పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజి

NAAC 'B' Grade

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)

పెదనందిపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522 235.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 10 - Spl. Edition - October 2020 - ISSN No. : 2456-4702



తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి - సమాలోచన

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

15, 16 & 17 అక్టోబర్ 2020.



నిర్వహణ :

తెలుగు విభాగం

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue No. 10 - Spl. Edition - October 2020 - ISSN No. : 2456-4702

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
   Dept. of Telugu,
   Central University of Hyderabad, Hyderabad. Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

నాక్ 'బి' గ్రేడ్1

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)

పెదనందిపాడు - 522 235, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి – సమకాలీనత

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

తేది : 15, 16 & 17 అక్టోబర్ 2020

నిర్వహణ :

తెలుగు శాఖ

పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

పెదనందిపాడు - 522 235, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి – సమకాలీనత

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రథమ ముద్రణ : **15 అక్టోబర్ 2020**

ప్రతులు : **500**

కాపీలకు : **ప్రిన్సిపాల్, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.**

గమనిక : **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**

ఎడిటోరియల్ చిరునామా : **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు – 522 002.**

డి.టి.పి & ప్రింటింగ్ : **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.

తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి – సమకాలీనత

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

ప్రధాన సంపాదకులు :

శ్రీ డి. ఈశ్వరరావు

ప్రధాన సంపాదకులు :

డా॥. బూసి వెంకటస్వామి

సంపాదకవర్గం :

డా॥. వై. చిన్నారావు

శ్రీ ఎల్. రమేష్‌బాబు

శ్రీ యం. నాగమోహనరావు

శ్రీ పి. శ్రీనివాస్

మెచ్చుకోలు

– డా॥. జి.ఎస్. మోహన్

జానపద విజ్ఞానం జాతి సంస్కృతిని ప్రతిబింబించే నిలువుటద్దం. ఈ విజ్ఞానంలో లభించని అంశాలంటూ ఏవీ ఉండవు. అందువల్లే ఇదొక విజ్ఞాన సర్వస్వం; పరిశోధకులకు ఒక కల్పవృక్షం.

మానవ సంస్కృతిని అధ్యయనం చేయడంలో జనపదాల (గ్రామాల) పాత్ర ప్రాధాన్యం వహిస్తుంది. 'సంస్కృతి' అన్నపదం 'సంస్కారం' అన్న పదం నుంచి నిష్పన్నమైంది. సాధారణంగా మనం 'వాడు సంస్కారవంతుడు', 'వాడిలో సంస్కారం లేదు', 'వాడిలో కల్చర్ లేదు' అనే పదాలను ప్రయోగిస్తుంటాం. సంస్కారం చేత మానవుడు ఉన్నతిని పొందుతాడు అన్న అర్థాన్ని ఈ పదాలు సూచిస్తున్నాయి. ఈ దృష్టిలో చూస్తే సంస్కృతి అంతర్ముఖమైంది; అంతరంగ వికాసాన్ని స్పష్టం చేసేది.

విశాలార్థంలో సంస్కృతి అంటే అభ్యాసం చేసి గడించుకొన్న నడవడిక అంటే సామాజిక జ్ఞానం మూలంగా ఆర్జించుకొన్న నడవడికే సంస్కృతి. మానవ జీవితంలోని పలు అంశాలను ఇదిలోగొని ఉంటుంది. సమాజానికీ, సంస్కృతికీ అవినాభావ సంబంధం ఉంది. సమాజంలోని వ్యక్తులు పరంపరానుగతంగా, ప్రయత్నపూర్వకంగా నేర్చుకొనే, పంచుకొనే ప్రసారం చేసే మొత్తాన్ని సంస్కృతి అనవచ్చు. ఇది ఉన్నత జీవనాదర్శాలకు, జీవన విధానానికి, ఉత్తమ వ్యక్తిత్వానికి సంకేతంగా ఉంది.

మానవుడు సంఘజీవి. సంఘమంటే. సంస్కృతిని ఆచరణలో ఉంచే మనుష్య సమాహారం. అంతేకాక, వరన్పరాపేక్షతో, తమకు తాము సాంఘిక, ఆర్థికరంగాలలో కొన్ని కట్టుబాట్లను నిర్ణయించుకొని ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో నిర్మింపబడిన మనుష్య సముదాయం. సంస్కృతి అంటే సంఘంలో ఒక సభ్యుడుగా మానవుడు ఆ సంఘంలోని అలవాట్లను, ఆచార వ్యవహారాలను, కళాస్వరూపాలను గ్రహించడమని అర్థం.

మన జనవదాలు సంస్కృతిని ప్రతిబింబించే మణిదీపాలు. ఈ సంస్కృతిలో మన సాంఘిక జీవనం నిక్షిప్తమై ఉంది. ఒక వ్యక్తి ఆసక్తి ఉంటే అధికంగా ఒక సమూహంలో అంతరిక చర్యలకు (Group Instructions) ప్రాధాన్యం ఉంది. జనన మరణాలు, యవ్వనం, వివాహం ఇత్యా ఆచరణలో కన్పించే విశ్వాసాలు, పండుగ-పబ్బాల నాటి ఆచారాలు, సంప్రదాయాలు; ఉత్సవాలు, జాతరలు, ఆ సందర్భాల్లో ప్రదర్శించే నాటకాలు, నృత్య, సంగీత, వేషభూషణలు, దైహిక క్రియలైన క్రీడలు, కర్షక జీవన వైరుధ్యం ఇవన్నీ సాంఘిక జీవనంలో ప్రాధాన్యం వహిస్తాయి. మన జనపదాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే ఇవన్నీ మన జీవనవిధానంలో ఎలా ముడిపెట్టుకొని ఉన్నాయో స్పష్టమవుతుంది.

జానపద సంస్కృతి ఒక జాతి పెన్నిధి
జానపద విజ్ఞానం సమాజదర్పణం
జానపద విజ్ఞానం ఒక విజ్ఞాన సర్వస్వం

ఆట, పాట, మాట - ఈ మూడింటి కలయిక జానపద విజ్ఞానం. జానపద విజ్ఞానంలో ప్రధానమైంది జానపద కవిత్వం. ఇది జానపదుల భావాలకు నిలయం, ఈ కవిత్వంలో ఆవేదన ఉంది, ఆర్ద్రత ఉంది, ఆనందం ఉంది, ఆత్మీయత ఉంది, ఆలోచన ఉంది, ఆవేశం ఉంది, అన్నటినీ మించి హృదయ స్పందన ఉంది.

'నిత్యజీవితంలో జానపదుడు అనుభవించిన సుఖదుఃఖాల, అనుభూతులు ఒక్కసారిగా పొంగిపొరలి వచ్చిన రసమాధురి జానపద గేయ సాహితి. సాంఘిక చరిత్రనీ, చారిత్రక విశేషాల్నీ, భాషా పరిణామాల్నీ తనలో ఇముచ్చుకొన్న చైతన్య స్రవంతి జానపద సరస్వతి. నెలవంక, చంద్రికలుగా సంగీత సాహిత్యాలతో మేళవించిన కవితా ప్రకృతి జానపద గేయ సాహిత్య చమత్కృతి. ఉవ్వెత్తున లేచే గోదావరి తరంగిణిలా డెందంలో చిందులో త్రొక్కే నాట్యమయూరి జానపద సాహితీకళామతల్లి'.

మొట్టమొదటి సారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1972 మార్చి 5, 6 తేదీలలో ప్రప్రథమ జానపద సాహిత్య సదస్సులో 'జానపద సాహిత్యమొక రసగుళిక' అన్న పత్ర సమర్పణలో చదివిన అంశాలు ఇది.

అచ్చయిన జానపద గీతం జానపదుల జీవితానికి వ్యాఖ్యానం. అదే నిమజమయిన జానపద గేయం. జీవితంలో తాను అనుభవించిన కష్టనష్టాలను, సుఖ దుఃఖాలను నలుగురికి పంచిపెట్టినవాడే జానపదకవి. రాయలసీమ భాషలో గొంతెత్తి పాడినా, కోనసీమ యాసలో గానం చేసినా, తెలంగాణ బాసలో గళం విప్పి పాడినా ఆ కవిత్వంలో ఆకర్షణ ఉంది. తమిళకవి సుబ్రహ్మణ్య భారతి అన్నట్టుగా 'కవితరాసేవాడు కవికాడు. కవిత్వాన్ని జీవితగా, జీవితాన్ని కవిత్వంగా చేసుకునన్నవాడే కవి' ఈ మాట ప్రత్యేకంగా జానపదులకు అన్వయిస్తుంది.

రాయలసీమతో బహుళ ప్రచారం పొందిన శ్రామిక గీతాలలో కపిలపాటలకు ప్రత్యేకత ఉంది. ఇవి ఈ ప్రాంతపు రసతరంగాలు. ఏ మహాకవి అనుభూతికీ దక్కనటువంటి శృంగారరస ప్రేరకాలు. ఏ భావకవి ఊహకూ అందని శృంగార రసాత్మక వ్యంజకాలు. అశ్లీలతకు తావున్నా, విన్నంతనే మధురభావాలను కురిపించే ముక్తకాలు.

ఈతాకు రాలినట్లు రాలిందా నీ మనసు !! ఛక్ ఛగణ!!'
అని ప్రేయని అంటే
'ఈడిగోల్ల చినదానా! ఈతపువ్వురైకదానా!
తమలపాకు నడుముదానా ! తగులుకోరా నారసింహా
!! వోవోవోప్పన్న రాముడా॥'

అలాగే 'గంగిమొగుడు దండుకుపాతు, గుండు తగిలి తీరిపాయ!

వాడుపోతే పీడబాయ, గంగి నాపాలాయ!! హేఛగణ!!'
అంటాడు మరో ప్రేమికుడు.

బాల్యవివాహాలు ఒకప్పుడు అధికంగా జరిగేవి అనడానికి ఈ క్రింది పాట మచ్చుతునక.

'మాయమ్మ ననుసాకె, ముసిలోన్ని కేలిచ్చే
దూడుసిన్నోన్ని సూత్తే, దుఃఖమొత్తుందేమిసేతు!! ఛక్ ఛగణ!!'

శ్రామికుని నిరాశా జీవితాన్ని దారిద్ర్యపు కళ్ళద్దాలు పెట్టుకొని చూస్తే కన్నీలి జల్లు కాలువలైపారుతుంది. ఆ కన్నీటి కాలువలు వెల్లువలై పారుతుంటే ఆనకట్ట కట్టేవాళ్లు లేరా అనిపిస్తుంది. ఆ ఆవేదన చూడండి.

'ఎన్నాళ్ళు పాటుపడినా
ఈగునపమే మిగులు
ఎందుకోయీ జన్మ - ఓరన్నా
కంటరాకరు మేడా
కలకటేరు మేడా
కట్టించుకు కట్టపడక

మతాచరణ సందర్భాల్లోకానీ, సాంఘికచరణ సందర్భాల్లోకానీ సాధారణందా జానపద కళలు ఆవిర్భవిస్తాయి. ప్రకృతి ఈ కళలు ఆవిర్భవించడానికి దోహదం చేసింది. ప్రకృతికి సంబంధించిన ఎండ, గాలి, వాన, చలి, కొండలు, గుట్టలు, పశుపక్ష్యాదులు, మొదలైన వాటిచేత కలిగిన భయభ్రాంతులవల్ల ఆదిమ మానవుడు తనకు తెలియని ఏదో ఒక అంతీతశక్తి తన్ను వెంటాడు

తోందని తలచాడు. ఆ అతీతశక్తినే దేవుడుగా సృష్టించు కున్నాడు. అరాధించడం మొదలుపెట్టాడు. క్రమంగా అదే గ్రామదేవతారాధనగా రూపుదిద్దుకుంది.

ఆరాధనా సమయంలో భక్తితో పాటలు పాడుకొన్నారు. ఆనంద హావశత్వంతో ఒళ్ళు తెలియక గంతులు క్రమల్ని అనుసరించాడు. ఆ ఆరాధనే ఒక కళగా, వృత్తిగా స్వీక రించారు. ఆ కళే మన సంస్కృతిలో ఒక భాగంగా, అవి భాజ్య అంగంగా నిలద్రొక్కుకొంది. ఇలాంటి జానపద కళలు, కళారూపాలు ఉభయ రాష్ట్రాలలో అనేకం ఉన్నాయి. జానపద సంస్కృతి ముప్పాతిక మున్వీసం ఈ జానపద కళారూపాల్లోనే ప్రతిబింబిస్తుంది.

జానపద విజ్ఞానంలో జానపద కళలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 'Human life without Art is incomplete and barren' అని చైనీయులు ఆర్యోక్తి. అందువల్లే జానపదకళల్ని, కళారూపాల్ని జానపద సంస్కృతి యొక్క అనుభవాల ప్రతీకలుగా మనం చెప్పవచ్చు.

గ్రామ దేవతారాధన సమయంలో జాతరలు, ఉత్స వాలు, ఊరేగింపులు, వేడుకలు, పరుసలు, ఉజనులు, మొక్కుబళ్ళు, పాటలు, కథలు అనేక ప్రాచుర్యంలో ఉన్నాయి.

జానపదుల వైద్యవిధానం కూడా జానపద విజ్ఞానంలో ప్రధాన పాత్రను వహిస్తోంది. జానపద వైద్యమే 'నాటీ వైద్యం'గా నాటువైద్యంగా ప్రచారంలో ఉంది. ఇందులో ప్రధానమైంది ప్రకృతి జానపద వైద్యం. చెట్ల మూలికలు, వేర్లు, ఖనిజాలు, జంతువుల అవయవాలు ఇందులో ఉపయోగించబడుతాయి. మంత్ర తంత్రాలు, సంతానం కోసం యంత్రాలు, తాయెత్తులు; దిష్టితీయడం ఇత్యాదు లన్నీ జానపద వైద్యంలో ఒక భాగంగా ఉన్నాయి.

మానవుని సాంఘిక జీవనానికీ, ఆటలకూ అవినాభావ సంబంధం ఉంది. 'Play is a form of expressive behavious common among all human beings and manifested overfly in all cultures' అంటాడు. Robest A Georges. గాలిపటం, గోలీలాట, గిల్లిదండ, పోలికట్టు ఆట, గుడుగుడుగుంచం, బలిగుడ, చెమ్మ చెక్క, దాగుడు మూతలు, బొంగరాలాట ఇత్యాదులన్నీ దైహికం గానే కాక మానసికంగాను మనల్ని ఉత్సాహ వంతులుగా చేస్తున్నాయి.

జానపద సంస్కృతికి చావులేదు. అది చావలేదు, చచ్చిపోదు. జానపద మూల సంస్కృతి పేర్లు పెక లించడానికి వీలులేనంత లోతుగా పాతుకొని పోయాయి. ఎప్పటికప్పుడు కొత్త చిగుళ్ళతో నిత్యనూతనంగా తయారవుతోంది. 'FolkHûre is a lively fossil which refuses to die. It is a precipitate of the scientific and cultural log of countries and millenia of human culture' (Standard Dictionary of Folklore, Mythology and Legend, P. 404 - 402)' మాటల్ని గమనించాలి. జానపద సంస్కృతి గంగానదీ ప్రవాహంలా నిత్యమూ పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తూనే ఉంటుంది. డా॥. బిరుదురాజు రామరాజు నేదునూరి గంగాధరం, కృష్ణశ్రీ, హరి ఆదిశేషువులాంటి జానపద సాహిత్యోద్ధా రకులు జానపద విజ్ఞానాంశాల్ని సేకరించి మనకు అందిం చినా, తరగని జానపద సంపద ఇంకా నిక్షిప్తమై ఉంది. వాటిని వెలికి తీయాల్సిన అవసరంతోపాటు పరిశోదన, వాటి పరిరక్షణ మన భుజస్కంధాలపై ఉంది.

మనం నాగరిక జానపదులం. మనలో ఆ జానపద మూల సంస్కృతి దాగి ఉంది. నేటి యాంత్రిక యుగంలో ఆధునీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో కూర మూల సంస్కృతి తొంగిచూస్తూనే ఉంది. 'Folklore is the echo of the past and at the same time it is the vigorous of the present.' అన్న మాటలు అక్షరసత్యాలు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు జానపదసాహిత్యం -సంస్కృతి -సమాలోచన

- నాగభట్ల భక్తవత్సల రెడ్డి

మహంకాళిదేవి పుత్తూరు, ఏర్పేడు మండలం, చిత్తూరు జిల్లా.

జానపదసాహిత్యం సంస్కృతి సమాలోచన అన్న ఈ సదస్సు నేటి అవసరాన్ని గుర్తిస్తూ చాలా అర్థవంతంగా ఉంది. అందుకు కార్యనిర్వాహకులని అభినందిస్తున్నాను.

గత రెండువందల ఏండ్లుగా తెలుగు జానపద సాహిత్యం మీద సేకరణ అధ్యయనం జరుగుతుంది. పాశ్చాత్యులు తొలుత ప్రారంభించినా తర్వాత తెలుగు వారి అధ్యయనాలు దానికి పుష్టిని కలిగించినాయి. జానపదసాహిత్య పరిశోధన విశ్వవిద్యాలయ స్థాయికి రావడానికి ముందే అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధమైనాయి. పరిశోధకులలో ప్రధానంగా అయిదు తరాలు కనబడుతున్నారు. ఆంగ్లేయులు, ఆంగ్ల విద్యావంతులు, తెలుగుపండితులు, జానపద అభిలాషులు, విశ్వవిద్యాలయ పరిశోధకులు. వీరికి తోడు ప్రచురణాలయాల పాత్ర కూడా మరువరానిది. 1910 కి ముందు మొదటి రెండు వర్గాలు ప్రధానపాత్ర పోషిస్తే ఆ తర్వాతి రెండు వర్గాలు జానపదసాహిత్య అధ్యయనానికి జవమూ జీవమూ కల్గించినాయని చెప్పకతప్పదు. అయిదో దశాబ్దంలో ప్రారంభమైన విశ్వవిద్యాలయ పరిశోధన బహు ముఖాలుగా విస్తరించింది.

ఈ పరిశోధనని దృష్టిలో పెట్టుకొంటే తెలుగు జానపద సాహిత్య అధ్యయనం తొలినాళ్లలో పరిచయపూర్వకంగా, తర్వాత శిష్టసాహిత్యానికి ఏ మాత్రం తక్కువకాదు అన్న భావాన్ని ప్రతిపాదించడానికి, ఇంకా చెప్పాలంటే శిష్టసాహిత్యానికి మూలం జానపదమే అని స్థాపించడం వైపు, ఆ తర్వాత అంతర్జాతీయ పరిశోధన తీరు తెన్నుల కనుగుణంగా ప్రధానంగా సాగిందని చెప్పవచ్చు.

సంస్కృతి - సంప్రదాయం :

గాలి నీరు తిండి బతుకుకి ఆధారం. వాటిని సమకూర్చుకోవడంలోనే సమాజాభ్యుదయం కనబడుతుంది. సమాజం లేదా సమూహం తమ మనుగడకోసం ప్రకృతి మీద ఆధారపడి ఎన్నెన్నో ప్రయోగాలు చేసుకంటూ ప్రకృతికి భాగస్వామ్యం కల్పించారన్నది చర్వితచరణం. నాగరికత పెరిగే కొద్దీ ప్రకృతిని ఉపయోగించు కోవడంలో వైవిధ్యం చోటుచేసుకొంది. ఆ క్రమంలో తమ అనుభవాలని, తాము గుర్తించిన ప్రయోజనాలని వ్యవస్థీకరించుకొని తర్వాతి తరానికి అందించిన ఆ సంప్రదాయం తర్వాతి తరానికి పరిజ్ఞాన మూలధనం లాంటిది. అలా వ్యవస్థీకరించుకొన్న సమాజ జీవన విధానాన్నే సంస్కృతి అంటున్నాం. ఆ సంస్కృతిలో వ్యక్తికి-సమాజానికి, సమాజానికి - ప్రకృతికి, సమాజానికి-కనబడని ఆ అదృశ్య శక్తికి మధ్య జరిగిన సాన్నిహిత్యం, పరస్పర పోషిత స్వభావం కనపడుతుంది.

గాలి, నీరు, తిండి జీవనాధారం కనుక వాటిని పరబ్రహ్మ స్వరూపంగా భావించుకొన్నారు మన పెద్దలు. గాలి కంటికి కనబడకపోయినా అది ఏ చెట్ల వల్ల బాగా అందుతుందో తెల్సిన అనుభవజ్ఞులు కనుకనే పది మంది గుమికూడే చోట రాగి చెట్టుని, వేపచెట్టుని పెంచుకొన్నారు. వాటికి అన్యోన్న సంబంధాన్ని కల్పించి, పెండ్లిండ్లు జరిపించినారు. పవిత్రత ఆపాదించినారు. అక్కగార్ల పొదలు (sacred groves) అంతర్జాతీయంగా చర్చావిషయాలుగా మారినాయి. ఏ చెట్ల కింద పడుకోవచ్చో, పడుకోరాదో అన్న తెలివిడిని కథల ద్వారా, పాటల

ద్వారా ప్రచారం చేసుకొన్నారు.

వ్యవసాయానికి ఆధారం నీరు. నీటికి ఆధారం వర్షం. వర్షం రావడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు, ప్రయోగాలు. కప్పతల్లి ఆటలు, దేవుళ్లకి అభిషేకాలు, పాశం వండి నాకించడం, గంగమ్మ జాతర్లు, చల్లదనం కోసం వేపాకు తోరణాలు - అలా ఎన్నో వేడుకలు, వేడుకోళ్లు కనబడుతున్నాయి. వాతావరణం చల్లబడితేనే వర్షం వస్తుందన్న శాస్త్రీయ సత్యం దీని వెనుక ఉందన్న విషయం నిర్వివాదం.

నీళ్లు రావడానికి, నీటిని కాపాడుకోవడానికి, నీటిని వాడుకోవడానికి ప్రతి విషయంలోనూ ఒక ఆరాధనా క్రమం - ఆచారాలు, అనుష్ఠానాలు, ప్రత్యేక వంటలు, వస్తుసంస్కృతి, నిర్వహించడానికి ఒక నిర్దిష్ట సమయం, నిర్దిష్ట వ్యక్తి - అలా ఒక వ్యవస్థని రూపీకరించుకొన్న వైనం కనబడుతుంది. నీటికి స్త్రీని అధిదేవతను చేసుకొన్న విషయం అడుగడుగునా కనబడుతుంది. తొలకరి వర్షాలు రావాల్సిన సమయంలో గంగమ్మకు ఊరూరా జాతర్లు, నడివీధిలో స్థానం కల్పించడం చిత్తూరు జిల్లాలో సర్వసాధారణం. చెరువు కట్ట దగ్గర కట్టమైసమ్మకు తెలంగాణాలో ఎన్నెన్నో వేడుకలు .

చెట్లు ఎన్ని ఉన్నా కొన్ని చెట్లని మాత్రమే పవిత్రంగా ఎంచుకొన్నారు. ఆ చెట్లకి దేవతలతో పండగల్లో సాన్నిధ్యం కల్పించి, సంబంధం కల్పించి ఆయా దేవతల్ని ఆయా చెట్ల దగ్గరే ప్రతిష్ఠించుకొన్న తీరు గమనించాలి. దేవతలకి పండగలకి ఒక కారణం కల్పించి , వాటిని జరుపుకొనే క్రమంలో ప్రత్యేక వంటలకి, ఆరగింపులకి, వస్తు సంస్కృతికి అస్తిత్వం కల్పించిన విధం చూడాలి. దేవతల్ని ఆవాహనం చేసి నిల్పడంలో దిక్కులకు సమయ సందర్భాలకు సన్నివేశాల రూపకల్పనలకు, పూజా క్రమంలో ఆయా పత్రులు పూలు తప్పనిసరి చేసి ప్రకృతికి ఆయా సమూహాలు ఇచ్చిన ప్రాధాన్యత ని ఆరా తీయాలి. ప్రకృతిని వైద్యపరంగా వాడుకోవడం వెనక ఉన్న సంప్రదాయ పరిజ్ఞానం వెలకట్ట లేనిది. ఆయుర్వేద విజ్ఞానం కొన్నింటి వస్తుతత్వాన్ని ప్రయోజనాన్ని గుర్తించి అక్షరబద్ధం చేసినా ఆయా ప్రాంతాలకనుగుణంగా , ప్రజల అనుభవంలో ఉండేది కొండంత. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని దానికొక పవిత్రస్థానాన్ని కల్పించినారు. దాంతో సంబంధం ఉన్న వ్యవసాయాన్ని కూడా విత్తనం దగ్గరి నుంచి ఊడ్పుల దాకా ఆచారాలు అనుష్ఠానాల నేపథ్యంలో ఒక పవిత్రయజ్ఞం గానే నిర్వహించినారు. దేవతలకు అర్పించే మొక్కుబళ్లలో ప్రత్యేక వంటలకి, వాటికి ఉపయోగించే ఆహార పదార్థాలకి పవిత్రత ఆపాదించినారు. ప్రకృతికి, తాము తమని కాపాడే శక్తిగా భావించుకొన్న ఆ అదృశ్య శక్తికి కృతజ్ఞతా పూర్వకంగా సమర్పించిన -తొలి మోపు దేవునికి తర్వాత మనకు -అన్న సమాజ ఆలోచనలలో దాగి ఉన్న ఆ పవిత్ర మనసుని గుర్తించాలి.

సంస్కృతి - మౌఖిక సంప్రదాయం :

మౌఖిక సంప్రదాయ ప్రధాన ప్రయోజనం ఆలాంటి సంస్కృతికి ప్రచారం కల్పించడంగానే కనబడుతుంది. అందులో వ్యక్తి-కుటుంబం, కుటుంబం-సమూహం, సమూహం-సమాజం, ప్రకృతి-సమాజం, ఆ సమాజం తమని కాపాడే శక్తిగా సృష్టించుకొన్న ఆ అదృశ్య శక్తి మధ్య నెరిపిన అనుబంధాలు, వాటిని తమ పురోగతి కోసం, భద్రత కోసం మలచుకొన్న విధానాలు, వాటి వెనుక ఉన్న అనుభవాలు, ఆచరణలు - అలా వ్యక్తి, సమూహం, సమాజం, ప్రకృతి, ఆ అదృశ్యశక్తి కలగల్సిన మానవ మనుగడలో ఒక వ్యవస్థ కనబడుతుంది. సమాజ కట్టుబాట్లు, ఆంక్షలు, అతిక్రమణలు, దిద్దుబాట్లు, భవిష్యత్తుకోసం మార్గనిర్దేశం, పాతమీద నగిషీలు, కొత్తకొత్త ప్రయోగాలు, పరిజ్ఞానాన్ని పదుగురితో పంచుకొనే మాధ్యమాలు - వాటితో కూడిన ఒక జీవనసంపుటి యొక్క ప్రచార మాధ్యమం మౌఖిక సంప్రదాయం అని గుర్తించడానికి అవకాశం కలుగుతుంది.

ఆ వ్యక్తీకరణలో పాట లేదా మాట ద్వారా సాగే వినిమయాన్ని జానపదసాహిత్యంగా మనం గుర్తిస్తున్నాం. ఆ సాహిత్యం కొంత లిఖిత రూపం పొందింది. మరెంతో

మౌఖిక ప్రచారంలోనే ఉంది.

సంస్కృతి – జానపదవిజ్ఞానం :

ఆ సాంస్కృతిక సంపదని మోసుకొస్తున్న మాధ్యమం జానవదవిజ్ఞానం. జానవదవిజ్ఞానాన్ని సూక్ష్మంగా అధ్యయనం చేస్తున్నపుడు గత సమాజం దేన్నయితే బలంగా నమ్మిందో, ఏదయితే తమ జీవనవిధానంలో తప్పనిసరిగా ఉండాలని భావించిందో, వాటికి పవిత్రత ఆపాదించి పదే పదే ఆచారాల ద్వారా అనుష్ఠానాల ద్వారా పాటలు ఆటలు ద్వారా ప్రచారం కల్పించి ప్రజలకి అన్ని వేళల అవి అందుబాటులో ఉంచడానికి చేసిన ప్రయత్నం కనబడుతుంది. ఇంటి పరిసరాల్లో ఆడవారు పాడుకొనే పాటల్లో మానవతావిలువలకు, అనుబంధాలకు ప్రాధాన్యమిచ్చిన విషయం గమనించగలం. వృత్తి గాయకులు కథాగానాల ద్వారా సామాజిక కట్టుబాటుల్ని, విలువల్ని, నమ్మకాల్ని ప్రచారం చేయడం ప్రధాన బాధ్యతగా తీసుకొన్నట్టు కనబడుతుంది.

జానపదవిజ్ఞానం – ప్రక్రియలు (Genre specific):

జానపద విజ్ఞానం విభిన్న ప్రక్రియలుగా వ్యాపించి ఉంది. అందులో వాగ్రూపం పొందిన జానపదసాహిత్య ప్రక్రియలు వస్తువైవిధ్యం పుష్కలంగా వివిధ సందర్భాలలో పాడే పాటలుగా, కథాక్రమం కథనపుష్టి కల్గిన గేయగాథలుగా, దైవభీతి ప్రతిపాదన, దైవత్వాపాదన కల్గిన కథాగేయచక్రాలుగా, సమాజం కోసం తమ సర్వస్వాన్ని అర్పించిన త్యాగధనుల స్మృతి కావ్యాలనిపించే గేయగాథలుగా, అనుభవదొంతరుల పేటిక అయిన సామెతలుగా, మనోవికాసాన్ని కలిగించే, మెదడుకు పదును పెట్టే పొడుపు కథలుగా, సాంస్కృతిక నేపథ్యం ఉన్న మాండలిక భాషావిశేషాలుగా, ఉచ్చారణా స్పష్టతని నేర్పించే వాక్యసందోహాలుగా మనకు కనబడుతుంది. గతంలో అవి మౌఖిక సంప్రదాయంలో మాత్రమే ఉన్నా నేడు మౌఖిక, లిఖిత సంప్రదాయాలు రెండింటిలోనూ కనబడుతున్నాయి.

జానపదసాహిత్య ప్రక్రియలో వస్తువు, రూపం రెండూ ఉంటాయి. ఈ రెండింటికి ఒక నిర్మాణ చట్రం ఉంటుంది. ఆ నిర్మాణ చట్రంలో ప్రధాన అంగాలు, ఉప అంగాలు ఉంటాయి. వి.జె. ప్రాప్ ప్రతిపాదించినట్టు అవి పరస్పరం ఒకదానితో ఒకటి ఎలా అన్వయం పొందుతూ పరిపోషించుకొంటూ ఆ పాఠ్యం మొత్తాన్ని రూపీకరిస్తున్నాయో చూడడం పరిశోధకుని ప్రథమ కర్తవ్యం. అంటే జానపదసాహిత్య ప్రక్రియ ఏదైనా ముందు అందులోని వస్తువు - రూపం గుర్తించడం, వాటి నిర్మాణాన్ని పరిశీలించడానికి అందులోని అంగాల్ని, ఉప అంగాల్ని గుర్తించడం, ఆ తర్వాత వాటి మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని, ఒక అంగం మరో అంగంతో ఎలా సంవదిస్తుందో చూడడం జరగాలి. ఆ పాఠ్యం కళా రూపాలకి సంబంధించింది అయితే దాన్ని ప్రదర్శన నేపథ్యంలో చూడాల్సి ఉంటుంది. అనుష్ఠాన కళా రూపమయితే అనుష్ఠాన నేపథ్యంలో చూడాల్సి ఉంటుంది.

స్వభావాన్ని బట్టి తెలుగు జానపద కళారూపాలలోని పాఠ్యం మూడు రకాలుగా కనబడుతుంది. అందులో పారంపర్యంగా కథలు చెప్పడమే వృత్తిగా చేసుకొన్న కళాకారులు పాడేది లేదా చెప్పేది పారంపర్య కథాగానం (Conventional Text). వారు చిన్నప్పటి నుంచే తమ పెద్దలతో పాటు కళారూప ప్రదర్శనలో పాల్గొంటూ శిక్షణ పొందుతారు. వీళ్లకి కథాగానం కుటుంబ ఆస్తి.

కథాగానంలో కథని, కథా సన్నివేశాలని సందర్భానికి తగ్గట్టు పవిత్రత ఆపాదించి కొనసాగిస్తారు. కథాగానంతో పాటు బలి, గావు, కొలుపులు లాంటివి నిర్వహిస్తారు. వీరికి సామాజికంగా కొంత ఆర్థిక భరోసా కూడా ఉంటుంది. అంటే కేవలం కథ చెప్పడమే కాకుండా దాంతో పాటు కొన్ని ఆచారాల తంతు కూడా నిర్వహిస్తారన్నమాట. అక్కడ ఏ సమూహం ఈ ప్రదర్శన జరగడానికి కారణమో ఆ సమూహంలోని కొంతమంది వ్యక్తులు కొన్ని ప్రత్యేక బాధ్యతలు నిర్వహించడం కూడా ఉంటుంది. అంటే పారంపర్యకథాగానం - కథాసన్నివేశాలతోపాటు ఆచారాలు

- వాటిని నిర్వహించే సమూహాలు అన్నింటికి ప్రాధాన్యత ఉంటుంది. కనుక పారంపర్య నేపధ్య చట్రంతో పొందిక కల్గి ఉంటుంది. పారంపర్య కథాగాన నిర్మాణంలో ప్రధానంగా కింది అంశాలు చూడడానికి అవకాశం ఉంది.

1. వస్తువు లేదా ఇతివృత్తం 2. గానం చేసే విధానం 3. కథా రచయిత లేదా యజమాని 4. కథ - పాఠాంతరాలు, రూపాంతరాలు 5. నేపథ్యం 6. అందులో జరిగే అనుష్ఠానాలు 7. కథాక్రమం లో ప్రధాన అంగాలు 8. కథా పాత్రలు - రూప వర్ణన, స్వభావ వర్ణన 9. ప్రదర్శన ప్రమేయం 10. సమయం - ఏ సమయం, ఎంత సేపు 11. కథా గాయకులు 12. పోషకులు 13. కథా గాయకులు పోషకుల మధ్య, కథకి గాయకులకి మధ్య, కథకి పోషకులకి మధ్య ఉన్న పరస్పర అనుబంధం 14. ప్రయోజనం. అలాగే ప్రదర్శన విధానంలో కూడా ఉన్న ప్రధాన అంగాల్ని చూడాల్సి ఉంటుంది.

ముగింపు :

జానపద సాహిత్యంలో ఈ సాంస్కృతిక సంపద ఎక్కడా గుదికుచ్చి కూర్చినట్టు కనబడదు. అన్ని ప్రక్రియలలోనూ వ్యాపించి కలగాపులగంగా ఉంటుంది. ఆ సాంస్కృతిక సంపదను గుర్తించి ఆ వ్యవస్థీకృత రూపాన్ని అధ్యయనం చేయడమే నేటి అవసరం. తెలుగు జానపద సాహిత్య భవిష్యత్తు పరిశోధన ఆ దిశగా సాగుతుందని ఆశిద్దాం.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

విషయసూచిక

	తెలుగు జానపదసాహిత్యం -సంస్కృతి -సమాలోచన	**- నాగపట్ల భక్తవత్సల రెడ్డి**	vi
	మెచ్చుకోలు	**- డా॥. జి.ఎస్. మోహన్**	ix
1.	జానపద ఐతిహ్యాలు	- ఆచార్య ఎం. రామనాథంనాయుడు	19
2.	జానపద సామెతలు - భావితరాలకు ప్రయోజనాలు	- డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి	26
3.	జానపద కళలు - కళారూపాలు - వాద్య పరికరాలు	- కొమ్మాలపాటి శ్రీనివాసరావు	32
4.	జానపద వైద్య విధానాలు	- ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్	35
5.	తెలంగాణ జానపద చారిత్రక వీరులు బల్మూరి రాయుడు, భోగంసాని	- డా॥. వి. త్రివేణి	40
6.	తెలుగు జాతీయాలలో జంట పదాలు - విశ్లేషణ	- తోట వెంకటస్వామి	53
7.	ప్రపంచీకరణ నేపథ్యంలో జానపద కళలు	- అరసవిల్లి మోహనరావు	58
8.	'సుభద్ర సారెపాట' కథాగేయం-జానపదాంశాలు	- డా॥. మంగరాజు వెంకటగౌరి	63
9.	జానపద సాహిత్యం - గేయ కవిత్వం	- కొండయ్య కోసూరు	67
10.	వ్యవసాయపు పనిపాటలు - పరిశీలన	- డా॥. యం. హరికృష్ణ	69
11.	జానపద పరిశోధకులు - సేవ	- షేక్ షానాజ్ బేగం	74
12.	జానపద పురాగాథలలో ప్రాగ్రూపాల అధ్యయనం	- డా॥. వారె దస్తగిరి	81
13.	బంజారా భాషా సాహిత్యం - సంస్కృతి	- డా॥. వి.గోపాల్	86
14.	జానపదుల జాతరలు - కొత్తపేట గంగానమ్మ పెద్దింట్లమ్మవార్ల జాతర	- తంగి ఓగేశ్వరరావు	90
15.	రొంపిచెర్ల పీలేరు మండలాల జానపద గేయ సాహిత్యం	- డా॥. ఆవుల గిరిబాబు	95
16.	పట్టపురావి కైఫీయత్తు - కాటమరాజు కథ - విశ్లేషణాత్మక అధ్యయనం	- డా॥. డి. విజయలక్ష్మి	101
17.	జానపదుల వంటింటి వైద్యం - మానవత్వపు విలువలు	- డా॥ బి. సరస్వతి	110
18.	జానవదులు - సామెతలు - విశ్లేషణ	- డా॥. రాచపాళెం పురంధీశ్వరి	113
19.	గతాలకు తరలిపోతున్న తరాల జాతి జీవసారం-జానపద విజ్ఞానం	- డా॥. పి.ఎ. సత్యనారాయణ	117
20.	జానపదుల పండుగలు	- జి. బాలకృష్ణ	120
21.	కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర - పరిశీలన	- కొర్ర ఝాన్సీ	122
22.	జానపద సాంఘీకాచారాలు	- డా॥. సూర్యకాంతి	125
23.	తెలంగాణ జానపద స్త్రీల పాటలు - సాహిత్యం : నవీన స్త్రీల పాత్ర	- డా॥. లింగా శ్రీనివాస్	128
24.	జానపద కళారూపాలు - పిచ్చుకకుంట్లు	- మద్దిరాల సత్యనారాయణరెడ్డి	132

25. జానపద గేయ గాథలు - స్త్రీ స్థానం	- డా॥. ఎస్.గులాబ్ జాన్	136
26. గ్రామదేవతల జాతరలు - పానగల్లు ఈదమ్మ జాతర	- డా॥. ఏ. వెంకటప్రసాదు	139
27. మన సంస్కృతిని ప్రతిబింబింప చేసే జీవకళలు జానపద కళారూపాలు	- డా॥. చుక్కా యశోద	141
28. నిర్మల్ జిల్లా గ్రామ దేవతలు - జాతరలు	- ఉల్లెంగ ముత్యం	144
29. తడ మండలం నిత్య క్రైస్తవ కీర్తనలు - విశిష్టత	- సుజిత రెడ్డి	146
30. జానపద కళారూపాలు	- డా॥. గుంటుపల్లి గౌరి	154
31. తెలుగు జానపద గేయ సాహిత్యం-ఆర్వీయస్ సుందరం పరిశోధన సేవ	- సారంగపాణి బండి	159
32. జానపద సాహిత్యంలో సుగాలీల మౌఖిక గేయాలు	- డా॥. భూక్యా జ్యోతి	166
33. ఆంధ్రుల విశిష్ట కళారూపం పండరి భజన	- డా॥. యం. ప్రసాద్	169
34. పట్టపుతెగ వారి పండుగలు	- డా॥. టి. జాన్ కిరణ్‌బాబు	173
35. 'ఆదిలాబాద్ జిల్లా గోండుల సంస్కృతి-ఉత్సవాలు'	- జె. సంగీత	178
36. జానపద సాహిత్యంలో అలంకార వైచిత్రి	- నారాయణదాసు మంజులచారి	181
37. జాన పద గేయ సాహిత్యం	- గూడూరి గ్లోరి యానెట్	185
38. జానపద కళలు - కళారూపాలు - వాద్య పరికరాలు	- మల్లికార్జున్. పి	188
39. జానపదుల ఇలవేల్పు -బాపూజీ మహరాజ్	- పోల్కం రాములు	191
40. జానపద కళారూపాలు - వృత్తి జీవన వైశిష్ట్యత	- బసవరాజప్ప	193
41. జీవన స్రవంతిలో జానపద సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు	- సూరేపల్లి పద్మావతి	197
42. "స్త్రీల గేయాలు - సాంఘికాచారాలు"	- పసుపులేటి నాగమల్లిక	202
43. తెలుగు కథా గేయ కవిత్వం	- ఘట్టమరాజు	205
44. తెరచీరల వారి చరిత్ర - జీవన విధానం	-డా॥. డి. సుశీల	212
45. జానపద కళలు - పరిరక్షణ మార్గాలు	-డా॥. దేవినేని జ్యోతి	215
46. వడిసెల గుండ్లలాగ రివ్వున హృదయానికి తగిలేవి సామెతలు	- డా॥. కందాళ శోభారాణి	220
47. తిరుమల తిరుపతి గ్రామదేవతలు	- డా॥. కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి	225
48. దివిసీమ జానపద కళారూపాలు - విశ్లేషణ	- కైలా హేమ బాంధవి	230
49. కడప జిల్లా జానపద దేవతలు - ఉత్సవాలు, పూజా విధానం	- డా॥. యు. కృష్ణమోహన్	233
50. జానపదుల ప్రదర్శన కళలు	- ఆర్. లక్ష్మీ ప్రసన్నకుమార్	240
51. జానపద సాహిత్యం - గిరిజన స్త్రీ - లైంగిక వేధింపులు	- బానోతు క్రిష్ణ	243
52. వివిధ జాంబ పురాణాలలో అరుంధతి - వశిష్ఠుల పెండ్లి	- నోముల సుమలత	245

53. మడకశిర సరిహద్దు ప్రాంతం యక్షగాన బయలాట	- డా॥. సి. శివన్న	249
54. లంబాడీల నృత్యాలు	- డా॥. లావుడ్య సుజాత	253
55. జానపదుల గ్రామ దేవతలు - సాంస్కృతికాంశాలు	- డా॥. వీపూరి వేంకటేశ్వర్లు	258
56. కడప జిల్లా జానపదుల వైద్యం - ఒక పరిశీలన	- ఎన్.వి. వసుమతి	264
57. పెద్దింటి అశోక్‌కుమార్ రచనల్లో సామెతలు - పరిశీలన	- బి. ప్రేమ్‌కుమార్	269
58. దక్షిణ భారతదేశములో చిత్రాంగుల హస్తకళ	- సి. వేణుగోపాల రెడ్డి & - వై. మనోహర రావు	274
59. పురాణాలలో జాంబవంతునికి, సూర్యవంశానికి గల సంబంధాలు	- నోముల రాజు	276
60. జానపద సాహిత్యం - నాడు నేడు	- వీణా రవళి & - నారుమంచి వాణి ప్రభాకరి	278
61. బతుకాట నవలలోని జానపద కథలు	- యం. అనురాధ లక్ష్మి	282
62. "జానపద దేవతలు - ఉత్సవాలు, ఊరేగింపులు "	- యమ్. అనురాధ	286
63. చిత్తూరు జిల్లా భారతం మిట్ట ఉత్సవాలు	- డా॥. చిలకా అనిత	289
64. వరంగల్ జిల్లా జానపద గేయకథలలో దేవతారాధన / పూజా విధానం	- డా॥. ధారవత్ సంతోష్‌కుమార్	292
65. తెలుగు సినిమాలు - జానపద గీతాలు	- డా॥. కె. రామలక్ష్మి	296
66. నెల్లూరు జిల్లా జానపద కథలలోని సాంఘీకాంశాలు	- డా॥. ఆర్. హరీన కళా	301
67. గిరిజన జానపదం - సృష్టికి మూలపథం	- గొల్లంగి చిన్నబాబు	307
68. మా ఊరి పండుగలు - నాడు - నేడు	- డా॥. చాగంటి నాగరాజేశ్వరి	311
69. తెలుగు జానపద ప్రతీకాత్మక కథలు - మనో విశ్లేషణ	- డా॥. కె.వి. సత్యనారాయణ	315
70. కొండరెడ్డి గిరిజనుల - పండుగలు	- డా॥. కపిల భారతి	319
71. కోనార్ల పౌరాణిక కథాగేయంలో నారదపాత్ర	- డా॥. వి.కె.టి. మహాలక్ష్మి	324
72. జానపదుల ధర్మరాజు తిరునాళ్ళు - పరిశీలన	- డా॥. ఎం. ప్రభావతి	328
73. వి.ఆర్. రాసాని రచనలలో జాతీయాలు	- డా॥. పోచంరెడ్డి రాజేశ్వరి	332
74. "తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి - సమాలోచన"	- కె. రంగనాయకులు	336
75. జానపద విజ్ఞానం - ఇతర అంశాలు	- కాపర్తి స్వరాజ్యం	340
76. నల్లగొండ జిల్లా జాతరలు - విశిష్టతలు	- మునగపాటి అరవింద	345
77. జానపద సాహిత్యంలో - సామెతల విలువలు	- పోసిక శ్రీనాథుడు	348
78. రాయలసీమ జానపద గేయాలు	- డా॥. వి. కృష్ణవేణి	350

79. "ప్రాచీన జైన సంస్కృతి క్షేత్రం - కొనకొండ్ల : ఒక పరిశీలన"	- డా॥. డి. సహదేవుడు	354
80. జానపద వైద్యం - ప్రయోజనాలు	- శశికళ యస్	359
81. ప్రకృతిని ఆరాధించే గిరిజన పండుగలు	- భూక్యా కాశీరామ్	364
82. ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ జానపద కలంకారి దృశ్యకళ	- వై. మనోహరరావు & - ఆచార్య కె. శ్యామల	368
83. జానపదుల గౌరమ్మ ఆరాధన	- తంత్రవహి శ్రీరామమూర్తి	372
84. జానపద సోయగం - పగటి వేషం	- డా॥. కొమ్మనబోయిన సుజాత	378
85. జానపద కళల పై ప్రపంచీకరణ ప్రభావం	- నరేష్ భూక్య	382
86. సామెతలు - సామాజిక ప్రయోజనం	- డా॥. కసప నరేందర్	385
87. కాకిపడిగెల ప్రదర్శనా సంప్రదాయం	- సోనబోయిన సతీష్	390
88. తెలుగులో జానపద సాహిత్యం-పాశ్చాత్యుల అధ్యయన విధానం	- గడ్డం నాగేందర్	395
89. నెల్లూరు జిల్లా గ్రామదేవతల కథలు - వైశిష్ట్యం	- తలారి సుజాతమ్మ	403
90. జానపద పండుగలు	- ముక్కా విద్యాసాగర్	408
91. భావకవుల భావాలలో జానపద సంస్కృతి - ఆంధ్రప్రశస్తి	- పత్తిపాటి భువనేశ్వరి	413
92. జానపద విజ్ఞానంలో సంగీత వాద్యాలు-పరిరక్షణ, పరిపోషణ	- మోత్కూరి అనిల్ కుమార్	418
93. తెలంగాణ జానపద నృత్యాలు	- యం. సతీష్	422
94. ఉత్తరాంధ్ర జానపద సంస్కృతి-సంప్రదాయాలు పండుగలు	- చివుకుల శ్రీలక్ష్మి	427
95. జానపద సామెతలు	- చుక్కా గాలయ్య	432
96. గ్రామ దేవత కలికిరి ఎల్లమ్మ తిరునాళ్ళు	- డా॥. పి. కుమారి నీరజ	437
97. పాలూరుప్రాంత గంగమ్మ దేవర ఉత్సవ వైశిష్ట్యం - పరిశీలన	- ఎస్. గంగాధరరెడ్డి	443
98. అపురూపమైన కళారూపం - పగటివేషం	- డా॥. బశెట్టి ఉపేంద్ర	447
99. అనంతపురం జిల్లా జానపద వీధినాటక కళారూపాలు	- డా॥. ఈ.మురళీధర్	450
100. "బతుకమ్మ పండుగ విశిష్టత-పాటలలోని సాహిత్య పరిశీలన"	- లేళ్ళపల్లి శ్రీదేవిరమేష్	453
101. గిరిజనులు (యానాదులు) సంస్కృతి - జీవన విధానం	- పులి చెంచయ్య	458
102. కొల్లేటిపాటలు - గ్రామీణ సంస్కృతి	- తాడేపల్లి వీరలక్ష్మి	462
103. జానపద కళలు - యక్షగానము	- డా॥. సి. నర్సింహులు	467
104. జానపద గేయ సాహిత్యం - అన్నమయ్య	-(కోరాడ) భమిడి కమలాదేవి	470
105. జానపద కళలు - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. ఉడుము ఝాన్సీ	473

106. జానపద సాంఘిక ఆచారాలు	- భూక్య సుజాత	477
107. ఆరె జానపద సాహిత్యం - పరిశీలన	- డా॥. కె. రత్నశేఖర్	482
108. జానపదుల దేవత - లక్ష్మీదేవర ఉత్సవాలు - ఊరేగింపులు	- యం. మాధవి	489
109. నెల్లూరు జిల్లా గ్రామ దేవతలు - ఉత్సవాలు, జాతరలు	- కాటంగారి బాబు	492
110. గుంటూరు జిల్లా సముద్ర తీరప్రాంత - జానపదుల పెండ్లి పాటలు	- డా॥. కాగిత సుబ్బారావు	495
111. గ్రామదేవత ఉత్సవాలు - ఊరేగింపులు	- ఎం. రమా గీతా దేవి	498
112. ఉరుముల నృత్యం	- డా॥అప్పిరెడ్డి హరినాథరెడ్డి	502
113. ఆదివాసి పద్మాల్‌పురి కాకో దేవత ఉత్సవాలు	- సంతోష్ కుమార్ ముత్తినేని	506
114. జానపద బాల సాహిత్యం - అద్భుత కథలు	- జి.చక్రపాణి	508
115. మడకశిర ప్రాంతంలోని జానపద వైద్య విధానం	- డా॥. పి. శివలింగప్ప	512
116. జానపద గేయ రచనలు - ఛందో సంగీత రీతులు	- డా॥. వాసిరెడ్డి భవాని	517
117. అనంతలో అంతరిస్తున్న జానపద కళారూపాలు	- డా॥. బత్తల అశోక్‌కుమార్	521
118. కర్నూలు జిల్లా జానపద కళారూపాలు - వాద్య పరికరాలు	- డా॥. బి. చిన్న వెంకటేశ్వర్లు	525
119. క్షేత్ర పర్యటనలో జానపద పరిశోధకుల సమస్యలు	- డా॥. చవ్వా వెంకటరెడ్డి	536
120. బంజారాల జీవనంలో పాడుపు కథలు	- డా॥. పి.భగ్గు నాయక్	540
121. బంజారా సంస్కృతి, సాంప్రదాయాలు - ఒక విశ్లేషణ	- బానోతు స్వామి	545
122. జానపద గేయాలు - హాస్యం	- డా॥. కొణిదల శోభ	555
123. జానపద కళారూపాలు - ఒగ్గు కథ	- రవిందర్ అచ్చ	559
124. వేట వేంకటేశ్వరస్వామి దేవాలయము	- పరుచూరి విజయలక్ష్మి	562
125. జానపద సామెతలు - సామాజికత	- ఎలగొండ రాములు	565
126. జానపద విజ్ఞాన పరిశోధనలు - నూతన అవిష్కరణలు	- డా॥. తరపట్ల సత్యనారాయణ	568
127. కాకి పడిగెల పటం కథ	- పల్లెమోని జయమ్మ	572
128. జానపదకళలు, కళారూపాలు, వాద్యపరికరాలు	- డా॥. కందేపి రాణిప్రసాద్	577
129. జానపదుల సంస్కృతికి నిదర్శనం - పోతులయ్యస్వామి జాతర	- ఎం. దీపిక	583
130. జానపద సాహిత్య పరిశోధకుడు - ఇనాక్	- డా॥. పి. కాళియప్ప	587
131. ప్రపంచీకరణ కోరల్లో ప్రభావం కోల్పోతున్న గంగిరెద్దు మేళం	- డా॥. ఒభిన్ని శ్రీహరి	593
132. చిన్నారుల గేయాల్లో దాగివున్న చిట్టి చిట్కాలు	- డా॥. సగిలి సుధారాణి	596
133. జానపద గ్రామదేవతలు : సాంప్రదాయాలు, ఉత్సవాలు	- పంచుమర్తి నాగసుశీల &	601

	- పరుచూరి గోపీచంద్	
134. రాయలసీమ కథా సాహిత్యం - జానపద పండుగల ప్రస్థావన	- యస్. రామాంజనేయులు	610
135. పాడుపు కథలు - చైతన్య దీపికలు	- డా॥. చదలవాడ విజయ కుమార్	613
136. తెలుగు కథానిక : జానపద కళలు	- కనపాల జోసఫ్	617
137. తెలంగాణ జానపద కళారూపాలు - సంస్కృతి	- ఖలీమ్ పాషా	620
138. తెలంగాణ జానపద కళారూపాలు - వాయిద్యాల పరిశీలన	- అందె అంగడి భాస్కర్	625
139. జానపద గేయసాహిత్యం - స్త్రీల పాటలు, కుటుంబ విలువలు	- అవధానం సుజాత	630
140. కాటి పాపలు	- డా॥. బాసని సురేష్	635
141. జానపద సంస్కృతి పండుగలు - వైవిధ్యం	- డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి	639
142. తెలుగు జానపద సాహిత్యం - జానపద నృత్యాలు	- డా॥. సి. ఉదయశ్రీ	642
143. జానపద సాహిత్యం జాతికి పట్టుగొమ్మ	- డా॥. దన్నాన అప్పలనాయుడు	645
144. తెలుగు వారి జానపదల - ప్రాచీనత	- డా॥. నూనావత్ రాంబాబు	647
145. తెలుగు జానపద సాహిత్యం - సంప్రదాయ విజ్ఞానము	- డా॥. యస్. సరళాదేవి	653
146. జానపద సాహిత్యంలో జంతువుల పాటలు	- కడారి గంగాజమున	655
147. అనంతపురముజిల్లా జానపదుల వివాహం - గేయాలు	- కొంకా మల్లికార్జున	659
148. పాడుపు కథలు - ప్రయోజనాలు	- - టి. వెంకటనారాయణ	662
149. ఆదివాసీల సంస్కృతి - జీవన చిత్రణ	- డా॥. బూసి వెంకటస్వామి & - పెండ్యాల లావణ్య	667
150. జానపదుల నృత్యాలు - వ్యష్టి సమిష్టి	- డా॥. మాడ పుష్పలత	673
151. జానపద వైద్యం	- డా॥. వై. సుగుణ	677

జానపద ఐతిహ్యాలు

– ఆచార్య ఎం. రామనోథంనాయుడు, తెలుగు విభాగం, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూర్, కర్ణాటక.

జానపద ఐతిహ్యాలు :

జానపద సాహిత్యంలోని గద్యాఖ్యానాలలో (Prose Narratives) పురాణం (Myth), ఐతిహ్యం (Legend), జానపద కథ (Folktale) ముఖ్యమైనవి. ఐతిహ్యాన్ని మాత్రం పరిశీలించినట్లయితే ''నిర్ధిష్ట వ్యక్తులకు, స్థలాలకు, వస్తువులకు సంబంధించినవి ఐతిహ్యాలు'' అని Dictionary of Folkloreలో చెప్పబడింది. ఇతిహాసమంటే చరిత్ర, చరిత్రను కొన్ని ఆధారాలతో (నాణ్యాలు, శాసనాలు) నిర్మించవచ్చు. కాని ఐతిహ్యాలకు ఆధారాలు కనబడవు. స్థానిక కథనం వంటి పరోక్ష ఆధారాలే తప్ప ప్రత్యక్ష ఆధారాలు వుండవు. అంటే ఐతిహ్యాలను సత్యమని విశ్వసించలేం. అసత్యమని తిరస్కరించలేం. ఇలా జరిగాయని మనం నమ్మేవాటిని 'ఐతిహ్యాలు' అని అనచ్చు. మౌఖిక ప్రసారం ద్వారా ఒక తరం నుండి మరో తరానికి ఐతిహ్యాలు సంక్రమిస్తాయి.

జనపదాలలో ఒక్కొక్క రాయికీ, రప్పకీ, చెట్టుకూ, పుట్టకూ, కొండకూ, బండకూ, గుడికీ, గోపురానికీ ఒక కథ వుంటుంది. ఐతిహ్యం కూడా వుంటుంది. గేయ రూపంలో వున్న ఐతిహ్యాలు వీరగాథ (దీఘశ్రీశ్రీవఁం) లవుతాయి. పాండవులు పాదాలు మోపిన ప్రదేశాలు, పాండవుల గుళ్ళు, భీముడు వంట చేసిన ఇళ్ళు, ద్రౌపది స్నానం చేసిన ఘట్టాలు; శ్రీరాముడు వనవాసం చేసిన ప్రదేశాలు, సీతమ్మ నివసించిన కొండ ప్రాంతాలు, సీతా రాముల పేర్లతో వెలసిన ఫలాలు (సీతాఫలం, రామ ఫలం), గ్రామానాల వంటివెన్నో దర్శనమిస్తాయి. ఇలాంటి గద్యాఖ్యానాలన్నీ ఐతిహ్యాలే.

పెద్ద పెద్ద గుట్టలలోను, కొండలలోనూ గుండుమీద గుండు మోపబడి వుండడం చూపి పూర్వం ఆయా గ్రామప్రజలు వారి ధనాన్ని ఎవరూ దోచుకోకూడదని ఆ గుంటిలో దాచిపెట్టి, అక్కడ సర్పాన్ని కాపలా పెట్టారని చెపుతారు. ఆ ధనాన్ని దోచుకోవడానికి ఇప్పటి మంత్ర గాళ్ళు ఎన్నో ప్రయత్నాలు చేసి, అక్కడే మరణించారని రకరకాల కథనాలు చెపుతారు. అలాగే మనకు కనిపిస్తున్న కొండలు, గుట్టలు లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు శ్రీరాముడు హనుమంతుడిని సంజీవిని మూలికను తీసుకురమ్మని ఆదేశించాడట. హనుమంతునికి సంజీవిని మూలిక ఎలా వుంటుందో తెలియక సంజీవిని పర్వతాన్ని తన చేతితో తీసుకువచ్చాడట. చేతివేళ్ళ మధ్యలో జారిపడిన చిన్న చిన్న రాళ్ళే ఈ కొండలు, గుట్టలు అని చెపుతారు. మనకు నమ్మకం కలిగించడానికి హను మంతుడు పర్వతాన్ని చేత్తో మోసుకువచ్చే చిత్రాన్ని కూడా చూపుతారు. ఇలాంటి స్థానిక కథనాలు కోకొల్లలు. నిర్ధిష్ట స్థలం, వ్యక్తి లేక సంఘటనను గురించిన మౌఖిక సాంప్ర దాయిక వివరణను 'ఐతిహ్యం' అని చెప్పవచ్చు.

పరిశోధనలకు ఆధారాలు లభించని విక్రమార్కుని సింహాసనం, మహాపురుషుల సమాధులు, వీరుల ఖడ్గాలు, స్మారక శిలలు వంటివి చూపుతారు. ఇవి బలంగా మౌఖిక ప్రచారమై చిలువలు పలువలుగా పెరుగుతుంటాయి. సతీసహగమనం సాంఘిక దురా చారం. కాని సహగమనం చేసుకున్న వారి పేర పేరంటాల గుళ్ళు, గోపురాలు వెలసి, పూజా పునస్కారాలు అందు కుంటున్నారు. ఉత్తర భారతదేశంలో సతీసహగమనం చేసుకున్నవారు దేవతలవుతారని నేటికీ దృఢంగా నమ్మే వారు వున్నారు. ఇలాంటి అశాస్త్రీయమైన, అమానవీయ మైన సాంఘిక ఆచార్లా చుట్టూ అల్లబడిన ఐతిహ్యాలు అనేకం వున్నాయి.

ఐతిహ్యాలు ముఖ్యంగా రెండు రకాలు

1. స్థానిక ఐతిహ్యాలు (Local Legends) :

ఇవి స్థానికంగా పుట్టి, అక్కడే పెరిగి పెద్దవై తర్వాత అక్కడే నశించిపోతాయి.

2. సంచారి ఐతిహ్యాలు (Migratary Legends) :

ఇవి ఒకచోట పుట్టి వేరే ప్రాంతాలకు సంచారం చేస్తాయి. ఒక్కోసారి ఇతర దేశాలకు కూడా ప్రయాణం చేస్తాయి.

జానపదుల దృష్టిలో 'ఐతిహ్యం' అనేది వాస్తవమైంది. ఐతిహ్యాలు నిజంగా జరిగిన ఘటనల్ని నిరూపిస్తాయని వాళ్ళు నమ్ముతారు. వాస్తవాంశాల్ని నిరూపించేది చరిత్ర. చరిత్రలో కల్పితాలకు తావుండదు. అయితే ఇలా జరిగింది, ఇలా ఉండింది అని చెప్పడమే ఇతిహాసం. ఇతిహాసంలో జరిగిన ఘటనలు, పాత్రలు వాస్తవాలని ప్రాచీనులు చెపుతారు. అలాంటివే ఐతిహ్యాలు.

ఆ విగ్రహం లేదా శివలింగం అక్కడ ఎలా ప్రతిష్టించబడిందో, ఆ గోపురం ఎలా కట్టబడిందో, ఆ ధ్వజస్తంభం ఎలా నిలబడిందో తెలిపే అద్భుత విషయాలను జానపదులు పరంపరగా చెప్పుకుని వస్తారు. ఈ ఘటనలు స్థానిక ప్రజల జీవితాలతో ముడిపడి వుంటాయి. అలా ముడిపడి వుండటమే 'ఐతిహ్యం' యొక్క ముఖ్యలక్షణం.

గద్యాఖ్యానాలైన పురాణం, ఐతిహ్యం, కథలను విడదీసి చెప్పడం కష్టతరం. అందుకే ఒక్కోసారి పురాణాలను, ఐతిహ్యాలను కథలలోనే కలిపి చెపుతారు. అందుకే వాటిని పురాణకథలనీ, ఐతిహ్యాత్మక కథలని పిలుస్తారు.

కన్నడదేశంలోని డా॥ జి.వి. దాసేగౌడ స్థానిక ఐతిహ్యాలను 9 రకాలుగాను, సంచారి ఐతిహ్యాలను 5 రకాలుగాను విభజించారు.

స్థానిక ఐతిహ్యాలు :

1. **నరబలికి సంబంధించినవి :** చెరువు నిండడం కోసం, చెరువు గండి పూడ్చడంకోసం, కోట భద్రతకోసం నరబలి ఇస్తారు.
2. **వీరుల్ని ఎల్లల్లో పూడ్చి పెట్టడం :** వీరులు చనిపోతే ఆ ప్రాంత సరిహద్దులలోనే పూడ్చి పెడుతారు. వారు వారి ప్రాంతాన్ని రక్షిస్తారనే నమ్మకం.
3. **యుద్ధ సంబంధాలు :** స్త్రీలు పురుషులకు వీరతిలకం దిద్ది యుద్ధానికి పురికొల్పడం, వాళ్ళు స్వయంగా యుద్ధాలలో పాల్గొనడం.
4. **కుటుంబ సంబంధాలు :** చనిపోయిన తల్లులు మమతల్ని చంపుకోలేక భూతాలు, దెయ్యాల రూపంలో వచ్చి తమ పిల్లల ఆలన, పాలన చూసుకుంటారు.
5. **భ్రమవల్ల పుట్టే ఐతిహ్యాలు :** ప్రకృతి వైపరీత్యాన్ని చూచిన మనిషి అదేదో కొరివిదెయ్యంలా వుందని భ్రమించడం.
6. **శబ్ద సంబంధాలు :** విచిత్ర శబ్దాలకు మనిషి భయపడడం. అలాగే అమావాస్యకు, పున్నమికి లంకెబిందెల శబ్దం వినిపిస్తోందని నమ్మడం.
7. **రహస్యనిధికి సంబంధినవి :** నిధులు భూమిలోపల కుండల్లోను, పెనుంలోనూ పాతింటారని; బురుజుల్లో, గుహల్లో దాచి వుంటారని వాటికి ఏడుశిరస్సుల నాగుపాము కాపలా వుంటుందని ప్రగాఢ విశ్వాసం.
8. **వంశ కీర్తనలు :** కుటుంబానికి సంబంధించిన వారి ఆత్మబలి లేదా వారు మహిమలు చూపే మహిమాన్విత గాథల్ని చెప్పుకోవడం.
9. **జానపద నిరుక్తి** (Folk Etymology) : పల్లెకు లేదా గ్రామానికి ఆ పేరు ఎందుకు వచ్చిందోనన్న విషయాన్ని ఇతరులు నమ్మేవిధంగా చెప్పడం.

సంచారి ఐతిహ్యాలు :

1. **వీరుల భూమికి సంబంధించినవి :** హరిహర రాయలు, బుక్కరాయలు వేటకని అడవికి వెళ్ళగా తమ వేట కుక్కల్ని కుందేలు తరమడం చూచి ఈ చోటు మంచిదని విజయనగర సంస్థానాన్ని స్థాపించారు. ప్రతి జానపద కథలోనూ కోటల

నిర్మాణానికి సంబంధించిన ఈ మూలాంశం వుంటుంది.

2. **ఆత్మబలికి సంబంధించినవి :** తమ ఊరిని కాపాడడంకోసం తమను తామే ఆత్మబలి చేసుకున్న త్యాగమూర్తుల గాథలెన్నో ప్రచారంలో ఉన్నాయి.
3. **శీలవతుల - శీలవంతులకు సంబంధించినవి :** శీలవంతులై వుండికూడా ఆజ్ఞకు లోనైన వారిని గురించి రకరకాల కథలున్నాయి. (ఉదా : రాముడు అరణ్యానికి వెళ్ళడం, పాండవులు వనవాసం చేయడం.)
   అలాగే శీలసంరక్షణకోసం ప్రాణత్యాగం చేసుకున్న స్త్రీల కథలు అనేకం. (ఉదా : చెర్లోపల్లి రెడ్డెమ్మ).
4. **పౌరాణిక అంశాలకు సంబంధించినవి :** పద్మావతి వెంకటేశ్వర కల్యాణం కథలో వచ్చే 'గోవు వృత్తాంతం' భారతదేశంలోని అన్ని భాషలలోనూ కనిపిస్తుంది.
5. **జనప్రియమైన నమ్మకాల ఆధారంగా పుట్టేవి :** ఎవరో సన్యాసి వచ్చి తలుపు తట్టి పిలుస్తాడని, బదులు పలికిన వాళ్ళు వెంటనే చనిపోతారని గట్టి నమ్మకం. అందుకే తలుపుపైన 'రేపు రా' అని రాసిపెట్టి సన్యాసి నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తారు.

'పుంగనూరు' గ్రామనామం. ఈ పేరు ఎందు కొచ్చిందని పరిశీలిస్తే "పుంగనూరు కోటాకు సందమామ, ముట్టాడి పడింది సందమామ, వాళ్ళు ఆడబడ్డ సెరబట్రి సందమామ, ఆవలా సెరబట్రి సందమామ" అనే జానపద పాటను బట్టి చూస్తే పుంగనూరు నందు 'కోట' వుండేదని, దాన్ని ముస్లింలు ముట్టడించారని తెలుస్తుంది.

అలాగే "ఏమే భామా! నీ పేరేమి? నిలిచి మాట్లాడు" అని ఒకడంటే "ఊరు గొప్పదిరా! ఉగ్రచండికరా!" పుంగమ్మ ఏలేటి పుంగనూరు మాదిరా" అని పలికిన ఆమె సమాధానం చూస్తే పుంగనూరు కోటను 'పుంగమ్మ' అనే పేరుగల మహారాణి పరిపాలించేదని తెలుస్తుంది.

పుంగనూరు పట్టణంలో ప్రజల మనస్సులను ఆకట్టుకునే 'రాచనగరి' అదే ఆవరణంలో "నుగుటూరు గంగమ్మ" ప్రక్కనే "పుంగమ్మ చెరువు", చెరువు కట్టకు ఆనుకుని "మాణిక్య వరదరాజస్వామి గుడి", అక్కడికి అల్లంత దూరంలో "ఆతి పలకల కోనేరు" కనిపిస్తాయి. అలాగే 'నాగప్పాళ్యం', 'కట్టకింద పాళ్యం, తాటిమాకుల పాళ్యం, కోనేటి పాళ్యం వంటి పేర్లు కనిపిస్తాయి. దీన్నిబట్టి చూస్తే 'పుంగనూరు' ఒకనాడు పెద్ద సంస్థానంగా వెలుగొందిందని తెలుస్తోంది.

పుంగనూరు కోటను పరిపాలించిన మహారాణి 'పుంగమ్మ' ఎవరని ఆరాతీస్తే ఈమె ఒక పాళెగాని ముద్దుల పట్టి అని, ధైర్యసాహసాలకు మారు పేరైందని ఆ ప్రాంతపువాసులు చెప్పి, మనకు నమ్మకం కలిగిస్తారు. అలాగే పుంగమ్మ చెరువుకు ఎగువన రంగమ్మ చెరువు. దిగువన సుబ్బమ్మ చెరువులు వున్నాయి. వీళ్ళు ముగ్గురు అక్కచెల్లెళ్ళు. వాళ్ళ పేర్లుతోనే ఈ చెరువులు ఏర్పడ్డాయని కూడా చెపుతారు.

అయితే పుంగనూరు ప్రాంతంలో లభించే ఒక కన్నడ శాసనంలో "పులినాట్ట కెఱయ బెలగటూరం" అని వుంది. శాసనంలోగల 'పులినాడు' ఏమిటి అనే మరో ప్రశ్న ఉద్భవిస్తుంది. దీన్ని పరిశీలిస్తే చోళుల కాలంలో ఈ ప్రాంతాన్ని 'పులినాడు' గా వ్యవహరించారని తెలుస్తుంది. 'అహనానూరు' అనే తమిళ కావ్యంలో తిరువేంగడాన్ని అంటే తిరుపతి ప్రాంతాన్ని 'పుల్లి' అనే పేరుగల వడుగు ప్రభువు పరిపాలించాడని చెప్పబడింది. ఆనాడు వడుగును తెలుగుకు బదులుగా తమిళులు వాడారు. తెలుగువాళ్ళను 'వడుగరు' అని పిలిచేవాళ్ళు. దీన్నిబట్టి చూస్తే 'పుల్లి' అనే తెలుగు ప్రభువు ఈ ప్రాంతాన్ని పరిపాలించడం వల్ల అతని పేరుతో 'పులినాడు' గా వ్యవహరింపబడిందని తెలుస్తోంది.

పులినాడులో 'పుంగనూరు' ఒక భాగం. పుంగనూరు అసలు పేరు క్రీ.శ. 610లో "వలవనారాయణ చతుర్వేది మంగళం". 'చతుర్వేదం' అంటే నాలుగు వేదాలు.

'మంగళం' అంటే నాలుగు వేదాలను వల్లించే శుభప్రదమైన ఊరు అని అర్థం. నేటికీ ఈ ఊరిలో కన్నడ మాతృభాష కలిగిన బ్రాహ్మణ కుటుంబాలు అనేకం బ్రాహ్మణవీధిలో నివసిస్తున్నారు.

క్రీ.శ. 10వ శతాబ్ది ఉత్తరార్ధంలో 'అత్తిమబ్బె' చాళుక్యరాజు సేనాని భార్యగా పుంగనూరులో నివాసం వుండేదని, ఆమె సాహిత్య పోషకురాలని, దానచింతామణి అని, రత్నత్రయంలోని పొన్నకవి రచించిన శాంతి పురాణాన్ని రాయసగాళ్ళ చేత రాయించి పండితులకు పంచి పెట్టిందని చెపుతారు.

పొన్నకవి తన శాంతిపురాణ పీఠికలో "పుట్టుదొదు పుంగనూ రొడ" అని తాను పుంగనూరు నివాసి"నని చెప్పుకున్నాడు. అలాగే ఆయన పుంగనూరు కోనేరులో వాగ్వాదాలు చూచి "వెధవలయ్యా పుంగనూరు విధ్వజ్జనులు" అని అన్నాడని చెపుతారు. దీన్నిబట్టి చూస్తే 'పుంగనూరు' అతిప్రాచీనమైన పట్టణం అని తెలుస్తోంది.

"వలవ నారాయణ చతుర్వేది మంగళం" 'పుంగనూరు'గా ఎందుకు మారిందని పరిశీలిస్తే

- పుంగవన్ అంటే తమిళంలో మునిశ్రేష్ఠుడని అర్థం. అంటే మునిపుంగవుడైన వాల్మీకి మహర్షి ఈ ప్రాంతంలో సంచరించినందువల్ల పుంగవన్ - ఊరు ∩ పుంగనూరు అయిందంటారు.
- పుంగం అంటే ఎద్దు. జాతి పశువులకు ప్రసిద్ధి ఈ ప్రాంతం. అందువల్ల పుంగం - ఊరు ∩ పుంగనూరు అయిందంటారు.
- పుంగ వృక్షాలు అంటే కానుగచెట్లు. ఈ ప్రాంతంలో కానుగచెట్లు ఎక్కువ. పుంగుచేదు (కానుగనూనె) వాడకం కూడా ఎక్కువే. అందువల్లనే పుంగపురి అయింది తర్వాత 'పుంగునూరు' అయిందని చెపుతారు. కన్నడదేశంలోని నంజనగూడు ప్రాంతంలో 'హొంగనూరు' అనే గ్రామం వుంది. కన్నడంలో హొంగెమర అంటే కానుగచెట్టు అని అర్థం.
- పరశురాముడు ఈ ప్రాంతానికి వచ్చి తపస్సు చేసుకుని తర్వాత వరదరాజస్వామిని ప్రతిష్ఠించి వెళ్ళాడని అందుకు 'పరశురామ క్షేత్రం' అని పిలువబడేదని చెపుతారు.

ఏది ఏమైనా జానపదుల పాటలను, మాటలను బట్టి చూస్తే పుంగమ్మ అనే మహారాణి ఈ ప్రాంతాన్ని ఏలినందువల్ల ఆమె పేరుతో 'పుంగనూరు' వచ్చిందని చెప్పవచ్చు.

పుంగనూరులోనే పుంగమ్మ చెరువు వుంది. దీని అసలు పేరు 'రాజేంద్రచోళ పేరేరి'. ఇది పెద్దచెరువు. ఈ చెరువుకు వర్షాకాలంలో 'గండి' పడింది. ఈ చెరువుపైనే ఆధారపడి ఎంతోమంది జీవనం గడుపుతుండేవారు. వారికోసం పుంగమ్మ గండికి ఆహుతయ్యింది. గండిపడిన చోట పుంగమ్మకు గుడికట్టి, ఆమె సత్యం వున్నంతవరకు ఈ కట్ట తెగదని ప్రజలు గట్టి విశ్వాసం వెలిబుచ్చుతారు. ఆనాటినుండి రాజేంద్రచోళ పేరేరి 'పుంగమ్మ చెరువు'గా పేరు మారింది. తమ ప్రజలకోసం ఆత్మబలులు చేసుకున్న స్త్రీల కథలు కోకొల్లలు.

రాచనగరి ఆవరణంలో వెలసిన గంగమ్మ కోలారు జిల్లాలోని సుగుటూరు సంస్థానాన్ని పరిపాలిస్తూ కప్పం కట్టలేక రాత్రికి రాత్రే తమ సంస్థానాన్ని వదలి వెళ్ళిపోతున్న వీరశైవలింగాయతుల ఇంటి దేవత. ఆమె వారితో బండరాతి ఆకారంలో వచ్చింది. వాళ్ళు ఒక రాత్రి నిద్రించిన చోటే నన్ను ప్రతిష్ఠించండని ఆజ్ఞాపించిందట. వాళ్ళు అమ్మవారి దృష్టి ఆ ఊరిపై పడకూడదని భూమిలోపల ప్రతిష్ఠించారు. అమ్మవారు సుగుటూరు ప్రాంతం నుంచి వచ్చింది కాబట్టి ఆమెను సుగుటూరు గంగమ్మ అని పిలుస్తారు. ఏడాదికి ఒకసారి అమ్మవారికి జాతరను అంగరంగ వైభవంగా జరుపుతారు.

అలాగే పరశురాముడు ప్రతిష్ఠించిన వరదరాజస్వామిని హరిహరరాయలు, బుక్కరాయలు దర్శించి మాణిక్యాలతో పూజించారట. ఆనాటి నుండి స్వామి మాణిక్య వరదరాజస్వామిగా పిలువబడుతున్నాడు.

పుంగనూరు కోట ముట్టడి :

'దైవా యత్తంతుకులే జన్మా, మదాయత్తంత పౌరుషం' అని కర్ణుడు చెప్పినట్లుగా ఆత్మపౌరుషాన్ని నమ్ముకొని లౌకిక శక్తిని ప్రదర్శించిన మహావీరులు కూడా జానపదుల ప్రశంసలకు పాత్రులవుతారు. ఇటువంటి వీరుల గురించి ఐతిహ్యాలు, వీరగీతాలు పుడుతాయి. పుంగనూరు కోటను నవాబులు ముట్టడించినప్పుడు కందూరు పాపయ్య అనే మహావీరుడు చూపిన ధైర్యసాహసాలు, శత్రువుల్ని ఎదిరించి వీరమరణాన్ని పొందిన ఉదంతం ఐతిహ్యంగా, వీరగీతంగా పుంగనూరు ప్రాంతంలో వ్యాప్తి చెందింది.

ఒకప్పుడు ఢిల్లీ పాదుషా గారి తురకదండు పుంగనూరు కోటను ముట్టడించింది. ఆ దండు ప్రజల్ని నానా బాధలు పెట్టింది. ఈ విషయాన్ని జానపదులు ఇలా పాడుకున్నారు.

పుంగనూరు కోటకు సందమామ - ముట్టాడి పడింది సందమామ
ఢిల్లీ పచ్చావ్ దండు సందమామ - ఢీకొని వచ్చింది సందమామ
అడబిడ్ల సెరబట్రీ సందమామ - వారు అవలా సెరబట్రి సందమామ
మగబిడ్ల సెరబట్రి సందమామ - వాళ్లు మగులా సెరబట్రి సందమామ

ఇలా దుర్మార్గాలు చేస్తున్న నవాబు సైన్యాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక పుంగనూరు దొర ఆవులపల్లె వన దుర్గాల్లోని ఒక చెట్టుతొర్రలో దాక్కుని నాలుగువైపులా వున్న తన బంధువులకు, మిత్రులకు జాబులు పంపాడు. సిద్ధయ్య గాడు ఒక జాబును తీసుకొని కందూరుకు వచ్చాడు. అక్కడ మల్లయ్య, పాపయ్య ఆజాబును చూస్తారు. కొత్త పెళ్ళి కొడుకైన పాపయ్య ఉగ్రుడైపోతాడు. పుంగనూరు దొరగారికి సాయంగా వెళ్లడానికి కోటగుండ్ల పల్లె నగరిలో వున్న తన తల్లి మల్లమ్మ అంగీకారం అడుగుతాడు.

అమ్మరో ఓయమ్మ సందమామ - కనతల్లి మాయమ్మ సందమామ
పుంగనూరు కారణాలు సందమామ - నాపాలి వచ్చాయి సందమామ

కొత్తగా పెళ్ళయిన తన కొడుకును యుద్ధానికి పంపడానికి తల్లి అంగీకరించలేదు. యుద్ధానికి వెళ్తానన్న బిడ్డ మాట వినగానే తల్లి మల్లమ్మ నాగుపాము వంటి నడుం నుగ్గునుగ్గయింది. ఆమె దుఃఖిస్తూ కొడుకుతో ఇలా అంది.

చూసేటి కన్నులకే సందమామ - సూదులే చెక్కితివే సందమామ
కన్న కడుపుకే సందమామ - కంపలే కొడితివే సందమామ
అన్న కూతుర్ని దెచ్చా సందమామ - వంతుగా పెండ్లిండ్లు సందమామ
చిన్నబొమ్మల పెండ్లి సందమామ - చిత్తుగా జేస్తినే సందమామ
పెద్దబొమ్మల పెండ్లి సందమామ - పేరుగా జేస్తినే సందమామ

అయినా పాపయ్య వినకుండా ఆయుధాలు ధరించి, ఏడుపుట్ల నల్లమందు గోనెలకెత్తుకొని, దేవరోళ్ల మారిలోబ్బి పిలిపించి గుర్రాన్ని తెప్పిస్తాడు. ఆ గుర్రం ఎలా ఉందంటే.

నాలుగ్గాళ్ళ తెలుపురా సందమామ - నన్నెత్తిన సుక్కరా సందమామ
తోకపూతోకరా సందమామ దోరవన్నె గోడరా సందమామ
వచ్చం వచ్చం లేని సందమామ - చేజినే పట్టుకొచ్చిరి సందమామ
పాపయ్య సైన్యం ఒక సముద్ర కెరటంలా బయలు దేరింది. ఆ బయలుదేరిన సైన్యం తీరే వేరు.
ఏడుపుట్ల నల్లమందు సందమామ - గోనెల్లు గట్టిరీ సందమామ
గోనేడు వరిపొట్లు సందమామ - గోనెల్లు గట్టిరీ సందమామ

గుర్రాల్ని పట్టుకొచ్చి సందమామ - మేతలే పెట్టిరీ సందమామ
కళ్లాలు వేసిరే సందమామ - జీనాలు పొందిరే సంద మామ
కుడితొడముగొట్టిరే సందమామ - కూసినే రేణువంత సందమామ
ఇరుము తొడము గొట్టిరే సందమామ - ఎల్లుతుందే రేణువంత సందమామ
గుర్రాలు ఎక్కిరే సందమామ - పోయిన్ని రేణువంత సందమామ
కోటగుండ్లపల్లె కాడ సందమామ - కుడితొడము గొట్టిరే సందమామ
కుడితొడము గొట్టిరే సందమామ - కూడినే రేణువంత సందమామ
ఎడమతొడము గొట్టిరే సందమామ - ఎల్లిపోయే రేణువంత సందమామ

ఇలా సైన్యాన్ని వెంటబెట్టుకొని పాపయ్య, తన బావ మరిది ఎర్రయ్య తోడురాగా పుంగనూరు చేరుకున్నాడు. అక్కడే దొరగారి బావి దగ్గర చద్ది అన్నాలు తిని రేణువకు చెప్పవలసినది చెప్పి, యుద్ధ భూమిలో అడుగుపెట్టాడు పాపయ్య అతను యుద్ధభూమిలో చూపిన ధైర్య సాహసాలు అసామాన్యమైనవి.

తొడగొట్టి కేకేశ సందమామ - దండులోన దూకినాడె సందమామ
పక్కలగు వేసెనే సందమామ - పదిలచ్చలే జంపినే సందమామ
ఎనకలగు వేసెనే సందమామ - ఏడులచ్చలు జంపినే సందమామ
వచ్చిన్న దండంత సందమామ - అంతముజేసినాడు సందమామ

యుద్ధభూమిలో పాపయ్య వీరవిహారం చేసిన నవాబు సైన్యం భయపడి ఇక కత్తులు కటార్లతో పని సాగదని మందుగుండుతో యుద్ధం చేసింది. నవాబుల ఫిరంగుల ధాటికి తట్టుకోలేక పాపయ్య సైన్యం చాలా వరకు అంతమైంది. ఉన్న కొద్దిమంది సైనికులు ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకొని పోరాడుతున్నారు. పాపయ్య అధైర్యపడకుండా తన సైన్యాన్ని ఉత్సాహపరుస్తూ, తురక సైన్యాన్ని రెట్టింపు ఆగ్రహంతో తుత్తునియలు చేయసాగాడు. కానీ ఫిరంగిగుండ్ల వర్షానికి పాపయ్య గురి కాక తప్పలేదు. ఆదమరచి వున్న ఒక దుర్ముహూర్తంలో ఒక గుండు తన కడుపులోకి దూరి బయటకు వచ్చేసింది. పాపయ్య కింద పడిపోయాడు. అయినా అతని బావ మరిది సైన్యాన్ని ఉసిగొలిపి శత్రుసైన్యంతో భయం కరంగా యుద్ధం చేస్తున్నాడు. రక్తం ఏరులైపారింది. నేల మీద పడివున్న పాపయ్య అంత్యదశకు చేరుకున్నాడు. అయినా మళ్లీ లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. గొంతులో శ్వాస ఆడుతున్నంత వరకు, నెత్తురు, చల్లబడనంత వరకు, తుది రక్తపుబొట్టు వరకు శత్రువులతో పోరాడటం ఆంధ్రవీరుల ప్రత్యేకత. పల్నాటి యుద్ధంలో బాల చంద్రుడు చూపిన ధైర్యసాహసాలను పాపయ్య చూపిం చాడు. బాలచంద్రుడిలాగే పాపయ్య కూడా వేలాడుతున్న పేగుల్ని పొట్టలోకి తోసి, పైన దట్టికట్టి యుద్ధం చేశాడు. పాపయ్య వీరత్వం గురించి ప్రజలు ఇలా పాడు కుంటారు.

గుండెలో పేగులే సందమామ - కుప్పబడీనాయి సందమామ
పేగులూ గుండెలూ సందమామ - డొక్కనే దోసెనే సందమామ
డొక్కలో దోసినే సందమామ - దట్టేసి కట్టినే సందమామ
పొలికేకొకటేసెనే సందమామ - పైబడి వచ్చినే సందమామ
ఎనకలగువేసెనే సందమామ - ఏడులచ్చలే జంపినే సందమామ
ముందులగువేసెనే సందమామ - మూడులచ్చలే జంపినే సందమామ

ఆలా పాపయ్య యుద్ధభూమిలో ఎంతోసేపు పోరాడలేకపోయాడు. అలాగే మరోసారి నేలకొరిగి పోయాడు. రెండోసారి నేలకొరిగిన పాపయ్యను చూడగానే ధైర్యాన్ని కోల్పోయిన పాపయ్య సైన్యం ప్రాణభయంతో సందుల గొందుల గుండా అడవులకు పారిపోయింది.

ఇలా పుంగనూరు గురించి ఎంతైనా రాయవచ్చు. అయితే కోటలు, నగరాల అవశేషాలు, శిథిలాలతోపాటు గ్రామాల్లోని గ్రామదేవతల గుళ్లను కూడా పరిశీలించాలి. అప్పుడే సమగ్రమైన వాస్తవ చరిత్ర కన్పిస్తుంది. ఇప్పటి చరిత్రను, సంస్కృతిని తిరగరాయవచ్చు.

శ్రీశ్రీగారు అన్నట్లు ''ఇతిహాసపు చీకటి కోణం. అట్టడుగున పడి కన్పించని కథలన్నీ కావాలిప్పుడు, దాచేస్తే దాగని సత్యం''

ఇంతవరకు చరిత్రకారులకు కనిపించని ఎన్నో సత్యాల్ని జానపదుల కథల, గేయాల, వీరగాథల ద్వారా వెలికితీయవచ్చు.

పుంగనూరులో నగరిని కట్టించినది కర్నాటక రాజ్యం లోని సుగుటూరు ప్రాంతం నుండి వచ్చిన వీరశైవులు. అయితే వీళ్ళకంటే ముందు పుంగనూరు ప్రాంతాన్ని పాలెగాళ్ళు ఎవరో పరిపాలించారనడానికి జానపద కథలే ఆధారం.

ఉదా :

1. పుంగమ్మ ఏలేటి పుంగనూరు మాది అని అనడం. పుంగమ్మ తన ప్రజలకోసం ఆత్మబలి చేసుకోవడం. ఆమె గుర్తుగా నేటికీ గుడికట్టి పూజింపబడుతుండటం.
2. పుంగనూరు దొరగారికి ఆవులపల్లె వనదుర్గాలు, కందూరు, బంగారుపాళ్యం, తెట్టు, పాకాల మొదలైన ప్రాంతాల్లో బంధువులున్నారు. (నుగుటూరు వారికి ఈ ప్రాంతాలలో బంధువులెవరూ లేరు).

సుగుటూరు వాళ్లు పుంగనూరుకు రాకముందుటి చరిత్రను పరిశోధిస్తే అసలు సత్యాలెన్నో వెలుగులోకి వస్తాయి. ఈ సాహసానికి ఎవరైనా పరిశోధక విద్యార్థులు కాని, విశ్వవిద్యాలయాలు కాని పూనుకోవాలి.

ఇలా ఒక ఊరిలో రకరకాల ఐతిహ్యాలు నిలయమై వుండడం పుంగనూరు ప్రత్యేకత.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద సాహిత్యము, పురాణగాథలు, ప్రేమలత, రాని, 1983, అవేక్ ప్రింటర్స్, సికింద్రాబాద్.
2. పులినాడు పుంగనూరు ఐతిహ్యాలు, రామనాథం నాయుడు, 2002, హర్షిణి పబ్లికేషన్స్, మైసూరు.
3. తొలి ప్రొద్దు, జాతీయ తెలుగు పక్షపత్రిక, 1991, శ్రీరాములు రెడ్డి, పుంగనూరు.
4. రా.నా. వ్యాససంకలనం, రామనాథం నాయుడు, 2016, గుప్త ప్రింటర్స్, మైసూరు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సామెతలు – భావితరాలకు ప్రయోజనాలు

– డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి

జనపథం నుండి పుట్టిన జానపదంలో మౌఖిక సాహిత్యానికి ప్రత్యేకస్థానం ఉంది. ప్రయోజనం ఉంది. జీవితం నేర్పిన పాఠాలను పదిలపరిచి, భావితరాలకు బోధనలుగా అందించే క్రమంలో జానపదుల పాట, మాట ప్రధాన భూమిక పోషిస్తాయి. నుడికారాలుగా, సామెతలుగా, పొడుపు కథలుగా, ఊకుడు కథలుగా జన సామాన్యంలో ప్రవహించే భాష. ఆయా సమాజాల ప్రత్యేకతలను, ఆలోచనాశక్తిని, ప్రయోగ నైపుణ్యాన్ని పట్టిస్తుంది. ఆలోచనతో, జీవితంతో గాఢంగా ముడి పోయిన భాష, సామెత రూపంలో బలమైన వ్యక్తీకరణకు ఆలవాలంగా నిలుస్తుంది. జానపద విజ్ఞాన అంశాలలో సామెత ముఖ్యమైంది.

'సామ్యతను చెప్పేదీ సామెత' అని సామెత స్వరూపాన్ని చిన్నదిగా చూపలేం. 'జనజీవనం ఎంత విస్తృతమైందో, సామెత కూడా అంత వైవిధ్యపూర్ణమైంది' అని చెప్పున్న ఆర్వీఎన్ సుందరంగారి మాటలు ఇక్కడ ఉదాహృతాలు.

'జానపద విజ్ఞానంలోని అనేక అంశాలలాగే సామెతలు కూడా సంప్రదాయకమైనవి. వీటి ప్రత్యేకత వివేకపూర్ణమైనవిగా ఉండడం, సంక్షిప్తంగా ఉండడం' అని పరిశోధకులు పేర్కొంటున్నారు. 'అల్పాక్షరాలలో అనల్పార్థ వ్యక్తీకరణగా, సమతూకం కలిగిన అందమైన వాక్యాలుగా, ప్రాసాను ప్రాసలతో కూడిన లయాత్మక విన్యాసంగా, సామెతలు దర్శనమిస్తాయి. మనిషి వివేకాన్ని ప్రతిబింబించేవిగా, మనుషుల అనుభవాన్ని అభివ్యక్తం చేసేవిగా జనసామాన్యంలో ప్రత్యేక సంప్రదాయాన్ని ఏర్పరిచేవిగా సామెతలు ఉంటాయి. సుదీర్ఘ అనుభవం ధరించిన సంక్షిప్తరూపంగా కనిపించే సామెత 'ఆలంకారికంగా, గూఢార్థద్యోతకంగా' ఉండడం ఒక ప్రత్యేకత. సామెతలలోకి భాష సంకేతాత్మకంగా' ఉంటూ, రూపకాలు, ఉపమానాలు, దృష్టాంతాలు, స్వభావోక్తులతో' తులతూగే సామెతలు బహుముఖ అభివ్యక్తులకు ద్వారాలుగా నిలుస్తున్నాయి.

ఎన్నో విశిష్ట లక్షణాలు గల సామెతలు భావితరాలకు ఏమైనా ప్రయోజనకరం ఉంటాయా? ఉంటే వాటి ప్రభావం ఎంతవరకు ఉండవచ్చు? అనే కోణంలో చర్చిద్దాం.

1. సంప్రదాయన్ని వారసత్వాన్ని అందించడం
2. భాషా ఔన్నత్యాన్ని చాటిచెప్పడం
3. సమర్థవంతమైన వ్యవహారాన్ని నడపడం
4. అనుభవసారాన్ని భద్రపరచడం
5. అన్యాపదేశంగా బుద్ధిచెప్పడం / నీతి నేర్పడం
6. దృక్పథంలో మార్పు తేవడం
7. అస్తిత్వ గుర్తింపును కొనసాగించడం

1. సంప్రదాయ వారసత్వాన్ని అందించడం :

పురాణ ఇతిహాసాల నుండి, ప్రాచీన కాలం నుండి మనిషికి ఉపయోగపడే విలువైన అంశాలను సామెతల రూపంలో అందించవచ్చు. సర్వకాలీన విలువలు గలిగిన సత్యాలు, అవి నేర్పిన పాఠాలు భావితరాలకు సులువుగా అందించడానికి సామెతలు వాహికలుగా పనికొస్తాయి. అదే సమయంలో గతం తాలూకు సంస్కృతి, దానిలో ఇమిడిపోయిన మానవ చరిత్ర కూడా అవగతం అవుతాయి. మనుషుల వ్యక్తిత్వాలను, సామర్థ్యాలను సరళ సుందరంగా, స్పష్టంగా చూపించడానికి సామెతలు దర్పణాల్లా ఉపయోగపడతాయి.

ఉదా :

రాము బాణానికి తిరుగు లేదు
ఉడతాభక్తిగా చేస్తున్నా

శల్య సారథ్యం వద్దు
గురువును మించిన శిష్యుడు
ఉత్తరకుమారుడిలా మాట్లాడకు
పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం

వంటి సామెతలు పురాణ ఇతిహాస నేపథ్యం నుండి వచ్చాయి. కాబట్టి, వాటి నేపథ్యం తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. 'రామబాణం' అంటే 'మాటకు తిరుగుండదు అని', 'ఉడతాభక్తి' అంటే 'చిరు సహాయం' అని, శల్యసారథ్యం అంటే 'స్వపక్షంలో విపక్షం' అని లేదా మన పుట్టలో చేరి మనల్నే ముంచేయడమనీ, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం అంటే చిన్నవారిపై పెద్దశిక్షలు అనే అర్థంలో ఉపయోగిస్తున్నాం. పురాణగతంగా కనిపించే కథలు, సంఘటనలు, పాత్రల వ్యక్తిత్వాలు వీటిల్లో ఉన్నాయి. వీటి ప్రాధాన్యం గతంతో ముడిపడి ఉంటుంది. ప్రపంచంలోని బహుముఖ వ్యక్తిత్వాలను అర్థం చేసుకోవడానికి మహాభారతం ఉపయోగపడినట్టే, విభిన్న మనస్తత్వాలను భావితరాలకు బోధించడానికి సంప్రదాయ సామెతలు ఉపయోగపడతాయి.

భాషా ఔన్నత్యాన్ని చాటిచెప్పడం :

ఇంతకు ముందే చెప్పినట్లు అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని చెప్పగల లక్షణం సామెతకు ఉంది. సామెతలు కేవలం విషయాన్ని బోధించడమే గాక, భాషాపరంగా ఒక చమత్కారాన్ని కూడా కలిగి ఉంటాయి. రెండు మూడు పదాలతో ఏర్పడే సామెతలను మినహాయిస్తే అంతకన్నా ఎక్కువ పదాలతో ఏర్పడే సామెతలు కొన్ని భాషా ప్రత్యేకతలతో అలరారుతున్నాయి.

సామెత ఏక వాక్యంలో ఉండవచ్చు, లేదా సమతూకం కలిగిన రెండు వాక్యాలుగా గాని, లేదా ఒకే వాక్యంలో రెండు భాగాలుగా గాని ఉంటున్నాయి.

రెండు సమాన భాగాలున్న సామెతల్లో ప్రాసలు, లయ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. తెలుగు సామెతల్లో ద్విపద, తేటగీతి, ఆటవెలది పాదాలు కనిపిస్తాయని విమర్శకులు తేల్చారు. (తెలుగు సామెతలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి)

ఛందోబద్ధత, రసప్రాధాన్యం వంటి కవిత్వగుణాలు సామెతల్లో ఉంటున్నాయి. ముఖ్యంగా వేమన పద్య పాదాలు సామెతలుగా వ్యవహారంలో ఉండడాన్ని గుర్తించవచ్చు.

చెప్పు తినెడి కుక్క చెరుకు తీపెరుగునా
సాధనమున పనులు సమకూరు ధరలోన
ఎదుటి వారి సొమ్ము ఎల్లవారికి తీపి

వంటివి కోకొల్లలు.

లోకానుభవం నుండి పుట్టిన సామెతల్లో కూడా ప్రాస వైవిధ్యం కనిపిస్తుంది.

అంగిట్లో అన్నీ ఉన్నా - అల్లుడు నోట్లో శని ఉంది
అ అలు రావు గానీ - అగ్రతాంబూలం కావాలంట
ఎంత పండినా కూటికే - ఎంత ఉండినా కాటికే
కడుపులో చల్ల - కదలకుండా
కలిపి కొట్టరా - కావేటి రంగా...

ఇలా లయమాధుర్యంతో సాగిపోయే సామెతలూ ఉన్నాయి. అంతేగాక యతి స్థానంలో ఉన్న అక్షరాలు కలిసేవి కూడా శ్రవణ మాధుర్యంతో ఉంటున్నాయి.

ఉల్లి చేసిన మేలు - తల్లి కూడా చేయదు
ఎద్దుకొద్దే సేద్యం - సద్ది కొద్దీ పయనం
ఏ గూటి పక్షి - ఆ గూటికి చేరుతుంది

ఇవి కాక సమతూకంతో నడిచే సామెతలు, వాటి మధ్య వచ్చే శబ్ద పునరావృతాలు కూడా సామెతలకు అందం తెచ్చి పెడుతున్నాయి.

కలిసి వచ్చే కాలానికి - నడిసొచ్చే పిల్లలు పుడతారు
ఏపాటు తప్పినా - సాపాటు తప్పదు
అదిగో పులి అంటే - ఇదిగో తోక అనట్టు
ఇల్లు గట్టి చూడు - పెళ్లి చేసి చూడు...

ఇలా భాషా ఔన్నత్యాన్ని చాటే సామెతలు ఎన్నో ఉన్నాయి. ఛందో బద్ధత కలిగిన సామెతలు తెలుగులోనే

గాక, ఆంగ్లం, తమిళం, కన్నడం మొదలైన భాషల్లో కూడా ఉన్నాయని ఆర్వీఎస్ పేర్కొన్నారు.

సామెతల్లో ఉండే భాషా సౌందర్యం, యతి, ప్రాస, లయ, అక్షర లేదా పదాల పునరావృతాలు ముందుతరాన్ని సులభంగా ఆకర్షించగలుగుతాయి. భాషలో కనిపించే చమత్కారం త్వరగా ఆకట్టుకోవడమే గాక, ఆలోచనల్లోకి సులభంగా తీసుకెళ్ళ గలుగుతుంది. తెలుగు భాషను సజీవంగా ఉంచడానికి వ్యవహర్తలలో జిజ్ఞాసను పెంచ డానికి సామెతలు ఉపయోగపడతాయి.

సమర్థవంతమైన వ్యహారాన్ని నడపడం :

'పురుషులందు పుణ్య పురుషులు' వేరయా అనట్టుగా, మాట్లాడే వారిలో బాగా మాట్లాడేవారు ఎప్పుడూ వేరుగా, గుర్తింపు కలిగి ఉంటారు. అందుకు కారణం వారు ఉపయోగించే భాష, విషయావగాహన, అభివ్యక్తి నైపుణ్యం ప్రధాన కారకాలుగా ఉంటాయి. అంతేగాక ఎంతో సమయం తీసుకొని చెప్పాల్సిన విషయాలను తక్కువ సమయంలో అర్థవంతంగా చెప్పాల్సి వచ్చినప్పుడు సామెతలు సమర్థవంతంగా కమ్యూనికేషన్‌కు ఉపయోగ పడతాయి.

ఒక వ్యక్తి శక్తిని వర్ణించడానికి వాడి కండబలం, ఒడ్డు, పొడువు, శక్తి సామర్థ్యాలను పని కట్టుకుని చెప్పి సమయం వృథా చెయ్యడం కంటే, వాడు భీముడు, వాడు ధర్మరాజు, వాడు శకుని, వాడు కర్ణుడు, ఆమె పిటి ఉష లాంటి పోలికను ఆవిష్కరించే ఉపమానాలు సమర్థవంతమైన వ్యవహారశైలికి మరింత పదును పెడతాయి.

ఉదా :

"నిండా మునిగినాక సలేంది"
"అగ్గికి గాలితోడైనట్టు"
"బూడిదలో పోసిన పన్నీరు"
"అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్టు"
"అమ్మ బోతే అడవి - కొనబోతే కొరివి"
"అయినోళ్ళకు ఆకులు - కానోళ్ళకు కంచాలు"

ఇలాంటి వైవిధ్యభరితమైన సామెతలు సందర్భాన్ని బట్టి చెప్పే విషయానికి ప్రాధాన్యాన్ని తేవడమే కాక, చెప్తున్న విధానానికి సొంపు చేకూర్చుతాయి. అంతే గాక వ్యవహర్త సామర్థ్యాన్ని ఉన్నతం చేస్తాయి. సాధారణ శైలిలో మాట్లాడే వ్యవహర్త కన్నా సామెతలు వినియోగించి మాట్లాడే వక్తకు అభివ్యక్తి సామర్థ్యం భిన్నంగా ఉంటుంది. కమ్యూనికేషన్ స్కిల్‌ను పెంపొందించే సామెతలను భావి తరాలకు అందించడం ద్వారా మాతృభాషకున్న సామ ర్థ్యాన్ని తెలుసుకోవడమే గాక, ఆ భాషపట్ల మరింత మమ కారం పెరిగే అవకాశం ఉంది. మనిషి ప్రతిభకు, కల్పనా చతురతకు సామెతలు ఊతం ఇస్తాయనడం అతిశయోక్తి కాదు.

అనుభవసారాన్ని భద్రపరచడం :

మనిషి విన్నవీ, కన్నవీ, అనుభవించినవీ సామెతలుగా వర్ధిల్లుతూ ఉంటాయి. జీవితం నేర్పిన పాఠాలు, పెద్దలు చెప్పిన కథలు, పుస్తకాలు చెప్పిన ధర్మాలు మొదలైన వన్నీ మానవ సమాజాన్ని మంచి దారిలో నడిపించడానికి ఉపయోగపడతాయి.

ప్రతి మనిషికీ అనుభవాన్ని మించిన పాఠం ఇంకొకటి ఉండదు. అదే సమయంలో ఎవరి అనుభవాలు వారివే. అన్నిటినీ ఒకరే అనుభవించలేరు. అయినా, అనుభవా లను పంచుకోగలరు. పంచుకున్న అనుభవం తాత్కా లికం. అంటే ఆ తరంతో అంతరించి పోవచ్చు. అదే అనుభవాన్ని రచనల్లోకి తెస్తే, ఆ రచన ఉన్నంత కాలం పాఠాలు చెప్తూనే ఉంటుంది. అదే అనుభవాన్ని సామెతల రూపంలోకి మార్చి, వాడుకలోకి తెస్తే, అది నిరంతరం ఒక సత్యాన్ని బోధిస్తూనే ఉంటుంది.

'అక్కర తీరిపోతే అక్క మొగుడు కుక్క'
'అడుసుతొక్కనేల కాళ్ళు కడుగనేల'
'ఆరోగ్యమే మహాభాగ్యం'
'ఇల్లు ఇరకటం - ఆలు మరకటం'
'ఎంగిలి చేత్తో కాకిని తోలడు'
'ఎదుటి వారి సొమ్ము ఎల్లవారికి తీపి'

'కొండను తవ్వి ఎలుకను బట్టినట్టు'
'కొత్తక వింత, పాతొక రోత'
'తిరపతికి వస్తే తిత్తెబోడి - నెత్తీబోడి'

ఇలా ఎన్నో సామెతలను చెప్పుకోవచ్చు. సామెతలు అనుభవాన్ని భద్రపరచడమే గాక, చమత్కార పూరితంగా భాషా సమాజంలో ప్రత్యేక పాత్ర పోషిస్తూ ఉంటాయి.

అన్యాపదేశంగా హితబోధ చెయ్యడం :

ఏ వ్యక్తీ తను చేసింది తప్పు అని ఒప్పుకోడు. ఇంకొకడు తప్పు చేశావని ఎత్తిచూపినా దాన్ని స్వీకరించ డానికి ఇష్టపడడు. తప్పులు చేస్తున్నవారికి హితబోధలు చెయ్యడానికి చాలామంది సాహసించరు. ఎందుకంటే, మంచిని స్వీకరిస్తారో లేదో తెలియదుగానీ, వారి మధ్య ఉండే సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఏర్పడవచ్చు. ఇలాంటి సున్నిత సందర్భాల నుండి మానవ సంబంధా లను కాపాడడానికి సామెతలు ఉపయోగపడతాయి.

'చెప్పేది శ్రీరంగ నీతులు - దూరేది... గడిసెలు'
'కొన్నది వంకాయ, కొసరింది గుమ్మడికాయ'
'కోడలికి బుద్ధి చెప్పి అత్త గంటె నాకిందంట'
'అంబలి తాగే వాడికి - మీసాలు ఎగబట్టేవాడొకడు'
'మింగను మెతుకు లేకపోయినా - మీసాలకు సంపంగి నూనె కావాలంట'
'చెట్టు పేరు చెప్పి - కాయలమ్ముకునే రకం'
'తడిగుడ్డతో గొంతు కోస్తారు'

ఇలాంటి సామెతలు ఘాటైన వ్యంగ్యాన్ని, అధిక్షేపాన్ని కలిగి ఉంటాయి. చెప్పాల్సిన నీతిని సామెత ద్వారా చెప్పడంవల్ల, అందులోని అంశం సాధారణీకరించ బడుతుంది. అయితే, అందులోని సారం అందాల్సిన వారికి సరిగ్గానే అందుతుంది.

దృక్పథంలో మార్పుతేవడం :

'పుర్రెకోబుద్ధి, జిహ్వకోరుచి' అన్నట్టు ఎవరి ఆలోచనలు వారివి. ఎవరి దృక్పథాలు వారివి. సాధ్యమైనంత ఎక్కువ మంది తమకు తెలిసిందే అసలైన నిజంగా భావిస్తుం టారు. అలాంటి వారి ఆలోచనలను మార్చడం అంత లేలిక కాదు. అయితే విద్య, గురువులు, నమ్మకస్తులు చెబితే అభిప్రాయాలను తొందరగా మార్చుకునే అవకాశం ఎక్కువ. ఈ క్రమంలో ఆలోచనల్లో మార్పు తేవడానికి సామెతలు కూడా బాగా ఉపయోగడపతాయి అని చెప్పడంలో సందేహం లేదు.

'స్థాన బలిమిగాని తన బలము కాదయా'
'తాడి చెట్టు నీడన పాలుతాగినా కల్లు తాగినారంటారు'
'తీటపట్టినోడు గోక్కుంటాడు'
'తొండ ముదిరి ఊసరివిల్లి అయినట్టు'
'అమ్మ అల్లం అయిందంట - పెళ్ళాం బెల్లం అయ్యిం దట'
'దాహమేసినప్పుడు బాయి దొవ్వుకున్నట్టు'
'దినుమ్మూ చచ్చేవాడికి - రోజూ ఏడ్చే వాళ్ళెవరు'
'దెబ్బకు దెయ్యం కూడా పరుగెత్తుతుంది'
'దొరికితే దొంగ - దొరక్కపోతే దొర'
'పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది'

ఇలాంటి సామెతలు మనిషి ఆలోచనా విధానాన్ని మార్చుకునేటట్టు చేయగలవు. మొసలికి బలమెక్కువ అని వాదించే వాడికి, బయట కుక్క చేత భంగపడిన విధం తెలియకపోవచ్చు. అది తెలిస్తేనే స్థానబలిమి విలువ తెలుస్తుంది. నేను చేసేవన్నీ సక్రమమే కాబట్టి బార్‌లో కూర్చొని పళ్ళరసం తాగుతున్నానంటే నమ్మరు. వాదోపవాదాల మధ్య అపవాదు పాలవ్వడం కన్నా, గౌరవంగా ఉండడానికి అవసరమైన లోకజ్ఞానం ఈ సామెతలు ప్రసాదిస్తాయి. ఈ విధంగా ఆలోచనా దృక్పథంతో మార్పు తేవడానికి సామెతలు ఉపయోగ పడతాయి.

అస్తిత్వ గుర్తింపు :

సామెతలు అస్తిత్వ గుర్తింపును కొనసాగించడంలోనూ తమవంతు పాత్ర పోషిస్తాయి. ప్రాంతీయ, వర్గ, వృత్తి పర అస్తిత్వాలు, వాటి తాలూకు సంస్కృతి సామెతల్లో కనిపిస్తాయి. ప్రాంతాన్ని బట్టి సంబంధిత భావజాలం,

పదజాలాలు సామెతల్లో మారిపోతూ ఉంటాయి. స్థలపురాణాలు, దేశచరిత్రల కూడా సామెతల్లో గుర్తింపును కలిగి ఉంటాయి.

ఉదా :

'గొడ్డోడు గొడ్డు కేడిస్తే కొవ్వోడు కొవ్వుకేడ్చాడంట'
'అర్ధ అణా కోతి - ముక్కాలణా బెల్లం తినింది'
'గొంగళి ఉన్నంత వరకు కాళ్ళు సాచుకోవాలి'
'రోట్లో తలబెట్టి రోకటి పోటుకు జడిసినట్టు / భయపడినట్టు'
'అసలు కన్నా - వడ్డీ ముద్దు'

వ్యవసాయం చేసే ఎద్దు చనిపోతే, రైతు ఎంత బాధ పడతాడో మనకు తెలుసు. అదే సమయంలో చనిపోయిన ఎద్దు మాంసాన్ని మరొకరు తింటారు. ఈ సందర్భాన్ని ఆసరాగా చేసుకొని పుట్టిన సామెత 'గొడ్డోడు గొడ్డు కేడిస్తే - కొవ్వోడు అంటే తినేవాడు కొవ్వులేదని లేదా కండలేదని ఏడ్చాడట. ఈ సామెత రైతు జీవన అస్తిత్వాని పట్టిస్తుంది. "సంగటి లేక ఇంట్లో వాళ్ళు ఏడస్తా వుంటే, అడుక్కునే వాడు పలావు పెట్టమన్నాడంట" అనే అర్థం వచ్చే విధంగా దీన్ని ఉపయోగిస్తుంటారు.

'అర్ధ అణా కోతి ముక్కాలణా బెల్లం తినిందంట' అనే సామెత కూడా చెరుకు రైతుల జీవితానుభవం నుండి పుట్టిందే. యాభై రూపాయల కూలి కొచ్చి, వందరూపాల బెల్లం తీసుకెళ్ళాడనడం ఒక సందర్భం అయితే, అనుకున్న దాని కన్నా ఎక్కువ తీసుకున్న సందర్భాలలో ఈ సామెతను ఉపయోగిస్తుంటారు.

'రోట్లో తలబెట్టి రోకటి పోటుకు జడిసినట్టు లేదా భయపడినట్టు' అన్న సామెత 'దంచుళ్ళు' గల జీవన విధానం నుండి పుట్టింది. రోకటి పోటు ఎంత గట్టిగా ఉంటుందో దంచేవారికి తెలుసు. ఇప్పుడు మిల్లులు, మిషన్లు వచ్చి 'దంపుడు' సంగతులు వస్తున్న తరానికి తెలియదు.

వడ్డీ వ్యాపార సంస్కృతి నుండి 'అసలు కన్నా వడ్డీ ముద్దు' అనే సామెత పుట్టి ఉంటుంది. అయితే ఇది వేరు వేరు సందర్భాలకు, వేరు రూపాల్లోకి మారిపోతూ ఉంది. 'ముందొచ్చిన చెవుల కన్నా, వెనకొచ్చిన కొమ్ములు వాడి' వంటివి కూడా ఇదే అర్థాన్ని ఇస్తున్నాయి.

సామెతల్లో సాంస్కృతిక అస్తిత్వం ఉండడాన్ని మనం గమనించవచ్చు. దీన్ని తరువాతి తరానికి అందించడంలో సామెతలు తప్పక వాహికలుగా నిలుస్తాయి.

సామెతలు, సామాజిక విజ్ఞాన జ్యోతులుగా నిలవడమే గాక, దురాచార ఖండన, సదాచార ప్రోత్సాహం అనే కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాయి.

ముగింపు :

క్రీస్తు సువార్తలలో, మహమ్మదీయుల ఖురాన్‌లో, వేదోపనిషత్తులలో సామెతలు, సామెతలను పోలిన వాక్యాలు ఇప్పటికీ ఎంతో కొంత బోధిస్తున్నాయి. ఆచారాలు, ఆదర్శాలు, మనవ స్వభావాలు, నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు సామెతల రూపంలో తరతరాలుగా విజ్ఞానం బోధిస్తున్నాయి. 'ప్రపంచ మానవులంతా ఒకే పిండి నుండి చేయబడిన వాళ్ళే' అంటున్న 'డా॥ చాంపియన్ మాటలను గుర్తిస్తే, మానవుడి మూలభూత గుణాలైన ప్రేమ, ఆకలి, భయం, ఇతర గుణాలు ప్రాక్‌పశ్చిమాలకు సమానం. అదే విధంగా 'సామెతల జ్ఞానం అందరికీ ఒక్కటే. అభివ్యక్తిలో తేడా తప్ప మనిషిని మానవతావాదం వైపు నడపడానికి అసవరమైన నీతిని బోధిస్తూ అనేక సంస్కారాలను తర్వాతి తరానికి అందించడంలో సామెతలు ఒక భూమికగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీయస్ సుందరం
2. సుందరజానపదం - డా॥ ఆర్వీయస్ సుందరం

3. తెలుగు సామెతలు - ఆం.ప్ర. సాహిత్య అకాడెమీ
4. పసిడి పలుకలు - నేదునూరి గంగాధరం
5. వ్యవసాయ సామెతలు - నేదునూరి గంగాధరం
6. తెలుగు సామెతులు (ఆంగ్లానువాదంతో) - ఎం.డబ్ల్యు. కార్
7. అంతర్జాల వేదిక - www.scribd.com (telugu samethalu.pdf)
8. సామెతలు సాంఘిక జీవనం - ఆచార్య పి. నరసింహారెడ్డి

❖ ❖ ❖

జానపద కళలు – కళారూపాలు – వాద్య పరికరాలు

– కొమ్మలపాటి శ్రీనివాసరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

జనపదమంటే పల్లెఊరు "ఆర్యావర్తః పుణ్యభూమి ర్మధ్యవిన్ధ్యహిమగయోఃr, నీవృజ్జ నపదొ దేశ విషయొతూ పవర్తనమ్" అని అమరం చెప్తుంది. జనపదంలో (గ్రామం) ఉండేవారు జానపదులు. వారు వాడుకొనే పాటలు లేదా గేయాలు జానపద గేయాలవుతాయి. సమాజంలోని ఆచార వ్యవహారాలు వివిధ వర్గ, వర్ణ మనస్తత్వాలను సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబించే లక్షనం ఆ సమాజపు జానపద సాహిత్యంలోనే అధికంగా ఉంటుంది. వాస్తవ మైన సామాజిక చారిత్రావగాహనకు జానపద సాహిత్యం పరిశీలన తొలిమెట్టు.

జానపద విజ్ఞానంలో కళలు విడదీయరాని విభాగం. ప్రపంచంలో ఏ కళైనా సమాజానికి, సంస్కృతికి సంబంధించినదై ఉంటుంది. భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు జానపద కళల్లో జీవిస్తాయి. ఈ కళలు ప్రజల నిత్య వ్యవహార భాషా పదాల్లో, పల్లె జీవితంలో ఊపిరి పోసుకుంటాయి. ఏ జాతి చరిత్రకైనా జానపద కళలే ఆధారం. వందలాది జానపద కళారూపాలు ఆనాడు పల్లె ప్రజలకు విజ్ఞానాన్ని వినోదాన్ని కలిగించాయి. మానవ జాతి నిత్య జీవనంలో కలగలిసిన సంస్కృతి, సంప్రదాయం, పవిత్రత, ప్రవర్తన, విజ్ఞానం, వినోదం, వేషం, భాష, కట్టు బొట్టు, కొలుపులు, జాతర్లు, నమ్మకాలు, ఆత్మీయత, వంటి అంశాలతోపాటు సంగీతం, తాళం, లయ, నృత్యం, అభినయం, ఆహార్యం, వాద్యం, లయబద్ధమైన కలయికా క్రమశిక్షణ వంటి ప్రత్యేకాంశాలు జానపద కళారూపాల్లో నిక్షిప్తమై జానపద విజ్ఞానానికి భాష్యం చెపుతాయి. ఆయా అంశాలన్నీ ప్రజలకు నూతన చైతన్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తాయి.

జానపద కళలు అంతి ప్రాచీనమైనవి. నాటి మానవుల యొక్క అనుభూతులకూ, మానసిక చైతన్యానికీ, విజ్ఞాన వినోదాలకూ, ఆనందోత్సాహాలకు ప్రతీకలై ఆధునిక కళలన్నిటికీ పునాదులై అగ్రభాగాన నిలిచాయి. సహజంగా ప్రతి సన్నివేశాన్ని, సంఘటనను అద్భుతంగా తమకు అనుగుణంగా మలచుకుని కళ్ళల్లోకి వంపు కోవటం జానపదులకు మాత్రమే తెలుసు. కళారూపాల్లో సమాజ మూలాలు, పునాదులను వెతుక్కోవచ్చు. నవీన నాగరి కతకు ముందున్న మానవ జీవన విధానం వీనిలో నిక్షిప్తమై ఉంటుంది.

ప్రాచీన గ్రామీణ వ్యవస్థను, ప్రజల ఆచార వ్యవహారా లను ప్రతిబింబించేవి జానపద కళలు. అనిర్వచనీయ మానవ సాంస్కృతిక జీవనంలో అంతర్భాగమై ఆహ్లాదకర పరిమళాల్ని వెదజల్లిన సహజమైనవి ఈ కళలు. కొలుపులు, జాతరలు, అచ్చమైన జానపదుల పండుగలు. ఇవి గ్రామీణుల విశ్వాసాలకు దర్పణం పడతాయి. విశ్వా సాలు, నమ్మకాలు ఆచార సంప్రదాయాలను తరతరా లుగా ఒకరి నుండి మరొకరికి అందిస్తూ తెలుగు నేలను సుసంపన్నం చేసిన వాహికలే ఈ కళలు. జానపదులకు విజ్ఞాన వినోదాలను కల్పించడానికి, తీరిక సమయాన్ని ఆనంద భరితం చేయడానికి, శ్రమను మరిచిపోవడానికి, కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించడానికి, సంస్కృతిని కాపాడ డానికి జానపదుల హృదయ లోతుల నుండి రూపుదిద్దు కున్న సజీవ సంపదే జానపద కళారూపాలు. వాని అనుసంధానకర్తలు ఆయా కళాకారులు. కళలు మనిషి మనుగడకు సాగిన జీవన పోరాటానికి ఊతమిచ్చాయి. ఏ రంగులూ పులమని, ఏ మర్మాలు సోకని స్వచ్ఛమైన జానపదం జనపథం జానపద కళల్లో దొరుకుతుంది. పురాణాలు, ఇతిహాసాలు, యుద్ధాలు, తిరుగుబాట్లు అతివృష్టి అనావృష్టి ఇలా ఒకటేమిటి ఊహాతీత వైవిధ్య భరితమైన అంశాలెన్నో జానపద కళల్లో ఇది ఉన్నది, అది

లేదని అనుకోవలసిన పనిలేదు. సమస్త విషయాలకు ఇవి ఆలవాలంగా ఉన్నవి.

నాటకం, సినిమా, రేడియో, టీవీ, కంప్యూటర్, వీడియో, ఆడియో, ఫోన్, అంతర్జాలం వంటి సమాచార, ప్రసార మాధ్యమాలు లేని పూర్వకాలంలో పల్లె ప్రజలను అలరించిన రసభరితమైన అత్యుద్భుత సిసలైన జానపద కళారూపాల్లో చాలా వరకు ఈనాడు కాలగర్భంలో కలిసి పోయాయి. మరికొన్ని క్షీణదశలో ఉన్నవి. అనాటి కళా కారులు పట్టెడన్నం, బారెడు ముతక గుడ్డకోసం రాత్రి పగలు తేడా లేకుండా శ్రమించి ప్రజలకు వినోదం, విజ్ఞానం, సంతృప్తిని పంచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకనాడు కోలాటాలు, పగటివేషాలు, బయ లాటలు, విప్రవినోదులు, యక్షగానాలు, వీధినాటకాలు, కొరవంజి, పగటి వేషాలు, తోలుబొమ్మలాటలు, జిక్కిణి కోపు, చోడిగాని కలాపం, కూచిపూడి నృత్యం, పేరిణి తాండవ నృత్యం, జంగం కథలు, కాశికథలు, బుర్రకథలు, పిచ్చుగుంటుల కథలు, పంబ కథలు, బయ నీడి కథలు, కొమ్ము కథలు, ఆసాది కథలు, వీరవిద్యా వంతుల పల్నాటి కథలు, ఒగ్గు కథలు, హరి కథలు, జముకుల కథలు, బుడిగె జంగాలు, గారడి విద్యలు, దేవదాసీ నృత్యాలు, మెరవణి గద్య, గరగ నృత్యం, చిందు భాగ వతులు, మల్లేలాట, సిడి ఉత్స వాలు, జట్టిజాము, పాములాటలు, మోడీలు, బతుకమ్మ పాటలు, ఫకీరు వేషాలు, గొండ్లి నృత్యం, పెద్దపులి నృత్యం, డప్పుల నృత్యం, అశ్వనృత్యం, కత్తుల గారడి, వీరభద్ర విన్యా సాలు, గొల్ల సుద్దులు, దొమ్మరి ఆటలు, కాటిపాపలు, హరిహరీ పదాలు, గొరవయ్యల నృత్యం, వీరముష్టివారు, ఉరుముల నృత్యం, వాలకం, గంగిరెద్దా టలు, చెక్క భజనలు, బుడబుక్కలు, తప్పెటగుళ్ళు, కొమ్ము దాసరులు, గంటె భాగవతులు, దండాగానం, గిరిజన కళారూపాలు, ఆదిమ వాసుల నృత్యాలు, జాలరి నృత్యం, సుగాలి నృత్యం, గావులాటలు, చుట్టకాముడు, భట్రాజు పొగడ్తలు, సాధనా శూరులు, సానివారు, జోగాట, తెరచీరలవారు, బాలసంతువారు, మాష్టీలు మొదలగు కళా రూపాల గురించి ఇలా చెప్పుకుంటూపోతే ఆయా కళా రూపాలు, వానిని బ్రతికించిన కళాకారులు నాటి సమాజ సంస్కృతి, సాహిత్యాలకు ఆటపట్టుగా నిలిచారు.

ఆంధ్రప్రదేశ్ పదమూడు జిల్లాల్లో ప్రాచీన చారిత్రిక అంశాలు, కళారూపాలు, కళాకారులకు నిలయంగా వెలు గొందు ప్రాంతమే ప్రకాశం జిల్లా. ఇది విభిన్న సంస్కృ తులు, సంప్రదాయాలు సమాహారంగా ప్రసిద్ధి చెందింది. అనాదిగా సమాజాన్ని ప్రభా వితం చేస్తున్న అనేక జానపద కళలు, కళారూపాలు ప్రకాశం జిల్లా వ్యాప్తంగా నిత్య నూతనంగా పరిఢవిల్లాయి. కాల గమనంలో వానిలో కొన్ని ఇప్పటికే కనుమరు గయ్యాయి. మరికొన్ని క్షీణదశలో ఉన్నవి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఇరవైకి పైగా మనుగడ సాగిస్తున్నవి. అవి వీధి నాటకాలు, తోలుబొమ్మలాట, బుర్రకథలు లేక జంగం కథలు, కోలాటం, పిచ్చుగుంట్లు, పగటి భాగవతులు, పంబ కథలు, బయనీడి కథలు, ఆసాదీ కథలు, కొమ్ము కథలు, పల్నాటి కథలు, కాటి పాపలు, గంగిరెద్దులవారు, ఆరెబుడబుక్కలు, గారడి విద్యలు, చెక్కభజనలు, పాముల వారు, మాతంగి జంగములు, హరిదాసులు, పులివేషాలు, బట్టుబొమ్మలు, ఈ కళారూపాల్లో వాద్య సహకారంతో కొనసాగేవి పదహారు వరకు ఉన్నవి.

1. తోలు బొమ్మలాట - మద్దెల, తాళాలు, హార్మో నియం, చెక్కలు.
2. బుడిగి జంగాలు - బుడిగి.
3. పిచ్చుగుంట్లు - చెక్కలు, గువ్వెమ్మెటలు, హార్మోనియం.
4. పగటి భాగవతులు - తబల, తాళాలు, హార్మోనియం.
5. పంబలవారు - పంబజోడు, తిత్తి.
6. బయనీడివారు - జమిలిక (జమిడిక), తిత్తి.
7. ఆసాదివారు - రొమ్ము తప్పెట, తిత్తి.
8. కొమ్ములవారు - కొమ్ము, తిత్తి.

9. వీరవిద్యావంతులు - వీరణం, తిత్తి.
10. కాటిపాపలు - గంటాకారపు బుర్ర.
11. గంగిరెద్దులవారు - డోలు, సన్నాయి, బూర.
12. అరెబుడబుక్కలవారు - ఢమరుకం (డక్కు), అందె.
13. చెక్కభజనలు - చెక్కలు.
14. పాములవారు - నాగస్వరం.
15. జంగములు - గంట, శంఖం.
16. హరిదాసులు - సితార, చెక్కలు.

ఈ కళారూపాల్లో నేడు వృత్తిగాయక కళారూపాలైన పంబకథలు, బయనీడి కథలు, కొమ్ముకథలు, ఆసాది కథలు, వీరవిద్యావంతుల పల్నాటి కథలు అధిక ప్రజాదరణ పొందుతున్నవి. ఈ కళారూపాలను మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం గ్రామదేవర, ఇంటిదేవర కొలుపులు, వీరకొలుపులు వంటి సందర్భాల్లో ప్రదర్శిస్తున్నారు. మిగిలిన కళాకారులు మాత్రం అడపా దడపా వారివారి కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. ఆధునిక కాలంలో కూడా ఈ కళారూపాలు కొందరు వంశపారం పర్యంగా మిరాశిగాను, మరికొందరు జీవనభృతి కోనం కొనసాగిస్తున్నారు. నిజానికి వీరిస్థితి దయనీయంగా మారింది. గ్రామాల్లో వ్యవసాయ వృత్తితోపాటు ఇతర వృత్తులు దెబ్బతినడం కళలకు దినదినగండంగా మారింది. ఆధునిక సమాజ ఆదరణ కొరవడి కళాపిపాస, వివేచన లోపించి ఈ నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు. దీని వల్ల కళాకారుల్లో కొందరు వృత్తినే నమ్ముకోగా, ఇంకొందరు ఆదరణ లేక వేరే వృత్తులు చేపట్టలేక జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. మరికొందరు వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. కనుక నిరాశా నిస్పృహలతో కునారిల్లే వృద్ధ కళాకారులకు చేయూతనిస్తే కొంతకాలం ఈ కళలు నిలిచే అవకాశం ఉంది. ప్రాచీన సంస్కృతికి మూలభూతాలైన జానపద సంస్కృతిని రక్షించుకొనుట మనందరి కర్తవ్యం.

ఆధార గ్రంథాలు :

1. ప్రకాశం జిల్లా జానపదులు
2. తెలుగువారి జానపద కళారూపాలు
3. తెలుగు జానపద గేయ సాహిత్యము
4. అమరకోశము
5. వాఙ్మయి

❖ ❖ ❖

జానపద వైద్య విధానాలు

– ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్, ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

జానపద విజ్ఞానం సాంస్కృతిక వారసత్వం. జానపద విజ్ఞానాన్ని జన సముదాయమే తమ సాంస్కృతిక వార సత్వంగా కాపాడుకుంటుంది. జన జీవనం ఉన్నంత వరకూ జానపద విజ్ఞానం కూడా సజీవంగా ఉంటుంది. గేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, నమ్మ కాలు, ఆచారాలు, సంప్రదాయాలు, ఆటలు, వంటలు, వైద్యం, ముగ్గులు, ఇళ్లు వాకిళ్లూ వంటివన్నీ జానపద విజ్ఞానంలో భాగమే.

జానపదవైద్యం తరతరాల నుండీ వచ్చే సాంస్కృతిక వారసత్వం. ప్రకృతే మనకు మొట్టమొదటి ఔషధశాల. ప్రకృతి నుండే మానవుడు తన వైద్యానికి కావలసిన వస్తువులను ఎంచుకున్నాడు. ఆధునిక వైద్యానికి భిన్నంగా ఉంటుందీ జానపద వైద్యం. ఇది అనుభవం వల్ల రూపుదాల్చుకుంది. తరతరాల నుండి వారసత్వంగా సంక్రమించింది. తెలుగులో జానపద వైద్యాన్ని నాటువైద్య మని, గృహవైద్యమనీ, అమ్మమ్మ, నాన్నమ్మల వైద్యమనీ పిలుస్తుంటారు. ఈ వైద్యానికి శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చు. అయితే ఒక్కో సందర్భంలో మంచి వైద్యమే లభించవచ్చు. భారతీయ వైద్య పద్ధతుల్లో ఆయుర్వేద వైద్యం శాస్త్రీయమైంది. జానపదవైద్యం శాస్త్రీయ ఆధారాలు లేకున్నా, ఎక్కువగా నమ్మకంపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఇందులో రహస్య గుణం ఎక్కువ. మూలికలు, ఆకుపసర్లు వంటి వాటిని చాలా వరకు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. జానపద వైద్యంలో చాలా వరకు మనకు బాగా తెలిసిన ఆకులు, పళ్లు, దుంపలు, కాయలు మొదలైన వాటినే వాడతారు. అందువల్ల అవి ఆహార పదార్థాలతో పాటే జీర్ణమవుతాయి.

తెలుగు వారికి సంబంధించినంత వరకు జానపద వైద్యాన్ని వందల సంవత్సరాల నుండి వాడుతున్నారు. ఈ వైద్య పద్ధతుల్ని గురించి కొన్ని ఉల్లేఖనాలు ప్రాచీన కాలం నుండే లభిస్తున్నాయి. వాపులకు వాయుతైలాలు, వావిల చిగుళ్లు, ఉమ్మెత్త, ఆముదపు చివుళ్లు, జిల్లేడాకులు, వీటితో కాచడం వంటివి చేసే వారని పాల్కూరికి సోమనాథుడు తన 'బసవ పురాణం' (పుట.77)లో చెప్పాడు. గోవులు కాచుకునే గోపబాలురకు కూడా కొంత పశువైద్యం తెలిసి ఉంటుంది. దూడ చచ్చిన ఆవులను సేపునట్లు చేయడం, కడుపులోనే దూడ చచ్చిపోతే ఆవులకు మందులు ఇవ్వడం వాళ్లకు తెలిసి ఉండేది. ఆవులకు వచ్చేరోగాల పట్టికను ఒకదాన్ని గౌరన తన 'నవనాథ చరిత్ర' (పుట.29-30)లో ఇచ్చాడు.

ఆదివాసీలైన గిరిజనుల్లో చాలా మందికి మూలికా వైద్యం బాగా తెలిసి ఉంటుంది. సర్పగంధి, సుగంధపాల వంటి వాటిని వివిధ రోగాలకు తగ్గట్లు ఉపయోగించడం వీరికి బాగా తెలుసు. గాయాలకు, రక్తపోటుకు, గర్భస్రావానికి, గర్భనిరోధానికి గిరిజనుల వద్ద తగిన ఔషధాలుంటాయి. యానాదులు తమ భార్యకు నవ మాసాలు నిండగానే పది పన్నెండు రకాల వేర్లను తెచ్చి సిద్ధం చేసుకుంటారు. నొప్పులు మొదలైనప్పట్నుండి పదవ రోజు వరకు మంచి నీటికి బదులుగా ఈ మూలికల కషాయాన్ని తాగడానికి ఇస్తారు. ఇందువల్ల ఏ జబ్బులూ రావని వారి నమ్మకం. "పెద్దమాన, ఆకుబెరడు, ఎర్రి వాలుడు, నల్ల ముసుకుడు, పొరము మొక్క, వారగోగు, తెల్ల బులుగుడు, నల్ల బులుగుడు, సోమి, విష బుద్ధి, నేల వేము, చేదుపుల్ల, నేలగుమ్మడి, చిల్ల బాలింత సంచుమి చెక్కలు" వంటి వేర్లను యానాదులు వాడతారని వెన్నెలకంటిరాఘవయ్య గారు తన "యానాది" (పుట. 75)లో తెలిపారు.

రక్తపోటు, చర్మవ్యాధులు, చక్కెర వ్యాధి, అంటు వ్యాధులు మొదలైన వాటికి గిరిజన వైద్యంలోమంచి

మందులున్నాయి. సర్పగంధి లాంటి వాటిని ఈనాడు శాస్త్రీయ వైద్యంలోవాడటం మనం గమనించవచ్చు. ముఖ్యంగా వేపచెట్టు జానపదులందరికీ పరమౌషధం. వేప ఆకులు, ఇగుళ్ల అంటువ్యాధులకు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. వేపనూనె పేలకు, కొన్ని క్రిమి కీటకాలను చంపడానికి ఉపయోగపడుతుంది. వేపపుల్ల దంతధావనానికి ఎలా ఉపయోగపడుతుందో మన కందరికీ తెలిసిందే. వేపనూనె దీపం కంటికి మంచిదని అంటారు. ఈ నూనె మసితో చేసిన కాటుక కంటికి మంచిదని కూడా అంటారు. ఒంట్లో వేడి తగ్గడానికి, వెంట్రుకలకు ఆముదం పెట్టుకుంటే చాలా మంచిది.

అదేవిధంగా చిత్రమూలం పాలు రాస్తే కీళ్ల నొప్పులు, తల నొప్పులు తగ్గుతాయి. రొమ్ము పడిశాన్ని రంక చెక్క నివారిస్తుంది. పాలతీగ కొనను ముక్కులోకి చొప్పిస్తే జలుబు నయమవుతుంది. ఎర్రగడ్డ, తెల్లగడ్డ, అల్లం కలిపి నూరి మింగితే జ్వరాలు తగ్గుతాయి. వాకుడు గింజలు కాల్చి పొగను కుడి చెవిలో పంపితే కుడి దవడ దంతాల నొప్పి కుదురుకుంటుంది. తేలు కొండె ఆకు పసరులో గచ్చకాయల గంధం కలిపి పూస్తే తేలు విషం హరిస్తుంది. నాగ ముష్ఠి వేరుని కొరివితో కాల్చి పాము కరిచిన చోట పెడ్తే పాము విషం నిలవదు. తులసి పసరు గాయాలకు మంచి మందు. గొంతులో వచ్చే టాన్సిల్సు వ్యాధికి రైలాకు సరైన మందుగా చెప్తారు. జీలకర్ర, తెల్లపాయలను నూరి మాత్రలుగా మింగితే విరేచనాలు కట్టుకుంటాయి. నల్లేరు, తెల్లతుమ్మ, వేపాకులను, మోదుగ తెల్ల పులుగుడు, వెంపలి, తంగేడు, జిల్లేడు వేళ్లు నీళ్లలో కాచి ఆ కషాయాన్ని తొమ్మిది రోజులు సేవిస్తే బాలింత జబ్బులు రానే రావని వెన్నెలకంటి రాఘవయ్య తన 'యానాది' గ్రంథంలో (పుట. 81-84) తెలిపారు.

జానపద వైద్య విధానాలు :

నొప్పులు : తలనొప్పికి శొంఠిని కణతలకు రాసినా పోతుంది. తల దిమ్ముగా ఉంటే శొంఠిని చితక్కొట్టి కట్టాలి. వేడి వల్ల వచ్చే తలనొప్పికి మల్లెపూలు, ఆముదపు ఆకులు తలకు కట్టాలి. గంధం తీసి ఫాల భాగానికి రాసినా తగ్గుతుంది. లేదా వెల్లుల్లిని బాగా నలగ్గొట్టి నుదుటిపై, కళ్లకు రెండు వైపులా రుద్దాలి.

చెవినొప్పి :

తులసిరసం చెవిలో పోస్తే బాగా పనిచేస్తుంది. వెల్లుల్లిని నూనెలో కాచిపోసినా చెవినొప్పి తగ్గుతుంది. సజ్జా ఆకు రసం కూడా పని చేస్తుంది. నువ్వుల నూనెలో ఒక లవంగం వేసి కాచి పోసినా చెవి నొప్పి తగ్గుతుంది.

పళ్ళనొప్పి :

మిరియాలు, ఉప్పు మెత్తగా పొడి చేసి నొప్పిగా ఉండే పంటిపై కాసేపు ఉంచాలి. లేదా రెండు మూడు లవంగాలు మెత్తగా నూరి నిమ్మకాయ రసంతో కలిపి చిగురుకి, పన్నుకి తాకిస్తే నొప్పి తగ్గుతుంది. నీళ్లలో ఉప్పు కరిగించి ఆ నీళ్లతో నోరు పుక్కిలించినా పళ్ల నొప్పికి ఉపశమనం కలుగుతుంది.

గొంతునొప్పి :

కొత్త సున్నం గొంతుకు పూస్తే గొంతునొప్పి తగ్గుతుంది. సున్నం, మునగాకు రసం కలిపి గొంతుకు పూసినా నొప్పి తగ్గుతుంది. కఫం ఉంటే మిరియాలు పొడిగిన బెల్లం మింగితే సరిపోతుంది. లేదా గోరువెచ్చని నీళ్లలో ఉప్పు కలిపి గొంతులో గులకరించినా (గార్గిల్) ఉపశమనం లభిస్తుంది.

కడుపునొప్పి :

వాము, ఉప్పు కలిపి తింటే కడుపునొప్పి పోతుంది. బొడ్డు దగ్గర నొప్పిగా ఉంటే జిల్లేడు పాలుపోసి పసుపు అద్దితే నొప్పి పోతుందని అంటారు. తంగేడు చెక్క కషాయం, కోలముక్క చెక్క కషాయం కూడా కడుపు నొప్పికి బాగా పనిచేస్తుంది

కళ్లనొప్పి :

నందివర్ధనం పూలు, పొన్నగంటాకు కలిపి కంటికి కట్టాలి. అలాగే కలబంద, పచ్చకర్పూరం కలిపి కంటిపైన పెట్టుకోవడం వల్ల కూడా కంటి నొప్పి పోతుంది.

బెణుకులకు :

ముష్టి పండ్లు, గంజేరు ఆకులు, తుత్తురేణిఆకులు బెణికిన చోట నలిపి కడ్తే తగ్గుతాయి.

గాయాలు, పుండ్లు :

చిన్న చిన్న గాయాలకు సున్నం పూయడమే మేలని జానపదులు భావిస్తారు. ఆముదంలో కలిపిన సున్నమైతే ఇంకా మంచిదంటారు. చిన్న చిన్న గుల్లలకు అయితే ఎర్రమట్టిని పూస్తారు. అది ఎండిపోగానే తగ్గిపోతుందని అంటారు. నెత్తురు కారే గాయాలకు బాగా ఎండిన మామిడి ఆకుల్ని బూడిద చేసి, ఆ బూడిదను గాయాలపై వేస్తే రక్తం కారడం నిలిచి, గాయం కూడా త్వరగా మానుతుందని విశ్వసిస్తారు. కాలిన గాయాలకు మంచి నూనె లేదా కొబ్బరినూనె పూస్తారు. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి కాలిన గాయానికి లేపనంగా పూసినా మంట తగ్గుతుంది. కాలిన గాయంవల్ల మచ్చలు ఏర్పడితే నేరేడు ఆకులను నున్నగా నూరి పూస్తూ ఉండాలి. పిచ్చిక బీరాకు, రాగి చెక్క, పూపిమద్ది చెక్క, ఊటి ఆకు, గబ్బు ఆకు పసర్లు కూడా గాయాలకు బాగా పని చేస్తాయి.

పాముకాటుకు :

తిప్పతీగ, నేలవేము, పాముకొండ, పల్ల ముష్ఠి చెక్క, లేకవేళ్లు వంటివి ప్రయోగించి పాము విషాన్ని హరిస్తారు.

తేలుకాటుకి :

ఎర్రగడ్డ (ఉల్లిపాయలు) గాని, తెల్లగడ్డ (వెల్లుల్లి) గానీ నలగ్గొట్టి తేలు కాటు వేసిన చోట కట్టాలి. తేలు కుట్టగానే ఉల్లిపాయ, బెల్లం నమిలి తినాలి. ఉల్లిపాయ రసాన్ని తేలు కుట్టినచోట పూయాలి. తేలు కుట్టగానే కుట్టిన తేలుని గాని, మరొక తేలుని గాని పట్టుకుని దాని కొండిని కాల్చి, వచ్చే పొగని కుట్టినచోట పట్టాలని అంటారు. కొండిని కాల్చగా వచ్చిన భస్మాన్ని కుట్టిన చోట పూయాలి.

తేనెటీగలు కరిస్తే మంచి తేనె పూసినా, ఎర్రగడ్డలు సగానికి కోసి తేనెటీగలు కుట్టిన చోట రుద్దినా మంట తగ్గుతుంది.

పిచ్చికుక్క కరిస్తే: పిచ్చికుక్క కరిస్తే చాలా ప్రమాదమని అందరికీ తెలుసు. ర్యాబిస్ సోకుండా ఇంజక్షన్లు తీసుకోవడం అవసరం. అయితే జానపదులు ఉత్తరేణి చెట్టును వేళ్లతో సహా పీకి తెచ్చి రోట్లో వేసి బాగా దంచి రసం తీస్తారు. దాన్ని వడబోసి, రసానికి కాస్త నీళ్లు కలిపి ప్రతి రోజూ ఉదయాన్నే ఒక లోటా చొప్పున వారం రోజులు తాగిస్తారు. పిచ్చికుక్క కరచిన వెంటనే ఈ వైద్యం ప్రారంభించాలి. మనిషి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం మొదలైన తర్వాత ఈ వైద్యం చేస్తే ప్రయోజనం ఉండదని అంటారు.

చర్మవ్యాధులకు :

ముఖంపై మొటిమలు ఉంటే ఎర్రమట్టిని వేడి చేసి వేస్తే పోతాయని అంటారు. లేదా దాల్చిన చెక్కను నిమ్మరసంలో సాది మొటిమలకు పూయాలి. కాలి మడమలు పగిలితే నలగగొట్టిన ఉల్లిపాయను కడితే ఫలితం ఉంటుంది. చలికాలంలో ముఖం పగలడం సాధారణంగా జరుగుతుంది. దీనికి పాలమీగడలో నిమ్మరసం పిండి చర్మంపై మృదువుగా అద్దాలి. ఓ అరగంట తర్వాత చల్లటి నీటితో కడిగెయ్యాలి. చర్మం బిరుసుగా (డ్రై) ఉంటే పచ్చికొబ్బరి తురిమి, దాంట్లోంచి పాలు తీయాలి. అందులో గ్లిసరిన్ కొద్దిగా కలిపి పూసుకోవాలి. చర్మంపై మచ్చలు ఉంటే సున్ని పిండితో బాగా రుద్ది స్నానం చేయాలి. లేదా బొప్పాయి పండు చెక్కలతో చర్మాన్ని రుద్దుతూ ఉంటే మచ్చలు పోతాయి. ఇక గజ్జి,దురద, దుద్దులు వంటివి పోవడానికి గరికను, పసుపును గోమూత్రంలో సాది పూసుకోవాలి. పూసిన అరగంట తర్వాత వేపాకులు వేసి మరగించిన నీటితో స్నానం చేయాలి. అలాగే చింతాకుల్ని నున్నగా నూరి పూసుకున్నా, నిమ్మకాయ రసంలో గంధం పొడిని కలిపి పూసుకుంటే దురదలు పోతాయి. కొన్ని రకాల చర్మ వ్యాధులకు తేనె పూసినా తగ్గుతాయని అంటారు. దేవదారు రసం, సన్నమల్లి ఆకుల రసం తీట వచ్చిన ప్రాంతంలో పూస్తే తగ్గుతుంది.

జలుబు, దగ్గు, జ్వరం :

సహజంగా మనకు వచ్చే సాధారణ రోగాలు జలుబు, దగ్గు, జ్వరమే. దీర్ఘకాలిక రోగాలకు తప్ప సాధారణ జలుబుకు, దగ్గుకు జానపదులు కషాయాలు వాడతారు. జలుబుకు కరక్కాయ, తాడికాయ, ఉసిరిక కలిపి కషాయం చేసుకుని తాగుతారు. శొంఠి, మిరియాలు, పిప్పళ్లు, బెల్లం కలిపిన కషాయం తాగినా జలుబు తగ్గుతుంది. ముక్కుదిబ్బడకు పసుపు కొమ్ముని నిప్పలపై కాల్చి వాసన చూస్తారు. లేదా ముద్ద కర్పూరం గుడ్డలో పెట్టి అప్పుడప్పుడూ వాసన చూసినా ఫలితం ఉంటుంది. ఇక మామూలు దగ్గుకి ఉప్పు, కరక్కాయను బుగ్గన పెట్టుకుంటారు. పొడి దగ్గుకయితే పెద్ద ఉల్లిపాయ ఒకటి తీసుకుని బెల్లం కలిపి రోజుకు మూడు పూటలా తినాలి. నెయ్యితో ఉల్లిపాయను వేయించి తిన్నా మంచిదంటారు. కఫంతో కూడిన దగ్గు అయితే ఉప్పు, మిరియాలు, తెల్లగడ్డ (వెల్లుల్లి) కలిపి దంచి కాసేపు నోటిలో ఉంచుకోవాలి.

జ్వరం మనకు ఎన్ని విధాలుగానైనా రావచ్చు. నిజానికి జ్వరానికి కారణం తెలుసుకుని తగిన మందు ఇవ్వడం శాస్త్రీయ వైద్య పద్ధతి. అయితే అన్నింటికీ కషాయాలే వాడటం జానపదులకు తెలిసిన పద్ధతి. నిజానికి 'లంఖణం పరమౌషధం' అని అంటారు. అంటే ఉపవాసానికి మించిన వైద్యం లేదు. జ్వరం ఎక్కువైతే చల్లటి నీటిలో తడిపిన గుడ్డను మడత వేసి నుదిటిపై ఉంచితే జ్వరం తగ్గుముఖం పడుతుంది. జానపద వైద్యంలోనే కాక ఇంగ్లీషు వైద్యంలోకూడా ఈ పద్ధతిఉంది. చలిజ్వరమైతే అడవి జీలకర్రను తీసుకుని బాగా పొడి చేసి, నెయ్యి కలిపి నీటిలో మరగకాయాలి. సగానికి సగం నీళ్లు ఇంకిపోయేలా మరిగించాలి. దానిలో అదే కొలతతోఅవుపాలు కలిపి తీసుకోవాలి. రోజుకు రెండుసార్లు ఇలా సేవించాలి.

తిప్పతీగ, దంతివేళ్లు, పెద్దమాను చెక్క, ఆకు చెముడు చెక్క, పునగాని చెక్క, నేలవేము చెక్క, వాగుడి చెక్క వంటివి ఉపయోగిస్తే జ్వరాలు తగ్గుతాయి.

అజీర్ణం :

అజీర్ణం అనేక వ్యాధులకు మూలం. వాంతులు, విరేచనాలు, తలనొప్పి, జ్వరం ఇలా రకరకాలైన రోగాలకు ఇదే కారణం కావచ్చు. శొంఠి, జీలకర్ర బాగా పొడి చేసి, మరిగే నీళ్లలో ఈ పొడివేసి ఐదు నిమిషాలు ఉంచి వడకట్టి ఆ నీళ్లు తాగితే అజీర్ణం పోతుంది. ఇక్కడ శొంఠి బదులు అల్లం కూడా వాడవచ్చు. నిమ్మకాయ రసం కూడా మంచిదే. లేదా ఉల్లిపాయను గానీ, వెల్లుల్లిని గానీ కాల్చి తింటే అజీర్ణం పోతుంది. పుదీనా ఆకుతో కషాయం చేసుకుని తాగినా అజీర్ణం తగ్గుతుంది. కడుపు ఉబ్బరానికి పుదీనా కషాయం లేదా చక్కెర, నెయ్యి వేసుకుని తాగినా తగ్గుతుంది. ప్రతిరోజూ ఆహారంలో ఉల్లిపాయ, వెల్లుల్లి వాడుతుంటే జీర్ణశక్తి పెరుగుతుంది.

వాంతులు, విరేచనాలు :

పసి పిల్లలు తాగిన పాలు కక్కుతుంటే పాలలో లేత కొబ్బరినీళ్లు కలిపి ఇవ్వాలి. వాంతులకు నిమ్మకాయ చాలా మంచిది. నిమ్మరసంలో చక్కెర కలుపుకుని తాగవచ్చు. లేకపోతే జీలకర్ర,నాలుగైదు యాలకులు పొడి చేసుకుని కలుపుకుని తాగాలి. ఉల్లిపాయను కాస్త నలిపి వాసన చూస్తున్నా లేదా చింతపండు, జీలకర్ర కలిపి తిన్నా వాంతి వచ్చేట్లుండే వికారం తగ్గుతుంది. వాంతులు, విరేచనాలు అవుతుంటే దోసకాయను తురిమి శుభ్రమైన వస్త్రంలో కట్టి, పిండి రసం తీయాలి. అందులో కొంచెం నిమ్మరసం కలుపుకుని రోజుకి రెండుసార్లు తీసుకోవాలి. అజీర్తి వల్ల విరేచనాలైతే జాజికాయ చూర్ణాన్ని అరటిపండుతో కలిపి తినాలి. నీళ్ల విరేచనాలకు మంచి నేరేడుపళ్లు తీసుకుని నీళ్లలో పిండి, ఆ రసంలో కొంచెం ఉప్పు కలుపుకుని తాగితే తగ్గుతాయి. ఇక అతిసారానికీ జానపద వైద్యంలో మందులున్నాయి. లేత జామకాయ కషాయాన్ని మజ్జిగతో పాటు తీసుకోవాలి. లేదా మెంతులు నోట్లో వేసుకుని మజ్జిగ తాగవచ్చు. దానిమ్మ చెక్కతో కషాయం చేసుకుని, దాంతో పాటు మెంతుల కషాయంతో కలిపి సేవించినా మంచిదే. వేపబంక, ఉల్లిందర బంక, ఎద్దుసోగ చెక్కలు కూడా విరేచనాలు కట్టుకోవడానికి ఉపయోగిస్తారు.

మరికొన్ని వ్యాధులు - జానపద వైద్యం :

జుట్టు రాలిపోతుంటే దాసాని (మందార) పువ్వులను కొబ్బరినూనెలో బాగా కాసి తయారు చేసుకుని, దాన్ని వెంట్రుకలకు పట్టించాలి. నిమ్మకాయ, నువ్వులనూనె కలిపి పూసుకుంటే చుండ్రుపోతుంది. ప్రతిరోజూ నల్లవేప ఆకులను మూడు నెలల వరకు తింటూ ఉంటే మధుమేహం తగ్గుతుంది. అలాగే నేల ఉసిరిక ఆకు తింటూ ఉన్నా చక్కర వ్యాధి నియంత్రణలోకివస్తుంది. నేల ఉసిరిక ఆకును కాయలతో సహా నలగగొట్టి పసరు తీసి మజ్జిగలో కలిపి తీసుకుంటే పచ్చకామెర్ల వ్యాధి నయమవుతుంది. లేత వేపాకు నూరి కొద్దిగా పసుపు, జీలకర్ర, మిరియాలు వేసి ఉండలుగా చేసి మింగించడం చాలా గ్రామాల్లో, ఇళ్లలో మనకి ఇప్పటికీ కనిపిస్తుంది. దీనివల్ల కడుపులో ఉండే కొన్ని రకాల పురుగులు నాశనమౌతాయి. అప్పుడే పిండిన ఆవుపాలు నురగతో సహా కొద్దిగా నిమ్మరసం పిండుకొని తాగితే మూలవ్యాధి నయమవుతుందని అంటారు.

'అమ్మవారు' అనే పేరుతో పిలిచే చాలా రకాలైన రోగాలకు వేపాకులను, ఇగుళ్లనూ, పువ్వులను వైద్యంగా వాడటం ఇప్పటికీ సమాజంలో మనం చూస్తుంటాం. వేపచెట్టు మంచి రోగ నిరోధక శక్తి గల సాటిలేని ఔషధంలా పనికివస్తుంది. అలాగే మనకు నిత్యం కనిపించే చింతచెట్టు, తాటిచెట్టు, ఈతచెట్టు వంటివి కూడా జానపద వైద్యానికి బాగా పనికి వస్తాయి. మనం ఆహార పదార్థాలుగా తీసుకునే ఆకులు, కూరగాయలు, పప్పు దినుసులు, మసాలా దినుసులు, పెరట్లో పెరిగే రక రకాలైన మొక్కలు, దట్టంగా పెరిగి ఉండే పొదలు, లతలు, మూలికలు అన్నీ జానపదవైద్య విధానంలో భాగమే అవుతాయి. అయితే అన్ని రోగాలూ ఈ వైద్య విధానానికి తగ్గుతాయా అని అంటే తగ్గవని జానపదుల క్కూడా తెలుసు. మంత్రాలతో రకరకాలైన వ్యాధులకు వైద్యం చేసే విధానమూ ఈ జానపద వైద్యంలో ఉంది. మంత్రాలతో కూడిన జానపద వైద్య విధానాన్ని ఇందులో ప్రస్తావించలేదు. ఎందుకంటే 'మంత్రాలకు చింత కాయలు రాలవు' కదా! జానపద వైద్య విధానాన్ని ఇంకా అన్వేషించాల్సి ఉంది. దీనిమీద పరిశోధనలు విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉంది. శాస్త్రీయంగా ఉన్న కొన్ని జానపద వైద్యవిధాన పద్ధతులకు శాస్త్రబద్ధత కల్పించడం ఎంతైనా అవసరమనిపిస్తుంది. అధునికమైన మందులు చాలా భాగం చెట్ల వివిధ భాగాల నుండి ఫార్మసీ కంపెనీలు తయారు చేయడం మనం గమనిస్తూనే ఉన్నాం.

ఆధార గ్రంథాలు :

1. రాఘవయ్య, వెన్నెలకంటి, 'యానాది', నెల్లూరు
2. సోమనాథుడు, పాల్కూరికి. బసవపురాణం, తితిదే ప్రచురణలు, 2013
3. సుందరం, ఆర్వీయస్, ఆంధ్రుల జానపద విజ్ఞానం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1992
4. మోహన్, జి.ఎస్. జానపద విజ్ఞానాధ్యయనం, ద్రావిడ విశ్వవిద్యాలయం, 2010
5. సుందరం, ఆర్వీయస్. సుందరజానపదం, సౌశీల్య ప్రచురణలు, 2017
6. రమణయ్య, కడప. ప్రధాన సంపాదకులు: దక్షిణ భారతీయ జానపద విజ్ఞానకోశం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

❖ ❖ ❖

తెలంగాణ జానపద చారిత్రక వీరులు

బల్మూరి కొండల రాయుడు, భోగంసాని

– డా॥. ఐ. త్రివేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

ఆసక్తి దాయక అంశాలు :

- కొండల రాయుడు, బోగంసాని ఎవరు.
- నిజామాబాద్ ఊరపండగలో కొండలరాయుడు, బోగంసానిని ఎందుకు ప్రతిష్టిస్తారు.
- ఊరపండగలో పదకొండు మంది దేవతా మూర్తులను చెక్కతో తయారు చేసి, ఊరేగించి, నగరంలో గల వివిధ గ్రామ సరిహద్దు గద్దెలపై ప్రతిష్టిస్తారు.
- అందులో కొండల రాయుడు, బోగంసానిని నిజామాబాద్‌లో గల సిర్నాపల్లి గడి సమీపంలోనే ఎందుకు ప్రతిష్టిస్తారు.
- ఈ ఊరపండగలో పెద్దమ్మ, మహాలక్ష్మమ్మ, మత్తడిపోశమ్మ, ఐదుచేతుల పోచమ్మ, బండమీది పోచమ్మ, అంపుడు పోచమ్మ, ఆడెల్లి పోచమ్మ, సార్గాలమ్మ, ఉప్పలమ్మ, కొండల రాయుడు, బోగంసానిని ఊరేగిస్తారు.
- కొండలరాయుడు, బోగంసానిగాక మిగతా వారంతా గ్రామదేవతలు. వీరిద్దరు మాత్రమే మానవులు.
- కొండలరాయుడు, బోగంసాని చారిత్రక మానవులు. గ్రామదేవతలుగా ఎలా రూపాంతరం చెందారు.
- 300 సంవత్సరాల క్రితం చరిత్ర కొండల రాయుడిది. అతడిది మానాలకోట. అది నేడు కరీంనగర్ జిల్లాలో ఉంది. నిజామాబాద్ జిల్లాకు కొండలరాయుడితో ఏం సంబంధం.
- ఊరపండగలో గ్రామదేవతలకు సరిసమానంగా కొండలరాయుడు, బోగంసాని పూజలందుకుంటున్నారంటే; కొండలరాయుడు ఇందూరు గడిని జయించి కొంతకాలం పాలన జరిపినట్లుగా అర్థమవుతుంది. నిజామాబాదు ప్రాంతంలోనే ఆయన వీరమరణం పొందినట్లుగా తెలుస్తుంది.
- కొండలరాయుడు వీరుడు, శౌరుడు, పరాక్రమశీలి. జాత్యభిమానం మెండుగా కలిగిన వ్యక్తి. తెలంగాణ ప్రాంతం మీద గోలుకొండ తురక నవాబుల పాలనను సహించని మనిషి.పరాయి పాలనను ఎదురించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన గొప్ప శక్తివీరుడు.
- కొండలరాయుడి అంతిమలక్ష్యం గోలుకొండ నవాబులను చేధించడం. వారి పాలనను అంత మొందించడం.

ఆధారాలుగా నిలిచిన విషయాలు :

- కొండల రాయుడు తన జీవితకాలంలో 27 సంవత్సరాలు మాత్రమే జీవించినా చివరి ఏడు సంవత్సరాలు ఇందూరును పాలించినట్లుగా వివిధ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలు.
- అంతేగాదు నిజామాబాద్ జిల్లాకు చెందిన పల్లికొండ సమీపంలో గల బాచనపల్లి వద్ద భీంగల్లు నవాబులతో జరిగిన భీకర పోరాటంలో తన శక్తియుక్తులను ప్రదర్శించి యుద్ధం చేశాడు. కాని తన అపజయాన్ని శంకించి తన తండ్రి ఖడ్గాన్ని నేలపై పాతి తానే తన పిడిబాకుతో పొడుచుకొని వీరమరణం పొందాడు.

- కొండలరాయుడి విజయగాథలో సమానమైన ప్రాధాన్యం వహించింది బోగంసాని. ఆమె కొండలరాయుడి సేవకురాలు/ప్రేయసి/వేశ్య. కానీ యుద్ధ విద్యను నేర్చిన వీరవనిత. కొండల రాయుడు ఏ గడిని జయించిన గానీ, ఏ కోటను జయించిన గానీ అతనికి తోడుగా వెళ్లేది. నిండు గర్భిణీగా ఉండి కూడా ఆమె యుద్ధం చేస్తూ వీరమరణం పొందింది.
- గడీలను జయించడమేగాక, ప్రజలను సుభిక్షంగా పాలించడమేగాక, వీరమరణం పొందిన కొండల రాయుడు, బోగంసానిని 300 సంవత్సరాలుగా గ్రామ దేవతలుగా నిజామాబాద్ ప్రజలు కొలుస్తున్నారు.
- అందుకే నిజామాబాద్ ఊరపండుగలో కొండల రాయుడి చేతిలో బల్లెం, బోగంసాని చేతిలో ఖడ్గాన్ని చూపుతారు. యుద్ధం సలిపేటప్పుడు భీకరమైన పోరు జరిగే టప్పుడు దూరంగా ఉన్న శత్రువుని సంహరించడానికి బల్లెమును కొండల రాయుడు ఉపయోగిస్తే; సమీపంగా వచ్చిన శత్రువును బోగంసాని తన ఖడ్గంతో తును మాడినట్లుగా తెలుస్తుంది.

తెలంగాణలో అస్పష్ట చారిత్రక గేయంగా బహుళ ప్రచారంలో ఉన్న కథ 'బల్మూరి/బల్మూరి కొండల రాయుడు'. శారదకాండ్రు ఈ పాటను పాడి పొట్టపోసు కొనే వారు. వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా ఈ వీరగాధను శారదగాండ్రు పాడుకొనేవారు. బుడిగె జంగాలు, ఒగ్గు కళాకారులు 'బల్మూరి కొండల రాయుడి' కథను జానపద గేయకథగా వీరగాధగా కొలుచుకుంటారు. పాడుకుంటారు. అతని జీవనకాలం సుమారు 1690-1720. 27 ఏండ్లు మాత్రమే జీవించి ఉన్నా ఎన లేని కీర్తిని, యశస్సును ఆర్జించాడు. వీరుడైన కొండల రాయుడు ఒక దేవుడిగా పూజలందుకుంటున్నాడు. బల్మూరి కొండల రాయుడి కథను గూర్చి తెలుసుకోవా లంటే మొదట అతని పుట్టుపూర్వోత్తరాల గురించి, అతని తండ్రి రఘుపతి రాయుడి పాలనను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రఘుపతిరాయుడి కథ :

బల్మూరి కొండల రాయుడి తండ్రి రఘుపతి రాయుడు. రఘుపతి రాయుడు కూడా ఒక గొప్ప వీరుడు. రఘుపతి రాయుడిది కరీంనగర్ జిల్లా వీణవంక మండలం లోని చల్లూరు. అతను తన యుక్త వయస్సులోనే ఏ కారణం చేతనో తండ్రిపై అలిగి, ఇల్లు వదిలి వెళ్ళి పోయాడు. జగిత్యాల సమీపంలోని పొలాస/పొలవాస/ పోలారం/పోలవరం దేశాయి అయిన జువ్వాడి మాధవ రావు కొలువులో చేరాడు. మాధవరావు కూతురు గొప్ప వీరనారి. ఆమెకు ధర్మాంబ/ దమ్మమ్మ/ దమ్మక్క/ జమ్మమ్మ/ జమ్మక్క/ జాజమ్మ అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఆమె రఘుపతి రాయుడి వీరత్వానికి మనసుపడి అతడిని వివాహం చేసుకుంది. కొంతకాలానికి జువ్వాడి మాధవరావు తన 60 గ్రామాల పరిపాలనా బాధ్యతను, తన ఇద్దరు కొడుకులు పెద్ద రామారావు, చిన్న రామారావు సంరక్షణా బాధ్యతను రఘుపతి రాయుడికి అప్పగించి కన్నుమూశాడు.

కొంతకాలానికి పెరిగి పెద్దవారైన పెద్ద రామారావు, చిన్న రామారావు బావయైన రఘుపతి రాయుడి పెత్తనాన్ని సహించలేక పోయారు. ఆస్తి తమదని అక్కా బావను వెళ్ళగొట్టారు. కాని పెద్దల సంప్రదింపుల వల్ల అక్కకు ఒక మానాల గ్రామాన్ని ఇచ్చారు.

రఘుపతి రాయుడు, ధర్మాంబ ఇద్దరు మానాల / మనువాల (కరీంనగర్ జిల్లా, మల్యాల మండలం)లో వ్యవసాయం చేస్తూ బతికారు. కొంతకాలానికి బలపడి ఒక పెద్ద కోట కట్టుకున్నారు. మానాల కోటకు జమీం దారు అయ్యాడు. ఇతని కోటకు నాలుగు బురుజులు ఉండేవి. అవి 'భీమ బురుజు, రామ బురుజు, రక్త బురుజు, రణరంగ బురుజు'లు. అప్పటి హైదరాబాద్ నవాబు నాసిరుద్దౌలా/తానీషా (రెండు పేర్లు జానపద

కథాగేయంలో కనిపిస్తాయి) అరువైపుట్ల తుకం (విత్తనాలు) పండే పంట భూమిని బహుమానంగా ఇచ్చాడు. ఈ విధంగా రఘుపతి రాయుడి మానాల కోటకు 'ముందర ముత్యాల రాసులు, వెనుక వెండి రాసులు, ప్రక్కన పైడిరాసులు' ఉండి వెలుగొందేది. సకల సంపదలు సమకూరాయి. కాని ఆ దంపతులకు సంతానం కలుగ లేదు.

ఆస్తి, అంతస్తు, ధనం, దర్జా పెరిగిన తర్వాత రఘుపతి రాయుడు అధికార బలం, బలగం కోసం ప్రయత్నించాడు. గోలుకొండ నవాబుల దగ్గరికి వెళ్ళాడు (జానపద కథలో డిల్లీరాజు దగ్గరికి అని ఉంటుంది. బాలనాగమ్మ కథలో కూడా డిల్లీ కోట ప్రసక్తి వస్తుంది). అది మొఘల్ పాదుషా ఔరంగజేబు గోలుకొండను జయించిన కాలం కావచ్చును. అక్కడ రఘుపతి రాయుడు తన వీరత్వాన్ని ప్రదర్శించాడు. ఒక గేయకథలో- గోలుకొండ నవాబు ఏనుగు మదమెక్కి బీభత్సం చేస్తుంటే రఘుపతిరాయుడు దాని మదం అణచి నవాబు మన్ననా పొందినట్లుగా ఉంది. మరొక గేయకథలో- ఎవ్వరికి వశంకాని గోలుకొండ నవాబు గుర్రాలలో ఒకదానిని ఎక్కి సునాయసంగా స్వారి చేసి నవాబు మెప్పు పొందినట్లుగా ఉంది. ఈ విధంగా తన వీరత్వంలో గోలుకొండ సుబేదారు ప్రశంసలు పొంది అయిదు ఊళ్ళ అధికారాన్ని పొంది తిరిగి వచ్చాడు. అవి "చిన్నబెల్లాల, పెద్దబెల్లాల, మానుపేట, మర్రిపడిగె, అంకంపేట" (ఇవన్నీ ప్రస్తుతం ఆదిలాబాదు జిల్లా ఖానాపూర్ మండలంలోగల "వెలిగడప" పరినర ప్రాంతాలు).

సకల సంపదలు ఉండి కూడా సంతానం లేకపోవడం ఆ దంపతులిద్దరిని కృంగదీసింది. సమీపంలో ఉన్న కొండగట్టు ఆంజనేయస్వామిని ఆరాధ్య దైవంగా భావించి, సంతానం కోసం ప్రార్థించారు. అనేక నోములు, వ్రతాలు నోచారు. ఆ ఆంజనేయుడి మీద భక్తితో ఆ దంపతులిరువులో ఒకే మనోభావం కలిగింది. ఎవరినైనా "దత్తత" తీసుకుంటే తమకు సంతానం కలుగుతుందనే విశ్వాసం వారి మనస్సుల్లో మొలకెత్తింది. అందుకే దత్తు కోసం రఘుపతిరాయుడు మానాల కోటకు తూర్పుదిశగా ప్రయాణం చేసి కోనాపురం అనే గ్రామాన్ని చేరాడు. అక్కడ సిరిగిరి పోశన్న (పోచన్న) అనే పేరుగల ఎర్రగొల్ల నివసించేవాడు. (సిరిగిరి అనే పేరుగల మహిళ కాటమ రాజు కథలో అయితమరాజు బిడ్డ. బహుభాషా కోవిదురాలు. ఆమె పేరు మీదుగానే వారికి ఇంటి పేరు వస్తుంది. ఆ ఇంటి పేరుకు చెందినవాడే పోశన్న). సిరిగిరి పోశన్న కటిక దరిద్రుడు. సంతానం ఎక్కువ. ఇది గమనించిన రఘుపతిరాయుడు ఆ సిరిగిరి పోశన్నతో "నీ యంబడి కుండ కాశపడి తిని" అని పుత్రభిక్ష పెట్టమని అభ్యర్థించాడు. సిరిగిరి పోశన్నకు ఏడుగురు పుత్రులు. వారిలో ఒక పుత్రుడిని "దత్తు" ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. కాని రఘుపతిరాయుడు తనకు తగిన కుమారుడిని ఎంచుకోవడం కోసం ఒక పరీక్ష పెట్టాడు. ఆ ఏడుగురు పుత్రుల ముందు పంచభక్ష పరమాన్నాలు, పట్టువస్త్రాలు, కత్తులు ఉంచాడు. చిన్న కొడుకైన మల్లన్న 'ఛురిక'ను అందుకున్నాడు. అతనిలో గల ఆ యుద్ధ పటిమను గ్రహించిన రఘుపతిరాయుడు మల్లన్నను 'దత్తు' తీసుకున్నాడు. (ఇటువంటి పరీక్షలు బొబ్బిలిలో కూడా ఉన్నట్లు జానపదకథలు చెబుతున్నాయి. జానపదులు బాలుర వీర్యాన్ని, శౌర్యాన్ని పరీక్షించడానికి ఇటువంటి సాధనాలను ప్రయోగించేవారు).

మల్లన్నను 'దత్తు'గా మానాలకోటకు తీసుకొచ్చి సతీ మణి ధర్మాంబ ఒడిలో పెట్టాడు. దంపతులిద్దరూ 'దత్తు' బిడ్డను 'శాఖమల్లు'గా పిలిచుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకున్నారు. దత్తు తీసుకున్న శుభగడియలు ఎలాంటివో గానీ ఆ దంపతులకు నలుగురు పుత్రులు జన్మించారు. మొదటివాడు ఎల్లారాయుడు, రెండవ వాడు మల్లారాయుడు, మూడవవాడు నరసారాయుడు, ఇక నాలుగవ వాడు కొండల రాయుడు.

కొండలరాయుడి పుట్టుకకు ఒక చరిత్ర ఉంది. రఘుపతిరాయుడు, ధర్మాంబ కొండగట్టు ఆంజనేయ

స్వామికి పూజచేసి అత్యంత ఇష్టతో తనకు వీరుడు, అత్యంత యోధుడు అయిన పుత్రుడిని ప్రసాదించమని వేడుకుంది. ఆ రాత్రి ఇంటిలో నిద్రించిన ధర్మాంబ కలలోకి కొండగట్టు అంజన్న వచ్చి తన అంశగల పుత్రుడికి జన్మనిస్తావని, కాని అతడు అల్ప ఆయుష్షు మాత్రమే కలిగి ఉంటాడని వరం ప్రసాదించి అంతర్ధానమౌతాడు. ఆ వరప్రసాదం వల్లనే కొండలరాయుడు జన్మిస్తాడు.

'కొంగలు కోలాటమేసెను / నక్కలు నాటకం బొక్కెను / కోతులు సిగాలూగెను / కొట్టిమట్టలు గుద్దులాడెను / చేపలు చెల్లాట మాడెను' అని జానపద కళాకారులు కొండలరాయుడి జన్మించిన వేళను వర్ణిస్తూ పాడుకుంటారు. మరికొందరు కళాకారులు ఈ వర్ణనను మానాల పెద్ద చెరువు ఎండిపోయినప్పుడు పాడుకుంటారు. ఈ విధంగా దత్తు తెచ్చుకున్న శాఖమల్లుతో పాటుగా తమకు కలిగిన నలుగురు సంతానంతో దంపతులిద్దరు సంతోషంగా కాలం గడుపుతారు. తదనంతరం శాఖమల్లు ప్రస్తావన చరిత్రలో అధికంగా కనిపిస్తుంది. అతని కారణంగానే మానాల, పొలాస మధ్య చెరువు నీటి కోసం అంతర్యుద్ధం చెలరేగుతుంది. ఈ నీటి యుద్ధం రఘుపతి రాయుడి హత్యకు కారణమవుతుంది. మానాల చెరువులో నీటిని నింపడం కోసం ప్రధాన భాగస్వామ్యం వహించిన శాఖమల్లు కథ జానపద కథా గేయాల్లో అద్భుతంగా వర్ణింపబడింది.

శాఖమల్లు కథ :

పెరిగి పెద్దవాడు అయిన 'దత్తు' పుత్రుడు శాఖ మల్లుకు రఘుపతిరాయుడు నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడెం తాలూకాలో గల కోనాపురమునకు చెందిన 35 గ్రామాల భూములను ఇచ్చి పాలకునిగా నియమించాడు. శాఖమల్లు ఆ గ్రామాలన్నింటిని అత్యంత పరాక్రమవంతుడిగా పరిపాలన సాగిస్తున్నాడు. ఇది ఈ విధంగా ఉండగా మానాలలో నీటి కటకం ఏర్పడింది. మానాల చెరువు ఎండిపోయింది. చేనులన్ని "కుండ కింద గడ్డివోలె మాడిపోయినవి". ప్రజలు అల్లాడి పోయారు. దుర్భిక్షం ప్రాప్తించింది. ఈ కరువు నుంచి మానాలను రక్షించడానికి రఘుపతిరాయుడు సమర్థుడైన తన దత్తు పుత్రుడు శాఖమల్లును కోనాపురం నుండి పిలిపించాడు. శాఖమల్లు మానాల చెరువును నింపడం కోసం 12 ఆమడల దూరంలో ఉన్న పొలాస చెరువు నుండి నీరు తెప్పించాలని ప్రయత్నించాడు. పొలాస పాలకులు తమ మేనమామలు. చాలా రోజులుగా వారితో బంధు సంబంధాలు లేకపోవడం వల్ల పొలాస పాలకులను పొలాస చెరువు నుండి నీటిని పంపించమని అడగడం గాని, అనుమతిని గాని తీసుకోలేదు. అక్రమంగా నీటిని మళ్ళించే ప్రయత్నం చేశాడు. మొదట శాఖమల్లు తన పరివారంతో వెళ్ళి పొలాస చెరువుకు గండి పెట్టే సందర్భంలో నీరటికాండ్రు అడ్డగించాడు. అక్కడొక నీటియుద్ధం జరిగిందని చరిత్ర చెబుతుంది. ఆ యుద్ధ వాతావరణాన్ని జానపదకారులు అద్భుతంగా ప్రదర్శిస్తారు. "కారు దున్నపోతులు కలబడ్డట్లు, మదపుటేనుగులు మరలబడ్డట్లు" నీటి పోరాటం జరిగిందిగా పేర్కొంటారు. ఆ సమయంలో "నిమ్మకాయంత రాయి నిల్వుకెగరబట్టె, పోకంతరాయి పొడి పొడి కాబట్టె" అంటూ చెరువుకు గండి పడి కట్ట తెగిపోయిన విషయాన్ని అత్యంత ఆశ్చర్యార్థంగా జానపదులు వర్ణిస్తారు. శాఖమల్లు తన బల్మూరి వంశానికి ఇలా దొంగదెబ్బ తీయడం పనికి రాదని, తన బొడ్డులో నుండి గుండి తీసి కాలి వేళ్ళతో పట్టి "తొమ్మిది లఘువుల మీద విసిరికొట్టి" నీరటి కాండ్రను చంపాడట. దీనిని జానపద గాయకులు "నీరటికాండ్ర తలపండ్లను దింపి ఒంటి జన్నేదుకు కట్టి" చెరువుకు గండి పెట్టినట్లుగా శాఖమల్లు వీరత్వాన్ని ప్రదర్శిస్తారు. ఈ భీకరపోరులో రెండు వర్గాల (మానాలకు చెందిన వీరులు చచ్చిపోయారు. పీనుగులు నీటితో పాటు ప్రవహించి మానాల చెరువులో చేరినట్లుగా అతిశయంగా చెప్పుకుంటారు. ఈ విషయం పొలాస పాలకులకు తెలుస్తుంది. ఈ దుర్ఘటనపై రఘుపతిరాయుడు శాఖమల్లు మీద కోపించి కోనాపురానికి పంపివేస్తాడు.

రఘుపతిరాయుడు పాలాస పాలకులకు నష్టం వాటిల్లిందని దానికి దండుగ కట్టడానికి వయన మయ్యాడు. ఈ సమాచారం తెలుసుకొని శాఖమల్లు తండ్రికి ఎదురై పాలాసకు వెళ్ళకుండా నిలుపుదల చేస్తాడు. పాలాస పాలకుల నుండి ఆపద వచ్చినప్పుడు తాను ఎదుర్కొంటానని చెప్పి తన రాజ్యం కోనాపురానికి వెళ్లిపోతాడు.

మొదటి నుండి కక్షలతో రగిలిపోయే పాలాస పాలకులు ఈ నీటి యుద్ధం వల్ల మరింతగా కోపం పెంచుకొని రఘుపతిరాయుడిని సంహరించడానికి ఎత్తు గడలు వేస్తారు. ఒక పాలాస యోధుడికి ఈ దుష్కృత్యానికి ఉద్యుక్తుడిగా చేస్తారు. ఆరవెల్లి కటారి జిముకడు అనే ఆ యోధుడు (మాలవాడు) కొంత సైన్యాన్ని తీసుకొని మానాల ప్రభువును రఘుపతిరాయుడిని చంపడానికి బయలుదేరుతాడు. మొదట రఘుపతిరాయుడి మంత్రిని, పంతులును తమ వశం చేసుకుంటాడు. వారు రఘుపతిరాయుడిని మోసగించి శత్రువుకు చిక్కేటట్లు చేస్తారు. ఆరవెల్లి కటారిజిముకడు రఘుపతి రాయుడిని వెంబడించి శంభునిగుడిలో తలను నరికి వేశాడట. జానపదులు రఘుపతిరాయుడి వీరత్వాన్ని గూర్చి చెబుతూ- 'అతడు తలపోయినను మొండెంతోడనె శత్రువులను మూడులక్షల మందిని చంపెనట' అని అతిశయంగా పాడుకుంటారు. అదేవిధంగా పాలాస పాలకులు తమ అక్క ధర్మాంబను, మేనల్లుండ్లను కూడా చంపివేయమని ఆ యోధుడిని ఆజ్ఞాపించారు. కాని ఆమె వారిని వేడుకొని తన మానాలకోటను, ఆస్తిని తమ్ముళ్లకే వదిలి తన సంతానం (ఎల్లారాయుడు, మల్లారాయుడు, నరసారాయుడు, కొండలరాయుడు)తో ఊరు విడిచి వెళ్ళిపోయింది. ఈ వార్త దత్తు పుత్రుడు శాఖమల్లుకు తెలిసింది. తన తండ్రిని సంహరించారని, తల్లిని, సహోదరులను మానాలకోట నుంచి తరిమివేశారన్న విషయం తెలుసుకొని శాఖమల్లు ఉగ్రుడయ్యాడు. దీంతో అతడు చవుడూరు, లంకాలపల్లి, నవాబుపేట, బింకనోలు (బిక్కనోలు), వడ్లకొండ మీదుగా దండెత్తి పాలాస కోటకు అడ్డంగా తిరిగి శత్రువులపై దాడి చేశాడు. శాఖమల్లు సేనాధిపతి గోసంగి లింగడు. ఇతడు చేసిన యుద్ధం అద్భుతమైందిగా జానపదులు అభివర్ణిస్తారు. ఈ భీకరమైన పోరును తట్టుకోలేక పాలాస పాలకులు కోటను విడిచి పారిపోయి, ప్రాణాలు దక్కించుకుంటారు. తదనంతరం దత్తు పుత్రుడైన శాఖమల్లు రఘుపతిరాయుడి కళేబరానికి దహన సంస్కారాలు చేసి కోనాపురం రాజ్యానికి పయనమై పోతాడు. అతనికి ఎందుచేతనో తన తల్లి, సహోదరుల జాడ తెలిసిరాలేదు. కానీ మానాలకోట వదిలి వెళ్లిన తరువాత కొండల రాయుడు పెరిగి పెద్దవాడై మళ్లీ తల్లి ప్రోత్సాహంతో, శాఖమల్లు సహకారంతో తమ తండ్రి మరణానికి కారణమైన శత్రువులను చంపుతాడు. ఇందులో కొండల రాయుడి వీరత్వాన్ని ప్రదర్శించే సన్ని వేశాలు అత్యంత భీభత్సంగా వర్ణింపబడ్డాయి.

బల్మూరి కొండలరాయుడి కథ :

మానాలకోటను విడిచి వెళ్లిపోయిన ధర్మాంబ, తన సంతానంతో ధర్మపురి వద్ద గోదావరి నదిని పుట్టిలో దాటి "ఎల్లెగడుప" (వెయిలగడప) అనే నగరానికి చేరుకుంది. అప్పటి గోలుకొండ రాజ్యంలో వరంగల్ సుభాలోని వెలి గందుల జిల్లాలోని "ఎల్లెగడుప" ఒక తాలూక పట్టణం. దానికి అధికారి జల్దారు సాహెబ్. రఘుపతిరాయుడికి అతడు మంచి మిత్రుడు. రఘుపతిరాయుడి జాగీరు ఐదు ఊళ్లు అతని ఆజమాయిషీలోనే ఉండేవని తెలుస్తుంది. అక్కడ ధర్మాంబ మారువేశంలో పనిమనిషిగా కాలం గడిపింది. కొండలరాయుడు జర్దార్‌ఖాన్ పిల్లలతోనే చదువుకున్నాడు. సాము-గారడీలు నేర్చుకున్నాడు. వీరుడిగా బయలుదేరాడు. దృఢమైన శరీరం కలిగిన వాడుగా గొప్ప బలశాలిగా రూపాంతరం చెందాడు. అతనికి పౌరుషం, జాప్యభిమానం మెండు. నాటి తురక పాలకులపై అతను కక్ష పెంచుకున్నాడు. నవాబు పాలనను అంతమొందించాలనే ధ్యేయాన్ని ఏర్పర్చు కున్నాడు. పెరిగి పెద్దవాడైన కొండలరాయుడు తన తండ్రి

రఘుపతిరాయుడి మరణంపై గల వివిధ గాధలను తెలుసుకున్నాడు. తన తండ్రిని హతమార్చిన వారిని సంహరించాలని పగతో ముందుకు సాగాడు. తనకు సహకరించే ఒక యువకుల దండును సమకూర్చుకున్నాడు. కోనాపురంలోగల దత్తు సోదరుడు శాఖమల్లును కలుసుకున్నాడు. పొలాస పాలకులైన తన మేనమామలపైకి పోరుకు సిద్ధమయ్యాడు. మొదట తమ తండ్రిని చంపిన కటారి జిముకడు అనే మాలవీరుడిని అర్వెల్లి వద్ద చంపివేశాడు. అదే సందర్భంలో ముందుగా అర్వెల్లి గ్రామ రక్షకురాలైన నాయకురాలిని ఓడించి, తన శక్తిసామర్థ్యాలతో మెప్పించి ఆమె సాయాన్ని పొందాడు. (ఈ నాయకురాలు ఎవరో కాదు 12వ శతాబ్దికి చెందిన నాయకురాలు నాగమ్మ. పల్నాటి యుద్ధం నడిపిన నాగమ్మనే అర్వెల్లి నాయకురాలు. ఈమె అర్వెల్లిలోనే జన్మించింది. తదనంతరం పల్నాటికి వెళ్లి తండ్రి, భర్త మృతి తర్వాత తన తెలివితేటలతో నలగామరాజుకు మంత్రిగా వ్యవహరించింది. ఆనాడు బ్రహ్మనాయుడిని ఎదురించి ఓడించింది. అంతగొప్ప బ్రహ్మనాయుడి పరాజయానికి కారణమైంది నాయకురాలు నాగమ్మ. కానీ చివరకి స్వగ్రామమైన అర్వెల్లికే చేరుకొని, అక్కడే మృతి చెందింది. తెలంగాణ వీరవనితగా గ్రామ దేవతగా ఇప్పటికి పూజలందుకుంటుంది).

తదనంతరం కొండలరాయుడు మానాలను కైవసం చేసుకొని తల్లి ధర్మాంబను, సహోదరులను తన కోటకు పిలిపించుకున్నాడు. తన సైన్యాన్ని, బలగాన్ని పెంచుకొని ఆయుధాలను సమకూర్చుకున్నాడు. పొలాస, ఎలుగందలను కూడా గెలుచుకున్నాడు. ఆ ప్రాంతపు ధనికులందరిని దోచుకోవడం ప్రారంభించాడు. (ఒక్కో సందర్భంలో కొండల రాయుడిని దోపిడి దొంగతో కూడా ముద్ర వేశారు). కానీ అతడి ధ్యేయం ముస్లిం పాలకులను ఈ నేల నుంచి తరిమి వేయాలన్నదే. అందుకే పొలాస, ఎలుగందలను గెలుచుకున్నా కూడా అతని పోరాటం ఆగలేదు.

ఒక సందర్భంలో కొండల రాయుడు సర్వాయి పాపన్న (వరంగల్) అనే గౌడ వీరుడితో పోరాటం చేయవలసి వచ్చింది. గంగాధర, పూడూరు వద్ద జరిగిన పోరాటంలో సర్వాయిపాపన్న కొండలరాయుడిని ఓడించాడు. కానీ కొండలరాయుడి వీరత్వానికి మెచ్చి తుర్క నవాబులను ఓడించే సామర్థ్యం అతనికి ఉందని భావించి, అతనిని అభినందించి గంగాధర, పూడూరు ప్రాంతాలను అతనికి అప్పగించి వెళ్లిపోయాడు.

ఈ విధంగా తన శౌర్యంతో పరాక్రమంతో విజయాన్ని సాధిస్తూ ముందుకు వెళ్లిన కొండల రాయుడు అనేక ప్రదేశాలను జయించాడు. అయితే తన ఆరాధ్య ప్రదేశమైన కొండగట్టు మీద కోటను నిర్మించే ప్రయత్నంలో ఎలుగందల సైన్యం కొండలరాయుడి మీద పడింది. అప్పుడు కొండల రాయుడు ఎత్తైన కొండ మీద నుంచి కిందికి దూకడం వల్ల అతని కాలుకి గాయమైనట్లుగా జానపద కళాకారులు తమ కథల్లో పాడుకుంటారు. కాని అది నిజం కాదు. తమ రక్షణ కోసం తన సైన్యం చుట్టూ ఉన్న తురకల సైన్యంతో పోరాటం చేస్తూ ఉండగా కొందరు అనుచరులతో పాటుగా కొండల రాయుడు గుర్రం ఎక్కి లోయలోపడి తప్పించుకొని వెళ్లిపోయాడు.

భోగంసాని కథ :

కొండలరాయుడు విజయయాత్రల అన్నింటిలో సేవకురాలు/ప్రేయసి/వేశ్య ఆయన సేవకురాలు బోగంసాని అతివీర పరాక్రమం చూపింది. ఆమె ఒక గొప్ప వీరవనిత. ఖడ్గం తిప్పడంలో అత్యంత నేర్పు కలిగింది. కొండలరాయుడు చేసిన యుద్ధాలన్నింటిలో బోగంసాని సహాయకురాలిగా వెళ్లేది. కొండగట్టు కోట నిర్మాణంలో ఉండగా ఎలుగందల సైన్యం తనపైకి వచ్చిపడినప్పుడు కొండలరాయుడితో సమానంగా పోరాటం చేసింది. నిండు గర్భిణిగా ఉండి కూడా శత్రువులతో పోరాటం చేసి ఆ యుద్ధరంగంలోనే ప్రసవ వేదన అనుభవించి మృతి చెందింది. అందుకు ఆమెను ఒక గొప్ప శక్తి మాతగా, గ్రామదేవతగా తెలంగాణ ప్రజలు కొలుస్తారు.

ఇది ఇలా ఉండగా కొండగట్టు లోయలోపడి కొందరి అనుచరులతో తప్పించుకున్న కొండలరాయుడు అచిర కాలంలోనే ఎంతో గొప్ప సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ నేపథ్యంలోనే ఇప్పటి నిజామాబాదు జిల్లా పూర్వ నామమైన ఇందూరును, మెదకు జిల్లాకు చెందిన ఆంథోల్ వరకు అనేక కోటలను, గడీలను జయించాడు. అక్కడి నుంచి గోలుకొండ కోటను సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పర్చుకున్నాడు.

కాని చివరకు నిజామాబాదు జిల్లా పల్లికొండ సమీపం లోని బాచనపల్లి దగ్గర గల చిట్టడవిలో చిన్రోళ్ళు గుట్ట మీద ''భీంగల్లు'' నవాబు సైన్యంతో పోరాడుతూ తన అపజయాన్ని శంకించి తన తండ్రి విజయ ఖడ్గాన్ని నేలపై పాతి, తన పిడిబాగుతో తన పొట్టలోనే పొడుచుకొని అమరుడైనాడు. తెలంగాణ అభిమాన ధనుడిగా, వీర బల్మూరి కొండలరాయుడిగా ప్రసిద్ధిగాంచాడు. ఇప్పటికీ 300 ఏళ్లుగా బాచనపల్లికి పడమరన ఉన్న చిన్రోళ్ల గుట్టమీద ప్రతియేటా తొలి ఏకాదశి తరువాత వచ్చే మూడవ శుక్రవారం రోజున ఆరాధనలు జరుగుతూనే ఉన్నాయి. అక్కడ ఆయనకు సంబంధించిన అనేక స్మృతి చిహ్నాలు ఉన్నాయి. కొండలరాయుడికి సంబంధించిన ధనాన్ని దాచి పెట్టిన గుండు, హనుమంతుని విగ్రహం, కోనేరు, కొండగుహ వంటివి ఉన్నాయి. అతడు బ్రతికిన 27 ఏళ్లలో చివరి ఏడు సంవత్సరాలు నాలుగు జిల్లాలైన నిజామాబాదు, ఆదిలాబాదు, మెదక్, కరీంనగర్ వంటి ప్రదేశాలలో ఆయన పౌరుషం విస్తరించింది. కొండల రాయుడి పూర్తి జీవన విశేషాలు చరిత్రబద్ధంగా రికార్డు కాలేదు. జానపద గుండెల్లో గూడు కట్టుకొని పాడిన పాట నుంచి, చెప్పిన కథ నుంచి ఆయన జీవనగాథ తెలు స్తుంది. జాతి గౌరవం, పౌరుషం ప్రధాన లక్ష్యంగా నాడు ఢిల్లీ, గోలుకొండ నవాబుల పాలన అంతమొందాలని పరితపించి పోరాడి అమరుడైన యువ వీరుడు బల్మూరి కొండలరాయుడు.

పై విషయమంతా చారిత్రక ఆధారాలను సేకరించి పరిశోధకులు చెప్పిన కొండల రాయుడి జీవన ఉదంతం. కాని కొన్ని జానపద గేయ కథల ఆధారంగా కొండల రాయుడి కథ మరొక కోణంలో వర్ణింపబడింది. ఈ కథా గేయాల ప్రకారం మానాలకోటను విడిచి వెళ్లిన ధర్మాంబ, తన సంతానంతో వివిధ దేశాలు తిరిగి దొమ్ముకొండ/ దుమ్ముణుడ/దోమకొండను ఆశ్రయించింది. అప్పటి దోమకొండ పాలకుడు తురుక నవాబు. అతనిపేరు జల్దార్ ఖాన్. అతి పిన్నవయస్సు అంటే 13 సంవత్సరాలు కలిగిన కొండలరాయుడు జల్దార్ఖాన్ పరివారంతో పోరాడి నవాబును మెప్పించాడు. కొండలరాయుడి పరాక్రమాన్ని ప్రశంసించిన నవాబు మానాలకోటను తిరిగి ఇవ్వడానికి సంసిద్ధుడైనాడు. కొన్ని రోజుల తరువాత ధర్మాంబ కొండలరాయుడితో సహా తన సంతానంతో మానాల కోటను చేరుకుంది). మానాలకోటలో కొండల రాయుడు క్రమక్రమంగా పెరిగి యోధుడిగా రూపాంతరం చెందాడు. తరువాత తన తండ్రి మరణానికి కారణం తెలుసుకొని పాలాస పాలకులపై పగను సాధించాలను కున్నాడు.

'తలలు కుచ్చెలు గడుదునూ / దొబ్బలు దోరణాలు గడుదునూ / రోకండ్ల గట్టుమీద రోయక యుద్ధం చేస్తా / లింగంపల్లి గట్టుమీద నిలబడి కానెలుబోస్తా / కలివి రోని గుండంల కత్తులు కడిగి వస్తా' అని అతడు తండ్రి పగను సాధించడానికి బయలుదేరుతాడని జానపద కళాకారులు పాడుకుంటారు. తల్లి చిన్న బాలుడైన కొండలరాయుడిని నిలువరింపజేస్తుంది. కాని తన పరాక్రమాన్ని మునుముందు ప్రజలు ''విసిరే రాళ్లమీద, దంచే రోకలమీద, చెరిగే చేటలు మీద'' యాలలుగా పాడుకుంటాడని కొండలరాయుడు అంటాడు. తల్లి ధర్మాంబ తన కొడుకు కొండలరాయుడు యుద్ధంలో విజయాన్ని సాధించగలుగుతాడో, సాధింపలేడో అని సందేహాన్ని వ్యక్తపరుస్తుంది. అందుకోసం తన కొడుకిని యుద్ధవీరుడిగా తీర్చిదిద్దడానికి కొండలరాయుడుతోనే మూడుసార్లు ధర్మాంబ యుద్ధం చేసి ఓడిస్తుంది. అతడిలో

ధైర్యం, శౌర్యం కలిగే విధంగా అతడిని పురిగొల్పుతుంది. అంతేగాక వీరత్వానికి ప్రతీకగా ధర్మాంబ తన కుమారుడి వీపున ముల్లు పొడిచినట్లుగా జానపద కథలనుబట్టి తెలుస్తుంది. కొండలరాయుడు సర్వశక్తులు సాధించి యుద్ధానికి సిద్ధపడి తన తండ్రిని సంహరించిన పాలాస నాయకులపై తిరుగుబాటుకు బయలుదేరాడు. తన దత్తు సోదరుడు శాఖమల్లు కూడా తన సైన్యంతో సహాయంగా వస్తాడు. (కొండలరాయుడు తన సైన్యానికి కావలసిన ధనాన్ని ఇవ్వవలసిందిగా తల్లిని కాల్చి బాదించినట్లుగా జానపద కథకులు చెప్పుకుంటారు. సర్వాయి పాపన్న కథలో కూడా ఇటువంటి సంఘటన ఒకటి ఉంది. కాబట్టి ఇవి రెండు కూడా అభూత కల్పనగా భావించవచ్చును. ధనప్రసక్తి కలిగిన చోట ఇటువంటి అపవాదులు వచ్చి చేరుతుంటాయి.)

ఇంతటి ఉధృతమైన సైన్యంతో వెళితే పాలాస పాలకులు తప్పించుకుపోతారని కొండలరాయుడు, శాఖమల్లు, మరికొందరు యోధులు కలిసి ఒక నాటకం వేస్తారు. వారందరూ భాగవతుల వేషం ధరించి పాలాస చేరుకొని అక్కడ "సుంకరి కొండయ్య" ఆట ఆడుతారు. భాగవతుల ఆటను చూడటానికి వచ్చిన పాలాస నాయకులను, అతని అనుచరులను మోసగించి చిత్రవధ చేస్తారు. మొదట తన తండ్రిని మోసగించిన మంత్రి, పంతులుని అనేక రకాలుగా హింసిస్తారు.

పాలాసకోటపైకి దండెత్తి వచ్చిన కొండలరాయుడి, శాఖమల్లు సమాచారం తెలుసుకున్న గోలుకొండ నవాబు ఆ సైన్యాన్ని ఎదురించడానికి తన దండును పాలాసకు పంపిస్తాడు. కానీ కొండలరాయుడు తన గుండె ధైర్యంతో, శౌర్యంతో గోలుకొండ నవాబు సైన్యానంతా హత మారుస్తాడు. కొండలరాయుడి ధాటికి తట్టుకోలేని గోలుకొండ నవాబు సైన్యం పారిపోవడానికి ప్రయత్నిస్తుంది. పారిపోయే సైన్యం మీద కూడా కొండలరాయుడు ఒక ఎత్తైన "సూది మాను గుండు" నుండి దూకడం వల్ల అతని కాలుకి ఒక కొయ్య గుచ్చుకొని గాయమైనట్లుగా జానపద కథలో ఉంది. ఆ గాయమే వ్రణంగా మారి అతడు మరణించినట్లుగా తెలుస్తుంది. మరొక కథా గేయంలో అతడు శత్రువులను సంహరించి తానే బాల చంద్రుడు అలుగులపై ఒరిగి మరణించినట్లుగా వర్ణింప బడింది. అప్పటికి బల్మూరి కొండలరాయుడి వయస్సు 27 సంవత్సరాలు మాత్రమే. బాలచంద్రుడిని తలపింప జేసే పరాక్రమశాలి బల్మూరి కొండలరాయుడు. అతని మరణానంతరం శాఖమల్లు మానాల ప్రాంతానికి కూడా అధికారిగా వ్యవహరించాడు.

సూచన :

కొందరి విమర్శకుల అభిప్రాయం ప్రకారం 12వ శతాబ్దానికి చెందిన నాయకురాలు నాగమ్మ, 17వ శతాబ్దానికి చెందిన నాగమ్మ వేరు వేరు అయి ఉండవచ్చు. 12వ శతాబ్దపు నాగమ్మ ఒక నాయకురాలు. రెడ్డి కులస్థురాలిగా చరిత్రకారులు చెబుతారు. ఆమె బొబ్బిలి సామ్రాజ్యంలో మహామంత్రిగా వ్యవహరించి బ్రహ్మ నాయుడి ఓటమికి కారణం అవుతుంది. కానీ 17వ శతాబ్దానికి చెందిన నాగమ్మ వెలమ ఇంటి ఆడపడచు. ఈమె ఆర్వెల్లి గ్రామానికి నాయకురాలిగా వ్యవహరింపబడ్డారు. బహుశ ఈమెతోనే కొండలరాయుడు యుద్ధం చేసి ఉంటాడు. కొండల రాయుడు వల్ల తన ప్రాణానికి ప్రమాదం పొంచి ఉందని యెంచి ఆర్వెల్లి గ్రామస్తులైన కటారి జిముకడు గ్రామానికి నాయకురాలైన నాగమ్మను ఆశ్రయించి ఉంటాడు. ప్రాణరక్షణ కోసం ప్రాదేయపడి ఉంటాడు. ఆమె అభయహస్తం ఇచ్చి ఉంటుంది. కొండల రాయుడు ఆర్వెల్లి గ్రామ సమీపంలోకి రాగానే నాగమ్మ అడ్డుకుంటుంది. వీరిద్దరి మధ్య భీకరమైన పోరాటం జరిగినట్లుగా జానపద కథా గేయాల్లో, చరిత్రలో కూడా చెప్పుకుంటారు. చివరికి నాగమ్మ ఈ యుద్ధంలో ఓడిపోతుంది. కాని కొండల రాయుడు ప్రదర్శించిన శౌర్యాన్ని, వీరత్వాన్ని చూసి అబ్బుర పరుస్తుంది. తరువాత కొండల రాయుడికి సాయం చేసి కటారి జిముకడి మరణానికి దోహదపడుతుంది. ఇప్పటికి ఆర్వెల్లిలో

వెలమ కులస్తులు తమ ఆడపడుచు అయిన గ్రామానికి నాయకురాలైన నాగమ్మకు ఆషాడమాసంలో చీరలు, సారెలు పెట్టి జాతర నిర్వహిస్తారు. ఆర్వెల్లిలో వెలసిన గుడికూడా 17వ శతాబ్దానికి చెందిన గ్రామ నాయకురాలు నాగమ్మదే అయి ఉంటుందని కొందరు పరిశోధకులు, విమర్శకులు సూచిస్తున్న సమాచారం.

తెలంగాణలో స్థానిక వీరుల ఉదంతానికి సంబంధించిన చరిత్ర చాలా వరకు కనుమరుగవుతూ వచ్చింది. అందులో బల్మూరి కొండలరాయుడు, బోగంసాని ప్రధానంగా నిలుస్తారు. వారు ప్రదర్శించిన వీరత్వం తెలంగాణ జాతికి ఎంతో స్ఫూర్తిదాయకం. గోలుకొండలో పరాయి పాలన అంతమొందాలని, తెలంగాణ స్వేచ్ఛా వాయువులను పీల్చుకోవాలని ఆనాడే ఆశించిన బల్మూరి కొండలరాయుడి జాత్యభిమానం ఆయన చారిత్రక గాథ ద్వారా తెలుస్తుంది.

కొండలరాయుడు, భోగంసానికి సంబంధించిన మరికొన్ని విషయాలు :

బల్మూరి / బల్మూరి కొండలరాయుడు (1690-1720) నిజామాబాదులోని భీంగల్లు జాగీరును జయించదలచి పోరాటానికి సిద్ధమైతాడు. ఈ విషయం తెలుసుకున్న గోల్కొండ నవాబు కొండలరాయుడిని ఓడించడానికి భీంగల్లు నవాబుకు అత్యధిక, అధునాతన సైన్యాన్ని పంపిస్తాడు. అంత పెద్ద సైన్యంతో పోరాటం చేస్తూ ఉండగాబీ ఒకానొక సందర్భంలో తన అపజయాన్ని శంకించి, తన తండ్రి ఖడ్గాన్ని నేలపై పాతి, తన పిడి బాకుతో తానే పొడుచుకొని ఆత్మత్యాగం చేసుకుంటాడు...

అతడు ఆత్మత్యాగం చేసుకున్న రోజు తొలి ఏకాదశి తరువాత వచ్చే మూడవ శుక్రవారం. అక్కడ ఆయనకు గత 300 సంవత్సరాలుగా ఆరాధనలు జరుగుతున్నాయని తెలిసింది. అది ఈ రోజే (10-8-2018). అక్కడికి వెళ్ళాలని ఈ రోజు కోసం నేను చాలా రోజులుగా నేను ఎదురు చూస్తున్నాను. ఆ ప్రదేశం నిజామాబాదు జిల్లాలోని భీంగల్లు మండలంలో గల పల్లికొండ గ్రామానికి దగ్గరలోని బాచనపల్లి సమీపంలో చిన్రోళ్ళు. నేను (డా.వి.త్రివేణి) మరియు తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి, తెరసం జిల్లా అధ్యక్షులు శ్రీ నరాల సుధాకర్, కొంత మంది మిత్రులం వెళ్ళాము...

బాచనపల్లికి వెళ్ళగానే ఆ ఊరి రచ్చబండ మీద కొందరు పెద్ద మనుషులు కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. వారిని కలిసి మేమొచ్చిన సంగతి చెప్పాము. వెంటనే వారు ఆ జాతర పోయిన శుక్రవారమే అయి పోయిందన్నారు. ఆ మాటతో నాకు చాలా నిరాశ కలిగింది. కాని ఆ ప్రదేశమైతే ఉంటుంది కదా ! అని ఆ పెద్ద మనుషులు ముగ్గురిని (భీంగల్లు మండల బిజెపి ప్రధాన కార్యదర్శి వన్నెల సుదర్శన్, కొప్పు ముత్తయ్య, అట్టి మల్లరాజన్న) మా కారులో తీసుకొని చిన్రోళ్ళుకు వెళ్ళాము. ఈ చిన్రోళ్ళు కొండయ్యకోట మీద ఉంది...

అది దట్టమైన అడవి ప్రదేశం. పైగా పెద్ద గుట్ట. చాలా ఎత్తైన కొండ. అడుగు తీసి అడుగు వేయరాకుండా ఉంది ఆ కొండ. ఆ కొండపైకి ఎక్కాలి. చాలా ప్రయాస పడుతూ ఎక్కాము. మూడు కిలో మీటర్ల ఎత్తులో ఉంది ఆ ప్రదేశం. ఆ ప్రదేశం చేరగానే నాకు ఎందుకో పట్టరాన్ని సంతోషం కలిగింది. ఒక్క గొప్ప వీరుడు, శౌర్యుడు, జాత్యభిమానం కలిగి అప్పటి గోల్కొండ నవాబుల పాలన అంతమొందింపజేసిబీ తెలంగాణ ప్రాంతానికి స్వేచ్ఛా వాయువులను అందించాలనే కాంక్ష కలిగిన వాడు. అటువంటి యోధుడు తిరుగాడిన నేలపై నేనున్నాను. ఒకపాటి విజయ గర్వం నాలో పొడసూపింది. జాతి గౌరవం మనసు నిండా నిండింది...

ఆ ప్రదేశం కొండలరాయుడి రహస్య నివాస స్థావరం.

1. అక్కడ ఆయన ఒక కోట కట్టుకున్నాడు. ఇప్పటికి అక్కడ రాళ్ళ సరిహద్దు ఉంది.
2. అతడు ధనం దాచిన గుండు ఉంది. ఆ గుండుకు ఒక రంధ్రం చేసి అందులో ధనం దాచి మళ్ళీ మూసేవాడట. ఇప్పటికి ఆ గుండుకు మూసిన చోట నల్లని మచ్చ ఉంది.

3. అతడు తన ఇష్ట దైవమైన ఆంజనేయ స్వామిని ప్రతి రోజు పూజించేవాడు. ఇప్పటికి అక్కడ ఆ స్వామి రూపం ఒక పెద్ద కొండకు తొలచి ఉంది.
4. ఒక్క పెద్ద కొండ కింద సన్న సన్నని గుహలు కలిగిన సొరంగం ఉంది. ఆ సొరంగం మానాల వరకు ఉందట. శత్రువులు దాడి చేస్తే ఆ గుహల్లో పడి, సొరంగం గుండా తప్పించుకొని పోయేవాడు.
5. అక్కడే గుట్టల నడుమ ఒక పెద్ద మైదానం ఎనిమిది కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. అది కొండలరాయుడి సైన్యం నిలిపే స్థావరమట. మైదానం చూస్తే అతడికి పెద్ద సైన్యమే ఉందని తెలుస్తుంది.
6. ఆ బండ మీదనే ఒక కోనేరు ఉంది. ఏ కాలమైనా ఎండి పోకుండా కోనేరు ఊట ఊరుతూనే ఉంటుందట.
7. కోనేరు పక్కనే భోగంసాని నివసించిన గుహ ఉంది. ఆమె ఆ కోనేరులో స్నానం చేసేదట.
8. కోనేరు బండ మీదనే అనేక చిన్న చిన్న రోళ్ళు ఉన్నాయి. వంటకు కావలసిన పదార్థాలు రోళ్ళలో నూరుకునేవారట. పెద్ద సైన్యం ఉంది కదా! వారందరికి ఆహారం కావాలి మరి!

అందుకే ఆ ప్రదేశం చిన్రోళ్ళుగా ప్రశస్తి గాంచింది...

జాతర రోజు భక్తులు మొదట భోగంసానికి నైవేద్యం పెట్టిన తరువాతనే మిగతా పనులు చేస్తారట. ఆంజనేయ స్వామి ఎదుట మేకపోతును బలి ఇస్తారట. దాదాపు 50 గ్రామాల ప్రజలు ఈ జాతరలో పాల్గొంటారు. ఎంతో కాలంగా కొండలరాయుడిని పూజిస్తూ, కొండయ్య కోట జాతర జరుపుకుంటూ, ఆయన కీర్తిని అజరామరణం చేశారు. తరతరాలుగా వెలుగొందుతున్న తెలంగాణ చరిత్రా సంస్కృతులు ఎంత గొప్పవో అవగతం అవుతుంది...

సాహితీ కారులు లేవనెత్తిన అంశాలకు నా అభిప్రాయాలు...

1. నిజమే... ఫిరంగి మందు గుండు కోసం రోళ్ళను కొట్టి ఉంటారు. నేను ఆ కోణంలో ఆలోచించలేక పోయాను. చిన్రోళ్ళ గుట్ట మీద ఉన్న రోళ్ళను చూస్తే అతనికి ఎంత పెద్ద సైన్యముండేదో తెలుస్తుంది.
2. శిలా శాసనాలు దొరకలేవు. వాటి కోసం బాగా వెదికాను. మాతో వచ్చిన ఆ ఊరి పెద్ద మనుషులను అడిగిన. కొండలరాయుడు, భోగంసాని చిత్రాలు గాని, ఏవైనా రాతలు గాని, గీతలు గాని ఈ గుట్ట మీద ఉన్నాయా? అని అడిగిన. వారి నుంచి సమాధానం రాలేదు.
3. తెలంగాణ శాసనములు, పుట 7 లో 'పాలాస' అనేది కరీంనగర్ మండలానికి పూర్వనామంగా వ్యవహరింపబడిందని తెలుస్తుంది. అంతకు మించి అతని సమాచారం నేను సేకరించలేక పోయాను. చూడాలి.
4. నిజాం గెజిట్ లో తప్పక అతని సమాచారం ఉండాలి. చరిత్ర ఆధారాలను బట్టి చూస్తే నాకొక విషయం బోధపడింది. కొండలరాయుడి కాలం (1690-1720).అప్పుడు గోల్కొండ సామ్రాజ్యంలో కుతుబ్ షాహీల పాలన అంతమై మొఘల్ పాదుషా ఔరంగాజేబు కైవసం అయ్యింది. ఈ సువిశాల సామ్రాజ్యానికి నిజాంను సుబేదారుగా ప్రకటించి ఔరంగజేబు డిల్లీకి వెళ్ళిపోయాడు. స్వతంత్ర్య అధికారం లేని నిజాం సుబేదార్ పాలనా కాలంలో (1687-1724) అస్థిరత్వం చోటుచేసుకుంది. అప్పుడే గోల్కొండ కోట కొల్లకొట్టుకుపోబడింది. 'కోహినూర్ వజ్రం' అప్పుడే డిల్లీకి తరలించబడింది. అటువంటి స్థితిలోనే స్థానిక వీరులు సర్వాయి పాపన్న, బల్గూరి కొండల రాయుడు మొదలైనవారు బయటకు వచ్చారు.

గోల్కొండలో నవాబుల పాలననే సహించని స్థానిక వీరులుబీ డిల్లీ రాజుల చేత్తుల్లోకి పోవడం జీర్ణించుకోలేకపోయారు. వీరందరు తిరుగుబాటు చేశారు. నిజాం ఆధీనంలో ఉన్న కోటలను, గడీలను జయించారు. అదే వరసలో గోల్కొండ కోటను కొట్టాలని వారి వాంచ. నవాబుల పాలన అంతమొందాలనేది వారి కాంక్ష. కొంత కాలానికి ఔరంగజేబు మరణించారు. నిజాం అప్పటి నుంచి గోల్కొండ సామ్రాజ్యానికి సర్వ స్వతంత్ర్య రాజుగా ప్రకటించుకున్నాడు. స్థానికంగా ఎదురు తిరిగిన వీరులను వేటాడి, వెంటాడి అణచి వేశాడు. అందులోనే కొండలరాయుడు వీర మరణం పొందాడు.

కొందరు కరీంనగర్ వాసులు 'తానీషా కూతురి ప్రేమ కథ' చెబుతారు. ఆమె ప్రేమించింది కొండల రాయుడి నేనట. పేరు మాత్రం ప్రస్తావించలేదు. ఈ విషయం మనం కనుక్కోవచ్చు.

5. అక్కడి వారిని అడిగాను. కొండలరాయుడి చరిత్ర ఇక్కడే అంతం అయ్యిందన్నారు. నేను గమనించిన అంశం ఏమిటంటేబీ ఆ పెద్ద కొండ కింద అనేక చిన్న చిన్న గుహలు ఉన్నాయి. శత్రువులు దాడి చేసినప్పుడు ఆ గుహలల్లో పడి తప్పించుకొనిపోయేవాడు. తన తండ్రి ఖడ్గాన్ని ఆ గుహల్లోనే ఎక్కడ పాతి ఉంటాడో తెలియదు. ఆ గుహల్లోకి వెళ్ళలేని పరిస్థితి. ఆ ఖడ్గచాయలను కనుక్కోలేక పోయాను. మాకు అప్పటికే చీకటి పడుతుంది. అక్కడి నుంచి అనివార్యంగా రావలసి వచ్చింది. నాకొక విషయం తెలుస్తుందేమిటంటే... కొండలరాయుడు కేవలం 27 ఏండ్లు మాత్రమే జీవించాడు. అంత చిన్నతనంలో తన జీవనాన్ని, విజయాలను, వీర గాథలను తెలపాలనిబీ తరువాతి తరానికి సందేశం అందిచాలని ఆలోచన బహుశా అతనికి ఉండకపోవచ్చు. అతడు బతికున్నన్ని రోజులు పోరాటానికే సరిపోయింది. ఒక నడి వయసుకు వచ్చి గాని, సుదీర్ఘ కాలం జీవితం అనుభవిస్తే గాని ఇటువంటి ఆలోచనలు చేసి ఉండే వాడేమోనని నా అభిప్రాయం. రాతి శాసనాలు దొరకకపోవడానికి కారణం ఇది కావచ్చు.

ఊరపండగ సందర్భాన్ని పురస్కరించుకొని పరిశోధన చేస్తుండగా బల్మూరి కొండలరాయుడు మరియు భోగం సాని అలియాస్ చంద్రకళ కు సంబంధించిన మరి కొన్ని అద్భుతమైన, ఆసక్తి కరమైన విషయాలు తెలిశాయి. చరిత్రక ఆధారలతో మీ ముందుకు వస్తున్నాను.

ఇంతవరకు ఆయనకు సంబంధించిన రహస్య స్థావరాలే మనం కనుక్కోగలిగాం. ఇప్పుడు కొండల రాయుడి సమాధి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే ఉందంటే. నమ్మశక్యంగా అనిపించడం లేదు కదా ! ఇది నిజం. ప్రత్యక్షంగా అందరు చూడవచ్చు. దర్శించవచ్చు కూడా !!

బల్మూరు / బలదూర్ / బల్మూరి కొండలరాయుడు (1690-1720) నిజామాబాదులోని భీంగల్లు జాగీరును జయించదలచి పోరాటానికి సిద్ధమైతాడు. ఈ విషయం తెలుసుకున్న గోల్కొండ నవాబు కొండలరాయుడిని ఓడించడానికి భీంగల్లు నవాబుకు అత్యధిక, అధునాతన సైన్యాన్ని పంపిస్తాడు. అంత పెద్ద సైన్యంతో పోరాటం చేస్తూ ఉండగాబీ ఒకానొక సందర్భంలో తన అపజయాన్ని శంకించి, తన తండ్రి ఖడ్గాన్ని నేలపై పాతి, తన పిడి బాకుతో తానే పొడుచుకొని ఆత్మత్యాగం చేసుకుంటాడు...

ఆ ప్రదేశం నిజామాబాదు జిల్లాలోని భీంగల్లు మండలంలో గల పల్లికొండ గ్రామానికి దగ్గరలోని బాచనపల్లి సమీపంలో చిన్రోళ్ళు గుట్ట. ఈ ప్రదేశానికి సంబంధించిన చాయాచిత్రాలను గూర్చి, విశేషాంశాలను గూర్చి ఇంతకు ముందే మనం చర్చించుకున్నాం.

ఇది ఇలా ఉండగా నాకు అత్యంత సన్నిహితులు దత్తును కొండల రాయుడికి సంబంధించి అడిగితే ఆసక్తి

కరమైన విషయం ఒకటి బయటబడింది. అది కొండల రాయుడి సమాధి. ఆయనకు చెందిన ఇంకొక రహస్య స్థావరం కూడా తెలిసింది.

అందుకే ఈ రోజు (శనివారం20-07-2019) నేను (తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి డా. వి. త్రివేణి) మరియు ఊరపండగ సర్వ సమాజ్ సంఘం చైర్మన్ నిజామాబాద్ మాజీ ఎం ఎల్ ఏ శ్రీ యెండల లక్ష్మి నారాయణ గారు , ఇతర సభ్యులు కలిసి బయలు దేరినం. మాతో పాటు మడియా మిత్రులు, ఒక గన్ మెన్ కూడా ఉన్నారు. మా కారు చాలా వేగంగా వెళు ్ంది. నిజామాబాద్ నుంచి కామారెడ్డి సమీపంలో గల ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట సమీప ప్రాంతానికి చేరుకున్నాం.

వెల్లుట్ల పేట ఊరి చివరలో ఉన్న కొండయ్య గోరి (సమాధి) చూసే సరికి ఒక విధమైన ఆత్మత తృప్తి, దృఢ విశ్వాసం నా మనసులో కలిగింది. బల్మూరి కొండల రాయుడు వీరుడు, శౌర్యుడు, జాత్యభిమానం కలిగి అప్పటి గోల్కొండ నవాబుల పాలన అంతమొందింప జేసిబీ తెలంగాణ ప్రాంతానికి స్వేచ్చా వాయువులను అందించాలనే కాంక్ష కలిగిన వాడు. అటువంటి గొప్ప వ్యక్తి సమాధి వద్ద ఉన్నందుకు గర్వంగా అనిపించింది.

వెల్లుట్లపేటలోని కొండలరాయుడి స్థావర విశేషాంశాలు :

1. ఎల్లారెడ్డిమండలంలో వెల్లుట్ల పేట గ్రామం అవ తల (కొండయ్య గోరి) బల్మూరి కొండల రాయుడి సమాధి ఉంది.
2. ఆ సమాధి మూడు గద్దెల ఎత్తులో నాలుగు వైపుల సలపలతో నిలిపి చతురస్రాకారంలో ఉంది.
3. దాని మీద ఒక వైపు శంఖం, చక్రం, మధ్యలో మూడు నామాలా గుర్తులు ఉన్నాయి. ఇక మూడ వైపులా పువ్వు ఆకారంలో తొలచబడి ఉంది. దాని మీద కొన్ని అక్షరాల గుర్తులు ఉన్నాయి.
4. దానికి సమీపంలోనే ఒక బండకు ఆంజనేయుడి విగ్రహం తొలిచి ఉంది.
5. ఊరికి కొంత దూరంలో కొండన్న గుట్ట ఉంది. ఈ గుట్ట అయిదు ఊళ్ళ మధ్య ఉంది.
6. ఆ గుట్ట మీద సన్న సన్నని దోనెలు (గుహలు), ఆ దోనెలలో అనేక సొరంగాలు, అందులో కొంత దూరం వరకు ఉనకపొట్టు ఉందని,
7. ఒక బాయి, ఒక చింత చెట్టు, ఒక బురుజు, చిన్న చిన్న రోళ్లు కూడా ఉన్నాయనిబీ
8. ఒక బండకు కొండలరాయుడు గుర్రం ఎక్కి స్వారి చేస్తూ బల్లెం సందిస్తున్నట్టుగా తొలచబడి ఉందని ఆ ఊరి పెద్ద మనుషులు చెప్పారు.

భీంగల్లు లోని పల్లికొండ వద్దగల బాచనపల్లికి సమీపంలోని చిన్రోళ్ళ గుట్ట మీద వీర మరణం పొందిన కొండలరాయుడు కామారెడ్డి సమీపంలోని ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో అయన సమాధి దర్శనం అవుతుంది. ఇప్పటి వరకు అయన మరణం మీద అనేక సందేహాలు, అస్పష్ట చారిత్రక ఆధారాలతో ఉన్న మనం ఈ సమాధి చూసిన తరువాత ఆ అనుమానాలన్ని పటాపంచలు అయ్యాయి.

కొండల రాయుడి మరణం అక్కడ అయితే సమాధి ఇక్కడ ఉండటానికి కారణం మరి ఏమై ఉండవచ్చు !?

కొండలరాయుడు భీంగల్లు గుట్టల్లో వీరమరణం పొందిన తరువాత ఆ పార్థివ దేహం నవాబుల చేతికి చిక్క నీయకుండా ఆయన సహచరులు తీసుకొని వచ్చి వెల్లుట్లపేటలో అంతిమ సంస్కారాలు చేసి, సమాధి చేసినట్లు ఉన్నారు. ఆ అనుచరులే కొండయ్య గుట్ట మీద ఆయన ఆకారంలో కొండలరాయుడు గుర్రం ఎక్కి స్వారి చేస్తూ బల్లెం సంధిస్తున్న చిత్రాన్ని తొలిచి ఉంటారు.

ఇక ఉదయం నుంచి వర్షం పడుతుండటం వల్ల మేము కొండయ్య గోరిని దర్శించున్నాం. కాని కొండయ్య గుట్ట వద్దకు వెళ్ళలేక పోయాం. అప్పటికే సాయంత్రం

అయ్యింది. ఆకాశం మబ్బు పట్టింది. అక్కడి నుంచి వెనుదిరిగాం. మరొక్క సారి తప్పక వెళ్తాం.

ఏది ఏమైనా బల్మూరి కొండలరాయుడికి సంబంధించిన ఒక కీలక ఘట్టం బయటపడింది. చారిత్రక ఆధారానికి చెందిన ఆనవాళ్ళు నమ చేత్తుల్లో పడ్డాయి. ఇక ముందు పరిశోధన ఫలవంతం అవుతుందని ఆశిస్తున్నాను.

ఆధార గ్రంథాలు - జానపద కళా ప్రదర్శనలు :

1. కొండలరాయుడు 1690-1720 మధ్య కాలానికి చెందినవాడుగా వివిధ ప్రదేశాలు తిరిగి సమాచారం సేకరించిన ప్రముఖ సాహితీ పరిశోధకులు మలయశ్రీ గారి అభిప్రాయం.
2. మలయశ్రీ బల్మూరి కొండన్న కథ అనే చిన్న పుస్తకాన్ని రచించారు.
3. ఈ చిన్న పుస్తకాన్ని ఆధారంగా చేసుకొని పి.శ్రీనివాసరాజు ఒక పెద్ద నవలగా బల్మూరి కొండలరాయుడు కథను రచించాడు.
4. కొండలరాయుడు చరిత్ర మీద అనేక జానపద కళా ప్రదర్శన రూపకాలు వెలిసాయి.
5. సిరిసిల్లాకు చెందిన ఆడెపు గురువదాసు 1971లో ఈ కథను యక్షగానంగా వ్రాశాడు.
6. రెండు విభిన్న ప్రదేశాలకు చెందిన శారదగాండ్ర కథలను ఆధారంగా చేసుకొని డా॥ బిరుదురాజు, రామరాజు బల్మూరుకొండలరాయుడు కథను తన పరిశోధన గ్రంథమైన తెలుగు జానపద గేయ సాహిత్యం అనే పుస్తకంలో ప్రచురించారు.

   ఒకటి ఏప్రిల్ 1954లో ఓరుగల్లు మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన వెంకట్రావు చెప్పిన కథ. మరొకటి మార్చి 1954లో రాత్రి హైదరాబాదు నగరంలో కప్పెరామయ్య, అతని భార్య ఎల్లమ్మ చెప్పిన కథ.
7. డా॥ నాయిని కృష్ణ కుమారి కూడా జానపద చారిత్రక గేయములలో బల్మూరి కొండల రాయుడి కథను తెలియపరిచారు.
8. మా గురువు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య టి.కిషన్ రావు నా పరిశోధనకు మూల కారకులుగా నిలిచారు. బల్మూరి కొండల రాయుడి గూర్చి కీలక అంశాలను తెలియజేశారు.
9. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగుశాఖ కామారెడ్డిలోని విశ్రాంత అధ్యాపకులు డా॥ చాట్ల నర్సయ్య కొంత సమాచారాన్ని అందించారు.

❖ ❖ ❖

తెలుగు జాతీయాలలో జంట పదాలు – విశ్లేషణ

– తోట వెంకటస్వామి, సహాయ సంపాదకులు, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

జాతీయం :

తెలుగులో 'జాతీయం' అన్న పదానికి ఇంగ్లీషులో 'ఇడియం' అంటారు. జాతీయం అంటే జాతి వాడుకలో రూపుదిద్దుకొన్న భాషా విశేషం. ఒక జాతీయంలో ఉన్న పదాల అర్థాన్ని ఉన్నది ఉన్నట్లుగా పరిశీలిస్తే వచ్చే అర్థం వేరు, ఆ పదాల పొందికతో వచ్చే జాతీయానికి ఉండే అర్థం వేరు. ఉదా॥ ''చేతికి ఎముక లేదు'' అన్న జాతీయంలో ఉన్న పదాలకు నిఘంటుపరంగా చూస్తే 'ఎముకలేని చెయ్యి అంటే కేవలం కండరాలు మాత్రమే కలిగినది' అని అర్థం వస్తుంది. కాని ఈ జాతీయానికి అర్థం ''ధారాళంగా దానమిచ్చే మనిషి'' అని అర్థం. జాతీయాలు ఒక జాతి ప్రజల సంభాషణలో స్థిరపడి పోయిన కొన్ని నానుడులు. మనిషి జీవితంలో కంటికి కనిపించేది, అనుభవంలోకి వచ్చేది, అనుభూతిని కలిగించేది ఇలా ప్రతి దాని నుంచి జాతీయాలు పుట్టుకొస్తూనే ఉంటాయి.

జాన్ సయీద్ అనే భాషాశాస్త్రవేత్త చెప్పినట్లుగా "Idiom as words collocated together happen to become fossilized, becoming fixed over time" అంటే తరతరాల వాడుకవలన భాషలో కొన్ని పదాల వాడుక శిలావశేషంగా మారి కాలక్రమేణ స్థిరపడుతుంది. కనుక భాషతో పరిచయం ఉన్న వారికే ఆ భాషలో ఉన్న జాతీయం అర్థమవుతుంది. ''నీళ్ళోసుకోవడం'', ''అరి కాలిమంట నెత్తికెక్కడం'' వంటి వాటిని జాతీయాలుగా చెప్పవచ్చు. జాతీయాలను సంస్కృతికి అద్దం పట్టే భాషా రూపాలు అనవచ్చు. సామాన్యంగా జాతీయాలను పనిగట్టుకొని ఎవరూ పుట్టించరు. అలా పుట్టించినా అవి కలకాలం ప్రజల నోళ్ళలో ఉండవు. జాతీయాలు ఒక భాషలో సహజంగా పుట్టి ప్రజల నోళ్ళలో నానుతుంటాయి. తరతరాలుగా అలా వాడుకలో ఉంటూనే ఉంటాయి.

కొన్ని జాతీయాలను సామెతగాను, సామెతలను జాతీయాలగాను పేర్కొన్న సందర్భాలున్నాయి. నిజానికి ఈ రెండు వేరు వేరు. సామెతలోని అర్థం సంపూర్ణం. ఉదా॥ ''అత్తలేని కోడలుత్తమురాలు-కోడలులేని అత్త గుణవంతురాలు'', ''తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం'' వీటిలో అర్థం సంపూర్ణం. దాన్ని అన్వయించడంలో కొంత తేడా కనబడుతుంది. జాతీయాలలో అర్థం అసంపూర్ణం. సగం వాక్యమే ఉంటుంది. ఉదా॥ 'కడతేర్చాడు', 'కడుపు మంట', 'పంట పండింది' ఇలా ఉంటాయి. పైగా వీటి నిజార్థాలు వేరుగా ఉంటాయి. వేరొక అర్థంలో వీటిని వాడుతుంటారు. ఉదా॥ 'పంట పండింది' అంటే అతడు వేసిన పండ పండిందని కాదు. అతడొక గొప్ప విజయం సాధించాడని అర్థం. 'పప్పులో కాలేశాడు' అంటే నిజంగా పప్పులో కాలేశాడని కాదు. అంటే 'పొరబడ్డాడు' అని అర్థం. ఇంతటి గూఢార్థమున్న జాతీయాలు సామాన్య మానవులు, నిరక్షరాస్యులకు సైతం అర్థం అయి వారి చేతే ఎక్కువగా వాడుబడుతుంటాయి. అందుకే జాతీయాలు ఆ భాషకు ఆభరణాలు అని చెప్పవచ్చు.

జంట పదాలు :

తెలుగు భాషలో జంట పదాలు అనేకం ఉన్నాయి. ఇవి కొన్ని ద్వంద్వ సమాసాలు. 'ఇల్లు వాకిలి', 'కట్టు బొట్టు', 'తోడు నీడ', 'పని పాట' మొదలైనవి. ఇవి శుద్ధంగా ద్వంద్వ సమాసాలు అనడం కన్నా జంట పదాలు గానే పలుకుబడిలో ఉన్నాయి. ఎందుకంటే ఈ తెలుగు పదాలు సాధారణంగా వ్యస్తంగా కంటే సమస్తంగా ప్రయోగించటం విశేషం. తెలుగువాళ్ళు వీటిని జంట పదాలుగానే వాడతారు. ఈ జంట పదాలలో కొన్ని, రెండో పదం కూడా మొదటి పదం యొక్క అర్థాన్నే ఇస్తూ మొదటి పదానికి వత్తాసుగా అంటే ఊతంగా నిలబడుతుంది.

ఉదా॥ 'సిగ్గు సెరము', 'ముసలి ముతక' మొదలైనవి ఇవి జంటపదాలలో భాగమే. అందుకే జంటపదాలను ద్వంద్వ సమాసాలానుంచి వేరు చేసి చెప్పడం జరుగు తోంది.

అలానే పరస్పర సన్నిహిత సంబంధం కలవి (ఇల్లు వాకిలి) జంటపదాలైతే, సమానార్థక పదాలు ఊత పదాలవుతాయి. ఇవి కాక మొదలైనవి, తత్సంబంధ మైనవి అనే తాత్పర్యార్థంలో వచ్చే జంట పదాలు కొన్ని ఉన్నాయి. ఉదా॥ 'పురుగు పుట్ర', 'నగ నట్ర', 'కూర నార' మొదలైనవి వీటిని కూడా ఊతపదాలుగానే పేర్కొనవచ్చు. మరికొన్ని పరస్పర విరుద్ధమైనవి కూడా ఉన్నాయి. ఉదా॥ 'పెళ్ళి పెటాకులు', 'హీనం మానం', 'నీళ్ళు నిప్పులు' మొదలైనవి. జంట పదాలలో ముఖ్యంగా రెండో పదం యొక్క అర్థం కాలక్రమంలో మరుగున పడిపోతున్నది. వాటి సహజ స్వభావం తెలియక, వ్యుత్పత్తి బోధపడక అర్థసామ్యం గుర్తురాక ఊతపదాలు చాలాభాగం వ్యర్థంగా ఉపయోగించబడుతున్నాయి.

తెలుగు జాతీయాలలో జంటపదాలు :

అక్కన్న మాదన్నలు :

గోల్కొండ తానీషా దగ్గర ఒకరు మంత్రిగా, మరొకరు సేనాపతిగా ఉన్న అక్కన్న మాదన్నలు స్నేహానికి ప్రతీకలు. జంట కవుల్లా కలిసిమెలిసి ఉండేవారు కాబట్టి అలా సన్నిహిత మైత్రితో ఉండే ఏ ఇద్దరినయినా చూసినప్పుడు వాళ్ళు అక్కన్న మాదన్నల్లా ఉన్నారనటం పరిపాటి అయింది. వీరిద్దరూ చరిత్రకెక్కిన వ్యక్తులే. వారిలా జీవితాంతం స్నేహం చెడకుండా అన్యోన్యంగా ఉండే వాళ్లు చాలా అరుదు. స్నేహం చేయటానికి అలనాటి శ్రీరామ సుగ్రీవుల్లా ఒక తంతు నడవటం ఇంకా కళింగ ప్రాంతంలో నిలిచింది. దాన్ని 'నేస్తం కట్టడ' మంటారు. అలా నేస్తం కట్టినవాళ్లు కుటుంబ మిత్రులై జీవితాంతం ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ ఉండటం ఆనవాయితీ.

అన్నదీక్ష అక్షరదీక్ష :

పూర్వం గురుకులాశ్రమాల్లో విద్యార్థులకు అన్నంపెట్టి, గుడ్డలిచ్చి, తలదాచుకొనే ఆశ్రయమిచ్చి, చదువు నేర్పి పంపేవాళ్లు. అలా ఆశ్రమాలు నిర్వహించే గురువులను వెతుక్కుంటూ విద్యార్థులు అనువైన స్థలం, గురువూ దొరికేదాకా దేశ సంచారం చేసేవాళ్లు. అలా ఏదో ఒక ఆశ్రమానికి చేరిన ఒక విద్యార్థివీరుడు నిద్రలేచినప్పటి నుంచి తిండివేళ కోసం చాలా శ్రద్ధగా కనిపెట్టుకొని ఉండేవాడట. చదువు దగ్గరకు వచ్చేసరికి ఆవలింతలు, పక్కచూపులు వగైరా అనేక భంగిమలు ప్రదర్శించేవాడు. అలాంటివాళ్ళు ఇప్పుడూ ఉన్నారు, ఎప్పుడూ ఉంటారు. అటువంటి వాళ్ళ దీక్షంతా అన్న సంపాదన మీదనేగాని అక్షర సంపాదన మీద ఉండదు. చదువు మీదకన్నా ఏదో విధంగా ఈ విద్యాసంస్థనుంచి బయటపడి ఎలాగో ఒకలాగు అన్న వస్త్రాలు సంపాదించుకోవాలనుకొనే వాళ్లు అన్నదీక్షాపరులు. చదువు పూర్తి అయిన తరువాత ఉపాధి దొరుకుతుందా లేదా అన్న విచారం లేకుండా విద్యార్జనే ధ్యేయంగా పెట్టుకొనేవాళ్లు అక్షర దీక్షాపరులు. గురుకులాల్లోని విద్యార్థుల చదువు పూర్తికావచ్చే సమయంలో వారికి చదువు ఒంటపట్టిందో, సంపాదనా లోచనే ఉందో తెలుసుకోవడానికి గృహస్థులు గురువులను ప్రశ్నించేవాళ్లు విద్యార్థి ప్రగతిని గురించి. మీ వాడికి అన్న దీక్ష ఉందనో, అక్షరదీక్ష ఉందనో ఉపాధ్యాయులు చెప్పేవాళ్లు - వేరే సర్టిఫికెట్లు రాసి ఇవ్వకుండా. అప్పటి మాట ఇది.

అయోధ్య, సయోధ్య :

అయోధ్య అనే మాటకు ఇరులు జయించటానికి వీలుగాని (కోటలాంటి) దని అర్థం. సయోధ్య అనే మాటకు సంస్కృత సాహిత్యంలో ప్రయోగం కనిపించదు గాని సయి (సమానమైన) ఒద్ద (చేరిక) అనే అర్థాన్ని కొన్ని తెలుగు నిఘంటువులిస్తున్నాయి. ఈ రెండు మాటలూ కలిసి సయ్యోద్ధ/సయ్యోద్ధి అనే రూపం పొందాయని, ఆ సమాసానికి సాన్నిహిత్యం, స్నేహమని అర్థాలనీ చెప్తారు.

అయోధ్యా శబ్దంతో దీనికి రూపసాదృశ్యం కల్పించి, సంస్కృతంలా భావించి, 'ద్య'కారానికి ఒక ఒత్తు పెట్టి సయోధ్య అనే రూపం కలిగించారు. ఇవి తెలుగునాటి రాజకీయాల్లో, అందులోనూ రాజకీయాల్లో - నీలం సంజీవరెడ్డి, కాను బ్రహ్మానందరెడ్డిగార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిత్వం కోసం పోటీపడ్డప్పుడు - బాగా వాడుకలోకి వచ్చిన జంటమాటలయినాయి. ఒక వర్గంవారు 'అయోధ్య' అంటే పోరాటం వద్దంటే - మరో వర్గంవారు సయోధ్య - అంటే స్నేహంగా ఉందామంటూ ఉభయపక్షాలూ నాయకత్వం కోసం పోరాడినప్పటి మాటలివి. ఫలితంలో సయోధ్య అంటే స్నేహమనీ, అయోధ్య అంటే శత్రుత్వమనీ నూతనార్థాలు వచ్చి చేరాయి. మూలార్థం ఒకటయితే వాడుకలో నిలిచిన అర్థాలు వేరు. ఒక పదం సంస్కృతం నుంచి తెలుగులోకి ఎరవుగా వచ్చిందయితే, రెండోది తెలుగునుంచి సంస్కృతీకరించిన మాట. భాషల్లో ఇలాంటి రూపభేద, అర్థభేదాలు ఏర్పడుతుండటం వింతేమీ కాదు.

ఉత్తరాషాఢ పూర్వాషాఢలు :

ఇవి రెండూ నక్షత్రాలు. ఒంటిగా మినుకు మినుకు మనే చుక్క తార. అలాంటి తారల సమూహం నక్షత్రం. జ్యోతిషంలో వీటి స్థానమేదైనా నిత్యజీవితంలో మానవులకు స్పష్టంగా వీటివల్ల లాభనష్టాలు రెండూ లేవు. అయితే, నక్షత్ర పరిగణనలో ఇవి పూర్వాషాఢ, ఉత్తరాషాఢాలుగా పక్కపక్కన వస్తాయి. మనిషికి వచ్చే కొన్ని రుగ్మతలు ఇలా జంటగా వస్తుంటాయి. అలాంటి సందర్భాన్ని పురస్కరించుకొని ఆ రోగాలకూ ఈ నక్షత్రాలకూ ముడివేశారు. వాంతులూ విరేచనాలూ సాధారణంగా అజీర్ణవ్యాధిలో భాగంగా వస్తాయి. ఆ రెంటిలో ఏదో ఒకటి మాత్రమే వస్తే అంత ప్రమాదం లేకపోవచ్చుగాని ఆ రెండూ కలిసివస్తే అది తీవ్రవ్యాధికిందే లెక్క. 'కరోనా'లో ఈ జంట బాధలు తప్పవు. కొన్ని శరీర భాగాలనూ, జబ్బులనూ ప్రస్తావించటం సఖ్యంగా ఉండదని డొంక తిరుగుడుగా చెప్పటం ఆచారమయింది. అటువంటిది వాంతులనూ విరేచనాలనూ పూర్వాషాఢ, ఉత్తరాషాఢలని పిలవటం. కొందరు 'జబ్బు చేసిందట గదా?' అని అడిగితేనే 'తప్పు' పడతారు. 'రోగం వచ్చిందా?' అంటే తిట్టు కింద లెక్క. అందుకని అక్షరాలను/ధ్వనులను వ్యత్యయం చేసి, ''ఇటీవల గోరంగా ఉన్నారన్నారు. ఇప్పుడు కులాసాయే కదా?'' అని సుకుమారంగా అడగటం పరిపాటి- రోగాన్ని గోరంగా మార్చి. అలా అడిగితే తప్పులేదన్నమాట. సంస్కృత గ్రంథాలు చంకన పెట్టి మాత్ర సంచితో తిరుగులాడే పూర్వకాలపు ఆయుర్వేద వైద్యుల్లో ఎవరో ఈ నక్షత్రాల పేరిట ఈ రోగాలను పిలిచి వుంటాడు. అందుకు జ్యోతిషజ్ఞానం కూడా తోడ్పడిందేమో తెలీదు.

కరటక దమనకులు :

''తోడుదొంగలు'' అనే అర్థంలో ఈ మాటను తెలుగులో వాడుతుంటాం. పంచతంత్రంలోని జంతు పాత్ర లివి. నక్కలు. చిన్నయసూరి నీతిచంద్రికలో ఇవి ఎంతో స్నేహంగా ఉన్న సంజీవకమనే ఎద్దునూ పింగళకమనే సింహాన్ని విడదీయగలుగుతాయి. పైకి ఒకరు వద్దంటే రెండోవారు కాదంటూ నటించినా ఉభయులకూ లక్ష్య మొక్కటే - మిత్రభేదం సాధించటం. మాయ మాటల్తో చాపకిందనీరులాగా స్వప్రయోజన దృష్టి పెట్టుకొని స్నేహం చెరిచినవాళ్లు కరటక దమనకులు. పైకి ఒకరికొకరి మాటలకు పొంతన లేనట్లుంటుంది. కాని, ఇద్దరూ కలసికట్టుగా సాధించదలచింది నెరవేర్చుకోగలుగుతారు. అందువల్ల మోసగాళ్లను, అభిప్రాయభేదం కలిగించేవాళ్ళను, తోడుదొంగలనూ కరటక దమనకులని వ్యవహరిస్తుంటాం.

గజగర్భం - గాంధారిగర్భం :

ప్రాణాంతకం కాకపోయినా బహుకాలం గర్భవతిగా ఉంటే 'గజగర్భ'మంటారు. ఏనుగు చాలాకాలం బిడ్డను మోసికాని కనదనే నమ్మకంతో లెక్క తప్పగా వేసుకొని ప్రసవ సమయం పదినెలలకు పైకాలానికిగాని రాకపోతే 'ఆయమ్మ గాంధారిలా మోస్తున్న'దని బుగ్గమీద

వేలేసుకుంటుంటారు. గాంధారికన్నా ముందే కశ్యపుడి భార్య వినత చాలాకాలం కడుపులో మోసి చివరికి రెండు గుడ్లు పెట్టిందని, ఒకదాన్ని తొందరపడి చిదిమితే కాళ్లులేని 'అనూరుడు' జన్మించి రెండో గుడ్డును అలా తొందరపాటు లేకుండా కాపాడితే మహాబలవంతుడు జన్మిస్తాడని చెప్పి, తాను సూర్యుడి రథానికి సారథిగా వెళ్ళాడనీ పురాణకథ. రెండో అండం నుంచి పుట్టినవాడే గరుత్మంతుడు. అతడు విష్ణువుకు వాహనమైనాడు. ఆ తల్లి కన్నబిడ్డలిద్దరూ రథసారథిగానూ, రథంగానూ బతికారు. అయితే, వినత విషయం కథగానే మిగిలి పోయిందిగాని జాతీయం కాలేదు. గాంధారి గర్భం 'దీర్ఘకాలిక'మనే అర్థంలో వాడుక కెక్కింది. అలాగే ఎన్నాళ్లకూ తేలని విషయాన్ని 'గాంధారి గుడ్డు' అని కూడా వ్యవహరించటం మొదలయింది. అదే విధంగా ఎన్నటికో గాని తేలనిదాన్ని కూడా 'గజగర్భ'మని వ్యవహరిస్తుంటారు.

గొడ్రాలు - గొడ్డుమోతు :

మొదటి మాటకు గొడ్డురాలు అనే రూపాంతరముంది. రెండోమాటకు గొడ్డుబోతు అనే రూపభేదముంది. ఆలు స్త్రీవాచకం, పోతు పురుష వాచకం. ఈ రెంటికీ సంతానం లేనివాళ్లనే అర్థం. గొడ్డు శబ్దానికి 'సంతులేని' అనే విశేషణార్థం ఎలా వచ్చిందో తెలీదు. కానీ వచ్చింది. పెద్దలు నిస్సంతు అనే భావానికి ప్రకృతి పరిశీలన జ్ఞానంతో అర్థవిస్తృతి సాధించారు. అప్పట్లో 'అష్టపుత్ర బహుధానావాప్తి రస్తు' (కనీసం) ఎనిమిది మంది పిల్లలను కనమని ఆశీర్వదించేవాళ్లు. ఆ కాలంలోనే 'కోడలు కంటానంటే అత్తవద్దంటుందా?' అనే సామెత కూడా పుట్టింది. ఆ దృష్టితోనే 'కాక వంధ్య, కదళీవంధ్య' అనే మాటలు పుట్టించారు. వంధ్య అంటే గొడ్రాలు. గొడ్రాలితనంలో మరి రెండు రకాలు తేల్చారన్నమాట. ఆ మాటకు ఒక్క బిడ్డను మాత్రమే కన్న గొడ్రాలని అర్థం! కాకి ఒక్క గుడ్డు మాత్రమే పెడ్తుందేమో - జంతుశాస్త్రజ్ఞులో పక్షిశాస్త్రజ్ఞులో చెప్పాలి. కదళి అంటే అరటి. సాధారణంగా పిలక పుట్టగానే అరటిచెట్టు కొట్టివేస్తారు అలా చేయకపోతే మరో పిలక పుట్టి అంతటితో వంశ విస్తరణ ఆగిపోతుందేమో - అంతకన్నా తెలీదు. అయితే, ఇద్దరు పిల్లలను మాత్రమే కన్న స్త్రీని కదళీవంధ్య అనేవాళ్లు. లోక ప్రవాదంలో మాత్రం అరటిచెట్టు పిలక పుట్టగానే చస్తుందని ఉంది. అరటి చెట్టుకు మరో ప్రయోజనం కూడా ఉండేది పాత కాలంలో. బాలింత చూలింత చావులు విపరీతంగా ఉన్న రోజుల్లో పిల్లల కోసం ఒక భార్య చనిపోగానే మరొ కరిని పెళ్ళాడే దుస్సంప్రదాయం ఉండేది. ఆరుగురు భార్యలు వరస వెంట చనిపోతే ఏడో పెళ్ళి చేసుకొనే మగవాడి చేత అరటిచెట్టుకు తాళి కట్టించేవాళ్ళు! తరువాత పెళ్ళి కూతురి మెడకు కట్టించేవాళ్ళు. సుప్రసిద్ధ తెలుగు కవి వడ్డాది సుబ్బారాయుడుగారు (భక్తచింతామణీ శతకర్త) అరటిచెట్టుకు తాళిగట్టిన అభాగ్యుణ్ణని చెప్పి వాపోయారు! ఈ ఏడో భార్య కదళీవంధ్య కావాలనే ఉద్దేశం ఉండేదేమో తెలీదు. కాలంతోబాటు సమాజ ధర్మం మారుతుంది. కాబట్టి ప్రస్తుతం 'ఒక్కరైతే ముద్దు ఇద్దరైతే హద్దు' అనే నినాదం ఇద్దరితో సరిపెట్టుకొమ్మని మారినట్లు, భవిష్యత్తులో కాకవంధ్యత్వందాకా పరిమితం కాదని చెప్పలేం.

రేచుక్క పగటిచుక్క :

రేచుక్క అనే దొంగ రాత్రులే (రే/రేయి-రాత్రి) దొంగతనం చేసేవాడు. పగటిచుక్క పట్టపగలే దొంగిలించే వాడు. ఈ ఇద్దరు దొంగలూ చేసిన ఘన కార్యాలను వర్ణిస్తూ కథలు పుట్టాయి. ఒకర్ని మించిన మరొకరు దొంగలవడానికి 'వాడు రేచుక్క అయితే వీడు పగటి చుక్క' లాంటి వాక్యాలతో మెచ్చుకుంటారు. 'చుక్క' అన్న మాట 'శుక్ర' శబ్ద భావం. బుద్ధికి బృహస్పతి అన్నట్లు రాక్షస గురువైన శుక్రుడు నీతికీ తెలివితేటలకూ పేరుమోసినవాడు. అంత వాడి పేరును ఘరానా దొంగలకు తగిలించి అనందించే ఘనత మన తెలుగు వాళ్లదే.

విడుపు శృంగారం - ముడుపు శృంగారం :

తెలుగులో ఒక సామెత వుంది. 'ఇల్లు వెళ్లగొడ్తే విడుపు

శృంగారం, మొగుడు వెళ్లగొడ్తే ముడుపు శృంగారం' అని. విడుపు అంటే విడుదల, విముక్తి, స్వేచ్ఛ. ముడుపు అంటే సొమ్ము, అలంకారం. తనంతట తాను భర్తనూ ఇంటినీ వదిలిపెట్టి బజారున పడితే అప్పుడు స్వతంత్రంగా శృంగారమయ జీవితం గడపవచ్చు. పెళ్లాడిన భర్త ఇంట్లోంచి వెళ్లగొడితే అప్పుడు భుక్తికోసం కూడా డబ్బు తీసుకొని, అలంకరించుకొని వ్యభిచరించవచ్చు. ఇలాగని ఓ ఇల్లాలు భావించిందని సామెత వెక్కిరింపు. భర్త చాటున తిరిగితే విడుపు శృంగారం, బహిరంగంగా తిరిగితే ముడుపు శృంగారం. ఇది చాటుమాటు వ్యవహారమయితే విడుపనీ (తాత్కాలికంగా కొంత సమయం లభించిన స్వేచ్ఛ అనీ), నిర్భయంగా బహిరంగంగా సాగిస్తే ముడు పనీ (డబ్బుకోసమనీ) తాత్పర్యం. ఈ సామెతలోని మాట లను విడిగా తీసి, డబ్బు కోసమా? కాదా? అనే వివరం కోనం 'విడుపా? ముడుపా?' అని గూఢంగా ప్రస్తావిస్తుంటారు.

హేమాహేమీలు :

హేమ, హేముడు అనే కవలలను కలిసి ఈ పేరుతో ద్వంద్వ సమాసంగా వ్యవహరిస్తున్నారు. ఈ మాటకు 'హేమాహేమీలు', 'హేమాహేములు' అనే రూపాంతరా లను కోశాలు గ్రహించాయి. 'అతనుడు, అధికుడు, అధికృత్యుడు, ఉదాత్తుడు, ఉదారుడు, కైవల్యుడు, ఘనుడు' అనే ఏడు రకాల వ్యక్తులు హేమాహేమీలని ఆంధ్రవాచస్పత్యం చెబుతున్నది. ఆ మాటలకే అచ్చతెలుగు రూపాలుగా 'అక్కజుడు, గఱుప, గొప్ప వాడు, పెద్ద, ప్రేపుడు, మిండడు, మిక్కిలివాడు, వెగ్గలీడు' అనే పదాలను ఆ నిఘంటువు చెప్తుంది. ఏ విధంగా నయినా సమర్థులైన, ఏ విద్యలోనయినా ప్రసిద్ధులయిన వ్యక్తులను హేమాహేమీలంటారు.

ముగింపు :

తెలుగులో జాతీయాలుగా ప్రయోగంలో ఉన్న పదాల్లో పదబంధాల్లో చాలాభాగం ఏదో ఒక కులాన్నో వంశాన్నో ఊరినో వృత్తినో ఏద్దేవచేస్తూ ఎవరో ఏనాడో సృష్టించగా తరతరాలుగా ఇతరులు ఆమోదంతోనో, ఆక్షేపణకోసమో, తాత్కాలిక ప్రయోజనం కోసమో వాడుకలో పెట్టినవే. ఒక వ్యక్తి, ఒక వృత్తి, ఒక కులం, ఒక మతం, ఒక ప్రాంతం కనబరిచే బలహీనతలనూ ప్రత్యేకతలనూ ఇవి బహిరంగ పరుస్తాయి. వీటిని నిందార్థంలో వాడరు. చెప్పే విషయం శ్రోత మనసులో హత్తుకపోయేట్లుండాలంటే వీటి ప్రయోగం అవసరం. వీటిని సరైన అర్థంలో సకారణంగా ఉపయోగించాలంటే 'లోకజ్ఞానం' అవసరం. వీటిలోని ఆక్షేపణలను సద్విమర్శలుగా, చమత్కార ప్రసంగాలుగా గ్రహింగలగటం ప్రయోక్తల, శ్రోతల హృదయ వైశాల్యానికీ లోకజ్ఞతకూ, సరసభావాలకూ నిదర్శనం.

ఆధార గ్రంథాలు :

1. కృష్ణారావు, నాళము. (సం.) తెలుగు జాతీయములు. తెనాలి: లక్ష్మీ గ్రంథ మండలి (1940)
2. గంగాధరం, నేదునూరి (సంకలనం) పసిడి పలుకులు. మద్రాసు: జాతీయ జ్ఞానమందిరం (1960)
3. రాధాకృష్ణ, బూదరాజు. తెలుగు జాతీయాలు. హైదరాబాద్: ప్రగతి పబ్లిషర్స్. (2009)
4. Saeed, John I. ***Semantics***. Oxford: Blackwell. (2003)

❖ ❖ ❖

ప్రపంచీకరణ నేపథ్యంలో జానపద కళలు

– అరసఖిల్లి మోహనరావు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

గ్లోబలైజేషన్ అనే ఈ ఆంగ్ల పదానికి తెలుగులో ప్రపంచీకరణ అనే మాటను సమానార్థకంగా ఉప యోగిస్తున్నారు. ఈ రోజుల్లో ప్రపంచీకరణ అనేది అందరినోట వినిపిస్తున్న సామాన్యమైన పదం ఈనాడు ప్రపంచీకరణ అన్నది ఏ ఒక్క అంశానికి పరిమితమై లేదు. ఆర్థిక రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలన్ని ఈ ప్రభావానికి గురౌతున్నాయి.

ప్రపంచం కుగ్రామం అయిపోయింది. ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సాంకేతిక అభివృద్ధితో ప్రపంచం చిన్నది అయిపోయింది. అయితే ప్రపంచీకరణను ప్రపంచదేశాలు ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రథమంలో స్వాగతించిన తర్వాత ఆచరణలో దాని స్వభావం తెలియగానే దాన్నీ వ్యతిరేకిస్తున్నాయి. ప్రపంచీకరణ వల్ల ప్రపంచం కుగ్రామం అవ్వడం, సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ ఉన్న దశలో దాన్ని వ్యతిరేకించడం జరుగుతుంది. ప్రపంచం కుగ్రామంగా, ఏకంగా మారడం మంచిదైనప్పుడు వ్యతిరేకించడం ఎందుకు? అయితే ఇది వ్యాపార, ఎగుమతుల, దిగుమతుల సాంకేతిక యంత్రాల విషయంలోనే గాని మానవుల ప్రేమ, అనుబంధాలకు సంబంధించిన విషయాల్లో కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచీకరణ వస్తువులు-వస్తువులు దగ్గర అవ్వడం, మనిషి-మనిషి దూరం అవ్వడం. ఈ పరిణామంను నేడు మనం స్పష్టంగా గమనించవచ్చు.

ప్రపంచీకరణ మూలాలు :

ప్రపంచీకరణ 20వ శతాబ్దంలో మొదలైందని చెబుతున్నప్పటికి అందులో వాస్తవం లేదు. నిజానికి ప్రపంచీకరణ 15వ శతాబ్దంలోనే మొదలైంది. అయితే అది దేశాలకు ఆక్రమించడం, వలస విధానం, వలస దేశాల సామ్రాజ్యవాద రూపంలో ఉన్న ప్రపంచీకరణ అనేక దశలను దాటుతూ నేడు మనం చెప్పుకుంటున్న నయా ఉదరవాద దశకు చేరుకుంది. ప్రపంచీకరణ వల్ల దుష్పరిణామాలే ఎక్కువని, ప్రపంచీకరణ అంటే అమెరీకీకరణ, డాలరీకరణ అని కొందరు మేధావులు అభిప్రాయ పడుతున్నారు.

నిర్వచనం :

ప్రపంచీకరణ ఎప్పుడు మొదలైంది అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లే ప్రపంచీకరణ నిర్వచనాన్ని అనేక మంది అనేక రకాలుగా నిర్వచించారు.

1. "అంక్షలు లేని వెసులుబాటు, విశ్వ స్వేచ్ఛా వ్యాపారం, ఎల్లలు దాటి వ్యాపించడాన్ని ప్రపంచీకరణ" అని ఒకరు నిర్వచిస్తే.
2. "పెట్టుబడిదారి అభివృద్ధి యొక్క వస్తుగత నియమమే ప్రపంచీకరణ". అభివృద్ధి చెందుతున్న దేశాలను తిరిగి ఆర్థిక వలసలుగా మార్చడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించిన బ్లూప్రింటే ప్రపంచీకరణ"
3. "గతంలో సామ్రాజ్యవాదంగా ఉండేది. నేడు ప్రపంచీకరణగా మారింది".

జానపద కళలు ప్రపంచీకరణ :

ప్రపంచీకరణ అన్ని రంగాల మీద దాన్ని దుష్పరిణామాన్ని చూపిస్తున్న ప్రస్తుత కాలంలో స్థానిక సంస్కృతి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాల్లో అనేక మార్పులు సంభవించాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో జానపదకళలు కూడా విధ్వంసానికి గురౌతున్నాయి. భారతదేశంలో ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతికి క్రమక్రమంగా లోనౌతూ తమదైన సంస్కృతిని ప్రజలు కోల్పోతున్నారు.

జానపదం :

జనపదం అంటే ఎక్కువ మంది గ్రామం అనే అర్థాన్ని

చెబుతున్నారు. ఆంగ్లంలో జానపదాన్ని "Folk" అని, జానపద విజ్ఞానాన్ని "Folklore" అని అంటారు. థామస్ అనే అతడు ఈ పదాన్ని సృష్టించాడు. "Folk lore" అనే పదాన్ని కొందరు "Folk life" అని పిలుస్తున్నారు.

నిర్వచనం :

1. "జానపద విజ్ఞానాన్ని శాబ్ధిక కళ లేదా వాగ్రూప కళ అని Willian, Bas com అన్నారు".

జానపద విజ్ఞానం అంటే మౌఖిక ప్రచారంలో ఉన్న పురాణాలు, ఐతిహ్యాలు, గేయాలు, కథలు, సామెతలు మొదలైనవన్నీ చేరతాయి.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల అనేక ఆదివాసీ, గిరిజన, సాంప్రదాయాలు ధ్వంసం అయ్యాయి, అవుతున్నాయి. అవుతాయి. ఇలాంటి తరుణంలో మనం మనదైన సంస్కృతిని, మనదైన ఆచార సాంప్రదాయాలు, కళలను రక్షించుకోవలసిన అవసరం ఉంది.

జానపద కళలు :

జానపద కళలను ముఖ్యంగా 1. గాత్ర సంబంధ మైనవి. 2. వాద్య సంబందమైన కళలుగా విభజించవచ్చు. అయితే కొందరు దృశ్యకథలు లేదా నృత్యకళలు అని కూడా విభజిస్తున్నారు.

పనిపాట :

ఈ మాట తెలుగులో వినిపించే అతి సామాన్యమైన మాట. పనిపాట అన ఈ మాటతో పనికి పాటకి మధ్య ఉన్న సంబంధం తెలుస్తుంది. జానపదులు పనిచేస్తున్న ప్పుడు తమ శ్రమను మరచిపోవడం కోసం అనేక పాటలు పాడుకునేవారు. అయితే సాంకేతిక అభివృద్ధి వల్ల ప్రతిపని యంత్రాలతో సులభంగా నేడు చేయగల్గుతున్నాం. నేడు పనిలేదు కాబట్టి పాటలేదు. పూర్వం కపిలపాటలని, నాట్లు వేసేటప్పుడు పాడుకునే పాటలు ఇలా అనేకం ఉండేవి. నేడు యంత్రాల రాకతో అవి కనుమరు గయ్యాయి. ఇలాంటి సమయంలో మనం మన కళలను ప్రపంచీకరణ ప్రభావం నుండి కాపాడుకోవాలి. ఒకప్పుడు జానపద కళలు మన కర్మకాండల్లో మతాచారాల్లో, సంస్కృతిలో భాగంగా పుట్టినవే. వీటిని రక్షించుకోవడం మన కనీస బాధ్యత.

ఇటీవల టి.వి.లు, సీరియళ్ళు, ప్రజాజీవితంపై విషం చిమ్ముతున్నాయి. దీని వల్ల పల్లెల సంస్కృతి తలక్రిందులై పోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వినోద సాధనాలుగా ఉన్న జానపదకళలు ప్రజలకు దూరమై, కనుమరుగౌ తున్నాయి.

కళలు అలసిన మనిషికి విశ్రాంతిని, ఒత్తిడిలో ఉన్న మనిషికి శాంతిని, వినోదాన్ని అందిస్తాయి. అయితే నేటి టి.వి.లు, సీరియల్స్, సినిమాలు మనిషికి వినోదాన్ని పంచకపోగా విపరీతమైన ఒత్తిళ్ళకు గురిచేస్తు ఇవి ప్రపంచీ కరణ ప్రజలను ఏకం చేయడం అనేది ఎంతభ్రమో నేటి సీరియల్స్ సినిమాలు, ఇంటర్నెట్, ఫేస్‌బుక్‌లు వినోదాన్ని వంచుతాయి. అనడం అంతేభ్రమ ఒకప్పుడు జానపదకళలు ఉచ్ఛస్థితిలో ఉండేవి. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

జానపదంలో గాత్రం :

జానపదుల కళలు వాగ్రూపంలోనే ఉంటాయి. ఈ గాత్రం ఆదిమానవుడి కూనిరాగాలతో మొదలైంది. ఇది ఎంతగానో అభివృద్ధి చెందిన కర్ణాటక, హిందూస్థానీ, వెస్టర్న్ సంగీతాలకు మూలం ఈ జానపద సంగీతమే ఆదిమానవులు తమ కళ్ళఎదుట జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ ఆవేశం, ఆనందం, దు:ఖం కల్గినప్పుడు ప్రకృతిలోని అనేక అంశాలు మానవుని మనస్సుని కదిలించినప్పుడు, శ్రమను మరిచిపోవాలనుకుంటున్న ప్పుడు, వేటపాటలు, వ్యవసాయ పాటలు, దంపుడు పాటలు, వేడుక పాటలు, జోలపాటలు ఇలా అనేకంగా ఉన్న పాటలు నేడు ఏకం పేరుతో, సినిమాపాటలు పేరుతో కనుమరుగు అవుతున్నాయి. నేడు వృత్తులు క్షీణిస్తుండటంతో దానికి సంబంధించిన పాటలు, కళలు కూడా అంతరిస్తున్నాయి.

జానపదంలో నృత్య మరియు దృశ్యకళలు :

జానపద కళలలో నృత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. కోలాటం, చెక్క భజన, పండరీభజన, జక్కికి, గోప్రాల్, గొబ్బిళ్ళు, యానాదినృత్యం, గొల్లల జాటీ దెబ్బలు, డప్పుల నృత్యం, లంబడీ నృత్యం, ఆసాదీ నృత్యం, నెమళ్ళ ఆట పుటివేషం, కీలుగుర్రాల ఆట, ఏలంగోడ్లు ఆట వంటి కళలు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహారంలో ఉన్నాయి.

కోలాటం :

ఇది స్త్రీల కళారూపంగా తెలుస్తుంది. ఈ కళను పురుషులు కూడా నేర్చుకుని ప్రదర్శిస్తున్నారు. ఈ కళను ప్రదర్శించేవారి వస్త్రధారణ, శిరోజ అలంకరణ ప్రత్యేకంగా ఉంటుంది. వీరి శిరోజ అలంకరణ ఒక్కో ప్రాంతంలో ఒక్కోవిధంగా ఉండటాన్ని మనం ప్రాచీన దేవాలయాల స్తంభాలపైన, గోపురాలపైన, కుడ్యాలపై చూడవచ్చు. ఇది ఎక్కువగా పండుగ సమయాల్లో, శుభకార్యాల సమయంలో ప్రదర్శించే వారు నేడు ఇది బ్రహ్మోత్సవాల సమయంలో తప్ప ఎక్కడ కనిపించడం లేదు. కమ్యూనిష్టులు ఈ కళను తమ ప్రచారానికి వాడుకుంటున్నారు.

చెక్కభజన :

ఇది కూడా అత్యంత ప్రాచీన కాలం నుండి వ్యవహారంలో ఉంది. ఇది పురుషులు ప్రదర్శించే కళ. రామాయణానికి సంబంధించినవే అధికం. ఇది ఒకప్పుడు పల్లెల్లో ప్రజలను ఉర్రూతలూగించింది. ఇందులో కలానాకి అనుగుణంగా వేష భాషల్లో, అలంకరణలో మార్పులు వచ్చాయి. ఏకంగా సినిమాలో ఉన్న విధంగా నృత్యం, వేగం పెరిగింది. ఈ కళ నేడు అంతంత మాత్రంగా కొనసాగుతూ ఉంది.

గొబ్బిళ్ళు :

ఒకనాడు ఆంధ్రప్రదేశ్‌లో గొబ్బిళ్లు ఆడే స్త్రీలు విరివిగా ఉండేవారు. సంక్రాంతి వచ్చిందంటే రంగవల్లికలు దిద్ది గొబ్బిళ్ళు పెట్టి స్త్రీలు వృత్తాకారంగా తిరుగుతూ, చప్పట్లు చరుచుచూ గొబ్బిపాటలు పాడేవారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆచారాలు, సాంప్రదాయాలు మృగ్యం అయిపోయాయి. నేడు సంక్రాంతి తన సహజ స్వరూపాన్ని కోల్పోయింది. దీనికి కారణం ప్రభుత్వం నిర్లక్ష్యానికి రైతు బలవ్వడమే.

గంగిరెద్దులాట :

ఇది కూడా సంక్రాంతి పండుగను ఆధారం చేసుకుని ఉన్న కళే. ఒకప్పుడు ఈ కళ ఆంధ్రదేశంలో విరివిగా కనిపించేది. ఎద్దులకు శిక్షణ ఇచ్చి సీతారామకళ్యాణంను ప్రదర్శించేవారు. ఒక ఎద్దును రాముడిగాను, ఆవును సీతగానూ పెట్టి ప్రదర్శించే ఈ కళను చూసి ప్రజలు మైమరిచేవారు. గంగిరెద్దువారు భిక్షాటనకు వచ్చినప్పుడు వస్త్రం సమర్పించి, ధాన్యం ఇచ్చి దానిపాదాలకు నమస్కరించడం ఆచారంగా వుండేది. నేడు ఈ ప్రదర్శనను తిలకించే ఆనక్తి ప్రజలకు లేకపోవడంతో ప్రదర్శించేవారు. తమ ఎద్దులను కబేళాలకు తరలిస్తున్నారు.

పులివేషం :

దసరా రోజుల్లో ఆంధ్రదేసమంతా ఇది విరివిగా కనిపించేది. కాని సినిమా ఛానళ్ళలో స్పెషల్ ప్రోగ్రాల మూలంగా జనాలు టి.విలకు అతుక్కుపోవడంతో ఈ వేషాలని చూసేవారు లేక దాదాపుగా మరుగున పడిపోయింది.

లంబాడినృత్యం :

ఈ నృత్యాన్ని ఆదివాసీలు ప్రదర్శిస్తారు. వారి వస్త్రధారణ, అలంకరణ ప్రత్యేకంగా ఉంటుంది. అయితే గనుల తవ్వకాలు, బ్రతుకుదెరువు కోసం వలసవెళ్ళడంతో ఈ కళ బాగా తగ్గిపోయింది. పర్యాట ప్రాంతాలలో (ఉదా. అరకు) జీతం ఇచ్చి ప్రభుత్వం ఈ కళను ప్రదర్శింపజేస్తున్నది.

ఉరుములు :

ఇది అనంతపురంల జిల్లాలో ఎక్కువ ప్రచారంలో ఉంది. ఉరుము అనేది ఒక జానపద వాద్యం. వీరు

గంగమ్మ దేవత ముందు వాయిస్తారు. ఉరుమును వాయిస్తూ ఉంటే కుంచెల నృత్యం చేస్తారు. ఈ కళ మాత్రం నేటికి బహుళ ప్రచారంలో ఉంది. ఇది ప్రపంచీకరణ ప్రభావానికి పూర్తిగా లోనుకాలేదు.

కొయ్యబొమ్మలాట :

ఈ ఆటను అనంతపురం జిల్లాలోని హిందూపురం, చిత్తూరు జిల్లాలోని సంతవేలూరు ప్రసిద్ధి. వీరు రామాయణాన్ని ప్రదర్శిస్తారు.లవకుశ వంటి సినిమాలకో ఈ కొయ్యబొమ్మలాట మూలం. ఇవి నేడు పూర్తిగా అంతరించాయి. ఖర్చులు అధికం కావడం, చూసే ప్రేక్షకులు లేకపోవడం వల్ల, టి.వి.ల ప్రభావం వల్ల ఈ కళ అంతరించింది.

తోలుబొమ్మలాట :

ఈ ఆట ఆంధ్రదేశంలో చాలా ప్రసిద్ధి. పూర్వ తోలు బొమ్మలాట చూడటానికి ప్రజలు బండ్లు కట్టుకొని ప్రయాణించి అయినా చూసేవారు. నేటి సినిమా వ్యవస్థకు తోలుబొమ్మలాట మూలం. అయితే సినిమాలు వచ్చిన తర్వాత ఈ కళాకారులు జీవనోపాది కోసం వేరే వృత్తులు ఎంచుకొన్నారు. ఇక టి.వి.చానెళ్ళు వచ్చిన తర్వాత ప్రజలు పూర్తిగా వీరిగురించి మరిచిపోయారు. దీన్ని ప్రదర్శించే వారు దాదాపుగా లేరు.

వీధి భాగవతం :

వీటినే బైలాటలు, వీధినాటకాలు అని కూడా అంటారు. నిన్నమొన్నటి వరకు ఇది కొనసాగుతూనే వుండేవి. నేటికి వీటిని మనం చిత్తూరు జిల్లాలో ధర్మరాజుల తిరునాళ్ళలో చూడవచ్చు. మిగిలిన ప్రాంతాల్లో అడపాదడపా కన్పిస్తాయి.

యక్షగానం :

యక్షగానాలు రాజస్థానాల్లో బాగా ప్రదర్శించేవారు. శిష్యుల అభిమానాన్ని చూరగొన్న కళల్లో ఇది ఒకటి. నాయక రాజుల కాలంలో ఇది విరివిగా ప్రదర్శింపబడేది. యక్షగానం రాత్రిపూట ప్రదర్శించే కళ. ఇవి ముందు గేయ రూపంలో ఉండేది. తర్వాత సంవాద రూపంలో మారి ఇప్పుడు అంతరించింది.

చిత్రకళ :

ఇది ప్రత్యేకంగా చెప్పుకోవలసిన కళ. భారతదేశంలో ప్రతి స్త్రీ గొప్ప చిత్రకళను చిత్రించగలరు. నైపుణ్యం కల్గినవారు. గోడల మీద, ముగ్గులు వేయుట, ఇంటి యందు ముగ్గులు వేయటం, ఇళ్ళు, దేవాలయాల పైకప్పులపై వర్ణాలు వేయడం, కుండలను ముగ్గులతో అలంకరించడం, శుభకార్యాల సమయాల్లో ఆడవారు తమ చేతికి ధరించే గోరింటాకుతో చేతులపై చిత్రకళను వేయటం ఉంది. ఇలా ముగ్గులు వేయటం వల్ల దుష్ట శక్తులు ధరిచేరవు అని జానపదులు నమ్ముతారు. ఈ కళ నేటికి నిలిచి ఉంది. ఈ కళలో జీవకారుణ్యం కూడా దాగి ఉంది. పాత కాలాల్లో బియ్యం పిండితో ఇంటి ముందు ముగ్గువేసేవారు ఇవి చీమలకు, పక్షులకు ఆహారంగా ఉంది. కానీ నేడు ప్రపంచీకరణ ప్రభావానికి లోనైన మనిషి వస్తు ప్రేమికుడిగా మారి సాటి మనుషులను కానీ, జీవజాతులను గానీ పట్టించుకునే స్థితిలో అతడు లేడు.

ఒకప్పుడు ఆవు, ఎద్దులను తమ ఇంటి సంతానంగా భావించేవారు. కానీ నేడు ఆవుల్ని పాల వ్యాపారంలో భాగంగానే చూస్తున్నారు. ఒట్టిపోయిన ఆవులను కబేళాలకు తరలిస్తున్నారు. ఇక వ్యవసాయంలో యంత్రాల రాకతో ఎద్దులకు పూర్తిగా పని లేకపోవడంతో దూడలుగా ఉన్నప్పుడే కబేళాలకు తరలిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే ప్రపంచీకరణకు లోనైన మానవుడు ప్రతిదాన్ని లాభాపేక్షతోనే ముడిపెడుతున్నాడు. అందుకే మనుషుల్లో ఆడశిశువులను చంపేసినట్టే ఎద్దులని (కోడే దూడ) చంపేస్తున్నారు. నేడు కొన్ని ప్రాంతాల్లో పెయ్యదూడే కలగాలని ప్రార్థనలు చేస్తున్నారు.

ప్రపంచీకరణ వల్ల వ్యాపార దృక్పథం మనిషి మొదళ్ళలో ప్రవేశించింది. బహుళజాతి సంస్థలు వారి మార్కెటింగ్ కోసం మన సంస్కృతిని పూర్తిగా వారి సంస్క

కృతిగా మార్చేస్తున్నారు. పిల్లల ఆట వస్తువులు దగ్గర నుండి శవపేటిక వరకు అన్ని విషయాలలోనూ, మత పరమైన విషయాలలోను ప్రపంచీకరణ విరివిగా చోటుచేసుకుంది.

ఇప్పటికైనా ప్రజలు, మన ప్రభుత్వాలు మేల్కొని ప్రపంచీకరణ ఇనుపచక్రాల క్రింద మన సంస్కృతి, మన కళలు, మన పాడిపంటలు ముఖ్యంగా మానవత్వం నలిగిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి మనిషికి ఉంది.

ఈ జానపద కళలను డాక్యుమెంటరీ రూపంలో మనం భద్రపరచుకుని భావితరాలకు అందించాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపదవిజ్ఞాన వ్యాసాలు - నెదునూరి గంగాధరం
2. తెలుగు జానపద గేయగాథాలు - ఆచార్య నాయని కృష్ణకుమారి
3. సమాజం - సంస్కృతి - సాహిత్యం - ఆచార్య నాయని కృష్ణకుమారి
4. అంతా జానపదం - ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి

❖ ❖ ❖

'సుభద్ర సారెపాట' కథాగేయం-జానపదాంశాలు

– డా॥. మంగరాజు వెంకటగౌరి, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

సాహిత్యాన్ని ప్రారంభం నుండి పరిశీలిస్తే, జానపద సాహిత్యంలో జానపద గేయం ఎంతో ప్రధానమైనది. తెలుగు సాహిత్యంలో దీనికి ప్రత్యేక స్థానముంది. జానపద గేయాన్ని ఆంగ్లంలో 'ఫోక్ సాంగ్' అని అంటారు. తెలుగులో దీనికి శుద్ధ గేయమనే పేరు కూడా ఉంది. ఈ జానపద గేయం జానపదులకు దగ్గరగా ఉండి, వారి అభిమానాన్ని, ప్రేమను, పెనవేసుకుపోయింది. ఇది వారి జీవన విధానంలో కలిసిపోయింది. వారి జీవితంతో గేయం గొప్ప అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంది అనటానికి వారి సాంఘిక ఆచారాలే ఆధారం. సాధారణంగా జానపదులందరు కష్టజీవులు. ఆయా పనుల్లో కలిగే కష్టాన్ని మర్చిపోడానికి వీరు గేయాలు పాడుతూ ఉంటారు. అందుకే వారి జీవనంలో గేయం ప్రధాన భాగం అయిపోయింది. ప్రతి పనికీ ఒక గేయం ఉండటం జానపద సాహిత్యంలో కనిపిస్తుంది. పనులు చేసేటప్పుడు శ్రమ తెలియకుండా, ఉత్సాహంగా పని చేయటానికి అనేక పాటలు పాడుతూ ఉంటారు. ఇది వీరి ప్రత్యేకత.

జానపద గేయాలలో సంగీత, సాహిత్యాలు రెండు ఉంటాయి. జానపద గేయాలలో బాణీ, లయ చెవి కోసుకునేంత మధురంగా ఉండి వినేవారికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. వారు గేయాలు పాడుతున్నప్పుడు అందులో సంగీతం శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తుంది. గేయాలలో సాహిత్యం మధురంగా ఉంటూ, ఎంతో ఉల్లాసాన్ని కల్గిస్తుంది. గేయాలలో భాష సులభంగా వినేవారికి, పాడేవారికి అనువుగా ఉంటుంది.కనుకనే జానపదులు ఆ గేయాలను బాగా ఆదరిస్తారు.

ఇక కథాగేయం గురించి చెప్పుకుంటే, కథను ప్రధానంగా చెప్తూ పాడుకోవడానికి వీలుగా ఉండేదే కథాగేయం. జానపద గేయాలలో కథాగేయం కూడా అత్యంత ముఖ్యమైంది. కథాగేయాలను ఆంగ్లంలో Ballad, Narrative songs అని పిలుస్తారు. ఇలా పిలిచే కథాగేయాన్ని తెలుగులో వీరగాథ, గేయగాథ, కథాగేయమని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. ఈ కథాగేయాలను పాడటానికి ఒక గంట నుండి మూడు లేక నాలుగు నెలలు తరబడి పాడుకోవడానికి వీలుగా ఉంటాయి. వీటిలో మళ్ళీ వివిధ విభాగాలున్నాయి. నా వ్యాసంలో భాగంగా 'సుభద్ర సారెపాట'ను విశ్లేషిస్తున్నాను.

సుభద్ర సారెపాట జానపద కథాగేయాలలో చిన్న కథాగేయాల శాఖకు చెందినది. ఈ కథాగేయం పౌరాణిక శాఖకు సంబంధించినది. చిన్న కథాగేయాలలో కథ చిన్నదిగా (తక్కువగా) ఒక గంటలోపు పాడటానికి వీలుగా ఉంటుంది. వీటి పేర్ల చివర పాట లేక పదం అనే పేర్లు వస్తుంటాయి. చిన్న కథాగేయాలు పౌరాణిక శాఖలో స్త్రీలు పెళ్లి, పేరంటాలు, పండుగలు, పబ్బాలు సందర్భాలోనూ పాడుకుంటారు. లేక గాయక బిక్షకులు పగటిపూట బిక్షమెత్తుకునే సమయంలోను పాడతారు. ఈ వ్యాసంలో భాగంగా ముందు కథను తెలుసుకుంటూ అందలి గేయాలను విశ్లేషిస్తాను.

సుభద్ర సారెపాట :

సుభద్రార్జులకు కొత్తగా వివాహమవుతుంది. అర్జునుడు తన భార్య సుభద్రతో తనను 'సుభద్ర పుట్టింటి వారు సరిగా చూడలేదని' గౌరవించలేదని అత్తింటి వారిని దెప్పుతూ సుభద్రతో ఇలా చెబుతాడు.

కుంచము కుంచెడు కొలిచి ఇచ్చిరిగా
కొలత పల్లెరాలు పెట్రి మీ వారు
మానెతో మానెడు కొలిచి ఇచ్చిరిగా
మారు కట్టు చీరలు మనకు మీ వారు
తవ్వతో తవ్వెడు కొలిచి ఇచ్చిరిగా

తలంటు గిన్నెలు పెట్టి మీ వారు
పున్నము నాడైనా బూరెలండుకుని
పుణ్యాడా రమ్మని పిలిచిరేమో మీ వారు
అమవాస నాడైనా అట్లు వండుకొని
అల్లుడా రమ్మని పిలిచిరా మీ వారు
కనుమ నాడైనా గారె లండుకొని
కాముడా రమ్మని పిలిచిరే మీ వారు

ఈ గేయంలో భర్త అత్తింటివారిపై చేసే ఆరోపణలు చిత్రించబడ్డాయి. సారెగా వంట సామాను లెక్కపెట్టి ఇచ్చారని, ఒక్క మూటలో వాడిన బట్టలు ఇచ్చారని కొత్తవి ఇవ్వలేదని, ఇంటికి సరిపడా సామానులు కూడా ఇవ్వలేదని దెప్పుతూ, పున్నమి నాడైనా బూరులు వండి భోజనానికి పిలవలేదని, అమవాస్య నాడు అట్లుపోసి పిలవలేదని తనకి గారెలు పెట్టలేదని దెప్పుతు భార్యపై భర్త అలిగాన విధానం ఇక్కడ గమనించవచ్చు. అర్జునుడి మాట విన్న సుభద్ర కూడా భర్తకి సరైన సమాధానాన్ని ఇస్తుంది.

సుభద్ర ఇలా అంటుంది -

'మా వాళ్ళు పేదవాళ్ళు మాకేమి కలదు
పెట్టగల పెద్దింటి పెళ్లాడతేను
అచ్చటలు ముచ్చటలు అన్నియు జరుగు...'

అని తనదైన శైలిలో వ్యక్తీకరిస్తుంది. సాధారణంగా భార్యభర్తల మధ్య ఉండే చిన్నపాటి గొడవలు ఈ పాటలో ప్రస్తావించబడ్డాయి. డబ్బుమీద అంత ఆశ ఉంటే డబ్బుగల అమ్మాయిని పెళ్ళి చేసుకోరాదా? అని అర్జునునితో అంటుంది సుభద్ర. అర్జునుడు వెంటనే కోపంతో సుభద్రను కాలితో తన్నుతాడు. సుభద్ర వెంటనే అన్న దగ్గరకు వెళ్ళేటప్పటికీ వదినలు మజ్జిగ చిలుకుతారు. మిగతావాళ్లు వేరే పనులు చేస్తారు. సుభద్ర రాకను గమనించిన ఒక వదిన శ్రీకృష్ణుడిని లేపి ఆమె రాకను చెబుతుంది. కృష్ణుడు సుభద్రను అడిగి విషయమంతా తెలుసుకుని కొంతకాలం తన దగ్గర ఉంచుకొని ఆమెను తిరిగి అత్తింటి వారింటికి పంపిస్తు అనేక సొమ్ములు, చీరలు, సారెలు ఇచ్చి పంపిస్తాడు. వాటి గురించి శ్రీకృష్ణుడు సుభద్రతో ఇలా వ్యక్తీకరిస్తాడు.

'తూర్పున ఉన్నాయి చూడి ఆవులు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
పడమట ఉన్నాయి పాడి ఆవులు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
ఉత్తరాన ఉన్నాయి మదపటేనుగులు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
దక్షిణాన ఉన్నాయి తూర్పు గుర్రాలు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
కుదురు మీదున్నాయి గుండు బిందెల్లు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
గూట్లోను ఉన్నాయి కంచు గిన్నెలు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
భరణిల్లో ఉన్నాయి పతకములు పేర్లు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
దండేన ఉన్నాయి తెల్లచీరలు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
పెటెల్లో ఉన్నాయి పట్టు చీరలు - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
రత్నాల కోళ్ల పట్టె మంచం - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు
ముత్యాల జాలలు పచ్చదోమతెర - అదిగోవె చెల్లెలా అరణంబు నీకు...'

ఈ విధంగా తనకు అన్న ఇచ్చిన సారె తీసుకొని ఆనందంతో అత్తింటికి భయలుదేరుతూ తమ వదినలకు చెప్తుంది. అందరూ ఆనందిస్తారు గాని, ఒక్క ఏడవ వదిన మాత్రం అది సహించలేక సుభద్రను నిందిస్తుంది. ఆమె మనసులోని కొపం ఇలా ఉంటుంది.

"ఎండిన ధాన్యమ్మ ఎత్తుక పొమ్ము
ఇంటి వాసాలన్నీ బండి పై వేసి
ముంజారు వాసాలు ముట్టించి పొమ్మ
ఇల్లు విరుచుక పొమ్మ! ఓ ముద్దు గుమ్మా!

వండిన వంటకము పట్టుకుని పొమ్మ
కట్టుకొన్న బట్ట కట్టి ఉంచ బోకమ్మా!...' అంటుంది.

ఏడవ వదిన తాలూకు అక్కసును ఈ గేయంలో దర్శనమిచ్చింది. వదిన మాటలకు సుభద్ర బాధపడి తన అన్నతో ఆ బాధను చెప్పుకుంటుంది. దానికి కృష్ణుడు ఈ విధంగా సమాధానమిస్తాడు.

"కొన్న బానిస అంటే కొదవేమి మనకు
మన అమ్మ కన్నాది మనల నిద్దరను" అని వారిస్తాడు.

పరాయి ఇంటి నుండి వచ్చిన వదిన మాటలను పట్టించుకోవద్దని, ఒక తల్లికి పుట్టిన మనం ఇద్దరం ఒకటని బుజ్జగించడం అర్జునుని మాటల్లో కనిపిస్తుంది. ఇక్కడ సుభద్రను ఓదార్చడమే ప్రధానంగా ఉంది.

జానపదుల సాంఘిక అంశాలు :

సుభద్ర సారెపాట జానపదుల మనస్తత్వానికి, వాతావరణానికి నూటికి నూరుపాళ్ళు అద్దం పట్టే కథాగేయం. సాధారణ కుటుంబాలలో క్రొత్తగా పెళ్ళైన స్త్రీలు పుట్టింటిపై మమకారం కలిగి ఉండటం సర్వసాధారణం. తన తల్లిదండ్రులను భర్త గాని అత్తింటి వైపువారు గాని ఏమైనా అంటే ఆడవాళ్లు భరించలేరు. వాళ్లని పల్లెత్తి మాట కూడా అననీయరు. ఎదురు తిరిగిన భార్యను, జవాబు చెప్పిన భార్యను భర్త కొట్టడం, భార్య పుట్టింటికి వెళ్లడం వారు తమ ఆడబడుచు కోసం తమకు ఉన్నంతలో చీర, సారె, కానుకలు ఇచ్చి తిరిగి అత్తింటికి పంపడం జరుగుతూ ఉంటుంది. ఇదే విషయం అత్యంత సహజంగా ఈ సారె పాటలో కనిపించింది.

సాధారణంగా క్రొత్తగా పెళ్ళైన అల్లుళ్ళని అత్తింటివారు పండుగలకు పబ్బాలకు పిలవడం, కట్నాలు కానుకలు ఇవ్వడం, రకరకాల పిండి వంటలతో అల్లుడికి మర్యాదలు చేస్తారు. ఆ తరవాత అత్తింటికి తిరిగి వచ్చిన కోడలు తన పుట్టింటి గొప్పను చుట్టుప్రక్కల వాళ్లకు చెప్పుకునే ప్రయత్నం చేస్తుంది. అది భర్తకు నచ్చక, దానితో కోపం వస్తుంది. సామాన్యంగా జరిగే ఈ తంతును జానపదులు తమ వస్తువుగా వాడుకుంటారు. వారి ఊహలకు, గేయాలకు కథలకు అడ్డం ఉండదు. అలా పుట్టిందే ఈ సుభద్ర సారెపాట కథాగేయం.

సుభద్ర, అర్జునుడు, శ్రీకృష్ణుడు జానపద వ్యక్తులుగానే వారికి అనిపిస్తారు. అందుకే వీరుడైన అర్జునుడు, సుభద్రను సాధారణ వ్యక్తిగా మీ వాళ్లు ఏమి పెట్టలేదని దెప్పడం, సుబద్ర మామూలు స్త్రీగా ఎదురు చెప్పడం, అర్జునుడు ఆమెను కొట్టడం మొదలైన తంతు సాధారణ భార్యాభర్తల కలహాన్ని వారు కథా వస్తువుగా తీసుకొంటారు. సుభద్ర అలిగి అన్న దగ్గరకు వెళ్ళడం, శ్రీకృష్ణుడు చెల్లెలి పై ప్రేమతో ఒక సాధారణ అన్నలా ఆమెకు సారె పెట్టడం కథాగేయంలో ప్రధానంగా దర్వనమిచ్చింది. ఆనాటి కాలంలో ముఖ్యంగా జానపదుల జీవితాలలోని సారె విశేషాల ప్రస్తావన, వదినలు విసురుగా మాట్లాడడం, అన్నలు వారించడం మొదలైనవన్నీ జానపదుల నిత్య జీవితంలో జరిగే విశేషాలు.

సాధారణంగా పుట్టింట్లో ఆడపడుచులకు, కోడళ్ళకు పడదు. ఒకరిమీద ఒకరు పిర్యాదులు చేసుకోవడం ఎక్కువగా కనిపిస్తుంది. ఇదే విషయం ఈ సారెపాటలో కనిపించింది. తనకు కలిగిన బాధను అన్నకి చెప్పుకోవడం, చెల్లెలి మాటలు విని అన్న పరాయి ఇంటి పడతి మీ వదిన అని, ఆమె మాటలు లెక్కచేయవద్దని, మనం ఒక తల్లి పిల్లలమని, శ్రీకృష్ణుడు సాధారణ జానపదుడుగా, అన్నగా శ్రీకృష్ణుని పలుకులు వినవచ్చు. సుభద్ర అన్నలు ఇచ్చిన చీర, సారెతో అత్తింటికి వచ్చి వారి గొప్పలను చుట్టు ప్రక్కల వారికి చెప్పడం, అది విన్న అర్జునుడికి కోపం రావడం కూడా చాలా సాధారణమైన విషయం. ఇలాంటివి అన్ని కుటుంబాలలో ఈ విధంగానే జరుగుతూనే ఉంటాయి. జానపదులు ఎంతటి ఉన్నతమైన పాత్రనైనా తమ శైలి, తమ బాణీలు వదలకుండా వారిని సాధారణ వ్యక్తులుగా చూపుతూ సంభాషణలు పలికిస్తారు. అందుకే సుభద్ర జానపద స్త్రీ వలె ప్రవర్తిస్తుంది.

అర్జునుడు జానపదుడు వలె పౌరుషంతో భార్యను తిట్టడం కనిపిస్తుంది. ఇలాంటి వస్తువులే జానపదుల కథాగేయాలలో కనిపిస్తుంటాయి. జానపదులు పాడుకోవడానికి 'సుభద్ర సారెపాట' అనువుగా ఉంటుంది. ఒక పక్క కథను చెబుతూ, మరో పక్క గేయంగా పాడుకునే విధంగా ఈ కథాగేయం ఉంటుంది. ఈ చిన్న కథాగేయంలో జానపదుల మనస్తత్వం, వారి శైలి, వారి బాణి, వారి సంభాషణలు అన్నీ సమానంగా కుదిరి జానపదుల వ్యక్తిత్వానికి చక్కగా సరిపోయే కథాగేయంగా తీర్చిదిద్దు తారు. అన్నిటికటే ముఖ్యంగా జానపదుల సాంఘిక జీవనం ఉట్టిపడేలా ఈ కథాగేయాలు దర్శనమిస్తుం టాయి.

ఆధారగ్రంథాలు :

1. జానపదగేయాలు - ఎల్లోరా
2. జానపదగేయ వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం
3. తెలుగులో జానపదగేయసాహిత్యం - డా॥ బి.రామరాజు
4. పల్లెపదాలలో ప్రజాజీవనం - డా॥ యెల్లండ రఘుమారెడ్డి
5. పౌరాణిక స్త్రీల పాటలు - కృష్ణశ్రీ సంపాదితము, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.

❖ ❖ ❖

జానపద సాహిత్యం – గేయ కవిత్వం

– కొండయ్య కోసూరు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, మధురై.

'నిజమైన భారతదేశం గ్రామాల్లోనే ఉంది' అన్న విలువైన గాంధీ గారి మాటల్లోని గ్రామాన్ని మనం పాచీన కాలంలో 'జనపదం' అని వ్యవహరించుకున్నాం. జనులకు సంబంధించిన భౌతిక, మానసిక, సాంస్కృతికాంశాల విశేష రూప సముదాయమే జానపదం. కాలానుగుణంగా మారుతున్న సామాజిక పరిణామాలన్నింటిని విశాల దృక్పథంతో పరిశీలిస్తే, పల్లె జనులు, గిరిజనులు, నగర వాసులు అందర్ని జానపదులు అనవచ్చు.

క్రీ.శ. మొదటి శతాబ్దం నుంచి శిష్ట సాహిత్యం అంచ లంచలుగా ఎదుగుతూ, 11 వ శతాబ్దం నుంచి మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉజ్జ్వలంగా వెలిగిపోయింది. దానికి మూలమైన జానపద సాహిత్యం మాత్రం 19వ శతాబ్దం ఉత్తరార్ధం నుంచి మెల్ల మెల్లగా ఎదుగుతూ, నేడు శాఖోపశాఖలుగా పెరుగుతూ ఉంది. అటువంటి జానపద సాహిత్యంలో గేయాలతో కూడిన కవిత్వానికి విశేష ప్రాచుర్యం కలదు. దీనిపై అనేక పరిశోధనలు జరిగాయి. ఇంకనూ ఎంతో మంచి విస్తృతమైన పరిశోధ నాత్మక, విద్యాత్మకంగా అధ్యయనం జరగవలసి ఉంది. జానపద సాహిత్యంలో గేయ కవిత్వం గురించి వివరించ డమే ఈ పత్ర సారాంశ ఉద్దేశ్యం.

జానపదం – గేయ కవిత్వం :

జానపద గేయాలను ఒకప్పుడు పల్లె పదాలని, పాత పాటలని చెప్పేవారు. కానీ అది సరికాదు. ఎందుకంటే జానపద విజ్ఞానం పాతది కాదు, కొత్తదీ కాదు. అది నిరంతరం కొత్త రూపాన్ని పొందుతూ ఉంటుంది. పాత బడుతూ ఉంటుంది మరియు భిన్న రూపాన్ని పొందుతూ ఉంటుంది.

తల్లి గర్భం నుండి పుట్టిన బిడ్డ కేరుమని ఏడుపు మెదలు పెట్టినప్పటి నుండి ఈ గేయాలు ఆరంభ మయ్యాయి. అప్పటి నుండి శిశువు ఏడుపు ఆపడానికి తల్లి జానపదంలోని గేయ కవిత్వాన్ని ఆధారం చేసుకొని ప్రధానంగా ఈ క్రింది పాటలను వివిధ దశలలో, వివిధ సందర్భాల్లో వీటిని పాడుతారు.

ఉగ్గు పాటలు :

తెలుగులో బాల గేయాలు అనంఖ్యాకంగా ఉన్నాయి. ఆధునిక యుగంలో కూడా చాలా మంది బాలగేయాలు రచించారు. తల్లి తన చంటి బిడ్డను చనుబాలను ఆముదాన్ని ఉగ్గు గిన్నెలో పోసి, రంగరించి ఉగ్గుపోస్తుంది. తరువాత మిగిలిన ఉగ్గును బిడ్డకాళ్ళు, చేతులకు, బొడ్డుకు పూస్తుంది. బిడ్డ కాళ్ళు చేతులను అటూ ఇటూ లాగి, బొడ్డును నిమురుతూ, తన బిడ్డ ఏమి తిన్నా జీర్ణమై పోవాలని -

'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
ఏనుగు తిన్న ఎలక్కాయ జీర్ణం
భీముడు తిన్న పిండి వంటలు జీర్ణం
మా పాప తాగిన పాలన్నీ జీర్ణం' అని పాడుతుంది.

జోలపాటలు :

ఏడెనిమిది నెలల తరువాత చిన్న పిల్లలకు స్నానం చేయించాలన్నా, నూనె పెట్టాలన్నా, తల దువ్వాలన్నా, బట్టు పెట్టాలన్నా, బువ్వ తినిపించాలన్నా కష్టమే. పిల్లవాడికి మారాం చేసే వయస్సు వచ్చి, బువ్వ తినకుండా మొండి కేసేటపుడు తల్లి చందమామను చూపిస్తూ -

'చందమామ రావె – జాబిల్లి రావే
కొండెక్కి రావె – కోటి వేలు తేవే
పరుగెత్తి రావె – పాలు పెరుగు తేవే
అన్నింటిని తేవె – మా అబ్బాయి కీవే'

అని పాడుతూ, బిడ్డను ఆడిస్తూ గోరుముద్దలు పెడుతుంది.

జ్ఞానార్జన గేయాలు :

చిన్న పిల్లలు వినోదంగా రకరకాలైన పాటల్ని పాడుకుంటారు. అవి వాళ్ళ జ్ఞాన సముపార్జనకు అధికంగా దోహద పడుతాయి.మనం నిజమైన విద్యావంతులు కావాలంటే జానపద విజ్ఞానం ఎంతో అవసరం.

ఉదాహరణకు :

'పిట్టమ్మ పిట్ట
ఏమి పిట్ట చిలక పిట్ట
ఏమి చిలుక తెలుపు చిలుక
ఏమి తెలుపు హంస తెలుపు
ఏమి హంస రాజ హంస
.....'

అంటూ పిల్లలు తమాషాగా పాడిన పై పాటలోని ముక్తపద గ్రస్తాలు వాళ్ళ జ్ఞాపక శక్తిని, పదజాల వృద్ధిని పెంపొందిస్తాయి.

కపిల పాటలు :

ఈ పాటలకు రాయలసీమ పాంతం పెట్టింది పేరు. ఈ పాటల్ని తెలంగాణాలో మోట పాటలంటారు. కపిలతో తోడుతూ, గట్లు కడుతూ

'రాతిరి రాతిరి వస్తానని చందమామయ్యో
రాతి గంధం తీసి ఉంచితి చందమామయ్యో
రాతిరి రాతిరి రాక పోతే మామయ్యో
రాతి గంధం రగిలి పోయే చందమామయ్యో'

అని ఉత్సాహంగా పాడుకుంటుంది.

వలపు పాటలు :

జానపద గేయల్లో వలపు పాటలకు ఎంతో ప్రాచుర్యం కలదు. బావా మరదలు మధ్య ఎంతో ఆశాజనకంగా ఉండే ఈ పాట

'ఆదివారం వస్తానని బావా - ఆశతో నేనుంటినీ
ఆదివారం రాక పోయే బావా - ఆశలన్నీ మానుకుంటీ
సోమవారం వస్తానని బావా - సోకుతో నేనుంటినీ
సోమవారం రాకపోయే బావా - సోకులన్నీ మానుకుంటీ
.....'.

వారి భావాంశాలను ఎంతో మనోహరంగా వ్యక్తీకరిస్తాయి.

కార్మిక గేయాలు :

కర్మాగారాల్లో, పరిశ్రమల్లో, పనిచేసేటప్పుడు, స్తంభాల్ని ఎత్తేటపుడు, రోడ్డు రోలరును లాగేటప్పుడు ఈ కార్మిక గేయాల్లో చరణాన్ని ఒకరు పాడితే తక్కిన వారంతా చరణాంతంలో 'హైసా' అంటూ బరువుల్ని ఎత్తడమో లేక లాగడమో చేస్తారు. ఈ పాటల్లో ద్వంద్వార్థాలు కూడా ఉంటాయి.

'మామ కూతురు - హైసా
మల్లె మొగ్గ - హైసా
పిల్లా పిల్లా - హైసా
అరె ఏమి పిల్లా - హైసా
ఎర్రా పిల్లా - హైసా
దాని..... - హైసా
..... **హైసా '**

అంటూ వాళ్ళంతా ఒక్కసారిగా బలాన్ని ఉపయోగించి పనులు చేస్తుంటారు.

ముగింపు :

తెలుగు వారి సాంస్కృతిక జీవన వికాసం అనేది ప్రధానంగా జానపద గేయ కవిత్వంతో పరిపుష్టి సాధించినదని భావించడం సముచితం. వివిధ దశల్లో, వివిధ సందర్భాల్లో ఈ గేయాలను ఉపయోగించుకొని ఆహ్లాదాన్ని, ఆనందాన్ని జానపదులు పొందుతున్నారు. కానీ మారిన కాల పరిస్థితుల్లో శాస్త్రీయ పరిజ్ఞానానికి గురై గేయాలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. కావున ప్రతి ఆంధ్రుడు మన వారసత్వ విజ్ఞాన సంపదైన జానపద కవిత్వాన్ని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వ్యవసాయపు పనిపాటలు – పరిశీలన

– డా॥. యం. హరికృష్ణ, ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

"శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః." అన్నారు పెద్దలు. చిన్నపిల్లలు, పశువులు, చివరికి విషంతో కూడుకున్న పాములు కూడా పాటకు పరవశిస్తాయని ఈ శ్లోకానికి అర్థం. ఇలా ప్రపంచంలోని అన్ని జీవులనూ పారవశ్యానికి గురిచేయగలిగే ధ్వనినే 'పాట' అంటాం. జానపద శైలిలో చెప్పుకోవాలి అంటే "మాటలను అందంగా, రాగతాళ బద్ధంగా వినిపించడమే పాట" అవుతుంది.

పాట శ్రమను ఎలా మరిపిస్తుంది? పాటకు అంత పట్టం కట్టడం దేనికి? జానపదులే కాదు ఆధునికులు కూడా పాటల మూటలను సింహాసనం మీద ఎందుకు కూర్చోబెట్టారు?

అదే పాటకు వున్న ప్రత్యేకత. పాట పాడుతుంటే పని కష్టం తెలీదు. పాట వింటుంటే ఎంత పని చేస్తున్నా మన్న స్పృహ వుండదు. దీంతో పని విసుగు లేకుండా, విరామం అవసరం లేకుండా వేగంగా సాగిపోతుంది. ఉత్పాదకత పెరుగుతుంది. దీనిని తెలునుకునే ప్రాచీనులు పాటకు పట్టం కట్టారు.

జీవనోపాధి కోసం శ్రమించేవారిని శ్రామికులు అంటారు. పల్లెజనం రోజంతా శ్రమిస్తూనే వుంటారు. ఆ సమయంలో వారు తమ పనిభారాన్ని మరచిపోవడానికి, పనిలో ఉత్సాహం కలగడానికి పాటలు పాడుకుంటారు. పాటల్లో మునిగిపోవడం వల్ల వారికి తాము చేస్తున్న పనిలో శ్రమ తెలియదు. ఇలా శ్రమించేటప్పుడు పాడే పాటలనే శ్రామిక గేయాలు, పనిపాటలు అని అంటారు.

"మానవులు శ్రమించునపుడు కష్టము కనబడ కుండుటకై, అలసిపోకుండుటకై, ద్విగుణీకృతోత్సా హముతో పనిచేయుటకై అప్రయత్నంగా కూనిరాగములు తీయుట, లయాన్వితములగునేవో మాటలుచ్చరించుట జరుగుతుంది. శరీర కష్టమొనర్చువారందరునూ శ్రామి కులే. శ్రమపడు వారందరునూ శ్రామికులే. పిండి విసరుట మొదలు పిడికిలి బిగించి కొడవలి చేబూని పనిచేయు వరకూ శ్రమపడుటయే".

"పనిచేసేటప్పుడు కలిగే అలసటను పోగొట్టుకోవడానికి మానవుడు పాటలుకట్టి పాడుతున్నాడు. ఆ పాటలకే పనిపాటలని లేదా శ్రామిక గేయాలని వ్యవహారం. శ్రమించేటప్పుడు మానవుని అంతరాంతరాల్లో పుట్టి సమిష్టిసొత్తుగా మారే గానవిశేషమే పనిపాట లేదా శ్రామిక గేయం. పనిపాటలు పనిచేసేవారికే కాకుండా వినేవారికి కూడా ఉల్లాసజనకంగా ఉంటాయి. పైగా పనిపాటల్లో శ్రామికుల అభిరుచుల్ని, సామాజిక జీవిత విశేషాల్ని గుర్తించవచ్చు."

వ్యవసాయానికి పట్టుగొమ్మ అయిన మనదేశంలో జానపద గేయాలు ప్రతి భాషలోనూ, ప్రతి ప్రాంతంలోనూ విరివిగా వున్నాయి. జానపద గేయాలలో అగ్రతాంబూలం శ్రామిక గేయాలదే. పిండి విసరడం, చెరగడం, దుక్కి దున్నడం, నాట్లువేయడం నుంచి కర్మాగారాల్లో పని చేయడం వరకూ అన్నిచోట్లా చేసేది శ్రమే. వరి నాటే టప్పుడు, కలుపు తీసేటప్పుడు, కపిల తోలేటప్పుడు, ఏతమెత్తేటప్పుడు, పాలం దున్నేటప్పుడు, జానపదులు పాటలు పాడుకుంటూ వుంటారు. ప్రధాన గాయకుడు లేదా గాయని వీటిని పాడేటపుడు పక్కన పనిచేసేవారు వంత పాడుతుంటారు. వీటిలో వస్తువు ఏదైనా వుండ వచ్చు. వృత్తికి సంబంధించిన పాటలుగానీ, స్థానిక విషయాలుగానీ, విషాద గాథలుగానీ, శృంగార గేయాలు గానీ, వ్యక్తిగత విషయాలు గానీ ఏవైనా సరే వాటిని పాటల రూపంలో పాడుకుంటారు.

కడప జిల్లాలోని రాజంపేట తాలూకాలో వ్యవసాయపు

పనులు చేసేటప్పుడు పాటలు పాడుకోవడంతో పాటు ఆ పనుల గురించి కూడా పాటలో అంతర్లీనంగా ప్రస్తావిస్తుంటారు. ఈ శ్రామిక గేయాలను మూడు రకాలుగా విభజించవచ్చు. 1. వ్యవసాయ పనిపాటలు 2. గృహ సంబంధ పనిపాటలు 3. వివిధ వృత్తులకు సంబంధించిన పనిపాటలుగా విభజించుకోవచ్చు.

రాజంపేట తాలూకాలో వర్షాధార పంటలతో పాటు వరిపంటలు కూడా ఎక్కువే. వర్షాలపైన ఆధారపడి వ్యవసాయం సాగుతుంది. వ్యవసాయపు పనుల్లో దుక్కి దున్నడం, నారుపోయడం, నారు పెరకడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, బావులనుంచి నీటిని కపిలతో తోడి పంటలకు పెట్టడం, చేను కావిలి, పంట కోతలు, చెత్తకొట్టడం తదితర పనులుచేసే సమయాల్లో పాటలు పాడుకోవడం కనిపిస్తుంటుంది.

వర్షాభావంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు తొలకరి అనంతరం విత్తనాలు చల్లేందుకు భూమిని దున్నడం ప్రారంభిస్తారు. దీనినే దుక్కిదున్నడం అంటారు. వర్షాల కోసం అలమటించిన రైతుకు తొలకరి ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. దీంతో మడకలకు, ఎద్దులకు భూమికి పూజచేసి భూమిని దున్నడం ప్రారంభిస్తారు. తమకు మంచి దిగుబడి అందించాలని కోరుతూ వారు భూమిని దున్నుతారు.

దూడమ్మా దూడో నా చిన్న లేగదూడో
చిన్నయ్యా కోడెదూడో
దూడబోయిన దారి నేనెరుగో నా చిన్ని బుడిగ దూడో
వడ్లు దంచి కూడు వండో వట్టి చాపల్ వడికలేసో
.....
అరవై ఆరు మడకల్లో ముందుదున్నే కోడెదూడో
దూడబోయిన దారి నేనెరుగో నా చిన్ని బుడిగదూడో
వడ్లు దంచి కూడువండో వట్టిచేపల్ వడికలేసో
దబ్బలన్నీ నీకు పెడుతును నా చిన్నిలేగదూడో
దూడబోయిన దారి నేనెరుగో

పాడినవారు :

ఆరంగి రామనుబ్బమ్మ, చెర్లోపల్లి, రాజంపేట మండలం, కడపజిల్లా.

జానపదులకు తమకు వ్యవసాయంలో సహాయంచేసే పశువుల పట్ల విపరీతమైన ప్రేమ వుంటుంది.తమ కుటుంబసభ్యులతో సమానంగా వాటిని చూసుకుంటారు. వాటికి ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విలవిలలాడి పోతారు. అందుకే ఈ పాటలో లయాన్వితమైన కోడె దూడను ఎంచుకున్నది ఓ పడుచు. ఈ పాటలో అంతర్లీనమైన అర్థం మాత్రం తన ప్రియుడి పట్ల విరహవేదనే. అయితే ఇతరులకు అర్థం కాకుండా కోడెదూడతో ప్రియుడిని కలిపింది ఆ జాణ. వడ్లు దంచి, కూడువండి, వట్టిచేపల కూరచేసి ముక్కలన్నీ కోడెదూడకే పెడతానని అంటోంది. అలా కోడెవయసులోని ప్రియుని పట్ల తన యిష్టాన్ని చూపడం ఈ గేయంలో మనం గమనించవచ్చు.

రైతులు భూమి దున్నగానే విత్తనాలు చల్లడం ప్రారంభిస్తారు. విత్తనాలు బాగా మొలకెత్తి మంచి దిగుబడి రావాలని వారు కోరుకుంటారు. మొలకెత్తిన గింజలను దున్నిన, నీళ్లు నిండిన మడిలో చల్లుతారు. దీనినే నారు పోయడం అంటారు. కొందరి చేతితో విత్తనాలు విత్తినట్లయితే బాగా మొలకెత్తి మంచి పంట పండి, దిగుబడి బాగా వస్తుందని జానపదుల నమ్మకం. ఆ నమ్మకంతోనే రైతులు కొందరు వ్యక్తులతో ప్రత్యేకంగా విత్తనాలు చల్లిస్తారు. విత్తనాలు చల్లేటపుడు తమకు ఇష్టమైన దేవతలను పూజిస్తూ, వారినే స్వయంగా వచ్చి దుక్కితీసి పప్పు పెట్టాల్సిందిగా కోరుతుంటారు. ఒక పాటలో తాము కొలుస్తున్న గ్రామదేవత అయిన రెడ్డెమ్మను స్వయంగా వచ్చి జొన్నగింజలు వేయాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు.

కొండానగరి కోడిగూసె, మేడలోనె కొలువుదీరె
భక్తురాల బాలరెడ్డెమ్మ, రెడ్డెమ్మ తల్లి సత్యమైన బాలరెడ్డెమ్మ...
ఊరికి ఉత్తరానదారికి దక్షిణాన

నల్లారేగడి భూములున్నవి, రెడ్డెమ్మ తల్లీ, నాణ్యమైన భూములున్నవి
నల్లారేగడి భూమిలోన నాలుగు గాండ్లా ఎద్దులు కట్టి
ఎర్రదున్నా లెక్కినావమ్మా, రెడ్డెమ్మ తల్లీ,
ఎర్రజొన్నాలేసినావమ్మా...

పాడినవారు :

మాదాసు రెడ్డెయ్య, చెన్నయగారిపల్లె, నందలూరు మండలం, కడపజిల్లా.

అంటూ పాటలు పాడుతుంటారు. ఈ పాట రాజం పేట ప్రాంతానికే పరిమితం కాదు. చాలా ప్రాంతాల్లో కాస్త అటూ యిటూ మార్పులతో ఈ పాట ప్రాచుర్యంలో వుంది.

విత్తనాలు చల్లిన తరువాత పైరు వత్తుగా పెరుగు తుంది. దీనిని నారుమడి అంటారు. విత్తనాలు మొలకెత్తి పైరు పెరగగానే మడినుంచి దానిని పెరికి విడిగా నాటుతారు. వరిపంట వచ్చే కాలాన్ని అనుసరించి నాలుగు నెలల పంట అయితే నాలుగు వారాలకు, ఆరు నెలల పంట అయితే ఆరువారాలకు నారుపెరికి తిరిగి మరో పొలంలో నాటుతారు. ఈ సందర్భంగా పాడే పాట ఈ క్రిందిది.

ఓరిమగ డోరిమగ డోరిమగడా
నా ఏలుపడిన పాటు చూడోరిమగడా
నందలూరి మళ్లల్లో ఓరిమగడా
నేను నారు పెరకబోతేనే ఓరిమగడా
మేటైనదాన్నని ఓరిమగడా
నేను మేటిమునం బట్టుకుంటి ఓరిమగడా
మేటిమునం పట్టుకుంటి ఓరిమొగడా
నన్ను ఎండ్రకాయ కరిసింది ఓరిమొగడా
ఎండ్రకాయ కరిసింది ఓరిమగడా
నన్ను ఏలూరికెత్తించు ఓరిమగడా
సరిగల్ల మగనివైతె ఓరిమగడా
నన్ను ఆస్పత్రికెత్తించు ఓరిమగడా

పాడినవారు :

కుమ్మరి చిన్నక్క, తాళ్లపాక, రాజంపేట మండలం, కడపజిల్లా.

తనకు ఎండ్రకాయ కరిచిందని, ఈ ప్రాంతంలోకెల్లా అతి పెద్దదైన వేలూరి ఆస్పత్రికి తీసుకెళ్లమని అంటోంది ఓ పడుచు. ఎండ్రకాయ దాదాపు కుట్టదు. ఒకవేళ కుడితే పొలంలోని తడిమట్టి పూసుకుంటే తగ్గిపోతుంది. అలాంటిది వేలూరు ఆస్పత్రికి తీసుకెళ్లమనడం ఆమె అభిజాత్యానికి సంకేతం. కొంతమంది తమ పట్ల దృష్టిని ఆకర్షింపజేసుకోవడానికి ఇలా వ్యవహరిస్తుంటారు. అలాంటి వాళ్లను ఉద్దేశించి వ్యంగ్యంగా ఈ పాటను పాడుతున్నారు జానపదులు.

నారు పెరికేటప్పుడు రహస్య ప్రేమలకు సంబంధించిన పాటలు కూడా పాడతారు. ఇవి ఎంతో సరదాగా ఉంటూ, శ్రామికులకు ఉత్సాహాన్ని కలిగించి శ్రమ తెలియకుండా పనులు సాగేందుకు తోడ్పతాయి.

నారుపోసి నాటే పైర్లలో వరి, ఉల్లి, మిరప వంటివి ముఖ్యమైనవి. పైరు నాటడానికి సహనం వుండాలి. ఎండలో వంగినాటాలి. అందుకే ఈ పనిలో ఎక్కువగా మహిళలే వుంటారు. నాటడం ఎక్కువ సమయం తీసు కుంటుంది కాబట్టి వీరు పాడే పాటలు కూడా చాలా వరకు సుదీర్ఘంగానే వుంటాయి. ప్రధాన గాయకురాలు పాటను పాడుతుంటే మిగిలిన స్త్రీలు ఆ పాటకు వంతపాడతారు.

కలిగిరి కలిగిరి కలింగ్రి సెట్లల్లో కల్లేతాగి వల్లే మరిచి
వైకోట పరిమళ్లల్లో వదిలిపోతావా వదినా ఒంటరినై పోతానే
దావల్లో డొంకల్లోనూ సేలకు పొయ్యే బాటల్లోనా
ఏమిటి మాటలురో మరిదీ ఏమి మాటలురో
.....
రెడ్డేరి మేడల్లోనా గుట్టూరట్టయ్యేనూ అరుగుమిందా అగుడుబట్టేను

కట్టమిందా నేనే వస్తా కట్టకిందికి నువ్వేరా వదినా...
ఎర్రగుంట్ల కోట జానపద గేయ సంస్కృతి,
అంకేరు నరేంద్ర, పుట 88

అంటున్నాడు. ఇది వదినా మరుదుల ప్రేమకు సంబంధించిన పాట. తనను వదిలి వెళ్లవద్దని మరిది కోరుతుండగా, గుట్టురట్టవుతుందని వదిన హెచ్చరిస్తోంది. ఇది ఓ సరదా పాట. ఇలాంటి పాటలు అలుపెరుగక పని చేయడానికి జానపదులకు సహాయం చేస్తాయి.

ఆయిలు ఇంజన్లు, కరెంటు రాకముందు కపిలతో బావి నుండి నీరుతోడి పొలాలకు కట్టేవారు. తోలుతో చేసిన పెద్ద బొక్కెనను బావిలో దింపి ఎద్దుల ద్వారా దానిని పైకి లాగి కాలవ ద్వారా పొలానికి నీరుపెట్టేవారు. ఒక జత ఎద్దులతో ఒకరే కపిల తోలడాన్ని 'ఒంటి కపిల' అంటారు. రెండుజతల ఎడ్లనుకట్టి ఇద్దరు వ్యక్తులు కపిల తోలితే దాన్ని 'తిరుగుడు కపిల' అంటారు. జానపదులు కపిల తోలుతూ పాటలు పాడుకుంటారు. ఇవి కూడా శృంగార సంబంధితాలై ఉంటాయి. క్రింది పాట అలాంటిదే.

కపిలతోలే చిన్నవాడా కర్రిగిత్తల చిన్నవాడా
ఎద్దుకేసిన మువ్వాలేవబ్బే నీయమ్మ చిన్నా ఎద్దుకేసిన మువ్వాలేవబ్బే
బావిలోకి బొక్కెన విడిచి ఎద్దులుపైనా నిలిపీనావూ
నీరు బైటికిరానే లేదబ్బీ నీయమ్మ చిన్నా నీరుపైకీ రానే లేదబ్బీ
.....

అంటూ పాడడం గమనించవచ్చు.

పాడినవారు :

పెంచలయ్య, చొప్పావారిపల్లె, ఓబులవారిపల్లె మండలం, కడపజిల్లా.

రాజంపేట తాలూకాలో జొన్నలు, సజ్జలు, రాగులు వంటి ధాన్యాలు పండిస్తారు. ఏపుగా కంకులు పెరిగే టప్పుడు రకరకాల పక్షులు, పశువులు గుంపులు గుంపులుగా పొలంలోకి ప్రవేశించి పంటను పాడు చేస్తాయి. వాటిని తరమకపోతే పొలంలో ఒక్క గింజకూడా మిగలక రైతు పూర్తిగా నష్టపోవలసి వస్తుంది. కాబట్టి రైతులు తమ పొలాల దగ్గర రాత్రింబవళ్లూ కాపలా కాస్తారు. లేదా కాపలా పెడతారు. చేను మధ్య మంచెపై నిలబడి తప్పెట్లు, కేకలతో, వడిసెలలతో పక్షులను తోలుతారు. చేను కావిలికి సంబంధించినదే క్రింది పాట.

బరికసేను కావిలంటివో నాయినా గోగాకు పెడతా నంటివో
నాయినా అబ్బయ్యో నువ్వు వస్తానని నేనో నాయినా ఏరుసెనగను తెచ్చుకొందునో
.....
నాయినా అబ్బయ్యో నీకు నాకూ ఈడంటివో నాయినా ఇద్దరికో జోడంటివో

పాడినవారు :

కామాక్షమ్మ, పోలి, రాజంపేట మండలం, కడపజిల్లా.

ఇది కూడా శృంగారగేయమే. చేసుకావిలికి వెళ్లిన ప్రియుడి కోసం ఎదురుచూస్తున్న యువతి ఈ పాటను పాడుతున్నది. బరికసేను కావిలికి వెళ్లిన ప్రియుడు గోంగూర తెస్తానని చెప్పి ఇంకా రాలేదని అతడు వస్తాడని వేరుశెనగలు, సేరు వక్కలు తెచ్చుకున్నానని, అతడు రాకపోతే పిల్లలకు పెట్టుకుంటానని అంటోంది. అతడు వస్తాడని కొత్తకోక, చుక్కబొట్టు పెట్టుకుందట. రాకపోతే కొత్తచీరను బండకేసి చించుకుంటానని, చుక్కబొట్టును సున్నంతో తుడిచేసుకుంటాను అంటోంది. రాత్రి ఊరిలో మారమ్మ తిరనాలలో నీకూ నాకూ ఈడుజోడూ అనిచెప్పి రాలేదని వెతలు పడడం ఈ పాటలో కనిపిస్తుంది.

కోతల పనుల్లో ఒక్కో మునానికి ఒకరు లేక ఇద్దరు చొప్పున కోత కోస్తారు. ప్రధాన గాయని లేదా గాయకుడు పాటపాడితే మిగిలిన వారు వంతపాడుతుంటారు. ఈ సందర్భంగా పాడే శృంగార గేయాన్ని ఇక్కడ చూడవచ్చు.

కట్టకడ ఇంటిదే కట్టకడ ఇంటిదే కోటేరు బాసదే
కనాల మొహముది ముంతంత కొప్పుదోయమ్మ

యమ్మ దాన్నిట్ట పిలవనంపమ్మా,
యమ్మ దానిపేరు నాకు తెలియదేయమ్మా
ఊరుకో ఊరుకో నాకొడుకా, నీ ఉసురు దానికెదగ
ఏముండ తగిలించె తీట
.....
ఒకచేత మందుపిడత ఒకచేత మందుపిడత
ఒకచేత కోడీక ఏమందూ పట్టలేదమ్మా
నేను ఏచేత గీరుకుందు తల్లీ.... ఊరుకో ఊరుకో నా కొడక....

పాడినవారు :

నరసమ్మ, పాచికాల్వ, నందలూరు మండలం, కడపజిల్లా.

అంటూ ఒక వ్యక్తి ఎవరితోనో శృంగారానికి పాల్పడి సుఖరోగం తగిలించుకున్నాడు. ఏమందుకూ జబ్బు తగ్గడం లేదని ఒక చేత్తో మందు పిడత, మరొక చేత్తో ఈక పట్టుకుని ఉండగా ఏ చేత్తో దురదను గీరుకోవాలని బాధపడుతున్నారు. అతని తల్లి ఓదారుస్తూ ఆ జబ్బును అంటించిన మహిళను తిట్టిపోస్తున్నది. సరదాగా సాగే ఈ శృంగారగేయం పరోక్షంగా సుఖవ్యాధులను గురించి హెచ్చరిస్తుంది.

ఈ విధంగా జానపదులు వ్యవసాయ పనులు చేసేటప్పుడు పాటలతో ద్విగుణీకృత ఉత్సాహాన్ని పొంది పనులు చేసుకుంటారు. కొన్ని పాటలను పనులు చేసుకుంటూ పాడుకుంటుంటే, కొన్ని పాటలు చేసే పనుల గురించి తెలియజేయడం గమనించదగ్గ విషయం. ఈ పాటలన్నీ గ్రామీణ జీవితపు శ్రామిక సౌందర్యానికి ప్రతీకలుగా వుండడం విశేషం.

ఆధారగ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యం, బి. రామరాజు, పుట 495
2. స్త్రీల పాటలు- ఒక పరిశీలన, డాక్టర్ శిష్టా లక్ష్మీ నరసమ్మ, పుట 296
3. ఎర్రగుంట్ల కోట జానపద గేయ సంస్కృతి, అంకేరు నరేంద్ర, పుట 88
4. రాజంపేట తాలూకా జానపద గేయాలు- ఆచార వ్యవహారాలు, డాక్టర్ ఎం. హరికృష్ణ

❖ ❖ ❖

జానపద పరిశోధకులు – సేవ

– షేక్ షానాజ్ బేగం, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కనిగిరి.

Folk అంటే నిరక్షరాస్యులయిన రైతులు. Lore అంటే విజ్ఞానం. Folklore అంటే జానపద విజ్ఞానము అని చెప్పబడింది. అయితే నాగరికత తెలిసిన ప్రతి ఒక్కరూ జానపదులే. భారతదేశాన్ని ఎందరో రాజులు పరిపాలన చేశారు. అయితే ఆనాటి సమాజంలో రాజభాష వేరు, ప్రజల భాష వేరు. రాజులు జానపద సాహిత్యాన్ని ఆదరించలేదు. ఒకసారి చరిత్రను తిరగవేసి వెనక్కి తిరిగి చూస్తే ఆది మానవుడు ప్రకృతి నుండి అన్ని విద్యలను నేర్చుకొని, కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. సమాజంలో సంఘ జీవితాన్ని ఏర్పరుచుకొని స్థిర నివాసాలను ఏర్పరచుకొని, వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని జీవించారు.

ఉదయం నుండి కాయకష్టం చేసుకుని, సాయంత్రం పనులు పూర్తి చేసుకున్న తర్వాత ప్రజలందరూ ఒకచోట గుమిగూడి తమ శ్రమను మరిచిపోవడానికి కునిరాగాలు తీస్తూ చిందులు తొక్కుతూ కాలం మారేకొద్దీ సాహిత్యాన్ని జోడు చేసుకొని జానపద గేయాలుగా ఆశురూపంలో ఒకరినుండి ఇంకొకరు పాడుకున్నారు. శ్రమను మరచి పోవడానికి పాటలు పాడారు, ఆటలు ఆడారు. దానికి కొన్ని వాయిద్యాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రకృతి సృష్టించిన అతివృష్టి, అనావృష్టులకు భయపడి తమకు కన్పించని శక్తులు ఉన్నాయని గ్రామదేవతలను సృష్టించుకున్నారు. వారిని నమ్మి ఆరాధించడం మొదలు పెట్టారు.

తమకు తెలిసిన ఇతిహాస గాధలను చేర్చుకొని పాటలు పాడుకున్నారు. చిందులు వేస్తూ వాటికి వాయిద్యాలను, కథలను కల్పించుకొని, యక్షగానాలను, వీధినాటకాలను, బుర్రకథలను, హరికథలను ఇలా ఒక్కటేమిటి ఇలా అనేకానేక ప్రక్రియలను సృష్టించుకొని తమలోతామే పాడి, ఆడి సంతోషించారు. 1930 కాలంలో శిష్ట సాహిత్యంతో పాటు జానపద సాహిత్యానికి కూడ సమానమైన గౌరవాభిమానాలు ఉన్నాయని నిజమైన జాతి సంస్కృతి అంతా జానపదుల జీవితాలలో ఉందని భావించిన కొందరు సాహిత్యవేత్తలు తమ పర్య వేక్షణలో జానపద సాహిత్య పరిశోధనలు చేయించి పిహెచ్‌డి చేయించారు. ఈ విధంగా జానపద సాహిత్యం కోసమే కృషిచేసిన కొందరు పరిశోధకులు చేసిన పరిశోధనలు ఎందరికో మార్గదర్శకమయ్యాయి. అటు వంటి జానపద పరిశోధకుల జీవిత విశేషాలను వారి పరిశోధనలను రేఖామాత్రంగా పరిచయం చేయడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

దారంతా ముళ్ళుంటే, ఆ ముళ్ళను తొలగిస్తూ వెళ్ళాలని ప్రయత్నం చేసేవారు అరుదు. ఆ ముళ్ళ లన్నింటిని తొలగించి ఒక బాటను ఏర్పరచిన తర్వాత ఆ బాటలో సునాయాసనంగా మిగిలినవారు కూడ నడవగలుగుతారు.

బిరుదురాజు రాజరాజు :

జానపద సాహిత్యంలో తనకెదురైన ముళ్ళనన్నింటిని తొలిగించి రాచబాటను వేసి జానపద సాహిత్యాభివృద్ధి కోసం కృషిచేసి జానపద గేయ సాహిత్యం అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించిన వారిలో మొదటివారు ఆచార్య బిరుదురాజు రాజరాజు గారు.

బిరుదురాజు రాజరాజు గారు 1925 ఏప్రియల్ 16వ తేదీన దేవనూరు గ్రామంలో లక్ష్మిదేవమ్మ, బిరుదురాజు నారాయణరాజు దంపతులకు జన్మించారు. మడికొండలో పెరిగారు. చిన్ననాటి నుండి గ్రామీణ వాతావరణంలో పెరగడం మూలాన వారి నాయనమ్మ గారు నిత్యం పాడి వినిపించే జానపద గేయాలకు ఆకర్షితులై జానపద

సాహిత్యంపై మమకారాన్ని పెంచుకున్నారు. బి.ఏ., ఎం.ఏ.,లు పూర్తి చేసుకున్న తర్వాత, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో జానపద గేయ సాహిత్యము అనే అంశము మీద పరిశోధనకు పూనుకున్నారు.

జానపద సాహిత్య సేకరణ ఎంతో వ్యయ ప్రయాస లతో కూడినది. అయితే చిన్ననాటి నుండి జానపద సాహిత్యంపై ఉన్న మక్కువ ఎక్కువ కనుక, ఎన్ని కష్టాల నైనా ఎదుర్కోవాలని ధృడ సంకల్పం చేసుకొని, కొండలు, కోనలు, వాగులు, వంకలు, డొంకలు, పల్లెపల్లెలు తిరిగి, వేలకొద్దీ గేయాలను సేకరించారు. తాను జానపద గేయాలు ఏ విధంగా సేకరించినదీ రామరాజు గారు తన సిద్ధాంత గ్రంధంలో చెప్పుకున్నారు. జానపద సేకరణ సమయంలో కొద్దిమందిని బుజ్జగించి, కొద్దిమందిని బ్రతి మాలుకొని, కొద్దిమందికి కల్లు పోయించి, కొద్దిమందికి డబ్బులిచ్చి, రేడియోలలో వచ్చే పాటలను వినిపించి, వారు పాడిన పాటలు కూడా రేడియోలలో ప్రసారమౌతా యని మురిపించి, ఇంకా కొద్దిమందిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి బెదిరించి, గేయాలు సేకరించానని, ఆతర్వాత వారికి తాను సేకరించిన సాహిత్య గేయాలలో పదిశాతం మాత్రమే తన గ్రంథంలో ప్రచురించగలిగానని చెప్పు కున్నారు. జానపద గేయ సాహిత్యం (1955) గ్రంథాన్ని 17 ప్రకరణాలుగా విభజించి, సిద్ధాంత వ్యాసమును సమర్పించుకున్నానని తాను చేసిన పరిశోధనా విధానాన్ని కూడ పొందుపరిచి, తర్వాత ఎందరికో మార్గాన్ని చూపిన మార్గదర్శి రామరాజు గారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా తన జీవితాన్ని ప్రారంభించిన రామరాజు గారు రీడర్‌గా, విశ్వవిద్యాలయ ఆచార్యులుగా పనిచేస్తూ శతాధిక గ్రంథాలను రచించారు. అందులో జానపద సాహిత్యానికి సంబంధించి, తెలంగాణా పల్లెపాటలు, త్రివేణి (జానపద పాటల సంకలనం), పిల్లల పాటలు, యక్షగాన వాఙ్మయం Folklore of Andhra Pradesh, Glimses into Telugu Folklore, South Indian Folk songs, Moharam Folk songs, అనే రచనలను సాహితీ లోకానికి అందించిన జానపద కర్మయోగి ఆచార్య బిరుదు రాజు రాజరాజు గారు.

1972 నుండి M.A. చదువుతున్న విద్యార్థులకు జాన పద గేయ సాహిత్యాన్ని పాఠ్యగ్రంథంగా పెట్టటం జరిగింది. నాటి నుండి నేటివరకు జానపద పరిశోధనలు చేసే ప్రతి ఒక్కరికి ఇది ఆధారగ్రంథమై జనాదరణ పొందింది.

జానపద గేయ సాహిత్యములో వస్తువుననుసరించి, పౌరాణిక, చారిత్రక, మతసంబంధ, పారమార్థిక, గేయములు, స్త్రీల పాటలు, శ్రామిక గేయాలు, పిల్లల పాటలు, శృంగార గేయాలు, అద్భుతరస,కరుణ, హాస్య సంబంధ గేయాలు, జానపద గేయములోని భాషా సారస్వత విషయాలు, జానపద గాయకులు, జానపద గేయముల వరుసలు మొత్తం 16 ప్రకరణాలు విభాగాల వారిగా విభజించారు.

సి.పి. బ్రౌన్ :

బ్రిటిష్ వారి పాలనా కాలంలో పాలకులుగా, అధి కారులుగా వచ్చిన వారిలో ఉదారహృదయులు, సంస్కార వంతమైన ఆంగ్లేయులు ఉన్నారు. అలాంటి వారిలో సర్ చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ ఒకరు.

సి.పి.బ్రౌన్ 1798 నవంబరు 10వ తేదీన కలకత్తాలో రెవరెండ్ బ్రౌన్, లేకాలే దంపతులకు జన్మించారు. కల కత్తాలో ఉండడం వలనే హిందీ, బెంగాలీ, గ్రీక్, లాటిన్ భాషలు తండ్రి నుండి సంక్రమించాయి. తండ్రి మరణా నంతరం ఇంగ్లండ్ వెళ్ళిన సి.పి.బ్రౌన్ విద్యాభ్యాసం పూర్తి చేసుకొని ఉద్యోగార్థం 1817 ఆగష్టులో మద్రాసుకు వచ్చి శిక్షణ పొందుతూ హిందుస్థానీ, మరాఠీ, తెలుగు భాషలను నేర్చుకొన్నారు.

తెలుగుభాషను నేర్చుకోవడమే కాకుండా తెలుగు భాషా సాహిత్యాల, సముద్ధరణకు కంకణం కట్టుకుని, తెలుగు సాహిత్యాభివృద్ధికి జీవితాంతం కృషి చేసి, గ్రంథ

పరిష్కరణలు, తెలుగు వారికి నిఘంటువులను రచించి ఇచ్చిన మహానుభావుడు సి.పి.బ్రౌన్.

సి.పి.బ్రౌన్ మనదేశానికి, మన ప్రాంతానికి రాకుండా ఉంటే సాహిత్య సంపద లభించి ఉండేది కాదేమో. తెలుగుభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన మహాను భవులు సి.పి.బ్రౌన్. యావదాంధ్ర జాతి సి.పి.బ్రౌన్‌కు ఋణపడి ఉంది. శిష్ట సాహిత్యాన్ని ఆదరిస్తూనే, జానపద సాహిత్య పరిశోధన పట్ల ఆసక్తిని పెంపొందించుకున్నారు. ఈయన బొబ్బిలి కథ, కుమార రాముని కథ, కామమ్మ కథ, దేశీ సాహితీ ప్రక్రియలకు సంబంధించిన మంజరీ ద్విపదలు, కథలు, పాటలను, యక్షగానములను, జానపద గేయ గాథలను సేకరించిన సృజనశీలి సి.పి.బ్రౌన్. ఆ తర్వాత 30 సం॥ చార్లెస్ గోవర్, Folk songs of South India అనే పుస్తకాన్ని ప్రచురించారు.

బ్రౌన్ తర్వాత బోయల్ అనే ఆంగ్ల పండితుడు ఆరు పాటలను సేకరించాడు. మొదటిది చారిత్ర గేయము అది బళ్ళారి వాసి నుండి సేకరించిన సర్వాయి పాపా రాయుడి కథ. మిగిలినవి శృంగార గీతములు ఒక రైతు పొలంలో పనిచేసుకుంటూ పాడుకుంటుండగా సేకరిం చారు.

చిలుకూరి నారాయణ రావు :

చిలుకూరి నారాయణ రావు గారు విశాఖపట్నం జిల్లా పొందూరు సమీపాన కల అనందపురం అనే గ్రామంలో 1889 ఆగష్టు 09 వ తేదీన లక్ష్మమ్మ, భీమాచారి దంపతు లకు జన్మించారు. ఈయన పట్టభద్ర విద్య పూర్తి చేసు కున్న తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయం నుండి తెలుగు కన్నడ భాషలలో ఏం.ఏ చదివారు. 11 వ శతాబ్దం నాటి భాష అనే అంశం పై పరిశోధన చేసారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో 1930వ సంవత్సరంలో తొలిసారిగా పిహెచ్‌డి చేసిన మహా పండితుడు చిలుకూరి నారాయణ రావు. 240 గ్రంధాలు రాశారు. ఈయన దాదాపు లక్ష యాభై వేల సామెతలు సేకరిస్తే ఎనభై వేలే మిగిలాయి. జానపద సాహిత్యానికి సంభందించి రాసిన గ్రంధాలలో ప్రసిద్ధమైనవి, మునలమ్మ, సంస్కృత లోకోక్తులు, చక్కటులు- సామెతలు బొమ్మ పొత్తికలు ప్రకృతినాటకం, The Dance of Rain Drops Songs of tyagaraaya, ఆంధ్రదేశపు జానపద గేయాలు, బాలల గేయ సాహిత్యము, తుక్కాంబ మొదలైన రచనలు చేశారు.

నేదునూరి గంగాధరం :

జానపద సాహిత్యం కోసం విశేషంగా పరిశ్రమించిన తన జీవితాన్ని జానపద సాహిత్య సేవ కోసమే అన్నట్లుగా విశేష కృషి చేసినవారు నేదునూరి గంగాధరం గారు (1904-1970)

నేదునూరి గంగాధరం గారు 1904 జూలై నాల్గవ తేదీన రాజమండ్రికి సమీపంలోని కొంతమూరు గ్రామములో మంగమాంబ, వెంకటేశ్వర్లు దంపతులకు జన్మించారు. గ్రామీణ నేపద్యంలో పెరగడం వలన చిన్ననాటి నుండి జానపద సాహిత్యంపై అభిమానం ఏర్పడింది.

ప్రాధమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే చుట్టుప్రక్కల ప్రాంతాలకు వెళ్ళి జానపద గేయాలను సేకరించేవారు. అందరిలో కలిసిమెలిసి వారితోనే ఉంటూ గ్రామాల్లో వాడే సామెతలను సేకరించారు. ఇంకా అడిగితే సిగ్గుపడి చెప్పరేమోనని, పొలాలలో పనిచేసుకుంటున్న జానపదుల గేయాలను వారికి కనపడకుండా వింటూ రాసుకొని సేకరించేవారు. ఇలా ఒకటేమిటి జానపదుల వివాహపు ఆచారాలు, మంగళహారతి పాటలు, భక్తి పాటలు మొదలైనవి సేకరించారు.

జానపద వాఙ్మయ సేకరణే తన జీవిత పరమాధి లాగా, ఒక తపస్సులా భావించి పల్లె పల్లెలు తిరిగి జానపద వాఙ్మయాన్ని సేకరించారు. ప్రయాణ సౌకర్యాలు లేని రోజుల్లోనే కాలినడకనే వేల మైళ్ళ దూరం ప్రయాణం చేసి, అరుదైన జానపద సాహిత్యాన్ని తెలుగులోనికి తీసుసువచ్చిన తపోధని నేదునూరి గంగాధరం గారు.

ఈయన జానపద కథలు - గాధలు, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, వాఙ్మయ వ్యాసావళి, స్త్రీల వ్రత

కథలు, వ్యవసాయ సామెతలు, సెలయేరు, మిన్నేరు, మున్నీరు, పసిడి పలుకులు, మంగళ హారతులు, శకున శాస్త్రము, పండుగలు - పరమార్థములు, వ్యవసాయ ముహూర్త దర్పణము, గృహ వాస్తు దర్పణం మొ॥ గ్రంథాలను రచించి, చిరస్థాయిగా జానపద సాహితీ లోకంలో నిలిచిపోయారు నేదునూరి గంగాధరం గారు.

తూమాటి దోణప్ప :

తూమాటి దోణప్ప అనంతపురం జిల్లా, రాకట్ల అనే గ్రామంలో సంజీవప్ప, తిమ్మక్క దంపతులకు 1926 జూలై 1వ తేదీన జన్మించారు. తాతగారైన భీమన్న వద్ద సంస్కృత, తెలుగు పంచ మహాకావ్యాలను చదువుకున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఏ., యమ్.ఏ. లు పూర్తి చేసుకొన్నారు. అదే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శ్రీ గంటిజోగి సోమ యాజి గారి పర్యవేక్షణలో తెలుగులో వైకృత పదాలు అనే అంశంపై 1966లో సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించిన దోణప్ప గారు తెలుగు జానపద సాహిత్యంపై అనేక వ్యాసాలను రాయడమే కాకుండా జానపద కళాసంపద, తెలుగు హరికథా సర్వస్వం, దక్షిణ భారతదేశపు తోలు బొమ్మలాట, ఆకాశ భారతి అనే జానపద సాహిత్య గ్రంథా లను రచించారు. తెలుగులో ఈయన రచించిన హరికథా సర్వస్వం అనే కావ్యమునకు డిలిట్ పట్టాను అందు కున్నారు. జానపద సాహిత్యానికి పరిశోధనలు చేయిం చడమే కాకుండా అనేక జానపద సాహిత్య గ్రంథాలకు పీఠికలను రచించిన ఘనత దోణప్ప గారికి దక్కుతుంది.

ఎస్వి జోగారావు :

సంగీత సాహిత్య నృత్య కళలతో విలసిల్లే కళారూపం యక్షగానము, సంగీత సాహిత్యాలనే ఇద్దరి తల్లుల ముద్దు బిడ్డలని, పివి రాజమన్నారు తెలిపారు. యక్షగాన ప్రక్రియ ఆంధ్ర, కన్నడ, తమిళ తెలంగాణాలలో విశేష ఆదరణ పొందిన ప్రక్రియ. ఈయన సేకరించిన యక్షగానము సంఖ్య కంటే ఆనాటి తాళపత్ర ప్రతులలో ఉన్న యక్షగానాలు పురుగుల పాలై పోయాయని బాధపడ్డారు, జోగారావు గారు.

యక్షగాన సేకరణ కూడా అంత సులువైన పని కాదు సుదూర ప్రాంతాలెన్నో తిరిగి, తిరిగి కష్టపడి సేకరించారు. ఈయన తంజావూరులోని సరస్వతి మహల్, అడయారు దివ్యజ్ఞాన సమాజం, తిరుపతి ప్రాచ్య లిఖిత భాండాగారం, రాజమండ్రి, గౌతమి గ్రంధాలయం, మరియు బాలభక్త పుస్తక భాండాగారల నుండి కొన్ని యక్షగానాలను సేకరిం చారు. నేలటూరి వెంకట రమణయ్య, రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ, శ్రీపాద గోపాల కృష్ణ మూర్తి మొదలైన వారు కొన్ని యక్షగానాలను సేకరించి జోగారావు గారికి ఇచ్చారని జోగారావు గారు తన యక్ష గాన వాఙ్మయ చరిత్రలో చెప్పారు. 1952లో పరిశోధనను ప్రారంభించి 1956 వరకు అహర్నిశలు కష్టపడి తన సిద్ధాంత గ్రంధమును సమర్పించి 1957లో పట్టభద్రులైనారు. 1957-58 సంవత్సరములలో ఆంధ్ర విశ్వ కళ పరిషత్ వారు తాము చేయించిన సిద్ధాంత గ్రంధములన్నింటిని పరిశీలించి, ఎస్వి జోగారావు గారి యక్షగాన వాఙ్మయ చరిత్ర ఉ త్తమ సిద్ధాంత గ్రంధముగా నిర్ణయించి రఘుపతి వెంకటరత్నం నాయుడు రీసెర్స్ మెడల్‌ను బహుకరించ డమే కాకుండా 1961లో గ్రంధముగా ప్రచురించారు.

యక్షగాన సర్వస్వంగా భావింపబడుతున్న ఆంధ్రుల యక్షగాన వాఙ్మయ చరిత్రలో 465 రచయితల యక్ష గానములే కాక దాదాపు 802 యక్షగానాల చరిత్ర ఉ న్నదని బిరుదు రాజు రామరాజు గారు పేర్కొన్నారు. శ్రీ గంటి జోగి సోమయాజుయ గారి పర్యవేక్షణలో పరిశోధన చేసిన ఎస్వి జోగారావు గారు తన యక్షగాన వాఙ్మయ చరిత్రను రెండు భాగాలు విభజించి గ్రంధ రూపాన్ని ఇచ్చారు.

ఎస్వి జోగారావు యక్షగాన ఉత్పత్తి విచారముల గురించి ప్రస్తావన, యక్షులు - గానము, జక్కుల జాతి సంబంధము, జక్కిణి, పూర్వ సమన్వయం, ఇతర వాదములు - అభిప్రాయములు యక్షగానము ప్రాచీనత ప్రాధమిక వ్యవస్థ అనే అంశాలను వివరించారు.

యక్షగాన పరిణామ చరిత్ర గురించి ప్రస్తావన, యక్ష గాన రచనా - ప్రారంభదశ, ఆంధ్ర ప్రాంత యక్షగానము, దక్షిణాంధ్ర యక్షగానము, తెలంగాణా యక్షగానములు, యక్షగాన సాంప్రదాయిక పాత్రలు, సింహావలోకనము అని విభజించారు.

యక్షగాన అనుభవములను గురించి యక్షగానాలలోని ఛందస్సు, తంజావూరు పద వాఙ్మయము, శహాజి దరువులు, యక్షగాన శబ్దజాలము, యక్షగానములోని సామెతలను వివరించారు. ఇక రెండవ భాగములో తెలంగాణము యక్షగాన కవులను గురించిన విషయాలను పొందు పరచి ఆంధ్రుల యక్షగాన వాఙ్మయ చరిత్ర గ్రంధాన్ని పూర్తి చేశారు. ఈయన రాసిన ఈ గ్రంధాన్ని ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు వారు 10 సంపుటములుగా ముద్రించారు.

తంగిరాల వెంకట సుబ్బారావు :

తంగిరాల వెంకట సుబ్బారావు గారు మార్చి 30, 1935వ సంవత్సరంలో జన్మించారు. ఎన్వి యూని వర్సిటిలో ఆచార్య పింగళి లక్ష్మి కాంతం, ఆచార్య జిఎన్ రెడి గార్ల పర్యవేక్షణలో తెలుగు వీరకధా కవిత్వము అనే అంశముపై పరిశోధన చేసి 1969 ఎన్ పిహెచ్‌డి పట్టను పొందారు. బెంగుళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖలో శాఖాధ్యక్షులుగా పనిచేసి పదవీ విర మణ చేశారు. విశ్రాంత ఆచార్యులుగా ఉంటూనే రచనా వ్యాసాంగాన్ని, విడవలేదు, కొత్త పాతలను మేళవించుకొని అనేక కళాశాలల్లో అనేక ఉపన్యాసాలిస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుత కరోనా పరిస్థితులలో కూడా అంతర్జాల వెబినార్‌లలో పాల్గొంటూ అవిశ్రాంతగా ఆధునిక పోకడ లను సైతం అలవరుచుకొని సాహితీ కృషి చేస్తున్నారు. ఈయన జానపద సాహిత్యము వీరగాధలు, కాటమరాజు కథలు, తెలుగు వీర కధా కవిత్వం అంకమ్మ కథలు శ్రీకృష్ణ కర్ణామృతం, రేనాటి సూర్యచంద్రులు అనే గ్రంధాలను రచించారు.

Balled శబ్దమునకు వీరగాధ అని అర్ధం. ప్రపంచంలో వీరులు లేని దేశం లేదు. డెన్మార్క్, నార్వే, స్వీడన్ దేశము లలో వీరగాధ సాహిత్యమున్నట్లు, మనదేశంలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలలో వీరగాధలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయని తంగిరాల సుబ్బారావు గారు తెలియజేశారు. తంగిరాల సుబ్బారావు గారి గ్రంధంలో 25 భాగాలు విభజన చేసి కథా గేయ విమర్శా సర్వస్వం, వీరగాధల పుట్టుపూర్వోత్తరములు, భారతీయ భారతీయే తర వీరగాధల చరిత్రము, వీరకథ విభజనము, శక్తి కథా చక్రము, బొబ్బిలి కథా చక్రము, పలనాటి వీర కధా చక్రము, కాటమరాజు కథాచక్రము, బొబ్బిలి వరుస కథలు, పదములు, జంగం కథలు, లఘు వీరగాధలు, వీరాగాధానుకరణములు, వీరగాధల్లోని రసము, భాష, ఛందస్సు, వీర గాధల వైశిష్ట్యము మొదలైన 980 వీరగాధలున్నాయని బిరుదు రాజు రామరాజు గారి జానపద గేయసాహిత్య గ్రంధంలో పేర్కొన్నారు.

జిఎన్ మోహన్ గారు కూడా బెంగుళూరు విశ్వవిద్యా లయంలో అనంతపురం జిల్లా స్త్రీల పాటలు అనే అంశం పై పరిశోధన చేశారు. ఇంకా ఈయన తెలుగు కన్నడ సామెతలు అనే గ్రంధాన్ని రచించి జానపద సాహిత్య సేవ చేశారు.

ఆర్.వి.ఎస్. సుందరం :

ఆర్‌విఎస్ సుందరంగా సాహితీ లోకానికి పరిచయమైన రాళ్ళపల్లి సుబ్బు సుందరం గారు 1948 ఏప్రిల్ 21వ తేదీన ఆంధ్రదేశంలోని నెల్లూరులో జన్మించారు. పై చదువులన్నీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఉన్నత చదువులు చదవడం వలన బహుబాషా పాండిత్యాన్ని సంపాదించారు. మైసూరు విశ్వవిద్యాలయంలో తెలుగు కన్నడ జానపద గేయాలు అనే అంశంపై 1969లో పిహెచ్‌డి పట్టాను పొందారు. ఇందులో తెలుగు కన్నడలోని పనిపాటలు, పారమార్థిక గేయాలు, స్త్రీల పాటలు, పిల్లల పాటలు, వేడుక పాటలు, నవ్వుల పాటలు, కన్నీటి పాటలు మొదలైన పాటలను విమర్శనాత్మకంగా పరి

శీలన చేసి ఆ పాటలలోని భాష, ఛందస్సు, సంగీత సాహిత్య విషయాలను రాశారు. కేవలం అంతటితో ఆయన జానపద కృషి ఆగలేదు. సాహిత్యంలో శతాధిక గ్రంధ రచనలు చేసినప్పటికనీ, జానపద సాహిత్యం అనే అంశం మీదనే కాకుండా ఏ విషయం పై నైనా అలవోకగా ఆధునికత పరిజ్ఞానాన్ని అలవరచుకొని అనేక సదస్సులలో పాల్గొంటున్నారు. ఈయన జానపద సాహిత్యానికి సంబంధించి ఆల్చిప్పలు - ఆణిముత్యాలు, జానపద సాహిత్య స్వరూపం, జానపద సాహిత్యద మూల తత్వగళు , (కన్నడం) తెలుగు - కన్నడ గేయాలు, జానపద విజ్ఞాన స్వరూపం, జానపద సాహిత్యం, ఆంధ్రుల జానపద విజ్ఞాన సర్వస్వం, కర్ణాటకాంధ్ర యక్షగాన సమీక్ష (కన్నడం), Study of Folkloristics ఆంధ్రప్రదేశ్ జానపద (కన్నడం), జానపద తత్వగళు, జానపద సాహిత్య సౌరభం, సుందర జానపదం, Folk intelligence and other Eassays, దక్షిణ జానపద కోశ (కన్నడ), దక్షిన భారత జానపద విజ్ఞాన కోశం, దక్షిణ భారతీయ దేశీ కృషి, విజ్ఞాన కోశ (కన్నడం), దేశి ఆహార పద్ధతి 2011 (కన్నడ) అనే అంశాలలో సుందరం గారి కృషి అనిర్వచనీయమైనది.

నాయని కృష్ణ కుమారి :

నాయని కృష్ణ కుమారి గుంటూరు జిల్లాలోని నాయని సుబ్బారావు, హనుమాయమ్మ దమతులకు 1930 మార్చి 14 న జన్మించారు. తండ్రి నుండి పొందిన కవిత్వ వార సత్వం వలన తెలుగు సాహిత్యం పట్ల, రచనల పట్ల ఆసక్తి కలిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయములో రీడర్‌గా ఉన్న నాయని కృష్ణ కుమారి 1969లో జానపద గేయ గాధలు అనే సిద్ధాంత గ్రంధమును వ్రాసి 1970లో పిహెచ్‌డి పట్టాను అందుకున్నారు. జానపద గేయ గాధలను మానవ శాస్త్ర దృష్టితో పరిశీలన చేసిన ఘనత ఈమెకు దక్కుతుంది. ఇందులో జంతు పూజా పద్ధతి, మాతృ పూజాపద్ధతి, వీరారాధనము, వాటి పరిణామాలను పరిశీలించడంతో పాటు జానపదుల మతాచారములు, నమ్మకాలు, సాంఘిక రాజకీయ విద్యలతో పాటు భాష విశేషాలను కూడా వివరించారు. ఆర్. వెంకట లక్ష్మి జానపద గేయమూలందలి సంగీతము గురించి కసిరెడ్డి వెంకట రెడ్డి పాడుపు కధల పై పరిశోధన చేశారు.

శ్రీపాద గోపాల కృష్ణమూర్తి :

సుప్రసిధా విమర్శకులు శ్రీపాద గోపాల కృష్ణమూర్తి గారి కలం పేరు కృష్ణశ్రీ ఈ పేరుతోనే మూడు సంకలనాలను ఆంధ్ర సారస్వత కళా పరిషత్ వారు ప్రచురించారు. అందులో మొదటిది పల్లె పదాలు 1955వ సం॥ లోనూ రెండవదైన స్త్రీల రామాయణ పాటలు 1955 ప్రచురించారు. ఇందులో రామయాణానికి సంభంధించిన 42 కధా గేయాలున్నాయి, మూడవ సంకలనమైన స్త్రీల పౌరాణిక పాటలు 1963 ప్రచురించారు, ఈ సంకలనంలో భారత భాగవతములకు పురాణములకు సంభంధించి 63 కథా గేయాలున్నాయి.

అలాగే కె. సుమతీ జానపద కధలను గురించి రావి ప్రేమలత జానపద సాహిత్యం -పురాగాధలు అనే అనే గ్రంధాలపై పరిశోధనలు చేశారు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే తన అభిరుచుల మేరకు జానపద సాహిత్యం పై పిహెచ్‌డిలు చేశారు, చేస్తూన్నారు. ఈనాడు జానపద సాహిత్యం ఒక విస్తృత అధ్యయన శాఖగా రూపుదిద్దుకుంది. ఇప్పటికినీ జానపద పరిశోధనా పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఇది ఆనందించే విషయం కూడా.

ముగింపు :

బిరుదురాజు రామరాజు గారిచే అంకురార్పణ చేయ బడిన జానపద సాహిత్య రచనా పరిశోధన ఎందరికో ఆదర్శమై, ఆధార గ్రంధమై, అనేక మంది పరిశోదకులు పరిశోధనలు చేశారు. చేస్తున్నారు కూడా. ఒకనాటి ప్రజా సాహిత్యం జానపద సాహిత్యమే. జానపద సాహితీ ప్రక్రియలపై పరిశోధనలు చేసి దిశా నిర్దేశం చేసిన రచయితలకు తెలుగు జాతి, తెలుగు సాహితీలోకం ఋణపడి ఉంది. జానపద గేయలు, పురాణాలు, గేయ నాటికలు, జానపద పురాణ గాధలు, జానపదుల పురాణాలు, గ్రామ దేవతలు ఉత్సవాలు, పల్లె పాటలు,

నాటకాలు, వీధి నాటకాలు, హరికథలు బుర్రకథలు, రంగస్థల నాటకాలు, అన్నమయ్య, క్షేత్రయ్య సంకీర్తనలు, జాతీయాలు, సామెతలు, జానపద వాద్య పరికరాలు, జానపద సాంఘిక ఆచారాలు, నమ్మకాలు, జిల్లాల వారీగా జానపదసాహిత్య పరిశోధనలు ఎన్నో ఎన్నెన్నో జరిగాయి. ఎంత కృషి జరిగినా జానపద సాహిత్యం పై ఇంకా ఇంకా పరిశోధనలు జరగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఈనాడు శిష్ట సాహిత్యం పై పరిశోధనలు చేస్తున్నవారు సహితం ఒకటో, రెండో జానపద గ్రంధ రచనలు చేస్తునే ఉన్నారు, ఈ విషయం ఆనందాన్ని కలిగిస్తునప్పటికిని, కొన్ని కళలు కళా రూపాలు, గేయాలు, కళలు, యక్ష గానాలు అంతరించి పోయాయి. దీనికి ప్రధాన కారణం సాంకేతికత. టివిలు సినిమాలు, విస్తృతంగా వ్యాప్తిలోనికి వచ్చిన తర్వాత కధలు, కళలు, కళారూపాలకు ఆదరణ తగ్గింది, మరికొన్ని కళలు, వాద్యాలు అంతరించే పరిస్థితు లలో ఉన్నాయి. ఒకనాటి నాటకాలు ఎలా అంతరిం చాయో బతుకాట అనే నవలలో రాసాని వెంకట్రామయ్య నాలుగు తరాల చరిత్రను తీసుకొని నాటక కళ అంత రించిన విధానాన్ని వివరించడం జరిగింది. తోలు బొమ్మ లాటలు, జంఖిడి నాటకాలు, హరికథ బుర్ర కథ లకు కొన్ని కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రదర్శనలు జరుగు తున్నాయి. ఒకవేళ ఈ కళలను పునరుద్ధరించి ప్రదర్శిత మైన మన ప్రజలు ఆదరించే స్థితిలో లేరు. హాయిగా ఇంట్లోనే గంటల కొద్ది సీరియళ్ళు, సినిమాలు, వినోద కార్యక్రమాల పట్ల చూపుతున్న ఆసక్తి కళారంగంపై చూపడం లేదు. జానపద పరిశోధకులకు ప్రేరణ అమ్మమ్మల నాయనమ్మల పాటలు, గ్రామీణ నేపధ్యం వల్ల జానపద సాహిత్యం పట్ల ఆసక్తిని పెంపొందించుకొని పరిశోధనలు చేసిన వారే ఎక్కువ, ప్రస్తుత ప్రపంచీకరణ నేపధ్యంలో కుటుంబ వ్యవస్థ విచ్చిన్నమై అమ్మమ్మలు, నాయనమ్మలు వృద్ధాశ్రమాలలో ఉంటున్నారు. ఒక వేళ కొందరు ఇళ్ళల్లో ఉన్న వారు కూడా టివిలకు అంకితమై పోతున్నారు, ఎక్కడో మారుమూల కొండకోనలలో నివ సించే వృద్ధుల వద్దనే మనకు కొంతలో కొంత జానపద సాహిత్యం లభిస్తుంది. ప్రస్తుత తరంలోని పిల్లలకు కళలు కళారూపాలు, జానపద సంపదను గురించిన విషయాలు తెలియకుండా పోతుంది. కనుక ప్రజలు, ప్రభుత్వాలు ఇప్పటికైనా జాగృతులై పాఠశాలల్లో, కళాశాల్లో, జానపద అధ్యయనమనే ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి చిన్న నాటి నుండి కళల పట్ల ఆసక్తిని కలిగిస్తే ఇంకా చరిత్రలో నిక్షిప్తమైన అపారమైన జానపద సాహిత్యం పై ఆశక్తి, అభిరుచి కలిగి పరిశోధనలకు అస్కారం ఏర్పడుతుంది. జానపద సాహిత్యం కూడా చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

ఆధార గ్రంధాలు :

1. బి. రామరాజు - జానపద గేయ సాహిత్యం
2. తంగిరాల సుబ్బారావు - జానపద సాహిత్యం - వీరగాధలు
3. ఎస్‌వి జోగారావు - ఆంధ్రుల యక్షగాన వాఙ్మయ చరిత్ర
4. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి - స్త్రీల రామాయణపు పాటలు
5. ఆర్‌విఎస్ సుందరం - సుందర జానపదం
6. నాయని కృష్ణ కుమారి - జానపద గేయ గాధలు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద పురాగాథలలో ప్రాగ్రూపాల అధ్యయనం

– డా॥. వొరె దర్శగిరి, తెలుగు ఉపాధ్యాయులు, నిజామాబాద్.

ప్రాచీన మానవుని మనస్తత్వానికి ప్రతిబింబంగా నిలిచేవి పురాగాథాలు. చరిత్రకందని పురావృత్తమును వ్యాఖ్యానించడానికి పురాగాథల అధ్యయనం అవసరం. అతి పురాతన కాలపు మానవ మనస్తత్వం నుండి పుట్టిన కథ పురాగాథ. ఆంగ్లంలోని మైత్ (myth) అనే పదానికి సమానార్థకంగా ఆచార్య నాయని కృష్ణకుమారి పురాగాథ అనే పదాన్ని వాడారు. ప్రాచీన కాలనికి చెందిన జగత్తు సృష్టిని, దేవతల, వీరుల సాంస్కృతిక లక్షణాలను, మత సంబంధమైన విషయాలను, నమ్మకాలను విచారించే గాథలే పురాగాథలు అని డా.రావి ప్రేమలత నిర్వచించారు. ఆమె రాసిన నితెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు అనే తన పరిశోధనా గ్రంథంలో అనేక పురాగాథలలో గల సారూప్యతలను వివరించారు. ప్రాణుల సృష్టి గురించి, వివిధ జంతువులకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉండటానికి గల కారణాలను, వివిధ కర్మ కాండలు ఎలా ప్రారంభం అయ్యాయో పురాగాథాలు వివరిస్తాయని ఆమె తెలిపారు.

కథాత్మకాలుగా ఉండటం, నియమితమైన స్వరూపం లేకపోవడం, గద్య పద్యాత్మకంగా ఉండటం, ప్రాచీన మానవ మనస్తత్వాన్ని చిత్రించడం, మౌఖిక రూపంలో ఒక తరం నుండి మరొక తరానికి అందడం పురాగాథల ప్రాథమిక లక్షణాలు. ప్రకృతిని మానవీకరించడం ఒక జాతికి ప్రత్యేక లక్షణం రావడానికి కారణం ఆ జాతి పూర్వీకులలో ఒకరి ప్రవర్తనా ఫలితం అని చెప్పడం, ఈ పురగాథలను చెప్పడానికి ప్రత్యేక వ్యక్తులు, ప్రత్యేక సందర్భాలుండటం పురగాథల ఉపలక్షణాలు. జానపద గాథలకు పురాగాథలకు ఒకే రకమైన లక్షణాలు ఉన్నప్పటికీ, పురాగాథలపై గల నమ్మకం జానపద కథలకు ఉండదు. పురాగాథలు నిజంగా జరిగాయని, అవి పవిత్రమైనవని వాటిని విన్నా, చెప్పినా, పుణ్యం వస్తుందని నమ్మకం కథకులలో శ్రోతలలో ఉండటం పురాగాథల విశేషం. పురాగాథలలో దేవతలు, దైవాంశ సంభూతులు, మరణానంతరం దైవత్వం పొందిన పాత్రలుంటాయి.

ప్రపంచంలోని అన్ని దేశాలలో గల పురగాథలలో అనేక సమానాంశాలు కనిపిస్తాయి. వాటికి గల కారణాలను అన్వేషిస్తూ పాశ్చాత్య సాహితీవేత్తలు కొన్ని సిద్ధాంతాలు చేశారు. వివిధ దేశాలలోని ప్రజలు అపరిచితులు, ఒకరి గురించి మరొకరు వినకపోయినా, ఒకరిని మరొకరు చూడకపోయినా, దూరదూర ప్రాంతాలలో నివసించినా వారి ఊహల ద్వారా అవతరించిన పురాగాథలలో అనేక సామ్యతలు కనిపిస్తాయి. ప్రపంచ పురాగాథలలో ఎంతో వైవిధ్యం ఉన్నప్పటికీ అనేక సారూప్యతలు ఉంటాయి. ఇలా కనిపించడానికి కారణం మానవుని మేధస్సును ఎంతో ప్రభావితం చేయగల సమష్టి అజ్ఞాత మనస్సు. దీని మీద అనేక మంది మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేసి ప్రాగ్రూప సిద్ధాంతాన్ని ప్రకటించారు. ప్రాగ్రూపమంటే మానవ సమష్టి అజ్ఞాత మనస్సులో నుంచి వచ్చే కథాంశాలు, పాత్రలు, భావాలు, సన్నివేశాలు కావచ్చు. సృష్టిలో అంతటా ప్రాగ్రూపాలు సామన్య లక్షణం కలిగి ఉంటాయి. అందువల్ల వాటి మీద ఆధారపడి నిర్మితమైన పురాగాథాలు కూడా విశ్వజనీనాలు అవుతాయని భావుకసీమలో ఆచార్య కోవెల సుప్రసన్న వివరించారు.

ప్రపంచంలోని మానవులు ఏ కాలంలో ఉన్నా, ఏ ప్రదేశంలో వారి ఆలోచనలు, అచార వ్యవహారాలు, నమ్మకాలు, ఒకే రకంగా ఉంటాయి. అందుకు మానవ జాతి ప్రారంభం నుండి సంచితమైన మానవుని అనుభవాలు ప్రాగ్రూపాలుగా తరువాతి తరాలను ప్రభా

వితం చేస్తాయి. దీనిని ప్రాగ్రూప సిద్ధాంతం అంటారు. సిగ్మండ్ ఫ్రాయిడ్, నార్త్రోప్ ఫ్రై, కార్ల్ గుస్టవ్ యూంగ్ మొదలైన మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు ఈ ప్రాగ్రూప సిద్ధాంతాన్ని ప్రతిపాదించి సాహిత్యానికి అన్వయించారు. యూంగ్ ప్రతిపాదించిన ప్రాగ్రూప తత్వ వివేచన అపూర్వ మైన అనుసంధానమై ప్రాచీన పరంపరాగతంగా వస్తూఉ న్న పురాగాథల అంతర్యాన్ని ఆధునిక సాహిత్య సృజనలో వాటి ప్రాధాన్యాన్ని వ్యక్తం చేయడంలో వినూత్న జ్ఞాన కవాటాలు తెరిచిందని ఆచార్య కోవెల సుప్రసన్న వివరిం చారు. సాహిత్య సృజనకు ఏ దశలోనైనా ఆ జాతి పురా గాథలు దాని అనంత కాలపు అనుభవ సంపుటాలుగా మార్గదర్శనం చేస్తాయని ఆయన సూత్రీకరించారు. ప్రాగ్రూపాలు ప్రాచీన తరాల మనోలక్షణాలను, విశ్వసా లనూ, అలవాట్లనూ జానపద పౌరాణిక విజ్ఞానాన్ని, మత భావాల సమతౌల్యాన్ని ప్రతిబింబిస్తూ ఉంటాయని విమర్శ కుల అభిప్రాయం. జానపద సాహిత్యంలో గల కొన్ని పురాగాథలను పరిశీలించి వాటిలో కనిపించే ప్రాగ్రూపా లను అధ్యయనం చేయడమే ఈ వ్యాస ప్రధాన లక్ష్యం.

భారతదేశంలోని బృహదారణ్యక ఉపనిషత్తులో దేవుడు మొదట అనంతమైన జలమును సృష్టించాడని, అందులో నుండి జీవం ఉద్భవించిందని ఉంది. శిష్ట సాహిత్యమైన పురాణాలు,ఉపనిషత్తులతో పాటు భారతదేశంలోని గోండ్, ముండా, సంతాల్, బైగా, బుహియా, బీర్ హోర్, చెరో మొదలిన ఆటవిక తెగల పురాగాథలలో కూడా ప్రపంచం అంతా జలమయం అని ఉన్నట్లు నిమైత్స్ ఆఫ్ మిడిల్ ఇండియాు అనే గ్రంథం పేర్కొన్నది. కేవలం భారత దేశంలోనే కాకుండా గ్రీన్, ఫిన్లాండ్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, కాలిఫోర్నియా, బెల్జియం, కాంగో, ఈజిప్ట్, జపాన్, బాబిలోనియా, మొదలైనదేశపు పురాగాథలలో కూడా సృష్టి జలం నుంచే జరిగినట్లు నిక్రియేషన్ ఆఫ్ మైత్స్ అరౌండ్ ది వరల్డ్ు అనే గ్రంథం ద్వారా తెలుస్తున్నది. బైబిల్ అదికాండం మొదటి అధ్యాయంలో దేవుని ఆత్మ జలముపై అల్లాడు చుండెను అని ఉంది. సృష్టి జలం నుండి జరిగిందని ప్రపంచ వ్యాప్తంగా ఉండటానికి కారణం ఆదిమ మానవునికి అనంతమైన జలరాశి కనిపించడంతో ప్రంపచమంతా జలమయమని భావించడమే అని డా.రావి ప్రేమలత తన పరిశోధన గ్రంథం నితెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు లో పేర్కొన్నారు. ఈ భావనా ఐకత్యకు కారణం ఆదిమ మానవుల అనుభవాలే ప్రాగ్రూపాలుగా వివిధ గాథలలో బహిర్గతం కావడమే.

బ్రహ్మాండ పురాణంలో స్వయంభువు సృష్టిని ప్రారం భించడానికి తన వీర్యాన్ని నీటిలో నిక్షిప్తం చేస్తాడు. అది గుడ్డుగా మారి పై భాగం స్వర్గంగా, మధ్య భాగం ఆకాశంగా, కింది భాగం భూమి గా మారినట్లు తెలు స్తుంది. సృష్టికి పూర్వం ప్రంపచమంతా జలమయంగా ఉంది. ఆ అనంత జలంపై ముక్కు మొఖం లేని పక్షి మూడు గుడ్లు పెట్టింది వాటిలో మొదటి గుడ్డు పై భాగం ఆకాశంగా, కింది భాగం భూమిగా మారినవి. రెండవ గుడ్డు పగిలి బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు, ముప్పై మూడు కోట్ల దేవతలు, ఆరవై కోట్ల మునులు జన్మిం చారు. మూడవ గుడ్డు పగిలి మానవులు, రాక్షసులు, జంతువులు, వృక్షజాలం, వెలువడినట్లు మరొక జానపద పురాగాథ ప్రచారంలో ఉంది. ఇలాంటి కథలు బ్రహ్మ పురాణం, దేవీ భాగవతంలో కూడా కనిపిస్తాయి. అలాగే ఒక తెలుగు జానపద పురాగాథలో అమ్మవారు కోడి రూపంలో గుడ్డు పెట్టగా అది పగిలి దివము ధరణిగా మారినట్లు ఉంది. గొండ్ జాతి పురాగాథ ఒకదానిలో సింగమాలి పక్షులు పెట్టిన గుడ్లు పగిలి ఆకాశం, పృథ్వి ఎర్పడ్డట్లు ఉంది. ఘర్వాలి పురాగాథలో వారి గురువైన నిరంకార్ సృష్టించిన ఆడ పక్షి గుడ్డు నుండి అంబరము, అవని, ఏర్పడ్డట్లు తెలుస్తుంది, ఒరిస్సా ఆటవికుల పురాగాథలో రమ్మ, భిమ్మ అనేవారు ఆకాశంలో ఉండే వారు. వారి దగ్గర ఉన్న కోడి ఏడు గుడ్లు పెట్టి ఎనిమిదవ గుడ్డును కింద పడవేసిందని ఉంది. అలా కింద పడ్డ ఆ గుడ్డు ప్రంపచమంతా వ్యాపించిన జలరాశిపై పడగా

తెల్లటి సొన భూమిగా, పై భాగపు పెచ్చులు రాళ్ళుగా ఏర్పడ్డట్లు కలదు. ఈ గాథలో నిమైత్స్ ఆఫ్ మిడిల్ ఇండియాు అనే గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి. కేవలం భారతదేశంలోనే గాక చైనా, ఫిన్లాండ్, గ్రీన్, ఈజిప్ట్, పురాగాథలలో కూడా ఇలాంటి అండోద్భవ గాథలు కనిపిస్తాయి. న్యూజిలాండ్‌లోని మారిస్ అనే తెగ ప్రజల పురాగాథలలో పక్షిగుడ్డు జలంలో పడి పగలగా దాని నుండి స్త్రీ పురుషుడు వరాహం, శునకము, పుట్టినట్లు నిహీరో విత్ థౌసండ్ ఫెసెస్ు అనే గ్రంథం తెలుపుతుంది. ఆది మానవుడు గుడ్డు నుండి జీవి బయటకు రావడం చూసి సృష్టి కూడా అండోద్భవమేనని ఊహించడం అనే ప్రాగ్రూప ప్రభావమే కారణం అని మనోవిశ్లేషకుల అభి ప్రాయం.

మెదక్ జిల్లాలో ప్రచారంలో గల ఒక పురాగాథలో దేవతల గురువైన జాంబవంతుడు తన రూపాన్ని చూసుకోవడానికి మట్టితో తన పరిమాణం గల బొమ్మను తయారు చేస్తాడు. దానికి శాశ్వతత్వం కల్పించడానికి ప్రాణం పోశాడని ఉంది. పరమేశ్వరుడు కమండలంలోని నీటిని మట్టితో కలిపి రెండు బొమ్మలను చేస్తే విష్ణువు ప్రాణం పోశాడని, బ్రహ్మ విధిరాత రాశాడని మరొక జానపద గాథ ప్రచారంలో ఉంది. అలాగే ముండా, కాసిస్, మొదలైన భారతీయ ఆదిమ తెగల పురాగాథలలో మట్టినుండి మానవుడు జన్మించినట్లు కనిపిస్తుందని డా.రావి ప్రేమలత తన పరిశోధన గ్రంథంలో ఉద హరించారు. బాబిలోనియా, ఈజిప్ట్, గ్రీకు, దేశాలతో పాటు క్రైస్తవ పురగాథలలో కూడా మట్టినుండి మాన వుడు తయారయ్యాడని కనిపిస్తుంది. బైబిల్, ఆదికాండం ద్వితీయ అధ్యాయంలో నిదేవుడైన యెహోవా నేలమట్టితో నరుని నిర్మించి వాని నాసిక రంధ్రంలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ అయ్యెను అని ఉంది. ఈజిప్ట్ పురాగాథలలో ఖనోమన్ అనే దేవతాధిపతి మట్టినుండి మానవుణ్ణి సృష్టించినట్లు నిది వరల్డ్ బుక్ ఆఫ్ ఎన్ సైక్లోపీడియాు లో కనిపిస్తుంది. ఈ భావన ఆదిమ మానవుడు మట్టితో వివిధ వస్తువులతో పాటు బొమ్మలను తయారు చేయడం చూశాడు. వాటికి ప్రాణ ప్రతిష్ట చేయగల దేవుడు మానవులను మట్టిద్వారానే సృష్టిం చాడనే భావనకు వచ్చాడు. ఈ భావనే ప్రాగ్రూపంగా ప్రపంచ వ్యాప్తంగా గల వివిధ జాతులలోని పురాగాథలలో కనిపిస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలో ఉన్న పురాగాథలలో దేవుడు మొదట పురుషున్ని తయారు చేశాడని తరువాత అతని పక్కటెముక, లేదా శరీరపు మైలతో స్త్రీని తయారు చేశాడనే కథలు కూడా సారూప్యాతలతో కనిపిస్తాయి. తొలి పురుషుడు ఒంటరిగా ఉండలేనని వేడుకొంటే బ్రహ్మ స్త్రీని పురుషునికి తోడుగా సృష్టించాడు అని ఒక కథలో ఉంటే, పరమేశ్వరుడు మొదట పురుషున్ని సృష్టించగా పార్వతీదేవి తన శరీరపు మురికిని బొమ్మగా చేసి జీవం పోసిందని మరొక కథ ఉంది. ఇంకొక కథలో పురుషుని ఎడమపక్క శరీరపు మురికితో స్త్రీ తయారు చేయబడినట్లు ఉంది. అందుకు పూజాది క్రతువులతో స్త్రీ పురుషుని ఎడమవైపే కూర్చోవాలనే నియమం ఏర్పడ్డట్లు జానపదులతో పాటు పురజనులు కూడా నమ్ముతారు. బైబిల్, ఆదికాండం, ద్వితీయాధ్యాయంలో ఆదాము ఎడమపక్క ఎముక నుండి అవ్వను తయారు చేసినట్లు కనిపిస్తుంది. బ్రహ్మపురాణంలో బ్రహ్మ తన కుడి భాగం నుండి పురుషున్ని, ఎడమ భాగం నుండి స్త్రీని సృష్టించి నట్లు తెలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పురాగాథలలో స్త్రీ ఎడమ భాగం నుండి పుట్టిందనే సారూప్యత కనిపించడం కూడా ప్రాగ్రూప ప్రభావంగానే భావించాలి.

మత్స్య, మార్కండేయ, భాగవత పురణాలలో గల జల ప్రళయ గాథల వంటివి భారతీయ ఆదిమ జాతులైన ముండా, కోండ్, భిల్లుల పురాగాథలలో కనిపిస్తాయి. ఇలాంటి కేవలం భారతదేశంలోనే గాక గ్రీకు, ఆల్ గోన్ క్విన్ పురాగాథలలో కూడా కనిపిస్తాయి. మత్స్య భాగవత పురాణాలలో సత్యవ్రతుడు మత్స్య రూపంలో గల జగన్నాథుని ఆదేశానుసారం అన్ని రకాల పదార్థాల, జీవుల

సత్వాలను ఒక నావలో భద్రపరిచి ప్రళయానంతరం పున:సృష్టికి కారణం అవుతాడు. మార్కండేయ పురాణంలో మార్కండేయుడు భగవత్ అనుగ్రహంతో ప్రళయాన్ని తప్పించుకొని అన్ని యుగాలను చూస్తాడు. కోండ్ జాతి పురాగాథలో మొదటి కోండ్ జాతి మానవులు జింక హెచ్చరికతో ఒక పడవను నిర్మించుకొని ప్రళయం నుండి తప్పించుకుంటారు. ముండా జాతి పురాగాథ ప్రకారం ప్రపంచమంతా ప్రళయంతో అంతమైనా రమ్మ, భిమ్మలు మాత్రం సజీవులుగా ఉండి పున:సృష్టి చేస్తారని ఉంది. భిల్లుల పురాగాథలో ఒక చేప హెచ్చరికతో కొందరు ఒక పంజరంలో కొన్ని గుమ్మడి గింజలు నీరు, కోడిని భద్ర పరుచుకొని ప్రళయానంతరం పున:సృష్టి చేస్తారని ఉంది. ఆల్ గోన్ క్లిన్ పురాగాథలో ప్రళయం వచ్చినప్పుడు కొందరు పుణ్యాత్ములు తాబేలుపై దూకి ప్రాణాలను రక్షించుకుంటారు. ఒక పక్షి ద్వారా మట్టిని తెప్పించుకొని నూతన జీవితాన్ని ప్రారంభిస్తారు. గ్రీకు పురాగాథలో ప్రళయం వచ్చినప్పుడు డెన్ కాలిన్ అతని భార్య పైరా మాత్రం గ్రీక్ దేవతల అనుగ్రహంతో జీవించి పున:సృష్టి చేస్తారని ఉంది. భగవదనుగ్రహం కలిగిన లేదా భగవదంశ కలిగిన కొందరు పుణ్యాత్ముల కారణంగా పున:సృష్టి జరుగుతుందని ఆదిమ మానవుని భావన ప్రాగ్రూపంగా ప్రతిఫలించడమే ఈ గాథలలోని సారూప్యతలకు కారణం.

భగవదనుగ్రహం కొరకు, కోరికలు తీరుటకు ఉత్సవ సమయాలలో బలి ఇవ్వడం భారత దేశంలోని శిష్ట సాహిత్యంతో పాటు జానపద సాహిత్యంలోనూ కని పిస్తుంది. అలాగే ప్రపంచంలో అనేక జానపద గాథలలో కనిపిస్తుంది. గ్రీక్ దేశానికి చెందిన జీస్ లైకాఇన్, కింగ్ లైకా ఇస్ కథలో రాజు తన కొడుకును చంపి అతని మాంసాన్ని జీస్ దేవతతో కలిసి భుజించినట్లు ఉంది. ఇది తెలుగులోని చిరుతొండనంబి కథలాగా కనిపిస్తుంది. ఇలాంటివే కెల్టిక్, ఐరిష్, ఇరాన్, అరబ్, హిబ్రూ, జపాన్, ఈజిప్ట్ పురాగాథలలో ఉన్నట్లు ఎన్‌సైక్లో పీడియా అండ్ ఎథిక్స్ అనే గ్రంథం ద్వారా తెలుస్తుంది. ఇదే గ్రంథంలో గ్రామ దేవతలకు పౌరణిక దేవతలకు పుట్టు వెంట్రుకలు సమర్పించే ఆచారం అనేక దేశాలలో ఉన్నట్లు కనిపిస్తుంది. రోమ్, అరేబియా, సీరియా, దేశాలలో యువతి యువకులు తమ వెంట్రుకలను దేవతలకు సమర్పించి నట్లు కొన్ని కథలున్నాయి. గ్రీక్ దేశంలోని కొన్ని జాతులలో పెళ్ళికి ముందు అమ్మాయిలు తమ వెంట్రుకలను భగవంతునికి సమర్పించే ఆచారముంది. ఇటువంటి ఆచారం భారతదేశంలోనూ కనిపిస్తుంది. ఇలాంటి ఆచారాల వేనుక అనాది మానవుని అనుభవాలే ప్రాగ్రూపా లుగా కనిపిస్తాయి. జానపదులు పౌరాణిక దేవతల కంటే స్త్రీ దేవతలైన గ్రామ దేవతలకు అధిక ప్రాధాన్యతను ఇస్తారు.

భారతదేశంలోనే గాక మెక్సికో, గ్రీక్, రోమన్, ఈజిప్ట్ దేశాలలో కూడా స్త్రీ దేవతలను నస్య దేవతలుగా పూజిస్తారని డా.రావి ప్రేమలత పరిశోధన ద్వారా తెలు స్తుంది. పిత్రుదేవతారాధన కూడా ప్రపంచమంతా ఆచ రించబడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. పంటలు పండిన తరువాత ఉత్సవాలు చేయడం కూడా అనేక దేశాలలో కనిపిస్తుందని ఆమె వివరించారు. జానపద పురగాథ లలోని ప్రాగ్రూపాల అధ్యాయనం ద్వారా అనేక మౌలికాం శాలు తెలుస్తాయి. ప్రపంచంలోని సామాజమంతా ఒకే రకమైన ఆలోచనా విధానం కలిగి ఉంటుందనే విషయం అవగతమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. సుప్రసన్నాచార్య, కోవెల (1993). భావుకసీమ (సాహిత్య వ్యాస సంపుటి) హైదరాబాద్ : యువభారతి.
2. ప్రేమలత, రావి(1983). తెలుగు జానపద సాహిత్యము పురాగాథము. సికింద్రాబాద్ : అవేర్ ప్రింటింగ్ ప్రెస్

3. ప్రేమలత రావి (2015). అలోకనం. హైదరాబాద్ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.
4. (2010) పరిశుద్ధ గ్రంథం (బైబిల్). బెంగుళూరు : బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా.
5. నళిని, ఎస్.ఎస్. (2009). సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. హైదరాబాద్ : నవోదయ బుక్‌హౌస్.
6. కృష్ణ కుమారి, నాయని (1977). తెలుగు జానపద గేయ గాథలు. హైదరాబాద్ : ఆంధ్ర సారస్వత పరిషత్తు
7. Elwin,Verrier (1949). Myths of Middle India. madras : Oxford University (Indian Branch)
8. Jung (1972). Archetypes of the Collective unconscious. in David lodge (Ed). 20th century criticis, london : Longman group Ltd.
9. Campbell, J. (1956) The Hero with a Thousand faces. New jersey : Princeton univercity press.
10. The world Book of encyclopedia (1960) Vol : 21

❖ ❖ ❖

బంజారా భాషా సాహిత్యం – సంస్కృతి

– డా॥. వి.గోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతదేశంలో దాదాపు 600 గిరిజన తెగల వారున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బంజారాలు 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 9.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 5.6 శాతం ఉన్నారు. లంబాడీలు మైదాన మరియు అటవీ ప్రాంతాలలో నివశిస్తున్న ఒక గిరిజన తెగ. వీరు ప్రపంచమంతటా వ్యాపించి ఉండడమే కాకుండా వీరికి 47 పేర్లు వాడుకలో ఉన్నాయి. వీరినిమన దేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. ఒక్క తెలంగాణలోనే లంబాడీ, బంజారా అనే పేర్లు వాడుకలో ఉన్నాయి. భారతదేశంలో ఈ లంబాడీల జనాభా, దేశ జనాభాలో 10 శాతం వరకు ఉండవచ్చని ఒక అభిప్రాయం. భారతదేశంలో ఉత్తరాది రాష్ట్రాల తరువాత దక్షిణాది రాష్ట్రాల్లో వీరి జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వరుసగా తెలంగాణా, కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్‌లు.

భాష :

ఒక క్రమంలో అమరిన అర్థవంతమైన ధ్వనుల సముదాయాన్ని శాస్త్రీయంగా ''భాష'' అంటారు. ప్రపంచంలో ఎన్ని భాషలున్నప్పటికీ ఏదో ఒక భాష మాత్రమే వ్యక్తికి స్వంత భాష అవుతుంది. కాగా ఇతర భాషలన్నీ అతనికి పరిచయమున్న భాషలుగానే వ్యవహరించబడతాయి. ఈ నేపథ్యంలో భాష అనే పదానికి పూర్వానుబంధం చేరి మాతృభాష ప్రథమ భాష, ద్వితీయ భాష, అంతర్జాతీయ భాష, అధికార భాష లాంటి వైవిధ్యాలు ప్రపంచంలో ఉన్నాయి. వీటిలో మాతృభాష తప్ప ఇతర భాషలన్నీ వ్యక్తిగత సాంఘీకరణానికి, నాగరిక సంపర్కానికి సంబంధించినవి. నాగరికత, సాంకేతిక పురోగతి మేరకు విద్యారంగానికి, ఏర్పడ్డ అపార ప్రాధాన్యం దృష్ట్యా భాష కూడా తగిన ప్రాధాన్యం సంతరించుకుంది. లంబాడీలు దేశమంతా విస్తరించి ఆయా ప్రాంతీయ భాషలు మాట్లాడగలిగినప్పటికీ తిరిగి అందరూ కలసి ఒకే భాషలో మాట్లాడటం ఒక విశేషంగా చెప్పవచ్చు. ''బంజారా భాషా'' ఎన్నో సంవత్సరాలుగా ప్రకృతి జీవనంలో ముడిపడి తన సంస్కృతి సంప్రదాయాలను, సాహిత్యాన్ని, జానపద విజ్ఞానాన్ని మౌఖిక రూపంలో ముందు తరాలకు అందిస్తూ వస్తుంది. బంజారాల వేష భాషలను, జీవన విధానాన్ని, వైభవాన్ని ప్రపంచానికి చాటడంలో బంజారా భాష ''గోర్ బోలి'', బంజారా సాహిత్యం రెండూ ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

భారతదేశంలో 398 భాషలున్నట్లు భాషావేత్తల అభిప్రాయం. అందులో 99 భాషలు విలువైనవైనాయి. ఐదుకోట్ల కంటే ఎక్కువ జనాభా మాట్లాడే భాషలు హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ, తమిళం తరువాత బంజారా భాష 'గోర్‌బాలీ'దే. గోర్‌బోలీకి ''లిపి'' లేకపోవడం లేదా లిపిని ఎంచుకొని భాషాభివృద్ధికి ప్రయత్నాలు జరగక పోవడంవల్ల వారి సాహిత్యంలోని సౌందర్యం బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు. తద్వారా బంజారా జాతి ఎంతో నష్టపోయింది. వారి భాషాసాహిత్యాలు అంతరించిపోతున్న భాషల సరసన చేరిపోయాయి.

భాష అనేది ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని పరిరక్షించే బలమైన సాధనం. సాహిత్యం ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని ప్రపంచానికి చాటే సాధనం. భాష, సాహిత్యం రెండూ అభివృద్ధి చెందాలంటే అట్టి భాషకు ఒక 'లిపి' అనేది ఉండాలి. మౌఖిక భాష సాహిత్యాన్ని ఒకరి నుండి మరొకరికి చేరవేస్తుంది. కానీ వాగ్రూపంలోని సాహిత్యానికి లికితరూపం ఇచ్చి శాశ్వతత్వాన్ని చేకూర్చేది లిపి మాత్రమే. అటువంటి లిపి బంజారాలకు లేకపోవడం ప్రధాన సమస్య. కాబట్టి ఇట్టి భాషకు దేశమంతటా ఒకే లిపిని వాడకంలోకి తేవాల్సిన అవసరం ఉంది. బంజారాల

వేషభూషణాదులు ఎంత విలక్షణమైనవో వారి భాష కూడా అంతే విశిష్టమైనది. భారతదేశంతటా నివసిస్తున్న దాదాపు ఏడు కోట్ల మంది మాట్లాడే భాషను "గోర్‌బోలి" సుమారు "ఆరువేల" సంవత్సరాల పూర్వమైందని భాషావేత్తల అభిప్రాయం. బంజారా భాషను మిగతా భారతీయుల భాషలతో పోలిస్తే ఉత్తర భారతదేశ భాషలైన హిందీ, రాజస్థానీ, గుజరాతి, మరాఠి మొదలైన భాషలతో దగ్గర సంబంధం కలిగి ఉంది. కాబట్టి బంజారాల 'గోర్‌బాలి" ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినదిగా భాషా వేత్తలు నిర్ధారించారు.

బంజారా శబ్దం 'వాణిజ్యం' అనే సంస్కృత పదం నుండి 'బనజ్' అనే హిందీ శబ్దం 'బనజ్' నుండి 'బంజారా' రూపొందిందని భాషా పరిశోధకులు పేర్కొన్నారు. వీరు వివిధ రాష్ట్రాల్లో ఒకే భాష (గోర్‌బోలి)ని ఉపయోగిస్తున్నప్పటికీ ఆయా రాష్ట్రాల్లో బంజారాలు వివిధ నామాలతో పిలువబడుతున్నారు. రాజస్థాన్‌లో వీరిని 'గవారియా' లేదా 'గమాలియా' అని ఢిల్లీ హర్యానాలలో 'సిరికిబాండ్' అని, పంజాబ్‌లో 'సిరికివాలా' అని మిగతా రాష్ట్రాల్లో బంజార, వనచర, బ్రంజారి, బ్రజ్వాసి, లఖాన్, సఖాన్, సబాన, బళదియా, లదణియా అని, కర్ణాటకలో 'లమాన్', లంబాణి, మహారాష్ట్రలో 'సింగడి బంజారా', కేరళలో 'గహర్' తెలంగాణలో 'లంబాడి', రాయలసీమలో 'సుగాలి' అని పిలుస్తారు.

బంజారా భాష ఎదుర్కొంటున్న సమస్యలు :

భారతదేశ వ్యాప్తంగా ప్రమాదంలో ఉన్న భాషలు 196. అత్యంత ప్రమాదంలో ఉన్న భాషలు 35. గడచిన 50 సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 20 భాషలు కనుమరుగైనాయని "ది లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా" వారు పేర్కొన్నారు. లంబాడీ భాష కూడా ప్రస్తుతం అంతరించిపోతున్న భాషల జాబితాలో చేరింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న లంబాడీలు గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు మాధ్యమంలో చదువుకోవడం. పట్టణ ప్రాంతాల్లో కొందరు ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం, ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడటం, ప్రసార సాధనాలు మాతృభాషలో లేకపోవడం అలాగే ఇంటి దగ్గర కూడా మాతృభాషలో మాట్లాడుకోక పోవడంవల్ల నేడు ఈ భాష అంతరించే స్థాయికి చేరింది. భాస అంతరించిపోవడం ద్వారా తన వాళ్ళ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పాటలు, ఐతిహ్యాలు కవిత్వం మొదలైనవి నశించిపోతాయి. అంతేకాకుండా వాటిని ఇతర భాషల్లోకి యధాతథంగా అనువదించలేము. దాని ద్వారా వాళ్ళ జాతికి గుర్తింపు తక్కువ. తద్వారా సామాజిక వెనులుబాటుతనం కన్పిస్తుంది.

బంజారా భాషపై తెలుగు భాష ప్రభావం మన రాష్ట్రంలో దాదాపు రెండు వందల సంవత్సరాలుగా ఉంది. సాధారణంగా ఏ తెలుగు పదాన్నైనా సులభంగా ఇముడ్చుకోగల భాషా సహనం బంజారాలకు సాంస్కృతికంగా వచ్చిన వారసత్వం. ఏ భాష అయినా మాట్లాడే వారు లేకపోతే, కొన్ని రోజులకు ఆ భాష అంతరించే అవకాశం ఉంది. ఉదాహరణకు బంజారా భాషను చూసినట్లయితే రానురాను ఆ జాతి వారే వారి భాషను మాట్లాడకుండా ఆధునిక నాగరికతకు అలవాటుపడి వారి భాషనే మర్చిపోయే ప్రమాదం ఉంది.

బంజారా సంస్కృతిలో స్త్రీల అలంకరణ :

బంజారా స్త్రీలు కుట్టులోను, కట్టులోను ఎంతో నైపుణ్యం కలవారని వీరి వస్త్రాలను చూసి చెప్పవచ్చు. ఎందుకంటే వారు తమ వస్త్రాలను స్వయంగా రంగురంగు గుడ్డలతో, రంగు రంగు దారాలతో కుట్టుకుంటారు. వీరి వస్త్రాలపైన కుట్టిన కుట్లు కీడి (బీయకుట్టు), మాకి (ఈగవాట్టు), సస్వార్ దాంట్ (కుందేలు పళ్ళు) అనే జంతువుల పేర్లు ప్రత్యేకంగా కనిపిస్తాయి. వీరి జీవనం ప్రకృతితో మమేకమై ఉంటుంది. అందుకు వారి వస్త్రాలపై కుట్టినకుట్లే నిదర్శనం అని చెప్పవచ్చు.

ఫేట్యా (లంగా) :

బంజారా స్త్రీలు రంగు రంగుల గుడ్డలు తీసుకుని వాటిపై చిన్న పెద్ద అద్దాలు (కాచే,ఆర్సి), పూసలు (లార్డీ),

రంగురంగుల దారాలతో కుట్టి అలంకరిస్తారు.దీనినే పొటేరో ఫేట్యా (పట్టు లంగా) అంటారు. లంగాను నడుంకు కట్టుకోవడానికి డోరణ్ (బొందేలు) అనే వాటిని దారంతోగాని లేదా గుడ్డతో గాని తయారు చేసి తాళ్లను అమరుస్తారు. వాటికి చివరల్లో రంగురంగుల దారాలతో పూందా (దారపు గుత్తి)ను అమరుస్తారు. ఈ ఫేట్యా చాలా కళాత్మకంగా తయారు చేసుకొని ధరిస్తారు.

కాళీ - పేటీ (రవిక) :

బంజారా స్త్రీలు రంగు రంగుల గుడ్డల్ని తీసుకొని, వాటిపై దారంతో చిన్నపాటి పూసల (లాల్డీ)తోనూ, చిన్న చిన్న అద్దాలు (కాచే)తోనూ, మధ్యలో పెద్ద అద్దాలు (ఆర్సితో) వాటి చుట్టూ రంగురంగుల దారాలతో స్వయంగా రవికెను (కాళి) తయారు చేసుకుంటారు. అలాగే ఈ కాళి (రవిక)కి కుడి, ఎడమ భుజాలపై ఖవ్య అనే వాటిని అమరుస్తారు. ఈ ఖవ్యపై చిన్న పెద్ద అద్దాలు, వాటి చుట్టూ రంగు రంగుల పూసలు, వాటి చివరల్లో వెండి మువ్వల్ని రూపేర్ ఘని మధ్యలో చిన్నపాటి వెండి బిల్లలు అమర్చి కుట్టుకుంటారు. అలాగే కడుపుపై ముందు భాగంలో ఈ రవికకు కిందపేటీ అంటే డబ్బులు దాచుకునే చిన్నపాటి జేబును అందంగా తయారు చేసి అమరుస్తారు. ఈ కాళీ (రవిక) చాలా చూడముచ్చటగా, ఎంతో నైపుణ్యంతో తయారు చేసుకుంటారు.

ఛాంటియా :

ఇది లంబాడీ స్త్రీలు తలపై నుండి రెండు వైపుల ధరించే పైట. దీనిపై వివిధ ఆకారాలతో ఉన్న గాజు ముక్కలను అమరుస్తూ ఎంబ్రాయిడరీ చేస్తారు. దీనికి రెండువైపులా లామణ్‌ను జోడించి కుడతారు. ఈ ఛాంటియాకు తలపై నుండి రెండు భుజాలపై లేలాడు తున్నట్లుగా ఘుంగటో అనేది తయారు చేస్తారు. ఇదిఆరు అంగుళాల వెడల్పు ఒక మీటరు పొడవుతో ఉంటుంది. దీనికి ముందు భాగంలో వెండి బిళ్ళలు వరుసగా కుడతారు. అలా కుట్టిన ఘుంగటోను రూపేర్ ఘుంగట్ అంటారు. వెండి గజ్జలు వేసి కుట్టిన వాటిని రూపేర్ ఘుగరార్ ఘుంగటో అంటారు. ఛాంటియా మధ్యభాగంలో చాంద్ పేరుతో పట్టు దారాలతో పెద్ద కుచ్చులు కడతారు. దీనిని 'పుండా' అంటారు. ఈ కుచ్చులకు గవ్వలను జత చేసి కుడతారు. ఇవి ఛాంటియా వెనుక భాగంలో పూలకుచ్చులుగా వేలాడుతుంటాయి. ఛాంటియా ధరించి నపుడు, తల కుచ్చులకు కట్టిన గుజరీలు అనే వెండి, ఇత్తడి అలంకరణలు చెంపల మీదుగా వేలాడు తుంటాయి.

ఛాంటియా (ముసుగు) ధరించే సంప్రదాయం ఇప్పటికి బంజారాల్లో ఉంది. వారి వేషం మారినా ఏడుపు సంప్రదాయం మారలేదు. వారి దుఖ్ఖాన్ని ప్రకటించే టప్పుడు ముసుగు వేసుకుని ఏడుస్తారు. ముసుగు పద్ధతి ఇప్పటికి మార్వాడీ స్త్రీల్లోనూ, రాజస్థానీ స్త్రీల్లోను, ముస్లిం స్త్రీల్లోను కనపడుతుంది. దీని ప్రధాన ఉద్దేశం పరాయి పురుషులకు ముఖం చూపించకూడదనేది వారి సంస్కృతిలో భాగం.

వికాస మార్గాలు :

భాష అనేది ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని పరి రక్షించే బలమైన సాధనం. సాహిత్యం ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని ప్రపంచానికి చాటే సాధనం. భాష, సాహిత్యం రెండూ అభివృద్ధి చెందాలంటే అట్టి భాషకు "లిపి" అనేది ఉండాలి. మౌఖిక భాష సాహిత్యాన్ని ఒకరి నుండి మరొకరికి చేరవేస్తుంది. కానీ వాగ్రూపంలోని సాహిత్యానికి లికితరూపం ఇచ్చి శాశ్వత్వాన్ని చేకూర్చేది లిపి మాత్రమే. అటువంటి లిపి బంజారాలకు లేకపోవడం ప్రధాన సమస్య. కాబట్టి ఇట్టి భాషకు దేశమంతటా ఒకే లిపిని వాడుకలోకి తేవాల్సిన అవసరం ఉంది.

పరిశీలన గ్రంథాలు :

1. తెలుగు భాషాధ్యయనంలో లంబాడీ విద్యార్థుల సమస్యలు - పరిష్కారాలు, డా.వి.గోపాల్, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
2. సుగాలి సంస్కృతి, భాష మరియు సంస్కృతి - ఎం.గోనా నాయక్.
3. లంబాడీ భాషా సాహిత్యాలపై తెలుగు భాష ప్రభావం - భూక్య తిరుపతి, ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం (అముద్రితం).
4. నల్గొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ - సూర్య ధనుంజయ్.
5. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి - చిన్యా నాయక్, బి.శ్రీలక్ష్మీ ప్రాసెస్, బెంగళూరు.
6. నల్గొండ జిల్లా బంజారాల మౌఖిక కథలు - డా.సిల్మానాయక్, ఎ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య గ్రంథాలయ పరిశోధనాలయం - హైదరాబాద్.

❖ ❖ ❖

జానపదుల జాతరలు – కొత్తపేట గంగానమ్మ పెద్దింట్లమ్మవార్ల జాతర

– తంగి ఓగేశ్వరరెడ్డి, తెలుగు అధ్యాపకులు, వి.వి.గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప.

హిందూ సంప్రదాయంలో దేవతలను, దేవుళ్ళను, పుణ్య స్త్రీలను, మహిమ గల స్త్రీ, పురుషులను పూజించడం అనాదిగా వస్తుంది. ఏదైనా ఒక దేవతను గాని, దేవుడ్ని గాని కొన్ని నిర్ధిష్టమైన రోజుల్లో పూజించి, పండగ చేయడాన్ని జాతర అంటారు. జాతరని యాత్ర అని కూడా అంటారు. ప్రతి గ్రామానికి ఒక గ్రామ దేవత ఉన్న మన దేశంలో ప్రతి సంవత్సరం లెక్కలేనన్ని జాతరలు జరుగుతున్నాయి.

గ్రామస్తును చల్లగా చూస్తూ, అంటువ్యాదుల నుండి రక్షిస్తూ, పంటలను పచ్చగా ఉండేలా చేస్తూ, గ్రామాన్ని భూత ప్రేతాలన నుండి రక్షిస్తూ గ్రామ పొలిమేరలో సదా కాపుకాస్తూ ఉండే దేవతే గ్రామ దేవత. గ్రామ దేవతల పూజా విధానం తరతరాలుగా మనకు వస్తున్న గ్రామీణ సంప్రదాయం. మానవుడు తన నిత్యజీవితంలో అనేక జయాపజయాలను చవి చూస్తున్నాడు. మరోవైపు తన లక్ష్య సాధన కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. మాతృదేవతారాధనలో సకల చరాచర సృష్టికి మూల కారకురాలు మాతృదేవత అని గ్రహించిన పురాతన మానవుడు, ఆమెను సంతృప్తి పరచేందుకు అనేక మార్గాలను ఆశ్రయించాడు. అందులో ప్రార్థన, మంత్ర తాంత్రికతలు, పవిత్రీకరణ, ఆత్మహింస, బలి అనేవి ప్రధానంగా కనిపిస్తాయి. ఈ విధమైన గ్రామ దేవతా లక్షణాలు కలిగిందే కొత్తపేట నందలి గంగానమ్మ, పెద్దింట్లమ్మ వార్ల జాతర.

కొత్తపేట గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం సిద్ధాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో కొల్లేటి సరస్సును ఆనుకొని ఉన్న చిన్న గ్రామం. ప్రస్తుతం కళింగ సామాజిక వర్గంవారు ఈ గ్రామంలో ఎక్కువ మంది నివశిస్తున్నారు. వీరు ఉత్తరాంధ్ర నుండి ఇక్కడికి వలస వచ్చారు. వీరు ఈ ప్రాంతానికి రాక పూర్వం ఈ గ్రామంలో వడ్డెరలు నివశించేవారు.ఈ వడ్డెరలు కొల్లేటి పరివాహక ప్రాంతంలో ప్రాచీన కాలం నుండి ప్రసిద్ధి పొందిన వారు.వీరు ప్రస్తుతం ఒడిస్సా నుండి గజపతుల కాలంలో ఆంధ్రదేశానికి వచ్చి కొల్లేటి ప్రాంతంలో స్థిరపడ్డారు. వీరి ప్రధాన వృత్తి చేపలను పట్టడం. వీరు ఇక్కడికి వచ్చి కొన్ని శతాబ్దాలు గడుస్తున్నా భాషా సంస్కృతి విషయంలో ఇప్పటికీ తమ ప్రాచీనతను కొంతవరకు నిలుపుకున్నారు. వీరి ఆరాధ్య దైవం పెద్దింట్లమ్మ వారు. నేటి కృష్ణా జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో ఈ అమ్మవారికి ప్రాచీన దేవాలయం కలదు. కొల్లేటి సరస్సు నడిబొడ్డున శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ అమ్మవారి ఆలయంలో తొమ్మిదడుగుల పైబడి విశాల నేత్రాలతో పద్మాసన భంగిమలో అత్యద్భుతంగా దర్శినమిచ్చే అమ్మవారిని దర్శించేందుకు ఇతర రాష్ట్రాల నుండి సైతం భక్తులు వస్తారు.ఏటా పాల్గుణ శుద్ధ పాడ్యమి నుండి పౌర్ణమి వరకు జరిగే ఉత్సవాల్లో పాల్గుణ శుద్ధ ద్వాదశి రోజున పెద్దింట్లమ్మ సమేత జలదుర్గకు కొల్లేటికోట సమీపాన గల గోకర్ణేశ్వర స్వామి వారికి కళ్యాణం జరిపిస్తారు.

చారిత్రక నేపధ్యం :

తూర్పు చాళుక్య రాజైన జయసింహవల్లభుని కాలంలో చైనా బౌద్ధ యాత్రికుడైన హ్యూయాన్ త్సాంగ్ వేంగి, కొల్లేరు ప్రాంతాల్లో పర్యటించారు. చాళుక్యుల కాలంలో కొల్లేరుకు 'కొలను విషయ, సాగర విషయ' అనే పేర్లు

ఉన్నట్లు 1985లో వెలువడిన 'రూల్ ఆఫ్ చాళుక్య - చోళాస్ ఇన్ ఆంధ్రదేశ' అనే పుస్తకంలో యం.కృష్ణకుమారి గారు తెలియజేశారు.వేంగి చాళుక్యులకు, సరోనాథులకు పరిపాలనా బాంధవ్యాలు ఉండేవి. అయితే సుమారు క్రీ.శ.1076 కాలంలో వీర విజయాదిత్యుడు (6వ విజయాదిత్యుడు) మరణంతో వేంగిలో చాళుక్యరాజుల పాలన అంతరించింది.

యశోదాదేవి గారు తాను రచించిన 'హిస్టరీ ఆఫ్ ఆంధ్రా కంట్రీ' అనే పుస్తకంలో ఈ సరోనాథుల గురించి ప్రస్తావించారు. సరోనాథులు లేక కొలను మండలీకులు సరసిపుర(నేటి ఏలూరు) రాజధానిగా చేసుకొని కొలను విషయను పరిపాలించారు.సరోనాథులలో ప్రముఖుడు తెలుగు భీముడు.ఇతని పేరు మీద వెలసిన గ్రామమే నేటి భుజబలపట్నం. దండి మహాకవి తన దశకుమార చరిత్రలో తెలుగు భీముని గురించి గొప్పగా రాశాడు. తెలుగు భీముడు తూర్పు గాంగుల (గంగా సామ్రాజ్యం) రాజులైన కళింగ వజ్రహస్త, రాజరాజ, అనంతవర్మ చోడ గంగా అనే రాజులకు విధేయుడిగా ఉండేవాడు. అంతే కాదు చాళుక్య రాజైన 6వ విక్రమాదిత్యునికి కూడా విధేయుడిగా ఉండేవాడు. క్రీ.శ.1076లో 6వ విజయాదిత్యుని మరణం తర్వాత వేంగి రాజుల పాలన ముగిసింది. వేంగి రాజు కులోత్తుంగ చోళుడు(రాజరాజ నరేంద్రుని కొడుకు)తన 4వ కొడుకైన విక్రమచోళుడ్ని వేంగిపురానికి మహారాజును చేశాడు. విక్రమచోళుడు శాలివాహనశకం 1042 (క్రీ.శ. 1120)లో పరిపాలనలో ఉన్నట్లు కర్ణాటక రాష్ట్రంలోని సిద్దగట్ట శిలాశాసనాన్ని బట్టి తెలుస్తుంది (ఎపిగ్రఫియా కర్నాటిక వాల్యూమ్ పార్ట్ -1). వేంగిలో విక్రమచోళుడి విదేశీపాలన ప్రమాదంగా భావించి తెలుగు భీముడు తిరుగుబాటు చేస్తాడు. ఈ యుద్ధంలో విక్రమచోళుడి చేతిలో తెలుగు భీముడు మరణించినట్లు అనేక శిలాశాసనాల్లో పొందుపరచడమైంది. తర్వాత కొన్ని తమిళ శిలాశాసనాలు బట్టి విక్రమచోళుడు దక్షిణ ప్రాంతాన్ని ఏలడానికి ఉత్తర ప్రాంతమైన వేంగిని వదిలేశాడని తెలుస్తుంది. ఈ విషయం ఎపిగ్రాఫియా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సథరన్ సర్కిల్ అనే పుస్తకంలో కూడా ఉంది.

స్థానికుల కథనాల ప్రకారం ఒరిస్సా రాజులు కొల్లేటి కోట ప్రాంతాన్ని పరిపాలించారు. పూర్వం కొల్లేటికోటలో లంగుల్య గజపతిరాజు కోట ఉండేది.ఆ కోటను వశం చేసుకోవటానికి మహ్మదీయులు కొల్లేరు సరస్సు సమీపంలోని చిగురుకోట వద్ద డేరా వేసి ఒక కాలువను తవ్వి (నేటి ఉప్పుటేరు) సరస్సును సముద్రంలోకి ఇంకించి గజపతి కోటను ఆక్రమించాలని చూస్తాడు. అప్పుడు గజపతి రాజు యొక్క ఒకానొక సైన్యాధ్యక్షుడు యుద్ధం సఫలం కావాలని తన సొంత కూతురైన పేరంటాలమ్మను బలి ఇవ్వబోతుంటే ఆవిడ ఒక శక్తి స్వరూపంగా మారి మహిషాసురమర్దినిగా శత్రువులను సంహరించింది. ఈ సంఘటన జరిగిన కాలువను పేరంటాల కనుమగా నేటికీ పిలుస్తారు. తరువాత లంగుల్య గజపతిరాజు సైన్యాధిపతి పేరంటాలమ్మను పూర్వమే ఉన్న ఆలయంలో విగ్రహ రూపంలో శక్తి స్వరూపిణిగా సుమారు (క్రీ.శ. 1237-82) మధ్య కాలంలో ప్రతిష్ఠించాడు. అందుకే ఆవిడ నేటికీ కన్యగానే ఉండి ఈ ప్రాంతాన్ని కాపాడుతుందని ప్రజలు భావిస్తారు. పేరంటాల కనుమ నేటి పెద్దింట్లమ్మ దేవాలయం ప్రక్క ఉన్న కాలువగా అర్థం అవుతుంది. అయితే ఒరిస్సాలోని పూరి జగన్నాధ ఆలయంలో లంగుల్య గజపతిరాజు ముని మత్తాత తాము సూర్యవంశస్థులమనీ, గంగేయ వారసులమనీ మాడలపంజి శిలాశాసనంలో వ్రాయించాడు. కాగా నేడు కొల్లేటి సరస్సు పరీవాహక ప్రాంతంలో నివశించే వడ్డీల కథనాలు, అనేక పత్రికా కథనాల ప్రకారం వీరంతా సూర్యవంశానికి చెందిన వారనీ, లంగుల్య గజపతిరాజు పరిపాలనలో ఇక్కడికి ఒరిస్సా నుండి వలస వచ్చారనీ అర్థమవుతుంది. పూర్వం వీరు ఒరిస్సా నుండి వచ్చిన క్షత్రియులు కావడంతో ఒడియ రాజులుగా (వడియరాజులు) పిలువబడేవారు. ప్రస్తుతం

వడ్డీలుగా పిలువబడుతున్నారు. వీరి కులదైవం పేరంటాలమ్మ నేడు పెద్దింట్లమ్మగా పిలువబడుతుంది.

మొదట కొత్తపేట గ్రామం వడ్డీల నివాస స్థలం కావడంతో వారు తమ ఆరాధ్యదైవమైన అమ్మవారికి జాతర నిర్వహించేవారు. క్రమంగా ఆ గ్రామంలో కళింగ సామాజిక వర్గం వారు స్థిర నివాసాన్ని ఏర్పరుచుకున్నారు. ఇప్పుడు అక్కడ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఈ గ్రామాలకు సరిహద్దు గ్రామాలైన నందమిల్లిపాడు, చినమిల్లిపాడు గ్రామాలలో ఇప్పటికీ వడ్డీలు నివశిస్తున్నారు. కానీ వీరిలో ఎక్కువ మంది క్రైస్తవ మతంలోకి మారడంతో ఈ జాతర నిర్వహించడంలేదు. కానీ ఇప్పటికీ కొత్తపేట గ్రామంలోని కళింగ, ఇతర సామాజిక వర్గాల వారు ఈ జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

కొత్తపేట గ్రామం తూర్పు పడమరగా వ్యవస్థీకరించ బడినది. పడమర సరిహద్దుగా ఒక రాయి, తూర్పు సరిహద్దుగా చింతచెట్టు క్రింద కొన్ని రాళ్ళు నిలబెట్టబడి ఉన్నాయి. వీటిలో పడమర సరిహద్దువైపు ఉన్నది పెద్దింట్లమ్మ అమ్మవారిగానూ, తూర్పు సరిహద్దుగా ఉన్నది గంగానమ్మగా గ్రామస్థులు భావించి పూజిస్తారు.

ప్రస్తుతం ఈ దేవతలకు చిన్న దేవాలయాలు కూడా నిర్మించారు. సాధారణంగా కొల్లేరు ప్రాంతలోని ఇతర గ్రామాలలో ఏదో ఒక గ్రామదేవత పేర జాతర నిర్వహచడం మనం చూస్తూనే ఉన్నాం. కానీ ఇక్కడ పెద్దిట్లమ్మ, గంగానమ్మ ఇద్దరి అమ్మవార్ల పేర జాతర నిర్వహిస్తారు. ఇది ఈ జాతర ప్రత్యేకత. అదే విధంగా ప్రధాన దేవతైన పెద్దింటమ్మ అమ్మవారి కంటే ముందు గంగానమ్మకు ముర్రాట (పసుపునీళ్ళు) పోయటం, మేకపోతు బలివ్వడం మరో ప్రత్యేకత.ప్రతీ సంవత్సరం సంక్రాంతి వెళ్ళిన తరువాత వచ్చే పౌర్ణమికి ముందు ఆదివారం ఈ జాతర నిర్వహిస్తారు.

ఈ జాతరకు ముందు ఆదివారం గ్రామస్తులంతా సమావేశమై గ్రామ పెద్దలను ఎన్నుకుంటారు. ఈ గ్రామ పెద్దలే జాతరను నిర్వహిస్తారు. జాతరకు అయ్యే ఖర్చును నిర్ణయించి గ్రామంలోని ప్రతీ ఇంటిపై సమానంగా వేస్తారు. అదేవిధంగా గ్రామంలో జాతర నిర్వహణ తేదీని ప్రకటించి గ్రామంలో చాటింపు వేస్తారు. జాతర నిమిత్తం రెండు పెద్ద మేకపోతులను కొనటం, జాతర ఏర్పాట్లను వీరే చూస్తారు. జాతరలో ఎటువంటి వివాదాలు లేకుండా విజయంతంగా నిర్వహించవలసిన బాధ్యత వీరిపైనే ఉంటుంది. జాతర నిర్వహించడంతో పాటూ మరల వచ్చే జాతర వరకు గ్రామంలో ఎటువంటి వివాదాలు జరిగినా వాటిని పరిష్కరించే బాధ్యత వీరిదే. ఈ విధంగా గ్రామ పెద్దలు జాతర నిర్వహణలో అత్యంత ప్రముఖపాత్ర పోషిస్తారు.

ఈ జాతరలో రజకుల పాత్ర అత్యంత కీలకం. గ్రామ పెద్దలు జాతర తేదీని ప్రకటించిన నాటినుండి వీరి పాత్ర ప్రారంభమవుతుంది. జాతర తేదీలను, ఒక్కక్క కుటుంబం చెల్లించవలసిన డబ్బులు గ్రామంలో చాటింపు వేసేది వీరే. ఈ గ్రామంలో అయిదు వరకు రజక కుటుంబాలు ఉన్నాయి. వీరంతా ఉమ్మడిగా ఈ జాతరలో తాము నిర్వహించవలసిన విధులను నిర్వహిస్తారు. జాతర ముందురోజు పెద్దింటమ్మ, గంగానమ్మ అమ్మవార్ల విగ్రహాలను తడిపి వాటికి పసుపు అద్దటం, ఆ విగ్రహాల చుట్టూ శుభ్రం చేయడం, జాతర మేకపోతులను ప్రతీ ఇంటికీ తిప్పడం, విగ్రహాల వద్ద వాటిని బలి ఇవ్వడం, ప్రతి ఇంటి వారు బలిచ్చే కోళ్ళను వారింటికి వెళ్ళి కోయడం మొదలగు పనులు వీరు చేస్తారు. బలిచ్చే మేకపోతుల తలలు, కాళ్ళు, కోళ్ళు తలలు వీరే తీసుకుంటారు. ప్రస్తుతం వీరు కోళ్ళ తలలకు బదులుగా డబ్బులు తీసుకుంటున్నారు. ఈ విధంగా జాతర నిర్వహణలో రజకుల పాత్ర కీలకం.

ఈ జాతరలో మొదటి ముర్రాటకు ప్రాధాన్యత ఉంది. గ్రామ పెద్దలకు ఎన్నుకున్న తరువాత ఎన్నికైన గ్రామపెద్దలు జాతరలో అమ్మవారికి మొదట ముర్రాట పోయడానికి అర్హులను ఎంపికచేయడానికి వేలం పాట

నిర్వహిస్తారు. ఆ గ్రామస్థులు మాత్రమే వేలంపాటలో పాల్గొనటానికి అర్హులు. ఎవరైతే అధికమొత్తానికి పాడి, వేలంపాటలో గెలుస్తారో వారే మొదటి ముర్రాటకు అర్హులు. వేలంపాట నిర్వహించినప్పటి నుండి జాతర రోజున వేలంపాటలో గెలచిన వారు ముర్రాట పోసేవరకు ఇతరులు ఎవ్వరూ అమ్మవారి విగ్రహాలపై ముర్రాట పోయరాదు.జాతర రోజున మేకపోతు ఊరేగింపు మొదట వారింటివద్ద నుండే ప్రారంభమై తరువాత గ్రామంలో మిగతా వారింటికి వెళుతుంది. మేకపోతులను బలిచ్చే ముందు వీరింటివద్ద నుండే విగ్రహాల వద్దకు తీసుకు వెళతారు. దేవతావిగ్రహాలను మొదట వీరు పూజించి, ముర్రాట ఇచ్చిన తరువాత మేకపోతులను బలి ఇస్తారు. అప్పటివరకు ఇతరులెవ్వరూ దేవతా విగ్రహాలను పూజించటంగానీ, వాటిపై ముర్రాట పోయటం గానీ చేయరాదు. గ్రామంలోని ప్రతి వ్యక్తీ తన జీవితకాలంలో ఒక్కసారైనా మొదటి ముర్రాట పోయాలని అనుకుంటాడు. అందు వలన ఈ వేలంపాటలో అధిక మొత్తంలో గ్రామస్థులు పాల్గొంటారు.అదేవిధంగా జాతర తేదీని నిర్ణయించిన రోజు నుండి జాతర రోజు వరకు గ్రామంలో మాంసం అమ్మడం నిషేదం. మరలా జాతర రోజే గ్రామస్తులు మాంసం కొనడం, తినడం చేస్తాడు.

సంక్రాంతి పండుగ ముగిసిన ఒక పక్షం రోజులలోనే సాధారణంగా ఈ జాతర జరుగుతుంది. సంక్రాంతి పండుగ సందర్భంలో ప్రతి గ్రామంలో బంధుమిత్రులతో నిండిపోవటం సహజమే. కానీ ఈ గ్రామంలో సంక్రాంతి కన్నా ఈ జాతర సందర్భంగా బంధువుల సందడి అధికంగా ఉండటం మనం గమనించవచ్చు. ముఖ్యంగా నగరాలలో ఉద్యోగాలు చేసుకునే యువతీ, యువకులు సందడి ఈ జాతరలో మరింత ఆకర్షణీయం.

ఈ జాతర రోజున గ్రామ పెద్దలు, రజకులు, యువకులు గంగానమ్మకు, పెద్దింట్లమ్మకు బలిచ్చే మేకపోతులను ప్రతీ ఇంటికీ తిప్పుతారు. ప్రతీ ఇంట్లోనివారు ఆ మేకపోతులను పూజించి వాటికి పసుపు, కుంకుమ పెడతారు. వాటి నుదుటున ఉన్న పసుపు, కుంకుమను బొట్టుగా పెట్టుకుంటారు. ఇలా సాయంత్రం వరకు గ్రామంలోని ప్రతి ఇంటికీ బలిచ్చే మేకపోతులను ఊరేగిస్తారు. సాయంత్రం మూడు గంటలకు మేకపోతులను బలిచ్చే కార్యక్రమము ప్రారంభమవుతుంది. మొదట ముర్రాటకు ఎంపికైన వారింటి నుండి డప్పులు వాయిద్యాలతో ఊరేగింపుగా మేకపోతులను మొదట గంగానమ్మ విగ్రహం వద్దకు తీసుకువెళ్తారు. మొదటి ముర్రాటకు ఎంపికైన వారు అమ్మవారికి ముర్రాటపోసి, పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత మేకపోతును గంగానమ్మకు బలిస్తారు. ఈ కార్యక్రమాన్ని రజకులు నిర్వహిస్తారు. వారికి గ్రామస్తులు సహకరిస్తారు.

ఇదే విధంగా పెద్దింట్లమ్మ వారికి మేకపోతును బలిస్తారు. ఈ రెండు సందర్భాలలోనూ స్త్రీలు ముర్రాటలు పట్టుకుని గుంపుగా వచ్చి బలి ఇచ్చిన అనంతరం ఆ దేవతా విగ్రహాలపై ముర్రాట పోయటం మనం చూస్తాం. ఈ సందర్భంగానే స్త్రీలకు పూనకాలు రావటం మనం గమనించవచ్చు. బలిచ్చిన మేకపోతుల మాంసాన్ని ప్రతీ ఇంటికీ ప్రసాదంగా పంచడం మనం గమనించవచ్చు.

గ్రామమం మొత్తంగా పెద్దింట్లమ్మ వారికి, గంగా నమ్మ వారికి మేకపోతులు బలిచ్చినట్లుగానే ప్రతి ఇంటి వారు అమ్మవార్లకు రెండు కోళ్ళు బలిస్తారు. ఈ విధంగా గ్రామస్తుల ఐకమత్యానికి, సామరస్యానికి ప్రతిబింబంగా ఈ జాతర కనిపిస్తుంది. మన ఆచార సాంప్రదాయాలకు ఈ జాతర ప్రతీక.

ఈ మధ్య కాలంలో ఆధునీకతలో భాగంగా జాతరలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ముఖ్యంగా స్త్రీల వస్త్రధారణలో ఈ మార్పులు గమనించవచ్చును. ఈ పండుగలో ముర్రాట ఇచ్చే సమయంలో స్త్రీలు చీర ధరించేవారు. ప్రస్తుతం ఆధునిక వస్త్రాలు కూడా ధరిస్తున్నారు. ఒకప్పుడు భక్తి ప్రపత్తులకు చిహ్నమైన ఈ పండుగ నేడు తాగుబోతులు, జూదగాళ్ళ పండుగగా కూడా కొంతవరకు మారింది. నగరాలనుండి వచ్చే చాలామంది

ఈ జాతర సందర్భంలో తాగుడు, జూదం, కోడిపందేలకు అలవాటు పడిన సంఘటనలు మనకు ఎదురవు తున్నాయి. ప్రస్తుతం ప్రజల దృష్టి దేవతల పట్ల భక్తిభావం స్థానే పూజా కార్యక్రమాలను సెల్‌ఫోన్‌తో వీడియో, ఫోటోలు తీయడం వైపు మళ్ళడం గమనించవచ్చు. మేకపోతులను బలిచ్చే సందర్భంలో ఆ మేకపోతు

ఒకే వేటుతో తలను మొండెం నుండి వేరవ్వాలని, లేకపోతే గ్రామానికి అరిష్టమని గ్రామస్తులలో ఒక భావన బలంగా నాటుకుపోయింది. ఇది రజకులపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోంది. కొన్ని సందర్భాలలో ఒకే వేటుకు తల మొండెం వేరు కాలేదనే సాకుతో వారికి కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఈ మధ్యకాలంలో గ్రామంలోని యువకులు అందరూ "కళింగ యువసంఘ్" అనే పేరుతో ఒక సంఘంగా ఏర్పడి ఈ జాతరను మరింత వైభవంగా నిర్వ హించడానికి తమవంతు కృషి చేస్తున్నారు. గ్రామస్తులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా వారిని సాంస్కృతిక కార్యక్రమాలవైపు మళ్ళిస్తున్నారు. అదేవిధంగా ఒకప్పుడు గ్రామ పెద్దలుగా కళింగ సామాజిక వర్గానికి చెందినవారు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం ఆ గ్రామంలోని ఇతర సామాజిక వర్గాల వారిని కూడా గ్రామ పెద్దలుగా ఎన్ను కుంటున్నారు. ఈ విధంగా కొన్ని లోటుపాట్లు ఉన్నా ఇప్పటికీ గ్రామస్తుల ఐక్యతకు, సామూహిక ఆరాధనకు, సామరస్య భావానికి చిహ్నంగా ఈ జాతర ఆ గ్రామ ప్రజల మధ్య విడదీయరాని బంధాన్ని నెలకొల్పిందని మనం తప్పక చెప్పవచ్చును.

సమాచార సేకరణకు ఆధారం :

1. కూన పున్నయ్య(58) - కొత్తపేట గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
2. హనుమంతు దాలినాయుడు(65) - కొత్తపేట గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
3. చింతాడ. అచ్చమ్మ (70) - కొత్తపేట గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
4. కరణం.కృష్ణ (63) - కొల్లేటికోట, కైకలూరు మండలం, కృష్ణ జిల్లా.
5. ది రూల్ ఆఫ్ ది చాళుక్య- చోళన్ ఇన్ ఆంధ్రదేశ - మం.కృష్ణకుమారి, బి.ఆర్. పబ్లిషింగ్ కార్పోరేషన్, 1985
6. ది హిస్టరి ఆఫ్ ఆంధ్ర కంట్రీ (క్రీ.శ.1000 -1500) - యశోద దేవి, గ్యాన్ పబ్లిషింగ్ హౌస్, 1993.

❖ ❖ ❖

రొంపిచెర్ల పీలేరు మండలాల జానపద గేయ సాహిత్యం

– డా॥. ఆవుల గిరిబాబు

జానపద సాహిత్యం – పరిచయం :

జానపద సాహిత్యం జానపద విజ్ఞానంలో ముఖ్యమైన ఒక విభాగం జానపద సాహిత్యం, మౌఖిక ప్రచారం ద్వారా యుగం నుండి యాగానికి, తరం నుంచి తరానికి, జాతి నుంచి మరోక జాతికి, మనిషి నుండి మనిషికి సంక్రమిస్తూ వుంది. జానపద సాహిత్యం జనసామాన్యంలో పుట్టి, వారిలో ప్రచారాన్ని పొంది జీవిస్తుంది. ఇది జానపదుల మానసిక భావనా స్వరూపమును, సుఖ దుఖములను యథాతథంగా చిత్రికరిస్తుంది. తెలుగులోని గేయ రచనలు ప్రత్యేకంగా "ప్రజాశాఖ" అని చెప్పవచ్చు.

జానపదులు అంటే సామాన్యంగా గ్రామీణులు లేదా నిరక్షరాస్యులు అని అనుకుంటారు. గ్రామంలనివసించే వారు జానపదులు. కాని నేటి కాలాన్ని బట్టి సామాజిక పరిణామాన్ని బట్టి జానపదులంటే ఏదైనా ఒక విషయంలో భావసామ్యం గల జన సముదాయంగా చెప్ప వచ్చు. ఒక భాష, జాతి, వృత్తి, ప్రాంతానికి సంబంధించిన జన సముదాయం కావచ్చు. ఆధునిక కోణంలో ఆలోచిస్తే గ్రామిణులు, గిరిజనులు, నగర వాసులు అందరూ జాన పదులు కావచ్చు. జన జీవనంలో ప్రధాన భాగమై ప్రజలకు లోక జ్ఞానానికి, మనో వికాసానికి, మనస్సు ఉల్లాసానికి తోడ్పడేది జానపద సాహిత్యమే.

జానపదం అనగా చిన్నపల్లె లేదా గ్రామం అని అర్థం. జానపదంలో వుండేవారు జానపదులు. జానపదులకు సంబంధించినది. జానపదము. ఇది వస్తు, భావ, ప్రద ర్శన రూపాలలో వుంటుంది. మొత్తం మీద చెప్పాలంటే జానపదత్వమున్నది జానపదము అవుతుంది.

ఈ జానపదం అమరసింహుని - అమర కోశం లోను వ్యాసుని - భారతం (సంస్కృతం) లోను ఇదే అర్థంలో కనిపిస్తుంది. ఆంధ్ర మహా భారతంలోని అరణ్య పర్వం శేష భాగాన్ని రచించిన ఎర్రన (ఆంధ్ర మహాభారతం - అరణ్యపర్వం - ఎఱ్ఱన - వి. 346)

జానపదులు గ్రామీణులనే అర్థంలోనే ఈ విధంగా ప్రమోగించారు చూడండి.

"జానపదులె పురీ జనులు సంతసముం బ్రమదం బెలర్పనీ
దైన శుభోదమంబ హృదయంబుల గోరుచునున్న వారు స
మ్మానము నొంది కౌరవ సమాజము నిన్ను భజింప భూరితే
జోనిధివై వెలిగెదవు సూర్యుని చాడ్పున నీవ యిమ్మహిన్

పై పద్యంలో కర్ణశకుని దుర్యోధనుల ఆలోచనల్లో పల్లె ప్రజలు, పురజనులు అనే అర్థంలో మొదటి రెండు పదాలు "జానపదుల్ పురీజనులు" ను ప్రయోగించారు. పల్లీయులు, గ్రామీణులు ఎక్కడఉంటే అక్కడ జానపద త్వముంటుంది. ఎందుకంటే ఈ కాలంలో గ్రామీణులు పొట్టకూడు కోసం పట్టణాలకు వలసలు వెలుతున్నారు. కాబట్టి జానపదం ఈ నాడు అంతటా వ్యాపించి వుంది.

జనపదులు నగరాలకు చుట్టూ ప్రక్కలా వుంటారు. గ్రామం వ్యవసాయిక జీవనానికి, పునాదిగా నిలుస్తుంది. చేతి వృత్తులు ప్రధానంగా పల్లె పట్టుల్లోనే ఉండేవి. ఇప్పుడవి అంతటా కనిపిస్తున్నాయి.

పల్లియుల బ్రతుకుల్లో జానపదత్వం చక్కగా కని పిస్తుంది. మానవ జీవనానికి మూలం జానపదమే అని కొందరి వాదన. మన దేశంలో జానపదత్వం - జానపదం ప్రత్యేకంగా గుర్తించే విధంగా ఇంకా నిలిచి వుంది. పల్లెల్లో ప్రకృతిలో, పరిసరాల్లో, కళల్లో, సాహిత్యంలో, ఆచారాలలో పండుగలలో, ఉత్సవాలలోవిశ్వాసాల్లో, సంప్రదాయల్లో, మతంలో, కులంలో, వర్ణంలో, వర్గంలో, సంస్కృతిలో, ధర్మంలో జానపదం అంతర్భాగంగా వుంటుంది.

జానపద కవిత్వానికి సామాన్యంగా కర్త ఎవరో చెప్పలేము. ఇది మౌఖికంగా అనేక రూపాలు, మారుతూ

వుంటుంది. పడవ లాగే వాళ్ళు, బండ్లు లాగే వాళ్లు, కళ్లాల దగ్గర పని చేసేవాళ్ళు వడ్లు దంచేవాళ్లూ, పిండి విసిరే వాళ్లూ, వివిధ వృత్తులు వారు, జానపదునిలో కలిగే వివిధ భావనలు కలిగినప్పుడు పలికిన శబ్దాలే ఆ తర్వాత అర్థయుక్తమైన పదాలై గేయంగా మారినాయి అని వింటూనే ఉన్నాము.

జానపద గేయానికి డాక్టరు బిరుదు రాజు రామరాజు ప్రతిపాదించిన ప్రధాన లక్షణాలు తొమ్మిది. (జానపద గేయ సాహిత్యము. పుచ. 15-23) అవి ఆశరచనా, అనామక కర్తృకము లేదా సామూహికకర్తకము, నియమిత, స్వరూప రాహిత్యము, అనిర్ణీత రచన కాలికము, మౌఖిక ప్రచారము,అకృతకశైలి,గానమోగ్యత పునరావృత్తి, జన సామాన్య పరిచిత వస్తువు. ఈ లక్షణములు అన్నింటి కూడలి ప్రధాన తత్వము - అజ్ఞాత శిల్పము మరియు సార్వజనీయత వున్నచాలని బి.రామరాజు వివరించారు. కాబట్టి మానవుని మనోగత భావ వ్యక్తీకరణ, లమాన్వితము, మాటలు మొదలు కొని అఖండ పాండితీలు జనామోదము గల పద కవితలును జానపద గేయములే అగును.

(తెలుగు సాహిత్య సమిక్ష - జి. నాగయ్య - పుట - 756) జానపద సాహిత్యము శిష్ట సాహిత్యానికి మూలం అని చెప్పవచ్చు. ఎందుకంటే జానపదసాహిత్యము, శిష్ట సాహిత్యంకన్నా చాలా ప్రాచినమైనది. అందుకు శిష్ట కవులు పేర్కొన్న సమకాలిక గేయములో నన్నయ (ఆంధ్ర మహా భారతం - ఆదిపర్వం 8-131) తన భారతంలో నాగ గీతములును పేర్కొన్నారు. నన్నెచోడుడు (కుమార సంభవం - 6-45) కుమార సంభవంలో ఊయల, గౌడ గీతములను, పాల్కురికిసోమన పండితారాధ్య చరిత్యలో తుమ్మెద, వెన్నెల, గొబ్బిపదాలను (పండితారాద్య చరిత్ర, వాద ప్రకరణము పుట 512) వ్రాసి వున్నారు. తాళ్ళపాక అన్నమాచార్యులు తన కాలంలో వినబడు జానపద గేయాల మాదిరుల కన్నీటికిని సరిపోయె సంకీర్తనలను రచించారు. శ్రీ కృష్ణ దేవ రాయులు దండ యాత్రకు బయలు దేరి పోతుండుగా ఒక చాకలి వాడు "కొండవీడు మందేరా కొండపల్లి మందేరా కాదను వాడంటే కటకం దాకా మందేరా" పాడుకొంటున్న గేయంగా ఐతిహ్యం చూడండి. (అముక్త మాల్యద - 2-55) కంచర్ల గోపన్న (రామదాసు), క్షేత్రయ్య, త్యాగయ్యల పదాలు, కస్తూరి రంగ కవి - ఆనందరంగరాట్చంధంలో హారతి, జోల పాటలు పెర్కొన్నారు. ఆధునిక రచనలలో జానపద గేయాలు యధాతథంగా కొంత రూపాంతరముగా కనిపిస్తున్నాయి.

"ముఖే ముఖే సరస్వతి" అన్నట్టు ఒకరి నుండి ఒకరికి జానపద సాహిత్యం వ్యాపిస్తుంది. దినిలోఅనేక కొత్త అంశాలు ఎన్నో కలిశాయి. గేయాలు, కధాగేయాలు, కథలు సామెతలు, పొడుపు కథలు,తిట్లు, ప్రమాణాలు, అరుపులు, గుసగుసలు అన్ని మౌఖికంగానే ప్రచార మయ్యింది. జానపద సాహిత్యంఎప్పుడు, ఎక్కడ ఎలా పుట్టిందో చెప్పడం కష్టం.

జానపద సాహిత్యం చాలా ప్రాచీనమైనది.ఆంధ్రల నిజమైన సంస్కృతిని అర్ధం చేసుకోవాలంటేశిష్ట సాహిత్యం కంటే జానపద సాహిత్యం ఎక్కువగా ఉపయోగపడుతుంది. జానపద సాహిత్యం దాదాపుఅజ్ఞాత కర్తృతమే. సంస్కృతికి సంబందించిన అంశాలు కాలగర్భంలో కలిసి పోకుండా జానపద సాహిత్యం కాపాడుతుంది.

జానపద విజ్ఞానం అనేది మహా సముద్రం అయితే దానిలో కలిసే ఒక నది జానపద సాహిత్యం జానపద విజ్ఞానాన్ని ఆంగ్లంలో 'FOLKLORE'అనే పదానికి అనువాదం. ఈ పదాన్ని "డబ్యు.జె. థాంస్ " 1846 లో ఉపయోగించాడు. జానపద సంస్కృతి, జానపద విశ్వాసాలు, కళలు జానపదుని జీవితంలో అంతర్భాగం. ఆధునిక జీవనానికి కూడా జానపద విజ్ఞానం ప్రేరణనూ, స్ఫూర్తినీ, నిత్య చైతన్య సిద్ధి కలిగిస్తుంది. గిరిబాబు జానపద విజ్ఞానమనే పదం సర్వ జనపదాంశాల్ని తనలో ఇముడ్చుకొంటుంది విశాలమైన అర్థాన్ని ఇచ్చే ఈ పదం ప్రపంచంలోని అన్ని భాష సాహిత్యల్లో వాడుతున్నారు.

తెలుగులో శిష్టసాహిత్యోద్ధరణకు పునుకొన్న సి.పి.బ్రౌన్ గారు తొలుత జానపద గేయ సేకరణకు కూడా కృషి చేశాడు. కామమ్మ కథ మొ.. కథా, గేయాలను సేకరించారు. చార్లెస్ ఇ.గోవర్, జె.వి. బాయ్ లీ, వేటూరి ప్రభాకరశాస్త్రి చిలుకూరి నారాయణ రావు, మల్లంపలి సోమ శేఖర శర్మ, చింతాదిక్షతులు మొదలైన పండితులు జానపద సాహిత్యద్ధరణకు కృషి చేసారు. నేదునూరి గంగాధరం గారు మిన్నేరు, మున్నీరు, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి పెర్కొనదగినవి. టెకుమళ్ల కామేశ్వర రావు, కృష్ణశ్రీ గారి 'గేయాలు' చెప్పకోదగినవి. హరి ఆది శేషువు, బి. రామరాజు ఆర్వీయస్ సుందరం, నామని కృష్ణకుమారి, యస్వీ జోగరావు, వింజమూరి సీతాదేవి ఇంకా ఎంతోమంది విశేషమైన కృషి చేశారు.విశ్వ విద్యాలయాలలో జానపద సాహిత్యాని సంబంధించి ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. పరిశోధకులకు జానపద సాహిత్యం అక్షయ పాత్రయ్యింది. తరగని గని అయ్యింది. జానపద గేయము కష్టాన్ని మర్చిపోవడాకో, ఉల్లాసముకో పాట పుట్టవచ్చు. గేయం ఏక కర్తృతమో,బహు కర్తృతమైనా సంప్రదాయ మూలమైనదైనా అది ఎప్పటి నుండో అంతటా వ్యాపించి ఉన్నది. దానిలో రూపం కనిపిస్తుంది. రాగం వినిపిస్తుంది. లయ తాళాలు కలుస్తుంటాయి. పుట్టిన దానిలో ఏమున్నది దాని నిర్మాణము ఎలా ఉన్నది అనేది ముఖ్యమైనది. పాడుకోవడానికి వీలుగా వుంటుంది. గేయ గమనంలోని గతి కారణంగా రాగ లయతాళాలు అలంకారాలు ఎవరు కావాలని తెచ్చి వేయరు.

జానపద గేయాలకి సహాజంగా కర్త ఎవరో చెప్పలేము. ఇది మౌఖికంగా అనేక రూపాలు, మారుతూవుంటుంది అని చెప్పవచ్చు. పలికిన శబ్బాలే ఆ తర్వాత అర్థయుక్తమైన పదాలె గేయంగా మారినాయి. పడవ లాగే వాళ్ళు, బండ్లు లాగే వాళ్లు, కళ్లాల దగ్గర పని చేసే వాళ్ళు వడ్లు దంచే వాళ్లూ, పిండి విసిరే వాళ్లూ, వివిధ వృత్తులు వారు, జానపదునిలో కలిగే వివిధ భావనలు కలిగినప్పుడు పాటలు పాడటం వింటూనే ఉన్నాము. అందువల్ల గేయం సహాజంగా, సాఫీగా సాగిపోతుంది. ఒక్కొక్క సారి గేయం ఏదో రసాన్ని ఆశ్రయించి వుండవచ్చు. వుండక పోవచ్చు. జానపద గేయం ఒక రసఘటిక, ఆత్మపరత్వం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ గేయాలలో సాంఘీక విషయాలు, భాషా, సంబంధ అంశాలు, సాంస్కృతిక అంశాలు, వృత్తి సంబంధవిశేషాలు విభిన్న మనస్తత్వాలు పరిశీలించవచ్చు. ఎవరు ఏలాగా తలిస్తే వారి కది అలాగే సాక్షాత్కరిస్తుంది. కనుక వీటిని జానపద గీతాలు, పల్లెటూరి పాటలు, ప్రజా సాహిత్యం మొదలైన పేర్లతో పిలుస్తుంటారు.

రొంపిచెర్ల పీలేరు మండలాల్లోని జానపద గేయాలు వర్గీకరణ :

రొంపిచెర్ల - పీలేరు మండలాల్లోని జానపదులు తమ శ్రమను మరిచిపోవడానికి, ఆనందంతో, ఆడుతూ పాడుతూ పని పాటలు చేస్తు జీవనం సాగిస్తుంటారు. "కృత యజ్ఞశ్చ మేధావి బుధో జానపద శ్రుచి" అన్న మాటలో జానపదులు యజ్ఞాలు చేసిన వారిలో పండితులతో సమానమని వేద వ్యాసుడు (వ్యాస భారతం (సంస్కృతం) - వ్యాసుడు) చెప్పాడు. కాబట్టి జానపదుల సాహిత్యాన్ని ప్రత్యేకించి పాడుకునే గేయాలను వాటి ప్రత్యేకతను, హృదయానికి హత్తుకొనే విధంగా లయ తాశాలు, సృజవాత్మక కల్పనను పరిశీలించాను. రొంపిచెర్ల - పీలేరు మండలాలలో లభ్యమైన జానపద గేయములన్నింటిని వస్తు రసాది భేదములను బట్టి ఈక్రింది విధముగా విభజించాను.

1. పౌరాణిక గేయాలు
2. స్త్రీల గేయాలు
3. బాల గేయాలు
4. శృంగార గేయాలు
5. హాస్యరస గేయాలు
6. కరుణ రస గేయాలు
7. పారమార్థిక గేయాలు

పౌరాణిక గేయాలు :

పౌరాణిక కథలపై జానపదులకు అమితమైన భక్తి, ఆసక్తి ఎక్కువ జానపదులు మన పురాణాలుమూలంను గ్రహించు వారి తెలిసిన జ్ఞానంలో, వారికి వచ్చిన భాషలో వారి మనస్సుకు అనుకూలంగా మలుచుకొని పాడు కుంటారు. పండితులు మిత్ర సమ్మతంగా అందించిన ఆగమార్థములను శిష్టులు పురాణాల నుండి గ్రహించారు. జానపదులు ఈ జ్ఞానామృతమును జానపద గేయాలు మూలమున గ్రహించారు. రామాయణ, మహాభారతం, భాగవతం మొదలైన పురాణాలు, కావ్యాలలోని కవులను కథాభాగములను వస్తువులుగా గల పౌరాణిక గేయాలు అసంభ్యాకముగా జానపదుల నోళ్ళతో నానుతున్నాయి. సంస్కృత సాహిత్యంలో కనిపించని కథలు కూడా జానపదులు, వారి గేయాలు కనిపిస్తాయి.

రొంపిచెర్ల - పీలేరు మండలాలలో నాకు లభించిన గేయాలను మూడు భాగాలుగా వర్గీకరించాను. పౌరాణిక గేయములన్నిటి లోను జానపదులకు ఇతిహాస పురాణాల పట్ల గల ఆదరాభిమానములు, వాటితో పాటు వారి కథా కల్పన చమత్కారంను, చిత్త ప్రవృత్తంలును కూడా తెలునుకోవచ్చు. ఈ పౌరాణిక గేయాలలో కొన్ని పురాతనమైనవి, మరి కొన్ని ఆధునికమైనవి. వాటి పౌరాతన్యమును తెలుస్తున్నది.

1. రామాయణ సంబంధ గేయాలు
2. భారత సంబంధ గేయాలు
3. భాగవత సంబంధ గేయాలు

రామాయణ సంబంధ గేయాలు :

రాముడు, రామాయణం తెలియని పామరుడు కూడా వుండడు. శిష్ట సాహిత్యంలోనే కాదుజానపద సాహిత్యంలో కూడా రామాయణంకు విశిష్ట స్థానం వుంది. అందుకేనెమో మిగిలిన పురాణాలు, కావ్యాలు కంటే ఎక్కువగా రామాయణ సంబందించిన గేయాలు లభించాయి. జానపద స్త్రీ లోకంలో కూడా రామాయణందే మొదటి స్థానం. రామాయణంలో కాలక్రమేణ ఆశ్చర్య, విచిత్ర, వినోద, విషయాలు, వృత్తాంతాలు ఎన్నో కల్పించబడ్డాయి. వివిధ విశేష ప్రయోగాలు వలన రామాయణ కథ అవతారాలకు అంతం లేదు. మూలంలో లేని కథలు కొన్ని రంగనాధ, భాస్కర రామాయణాలలో ఉన్నది. ఇవేకాక మరి కథలు కూడా జానపద గేయములలో వున్నవి ముద్రితమైన కథా గేయాల కన్నా అముద్రితములే చాల ఎక్కువ. రాముడు ఈ లోకానికి ఆదర్శప్రాయుడు, ఒకే బాణం, ఒకే మాట, ఒకే భార్య, అనే నియమాలు జానపదుల మనస్సు బలంగా నాటుకు పోయాయి.వీటినే వస్తువుగా తీసుకొని జానపదులు గేయాలు పాడుకుంటుంటారు.

కళ్యాణము చూతము రారమ్మ :

లోకంలో కళ్యాణం అంటే సీతారాముల కళ్యాణమే అనే విధంగా ప్రసిద్ధి చెందింది. ఏవరి కళ్యాణం జరుగు తున్న సీత రాముల కళ్యాణ చిత్ర పటం వుండాల్సిందే అది లేకపోతే కనుక పల్లియులు పాటలో సీతారాములు కళ్యాణ గేయానికి అగ్రతాంబాలం ఇచ్చారు చూడండి. సీతా స్వయంవరంలో తన గురువు వశిష్టుని ఆజ్ఞతో శివుని ధనస్సును విరిచివేస్తాడు. సీత రాములు కళ్యాణం ఈ విధంగా జరుగుతుంది.

"కళ్యాణము చూతము రారమ
శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారమ్మ
చూచి వారలకు చాల పుణ్యమట
కళ్యాణము చూతుము రారమ్మ
భేరి మృదంగ డమర గానమట
గజరోహన పవీరని గార్లట
వింత వింతమగు విన్యలేలమట
వీనుల విందగు వినగ సన్నామట
తెల్లని గోపుల బృంద మృదంగము
భజనలు ప్రార్ధనలు భక్తుల నృతము
కులుకుచు పలుకుచు కలకలలాడెడి
ముస్తాబందిన ముచ్చటేనిగపై
మొత్తని పానుపు మోరి మనంబారట
అంబారపై ఆలర తేజమున రాముడు

జనకుని పక్కున మంత్రి సుమంత్రులు
సాముజ్జనమున వేత్రవేదులు
వేద హృదయముగ కాంతలు వేనలు రథములు
హయములనేకములూ నేత్రుత్సవముగ
అయోధ్య అంతము కదలి వచ్చెను

(ఎ.రాణెమ్మ - 42, కె.యన్ కువపల్లి, రొంపిచెర్ల మండలం)

స్త్రీలు ఏక్కువగా పాడుకునే పాటలలో) పెళ్ళి వేడక పాటలో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. జానపదులు ఏవిధంగా పాడుకుంటునారో, వారి భావం చూడండి. శ్రీ సీతారాములు కళ్యాణం చూతాము రారండి అక్కడ మృదంగ, డమరక చప్పుడు వినదాం, గజరోహనం, వింతలు చూతము సన్నాయి వీదులట విందు కలుగు తుంది. తెల్లని గోవుల బృందము, భజనలు, ప్రార్ధనలు, నృత్యము కలకలలూడుతుంటే చూడుము రారండి ముచ్చటైన ఏనుగుపైన మెత్తని పానుపుపై రాముడు, జనకుడు ప్రక్కనే సుమంత్రులు, వేద మంత్రలలో నేత్రోత్సవముగా వుందట, దీనిని చూడటానికి అయోధ్య ప్రజలంతా కదిలి వచ్చారు.సీతారాములు కళ్యాణము చూసిన వారికి ఏడేడే లోకాల పుణ్యములు కల్గుతాయని చెప్పుకుంటారు. ఈ పాటను పాడుకుంటుంటారు

భారత సంబంధ గేయాలు :

పీలేరు - రొంపిచెర్ల మండలలో భారత సంబంధ గేయాలు పాడటం చాలా తక్కువ.“రామాయణం ఒక రంకు - భారతం ఒక బంకు” అనకున్నారో ఏమో జానపదులో భారతం అంటే నాటకాలుగా స్థిరపడింది. ఈ మండలలో కొన్ని స్త్రీల పాటల రూపంలో కనిపిస్తు న్నాయి.

మమకారం పాట :

సన్యాసి వేషంలో ఉన్న అర్జునుని మాటలకు బాధ పడుతున్న సుభద్రను కృష్ణడు ఓదారుస్తూ, ముద్దుగా లాలిస్తున్నట్లు పల్లియుల కల్పన.

“చిరునవ్వుతోను క్రిష్ణయ్య పిలిచెనమ్మ
అమ్మరా ముద్దుల గుమ్మ రారమ్మ
కొమ్మ నవకెంపుల బమ్మ రారమ్మ
ముత్యాల సరములా ముద్దురాల రావే
అత్తరి నెరిగాళ్ళ అమరించె కొప్పనమ్మ
శిరసు ఆఘ్రాణించి చెల్లిలిని చూచినమ్మ
శేషకొప్పటు బెట్టి చలువమర గానమ్మ
చెక్కిలినొక్కి చెల్లిని గారవించినమ్మ

శ్రీకృష్ణుడు సుబద్రను ప్రేమతో పిలిచి, ఒళ్ళో కూర్చో పెట్టుకొని, కన్నీరు, తుడిచి, తల నెమరి, చెక్కిలి నొక్కిడం. శ్రీకృష్ణునికి చెల్లెలిపై ఉండే వాత్సల్యం, మమకారం ఎంతో తెలియజేస్తూ స్త్రీలు పాడుకుంటారు.

భాగవత సంబంధ పాటలు :

జానపదులలో రాముని గురించి, స్త్రీలు, పురుషులు పాడుకొంటున్నారు. కాని కృష్ణుని గురించి ఎక్కువగా స్త్రీల పాటలే కనిపిస్తున్నాయి. అవి కృషుని అవతారాలు లీలలు గురించి రొంపిచెర్ల - పీలేరు మండలాలలో జాన పదులు పాడుకుంటున్నారు. తమ పిల్లలను బాల కృషునిగా పొల్చుకొనివారి తల్లులు, పల్లియులు మన స్తత్వం ప్రతిబింబిస్తుంది. తర్వాత గొల్లబామ - శ్రీకృష్ణుల సరస సల్లాపాలు, వాటి సంబంధించి గేయాలు చూడండి. భాగవతంలో మూల నాయుకుడైన శ్రీకృష్ణుని గురించి జానపదులలో భక్తి భావం ఎక్కువగా వుంది. శ్రీ కృష్ణ లీలలకు సంబంధించిన గేయాలను జానపదులు పాడుకుంటున్నారు.

చెంచీత సమాధానం పాట :

శ్రీకృష్ణుడు రాత్రి వేశలో చెంచీత ఇంటికి తలుపు తెరవమంటే చెంచీత తెలివిగా, భార్య భర్తల సంబం ధాన్ని చెపుతూ పారిజాత పుష్పాలు నా దగ్గర లేవని, వచ్చిన దారిలో వేళ్ళండి అని సమాధానం చెప్పడంలో జానపదుల ఊహా కల్పన, కృష్ణుడు.

తలుపులు తియ్యవే చెంచీత
నువు తలుపులు తియయ్యవే చెంచీత
రాతిరి వేళల్లో రాగల పనులేమిటికి

వచ్చిన వారు పని ంమిటో చెప్పాలి
కాళీయ మదనం గావించి వచ్చితిని
ఓ చెంచీత నేను చిన్న క్రిష్ణున్ని
చెంచీత చీకటిలో వచ్చారు మీరు చిన్న కృష్ణున్ని
ఎటు వచ్చినారో అటే దయచేయండి
కమ్మని పారిజాతాలు మా ఇంట లేవు
రుక్మిని ఇంటికి వెళ్ళండి తలుపులు తీసి వుంచారు.
(పాడినవారు : నాగమ్మ 48 మేడసానివారిపల్లి, రొంపిచెర్ల మండలం)

చెంచీత పాటలు చాలా వినే వుంటాము. కాని ఇది ప్రత్యేకమైనది. ఎందుకంటే శ్రీకృష్ణుని వచ్చిన దారినే ఇంటికి వెళ్ళమని మా ఇంటిలో పారిజాతాలు లేవని, నీ ఇంటి దగ్గర నీ భార్య రుక్మిణి నీకోసం ఎదురు చూస్తూ వుంటారని. చెపుతుంది. దీనిలో జానపదులు అక్రమ సంబంధాన్ని వద్దని వారి భార్య ఎదురు చూపులను వివరిస్తూ పాడటం వారి లోకజ్ఞానానికి అభినందలను తెల్పవచ్చు. అలాగే భార్య భర్తల సంబంధానికి ఇచ్చె ప్రాధన్యత అర్థమవుతుంది.

ఆధార గ్రంధాలు :

1. ఆంధ్ర మహాభారతం - అరణ్యపర్వం - ఎఱ్ఱన - వి. 346.
2. జానపద గేయ సాహిత్యము. పుచ. 15-23.
3. తెలుగు సాహిత్య సమిక్ష - జి. నాగయ్య - పుట - 756.
4. ఆముక్త మాల్యద - 2-55.
5. వ్యాస భారతం (సంస్కృతం) - వ్యాసుడు-25.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పట్టపురావి కైఫీయత్తు – కాటమరాజు కథ – విశ్లేషణాత్మక అధ్యయనం

– డా॥. డి. విజయలక్ష్మి, దుంపగడప, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

కైఫీయత్తు నిర్వచనం :

"కైఫీయత్తు" అను అరబీ పారశీక పదానికి విశేష వృత్తాంతము, ఉదంతము, వివరణము అని లోక వ్యవహారార్థం. ఒకానొక గ్రామం, మండలం, దేశభాగాన్ని గూర్చి తెలియజేసే ఒక ప్రత్యేక రచన "కైఫీయత్తు" అని నిర్ధారించబడింది. కథ, వృత్తాంతము, హకీకతు, యాదు దాస్తు, అర్జిదాస్తు అనే పదాలు కైఫీయత్తుకు పర్యాయ వాచకాలుగా ప్రయోగింపబడ్డాయి. "హకీకత్తు" అనగా నిజమైన వృత్తాంతము యాదుదాస్తు అనగా పకముంచు కొనదగినది. డైరీ వంటిది అని అర్థం. "అర్జిదాస్తు" అనగా విన్నపము అని అర్థం. హఖీఖతు, ఆఖీఖతు, అకీకతు, హకిఖత్తు అను రూపాంతరాలు వివిధ గ్రంథాలలో కనిపిస్తున్నాయి.

కైఫీయత్తులు స్థానిక చరిత్రను తెలుసుకోడానికి ఉపయోగపడతాయి. దేశ చారిత్రక విశేషాలను, ప్రత్యేక చరిత్ర గ్రంథాలుగా వ్రాసే ఆచారం ప్రబంధ యుగం తరువాత మొదలైంది. అంతకు ముందు చాటువులు, కావ్య అవతారికలు, శాసనాలు, కావ్యాంతర్గతాలైన కొన్ని భాగాలు స్థానిక చరిత్రను గ్రహించడానికి కైఫీయత్తులు ఉపయోగపడ్డాయి.

కైఫీయత్తులను పరిశీలించినట్లైతే కొన్ని సామాన్య లక్షణాలతో అవి రచింపబడినట్లు స్పష్టంగా తెలుస్తుంది. అవి

1. ఆరంభంలో సర్వేయర్ జనరల్ మెకంజీ నుద్దేశించి రాయబడిన వాక్యాలుంటాయి. వారి ఆదేశాన్ని అను సరించి కైఫీయత్తులు సంతరింప బడి, పంపిస్తున్నట్లుగా నివేదించబడిన వాక్యా లొకటి రెండు కనిపిస్తాయి. రచనా కాలాన్ని కూడ కొందరు సూచించారు.
2. ప్రతి గ్రామాన్ని గురించి సంగ్రహ చరిత్ర ఉంటుంది.
3. ప్రాచీన కాలం నుండి ఆ గ్రామచరిత్ర తెలిసినంత వరకు వివరింపబడింది.
4. చారిత్రక పూర్వరంగం తెలియనిచో స్థానికులు వయోవృద్ధుల వలన తెలిసినంత వరకు విశే షముల వివరణము.
5. గ్రామాదుల సరిహద్దుల వివరణము.
6. చారిత్రక విశేషాల వివరణము.
7. గ్రామంలో గల ఆలయములు మసీదులు, భవ నములు మున్నగువాని చరిత్రలు.
8. గ్రామమునగల నదీనదములు, పర్వతములు, అరణ్యములు, తటాకములు, చెరువులు, బావులు మున్నగు భౌగోళిక పరిస్థితుల వివ రణము.
9. జననంఖ్య, జంతువులు, పశువులు, పాడి పంటలు, క్షేత్రములు మున్నగువాని వివరణము.
10. ముగింపు వాక్యము చేర్చాలు మొదలైనవి ఉం టాయి.

(గోపాలకృష్ణారావు, కె. వివేచన. పుట:86)

జనవదాలు జానవద విజ్ఞానానికి ఆయువు పట్టులాంటివి. జనపదాలలో జానపదులు పాడే గేయాలు, కథా గేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు,

ఆచారాలు, నమ్మకాలు, పండుగలు, ఉత్సవాలు, కళలు, కళారూపాలు మొదలైన అంశాలు లభ్యమవుతాయి. వీటి గురించి లోతుగా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఉంది. వివిధ విశ్వ విద్యాలయాలలో ఈ అంశాలపై పరిశోధన కొనసాగుతుంది. కైఫీయత్తులలో కూడ జనపదాలకు సంబంధించిన అనేక అంశాలు పొందుపరచబడ్డాయి. అదేవిధంగా జానపద విజ్ఞానానికి చెందిన అనేక విషయాలు వెల్లడి అవుతున్నాయి. వాటి గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కడప జిల్లా పట్టపురావి కైఫీయత్తులలో కాటమరాజు కథ ప్రస్తావన కలదు. ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు సేకరించి గ్రంథ రూపంలోకి తెచ్చిన కాటమరాజు కథలకు కొన్ని భేద సాదృశ్యాలు కనబడుతున్నాయి. వాటిని తెలియజేయడమే ఈ పత్రం ఉద్దేశం.

పట్టపురావి కైఫీయత్తు - కాటమరాజుకథ :

కడప జిల్లాలోని పట్టపురావి అనే గ్రామానికి ఉత్తర భాగంలో గల ఫినాకిని నదికి ఉత్తరం వైపున ఉన్న పర్వతం మీద కాటమరాజు తన ఆవులను మేపుకుంటూ ఉంటాడు. అతని గోవులు చాలా ఎక్కువగా ఉండడం వల్ల గ్రాసము సరిపోదు. అపుడు కాటమరాజు నెల్లూరు నల్లసిద్ధిరాజు రాజ్యంలోని అరణ్యాలు, పచ్చిక బీళ్లు మొత్తం గ్రాసం తమ ఆవులను మేపుకోడానికి అనుమతించమని దానికి తగిన 'పుల్లరి' చెల్లిస్తానని నల్లసిద్ధిరాజుకి వర్తమానం పంపిస్తాడు. అపుడు నల్లసిద్ధిరాజు, కాటమరాజు గోవులు సీమలో గడ్డిని మేపినన్ని రోజులు ఆవులకు పుట్టిన కోడెదూడలను వారికి ఇచ్చినట్లైతే తన రాజ్యంలో గల పచ్చిక బయళ్లను ఇస్తాము గాని పుల్లరి ఒడంబడిక ప్రకారము ఆ భూములను ఇవ్వమని జవాబు రాస్తాడు. అందుకు కాటమరాజు, కరి ఆవులరాజు అంగీకరిస్తాడు. కాటమరాజు గోవులను తమ స్వాధీనంలో ఉంచుకొని కోడెదూడలను మాత్రం నల్లసిద్ధిరాజుకి ఇస్తూ ఉంటాడు.

ఈ విధంగా కొంత కాలం గడిచిన తరువాత నెల్లూరు సీమలో మహత్తరమైన క్షామం వస్తుంది. దానివల్ల పచ్చిక బయళ్ళన్ని ఎండిపోయి అరణ్యాలలో గడ్డి లేకపోవడం వలన కాటమరాజుకు గోవులను సంరక్షించడం కష్టం అయ్యింది. అపుడు కాటమరాజు బావుల నీటితోను యేరుల నీటి ఆధారంగా పండిన పైరు భూములలో గోవులను మేపుతాడు. అందువల్ల నల్లసిద్ధిరాజుకు, కాటమరాజుకు విరోధం ఏర్పడుతుంది. ఆ తరువాత కాటమరాజు తన గోవుల మందను అంతకు ముందు ఉన్న కోడెదూడలతో సహా నెల్లూరు నుండి పట్టపురావికి పినాకిని నదికి ఉత్తర భాగంలో గల పర్వత ప్రదేశానికి వెళతాడు. అపుడు నల్లసిద్ధిరాజు, కాటమరాజు తనకు ఇస్తానన్న కోడెదూడలను తోలుకుని వెళ్లడానికి సైన్యం వచ్చి అడ్డగిస్తుంది. కాని కాటమరాజు వారిని ఎదిరించి కరి ఆవులరాజుతో కలసి గోవుల మందను తోలుకుని స్వస్థలానికి వెళతాడు. ఆ తరువాత నల్లసిద్ధిరాజు రణతిక్కనకు కొంత సైన్యాన్ని ఇచ్చి, కాటమరాజ మీదికి యుద్ధానికి పంపుతాడు. 'పట్టపురావి' అనే గ్రామానికి ఈశాన్య భాగానికి పరుగు దూరంలో ఉండే పినాకిని నదికి ఉత్తర భాగంలో సోమశిల అనే పట్టణం ఉండేది. అక్కడ రణతిక్కన యుద్ధ తీవ్రతను తట్టుకోలేక వెనుదిరిగి ఇంటికి వెళతాడు. అపుడు అతని భార్య నిత్యం తాను స్నానం చేసే రహస్య స్థలంలో స్నానానికి నీళ్ళు పెడుతుంది. n| Ü&fÜ¿Ø€ &ý sÁkí•q+ #ûd dÜë+ý Ëkí•H " ¿ì @s Î³ T#ûd¾4uésÁqT€ $<ß>±m+<ŠÅ€#Üæe" ¢¥•kí&f. nÔá uésÁúeÚ ãT<ßÁ>+ qT+& Ü] Ð eº Ìq+<ŠÅ€ ný² #Üæ" #î TÔã+~. n~ $" nÔ&f # ý² u²<ß&ÞÔ &f. € ÔáÁý ÔáuËEq dë¨ã+ý Ë Ü¿Ø Ôá¢nÔá¿ì $] Ðq bí\ qT e&þ¨Ÿ+~. n| Ü&ÞÔ&f $] Ðq bí\ qT m+<ŠÅ€ e&þ+# e" n&f>·TÔ &f. n| Ü&þyîT úeÚy¯ ¢q bõý²" ½¿€eÚTyîTÔÅ€yÞ²ß ãT #î TÔã+~. Ü¿Ø j ãT<ßÁ>+ qT+& Ü] Ð eº Ìq+<Š¿Ôá€ $<ß>± #¯ Ì¼<Š ç>V¾º , eTsÁdÝì sÆ TdÑ«" • dë¨T ÅEsÂÅ€" j ãT<ßÁ>±" ¿ì yÞØ &f. ¿±³ eTs E ¿ì

పినాకినీ నది తీరాన సోమశిల పట్టణం దగ్గర యుద్ధ ప్రసక్తి వస్తుంది.

కాటమరాజు సైన్యాన్ని అతనికి సహాయంగా వచ్చిన చల్లా వారిని కూడ విరగ పొడిచి, సోమశిల పట్టణం విడిచి, పట్టపురావి అనే గ్రామ సమీపాన ఉత్తర భాగంలో పినాకినీ నదీ తీరంలో కాటమరాజు రణతిక్కన తల నరుకుతాడు. ఆ విషయం తెలిసిన తిక్కన భార్య భర్తతో సహగమనం చేయాలని భావించి భర్తతో యుద్ధరంగానికి వెళుతుంది. ఆమె అక్కడ ఉన్న శవాలలో తన భర్త కళేభరాన్ని గుర్తుపట్టలేకపోతుంది. అపుడామె బాధ పడుతూ నేనే వీర పతివ్రతనైతే నేను పిలిచిన తరువాత తిక్కన తలపైకి ఎగరకుండా ఉంటుందా అని మనసులో అనుకొని, యుద్ధభూమికి ప్రదక్షిణ చేసి, నిలిచి 'తిక్కా' అని పిలుస్తుంది. అపుడు యుద్ధ భూమిలోని శవాల మధ్య నుండి తిక్కన తల మూరెడు ఎత్తు ఎగురుతుంది. అది గుర్తుపట్టి ఆమె తన భర్త తల తీసుకువచ్చి తిక్కన భార్య భర్త తలతో కలసి సహగమనం చేస్తుంది.

రణతిక్కన జీవించి ఉన్నపుడు ఒక భట్టురాజు అతని మీద ఒక సీస పద్యాన్ని కూడ చెప్పినట్లు ఈ కైఫీయత్తులో కలదు.

సీ. ధైర్యంబు నీమేన దగిలి యుండుటశి, చలియించి మందరాచలము దిరిగె!
గాంభీర్యమెల్ల నీకడ (9) నెయుండుట జెశి, కాకున్ను ఛేవాధి కట్టుపడియె!
అల లక్ష్మి నీయందు నలరియుండుట జేసి హరిపూయి బలిదాన మడిగి పోయె!
ఆకారమెల్ల నీయందు నుండుట జేసి, మరుడు ధూజటి కంటి మంటగ్రాంగె!

అని ఈ నాలుగు చరణాలు భట్రాజు చెప్పగా విని తిక్కన అతనికి ఎనిమిది వేల వరహాలు ఇస్తాడు. ఆ తరువాత తిక్కన భార్యను పిలిచి ఆ భట్రాజు పద్యాన్ని పూర్తి చేసుకుని వచ్చినపుడు అతనికి నాలుగువేల వరహాలు ఇవ్వమని, తిక్కన తన భార్య తల్లికి చెబుతాడు. అతడు యుద్ధంలో మరణించిన విషయం తెలుసుకుని భట్రాజు మిగిలిన పద్యాన్ని పూర్తి చేసుకుని తిక్కన తల్లి వద్దకు వెళ్ళి ఆ పద్యాన్ని వినిపిస్తాడు. అపుడామె తన కుమారుడు చెప్పిన విధంగా ఆ భట్రాజుకు నాలుగు వేల వరహాలిస్తుంది.

పద్యం :

తిక్క దండనాధ దేవేంద్రపురము
నీవరుగు టెరిగి నగము దిరుగుటుడిగె!
అబ్ధి కట్టుదానె! అచ్చుతక్కరదీరె!
మరుడు మళ్ళి బుట్టెమగల రాజా!

(ఇవి ఎత్తుగీతి పద్య పాదాలు)

తిక్కనకు కాటమరాజుకు యుద్ధం జరిగి తిక్కన మరణించిన ప్రదేశం పినాకినీ నదీ తీరాన పట్టపురావి గ్రామానికి తూర్పు భాగంలో పినాకినీ నది తీరాన పూర్వ కాలంలో పరశురామ దేవరకు నందన చక్రవర్తి ప్రతిష్టించిన స్థలము. ఆ స్థలాన్ని స్వీకరించిన ప్రజలు ఇపుడు 'తిక్కనపాడు' అని పిలుస్తారు. ఆ స్థలంలో ఒక రాయి మీద గుర్రము దానిపైన ఒక వ్యక్తి స్వారి చేస్తున్నట్టు చెక్కి ఉంటుంది. అది తిక్కన మంత్రి ప్రతిమె అని ప్రజలు చెప్పుకుంటూ ఉంటారు.

(మెకంజీ కైఫీయత్తులు కడప జిల్లా మూడో భాగం, 2006. పుట: 68-72)

పై విషయాలన్ని కడప జిల్లా పట్టపురావి కైఫీయత్తులో పొందుపరచబడ్డాయి.

కాటమరాజు కథలు పీఠికలో గల అంశాలు :

పుల్లరి ఒడంబడిక :

కాటమరాజు నల్లసిద్ధిరాజుకు కోడెదూడలను పుల్లరిగా ఇవ్వడానికి అంగీకరిస్తాడు.యాదవులు మొదట అరణ్యంలోని పచ్చిక బయళ్ళు మేపుకుంటూ, వర్షాభావం చేత కసవు చాలక నెల్లూరు రాజ్యంలోని వరిపొలాలలో గూడ పశువులను మేపుతాడు. అపుడు కాటమరాజుకు, ఖడ్గ తిక్కనకు పట్టపురావి సమీపంలో యుద్ధం జరుగుతుంది.

ఆ యుద్ధంలో ఖడ్గతిక్కన మరణిస్తాడు. ఈ విషయం పట్టపురావి కైఫీయత్తులోఉందని ఆచార్య టి.వి. సుబ్బా రావు గారు కాటమరాజు కథలు రెండవ పీఠికలో తెలియ జేశారు.

(కాటమరాజు కథలు. రెండవ పీఠిక, పుట: ixxviii)

కాటమరాజు, నల్లసిద్ధిరాజుల యుద్ధకారణాలు :

కాటమరాజు కడప, కర్నూలు మండలాలలో లంక మల, పాలకొండ, నల్లమల మొదలైన పర్వతారణ్య ప్రాంతాలలో తన అతి పెద్దదైన గోగణాన్ని మేపుకుంటూ ఉంటాడు. అక్కడ అనావృష్టి ఏర్పడి పశువులకు గడ్డి లభించదు. అందువల్ల నెల్లూరు సీమకు వెళ్ళి నల్లసిద్ధి రాజుతో తన ఆవులకు పుట్టే కోడెదూడలను పుల్లరిగా ఇస్తానని ఒప్పుకుని, నెల్లూరు సీమలో పచ్చిక బీళ్లను మేపుకుంటూ ఉంటాడు.

1. ఒడంబడికకు విరుద్ధంగా వరి పైరులను కూడ మేపుకుంటాడు.
2. యాదవులు అరణ్యాలలోని కిరాతకుల జీవన భృతికి అడ్డుతగులుతారు.
3. నల్లసిద్ధిరాజు ఉంపుడుగత్తె అయిన వేశ్య పెంపుడు చిలుకను కాటమరాజు బంధువులు చంపుతారు.

ఈ మూడు కారణాల వల్ల యుద్ధం జరిగిందని స్థానిక చరిత్ర పద్దెనిమిదవ సంపుటంలో ఉన్నట్లు ఆచార్య టి.వి. సుబ్బారావు గారు తెలియజేశారు.

(కాటమరాజు కథలు. రెండవ పీఠిక, పుట : cviii)

ఆచార్య టి.వి.సుబ్బారావు - కాటమరాజు కథలు:

కాటమరాజు కథలలో కాటమరాజు దైవాంశ సంభూతుడుగా చెప్పబడతాడు. పెద్దిరాజు, పెద్దమ్మ దంపతులకు కల్యాణ సోమేశ్వరుడు కలలో కనిపించి, కల్యాణ నగరానికి వచ్చి తనను పూజిస్తే, కల్యాణ సోమేశ్వరుడే వారికి కుమారుడుగా జన్మిస్తానని చెబు తాడు. అదే విధంగా జరుగుతుంది. కాటమరాజు పెరిగి పెద్దవాడైన తరువాత శ్రీశైల పర్వత ప్రాంతానికి వెళ్ళి శ్రీశైల మల్లిఖార్జునుని పూజించి, ఆ ప్రాంతంలోనే పన్నెండు సంవత్సరాలు ఆవులను మేపుతాడు. ఆ సమయంలో ఈశ్వరుడు బ్రహ్మను పిలిచి యాదవుల ఆయుష్షు గురించి అడుగుతాడు. అపుడు బ్రహ్మదేవుడు కవిలెలు చూచి వారు చిత్రభాను సంవత్సరంలో చనిపోతారనిఈశ్వరుడితో చెబుతాడు. ఆ విషయం తెలుసుకుని శివుడే స్వయంగా కాటమరాజు గోగణంలో క్షామం సృష్టిస్తాడు. వర్షాలు లేక ఆవులకు గ్రాసము లభించక కృశించి పోతుంటాయి. అది చూచి కాటమరాజు తన స్నేహితుడైన పద్మనాయుడితో గోవుల అవస్థ గురించి చెప్పి ఈ కింది విధంగా బాధపడ తాడు.

'భద్రేభముల వంటి బసవము యెద్దులు
నిద్రబోయిన రీతి నిలమీద చెల్లె
నర్రావులన్నియు నాకు సైదోడు
విడనాడి ధేన్వలు విడిచి పోగాను'

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం పుట : 7)

ఎద్దులు, ఆవులు నిద్రపోతున్న రీతిగా నేల పైబడి మరణిస్తున్నాయని కాటమరాజు దుఃఖిస్తాడు. శ్రీశైల పర్వతాన్ని విడిచి వెళ్ళాలని భావించి, శివుని వద్దకు వచ్చి ఈ కింది విధంగా ప్రార్థిస్తాడు.

'పాలునేతులు అమృత పళ్ళమునునుంచి
పర్వతాల మల్లయ్యను ప్రార్థనజేసే
కరుణించు వోస్వామి ! కైలాస నిలయ
నీలకంఠస్వామి ! నీకు మొక్కెదను
పశువులకు కరువాయె పట్టంగ రాదు
యిక్కడ వుండుట మాకు వుచితంబు గాదు
పోయి వచ్చెద'

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం పుట: 8)

అని కాటమరాజు పాలు, నెయ్యి శివుడుకి సమర్పించి, ప్రార్థించి, శ్రీశైల పర్వతాన్ని విడిచి వెళుతున్నట్టు విన్న

వించుకంటాడు. ఆ తరువాత కాటమరాజు గోవులను కొండలను దింపి తీసుకుని వెళుతున్నపుడు గోవులు చాలా అవస్థలకు గురవుతాయి. అపుడు అది చూచి త్రిమూర్తులు బలిజల వేషంలో ఆల మందను రక్షిస్తారు. ఈశ్వరుడు వీరిశెట్టివలె, విష్ణుమూర్తి చెన్నమశెట్టి వలె, బ్రహ్మదేవుడు బ్రహ్మశెట్టి వలె వచ్చి పశువులను చూడగానే అవి వారిని చూచి ఆనందంతో అరుస్తాయి. ఆ తరువాత వారు కాటమరాజుని నల్లసిద్ధి రాజ్యానికి వెళ్ళమని చెబుతారు. అపుడు కాటమరాజు దొనకొండకు వెళ్లి తన పిన తల్లి అయిన సిరిదేవి తీసుకోవాలని భావించి, గోవుల మేత కోసం దొనకొండకు వెళుతున్నానని చెబుతాడు. ఆమెను దీవించమని కోరతాడు. అపుడు సిరిదేవి ఈకింది విధంగా అంటుంది.

'తర్లవద్దు దక్షిణాది మీన తండ్రి పగలు ఉన్నాయి
పోలురాజు పగ ఉన్నది పోవద్దు కొడుక!
.....
పగ భూములకు బోయేటి పంతంబు గాదు
పగ వారము గాదు ఈ మాటలు పలుక'

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం, పుట : 30)

అని సిరిదేవి దక్షిణాదిలో మీ పినతండ్రి పోలురాజు పగ ఉంది. కాబట్టి దక్షిణాదికి వెళ్ళవద్దని కాటమరాజుని వారిస్తుంది. కాని కాటమరాజు ఆమె మాటలు పెడచెవిన పెట్టి, కుల పగను తీరుస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఆ తరువాత అతడు దొడ్డికుడుపు ఏర్పాటు చేయమని సిరిదేవిని అడుగుతాడు. (దొడ్డికుడుపు అనగా ఇలవేల్పు అయిన బసవన్నకు, గంగకు బోనాలు సమర్పించడం) కాటమరాజు దొడ్డికుడుపు అయిన తరువాత దక్షిణాదికి బయలు దేరుతాడు. కాని గంగ ఆర్లపెంట రణంలో కాటమరాజు తండ్రి కళేబరాన్ని వెదకడానికి సహాయం చేసినపుడు, అతడు తనని పూజిస్తానన్న విషయం గుర్తు చేస్తుంది. కాని కాటమరాజు గంగను పూజించనంటాడు. పోలురాజు కాటమరాజు కలలో కనిపించి, గంగను పూజించ మంటాడు. ఆ తరువాత కాటమరాజు గంగకు కొలుపులు చేయిస్తాడు. ఆ సమయంలో గంగ ఈ కింది విధంగా దీవిస్తుంది.

'పగవారు దక్షిణాదిన పట్టజాలక వున్నారు
ఆ భూమిలోకి పోయి అరుదెంచి మీరు
ఆవుల మేపుక పోలురాజు పగలు సాధించి
క్షేమాన రమ్మని సెలవిచ్చెను గంగ'

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం, పుట : 93)

అని గంగ కాటమరాజుని పోలురాజు పగ సాధించి క్షేమంగా రమ్మని చెబుతుంది. ఆ విధంగా కాటమరాజు తన పిన తండ్రి నాటి పగ తీర్చుకోడానికి ధనకొండకు వెళతాడు. పైన చెప్పిన విషయమంతా కాటమరాజు ఉత్తరాది ఆవుల మేపు కథలో కలదు.

పట్టపురావి కైఫీయత్తులోని కాటమరాజు కథకు, టి.వి.సుబ్బారావు కాటమరాజు కథకు గల వ్యత్యాసాలు
కాటమరాజుకథలోని కాటమరాజు, నల్లసిద్ధిరాజుల పుల్లరి ఒడంబడిక

ఆవుల మేపుకథ లేక జన్నివాడ కథలో కాటమరాజుకి పుల్లరి ధనాన్ని చెల్లించినట్లు ఈ కింది పద్యాల వల్ల వెల్లడి అవుతుంది.

'సిద్ధిరాజూ మనము సత్యమున ఉంటె
(వారికి) నడబడ్డ (పుల్లరి) ధనమెల్ల వప్పించ వలెను
వరహాలు వకరాశి వంచించక పోసి
మాడలు ఒకరాశి మంచివ్వగాను
.....
సిద్ధరాజును పిలచి (మనము) చెయ్యి పుచ్చుకొని
మా వద్ద పుల్లరి ధనము మీకు చెల్లిస్తిమి
నీరున పుట్టిన పూరెల్లను నీవు మాకిస్తివి
.....
నిన్ను కొనుకుంటిమి నీవు మా సొమ్ము
నిన్ను నీరు చేయక నిలువ మిచ్చోట

.....

.....

కడచేసి పోదాము (యీ భూమి) కవులావులు మేపుడి (సుబ్బారావు, టి.వి. 1978, రెండవ సంపుటం, పుట : 96)

కాటమరాజు నల్లసిద్ధిరాజుకి నీరున బుట్టిన పూరికి పుల్లరి చెల్లించి, నెల్లూరి భూములలో కవులావులను మేపి కయ్యాన్ని పెంచుకుని తన పిన తండ్రి పోలురాజు నాటి పగ సాధించాలనుకుంటాడు.

పట్టపురావి కైఫీయత్తు - పుల్లరి ఒడంబడిక :

కాటమరాజు నల్లసిద్ధిరాజు రాజ్యంలోని అరణ్యాలు, పచ్చిక బీళ్ళు మొత్తం గ్రాసం తమ ఆవులను మేపుకోడానికి అనుమతించమని దానికి తగిన పుల్లరి నల్లసిద్ధిరాజుకి వర్తమానం పంపిస్తాడు. అపుడు నల్లసిద్ధిరాజు, కాటమ రాజు గోవులు సీమలో గ్రాసం మేసినన్ని రోజులు ఆవులకు పుట్టిన కోడెదూడలను వారికి ఇచ్చినట్లైతే తన రాజ్యంలో గల పచ్చిక బయళ్ళను ఇస్తాము గాని పుల్లరి ఒడంబడిక ప్రకారం ఆ భూములను ఇవ్వమని జవాబు రాస్తాడు. ఆ ఒప్పందానికి కాటమరాజు, కరియావులరాజు అంకీరిస్తారు.

నల్లసిద్ధిరాజు, కాటమరాజుల యుద్ధానికి కారణాలు :

కాటమరాజుకథలలో గల యుద్ధ కారణాలు :

కాటమరాజు తన పినతండ్రి పగతీర్చుకోవాలని భావించి, ఆవులను స్వేచ్ఛగా మేపమని యాదవులకు చెబుతాడు. కాటమరాజు గోగణాలు పాకనాటిలోని వరి చేలను ధ్వంసం చేస్తాయి. నెల్లూరి కాపులు నల్లసిద్ధిరాజుకు ఆ విషయం చెబుతారు. అపుడు అతడు వారిని ఓదార్చి కొంత ధనాన్ని ఇస్తాడు.

కొంతమంది కాపులు గొల్లరాజుని హతమారుస్తా మంటారు. అపుడు సిద్ధిరాజు వారిని ఆ విధంగా చేయవద్దని వారిస్తాడు. ఆ తరువాత వారు కాటమరాజు చిన్న భార్య అయిన కుందుమాదేవితో ఆ విషయం చెబు తారు. అపుడామె కాటమరాజు గోవులను చంపిస్తానని వారికి మాటిస్తుంది. ఆమె తన సోదరుడు భావరాజుని పిలిచి కాటమరాజు గోవులను చంపమని చెబుతుంది. భావరాజు గోవులను చంపడం పాపమని తన చెల్లెలితో అంటాడు. అపుడామె ఏడ్చి, తన అన్నపై అలుగుతుంది. ఆ తరువాత కుందుమాదేవి తన పెంపుడు చిలుకను పంపి కాటమరాజు ఆవులను బెదరగొడుతుంది. ఆ చిలుక చేసిన వింత శబ్దాలకు ఆవులు భయపడి లేగ దూడలను తొక్కుతాయి. అపుడు లేగదూడలు మరణి స్తాయి. ఆ చిలుకను కాటమరాజు ఆజ్ఞ ప్రకారం అతని స్నేహితుడైన పద్మరాఘవుడు బాణంతో కొడతాడు. నల్లసిద్ధిరాజే ఆవులను చంపించాడని కాటమరాజు భావి స్తాడు. అందువల్ల కాటమరాజుకి యుద్ధం జరుగుతుంది.

పట్టపురావి కైఫీయత్తులో గల యుద్ధకారణాలు :

నెల్లూరులో మహత్తరమైన క్షామం ఏర్పడుతుంది. దానివల్ల పచ్చిక బయళ్ళన్ని ఎండిపోతాయి. అరణ్యాలలో గడ్డిలేక కాటమరాజుకు గోవులను సంరక్షించడం కష్టమవు తుంది. అపుడు కాటమరాజు పంట భూములలో గోవు లను మేపుతాడు. అందువల్ల కాటమరాజుకి, నల్లసిద్ధి రాజుకి విరోధం ఏర్పడుతుంది. ఆ తరువాత కాటమరాజు తన గోవులను, అంతకు ముందు ఉన్న కోడెదూడలతో సహా నెల్లూరు నుండి పట్టపురావికి, పినాకిని నదికి ఉత్తర భాగంలో ఉన్న పర్వత ప్రదేశానికి వెళతాడు. అపుడు నల్లసిద్ధిరాజు, కాటమరాజు తనకు ఇస్తానన్న కోడెదూడలను తోలుకుని రమ్మని సైన్యాన్ని పంపుతాడు. కాని కాటమరాజు వారిని ఎదిరించి కరియావులరాజుతో కలసి గోవులను తోలుకుని, స్వస్థలానికి వెళతాడు. ఆ తరువాత నల్లసిద్ధిరాజు రణతిక్కనకు కొంత సైన్యాన్ని ఇచ్చి కాటమరాజుపైకి యుద్ధానికి పంపుతాడు.

కాటమరాజుకథలో ఖడ్గతిక్కన మరణం :

ఖడ్గతిక్కన తనను యుద్ధానికి పంపమని నల్లసిద్ధి రాజుని అడిగి, యుద్ధానికి వెళ్ళి యాదవరాజయిన చల్లపిన్నమనాయుడితో యుద్ధానికి తలపడతాడు.

"పుడమి లో యాదవులు పుణ్యాత్ములనగ
కడసారి బ్రహ్మ హత్య కట్టుకోరాదు
ఆ మీదట నీవు అన్నియు యెరుగుదువు
భూమీశుడెరుగని పోరునీకేల
యవ్వరు చూశేరు నీవు యుద్ధంబు శాయగాను
దవ్వున వున్నాడు మీధారుణీశుడు
పోరు నీకేల ! బుధపుంగవ! పోవోయి!

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం, పుట : 317)

ఈ భూలోకంలో యాదవులకు పుణ్యాత్ములని పేరు. ఒక బ్రాహ్మణుణ్ణి హత్యచేసి పాపం కట్టుకోలేము, మీ రాజయిన నల్లసిద్ధిరాజు మౌనంగా ఉన్నాడు. ఈ యుద్ధాన్ని నీపైన ఎందుకు వేసుకున్నావని ప్రశ్నించి, చేతికి చిక్కిన తిక్కనను పిన్నమనీడు క్షమించి వదిలేస్తాడు. తిక్కన యుద్ధరంగం నుండి తిరిగి ఇంటికి వెళతాడు. అతడు యుద్ధరంగం నుండి వెనుదిరిగి వచ్చాడని తెలిసి అతని తండ్రి అయిన సిద్ధన మంత్రి దూషిస్తాడు. ప్రజలు కూడ తిక్కనను హేళన చేస్తారు. తిక్కన భార్య యుద్ధరంగం నుండి తిరిగి వచ్చిన భర్తను ఈ కింది విధంగా అవ మానిస్తుంది.

"కడువేగ విభునికి కాగిన నీళ్ళు
బిండెలతో చన్నీళ్ళు బిరబిర దెచ్చి
పసిణి చెంబుల నీళ్ళు పాకంబు చేసి
అక్కడ పట్టె మంచములు అడ్డంబు వెట్టి
అద్దశేరు పసుపు ముద్ద అమరంగ నుంచి
కూర్చుండి స్నానంబు గొబ్బున సేయు
అని చెప్పి వచ్చెను తమ అత్త దగ్గరికి
గొబ్బున స్నానంబు చేసి నీకూతురు వస్తుంది"

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం, పుట : 320)

తిక్కన యుద్ధరంగం నుండి వెనుదిరిగి ఇంటికి వచ్చిన తరువాత, అతని భార్య అతనికి ఆడవాళ్ళు స్నానం చేసే చోట నీళ్ళు పెడుతుంది. పట్టె మంచం అడ్డుపెట్టి, అతణ్ణి కూర్చుని స్నానం చేయమని, పసుపుముద్దను కూడ పెడుతుంది. అంతేగాక ఆమె తన అత్తగారిని పిలిచి, నీ కూతురు స్నానం చేసి వస్తుంది. బొట్టు, గంధం పెట్టి, పళ్ళెంలో అన్నం పెట్టమని చెబుతుంది. ఆ తరువాత తిక్కన తల్లి అతని భోజనంలో విరిగిన పాలు పోస్తుంది. తిక్కన విరిగిపాలు ఎందుకు పోశావని తన తల్లిని ప్రశ్న స్తాడు. అపుడామె ఈ విధంగా సమాధానం చెబుతుంది.

"పణతిరో! వోతల్లి యీపాలు విరిగినది యేమి
యివి నాకు బోసిన విచిత్రమేమి"
అన కొమరుని జూచి ఆ తల్లిపలికె
అరుణోదయ వేళ అది యెట్టిదో కాని
ఆవులు పెయ్యలు అటు మెయ్యబోయి
హరులతో పోరాడి అటు మీద నీవు
విరిగిన నిను జూచి విరిగెను పాలు"

(సుబ్బారావు, టి.వి. 1978. రెండవ సంపుటం, పుట : 322)

అరుణోయ సమయంలో ఆవులు, పెయ్యలు యాదవులున్న చోటికి గడ్డి మెయ్యడానికి వెళ్ళి, అక్కడ విరిగిన నిన్ను చూచి పాలు కూడ విరిగాయని చెబు తుంది. ఆ అవమానాన్ని భరించలేక ప్రతిజ్ఞ చేసి యుద్ధ రంగానికి వెళతాడు. ఆ తరువాత తిక్కన, బ్రహ్మ రుద్రయ్యలు ఇరువురు ద్వంద్వ యుద్ధం చేసి మర ణిస్తారు. పిమ్మట తిక్కన తండ్రి సిద్ధనమంత్రి యుద్ధ రంగానికి వెళ్ళి కుమారుడి మాంసపు ముద్దలను ఏరి తీసుకుని వెళతాడు. అపుడు తిక్కన భార్య సహగమనం చేస్తుంది.

పట్ట పురావి కైఫీయత్తులో తిక్కన మరణం :

ఈ కైఫీయత్తులో తిక్కనకు, కాటమరాజు, కరియావుల రాజుతో యుద్ధం జరిగినట్లు పేర్కొనబడింది. వీరికి 'పట్టపురావి' అనే గ్రామానికి ఈశాన్య భాగానికి పరుగు దూరంలో ఉండే పినాకిని నదికి ఉత్తర భాగంలో సోమ శిల అనే పట్టణం దగ్గర యుద్ధం జరుగుతుంది. అపుడు రణతిక్కన యుద్ధ తీవ్రతను తట్టుకోలేక వెనుదిరిగి ఇంటికి

వెళతాడు. అపుడు అతని భార్య అడవాళ్ళు స్నానం చేసే చోట అతనికి స్నానానికి నీళ్ళు పెడుతుంది. తిక్కన ఆ విధంగా ఎందుకు చేశావని భార్యను ప్రశ్నిస్తాడు. అపుడు అతని భార్య యుద్ధరంగం నుండి తిరిగి వచ్చినందుకు ఆ విధంగా చేశానని సమాధానం చెబుతుంది. అది విని అతడు చాలా బాధపడతాడు. ఆ తరువాత అతని తల్లి భోజనంలో విరిగిన పాలను పోస్తుంది. తిక్కన విరిగిన పాలను ఎందుకు పోశావని తల్లిని ప్రశ్నిస్తాడు. అపుడామె నీవు వెళ్ళిన పాలానికే ఆవులు మేతకు వెళ్ళాయని సమాధానం చెబుతుంది. తిక్కన యుద్ధరంగం నుండి తిరిగి వచ్చినందుకే తల్లి ఆ విధంగా చెప్పిందని గ్రహించి, మరుసటి రోజు సైన్యాన్ని సమకూర్చుకుని యుద్ధరంగానికి వెళతాడు. కాటమరాజు సైన్యాన్ని అతనికి సహాయంగా వచ్చిన చల్లా వారిని కూడ తిక్కన హతమారుస్తాడు. ఆ తరువాత కాటమరాజు పట్టపురావి అనే గ్రామానికి ఉత్తర భాగంలో గల పినాకినీ నది తీరంలో కాటమరాజు రణతిక్కన తల నరుకుతాడు. ఆ విషయం తెలిసిన తిక్కన భార్య భర్తతో సహగమనం చేయాలని భావించి, పట్టపురావి వద్ద గల యుద్ధరంగానికి వస్తుంది. అక్కడ ఉన్న శవాలలో తన భర్త కళేబరాన్ని గుర్తుపట్టలేక పోతుంది. అపుడామె బాధపడుతూ నేనే వీర పతివ్రతనైతే నేను పిలిచిన తరువాత తిక్కన తలపైకి ఎగరకుండా ఉంటుందా! అని మనసులో అనుకుని యుద్ధభూమికి ప్రదక్షిణ చేసి నిలిచి 'తిక్కా' అని పిలుస్తుంది. అపుడు యుద్ధభూమిలోని శవాల మధ్య నుండి తిక్కన తల మూరెడు ఎత్తు ఎగురుతుంది. అది గుర్తుబట్టి ఆమె అతని తల తీసుకువచ్చి, ఆ తలతో కలసి సహగమనం చేస్తుంది.

పట్టపురావి కైఫీయత్తులో గల అంశాలు :

తిక్కన జీవించి ఉన్నపుడు ఒక భట్టురాజు, అతని మీద సీస పద్యంలోని నాలుగు చరణాలను రాసి, విని పిస్తాడు. అతనికి తిక్కన ఎనిమిది వేల వరహాలు ఇస్తాడు. ఆ తరువాత తిక్కన భార్యను పిలిచి, ఆ భట్రాజు పద్యాన్ని పూర్తి చేసుకుని వచ్చినపుడు, అతనికి నాలుగు వేల వరహాలు ఇవ్వమని, తిక్కన తన భార్యకు, తల్లికి చెబుతాడు. రణతిక్కన యుద్ధంలో మరణించిన విషయం తెలుసుకుని, ఆ భట్టురాజు మిగిలిన పద్యాన్ని పూర్తి చేసుకుని తిక్కన తల్లి వద్దకు ఆ పద్యాన్ని వినిపిస్తాడు. అపుడామె తన కుమారుడు చెప్పిన విధంగా ఆ భట్టు రాజుకు నాలుగు వేల వరహాలను ఇస్తుంది.

తిక్కన మరణించిన స్థలాన్ని ఆ ప్రాంతపు ప్రజలు 'తిక్కపాడు' అని పిలుస్తున్నారని పట్టపురావి కైఫీయత్తులో పేర్కొనబడింది. ఆ స్థలంలో ఒక రాయి మీద గుఱ్ఱము దానిపైన ఒక వ్యక్తి స్వారీ చేస్తున్నట్టు చెక్కబడి ఉంది. అది తిక్కన ప్రతిమె అని అక్కడ ప్రజలు చెప్పుకుంటు ఉంటారు.

ముగింపు :

నల్లసిద్ధిరాజు రెండవ భార్య కుందుమాదేవి గురించి పట్టపురావి కైఫీయత్తులో లేదు. టి.వి. సుబ్బారావు గారు సేకరించిన కాటమరాజు కథలలో ఆమె ప్రస్తావన ఉంది. కాని కుందుమాదేవి సిద్ధిరాజు సోదరి అని గాధా కారులు పాడుకుంటున్నారని రెండవ పీఠికలో సుబ్బారావు గారు రాశారు. ఆయన ఇంకా అనేక అంశాలు తెలియ జేశారు. పట్టపురావి కైఫీయత్తులోని ''కాటమరాజుకథ'' యందు గల అంశాలను తెలుసుకోవడానికి, టి.వి. సుబ్బారావుగారు సేకరించిన, కాటమరాజు కథలలోని నాలుగు కథలను పరిశీలించవలసి వచ్చింది. అవి

1. కాటమరాజు ఉత్తరాది ఆవులమేపు. దీనినే ఆవులమేపులు - ఉత్తరకాండం అని కూడ అంటారు.
2. కాటమరాజు దక్షిణాది ఆవులమేపు, దీనినే 'ఆవులు - దక్షిణకాండం' లేక 'జన్నివాడ కథ'
3. భట్టురాయబారము (కల్లి రాయబారము).
4. ఎర్రగడ్డపాటి పోట్లాట.

ఈ కథలను పరిశీలించిన తరువాత కైఫీయత్తులో గల అంశంపై ఒక స్పష్టత ఏర్పడింది.

ఉపయుక్త గ్రంధ సూచి :

1. కృష్ణకుమారి, నాయిని. 2017. తెలుగు జానపద గేయ గాథలు. తెలుగు అకాడమి, హైదరాబాదు.
2. గోపాలరావు, కె. వివేచన
3. సుందరం, ఆర్.వి.యస్. 2014. ఆంధ్రుల జానపద విజ్ఞానం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
4. సుబ్బారావు, టి.వి. 1978. కాటమరాజు కథలు. నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
5. మెకంజీ కైఫీయత్తులు కడప జిల్లా మూడోభాగం. 2006. సి.పి బ్రౌన్ యస్.వి, యోగివేమన యూనివర్సిటీ తెలుగు భాషా సాహిత్యాల ప్రాంతీయ పరిశోధన కేంద్రం కడప. ఆంధ్రబుక్హాల్, వై.వి. స్ట్రీట్.

❖ ❖ ❖

జానపదుల వంటింటి వైద్యం – మానవత్వపు విలువలు

– డా॥ ఐ. సరస్వతి, తెలుగు సహాయాచార్యులు, ఐడియల్ కళాశాల ఆర్ట్స్& సైన్స్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా.

"హిందువులకు రాముడు కావాలి
జైనులకు మహావీరుడు కావాలి
క్రీస్టియన్‌లకు క్రీస్తు కావాలి
మహ్మదీయులకు అల్లా కావాలి
ఆరోగ్యం అందరికీ కావాలి"

"శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం" ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు కాబట్టి ఆరోగ్యం బాగుంటేనే ఏ కార్యం అయిన విజయవంతం చేయగలం.

జానపదుల గృహ వైద్యం అనేది చాలా ప్రాచీనమైనవి. నిత్య జీవితంలో మానవులు అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమౌతుంటారు. ప్రాచీన కాలంలో వైద్యశాలలు వుండేవికావు. ప్రకృతే వారికి ఆధారం. కాబట్టి ప్రకృతి నుండి లభించే వస్తువులతోనే రోగ నిరోధక గుణాన్ని కనిబెట్టి వాటినే ఔషధాలుగా ఉపయోగించారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సమయానికి మంచి ఆహారం తీసుకోవాలి. పరిశుద్ధమైన, తాజా ఆహార పదార్థాలు తీసుకుంటే మనిషి ఆరోగ్యంగా, దేహదారుఢ్యంతో చక్కగా వుండగలడు. అటువంటి ఆహార పదార్థాలతో వంటింటి వైద్యం చేయడమనేది తరతరాల నాటిది అనడంలో సత్యం లేకపోలేదు. మనం ప్రతిరోజు ఆహారంలో తీసుకొనే, ఆహారంలో ఉపయోగించే అనేక మసాలా దినుసులు. పసుపు, నిమ్మ, ధనియాలు, అల్లం, వెల్లుల్లి పాయలు, కొబ్బరి, గసగసాలు, వాము, జీలకర్ర, శొంఠి మొదలైనవి.

'ఇల్లాలే వైద్యురాలు - వంటిల్లే వైద్యశాల' అని ఏ మహానుభావుడన్నాడో గాని ఏ రోగానికైనా తక్షణ చికిత్సకు వంటిల్లు ఎంతగానో దోహదపడుతుంది. జానపదులు వారికి తలనొప్పి, జలుబు వంటివి వస్తే శొంఠి, కడుపు నొప్పికి వాము, దగ్గుకి మిరియాలు వేడి పాలు, ఇలా ఇంట్లో దొరికే దినుసులతోనే కషాయలతోనే గృహ చికిత్సలు నాటికి చేసుకుంటున్నారు. అట్లా అని ఇంగ్లీష్ మందులు వేసుకోరు. అని చెప్పడానికి వీలులేదు. చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు నాటువైద్యం అని, గృహావైద్యం అని, కూరకాయ వైద్యమని వివిధ పేర్లతో పిలిచే వైద్యం చేసుకుంటారు.

జానపదుల వైద్యం :

తలనొప్పి :

ఈ నొప్పికి పసుపు కొమ్మును నేలపై చాది అందులో కొంచెం సున్నం వేసి తలకు పట్టువేస్తారు. అలా పట్టి వేయుట వలన కొంత సమయానికి నొప్పి తగ్గుతుంది. మరొక పద్ధతి అల్లం రసాన్ని త్రాగుతారు. ఇంకొక పద్ధతి వెల్లుల్లి చితగకొట్టి కళ్ళకు ఇరువైపులా రుద్దుకుంటారు.

చెవినొప్పి :

నువ్వుల నూనెలో వెల్లుల్లి పాయలు వేసి కాచి గోరువెచ్చగా ఉన్నప్పుడు రెండు చుక్కల చొప్పున చెవిలో వేస్తారు. నిమ్మరసంలో కొంచెం నీళ్ళు కలిపి కొంచెం వెచ్చ చేసి బొట్టుబొట్టుగా చెవిలో వేస్తారు.

కళ్ళునొప్పి :

ఆకుకూరలు సాధారణంగా జానపదులు ఎక్కువగానే తీసుకుంటారు. పొన్నగంటి ఆకును కళ్ళకు కడితేనొప్పి తగ్గుతుంది. కర తేనే చుక్కలు కంట్లో వేసిన తగ్గుతుంది. పసుపు నీళ్ళద్దిన గుడ్డతో కళ్ళను తుడుచున్న కళ్ళు నొప్పులు పోతాయి.

పంటినొప్పి :

మిరియాలు ఉప్పును మెత్తగాదంచి నొప్పి ఉన్నచోట పెడతారు. లవంగం మెత్తగా చేసి లేదా ఇంగువ పొడిచేసి మూడుపూటల నొప్పి ఉన్నచోట పెడుతుంటారు. దాల్చిన చెక్క పొడిని కూడా నొప్పి ఉన్నచోట పెడతారు. క్రమేపి తగ్గుతుంది.

గొంతునొప్పి :

వెచ్చని నీటిలో ఉప్పు వేసి బాగా కరిగిన తరువాత గొంతులో పోసుకొని పుక్కిలిస్తే గొంతునొప్పి పోతుంది. గొంతునొప్పి ఎక్కువగా ఉన్నపుడు మిరియాలపొడిని బెల్లంతో కలిపి వేసుకుంటే నొప్పి తగ్గుతుంది. ధనియాలను రెండు ఉప్పురాళ్ళతో నమిలి తినాలి.

దగ్గు :

అల్లపు రసం, 6 మిరియాలు, పసుపు ఈ మూడింటిని వేడి పాలల్లో కలిపి రెండుపూటలా వాడుతారు. శొంఠిని ఉప్పులో కలుపుకొని తింటే దగ్గు తగ్గుతుంది. దాల్చిన చెక్క పొడి తేనెతో తినాలి.

జ్వరం :

ఆహారం తీసుకోకుండా లంకనం చేయిస్తారు. తులసి రసాన్ని చెవిలో వేస్తారు. జ్వరం తగ్గుతుంది.

కడుపునొప్పి :

వాము, ఉప్పు కలిపి తింటారు. మజ్జిగ పంచదార కలిపి తీసుకుంటారు. దాల్చిన చెక్క తేనే తీసుకుంటారు. మెంతులు పెరుగుతో తీసుకుంటారు. కడపునొప్పి తగ్గుతుంది.

రక్త విరోచనాలు :

ధనియాలు, అల్లం కలిపిన కషాయం త్రాగిస్తారు. సగ్గుబియ్యం కాచి తాగిస్తారు. గసగసాలు పంచదార రెండు కలిపి తినిపించడం రక్తస్రావం తగ్గుతుంది.

గాయాల పుండ్లు :

గాయాలకు పసుపు వాడుతారు. బెల్లపు కాడ రసం. మిరియాలు, కాల్చిన గుడ్డపొడి రెండు కలిపి పుండ్లకు పట్టిస్తారు. కొబ్బరినూనెను కాలిన గాయాలకు వాడుతారు. కాలికి ముల్లు గ్రుచ్చుకున్నప్పుడు మిరప పొడిని మంచి నూనెతో వేడిచేసి కడతారు.

చర్మవ్యాధులు :

చర్మంపై దద్దుర్లు వచ్చినపుడు దురదగా ఉన్నప్పుడు. కొత్తిమీర రసం, తేనె, బాదం తైలం కలిసి రాస్తే దురదలు తగ్గుతాయి. వేపాకు, పసుపు, నిమ్మరసం లాంటివి వాడతారు.

మొటిమలకు :

దాల్చిన చెక్కను, నిమ్మ రసంతో కలిపిరాస్తారు.

కీళ్ళ నొప్పులు :

ధనియాలు పొడి, దాల్చిన చెక్క పొడి తేనె వాడతారు. చింతాకు వేడి చేసి కడతారు. చింతపిక్కల పొడిని తాటి బెల్లం వాము, తేనె కలిపి వాడతారు.

ఒక విధంగా చెప్పాలంటే వెల్లుల్లి వాడటం వలన క్యాన్సర్ రాదని, ఉల్లివాడటం వలన బి.పి. రాదని, పసుపు యాంటిబయాటిక్ అని, ఒక్కొక్క మసాలా దినుసులతో ఒక్కొరకం జబ్బులను తగ్గించే గుణ గణాలున్నాయి. అని ఆధునికి శాస్త్రజ్ఞులు ఇప్పుడు శాస్త్రాలు చదివి చాటి చెబుతున్నారు. కాని మన పూర్వీకులు ఆనాడే ఈ వంటింట్లో ఉండే దినుసులు యొక్క రహస్యాన్ని తెలుసుకొని వారి ఆరోగ్యాలను ఆసుపత్రి పాలు కాకుండా ఇంట్లోనే తగ్గించుకునే మార్గాన్ని వారు కనిపెట్టారు. అనడం లో సత్యం లేకపోలేదు. కాబట్టి ఆనాటి నుండి ఈనాటి వరకు జానపదులు 'వంటిల్లే వైద్యశాల గా, ఇల్లాలే వైద్యురాలిగా ప్రకటించుకున్నారు.

ఉదా :

ప్రపంచమంతా కుదిపి అతలాకుతలం చేస్తున్న కరోనాను పరిశీలించినట్లైతే రోజురోజుకు పెరిగిపోతున్న రోగులను బట్టి ప్రభుత్వం, డాక్టర్లు చేతులెత్తే పరిస్థితులలో ఎవరికి వారే ఇంటి దగ్గర పసుపు, వేడినీరు, కషాయాలు తీసుకోమని టీ.వి.లు మారుమ్రోగుతున్నాయి. ఇప్పుడైనా ఈ వంటింటి వైద్యం నమ్మక తప్పదు. పాటించక తప్పదు. జానపదులను గౌరవించకతప్పదు వారిని ప్రేమించక తప్పదు. మన ఆరోగ్యం కాపాడుకోక తప్పదు. అని అందరం గ్రహించాలి.

జానపదులలో మానవత్వపు విలువలు :

జానపదులు గ్రామంలో ఏ ఉత్సవం జరిగిన అందరు

కలిసి మెలిసి చేసుకోవడం. ఆనందాన్ని అందరు పంచుకోవడం. గ్రామంలో ఏ కుటుంబానికైన ఆపదొచ్చిన ఒకరి నొకరు ఆదుకోవడం. కులం, మతం, వేరైనా బందుత్వం కలుపుకొని అత్త, అక్క, పిన్ని మామయ్య, బాబయి అని ఎంతో ఆప్యాయంగా పిలుచుకుంటారు. పెద్దలు మంచి చెడులు చెబితే తు.చ. తప్పకుండా పాటించడం. వారిని గౌరవించడం మోసగించడం, కల్మషంగా ప్రవర్తించడం అనేది తెలియదు. వ్యవసాయ పనులు, వ్యాపార పనులు వాయిదా వెయ్యకుండా చేసుకోవడం నిరాడంబరంగా జీవించడం అనేది వీరి లక్షణం వీరిలో అందర్ని ప్రేమించే గుణం అధికంగా ఉంటుంది.

ఉదా :

వారితో పాటు కుక్కలను, పిల్లులను, పశువులను, పక్షులను కూడా పెంచుతుంటారు. వాటి ప్రేమను పొందుతుంటారు. ఎవరైనా చిన్న చిన్న పొరపాట్లు చేసిన సర్ధిచెప్పి క్షమించే గుణాన్ని కలిగి ఉంటారు. 'యద్భావం, తద్భవతి' అనేది. జానపదులకు వర్తిస్తుందనిపిస్తుంది. ఆనందంగా, శాంతియుతంగా వుంటూ గ్రామాన్నాంతా వసుధైక కుటుంబంగా భావిస్తుంటారు.

ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఏ పాఠ్యాభాగాన్ని బోధిస్తున్నా ఏదో ఒక మానవత్వపు విలువ గురించి వచ్చినపుడు పురాణాలలో కథలో, ఇతిహాసాలలో కథలు చెప్పివారిలో మానవత్వపు విలువలను మనం పెంచినట్లైతే మన కళాశాలు, మన పాఠశాలలను కూడా వసుధైక కుటుంబంతా మనం చూడవచ్చని ఆశిద్ధాం.

❖ ❖ ❖

జానపదులు – సామెతలు – విశ్లేషణ

– డా॥. రొచపాళెం భ్రరంభీశ్వరి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తి.తి.దే. తిరుపతి.

అక్షర జ్ఞానం లేని పల్లె ప్రజల చేత సృష్టించబడిన జానపద సాహిత్యం అధిక సంఖ్యాకులు చేత ఆనందాను భూతులను పొందుతూ ఆదరణీయ సాహిత్యంగా వెలు గొందుతూ వుంది. నిస్వార్థ కళా స్వరూపంగా, భావోద్రేకమే ప్రధానంగా మంచిని మంచిగా చెడును చెడుగా చిత్రీ కరించి మంచి చెడ్డల లోతు పాతుల్ని, సత్యా సత్యాల్ని బహిర్గతం చేస్తూంది. ఒకరి నోటి నుంచి మరొకరి నోటికి ప్రసారమయ్యే జానపదసాహిత్యం మౌఖిక ప్రచారంలో జీవిస్తూంది Folk Songs, Folk Literature. Folk lore అనే మాటలకు జానపదగేయాలు, జానపద సాహిత్యం లేదా జానపద సారస్వతం. జానపద విజ్ఞానం (Folk lore) జానపద సంస్కృతి (Folk Culture) జాన పద జీవనం (Folk life) ఈ మూడు పదాలు వేరు కావు. జానపద విజ్ఞానం సంస్కృతిలో ఒక భాగం. గతకాలానికి ప్రతిధ్వనే కాదు వర్త మానానికి ఒక శక్తివంతమైన గొంతుక జానపద విజ్ఞాన మంటే కేవలం మౌఖికంగా ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమించే వ్రాగూప సాహిత్యం కాదు ఇంగ్లీషులోని Folk loreకు సమానార్థకం జానపద విజ్ఞానం. జానపద విజ్ఞానం శాబ్ధిక, శాబ్దికేతర అని రెండు విభాగాలు. మౌఖికంగా శబ్దరూపంలో వెలువడేది శాబ్దికం ఇతరాలైన నమ్మకాలు, ఆచారాలు, దుస్తులు, అలం కారాలు, ప్రదర్శనకళలు శాబ్దికేతరములు.ప్రస్తుత నా పత్ర ముఖ్య ఉద్దేశ్యం జానపదుల్లో సామెతలను పరిశీలిం చడం.

సామెతలు సాంప్రదాయికమైనవి. వివేకవంతమైనవి సంక్షిప్తమైనవి. వైవిధ్యమైనవి. జనప్రియమైనవి అను భవమైనవి అభివ్యక్తుల సమ్మేళనమైనవి. నిసామెత లేని మాట ఆమెత లేని ఇల్లు అనేది తెలుగుభాషా ప్రాశస్త్యాన్ని తెలుగువారి గృహధర్మాన్ని తెలియ చేస్తుంది. ఆమెత అంటే విందు. విందు భౌతిక సుఖాన్నిస్తుంది. సామెత మానసికానందాన్నిస్తుంది. శరీరానికి పుష్టిని, మనస్సుకు తుష్టిని కల్గించేవి సామెతలు మానవ జీవనానుభవ సారాలైన సామెతలను కూర్చడానికి నేర్పు కావాలి. మానవునిలో భాష, భావం కళాకౌశల్యం ఎపుడు పుట్టిందో అపుడే సామెతలు పుట్టాయనడంలో సందేహం లేదు. ప్రాచీన భారతీయ సూత్ర వాజ్మయమంతా సామెతల మయం వేదం సూత్రబద్ధమైతే సూత్రం అనుభవసారం అనుభవసారాల నుంచి పుట్టిన సామెతలు లేకుండా వేదాలు ఉపనిషత్తులు, పురాణాలు, కావ్యాలకు అందం లేదు సంస్కృతభాషలో వేద, పౌరాణిక, లౌకిక వాజ్మయాల్లోనూ, ప్రాచ్య పాశ్చాత్య భాష లన్నింటిలోనూ సామెతలున్నాయి. సామ్యతే సామెత అయ్యిందని అంటారు.

ఆదిమానవుడు తన సుఖదుఃఖాలను అభివ్యక్తీ కరించడానికి అనుభవాలను ఎదుటి వారికి తెలియచెప్ప డానికి సామెతను ఉపయోగించాడు. సంక్షిప్తంగా స్వరూపాన్ని తెలియచేసేవి, జ్ఞానాన్ని వివేకంగా చెప్పడమే సామెతల పుట్టుకకు కారణమైంది. ప్రతిభ, కల్పన, అన్వేషణాశక్తితో ప్రాచీన మానవుడు సామెతలను సృష్టిం చాడు. ప్రాచీన మానవ సంస్కృతిని ప్రతిబింబించే సామెతల్లో కవితాగుణం వుంటుంది. నిత్య జీవితంలో మనం చూచి అనుభవించే ప్రతి విషయమూ సామెతలు పుట్టుటకు కారణం, సామెతల్లో లయ గుర్తుపెట్టుకోవ డానికి ఉపయోగపడుతుంది. సామెతలు పుట్టుటకు కారణం అనుభవమనడానికి మననిత్యజీవితంలో ప్రతి రోజూ మనం కన్నవి విన్నవి అనుభవించినవే సామెతల రూపంలో వెలు వడడమే. ఒక్కొక్క సామెతలో ఒక్కొక్క పరిపూర్ణ జీవితానుభవమనే సత్యం దాగి వుందిసామెత్త

అనే మాట¬సామ్యత్ణ నుంచి వచ్చిందని ఇంగ్లీషులో 'Proverb' అనే పదానికి తెలుగులో సామెత అనే అర్థం వుంది. సామెత నాణెం వంటిది నాణెం ముద్రించిన వెంటనే ఎలా చలా మణిలోకి రాదో అలాగే సామెతలు కూడా ప్రాచీన కళాత్మక అభివ్యక్తులలో వుంటూ మానవుని వివేకాన్ని ప్రతిబింబిస్తూ ఉక్తిగా ప్రజల్లో ప్రచారంలో వుండి ఆ తర్వాత సామెత అవుతుంది. అల్పార్థాలలో అనల్పార్థ రచనకు సామెతలు ఉదాహరణలు.

సామెతలను వస్తువు, రచన, భాష, ప్రాసాదులను బట్టి జనప్రియ సామెతలని, గ్రంథస్థ సామెతలని, గరికుల సామెతలని వర్గీకరించారు. ప్రజల్లో సహజంగా పుట్టేవి జనప్రియ సామెతలు మిగిలినవి కల్పితాలు. డా॥.పి.నర సింహారెడ్డి తెలుగు సామెతలు-జనజీవనం అనే గ్రంథంలో సామెతల పుట్టుటకు ఆధారాలను స్థూలంగా వివరిం చాడు. కుటుంబంలో సంఘంలో వ్యక్తికి వుండే సంబం ధాలు అనుబంధాలు, అను భవాలు ఃసామెతల్లో అధిక బాగం వీటికి సంబంధించినవే వుంటాయి. వివిధ కుటుంబ సభ్యుల ఆధారంగా చాలా సామెతలు పుట్టాయి.

"పిల్లనిచ్చినవాడు పిల్లి, పుచ్చుకున్నవాడు పులి" దీని అర్థం
పిల్లనిచ్చినవాడు పుచ్చుకునే వాడికి లోకువ
"ఏరుదాటాక తెప్ప తగలేసినట్లు" ఇలాంటి వాళ్ళు
సమాజంలో ఎందరో వుంటారు.
"ఇంట్లో ఈగల మోత బయట పల్లకీ మోత"
"పని లేని మంగలి పిల్లి తల గొరిగినట్లు" వంటివి

సమాజంలో సామెతలకుండే ప్రాధాన్యాన్ని ప్రాచీన కవులు గుర్తించి నన్నయ కాలం నుంచి తమ కావ్యాలలో ఎన్నో సామెతలు, పలుకుబళ్ళు, నుడికారాలు, లోకోక్తులు, జనవ్యవహారంలోకి వచ్చాయి. ప్రాచీన కాలం నుంచి తెలుగునాడులో సామెతలు జనజీవితంలో భాగంగా వుండేవనడానికి ఇవి నిదర్శనాలు. పురాణే తిహాసాలు సామెతలకు ప్రేరణనిచ్చాయి.

రామాయణ భారత, భాగవతాల్లోని సన్నివేశాలా ధారంగా ఎన్నో సామెతలు పుట్టాయి. ''రామాయణంలో పిడకల వేట'' -ఇది పేడలో చేసిన పిడక కాదు. జాబాలి ముని ప్రసంగిస్తున్నపుడు మధ్యలో బౌద్ధ ధర్మ సూత్రాలనే త్రిపీటకాలను గూర్చి చెప్తున్నపుడు ఆటంకమని భావింది ఒకరు ప్రసంగిస్తున్నపుడు ఇంకొకరు అడ్డుతగిలితే ఈ సామెతను ప్రయోగిస్తారు.

సీతపుట్టె లంక చెడె
రాత్రంతా రామాయణం విని రామునికి సీత ఏమి కావాలని అడిగినట్లు
కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి
వింటే భారతం వినాలి. తింటే గారెలు తినాలి
గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్
లేడి కడుపున పులి పుట్టునె
వృద్ధుల బుద్ధులు సంచలింపవే మొ॥నవి.

అల్పాక్షరాలలో అనల్పార్థరచనకు చక్కని ఉదాహరణ సామెత అనడానికి అర్థానికి అర్థం,శబ్దానికి శబ్దం రెండూ వుండే సామెతలుఃఃః

వుంచే జీలకఱ్ఱ బెల్లం అనే మంగళ వాయిద్దాలే ఈ సింగి నాదమని ప్రతి దానికి సింగినాదం జీలకఱ్ఱ కావాలా అని పలుకుట వల్ల ఈ సామెత పుట్టిందని కొందరి అభి ప్రాయం.

సాంఘిక సంబంధి అయిన వర్తమాన జీవన పరి మళాల్ని ప్రతిబింబించేది వెదజల్లేది సామెత

"రెడ్డి వచ్చాడు మొదలెత్తుకో"

ముందుకాలంలో పండుగ పర్వ దినాల్లో ఆటాడే వారు వారు రెడ్డి ఇచ్చేకానుకలపై దృష్టితో ఆట ప్రారంభంలో వచ్చిన ప్రతి రెడ్డిని పొగడడం మరల రెడ్డి వస్తే మరల మొదలు పెట్టడంలో ఈ సామెత వచ్చింది.

"రెంటికీ చెడ్డ రేవడు"

"కొండ మంగలి కొరిగినట్టు"

సామెతల్లో ఒకే పరిణామంతో రెండు వాక్యాలుండ వచ్చు సామెతలో రెండుభాగాలు అక్షరాల సంఖ్య సమానంగా వుందనడానికి ఉదాహరణలు-

చేసేది పోదు, చేయంది రాదు

చేసేవి లోపాలు, చెప్పితే కోపాలు

నలుగురు నడిచిందే బాట, పలువురు పల్కిందే మాట అనుభవమే సామెతల పుట్టుటకు ప్రధానకారణం అనడానికి ఉదాహరణలు-

రోట్లో తలపెట్టి రోకటి దెబ్బకు జడిసినట్లు

చిన్న మిరపకు కారం హెచ్చు

తీట గలవానికి తోట గలవానికి తీరిక వుండదు

తిరిగే కాలు, తిట్టేనోరు వూరుకోవు అని పూరిక అన్నవి కావు.

ఇవన్నీయు మన జీవితానుభవం ద్వారా వచ్చినవే.

సత్యాన్ని నీతిని తెల్పేవి :

మౌనం అంగీకారసూచకం

పాతకాలపు సంప్రదాయాలకు, కథలను సూచించేవి :

అందని ద్రాక్ష పళ్ళు పుల్లనీ

దేవాలయానికి దగ్గరయ్యే కొద్దీ దేవుడికి దూరం

సామ్యతలకను గుణంగా వచ్చినవి :

కూటికుండ కుక్క ముట్టినట్లు

కూడినకొద్దీ కుండలమ్ముకొని తిన్నట్లు

వాతావరణ మార్పుకనుగుణంగా వచ్చినవి :

కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు

ఆరుద్ర కారై విత్తనానికి అన్నం పెట్టిన ఇంటికి సేగిలేదు

ఆరుద్ర కురిస్తే ఆరుకారైలు కురుస్తాయి.

వాచ్యార్థం సూచ్యార్థం రమణీయంగా వున్న సామెత :

పడమట క్రుంకిన ప్రొద్దు తూర్పున లేదా

ఇక్కడ సూర్యుని దినచర్యను చూస్తే తూర్పున ఉదయించడం పటమట అస్తమించడం మళ్ళీ ఉదయించడం ఇది ప్రకృతి నిరంతర ప్రక్రియ మనం వున్నా లేకున్నా జీవనాన్ని సాగించాలనే దీని భావం

పాడి పసరం పసిబిడ్డ ఒకటి

పాడి గుట్టు పంటరట్టు

సామెతలు సంస్కృతికి ప్రతిబింబాలు సంఘం లేక సంస్కృతి లేదు సంస్కృతి లేనిదీ సంఘం లేదు ఈ రెండింటికి విడదీయరాని సంబంధముంది.

ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత

అన్నీ వున్నా అల్లుని నోట్లో శని

తినే దానికి తిండి లేకపోయినా మీసాలకు సంపెంగ నూనె - వివాహ సందర్భాలతో వచ్చినవి :

మన సంస్కృతిలోని సంఘటనల్లో పెళ్ళి ఒకటి :

పెళ్ళాం బెల్లం తల్లి దెయ్యం

పెళ్ళి అయిన ఇంట్లో ఆరు నెలలు కరువు

పెళ్ళికి పోతూ పిల్లని చంకను పెట్టుకొని పోయినట్లు

అత్తకు సంబంధించినవి

అత్తకాలం కొన్నాళ్ళు కోడలి కాలం కొన్నాళ్ళు

అత్తకు మంచి లేదు చింతకు పచ్చిలేదు

అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు

అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు

ఇలాంటివి సంబంధ బాంధవ్యాలను కూడా సూచిస్తాయి

అత్తకాలం కొన్నాళ్ళు కోడలి కాలం కొన్నాళ్ళు
మానవుని జీవితంలో డబ్బుకున్న ప్రాధాన్యాన్ని సూచించేవి
ధనమూల మిదం జగత్
ఎన్నడూ దొరకనమ్మకు ఏగాని దొరికితే ఏడుముళ్ళు వేసిందట

మానవుల స్వభావాలలో గుణాలలో మనిషికున్న స్వార్థాన్ని, పిసినారితనాన్ని తెలియచేసేవి :

పాడి ఆవును దానం చేసి పాలు తాను పితుక్కునేవాడు
పెట్టిన పెళ్ళి గోరు పెట్టకున్న చావు గోరు

ఇవన్నీ ఒక ఎత్తైతే వేమన పద్యాలలో వున్న సామెతలు ఒక ఎత్తు వేమన జీవితానుభవంతో కవితలు రాయడం వలన మూలద్రవ్యంగా సామెతలు వేమన సూక్తులలో కోకొల్లలుగా కన్పిస్తాయి. ఈ సూక్తులే వేమనను అచ్చమైన ప్రజాకవిని చేసాయి.

అనువుగాని చోట అధికులమనరాదు -
ఇలాంటి వారిపుడు సమాజంలో కోకొల్లలు
తప్పులెన్నువారు తమతప్పు లెరుగరు -

తమ తప్పులు తెలుసుకోకుండా ఎదుటివారిలో వున్న తప్పులను ఎత్తి చూపేవారు.

కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా
సాధనమున జనులు సమకూరు ధరలోన
భక్తి కలురు కూడు పట్టెడైనను చాలు
చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా!

ముగింపు :

తెలుగు సామెతల మీద సమగ్రమైన పరిశీలనగానీ పూర్తి అధ్యమనము గానీ జరుగలేదు సామెతల విలువను సమాజంలో వాటి పాత్రను లోతుగా పరిశీలించవలసిన అవసరం ఎంతైనా వుంది సాహిత్య సామాజిక సాంస్కృతిక పరంగా సామెతల మీద సమగ్రమైన విశ్లేషణ జరగాల్సిన అవసరం ఎంతైనా వుంది. జానపదుల అనుభవాలను ఇప్పటికీ సామెతల రూపంలో మనకందిస్తున్నారనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. సామెతను తెలుసుకోవడం అంటే ఇసుకలో తైలం తీసినట్లే అన్న మాటలు అక్షర సత్యాలు కొత్తగా సామెతలు పేరుతో వాక్యాలను సృష్టించే వాటికి కన్నా ఇప్పటికి నాశనమవకుండా జానపదుల నోళ్లలో వుండే సామెతల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై వుంది.

ఆధార గ్రంధాలు :

1) జానపద విజ్ఞానం : డా॥ ఆర్వీయస్. సుందరం
2) తెలుగు సామెతలు జనజీవనం : ఆచార్య పి.నరసింహారెడ్డి
3) పొడపు కథలు : ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి

❖ ❖ ❖

గతాలకు తరలిపోతున్న తరాల జాతి జీవసారం – జానపద విజ్ఞానం

– డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

వాగ్రూపంలో ఉన్న జానపద వాఙ్మయాన్ని పరిశోధించడం వల్ల ఈ క్రింది అంశాల వికాసం సాధ్యపడుతుంది.

- నిఘంటువుల నిర్మాణం
- స్థానిక చరిత్రల నిర్మాణం
- దేశీ సాహిత్య అధ్యయనం
- సాహిత్యేతర దేశీ కళల అధ్యయనం

జానపద విజ్ఞానం భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి, ముడిసరుకుగా ఉంటుంది. దీని సాయంతో మనం నిఘంటువులను, చరిత్రను నిర్మించవచ్చు. అపార కళా సంపదను వెలికి తీయవచ్చు. భౌతికమైన జానపద విజ్ఞానం చాలా వరకు గ్రంథస్తం చేయబడింది కానీ క్షేత్రస్థాయి అధ్యాయనం తాలూకు సాధకబాధకాల దృష్ట్యా, సాంస్కృతిక వైవిద్యాల దృష్ట్యా అపారమైన కళాసంపదను సాహిత్య పరంగా భాషాపరంగా చరిత్ర దృక్కోణంలోవెలికి తీయలేని పరిస్థితి కనిపిస్తుంది. అయితే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మన ముందుతరం వారు జాతి కళా సంపద ను సంస్కృతిని వెలుగులోకి తీసుకొచ్చారు కానీ చరిత్రగా సంస్కృతి గ్రంథస్థం అయినప్పటికీ సాహిత్యంగా అది వెలుగులోకి వచ్చినప్పటికీ భాషా పరంగా మాత్రం వెలుగు చూడలేక పోయింది దీనికి కారణం అప్పటి సమాజానికి ఇప్పటి సమాజానికి సాంస్కృతిక పరమైన పరిణామాలు చోటు చేసుకోవడం ప్రధాన కారణం.

అంటే అప్పటి సమాజంలో ని అత్యధిక సామెతలు పొడుపు కథలు పలుకుబళ్ళు ఇప్పుడు అభ్యంతరకరంగా మారాయి. అప్పటి సభ్యమైన సంభాషణ ఇప్పుడు అసభ్యంగా తయారైంది దీనికి కారణం సాంస్కృతిక పరిణామమే. ప్రతి దశకానికి సమాజం స్వాభావికంగా, భౌతికంగా ఎంతోకొంత మార్పులతో మనకు దర్శనమిస్తుంది. దానివల్ల అప్పటి భాష, భావజాలం ఇప్పుడు అసభ్యం అయ్యాయి అప్పటి భాష ఇప్పటికీ మొరటుగా తయారయింది. అందువల్ల జానపద విజ్ఞానం చరిత్రగా కంటే సాహిత్యంగా రికార్డు చేయబడ్డంలో వెనకబడి పోయింది. నిఘంటు నిర్మాణం సాధారణంగా లిఖిత రచనలు ఆధారంగా జరుగుతుంది. పారంపర్యంగా తరతరాల నుంచి దిగుమతి అయ్యే మౌఖిక వాఙ్మయం నుంచి నిఘంటు నిర్మాణం జరగాల్సి ఉంటుంది. అలా జరగకపోతే జాతి; భాషను, అంతకుమించి తన సంస్కృతిని, చరిత్రను, కళను పోగొట్టుకుంటుంది.

నాగరికులుగా అనబడే మనకు ఇవాళ మౌఖిక సాహిత్యం అభ్యంతరం పరిశోధనాత్మక దృష్టితో పక్కన పెట్టి రికార్డు చేయాల్సి ఉంటుంది తద్వారా మనం భాషా దాస్యం నుంచి భావ జాలదాస్యం నుంచి సాంస్కృతిక దాస్యం నుంచి తప్పించుకునే వీలు ఉంది. మన వెనుక వెన్నుముకగా నిలబడ్డ మన జాతి మూలాలు మనం నిటారుగా నిలబడేలాగా ఆత్మగౌరవంతో తలఎత్తుకునేలా చేయగలవు. మారుతున్న విలువల నేపద్యంలో మంచివైనా మరి ఎలాంటివైనా అసభ్యమైన అభ్యంతరకరమైన ఆనాటి సమాజ స్వభావాన్ని అంచనా వేయడానికి ఎంత ప్రగతిపథంలోకి మనం ఏమో అన్న దాన్ని బేరీజు వేసుకోవడానికి ఈ పరిశోధన ఉపకరిస్తుంది.

మన భాషలో అసభ్యంగా ముద్ర వేయబడ్డ గుప్త అవయవాలకు సంబంధించిన పదజాలం చాలా నిఘంటువుల్లో మనకు కనిపించదు. లైంగిక అవయవాలను ద్వేశించి పదజాలం మౌఖిక రూపంలో బూతులుగా మాత్రమే మనకు కనిపిస్తుంది. జానపదుల్లో బూతు వినోదం. నాగరికులమనిపించుకునే వాళ్లలో అయితే అది ఆగ్రహావ్యక్తీకరణకు ఉపకరిస్తుంది. మొత్తంమీద బూతును దైనందిన వ్యవహారంగా భావవినిమయానికి

ఉపయోగించడం లేదు. ఆ మాటకొస్తే లిఖిత సాహిత్యంలో ఆగ్రహవ్యక్తీకరణకు, వినోదానికి, బూతు ధ్వని పూర్వకంగా లేదా ద్వంద్వార్థాలలోనో కనిపిస్తుంది అందులోనూ సంస్కృతీకరింపబడుతుంది. దిగంబర కవి ఈ భూగోళాన్ని నాశిశ్నాగ్రం మీద నిలబెడతాను అన్నప్పుడు బూతు గానే అనిపించినప్పటికీ బూతు కు సంస్కృత పదం వాడవలసి వచ్చింది. దిగంబర కవి సైతం అచ్చ తెలుగు పదాన్ని బూతుగా వాడి ఆగ్రహవ్యక్తీకరణ చేయ లేకపోయాడు అన్న విమర్శ ఉంది. దీనికి కారణం సాంస్కృతిక పరిణామమే.

సాంస్కృతిక పరిణామం ఎంతగా జరిగింది అంటే మౌఖికంగా చలామణిలో ఉన్న వాజ్మయం అది పొడుపు కథలులో గాని, సామెతల రూపంలో గాని, ఉన్నప్పటికి వాటిని గ్రంథస్థం చేయలేకపోవడమే నిదర్శనం. భాష బూతుగా పరిణమించింది. అసభ్యకరం అభ్యంతరకరంగా మారిపోయింది అని చెప్పి భాషా సంపదను రికార్డు చేయడం మానేస్తే ముందు తరాలలాగే అది కూడా కాలంలోకి చేజారిపోతుంది. కాబట్టి పరిశోధనా దృష్టితో భాషను సాహిత్యాన్ని గ్రంథస్తం చేయాల్సి ఉంది.

ఉదాహరణకు రెండు మూడు సామెతలు ఉదా హరణలుగా ప్రస్తావిద్దాం వాటిని విశ్లేషించి చూద్దాం. చదువుకున్న వాడికంటే చాకలోడు మెరుగు అన్న సామెత ఈనాడు అభ్యంతరకరం. ఎందుకంటే సమాజంలో కులం భావన అభ్యంతరకరం. అది సమానత్వానికి నిరోధకంగా ఉంటుంది. అయితే దీని నేపథ్యాన్ని మనం అర్థం చేసు కుంటే ఆనాటి సమాజ స్వభావమే కాక జాతి సారం కూడా ముందు తరాలకు అందుతుంది. అది ఎలాగంటే చాకలోడు అన్నమాట ఆ వృత్తి ని తద్వారా ఆ కులాన్ని తక్కువచేసి మాట్లాడడం ని సాక్ష్యం ఇస్తుంది. చాకలోడు అనే కాదు చాకలి అనటం కూడా ఇవాళ అభ్యంతరకరమే. అందుకని చాకలి, రజకగా సంస్కృతీకరింపబడినది. ఇది సాంస్కృతిక ఆర్థిక భూమికగాగల నిందావాచకంగా ఉన్నది కాబట్టి నిషేధించబడింది. దీని ద్వారా ఆనాటి సమాజం లో కులాల మధ్య నిమ్నోన్నతాల సమ్మతిని ధృవీకరిస్తుంది. నిమ్నోన్నతాలు ప్రస్తావన వెల్లడి చేయడానికి మాత్రం ఈ సామెతను సృష్టించడం కాదు. ఆ రోజుల్లో ఏ వృత్తికీ లేని గణిత శాస్త్ర పరిజ్ఞానంతో అనుబంధం చాకలి వృత్తికి ఉన్నది. వస్త్ర విశేషాల జాబితాను వర్గీకరించి మనో గణితంతో నోటి లెక్కలు కట్టి సునాయాసంగా వ్యవహారం చక్కపెట్టగలిగే వ్యక్తిగా చాకలి కనిపిస్తాడు కానీ చదువరి కాగితం కలాలు ఉ ంటే కానీ లెక్కలు వేయలేడు. కాబట్టి ఈ నేపథ్యంలో గణిత పరిజ్ఞానం దృష్ట్యా వేగవంతమైన చాకలి ప్రజ్ఞ ను గొప్పచేయడం కంటే చదువరి నిస్సహాయతను గేలి చేయడం మనకు కనిపిస్తుంది.

అదేవిధంగా పనిలేని మంగలోడు పిల్లి తల గొరిగా డంట. అన్న సామెత కార్యదీక్ష పరుడైన పనికి నిబద్ధుడైన వృత్తి పనివాడిని, పనితనాన్ని వ్యాజస్తుతి చేయడం ఇక్కడ కనిపిస్తుంది. పని చేయకుండా ఉండలేకపోవడం అనేది ప్రగతి సూచకమే కానీ సోమరితనం కాదు. కానీ పిల్లికి జూలు లేదు దానికి ఉన్న పొట్టి జుట్టును కూడా అంట కత్తెర వేయగల నైపుణ్యం మంగలికి ఉన్నది. పనితనాన్ని, పని చేయకుండా ఉండలేక పోవటాన్ని, పట్టి చూపించే సామెత ఇది. దీన్ని కూడా వ్యాజస్తుతిగా మనం తీసు కోవచ్చు.

అనుత్పాదక శ్రమను సూచించే అర్థంలో ఈ సామెత వాడటాన్ని మనం గమనించవచ్చు. అయితే ఇవాళ్ళ పై రెండు సామెతలు అభ్యంతరకరమైనవి. వీటిని అభ్యంతర కరంగా వాడటం కాదు. ఆనాటి సమాజ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి, అంచనా వేయడానికి ఇలాంటి సామెతలు పరిశోధనకు అవసరమవుతాయి.

మన స్థానిక పలుకుబడులకు అసభ్యత ముద్రవేసి వాటిని ఆంగ్ల పదాలతో, సంస్కృత పదాలతో రిప్లేస్ చేయటం, ప్రామాణిక భాష -మాండలిక భాష , శిష్ట భాష- శిష్టేతర భాష, గ్రామ్యం అప భ్రంశ భాష లాంటి

సూత్రీకరణలు భాషను మనుషుల్ని కృతకంగా విభజించి తద్వారా అవి శాశ్వతంగా మరుగున పడి పోయేటట్టు పరోక్షంగా దోహదపడ్డాయి. మాధ్యమాల వల్ల ప్రాదేశిక ప్రాంతాలు విద్యా వ్యాప్తి వల్ల సామాజిక ఆర్థిక అసమానతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో భాష ఏకముఖంగా ప్రయాణిస్తుంది. పాయలుగా విడిపోవడం తగ్గు ముఖం పట్టింది. కానీ వాగ్రూపభాష నిఘంటువులకు ఎక్కవలసిఉన్నది. కళ గా కొత్త తరాలకు అందాల్సిన వాజ్మయం చరిత్రగా నిర్మితం కావాల్సిన సాంస్కృతిక వారసత్వ సంపద మన పూర్వీకుల నాలుక మీద ఉన్నది వారితో పాటు అది కూడా పోయే ప్రమాదం ఉంది కాబట్టి ముందే మేలుకుని వాగ్మయాన్ని నిఘంటువులగా కలగా చరిత్రగా రికార్డు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. వాజ్మయ సేకరణ మన సాంస్కృతిక వైభవం ఎంత ఉన్నదో తెలుసుకోగోరే వారికేకాక గుణాత్మక పరిణామంలో మనం ఎంత దూరం ప్రయాణించాం అన్నదాన్నీ బేరీజు వేసుకోవాలనుకునే వారికి కూడా ఉపకరిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1) జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు
2) తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల పండుగలు

– జి. బాలకృష్ణ, తెలుగు అధ్యాపకులు, నూర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ.

జానపదుల సంస్కృతిలో ప్రధానపాత్ర పోషించేవి పండుగలు. ఒక్కొక్క పండుగ ఒక్కొక్క విశిష్టతను కలిగి ఉంటుంది. అందులో ఎన్నో ఆచారవ్యవహారాలు దాగి ఉంటాయి. అలాంటి పండుగలలో తెలుగువారికి అత్యంత ప్రియమైనది అతి పెద్దపండుగ సంక్రాంతి. మన పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులోనూ విశిష్టంగా జరుపుకొనే అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగను తమిళంలో 'పొంగల్' అని అంటారు. ఈ పండుగ ప్రజలకు ప్రియమైనట్లే జానపద కళాకారులకు కూడా అత్యంత ప్రీతిపాత్రమైనది. అటువంటి జానపద కళలలో ఒకటి గంగిరెద్దుల మేళం. ప్రజలు ఈ గంగిరెద్దులను తమ ఇళ్ళకు ఆహ్వానించి పూజలు చేసి వారి శక్తి కొలది దానధర్మాలు చేసి ఆ గంగిరెద్దుల ఆశీర్వాదం పొందుతారు. ఇలా ప్రజలకు దీవెనలు అందిస్తూ వారిని సంతోషింప చేస్తూ సంచరించే గంగిరెద్దుల మేళంకు మన సాహిత్య సంస్కృతులలో విశిష్టమైన స్థానముంది.

గంగిరెద్దులాట :

తెలుగులో గంగిరెద్దులాట అంటాం. తమిళంలో 'భూం భూం మాడు' అని పిలవబడే ఈ కళారూపం మన సంస్కృతి సంప్రదాయాలను తెలుయజేస్తుంది. గ్రామాల్లో రైతుల వద్ద వున్న కొన్ని ఎద్దులు బాగా బలిసి అలవికాక ఉంటాయి. వారు ఆ ఎద్దులను అదుపు చేయలేక వాటి పొగరణచి చెప్పినట్లు వినేవిధంగా చేసే గంగిరెద్దుల వారికి ఇచ్చేస్తారు. వారు వాటిని తీసుకెళ్ళి, బాగా శిక్షణ యిప్పించి ఆ ఎద్దులకు రకరకాల అలంకరణ చేసి ఆటలు ఆడిస్తూ సంగీత వాద్యాలు వాయిస్తూ యాచన చేసుకుంటారు. ఈ యాచన చేసే దానిలో ప్రధాన పాత్రలుగా గంగి రెద్దులు, గంగిరెద్దుల ఆట అని రకరకాలుగా పిలుస్తారు.

గంగిరెద్దులు పుట్టుక :

గంగిరెద్దుల గురించి సాహిత్యకారులు ఎందరో తమ కావ్యాలలో సందర్భానుసారంగా వీరి వేషణ గురించి, ప్రదర్శనల గురించి రకరకాలుగా వ్యాఖ్యానించారు. ఈ గంగిరెద్దుల పుట్టుక గురించి ఆంధ్రదేశంలో ప్రజా వ్యవహారంలో ఒక కథ ప్రచారంలో ఉంది. ఇక్కడే కాదు దేశమంతటా ఈ కథే దీని పుట్టుకకు కారణం అని చెబుతూ ఉంటారు. ఈ కథను గంగిరెద్దుల ఆట అనే అంశంపై పరిశోధన చేసిన డా॥ కోటగీతశ్రీ ఇలా తెలిపారు.

"పూర్వం తారకాసురుని కుమారుడైన గజాసురుడు శివుని కోసం ఘోర తపస్సు చేస్తాడు. భోలా శంకరుడు గజాసురుని తపస్సుకి మెచ్చి ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమంటాడు. అందుకు గజాసరుడు లయకారుడైన శివుని తన గర్భంలో ధరించాలన్న కోరికతో, శివుని సదా తన గర్భంలో నివాసముండి పూజలందుకోమని కోరుకుంటాడు. ఆ భక్తవతస్సులుడు అంగీకరించి లింగాకారంలో గజాసరుని గర్భంలోకి ప్రవేశిస్తారు. లయకారుడైన శివుని అంతర్ధానంతో లోకం అల్లకల్లోలంగా మారుతుంది. పతి దేవుని జాడ తెలియని పార్వతిదేవి దు:ఖిస్తూ కైలాసానికే వచ్చిన నారదమహర్షిని భర్త జాడ గురించి అడుగుతుంది. త్రిలోక సంచారియైన నారదుడు శివుని జాడను తెలుపుతూ గజాసరుడు వరం పొందిన వృత్తాంతాన్ని పార్వతికి విన్నవిస్తాడు. పతిని విడిపించెందుకు తగినవాడు విష్ణువు అని గ్రహించిన పార్వతి ఉపాయం చెప్పమని, పతికి కలిగిన బందనం నుండి విముక్తి చేయమని విష్ణువును ప్రార్థిస్తుంది.

స్థితికారుడైన విష్ణువు పరమశివునికి పరమ ప్రీతికరమైన నంది నృత్యాన్ని గజాసరుని ముందు ఆడించదలచి, నందివకేశ్వరుణ్ణి, సర్వ అలంకారలతో గంగిరెద్దుగా

తయారు చేసి, బ్రహ్మాది దేవతలు, పురజనులు తోడు రాగా, విష్ణుమూర్తి గంగిరెద్దు నృత్యానికి డోలు వాద్య కారుడిగా, బ్రహ్మ శృతికారుడిగా, ఇంద్రుడు సన్నాయిని ఆలపిస్తూ గజాసురురుణి పట్టణమైన హాణితాపుర పట్టణానికి చేరుకొని, అక్కడి వీధుల్లో గంగిరెద్దులను ఆడిస్తూ, ప్రదర్శనలిస్తూ పుర జనులను మెప్పిస్తూ ఉం టారు. రాజదర్బారు మనుషులు ఆటను చూసి విషయాన్ని గజాసురునికి చేరవేస్తారు.

గజాసురుడు ఆటను చూడాలని తలంచి వారిని దర్బారుకు పిలిపిస్తాడు. ఆ అవకాశం కోసం ఎదురు చూస్తున్న బ్రహ్మ, విష్ణాది దేవతలు గజాసురుని సమక్షంలో గంగిరెద్దులాటను ప్రదర్శినస్తూ డోలు, సన్నాయి వాయిద్యాలతో గజాసురుని మెప్పిస్తారు. గజాసురుడు ఆటను మెచ్చుకొని ఏ వరం కావాలో కోరుకోమని అంటాడు. ప్రయత్నం ఫలించినందుకు విష్ణుమూర్తి సంతోషించి ఇది శివుని వాహనమైన నంది తన స్వామి దూరమై విలపిస్తూ వుంది. ఆ స్వామిని నందిని చెంతకు చెర్చుకోమని కోరతాడు. పరిస్థితి తెలుసుకున్న గజాసురుడు విష్ణువే గంగిరెద్దు వాని రూపంలో వచ్చాడని గ్రహించి, ఇక చావు తప్పదని తెలునుకొని శివుని ప్రార్థించి, నందీశ్వరుడి ఎదుట నిలిచాడు. విష్ణుమూర్తి నందిని ప్రేరేపించగా, నంది గజాసురుణ్ణి తన శిరస్సు లోకపూజ్యం చేయమని, తన చర్మాన్ని శివుడు ధరించాలని కోరగా అట్లే వరమిచ్చి, గజానురునికి శివసాన్నిధ్యాన్ని ప్రసాదించాడు శివుడు. ఈ విధంగా గంగిరెద్దుగా మారిన నందీశ్వరుని ఆడించటం జానపదుల సంప్రదాయంగా స్వీకరించారు.

గంగిరెద్దుల ఆడించేవారి వేషధారణ, వాద్యాలు :

గంగిరెద్దుల వారికి ప్రత్యేకమైన వేషధారణ ఉండదు. ఎప్పుడు ధరించే పంచె, చొక్కాలు ఉంటాయి. మెడలో డోలు, ఒక బూర, భుజాన ఒక చండ్రకోల ఉంటుంది. చర్లకోల ద్వారా ఎద్దును అదుపు చేస్తారు. రెండవ భుజాన రెండు, మూడు సంచులు తగిలించుకుంటారు. గంగి రెద్దుల మేళంలో ప్రధానంగా ఉపయోగించే వాద్యాలు డోలు, బూర, సన్నాయి మొదలైనవి ఉంటాయి.

గంగిరెద్దుల వేషధారణ :

కాళ్లకు గజ్జెలు, కొమ్ములకు తళుక్కుమనిపించే విధంగా రకరకాల పట్టుకుచ్చులు కడతారు. ఎద్దు నుదిట భాగాన ఇత్తడితో చేయబడిన హనుమంతుని విగ్రహం కట్టి దానికి పసుపు, కుంకుమలు పూస్తారు. ఇంకా యాచన సమయంలో వచ్చిన రకరకాల పాత సిల్క్ చీరలు, పట్టు చీరలు, కాశ్మీరు శాలువలు మొదలైనవి ఎద్దుల వీపుపైన వేస్తారు. ఈ గంగిరెద్దులు మేళంలో ఒక ఎద్దు, ఒక ఆవు ప్రధానంగా ఉంటాయి. అయితే ఆవుకు ప్రత్యేకమైన అలంకరణ ఉండదు.

గంగిరెద్దులు - సంచారం :

సాధారణంగా గంగిరెద్దుల వారు పండుగ రోజులలో గ్రామాలలో కనిపిస్తారు. వీరు సంచార జీవులు. వీరు ఏదైనా గ్రామానికి వస్తే ఆ ఊరి పొలిమేరలలోగాని, గ్రామపెద్దల కొట్టాలలో గాని, ఖాళిగా ఉన్న పాలాలలో నివాసాలు ఏర్పరచుకుంటారు. ముఖ్యంగా వారు సన్నాయితో బ్రహ్మంగారి తత్వాలు, సత్యహరిశ్చంద్రలోని పద్యాలు, రకరకాల సినిమాలోని పాటలను పాడుతారు. బాగా సంగీతం తెలిసిన వారు అయితే మంచి రాగాలు ఆలపిస్తూ ప్రజలను మంత్రముగ్ధులను చేస్తారు. ప్రాచీన కాలంలో ఈ గంగిరెద్దులాట పట్ల ప్రజలు ఎంతో ఆసక్తి కనబర్చేవారు. ఎందుకంటే చిన్న చిన్న మాటల ద్వారా ఎంతో విజ్ఞానాన్ని అందిస్తూ హాస్యంతో ముంచెత్తడం ఈ గంగిరెద్దులాట ప్రత్యేకత. అందువలన ఈ గంగిరెద్దుల ఆట కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ కళ ప్రదర్శలో కళాకారుల నైపుణ్యం అద్వితీయమైనది.

ఆధారగ్రంథాలు : గంగిరెద్దులాట - డా॥ కోటగీతశ్రీ

❖

కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర – పరిశీలన

– కొర్ర రమేష్

జానపదుల జీవితంలో జాతర స్థానం ఎంతో ఉన్నతమైంది. జానపద విజ్ఞానానికి, జాతరలకు అవినాభావ సంబంధం ఉంది. రకరకాల గ్రామీణ సంస్కృతులను ప్రతిబింబించేవి జాతరలు. వ్యక్తి నుంచి వ్యక్తికి తెగ నుంచి తెగకు, ఊరి నుంచి ఊరికి ఒక్కొక్క ప్రాంతాన్ని పరస్పరం ప్రభావితం చేసుకుంటూ దట్టంగా పాకే విస్తారగుణం జాతరకున్నది. జాతర అనేది పలు సంప్రదాయాలను, ఆచారాలను, ఆనందాలను, ఆచరణలను, వ్యాపారాలను కలుపుకొని కొనసాగే ఒక వ్యవస్థ. జాతరలో పిల్లలు, స్త్రీలు, పురుషులు, వృద్ధులు, వివిధ రకాల వృత్తుల వారు, కులాల వారు, మతాల వారు అంతా కలిసి పాల్గొంటారు. "జాతర" అనేది ద్రావిడ భాషా పదం. అందరూ కలుసుకునే కోలాహలం. జాతర అంటే ఉత్సవం, జాతా, మేలా అనే పదాలు వాడుకలో ఉన్నాయి. గుంపుకు, సంబరాలకు పర్యాయ పదాలివి. మన భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ జానపద విజ్ఞానం ఇంకా విలక్షణంగా కనిపిస్తుంది.

జాతరలు మొదట గ్రామాల నుండి ప్రారంభమై కాలక్రమేణా అవి మండలాలకు, జిల్లాలకు, పట్టణాలు మరియు రాష్ట్రాల వరకు విస్తరిస్తుంటాయి. గిరిజనుల సంప్రదాయం, ఐకమత్యం, కట్టుబాట్లు, ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబించేల కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర జరుగుతుంది. ప్రతీ రెండేళ్ళకోసారి వైభవంగా జరిగే ఈ జాతరలో గిరిజనులే కాకుండా, గిరిజనేతరులు కూడా ఈ జాతరలో పాల్గొని లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో మిర్యాలగూడ పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి నుండి 5 కిలోమీటర్ల దూరంలో కొండ, కోనల మధ్య కళ్లేపల్లి గ్రామం ఉంది. పూర్వం ధీరావత్ హచ్చు నాయక్ తన కుటుంబం భాదల నుండి, కీడు నుండి విముక్తి కలగాలని కళ్లేపల్లి గ్రామ సమీపంలో బంగారు మైసమ్మను ప్రతిష్ఠించారు. గ్రామ పెద్దల నిర్ణయముతో ప్రతి రెండేళ్ళకోసారి ఏప్రిల్, మే మాసంలో శని, ఆది, సోమవారాలలో జాతరను జరపాలని నిర్ణయిస్తారు. గిరిజన పూజారులతోనే వారి సంప్రదాయ వేషధారణలతో కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర జరుగుతుంది. ఈ మాసాలలో పంట పొలాలు ఏమీ పండించరు కనుక బంగారు మైసమ్మ గుడి పరిసర ప్రాంతాలల్లో వేలాది భక్తులతో నిండిపోతుంది. కేవలం తెలంగాణ జిల్లాల్లోని భక్తులే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతగా, అలా మహిమలు చూసి ప్రతి సంవత్సరము భక్తులు మొక్కలు తీర్చుకోవడానికి వేల సంఖ్యలో పెరుగుతూనే వున్నారు.

చారిత్రక నేపథ్యం :

గ్రామాలలో శక్తి దేవతలలో అతి శక్తివంతమైన గ్రామ దేవత మైసమ్మ. ఈమె వెలసిన ప్రదేశాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి కోటమైసమ్మ, కట్టమైసమ్మ, గండి మైసమ్మ, బంగారి మైసమ్మ అను పేర్లతో వ్యవహరిస్తారు. కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర నిర్వహణకు ముందు చారిత్రక గాథను పరిశీలిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు స్పష్టమవుతాయి. బంగారు మైసమ్మ మహిమల గురించి భక్తులు విభిన్న కథలు ప్రచారంలో ఉన్నాయి. పూర్వము కళ్ళేపల్లి గ్రామంలో ధీరావత్ వంశము నందు హచ్చునాయక్, సూరానాయక్ మరో ముగ్గురు అన్నదమ్ములు నివసించుచుండేవారు. వారిలో చిన్న వారైన హచ్చు నాయక్ ఇద్దరు భార్యలను కలిగి ఉండేవాడు. వీరు సంచార జీవనము

గడుపుతూ ఊరూర తిరుగుతూ ఉప్పు అమ్ముకునేవారు మరియు పశువులను పోషించడం వీరి ముఖ్యమైన జీవనా ధారము.

వీరి వద్ద వందల సంఖ్యలో పశువులు ఉండేవి, కొంత కాలవ్యవధిలోనే చాలా పశువుల చనిపోవడం జరిగింది మరియు అదే సమయములో హచ్చునాయక్ భార్య అంటుమైలతో చనిపోయంది. అన్నదమ్ములు అందరూ కలిసి ఎందుకిలా జరుగుతుందని భావించి కొలుపు చెప్పే ఎరుకల సాని వద్దకు వెళ్ళి 1.25 పైసలు పెట్టి కొలుపు చెప్పించారు. ఎరుకలసాని కొలుపు చెప్తూ నల్లగొండ జిలాల దగ్గర వున్న చెర్కుపల్లి గ్రామమందున్న బంగారు మైసమ్మ ఆవహించడం వల్ల నీ భార్య మరియు పశువులు చని పోతున్నాయని చెప్పింది. దీనికి పరిష్కారంగా మీరు బంగారు మైసమ్మను కళ్లేపల్లి యందు ప్రతిష్టించినట్లయితే నీ కీడు తొలగిపోతుందని చెప్పింది. ఎరుకలసాని చెప్పి నట్లుగానే అన్నదమ్ములందరూ కలసి మైసమ్మను ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నారు. దానికోసం డప్పులు వాయించే వాళ్ళను, పెద్దకాపు, పెద్దగౌడ, పెద కుమ్మరి, బవనీలు, పెద్ద చాకలి, మైసంగి, మాతంగి మొదలగు వారందరిని పిలిపించి మైసమ్మను ఆరె చెట్టు క్రింద నాలుగు చదునైన రాళ్ళతో ప్రతిష్ఠించి, దానికి సున్నం వేసి, ఒక పిల్ల తల్లి గొర్రెపిల్లను, దున్నపోతును బలి యిచ్చారు. బలి యిచ్చిన గొర్రె పేగులను బవనీడు ధరించి, "గావు" పట్టిన జీవము యొక్క రక్తాన్ని కుంభంలో కలుపుతారు. ఇట్టి కలిపిన అన్నమును ఊరి చుట్టు తిరుగుతూ చల్లుతారు. ఇలా పోలి చల్లడం వలన గ్రామానికి దుష్టశక్తులు రావని వీరి విశ్వాసము.

జాతర సంప్రదాయం / జాతర విధానము :

కళ్లేపల్లి గ్రామంలో బంగారు మైసమ్మ జాతర పర్వ దినాన సాంప్రదాయబద్ధమైన వేడుకలు జరుగుతాయి. హచ్చునాయక్ నుంచి వంశపారంపర్యంగా వస్తున్న గిరిజనులు తొమ్మిది బంగారు మైసమ్మ వెండి విగ్రహాలను గ్రామము నుండి తీసుకురావడంతో జాతర ఊపందు కుంటుంది. మొదట కుంటుంబ సభ్యులు మాత్రమే పూజించేవారు. కాలక్రమేణ చుట్టు ప్రక్కల గ్రామాలలో నివసించే గిరిజనులు పూజించడం ప్రారంభించారు. ఈ విధంగా గ్రామాల నుండి మండలాలు, మండలాల నుండి జిల్లాల వరకు ఈ మైసమ్మ మహిమలు వ్యాపించి ఇప్పుడు మూడు రోజుల జాతరగా సాగుతుంది. ప్రస్తుత కాలంలో ఈ జాతరకు గిరిజనులే కాకుండా, గిరిజనేత రులు వివిధ కులాల, మతాల, వృత్తులవారు వచ్చి మొక్కులు చెల్లించుకోవడం విశేషం. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ప్రసిద్ధిచెంది, వారి మొక్కు చెల్లింపులు దున్నపోతులు వదిలేయడం, జంతు బలి, కోళ్ళు బలి మరియు ముడుపులు కట్టడం, కానుకలు సమర్పించడం వంటివి వివిధ రూపాలలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. బలి యిచ్చిన యాటలు, కోళ్ళ ఎడమ కాలిని మాత్రం భక్తులు గుడి ఆవరణలో ఉన్న చెట్లకు కడతారు. దేవతకు నైవేధ్యంగా పాయసం మరియు వండిన కాలేయం లేదా కాల్చిన కాలేయంను మరియు కొబ్బరి కాయలతో పాటు కానుకలు సమర్పించు కుంటారు. జాతర చివరి రోజు ఆలయ కమిటి నిర్ణయిం చిన విధంగా దున్నపోతులను బలి యిచ్చి గుడి చుట్టు పాలి తిరిగి ఆ తొమ్మిది విగ్రహాలను తిరిగి గ్రామంలో తీసుకువెళ్తారు. దీనితో జాతర ముగుస్తుంది. కాని అదే రోజు కళ్లేపల్లి గ్రామ ప్రజలు అమ్మ వారిని తన ఇంటివద్ద యాటలు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

ముగింపు :

కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర మొదట ఒక కుటుంబంతో ప్రారంభమయ్యి కాలక్రమేణ గ్రామ గిరి జనులు జరుపుకునేవారు. బంగారు మైసమ్మ మహిమలు మరియు కోరిన కోర్కెలు తీర్చే మహిమగల తల్లి అని ఆనోట ఈనోట వ్యాపించి గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లాలకు, జిల్లాల నుండి రాష్ట్రమంతా వ్యాపించియున్నది. ఈ జాతర సమయంలో వేలాది

మంది భక్తులు గిరిజనులే కాకుండ, గిరిజనేతరులు కూడా పాల్గొనడం విశేషం. ఈ విధంగా అభివృద్ధి చెందడం వలన తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలో తీసుకొని ఇంకా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉన్నది. కావున ఇంతటి అభివృద్ధి చెందిన జాతర మీద పరిశోధన చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

ఆధార గ్రంథాలు :

1) డా. చింతల యాదయ్య - నల్లగొండ జిల్లా జాతరలు-పరిశీలన - 1995, పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, 1-1-517/బి/1, న్యూబాకారం, గాంధీనగర్, హైదరాబాద్-500380.

2) డా. సుతారి లక్ష్మీనారాయణ-''బోనాల ప్రదర్శన కళారూపాలు'', ప్రసన్న ఆర్ట్ ప్రింటర్స్, ఇసిఐఎల్, హైదరాబాద్-62.

3) జూలూరు గౌరీశంకర్, పెన్నా శివరామకృష్ణ-తెలంగాణ సంస్కృతి-కళలు, శ్రీ బాలాజీ గ్రాఫిక్స్, గోల్నాక, హైదరాబాద్-13.

❖ ❖ ❖

జానపద సాంఘికాచారాలు

– డా॥. సూర్యకాంతి, అసోసియేట్ ప్రొఫెసర్, అరారోస్ డిగ్రీ & పి.జి కళాశాల, హైదరాబాద్.

జానపదం :

జానపదం అంటే పల్లె లేదా చిన్న గ్రామం. జనపదంలో ఉండేవారు జానపదులు. జానపదులకు సంబంధించింది జానపదం. అది వస్తురూపంలో, భావరూపంలో, ప్రదర్శన రూపంలో ఉండవచ్చు. మొత్తం మీద జానపదత్వమున్నది జానపదమవుతుంది.

ఈ పదం అమరకోశంలోనూ, వ్యాసమహర్షి విరచిత భారతంలోనూ ఇదే అర్థంలో కనిపిస్తుంది. ఎఱ్ఱన అరణ్య పర్వంలో జానపదులు గ్రామీణులనే అర్థంలోనే ప్రయోగించారు.

"జానపదుల్ పురీజనుల సంతసమున్ బ్రమదం బెలర్పనీ
దైన శుభోదయంబ హృదయంబుల గోరుచున్న వారు స
మ్మానము నొంది కౌరవ సమాజము నిన్ను భజింప భూరితే
జోవిధివౌ వెలింగెదవు సూర్యుని చాడ్పున నీవ యిమ్మహిన్"
(భారతము - అరణ్య-346)

ఇది సాహిత్యంలో అంతర్భాగమే అయినా ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. ఉచ్చారణ మాండలిక పదాలు, గ్రామ నామాలు, అరుపులు మొదలైనవెన్నో ప్రధానంగా భాష క్రిందకి వస్తాయి. తిట్లు, ఒట్లు కూడా భాష క్రిందనే పరిశీలించాలి. ఒక భాషలోని వివిధ మాండలిక క్రియలు గిరివాసి, పురవాసి, గ్రామవాసి ఉచ్చారణలో వైవిధ్యం తెలుసుకోవడానికి భాష దోహదం చేస్తుంది.

ఇవన్నీ జానపద విజ్ఞానంలో విభాగాలు, అయితే అన్నింటికీ మూలం సాహిత్యమే అని చెప్పక తప్పదు. సాహిత్యంలోనే సంస్కృతి, ఆచారాలు, ఆటపాటలన్నీ దర్శనమిస్తాయి. ఈ అంశాలన్నీ తనలో నిబిడించుకొన్న పదం మాత్రం జానపద విజ్ఞానం.

జానపద విజ్ఞానంలో సాహిత్యంలో పాటు భౌతిక సంస్కృతి లేదా వస్తు సంస్కృతి ప్రధాన పాత్ర వహించింది. వివిధ వృత్తి క్షేత్రాల్లో జీవనం కొనసాగించే మానవునికి ఆయా వృత్తి సంబంధి పరికరాలు కావాల్సి వస్తాయి. ఆ పరికారాలతో కొనసాగించిన పనివల్ల ఉత్పత్తి వస్తుంది. ఆ పరికరాల నిర్మాణంలోనూ, ఇటు వస్తూత్పత్తిలోనూ తనదైన ప్రత్యేకతను జానపదుడు సంతరించుకొన్నాడు.

వ్యవసాయం, వండ్రంగం, కమ్మరం, నేత, గీత, అల్లిక, అలంకరణ అది ఏది అయినా సరే జానపద సంస్కృతీ చిహ్నంగా కనిపిస్తే చాలు అవి ఈ విభాగంలో చేరుతుంది.

జానపద సాంఘికాచారం :

జానపద విజ్ఞానంలో వస్తు సంస్కృతితోపాటు సాంఘికాచారాలకు కూడా ప్రధాన స్థానముంది. జీవితం ఎక్కడో మలుపు తిరుగుతుంది. ఆ మలుపుకు గుర్తుగా ఓ పండుగో, పబ్బమో, ఉత్సవమో, జాతరో జీవితంలో స్థిరపడుతుంది. అది ప్రారంభంలో వ్యక్తిగతమైనదైనా, కొంతకాలానికి అది ఒక సముదాయానికీ, ఒక జాతికి చెందిందై సాధారణీకరణాన్ని పొందుతుంది. అది తరం నుండి తరానికి సంక్రమించి స్థిరంగా నిలిచిపోతుంది.

వేడుకలు, తిరునాళ్లు, ప్రభలు కట్టడం, బోనాలు తీయడం, బలులివ్వడం, నమాధులకు పూజలు చేయడం, మంత్రతంత్రాలు తాయెత్తులు కట్టించుకోవడం, సంతర్పణులు, దాన ధర్మాలు, దిగదిడుపులు, దిష్టితీయడం, నైవేద్యాలు, మ్రొక్కుబడులు, విషయాలపై విశ్వాసాలు - ఇలా ఎన్నో అంశాలు సాంఘికాచారాల క్రిందకి వస్తాయి. ఇవేగాక పుట్టుక చావు వరకు భారతీయ సమాజం అనుసరిస్తున్న షోడశ సంస్కారాలకు కొంత

అటు ఇటుగా వచ్చిన ఆచారాలెన్నో కనిపిస్తున్నాయి. ముక్కు కుట్టించడం, చెవి కుట్టించడం, తిలకధారణం, విభూతి ధారణం, తీనెదీసి అలకడం, చెట్లకు వివాహాలు చేయడం, బృందావనాలు నిర్మించడం, వనవాసాలకు వెళ్లడం, బండ్లు తీయడం, కల్లుసాకవోయిడం, కాకి ఇంట్లోకి వస్తే శాంతి అనేక కట్టుదిట్టాలుండడం ఈ విధంగా ఇంకా ఎన్నోఅంశాలు ఆచారాల క్రిందకి వస్తాయి.

ఆచారాలు :

ఆచారాల్లో దురాచారాలుంటాయి. సదాచారాలుంటాయి. దురాచారం ఏ చారిత్రక సాంఘిక పరిస్థితుల్లో కాలానుకొన్నా అది శాశ్వత కాలాలపాటు నిలువదు. సదాచారం మాత్రం ఎప్పుడూ ఉంటుంది. దేశ కాల పరిస్థితుల్ని సమన్వయించుకొంటూ కొనసాగుతుంది.

ఇంటిని అలకడం, ముగ్గులు వేయడం, కడపలు కడిగే పనువు కుంకుమల బొట్టు పెట్టడం ఆరోగ్య విధులైన ఆచారాలు.

వివాహ సందర్భంలో తోరణాలు కట్టడం, గంధం అక్షింతలు పంచడం, పోలు రాయడం లేదా హెూమం నిర్వహించడం కర్మకాండకు సంబంధించిన ఆచారాలు.

వ్యక్తి జీవనంలో పుట్టుక చావు వరకున్న సంస్కారాల్లో చాలా వరకు ఆచారాలుగా స్థిరపడ్డాయి. ఆచారమనేది ఓ కార్యం. కార్యకరణ సంబంధం లేకుండా ఆచారాలు రావు - పోవు.

"ఇంతింతాకు - బ్రహ్మంతాకు
పెద్దలు పెట్టిన - పేరంటాకు"

ఈ పొడుపు గేయానికి మంగళసూత్రం విడుపు. హిందూ వైవాహిక సంప్రదాయాల్లో మంగళ సూత్రధారణం అన్ని ప్రాంతాల్లో ఏమిలేదు. అందువల్ల ఇలాంటివి ఏ ప్రాంతంలో ఏ కాలంలో పుట్టాయో నిర్ధారించడానికి అవశాకముంది. ఆ నిర్ధారణకు ముందే జరిగే పరిశోధన సాంఘిక చరిత్ర నిర్మాణానికి కావల్సినంత సామాగ్రి కూడా లభిస్తుంది.

చరిత్ర కందని అతి ప్రాచీన కాలం విషయం తెలియదు గాని మధ్యయుగంలో పొడుపుకథలు విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు దేశ కాల పరిస్థితులను బట్టి పుట్టిన పొడుపు కథలు సాధించిన ప్రయోజనం అద్భుతమనిపిస్తుంది.

లోకజ్ఞానం :

పొడుపు కథ వల్ల లోకజ్ఞానం అబ్బుతుంది. ఆలోచనకు తావిచ్చినప్పుడు భూత భవిష్యద్వర్తమాన విషయాల్ని శోధించడం తప్పనిసరి అయినప్పుడు లోకజ్ఞానం తప్పకుండా అబ్బుతుంది.

శాస్త్ర విషయ పరిజ్ఞానం :

తత్వ, వైద్య జ్యోతిష, గణితాది శాస్త్రాలు పొడుపుకథల్లో కనిపిస్తాయి. వాటివల్ల శాస్త్ర విషయ పరిజ్ఞానం కలుగుతుంది.

క్రీడాసక్తి :

ఈ క్రీడ కూర్చొని ఆడే ఆటే, హాస్యాద్భుతాల్లో ముంచి వేసే గుణం కలిగిన పొడుపుకథ వ్యవహర్తకూ శ్రోతకు క్రీడా సక్తిని పెంచుతుంది.

ఆలోచన శక్తి :

జటిల ప్రశ్నను పరిష్కరించేది ఆలోచనే.

జ్ఞాపకశక్తి :

అడగాలంటే అది తెలిసి ఉండాలి. తెలిసి ఉండాలంటే ధారణ చేయాలి. ధారణ వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

వాచక శక్తి :

ఈ కథల్లో అంత్యాక్షరి, చ్యుతాక్షరి, దత్తాక్షరి వంటి అంశాలూ వస్తాయి. స్పష్టమైన ఉచ్చారణ కూడా అవసరం. వీటిన్నిటి వల్ల వాచక శక్తి పెరుగుతుంది.

సమన్వయ శక్తి :

పొడుపు కథ కేవలం విప్పడం కాదు, విప్పాలంటే ఎంతో సమన్వయ శక్తి ఉండాలి.

జిజ్ఞాస :

పరిష్కారం కొరక జిజ్ఞాస పెరుగుతుంది.

ఏకాగ్రత :

సమస్య పరిష్కరించాలన తపన కారణంగా 'ఏకాగ్రత' నిలుస్తుంది.

విచిత్ర వాగ్వ్యవహారం :

చమత్కారంగా మాట్లాడే శక్తి వస్తుంది.

సమాజంలో అన్ని రంగాలపై ప్రపంచీకరణ ప్రభావం ఉన్నట్లే నేడు జానపదుల జీవన విధానం, తెలుగు భాషపై కూడా ఉన్నది. పాశ్చాత్య విద్య, సంస్కృతీ, సాంప్రదాయల వల్ల యాంత్రిక జీవనానికి అలవాటు పడి నేటి జానపదులు మానవ జీవిత లక్ష్యాన్ని మరిచిపోతున్నాయి. అందుకే ఐకమత్యాన్ని తెలిపే ఉమ్మడి కుటుంబాలు, ప్రేమను పంచే అనురాగాలు - అనుబంధాలు, శ్రమ విలువలను నేర్పే వ్యవసాయం, సంప్రదాయాన్ని చూపించే వస్త్రధారణ, ఆచారాలు, పండుగలు, పవిత్రతకు చిహ్నం అయిన వివాహ వ్యవస్థ, అమ్మలాలన, తండ్రిపాలన, బంధువుల ఆప్యాయతలు నేటి మనిషికి కనుమరుగౌతు అవసరం లేకుండా పోయాయి. కాబట్టి మరల మానవీయ సంబంధాలు మెరుగుపడాలంటే జానపదుల జీవనంపై ప్రపంచీకరణ ఏ విధంగా ప్రభావం చూపుతుందో సమీక్షించి, ఆ ప్రభావం నుంచి బయట పడేలా చూడాలి. అప్పుడే మన జానపదుల సంస్కృతి, సంప్రదాయాలతో దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - బి. రామరాజు
2. తెలుగు వారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
3. జానపద విజ్ఞాన వ్యాసావళి - జి.ఎస్.మోహన్
4. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరం

❖ ❖ ❖

తెలంగాణ జానపద స్త్రీల పాటలు – సాహిత్యం : నవీన స్త్రీల పాత్ర

– డా॥. లింగా శ్రీనివాస్

తెలంగాణ జానపద విజ్ఞానంలో స్త్రీల పాటలకు విశిష్ట స్థానాన్ని సంతరించుకుంది. శ్రామిక జీవనంలోని సౌందర్యం అంతయూ గ్రామీణుల మౌఖిక సాహిత్యంలోనే ఉంది.

ఒక వైపు కార్మికుల, కర్షకుల శ్రమను మరిచి పోయేందుకు ఆశువుగా పుట్టిన గీతాలు అనాటి సమ కాలీన పరిస్థితులను, సాంస్కృతిక అంశాలను, మనస్త త్వాన్ని చిత్రీకరిస్తాయి. "పనితో పాటే పాట, పాటతో పాటు పని" అన్న లోకోక్తిని ఋజువు చేస్తాయి. అటువంటి గ్రామీణ జానపద విజ్ఞానంలో స్త్రీల పాటలు నేటికీ అజరామరాలు.

జానపద స్త్రీల పాటలను స్త్రీ పుట్టుక నుండి చివరి దాకా అన్ని పరిస్థితుల్లోనూ సాహిత్యం కూడా మమేకమై ఉంది. లాలి పాటలు, పురుటి పాటలు, ఉయ్యాల పాటల నుండి స్త్రీల జీవన సంబంధమైన అనేక సాంస్కృతిక ప్రక్రియలలోనూ తత్సంబంధమైన గీతాలు నేటికీ మనుగడలో ఉన్నాయి. ఇవి గాక గృహ సంబంధ మైన, నిత్య కృత్యములలోనూ, రోకటి పాటలు, దంపుడు పాటలు, చాట పాటలు, ఇసుర్రాయి పాటలు అనేకం ఉండేవి. వివిధ రకాల నోములు, వ్రతాలు, పండుగ సంబంధమైన పాటలను గూర్చి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. జీవన సంబంధమైన సాంస్కృతిక ప్రక్రియలలోని సమర్థ పాటలు, సీమంతం పాటలు, పెళ్లి పాటల్లోని నలుగు పాటలు, అప్పగింతల పాటలు అనేకం స్త్రీల జానపద వాఙ్మయమే.

జానపదులు వారి వారి ఇష్ట దైవాలను - ప్రార్థించేం దుకు పారమార్థికాలు, మంగళ హారతులు మాత్రమే కాకుండా, నవరసోపేతమైన అన్ని అనుభూతులను స్త్రీల పాటలలోని సాహిత్యంలో చూడవచ్చును.

కుటుంబ సంబంధ గేయాలు :

జీవితపు రథానికి స్త్రీ-పురుషులు ఇరువురూ రథ చక్రాలైతే పురుషుల జీవిత విశేషాల కన్నా, స్త్రీల సంబంధమైన పనులలోని పాటలే అనేకం.

గృహ సంబంధమైన పనులలోని ప్రతి పనులలోనూ తాము ఆశువుగా పాడుకునే పాటలలోని సాహిత్యం అత్యంత విలువైనది.

పొద్దున లేచీ లేవంగానే చీపురు విలిసెను ఓ లాలా....
చీపురు తీసి ఊడుస్తుంటే వాకిలి వెలిసెను ఓ లాలా ....
వాకిలి లోనా ముగ్గేస్తుంటే రోకలి విలిసెను ఓ లాలా ....
రోకలి తోనే దంచుతూ ఉంటే కుంపటి విలిసెను ఓ లాలా ....
కుంపటి నేనూ సగలెడుతుంటే పిల్లల బాధా ఓ లాలా ....

(పాడిన వారు : శ్రీమతి ఎం.పోషవ్వ (67) మల్యాల గ్రా॥)

ఉదయం లేచిన నుంచీ స్త్రీ ఒక తల్లిగా, భార్యగా, ఆడపడుచుగా ఎన్నో పాత్రలు నిర్వహించ వలసిన అనేక సందర్భాలలో వారి అంతర్మథనాన్ని సాహిత్యం ద్వారా తెలుసుకొన వచ్చును. కోపంలోనూ, సంతోషంలోనూ వారి మాటలు పాటలుగా మనకు వినిపిస్తాయి. ..

లాలి పాటలు :

జో అచ్యుతానంద జో జో ముకుందా!
లాలి పరమానంద రామ గోవిందా జో జో !!

జోల పాటలలో రామాయణ, భారత సంబంధమైన కథలను పాటలుగా విన్నప్పుడు కనిపించే సాహిత్యము కన్నా నికార్సయిన గ్రామీణులు తమ చిన్న పిల్లలకు లాల పోస్తూ, ధూపం వేస్తూ, అనేక రకాలైన సేవ చేస్తూ పాడుకునే పాటలలో వారి పుట్టింటి విశేషాలు మేన

మామల పౌరుషాలను, ప్రేమానురాగాలను వర్ణిస్తూ గల సాహిత్యమే ఎక్కువగా మనస్సులో నిలుస్తుంది.

ఉళు.. ళూళూ.... హాయమ్మా....
ఇగో దాయె పిట్టా.... దాయిల్ల పిట్టా...
పిట్టా రాయె పిట్టా... పిల్లాల తల్లీ....
ఇగొ మందల్ల ఉన్నాడే మామ మయేషూ...
ఇగొ మరువాక తేవయ్యా మచ్చాపు పాలూ
ఇగొ తోడు వెట్టక తేరూ తొర్రావు పాలూ....
ఇగొ కాగా వెట్టక తేరూ కర్రావు పాలూ...
ఇగో ఎచ్చవెట్టక తేరూ ఎర్రావు పాలూ....

(సేకరణ : పరిశోధకులు - పాడినవారు కీ.శే. శ్రీమతి లలితాబాయి (72)

అంతే కాకుండా ఆయా ప్రదేశాలలోని గ్రామ దేవతలను విశిష్ట దేవతలను, ఇష్ట దైవాలను కొలుచుకుంటూ పాడుకునే పాటలలో గ్రామీణ స్త్రీల మాతృత్వ పరిమళాలతో పాటు పారమార్థిక తత్వాలను స్పష్టంగా గాంచవచ్చును.

"అమ్మాయి మామల్లూ ఎటువంటి వారూ
అడ్డ పంచెల వారు అంగీల వారు"

(పెద్ద బాలశిక్ష. పుట)

ఇటువంటి సాహిత్యం - చిన్న నాటి నుండి మనం బాలశిక్షలోనే నేర్చుకొని యున్నాము. గృహ సంబంధమైన అనేక పనులలోనూ స్త్రీలు తాము అను నిత్యం చేసే శ్రమతో పాటు ఆశువుగా పుట్టిన పాటలలో రోకటి పాటలు మరొక కోణం.

సువ్వీ సువ్వన్నల్లా సువ్వన్నల్లారా ఓ మాయన్నల్లారా....
సువ్వన్నీ నేనొక్కా పాటా వాడంగా... ఓ పోటూ వేయంగా...
వడ్లోల్లు జెక్కిన్నా వన్నెల్లా గదమూ... నా వన్నెల్లా గదమూ...
కమ్మరన్న జేసినా... గజ్జెల్లా పొన్నూ... నా గజ్జెల్లా పొన్నూ...
ఉంగరాలా శేత ఊపి పోటేసీ... నా ఆపి పోటేసీ...
కంకణాలా శేత గదమందూ కోనీ... నా గదమందూకోనీ...
మెట్టెల్లా కడియాలూ మెరియంగా జూపీ - నా మెరియంగా జూపీ...
మాయత్తా గంగమ్మా పెద్దా కోడలినీ... నేను మాదేవీనీ!

పాడినవారు : శ్రీమతి నాగలక్ష్మి (48), ఇమాంపేట (గ్రా), సూర్యాపేట (మం)

గ్రామీణ స్త్రీల శ్రామిక సౌందర్యం వారి పాటల్లోని సాహిత్యంలోనే కనిపిస్తుంది. ఆశువుగా పాడుకొన్ననూ వారి జీవితంలోని అనుభవాలనూ, అనుభూతులను, అంతరంగాలనూ ఈ పాటలలో పాడుకొంటారు. ఆనందాన్ని కూడా అన్ని సమయాల్లో పంచుకోలేనంత కట్టడి చేసే కుటుంబ వ్యవస్థలోనూ... వారి మనోభావాలను ఇలా వ్యక్తం చేస్తారు.

ఇసుర్రాయి పాటలు :

ఆనాటి సమిష్టి కుటుంబాలలో ఇంటికి సంబంధించిన పనులు అందరూ కలిసి మెలిసి చేసుకునే వారు. అటు సమిష్టిగా చేసుకున్నా, ఒంటిగా పని చేసుకుంటున్నా పనిని మరిచి పోవుటకు పాడుకునే పాటలతో మానవీయ కోణమే ఎక్కువగా కనిపిస్తుంది. దంపుడు పాటలతో పాటు మరో వైపు ఇసుర్రాయితో ఇసురుతూ కూడా మాట్లాడుకుంటారు, పాడుకుంటారు.

సక్కాని సరిబండ మీదా ఒస్సేయ్
శెక్క గొట్టె సిన్నదాన్నీ
శెక్క వచ్చి శెంప దలిగే నా సామి
సెప్పరాని ద్దుఃఖమొచ్చే
మాయదారి గుంటి మీదా ఒస్సేయ్
మందునూరు మావ కొడుకో
మందు దేకపోతే మాయె నాసామి
మనసులుంటే సాలు పోరో!

పాడినవారు : నాగలక్ష్మి, సూర్యాపేట

ఎంతో ప్రేమానురాగాలతో గడిచే ఆనాటి గ్రామీణ జీవనంలో స్త్రీలదే ప్రత్యేకమైన పాత్ర. గృహ సంబంధమైన

పనులే కాకుండా వ్యవసాయ కుటుంబాలలో స్త్రీలు పాలం పనుల్లోనూ పాటలు వినిపిస్తాయి.

కలుపు పాటలు (పొలం పాటలు) :

మదనా సుందారి - పూలా వయ్యారి -
ఎంతా లెంకిన లేడు అత్తా నీ కొడుకూ
మదనా సుందారి
సిరగోనేలాడేటి సింతల్ల జూడో మదనా సుందారి
ఎంతా లెంకిన లేడు అత్తా నీ కొడుకూ
మదనా సుందారి
శెండీలు ఆడేటి శెర్లల్ల జూడో మదనా సుందారి
ఎంతా లెంకిన లేడు అత్తా నీ కొడుకూ
మదనా సుందారి
గోటీలు ఆడేటి గోడల్లా జూడో
ఎంతా లెంకిన లేడు అత్తా నీ కొడుకూ
మదనా సుందారి
బంగురాలు ఆడేటి బొడల్ల జూడో మదనా సుందారి
అరుకల్లూ దున్నేటీ సెలుకల్లా జూడో మదనా సుందారి
దొరికిండూ నీ కొడుకూ దొరబాబు వోలే
మదనా సుందారి

పాడినవారు : ఎల్లమ్మ (67), జగిత్యాల, మేడిపల్లి (మం॥)

ఇలా ఆది పదాలు అంత్య పదాలు పునరావృత మవుతూ సాగే కలుపు పాటల్లోనూ ఎంతో మాధుర్యతను సంతరించకొంది మన తెలంగాణ వాఙ్మయం.

కలుపు పాటలు, నాట్ల పాటలు, కోతల పాటలు, గూడ పాటలు, ఏతం పాటలు ఇలా ఒకటేమిటి, వ్యవ సాయంలోని ప్రతి పనీ, పాటలతో కూడుకొని యుండును.

ఏటి కేతం బట్టి ఎయ్ పుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరుగనన్నా...

అనే రైతులు, ఆ రైతులను ప్రేమతో ఓదార్చుతూ జీవితాన్ని సాఫల్యం చేయు భార్యల పాత్ర అనిర్వచ నీయం.

పొద్దు జాత్తే బారెడెక్కే - మింటి సూర్యుడు మీదికెక్కె
పంతమేలా పని మీదా...
యావ లేదు బువ్వ మీదా!
నీ తోడు నేనుంటా - నీ జాడ నడుస్తుంటా...
ఈ ఏడు మన పంటా మెండుగానూ పండునంట...

ఒక వైపు కర్షకులు, మరో వైపు కార్మికులు, పండుగలు, నోములు, వ్రతాలు, పేరంటాలు, పెళ్ళిల్లు... ఒకటేమిటి మానవుని జీవితం ఆద్యంతం స్త్రీ. ఒక వరమై నిలుస్తుంది. అటువంటి గ్రామీణ స్త్రీలు తమ సంస్కృతిని వారసత్వ సంపదగా తమ తరువాత తరాలకు అందించు ననుటకు తెలంగాణ పండుగ బతుకమ్మకు బడ్డెమ్మను జోడించి నట్లే. బోనాల పండుగలో ఆడిబిడ్డలు బోనమెత్తినట్లే. అందుకే మన రాష్ట్రం జాతీయ పండుగలుగా ప్రకటిం చింది.

నవీన స్త్రీల పాత్ర :

ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న విజ్ఞానం - తరుగుతున్న మానవ విలువలు. ఈ నేపథ్యంలో నేటి కాలపు స్త్రీ పాత్ర అనిర్వచనీయం.

ప్రాచీన సంస్కృతిలోని స్త్రీలు తల్లిగా, ఇల్లాలిగా, కూతురుగా, భార్యగా వివిధ సందర్భాలలో నిర్వహించిన విధులు తరతరాలకు మార్గదర్శనం.

పాశ్చాత్య పోకడలను తగ్గించి, నేటి యువతులకు మన ప్రాచీన సంస్కృతిని అవలంబించేందుకు ప్రోత్స హించాలి.

మన గ్రామీణ సంస్కృతి మరియు వివిధ దశలలోని "సమిష్టి కృషి"ని అలవాటు చేయటం ద్వారా, సంఘీక జీవనం, సమిష్టి జీవనంలోని మాధుర్యం, కష్టసుఖాలు పంచుకునే అవకాశం కలిగి, ఏకాంత జీవనం ద్వారా ఏర్పడే అనారోగ్య, మానసిక రుగ్మతలకు చెందిన లక్షణా లను బాగు చేసుకోవచ్చును.

పనితో పాటు పాటలు నశించాయి. టెక్నాలజీ పనిని చేయగలుతుతుంది. కానీ సంఘ జీవనంలోని శ్రామిక

పరిమళాలను మానవీయ కోణంలో భావి తరాలకు అందించలేక పోయింది.

మానవతా విలువలు కలిగిన మన ప్రాచీన జానపద గేయ వాఙ్మయం ఇప్పటికీ సమాజంలో మెరుగైన జీవనం కోసం అవసరం. నేటి తరం పిల్లలకు మన భాష, సంస్కృతిని గురించి అర్థమయ్యేలా వివరించి వారితో ఆచరింప జేయాలి. వివిధ రకాల పండగలు నిర్వహింప జేయాలి. ముఖ్యంగా మన తెలంగాణ రాష్ట్రీయ పండుగ లైన బోనాలు, బతుకమ్మ పండుగల సాంస్కృతిక నేపథ్యం, శాస్త్రీయత, సాంస్కృతికతలను నేటి తరం పూర్తిగా తెలుసుకోగలిగేలా చూడాలి.

అత్యంత వైభవమైన జానపద కళా రంగానికి పెట్టని కోట గోడలు ఇప్పుడు శిథిలమవుతున్నాయి. వాటి పునర్నిర్మాణం చేయుట కష్టమైనా, కనీసం ఉన్న వాటికి కొంత రంగులద్దితే... అది మరి కొన్ని తరాలు మన గలుగుతాయి. అందుకు ప్రధాన పాత్ర నేటి స్త్రీలదే.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపద నృత్య గీతాలు, సాహిత్యానుశీలనం, డా॥ వేదాంతం శ్రీదేవి (శ్రీ పబ్లికేషన్స్)
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - పొ.శ్రీ. తె.వి.వి. ప్రచురణ - డా॥ ఆర్.వి.ఎస్. సుందరం
3. తెలుగు జానపద గేయ సాహిత్యం - జానపద విజ్ఞాన ప్రచురణలు, 1958, బి. రామరాజు
4. జానపద సరస్వతి వ్యాస సంపుటి - 2013, ఆం.ప్ర. జానపద సాహిత్య పరిషత్తు.
5. తెలుగు జానపద సాహిత్యము - స్త్రీల గేయములలో సంప్రదాయము - డా॥ సి.వసుంధరా రెడ్డి (ఆంధ్ర సారస్వత పరిషత్తు)

❖ ❖ ❖

జానపద కళారూపాలు – పిచ్చుకకుంట్లు

– మద్దిరాల సత్యనారాయణరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

జనుల సమూహమే జానపదం. జానపదమనగా గ్రామం లేదా పల్లె అని అర్థం. తెలుగు సాహితివేత్తలు అనేక కావ్యాలలో జానపదులను 'పల్లీయులు' అని ప్రయోగించారు. ఒక ప్రత్యేకమైన సంప్రదాయం గల ఏ సమూహానైనా జానపదులు అని ఆంగ్ల సాహితివేత్త అయిన 'అలెన్ డాండస్' నిర్వచిస్తే, "అక్షర జ్ఞానం లేని పల్లె ప్రజల సాంప్రదాయక విజ్ఞానము అదియే జానపద విజ్ఞానం" అని తంగిరాల సుబ్బారావు పేర్కొన్నారు. అయితే తంగిరాల అభిప్రాయం ప్రకారం వారికి అక్షరజ్ఞానం లేకపోవచ్చు కాని వారి అనుభవ ప్రపంచం చాలా పెద్దదని చెప్పవచ్చు.

జానపదులు ఆనందంగా పని సమయాలలో ఉత్సాహంకంగా ఉండటానికి కొన్ని గేయాలను పాడేవారు. ఈ గేయాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ, కొన్ని కళారూపాలను సృష్టించి, వాటిని గ్రామాలలో ప్రదర్శించే వారు. ఈ జానపద కళాకారులు సంచార జీవులు. వీరి వల్లనే జానపద కళా రూపాలెన్నో ఇప్పటికి నిలిచి ఉన్నాయి. వీరు జానప సాహిత్యానికి మూల స్థంబాలాంటి వారు. పూర్వం ఈ జానపద కళాకారులు ఒక నియమిత కులాలకు కథలు చెబుతూ వారిచ్చే భృతితో గౌరవంగా బతికేవారు. కాని తరువాతి కాలంలో సమాజంలో వచ్చిన మార్పుల వల్ల జానపద వృత్తి గాయకులలో కూడా మార్పు వచ్చింది. వారు పొట్టకూటికోసం అన్ని కులాల వారిని యాచించడం ప్రారంభించారు. అయినా నేటికి కొందరు వృత్తి కళాకారులు తమ కులాల తెగల వారిని యాచించి జీవనం సాగిస్తున్నారు. జానపద కళారూపాలలో తన్మయత్వంతో నృత్య గానాలు చేసే సమయాన రాగతాళ లక్షణాలు కొన్ని సార్లు ఏమి తెలియకున్నా ఒక లయతో తదాత్మనం చెందుతూ, పాడుతూ, నర్తిస్తారని 'శ్రీమతి వేదాంతం శ్రీదేవి' అన్నారు. జానపద కళాకారులలో "గాయత్వం అనేది ఒక పద్ధతిగా ఉండక బహుముఖంగా కనిపిస్తుంది. ఒకడు పాడితే వయక్తికమవుతుంది. దీనికే వ్యష్టి అని పేరు. హరిదాసు, బాలసంతు దీనికి ఉదాహరణ. ఇద్దరు లేక ముగ్గురు కలిసి వాద్యంపై పాడితే లేక కథలు చెప్పితే అది యుగళమవుతుంది. శారద గాళ్లు, ఒగ్గులు, బుడిగె జంగాలు దీనికి ఉదాహరణ. ముగ్గురికంటె ఎక్కువగా ఎంత మంది గానం చేసిన దానిని బృందగానం లేక సమిష్టిగానం అని అంటారు. దీనికి ఉదాహరణగా గొరవయ్యలు, ఉరుములవాళ్లు, వీరముష్టలు, భాగవతుల వాళ్లను పేర్కొనవచ్చు". జానపద కళాకారులలో ఉన్న ప్రతి వ్యక్తికి గానంతో పాటు వాద్య వాదనంలోనూ నైపుణ్యం ఉంటుంది. జానపద నృత్యగానాల పద్ధతులను పరిశీలించినట్లైతే మనకు అనేక రకాలుగా కనిపిస్తున్నాయి. అవి

1. కథాత్మకం - కేవలం కథలు చెప్పడం.
2. కథా విరహితం - కథలు లేకుండా ఏవో పాటలు పాడుతూ నర్తించడం.
3. దీర్ఘకాలిక కథాత్మకం - రెండు మూడు నెలల వరకు కథా గానం చేయటం.
4. లఘు కథాత్మకం - చిన్న కథలనుగానం,నృత్యం చేయడం.
5. ప్రదర్శనాత్మకం - భాగవతాది కథలు ప్రదర్శించడం.
6. పట ప్రదర్శనం - కులోత్పత్తి కథలు చిత్రాలలో ప్రదర్శించి, నృత్యగానాలు చేయడం.
7. నృత్యరాహిత, నృత్యాత్మక గాయత్వం - ఆడుతూ మరియు ఆడకుండా గానం చేయడం.
8. ఆహార్య సహిత - ఆహార రహిత నృత్య గాయత్వం - వేషధారణతో లేక వేషదారణ లేకుండా నృత్యగానం చేయడం.

9. సంభాషణాత్మకం - భాగవతానికి సంబంధించిన పాటలు.

జానపద కళారూపాలంటే కేవలం పామరుల కళా రూపాలని వాటికి శాస్త్రీయత లేదని కొందరు వాదిస్తు న్నారు. కాని సంగీతానికీ, నృత్యానికి ఎలాంటి శాస్త్రీయత ఉందో, అలాంటి శాస్త్రీయత వీటికి ఉంది. జానపద కళారూపాలలో సంగీతముంది, తాళం వుంది. లయ వుంది. అభినయం వుంది. నృత్యముంది. ఆహార్యముంది. వాయిద్యముంది. లయబద్ధమైన కలయికా క్రమశిక్షణ ఉంది. జానపద కళారూపాలని ప్రదర్శించే జానపదులు సంచార జీవితం గడుపుతారు. కాబట్టి వాద్యాలు, వేష దారణ, వస్తువులు, కుటుంబాలు మొదలైన వస్తువులన్ని వాళ్ళ వెంబడే ఊరూర, సంచరిస్తాయి. జానపద కళా రూపాలను పరిశీలిస్తే మనకు అనేక కళారూపాలు కని పిస్తున్నాయి. అందులో పిచ్చుకకుంట్లు, మందెచ్చులు, అసాదివాళ్లు, సాతానులు, కొండరెడ్లు, చిందువాళ్లు, కుర వంజి, గంగిరెద్దుల వాళ్ళు, గౌడ శెట్టీలు, గొరవయ్యలు, సాధన శూరులు, భాగవతులు, కాటిపాపలు, శారద గాండ్రు, బుర్రకథ, హరికథ, కాకిపడగలవాళ్ళు, బవనీలు, తోలుబొమ్మలాట మొదలైన కళారూపాలున్నాయి.

మనకు పందలకొద్ది కనిపిన్తున్న జానవద కళారూపాలలో 'పిచ్చుకకుంట్లు' ప్రముఖంగా కనిపిస్తు న్నారు.

పిచ్చుకకుంట్లు :

పిచ్చుకకుంట్లు అనగా 'కాళ్లు లేనివాళ్లు', 'అనూరులు' అనే అర్థాలు శబ్దరత్నాకరంలో కలవు. వీరికే పిచ్చికుంటు, పిచ్చుకుంటు, పిచ్చుకకుంటు అనే పేర్లు కలవు. "పిచ్చుక కుంట్లు వాళ్లు రెడ్లు, కమ్మలు, యాదవులు, కాపులను యాచిస్తూ కథలు చెప్పి వినోదింపజేస్తారు". వీరు ఇంటింటా గోత్రాలు చెప్పుతూ యాచిస్తుంటారు. వీరు గోత్రాలనే కాక కథలు కూడా చెబుతుంటారు. వీరు చెప్పే కథల్లో శృంగార, వీర, కరుణ రసాలకు ఎక్కువగా ఉం టాయి. పాల్కుర్కి సోమనాథుడు తన రచనలలో పిచ్చుక కుంట్లు వారి గురించి వివరిస్తూ అంగవైకల్యం కల కుంటి వారనీ, అంధులని పేర్కొన్నాడు. పిచ్చుకకుంట్లు వారు వీరశైవ మతాన్ని ఆరాధించారు. వీరు శక్తి ఉపాసనా పరులు. రేణుకామహత్మ్యాన్ని, పోచమ్మ, ఎల్లమ్మ, మరిడమ్మ, మూహురమ్మ కథలను ప్రచారం చేశారు. వీరికి మూలదైవం శ్రీశైల మల్లిఖార్జునుడు. వీరి కులోత్పత్తి గురించి పరిశీలించినట్లైతే మనకు ముఖ్యంగా రెండు కథలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిది చూస్తే త్రిమూర్తుల వివాహ సందర్భంలో వారి గోత్రాలు వల్లించ టానికి ఒక వ్యక్తి కావలసివచ్చి వారు ఒక మట్టిబొమ్మను చేసి దానికి ప్రాణం పోశారు. అయితే ఆ బొమ్మకు కాలు సరిగా లేక కుంటిగా ఉండటం వల్ల వారి సంతానమంతా భిక్షమెత్తే కుంటి వాళ్ళయ్యారని వారినే పిచ్చుకకుంట్ల అని పిలిచేవారని ఒక గాధ ప్రచారంలో ఉంది. మరో వైపు ఇంకోక కథ కూడా వినిపిస్తుంది. అది ఏడుగురు గోల్ల వనితలు సంతానం కొరకు తపస్సు చేయగా, శివుడు వాళ్ళకు ఒక కుంటిబాలున్ని ఇచ్చి పెంచుకోవలసిందిగా ఆదేశించాడు. వారు ఆ బాలున్ని పెంచుతున్న సందర్భంలో వారికి శివుని వరాన ఏడుగురు ఆడపిల్లలు జన్మించారు. ఆ ఏడుగురు ఆడపిల్లలని పెంచి పెద్ద చేసి ఆ కుంటి వానికిచ్చి పెండ్లి చేయమని శివుడు చెప్పాడు. వారు ఆ విధంగానే చేశారు. శివుడు ఆ కుంటి వానికి ఒక శంఖాన్ని, గంటనూ, ఒక శూలాన్ని, ఒక ఎద్దును ఇచ్చి బిక్షటన చేసి జీవించమని చెప్పాడు. ఆ సంతతి వారే పిచ్చుకకుంట్ల వారని తెలుస్తుంది. వీరు చాలా చోట్ల ఎద్దునెక్కి, గంట ఊపుతూ, గోత్రాలు చెబుతూ బిక్షం ఎత్తి యాచించి జీవనం సాగిస్తారు.

"తెలంగాణలో పిచ్చికుంట్లు కులంలో చాలా తెగలు న్నాయి. అందులో గంట, రెడ్డి, కమ్మ, పెదకంటి, పాక నాటి, గుడాటి, బుర్రతురగ, కోడిద, చిట్టెపు ముఖ్యమైనవి. ఇందులో కత్తి, తిత్తి, పిచ్చికుంట్లు రెడ్డి కులానికి గుంటపిచ్చికుంట్లు కమ్మకులానికి, తురగ పిచ్చికుంట్లు గొల్ల కులానికి గోత్రాలు చెబుతారు. రెడ్డి కులాన్ని

ఆశ్రయించి పిచ్చికుంట్లు గోత్ర పఠనంతో పాటు కుంటి మల్లారెడ్డి కథ, పల్నాటి వీర చరిత్రను గానం చేస్తారు. కుంటి మల్లారెడ్డి కథలో రెడ్ల కుల పుట్టు పూర్వోత్తరాలు వివరిస్తారు. వీరు అలరాజు, పేరిందేవి, బాలచంద్రుని శౌర్యం, బ్రహ్మనాయుడు, కారంపూడి యుద్ధం, కన్నమ దాసు, నాయకురాలి కుతంత్రం, నలగామరాజు అనే కథలను నలభై రోజులు చెప్పుతారు. దీనినే 'పలనాటీ భారతం' అంటారు. పలనాటి కథలు చెప్పె పిచ్చుకకుంట్లు ఒక కిలో బరువుండే ఇత్తడి డాలును ఒక చేత, చెక్కపిడి గల ఐదు జానలు పొడువున్న పెద్ద కత్తిని ఇంకోక చేత పట్టుకొని, ఆ కత్తికి అందెలు వేసి వూపుతూ కథలు చెబుతారు. ఒకరు తిత్తి ఊదుతుండగా మరోకరు చిరుగంటులన్న పంబజోడు వాయిస్తూ వంతలు పాడు తారు. ప్రధాన కథకుడు మోకాళ్ల వరకు గట్టిగా దొవతికట్టి, నెత్తికి పాగా చుట్టి, తెల్లని చొక్కా ధరించి ఎడమ చేత డాలు, కుడి చేత కత్తి పట్టుకొని, గజ్జలు కట్టిన తన కాళ్లను కదిలిస్తూ కథకు అనుకూలంగా గానం చేస్తుంటాడు. వీళ్లు కథను గానం చేస్తున్నప్పుడు ప్రతి చరణం చివర లేక రెండు మూడ చరణాలకొకమారు "శ్రీమల మలిదేవ చెన్నుడో ఓ ఓ ఓ ... చెన్నయస్వామీ ఆ ఆ ఆ" అని మాచెర్ల చెన్నకేశవుని స్మరిస్తారు. కథా ప్రారంభంలో గణనాయకుని ప్రార్థన చేస్తారు. ''గణ నాయక, శివగణనాయక, పార్వతీ వరపుత్ర గణనాయక ప్రత్యక్షం కావుమయ్యా గణనాయక పూజింతుమయ్యా గణనాయక, మమ్మందరిని దయజూడుమయ్యా గణేశ ... ఆహా ఓ ఓ ఓ .." అంటూ రాగం తీస్తారు.

తరువాత మాచెర్ల చెన్నకేశవుని, అంకమ్మను స్మరిం చడం 66 మంది పలనాటి వీరులందర్ని కీర్తించి కథలు చెప్పడం ఉంటుంది.

"అంకమ్మా వీర్ల అంకమ్మో
వేడుకతో గొల్తుము వేడ్కమీర
చాలుగా మాలల్లో కానాది ఎట్లా । కానరాదు వెళ్లు।
పచ్చనిమెచ్చిన్నా పందిళ్లులోనూ । పందిళ్లు ।
పాలకెల్లి కొరినాది పద్మాల అంకమ్మ
కోర్లపాటి అంకమ్మా గూడురు అంకమ్మ వేగమే రావమ్మా
। వేగమే ।
ముప్పొద్దూ నిన్న ప్రార్థనచేసే పాటివవాళ్లమూ
మేము చేసేటి వాళ్లమూ"

అంటూ జానపద మాండలిక భాషలో జనాలుకు అర్థమైయ్యేలా కథను గానం చేస్తారు. వీళ్లకు రాగాలు సరిగా తెలియవు. అభ్యాసాన్ని బట్టి చెప్తుంటారు. ప్రతి చరణం చివర వీళ్ల రాగం విలక్షణంగా ఉంటుంది. ధిం, ధిం, ధిధిం, దిద్దిరి, అబ్బంక, బబ్బంబన, అబ్బంబక అని ధ్వని వచ్చే విధంగా ఢక్కాని వాయిస్తారు. బాల చంద్రుని యుద్ధవర్ణన, వీరుల పోరాటాలు వర్ణించేటప్పుడు అడవి దెబ్బ అనే పేరుతో ధిం, ధిం, ధిధిం, ధిధిం అనే విధంగా ఢక్కా కొడతారు. వీరు తెలంగాణలో రాములమ్మ, బాల నాగమ్మ, సదాశివరెడ్డి, పర్వతాల మల్లారెడ్డి, సూర్య చంద్రురాజులు, హరిశ్చంద్ర మొదలైన కథలను చెబు తుంటారు.

పిచ్చుక కుంట్ల వారు ఇప్పటికి గుంటూరు జిల్లా రెంటచింతల గ్రామంలో, చెరుకుపాలెం గ్రామంలో, మునిపల్లెలో, గామారిపలెంలో, ప్రకాశం జిల్లా టంగు టూరులో, వరంగల్ జిల్లా మొగిలిచర్లలో జీవనం సాగిస్తు న్నారు.

టెలివిజన్, సినిమా, ఇంటర్‌నెట్ లాంటి ఆధునిక సాంకేతిక ప్రక్రియలు రావడంతో ఈనాడు పల్లెలో జానపద కళారూపాలకు ఆదరణ తగ్గింది. ఇది దాదాపు అంత రించిపోయే దశలో ఉన్నాయి. ఆధునిక ఉద్యోగాల వల్ల కూడా ఈ జానపద కళారూపాలకు ఆదరణ తగ్గి పోయింది. వీరి ప్రదర్శనలు కేవలం పండగలకు మాత్రమే ప్రదర్శిస్తున్నారు. క్షీణ దశలో ఉన్న ఈ జానపద కళా రూపాలు సజీవంగా ముందు తరాలకు అందించాలంటే, ప్రభుత్వాలు వాటికి ప్రత్యేకమైన నిధిని ఏర్పాటు చేసి, వారికి జీవన భృతి కలిపించాలి. ప్రభుత్వ పథకాల

ప్రచారంలో జానపద కళాకారులను ఉపయోగించుకోవాలి. ప్రతి జిల్లా మండల కేంద్రంలోను జానపద కళా క్షేత్రాలని ఏర్పాటు చేయాలి. జానపద నృత్యం చేసే వారికి పరికరాలు, వారి దుస్తువులు వంటి వాటికి ప్రత్యేక రాయితి ఇచ్చి ప్రోత్సహించాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో కొన ఊపిరితో ఉన్న పిచ్చుకకుంట్ల వారిని కాపాడి, ఆ కళ పునరుద్ధరణకు పాటు పడాలి. జానపద కళాకారులకు అవార్డులు, రివార్డులు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తే, మన తెలుగు రాష్ట్రాలలో జానపద కళల పండగను మనందరం చూడవచ్చు. అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. జానపద సాంస్కృతిక నృత్య గీతాలు - సాహిత్యానుశీలనం (ఆమోదిత సిద్ధాంత గ్రంథం) - శ్రీమతి వేదాంత శ్రీదేవి, పుట 48
2. తెలంగాణ చరిత్ర - సంస్కృతి - తెలుగు అకాడమీ - పుట - 493
3. తెలుగు వారి జానపద కళారూపాలు
4. పరీక్షణం (సాహిత్య వ్యాస సంకలనం)
5. తెలుగు జానపద గేయ సాహిత్యం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద గేయ గాథలు – స్త్రీ స్థానం

– డా॥. ఎస్.గులాబ్ జాన్, ఎస్.డబ్ల్యూ. ఆర్. ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, కలికిరి, చిత్తూరు జిల్లా.

సమాజం అంటే ప్రమాణాలు, ఆచారాలు, ధర్మాలు, విధానాలు ఉన్న వ్యవస్థ. ఇది మానవ ప్రవర్తనను, స్వేచ్ఛను అదుపులో ఉంచుతుంది.నిరంతరం పరివర్తన చెందడం దీని స్వభావం. ఇటువంటి వ్యవస్థ సమాజం.

'సాముదాయికమైన ప్రయోజనాలకోసం, అభిప్రాయ సామరస్యమున్న వ్యక్తులు ఒకరి నొకరు గుర్తించి కలసి మెలసి పనిచేయడాన్ని సమాజం అంటారు'.

ప్రతి సంఘానికి ఒక సంస్కృతి ఉంటుంది. సంఘునికి సంస్కృతికి విడదీయరాని సంబంధముంటుంది. ఒక సంఘం నుంచి, మరో సంఘాన్ని వేరు పరిచేది ఆ సంఘ సంస్కృతి.

కుటుంబం సూక్ష్మపరిధిలోని సంఘం లాంటిది, ఒక కుటుంబంలోని సభ్యులంతా పరస్పరాశ్రయులై ఉంటారు. స్త్రీలు, పురుషుల సహాయం వల్ల, పురుషులు స్త్రీల సహాయం వల్ల, పరిపూర్ణత్వం పొందుతారు. కుటుంబానికి వర్తిస్తున్న సూత్రమే విశాలమైన పరిధిలో సంఘానికి కూడా వర్తిస్తుంది. సంఘంలో స్త్రీకి గల స్థానం జానపద గేయగాథల్లో వ్యక్తీకరింపబడిన విధానంను గూర్చి విశదీకరించి చెప్పటమే నాయీ పత్ర లక్ష్యం.

త్రిగుణాత్మకమైన ప్రకృతియే స్త్రీ. స్త్రీ శబ్దంలో సకార, తకార, రకారాలున్నాయి. సకారం సత్త్వగుణానికి, తకారం తమోగుణానికి, రకారం రజోగుణానికి చిహ్నాలు. సత్త్వ గుణలక్షమైన మృదుత్వం, అణకువ, సహనశీలత. తమోగుణ లక్షణాలైన సిగ్గు, భయం, మందత్వం స్త్రీలలో ఎక్కువగా ఉంటాయి. రజోగుణలక్షణాలైన ధైర్యం, సాహసం, స్వతంత్రతలు సూక్ష్మరూపంగా ఉంటాయి.

సంఘంలో స్త్రీకి మగవారికున్నంత గౌరవం, స్వేచ్ఛ, అధికారం లేవు. పురుషుని ఆశ్రయం, అదుపాజ్ఞలతో ఉన్నపుడే స్త్రీ జీవితం బంగారుబాట. స్త్రీ గడప దాటితే రక్షణ లేదు. కడగండ్ల పాలవుతుంది. మగవారి కామాంధ కారానికి బలవుతుంది, ఇందుకు వీరరాజమ్మ, ఎరుకల నాంచారి జీవితాలే ప్రత్యక్ష సాక్ష్యాలు.

ఇంటి నుంచి అత్తచేత వెళ్లగొట్టబడిన వీరరాజమ్మ దైవదుర్విపాకం వల్ల దొంగల పాలపడుతుంది. వారంతా అమెను మానభంగం చేయబోతారు. "మానభంగం పొంద లేక నా తండ్రి, నిన్ను అర్పించేను" అని కన్న కొడుకునే దొంగలకర్పించింది. వారితో పోరాడి తాను మరణిస్తుంది. (వీరరాజమ్మ కథలో)

ఎరుక చెప్పడానికి ఒంటరిగా వెళ్తున్న నాంచారి రెడ్డి కొడుకు చేత బలవంతం చేయబడుతుంది, సమయ స్ఫూర్తితో తప్పించుకొంటుంది. కాని భర్త నాంచారిని అనుమానించి చంపేస్తాడు.(ఎరుకల నాంచారి కథలో) ఇలాంటి పరిస్థితుల్లో 'ఆడదై పుట్టేకంటే అడవిలో మానై పుట్టటం మేలని' తలచి నిరాశపడి తలవంచడం కంటే ' నేనే స్త్రీనైపుట్టి ఉంటే స్త్రీ తనకు ఆటవస్తువు అనుకునే పురుషుడి భావానికి వ్యతిరేకంగా, విప్లవం లేవదీసే వాణ్ణి' అన్న గాంధీజీ వాక్యాలు స్త్రీ హృదయాంతరాలల్లోంచి అగ్నిజ్వాలలై ప్రజ్వరిల్లాలి.

స్త్రీకి శీలమే ప్రాణం. పగవాని చెరలో ఉండికాని, ఇల్లు వదలి అడవులు, పర్వతాలు తిరిగి, అష్టకష్టాలు పడి, ఇల్లు చేరిన స్త్రీ, ఎంతటి పవిత్రురాలైన కూడా సంఘం పరీక్షలకు నిలబెడుతుంది. రామాయణంలో సీతాదేవి వలె శీల నిరూపణ చేయవలసిందే లేకుంటే భర్త స్వీకరించడు. ఇందుకు బాలనాగమ్మ, సుందరి వృత్తాంతాలు నిదర్శనాలు.

బాలవర్ధిరాజు, బాలనాగమ్మను ఫకీరు చెరనుంచి విముక్తురాల్ని చేస్తాడు. కార్యవర్ధి రాజు ''మీ తల్లి బాలనాగమ్మ ఫకీరు చేతుల్లో వ్రతము చెడ్డదేమో దానిని

నేను ఏలనంటాడు". అంతట బాలుడు సల సల కాగే (కళవెళ లాడే) నూనెలో వేలి ఉంగరమేసి తల్లిని తీయ మంటాడు. బాలనాగమ్మ ఆ పరీక్షకు నిలుస్తుంది.కాని కార్యవర్ధి రాజు 'ఫకీరు చెంత ఉండి చెట్ల క్రియలు జెన్ని నేర్చినాదో, ఆకు పసరులు ఎన్ని నేర్చినాదో' అని ఆ పరీక్షను తిరస్కరిస్తాడు. అపుడు బాలనాగమ్మ భగభగ మండే గుండంలో దూకి, కట్టినకోక కాలకుండా , పెట్టిన కుంకుమ చెదరకుండా , దేహం బొబ్బలు పొక్కకుండా బయటికి వచ్చి శీల నిరూపణగావిస్తుంది. 'మీ తల్లిని నేను నమ్మితిని నాయనా' అని బాలనాగమ్మను కార్యవర్ధి రాజు పరిగ్రహిస్తాడు.(బాలనాగమ్మ కథ)

'ఎన్నో తీర్థాలు కుంకి, సకల క్షేత్రాలు మెట్టి, సుందరి తన భర్త పామును మానవునిగా మార్చుకొని తిరిగి వచ్చిన కోడలిని మామ''దేశ దేశములెల్ల తేటగా వెదకి/మనసు కొచ్చిన రాజు మగువ నీవు గోరి/ ఆ రాజుతో గూడి యిటు వచ్చితివి గాని/ నీ మాటలెల్లను నిజముగా నమ్మన్' అంటాడు. సుందరి గగనవాణిని ప్రార్థిస్తుంది. ఆకాశవాణి జరిగిన సంగతి వెల్లడించి, సుందరి నిర్దోషి అని నిరూపి స్తుంది.(ధర్మాంగద చరిత్ర - పాము పాట)

సంఘంలో స్త్రీ భార్యగా, తల్లిగా, అత్తగా, సోదరిగా, సవితిగా, ఆడపడుచుగా ఇలా రకరకాలుగా పాత్రలను నిర్వహిస్తూ ఉంటుంది. స్త్రీ జీవితంలో అత్యధిక ప్రాధాన్యం కల భాగం దాంపత్య జీవితం, భార్యగానే స్త్రీకి సంఘంలో గౌరవాదరణలున్నాయి. పవిత్రత, బాధ్యత కలిగి ఉంది.

స్త్రీ కులాంతర వివాహం చేసుకోవడాన్ని సంఘం గుర్తి స్తుంది. కులవ్యవస్థ పాదుకున్న సంఘంలో కులాంతర వివాహం చేసుకొంటే ఆ కుటుంబం నవ్వుల పాలవ్వడమే కాకుండా, వారిని కులం నుంచి వెలివేస్తారు. ఈ విషయాలను -

'అబల నువ్వెక్కడ నా జంగమెక్కడఁ నవ్వరా కనుగొన్న నరులెల్ల నిన్ను
చెలియ మన జాలారి జాతి మహా చెడ్డది! వెలివెయ్యరా మన కులమంత గూడి!
వెలివెయ్యడం కాక కులమంత కూడుకొని !
తప్పులెమ్మందురే తగకోటి ధనంబు'
(గంగా వివాహము)

గొడ్రాలికి స్త్రీలోకంలోనేకాక, సంఘంలో కూడా గౌరవాదరాలు లేవు. గొడ్రాలితనం స్త్రీకి తీరని దుఃఖాన్ని కల్గిస్తుంది. బిడ్డలు లేని స్త్రీని గొడ్రాలు అని సంఘం ఈసడించుకొంటుంది. స్త్రీ ఎంత సుందరి అయినా సుకుమారి అయినా, విద్యావతి అయినా గొడ్రాలి తనం ఆమె జీవితానికి మాయని మచ్చ. పిల్లలు లేని ఇంటిని యిరుగు పొరుగువారు 'దీపంబు లేనిల్లు ఎట్టులుండునో ఓయమ్మ చంద్రుడులేని ఆకాశమట్లు మాయమ్మ! తామరపువ్వులు లేణి చెరువట్లు మాయమ్మ! పెద్దలు లేనట్టి యిల్లెట్టు యిండ ఓయమ్మా! ఐదవతనములేని యతివ యెట్లుండూ సూరమ్మ! బిడ్డలు లేని యిల్లు అట్టులేయుండు మాయమ్మ'(వీరరాజమ్మ కథ) అని పరిహసిస్తారు.

సవతి పాత్రకు సంఘంలో మంచి స్థానంలేదు. భార్యగల పురుషునికి తన కూతురి నివ్వడానికి ఏ తల్లీ ఒప్పుకోదు. ఎన్ని సంపదలున్నా సవతి బ్రతుకు దొంగతనం వంటిదనీ, దొప్పక్రింద చేరి దోసిలొగ్గిన రీతిగా ఉంటుం దని భావిస్తారు. ఇందుకు 'ఎన్ని భాగ్యములున్న నెన్ని సౌఖ్యములున్న ! సవతి మీద బ్రతుకు జెప్పగాదు పదివేలు గలిగిన పదిలక్షలుండిన! సవతి మీదను బ్రతుకు జెప్పకాసుమ్మి ఆలున్న విభువి వద్ద నాటలు జెల్లవు! పోరుకు మూలంబు యేరాలి బతుకు దొప్పక్రిందను చేరి తోసిలొగ్గిన రీతి' (గంగావివాహము) అనే గేయకథా భాగం సాక్ష్యం.

సంఘంలో స్త్రీ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం కాని, విద్యవతి అయిన స్త్రీని విశిష్టంగా పరిగణించడంగాని, సంఘంలో ఉన్నట్లు కన్పించదు. గేయగాథల్లో ఒకటి, రెండుచోట్ల మాత్రం ఆడపిల్లలకు విద్యాభ్యాసం చేయించి నట్లు చెప్పబడింది.

'కులశీలములు కలిగి సద్బుద్ధి కలిగి మాయమ్మ
చదువు సంధ్యలు కలిగి చక్కనైనట్టి
కన్యాను ఎంచుకొని నే పెండ్లి చేసుకొందును'
(వీరరాజమ్మకథ)

అనే గేయ కథాభాగాన్ని బట్టి విద్యావతి అయిన కన్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పవచ్చు. విద్యావసరాన్ని గుర్తిస్తున్నట్లు చెప్పవచ్చు.

జానపద సంఘంలో స్త్రీలు స్వేచ్ఛావాతావరణంలో పెరగలేదు. స్వేచ్ఛను అనుభవించలేదు. బాల్యంలో తల్లిదండ్రులచేత, యౌవనంలో భర్త చేత, వృద్ధాప్యంలో కొడుకు చేత పోషింపబడినారు. బాల్య వివాహాలు అమలులో ఉండేవి కాబట్టి, స్త్రీ విద్యకు అంత ప్రాముఖ్య మివ్వలేదు. మధ్య తరగతి స్త్రీలు యింటి పనులలో ఎక్కువ కాలాన్ని గడిపేవారు. ఉన్నత కుటుంబాల స్త్రీలు రాణివాసంలో జీవించేవారు. అందువల్ల వారికి విద్యా భ్యాసం చేసే అవకాశంగాని, అవసరంగాని ఉండేవి కాదు.

ఈ విధంగా సంఘంలో స్త్రీని గౌరవించడం, అగౌర వించడ వివిధ సందర్భాలపై ఆధారపడి ఉంది. భార్య, తల్లి, సంతానవతి, ముత్తైదువ అయిన స్త్రీలు సంఘంలో గౌరవ పాత్రులౌతున్నారు. గొడ్రాలు, అత్త, సవతి తల్లి, సవతి పాత్ర వహిస్తున్న స్త్రీలకు గౌరవాదరణలు తక్కువగా ఉన్నాయి.

ఆధారాలు :

1. జానపదగేయాలుసాంఘికచరిత్రఃడా.బి.రామరాజు
2. ఈదెమ్మకథఃఆంధ్రప్రదేశ్సాహిత్యఅకాడమీ
3. ఎరుకలనాంచారికథఃకొండాశంకరయ్య
4. గంగావివాహముఃసి.వి.కృష్ణాబుక్డిపో,మద్రాసు
5. బాలనాగమ్మ కథఃసి,వి. కృష్ణాబుక్ డిపో, మద్రాసు
6. వీరరాజమ్మకథఃసత్యనారాయణ పబ్లిషింగ హౌస్, రాజమండ్రి

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గ్రామదేవతల జాతరలు – పానగల్లు ఈదమ్మ జాతర

– డా॥. ఏ. వెంకటప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.

ఆదిమ మానవుడు గుట్టల దగ్గరో, అటవీ ప్రాంతాల లోని నీటి వసతి వుండే దగ్గరో నదీ జలాలనో గుర్తుగా చేసుకుని ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాడు. మానవుని నాగరికతా క్రమంలో అడవులను నరికి వ్యవసాయం చేసుకుంటూ గ్రామాల నిర్మాణం చేసుకున్నాడు. అలా గ్రామాలతో పాటు గ్రామదేవతలు కూడా ఆవిర్భవించారు. కాని యిది రామాయణ కాలం నాటికే మనదేశంలో కని పిస్తుంది. హనుమంతుడు లంకకు వెళ్ళినపుడు, అతనిని పురప్రవేశం చేయకుండా "లంకిణి" అనే రాక్షసి అడ్డు కుంటుంది. ఈమెయే లంకాధిదేవతగా కనిపిస్తున్న మొదటి గ్రామదేవతగా చెప్పవచ్చు. గ్రామదేవతలపై విశ్వాసం భారతీయులకే గాక, పాశ్చాత్యులు కూడ విశ్వసిస్తున్నారు. "శ్రీరాముని కుమారుడైన కుశుడు అయోధ్యను వదిలి కుశావర్తం కట్టుకున్నపుడు అయోధ్యా దేవి అతని కలలో కనపడి తనగోడును చెప్పుకున్నది. ఇదే విధంగా మధురాదేవి కంపరాయలకు స్వప్నంలో కనిపించి తనస్థితి చెప్పుకున్నట్లు మధురావిజయంలో వర్ణింపబడింది." కాబట్టి ప్రాచీనకాలం నుండే గ్రామదేవత లున్నారని చెప్పవచ్చు.

గ్రామాలను రక్షించే దేవతలే గ్రామదేవతలు. వీరు గ్రామపొలిమేరలో గాని, గ్రామరక్షణ కోసం వెలసిన దేవతలు. గ్రామదేవతలు గ్రామం ఏర్పడినప్పటి నుండి, ఆ తర్వాతి కాలాలలో సందర్భానుసారంగా ఏర్పడి వుండవచ్చు. తొంబయి శాతానికి పైగా గ్రామదేవతలలో స్త్రీ దేవతలే కనిపిస్తారు. ఈ దేవతలు రోగాలబారినుండి, మహమ్మారిల నుండి కాపాడుతారని గ్రామస్తుల విశ్వాసం. గ్రామంలో ఏ చిన్న ఆపద కలిగినా, పశువులు మరణిం చినా రోగాలబారిన పడినా గ్రామదేవతలకు కోపం వచ్చిం దని జాతరలు చేస్తారు. అలా చేయటం వల్ల గ్రామదేవత తమకుటుంబాన్ని, పశుసంపదను కాపాడుతుందని, సుఖసంతోషాలతో ఉంచుతుందని గ్రామస్తుల ప్రగాఢ నమ్మకం. ఈ విధంగా ప్రారంభమైన దేవతల కొలువు సంవత్సరానికో, అయిదు సంవత్సరాలకోసారో పెద్ద మొత్తంలో జరిగే జాతరగా పరిణమించింది. నేడు తెలంగాణలోని వరంగల్లు జిల్లాలోని మేడారంలో రెండు సంవత్సరాలకోసారి జరిగే సమ్మక్క, సారక్క జాతరలను ఉదాహరణగా చెప్పవచ్చు. గ్రామాలలో గడ్డివాములు, గుడిసెలు అగ్ని ప్రమాదానికి గురయినపుడు ఈదమ్మ, ఎల్లమ్మలను, పశువుల ఆరోగ్యం కోసం దొడ్లమైసమ్మను, మైసమ్మలను కొలుస్తారు. పిల్లలులేని స్త్రీలు తమకు సంతానం కలగాలని, పిల్లలు కలవారు తమ పిల్లలు చల్లగా వుండాలని ఇడుపు దేవరను నిలుపుకొని పూజించడం జరుగుతుంది.

ఈ గ్రామదేవతలు ఎటువంటి ఆడంబరాలు లేకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు శ్రమించే గ్రామీణులవలే చాలా సాధారణ స్థితిలో ఏ చెట్టుకిందనో, పుట్ట ప్రక్కనో, గ్రామ పొలిమేరలోనో, ఊరిమధ్యలోనో, చెరువు కట్టపైనో, కోటక్రింద గాని, గుట్టల్లో, లోయల్లోనో శిలారూపంలో కనిపిస్తారు. ఈ గ్రామదేవతలు ఎక్కువగా వేప, మర్రి, నార్లింగి, రావి, ఊడుగ, చింత, తుమ్మ చెట్ల క్రిందనే ఉంటాయి. గ్రామదేవతల గుడులు దాదాపుగా చిన్నచిన్న గుడులే. చుట్టూ 3 రాతి బండలు, పైన ఒకరాతి బండతో ఈ గ్రామదేవతల గుడులు అతి సామాన్యంగా ఉంటాయి. వీటిలో కొయ్యబొమ్మలు గాని, మట్టి పాత్రలు గాని, చిత్రమైన ఆకారాలలో మట్టితో తయారుచేసిన వాటిని గ్రామదేవతలుగా భావించి కొలుస్తారు. ఈ గుడులన్నీ

"చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు సర్వంబులును తేళ్ళు
పలనాటి సీమ పల్లెటూళ్ళు"

అన్న శ్రీనాథుని చాటువును తెలుపుతున్నాయి.

శ్రీనాథుని కాలంలో కూడ పలనాటి సీమలో ఈ గ్రామ దేవతల విశిష్ఠత ఎంత గొప్పగా ఉందో తెలుస్తున్నది. ఆనాడు కూడ ఇంటింటికొక దేవత ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ గ్రామదేవతల గుడులలో, కొంత ఆదాయం లభించే గుడులు 5 అడుగుల నుండి 6 అడుగుల ఎత్తులో మధ్యస్థంగా ఉంటాయి.

పానుగల్లు ఈదమ్మ జాతర :

తెలంగాణలోని ఉమ్మడి మహబూబునగరు జిల్లా మరియు నేటి వనపర్తి జిల్లాలో గల పానుగల్లు మండల శివారులో గల పొలాల్లో "పానుగంటి ఈదమ్మ" వెలసింది. ఈ ప్రాంతంలో వెలసిన ఈదమ్మలలో అందరికంటే పెద్ద దని చెప్పవచ్చు. 300 సంవత్సరాల క్రింద 12 సంవత్సరాల అమ్మాయి పానుగల్లు రాగా, అక్కడి గడ్డి వాములు, కొన్ని ఇళ్ళు తగలబడి పోయాయి. ప్రజలు భయపడి జాన పదుల అలవాటు ప్రకారం గద్దె పెట్టి అడిగి చూడగా, గద్దెపై దేవత " నేను తూర్పుదిశ నుండి వచ్చాను. నాపేరు ఈదమ్మ. నన్ను పవిత్రస్థలంలో ప్రతిష్ఠ చేయండి" అని చెప్పటంతో పాటు శివసత్తులు సిగం ఊగి వారు కూడ ఇదే విషయాన్ని చెప్పారు.

శుభముహూర్తాన్ని చూసి మట్టితో గుడిని నిర్మించి అందులో ఈదమ్మ దేవతను నిలబెట్టారు. కొన్ని రోజులు గడిచాక ఒకనాడు ఒక వ్యక్తికి పూనకం వచ్చి ఈదమ్మ దేవతకు పూజార్లుగా కుమ్మరి వారు కావాలని కోరటంతో గునగంటి వంశానికి చెందిన వారిని నియమించారు. పూజాదికాలకోసం ఈ దేవతకు 5 ఎకరాల మాన్యాన్ని కూడ ఏర్పాటు చేశారు. ఈదమ్మ దేవత గుడిని 1995 ప్రాంతంలో మరమ్మత్తులు చేశారు. నేటి ఈదమ్మ గుడిలో ఈదమ్మ తో పాటు ఈదమ్మడు, ఎల్లమ్మ విగ్రహాలుకూడ ఉన్నాయి. 'ఈదమ్మడు' ఈదమ్మ తమ్ముడని అంటారు. ఇప్పటి ఈదమ్మ ప్రతిమను చింతబిచ్చల జిగురు, మట్టి, ఆవుపేడ, కాసుల మిశ్రమంతో తయారుచేసి ఆ ప్రతిమ లకు రంగులు వేశారని పూజార్లు తెలిపారు.

ఈదమ్మ జాతర ప్రతి సంవత్సరం జనవరినెలలో చివరి మంగళవారంనాడు ప్రారంభమయి 3-4 మంగళవారాలు జరుగుతుంది. మొదటి మంగళవారంనాడు సిడె ఉత్సవం జరుగుతుంది. ఆనాడు పూజారి స్నానం చేసి కొత్త దుస్తులు ధరించటం జరుగుతుంది. ఇక సాయంత్రం పూజారిని స్త్రీ రూపంలో అలంకరించి పూలు కడతారు. బవనీలు వచ్చి పూజారికి మంత్రాలు చెబుతారు. శరీరమంతా బండారుపూసి వీపుకు ఇనుపకొండ్లు గుచ్చి బండి మణిగెపై నిలబెట్టి మూడు నుండి అయిదు సార్లు గుడిచుట్టూ త్రిప్పటం జరుగుతుంది. 15 నుండి 20 అడుగుల పొడవుండే సిడె కట్టెకు పొట్టేలును కడతారు. సిడె బండిపై పూజారి నిలబడతాడు. ఈదమ్మ గుడి చుట్టూ మూడు నుండి అయిదు సార్లు సిడె బండిని తిప్పి అనంతరం పొట్టేలును బలి ఇచ్చి వడ్లవారికి దానం చేస్తారు. ఆ తర్వాత ఈదమ్మ దేవత అనుగ్రహం కోసం గొర్రెలు, మేకలు, కోళ్ళు, పొటేళ్ళను భక్తులు అమ్మవారికి బలి ఇస్తారు.

ఈ జాతరలో శివసత్తులు సిగె ఊగుతారు. ఈదమ్మ దర్శనానికి, ఈదమ్మ జాతరను తిలకించటం కోసం చాలామంది భక్తులు వస్తారు. మరునాడు బుధవారంనాడు పానుగల్లు గ్రామప్రజలు ఊరబోనాలు చేస్తారు. అమ్మ వారికి ఎంతో ఇష్టమైన కల్లును బోనాలమీద చిలుకరించి నైవేద్యాన్ని పెడతారు. ఊరి ప్రజలు తమ ఎద్దులబండ్లను అలంకరించి గుడిచుట్టూ తిప్పుతారు. ఈ జాతరకు ప్రజలంతా తమబంధు మిత్రాదులనందరిని పిలిపించు కుని ఆనందంగా వేడుకలను జరుపుకుంటారు. నేటి ఆధునికయుగంలో గ్రామీణ ప్రాంతాలలో ఈ గ్రామ దేవతల పూజలు, జాతరలు ఈనాటికి కూడ కొనసాగు తూనే వున్నాయి.

ఆధార గ్రంధాలు :

1. మహబూబునగరు జిల్లా గ్రామదేవతలు - డా॥ యం.ఇందిర.
2. చాటు పద్యాలు - శ్రీనాథుడు. 3. పానుగల్లు గ్రామస్థుల నుండి సమాచార సేకరణ.

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మన సంస్కృతిని ప్రతిబింబింప చేసే జీవకళలు

జానపద కళారూపాలు

– డా॥. చుక్కాయశోద, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖాధిపతి, శాతవాహన కళాశాల, విజయవాడ.

"జనపదం" అంటే జనులు నివశించే (పల్లెవాసులు) గ్రామం అని, 'కళ' అంటే బుద్ధి సూక్ష్మాలను ఉపయోగించి చేసేదని చెప్పవచ్చు. భావనాశక్తిని రేకెత్తించి మనసులో ఏర్పడిన దృశ్యానికి బాహ్యరూపం కల్పించడమే జానపద కళ.

జానపదకళను రేఖారూపంలోనూ, వర్ణరూపంలోనూ, ధ్వని, హావ, భావ, లయాత్మక, చలన రూపంలోనూ అభివ్యక్తం చేయవచ్చు. మానవునికి ఉపయోగాన్ని చేకూర్చడంతోపాటు ఒక విధమైన ఉల్లాసాన్ని, తృప్తిని కలిగించేది జానపదకళ.

ఆంధ్రప్రదేశ్ జానపదకళలకు పెట్టింది పేరు. ఈ కళలు మన సంస్కృతిలో భాగం. మన సంస్క్ర తిని ప్రతిబింబింప జేసే జీవకళలు మన జానపద కళారూపాలు.

ఆదిమానవుని కాలం నుండి జానపదకళల ఆవి ర్భావం కొనసాగుతుంది. సంప్రదాయ బద్ధంగా తరతరా లుగా మనకు సంక్రమిస్తోన్న సౌందర్యనిధులు మన జానపద కళలు. అక్షరజ్ఞానం లేని ఒక జానపదుడు తను చేస్తోన్న కష్టం మరవడానికి తీసిన కూనిరాగం జానపద కళగా పేరొందింది. జానపదకళలకు వేదిక ప్రకృతి. మనస్సుకుగాని, బుద్ధికిగాని ఆనందాన్నిచ్చే దృశ్యంలోని ఒక భాగంవల్ల కళాస్వరూపం ఆవిర్భవిస్తుంది. ఆ కళ మనోసౌందర్యరూపాన్ని ప్రసాదిస్తుంది. జానపద నృత్యా లలో వ్యక్తి కన్నా సమిష్టికే ప్రాధాన్యం కనిపిస్తుంది.

కొన్ని జానపద నృత్య కళారూపాలు :

తోలుబొమ్మలాట :

అతిప్రాచీనమైన జానపద కళా రూపమిది. మానవుడు ఎరిగిన మొట్టమొదటి చిత్ర, సాహిత్య, నృత్య, సంగీతకళ తోలుబొమ్మలాట. ఈ రూపకం సాయంకాలం ఆరంభమై రాత్రి రెండు జాములకు ముగుస్తుంది. వీటిని ఊరి శివార్లలో ఆరుబయట ప్రదర్శిస్తారు. వీటిలోని బొమ్మలను చర్మంతో చేస్తారు. తోలుబొమ్మలలో ఏ అవయవానికి ఆ అవయవం తేలికగా కదలటానికి తెల్లటి దారాన్ని వీటికి జతచేస్తారు. ఆయా పాటలకు అనుగుణంగా పద్యాలు, పదాలు, దరువులు, సంభాషణలు, అభినయాలు బొమ్మలాటలో ఉంటాయి. రామాయణ, మహాభారతాది పురాణ కథలు ఇందులోని ఇతివృత్తాలు. జనప్రియ కథలను కూడా ప్రదర్శిస్తుంటారు.

వీధి భాగవతం :

గీతం, నృత్యం, సంగీతాల మేలు కలయిక వీధి భాగ వతం. లౌకిక ఇతివృత్తాలు ఇందులో చోటుచేసు కుంటాయి. దీనిలో 12 నుండి 15 పాత్రలుండి స్త్రీ పాత్రలను కూడా పురుషులే ధరించటం ఈ నృత్యంలోని విశేషం. సాధారణంగా రాత్రి సమయాల్లో ప్రదర్శించే ఈ కళ ఒక్కోసారి రెండు మూడు రాత్రులు ప్రదర్శించటం గమనించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా తీరప్రాంతాలలో ఈ జానపద రూపకం నేటికీ సజీవంగా ఉంది.

ఒగ్గు కథ :

జానపద నృత్య రూపకాల్లో ప్రముఖంగా పేర్కొనబడిన ఈ కథ శివరాత్రినాడు ప్రజారంజకంగా సాగుతుంది. శివుడి చేతిలో ఉండే డమరుకాన్ని 'ఒగ్గు' అన్నారు. శివుని అంశం వల్ల జన్మించిన శివభక్తులు మల్లన్న - బీరప్పలు ఒగ్గుకథ రూపకాన్ని ఆరంభించారనేది ఐతిహ్యం. కురమ కులానికి చెందినవారు ఈ కథను చెబుతుంటారు.

ఈ కథలో నలుగురైదుగురు కథకులుంటారు. ఇద్దరు తాళం, డోలు వాయిస్తూ రాగం పాడుతారు. పురుష వేషధారిణి గొల్లగోచి పెడతారు. స్త్రీ పాత్రధారి చేతిలో రుమాలు వుంటుంది. వీరు వెంట్రుకలను జారవిడుస్తారు. మల్లన్న కులదేవతగా ఉన్నవారు చావులు జరిగి శ్రద్ధకర్మలపుడు ముఖ్యంగా ఈ కథ చెప్పించుకుంటారు.

బుర్రకథ :

గుంటూరు జిల్లా పొన్నెకల్లులో పుట్టిన పద్మశ్రీ షేక్ నాజర్ బుర్రకథా పితామహుడుగా పేరుపొంది, బుర్ర కథకు అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగించారు. 1925లో "కష్టజీవి" అనే బుర్రకథను రచించడం, నాజర్ గానం చేయడంతో ఈ కథ ఆంధ్రప్రదేశ్ అంతటా పాకింది.

తంబుర్రలోని 'బుర్ర' కథగా మారి ఆంధ్రజానపద నృత్యరూపకంగా పేరుగాంచిన బుర్రకథలో మధ్య మధ్యన వచనం ఉండి 'చంపూ' శైలిలో సాగుతుంది. వంతల సంభాషణల వల్ల ఒక నాటకంగా కూడా సాగుతుంది. బుర్రకథలు ముద్రితాలు కావు. మౌఖిక సంప్రదాయంలో ఉన్న ఈ కథలో 'తాన - తందాన - సై - సై' అనేవి తరచుగా ప్రయోగించే పదాలు.

పల్నాటి యుద్ధం - బొబ్బిలి యుద్ధం, వీర బుర్ర కథలకు తార్కాణాలు. ప్రభుత్వ పథకాలను ప్రజలలోనికి తీసికొని వెళ్ళటానికి ఈ కథలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

జంగం కథలు :

వామన విజయం, దేశింగురాలు కథవంటివి జంగం కథలు. శైవసంబంధ కథలను చెప్పటమే జంగం. ఈ కథలు చెప్పేవారిని బుడిగి జంగాలంటారు. ఈ కథలు తెలంగాణా ప్రాంతంలో బాగా ప్రచారంలో ఉన్నాయి.

తప్పెటగుళ్ళు :

యాదవ కులానికి చెందిన పురుషులు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఇది వంశపారంపర్యపు కళ. వలయాకారంగా తిరుగుతూ తప్పెటలను గుండెలకు ఆనించి రెండు చేతులతో లయాన్వితంగా వాయిస్తారు. గురువుల ద్వారా లయబద్ధపు నృత్యం చేస్తూ రాత్రి సమయాల్లో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలలో ఈ జానపద నృత్యం ప్రచారంలో ఉంది.

కోలాటం :

గీతం - సంగీతం - నృత్యం ఈ మూడింటి మేలు కలయికగా పేరుగాంచిన కోలాటం ప్రముఖ శైవకవి పాల్కురికి సోమనాధునిచే కోలాటగడియగా పేరు గాంచింది. పన్నెండుమంది కళాకారులతో సాగే ఈ నృత్యం జట్టునాయకుడి ఆజ్ఞ ప్రకారం జరుగుతుంది.

కాళ్ళకు గజ్జెలు, ఎగగట్టిన పంచె, చొక్కా, నడుముకు గుండ్రంగా చుట్టిన వస్త్రం కోలాటం చేసేవారి వేషం. "శివశివమూర్తివి గణనాధా - నీవు శివునీ కుమారుడవు గణనాధా" అనే చరణాలతో ఆరంభమై 'తయ్యకు తకధిమితా' అంటూ నాయకుడు కోలాటాన్ని సాగిస్తాడు.

కరగ నృత్యం :

ఈ నృత్యం ప్రధానంగా శక్తి ఆరాధనకు చెందింది. ద్రౌపది పెండ్లి చేసుకొనే సమయంలో ఆనందంతో చేతిలో ఉన్న కలశాన్ని తలపై ఉంచుకోవడం వల్ల అది కరగ అయిందని అంటారు.

రాయలసీమలో విశిష్టంగా ప్రాచుర్యం పొందిన ఈ నృత్యాన్ని ఉభయగోదావరి జిల్లాల్లో గరగనృత్యం అంటారు. దేవీ నవరాత్రులలో, గ్రామదేవతల జాతర్లలో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఒక కుండ చుట్టూ పూలు చుట్టి, తలమీద పెట్టుకొని పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఇంటింటికి తిరగడం ఈ నృత్యంలోని విశేషం. మన రాష్ట్రంలోనే కాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో కూడా ఈ నృత్యం ప్రాచుర్యంలో ఉంది.

కురవంజి :

ఈ నృత్యాన్ని కురబ జాతివారు చేస్తారు. అనంత పురంలో వీరిని గోరగయ్యలంటారు. బీరప్ప వీరి

ఇలవేల్పు. ఉగాది దినాలలో బీరప్ప విగ్రహాన్ని ఎత్తుకొని పిల్లనగ్రోవులను ఊదుతూ నగారాలు, డోళ్ళు వాయిస్తూ, పాటలు పాడుతూ కుండలాకార నృత్యాలు చేస్తారు.

పగటి వేషాలు :

సామాజిక స్పృహ ప్రధానంగా కనపడే నృత్యమిది. పులివేషం, దొర, దొరసాని వేషాలు, బ్రాహ్మణ వితంతువు మొదలగునవి పగటివేషాలు. ఈ వేషానికి తగిన భాషోచ్చారణ, నడక తీరు, వారి హావభావాలు చాలా ఆసక్తిదాయకం. ప్రదర్శన ఇస్తూ పరిహసిస్తూ, కడుపుబ్బ నవ్విస్తూ, భిక్షమెత్తి తమ కడుపునింపుకుంటారు. వీధి గుమ్మమే వీరి రంగస్థలం.

గొల్లసుద్దులు :

కాటమరాజు కథ, కృష్ణలీలలకు సంబంధించినవే గొల్ల సుద్దులు. వీరు చెప్పే కథలు పెద్ద పెద్ద వస్త్రాలపై రాసి ఉంటాయి. వీరు చిత్ర ప్రదర్శన చేస్తూ కథలు చెబుతారు. వీటిని పటాలని, కాకి పడగలని అంటారు. కొమ్ములు, శంఖాలు వీరి ప్రధాన వాయిద్యాలు.

జానపద కళలు - సామాజిక ప్రయోజనం :

గాలి, వెలుతురు, ఆహారం మానవుడు భౌతికంగా జీవించటానికి ఎంత అవసరమో, సంగీతం, సాహిత్యం, కళ అనేవి మానసికంగా ఉల్లాసంగా ఉండటానికి అంతే అవసరం. మనసుకు ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు సామాజిక ప్రయోజనమే జానపద కళల్లో ఇమిడియున్న సిద్ధాంతం.

1. ప్రకృతి ప్రేరణకు లోనై ఆదివాసులు తమకు ఆనందానుభూతి కలిగినప్పుడల్లా ఎగిరి గంతులు వేసేవారు. నృత్య కళ ద్వారా ఆదిమానవుడు జంతువులను సైతం ఎదిరించగలిగేవాడు.
2. జ్ఞానపదులు ప్రతిరోజూ చేసే పనిపాటల్లో నుంచే జానపద నృత్యాలకు భావప్రేరణ ఉంటుంది. ఈ కళలు ప్రజలను విపరీతంగా ఆకర్షించాయి.
3. జానపద నృత్యాలలో వ్యక్తికన్నా సమిష్టి నృత్యాలకే ప్రాధాన్యం ఉంటుంది. తామంతా ఒక్కటే అన్న భావన వారిలో అంతర్లీనంగా కలుగుతుంది.
4. జానపద కళల వల్ల గ్రామాలలో సందడి వాతావరణం కనిపించి ఒక సామాజిక అనుబంధం, ఆప్యాయతలు, ప్రేమలు పెరుగుతాయి.
5. జానపద కళల ద్వారా సమస్యలను ప్రజల ముంగిటకు తేలికగా తీసికొని వెళ్ళి వాటికి పరిష్కార మార్గాలు కూడా వివరించవచ్చు. (ఉదా : ఎయిడ్స్, అక్షరాశ్యత, కుటుంబ నియంత్రణ మొదలగునవి)

ఉపసంహారం :

సంస్కృతి, కళలు పరస్పర ప్రయోజకాలు. వీటిని ప్రజలు, ప్రభుత్వం కాపాడుకోవాలి. ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో గ్రామాలే మారిపోతున్న తరుణంలో నేడు జానపద కళలు క్షీణదశకు చేరుకున్నాయి.

తమ పూర్వీకుల ద్వారానో, వారసత్వం వల్లనో ఈ రూపాలను కొనసాగిస్తున్నవారు కొద్దిమందే ఉన్నా, ఆధునిక పాశ్చాత్య కళల ప్రభావానికి లోనై చాలా మంది ఆకలి బాధలకు గురౌతున్నారు.

ఒక జాతిగాని, సమాజంగాని సంపూర్ణత సాధించాలంటే అది తన కళావారసత్వాన్ని తమ తదనంతర తరాలకు అందించాలి. ఈ విషయంలో మన తెలుగు రాష్ట్రాలలో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు చేస్తున్న కృషి అభినందనీయం.

ఆధార గ్రంథాలు :

1) ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీయస్. సుందరం
2) ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర - యస్వీ. జోగారావు

❖

నిర్మల్ జిల్లా గ్రామ దేవతలు – జాతరలు

– ఉల్లెంగ ముత్యం, తెలుగు ఉపాన్యాసకులు, ఆర్.జి.యు.కె.టి బాసర.

చాల ఏండ్ల కొట్లాటల ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం బంగారు భవిష్యత్తు వైపు పరిగెడుతున్న యాల్ల ఇది. అహింసను ఆయుధంగా మలుసుకున్న మన మహాత్మగాంధీ ''గ్రామాలే ఈ దేశానికి నేటి గ్రామలను తయారుజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాలలో పేద, బీద, ముసలి, ముక్కి, పీడిత తాడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల కష్ట సుఖాలలో వారికి అండగా నిలిచి వారి బతుకులలో బంగారాన్ని పండించడానికి తోడ్పడేవి గ్రామ దేవతలు-గ్రామీణ జాతరలు, ఆ గ్రామ ప్రజల నమ్మకాల నుండి పుట్టి, వాళ్ళను కాపాడుతున్న ఆ గ్రామ దేవతలు వాటికి చెందిన జాతరలను గురించి పరిశీలిండమే ఈ చిన్న ప్రయత్నం.

కష్ట జీవులైన గ్రామ ప్రజలు కండలను కరిగించి, గుండెలను రాయి చేసుకొని కలలను పండించుకోవాడానికి ప్రయత్నం చేస్తుంటారు. ఆ యాల్లలో సేద దీరే వేళ వారి ఎదలో శక్తి ఉందని గ్రహహించి శక్తి యుక్తులను ధారవోస్తే వారికి ముక్తినివ్వడానికి 'శక్తి' గా పుట్టినవే ఈ గ్రామ దేవతలు ఆ గ్రామ దేవతలకు బలాన్నిచ్చి ఉత్సాహాన్నిచ్చేవే గ్రామ జాతరలు.

పరుశరాముడు తన తండ్రి మాట విని తల్లియైన రేణుకను అనేక కష్టాలు పెడుతుంటాడు. అతడి నుండి తన ప్రాణాల్ని కాపాడుకోవడానికి ఇతరుల ఇండ్లల్లకు వోయి కన్నీరు వెడుతుంది రేణుకమ్మ, కాని ఎవరు కూడా అమెను కాపాడడానికి తమ ఇంట్లో దాచడానికి ముందుకు రారు. చివరకు ఈ గ్రామం చివరలో ఉన్న మాదిగ పల్లకువోయి నన్ను కపాడండమ్మ అని అడుగుతుంది.

వారు ఇంట్లో ఉంచుకొనక, వారి ఇంటి వెనుకున్న 'లంద' లలో దాక్కోమ్మని చెప్పారు. అలా మాదిగ లందల దాక్కొని యోగము చేసి ఆ పల్లె పుల్లములో 'ఎల్లమ్మ తల్లి''గా ఆ ప్రజలను దీవించింది. పల్లె సీమలు పచ్చ గుంటు, ఊరివాడలో సిరులు నిండాలంటే పంటలు బాగా పండాలి అందుకోసం నీళ్ళు కావాలి పారుతున్న ఏరులకు నదులకు అడ్డుకట్టకట్టి నీటిని నిలిపి ఉంచే వేళ ఆ కట్టడాలకు కాపుగా ఉండి, బ్రతకు చెరువు కోసం ప్రయత్నం చేస్తున్న ఈ మనుషుల నమ్మకాలలో నుండి 'మైసమ్మ తల్లి'గా పురుడు వోసున్నది.

గ్రామములో యాదాదికోసారి వైభవంగా జరిగేది ఊర పండుగ, రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పండగలో గ్రామంలోని దేవతలకు బలి ఇచ్చి ఆ గ్రామానికి వచ్చిన అరిష్టాన్ని తొలగించమని కోరుకుంటాడు. ఈ పండుగలో అన్ని కులాల వారికి సమాన భాద్యత ఉంటుంది. సమాన గౌరవం ఉంటుంది. పతను తయారు చేసే వారు ఒక కులం, అభరణాలు ఇచ్చే వారు ఒక కులం. ఆ అభరణాలను దేవతకు బంతకరించేవారు ఇంకోక కులం, దేవత ఊరేగింపుకు కాపలా ఉండేవారు మరొక కులం, ఊరేగింపు ముందు డప్పులు వాయించేవారు ఒక కులం ఇలా సాల, సాకలి, కాపు కమ్మరి, కుమ్మరి, మాల, మాదిగ, వడ్రంగి, రెడ్డి కాపు , ఉన్నోడు, లేనోడు అనే తేడాలు లేకుండా వారి భాద్యతను సమానంగా నిర్వహిస్తారు. ఏ ఒక్క కులం ఎక్కవగా పని చేయాక పోయినా పండగా సరిగా జరగనట్టే. అంటే అన్ని కులాలకి సమాన భాద్యత ఇలా కులాలన్నీ మరిచిపోయి కలిసి జీవించడమే జాతి లక్ష్యము. మన పూర్వికులు చాల ఏండ్లుగా ఈ పద్ధతిని జాతిలో నిర్మాణం తెలిపారు. అదే పద్ధతిని ఈ సమాజం నేటికి అనుసరిస్తున్నది.

ఈ పండుగలు జాతరలు ద్వారా మన రాజ్యాంగములోని అంతిమ లక్ష్యాలైనా సోదర భావం, సమానత్వం

అనేవి సాధించబడుతాయి. ఈ గ్రామీణులు గ్రామ దేవతలను పూజిస్తూ నమ్మకంగా జీవించిన కారణంగానే గ్రామాలు ఈ దేశానికి పట్టు కొమ్మలుగా భావించబడు తున్నాయి.

నిర్మల్ జిల్లాలో 19 మండలాలు, 2 నగారాలలో దాదాపు వెయ్యి గ్రామలలో సహజంగా ఉండే గ్రామ దేవతలు కొన్ని అయితే, కొన్ని గ్రామాలు కలిసి పూజించి జాతరలు చేసేవి కొన్ని ఉన్నాయి. గ్రామీణ ప్రజల జానపద జన జీవనంలో ప్రజల నమ్మకాల నుండి పుట్టిన ఈ గ్రామ దేవతల పేర్లు, రూపాలు వేరు వేరు అయినప్పటికి అన్ని దేవతలు ఒక్కటే అనే సత్యాన్ని గ్రహించాలి. ఆకాశం నుండి పడ్డ ప్రతీ నీటి బొట్టు, చెరువు పంటలు, నదుల ద్వారా చివరికి సముద్రాన్ని ఎలా చేరుతుందో, మనం ఏ దేవతను మ్రొక్కినా చివరికి ఆ పరమేశ్వరునికే చేరుతాయనడం లో సందేహం లేదు. ప్రజలు ఆ జీవిత సత్యాన్ని తెలుసుకొని జీవించాలి. ఇలాంటి అనేక గ్రామ దేవతల జాతరల వివరాలను వెలికితీయడమే ఈ ప్రయత్నం.

తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి చెందిన సరస్వతి దేవాలయం ఉన్న నిర్మల్ జిల్లాలో ప్రముఖమైన "కదిలి-పాపహరేశ్వర" ఆలయంతో పాటు దాదాపు వెయ్యి గ్రామలలో గ్రామ దేవతలు ప్రజల కష్ట సుఖాలలో అండగా ఉండి కాపాడుతున్నాయి. ఈ ప్రజలు కష్టమొచ్చిన నష్టమొచ్చిన రోగమొచ్చినా రొక్కమొచ్చినా డాక్టరు దగ్గరికి వెళ్ళే పరిస్థితి వచ్చినా నా పోకంటే ముందు ఈ బాధ మనకు వచ్చిందంటే మన దేవతలకు ఏదైనా మొక్కు చేల్లించలేదేమో అందుకే ఇలా అయిందేమో అనే ఆలోచన వస్తుందంటే గ్రామ ప్రజల జీవితాలలో గ్రామ దేవతలు ఎంత ప్రభావం చూపుతున్నాయో అర్థం చేసుకోవచ్చు పోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, ఊరడవ్వ మహాలక్ష్మి, చిలుకలవ్వ, గజ్జెలవ్వ, ముత్యాలమ్మ, మల్లన్న, బీరప్ప పోతరాజులు తాతాయి, ఇలాంటి ఎన్నో పేర్లు గల గ్రామ దేవతలు ఉంటాయి. జనాలకు రోగలు వచ్చినపుడు వాటిని తగ్గించమని మొక్కేవి కొన్నేతే ఇంట్లో పెళ్ళిలాంటి శుభకార్యాలు జరిగే ముందు పండగలు చేసేవి కొన్ని, గ్రామం మొత్తానికి ఏదైనా ఇబ్బంది జరిగినపుడు మ్రొక్కి చేసే పడుగలు కొన్ని, ఇలా ఒక్కో గ్రామ దేవతలకు ఒక్కొక్క వారము నాడు ప్రత్యేకంగా పూజ చేస్తారు.

వాటితో పాటు సంవత్సరంలో ఒకటి రెండు రోజులు "జాతర" పేరుతో చుట్టూ పక్కల గ్రామాలను కలుపుకొని ఆనందంగా నిర్వహించుకుంటారు. బంధు మిత్రులతో సంతోషంగా గడుపుతారు. అదే పోచమ్మ, గంగానీళ్ళ జాతర, ముజ్జిగ మల్లన్న జాతర, వానల్ పాడ్ ఎల్లమ్మ జాతర, దేవుని చెరువు జాతర, కుంటాల గజ్జెలమ్మ జాతర, ముత్యాలమ్మ జాతర వీటితో పాటు చాల గ్రామాలలో నిర్వహించే సప్తాహం కూడా జతారలంటిదే. ఈ జాతరలలో ప్రజలు కుల బేధాలు మరిచిపోయి, ఉన్నవారు, లేనివారు అనే తేడాలు లేకుండా ఒక్కటిగా కలిసి ఆడి, పాడి ఆనందంగా గడుపుతారు. సమాజంలో ఐక్యమత్యం సాదించడం దీనివల్ల వస్తుంది అనేక కులాలని వర్గాలని, మతాలని విడివిడిగా జీవిస్తున్న ప్రజలందరినీ కలిసేవి ఈ జాతరలు.

ఉపయుక్త గ్రంథాలు :

1. నిర్మల్ జిల్లా సర్వస్వము - ప్రభుత్వం ద్వారా ప్రచురితం.
2. రేణుకదేవి చరిత్ర - గీతాప్రెస్ - 1998
3. పరీక్షణం - మద్దిరాల సత్యనారాయణ రెడ్డి - 2018

❖

తడ మండలం నిత్య క్రైస్తవ కీర్తనలు – విశిష్టత

– సుజిత రెడ్డి, పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

భక్తి సాహిత్యం చిన్నచిన్న పదాలతో ప్రజాభాషలో వచ్చింది. కనుకనే ఇప్పటి వరకు జనసామాన్యంలో చోటు చేసుకొని ఉన్నాయి కీర్తనలు. భారతదేశంలోని భక్తి సాహిత్యంలో అధిక భాగం కీర్తనల రూపంలోనే ప్రజల్లోకి వ్యాపించింది. వినడానికి సొంపుగా ఉండి హృదయాన్ని ఆకట్టుకొనే పల్లెపదాలు కన్నా ప్రజలకు ఇష్టమైనది మరొకటి ఉండకపోవచ్చు. ఆ పల్లె పదాలు వారి జీవితంలోని సుఖదు:ఖాలలో భాగస్వాములైనాయి. ఈ విధంగా పల్లె పదాలతో ప్రారంభమైన భక్తి సాహిత్యం సంగీత సాహిత్యంలో మెళకువలను, ఒరవడులను సొంతం చేసుకొని గీతంగా, గేయంగా, కీర్తనగా, సంకీర్తనగా, కృతిగా అభివృద్ధి చెందింది. మనిషికి ఉల్లాసాన్ని కలిగించే వాటిలో పాటలు ప్రముఖ స్థానం సంపాదించాయి. ఇవి మనస్సుకు ఎంతో హాయిని, నెమ్మదిని ఇస్తాయి. ప్రతి ఒక్కరూ పసిపిల్లల నుండి పెద్దల వరకు పాటలంటే ఇష్టపడని వారు ఉండరు. మనసుకు ప్రశాంతతను కలిగించే వాటిలో భక్తి పాటలు ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ప్రతి మతానికి చెందిన వారు తమ భగవంతుడిని స్మరించుకుంటూ పాటలు పాడుకుంటారు. క్రైస్తవులు యేసుకు చెందిన కీర్తనలను పాడుకుంటారు. తడ మండల క్రైస్తవ కీరన్తలను రెండు రకాలుగా వర్గీకరించాను. నిత్య కీర్తనలు, నైమిత్తిక కీర్తనలు. నిత్య కీర్తనలు అంటే ప్రతిరోజు భగవంతుణ్ణి స్మరిస్తూ పాడుకొనేవి. వాటిలో భగవంతునికి చెందినవి, వ్యక్తికి చెందినవి అని రెండు రకాల కీర్తనలు ఉన్నాయి. వీటిలో వ్యక్తి సంబంధ కీర్తనలను పరిశీలిద్దాం.

వ్యక్తి సంబంధ కీర్తనలు :

క్రీస్తును స్తుతించడానికి రచయితలు అనేక కీర్తనలను క్రైస్తవ లోకానికి అందించారు. క్రైస్తవులుగా క్రీస్తును స్వీకరించిన పిల్లలు, యువకులు, పెద్దలు, స్త్రీలు పాడుకొనే కీర్తనలు అనేకం కనిపిస్తాయి. వీటిని క్రైస్తవ సంఘాలలోనూ, కుటుంబాలలోనూ ఆలపించడం గమనించవచ్చు. క్రైస్తవేతరులు ఈ ఆరాధనలకు దూరంగా ఉంటారు. అందుకే అన్యుల (క్రైస్తవేతరులు) ప్రస్తావన కీర్తనల్లో మనకు ఎక్కడా కనిపించదు. క్రీస్తు భక్తులకు సంబంధించిన కొన్ని కీర్తనలను పరిశీలిద్దాం. ఇందులో పిల్లలకు, యువకులకు, స్త్రీలకు సంబంధించిన కీర్తనలు ఉన్నాయి. ముందుగా పిల్లలకు సంబంధించిన కీర్తనలను పరిశీలిద్దాం.

పిల్లల కీర్తనలు :

పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని కల్గించే సృజనాత్మక రచనలు, గేయాలు, కథలు, నవలలు, నాటికలు మొదలగు ఎన్నో ఇటీవల కాలంలో బాగా అభివృద్ధి చెందాయి. బాల సాహిత్య ప్రక్రియలో గేయాలు, పాటలు ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్నాయి. సంకీర్తనా పరమేశ్వరుడైన తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనల్లో లాలిపాటలు, జోలపాటలు, ఉగ్గుపాటలు, ఉయ్యాల పాటలు చోటు చేసుకున్నాయి. భాగవత రామాయణాల్లోని కథల్ని, సన్నివేశాల్ని దృష్టిలో పెట్టుకొని చిన్న పిల్లలు పాడుకోవడానికి అనువుగా అనేక గేయాలు వచ్చాయి. భావి పౌరులయిన బాలల్ని సక్రమ పద్ధతిలో తీర్చిదిద్ది సంస్కారవంతులుగా రూపొందించడానికి నీతి ప్రధానాలైన గేయాలు వచ్చాయి. సమయ స్ఫూర్తితో సమస్యల్ని సులభంగా ఎదుర్కోవడానికి తగిన మనో ధైర్యాన్ని పిల్లలకి కల్గించడానికి వారిలో సమయస్ఫూర్తిని కలిగించడానికి విజ్ఞానంతో కూడిన గేయాలు వెలువడ్డాయి. పిల్లల్లో భక్తిని పెంచడం కోసం కొన్ని భక్తి ప్రధానమైన గేయాలు వెలువడ్డాయి. ఇలా సాహిత్యంలో అనేక బాల గేయాలు తెలుగు క్రైస్తవ సాహిత్యంలో కూడా చోటు చేసుకున్నాయి.

యేసుక్రీస్తు ఈ లోకంలో ఉండగా పిల్లల్ని ఎక్కువగా ఇష్టపడినట్లు క్రైస్తవులు చెప్తుంటారు. పిల్లలు దేవునితో సమానం అనే మాట కూడా వాడుకలో ఉంది. పిల్లల్ని తగినట్లుగా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత. పిల్లలు విధేయత కలిగి దేవునికి లోబడి ఉండాలి. తల్లిదండ్రులకు లోబడి ఉండాలి. ఈ విధంగా పిల్లలకి మొదటి నుండి బైబిలులో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. చిన్న పిల్లలంటే యేసుకు ఎంతో ఇష్టం. అందుకే " చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడి వారిని ఆటంక పరచవద్దు " అని అంటాడు. చిన్న పిల్లలను యేసు ఎత్తుకొని, కౌగలించుకొని వారిని ఆశీర్వదించాడు. వీరి నోట పాటలు, స్తోత్రాలు చెప్పాలని ఆయన కోరుకుంటున్నాడు. "బాలుర యొక్కయు, చంటిపిల్లల యొక్కయు నోట స్తోత్రము సిద్ధింపజేసితిని" క్రైస్తవులు వారి పిల్లల్ని సండేస్కూలుకు పంపి విజ్ఞానదాయకమైన పాటల్ని, భక్తికి సంబంధించిన గేయాలను నేర్పడం పరిపాటి. ఇలా పాటలు క్రైస్తవ గేయ సాహిత్యంలో కోకొల్లలుగా ఉన్నాయి. ఆంధ్రక్రైస్తవ కీర్తనల పుస్తకంలో కూడా పిల్లల గేయాలు చోటుచేసుకొని ఉన్నాయి.

తడమండలంలో క్రైస్తవులు వారి పిల్లలను పసితనం నుండే దేవుడియందు భయభక్తులతో పెంచాలని అనుకుంటారు. చిన్నతనంలోనే వారి హృదయాల్లో భక్తి ఒక చిన్న మొక్కగా ఉండి రానురాను ఎంతో అభివృద్ధి చెంది ఆధ్యాత్మికంగా భక్తిని కలిగి ఉంటారు. ఆదివారం జరిగే సండేస్కూలుకి వెళ్ళడం అక్కడ యేసుకు సంబంధించిన మాటలు, కథలు, వాక్యాలను నేర్చుకుంటారు. పాటలకు యాక్షన్ చేస్తూ ఎంతో సంతోషపడతారు. వాక్యాలను చూడకుండా చెప్పడం ద్వారా వారి చదువుల్లో కూడా ఇది ఉపయోగపడుతుంది. మంచి జ్ఞానాన్ని పొందుతారు.దేవుని భయం ఉంటే చెడు త్రోవ పట్టరు. మంచి వారుగా ఎదుగుతారు. తడమండలంలో పిల్లలకు సంబంధించిన కీర్తనలు తక్కువగానే ఉన్నాయని చెప్పుకోవచ్చు.

యేసయ్యకు పసి పిల్లలంటే ఇష్టం అని, వాళ్ళు కళ్ళాకపటం లేని వారని తెలియజేస్తున్న పాట -

"చిన్న పిల్లలం చిన్న పిల్లలం యేసయ్యకెంతో ఇష్టులం
కలసి వెళ్ళుదాం కలసి వెళ్ళుదాం యేసయ్య సన్నిధికి ఈ దినం
కళ్ళాకపటం లేని ఈ చిన్న వారిదే
పరలోక రాజ్యమని యేసు చెప్పెను ..."
(పి. రమేష్ అముద్రితం)

చిన్న పిల్లలు భగవంతునితో సమానం అని పెద్దలు చెప్తుంటారు. అటువంటి చిన్న బిడ్డలు యేసయ్యకు ఎంతో ఇష్టం అని గాయకుడు ఈ పాటలో తెలియజేస్తున్నాడు. పసి పిల్లలకు తప్పొప్పులు తెలియదు. లేతమనసులు వారివి. కళ్ళాకపటం తెలియని వయసు. పరలోక రాజ్యం అలాంటి వారిదే అని కవి ఈ కీర్తనలో ప్రస్తావించాడు. ఇంకా వారిని దీవిస్తాడని కూడా ఉంది. యేసు మాటలను మరచిపోకుండా ఆయన ప్రేమను ఊరూరా చాటుదాం అంటూ ఈ కీర్తన పిల్లల అమాయకత్వాన్ని, వారి సున్నిత హృదయాలను చాటుతూ ఉంది.

సర్వ సృష్టి దేవుడిని ఆరాధిస్తుంది. కనుక పిల్లలు కూడా ఆరాధించాలని తెలియజేస్తున్నటువంటి మరొక కీర్తన -

"సర్వ సృష్టి దేవ దేవుని ఆరాధిస్తుంది
నీకు నాకు స్తుతియించే భాగ్యమిచ్చింది
కొమ్మ మీద కోయిలమ్మ తీయగ పాడింది
ఆకాశంలో జాబిలమ్మ హాయిగా నవ్వింది...
రాజుల రాజ రారమ్మని ఆహ్వానిస్తుంది"
(పి. రమేష్ అముద్రితం)

ఈ కీర్తనలో ప్రకృతిని పిల్లలకు పరిచయం చేస్తున్నాడు. భగవంతుడు సృష్టించిన లోకం కూడా యేసుని ఆరాధిస్తుంది. అందులో కమ్మని పాటలు పాడే కోయిలమ్మ, ఆకాశంలో జాబిలమ్మ, సముద్రంలోని గాలి ఇవన్నీ కూడా రాజాధి రాజుని స్తుతిస్తున్నాయి. పిల్లలకు ప్రకృతిలోని

అందాలను చూపిస్తూ ఆరాధించడం ద్వారా వారి మనసులో భక్తిభావాలు మొలకెత్తుతాయని రచయిత అభిప్రాయం.

పసి పిల్లలు యేసయ్య రాజ్యానికి పౌరులంటూ పాడుతున్న మరొక కీర్తన.

"చిన్నలం మల్లెలం యేసయ్య ప్రేమించే బాలలం
గువ్వలం దివ్వెలం యేసయ్య రాజ్యానికి పౌరులం
వాన వరదలే వచ్చినా ఏనాడు బెదిరిపోము
బలమైన గాలులు వీచినా యేసయ్యను వీడిపోము....
ఆటంకాలెన్ని వచ్చినా యేసు మార్గము విడువము "
(పి. రమేష్ అముద్రితం)

మల్లెపువ్వు ఎంత తెల్లగా ఉంటుందో పసి హృదయాలు కూడా ఏ కల్మషం లేకుండా ఉంటాయి. పిల్లలను మల్లెలతో, గువ్వలతో, దివ్వెలతో పోల్చుతూ, వీరే దేవుని రాజ్యానికి పౌరులంటున్నాడు. ప్రకృతికి సంబంధించిన కష్టాలు, నష్టాలు వచ్చినా యేసయ్యను విడిచిపెట్టం, ఆయన మార్గంలోనే పయనిస్తాం అంటూ పిల్లలనుద్దేశించి రచయిత ప్రస్తావించాడు. పిల్లలకు సంబంధించిన కీర్తనలు ఉన్నట్లుగానే యువకులకు సంబంధించిన కీర్తనలు కూడా ఉన్నాయి. వాటిని పరిశీలిద్దాం.

యవ్వనస్థుల కీర్తనలు :

ఒక దేశ భవిష్యత్తు ఆదేశంలోని యువకులపై ఆధార పడి ఉంటుందనడానికి చరిత్రలో ఎన్నో సంఘటనలు ఉన్నాయి. ఈనాడు యువకుల్లో ప్రబలిన అశాంతి, అసంతృప్తి కారణంగా అన్ని దేశాల్లో యువకులు దారి తప్పుతున్నారు. వారి స్వయం కృతాపరాధమనడానికి వీలు లేదు. మనిషి చేసే ప్రతిపని జీవిత సౌధానికి పునాది రాళ్ళవుతాయి. యవ్వనం చాలా చిత్రమైంది. అది చిత్ర విచిత్రమయిన దారుల్ని చూపిస్తుంది. ఇలా చెడుదారిలో పోయి ఇబ్బందులు తెచ్చుకోకుండా మంచి మార్గంలో వెళ్ళడానికి యువకులు ఏమార్గం ఎన్నుకోవాలో బైబిలు చక్కగా చెబుతుంది. " యవ్వన కాలంలో నీ సృష్టికర్తను జ్ఞాపకముంచుకో "52 అని బైబిలు దేవుణ్ణి వెదక మంటుంది.

మానవ జాతికి ఉత్తమ ఉపాధ్యాయుడిగా, రక్షకుడిగా, సుఖమయ జీవితానికి మార్గదర్శకత్వం చూపిన యేసు క్రీస్తు జీవితాన్ని ఈనాటి యువకులు ఆదర్శంగా తీసుకోవాలి. క్రీస్తు మంచి యవ్వన కాలంలో సువార్త చెప్పి, అనేక అద్భుతాలు చేశాడు. ఈ లోకంలో ఒక మనిషి ఎలా సన్మార్గంలో నడుచుకోవచ్చో తన జీవితం ద్వారా నిరూపించాడు క్రీస్తు. తల్లిదండ్రుల మీద విధేయత చూపించాడు. ఈనాటి కాలం యువకులలో తల్లిదండ్రుల పట్ల విధేయత చూపుతున్నది కేవలం కొంతమంది మాత్రమే. కాని పెద్దల పట్ల గౌరవాన్ని చూపాడు క్రీస్తు. అన్నార్థుల్ని ఆదరించాడు. వ్యాధిగ్రస్థుల్ని బాగు చేశాడు. పాపుల్ని దగ్గరకు తీసుకున్నాడు. వారిని సన్మార్గంలో నడిచేలా చేశాడు. ఇలా ఉత్తమ ఆదర్శాలతో తన జీవితాన్ని తీర్చిదిద్దుకొన్న క్రీస్తు శిష్యులు ఆయన మార్గంలో పయనించారు. అలాంటి క్రైస్తవ మతంలో పుట్టిన యువకులకు ఎంతో బాధ్యత ఉందని క్రైస్తవులు చెప్తారు. ఇనుప తెర వెనుకనున్న ఎంతోమంది యువకుల జీవితాన్ని బాగుచేయడానికి యువకులే పూనుకొని పరమ సత్య సూక్తుల్ని దేశవిదేశాల్లో చాటడానికి నడుం బిగించాలి. సువార్త ప్రచారార్థం వచ్చిన అనేక మంది పాశ్చాత్య యువకుల్ని మార్గదర్శకంగా తీసుకొని ఆ మార్గంలో పయనించాలని ఈనాటి క్రైస్తవ యువకులకి ఎన్నో నవలలు, కథలు వెలువడ్డాయి. బైబిల్లో ఉన్న అనేక మంది యువకుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తమ బ్రతుకుల్ని సన్మార్గంలో ఉంచాలని తెలిపే కీర్తనలు వెలువడ్డాయి.

క్రైస్తవ యువకుల్ని ఉత్తేజపరుస్తూ అనేక మంది క్రైస్తవ కవుల కలాల నుండి కీర్తనలు వెలువడ్డాయి. మంచిదారిని ఎన్నుకోమని చెప్పే కీర్తనలు ఉన్నాయి. బైబిలులో యువకుల జీవితాన్ని మార్గదర్శకత్వంగా చూపించి వారిలాగా ఉండమని చెప్పే కీర్తనలు ఉన్నాయి. సువార్త ప్రచారానికి

నడుం కట్టాలని, క్రీస్తునందు జీవించాలని చెప్పే కీర్తనలు క్రైస్తవ వాఙ్మయంలో చోటు చేసుకున్నాయి. పాపపు చీకటిలో ఉన్న యువకులను క్రీస్తు వెలుగులోకి రమ్మని పిలిచే కీర్తనలు ఉన్నాయి. ఇంకా ఎన్నో యువకులకు సంబంధించిన కీర్తనలు ఉన్నాయి.

తడమండలంలో యువకులు ఎంతో ఉత్సాహంతో యేసు సువార్తను ప్రకటిస్తారు. యవ్వనంలోనే క్రీస్తుకు దగ్గరగా ఉంటే వారి జీవితం మంచి దారిలో ఉంటుందని అక్కడి క్రైస్తవుల నమ్మకం. పాటలు పాడుతూ ఆరాధనలు చేస్తారు. మందిరాలలో సంఘ పెద్దలకు సహాయకులుగా ఉంటారు. చాలా అణకువతో తగ్గింపు స్వభావం కలిగి ఉంటారు. యేసుని తన రక్షకుడిగా భావించిన వారు బాప్తిసం తీసుకుంటారు. పాటలను రాగయుక్తంగా పాడుతారు. యువకులకు సంబంధించిన పాటలను కొన్నింటిని పరిశీలిద్దాం.

యేసు ప్రేమ ఎలాంటిదో కింది కీర్తనలో తెలుపుతూ స్తుతిచేస్తున్నారు.

"వెండి బంగారాల కన్న మేలైనది
జుంటి తేనెదారల కన్న మధురమైనది
యేసుని ప్రేమ బహు విలువైనది
రుచి చూచిన చాలు మరువలేనిది
తల్లిదండ్రులే మరచినా అన్నదమ్ములే విడచినా
విడువక ఎడబాయక ప్రేమించెను
కడవరకు కనుపాపలా నను కాచెను"

(పి. రమేష్ అముద్రితం)

వెండి, బంగారాలు ఎంతో విలువైనవి. తేనె చాలా తియ్యగా ఉంటుంది. వాటికంటే కూడా యేసు ప్రేమ విలువైనదని, దానిని రుచి చూచి తెలుసుకోవాలని యువకులకు చెప్తున్నాడు. భూలోక ప్రేమలు అశాశ్వతం. కాని దేవుని ప్రేమ విడువక చివరి వరకు కనుపాపలా ఉంటుందని కవి పేర్కొంటున్నాడు. అంధకారం కళ్ళకు అలుముకున్నా, భరించరాని బాధలు ఎదురైనా క్రీస్తు ప్రేమ అనుక్షణం చేయిపట్టి నడిపిస్తుంది. బంధువులు అవమానించినా, స్నేహితులు దూరం అయినా ఎంతో బాధను అనుభవిస్తారు. అలాంటి సమయంలో కూడా భగవంతుని అండ ఉంటుందని ఈ కీర్తనలో రచయిత యువతకు సందేశాన్ని ఇస్తున్నాడు.

దేవుడిని నమ్మితే ఆయన మహిమను చూస్తావు అని చెబుతున్న మరొక కీర్తన -

"విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము
నమ్మితే దేవుని మహిమను చూచెదవు
గ్రూప్ టెస్ట్ రాస్తున్న గూగుల్స్ చూస్తున్న టాలెంట్
ఎన్ని ఉన్నా
బీ.టెక్ చేస్తున్న ఎమ్.టెక్ చేస్తున్న నీటెక్కులెన్ని
ఉన్నా
ఏవేవో డిగ్రీలు నీచెంతున్న యేసు లేకుంటే నీకున్నది సున్న....
ఎన్నెన్నో హెచ్చింపులతో నీవున్న యేసు లేకుంటే
నీకున్నది సున్న "

(పి. రమేష్ అముద్రితం)

విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టుడై ఉండుట అసాధ్యము అని బైబిలు సెలవిస్తుంది. యేసయ్యను నమ్ముకోమని యువ లోకానికి రచయిత పిలుపు నిస్తున్నాడు. నేటి యువకులు అన్ని రంగాలలోను ముందుంటున్నారు. మంచి చదువులు చదివి జీవితంలో స్థిరపడుతున్నారు. అయినా సరే నీకు ఎన్ని ఉన్నా , ఏ స్థితిలో ఉన్నా నీ జీవితంలో యేసు లేకుంటే అవి సున్నాతో సమానం అని కవి పేర్కొంటున్నాడు. ఎంతో మంది గర్వంతో కూడిన మనసుని కలిగి ఉంటారు. లోకంలో తామే జ్ఞానులని అనుకుంటారు. కాని నీతో యేసు లేకుంటే అవన్నీ కూడా వట్టి సున్నాకు ఎంత విలువ ఉండదో నీకున్నవన్నీ కూడా విలువలేనివిగా ఉంటాయి అని రచయిత అభిప్రాయం. కనుక యువకుల జీవితాలల్లోకి యేసును స్వీకరించమని తెలియ జేస్తున్నాడు.

పాపపు లోకంలో పరుగెత్తడం మాని యేసు చెంతకు రమ్మని తెలుపుతున్న మరొక కీర్తన.

"యవ్వన జనమా యేసుని గనుమా
యవ్వన కాలమున దేవుని కొడిని మోయుమా
యవ్వన కాలములో గంతులు వేయుచూ
ఎందుకు ప్రభువనుచూ యోచన చేయకుమా
నీయువ హృదయమును యేసునకర్పించు.....
దేవుని రాజ్యముకై పాత్రగా జీవించు"

(పి. రమేష్ అముద్రితం)

కొంతమంది యువకులు భగవంతుని పట్ల భక్తిని పెంచుకుంటారు. మరి కొంతమంది దేవుడి అవసరం లేదని అనుకుంటారు వారిని ఉద్దేశించి కవి ఈ కీర్తనను పాడుతున్నాడు. యవ్వన ప్రాయంలో చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి మార్గంలో నడవమని, పాపపు లోకంలో పరుగును చాలించి యేసు వద్దకు వచ్చి ఆయన వాక్యాన్ని లోకానికి చాటిచెప్పమని యువకులకు తెలుపు తున్నాడు. దేవుని రాజ్యంలో ఉపయోగపడే పాత్రగా ఉండమని, వరాలను కురిపించే వాక్యాలను ఈ లోకానికి ప్రకటించమని యువకులకు తెలియజేస్తుంది పై కీర్తన.

భగవంతుడిని ఆశ్రయించి, ఆయన గొప్పతనాన్ని తెలుసుకోమంటున్న మరొక కీర్తన -

"నీ మార్గములో లేదు లాభము ఆశ్రయించుము యేసు నామము
ఆశలతో చిక్కుకున్న యువతి...కోరికలతో ఎగురుచున్న యువకా...
చూచిన వన్నీ మళ్ళీ చూడాలంటావు
ఈ లోకమును కోరుకుంటావు.....
నీ జీవితమును వ్యర్థము చేసుకుందువు
అద్దం ముందు మంచిగ ఉంటావు
చేయకూడని పనులు చేస్తూ ఉంటావు"

(పి. రమేష్ అముద్రితం)

ఇందులో యువతి, యువకుల స్వభావం గురించి చెప్తున్నారు. వీరు ఒకసారి చూసినవి మళ్ళీ మళ్ళీ చూస్తూ, ప్రతిదీ వారి సొంతం కావాలని ఆరాటపడుతుంటారు. ఈ లోకాన్ని కోరుకుంటారు. ఈ విధంగా చేసినందు వల్ల సమయంతో పాటు జీవితం కూడా వ్యర్థం అవుతుంది కాని అభివృద్ధి ఉండదు. అద్దం ముందు ఎంతటి మూర్ఖుడు కూడా మంచిగా కనిపిస్తాడు. కాని వాడి అంతరంగం కుళ్ళుకుతంత్రాలతో నిండి ఉంటుంది. 'మేడి పండు చూడ మేలిమై ఉండును / పొట్ట విప్పి చూడ పురుగులుండు' అన్నట్లు పైకి మంచిగా కని పించినా వారి హృదయంలో ఎన్నో చెడు ఆలోచనలు గూడు కట్టుకొని ఉంటాయి. కనుక ఎన్నో ఆశలతో చిక్కుకున్న యువతి వాటినన్నింటిని విడిచిపెట్టి యేసు దగ్గరకు రమ్మని రచయిత యువకులనుద్దేశించి చెప్తున్నాడు.

యవ్వన కాలంలో యువకులు ఈ లోకంలో ఎలా ఉండాలో తెలియజేస్తున్న మరొక కీర్తన.

"యేసయ్యకు నీవంటే ఇష్టం
యేసు లేకుంటే నీ బ్రతుకంతా కష్టం
ఇమ్మానుయేలు దేవుడు వుంటాడు అందరికి తోడు
యవ్వన కాలమున ప్రభువు కొరకు బ్రతకాలని
యేసయ్యలో నిలచి బహుగా ఫలించాలని
ఆశించుచున్నాడు అవకాశమిస్తాడు....
నిజమైన స్నేహితుడై విడువక ప్రేమించును"

(పి. రమేష్ అముద్రితం)

యువ్వనం శ్రేష్టమైనది. కాని ఈ లోకంలో రకరకాల ఆశలకు లోబడి ఎంతో మంది వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. భయంకరమైన చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. అలా కాకుండా దేవునిలో పరిశు ద్ధంగా జీవించమని చెప్తున్నాడు. వాడి స్నేహితులను బట్టి వాడెలాంటి వాడో చెప్పవచ్చు అని పెద్దలు అంటుంటారు. కనుక చెడు స్నేహాలకు లోనుకాకుండా నిజ స్నేహితున్ని తెలుసుకోమని యువతను కవి ఈ పాట ద్వారా మేల్కులుపుతున్నాడు.

పిల్లలకు, యువకులకు సంబంధించిన కీర్తనలను తెలుసుకున్నాం. ఇప్పుడు స్త్రీలకు సంబంధించిన కీర్తనలను పరిశీలిద్దాం.

స్త్రీల కీర్తనలు :

భారతీయులకు అత్యంత పవిత్ర గ్రంథాలుగా భావించబడే భారతం, భాగవతం, రామాయణ గ్రంథాలలో ఎన్నో పాత్రలు మనకు దర్శనమిస్తాయి. ఆ పాత్రల మనస్తత్వాన్ని పరిశీలిస్తే మనం ఎలా జీవించాలో, జీవించ కూడదో వివరణాత్మకంగా తెలుస్తుంది. ఈ గ్రంథాలలో స్త్రీ పాత్ర చిత్రణలో మహోన్నత వ్యక్తిత్వాలు మనకు గోచరమౌతాయి. ముఖ్యంగా సీత, రుక్మిణి, సుభద్ర, ద్రౌపది వంటి స్త్రీ పాత్రల ద్వారా స్త్రీలు చైతన్యవంతమైన తమ దాంపత్య జీవితాలను సరిదిద్దుకోవలసిన ఆవశ్యకతను కవులు చెప్పకనే చెప్పారు. అదే విధంగా క్రైస్తవులకు పవిత్ర గ్రంథంగా భావించబడే కొన్ని స్త్రీ పాత్రల జీవన విధానం, వారు నడచిన ప్రవర్తనా విధానాన్ని పరిశీలిస్తే వారెంత ఆదర్శ స్త్రీ మూర్తులుగా జీవించారో లోకానికి వెల్లడవుతుంది. బైబిల్‌లోని కొంతమంది స్త్రీలు తమ జీవన విధానంలో భర్తల పట్ల, కుటుంబం పట్ల, సమాజం పట్ల ఎలా బాధ్యతాయుతంగా ప్రవర్తించారో తెలుస్తుంది. బైబిలు ప్రకారం పాత నిబంధనలో స్త్రీలు భర్తలకు లోబడి ఉండాలని ఆదాము, హవ్వల జీవితం ద్వారా తెలుస్తుంది. స్త్రీలు పురుషులకు సహాయకులుగా ఉండాలని కూడా ఉంది. రాజుల కాలంలో "ఎజెబెలు, అతల్యా" అనే స్త్రీలు యూద రాజ్యాలలో అధికారాన్ని చెలాయించినట్లు పాత నిబంధనలో చెప్పబడింది. పాత నిబంధన కాలంలో స్త్రీలను కొంచెం తక్కువగా చూసినా వారికి పురుషులతో పాటు సమానమైన హక్కులుండేవి.

ఇక కొత్త నిబంధన కాలంలో క్రీస్తు తన బోధనలన్నింటిలో స్త్రీ, పురుషులకి ఈ లోకంలో భేదాలు ఉన్నట్లు తన రాజ్యంలో అటువంటి భేదం లేదంటాడు. దేవుని ఎదుట స్త్రీలు పురుషులు సమాన హక్కుదారులుగా క్రీస్తు బోధిచాడు. కొందరు స్త్రీలు సంఘంలో చేరి సంఘ పరిచర్య చేసినట్లు రోమా పత్రికలో ఉంది. స్త్రీలు సంఘంలో మౌనంగా ఉండాలి. వారు లోబడి ఉండాల్సిందే గాని వారు మాట్లాడ్డానికి హక్కులేదు. వారు ఏదైనా మాట్లాడాలంటే వారి భర్తలను అడగాలి. సంఘంలో స్త్రీలు మాట్లాడటం అవమానకరం అని పరిశుద్ధుడైన పౌలు కొరింథి పత్రికలో చెప్తాడు. స్త్రీ సమానత్వం గురించి పౌలు ఇలా అంటాడు. "యూదుడని, గ్రీసు దేశస్థుడని, దాసుడని, స్వతంత్రుడని, పురుషుడని, స్త్రీ అని లేదు. యేసు క్రీస్తునందు మీరందరూ ఏకంగా ఉన్నారు" బాప్తీస్మం పొందిన వారందరూ ఏ బేధం లేకుండా క్రీస్తులో ఉన్నారని చెప్పే సందర్భంలో పై మాటలను అంటాడు. దీనిని బట్టి స్త్రీ, పురుషులకి సమానంగా బైబిల్లో స్థానం కల్పించబడిందని నిర్ధారించవచ్చు.

ఈనాడు సంఘంలో మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారు. అనేక స్త్రీ సమాజాలు ఏర్పడి తమ పాత్రని నిర్వహిస్తున్నాయి. క్రైస్తవుల్లో కూడా స్త్రీలు మందిరాలలో బోధించడంలాంటివి పురుషులతో సమానంగా చేస్తున్నారు. దెబోరా, మిర్యాము ప్రవక్తులుగా పేరు తెచ్చుకున్నారు. యేసుకు జన్మనిచ్చిన మరియ ధన్యురాలిగా పేరుతెచ్చుకుంది. రూతు యేసుక్రీస్తు వంశావళిలో పేరు గడించింది. మగ్దలేని మరియ యేసు చనిపోయి లేచినప్పుడు మొదటిగా చూసింది. ఇంతటి ధన్యతను బైబిల్లోని స్త్రీలు కలిగి ఉన్నారు.

తడమండలంలోని క్రైస్తవ సంఘాల్లో మహిళలు పురుషుల కంటే ఎక్కువ పాత్రను పోషిస్తారు. ఇక్కడ స్త్రీలకు సంబంధించిన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి గురువారం స్త్రీలకు బైబిలు గురించిన పరిజ్ఞానాన్ని అందిస్తారు. కుటుంబం ఆరాధనలు జరిపిస్తారు. వారానికి ఒక్కో కుటుంబంలో ప్రార్థనలు జరిపిస్తారు. స్త్రీలకు సంబంధించిన పాటలను కూడా పాడుకుంటారు. దీనికి సంబంధించిన కీర్తనలు క్రైస్తవ కీర్తన వాఙ్మయంలో చోటు చేసుకోవడం గమనార్హం. ఇప్పుడు వీటికి సంబంధించిన కీర్తనలను పరిశీలిద్దాం. స్త్రీలు వారి జీవితంలో యేసుకు ఇచ్చిన స్థానాన్ని తెలుపుతున్నటువంటి ఒక కీర్తన.

"యేసు నామమందు భయభక్తులు గల స్త్రీలు
వర్ధిల్లెదరు కొనియాడెదరు

పిల్లలు లేని గొడ్రాలవనుచూ హన్నమ్మను అవమానించగా
యెహోవా సన్నిధిలో మ్రొక్కుబడులు చేసి
ఆరుగురు పిల్లలతో ఆశీర్వాదము పొందుకున్నదమ్మా
పరదేశియైన రూతమ్మ నిజమైన దేవుని ఆశ్రయించగా
నీ దేవుడే నా దేవుడని విశ్వాసముంచగా
దావీదువంశానికి తల్లిగా నిలిచెనమ్మా
కన్యయైన మరియమ్మ కలవరపడగా
దయాప్రాప్తురాలా నీకు శుభమనుచూ
ప్రభుయేసు జన్మకు పాత్రగా నిలిచెనమ్మా"

(పి. రమేష్ అముద్రితం)

ఈ కీర్తనలో కవి బైబిలులో ఉన్న హన్నా, రూతు, యేసుకు జన్మనిచ్చిన మరియ గురించి ప్రస్తావిస్తున్నాడు. హన్నాకు సంతానం లేకుంటే ప్రభువు అమెకు ఎంతో తెలివిగల కుమారుడిని బహుమతిగా ఇస్తాడు. రూతు తన అత్త అయిన నయోమిని ఒంటరిగా విడిచి పెట్టకుండా ఆమెను అంటిపెట్టుకుంది. చివరకు నిజ దేవుణ్ణి తెలుసుకొని యేసుక్రీస్తు వంశావళిలో చోటు సంపాదించింది. లోకుల మాటలకు భయపడక లోకరక్షకునికి జన్మనిచ్చి ధన్యురాలైంది మరియ. ఇంతటి గొప్ప భాగ్యాన్ని పొందుతున్నారు వీరు. వీరి జీవితాలను ఆదర్శంగా తీసుకొని దేవుని దీవెనలను పొందమని రచయిత నేటి స్త్రీలకు ఈ కీర్తన ద్వారా తెలియజేస్తున్నాడు.

ఎంతమంచి దేవుడవయ్యా నీవు అంటూ కొనియాడుతున్నటువంటి మరొక కీర్తన.

"నా యూనుపొలిమేరలో విధవరాలు ఏడ్పువిన్నావయ్యా
కనికరమే చూపావయ్యా - ఏడ్వద్దమ్మా అని అన్నావయ్యా
చిన్నదానా - లెమ్మన్నావయ్యా
నీ జాలి నీ కరుణ అబ్బా చాలయ్యా"

(డా॥ అకుల పాల్, రక్షణధ్వని, పాట. 65)

దేవుని కరుణ, జాలి మానవుని పట్ల ఎలా ఉందో ఈ కీర్తనలో తెలియజేసారు రచయిత. యేసు చేసిన అద్భుతాలను చెప్తూ కీర్తిస్తున్నాడు. చనిపోయిన అధికారి కుమార్తెను బతికించాడు. విధవరాలును కరుణించాడు. మార్తా, మరియ తమ్ముడును సమాధి నుండి బయటకు రప్పించాడు. ఎంత అద్భుతాలను చేసిన యేసు కరుణామయుడని ఈ పాటలో తెలియజేసాడు కవి.

మరొక కీర్తన -

"సమర్పణ చేయుము ప్రభువునకు
నీ దేహము ధనము సమయమును
ప్రభుని ప్రేమించిన పేదవిధవరాలు
కాసులు రెండిచ్చెను కానుకగా
జీవనమంతయు దేవునకిచ్చెన్"

(కల్వరి సునాద గీతములు పాట. 157)

యెహోవా దేవునికి సంపదను, సమయాన్ని, దేహాన్ని సమర్పించాలని కవి చెప్తున్నాడు. ఇక్కడ పేద విదవరాలు తన దగ్గర ఏమి లేకున్నా రెండు కాసులను సమర్పించింది. కలిమిలో కూడా దేవునికి ఇవ్వడం అనేది గొప్ప తనానికి తార్కాణం. నేటి సమాజంలో దేవుని మీద భక్తితో కాకుండా ఇతరుల భయంతో కానుకలను ఇస్తుంటారు. అలా కాకుండా ఉన్నదాంట్లో భగవంతునికి సమర్పించడం అనేది ఈ పాటలో చెప్పకోదగ్గ విషయం.

ముగింపు :

తడమండల క్రైస్తవ కీర్తనల వైవిధ్యం గురించి పరిచయం చేయడం జరిగింది. వ్యక్తి సంబంధ కీర్తనల్లో పిల్లల, యువకులు, స్త్రీలకు సంబంధించిన కీర్తనలను పరిచయం చేయడం జరిగింది. పిల్లలు పసితనం నుండి భక్తి కలిగి జీవించాలని క్రైస్తవం చెప్తుంది. నేటికాలంలో యువకులు చాలా వరకు పాడైపోయిన స్థితిలో ఉన్నారు. వారు దేవుని దగ్గరకు వస్తే వారి జీవితాలను సుఖమయం చేసుకుంటారు. స్త్రీలు నేటి సమాజంలో ఎంతో అభివృద్ధి చెందారు. భగవంతుని కొలవడంలో కూడా మహిళలే ముందుంటారు. స్త్రీలు ఆధ్యాత్మికంగా కూడా ఎంతో అభివృద్ధి చెందినట్లు క్రైస్తవమతంలో కూడా చూడవచ్చు. మసిషికి, భగవంతునికి ఏర్పడే సున్నితమైన విషయాలు చర్చించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. పరిశుద్ధ గ్రంథం, బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా, 206 మహాత్మాగాంధీ రోడ్, బెంగుళూరు.
2. పి. రమేష్ అముద్రితం, వయస్సు 45, తోండూరు గ్రామం, నెల్లూరు జిల్లా.
3. డా॥ అకుల పాల్, రక్షణధ్వని, జీసస్ గ్లోబల్ ప్రేయర్ టవర్ మినిస్ట్రీస్, సూళ్ళూరుపేట.
4. కల్వరి సునాద గీతములు, కల్వరి ఇవాంజిలికల్ ఫెలోషిప్, వేలచ్చేరి, చెన్నై.

❖ ❖ ❖

జానపద కళారూపాలు

– డా॥. గుంటుపల్లి గౌరి, లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల, (స్వయంప్రతిపత్తి), గుంటూరు.

తెలుగుదేశంలో ఉన్నన్ని జానపద కళారూపాలు భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవని చెప్పడం అతి శయోక్తి కాదు. జానపదమంటే జనులు నివసించే పల్లె టూరు. యుగయుగాలుగా వారు పాడుకునే పాటలను జానపద గేయాలనీ, వారు ప్రదర్శించే కళారూపాలను జానపద కళారూపాలని పెద్దలు నిర్వచించారు. సినిమా రంగానికీ, నాటక రంగానికి పూర్వ రూపాలైన జానపద కళారూపాలు, ఆయా రాజుల పరిపాలనలో ఆంధ్ర ప్రజాస్వామ్యాన్నంతా అలరించి వారిని సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానికంగా తీర్చిదిద్ది వారి జీవితాలతో పెనవేసుకు పోయినవి నాటి నేటి జానపద కళారూపాలే.

కురవంజి :

ఆంధ్రులయొక్క మొట్టమొదటి కళారూపం దృశ్య కావ్యం కురవంజి. అరణ్యాలలో నివసించే చెంచులు, కోయలు, కురవలు, ఈ ప్రదర్శనాన్ని ప్రదర్శించేవారు. కురవంజి అనగా ఒక నృత్య విశేషంతో కూడిన అడుగు, కురువలనేవారి అడుగు కాబట్టి దానిని కురవంజి లేక కొరవంజి అనికూడ పిలుస్తూ వచ్చారు. వీరు పుణ్య క్షేత్రాలుగా వున్న తిరుపతి, మంగళగిరి, శ్రీశైలం, భద్రాద్రి, సింహాచలం మొదలైన యాత్రా స్థలాలలో యాత్రికుల వేడుకార్థం పురాణాలు, పుణ్యక్షేత్రాల మహాత్మ్యాలు ప్రదర్శించేవారు.

యక్షగానం :

మన ప్రాచీన కళారూపాల్లో అతిప్రాచీనమైనది యక్ష గానం. జక్కులనేవారు ఈ యక్షగానాలను ప్రదర్శించడం వల్ల జక్కు శబ్దం యక్షగామారి జక్కులవారి ప్రబంధానికి యక్షగానమని పేరువచ్చింది. దక్షిణ దేశంలో యక్షగానాలు విలసిల్లాయని పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఉదహరించాడు. యక్షగానాలు కాకతీయ సామ్రాజ్యంలో బహు జనాదరణను పొందాయి. 14వ శతాబ్దం చివరిలోనూ, 15వ శతాబ్దం ప్రారంభంలోనూ వున్న యక్షగానాలను గురించి శ్రీనాథుడు పొగిడాడు. విజయనగర రాజుల కాలంలోను తంజావూరు ఆంధ్ర రాజుల కాలంలోను వర్ధిల్లాయి. ఈనాటికీ తంజావూరు సరస్వతీ మహల్‌లో 400 యక్షగానాలు తాళపత్రాల మీద ఉన్నాయి. ఆంధ్రదేశంలో యక్షగాన ప్రదర్శనలకు పేరెన్నిక గన్నవి మేళాలు. 18వ శతాబ్దంలో భాగోతుల బుచ్చిగాడి మేళం కూచిపూడి సిద్ధేంద్రయోగి మేళం, భాగవతుల దశరధరామయ్యగారి మేళం. 19వ శతాబ్దపు లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి మేళాలు, 19,20 శతాబ్దాల్లో నెల్లూరు మండలంలో పడకండ్ల రామస్వామి రాయకవి మేళాలు మొదలైనవి యక్షగానాలను ఎంతగానో ప్రచారం చేసాయి.

వీధి నాటకాలు :

ఒకే ఒక పాత్ర ఆడుతూ, పాడూతూ, కథ వినిపించే దశనుంచి ఒక్కొక్క వ్యక్తి ధరించి నటించే దశకు పరిణితి చెందిన యక్షగాన ప్రబంధ రూపాంతరమే వీధి నాటకము. దీనిని యక్షగాన నాటకమని, వీధి భాగవతమని, బయ లాట అనికూడ అంటారు. ఇది సంగీత నాటకం. 16వ శతాబ్దంలోనే వీధి నాటకాలు ప్రారంభమయ్యాయి. యక్షగానంయొక్క రూపాంతరమే వీధినాటకం. కాక తీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం వీధి నాట కమే. వీధినాటకాన్ని ఎక్కువ ప్రచారంలోకి తీసుకు వచ్చినవారు కూచిపూడి వీధి భాగవతులు. వీరు రాయల కాలంలో విజయనగరంలోనూ, తంజావూరు, మేలటూరు, శూలమంగళం, అచ్యుతాపుర అగ్రహారం మొదలైన ప్రాంతాల్లోను, రాయలసీమలో కోటకొండ, కపట్రాల కళాకారులు, గోల్కొండ నవాబుల కాలంలో ఉన్న అక్కన్న

మాదన్న భాగవత దళం వీధినాటకాలను విరివిగా ప్రచారం చేసింది. ఆంధ్ర దేశమంతటా కూచిపూడివారి వీధి నాటకాలు ప్రదర్శించబడ్డాయి.

తోలుబొమ్మలాటలు :

ఒకదేశంయొక్క సంస్కృతి మరో దేశానికి వ్యాపించినట్లు ఈ తోలుబొమ్మలాటలు మహారాష్ట్ర దేశం నుంచి దిగుమతి అయ్యాయి. ఈ తోలుబొమ్మలాటలు తూర్పు చాళుక్య రాజుల కాలంలోనూ, పల్నాటి వీరుల కాలంలోనూ, రాయల కాలంలోను ఎక్కువగా అభివృద్ధి చెందాయి. బొమ్మలాటలను జంగంవారు, దేవాంగులు, ఆరకాపులు మొదలైనవారు ఈనాటి వరకు ఆడుతున్నారు. బొమ్మలాట కథలుగానీ, రామాయణం, మహాభారతం, ఉషా పరిణయం, హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, రంగనాథ రామాయణం మొదలైనవాటిలోని పాత్రలను, కథలను తీసుకొని ఎంతో జనరంజకంగా ప్రదర్శించేవారు. లలిత కళలన్నీ ఈ కళలో ఇమిడి ఉన్నాయి. తెల్లని తెర వెనుక ఆముదపు దీపాల వెలుతురులో రంగులతో చిత్రించిన తోలుబొమ్మలను ఆడిస్తూ, పాడుతూ, కథచెబుతూ, మధ్య మధ్య హాస్యాన్ని పురికొల్పే జుట్టుపోలిగాడు, బంగారక్క, అల్లాటప్పగాడు, కేతిగాడు మొదలైన హాస్య పాత్రల ద్వారా కడుపుబ్బ నవ్విస్తారు. ఈవిధంగా తోలుబొమ్మలను గురించి ఎంతైనా వ్రాయవచ్చు.

పగటి వేషాలు :

ఒకనాడు భారతదేశంలో సామంత రాజులు, స్వతంత్ర హిందూ ముస్లిం రాజుల పాలనలో గూఢచారులుగా మారు వేషాలు ధరించడం కోటలో జొరబడి రాజులను వంచించడం, చీరల వర్తకులుగాను, గాజు శెట్టి వేషాలతోను కురవంజి వేషాలతోను ప్రవేశించి, రాజుల గుట్టు మట్టులు తెలుసుకొని యుద్ధం ప్రకటించేవారు. పగటివేషాలద్వారా సంఘంలో వుండే మూఢనమ్మకాలను, దోపిడిగాండ్లను, లంచగొండులనూ, హాస్య ధోరణిలో బట్టబయలు చేసేవారు. వీరు పగలే వేషాలు ధరించి, బజారులు తిరుగుతూ కూడలిలో నిలబడి వారి ప్రజ్ఞా ప్రాభవాలను వివరించేవారు.

జంగం కథలు :

ఈనాటికి ప్రచారంలోవున్న బుర్రకథ కళారూపానికి పూర్వరూపం తందాన కథలనీ, డక్కీ కథలనీ, జంగం కథలనీ, మరాఠీ కథలనీ, తంబుర కథలనీ, బుర్రకథలనీ ప్రచారంలో వుండేవి. ఒకనాడు దేశభక్తి ప్రచారానికి, ప్రబోధానికి, మతవ్యాప్తికి తోడ్పడిన విశిష్ట కళారూపం ఇది. ఈనాడు దేశదిమ్మరుల ఉదర పోషణకు ఉపయోగపడుతూవుంది. ధేనువుకొండ వెంకయామాత్యుడు రచించిన పౌరాణిక కథలను దొడ్డారపు వెంకటస్వామి ఎంతో ప్రచారంలోకి తీసుకువచ్చాడు.

జముకుల కథలు :

జముకుల కథగా పిలువబడే ఈ జక్కుల కథలు, కాకతీయ సామ్రాజ్యంలో బవనివాండ్రు ఏక వీరాదేవి మూహురమ్మ, కాకతమ్మ, బతుకమ్మ, బొడ్డెమ్మ, రేణుకా కథలను భక్తి పురస్సరంగా చెపుతూ వుండేవారు. ఈ కథలు తెలంగాణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోనూ, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలోనూ, బహుళ ప్రచారంలో ఉన్నాయి. శృంగార లాలిత్యాలతో హృదయాలను స్పందింపచేసే కరుణ రసానికి సంబంధించిన అనేక సన్నివేశాలున్నాయి. సంగీత, సాహిత్య, వాయిద్య నృత్య సమ్మేళనం ఈ కళారూపాలు. మధ్య కథకుడు తాళంవేస్తూ అభినయిస్తూ కథను చెబితే, వంతలు, జముకు వాయిద్యాన్ని వాయిస్తాడు.

పిచ్చుకుంటులవారు :

ఆయా వంశాల గోత్రనామాలను వల్లించే వీరు పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు చరిత్ర, ఖడ్గ తిక్కన మొదలైన వీరకథలను చెపుతుంటారు. వీరి కథల్లో శృంగార, వీర, కరుణరసాలకు ఎక్కువ అవకాశముంది. హుందా తలపాగాతో, ఒక చేతితో కత్తినీ, మరో చేతిలో డాలునూ, కాళ్ళకు గజ్జెలునూ ధరించి, వీరణ వాయిద్యంతోపాటు శృతి తిత్తి వుంటాయి. ఈ కథలు ఎక్కువ వీరరస ప్రధానములైనవి.

హరికథలు :

ఒకే వ్యక్తి మూడుగంటల కాలం కథా కాలక్షేపంతో ప్రేక్షకుల్ని ముగ్దల్ని చేసే అత్యుత్తమ కళారూపం హరికథ. కళారూపాలన్నిటిలోనూ ప్రముఖ స్థానాన్ని అలంకరిస్తున్న హరికథలో మధురగానం, లయ, తాళం, నృత్యం, వాచకం, అభినయం మొదలైనవి తాండవిస్తూ ఉంటాయి. ఈ కథా కాలక్షేపానికి పితామహుడు శ్రీ అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు. ఈనాడు ఆయన ఏక లవ్య శిష్యులైన దాదాపు 50 మంది హరికథకులున్నారు. హరికథా నిర్వహణ అష్టావధానం లాంటిది.

జేగంట భాగవతులు :

ఎందుకయ్యా ఉంచినావు బంధిఖానలో రామయ్య తండ్రి అంటూ రామదాసు బంధిఖానా విశేషాన్ని పాట రూపంలో వల్లిస్తూ చేతిలో ఒక పెద్ద జేగంటతో రామ లక్ష్మణ సీత విగ్రహాలతో కూడిన దీపపు స్తంభాన్ని పట్టుకొని నోటితో పాడుతూ, గజ్జెల కాళ్ళతో నృత్యం చేస్తూ, చిరుతలతో తాళంవేస్తూ, స్తంభంచుట్టూ కలియ దిరుగుతూ నృత్యం చేస్తారు. ప్రతి ఇంటి ముందు భాగమూ ఈ కళారూపానికి రంగస్థలమే.

జిక్కిణి :

నాట్యాలలో దేశి, మార్గ, నృత్యాలను గురించి శ్రీనాథుడు కాశీఖండంలో ఉదహరించాడు. జిక్కిణి చిందు అనీ, దేశీయ నృత్యాలు వున్నాయనీ జిక్కిణిగూర్చి శ్రీనాథుడే "దశావతార చరిత్ర"లో "పెక్కువగ జిక్కిణీకోపు ద్రొక్కెనొక్క చక్కని మిటారి నరపతుల్ సొక్కిచూడ" అని వర్ణించాడు.

గంటి భాగవతులు :

గంటి భాగవతులు దీపపు స్తంభాల వెలుతురులో బొమ్మలు ఆడిస్తూ ఉండేవారు. ప్రతి ఇల్లూ వీరి రంగ స్థలమే. మూగ ప్రజలే వీరి ప్రేక్షకులు. ప్రదర్శనాకాలం కూడ స్వల్పమే. చూడవచ్చిన ప్రేక్షకులు ప్రమిదలో కానుకలుంచేవారు. ప్రతి ఇంటివారు ఆ ప్రమిదలో గంటెడు చమురు పోసేవారు. ఈవిధంగా పాటలు పాడుతూ, బొమ్మల నాడిస్తూ, వారూ ఆడుతూ, ఊరంతా తిరిగి భక్తి ప్రచారం చేసేవారు.

గొల్లభాగతులు :

కృష్ణుడు గొల్లవాడనే విశ్వాసంకొద్దీ కృష్ణలీలలనూ, కృష్ణ భాగవతాన్ని, గొల్ల భాగవతులు ప్రదర్శించేవారు. యాదవ కులానికి గర్వకారకుడై అనంత విశ్వానికి భగవానుడైన శ్రీకృష్ణ భగవానుడు తమజాతి వాడనే గర్వంతో వీరు భాగవతాలను ప్రదర్శించేవారు. ఒకే గ్రామంలో వీధి వీధిలో భాగవతాలు ప్రదర్శించేవారు.

దొమ్మరాట సర్కసు :

ఇతర వినోద కార్యక్రమాలతోపాటు దొమ్మరాట సర్కసు కూడ ఒకటి. దొమ్మరవారు నాలుగు వీధులూ కలిసినచోట ఒకపెద్దగడను పాతి, డోలువాయిద్యాన్ని ప్రారంభించి, ప్రేక్షకులను సమీకరించి, ఆటపాటలతో అందర్నీ ఆకర్షించి, వివిధ బల ప్రదర్శనాలతో ప్రజలను ఆనందపరిచేవారు. పెద్ద పెద్ద సర్కసులు చూడలేనివారికి ఇవి ఎంతో ఇంపును కూర్చేవి. అమరాంగనలు, దివినాడెడుమాడ్కి నమరంగ గడలపై నాడెడువారని పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఉదహరించాడు.

యానాది భాగవతులు :

కూచిపూడి వీధి భాగవతుల ప్రభావం అనేక జాతుల మీదా, కులాలమీదా పడింది. నెల్లూరు, గుంటూరు జిల్లాలలోవుండే ఈ యానాదుల వృత్తి ఊరు కాపలా. వీరిలో పురుషులూ, స్త్రీలుకూడా పౌరాణిక వీధి నాటాకాల్లో పాత్రలు ధరించి ఆంధ్రదేశంలో ఒక గొప్ప సంచలనాన్ని కలిగించారు.

కోలాట నృత్యం :

తెలుగుదేశపు జానపద కళారూపాలలో కోలాటం అతిముఖ్యమైనది. పాల్కురికి సోమనాథుడు ఈ కోలాటాన్ని గురించి - కోలాట గొడియ అని వర్ణించాడు. భక్తిరస

ప్రధానమైన ఈ కళారూపంలో కూర్చుని, నిలబడి, ఎగురుతూ, గిర్రుగిర్రున తిరుగుతూ, ఒకేరంగు తలపాగా చుట్టి, నడుముకు కట్టు బిగించి, పంచలు ఎగగట్టి, కాళ్ళకు చిరుగజ్జెలు కట్టి కోలాటపు చిరుతలతో అత్య ద్భుతంగా, గుండ్రంగా తిరుగుతూ కోలాటం వేస్తారు.

కనక తప్పెట్లు :

ఈ డప్పుల వాయిద్యాన్నే తప్పెట్ల వాయిద్యమంటారు. రాయలసీమలో వీటినే కనకతప్పెట్లంటారు. ఈ కళా రూపాన్ని చాటింపులకు, జాతర్లకు, వివాహాలకు, వీరుల పూజలకు ఉపయోగిస్తారు. ఈ డప్పులతో వలయాకారంగా తిరుగుతూ, వివిధ వరుసలను అత్యద్భుతంగా వాయిస్తూ, ఉధృతంగా నృత్యం చేస్తూ పాట పాడతారు.

చెక్క భజన :

పల్లెల్లో పనిపాటలు లేని తీరిక సమయాల్లో దేవుని స్తంభాలు పట్టుకుని భక్తితత్వంతో భజనలు చేస్తారు. దాదాపు 20మంది గల ఈ బృందం, నోటితో పాటనూ, ముఖంలో అభినయాన్ని, చెక్కలతో తాళాన్ని, గజ్జలుకట్టిన కాళ్ళతో నృత్యాన్ని ఉధృతంగా నడుపుతారు. ఈ కళా రూపాన్ని ఇటీవల సాంఘిక, రాజకీయ ప్రచారానికి కూడ వినియోగిస్తున్నారు.

హరిహరీ పదాలు :

హరిహరీ నారాయణ, ఆదినారాయణ కరుణించి మమ్మేలు కమలోలచనుడ, "కరు" "హరిహర" అన్న పదాలతోనే ఈ పల్లవి నడుస్తుంది. హరిహర పదాలు విశాఖ పట్టణం జిల్లాలో విశేష ప్రభావాన్ని కలిగివున్నాయి. పదాల నడక ప్రారంభంనుంచీ చివరివరకూ ఒకే వరుసలో నడుస్తుంది. మధ్య మధ్య కథాగమనాన్నినుసరించి వచనంలో తేటతెల్లంగా కథయొక్క అర్థాన్ని చెపుతారు. వీటి కథల్లో చాలవరకు రామాయణ, భారతాది కథలే ఎక్కువగా ఉన్నాయి. శ్రీకూర్మం, చికాకోల్, రాజాం, పాలకొండ, ఆముదాల వలస, విజయనగరం ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఈ కథను రంజింపజేస్తారు.

బైండ్లవారు :

వీరశైవ మతస్థులకు వినోదాన్ని కలిగించేవారిని బైండ్ల వారని అంటారు. కులాలూ, మతాలవారిగా, ఆచార్యులు, కళాకారులు, వున్నట్లు వీరు కేవలం శైవమతస్థులకే వినోద ప్రదర్శనలిస్తారు. వీరు శైవ మతస్థుల ఇండ్లలో పెండ్లి, మొదలైన శుభకార్యాలలోనూ, చావు మొదలైన దుర్దినాలలోను కథలను చెబుతారు. వివిధ వాయిద్యా లను అద్భుతంగా వాయిస్తారు.

దేవదాసీ నృత్యాలు :

ఆంధ్రదేశంలో దేవదాసీలూ, భాగవతులూ, నృత్య కళను పోషించి, అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. దేవదాసీల నృత్యకళ, భాగవతుల నృత్యకళ అని వేరువేరుగా అభివృద్ధి చెందాయి. దేవదాసీలు దేవాలయాల నృత్య మండపా లలో దేవుని సన్నిధానంలో, శైవ, వైష్ణవ సాంప్రదాయాల ననుసరించి ఆరాధన నృత్యాలూ అష్టదిక్పాలక నృత్యాలు, కేశికా ప్రదర్శనలూ, కలాపాలూ మొదలైన నృత్యాలను ప్రదర్శించేవారు. స్వామి సన్నిధిలో బలిపీఠం పైన నృత్యం చేయడానికి అధికార ముద్రల్ని పొందినవారే ఈ అర్హతను కలిగి వున్నారు. అటువంటివారే నిజమైన దేవదాసీలు. తమ జీవిత సర్వస్వాన్ని దేవుని సేవకే అంకితం చేసి ఆ ఐక్యమునకై తహతహలాడేవారే దేవదాసీలు.

గోండు జాతి నృత్యాలు :

తెలంగాణాలో కీసలాపురం భూమదేవు దేవాలయం గోండు జాతికి సంబంధించినది. ఇక్కడ గోండు జాతివారు పదిహేనురోజులపాటు గొప్ప జాతర జరుపుతారు. వేలాది గోండు జాతి ప్రజలు గూమికూడే ఈ ఉత్సవంలో గోండు కవులూ, వాద్యకారులూ, పాటకులు, అందరు హాజరై ప్రధాన వాయిద్యాలను వాయిస్తూవుంటే పాటగాండ్రు భక్తి గీతాలు పాడతారు. విగ్రహంముందు నిలబడి తన్మయీ భావంతో రకరకాలైన నృత్య ప్రదర్శనాలను జరుపుతారు. ఈ విధంగా తెలుగువారి ప్రజా జీవితంలో

అనేక కళారూపాలు పుట్టి పెరిగాయి. ఆంధ్రుల కళా సంస్కృతు లకు పట్టుకొమ్మలై మెరిసాయి. పైన చెప్పినవే కాక ఇంకా వందపైన ఇతర కళారూపాలు వేరు వేరు కాలాల్లో అభివృద్ధి చెందాయని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. "తెలుగువారి జానపద కళారూపాలు." రచయిత : డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ప్రచురణ : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాదు, 1992.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆర్వీయస్ సుందరం పరిశోధన సేవ

- సారంగపాణి బండి, వరంగల్లు.

పాటల ప్రపంచంలో జానపద గేయం తెలియని, ఆస్వాదించని, ఆపాటల మాధర్యాన్ని అనుభవించని మనిషి ఉండడు. ఎందుకంటే ఈ లోకంలోకి అడుగు పెట్టిన ప్రతిబిడ్డ తన తల్లి పొత్తిళ్ళలో వింటూ హాయిగా నిద్రపోయే పాట లాలి పాట. అందుకే జానపదం అంత మాధుర్యం.

జానపద సాహిత్యం అనేది ఎప్పుడు ఎక్కడ ప్రారంభం అయ్యిందో ఖచ్చితంగా చెప్పడం కష్టం. ప్రాచీన కాలంలో మానవులు సంఘజీవులుగా ఉండేవారు. సమూహాలుగా జీవనం సాగించేవారు. అలాంటప్పుడు వాళ్ళు వేడుకలు, ఆటలు, పాటలు అన్నీకూడా సమూహాలుగా నిర్వ హించేవారు. జానపద సాహిత్యం చాలా ప్రాచీనమయిన సాహిత్యం. అలాగే సమిష్టికర సాహిత్యం. ఇది సమూహాల నుండి ఉద్భవించబడే సాహిత్యం అని చెప్పవచ్చు. మనసు ఆలోచనలను, అనుభవాలను భావాలను సమూహాలుగా సరళంగా వ్యక్తీకరిస్తారు. జానపద సాహిత్యం లోని ఒక్కోగేయం, కథ, సామెతల వెనుక ఖచ్చితంగా ఒక ఇతివృత్తం ఉంటుది. ఈ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వల్ల ప్రాచీన నాగరిక సమాజం ఆచారాలు, సంప్రదాయాలు సంస్కృతులు తెలుసుకోవచ్చు ఆ రోజుల్లో సామాజిక స్థితిగతులను తెలుసుకోవచ్చు. ప్రాచీన సంస్కృతి కాలక్రమంలో కనుమరుగు కాకుండా చూసు కోవచ్చు. సమాజ వాస్తవిక జీవన చిత్రణ అనేది ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న శిష్ట సాహిత్యం కన్నా జానపద సాహిత్యం ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. ఇది ఒక సాహిత్యం మాత్రమే కాదు ఇది ఉల్లాసానికి, మనో వికాసా నికి, సమిష్టి తత్వానికి, సంప్రదాయ విజ్ఞానానికి తోడ్పడు తుంది. జానపద సాహిత్యంలోని జానపద గేయాలు సాంస్కృతిక కళలు, కళారూపాలు అన్నీ కూడా మానవ శ్రమ నుండి ఉద్భవించినవే. మానవ వికాసంలో భాగంగా శ్రమనుండి సేద తీరడానికి శ్రమ జీవులే వీటిని సృష్టించు కుంటారు.

సహజ వాతావరణంలో ప్రకృతి ఒడిలో పాటలు అల్లిన వీరు చెట్టు నుండి పుట్ట వరకు అన్నింటినీ తమ జాన పదంలో ఇనుమడింప జేసారు. అదే విధంగా బతుకు దెరువులో భాగంగా సంచార జీవనం సాగించే సంచార జాతులు అనేక ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను పాటలుగా అల్లి సమాజానికి జ్ఞానం అందించేవారు అలాగే గొర్రెల కాపర్లు, గొల్ల కుర్మలు చెప్పే ''ఒగ్గు కథ''ను కూడా చెప్పవచ్చు. జానపద సాహిత్య పరిశోధనలో భాగంగా ఇప్పటికీ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. జానపద సాహిత్య అన్వేషణలో అమూల్యమైన సేవలందించిన వారిలో బిరుదురాజు రామరాజు ''జానపద గేయ సాహిత్యం'', నాయని కృష్ణకుమారి ''జానవద గేయ గాధలు,'' మొదలినాగభూషణ శర్మ-''తోలు బొమ్మలాట'', చెలుకూరి నారాయణరావు-'తెలుగు సామెతలు'', ఆర్వీయస్ సుందరం- ''సుందర జానపదం'' ముఖ్యులు. అదేవిధంగా కొలకలూరి ఇనాక్ గారు చేసిన-జానపద సాహిత్య విమర్శ అనేది ప్రత్యేకమయిన ప్రక్రియ అని చెప్పవచ్చు.

జానపద కవిత్వంలో కర్త, క్రియ, ప్రచారం అన్నీ కూడా సామూహికం. దీనికి మౌఖిక వ్యక్తీకరణ సంప్ర దాయాల లక్షణాలు ఉంటాయి. ఈ జానపద కవిత్వాన్ని గేయం, కథాగేయం అని రెండు విధాలుగా విభజించ

వచ్చు. అదే విధంగా జానపద గేయాల్లో కథ ఉండదు. కేవలం ఆత్మ పరత్వం ఉంటుంది.

ఉదాహరణకు :

"ఏటి కేతం బెట్టి యెయిపుట్లు పండించి
ఎనడూ మెతుకెరగ నన్నా
నేను గంజిలో మెతుకెరగనన్నా"

అని రైతు తన వాస్తవ పరిస్థితిని తన పొలంలో గట్లు కడుతూ నీళ్ళు పెడుతూ పాడుకోవడంలో రైతు ఆత్మ పరత్వం కనిపిస్తుంది.

జానపద సాహిత్యంలో విశేషమయిన సేవలందించిన ఆర్వీయస్. సుందరం గారి రచనలను, గ్రంథాలను చూస్తే సుమారు 50 సంవత్సరాలకు పైగా రాయడం, చదవడమే జీవన విధానంగా గడిపారు. బోధనా వృత్తిని కొనసాగిస్తూ వందకు పైగా పుస్తకాలు ప్రచురించారు. సుందరం గారు రాసిన "తెలుగు కన్నడ జానపద గేయాలు' అనే సిద్ధాంత గ్రంథానికి మైసూరు విశ్వవిద్యాలయం వారు 1973 సం॥లో పిహెచ్.డి ఇచ్చారు. జానపద విజ్ఞానంలోని అన్ని శిఖరాలను వెలుగులోకి

తెచ్చే "ఆంధ్రుల జానపద విజ్ఞానం" గ్రంథానికి డి.లిట్ 1987లో ఇచ్చింది. ఇన్ని రచనలు చేసి పదవి విరమణ చేసిన తరువాత కూడా పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం వారు సందర్శకాచార్యుడు (గెస్ట్ ప్రొఫెసర్)గా సుందరం గారి బోధనా అనుభవాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆయన రచించిన "తెలుగు - కన్నడ జానపద గేయాలు" మైసూరు విశ్వవిద్యాలయం నుండి 1973 సం॥లో వ్యావహారిక భాషలో తెలుగులో వెలువడిన మొట్టమొదటి సిద్ధాంత వ్యాసం. తెలుగు జానపద సాహిత్య పరిశోధనలో మొదటి పరిశీలన గ్రంథం కూడా ఇదే. ఆర్వీయస్ సుందరం జానపద గేయాలపై తన అభిరుచిని ఈ విధంగా తన సిద్ధాంత గ్రంథం ముందుమాటలో వ్యక్తపరుస్తాడు.

"పల్లె పాట పాడితే లయ
కడలి పొంగి పొర్లిగే లయ
గుండె కోయిల కూస్తే లయ
మొన్న పుటెటన పువ్వు నవ్వినా లయ
నిన్న పూచిన పువ్వు రాలినా లయ
కాల పురుషుని గమనంలో లయ
తీపి తలుపుల మననంలో లయ
లయాత్మక జీవనంలోని
అనుభవాల - అనుభూతుల
ఈ అభివ్యక్తి
నా మనోలతలో నిశ్చలంగా నిలిచిన
అలరులకే అంకితం"

అని జానపద సాహిత్యంపై తన మనుసులోని భావాలను వ్యక్తపరుస్తాడు.

జానపద గేయాలను తన అనుభవరీత్యా అనేక పరిశోధనల అనంతరం ఎనిమిది రకాలుగా విభజించాడు. అవి పనిపాటలు, పారమార్థిక గేయాలు లేదా భక్తి గీతాలు, బాంధవ్య గేయాలు, పిల్లల పాటలు, వేడుకపాటలు, వలపు పాటలు, హాస్య గీతాలు, కన్నీటి పాటలు.

పని పాటలు :

పనిపాటల్లో రైతులు పొలంలో పని చేసేటప్పుడు పడవ ప్రయాణాల్లో అలసట ఎక్కువవుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎక్కువవుతాయి గుండె వేగంగా కొట్టు కుంటుంది. అలాంటప్పుడు పాటలు పాడడం ద్వారా అలసటను తగ్గించుకొని శ్రమను మర్చిపాయి మానసి కంగా దృఢంగా ఉండడానికి ఉపయోగపడుతుంది. ఇటువంటి పాటలకు శబ్దాలు ఉంటాయి. కానీ పదజాలం ఉండదు. ధ్వని అనుకరణలు ఎక్కువగా ఉంటాయి.

ఉదాహణకు :

"ఏ లస్సా ఓలెస్సా ఏ లెస్సా ఓ లెస్సా
ఏ ఎలస్సాలో ఓలెస్సా ఏ లెస్సాబో ఓలెస్సా"
"ఏలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా
ఏలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా
ఏలా ఏలా జోర్సెయ్ బార్సెయ్"

ఇలా శ్రమ జీవులు తమ శ్రమను, అలసటను తీర్చుకోవడానికి పాడుకుంటారు. ఈ పాటలను రైతులు నీటిని తోడేటప్పుడు అదేవిధంగా పడవ ప్రయాణాల్లో పాడుకుంటారు. కూలీలు పెద్దపెద్ద బరువులు లేపేటప్పుడు, (ఉదా॥ కరెంటు స్థంబాలు ఎత్తేటప్పుడు) బండ్లు లాగేటప్పుడు.

పడవ పాటల్లో వేదాంతం కూడా పుష్కలంగా ఉంటుంది. కను చూపు మేర ఉండే సముద్రంలో మెల్లగా అలల మధ్య ఊగుతూ సాగే చిన్న పడవను ఏ క్షణంలో ఏగాలి ఎటువైపుకు ముంచుతుందో తెలియని స్థితిలో వేదాంతం గుర్తుకు వచ్చి ఇలా పాడుతుంటారు.

"గట్టెక్కుతాదా నా తెప్ప?
కల్లోల జలధిలో మునిగిపోతుందా
కొక్కరోకోమంచు కోడి కూయంగానే
దేవుడిచ్చిన నిద్ర తేలింది రాయంటు
చలిగాలిలో వళ్ళు సవరించుకొంటూ
చద్దిగట్టుక నేను చక్కవచ్చాను"

ఇలా పాట సాగే కొద్దీ వేదాంతం కనిపిస్తుంది. ఈ పడవ పాటల్లో మామూలుగా కనిపించే ఊత పదాలు హైలెస్సో, ఏలేయాలా, జోరుసెయ్యి, బారుసెయ్యి, జాలుమాలి మొదలయినవి.

నిర్మాణ రంగంలో కాంక్రీటు పనులు చేసేటప్పుడు మగవాళ్ళు, ఆడవాళ్ళు పల్లెలో ఆడుతూ పాడుతూ పనిచేసేసమయంలో

"ఏయూరు, భామా
గుంటూరు నాది
ఏమి నీ, పేరు
పేరు గు, న్నమ్మ"

అని పాడుతుంటారు ఈ పాట పూర్తయ్యేసరికి నాలుగైదు పారల మట్టి పోగు చేస్తారు.

భక్తి గీతాలు :

సహజంగా గ్రామాలలో ఉత్సవాలు నిర్వహించేటప్పుడు కొన్ని ప్రత్యేక సందర్భాలలో కోలాటం ఆడుతుంటారు. ఈ కోలాటం ప్రారంభించేటప్పుడు గణపతిని కొలుస్తారు. అందరూ సమూహంగా ఆడే ఆట కనుక ఒక్కో కులం వారు ఏవిధంగా ఈ గేయంలో కొలుస్తారో తెలుస్తుంది.

"గణ నాధ నిర్గుణ గణనాధ
గజ్జమూర్తి మొదలింగ గణనాధ
తీడ్లమూతొ నీరు తెచ్చి గణనాధ
తోరంపు బొజ్జాలు కడిగి గణనాధ ॥ గణ॥

అయ్యవార్లు నిన్నే గొల్వ గణనాధ
వాళ్ళు పంచాగమున ఉందువయ్య గణనాధ ॥ గణ॥

కొమిడి వాళ్ళు నిన్నే గొల్వ గణనాధ
వాళ్ళు తక్కిండందే వుందువయ్య గణనాధ ॥ గణ॥

కాపువారే నిన్ను గొల్వ గణనాధ
వాళ్ళ కాడి మేడి నుందువయ్య గణనాధ ॥ గణ॥
(గంగన్న, కోమ్మేసల్లి,చిత్తూరు జి॥)

ఇలా ఆడుతుంటూ ఆ సమూహం, గ్రామాల్లోని, ఐక్యతను తెలుపుతుంటారు.

అదే విధంగా పంటకోతల సమయంలో, ఇళ్ళు కట్టుకునే సందర్భంలో గణనాధుని ధ్యానిస్తూ, కొలుస్తూ

"గనపతయ్య గనపతయ్య
ఉండ్రాళ్ళు నీకు పోతురా ఓ గనపతయ్య
మంద కొడిగ ఉండ బోకురా"

అని పూజలు చేసే సమయంలో గణపతిని ఆరాధిస్తారు.

బాంధవ్య - గీతాలు :

ప్రాచీన కాలం నుండి కుటుంబ వ్యవస్థ ఉండేది. అవి ఇప్పటి కుటుంబాలుగా కాకుండా కలిసి ఉండే గుణంతో సమాజంలో ఒక భాగంగా ఉండేవి. అలా కొన్ని కుటుంబాల వాళ్ళు అంతా ఒకే చోట నివసించేవారు. అలాంటి వ్యవస్థలో స్త్రీ ప్రముఖ స్థానంలో ఉండేది

వ్యక్తులను ఆదర్శ ప్రాయంగా తీర్చిదిద్దడంలో అమ్మగా, భర్తను ఆప్యాయంగా చూడడంలో కోడల్ని అదుపులో పెట్టడంలో ఇలా ఎన్నో రూపాల్లో స్త్రీ సాక్షాత్కరిస్తుంది.

ప్రపంచంలో ఏదేశంలోనైనా మానవ జన్మకు కారణ మైన తల్లికి ప్రత్యేక స్థానం ఉంది అది ఒక పవిత్ర స్థానం. అలాంటిది బిడ్డలు లేని గొడ్రాలికి ఆ గౌరవం ఉండదు. పిల్లలు లేని వాళ్ళు ఎదురుపడితే అశుభంగా పరిగణిస్తారు. వాళ్ళ నీడ వాళ్ళ మీద పడడం కూడా వారు సహించరు. అ సమయంలో నిర్వేదంతో కూడిన బాధలో నుండి ఆవేదనతో ఆ గొడ్రాలు పాడుకునే పాట

"పసుపు కుంకుమలకు పోలేను నేను
పసి బిడ్డలను నేను ఎత్తుకోలేను
ఇల్లు కలకలలాడ చూడంగ
ఒక్క బిడ్డనైనా ముద్దాడ లేను
గొడ్రాలి బతుకయ్యే గౌరవం లేదయ్యే"

(సీతమ్మ, సూళ్ళూరుపేట)

అనే ఈ పాటలో ఒక గొడ్రాలు బిడ్డలకోసం ఎంతగా పరితపిస్తుందో, బిడ్డలు లేని కారణంగా తను ఈ సమాజంలో ఎలాంటి వివక్షకు గురౌతున్నానో తెలుపు తుంది. ఈ పరిస్థితులు నేటికీ ఈ సమాజంలో ఉన్నాయి.

అత్త కోడళ్ళు సంబందం గురించి చెబుతూ ఈ సంస్కృతి ఒక మాయని మచ్చ అని చెప్పవచ్చు. కోడలిని ఎప్పుడూ అదుపులో పెట్టాలనే భావనలో అత్త పెత్తనం చేయడం జరుగుతుంది. అందరూ అలా ఉండరు కానీ! సమాజంలో ఉన్న సాధారణ అభిప్రాయంను పరిగణలోకి తీసుకుంటే "అత్తలేని కోడలుత్తమురాలు, కోడలు లేనత్త గుణవంతురాలు" అంటారు.

ఇక్కడ నిత్యం ఆరడి చేసే అత్తతో ఒక కోడలు ఈ విధంగా అంటుంది.

"అత్తగారా రావమా ఆరడి చేయకమ్మా
ఒత్తులు ఒత్తకమ్మా ఒత్తిగిలి ఉండాలమ్మా?
కొడుకులు గన్నానంటూ
కోమలి పొంగాకమ్మా

(కామమ్మ, నెల్లూరు)

ఈ విధంగా కోడలు అత్తతో తన మనుసులోని భావాలను తెలియజేస్తుంది.

అదే విధంగా అత్తమామలు అంటే గిట్టని కోడలు వాళ్ళను లక్ష్యంగా చేసుకొని అపహాస్యం చేస్తుంటారు.

"మాయత్త మా మామ ఊరేగుతుంటే
చుట్టపీకలు రెండు చూడొచ్చినాయి
మట్టగిడసలు రెండు మాట్లాడినాయి
కందిరీగలు వచ్చి కత నడిపినాయి
బోదురు కప్పలు వచ్చి భాగోతమాడు"

అంటూ ఇరుగు పొరుగు వారితో తన అత్త మామ లను ఎగతాళి చేస్తూ తన కోపం, వారితో పంచుకుని ఆనందిస్తుంది.

పిల్లల - పాటలు :

పిల్లల పాటలు రెండు రకాలు. అవి పెద్దలు పిల్లల కోసం పాడేవి. ఇంకొకటి పిల్లలు తమకు తామే అల్లుకుని పాడుకునేవి. పెద్దల పాటల్లో లాలిపాటలు, జోలపాటలు ఉంటాయి. ఈ విధమయిన లాలి పాటల్లో స్తుతి రూపంలో ఉండేవి కొన్ని తల్లి తన బిడ్డను లాలిస్తూ దైవ సమానుడు అని రాముడు అతనే, కృష్ణుడు అతనే అని దశావతారాలు ఎత్తిన విష్ణుమూర్తి అతనే అని పాడు తుంది.

"లాలి రామన్నలాలి - ననుగన్న బాలగోపాలలాలి
లాలితామరలాలి-నానోము పంట భాగ్యంబలాలి
ఏచి సంద్రమునజొచ్చి-మీనమై సొచ్చి సోమకుని జంపి
తెచ్చి వేదములనెల్ల -నజునకు నిచ్చిన దేవలాలి. . ..

(గంగన్న, కోమేపల్లి, చిత్తూరు)

అంటూ పాడే ఈ పాటలో ఒక తల్లి తన బిడ్డలో భగవంతుణ్ణి చూస్తూ లాలి పాట పాడుతుంది.

అదేవిధంగా బిడ్డను ఉగ్గు పోసేటపుడు, నిద్ర పుచ్చుతూ, అనేక పాటలు పాడుతుంది. ఉగ్గు పాలు

పోసాక, ఉగ్గు గిన్నెను ఒక సారి బిడ్డ చుట్టూ తిప్పి గొంతు దగ్గర నుండి బొజ్జ వరకు నిమురుతూ

"జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుర్రం తిన్న గుగ్గిళ్ళు జీర్ణమై
ఏనుగు తిన్న వెలక్కాయ జీర్ణమై
భీముడు తిన్న పిండి వంటలు జీర్ణమై . . .

అంటూ పాడుతుంది.

అదే విధంగా తిండిబోతు పిల్లలు సోమరి పిల్లలపై పాటను చూస్తే.

"నీళ్ళకు బోరా తిమ్మ
నిద్ద రాస్తాదమ్మ
కట్టెలు తేర తిమ్మ
కడుపు నస్తాదమ్మ
గట్టుకు బోర తిమ్మ
నడుము నస్తారమ్మ"

అంటూ నెల్లూరు ప్రాంతంలోని వారు పాడుకుంటుంటారు.

వేడుకల - పాటలు :

సహజంగా ఈ పాటలు పెళ్ళిళ్ళలో, పండుగల్లో, శుభకార్యాలలో పాడుతుంటారు. పెళ్ళి చూపులలో పెళ్ళి కూతురుని చూపించమనే సందర్భంలో పెళ్ళి కూతురు మాట, చూపు, ఏవిధంగా ఉందో చూడాలని పాడుకునే పాట.

"పిలిపించు నీ సీత పిలుపు చూతాము
పిలుపేమి సూసేపు చిలుక పలుకుల్లూ
పిలిపించు నీ సీత నడక చూతాము
నడకేమి సూసేపు అంస నడకల్లూ
మీ సిరిబాల సీత ఉందని
మా అయోధ్య రామునికి అడగనొస్తి
మా సీత సిన్నాది మేమియ్య లేదు
సీతకన్న సిన్నోడె అయోధ్య రాముడు
(తాయమ్మ, రామపురం, కోవారు జి॥)

అని ఆడపిల్ల తరుపువారు గర్వంగా చెప్పుకుంటూ పాడుతూ సీత పెళ్ళికూతురుగా రాముడు పెళ్ళి కొడుకుగా అభివర్ణిస్తూ నిత్యజీవితంలో జానపద గేయాన్ని భాగంగా చేసుకున్నారు.

అదే విధంగా అప్పగింతలు సమయంలో కరుణరస పాటలు, అప్పగింతల పాటలు ఉంటాయి. అలాంటిదే

"అత్తమామలు గాని ఆడబిడ్డలు గాని
లేరమ్మ, నీదెంత పున్నెమోగాని
మగడు ఒక్కడు గానమనసు కెక్కినయట్లు
మర్దించి నీ వశము చేసుకోవమ్మ"

అని ఒక తల్లి తన కూతురుని అత్తగారింటికి పంపే సందర్భంలో అత్తగారింట్లో ఉన్న పరిస్థితుల్ని చెబుతూ భర్తను తన వశం చేసుకోవడానికి సలహాలు ఇస్తుంది.

వలపు - పాటలు :

సహజంగా ప్రియురాలి మనోభావాలను అత్యద్భుతంగా చిత్రించే గీతాలలో "చల్ మోహన్‌రంగా" పాట ముఖ్యమయినది జానపదుల. ముద్ద భావనలను కురిపించడంలో ఈ పాట ప్రత్యేకత వేరు.

"కంటికి కాటుక బెట్టి కడవ చంకానుబెట్టి
కళ్ళ నీళ్ళు ఉడవ నిండెను గదరా
చల్ మోహనరంగా
కళ్ళునీళ్ళు కడగ నిండిను గదరా"

అని విరహంతో కూడిన వలపు పాటను చూడవచ్చు.

అదే విధంగా ప్రియుడితో ప్రియురాలు రేపే వలపుల తలపులు ప్రియునికి ఆనంద లహరులుగా బాసిస్తాయి. ప్రియురాలు ఓరచూపుతో ప్రియున్ని చూస్తూ నవ్వినప్పుడు

"నన్ను చూసి నవ్వింది దేశోళ్ళ చిన్నది
మెట్టా యెట్టిండీ- అహ మేలు కళ్ళది పెద్ద ॥మేలు॥
సట్టి సేత బుచ్చుకోని సాగెడుతుండీ
మిట్లపల్లలాగ మిడిసి మిడిసి పడుతుండీ ॥ నన్ను॥
కోక కట్టుకుంది సెవ్వాకు లెట్టుకుంది - కొత్త
ఎల్లిక ఎల్లోరి ఎల్లు ఎల్లుమన్నది ॥ నన్ను ॥
సల్లగ బైతాకు తేను పల్లకునదీ ॥ నన్ను ॥

ఈ విధంగా ప్రియురాలి ఓర చూపుతో వలపుల లాహిరిలో జీవిస్తూ ప్రియుడు పాడుకుంటాడు.

అదేవిధంగా సంసారంలో వచ్చే చిన్న చిన్న కలహాలతో భార్యభర్తలు అరచుకొని అలుగుతుంటారు. కొద్ది సమయంలోనే ఈ కలహాలు, అలకలు మాయమౌతాయి అలాంటి ఒక సందర్భంలో

"వంకాయ వండాను, వరికూడు వార్చాను
తినమని చెప్పవే తడికా తడికా
వగలాడి మాటలకు వళ్ళంత మండింది
వద్దని చెప్పవే తడికా తడికా
పట్టు చీర తెచ్చాను పెట్టెలో పెట్టాను
కట్టమని చెప్పవే తడికా తడికా
చీరకంచులు లేవు చుట్టు చెంగులు లేవు
వద్దని చెప్పవే తడికా తడికా
సంతోకి వెళ్ళి సరిగంచు చీరను
అద్దాల రవికను అతివ తెచ్చెద ననవె"

అంటూ ఒక్కో సారి ఇద్దరి మధ్య మాట పట్టింపులు ఉన్నప్పుడు సంభాషణలు నేరుగా సాగవు అలాంటి సందర్భంలో వారికి ఏ గోడనో, ఏ తడికనో మధ్యవర్తిత్వం వహిస్తుంది.

హాస్య - గీతాలు :

వినోద పాటలను ఎక్కువగా ఆనదించేది పిల్లలు, వాళ్ళకు ఎక్కువగా కావలసింది నవ్వుల పాటలు, గ్రామాల్లో అయ్యవారిని అయ్యవారి పెళ్ళాన్ని ఎగతాళి చేసే ధైర్యం ఒక్క పిల్లలకే ఉంటుంది. అలా సరదాగా ఆటపట్టించే సందర్భంలో

"అయ్యగారయ్య గారంతంత
అయ్యగారి పెళ్ళాం ముంతంత
ముంత కొంట బోయి మూలకు పెడితే
నక్కెత్తుక పోయెరా నారాయణా
నారాయణాని నారకు పోతే
గొడ్డలి పోయెరా గోవిందా
గోవిందా అని గోడ కొరిగితే
పెల్లగూలెరా పెరుమాండ్లూ
పెరుమాండ్లాని పెండకు పోతే
అవుదన్నె రా అనుమాండ్లూ
అనుమాండ్లాని అంగడికి పోతే
గొంగడి పోయెర శివలింగా. ... .

అంటూ హాస్య భరితంగా పాడుకుంటారు.

కరుణ గేయాలు - కన్నీటి పాటలు :

ఇవి కరుణరసం ఇతివృత్తంగా ఉంటాయి. ఇవి అన్నీ కూడా కన్నీటి పాటలే వీటిలో ఎక్కువగా పెండ్లి సమయంలో అప్పగింతల పాటలు. పెండ్లి జరిగినంత సేపు ఆనందంగా గడిపిన వారు చివరి ఘట్టం అప్పగింతలు విషయంలో అంతా కన్నీళ్ళతో శోకసంద్రంగా మారిపోతారు. అలాంటి సందర్భంలో

"సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినాము
చెలగి మీ అత్తింట బుద్ధిగలిగుండు
ఎవ్వరే మాడిన ఎదురాడకమ్మ
వీధిలో నిలుచుండి కురులిప్పకమ్మా
పలుమారు పలుదెరచి నవ్వబోకమ్మా
పరమాత్మతో గూడి వెలుగు మామమ్మా"

అని అత్తవారింటికి తన కూతురును సాగనంపే సందర్భంలో ఒక తల్లి తన కూతురుకి సుబుద్ధులు చెబుతూ కన్నీటి పర్యంతమవుతుంది.

అదే విధంగా భూస్వాములకు పేదవారికి జరిగిన పోరాటంలో 1880-1925 మధ్య కాలంలో ఒక యదార్థ గాధ జరిగింది. విప్లవ వీరుడు నాగిరెడ్డి అతనంటే గిట్టని వారు ఆయనను చిత్రవధ చేస్తారు.అప్పుడు ఆ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఈ విధంగా పాడుకుంటారు.

"చుట్టూ ముట్టూ పల్లెలకెల్ల శూరుడమ్మ నాగిరెడ్డి
డెబ్బైయేడు పల్లెల కెల్ల దేవుడమ్మ భీమలింగ
రామ రామా కోదండరామా
బైరామా రామా కోదండరామా
పక్క నున్న పల్లెల కెల్ల పాళెగాడు నాగిరెడ్డి" .....

అంటూ తమ కోసం భూస్వాములతో ఎదురుతిరిగిన నాగిరెడ్డి సామాన్యులకు దైవం అని వారి కోసం పుట్టిన దేవుడని అటువంటి నాగిరెడ్డి బండి మీద వస్తుంటే నాలుగు దిక్కుల నుండి నలుగురు చుట్టు ముట్టి చిత్ర వధ చేశారని పాడుతారు.

ఈ విధంగా ఆర్వీయన్ సుందరం గారు జానపద సాహిత్య స్వరూపాలను, కాలక్రమంలో వివిధ ప్రాంతాలలో ఏవిధంగా అవి ఇప్పటికీ సజీవంగా ఉన్నాయో పరిశోధించారు. జానపద సాహిత్య అధ్యయనం అనేది అంతసులువైన విషయం కాదు. ఎన్నో వ్యవ, ప్రయాసలకు ఓర్చి ఆర్థిక వనరులను సమకూర్చుకొని ఒక తపస్సులాగా సమాచార సేకరణ చేసేవారు. ఈ సాహిత్యం ఎక్కువగా పల్లెల్లో, గిరిజన ప్రాంతాల్లో ఉంటుంది కనుక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది. జానపద సాహిత్యానికి విశేష సేవలందించిన సుందరం గారు జానపద గేయ సాహిత్యం తెలుగు నాట ఎన్ని రూపాలలో, పాటల రూపంలో ఉందో విపులంగా విశదీకరించి వర్గీకరించి చెప్పడం జరిగింది. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే దృక్పథంతో, దృఢసంకల్పంతో చేసిన నిర్విరామ కృషి ఫలితంగా మనం, ఇలాంటి సమాచారాన్ని పొందగలుగుతున్నాం. అలాంటిది ప్రాచీన సాహిత్యం సంరక్షణలో జానపద సాహిత్య వైభవంను కాపాడడంలో మనవంతుగా ప్రయత్నం చేయాల్సిన అవసరం మనపై ఎంతైనా ఉంది.

ఉయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ డ్వా.నా. శాస్త్రి., ముద్రణ, సెప్టెంబర్ 2016.
2. తెలుగు-కన్నడ జానపద గేయాలు - ఆర్వీయన్ సుందరం, ముద్రణ, ఏప్రిల్ 2017.
3. నవతెలంగాణ దినపత్రిక - అంతర్జాల సమాచారం, ఆగస్టు 21, 2016.

❖ ❖ ❖

జానపద సాహిత్యంలో సుగాలీల మౌఖిక గేయాలు

– డా॥. భూక్యా జ్యోతి, సహాయ ఆచార్యులు, యస్.ఎల్.యస్. డిగ్రీ కళాశాల, పుల్లారెడ్డి పేట, దువ్వూరు, కడప జిల్లా.

సుగాలీలకు మౌఖిక భాష తప్ప ధృవీకరించబడిన లిపి ఇప్పటి వరకు లేదు. సుగాలీల సాహిత్యం మౌఖిక రూపంలోనే లభ్యమౌతుంది. ఈ గిరిజన సాహిత్యంలో గేయాలకు విశిష్టస్థానం ఉంది. ఆదిమానవుడు సమిష్టిగా జీవించాడు. మొదట ''సామాజిక జీవనం వల్ల తన భావాలను తోటివారితో చెప్పుకోవలసిన అవసరం ఏర్పడింది. మానవుడు భూమిమీద సైగలతో, సంకేతాలతో ప్రారంభమై క్రమక్రమంగా అభివృద్ధి చెంది శబ్దాన్ని ఉపయోగించడం మొదలు పెట్టాడు. ఆ శబ్దాలను రూపకల్పన చేయడం, మేధాశక్తికి, ఆలోచనలకు పదును పెట్టడం ప్రారంభమైంది. సుఖమో, దు:ఖమో అతని ఉద్విగ్న హృదయం నుండి లయాన్వితమైన గేయమో, గేయపాదమో వెలువడుతుందని, ఇది ప్రజల నోళ్ళల్లో నాని పెరిగి తిరిగి స్వయంభువుగా నిలుస్తుంది''

సుగాలీల మౌఖిక గేయాలు చాలా ప్రాచీనమైనవి. వీరిలో సాహిత్య ప్రియులు, నాట్య ప్రియులు, మేధావులు ఉండడం వల్లనే ఇప్పటికీ లిపి లేకపోయిన సాహిత్యం బతుకగలుగుతున్నది. సుగాలీల భాష ఎంత ప్రాచీనమైందో వీరి గేయం కూడా అంతే ప్రాచీనమైనవి. మానవుని సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి నాంది వీరి భాష. సుగాలీల మౌఖికగేయాల్లో శృతి, లయ, భావానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఈ మూడు గిరిజన సాహిత్యానికే కాక ఏ ఇతర భాష సంగీతానికైనా, జానపద సంగీతానికైనా మరియు శాస్త్రీయ సంగీతానికి కూడా ముఖ్యమైనవి. మొదట రాజరికం అనుభవించిన సుగాలీలు తరువాత కాలంలో అడవులకు పరిమిత మయ్యారు. కొండలలో కొనలలో అనేక రాగాలతో గేయాలను పాడుకుంటూ దైనందిన అభివృద్ధి చెందుతూ జానపదునిగా, నాగరికునిగా, గిరిజనుడు ఎదిగాడు. అందువల్లనే నేటి శాస్త్రీయ సంగీతానికి, గేయ ఆవిర్భావానికి గిరిజనుడే మూలం అని చెప్పవచ్చు. ఆ గేయాలలో తాళ, లయలు, శాస్త్రీయ సంగీతానికి ఛందస్సుకు మూలమైనాయి. నాటి వారి జీవన విధానంలోని కొన్ని ఆచారాలు, సంప్రదాయాలను గమనించవచ్చు. సుగాలీలలో గేయాలు చాలా వరకు వారి సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఏర్పడటం గమనించవచ్చు.

హోలీ పండుగ గేయాలు :

సుగాలీలు హోలీ పండుగను చాలా శ్రద్ధాభక్తులతో జరుపుతారు. వీరు జరుపుకొనే హోలీ సామాన్యంగా మాఘపాల్గుణ మాసాలలో వస్తుంది. హోలీని మూడు ప్రముఖ దినాలలో వచ్చిందని బావిస్తారు. సుగాలీలు హోలీనీ హోలీర్ పాక్ అంటారు. అనగా చంద్రుడు మొదటి రోజు కనబడినప్పటి నుండి పౌర్ణమి వరకు మొత్తం 15 రోజులు ఆనందంతో, ఆటపాటలతో తండా వీధులలో వచ్చి రాత్రి వెన్నెలలను అనుభవిస్తూ గోర్‌మాటీ (మగవారు) ఒకప్రక్క గోర్‌బాయి (ఆడవాళ్ళు) ఒక ప్రక్క పాటలు పాడుకుంటూ, డ్యాన్సులు, భజనలు నంగారా శబ్దాల మధ్య వృత్తాకారంలో చేతులను, కాళ్ళను వివిధ రకాలుగా మార్చుతూ ఆటలు ఆడుతూ గేయాలాపనలు చేస్తారు. మధ్య మధ్యలో పురుషులు తమ వరుసలోకి స్త్రీలను తీసుకువచ్చి రసవత్తరంగా మలుస్తారు. పుత్ర సంతానం లేని స్త్రీలను ఆశీర్వదిస్తారు. హోలీ నందర్భంగా పురుషులు, స్త్రీలు ఒకరికొకరు ఆపాదిస్తూ పాటలను పాడుకుంటూ ఆనంద డోలికలలో మునిగి తేలుతారు.

హోలీ పండుగ సందర్భంలో సుగాలీలు ఈ క్రింది విధంగా గేయాలను పాడుకుంటారు. ఇవి వ్రాత పూర్వకంగా లేనప్పటికీ నిరక్షరాస్యులు కూడా పాడుకోవడానికి సులభంగా ఉంటాయి. ప్రతి గేయానికి ఒక

ప్రత్యేకత, భావకత, సామాజిక విలువలను పెంపొందిస్తూ సమాజంలోని లోటుపాట్లను మరియు సుగాలీల యొక్క బలాలు బలహీనతలను సృజనాత్మకంగా వినసొంపుగా ఉంటాయి. సేవాలాల్ పై ప్రచారంలో ఉన్న ఒక పాటను పరిశీలిస్తే.

"అసి నంగరిమా సేవాలాల్ బేటోజోరే!
మార్ ఝూడవేరి దేవేరి! ధరమేరి జయబోలో లచమణ బాలాజి!
ఆప్ నగరిమా సేవా సూఖా బేరజగో!
మార ఝుడవేరి దేవహి, చరమేరి జయబొలో లచమణ బాలాజి!
అసి నంగరే మా హేలా నాయక్ వేరజగే!
మార ఝుడవేరి నాయకోరి సతవేరి జయబోలో లచమణ బాలాజి!
ఆసి నంగరేమా తులజా భాయి వరాజి!
మార ఝుడవేర దేవేర, ధరమేరి జయబోలో లచమణ బాలాజి!

భావం :

సుగాలీలలో రంగురంగుల హోలీ పండుగే కాకుండా, వారి దైవాలయిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సీత, పార్వతి వారితో పాటు బాలాజీ (శ్రీవేంకటేశ్వరస్వామి), సేవాలాల్ కొద్దిమంది అవతారపురుషులను కొలుస్తూ కుటుంబాన్ని గొడ్డు, గోదాను చల్లగా చూడమని పాడుతారు.

దేవతా సంబంధం గేయాలు (దేవళుర్ గీద్) :

మనదేశంలో మాతృదేవతారాధనకు ముఖ్య నిదర్శనం గ్రామ దేవతారాధన ఇదే జానపదుల వేదిక. పురుష దేవుళ్ళైన త్రిమూర్తులకన్నా గ్రామదేవతలకే అధిక ప్రాముఖ్యాన్నిస్తూ వింత వింత గాథలు చెబుతూ వింత గొలిపే ఆచారాలతో విందులు చేస్తూ జాతరలు చేస్తుంటారు. మనదేశంలో కులవ్యవస్థ బాగా ప్రబలింది. కొన్ని ప్రత్యేక కులదేవతలను సృష్టించుకోవడం కూడా జరిగింది.

తండా సంస్కృతిలో సుగాలీలు మారెమ్మ తల్లికి నైవేద్యం పెట్టి పూజించేటప్పుడు వారు చేసే ప్రార్థన తెలుగువారికంటే భిన్నంగాను చాలా విశిష్టతను సంతరించుకుని ఉంది. దేవుని ముందు భక్తులు చేతులు జోడించి నాయకుడు మధ్య నిలబడి చేతులు జోడించగా నాయకుడు మధ్య నిలబడి తండావారి అందరికోసం ప్రార్థిస్తాడు. వీరి ప్రార్థన ఈవిధంగా ఉంటుంది.

"సాయివేస్ యాడి హమర మారెమ్మయాడి
కచ్చాబచ్చాన సాయి వేసయాడి
హమార ఘరేన హరోబరో రకాడేస్ యాడి
దొక్కెన దూర్ కరేస్ యాడి
సావుకార్న సమ్మేక్ రకాడేస్ యాడి
హమేన సాయి వేస్‌యాడి
ఏ వర్సెదాడేరో పండగార్ పూజ
తోన పూజా కరూ యాడి"

భావం :

మారెమ్మా! మా తాండా ప్రజలు నిన్ను భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. కాబట్టి మా పిల్లా పాపలను పశువులను చల్లగా చూడమని, ఇళ్ళు పంటపొలాలు పచ్చగా ఉండాలని రోగాలు రాకుండా తమని కాపాడమని ఇంటిలో కుండలు నిండుగా వుండాలని ధనవంతుడుని అన్నింటికి ముందుంచమని సంవత్సరంలో ఒక్కరోజు వచ్చే పండుగను మేము జరుపుకుంటున్నామని తమ ఆరాధ్య దైవాన్ని వేడుకుంటారు.

వేంకటేశ్వరస్వామి మఠం పాట :

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సుగాలీలు తన్మయత్వం పొంది ఆయన విశేషాలను, గొప్పతనాన్ని మరియు రూపురేఖల గూర్చి పాటరూపంలో తెలియజేస్తారు.

"బాలాజీ మఠేపర జాడకసేరో కసేరో
బాలాజీ మఠేపర నారళే నారళే జాడ
బాలాజీర పగడి సారిసో నేరో
సారి సోనేరొనజగ రూపేరో
బాలాజీర కిరీట సారి సోనేరో
సారిసోనేరోన జగరూపేరో
బాలాజీ మఠేపర జాడ కసేరో కసేరో
బాలాజీ మఠేపర పాన జాడ హూగరో
బాలాజీ మఠేపర సఫారీ జాడ హుగరో

బాలాజీ మటేపర జాడకసేరో కసేరో
బాలాజి మఠేపర పూల జాడరో పూలజాడ
ఓన్ తొడన్ బాలాజీర పగపర నాకా
బాలాజీర మఠమ సారిసోనేరోన
సారిసోనేరోన జగరూపేరో
బాలాజీర మటేప కావ్‌నో కాయి గాలరే
మల్‌కే మల్‌కేర్ అదమీ కాయిదొకరేచ"

ఐ తెరి ఆవత సేదా సేదా
జాగ లాబన ఛేనిరే సేదా సేదా
స్వామి వేసం లీదోర సేదా సేదా
సేదా సేదైయే బెగతూరి భాయ్ ఏ
ఐతెరి ఆవత సేదా సేదా
భీమాని తెరి ఆవత సేదా సేదా"

(సెదా = తీర్చిదిద్దడం)

భావం :

బాలాజీ మఠం మీద పూజకు కావలసిన టెంకాయ, ఆకు, వక్కలు, ఎర్రచందనం చెట్లు విరివిగా ఉన్నాయి. వెంకటేశ్వరస్వామి కిరీటం తళ, తళ మెరుస్తున్న వెంకటేశ్వర స్వామి కిరీటం బంగారు కాంతి లీనుతొంది. బాలాజీ మఠం మీద రకరకాల పూలచెట్లు వున్నాయి. వీటి నుండి కోసిన పూలు స్వామి బంగారు పాదాలకు సమర్పిస్తారు. బాలాజీ మఠం మీద పెద్దఎత్తున అన్నదానం జరుగుతున్న దని ఇక్కడకి ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు భక్తితో దేవదేవున్ని కొలుస్తున్నారు.

సేవాలాల్ జాతరపాట

"సేదా సేదైయే బెగతూరి బాయ్ ఏ
ఐ తెరి ఆవత సేదా సేదా
భీమాని తెరి ఆవత సేదా సేదా
బాపు బేటోరే సేదా సేదా
పర చోడ ఆనిరే సేదా సేదా
సోనేరి పడగేమ బేటోరే సేదా సేదా
సాపేరి పడగేమ సూతోరే సేదా సేదా
సేదా సేదైయే బెగతూరి భాయ్ ఏ

భావం :

ఈ గేయం జాతరకు సంబంధించింది. తమ పితృ దేవత ఐన సేవాలాల్‌ను స్మరించుకుంటూ పాట పాడుతూ ఏడుపడగల సేవాలాల్! బంగారు పల్లకిలో కూర్చున్నావు. స్వామి వేషం వేసుకొని మాకు కనబడు కుండా తిరుగుతున్నావు. దయవుంచి మమ్మల్ని కరుణించుస్వామి అని సేవాలాల్‌ను వేడుకుంటారు. పూజలు చేసి నైవేధ్యం పెడతారు.

ముగింపు :

సుగాలీల మౌఖిక సాహిత్యం పరిశీలనలో చాలా కొత్త విషయాలు వెలువడ్డాయి. సుగాలీ భాషకు లిపి లేక పోవడం వలన వారు వారి యొక్క అభిప్రాయాలను మౌఖికంగా పాటలు మరియు కథలు, పొడుపు కథలు, సామెతల రూపంలో తెలియజేస్తు వుంటారు. భూమి ఆవిర్భవించిన నాటి నుండి అనేక మతాలు, జాతులు వారి ఉనికిని వారి సాహిత్యం సంప్రదాయాలు జీవం పోస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న అవసరాలకు మనిషి జీవితం రకరకాలుగా మార్పు చెందుతూ వస్తున్నది.

ఆధారగ్రంథాలు :

1. మూడే హేలానాయక్, వయస్సు-45, విర్నమల తాండ, రామకుప్పం, చిత్తూరు జిల్లా.
2. బానోత్ సంజన, వయస్సు-47, రామానాయక్ తాండ, పీలేరు, చిత్తూరు జిల్లా.
3. మూడే సక్రమ్మ, వయస్సు-54, నక్కలదిన్నే తాండ, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

❖ ❖ ❖

ఆంధ్రుల విశిష్ట కళారూపం పండరి భజన

– డా॥. యం. ప్రసాద్, పాఠశాల సహాయకులు (తెలుగు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాపూరు, నెల్లూరు (జిల్లా).

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః అని పెద్దల అభిమతం. పాట మనిషిని పరవశింపజేస్తుంది. పాటకు ఆనందంతో పులకించని మనస్సు ఉండదు. పాట శ్రమ నుండి ఊరట కలిగిస్తుంది. పాటకు అంతటి ప్రాధాన్యత ఉంది. పాట జానపద సాహిత్యంలో ఒక భాగం. పాటకు పాదం కదిపి కదం తొక్కితే తాండవం అవుతుంది. అలాంటి పాట, నృత్యాల సమ్మేళన జానపదుల కళా రూపమే పండరి భజన. ఈ కళారూపాన్ని గురించి తెలియ జేయడమే ప్రస్తుత వ్యాసం ప్రధాన ఉద్దేశం.

పండరి భజన – విశిష్టత :

ఎండరి భజన కళారూపం. ఇది మహారాష్ట్రానికి చెందింది. పండరి పురంలోని పాండు రంగని వేడుకుంటూ చేసే నృత్యం. పండరి భక్తుల ద్వారా ఈనాడు ఇది దేశ మంతటా విస్తరించింది. ఇది నృత్య ప్రధానమైన భజన. చేతిలో చిరుతలు, నోటితో పాట, పాటకు తగిన అభి నయం. పాటను రసరమ్యభరితం చేసే వాయిద్యాలైన మేళం, తాళం, డోలక్, మద్దెల, కంజిరా, తంబూరా, హార్మోనియం మొదలైనవాటితో కూడిన పండరి భజన వినసొంపుగా ఉంటూ తిలకించే వారికి కన్నులపండుగగా ఉంటుంది.

పండరి భజనలో అన్ని తెగల వారూ పాల్గొంటారు. దీనిని నేర్పడానికి గురువు ఉంటాడు. ఇతడు పల్లెలు తిరుగుతూ పండరి భజనలు నేర్పుతుంటాడు. ఈ భజనలు ఒక ప్రాంతానికే పరిమితం గాకుండా ఆంధ్ర దేశం అంతటా విస్తరించింది. వీటిని నేర్పేవారిని 'గురువు' లేదా 'దాసు' అని వ్యవహరిస్తారు. కడపకు చెందిన నారాయణదాసు అనే ఆయన పాండురంగ స్వామి మీద పాటలు అల్లి పండరిభజన విశిష్టతను ఆంధ్రదేశం అంతటా విస్తరింపజేశారు. ఈ భజనలు రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగాను మిగిలిన ప్రాంతాల్లో సందర్భానుసారంగా ప్రదర్శిస్తారు.

పండరి భజన నేర్పేడానికి 30 రోజుల నుండి 50 రోజులు పడుతుంది. గణనాధుడైన వినాయకుని ప్రార్థనతో గురువు భజన కార్యక్రమాన్ని మొదలు పెట్టి పాండురంగని పాటలు, రామడు, కృష్ణుడు, శంకరుడు, గ్రామదేవతలు, అవధూతలు, జానపద గేయాలు, కోలాటం పాటలు, శ్రీకృష్ణలీలు మొదలైనవి నేర్పిస్తాడు. 30 రోజుల తరువాత భజన నేర్చుకొనే వాళ్ళందరికీ కాళ్ళకు 'గజ్జెలు' కడతారు. ఈ తంతుని "గజ్జెపూజ" అంటారు. అందరూ శిష్యులు పాటకు, లయకు అనుగుణంగా నృత్యం నేర్చుకున్నారని నిర్ధారించుకున్న తరువాత చివరి అంకంగా అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. భజన అనం తరం వేకువ ఝామున అందరూ పవిత్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పాండురంగనిపై భక్తి నిలిపి అగ్ని గుండంలో ముందు గురువు నడిచి పోతుంటే ఆయనను అనుసరిస్తూ శిష్యగణం గుండంలోకి నడుస్తారు. ఇలా మూడు సార్లు నిప్పులపై నడుస్తారు. ఇలా చేసే క్రతువుని "అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం" అంటారు. తరువాత అగ్ని గుండంపై కొత్త గుడ్డలు కప్పి మట్టితో కప్పేస్తారు. 16 రోజుల తరువాత మరలా అందరూ భజన ప్రదర్శన ఇస్తారు. అంతటితో భజన నేర్చుకొనే ప్రక్రియ పూర్తవు తుంది.

పండరి భజన – ప్రదర్శన :

ఈ నృత్యంలో చిన్న పిల్లలు ఎక్కువగాను పెద్దవారు తక్కువగానూ పాల్గొంటారు. దీనిని నేర్చుకొనే వారు కాషాయ గుడ్డను నడుముకు కట్టుకుంటారు. పసుపు పచ్చని జెండాను కుడి చేతిలో పట్టుకుంటారు. కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. పెద్దలు, బాల బాలికలు 50

మంది వరకు ఉంటారు. గురువు మధ్యలో నిలబడి పాట పాడుతూ ఒక్కొక్క భంగిమను ప్రదర్శిస్తూ ఉంటాడు. భజన నేర్చుకొనేవారు చుట్టూ వృత్తాకారంలో నిలబడి పాట పాడతూ గురువు చెప్పిన భంగిమను అందరూ అభినయిస్తారు. భజన కార్యక్రమం ప్రారంభించే ముందు గ్రామంలోని అందరూ దేవతల పేర్లను చెబుతాడు. పాండు రంగ స్వామికి జై అంటూ గురువు దేవతలందరి పేరు పేరునా శిష్యులచే జై కొట్టిస్తాడు.

పండరిభజన కార్యక్రమం వినాయకుణి ప్రార్ధనతో ఆరంభమవుతుంది. వినాయకుడికి విఘ్నేశ్వరుడనే పేరు ఉన్నందు వలన తలపెట్టిన కార్యక్రమం ఏ ఆటంకం లేకుండా జరుగుతుందని జానపదుల నమ్మకం. ఇదే సంప్రదాయం నేటికీ నాటక ప్రదర్శన, శుభకార్యాలలో హిందువులు ఆలపించడం పరిపాటి. పండరి భజనలో వినాయకుని ప్రార్ధన ఇలా ఉంటుంది. ప్రతి పాటకు లయాత్మక నృత్యం ఉండడం ఈ భజన ప్రత్యేకత.

పాట - 1

॥పల్లవి ॥ గజాననా ఓం గజాననా
గజాననా ఓం గజవదన

॥చరణం॥ పాహిపాహి గజాననా
ఓం పార్వతి తనయా గజాననా ॥గజాననా॥

॥చరణం॥ మూషిక వాహన గజాననా
మునిజన వందిత గజాననా ॥ గజాననా ॥

వినాయకుని ప్రార్ధన తరువాత మహావిష్ణువుకి సంబంధించిన పాట ఉంటుంది. దశావ రాలు దాల్చి మహా విష్ణువు అందరినీ కాపాడుతాడని జానపదుల నమ్మకం అందులన విఘ్నేశ్వరుని ప్రార్ధన తరువాత విష్ణువుని ఇలా స్తుతిస్తారు.

పాట - 2

॥పల్లవి ॥ కాపాడరా మమ్ము కరీరాజ వరాద
కరీరాజ వరాదా గజారాజ వరాదా ॥కాపాడరా॥

॥చరణం॥ నీ పాదముల మేము నెరనమ్మి నామురా
కరుణతో మము బ్రోవరావ కరీరాజ వరాదా ॥కాపాడరా॥

మొదట గణనాధుడు అనంతరం మహావిష్ణువు తరువాత పాండురంగ స్వామికి సంబంధించిన పాటలు పాడుతారు. ఈ పాటల ద్వారా పాండు రంగడ్ని పరిపరి విధాలుగా స్తుతిస్తూ పాటలు పాడుతూ పాండురంగనిపై తమకు గల భక్తి ప్రపతులను వ్యక్తంచేస్తారు. పాండురంగని స్తుతి పాటలు ఇలా ఉంటాయి.

పాట - 3

॥పల్లవి ॥ పరమాత్మ పాండురంగ శరణంటిని బ్రోవుమా
కరివరదా మేఘశ్యామ కరుణ జూడుమా
॥పరమాత్మ॥

॥చరణం॥ ఏదిక్కు లేనివాడను! నాదిక్కు చూడుమా
నా దిక్కు జూడుమా! నన్ను దరీ జేర్చుమా
॥పరమాత్మ॥

పాట - 4

॥పల్లవి ॥ పండరిపురి బోవుమా! పాండురంగని చూడుమా
భక్తితో భజన చేయుమా!
నీ మనసే రంగని పైన నిలుపుమా!
॥పండరిపురి॥

॥చరణం॥ ఎంతో మందీ భక్తులు భజనా జేసీనారు
భజనా జేసీవారు పరవశమై పోయారు
ఆనాటి యుగము నుండి ఈ నాటి యుగము వరకు
కలకాలం చెరగని వెలుగల దిక్కైనారు
॥పండరిపురి॥

పాండురంగ స్వామి పాటలు అనంతరం మహా విష్ణువు దశావతరలలో ఒకటైన శ్రీకృష్ణుని గురించి గానం చేస్తారు. అయితే శ్రీకృష్ణుడే అనగా మహావిష్ణువు పాండు రంగని మరోరూపంగా భావించి శ్రీకృష్ణ స్తుతిలో పాండు రంగ స్వామిని కూడా కలిపి స్తుతించడం ఈ పాటలో ప్రత్యేకత. ఆ పాట వరుస ఇలా ఉంటుంది.

పాట – 5

॥పల్లవి॥ మురళి మోహనా గరుడ వాహనా మోక్షమొ
సగుము జనార్థనా
ఎంత నిన్ను వేడినాము బ్రోవరావయ్యా
కృష్ణా కావరావయ్యా ॥మురళి మోహనా॥
చల్లగ రావయ్యా రంగా మెల్లిగ రావయ్యా
....ఓహో పాండు రంగ... నీలాల
పాండురంగ ॥చల్లగ॥

పండరి భజన నేర్పే గురువు స్థానికంగా వెలసిన దేవుళ్ళ విశిష్టతను గురించి తెలియజేస్తూ వారిని ప్రశంసిస్తారు. ఆంధ్రరాష్ట్రంలో నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాశయానికి ఒక విశిష్టత కలది. ఆ జలాశయం కింది భాగంలో శివాలయం ఉంది. అక్కడికి అశేష భక్తగ్రేసరులు శివరాత్రి పర్వదినాన శివుడ్ని పూజిస్తారు. ఆయనను పండరి భజన పాటలలో ఇలా స్తుతిస్తారు.

పాట – 7

॥పల్లవి ॥ సోమశిల ప్రాజెక్టు క్రింద వెలసినయున్న
సాంబశివా
భక్తులాను బ్రోవరావా బ్రోవరావా నీలకంఠ

॥చరణం॥ గంగమ్మను తలపై చుట్టి
నెలవంకను సిగలో దాల్చి
నాట్యమాడుచున్నావయ్యా నటరాజా
రావయ్య భక్తుల బ్రోవగ రావయ్య మా
భజనలు చూడగ రావయ్య
హరహర శంకర శంభోశంకర
గరళకంఠ కైలాస నివాసా ॥సోమశిల॥

ఆంధ్రరాష్ట్రంలో హిందువుల ఆరాధ్య దేవతలు చాలా మంది ఉన్నప్లే. భగవంతుని ప్రతిరూపాలుగా ఉంటూ దేవుని బోధలను ప్రజానికానికి ప్రవచనాల రూపంలో చేరవేసే వారిని అవధూతలు అంటారు. సత్యసాయిబాబ, వెంకయ్యస్వామి, కాశీనాయన మొదలైనవారు అవధూతలు. నెల్లూరు జిల్లాలో వెంకయ్య స్వామి అనే అవధూతను గురించి ఇలా వేడుకుంటారు.

పాట – 8

॥పల్లవి ॥ నాగలేటూరిలోన నరుడుగా బుట్టావు
నరనారాయణనని జగమంతా చాటావు
గోరంత గొలగమూడిలో నా స్వామి
కొండంత వెలుగైనావా! స్వామి వెంకయ్యగ
కొలువైనావా ॥నాగలేటూరి॥

॥చరణం॥ పశుపతి నాథుడని పదేపదే వేడినాము
పరమాత్మ పరంధామ పూజలెన్నో చేశాము
పలుకవు ఉలుకవేమి స్వామి! మాపై
కరుణజూపవేమి ॥నాగలేటూరి॥

మానవ జన్మ దుర్లభమైంది. మానవ జన్మనెత్తిన వారు పరోపకార గుణం కలిగి ఉండాలని, అశాశ్వితమైన మానవ జన్మను సార్థక్యం చేసుకోవాలంటే స్వార్థబుద్ధి వీడి దైవ సన్నిధికి చేరువ కావాలనే విషయాన్ని ఇలా వ్యక్త పరుస్తారు.

పాట – 9

॥పల్లవి ॥ మరువబోకు మానవుడా! మమతలీడరా!
మమత లిడచి రామనామ స్మరణజేయరా
స్వామి శరణు జేయరా

॥చరణం॥ నీది నాది యనేమూఢత్వము వీడనాడరా
వెదకి జూడ జగతిలోన ఏదినీది కాదురా
॥మరువబోకు॥

పండరి భజనల్లో అప్పుడప్పుడు స్మృతిగీతాలు, శృంగార, హాస్యస్ఫోరక గీతాలను ఆటవిడుపుగా ఆలపించడం కూడా చూడవచ్చు.

పాట – 10

॥పల్లవి॥ బావిలో బంగారు చెండూ బాలుడేసిన
పూలాతోట
పూలు నేను కోయాబోతేనూ నా స్వామి
రంగా
పుష్పగిరి తేరే కదిలేను ॥బావిలో॥

॥చరణం॥ కందుకూరీ కంసాలన్నా కమ్మాలిస్తా
మెరుగూబెట్టూ
అత్తమామల గానా కుండాను నా స్వామి
రంగా
విత్తనాల జొన్నాలిస్తాను. ॥బావిలో॥

అశేష ప్రజానికాన్ని కథలతో, గేయాలతో ఉర్రూత లూగించిన జానపద కళలు నేడు ప్రజల ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రపంచీకరణలో భాగంగా కళలు కనుమరుగైపోతున్నాయి. యాంత్రిక జీవనానికి అలవాటు పడిన మానవుడు సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతి రూపాలైన జానపదకళారూపాలను మరిచిపోతున్నారు. వాటిని వీక్షించడానికి కూడా సమయాన్ని వెచ్చించే స్థితిలో నేటి మానవుడు సుముఖత చూపడం లేదనేది సర్వ విదితమే. మన సంస్కృతికి నిదర్శనాలైన జానపద సాహిత్యాన్ని, జానపద సంపదను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఆంధ్రుని భజస్కంధాలపై ఉంది. ఆ దిశగా నేటి తరానికి వాటిని పరిచయం చేయవలసిన ఆవశ్యకత ఎంతైన ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపద గేయవాఙ్మయ వ్యాసావళి - గంగాధరం నేదనూరి
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీయస్. సుందరం
3. జానపద నృత్య కళలు - కృష్ణారెడ్డి చిగిచర్ల

(పరిపృచ్ఛ : పండరి భజన గురించి వివరించిన భజన గురువు కుంచం రమణయ్యదాసు (పండరి భజన సంక్షేమ సంఘం సభ్యులు) కృష్ణారెడ్డి పల్లి (గ్రామం), సైదాపురం(మం), నెల్లూరు జిల్లా)

❖ ❖ ❖

పట్టపుతెగ వారి పండుగలు

– డా॥. టి. జాన్ కిరణ్‌బాబు, తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో ఇంచు మించు 64 సముద్రతీర గ్రామాలలో విస్తరించి సముద్రపు చేపలవేటయే జీవనాధారంగా బ్రతికే జాలరులు పట్టపుతెగవారు. శ్రీలంక మరియు దక్షిణ భారతదేశాల మధ్య హిందూమహాసముద్రంలో చెదురుముదురుగా విస్తరించియున్న చిన్నచిన్న దీవులలో ఒక దీవి పట్టపుదీవి. దాదాపు 400 సంవత్సరాలక్రితం ఈ పట్టపుదీవికి చెందిన జాలరులు బ్రతుకు తెరువుకోసం తమిళనాడు మొదలు కొని ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వరకు వలస వచ్చి సముద్రతీరప్రాంత గ్రామాలలో స్థిరపడిపోయారన్నది వీరి పూర్వికులద్వారా ప్రాచుర్యంలో వున్న వలస చరిత్ర. పట్టపుదీవి నుండి వలస వచ్చినవారు కాబట్టి పట్టపు తెగవారిగా కాలక్రమంలో వీరి పేరు వ్యవహారంలో రూఢమైంది. అత్యధికభాగం నెల్లూరు జిల్లా తీరప్రాంత గ్రామాలలోను, పులికాట్ సరస్సు దీవులలో స్థిరపడగా, ప్రకాశం జిల్లాలో 26 గ్రామాలలోనూ, గుంటూరుజిల్లాలో బాపట్ల తాలూకు సూర్యలంక తీరంలో కేవలం 3 గ్రామాలలో మాత్రమే వీరి ఉనికి గోచరమౌతుంది. ఆపై వీరి ఉనికి గానీ ప్రస్తావన గానీ కనిపించదు. వీరి నివాస గ్రామాలు పట్టపు పల్లెలుగా రెవెన్యూ రికార్డులలో సైతం నమోదై ఉన్నాయి. తెలుగు-తమిళం కలిసిపోయిన వీరి భాషను పట్టపుభాష అంటారు. పట్టపువారి ఆచారాలు, సంప్రదాయాలు, పద్ధతులు తక్కిన మత్స్యకార జాతుల కంటే భిన్నంగా ఉంటాయి. వీరు సముద్రచేపల వేటని నమ్ముకుని బ్రతుకుతారు. వీరి గ్రామానికి గ్రామకాపులు ముగ్గురు ఉంటారు. ఆ ముగ్గురు గ్రామానికి రాజులని అర్థం. ఊరిలో ఏం చేయాలన్నా వీరి ముగ్గురి అనుమతి తీసుకోవాలి. వివాహకట్టుబాట్లు మరింత కచ్చితంగా ఉంటాయి. కేవలం పట్టపుతెగ వారి మధ్య మాత్రమే వైవాహిక సంబంధబాంధవ్యాలు జరుపుతారు. ఇతర మత్స్యకార జాతులతో ఎంతమాత్రం వైవాహికసంబంధాలు పెట్టుకోరు. ఎవరైనా ఈ కట్టుబాటును మీరితే భారీజరిమాన విధించి వెలిగా ఉంచుతారు. వీరు జరుపుకునే పండుగలు కూడా కొంత ప్రత్యేకతను సంతరించుకుని ఉంటాయి.

రాములవారి పట్టాభిషేక పండుగ :

శ్రీరామనవమి వేడుకల్లో సీతారాముల కళ్యాణం జరిపిస్తే, పట్టపుతెగ వారు మాత్రం అందుకు భిన్నంగా పట్టాభిషేకపండుగను జరుపుకుంటారు. అయితే ఈ పండుగను శ్రీరామనవమినాడు కాకుండా మార్చి-ఏప్రిల్ నెలలో ఏదైనా ఒక అనుకూలమైనరోజును గ్రామకాపుల సభలో ఎంచుకుని ఆ రోజు ఈ పండుగను నిర్వహిస్తారు. పట్టపువారి ఏపండుగైనా సరే రాత్రిపూట ఊరేగింపుతో ప్రారంభమౌతుంది. ముందుగా సాయంత్రం రాముల వారి గుడిదగ్గరికి ఫలహారాలు పెట్టి (కొబ్బరి కాయలు కొట్టి) అక్కడినుండి బాజాభజంత్రీలతో ఊరేగిస్తూ గ్రామంలో ఉన్న గుళ్ళన్నిటి దగ్గర ఫలహారం పెట్టుకుంటారు. ఆ తర్వాత రాములవారి పల్లకీని చెక్కభజన చేసుకుంటూ గంగ(సముద్ర)స్నానానికి తీసుకెళ్తారు. తీరపుగట్టున పల్లకీదింపి, పట్టపుతెగవారంతా సముద్ర స్నానం చేస్తారు. రాత్రి 7 గంటలనుండి 8గంటల సమయానికల్లా ఈ తంతు నంతటినీ పూర్తిచేస్తారు. ఆపై జ్యోతిని వెలిగించి జ్యోతిచుట్టూ చెక్కభజన చేస్తూ పల్లకీతో తిరిగి కోవెలకు చేరుకుంటారు. రాత్రి పన్నెండుగంటలు దాటిన తర్వాత వాహనాన్ని(ట్రాక్టర్) అలంకరించి ఊరేగింపు చేస్తారు. పూర్వపురోజుల్లో పల్లకీని స్వయంగా మోసేవారు. ఇటీవలికాలంలో వాహనంపై ఊరేగింపు చేస్తున్నారు. పట్టాభిషేకం అనంతరం రాజ్యాన్ని(ఊరిని) చూస్తున్నట్లుగా ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఇటీవలి కాలంలో స్థానిక వేడుకల ప్రభావాన్నిబట్టి కొన్ని పట్టపుగ్రామాలలో కళ్యాణం కూడా చేస్తున్నారు. కానీ ఈ పట్టాభిషేకం పూరైన తర్వాత కళ్యాణం చేస్తున్నారు. బాజాభజంత్రీలతో ఊరేగింపు జరుగుతోంటే ప్రతీ ఇంటి నుండీ ఫలహారాలు(నైవేద్యాలు), పానకాలు, హారతు లివ్వడం, కొబ్బరికాయలు కొట్టడం జరుగుతుంది. పట్టపు తెగవారు ఏ మతానుయాయులైనప్పటికీ విధిగా ఫల హారాలివ్వాలన్నది ఊరి కట్టుబాటు. లేనట్లైతే గ్రామకాపులు సభకు పిలిచి జరిమానా విధిస్తారు. రాత్రంతా ఊరేగింపు జరిపి ఉదయానికి తిరిగి పల్లకీని కోవెలకు చేరుస్తారు. అక్కడ మోడి అనే ఆటను ఆడతారు. సుమారు పావుగంట పాటు సందడిని, ఉత్కంటను కలిగించే మోడి ఆట ఈ పండుగకు ఒక ప్రత్యేక ఆకర్షణ. అన్నదమ్ములవరుసైనవారు ఒక జట్టుగానూ (నలుగురు), బావ-బావమరుదుల వరసైనవారు(నలుగురు) మరొక జట్టుగాను ఏర్పడతారు. ఒక జట్టు నాట్యంచేసే నాగుపాములుగానూ రెండోజట్టు మంత్రగాళ్ళవలె ఈ ఆటను ఆడతారు. నాగస్వరాలు మోగుతోంటే నాగు పాముల జట్టు తువ్వాలు యొక్క ఒక కొనను నోటిలో పెట్టుకొని, మరొక కొనను చేత్తో పట్టుకుని నాగుపాములా నాట్యంచేసూ మంత్రగాళ్ళజట్టు దగ్గరికి వచ్చి మంత్రగాళ్ళ ముందు ఉంచిన కొబ్బరి చిప్పను చిక్కించుకోవాలి. అయితే ఈ మంత్రగాళ్ళజట్టు ఆ కొబ్బరిచిప్పను చిక్క కుండా చేయడానికి నాగుపాము జట్టుపైకి మంత్రించిన వేపాకుల్ని విసురుతారు. ఆ మంత్రప్రభావానికి నాగు పాముజట్టు కొబ్బరి చిప్ప దరిదాపుల్లోకి రాకుండా వెనక్కి విరుచికుని పడిపోతారు. ఇరుజట్లు ఇలా పోటీపడు తుండగా నాగుపాముజట్టులో ఎవరోఒకరు మంత్రశక్తిని తప్పించుకుని కొబ్బరిచిప్ప చేజిక్కించుకునేవరకు ఈ మోడి ఆట తీవ్రమైన ఉత్కంటతో కొనసాగుతుంది. చివరికి ఎలాగోలా కొబ్బరిచిప్పను చేజిక్కించుకున్న జట్టు రాములవారి గుడికి వెళ్ళి దీపం వెలిగించి ఒక చేత కర్రను పట్టుకొని దాని కొనను దీపానికి అంటిస్తూ, గోవిందనామ స్మరణ చేస్తూ ఆ జ్యోతిచుట్టూ నాట్యం చేస్తారు. అనంతరం బయటికి వచ్చి పల్లకి ముందు జ్యోతిని పెట్టి చుట్టూ తిరుగుతూ నాట్యం చేస్తారు. దీంతో రాముల వారు రాజ్యాన్ని చూసివచ్చిన పట్టాభిషేకపు ఊరేగింపు ముగుస్తుంది. గ్రామకాపులు ఆరోజు స్వాములవారికి ఒక్కపొద్దు పెట్టుకుంటారు. ఆ పొంగళిని ఊరి ప్రజ లందరికీ ఫలహారంగా ఇస్తారు. కొన్ని గ్రామాలలో ఈ ఊరేగింపు అయినా తర్వాత స్వాములవారిని గంగ స్నానానికి తీసుకెళ్తారు. ఆ రోజు సాయంత్రం చల్లపూట నాలుగుగంటల వేళకు వసంతం ఆడతారు. ఇది ఉట్టి కొట్టే ఒక ఆట. అయితే ఇక్కడ ఉట్టికాకుండా ఉట్టిస్థానంలో కొబ్బరికాయ పెడతారు. ఆ కొబ్బరికాయని పగలగొట్టాలి. ఉదయం ఆడిన మోడి ఆటలో అన్న దమ్ముల జట్టు, బావామరుదులజట్టు మాదిరిగానే ఇక్కడ కూడా వరసైన దాయాది బంధువులతో రెండుజట్లుగా ఏర్పడతారు. మోడిఆటలో రెండు జట్లుగా ఆడిన మాదిరిగానే ఇక్కడ కూడా ఒక జట్టువారు ఈ వసంతం ఆటలో కొబ్బరికాయ పగలగొట్టాలి. రెండవజట్టువాళ్ళు ఉట్టిమీది కొబ్బరికాయను కొట్టనివ్వకుండా కళ్లకేసి నీళ్ళుకొడుతూ లాగేస్తూ అడ్డుపడతారు. ఈ ఆటకూడా చాలా సందడిగా హెూరాహెూరీగా సాగుతుంది. ఉట్టిమీది కొబ్బరికాయ కొట్టింతర్వాత సీతమ్మవారి పడవ ఊరే గింపుగా బయలుదేరుతుంది. అడుగుభాగాన చక్రాలు ఏర్పాటుచేసిన ఒక పడవను అందంగా అలంకరించి, పల్లకీలో ఊరేగించిన రాములవారి పట్టాభిషేక పటాన్ని ఆపడవలో పెట్టి ఉత్సాహంతో ఆడుతూ పాడుతూ తాడుకట్టి ఆ పడవను లాక్కెళ్తూ పల్లెవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులో కూడా ప్రతీ ఇంటి ఫలహారాలు, కొబ్బరి కాలు అందిస్తారు. పడవ ఊరేగింపు జరుగుతుండగా ప్రతీ ఇంటివారు బిందెలకొద్దీ నీటితో వీధుల్ని తడుపుతారు. ఏ ఊరేగింపుకైనా ఇదొక ఆనవాయితీ. ఏ ఇంటిముందైతే ఈవిధంగా చేయరో, ఆ ఇంటివారిని తర్వాత గ్రామ కాపులు సభకు పిలిచి జరిమానా విధిస్తారు. ఊరేగింపులో బుంగలో పసుపునీళ్ళు కలిపి సిద్ధంచేసుకుని దాయాదుల

వరసయ్యేవారిమీద కాకుండా బావామరుదులు, బావా మరదళ్ళు, అత్తాఅల్లుళ్లు వంటి వరసయ్యేవారి మీద పసుపునీళ్ళు చల్లుతూ కోలాహలంగా వసంతం ఆడతారు. ఊరేగింపుగా వచ్చే పడవ క్రింద కొందర భక్తిపారవశ్యంతో పడుకుంటారు. మరికొందరిని బలవంతంగా పడుకోబెడ తారు. ఇలా పడుకున్న వాళ్ళు, పడవను వారిపైనుండి దాటేంచేంతవరకు లేవకూడదన్నది గట్టి నియమం.

"ఎలెలో ఏలేలో ఏలేలో - సీతమ్మ పడవేలు ఏలేలో
సీతవై జనకుడా ఏలేలో - శ్రీరామచంద్రుడా ఏలేలో
ఓ మమ్మాదరించరా ఏలేలో - మమ్మూ కాపాడరా
ఏలేలో - ఎలేలో ఏలేలో ఏలేలో - సీతమ్మ పడవేలు
ఏలేలో
ఓ మచ్చావతారుడా(మత్స్యావతారుడా) ఏలేలో - ఓ
గోపావతారుడా ఏలేలో
సీతవై జనకుడా ఏలేలో - శ్రీరామచంద్రుడా ఏలేలో
- ఎలేలో ఏలేలో ఏలేలో - సీతమ్మ పడవేలు ఏలేలో
నల్లనల్లనివాడ ఏలేలో, శ్రీరామ చంద్రుడ ఏలేలో
రావణ సంహారి ఏలేలో, అయ్యోధ్యకు రాజ ఏలేలో
ఎలెలో ఏలేలో ఎలేలో సీతమ్మ పడవేలో ఏలేలో
దశరథతనయా ఎలేలో, కౌసల్య పుత్ర ఎలేలో -
లక్ష్మణ సోదర ఎలేలో, జనకుడి అల్లుడా ఎలేలో
ఎలెలో ఏలేలో ఎలేలో సీతమ్మ పడవేలో ఎలేలో
రాజ్యాన్ని చూడంగా ఏలెలో, సీతమ్మతో కలిసి ఎలేలో
- మా వీధికి వచ్చావా ఎలేలో, మా ఇంటికొచ్చిన
ఎలేలో
మమ్ము ఆదరించార ఎలేలో, మమ్ము కాపాడార ఎలేలో
- ఎలెలో ఎలేలో ఎలేలో సీతమ్మ పడవెలో ఎలేలో

(ఇలు అంటే పట్టపుభాషలో లాగు అని అర్థం. సీతమ్మ పడవ ఇలు = సీతమ్మ పడవ లాగు. రాగంలో, వ్యవ హారంలో ఏలేలో అని అంటున్నారు.) అంటూ ఈ పాటను గానప్రతిగానాలతో పాడుకుంటూ ఊరేగింపులో పడవ లాగుతారు.

వీధులగుండా ఊరేగింపును నడిపించేటపుడు పడవలాగే బృందంలో కొందరు ఇంక పడవలాగలేం మావల్లకాదు అంటూ ఊరేగింపుకి అడ్డంగా మంచాలు వేసుకుని కూర్చుండిపోతారు. అప్పుడు సమీపపు ఇళ్ళ వారు పడవ వెంట నడిచివచ్చే గ్రామకాపులద్వారా మాట్లాడించివారికి ఎంతోకొంత డబ్బును మామూలు క్రింద ముట్టజెప్పి, బుజ్జగించి ఊరేగింపు ముందుకు సాగేటట్లు చేస్తారు. ఒప్పందం జరిగే సమయంలో పట్టపుభాషలో వారి మధ్య జరిగే సంభాషణ చూపరులకు మహా వినోదాన్ని పండిస్తుంది. సందడి వాతావరణం సృష్టించడానికి సీతమ్మపడవ లాగే యువకులు ఉద్దేశ్యపూర్వకంగా ఈ ఆట ఆడతారు. ఈవిధంగా ఊరేగింపును పట్టపుపల్లెవీధులన్నిటిగుండా నడిపిస్తూ, గుడులలో కొబ్బరికాయలు కొడుతూ తిరిగి రాములవారి గుడికి చేరుకుంటారు. కోవెలలో కొబ్బరికాయ కొట్టి ఫల హారాలు పంచిపెట్టడంతో ఈ పండుగ ముగుస్తుంది.

జెండాపండుగ :

సముద్రపువేటను నమ్ముకుని బ్రతికే మత్స్యకారులు చేపలు బాగా పడాలని, తీరప్రాంతపు గ్రామాలైన మత్స్య కారపల్లెలు సురక్షితంగా ఉండాలనీ నాగుర్ మీరా సాయిబు వారి పేర జెండా పండుగను పట్టపు తెగవారు జరుపుకుంటారు. ఈ జెండా పండుగను మూడు విధాలుగా నిర్వహిస్తారు. మొదటిగా జూలై నెలలో గ్రామకాపుల ఆర్థ్యర్యంలో జరిగిన సభలో ముందుగా నిర్ణయించుకున్న ఒక తేదీ ప్రకారం శుక్రవారం నాడు పట్టపుతెగవారు జెండాపండుగను నిర్వహిస్తారు. శుక్ర వారంనాడు సాయంత్రం గ్రామంమీద సుమారు 20 నుండి ముప్పై జెండాలు తయారు చేసి రాములవారి గుడివద్ద ఫలహారం పెట్టుకుని, ఊరిలో దేవీదేవతలు అందరికీ ఫలహారం పెడతారు. జెండాలను రాములవారి గుడిదగ్గరనుండి ఊరేగింపు లేకుండా సముద్రం దగ్గర ఉన్న నాగూర్ మీరా సాయిబ్ చెట్టుదగ్గరకు తీసుకెళ్తారు. ఒక చెట్టును నరికి సముద్రంలో ముంచి తీసుకువస్తారు. ఈ జెండాలను ఆ చెట్టుకి అలంకరిస్తారు. దేవుడిగా

కొలిచే పెద్దచెట్టుకి అలంకరించిన చెట్టును పైకి కట్టేస్తారు. తీరంలో చెట్టులేని గ్రామాలవారు ఊరిలో అలంకరించిన చెట్టునే నాటుతారు.

ఈ జెండాపండుగ అనంతరం చేపలు బాగాపడి, వేట లాభదాయకంగా ఉండి, మత్స్యకారులకు మంచి గిట్టు బాటు కలిగితే, ఆపై ఆగష్టు/సెప్టెంబరు నెలలో జెండాపండుగను మరింత ఆర్భాటంగా చేస్తారు. ఈ జెండాపండుగను కేవలం శుక్రవారం మాత్రమే చేస్తారు. గ్రామకాపులసభలో నిర్ణయించుకున్న తేదీ ప్రకారం శుక్రవారం నాడు జరిగే ఈ పండుగకోసం గురవారంనాడే ఊరంతటిమీద 20 నుండి 30 వరకు జెండాలను తయారుచేసి రాములవారి గుడి దగ్గర సిద్ధంగా ఉంచుతారు. గురవారం సాయంత్రం రాములవారిగుడిలో ఫలహారాలు పెట్టుకొని (కొబ్బరికాయ కొట్టి), గ్రామంలోని ఇతర గుడుల దగ్గర కూడా ఫలహారాలు పెట్టుకుంటారు. గురువారం అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటి శుక్రవారం ప్రవేశించగానే ఆర్భాటంగా జెండా ఊరేగింపును ప్రారంభిస్తారు. ఇంతకుపూర్వం భాజాభజంత్రీలతో సాగిన ఊరేగింపులు ఇటీవలి కాలంలో డిజె బాక్సులహోరులో జరుగుతున్నాయి. వీధులగుండా ఊరేగింపు వస్తోంటే ప్రతీఇంటినుండీ బెల్లం, ఫలహారాలు, కొబ్బరికాయలు ఇస్తుంటారు. వీటితోపాటు ప్రతీ ఇంటివారు విధిగా ఒక జెండాను కూడా ఇవ్వాలి. గతంలో ఏ ఇంటివారు ఆ ఇంటి తరపున జెండా తయారుచేసుకుని, స్వయంగా మోసుకుంటూ ఊరేగింపులో పాల్గొనేవారు. ఇప్పుడైతే ఊరిఅంతటిమీద కలిపి జెండాలను తయారుచేసి ట్రాక్టరు మీద పెట్టి ఊరేగిస్తుండగా ప్రతీ ఇంటినుండి చిన్నచిన్న జెండాలను ఫలహారాలతోపాటు ట్రాక్టరులో ఊరేగింపు చేసేవారికి అందిస్తున్నారు. "ఆలే - ఆలే - దూలే - దూలే - హైసత్ - హైసత్" అనే మాటను ఒకరి వెంబడి మరొకరు నిరంతరాయంగా వల్లెవేసుకుంటూ రాత్రంగా ఊరేగింపుచేసుకుంటూ తెల్లవారేసరికి సముద్రం దగ్గరికి చేరుకుంటారు. ఒక చెట్టును నరికి సముద్రంలో ముంచి తీసుకువస్తారు. ఈ జెండాలను ఆ చెట్టుకి అలంకరిస్తారు. దేవుడిగా కొలిచే పెద్దచెట్టుకి అలంకరించిన చెట్టును పైకి కట్టేస్తారు. తీరంలో చెట్టులేని గ్రామాలవారు ఊరిలో అలంకరించిన చెట్టునే నాటుతారు. ముసల్మాను మత గురువును తీసుకొచ్చి నమాజు చదివించి సంబంధిత పూజా తంతును నిర్వహిస్తారు. అనంతరం మరమరాలు, వేయించిన శనగపప్పు, బెల్లంతో తయారుచేసిన ఫలహారాన్ని పంచడంతో జెండా పండుగ పూర్తౌతుంది. ఒకవేళ ఆ సంవత్సరం జూలై జెండాపండుగ అనంతరం చేపలవేట గిట్టుబాటుకాకపోయినట్లైతే తదుపరి ఆగష్టు/సెప్టెంబరు నెలల్లో నిర్వహించే భారీ ఊరేగింపు జెండా పండుగను ఆ సంవత్సరానికి ఆపి మరుసటి సంవత్సరానికి వాయిదా వేసుకుంటారు.

ప్రతీ సంవత్సరం చేసుకునే జెండాపండుగను విభిన్నంగా వైవిధ్యభరితంగా మరింత వైభవోపేతంగా 5 సంవత్సరాల కొకసారి కందిరి అనేపేరుతో తిరునాళ్ళుగా చేసుకుంటారు. అయిదేళ్ళకొకమారు నిర్వహించే ఈ కందిరి జెండాపండుగ కోసం ఒక సంవత్సరం ముందుగానే మేకపోతునొకదాన్ని ఊరంతటిమీద కలిపి కొని దేవుడిపేర వదిలి మేపుతుంటారు. పండుగనాడు మేకపోతును బలిచ్చి ఆ మాంసాన్ని బియ్యంతోపాటు కలిపి బిర్యాని మాదిరిగా వండి గంపలో పెట్టి జెండాలతో పాటుగా ఊరేగిస్తారు. ఆ తరువాత ఆ వంటకంతో గ్రామప్రజలందరికీ విందు చేస్తారు. ఏ పండుగ జరిగినా సరే ముందురోజు గ్రామ సలవాది చేత చాటింపు వేయిస్తారు. ప్రతీ పండుగకు ఇదొక ఆనవాయితీ. తిరునాళ్ళు రేపు మొదలౌతాయి అనగా ముందురోజే సముద్రపు వేటకు ఎవరూ వెళ్ళకూడదనీ, ఊరేగింపు వస్తోంటే వీధుల్లో నీళ్ళుపోసి ప్రతీ ఇంటి ముందు తడపి ఊంచాలనీ చాటింపు వేయిస్తారు. పండుగ జరిగే రోజు ఎవరూ ఊరొదిలి బయటికి పనులకు వెళ్ళకూడదు. పండుగ జరిగిన వారంరోజులపాటు ఊళ్ళో నుండి ఏ వస్తువూ

బయటికి వెళ్ళ కూడదు. బయటి నుండి వచ్చిన వస్తువు లేవైనా వుంటే వాటిని కూడా ఊరు దాటించకూడదు. ఊళ్ళోనే ఉంచాలి. మత్స్యకార వ్యాపార సంబంధమైన వలలు, పడవలు వంటి వాటిని సైతం జెండా పండుగ జరిగిన శుక్రవారం నుండి మరలా వచ్చే శుక్రవారం వరకు అమ్మడాలు, కొనడాలు జరగకూడదు. ఒకవేళ అంతకు ముందు రోజుల్లో అమ్ముకుని, కొనుక్కుని ఉంచుకున్న ప్పటికీ ఆ వారంరోజులు మాత్రం వాటిని ఊరినుండి బయటికి తీసుకెళ్ళకూడదు. అదేవిధంగా బయటి ఊరువారు ఎవరైనా జెండాపండుగ జరిగేరోజుల్లో ఈ ఊరి తీరానికి వస్తే, వాళ్ళుకూడా మరొకవారం వరకు ఆ ఊరుదాటి వెళ్ళకూడదు. ఆ వారంరోజులపాటు ఆ ఊళ్ళోనే ఉండాలి. ఈ కట్టుబాట్లను ఎవరైనా మీరితే వారిని గ్రామకాపులు సభకు పిలిచి జరిమానా విధిస్తారు. ఈ విధంగా పట్టపుతెగవారు కందిరి జెండాపండుగను నిర్వహిస్తారు.

ఆధార గ్రంథాలు :

1. Castes and Tribes of South India (1909)-Edgar Thurston, Volume PtoS, Government Press, Madras
2. తెలుగులో జాలర్ల పాటలు - డా.పి. చక్రపాణి అముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం (shodhganga.inflib.net.ac.in>jspuri)
3. ఒంగోలు తాలూకా యందలి గ్రామనామాల పరిశీలన- డా. నాగమల్లీశ్వరరావు (shodhganga.inflib.net.ac.in>jspuri)

❖ ❖ ❖

'ఆదిలాబాద్ జిల్లా గోండుల సంస్కృతి-ఉత్సవాలు'

– జె. సంగీత, సహాయ ఆచార్యులు, ప్రభుత్వడిగ్రీ కళాశాల,ఉట్నూర్. ఆదిలాబాద్ జిల్లా.

సంస్కృతి అనేది మానవ జీవనవిధానాన్ని, వారి ఆచార వ్యవహారాలను, ప్రమాణాలను, మత సంబంధమైన వాటిని సూచించే పదమని చెప్పవచ్చు. ఒక సమాజంలోని పద్ధతులు, నిర్మాణాలు, వ్యవస్థలు ఆసమాజ సంస్కృతిని సూచిస్తాయి. గతించిన కాలం గురించి భవిష్యత్ తరాలకు అందించే వారధి సంస్కృతి. అలాంటి విభిన్న సంస్కృతిని సంప్రదాయాలను ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు కలిగి ఉన్నారు. జిల్లాలోని గోండు గిరిజనులు నాగరిక ప్రపంచానికి దూరంగా బ్రతకడానికి ఇష్టపడతారు. వీరు ముఖ్యంగా అటవీప్రాంతానికి సమీపంగా నివసిస్తారు. తమ సంస్కృతిని,సంప్రదాయాలను,ఆచార వ్యవహారాలను ఖచ్చితంగా నియమ నిబంధనల ప్రకారం పాటిస్తూ విలక్షణీయమైన జీవనాన్ని గడుపుతున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో గోండు, కొలాం, తోటి, నాయక్ పోడ్, అంధ్, బంజారా, కోయ ఇలా ఎన్నో గిరిజన తెగలు కన్పిస్తాయి. ఈ గిరిజన తెగలు తమ సంస్కృతి సంప్రదాయాల ద్వారా, ఆచార వ్యవహారాల ద్వారా, జీవనశైలి ద్వారా ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. ఈ గిరిజన తెగలలో ఒకటైన గోండు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను మీ ముందుకు తీసుకువస్తున్నాను.

వివరణ :

భారతదేశంలో సంఖ్యాపరంగా, సాంస్కృతికంగా ప్రబలంగా ఉన్న గిరిజన జాతులలో గోండుజాతి ఒకటి. భారతదేశంలో అత్యంత పురాతన భూమిగా గోండ్వానా భూమిని వర్ణించడం జరిగింది. గోండులు ఎక్కువగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఒరిస్సా, తెలంగాణ ప్రాంతంలో కన్పిస్తారు. తెలంగాణ ప్రాంతం ఆదిలాబాద్ జిల్లా గోండులు వారి భాషను మాట్లాడుకునేటప్పుడు 'కోయ'అని పిలుచుకుంటారు. తమను తాము 'కోయ తూర్' అని పిలుచుకుంటారు. వీరి మాతృభాష గోండి. ఈ గోండి భాష మధ్యద్రవిడ మూలమునకు చెందినభాష.

గోండులు అటవీ ప్రాంతానికి సమీపంగా నివసిస్తారు. సమిష్టి జీవనం వీరి ప్రత్యేకత. వీరు నివసించే గ్రామాలను 'గూడ' అని పిలుచుకుంటారు. ఈ గూడ లేదా గ్రామంలో ఒకే జాతికి చెందిన ప్రజలు ఉంటారు. వీరికి కుల పంచాయతీ ఉంటుంది. ఇదేవారి ముఖ్యమైన రాజకీయ, సాంఘికవ్యవస్థ. ప్రతీ పంచాయితీ తమ జాతికి అనుగుణంగా విధులను, చట్టాలను నిర్మించుకుంటుంది. ఆయా గిరిజనజాతులకు ఒక్కొక్క నాయకుడు ఉంటాడు. అతని మాటే చెల్లుబడి అవుతుంది.

పండుగలు, ఉత్సవాల సమయాల్లో ఈ గిరిజనులంతా కలిసి పండుగలు చేసుకుంటారు. విందులు, వినోదాలు, పాటలు పాడటం, నృత్యాలు చేయడంలో వీరి సమిష్టిజీవనం వ్యక్తమవుతుంది. ఒక జాతి పాటించే ఆచారసంప్రదాయాలు ఆజాతి సంస్కృతికి మూలాధారాలు. ఒక జాతి యొక్క సంస్కృతి తెలియాలంటే వారి ఆచారాలు, పండుగలు, సంప్రదాయాలు తెలుసు కోవడం అవసరం. గోండులు వారి సంస్కృతి, సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. వీరి పండుగలద్వారా వీరి సంస్కృతి వ్యక్తమవుతుంది.

గోండులు తమ భాషలో దేవతను 'పేన్' అంటారు. వీరి ప్రధానదేవత పెర్సాపేన్. ఈ పెర్సాపేన్‌ను కొలిచే పండుగలు భావే (ఏప్రిల్ - మే) మరియు పుస్ (డిసెంబర్ - జనవరి) మాసాలలో జరుపుతారు. పెర్సాపేన్ విగ్రహం వెదురుకర్రకు ఇనుపశూలం గుచ్చి ఉంటుంది. గోండుల సామాజిక వ్యవస్థ 12 సగాలుగా విభజింపబడింది. సగా అనగా ఘట్టం. ఈ సగాల నిర్మాణం చేసినది శ్రీ పాహన్డీకుపార్ లింగో. ఈ సగాల నిర్మాణంలో ఈయనకు

జంగోపేన్ రాయితడ్ అనే దేవత సాయం చేసిందని గోండుల నమ్మకం. ఈమె పేరు మీద 6వ సగా వారు ప్రత్యేకంగా పూజ చేస్తారు. ఈసగాలలో ఆయా గోత్రాలకు సంబంధించిన వారు ఉంటారు. గోండులు తమ పేర్లకు ముందు గోత్రాల పేర్లు చేర్చి ఉపయోగిస్తారు. గోండులు వారి జాతివారిని కలిసినపుడు పేరు కాకుండా వంశ నామాన్ని అడుగుతారు. ఒకే వంశనామం కలిగిన వారిని ఒకే మూలపురుషుని సంతతిగా భావిస్తారు.

గోండుల పండుగలు :

పెర్సాపేన్ పెర్సాపేన్ విగ్రహం వెదురుకర్రకు ఇనుపశూలం గుచ్చి ఉంటుంది. సగాలో ఎందరు దేవతలుంటే అన్ని కణుపులు గల వెదురుకర్రను ఉపయోగిస్తారు. పెర్సాపేన్‌ను ఊరిబయట ఒక ఇప్పచెట్టుపై ఉంచుతారు. ప్రతీ సంవత్సరం భావే,పున్ మాసాలలో పౌర్ణమినాడు కటోడా,ప్రధాన్,పూజారి కలిసి పూజ చేస్తారు. గ్రామస్తులు దేవుని ఊరేగింపు నిర్వహించి, రాత్రిపూట మరల అదే చెట్టు దగ్గరకు తీసుకువెళ్లి పూజలు నిర్వహిస్తారు. అక్కడే అందరూ భోజనాలు చేస్తారు. దీనిని పాతింగ్ అంటారు.

పెర్సాపేన్‌ను పూజించే సమయంలో ప్రతీసగావారు అడవి ఆవుల యొక్క తోక వెంట్రుకలను తమ ప్రధాన్‌తో కలిసి తీసుకొని వస్తారు. ఈ వెంట్రుకలను ఒక వెదురు కర్రకు చుడతారు. దీనిని చాపుర్ అంటారు. మువ్వలను కూడా ఈ వెదురుకర్రకు కడతారు. దీనిని కాటి అంటారు. ఇనుప శూలాన్ని సల్లె అంటారు. దీనిని శివుని త్రిశూలంగా భావిస్తారు. చాపూర్‌ను శంకరుని జటలుగా భావిస్తారు.

భీమల్‌పేన్ మార్గశిర పౌర్ణమిరోజున భీమల్‌పేన్ యొక్క పూజ చేస్తారు. భీమల్‌పేన్ ఆలయం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా ఖీల్‌గడ్ పర్సవాని అనే ఊరిలో ఉంది. గోండులు దేశంలోని అన్ని ప్రాంతాల నుండి వచ్చి భీమల్‌పేన్‌ను దర్శించి ముడుపులు చెల్లిస్తారు.

ఇవికాక గ్రామదేవతలు లకిపేన్, నాట్‌అవ్వల్‌లను జంతుబలులతో పూజిస్తారు. అకాడి పూజద్వారా సివా అవ్వల్‌ను సంతుష్టపరిచి పశుసంపద కాపాడమని కోరతారు. పోలమ్‌రాజుల్ అనే దేవతను, గౌరీపేన్‌ను (పులి దేవత) పూజించి పశువులను అడవిజంతువుల బారినుండి కాపాడమని కోరతారు. ఋతుపవనాల ఆగమన సమయంలో 'రాజుల్‌ముండ' అనే ఉత్సవాన్ని జరుపుతారు. వనదేవతకు మేకను బలిస్తారు. ఈ ఉత్సవం తరువాతనే టేకుకలపను, ఆకులను సేకరించి గుడిసెలు కట్టుకుంటారు.

జంగుబాయిదేవత గోండులు జంగుబాయి దేవతను పూజిస్తారు. ఈ దేవత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కెరామెరి మండలం పరంధోలి గ్రామం ముకద్ధంగూడ అడవులలో ఉంది. ఈ జంగుబాయి జాతర పుష్య మాసంలో జరుగుతుంది. పుష్యమాసంలో నెలవంక కన్పించగానే నియమనిష్టలతో దీపారాధన చేసి ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. దీపారాధనతో జంగుబాయి ఉత్సవం ప్రారంభం అవుతుంది. ఈదేవత గుహలో బసచేసి ఉంది. భక్తులు కూర్చునే ముందుకు కదులుతారు. చిమ్మచీకటిలో దీపం వెలుగులో అమ్మవారు దర్శనమిస్తారు. ఈ జాతరకు వచ్చే భక్తులు నియమనిష్టలతో ఉంటారు. పాదరక్షలు ధరించరు. కాలిబాటనే ప్రయాణిస్తారు. మద్యమాంసాలకు దూరంగా ఉంటారు. బ్రహ్మచర్యదీక్ష పాటిస్తారు. ఒంటిపూట భోజనం, కటికనేలపైనే పడుకోవడం, బయటనీరు, తినుబండారాలు గ్రహించకుండా నిష్టగా ఉంటారు.

ముగింపు :

గోండులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ద్వారా, విలక్షణమైన జీవనం ద్వారా ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా తమ గుస్సాడి పండుగద్వారా, కేస్లాపూర్ జాతర ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రకృతికి దగ్గరగా జీవించే ఈ గిరిజనులు స్వచ్ఛమైన జీవనం ద్వారా తమసంస్కృతిని కాపాడుకుంటూ తర్వాతి తరాలకు అందిస్తూ తమ సంస్కృతి వారసత్వాన్ని కాపాడుకుంటున్నారు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఉపయుక్త గ్రంథాలు :

1) మనోహర్, మెస్రం. గోండి సంస్కృతి, శ్రీవినాయకసాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, హైదరాబాద్.

2) మోహన్,జి.ఎస్. జానపద విజ్ఞానాధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్స్, బెంగళూరు,2001

3) Haimandorf, christoph Von Furer, Tribes of India For Survival, Oxford University Press, 1989.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సాహిత్యంలో అలంకార వైచిత్రి

– నారాయణదాసు మంజులచౌరి, కస్తుర్బా కళాశాల అధ్యాపకురాలు, నాగర్ కర్నూల్.

మానవుని హృదయంలో రాగద్వేషాలు ఎప్పుడు స్థానం పొందగలిగినవో, వాటితో పాటు కవిత్వం కూడా వారి హృదయంలో అదిష్టించింది. ఆది మానవుడు అసలైన జానపదుడు, కాబట్టి మొదట వెలిసిన కవిత్వం జానపద కవిత్వమని నిక్కచ్చిగా చెప్పవచ్చు. ఇక కవి అయిన వాడు దృష్ట, సృష్ట అయి ఉండవలెను. అతడు ఋషి, స్థానాన్ని అలంకరించి 'శబ్ద బ్రహ్మ' అవుతాడు. లోక సృష్టి బ్రహ్మ చేస్తే కావ్య సృష్టి కవి సల్పుతాడు.

కవిత్వంలో ఎన్ని రసములు వర్ణించినా చివరకు పాఠకులు దానిలో నుండి పొందేది. "ఆనందానుభూతి" ఇక్కడ కొంత చర్చ చేస్తాను. శృంగార రసమును ఏ పాళ్ళతో చిత్రిస్తాడో, కరుణనూ దానికి సమానంగా చిత్రిస్తాడు కవి. అంటే ఇక్కడ కావ్యంలో శృంగారాన్ని ఆస్వాందించిన సహృదయుడు. కరుణ పానము చేసిన పాఠకుడూ, ఇద్దరూ సమాన ఆనందాన్ని అనుభవిస్తారన్న మాట.

కవిత్వం ఎండు కట్టెల యందు అగ్ని వలే సరస హృదయుల హృదయాన్ని వ్యాపించి వారికి ఆనందము కల్గించును. దీనికే హేతువును జోడించి ప్రకృతి అనుకరణ కవిత్వంగా చెబుతాం.

"పండిన హృదయంలో నిండిన భావం. కవిత్వం,
ఎదిగిన ఎదలో పొదిగిన భావం కవిత్వం"

వ్యాస వాల్మీకులు ఋషి కవులు మాత్రమే. కానీ దీనితో పాటు వర్ణనా చాతుర్యం కల్గి ఉంటే అది రంగు రంగుల పూలు ఏరి, మాలకరి గూర్చిన పూమాల వలె కవిత్వం పరిపక్వత చెందును.

రుచి విశేషము తెలిసినపుడు, హృదయం మాగిన పుడు, పలుకు పచనమైనపుడు, లయ మేళవించినపుడు, అభివ్యక్తమయ్యేది కవిత్వం.

ఉదా :

"అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ"

అను సుందర సందేశం. లయాత్మకమై ఇహ పర సార్ధక మొనర్చే శక్తిని కల్గి ఉన్నది. అలాంటి కవితకు చతుర్విధ పురుషార్థాలు పరమావధులు. కవి దానికి సారధియై, ధర్మమే మార్గమై, మోక్షం గమ్యమై, సాగింప జేసేది కవిత్వ ప్రయాణం, ఇందులో పధికులందరికి ఉత్తమగతి ప్రాప్తిస్తుంది.

జానపద భాషలో అలంకార ఆరంభం :

(అలం + కృ + ఇష్ణచ) అనగా "అలంకరించు శీలము కలవాడు. భాషకు మూలం. శబ్దం (ధ్వని) అర్థమును ఆపాదించుటయే భాషాలంకారము. అందానికి వన్నెబెట్టి మరింత అందంగా తీర్చిదిద్దే అలంకార ముఖ్య ఉద్దేశ్యం.

విశ్వ సాహిత్య వేదికపై భారతీయ సాహిత్యానికి ప్రత్యేకించి భారతీయ అలంకార శాస్త్రములకు అలం కారికులకు విశిష్ట స్థానం కలదని చెప్పవచ్చు. గ్రీకు భాషలో శాస్త్రంలో Aurum శబ్ధము Gold అనే అర్థంలో కలదు. Alam - Aurm శబ్దాల సాహిత్యం వలన అలంకారము లౌకికార్థంలో నుండి రూపకాలంకార పద్ధతిలో (Metaphorical) కావ్య లక్షణాలుగా ఏర్పడిందని చెప్ప వచ్చును.

అలంకారాల్లో 1. సహజాతలు 2. కృతకాలు

సామాన్య మానవునికి మరి ఎవరికి అందుబాటులో ఉండని లక్ష్యాలను ఉదాహరిస్తూ చెప్పడం కృతకంగా ఉంటుంది.

ఉదా : ఆకాశగంగలు, హంసలు, స్వర్గాలు, రంభాదులు, నాట్యాలు ఇవి పాఠకునికి శ్రోతలకు

భావనకు స్ఫురణ కల్గించదు, ఎందుకనగా ఇవి అందుబాటులో ఉండవు.

సహజాతలైన పంటలు, పాలాలు, వ్యవసాయ పని ముట్లు, పశువులు, ముద్దబంతులు, ముచ్చటైన యింతులు ఇవే పల్లె వాతావరణం ఇవి అందుబాటులో పాఠకునికి శ్రోతకు అందుబాటులో "ఝటిత స్ఫూర్తి" ద్రాక్ష పండు నోటికిచ్చినట్లు సహజాలంకృతలై ఉంటాయి.

ఉదా :

కరుణగల్ల తల్లి కాంతమ్మ తల్లి / కన్నతల్లి మనస్సు కాంతమ్మ తల్లి!
తైదంబలి సల్ల తాగించు ప్రజల / ఎండకాలమంతా నీ తల్లి గాంచు!"

ఇందులో ఉదార గుణం ఆపాదించబడింది. అందుకే "కావ్య శోభాకరాన్ ధర్మాన్ అలంకారాన్ ప్రచక్షతే" అన్న అలంకరికుల ప్రకారం కావ్యశోభ అలంకారాల్లో దాగినట్లు ఇక్కడ వెల్లడవుతుంది.

ప్రకృతి అందం ఒక ఎత్తు నిత్యజీవన బంధాలైన స్నాన, పాన, సుగంధ, భోగ, ఆరోగ్య విషయాలలోని అలం కరణ మరో ఎత్తు.

"జాలే వోసిన వేమయ్య జంగమయ్య!
రైకే గుట్టిన వేమయ్య!
జాలె వోయ్ జల్తారు వోయ్యి! యింపున యిందానమెయ్యి!
రైక ముళ్ళు గుట్టెదాన రాజునాల పొత వోయ్యి!
(పోతరెడ్డిపల్లి గుళ్ళ జంగయ్య రాచూర్)

వ్యవసాయం బండ్లు పూదించడం, ఎద్దుల అలం కరణ (సిరిమల్కలు మెడగంటలు) విత్తనం కుండకు బొట్లు జానపదుల నిత్యజీవితం అలంకరణ గృహం, వస్త్రం, ముగ్గు, పేర్లు, పచ్చపాడుపు ఇవన్నీ పరిశీ లించినట్లయితే మానవునిలోనున్న ఇటువంటి సౌందర్య ప్రేరణా ధృక్పథాలు, లలిత కళల ఆవిర్భావానికి ఆలం బనం. ఇక భాష విషయంలోకి వెళ్ళినట్లయితే భావానికి అందమును ఆపాదిస్తూ అలంకారయుతంగా పరిణామం చెందునని ఆ క్రమమును పరిశీలిద్దాం.

ప్రాచీన ఆర్యుల వాడుక భాష ప్రాకృతం. వారి పల్లె పాటలుగా ప్రచారములో వున్న వేదాలలో ప్రాకృత పదాలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ప్రాకృతం నుండి సంస్కృతం సంస్కరించబడినట్లే మన జానపదమైన వాడుక భాష నుండే గ్రాంధికం రూపు దిద్దుకున్నది. జానపద భాష వల్లే జానపద సాహిత్యం కూడా చరిత్ర కందని అతి పురాతనమైనదని చెప్పవచ్చు.

నిజంగా అలకిస్తే నన్నయ్య ఆదికవి కాదు. పల్లె కవులే ఆదికవులు, అనువాద రచన చేసి పేరు తెచ్చుకున్న కవి నన్నయ్య. మౌలిక పాటలు రాసి పేరు కూడా ఆశించని సహజకవులు ఈ జానపదులు జానపద గేయాలు వేదమంత్ర తుల్యాలు.

జానపదులలో నీతి నియమాలు, పట్టింపులు వావి వరుసల పట్టింపులు పకడ్బంధిగా ఉంటాయి. కుల మతాల ప్రసక్తి లేకుండా గ్రామాల్లో అన్న, చెల్లి, అక్క, బావ మొదలగు వరుసలతో ప్రేమగా పవిత్ర భావంతో పిలుస్తూ అట్లానే వ్యవహరిస్తూ ఉంటారు. వీరిని నీతి నియమాలపై, సాంఘిక సిద్ధాంతాలపై, ధార్మిక విశ్వా సాలపై నమ్మకాలను గేయరూపంలో చక్కని విలువలతో కూడిన జానపద సాహిత్యంలో వెలిబుచ్చుతారు. ప్రబంధాల కంటే కూడా కొన్ని పల్లె పాటలు రసవంతంగా ఉంటాయి.

పల్లె పాటలు అలంకారాలు :

సాహిత్య ప్రక్రియలలో విషయ ప్రాధాన్యతను బట్టి ఉపయోగించే వారిని బట్టి రకరకాలైన పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

1. కొంటె పాటలు, 2. మోటు పాటలు, 3. రేల పదాలు, 4. పడిదెల పదాలు

అని సామాన్యంగా పిలుస్తుంటారు. అయితే శృంగార మైన పాటలకు మాత్రమే ఈ పేర్లు ఎక్కువగా ప్రచారంలో ఉండటం గమనించవచ్చును.

ఏదో ఒక విధంగా అలంకారాలు చోటు చేసు

కుంటాయి. చిన్నపిల్లలు పాడుకునే పాటల్లో కూడా అనేక శబ్దార్థాలంకారాలు కనిపిస్తాయి.

భావం ఏదైనా భాష ప్రవాలమైన అంత్యానుప్రాసాలో ఇంపు సొంపుగా బాలబాలికలు పాడుతూ ఆడుకుంటారు.

జానపద నిత్య సంభాషణలో, రాగద్వేష వ్యక్తీకరణలో, ఆటల్లో, పాటల్లో కుప్పలు తెప్పలుగా అలంకారాలను ఏరుకొనవచ్చు, నేటి సాధారణ జన జీవితంలో సంబంధం ఉన్న అన్ని ప్రక్రియల్లో సాహిత్య పరికరాలలో అలంకారం ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంది. సామెతలు, నినాదాలు దినపత్రికలలో పతాక శీర్షికలు ప్రచార వాక్యాలు, ప్రకటనలు మొదలగు వానిలో చాలా బాగా ఏదో ఒక అలంకారాన్ని కలిగి ఉంటాయి.

ఏ భాషకు సంబంధించిన జానపద గేయాలైన ఆయా జాతుల పుట్టుకతోనే వారి వ్యవహారాలు ప్రారంభమైన వాటి నుండే పుడతాయి, అలాగే తెలుగు జాతి పుట్టుకతోనే ఆ భాష జన్మించడం తెలుగు పదాలు పుట్టినవి అని చెప్పవచ్చును. చరిత్రకు అందని యుగాల నాటి పాటలు కూడా కొన్ని ఈనాటికి ఈ సాహిత్యంలో సజీవంగా ఉన్నాయి. ఈ విషయాలను సుప్రసిద్ధ జానపద పరిశోధకుడు డాక్టర్ దేవేంద్ర సత్యార్థి ఈ విధంగా వివరించారు. "Andhra Folk Songs are irresistibly Alive. Some of them Surel Go back to the pre istoric Days"

ఒక జాతి చైతన్యానికి అభివృద్ధికి వారి మానసిక తత్వాన్ని, వారి సంస్కృతిక జీవన స్థితిగతులను ఆచార, సంప్రదాయాలను తెలుసుకొని దానిని కాపాడుకుంటూ ముందు తరాలకు అందించవలసిన అవసరం చాలా ఉంది. ఇవి అతి ప్రాచీనతను నిలుపుతాయి. దేశ, కాల, ప్రాంతాతీమైన వసుధైక కుటుంబతత్వాన్ని ప్రభోదిస్తాయి. నిరాండంబరతత్వం, నిష్కల్మశత్వం, ప్రకృతి పరిశీలనం, సర్వత్రా పరమాత్మ దర్శనం అనేవి పల్లీయ హృదయ తత్వంపై లక్షణాలలో ఏకత్వంగా భావిస్తాయి. జానపద గేయం అనేది వ్యక్తిగత సంపద కాదు సమిష్టి సంపద.

హాస్యంలో అలంకారం :

చిన్నాంపల్లి సాయిబు / సాయిబుకున్నది గడ్డం
గడ్డానికున్నది గరక / గుర్రమొచ్చి పెరక
బోడ కాకరకాయ బొట్టు / తమ్ముళ్ళ పాపయ్య జుట్టు
జుట్టుకు మద్దెల కట్టు / కట్టుకుంటే ఒట్టుపెట్టు(వరసైన పెద్దలు పళ్ళూడిన పిల్లలను గేలి చేయడంలో) కనిపించే అలంకారం
చేకాను ప్రాస అలంకరమును జానపద సాహిత్యంలో చూసినట్లయితే

ఉదా :

గుంటబలుసు కూరనే గోగుళ్ల చల్ల / మెట్ట బలుసు కూరనే మేకళ్ల చల్ల
అడవి బలుసు కూరనే ఆవుల్ల సల్ల / కొమ్మ బలుసు కూరనే గోవుళ్ళ సల్ల

పొడుపుకథల్లో అలంకారం :

కిస్ కిస్ పిట్ట / నేలకేసి కొట్ట - చీమిడి
కట్ట కాని కట్ట - నీరు కట్టే
పండు కాని పండు - తలపండు

సామెతలలో అలంకారం :

వర్షాలుంటే పంటలు / లేకుంటే మంటలు
లక్ష్య బక్షాలు తినటానికి / ఒక బక్ష్యం లక్ష్యమా
కాళ్ళ గజ్జే కంకలమ్మ / వేగుచుక్క వేలగమొగ్గ - పిల్లల గేయాల్లో - ముక్తపదగ్రస్త
మొగ్గ కాదు మొదుగు నీరు / నీరు కాదు నిమ్మల వాయి
"పన్నెండు గుర్రాల బగ్గి పోతుంది / బగ్గిలో మేనత్త బిడ్డ పోతంది బిడ్డతో బిందెడు నీళ్ళు పోతున్నాయి / నీళ్ళతో నీళ్ళంచు చీరె పోతుంది"

అర్థంతారన్యాసలంకారం :

1. తమ్ముడు తనవాడైనా తప్పు తప్పే.
2. చేసిన పాపం గోసిలో పెట్టుకొని కాశీకి పోయిన తీరదు - సామాన్య విశేషాలకు పరస్పర సమర్థించి చెప్పడం చూడవచ్చు.

మిథ్యాధ్యావత్యాలంకారం :

కోడల కోడల కొలికి ముత్యమా / పచ్చిపాల మీద మీగడేమాయే

వేడి పాల మీది వెన్న ఏమాయే - లేనిది ఉన్నట్లు చెప్పబడింది

క్రమాలంకారం :

ఉరిమిన మేఘం తరిమిన పాము కురవక, కరవక మానవు - అవు సేలమేస్తే దూడ గెట్టు మేయద.

స్వభావోక్తి :

ఆకాశమందున ఊయ్యాలో / అల్లెను మేఘములు ఊయ్యాలో

మేఘాల నడుమ ఊయ్యాలో - గుణాలను చెప్పడం జరిగింది

శ్లేష :

తోటకూర ఏరే పాప / పూటకు ఏ మడిగినావే

పనికి - రాను, పనికిరాను

- భిన్నర్థాలు ఇందులో కనిపిస్తాయి

సాహిత్యం సముద్రం అలాంటి సాహితీ సింధువుల్లో బిందువులాగా కొన్ని అలంకారాల గురించి తెలుసు కున్నాము. వీటితో పాటు రూపక, వ్యాజ్యోక్త, విరోధాభాస, అసంగత్య, కారణమాల, రత్నావళ్యా, వివృతోక్త, గూఢోక్త, విభావనా, ప్రతీప, అపహ్నవ, లోకోక్త్య, ఉద్దాత్య, అక్షేప, తద్గుణ, సారాలంకారం వంటివి (5+30 శబ్దలంకారాలు) జానపద అలంకార పరిశోధన లోతుల్లో అక్కడక్కడ తారసపడ్డాయి. ఇలా జాపపదాల్లో దీనిని బట్టి జానపదుల అలంకార ప్రవృత్తి ద్యోతకమౌతుంది. ఇలా జానపదాల్లో అలంకారాలు సహృదయ హృదయాలను తప్పకుండా అలరిస్తాయి కాబట్టి జానపద సాహిత్యం సమిష్టి సంపద సంస్కృతి సంప్రాదాయాలకు అలంబనం, ప్రేరణ దీన్ని ముందు తరాలకు కొనసాగింప చేయడం మన కర్తవ్యం. ''జానపదం బతుకు చిత్రమాలిక స్వరం'' అందుకే ఆచర ణీయం సర్వం. బహుళ జనపథము జానపదము.

ఆధార ఉపయుక్త గ్రంథసూచి :

1. జానపద విజ్ఞానాధ్యయనం - డాక్టర్ జి.ఎన్. మోహన్ (ద్రావిడ విశ్వ విద్యాలయం) విజయవాణి పబ్లికేషన్స్.
2. తెలుగుభాషలో ఛందో రీతులు - విద్వాన్ రావూరి దొరస్వామి శర్మ (తివేణి పబ్లిషర్సు మచిలీపట్నం)
3. జానపద సాహిత్యంలో అలంకార విధానం - డాక్టర్. కె. రుక్నుద్దీన్ (పరిశోధనా వ్యాసం1878-83)

❖ ❖ ❖

జాన పద గేయ సాహిత్యం

– గూడూరి గ్లోరి యూనెట్, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

జానపద గేయ లక్షణాలు :

పాటలలో ముఖ్యంగా జానపద పాటలు రకరకాలుగా ఉంటాయి. వాటిలో అవి పాడుకునే వ్యక్తులు, తిరు నాళ్ళలో పాడే పాటలు, దేవుడిపై పాడే భక్తి గీతాలు, బోనములు, వీరాచారములు మొదలైనవి ముఖ్యమైన పాటలుగా చెప్పుకోవచ్చు.

పద్యము కన్నా ముందు పదము పాట లేక గీతము పుట్టినదని అంటారు. ఏమైనా శ్రామికులు, పడవ నడిపేవారు, వడ్లు దంచేవారు, పొలం పని చేసుకునేవారు, ఇంట్లో కూనిరాగాలు తీసేవారు ఈ విధగా చెప్పాలంటే చాలా మంది జానపదులు, అనాగరకులు తమ కష్టము కనపడకుండా ఉండాలని పాడుకునే పాటలు జానపద గేయాలని పిలుస్తారు. వీటికి ప్రత్యేక లక్షణములు ఉం డవు. జన హృదయమునుండి వెలువడేదే జానపదం అనవచ్చు. కానీ వారు పాడుకునేటప్పుడు ఒక లయ మనకు కనబడుతుంది. అంతే, ఆ తర్వాత చాలా మంది కవులు, రచయితలు వీరు పాడుకునే పాటలలో లక్షణా లను గురించి వెతకడం జరిగింది.

ప్రాచీన సాహిత్యంలో కూడా ముందుగానే పద్యం వచ్చింది అని చెప్పవచ్చు. పద్యం ఆ తర్వాత రాగ యుక్తంగా పాడడంతో గీతంగా మార్పు చెందినదనవచ్చు. ముఖ్యంగా పద్యాలు లేక లొల్లాయి పాటలు జానపదు లలో మనకు కన్పిస్తాయి. జానపదులు తమ శ్రమను మర్చిపోవడానికి పాటలను పాడుకునేవారు. జానపదులు పాడేవే పాటలు. వారు పలికే పలుకులే పాటలుగా మారాయి.

నాడు కవులు రచించిన లేక జానపదుల నోళ్ళల్లో నానుతున్న పాటలు లేక గీతాలు నేటికీ ప్రజలు పాడుకుంటూనే ఉన్నారు. జానపదుల పాటలైతే ఎవరు రాశారో తెలియని పరిస్థితిలో ఉన్నప్పటికీ కొందరు నేటి ఔత్సాహిక సాహిత్యకారులు వాటిని సేకరించి ఉంచారు. ఇక గీత సాహిత్యంలో కవులు, పదసాహిత్య కర్తలు మాత్రం చిరస్థాయిగా తమ స్థానాన్ని సుస్థిరం చేసు కున్నారు. వాటిలో భక్తి గీతాలు ప్రసిద్ధి చెందాయి. పద కవితా పితామహుడుగా పేరొందిన తాళ్లపాక అన్నమా చార్య రచించిన గీతాలు నేటికీ పలువురు గానం చేస్తు న్నారు. అదే విధంగా జయదేవుని అష్టపదులు, రామదాసు కీర్తనలు నేడు పలువురి భక్తులకు మార్గదర్శనం అయ్యాయి. కేవలం భక్తి గీతాలేకాక దేవునిపైన శృంగార సాహిత్యాన్ని కూడా రచించాడు మహాకవి క్షేత్రయ్య. క్షేత్రయ్య పదంలో కేవలం భగవంతునిపై భక్తి మాత్రమే కాక తాను నాయికగా ఉండి, భగవంతుని నాయకుడిగా చేసుకుని శృంగార భావనలతో గీతాలు రచించండం మామూలు విషయం కాదు. ఆ పని మహాభక్తుడైన క్షేత్రయ్య చేశాడు.

వివిధ రస పోషణను బట్టి, అంటే హాస్యరసం, శృంగార రసం, కరుణ రసం ఇత్యాది రస పోషణను బట్టి జాన పదాలను విభజించవచ్చు. ఇంకా వివిధ వస్తు నిర్ణయాన్ని బట్టి అంటే భక్తిగీతాలు, చారిత్రక గీతాలు, స్త్రీల పాటలు, జోలపాటలు ఇత్యాదివాటిని బట్టి జానపదపదాలను విభజించవచ్చు. ఇదే కాక ఇంకా వాటిలోని కవిత్వ నిర్ణయాన్ని బట్టి కూడా అంటే కవిత్వాంశాలను బట్టి జాన పద విభజన జరుగుతుంది.

జానపదులు పాడే జోలపాటలు, లాలి పాటలు, పిల్లల పాటలు, బతుకమ్మ పాటలు, గొబ్బిపాటలు, సువ్వి పాటలు, పడవ పాటలు, వానదేవుని పాటలు, తుమ్మెద పాటలు, హైలెస్స అనుకునే దంపుడు పాటలు, సిరిసిరి మువ్వ పాటలు, గొల్లసుద్దులు, జాజిరి పాటలు,

కోలాటపు పాటలు, తలుపు దగ్గర హారతి ఇచ్చునప్పుడు పాడుకునే పాటలు, ఏల పాటలు, చిలుక పాటలు, నాట్లు వేసే పాటలు, ఊడుపులు తీసేప్పుడు పాడే పాటలు, కోతల పాటలు, చెక్క భజన పాటలు, పెళ్ళి పాటలు, గ్రామ దేవతల పాటలు, తత్వాలు, భిక్షుకుల పాటలు, తత్వాలు, ఇవి దళితులపై పాడితే దళిత గీతాలుగా, విప్లవం మీద పాడితే విప్లవ గీతాలుగా జాన పద, పల్లె పదాలు కాస్తా ఈ విధంగా ఇలా అనేకరకాలుగా రూపొందాయని భావించవచ్చు.

గీతాల సేకరణ :

ప్రాచీన కవులు రచించిన గీతాలను పరంపరంగా వస్తున్న గీతాలను సేకరించాలనే ఆలోచన వచ్చినదాదిగా అనేకమంది ఉత్సాహవంతులైన విజ్ఞులు గీతాల సేకరణ చేపట్టారు.

ప్రాచీన తెలుగు సాహిత్యోద్ధరణకు నడుం కట్టిన ప్రముఖుడు సి.పి. బ్రౌన్ అని చెప్పవచ్చు. శిష్ట సాహిత్యాద్ధరణకు బ్రౌన్ ఎంతగానో కృషి చేశాడు. అలా శిష్ట సాహిత్య సేకరణకు మధ్యలో జానపద సాహిత్యం మీద కూడా అతని దృష్టి పడింది. బొబ్బిలి కథ, కుమార రాముని కథ, కామమ్మ కథ వంటి గేయ కథలను సేక రించి మనకందించిన వాడు బ్రౌన్ దొర అని చెప్పక తప్పదు. అంతేగాక దేశి సారస్వతమునకు చెందిన అనేక మంజరీ ద్విపదలు, కథాగేయాలు వంటివి కూడా సేకరించాడు కూడా. ఆంగ్లేయుడైనప్పటికీ బ్రౌన్‌దొర ప్రాచీన తెలుగు సాహిత్యమును వెలుగులోనికి తెచ్చి తెలుగు సాహిత్యోద్ధరణకు మహోపకారం చేశాడనవచ్చు. అంతేగాక తెలుగులో మొదటగా ఆంగ్ల - తెలుగు నిఘంటువును కూడా రూపొందించాడు.

తెలుగు సాహిత్యానికి మరొక కృషికర్త ఆంగ్లేయుడైన జె.ఎ. బోవెల్ యం.సి.యస్. అనే ఆయన. ఈయన తెలుగు సాహిత్యంలో అనేక గేయాలను సేకరించాడు. ఇతని తర్వాత ఇతనిని అనుసరించి అనేక మంది తెలుగు పరిశోధకులు నడుం కట్టారనవచ్చు. ఇతను మొత్తం 100 పాటలను సేకరించాడు. ఇతని తర్వాత తెలుగు గేయ సాహిత్యములో పరిశోధనలు జరిగి జానపద గేయాలను సేకరించడం జరిగిందనవచ్చు.

కీ.శ. 1900-1903 లో శ్రీనందిరాజు చలపతిరావుగారు స్త్రీల పాటల్ని సంపుటాలుగా అచ్చువేశారు. ఆ తర్వాత శ్రీ మంగు వెంకట రంగనాథరావు గారు 1904లో మరికొన్ని స్త్రీల పాటల్ని ముద్రించారు. 1904లో స్త్రీ జనానంద నవీన కల్యాణ పాటలు, 1910లో స్త్రీలు వేడుక పాటలు గూడ కృష్ణయ్య గారు సేకరించారు. (బి. రామరాజు పే.63)

1911 లో స్త్రీ జన వినోదిని పెండ్లి పాటలు - వి. కన్నయ్య దాసు, 1913లో స్త్రీల పూజ పాటలు - తెలకపల్లి నరసమాంబ, 1915లో స్త్రీల వేడుక పాటలు - ఘాలి సుబ్బారావు, 1919లో స్త్రీ జననాందకర కల్యాణ పాటలు - ఎస్. గోపాల కృష్ణయ్యగారివి వెలువడ్డాయి.

రాజమండ్రి వాస్తవ్యులు శ్రీ నేదునూరి గంగాధరం గారు మొత్తంగా 6,000 జానపద గేయాలను సేకరిం చారు. టేకుమళ్ల కామేశ్వరరావు, శ్రీపాద గోపాల కృష్ణ మూర్తి గారు కూడా అధిక సంఖ్యలో జానపద గేయాల్ని సేకరించడం జరిగింది. టేకుమళ్ల వారు 1941లోనే పాత పాటలను పేరుతో చిన్న సంకలనాలుగా ప్రకటించారు. శ్రీ కె. సభాపతి పిళ్లెయిగారు చిత్తూరు ప్రాంతంలోని జానపద గేయాలను సేకరించారు. సీతారామ నాయుడు గారు (వకీలు) - హుజూరాబాద్, గరిమల సాయిరెడ్డి, ఇల్లిందల సరస్వతీదేవి, గూడూరి, కనపర్తి, అచ్యుత రాజుగార్లు తెలంగాణా పల్లెపాటల్ని సేకరించారు. జానపద గేయాలను ఎల్లోరా అనే కలంపేరుతో శ్రీ గొడవర్తి భాస్కర రావు గారు సేకరించారు. వీటిని విశాలాంధ్ర వారు 1955లో ప్రచురించారు. ఇవి మొత్తం 98 గీతాలు. రెండవ సంపుటంలో వీరు 71 పాటలు, సేకరించారు వీటిని కూడా విశాలాంధ్రవారు 1959లో ప్రచురించారు. సరాగాలు శిర్షికతో సేకరించిన వాటిని విజయ పబ్లిషింగ్ కంపెనీ (1961లో 114 పాటలను (జానపద గేయాలను)

సేకరించారు. అదే విధంగా పల్లె పాటలు పేరుతో ప్రయాగ నరసింహశాస్త్రిగారు (కవితా పబ్లికేషన్స్) వారు 40 పాటలను సేకరించి (1960) ప్రచురించారు.

తెలంగాణా ప్రాంతంలో శ్రామికులు పాడుకునే పాటలలో ఒకటి చూడండి..

ఏటి కేతంబట్టి ఎయిపుట్లు బండించి
ఎన్నడో మెతుకెరుగరన్నా నేను గంజిలో మెతుకెరు గరన్నా
కాల్జేయి కడుక్కోని కట్టమీద కూసుంటె
కాకి తన్నీ పొయెరన్నాన్నీ కాకిపిల్లదన్నీ పొయెరన్నాన్నీ
పోరుకూ చాల్లేక పొయికాడ కూసుంటె
పోరిదన్నీ పాయెరన్నా పోరి తల్లి దన్నీ పాయెరన్నా
చుక్కపొద్దున లేచి బొక్కె నెత్తుకపోంగ
బొక్కబోర్లా బడితిరన్నా నేను పక్కలిరగాబడితిరన్నా
నాదేటి బతుకాయెరన్నా నేను నాడె చావకపోతిరన్నా

బీద రైతుకు సంబంధించిన పాట ఇది. ఈ పాటను ఎవరు రచించారో తెలీదు. రైతు గుండెల్లోంచి వచ్చి ఉంటుంది. అతని ఆవేదనకు చెందినదీ పాట. ఈ పాటలో కాకి అంటే గ్రామాధికారి అని భావించాలి. కాకి తన్నీ పొయెరన్నా అంటే గ్రామాధికారి వచ్చి ఇతని దగ్గర ఉన్న కూడు లాక్కున్నాడని భావం. అలాగే కాకి అంటే గ్రామాధికారి కొడుకు కూడ వచ్చి దర్జాలు ఒలకబోస్తూ రైతును మరింత తన్ని అతని కూడు లాక్కున్నాడని భావం. పోరుకూ చాల్లేక పొయికాడ కూచుంటె అంటే వీరితో యుద్ధం చేయలేక వంటగదిలో పొయికాడ కూర్చుంటే భార్యా పిల్లలు కూడ ఈసడించుకున్నారని వాపోతాడు.

మరొక గేయాన్ని చూద్దాం...

నదులలో నాటు పడవలు నడుపుకునే సరంగులు తాము పడే శ్రమను మర్చిపోవడానికి అలసటను దూరం చేసుకోవడానికి పాడుకునే పాట ఇది.ఇటువంటి పాటలు ఎన్నో ఉన్నప్పటికీ నేటికీ వీరు తమ శ్రమను మర్చిపోవ డానికి ఉస్సు, అస్సు అంటూ ఏలెస్సా అంటూ పాడుకునే పాట ఇది. ఈ గేయాన్ని గమనిస్తే వీరి శ్రమ ఇక్కడ కన్పిస్తూ దాన్ని వీరు మర్చిపోయేట్లుగా పాడుతున్నారని పిస్తుంది.ఇవన్నీ లొల్లాయి పాటలే.

ఏలేస్సా ఓలెస్సా ఏలెస్సా ఓలెస్సా
ఏలెస్సాబో ఓలెస్సా - ఏలెస్సాబో ఓలెస్సా
ఏలాయేల యేలా యేలా యేల యేలయేవెల్లా
ఏలాయేల యేల యేలా యేలా యేలాయేలా తండేలా
ఏరాఏరా జోర్మెయ్ బార్సెయ్... అని ఈ గీతం సాగుతుంది.

ముగింపు :

గీతం జానపద గీతం నుండి ఆధునిక గేయాల సరళిని గమనిస్తే అనేకవిధాలుగా మార్పు చెందినదని చెప్పవచ్చు. ఆధునిక గేయాలలో అప్పటికప్పుడు ఒక రకమైన ఊపు నిచ్చేవిధంగా ఉంటాయన్నది వాస్తవం. తెలుగు సాహిత్యంలో గీతాలనేవి జానపద గీతాల నుండి ఆవిర్భ వించాయనే చెప్పాలి. జానపద గీతాలను ఒక కవి రచించారని చెప్పేందుకు వీలులేదు. ఇవి జానపదుల నోళ్ళల్లో నాని రకరకాలుగా మార్పులు చెంది జానపద సాహిత్యంగా మార్పు చెందినదని చెప్పక తప్పదు.

ఆధార గ్రంధాలు...

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - శ్రామిక గేయాలు - బిరుదురాజు రామరాజు
2. జానపద గేయాలు, విశాలాంధ్ర పబ్లిషర్స్
3. జానపద సరాగాలు, విజయ పబ్లిషింగ్ కంపెనీ
4. తెలుగు పల్లె పాటలు, కవిత పబ్లికేషన్స్

❖ ❖ ❖

జానపద కళలు – కళారూపాలు – వాద్య పరికరాలు

– మల్లికార్జున్. పి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

జానపదం అంటే గ్రామం, జానపదుల అంటే గ్రామన్థులు లేదా నిరక్షరాన్యులు అని అర్థం. ఈ విషయం తెలుగు నిఘంటువులలో ప్రస్తావించ బడింది. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జానపద అర్థం కూడా మారిపోతూవుంది. ఏదైనా ఒక విషయంలో భావస్వామ్యం వున్న జన సముదాయాన్ని జానపదముగా చెప్పవచ్చు. ఎందుకంటే సంప్రదాయ ములు, ఆచారాలు, నమ్మకాలు మొదలైనవి జాన పదులు మాత్రమే కాకుండా నగరవాసులు కూడా పాటి స్తారు. కావున వారందరూ జానపదానికి చెందినవారే.

జానపద కళలు :

జానపదులు ప్రదర్శించేటువంటి కళలు జానపద కళలు. ఈ కళలు మనస్సుకు ఉల్లాసాన్నిస్తాయి. వినోదంగా వున్న కళలకు కొదువేలేదు. కళలు తర తరాలుగా అందిపడుతున్నాయి. ఈ కళలకు సంప్రదాయ వ్యాప్తి లక్షణం వుంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, ఎన్ని మార్పులకు సమాజం గురైనా జానపద కళలకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదని చెప్పాలి. జానపద కళలు ప్రధానంగా సంగీత, నృత్య ,నాటకాలకు చెంది నవిగా వుంటాయి. జానపదకళల వర్గీకరణ ఈ విధంగా వుంది.

- కథకు సంబంధించిన కళలు : జంగం కథలు, శారధకథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు
- కిన్నెరకథలు, జమ్ములకథలు లాంటివి కలవు.
- బృంద ప్రదర్శన కళలు : కోలాటం , పండరిభజన, చెక్కభజన, డప్పులనృత్యం
- ఒగ్గుడోలు నృత్యం, తప్పెటగుళ్ళు, ఉరుముల నృత్యం,
- అలాయి ఆడటం.
- నాటక సంబంధ కళలు : యక్షగాయం, వీధి నాటకం, బయలాట, తోలుబొమ్మలాట
- పగటివేషాలు లాంటివి మొదలైనవి.
- వినోద కళలు : గంగిరెద్దులాట, ఎలుగుబంటి ప్రదర్శన, పిట్టలదొర
- కాశికావడి లాంటివి మొదలైనవి.
- స్త్రీల నృత్యాలు : బతుకమ్మ, బొడ్డెమ్మ, గొబ్బి లాంటివి మొదలైనవి.
- వ్యష్టి కళలు : దాసరి, ఫకీర్, జంగమదేవర లాంటి కళలు కలవు.

కప్పలకావడి ప్రదర్శనకళ స్త్రీలకు సంబంధించినది. దాదాపుగా కళలు అన్ని మానసిక ఆనందంకోసం, వినోదం కోసం ప్రదర్శించబడతాయి. కప్పలకావడి మాత్రం సమాజ శ్రేయస్సు కోసం ప్రదర్శించబడుతుంది. వర్షాలు రాని సమయంలో మహిళలు ఈ కళ ప్రదర్శనను చేస్తూ వర్షాలు కురవాలని, సమాజంలో ఆకలిచావులు వుండ రాదని, వానదేవున్ని వేడుకుంటు పాటలు పాడుతూ ప్రదర్శన చేస్తారు.

జానపద కళలు – వాద్యాలు :

జానపదులు ప్రదర్శించేటువంటి కళలు అద్భుతంగా వుండాలంటే కొన్ని శబ్దాలు అవసరం. ఆ శబ్దాలు వెలవడ్డానికి మూలం వాద్యాలు. వాద్యం అంటే వాయిం చేది. వాద్యము నుండి వచ్చే ధ్వనులు అనగా దరువులకు అనుగుణంగా జానపద కళాకారులు నృత్యాలు, పాటలు పాడుతారు. మన తెలుగు సాహిత్యంలో వాద్యాల ప్రస్తావన వున్నది. యుద్ధసమయంలో, ముగింపు సమ యంలో వాడినట్లు తెలిపారు. అంతేకాకుండా జాతరలు, ఉత్సవాలు, ఊరేగింపు సమయాలలో వాద్యాలను ఉప యోగించినట్లు సాహిత్యకారులు పేర్కొన్నారు. గాథా

నప్తశతి, ఆముక్తమల్యద, శ్రీకాళహస్తిమహాత్యం, అచ్చతెనుగు రామాయణం, రంగనాథరామాయణం, క్రీడాభిరామం, నృత్యరత్నావళి,పండితరాద్యచరిత్ర లాంటి సాహిత్య గ్రంథాలలో వాద్యాల ప్రసావన వున్నది. గుమ్మెట, డప్పు, మద్దెల, మృదంగం, డమరుకల, నగరా, వీణ, ఏక్‌తారలు, తంబూర, జమిడికలు, డక్కిలు, బుడబుక్కలు, కొమ్ములు, శంఖములు, నాగస్వరం లాంటి వాద్యాలను సాహిత్యకారులు తమ సాహిత్య గ్రంథాలలో పొర్కొన్నారు.

మన జానపద సాహిత్యవేత్తలు జానపద వాద్యాలను ఐదు రకాలుగా విభజించారు. అవి 1) మట్టి వాద్యాలు, 2) చర్మవాద్యాలు, 3) తీగవాద్యాలు, 4) గాలివాద్యాలు, 5) లోహపువాద్యాలు,

మట్టి వాద్యాలు :

మట్టితో తయారు చేసే వాద్యములను మట్టి వాద్యములు అంటారు. ఈ వాద్యములకు నల్లరేగడి, ఎర్రమట్టి, బంకమట్టిని ఉపయోగిస్తారు. ఈ మట్టి వాద్యములను కుమ్మరి కులస్థులు తయారుచేస్తారు. మట్టితో తయారు చేసే వాద్యాలు 1)కుండ, 2)గుమ్మెట 3) తాషా లాంటివి వున్నాయి.

చర్మ వాద్యాలు :

జంతువుల చర్మాలతో తయారు చేసే వాద్యములను చర్మవాద్యములంటారు. వీటిలో కొన్నింటిని జంతువుల చర్మాలను ఆయా వాద్యముల యొక్క ఫ్రేములకు బిగించి కడుతారు. వాటిలో 1) డప్పు 2) డక్కి, 3) తాషా 4) మద్దెల, 5) మృదంగం 6)డమరుకం 7)నగరా, 8) బుడబుక్ 9) పంబజోడు 10) తబలా ý²+{ ₿.

తీగ వాద్యాలు :

తీగను తంత్రీ అంటారు. తీగతో తయారు చేసే వాద్యాలను తీగవాద్యాలు అంటారు. తంత్రీ వాద్యాలను మరొక పేరు కలదు. తగవాద్యాలు అవి 1) ఏక్‌తార 2) కిన్నెర 3) తంబూర, 4) జమిడిక

గాలి వాద్యాలు :

ప్రకృతినుండి వచ్చే గాలిని నోటితో బంధించి వాద్యాల ద్వారా విడవడం (ఊదడం) వలన శబ్దాలు వస్తాయి. ఈ వాద్యాలను నోటీలో పెట్టుకొని గాలిని ఊదడం ద్వారా వినసొంపైన ధ్వనులు వెలువడుతాయి. అవి 1) పిల్లన గొయ్య, 2) సన్నాయి. 3) నాగస్వరం 4) కొమ్ము 5) శంఖం లాంటివి.

లోహపు వాద్యాలు :

లోహాలతో తయారు చేసేటువంటి వాద్యాలు. ఇందులో కంచు, ఇనుము, ఇత్తడి వుంటాయి. లోహాలను తాకించడంవలన కదిలంచడంవలన శబ్దాలు వస్తాయి. అవి 1) తాళాలు 2) అందెలు, 3) దాసరిగంట 4)గజ్జెలు 5) భజన పలకలు 6) చిరుతలు లాంటివి.

ఈ వాద్యాలే కాకుండా కర్రలు, చేతివ్రేళ్ళు, నోరు, టేబుల్, బేంచిలు, వంటపాత్రలను వాద్యాలుగా చెప్పవచ్చు. కోలాటంలో కర్రల సహాయంతో ప్రదర్శన జరుగుతుంది. ఎవరైన పాటను పాడినప్పుడు మనం దానికి స్పందించి చిటికెలు వేయడానికి చేతివ్రేళ్ళు సహ కరిస్తాయి. ఎవరైన పాట పాడినప్పుడు దానికి అను గుణంగా నోటిద్వారా ధనులు చేస్తాము. పాటలు పాడుతున్నప్పుడు చెంబుపైనగాని, టేబుల్‌పైనగాని దరువులు వేస్తాము. ఈ సంఘటనలు సమావేశాలలో పాటలు పాడినప్పుడు పాఠశాలలో పాటలు పాడినప్పుడు జరుగుతాయి. హాస్టళ్ళలో విద్యార్థులు బోజనానికి వరుసలో వెళతారు అప్పుడు కొంతమంది పిల్లలు పాటలు పాడుతూ ప్లేట్లపై దరువులు వేస్తారు.

జానపదకళలు, వాద్యాలు సమాజంతో పాటుగానే రూపాంతరము చెందుతున్నాయి. వీటిని ఆదరించేవారు తగ్గిపోయారు. కళలను, వాద్యాలను ఉపయోగించడం వలన వారిని చిన్నచూపు చూస్తున్నారు. అయినా కళా కారులు వీటిని మందుకు తీసుకువెళ్తున్నారు. ప్రభుత్వం పరిశోధక విద్యార్థులు, చదువుకున్నవారు కళలను గురించి

అవగాహన కల్పించి, కళల ప్రదర్శనకు తోడ్పడాలి. ప్రభుత్వం కళాకారులకు తగిన పారితోషికం అందించాలి. విజ్ఞానాభివృద్ధి ఎంత ఉన్నా కళలను ప్రదర్శిస్తున్నారంటే వారియొక్క గొప్పతనముగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అంధ్రుల జానపద విజ్ఞాన - డాక్టర్ ఆర్.వి.ఎస్ సుందరం
2. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
3. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
4. సంగీత వాద్యాలు - దండమూడి తిరుమలేష్ కుమార్.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల ఇలవేల్పు -బాపూజీ మహరాజ్

-శోల్కం రాములు, తెలుగు ఉపన్యాసకులు, రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం, బాసర.

భారతీయ సాంప్రదాయంలో రాళ్ళను, చెట్లను, మూగజీవులను, దేవుళ్ళను, దేవతలను పుణ్యమూర్తులను, మహిమ గల వ్యక్తులను సనాతన కాలం నుండి పూజిస్తూనే ఉన్నారు. ఒక కుటుంబం కాని, కొన్ని కుటుంబాలు కాని ఒక చోట ఒక నిర్ధిష్ట సమయంలో ఐకమత్యంతో జరుపుకొనేవి పడుగలు. అన్ని మతాలు, అనేక గ్రామల ప్రజలు కలిసి మెలసి సమానత్వం, ఐకమత్యంతో జరుపుకొనేవి జాతరలు. జాతరలు జానపదుల జీవన విధానాలకు, విశ్వాసాలకు నిదర్శనంగా నిలుస్తాయి. చారిత్రాకమైన మన భారతదేశంలో అనేక జాతరలు జరగుతున్నాయి. వీటిలో వేటి ప్రత్యేకతలు వాటివే.

150 సంవత్సరాల చారిత్రాత్మక నేపథ్యంను కలిగిన జాతర ఇది. జిల్లా కేంద్రమైన నిర్మల్ నుండి 50 కిలోమీటర్ల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చదువుల తల్లి సరస్వతీ దేవస్థానం బాసర నుండి 30 కిలోమీటర్ల దూరంలో వెలిసిన జాతర బాపూజీ మహరాజ్ జాతర.

జాతర చరిత్ర - ఇతివృత్తం :

మరాఠ యోధుడు చత్రపతి శివాజీ మహరాజ్ గురువు సమర్థ రాందాస్ శిష్య గణం.

- సమర్థ రాందాస మహరాజ్
- కృష్ణస్వామి మహరాజ్
- బాపూజీ మహరాజ్
- శ్రీరాం మహరాజ్
- రాందాస్ మహరాజ్
- బాను మహరాజ్

కృష్ణస్వామి మహరాజ్ తను గురువుగారైన సమర్థ రాందాస్ మహరాజ్ నన్నిది విడిచి దేశ సంచారం చేసుకుంటు సిరాల గ్రామకొండలోని ఒక గుహలో స్థిర నివాసం ఏర్పరుచుకొని తమ గురువుగారిని స్మరిస్తూ ధ్యానం చేసుకుంటు ఉండేవాడు. కృష్ణస్వామి గారి మహిమలు సత్స సంకల్ప బుద్ధి నెరిగిన అనేక భక్తులు ఆయనకు శిష్యులుగా మారారు. వారిలో బాపూజీ మహరాజ్ ఒకరు. కృష్ణస్వామి గారి మహిమలు తెలుసుకొని అనేక గ్రామాల ప్రజలు మహరాజ్ గారి దర్శనార్థం సిరాల గ్రామానికి రావడం ప్రారంభించారు. జనాలు తండోపతండాలుగా రావడం వలన అక్కడి ప్రజలకు, పశువులకు (నీరు, అన్నదానం పశువులకు మెత విషయాలు) ఇబ్బంది కలిగింది. ఈ విషయాన్ని గ్రహించిన కృష్ణస్వామి ప్రజల సంకుచిత మనస్తత్వం ఎరిగి ఆ ప్రాంతంను వదిలి వెళ్ళిపోయాడు. తమ గురువైన కృష్ణ స్వామి మహరాజ్ గారి ఆచూకి తెలియక అతని శిష్యుడైన బాపూజి మహరాజ్ తమ గురువుగారి పాదముద్రికలు తీసుకొని తూర్పు వైపునకు ప్రయాణిస్తూ బాసర సరస్వతీ అమ్మవారి చెంతకు చెరుదాం అనుకుంటూ ఇలేగాం గ్రామం గుండా ప్రయాణించగా ఇలేగాం గ్రామంలోని పెద్దలు, కృష్ణస్వామి శిష్యులు అయినటువంటి నాతురావ్ దేశాయి, దర్బార్ రాముషావుకారి నిరాన్ షావుకారి, శంకర్ షావుకారి, బాబు షావుకారి, పోశెట్టి షావుకారి అందరు కలిసి తమ గ్రామంలోనే కొంత స్థలంను కేటాయించి కృష్ణస్వామి వారి పాద ముద్రికలను ప్రతిష్ఠించి ఆయనకు గుడి కట్టించారు. అప్పటి నుండి కృష్ణస్వామి మహరాజ్‌ను స్మరిస్తూ బాపూజీ మహరాజ్ పేరు మీదుగా ఈ జాతర నిర్వహిస్తున్నారు.

జాతర జరిగే విధానం:

బాపూజీ మహరాజ్ జాతర పాల్గున పంచమి నుండి దశమి వరకు లేదా శివరాత్రి అయిన ఏడవ రోజు నుండి 5 రోజుల పాటు అంగరంగ వైభవంగా ప్రతి సంవత్సరం జరిగే జాతర ఇది.

జాతర మొదటి రోజు కృష్ణస్వామి శిష్యగణాలలో ఒకరు భాను మహరాజ్ (ప్రస్తుతం) సూర్యోదయంనకు ముందు పుణ్యస్నానం ఆచరించు సిరాల గ్రామానికి వెళ్ళి అచ్చట భిక్షాటన చేసిన వచ్చిన దానంతో కృష్ణస్వామికి నైవేధ్యంను సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడుతుంది. జాతరకు ముందురోజే చుట్టు ప్రక్కల గ్రామాలలోని బంధువులను పిలుచుకుంటారు. గ్రామం లోని ప్రతి ఇంటి నుండి తమకు తోచిన ధన, ధాన్యాలను సమర్పించుకుంటారు. సిరాల గ్రామం నుండి మహరాజ్ వచ్చాక ఇలేగాం గ్రామంలో ఒక పల్లకిలో కృష్ణస్వామి, బాపూజీ మహరాజ్ చిత్రపటాలను ఒక పల్లకిలో ఊరేగిస్తూ భాను మహరాజ్ బిక్షాటన చేస్తారు. బిక్షాటన చేసే సమయంలో గ్రామంలోని ప్రజలు ఒక పీఠ వేసి మహరాజ్ పాదాలను పసుపు, కుంకుమను అలంకరించి తమకు తోచిన దాన ధర్మాలు చేస్తారు. బిక్షాటన చేశాక వచ్చిన దాన ధర్మాలను నైవేధ్యంగా వండి గురువులకు సమర్పించుకుంటారు. అదేరోజు రాత్రి అన్నదాన కార్యక్రం ఉంటుంది. ప్రజలకు వినోదంను కలిగించడానికి నర్తనశాల, లవకుశ, ద్రౌపతి వస్త్రాపహరణం ఎల్లమ్మ వంటి నాటకాలు ప్రదర్శిస్తారు. ఆనందంను కలిగించే యంత్రాలు, తినుబండరాలు, దుకాణాలు వస్తాయి.

రెండవ రోజు గురువుగారు లేరనే బాధతో ఏకాంతంగా శివాలయం ప్రక్కన కూర్చొని ఉండి గ్రామస్తులు అందరు కలిసి భజన చేసుకుంటు, కీర్తనలు పాడుతూ, భుజ్జగిస్తూ మందిరానికి తీసుకొని వస్తారు. మూడవ రోజు గ్రామం లోని కాపు కులస్థులు తమకు తోచిన దాన ధర్మాలు చేసి మహారాజ్‌కు నైవేధ్యం సమర్పించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాల్గవరోజు సత్యనారాయణ వ్రతంను జరిపి అన్నదాన కార్యక్రమంను జరుపుతారు. జాతర చివరి రోజు గ్రామంలోని బ్రాహ్మణులు, కోమట్లు మహరాజ్ గారిని పూజించి నైవేధ్యం సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. తమ కోరికలు తీర్చుమని మనసులో కోరుకుంటారు. ఈ విధంగా జాతర పూర్తి అవుతుంది. సనాతన కాలం నుండి జాతిని ఐక్యం చేయడంలో జాతరలు ప్రత్యేకమైనవి. జాతరలు ఆనందం ఆహ్లాదం కాకుండా చారిత్రక ఆధారాలు అందించడంలో తోడ్పడు తాయి. ఇటువంటి జాతరలు సజీవంగా నిల్పి అంగరంగ వైభవంగా నిర్వహించవల్సిన బాధ్యత అందరిది.

ముఖా ముఖి సేకరణ :

1. పెర్లంపల్లి శంకర్, గ్రామం ఇలేగాం, జిల్లా నిర్మల్, సెల్: 9849857162.
2. కోల రాంచందర్, గ్రామం ఇలేగాం, జిల్లా నిర్మల్
3. కోల క్రిష్ణమూర్తి, గ్రామం ఇలేగాం, జిల్లా నిర్మల్, సెల్: 9848467100.
4. పండరి శావుకార్, గ్రామం ఇలేగాం, జిల్లా నిర్మల్
5. రెడ్ల బాలాజి, గ్రామం ఇలేగాం, జిల్లా నిర్మల్, సెల్: 9010140767.
6. పోతూరి గంగాధర్ గ్రామం ఇలేగాం, జిల్లా నిర్మల్, సెల్: 9701620759.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద కళారూపాలు – వృత్తి జీవన వైశిష్ట్యత

– బసకరెడ్డి, అధ్యాపకుడు, నలంద ఉపాధ్యాయ విద్య శిక్షణ కళాశాల, మహబూబ్ నగర్, తెలంగాణ.

జనపదం అనగా పల్లె ప్రజలు. పల్లెల్లో అలరారు కళలను జానపద కళలు అంటారు. పల్లెలనుంచి, సామాన్యుల నుంచి పుట్టిందే జానపద సాహిత్యం. అమ్మ లాలిపాట బిడ్డ ఆకాలిని మరిపిస్తుంది, జోలపాట నిద్ర ఒడిలోకి చేరుస్తుంది, పాటకున్న శక్తి అటువంటిది. కష్టజీవుల మనుసుల నుంచి పుట్టినవే జానపద కళలు. పల్లెల్లో ఆటలకు, పాటలకు విడదీయలేని బంధం ఉన్నది. ఇక్కడి సాహిత్యం ప్రజా సాహిత్యం. ఇక్కడ కళలు ప్రజాకళలు. పాటలు, గేయాలు, కథలు మొదలైనవి అపారమైన సారస్వతము అనేక కళారూపాల్లో వైభవాన్ని పల్లె ప్రజల నాలుకల మీద నాట్యమాడుతాయి, అవే జానపదకళలు. జానపద కళలు అతి ప్రాచీనమైనవి. మానవుల యొక్క అనుభూతులకు, మానసిక చైతన్యనికి, విజ్ఞాన, వినోదాలకు, జాతి సంస్కృతికి, వారసత్వానికి, ఆనందోత్సాహాలకు ప్రతీకలై నిలిచాయి. శ్రమను మర్చిపోయేందుకు పుట్టిన జానపద కళలు అన్ని కళాలకు పునాదులై, అగ్రభాగాన నిలిచి, సామాజిక రుగ్మతలను నిర్మూలించడంలో కూడా ఎంతో ప్రాధాన్యతను సంత రించకున్న జానపదకళలు. అందులోని కొన్నింటిని పరిశీలిద్దాం.

సిద్ధీ - కంచెనీ వేషాలు :

జానపద కళారూపాలలో ఎక్కువ స్థానాన్ని ఆక్ర మించినవీ, బహురూపాలుగా ప్రజలను అలరించినవీ పగటి వేషాలే. అలాంటి వాటిలో నాటి సామాజిక పరిస్థితుల్ని వివరించేదే సిద్ధీ - కంచెనీ వేషాలు.

ముస్లింలకు చెందిన సిద్ధీ.. ముఖానికి గడ్డం, నల్లటి రంగు పూసుకొని, చొక్కాపైన ఒక కోటు, సిల్కు లుంగి ధరించి, టర్కీ టోపి, పెట్టుకొని ఉంటాడు. ఇంక కంచెనీ అంటే భోగం వారు. వీరు ఇద్దరు, లేదా ముగ్గురు ఉంటారు, వీరు నాట్యకత్తెలు. వీరు అందరు కలిసి వివిధ రూపాలలో సమాజంలో ఉన్న సాంఘిక పరిస్థితులను వివరిస్తారు. దశావతారాలను, అష్టపదులను, ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలను, త్యాగరాయ కీర్తనలను పాడుతూ, హార్మోనీ నీ వాయించేవారు, మద్దెలను వాయించేవారు ఉంటు, నృత్యం చేస్తూ చక్కగా అభినయిస్తారు.

గారడీవేషం :

ఇదికూడ పగటి వేషం క్రిందికి వస్తుంది. ఈ గారడీ వేషం చాలా సాహసవంతమైనది. ప్రేక్షకులకు భయం కలిగిస్తుంది. ముఖ్యంగా ఇది అగ్నికి సంబంధించినది. గ్రామంలో కమ్మరిని పిలిచి బజారులో కొలిమిని పెట్టించి, గడ్డపారల్ని, పలుగుల్నీ, ఇనుప వస్తువులను ఎర్రగా కాల్చి, ఆ ఎర్రగా కాల్చిన పలుగుల్ని చేతితో దూయడం, ఇనుప వస్తువులను పళ్ళతో పట్టించడం, నెత్తిమీద పొయ్యిపెట్టి దానిమీద పెనం పెట్టి గారెలు వండటం - ఇలా చూప రుల్ని ఆశ్చర్యంతో ముంచివేసే వాళ్ళు. అయితే ఈ పనులు చేసేటప్పడు వాయిద్యాలను ఉధృతంగా వాయిస్తూ, పాటలు పాడుతూ, కేకలు వేస్తూ ఉంటే, గారడీ వాళ్ళు చేసే పనులు కూడా మాకు మంత్రతంత్ర విద్యలు వచ్చునని నిరుపించారు. ఇలాంటి గారడీలు రెండువందల సంవత్సరాల నాటివి.

బుడిగె వాయిద్య కారులు :

ఈ బుడిగెనే డక్కీ, డిక్కీ, గుమ్మెట్ల, అన్ని అనేక రీతులలో ఆయ ప్రాంతాలలో పిలుస్తారు. వీటిని ఇత్తడితో, కంచుతో తయరుచేస్తారు. ఈ వాయిద్యంను బుర్రకథలో, బుడ్గజంగం వాళ్ళకు జీవనోపాదిని ఇస్తుంది. గుమ్మెట - ఇది శాస్త్రీయమైన వరుసలతో కనువిందు చేయిస్తారు. ఈ వాయిద్యంలో ఖమ్మం వాస్తవ్యుడు బుర్రపంతులు ఈ గుమ్మెట మీద అనేక ధ్వనులను

శాస్త్రీయంగా పలికిస్తాడు. సన్నివేశానికి అనుగుణంగా ధ్వనులను పలికించగలడు. అలాగే దొడ్డారపు వెంకట స్వామి, తాటికొండ సుబ్బయ్య, యల్లమంద మొదలగు వారు ఈ వాయిద్యంలో సిద్ధహస్తులు. ఎంతో సాధన చేస్తేగానీ ఈ వరుసలు అంకెకు రావు. బుర్రకథలకు ఈ వరుసలే ముఖ్యం. ఉదాహరణకు

దద్దో తిమి, దద్దో తిమి
తక తక్క తక తక్క
తక తక్క తత ధిమి
తక తకిట్ట తక్కిట తక్కిట

ఈ విధంగా ఎన్నో వరుసలతో జోడు గుమ్మెటలు ముక్తాయింపులతో వాయిస్తూ ఉంటే కథ ఎంతో రస వత్తరంగా నడుస్తుంది. వరుసలకు తగినట్లుగా కథకుడు నృత్యం చేస్తూ ఉంటే ప్రజలు ఉత్తేజాన్ని పొందుతారు.

డప్పతోసందరాళ్ళ ఆట :

ఇది గ్రామీణ ఆట, తెలంగాణ రాష్ట్రంలో జోగుళాంబ గద్వాల్ జిల్లాలో ఎంతో ప్రాచుర్యం పొందింది.

సందరాళ్ళు (రాయి), ఈ రాయి ముడు, ఐదు, పది, పదిహేను, ఇరవై, ఇరవైఐదు కే.జీ ల రాయిని ఒక వ్యక్తి ఒక చెయ్యి మణికట్టుతో, నోటితో పైకి ఎత్తడం జరుగుతుంది. ఈ రాయిని ఎత్తుతున్నప్పుడు డప్పును వాయిస్తుంటారు. ఈ రాళ్ళును ఎత్తడం అనేది శిక్షణద్వారా మాత్రమే జరుగుతుంది, ఎవరు అయితే శిక్షణ పొందుతారో వారు ప్రత్యేక సందర్భలలో పోటిలను కూడా నిర్వహిస్తారు.

దండాగానం :

తెలంగాణ రాష్ట్రంలో పల్లె ప్రజలలో బాగా ప్రచారంలో ఉంది. ఈ దండాగానం అంటే అల్లాకేనాం అంటూ పాడే ఫకీర్ల పాటకన్నా కొంతభిన్నంగా ఉంటుంది. ఇందులో ఉర్దూ పదాలు ఉర్దూ భాష ఉచ్చారణ తక్కువగా ఉంటుంది. దీనిని ప్రదర్శించడానికి ఇద్దరు వ్యక్తులు ఉంటే చాలు. వీరు ఎర్రని లుంగీలు ధరించి, నల్ల బనీన్లు తొడుక్కుని, మోకాలు వరకు వ్రేలాడే పంచెను నడుముకు కట్టి, కోర మీసాలు ధరించి, మెడలో ఫకీరు పూసల దండను వేసుకుంటారు. ఎర్రని రిబ్బన్ తలకు కట్టుకుంటారు. ఒక కర్రను దండంగా ఉపయోగించి ముంచేతికి గాజులు ధరించి. గాజులున్న చేతితో కర్రను పట్టుకొని, ఆ కర్రతో గాజులను తాళంగా కొడుతు లయ తప్పకుండా ఒకరు గానం సాగిస్తారు, కుడిచేతితో గాజులు కోడుతు ఎడమ చెతితో రుమాలను ఉపుతు,అదే చేతితో మీసాన్ని మెలి వేస్తు ప్రజలను ఉత్తేజపరుస్తూ పాటను పాడుతారు - అని ప్రముఖ రచయిత, కవి జయధీర్ తిరుమలరావు గారు తమ ప్రజా కళారూపాలు గ్రంథంలో వివరిస్తూ, ఈ పాటలలో తెలంగాణలో జరిగిన పోరాటాల చరిత్ర, నైజాం కాలంలో పోలీసుల చర్య తరువాత ప్రజా జీవితంలో వచ్చిన మార్పల్ని, వారి ఆశయాలను అభిశంసలను ఈ గానంలో ప్రతిబింభించాయి అని రాశారు. దీనిలో పాట పాడుతు ఆవేశంతో హావభావలను చూపించడం జరుగుతుంది. ఈ దండాగాన కళారూపాన్ని, అమ్ములు ధరించిన కొయవేషాలతో ప్రదర్శించారని ప్రముఖ ప్రజా జానపద కళకారుడు సుద్దాల హనుమంతు గారు నాటి పరిస్థితులను వివరిస్తూ కొన్ని గీతాలు పాడారు...

దిన దిన ప్రజల జీవిత మతిభారమయింది
ధనవంతుల భూస్వాముల దోపిడి పెరిగింది
అసాధ్యమైన నిరుద్యోగత అధికమయ్యింది
కర్మాగారములందే పదిలక్షల మంది
కార్మికుల జీవితాల విలువ తగ్గపోయింది
“ sÁ¶ <ÃDeTT€ ÔaV¥Ôa¶ Å£>T¶ n sTH~

- అని చెపుతు గీతాలు పాడారు.

నూనెగుడ్డలవారు :

ఒకో ప్రాంతంలో ఒకో కళారూపం అభివృద్ధి పొందింది. అయితే ఈ నూనె గుడ్డలవారు తెలంగాణలో ఎక్కువగా ఉన్నారు. వీరు రంగు రంగుల అందమైన గుడ్డలమీద గవ్వల్ని బెల్టులుగా కుట్టి వరుసలు వరుసలుగా అలంకరిస్తారు. మరో విశేషం వీరు ధరించే

గుడ్డలు నూనెతో తడిసి ఉంటాయి. అందువల్లనే వారికి ప్రత్యేకంగా నూనెగుడ్డలవారు అని పేరు వచ్చింది. వీరు మెడలో గవ్వల హారాల్ని ధరిస్తారు. నుదుట పెద్ద సింధూరపు బొట్టును ధరిస్తారు. తలకు గంభీరమైన తలగుడ్డను చూడతారు. చూపరులకు ఒక విలక్షణమైన వ్యక్తిగా, మంత్రగాడుగా కనిపించే వారు. వీరు జ్యోతిషాన్ని, గ్రహల కదలికలను చెప్పరు, నోటితో వచ్చే సాహిత్యం మాత్రం ఒకదానికొకటి పొంతన లేకుండ ఉంటుంది. వీరు ఈ విద్య ద్వారా గ్రామ ప్రజలను ఆకర్షించి, వారి భవిష్యత్‌ను చెపుతూ, గ్రహదోషలను తొలగిస్తూ జీవిస్తున్నారు. వీరికొసం ఎదురుచూసేవారు పల్లెల్లో ఎంతో మంది ఉన్నారు.

కడ్డీవాయిద్యం :

దాసరులనీ, మిత్తుల అయ్యవార్లనీ పిలువబడే వీరు, కడ్డీ వాయిద్యంలో సిద్ధహస్తులు. ఈ వాయిద్యం వీణ మాదిరిగా ఉంటుంది. వీణమాదిరే దీనిని కూడా చేతి వ్రేళ్ళతోనే వాయిస్తారు. వీరు ముఖ్యంగా ఈ వాయిద్యం మీద భక్తి సంకీర్తనలను వాయిస్తూ ఉంటారు. ఈ వాయిద్యం రెండు సన్నని పుల్లలతో పొడువుగా ఉంటుంది. ఈ స్వరమాధుర్యం ఎంతో మధురంగా ఉంటుంది, వీరి వృత్తికి ప్రాధాన్యమైనది ఇది. అయితే ఈ వాయిద్యంను అందరు వాయించలేరు ప్రత్యేక శిక్షణ తోను, సాధనతోను సాధించడమే. అందుకే ఈ వాయిద్యంలో చాలా తక్కువ మంది ప్రసిద్ధలైనవారు ఉన్నారు. కరీంనగర్ జిల్లా మెట్టుపల్లిలో ఎక్కువగా ఉన్నారు ఈ కళారూపానికి సంబంధించిన వారు.

బాలసంతు :

వీరు బుడిగె జంగం కులంలో ఒక తెగ. వీరు సంతనం లేనివారికి సంతనం కలగాలని దీవిస్తూ అడుక్కొనే వాళ్ళని బాలసంతు వారు అంటారు. వీరు ఊరికి బయట గుడిసెలు లేదా గుడారాలు వేసుకొని ఆ ఊరిలో అడుక్కొంటారు. పురుషులు తెల్లవారకముందే ధోవతి కట్టుకొని, చొక్కా వేసుకొని, తలకు పాగ చుట్టుకొని, నుదుట విభూతి రేఖలు పెట్టుకొంటారు. భుజం మీద కావడి పెట్టుకొని, కావడికి ఇరువైపుల రెండు సంచులు తగిలించుకొని కుడివైపున శంఖం, ఎడమవైపున గంట ఉండే విధంగా తాడుకు కట్టి మెడలో వేసుకుంటారు. గంట వాయిస్తూ ప్రతి ఇంటి ముందుకు వెళ్ళి వీరగాథల్ని లేదా శైవకథల్ని పాడుతూ భిక్షం స్వీకరించి, శంఖం ఊది, పిల్లాపాపలతో చల్లగా ఉండమని దీవిస్తారు. అప్పు డప్పుడు వేటకు వెళ్ళడం వీరి జీవనవిధానంలో ఒక భాగం.

కాటిపాపలు :

వీళ్ళు బుడిగె జంగం కులంలో ఒక భాగం. వీరు ఏ కులం వారు చనిపోయినా శవసంస్కార సమయంలో ఇద్దరు లేక ముగ్గురు పురుషులు ఒక బృందంగా శవం ముందునడుస్తూ, చనిపోయిన వ్యక్తి గుణగణాలను, గొప్పదనాన్ని రాజులతో పోల్చి పాటరూపంలో పాడుతారు. శవం పాడె పైన, శవంను భూమిలో పెట్టే ముందు వీరు పాడె పైన పడుకుంటారు. ఎవరు చనిపాయినా వీరు వచ్చినచో శుభంగా, అదృష్టంగా, బావిస్తారు. వీరు రాకపోతే అయ్యో కాటిపాలు రాలేదు ఏమి దురదృష్టవశాత్తు అని అనుకుంటారు. వీళ్ళు మిగతా సమయాల్లో అడుక్కుంటారు. వేటకు వెళతారు. ఆడవాళ్లు ఈతచాపలు అల్లుతారు లేదా కూలీకి పోతారు.

దుబ్బులవాళ్ళు :

దుబ్బు అనేది వాద్యం. ఈ వాద్యాన్ని వాయిస్తూ కనక దుర్గమ్మ కథను చెప్పేవాళ్ళను దుబ్బుల వాళ్ళు అంటారు. దుబ్బుల వాళ్ళు ఎక్కువగా చాకలి, తెలుగు కులాల వాళ్ళు ఉంటారు. కనకదుర్గమ్మను కొలుపు చేస్తారు. పురుషులు మాత్రమే ఈ కొలుపులు చేస్తారు. వీరి దుబ్బు వాద్యం డప్పు వాద్యం లాగే ఉంటుంది. ఇది చిన్నదిగా డప్పు ఆకారంలో ఉంటుంది. చేతితో వాయిస్తారు. ఇది వరంగల్‌లో ఎక్కువగా ఉంటుంది. ఏ కులంవారికైనా ఆరోగ్యం బాగలేకపోయినా, దిష్టి తగిలిందని భావించినా, విచిత్రమైన రోగాలు వచ్చినా వీరిని పిలిపించి ఇంట్లో

శాంతి చేయిస్తారు. మూడు సంవత్సరాలకు ఒకసారి ఊరివారందరు కలిసి కొలుపు చేస్తారు.

శారద కథలు :

శారద అనే వాద్యాన్ని వాయిస్తూ కథను చెపుతారు కాబట్టి దీనికి శారద కథ అని పేరు. శారద కథలు చెప్పేవారిని శారదగాండ్రు అని పిలుస్తారు. వీరు బుడిగె జంగాలలో ఒక వర్గంవారైన ఈ శారదగాండ్రు కథలు చెపుతూ, అన్ని కులాలవారిని అడుక్కుంటారు. శుభకార్య మైనా, దినమైనా, మాసికమైనా వీరు కథలు చెపుతారు. కథకుడు శారదను కుడిభుజం మీద పెట్టుకొని, ఎడమ చేతి బొటన వ్రేలుకు అందెలు ధరిస్తారు. ఈ వాద్యాలు వీరే తయారుచేసుకొంటారు. బాలనాగమ్మ, బొబ్బిలి కథ, పాండవుల కథలు, ధర్మాంగరాజు, ఎరుకల నాంచారి, సర్దార్ సర్వాయి పాపన్న మొదలైన కథలతో పాటు ఆ ప్రాంతంలో పేరుపొందిన వ్యక్తుల జీవిత చరిత్రలను కూడా కథరూపంలో తయారుచేసుకొని చెబుతుంటారు. ఇంటింటికి తిరిగి కథ చెపుతారు.

ఒగ్గు కథ :

శివుని ఢమరుకాన్ని పోలిన ఒగ్గు వాద్యాన్ని వాయిస్తూ కథను చెప్పుతారు. ఈ కథను చెప్పే, వాయిస్తూ ఉన్న వాళ్ళని ఒగ్గు వాళ్ళు అంటారు. వీరు గొల్ల/కురువ కులానికి ఉపకులస్థులు. వీరు గొల్లవాళ్ళు చేసుకునే బీరన్న పండుగకు పూజరులుగా ఉంటారు. వీరు అన్ని కాలాలలో కాల ప్రసక్తిలేకుండా అందరికి కథలు చెపుతారు. పండుగలు, పెండ్లిళ్ళు, చావులు, దినాలు, మొదలైన సందర్భాలలో వీరు కథలు చెపుతుంటారు. సంక్రాంతి నెలముందు నుండి సంక్రాంతి వరకు, శివరాత్రి నుండి దసరా వరకు పట్నాలు వేసి కథలు చెపుతారు. పట్నాలు వేసి కథ చెప్పడాన్ని పట్టి పండుగ అంటారు. బీరన్న, మల్లన్న, ఎల్లమ్మ మొదలైన దేవతలకు పూసపలక, చక్రాలపలక అనే రెండు రకాల పలకలతో పట్నాలు వేస్తారు. ఈ పలకల కొయ్యతో, చతురస్రాకారంలో, దీర్ఘ చతురస్రాకారంలో చక్రాల డిజైన్ చెక్కబడి ఉంటుంది. ఈ పలకలలో చతురస్రాకారంలో పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చ మొదలైన రంగులతో పట్నాలు చేస్తారు. ఐదుగురు పురుషులు ఒక జట్టుగా ఉండి, ఒకరు ప్రధాన కథకుడు, ఇంకొకరు కథా సహాయకుడు, మిగిలిన ముగ్గురు వాద్యాలు వాయిస్తూ కథ చెపుతారు. వీరు వాయించే వాద్యాలు డోలు, తాళాలు, ఒగ్గు కనకడప్పు, కంజరీ, ఒగ్గు వాద్యాన్ని బీరన్న ఎల్లమ్మ పండుగలప్పుడు పట్నాలు వేసినప్పుడు వాయిస్తారు. కనకడప్పు అప్పు డప్పుడు వాయిస్తారు. వీరు చెప్పే కథలు మల్లన్న కథ, బీరన్న కథ, ఎల్లమ్మ కథ, కాటమరాజుకథ, మార్కండేయ పురాణం, మండోదరి కథలు చెపుతారు. కథ ప్రారంభంలో గణపతి, గ్రామ దేవతను ప్రార్థిస్తారు. కథ ముగిసిన తర్వాత మంగళంతో ముగించుతారు. ఈ కథలో సిద్ధ హస్తులు చుక్క సత్తయ్య, మిద్దే రాములు. ఈ ఒగ్గు కథకు వరంగల్, నల్లగొండ లలో కళాకారులు ఎక్కువ.

వైవిధ్యభరితమైన జానపద కళారూపాలు తర తరాలుగా కళాప్రదర్శననే తమ వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్న కళాకారులు అధికంగా తెలుగు ప్రాంతంలో ఉన్నారు. నేటి ప్రసార, ప్రచార మాధ్యమాల పోటివల్ల జానపద కళాకారులు, కళారూపాలు కనుమరుగై పోతున్నాయి. కాబట్టి ప్రభుత్వాలు వివిధ పథకాలను, సాంస్కృతిక భావజాలాన్ని ప్రజల దగ్గరకు తీసుకపోవడానికి జానపద కళారూపలే ప్రచార సాధనాలుగా చేసుకోవలి.

ఆధార గ్రంథాలు :

1. జానపద కళారూపాలు గ్రంథం - రచయిత డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
2. జానపద విజ్ఞానం - డా॥ ఆర్.వి.ఎస్. సుందరం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మానవ జీవన స్రవంతిలో జానపద సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు

– సూరేపల్లి లక్ష్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, రంగల్, తెలంగాణ.

జానపద విజ్ఞానం అనేది రోజు రోజుకీ క్షీణిస్తున్న విశిష్ట జ్ఞానసంపద. దీనిలో చాలా భాగం మౌఖికంగా ఒక తరం నుండి ముందు తరాలకు సంక్రమించేది కావడం చేత ఈనాడు ఉన్నటువంటి సాహిత్య స్వరూపాలు, కళా రూపాలు లాంటివి రేపటి రోజుకు ఉంటాయనే నమ్మకం లేదు. జానపదానికి సంబందించిన విజ్ఞానం లేదా జన పదులకు సంబంధించిన విజ్ఞానమే జానపద విజ్ఞానం అని చెప్పడం చాలా తేలికయిన విషయం. ఇందులో జనపదులు అంటే పల్లెటూరు వారు అని అర్థం. జానపదం అంటే గ్రామమని కూడా అర్థం ఉంది. అలాగని ఇది కేవలం పల్లెటూరి వారికి సంబంధించిన విజ్ఞానం అంటే అది పూర్తిగా సమంజసం కాదు. అలా అంటే అది ఒక అసంబద్ధ అసమగ్ర నిర్వచనం అవుతుంది. నగరాల్లో కూడా జానపదం ఉంటుంది. నగరాలు అనేవి వాటికవే ఏర్పడినవి కావు. కాలక్రమంలో పల్లెల్లోని ప్రజలు బ్రతకుదెరువు కోసం నాణ్యమైన జీవనం కోసం, నాగరిక జీవనంలో భాగంగా ఉన్నత చదువులకోసం, నగరాలకు వలస వస్తే ఆ నగర జనాభా విస్తరించి మహానగరాలుగా ఏర్పడతాయి. అలాంటప్పుడు గ్రామీణ జీవన విధానంలో భాగమయిన జానపదం ఒక్కసారిగా అంతం కాదు కనుక అక్కడ కూడా దాని ప్రాబల్యం ప్రారంభం అయ్యింది. జానపదంలో ఉండే ఆకర్షణ వల్ల తొందరగా చుట్టు ప్రక్కల ప్రదేశాలకు విస్తరిస్తుంది. అలా నగరంలో పుట్టి పెరిగిన వారు కూడా వారి దైనందిన జీవనంలో జానపద విజ్ఞానానికి సంబందించిన అంశాలను మనం ఇప్పటికీ నిత్యం చూస్తూనే ఉన్నాం. జానపదుల ఆస్తి, సంపత్తి అంటున్న నమ్మకాలు, ఆచారాలు, సామెతలు, పలుకు బళ్ళు, పొడుపు కథలు, జాతీయాలు, గేయాలు, ఆటలు ఇలా అన్నీ నాగరిక జీవనంలో కూడా ఇమిడి ఉన్నాయి. అలాంటప్పుడు జానపదం, అనేది ప్రస్తుత కాలంలో ఏ ఒక్క వర్గానికో, ప్రాంతానికో చెందినది కాదు. అవి మానవ జీవన విధానంలో ఒక భాగం. అంతర్లీనంగా మనుషులలో పెనవేసుకున్న ప్రాచీన సంపద అని చెప్పవచ్చు. కానీ మారుతున్న కాలంతో పాటుగా నిత్య అన్వేషణలో మానవుడు నూతన సాంకేతిక అంశాలు ఆవిష్కరణపై దృష్టి కేంద్రీకరించడంతో జానపదంను నిర్లక్ష్యం చేస్తున్నారు. సహజంగా ఏదైనా వస్తువును వినియోగంలో ఉంచకపోతే అది దాని అస్థిత్వాన్ని కోల్పోయి నశిస్తుంది. అలాగే జానపదంను నేటి తరాల వారు ఆచరణలో చూపక పోవడం, పరిశోధనలు జరగకపోవడం, జ్ఞానార్జనలో భాగంగా జానపదం నేటి తరాలవారికి అందుబాటులో ఉంచక పోవడంతో జానపద సాహిత్యం మనుగడ, ఒకింత ప్రశ్నార్థకంగా ఉందని చెప్పవచ్చు. అలా మనకు ప్రాచీన కాలం నుండి చాలా వరకు మౌఖికంగా, కొంత అధ్యయన పరిశోధన రచనల ఫలితంగా కొన్ని సామెతలు, పొడుపుకథలు, జాతీయాలు అందుబాటులో ఉన్నాయి. అలాంటి సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే ధ్యేయంతో విశేషమయిన కృషి చేసిన వారిలో బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణకుమారి, తూమాటి దోణప్ప, మిక్కిలినేని రాధా కృష్ణమూర్తి, తంగిరాల సుబ్బారావు, కె. సుమలత, చిలు కూరి నారాయణ, ఆర్వీయస్. సుందరం ముఖ్యులు అదే విధంగా జానపద సాహిత్యంపై "జానపద సాహిత్య విమర్శ" అనే ప్రత్యేకమయిన పద్ధతిని ఆచార్య కొలకలూరి

ఇనాక్ ప్రవేశ పెట్టారు. ఈ జానపద సాహిత్య విమర్శకు శాస్త్ర ప్రతిపత్తి కూడా చేకూరింది. ఇక ప్రజల నిత్య జీవనంలో భాగమైన సామెతలు, పొడుపు కథలు, జాతీయాలను పరిశీలిస్తే.

జానపదంలో సామెతలు: "సామెత' అనేది "సామ్యత" అనే పదం నుండి ఏర్పడింది. జన జీవితంలో సామెతలు అంతర్భాగం. సామెతలు అనేవి జీవిత అనుభవాల సారాంశం. వీటిని సంక్షిప్తంగా, వివేకయుతంగా ఉండే సాంప్రదాయిక అభివ్యక్తులు అని నిర్వచించారు. సామాన్యంగా సామెతలు ఒక్క వాక్యంలోనే రెండు వాక్యాలు గల సామెతలుగా ఉంటాయి. ఇవి ప్రస్తుతానికి తెలుగులో కొన్ని మాత్రమే వాడుకలో ఉన్నాయి. అంత్యానుప్రాస, యతి స్థానం లాంటివి సామెతల్లో చూడవచ్చు.

ఉదాహరణకు :

చేసింది పోదు
చేయంది రాదు

ఇవి రెండు వాఖ్యాల సామెత . . .

అలాగే

అడగందే అమ్మయినా పెట్టదు

ఇది ఏక వాక్య సామెత.

"ఈ సామెతలు అనేవి " ఒక ఉక్తి లేదా ఒక అనుభవం ప్రజల్లో బాగా ప్రచారమై ఆ తర్వాత కాలంలో సామెత అవుతుంది. పదునైన భావాలను పదునైన మాటల్లో క్లుప్తంగా చెప్పడమే సామెత ప్రధాన లక్షణం" అని ఆర్వీయస్ సుందరం వివరించారు.

ప్రాచీన కాలం నాటి వేమన పద్యాల్లోని కొన్ని పాదాలు నేటికీ సామెతలై ప్రజల్లో స్థిరపడ్డాయి.

అలాంటివే

"తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు"
"కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా"
"చిత్త శుద్ధి లేని శివపూజ లేలరా"

అదే విధంగా జానపద గేయాలలో, గద్య కథలలో కూడా సామెతలు ఈ విధంగా కనిపిస్తుంటాయి.

"పేదవాని కోపము పెదవుల తీట "
"చల్ల కోసము వచ్చి ముంత దాచనేల మనకు"
"దాసుని తప్పు దండముతో సరి"

అలాగే మరి కొన్ని సామెతలు స్పష్టంగా నీతిని తెలియజేస్తాయి.

ఉదాహరణకు :

"పరుల సొమ్ము పాపిష్టి సొమ్ము " లేదా "పరుల సొమ్ము పాము వంటిది"

"మౌనం అర్ధాంగీకారం"
"ఉన్నమాటంటే ఉలుకు ఎక్కువ"
"బాల వాక్కు బ్రాహ్మ వాక్కు"

ఈ విధంగా ఒక వాక్యంలో అనుభవ సారాంశం అంతా కూడా నీతిగా వ్యక్తపరుస్తారు.

అదే విధంగా ఇప్పుడు రెండు వాక్యాల సామెతలను గమనిస్తే

"గొడ్డలి ఎక్కడ పెట్టినాపురా అంటే కొట్టే చెట్టు దగ్గర, కొట్టే చెట్టు ఎక్కడుందిరా అంటే గొడ్డలి దగ్గర అన్నాట్ట"

ప్రాసలు ఇమిడి ఉండే సామెతలు

"బిడ్డ వచ్చిన వేళ, గొడ్డు వచ్చిన వేళ "
బెల్లంవుందా అంటే అల్లం వుందన్నట్టు"

ఇతిహాసాలు, రామాయణ, మహా భారతం పై ఉండే సామెతలను చూస్తే

"రామాయణంలో పిడకల వేట "
"వింటే భారతం వినాలి-తింటే గారెలు తినాలి"
''రామాయణం అంతా విని-రాముడికి సీత ఏమవుతుంది అన్నట్టు "

మరికొన్ని సామెతలు మానవ స్వభావాన్ని ప్రతి బింబిస్తూ హాస్య ఇతివృత్తంగా ఉంటాయి. అలాంటివే

"బావా అని చూడబోతే రావా అని కొంగు పట్టుకున్నాట్ట"
"రోట్లో తలపెట్టి రోకటి పోటుకి జడవడం ఎందుకు "

వ్యక్తులకు సంబంధించిన సామెతల్లో ప్రధానంగా
"చదువుకున్న వాడి కంటె" చాకలి వాడు మేలు"
"తెల్ల కోమటిని నమ్మకూడదు "
ఇంకా కొన్ని ఏక వాక్య సామెతలు పరిశీలిస్తే
"అత్తమీద కోపం దుత్త మీద చూపినట్లు"
"అబద్ధమాడినా అతికినట్లుండాలె "
ఎవరు చేసుకున్నంత వారు అనుభవించాలి
కన్న ప్రేమ కన్నా సాదిన ప్రేమ గొప్పది
గురువులకు పంగనామం పెట్టినట్లు
పెద్దల మాట సద్దిమూట
ఆడదాని మర్మం బ్రహ్మదేవునికి కూడా తెలియదు
ఎంగిలి చేత్తో కాకిని కొట్టనోడు దానం జేస్తడా
అత్త ఆరడీ మామ గారడి
కక్కు వచ్చినా కళ్యాణం వచ్చినా ఆగదు.

పొడుపు కథలు :

ఈ పొడుపు కథల వల్ల వినోదం, విజ్ఞానం రెండూ లభిస్తాయి. జానపదులను ఈ విధంగా ఉపయోగించే విశిష్ట ప్రక్రియ అవ్వడం చేత ప్రపంచంలోని అన్ని జాతుల వారూ పొడుపు కథల్ని తమ నిత్య జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారు. ఆదిమానవుని చిత్తశుద్ధి, బుద్ధి వికాసం చెందుతున్న దశలో అతని ఆరాటానికి అభివ్యక్తి శక్తిని ప్రతిబింబించేవే ఈ పొడుపు కథలు. సామాన్య మానవునిలో ఉండే చాతుర్యం, హాస్యం, సమస్య పరిష్కార కోరిక ఇవి అన్నీ కూడా పొడుపు కథలను సుందరంగా కళాత్మకంగా తీర్చి దిద్దడానికి తోడ్పడ్డాయని చెప్పవచ్చు. ఈ పొడుపు కథల గురించి "నేదనూరి గంగాధరం" గారు ఈ క్రింది విధంగా అన్నారు. "పొడుచుట, విప్పటలో ఆనందమును వెల్లివిరియించు నవి పొడుపు కథలు" అని జానపద సాహిత్యంలో పొడుపు కథలకు ఒక ప్రత్యేక శాఖగా పరిగణించగల వ్యాప్తి, వైవిధ్యం ఉంది. ఇవి గేయ రూపంలో, కథారూపంలో, సామెతల రూపంలో కూడా ఉంటాయి. ఈ పొడుపు కథలు కొన్ని ప్రత్యేకమయిన లక్షణాలను కలిగి ఉంటాయి. అవి

బుద్ధి చాతుర్యానికి ప్రాముఖ్యం
అలంకారికంగా ఉండడం
చమత్కార గుణం కలిగి ఉండడం
హాస్య స్ఫోరకంగా ఉండడం
జవాబు తెలియగానే ఆశ్చర్యం కలిగించడం
ప్రకృతి సంబంధంగా ఉండడం.

బేకు మళ్ళ కామేశ్వరరావు "పద కల్పన" రకం పొడుపు కథలను పేర్కొన్నారు. ఇందులో ప్రతి చరణం చివరి అక్షరం సమాధానాన్ని సూచించడం దీని ప్రధాన లక్షణం.

" వంకర టెంకర శౌ (శౌంఠి)
వాని తమ్ముడు అ (అల్లం)
నల్ల గుడ్ల మి (మిరియం)
నాలుగు కాళ్ళ మే (మేక)"

ఏక వాక్య పొడుపు కథలో
"చిటారు కొమ్మన మిఠాయి పొట్లం" (తేనెపట్టు)

గేయ రూపంలో ఉండే పొడుపు కథలలో
"చెక్కని స్తంభం చేతికందదు
చెయ్యని కుండ పొయ్యని నీళ్ళు
వెయ్యని సున్నం తియ్యంగా" (కొబ్బరి నీళ్ళు)

ఇక గొలుసు కట్టు పొడుపు కథలలో
"దిబదిబలాడేవి రెండు (కాళ్ళు)
దిబ్బెక్కి చూసేవి రెండు (కళ్ళు)
ఆలకించేవి రెండు (చెవులు)
ఆదుకొనేవి రెండు (చేతులు) "

అదే విధంగా కొన్ని విభిన్న వాక్య ప్రయోగాలతో, చెప్పాల్సిన విషయానికి సమాంతరంగా ఒకటి చెప్పి కాదు అని వ్యతిరేకంగా ఇంకొకటి చెప్పే పద్ధతి ఉంటుంది.

"ఆకాశంలో ఉంటుంది, కాని మేఘం కాదు
తోకతో ఉంటుంది, కాని ఎద్దు కాదు

అటు ఇటు ఎగురుతుంది, కాని పక్షి కాదు
పట్టు తప్పితే చాలు-పరుగులేస్తుంది" (గాలి పటం)

ఈ విధంగా వినోదం, విజ్ఞాన సాధనమై సాహిత్య ప్రక్రియగా ఉంటూ ప్రజల ఆదరణ పొంది మానవ సంస్కృతిలో ఈ పొడుపు కథలు ఒక భాగం అయ్యాయి అని చెప్పవచ్చు.

జాతీయాలు :

'జాతీయాలు'' లేదా ''జాతీయములు'' అనేవి ఒక జాతి ప్రజల సంభాషణలలో స్థిర పడిపోయిన కొన్ని 'నానుడులు'. ఇవి పలుకగానే అర్థమైపోయే మాటలు ప్రపంచంలో మనిషి జీవితంలో కంటికి కనిపించేవి అనుభూతులను కలిగించేది. ఇలా ప్రతి దాని నుండి జాతీయముగా పుట్టుకొస్తూనే ఉంటాయి. ఈ జాతీయాలను వేటూరి ప్రభాకర శాస్త్రి, నేదునూరి గంగాధరం, బూదరాజు రాధాకృష్ణ వంటి సంకలన కర్తలు అర్థ వివరణలతో సేకరించి ప్రచురించడం జరిగింది. జాతీయం అనేది జాతి వాడుకలో రూపు దిద్దుకొన్న భాషా విశేషం అని చెప్పవచ్చు. ఈ జాతీయాలలో ఉన్న పదాలను ఉన్నది ఉన్నట్లు పరిశీలిస్తే వచ్చే అర్థం వేరు. ఆ పదాల అంతరార్థం వేరు.

ఉదా :

''చేతికి ఎముక లేదు'' దీనిలో ఉన్నది ఉన్నట్లుగా పరిశీలిస్తే. ఎముక లేని చెయ్యి అనే అర్థం వస్తుంది. అంటే కేవలం కండరాలు మాత్రమే కలిగి ఉన్న చెయ్యి అని అర్థం వస్తుంది. వాస్తవానికి ఈ జాతీయానికి అర్థం ''ధారాళంగా దానిమిచ్చే మనిషి'' అని.

ఇంకా కొన్ని జాతీయాలు
"ఉత్సవ విగ్రహం"
"కరువులో అధిక మాసం"
"అలకపాన్పు"
"నిండుకుండ"
"పాసకంలో పుడుక"
"నూతిలో కప్ప"

ఈ జాతీయాల లక్షణాలను పరిశీలన చేసి 1999 సం॥లో మూలె విజయలక్ష్మిగారు ఈ క్రింది లక్షణాలను జాతీయాలు కలిగి ఉంటాయని చెప్పడం జరిగింది.

లక్షణార్థ ప్రాధాన్యం
సాదృశ్య పూర్వకం
అనుభవాల మూలం
అలంకారిక చమత్కృతి
సారవంతం-సంక్షిప్తత

వ్యాప్తిని బట్టి జాతీయాల వర్గీకరణను కూడా మూలె విజయలక్ష్మి గారు మూడు రకాలుగా విభజించారు.

అవి

1. సార్వదేశిక జాతీయాలు
ఉదా॥. 'తుంగలో తొక్కు'

2. ప్రాదేశిక జాతీయాలు
ఉదా॥. 'పుంగనూరు జవాను'

3. మాండలిక జాతీయాలు
ఉదా॥. 'దొండుపల్లె గొల్లోడు'

నిర్మాణ పరంగా జాతీయాలు నాలుగు రకాలుగా వర్గీకరించారు.

1. నామ పదబంధాలు
2. విశేషణ పదబంధాలు
3. ప్రత్యయ పదబంధాలు
4. క్రియా విశేష పదబంధాలు

చమత్కారం నుడి కట్టు, భాషీయం, నానుడి అనే పదాలను జాతీయానికి ప్రత్యామ్నాయంగా వాడుతారు. జాతీయాల వాడకం భాషకు చక్కదనాన్ని భావానికి చిక్కదనాన్ని తేలికగా అర్థమయ్యే తీరును అందిస్తుంది. ఇతర భాషలను నేర్చుకోవడం సులభం కావచ్చు కానీ ఆ భాషలో జాతీయాలను అర్థం చేసుకోవడం, అవగతం చేసుకోవడం అంత సులభం కాదు అని చెప్పవచ్చు.

ప్రస్తుతం వినియోగంలో ఉన్న కొన్ని జాతీయాలను చూస్తే

"ఆకాశమంత పందిరి భూలోకమంత పీట"
"నోటరాయి గొట్టె"
"గంగల కలిసిపోయింది."
"ప్రాణం అవిసిపోయింది"
"ధన ధాన్యాలు"
"గడ్డి గాధం"
"కామానికి కండ్లులేవు"

ఇలా ఎన్నో జాతీయాలను మనం నిత్యం ఏదో ఒక సందర్భంలో మనం మాట్లాడే భాషలో వినియోగిస్తూనే ఉంటాము. ఇలాంటి జాతీయాలు కథలలో, గేయాలలో కూడా కన్పిస్తుంటాయి.

ముగింపు :

జానపద విజ్ఞానం అనేది బహుముఖీయమయినది. ఇది రోజు రోజుకీ క్షీణిస్తున్న అమూల్య జ్ఞాన సంపద. ఇది ఎక్కువగా మౌఖిక రూపంలో ఒక తరం నుండి ఇంకొక తరాలకు సంక్రమిస్తుంది కనుక ప్రస్తుతం ఉన్న రూపాలు, భవిష్యత్‌లో ఉంటాయని నమ్మకంగా చెప్పలేం. జానపద సాహిత్యం అనేది ఒక జాతి యొక్క జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలు, జ్ఞాన సంపదలను తెలియ చేస్తుంది. నగరీకరణ, ప్రపంచీకరణలో భాగంగా ఎన్నో మార్పులకు ఈ సమాజం రూపాంతరం చెందుతూ వస్తుంది. ఇటువంటి సమయంలో లిఖిత పూర్వక ఆధారాలు ఎక్కువగా లేని ఈ జానపద సాహిత్యం మనుగడ ప్రశ్నార్థకం కాకూడదు. అందువల్లనే పూర్వీకుల నుండి సంక్రమించిన జానపద విజ్ఞాన సాహిత్యంను కాపాడడం కొత్త విషయాలను పరిశోధించడం ఎంతో ముఖ్యం.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర-డా॥ ద్వా. నా. శాస్త్రి, - సెప్టెంబర్ 2016
2. సుందర జానపదం (జానపద సాహిత్య స్వరూపం) - ముద్రణ 2017
3. నాటక సాహిత్యం-జానపద సాహిత్యం - యం.ఎ. తె॥ ద్వి.సం॥ పే.6 ముద్రణ 2012
4. కన్యా శుల్కం,జాతీయాలు, సామెతలు అనువాద పరిశీలన ఎం.ఫిల్ పట్టా కోసం ఎ.ఖ విద్యార్థి పరిశోధన వ్యాసం
5. "జాతీయములు" వికీపీడియా - అంతర్జాల సమాచారం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

"స్త్రీల గేయాలు – సాంఘికాచారాలు"

– వసుధలేటి నాగమల్లిక, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం, తూ॥గో జిల్లా.

జానపదులు పాడుకునే పాటలను లేదా గేయాలను జానపదగేయాలంటారు. వీటిని ఆంగ్లంలో "Folk songs" అంటారు. ఈ పదము 'Volkslied' అను జర్మన్ భాషాపదానికి అనువాదము. ఏ భాషలోనైనా మొదట వెలువడేది జానపద సాహిత్యమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ భాషలో లిఖిత సారస్వతం వెలువడడానికి ముందు నుండీ ప్రవహించే మౌఖిక సాహిత్యమే జానపద సాహిత్యము.

ఈ అపారమైన జానపద సాహిత్యంలో ప్రధానంగా ఐదు అంశాలున్నాయి. అవి: 1) జానపద గేయాలు 2) కథా గేయాలు 3) కథలు 4) సామెతలు 5) పొడుపు కథలు. వీటిలో అత్యంత ఆదరణ పాత్రమైనవి జానపద గేయాలు. ఇవి అనేక విభాగాల్ని కలిగి ఉన్నాయి. అవి : పౌరాణిక గేయాలు, చారిత్రక గేయాలు, మత సంబంధ, పారమార్థిక, స్త్రీల గేయాలు, శ్రామిక, పిల్లల, శృంగార, అద్భుత, కరుణ హాస్యరసగేయాలు మొ॥నవి.

సమాజంలోని సంస్కృతీ సంప్రదాయాలు, సాంఘిక ఆచారవ్యవహారాలను ఇనుమడింప చేసే గేయాల్లో ప్రధానమైనవి స్త్రీల గేయాలు. ఎందుకంటే తరతరాలకు మన సంస్కృతీ సంప్రదాయాల్ని, ఆచార వ్యవహారాల్ని వారసత్వ సంపదగా అందించేది నారీమణులే కాబట్టి. వారు పాడకునే అనేక రకాల గేయాల్లో సాంఘికాచారాలు తొంగి చూస్తాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

శిశువు పుట్టినప్పటి నుండీ స్త్రీలు లాలి, జోలపాటల ద్వారా తమ గేయాల్ని మొదలు పెడతారు. స్త్రీల గేయాల్లో లాలి పాటలు, జోలపాటలు, పెండ్లి పాటలు, అత్త వారింటికి సాగనంపే పాటలు, సారె పాటలు, అత్తా కోడండ్ర ఆరళ్ళు, నోములు, వ్రతాలకు చెందిన గేయాలు, భార్యభర్తలు గేయాలు ఇలా చాలా రకాలుగా స్త్రీలు తమ జీవితంలో జరిగే ప్రధాన ఘట్టాల్ని, సాంఘికాచారాల్ని తమ గేయాల్లో ఇమిడ్చి పాడుకుంటారు.

నాడు నేడు స్త్రీకి మాతృత్వమనేది ఎనలేని సంపద. దానికి నోచుకోని స్త్రీలను ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో చులకనగా చూడటం సమాజంలో కన్పిస్తుంది. సంతానం కోసం స్త్రీలు పడరాని పాట్లు పడతారు. వ్రతాలు, నోములు, తీర్థయాత్రలు చేసేవారు.

"కొత్త చింతపండు గొనెల్ల చీకు - గొడ్రాలి వస్త్రాలు పెట్టెల్ల చీకు
పాత చింతపండు బస్తాల చివుకు - బాలెంత వస్త్రాలు పసుపుల్ల చివుకు..."

అంటూ ఈ గేయంలో గొడ్రాళ్ళగా స్త్రీలు ఎంత బాధపడే వారో నాటి సామాజిక స్థితిని తెలిపారు. స్త్రీలకి పిల్లలు పుట్టగానే అబ్బాయి అయితే రాముడిగానో, కృష్ణుని గానో ఊహించుకుని లాలి, జోల పాడేది. అమ్మాయి అయితే లక్ష్మీదేవి, పార్వతీ దేవి పేరుతో జోల పాడుకునే ఆచారం కలదు.

"లాలనుచు చుపాడరమ్మామ ఈ బిడ్డ లక్ష్మీదేవిలా సుడమ్మా పాదమున చక్రమమ్మ ఈ బిడ్డ వేదాంత వేద్యుడమ్మా వేణునాదంబుతోను ఈ బిడ్డ వేదములు పాడునమ్మా..."

"లాలి బంగరు బొమ్మ లాలిమాయమ్మా
లాలి ముద్దుల గుమ్మా లాలి సీతమ్మా" అని

అదే విధంగా జోవచ్యుతానంద జో..జో.. ముకుందా... అంటూ పాడని తల్లి ఉండదంటే అతిశయోక్తి కాదేమో. ప్రతీ తల్లికీ తన బిడ్డ అందంగా కనిపిస్తుంది. 'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నట్లుగా తన పాపాయిని చూసి మురిసి పోతుంది.

"పాపాయి కన్నులు కలువ రేకుల్లు - పాపాయి జులపాలు పట్టుకుచ్చులు
పాపాయి దంతాలు మంచి ముత్యాలు - పాపాయి చేతులు పొట్లకాయల్లు
పాపాయి పలుకులు పంచదార చిలుకల్లు - పాపాయి వన్నెలు బాలకృష్ణుని వన్నెలు.... "

అని పొంగిపోతుంది.

వివాహమనేది స్త్రీ జీవితంలో అత్యంత ప్రధాన ఘట్టము. సమాజంలో ఒక విధమైన గౌరవాన్ని, మర్యాదల్ని కుటుంబ పరంగా బాధ్యతల్ని తెచ్చి పెడుతుంది. ఈ వివాహ వ్యవస్థ అనేక రకాలైన కట్టు బాట్లు, ఆచారవ్యవహారాల్తో కూడుకుని ఉంటుంది. పెళ్ళి కూతుర్ని, కొడుకుని చూసెందుకు చూపులకెళ్ళడం, కట్న కానుకలుకు సంబంధించిన మాటలు, వివాహ ఘట్టం, అప్పగింతలు, సారెపాటలు, నోములు, వ్రతాలు, వియ్యాల వారి మర్యాదలు ఇలా చాలా రకాల సాంఘికా చార వ్యవహారాలన్నీ జానపద స్త్రీలు తమ గేయాల్లో పాడుకుంటారు.

సాధారణంగా పిల్లవైపువారు పిల్లవారి స్థితిగతులు విచారించి కలిగిన కుటుంబంలోఇవ్వడానికి చూస్తారు.

"అల్ల వూరీవారు పిల్లనడిగేరు, పిల్లవానికి రూపు రేఖలున్నాయి. ఏటేటా పండేటి భూములున్నాయి, ఊరి పొలిమేరలో తోటలున్నాయి. చుట్టూ కొల్లారంపు! మిద్దెలున్నాయి. కుఱ్ఱవానికి మంచి సేద్యమున్నాది. మన పిల్లకూ తగ్గ ఈడు జోడేను, కన్నె నిద్దామని కబురంపు దాము.

అదేవిధంగా పెండ్లికి సంబంధించిన ఆచారాలు తెలిపే పాటలు చాలా ఉన్నాయి. కల్యాణ పాటలు, గంథం పాటలు, కొట్నాల పాటలు, తలుపు దగ్గర పాటలు, బంతులాట, బువ్వము, వధూవరుల, అలక, ముఖము కడుగు పాటలు, కట్నాల పాటలు, పతిభక్తి, అవిరేణి, అప్పగింతల పాటలు ఇలా పెళ్ళిల్లో జరిగే ప్రతీ సాంఘికాచార వ్యవహారాలకి చెందిన అంశాలపై అనేక గేయాలున్నాయి.

తెన్నేటి తిరుమల దాసుగారి 'వేడుక పెండ్లిపాట' గంగాధరం గారు 'సెలయేరు'లో ఇలాంటివెన్నో పాటలు న్నాయి. వివాహానికి ముందు కొట్నాలు దంచుట ఆచారం. దానికి ఇలా గేయాన్ని పాడతారు.

"సువ్వి సువ్వి రామచంద్ర - సువ్వి సువ్వి కీర్తి సాంద్ర
సువ్వి సీతమ్మ మాకు శుభములిమ్ము మోదమునకు
పెండ్లి పీట - మీద శ్రీరాము సరసన
ఆదిలక్ష్మియైన సీతమ్మను నిచిరీ...."

ఇంకా నలుగు పెట్టే ఆచారంతో నలుగు పాటలు

"అత్తరులోన మేలియత్తరులోన్ అంబరు గూర్చి,
క్రొత్త సంపంగితో గోవిందునకు..."

నలుగు పూయుట అనేది ఇందులో వస్తువు ఇంకా తలంటు పాటలు, తిలకం దిద్దే పెండ్లిపాటలున్నాయి.

"తిలకము దిద్దరే కలకలలాడేటి ఎలనవ్వుమొగ
మున..."

వియ్యాల వారు సరదాగా ఆటపట్టించే హాస్యపు పాటలు.

"ఎక్కడ దొరికి నాడమ్మా ఈ పెళ్ళి కొడుకు
అడ్డెడు మానెడు పోసినాము, అరిసలైనవండినాము
అంగుడైన జూవడాయె - అరమొగము పెళ్ళి కొడుకు..."

బ్రాహ్మణీతురులందు ప్రత్తివిత్తులు వధూవరులచే నాటించే ఆచారం ఉంది. ఇవి కూరాడ కుండల్లో నాటిస్తూ..

"ప్రతివిత్తుల గుమ్మి మెత్తైన వీసి
గోవు పెండా దెచ్చి గోలెంల కలిపి
ఆవు పెండా దెచ్చి అలుకైనా జల్లి..."

పెళ్ళి చివర్లో అప్పగింతలు చివరి ఘట్టము. పిల్లచేతిని అత్త వారికి అప్పగిస్తూ పిల్ల తలిదండ్రులు కన్నీరు కారుస్తారు.

"సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినాము..
చెలగి మీ అత్తంట్ల బుద్ధి గలిగుండు
ఎవ్వరేమాడిన ఎదురాడకమ్మా - వీధిలో నిలుచుండి కరులిప్పకమ్మా
పలుమారు పలుదెరిచి నవ్వబోకమ్మా - పరమాత్మతో గూడి వెలుగుమాయమ్మా..."

వధువు చేతిని పాలలో ముంచి అత్తచేతిలో పెట్టే ఆచారం పాటించే సందర్భంలో

"ఈ బాల యెరుగదు ఏమియునైనను
మీ బాలలో నొకబాలగా చూడు
కోడలు మీ సొమ్ము, కొడుకు మీ సొమ్ము... "

అంటూ పాడతారు. అదేవిధంగా సారె వంపే సమయంలో సారె పాటలు, అత్తా కోడళ్ళ ఆరళ్ళు పాటలు, ఆ పోరు పడలేక వేరు కాపురం పెడదాయని భర్తకు చెప్పే పాటలు ఇలా కుటుం వ్యవహారాలకు, ఆచారాలకు సంబంధించిన గేయాలు చాలా స్త్రీ గేయాల్లో ఇమిడి ఉన్నాయి.

ఈ విధంగా గృహజీవనానికి, సంస్కృతి సంప్రదాయాలకి, సాంఘికాచారాలకు సంబంధించిన గేయాలు స్త్రీల గేయాల్లో కోకొల్లలుగా కన్పిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యము - బి.రామరాజు
2. తెలుగు సాహిత్య చరిత్ర - సిమ్మన్న
3. జానపద గేయ సాహిత్య స్వరూపం - ఆర్.వి.యస్ సుందరం
4. జానపద గేయ వాఙ్మయ పరిచయం - హరి ఆది శేషువు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు కథా గేయ కవిత్వం

- ఇంగ్లీష్ మూలం : జె. ఓ. బోయెల్, తెలుగు : ఘట్టమరాజు

కీ. శే. శ్రీ గోవర్ సంకలించిన 'దక్షిణ భారత జానపద గేయాలు' (ఫోక్ సాంగ్స్ ఆఫ్ సదర్న్ ఇండియా) పుస్తకంలో ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగుకు మాత్రమే ప్రాతినిధ్యం లేకుండా పోయింది. అలా చేయడం పెద్ద పొరపాటని తెలుసుకున్న శ్రీ గోవర్, ఆ గ్రంథంలో లోపాన్ని పూరించాలనుకొని వేమన పద్యాల్ని కొన్నింటిని ఉదాహరణలుగా ఆ గ్రంథంలో చేర్చాడు. జెరేమియా 'లామెన్ టేషన్' లేదా జువెనల్ 'అధిక్షేపాల్ని' జానపద గేయాలుగా భావించలేనట్లే నీతిని బోధించే, కొన్ని చోట్ల వివాదగ్రస్తాలైన వేమన పద్యాల్ని జానపద గేయాలుగా స్వీకరించలేం. ఎలాంటి వివాదాలకు ఆస్పదం లేకుండా, నిక్కచ్చిగా జానపద గేయ మంటే ఏమిటో నిర్వచించడం కష్టం. వేమన పద్యాల్లోని సంక్లిష్టత, చెక్కడపు పనితనం లేని గేయాల్ని జానపద గేయాలనవచ్చును. కథావస్తువు, భావాలు సరళంగా వుండటమే జానపద గేయకవిత్వం జీవాతువు. రణోత్సాహంతో యోధుల్ని ముందడుగులు వేసేందుకు ఉత్తేజ పరిచే యుద్ధ గీతాల, మధ్య ప్రియులకు ఉల్లాసం కలిగించే మధురమైన మధు గీతాలు, సుకుమారమైన, సులలితమైన భావాల్ని హృదయంలో రేకెత్తించే ప్రేమ గీతాలు ప్రాచీన కథా గేయ కవిత్వంలోని ప్రధాన వర్గాలుగా భావించవచ్చును. ఈ గేయాలు కవుల, ప్రేక్షకుల, శ్రోతల అభిరుచులకు, ప్రతిస్పందనలకు సమయానుకూలంగా ఎక్కువగా మారుతూ, పునరుక్తమవుతూ వుంటాయి. సేనాపతి అంతిమ యాత్రలో అతని ధైర్య సాహస గాథల్నీ, ప్రేమ కథల్నీ, మధుపాన మధుర అనుభవాల్ని జానపద గాయకుడు కథాగేయ రూపంలో పాడుతాడు. అంతేకాదు పెళ్లి వేడుకల్లోనూ, పండుగలు- పబ్బాలప్పుడు అతను తంత్రీ వాద్యం వాయిస్తూ అనాయాసంగా, అవలీలగా యుద్ధంలో పాల్గొన్న వీరవంశీకుల విజయగాథల్నీ, వాళ్ల ప్రేమ యాత్రా విశేషాల్నీ, విజయ యాత్రల్నీ వర్ణిస్తాడు.

ఇలాంటి విలువైన వివిధ భారతీయ భాషల జాతీయ కవితా సంపదను తవ్వి తలకెత్తడం అవసరం. ఈ నేపథ్యంలో దక్షిణ భారత భాషల అమూల్యమైన జానపద కవిత్వ నిధుల్ని విస్మరించడం తగదు. ఇలాంటి పెన్నిధిని మీకు పరిచయం చేయాలన్నదే నా ఆశయం. విలువైన జానపద గేయాల్ని సేకరించి, వెలుగులోనికి తెచ్చేందుకు యోగ్యులైన వ్యక్తుల్ని నా ఈ వ్యాసం ప్రేరేపించగలిగితే నా ప్రయత్నం వ్యర్థం కాదని నేను భావిస్తున్నాను.

నేను ఇక్కడ కొన్ని జనప్రియమైన కథా గేయాల్ని ఉదహరిస్తున్నాను. వీటిని గ్రామీణ కవులే రచించారని నేను బల్ల గుద్ది చెప్పగలను. వీటిని సేకరించిన వాళ్లు ఓనమాలు కూడా చదవడం, రాయడం తెలియని పల్లె ప్రజలే. పొలం దున్నే నాగలి పట్టిన రైతు, తోడుగా పనిచేసే వాళ్ల ముందు పాడిన పాటలు, బండి తోలే మనిషి ఎద్దుల్ని అదిలిస్తూ పాడిన గేయాలను నేను మీ ముందు వుంచుతున్నాను. ఈ పాటలు కొన్ని అర్ధంబర్ధంగా వున్నాయి. మరికొన్ని గేయాలు అక్షర జ్ఞానం లేని గాయకులు మార్చి మార్చి చెప్పినందువల్లా, మొరటుగా వున్నాయి. గాయకులు తమకు తెలియకున్నందువల్లో లేదా జ్ఞాపకం రానందువల్లో వీటిని పూర్తిగా పాడలేక పోవడమే వీటి అసంపూర్ణత్వానికి కారణం. ఈ పాటల సరళత్వం, నూటితనమే వీటి సహజాలంకారమని చెప్పొచ్చు. ఈ జానపద గాయకుల స్వాభావికమైన భావనలు సహజసిద్ధమైన మోటుతనంతో అనాయాసంగా, అప్రయత్నంగా వెలువడ్డాయి. ఈ గేయాల్ని గ్రామీణ శ్రోతలూ, ప్రేక్షకులూ తలలు వూపుతూ విని, హృదయాలకు హత్తుకున్నారు.

నేను ఉదహరించిన మొట్టమొదటి జానపద కథా గేయం ఆధునికమైనదిగా తోస్తుంది. ఈ పాటను పాడిన వ్యక్తి ఓ పాళెగాని లేదా దత్తమండలాలకు (బళ్లారి, అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు) చెందిన ఓ చిన్న స్థానిక నాయకుడి ఆశ్రితుడైన వంశపారంపర్య జానపద గాయకుడు. నేను ఈ పాటను బళ్లారికి చెందిన ఓ బోయ వాడు పాడగా విని రాసుకున్నాను. ఈ కథాగేయ నాయకుడైన పాపడు నాయుడు లేదా కాపు కులానికి చెందిన వ్యక్తి. నేను అతని కుటుంబం గురించి కాని, కులగోత్రాలు, వంశం గురించి కాని తెలుసుకోలేక పొయ్యాను. ఈ దుర్మార్గులైన పాలేగాళ్ళ గురించి స్థానిక సంప్రదాయాలు, స్థానిక చరిత్రలు, ప్రభుత్వ రికార్డులు కొంత వరకు పొందుపరిచాయి. ఈ పాలెగాళ్ళ కోటలు కూలిపోయి, శిథిలాలుగా మిగిలాయి. వాళ్ళ వంశీకులు సిరిసంపదలు కోల్పోయి కొట్టు మిట్టాడుతున్న రైతుల స్థాయికి దిగజారి పొయ్యారు. కాని వీళ్ల కథలు కథాగేయాల రూపంలో జానపద గాయకుల ద్వారా పాడబడి, పాలెగాళ్ళ దర్బారుల్లో ప్రతి ధ్వనించాయి. ప్రస్తుతం పల్లెసీమల్లో పాలెగాళ్ళ జ్ఞాపకాల్లో మారుమోగుతున్నాయి.

జానపద గాయకుడు కథానాయకుడి తల్లిదండ్రుల గురించి చెప్పకుండా, తల్లి పేరు సారమ్మ అని చెప్పి, వీరావేశంలో నేరుగా కథా రంగంలోకి దూకుతాడు -

"వస్తాడె తాను, సర్వాయ్య పాపడు!"

కవి తర్వాత సర్వాయి పాపడు తల్లికి వీడ్కోలు చెప్పుతూ, తన మహత్వాకాంక్షను ఇలా వెల్లడిస్తాడు.

"తల్లి కొలువుకు వడిగా వెళ్లెను,
తల్లికి దండముగా నిలిచెను,
ఏరు కట్టి వ్యవసాయము అమ్మ
ఎంగిలి ముంత ఎత్తలేను
కొట్టుదును గోల్కొండ పట్టణం:
ఢిల్లీకి మోజుర్ నవుదును:
(ఢిల్లీ సుల్తానుతో తలపడతా)
మూడు గడియల బందరు కొట్టుదునుబీ
మూల కోట కంద నూలు చూసి
బంగారు కడియాలు పెట్టుదును.
మనకంట బంట్రోతు తనమేల
మనకులకై మానవద్దురా!
సర్వాయ్యపాప!

సర్వాయి పాపడు ఇలా తన దండయాత్ర ఆశయాన్ని వెల్లడిస్తాడు. (కాని ఇది అంత స్పష్టంగా వ్యక్తం కాలేదు. ఆశయం తెలియ చెప్పడంలో తొందర పడ్డాడేమో అనిపిస్తుంది.)

పాపడు యుద్ధానికి సిద్ధమవుతాడు కత్తుల్నీ, కటార్లనీ ధరిస్తాడు. వీటి గురించి గేయంలో వివరంగా వర్ణించ బడింది.

సర్వాయి పాపడు యుద్ధం చేయడానికి అన్ని విధాలా సిద్ధమై నిల్చుకోగా అతని ప్రతాపానికి లోకం ఎలా తల్లడిల్లుతుందో కవి ఇలా వర్ణిస్తాడు :

"అడుగో! పాపడు వస్తాడంటే
కుందేళ్లు కూర్చుండ పడెనుబీ
లేడి పిల్లలు లేవలేవు
పసిబిడ్డలు పాలు తాగవు
నక్కలు సింహాలు తోక ముడుచును"

పాపడు యుద్ధానికి సిద్ధంగా వున్న తన అనుచరుల్ని కలపడానికి సంకేత స్థలానికి వెళ్తాడు. వాళ్లున్నది తాటి తోటల ప్రదేశం. అందరు పూటుగా తాటికల్లు తాగుతారు. పాపడు లాంటి వీరుని ఘనతకు తగింది కాదీ తయారీ. కాని ఈ లక్షణాలు స్థానిక ప్రజల జీవిత సత్యాలు. బందిపోటు దొంగలుగా కుఖ్యాతులైన బోయవాండ్లు దోపిడీకి వెళ్లే ముందు కడుపు నిండా తాటికల్లు తాగే బయలు దేరుతారు. జానపద కవి సర్వాయి పాపడి ఈ దండయాత్ర సందర్భంలో కల్లు తాగే సంగతిని ఓ విశేషంగా, రసవంతంగా చిత్రించాడుబీ

"పాపడు తాగేటి కల్లు

ఏతాటి ఏతాటికల్లు?
వేలు పెట్టితే వేలు తెగును
దివిటీ పెట్టితే భగ్గున మండును
తాగేతప్పుడు తియ్యగ వుండును
తాగినవాణ్ణి లేవనివ్వదు
లేచినవాణ్ణి పోనివ్వదు"

ఈ తాటికల్లు ప్రసంగం చాలా పంక్తుల్లో వర్ణించ బడింది. సాధారణ విషయమైన మద్యపానాన్ని ఎంతో రసవత్తరంగా వర్ణిస్తూ, దానికి అపూర్వమైన గుణాల్ని ఆపాదిస్తూ చిత్రింపబడిన ఈ ప్రసంగం పేజీల కొద్దీ సాగింది. గంటల కొద్దీ కొనసాగే ఈ వీరగాథాలాపన రాత్రంతా శ్రోతల్ని ఆకట్టుకోవాలి, మంత్రముగ్ధల్ని చెయ్యాలి. ఈ కారణంగా చాలా చిన్న విషయాల్ని కూడా జానపద గాథా కారుడు వివరంగా, విస్తారంగా శ్రోతల్లో ఉత్కంఠ పెరిగేలా వర్ణిస్తూ పోతూ వుంటాడు.

ఈ దీర్ఘ ప్రసంగాలూ, వర్ణనలూ ప్రేక్షకులు, శ్రోతలు సహన శక్తిని కోల్పోయేలా చేయడమూ కద్దు.

ఈ జానపద కథా గేయం సరళంగా ఉంటుంది. గానం చెవులకు ఇంపుగా ఉండే అవకాశం తక్కువ.

సుదీర్ఘమైన ఈ జానపద వీరగాథా మహాకావ్యాన్ని చిన్న చిన్న జానపద గేయాలతో పోల్చి చూద్దాం.

ఈ క్రింది పాటలు ఓ రైతు రెండెద్దుల సాయంతో బావిలో నుంచి తోలు బాన ద్వారా నీళ్ళు తోడే సందర్భంలో పాడినవి. రెండు పంక్తుల ఈ పాటలోని మొదటి పంక్తి పాడుతూ రైతు ఓ బాన (తోలు సంచి చిన్నదీ కావొచ్చు, పెద్దదీ కావొచ్చు) నీళ్లు తోడి చిన్న కాలువ ద్వారా రాగి నాటిన పొలంలోకి పారేలా చూస్తాడు. తెల్లవారక ముందే లేచి పొలానికి నీళ్లు పారేలా చూసే చల్లని వేళలో అతను పాడిన పాటలు విన, తర్వాత పిలువనంపితే, పని వదిలి, అక్షర జ్ఞానం లేనందువల్ల పాటలు విని నేను వాటిని రాసుకున్నాను.

1. ఏగి ఏగి ఎండలైనా, ఎదురు గుమ్మి నీడలైనా
   దూడవాడు మొగడైనా, ఉండవలె కొండ నడమ.
2. ఎదురింటి ఎర్రపాప, చూతమన్నా కానరాదు
   పాపిష్ఠి తల్లిదండ్రి, బైలెల్ల నివ్వరు.
3. ఎత్తు గుబ్బల యెర్రదాని, కోర గుబ్బలు యెవ్వని పాలు
   ఆలు లేని బాలునికి, ఆరు నెలల అరణ మిత్తు
4. గుబ్బలుండే తీరు చూసి, గుద్దుకుంటే తీరునంటే
   గుండెగల బంటు ఐతే, గుండ్ల పల్లె కనుమకు రా

పై పాటల్లో ఒకదానికి మరో దానికి సంబంధం లేనందుకు, కొన్ని చోట్ల వ్యాకరణ దోషాలున్నందుకు విచారించాల్సి వుంటుంది. ఈ పాటల్ని విన్న నేను వీటిని రాసుకోవడంలో సాధ్యమైనంత జాగ్రత్త తీసుకున్నాను. ఎక్కడన్నా వాక్యరచనలో దోషాలు వున్నాయను కోండి, అవి గాయకుడు అక్షరజ్ఞానం లేనందువల్ల పాడటంలో చేసిన తప్పులు కావొచ్చు లేదా తెలుగు భాషాజ్ఞానం తగినంతగా లేనందువల్ల ఆ పాటల్ని రాసుకోవడంలో నావల్ల దొర్లిన దోషాలు కావచ్చు.

వస్తువు, కథన విధానంలో సామ్యం వున్న మరి కొన్ని పాటలు పొందు పరుస్తున్నాను. ఈ పాటలు పాడింది కూడా ఆ పల్లెటూరి పాటగాడే. ఆ పాటలు ఇవిగోయి

1. రాత్రి పూట వస్తానంటివి, తీసి వుంటిని గంధము
   రాత్రికి నీవురాలేదు, రాచిగంధము రీతి తప్పెను.
2. కంచు గుబ్బల కారు కోడి, మంచి నీళ్లకి చెలిమికి వచ్చె
   చూచు కోని బోయబిడ్డ, కంచు గుబ్బలు కదల మీటె.
3. వదులు కొప్పు బిగువు రవికె, వంగి నీళ్లు చేదే పాపా
   వగలకారి రంగడు వచ్చి, బిగువు రవికె పిక్కటిల్లె.
4. దిన్నె మీద జిల్లెడాలాలా, మల్లెదాడి ముడుచు కొంటి
   వెొదుగు మానులు మరుగు అయ్యె, ముక్కునాకు చూపనమ్మా.
5. వంకనుంటి పోతున్నదంటె, జింకమూతి ఎర్రపడుచు
   ఏగు చూచి ఎత్తినాడు, మొనగాడు మల్లప్ప నాయడు

పై పాటల్లాంటి వాటినే మరి కొన్నింటిని తెలియ

చేస్తున్నాను. వాటిని చెప్పే రీతిలో సామ్యం వున్నా, వస్తువులో కొంత వ్యత్యాసమున్న సంగతి గమనించాలి. ఓ భగ్న ప్రేమికుడు తన ప్రేయసిని బ్రతిమాలినా ఆమె అతని ప్రేమను అంగీకరించదు. ఆమె అతని బావికి నీళ్లకు వచ్చినప్పుడు కూడా, అతను అడిగినా మనసివ్వలేదు. అప్పటి ఆ విరహ స్థితి ఈ పాటల్లో వ్యక్తమయింది.

1. బావికి వారధి కట్టి, బావి నీళ్లు ఎల్లతోలి,
   కన్నపడుచు నీళ్లకు వచ్చె, కడవ మునగదు
   ఏమిసేతు?
2. కాని కాని కాపుదానా, కానుకలు ఇవ్వకపోతివంటే
   ఒంటిగా నీళ్లు దొరుకు లమ్మిడీ, వొళ్లు ఎల్ల
   వసంతమయ్యె
3. నీ యక్క నాకు దక్కునంటె, నుక్కలాకు
   మొక్కకొంటి,
   నీ యక్క నాకు దక్కలేదు, నుక్కలాకు
   మొక్కలేదు,
4. బాయి గడ్డన వుండవల్ల, నీళ్లలోతు కానవల్ల
   తామరాకు పరుపు మీద, దాని మెత్త కానవల్ల

తర్వాతి పాట మొరటైనది. పైగా సాధారణమైన లయాత్మక సంగీతంతో కూడుకున్న పిల్లల పాట ఈ పాట. ఇలాంటివే మరి కొన్ని పాటలు పండగలప్పుడు పిల్లలు కలిసి ఆడుతూ పాడే కోలాటం పాటలు కొంత మంది పిల్లలు గుండ్రంగా నిలబడి చేతుల్లో కోలాటం కర్రలు రెండు పట్టుకొని, తిరుగుతూ ఒకరితో ఇంకొకరు వివిధ భంగిమల్లో తిరుగుతూ కర్రలు పరస్పరం తాకిస్తూ, కొడుతూ పాడుతూ వుంటారు. ఈ సామాన్యమైన, సరళమైన పాటకు ఓ వాద్య వాదన కూడా తోడ్పడి, వాతావరణంలో ఆనంద, ఆహ్లాదాలను వ్యాపింపచేస్తుంది. ప్రశాంతమైన రాత్రివ్యూట ఈ కోలాటం పాట వాతావరణంలో మారు మోగుతుంది. ఆ కోలాట పదం వినండి.

"చిన్నదానా, నల్ల చిన్న దానా
నీవూరిపేరేమి, నీ పేరేమి?
నిజముగ చెప్పితే
నీయెంట వస్తాను నల్ల చిన్నదానా
నావూరు ఏలరా
నాపేరు ఏలరా
గుర్తుగా గుడిబండ పేరు
పెనుగొండ అందాము పాలకొండ
అక్కడ వుంటాను చక్కని చిన్న దానా
పెనుగొండ, లేపాక్షి, పెద్ద పాలెము గట్టు
సానుగొండ, లాలంక, సంత నరసాపురం
చెరువు ధర్మావరము, బుక్కపట్టణం
వారిండ్లు మావి, నల్ల చిన్నదానా
అదిగో మావూరు తాటి మాకుల పల్లె
స్థలమాకు రా నల్ల చిన్నదానా

ఈ పాటను నేను కావాలనే సంవాద రూపంలో అనువదించాను. అప్పుడు కాని నేను పై పాటను అర్థవంతంగా, తృప్తికరంగా అనువదించానన్న నమ్మకం కలగలేదు. ఈ పాటలో కొన్ని వూర్లపేర్లు దండగా కూర్చబడ్డాయి. అవన్నీ ఒకప్పటి విజయనగర చక్రవర్తుల రాజధాని యైన పెనుకొండకు చుట్టు ప్రక్కల సుమారు 30 మైళ్ల దూరంలో వున్నవూళ్లే. ఆ ప్రాంతం వాడైన ఓ జానపద కవి ఈ వూళ్లను తన కవితల్లో పూల దండగా గుచ్చి తన కవిత్వానికి ఓ వాస్తవికతను, విశ్వాసపాత్రతను సంతరించి పెట్టాడు. ఈ పాట చిన్నపిల్లల్ని వుద్దేశించి రాసిన ఓ సామాన్య గేయమే కాని దీనికి విశేషమైన అర్థాలు, వివరణలు కల్పించడం అనవసరం.

నేను మీకు కొన్ని జానపద గేయాల్ని ఉదాహరణగా ఇచ్చి, వాటి అర్థాన్ని వివరించి చెప్పాను. కాని వీటన్నిటి కంటె మంచిదైన, అందమైన పాటను వినిపిస్తాను. నేను విన్న పాటలన్నిటి కంటె లయాత్మకమైనదీ, మధురమైనదీ ఈ పాట. దీన్ని వింటే చాలు అది మీ హృదయంలో నాటుకు పోతుంది. అంత కరుణ రసాత్మకమైన ఈ పాట విందామా మరి:

"ఏటికి వెంపల్లె తీగ అడ్డమయ్యే
ఏటిమీద కొగిలి ఎన్ని నాళ్లకు అందునో ? సందమామా?
వోసమ్మ, నేటివేళ, వొంటిగా వుండలేను
నా ప్రాయము మగవాని పాలుకు తోడు అంపవే ? సందమామా?
చీకటి ఇంటి లోనా చిన్న దాన్ని వున్నాను
నా ప్రాయము చిన్న వాన్ని పాలుకు తోడు అంపవే? సందమామా?
వాని మొలలోన వున్నది మోహంపు పిడి బాకు? సందమామా?
నా మొలక కుచములపైన మోపిన చాలమ్మ ?
సందమామా?
వాని పలకరొమ్ము మీద పూసిన గందము ?
సందమామా?
నా అరిటి నల్లల మీద రాలిన చాలమ్మ? సందమామా?
వాని శిఖలోన వున్నవి చిక్కు తై తాములు
వాని కురువులు మాయకుండ నా కొంగుఎట్లా పరుతును ? సందమామా?
ముద్దుల రంగడు ముక్కెర అంపినాడు
నా ముక్కెర కాడ తీసి ముద్దెట్ల పెడుతును ? సందమామా?

మోహంతో రగిలిపోతున్న ఓ పల్లెటూరి పడుచుపిల్ల తియ్యని బాధను తెలిపే పాట ఇది. తన ముద్దుల రంగడు తనకు పంపిన ముక్కెర చూసి మురిసిపోతూ, అతన్ని ప్రేమతో ముద్దు పెట్టు కోవాలని తహతహ లాడుతున్నది ఈ విరహోత్కంఠిత.'సందమామ' అని పదేపదే వస్తున్న మాట బహుశా తనకు దూరంగా వున్న ప్రియునికి సంకేతం కాబోలు. దీన్ని అనువదించడం కష్టం కాగా నాకు ఈ మాట పూర్తిగా అర్థం కాలేదు కూడా.

'సర్వాయి పాపడు' మహాకావ్యం వినిపించిన వ్యక్తే నా ముందు ఈ పాట పాడాడు. ఈ ప్రేమ గీతంలో మొదటి నుంచి చివరి దాకా మొరటు తనం నాకు కనపడనే లేదు. ఈ ప్రేమగీతం లోని మాధుర్య ప్రవాహం ప్రశంసనీయమైనది. తెలుగు జానపద కవిత్వాన్ని విశదీకరించేందుకు నా చేతనైనంత వరకు ప్రయత్నించాను. ఈ వ్యాసంలో నేను ఉదహరించిన పాటల్ని తెలుగు భాషా విద్వాంసులు విమర్శించవచ్చు. ఎందుకంటే ఈ తెలుగు జానపద గేయాల్ని ఆ భాషతో పరిచయం లేని నేను ఉటంకించినప్పుడు తప్పకుండా తప్పులు దొర్లి వుంటాయి. క్షంతవ్యుణ్ణి. నా గేయానువాదం పరిణతులైన వాళ్ళకు ఏమాత్రమూ తృప్తి ఇవ్వక పోవచ్చు.

ఉద్యోగ రీత్యా వూర్లూ వాడలూ తిరుగుతూ గుడారాల్లో బస చేస్తూ, వొంటరిగా వుంటూ, ఈ గేయాల్ని సేకరించి, అనువదించి వేసటను మరిచి పోగలిగాను నా ఈ ప్రయత్నం ఈ క్షేత్రంలో పనిచేసే వారిని ప్రేరేపించి, తెలుగు జానపద గేయ కవిత్వాన్ని వాళ్ల ద్వారా సేకరింప చేయించి, ప్రచురింప చేయిస్తే నా కృషి ఫలించినట్లే.

అనువాదకుని మాట :

జె. ఎ. బోయెల్ రాయలసీమలో పని చేసిన మద్రాసు సివిల్ అధికారి. ఇతను బళ్లారిలో ఉద్యోగం చేస్తున్న సమయంలో పల్లె పాటలు విని, ముగ్ధుడై ఒక బోయ వ్యక్తితో జానపద గేయాలు విని, వాటిని ఉదహరిస్తూ ప్రాచ్య భాషా సాహిత్య పరిశోధన పత్రిక 'ది ఇండియన్ ఆంటిక్వరీ' (జనవరి 1874)లో 'తెలుగు బ్యాలెడ్ పొయెట్రి' అనే వ్యాసాన్ని 1-6 పేజీల్లో చక్కని వ్యాసం రాశారు. చార్లెస్ ఇ. గోవర్ 1871లో ప్రచురించిన 'ది ఫోక్ సాంగ్స్ ఆఫ్ సదర్న్ ఇండియా' పుస్తకంలో జానపద గేయాల పేరిట వేమన పద్యాల్ని ఉదహరించాడు. ఈ విషయంతో విభేదించి జె. ఎ. బోయెల్ దొర అప్పటం జానపద గేయాల్ని సేకరించి, వాటి కవితా సౌందర్యం, వైశిష్ట్యాన్ని వివరిస్తూ 'తెలుగు బ్యాలెడ్ పొయెట్రి' అనే వ్యాసం రాసి ప్రసిద్ధ పరిశోధన పత్రిక 'ది ఇండియన్ ఆంటిక్వరీ' లో ప్రచురించాడు.

'తెలుగు సూర్యుడు' సి. పి. బ్రౌను కుమార రాముని కథ, పల్నాటి వీర చరిత్ర, లక్ష్మమ్మ కథ మొదలైన కథా

గేయాల్ని సేకరించి, సాపు ప్రతులు రాయించి భద్రపరిచి పుణ్యం కట్టుకున్నాడు. కాని జానపద గేయాల్ని సేకరించి, వాటి గురించి రాసిన దాఖలాలు లేవు.

జె. ఎ. బోయెల్ రాసిన 'తెలుగు కథాగేయ కవిత్వం' వ్యాసాన్ని విఖ్యాత విద్వాంసులు నిడదవోలు వెంకటరావు గారు మద్రాసు నుండి వెలువడ్డ విశిష్టమైన మాస పత్రిక 'కిన్నెర' జనవరి,1955 సంచికలో జానపద గేయాలు: కొన్ని విశేషములు అనే ఓ పెద్ద వ్యాసం రాశారు. ఈ వ్యాసం 'కిన్నెర' పత్రికా సంపాదకులైన పందిరి మల్లికార్జునరావు శతజయంతి ప్రచురణలు 5వ సంపుటం 'జానపద విజ్ఞానము' లో (పేజీలు 2847-2862) మరో సారి వెలుగు చూసింది. 'పరిశోధనా పరమేశ్వరులు' నిడదవోలు వారు, జె. ఎ. బోయెల్ దొరవారి 'తెలుగు కథాగేయ కవిత్వం' గురించి ప్రస్తావిస్తూ, ఆయన ఇంగ్లీషు వాక్యాల్నే ఉటంకిస్తూ, ఆయన సేకరించిన తెలుగు జానపద గేయాల్ని ఇంగ్లీషు లిప్యంతరణం నుంచి తెలుగు చేశారు. ఈ వ్యాసంలో పైగా చందమామ, ఏల పదాల్ని లక్షణ సహితంగా, సోదాహరణంగా వివరించారు.

జె. ఎ. బోయెల్ దొర తమ వ్యాసంలో ఆరు విడి భాగాలుగా కొన్ని జానపద గేయాలు ఉదహరించారు. నిడదవోలు వెంకటరావుగారు తమ వ్యాసం'జానపద గేయాలు: కొన్ని విశేషాలు' (కిన్నెర 'జానపద విజ్ఞానము' 5వ సంపుటము. పేజీలు: 2847- 2862) లో బోయెల్ దొరగారి ఇంగ్లీషు వాక్యాల్ని ఉటంకిస్తూ ఆరు విభాగాల కింద తెలుగు జానపద గేయాలను పొందుపరిచారు. వీటిని ఆరు పాటలుగా భావించడం సరికాదు. మొదటి విభాగంలో 'సర్వాయి పాపడు' కథా గేయంలోని 24 పంక్తులు వున్నాయి. రెండవ విభాగంలో 4 కపిల పదాలు, మూడవ విభాగంలో 5, నాలుగవ విభాగంలో 4 కపిల పదాలున్నాయి. ఐదవ విభాగంలో ప్రేయసీ ప్రియుల సంవాద గేయం, ఆరవ విభాగంలో 1 చందమామ పాట వున్నాయి. అంటే మొత్తం 16 జానపద గేయాలున్నాయన్న మాట ఐతే 'సర్వాయి పాపడు' మాత్రం వీరగాథాంశం - అంటే కథా గేయం (బ్యాలెడ్) అని చెప్పుకోవాలి. మిగతా 15 జానపద గేయాలే.

డా. బి. రామరాజుగారు తమ సిద్ధాంత గ్రంథం 'తెలుగు జానపద గేయ సాహిత్యము' (1978) లో బోయెల్ దొరగారు మొత్తమారు పాటలు సేకరించి ప్రకటించెను. (పుట: 62) అన్నమాట పొరపాటు. అవి మొత్తం 16 గేయాలన్న సంగతి మరవరాదు. పైగా ఆయన 4 కపిలి పదాల్ని ఉదహరిస్తూ వాటిని ఒక గేయంగా భావించారు. (పేజి:62) ఇది కూడా ప్రమాద పతితమే.

జె. ఎ. బోయెల్ దొర ఈ జానపద గేయాల్ని "కడప మండలములో ప్రచారములో నున్న ఆరు జానపద గేయాలను సంగ్రహించి నారు". అని "జానపద గేయాలు: కొన్ని విశేషాలు" అనే వ్యాసంలో నిడదవోలు వెంకటరావు గారు పేర్కొన్నారు. బోయెల్ దొర తాను పై గేయాల్ని బళ్లారిలో సేకరించినట్లు తమ వ్యాసంలో స్పష్టంగా పేర్కొన్నారు. అలాంటప్పుడు నిడదవోలు వారి మాటకు మూలమేదో?

జె. ఎ. బోయెల్ దొరగారి 'తెలుగు కథాగేయ కవిత్వం' (Telugu Ballad Poetry) తెలుగు జానపద గేయాల సేకరణ రీత్యానూ, విషయ వివేచన పరంగానూ విశిష్ట మైనది. బోయెల్ దొర సేకరించిన తెలుగు జానపద గేయాలు కొన్నే అయినా వాటిని పాడిన వ్యక్తి, ఊరు, కుల గోత్రాలు గురించి తెలిపారు. తాను సేకరించిన ఊరు బళ్లారి అనీ చెప్పారు. వారు 'సర్వాయి పాపడు' వీర కథాగేయంలోని 24 పంక్తులు మాత్రమే ఉటంకించ గలిగినా, స్థానిక వీరుల వీరగాథలకున్న ప్రజాదరణను తెలియ పరిచారు. పైగా అతను వీరగాథలోని వర్ణనల విస్తారానికి కారణాల్ని కూడా వూహించగలిగారు. బోయెల్ దొర కథాగేయాల (Ballads) గేయాల, పాటల (Songs) కున్న భేదాన్ని ఈ వ్యాసంలో తెలుపలేదు. పైగా 13 పదాల్ని కపిల పాటలని పేరు పెట్టి పిలవలేదు. బోయెల్ దొర వ్యాసం చివర తన ప్రయత్నం జానపద గేయ సేకరణకు పూను కొనేవాళ్లకు ప్రేరణ కలిగించ గలిగితే

అదే పదివేలనీ, తన అనువాదం పండితుల ఆమోదానికి పాత్రమవుతుందో లేదో అన్న సంశయాన్ని ప్రకటించారు. ఆయన జానపద గేయానువాదం సంతృప్తికరంగా వుందనడంలో సందేహం లేదు. ఆ పాశ్చాత్య పండితుని వినయ విధేయతలు ఈనాటి యువ విద్వాంసులకు అనుకరణీయమైనవి, అనుసరణీయమైనవీనూ.

వ్యాసకర్త పరిచయం :

జె. ఏ. బోయల్ గారి పూర్తిపేరు జాన్ ఆర్చిబాల్ బోలే ఇతను 1841 లేదా 1845 మధ్య కాలంలో జన్మించారు. ఇతను 1875 ఫిబ్రవరి 9వ తేదినా తమిళనాడులోని తిరునెల్ వేలి జిల్లాలోని పాళయం కోట్టై లో మరణించాడు. అక్కడి చర్చి స్మశానంలో ఇతని శవం సమాధి చేయ బడింది. ఇతను ఇంగ్లాండులో రాడ్లీ కాలేజీలో విద్య నభ్యసించి సుమారు 1860 ప్రాంతంలో మద్రాసుకు వచ్చాడు. మద్రాసు సివిల్ సర్వీస్ లో ఉన్నత అధికారిగా ఉద్యోగం నిర్వహించాడు. ఈయన తిరునెల్ వేలి జిల్లాలో యాక్టింగ్ స్పెషల్ అసిస్టెంట్ కలెక్టర్ గా పనిచేస్తూ పాళయం కోట్టై లో పరమపదించారు. జె. ఏ. బోయెల్ రచనలు 'ది ఇండియన్ ఆంటిక్వరీ' మూడవ సంపుటంలో (1874) 287-289 పేజీలలో 'క్యాస్ట్ అండ్ ట్రైబ్స్ ఆఫ్ సదరన్ ఇండియా' అనే వ్యాసం రాశాడు. తర్వాత 'ది కలకత్తా రివ్యూ' (1876) సంపుటంలో 'ది ఫిషరీష్ ఆఫ్ సదరన్ ఇండియా' లో ప్రచురితమైంది. అంతే కాక ఈయన నెల్లూరు జిల్లాలోని గనుల పరిశ్రమ గురించి కూడా ఒక వ్యాసం రాసినట్లు తెలుస్తోంది.

మహనీయుడు జె. ఏ. బోయెల్ గురించి పై సమాచారం అందించిన సాహితి మిత్రుడు డా? పి. ఎన్. గోపాలకృష్ణ (హైదరాబాద్) గారికి కృతజ్ఞతలతో....



తెరచీరల వారి చరిత్ర – జీవన విధానం

–డా॥. డి. సుశీల, తెలుగు అధ్యాపకురాలు డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఐఐఐటి, ఒంగోలు.

Folk Arts అనే ఇంగ్లీషు పదానికి సమానర్థకంగా తెలుగులో జానపదకళలు అనే మాటను ఉపయోగిస్తున్నాం. Folk అంటే జానపదులు. Art అంటే కళలు. ఇంగ్లీషులోని Art అనే పదం Ars అనే గ్రీకు భాషాపదం నుంచి వచ్చింది. Ars అంటే ప్రకృతి కానిది అర్థం. Nature అంటే ప్రకృతి. ప్రకృతి కానిది అంటే కృత్రిమమైనది అని అర్థం. అంటే కళ మానవుని చేత కృత్రిమంగా రూపొందించబడిందని అర్థం. "Art Imitates Nature" అని అరిస్టాటిల్ చెప్పారు. మనిషి ప్రకృతిని చూచి దానికి అనుకరణగా కళను రూపొందించాడు. మనిషి ప్రకృతిని చూచి అనేక విషయాలు నేర్చుకున్నాడు. అందులో కళలు గూడ ఉన్నాయి. అందువల్లనే "Nature taught Art" ప్రకృతి కళను నేర్పింది అని మిల్టన్ చెప్పారు. చెప్పేదేమంటే జానపద కళలను చాలా వరకు మనిషి ప్రకృతిని చూచి సృష్టించాడు. అయితే ప్రకృతిలో ఉన్నదాన్ని ఉన్నట్లుగా కాకుండా ప్రకృతి అతని మనస్సుకు గోచరించినట్లుగా చిత్రించాడు. అంటే మనిషి ప్రకృతిలో ఉన్నదాన్ని చూసి దానికి ప్రతిసృష్టి చేశాడన్నమాట.

తెరచీరల వారు విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి గ్రామంలో ఉన్నారు. పెద్ద బొడ్డేపల్లి ప్రస్తుతం నర్సీపట్నంలో కలసిపోయింది. తెరచీరలవారుపూజగొల్ల శాఖకు చెందిన యాదవులు. వీరు కాటమరాజు కథలను చెబుతారు. ఈ కథలను చెప్పేటప్పుడు వీరు ఒక పెద్ద తెరను ఉపయోగిస్తారు. ఈ తెరను తెరచీర అని పిలుస్తారు. తెరచీరనుపయోగించి కథను చెప్పడం వల్లనే వీరికి తెరచీరల వారు అనే పేరు వచ్చింది. ఈ తెరచీరల వారు పదం వ్యవహారంలో తెలసీరవారు అయింది. గ్రామీణులు వీరిని తెలసీరవారు అని పిలుస్తారు. వీరు విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆలగొల్లలను, ఎర్రగొల్లలను, యాచించి జీవిస్తున్నారు.

తెరచీరలవారు పెదబొడ్డేపల్లిలో కొల్లి, బర్ల, చెల్లి బోయిన, గొంప అనే నాలుగు ఇంటిపేర్లకు చెందిన ఎనిమిది కుటుంబాలవారు మాత్రమే ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పూజగొల్ల శాఖకు చెందిన యాదవులు లేరు. ఈ ప్రాంతంలో ఎర్ర, ఆల, గౌడ శాఖలకు చెందిన యాదవులు మాత్రమే ఉన్నారు. ఈ మూడు శాఖల వారు గాకుండా మిగిలిన శాఖలకు చెందిన యాదవులు ఎవరైనా ఈ ప్రాంతంలో ఉంటే వారు మిగిలిన ప్రాంతాల నుంచి వలస వచ్చినవారై ఉంటారు. అలాగే పూజగొల్ల శాఖకు చెందిన తెరచీరల వారు కూడా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల నుంచి వలస వచ్చిన వారై ఉంటారు. తెరచీరల వారు కథ చెప్పేటప్పుడు వంత పలికే వారిని "బలకొటే వారు" అని పిలుస్తారు. వంతపాడే వారిని బలకొట్టేవారు అని రాయలసీమ ప్రాంతంలో పిలుస్తారు. అందువల్ల తెరచీరల వారు రాయలసీమ ప్రాంతం నుంచి వలస వచ్చిన వారై ఉండవచ్చు.

తెరచీరల వారిలోని ఎనిమిది కుటుంబాల్లో ఒక్కొక్క కుటుంబానికి వందగ్రామాల్లో యాచించే అధికారం ఉంది. వీరు మూడు సంవత్సరాల కొకసారి తమ గ్రామాలకు వెళ్ళి ఆ గ్రామాల్లో ఉన్న యాదవుల ఇళ్ళ దగ్గర కాటమరాజు కథలను చెప్పి వారిని యాచిస్తారు. యాదవులు వీరికి ఇచ్చే డబ్బు, గొర్రెపిల్ల, మేకపిల్ల మొదలైన వాటిని మందెచ్చులవారి లాగా "తాగం" అని పిలుస్తారు. యాచనకు వెళ్ళేటప్పుడు వీరు ఇద్దరు లేక ముగ్గురు వెళ్తారు. వీరిలో ఒకరు ప్రధాన కథకుడుగా ఉంటే మిగిలిన ఒకరు లేక ఇద్దరు వంతలుగా ఉంటారు.

ఇలా యాచనకు వెళ్ళేటప్పుడు వీరు పురుషులు మాత్రమే వెళ్తారు. స్త్రీలు వెళ్ళరు. తమ స్వగ్రామమైన పెదబొడ్డేపల్లికి దగ్గరగా ఉన్న గ్రామాలకు యాచనకు వెళ్తే ఉదయం వెళ్ళి రాత్రికి తిరిగి తమ ఇంటికి వస్తారు. దూరంగా ఉన్న గ్రామాలకు వెళ్ళినప్పుడు ఏదైనా ఒక ఊర్లో మకాం వేసి ఉదయమే చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలకు వెళ్ళి యాచించి రాత్రికి మకాంకు చేరుకుంటారు.

గ్రామాల్లో గొర్రెల మంద ఉన్న యాదవులు ఒక్కొక్క ఇంటి పేరుగలవారు కలిసి వీరికి గొర్రెపిల్లను గానీ, మేకపిల్లను గానీ ఇస్తారు. మంద ఉన్నవారు వీరికి తప్పనిసరిగా గొర్రెపిల్లను గానీ, మేకపిల్లను గానీ ఇస్తారు. మంద ఉన్న వారి దగ్గరి నుంచి వీరు డబ్బు తీసుకోరు. తప్పనిసరిగా జీవాన్నే తీసుకుంటారు. మందలేనివాళ్ళు డబ్బు ఇస్తారు. డబ్బు ఇచ్చేవారు వంద, రెండు వందలు, మూడు వందలు ఇలా వారి ఆర్థిక స్థోమతను బట్టి డబ్బు ఇస్తారు.

యాదవులు తమ ఇంటికి వచ్చిన తెరచీరల వారిని యాచకులుగా చూడరు. తమ అడబిడ్డల మాదిరిగా గౌరవంగా చూస్తారు. తెరచీరలవారు ఒకటికి నాలుగైదు సార్లు యాదవుల ఇళ్ళకు వెళ్ళి తరతరాలుగా తాము యాదవుల అర్తివారుగా జీవిస్తున్నామని, అందువల్ల వారు తమకు తాగం ఇవ్వాలని బ్రతిమాలే ధోరణిలో మాట్లాడుతూ యాదవుల దగ్గర నుంచి తాగం వసూలు చేస్తారు. దాదాపుగా యాదవులందరూ వీరికి తాగం ఇస్తారు.

తెరచీరల వారు తమ కళాప్రదర్శన సందర్భంగా యాదవభారతంగా పిలువబడుతున్న కాటమరాజు కథను చెబుతారు. అందువల్ల ఇది సాహిత్యమున్న కళ. వీరు తమ కళను పగలు, రాత్రి తేడా లేకుండా అన్ని వేళలా ప్రదర్శిస్తారు. ఈ కళా ప్రదర్శనలో పురుషులు మాత్రమే పాల్గొంటారు. స్త్రీలుగానీ, పిల్లలుగానీ పాల్గొనరు. ఈ కళ ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాత్రమే ప్రదర్శింపబడుతూ ఉంది. అందువల్ల ఇది ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన కళ. ఈ కళను తెరచరీల వారు మాత్రమే ప్రదర్శిస్తారు. వేరే ఎవ్వరూ ఈ కళను ప్రదర్శించడం లేదు. అందువల్ల ఇది తెరచీరల వారికి మాత్రమే పరిమితమైన కళ. తెరచీరలవారు తమ పోషకులైన యాదవుల ఇళ్ళ దగ్గర యాదవుల కోసం మాత్రమే ఈ కళను ప్రదర్శిస్తారు. ఐతే ఇతర కులాల వారు కూడా ఈ కళను చూడవచ్చు.

తెరచీరల వారు తమ కళకు ఆధారమైన తెరచీరను చాలా పవిత్రంగా చూస్తారు. తెరచీరను విప్పి కథ చెప్పేటప్పుడు కాళ్ళకు చెప్పులు వేసుకోరు. అంతేగాదు తెరచీరను మడిచి 'సంచిలో పెట్టుకొని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళేటప్పుడు. తెరచీర ఉన్న సంచిని పట్టుకున్న వ్యక్తి కాళ్ళకు చెప్పులు వేసుకోడు. ఎంత ఎండలోనైనా తెరచీరను పట్టుకున్న వ్యక్తి కాళ్ళకు చెప్పులు లేకుండా ఎంత దూరమైన నడుచుకుంటూ వెళ్తాడు. దీనికి కారణం తెరచీర మీద శక్తిస్వరూపిణిగా ఉన్న గంగమ్మ తల్లి ఉండడమే. ఆ తల్లి బొమ్మ ఉన్న తెరను పట్టుకోవడం గంగమ్మ తల్లిని మోసుకెళ్ళడం లాంటిదని వీరు భావిస్తారు. దేవతా విగ్రహాలను తలమీద పెట్టుకొని మోసుకొని వెళ్ళేవారు ఏ విధంగా చెప్పులు వేసుకోరో, అలాగే గంగమ్మతల్లి బొమ్మ ఉన్న తెరచీరను తీసుకొని వెళ్ళేవారు గూడా చెప్పులు వేసుకోరు. అంతే గాదు వీరు ప్రతీ సోమవారం తెరచీర మీద ఉన్న గంగమ్మకు కోడిని బలి ఇస్తారు. అలా చేయకపోతే గంగమ్మ కోపగిస్తుందని వీరు చెబుతారు.

తెరచీరలవారు తమ కళాప్రదర్శన సందర్భంలో పొడపోతుల వారిలాగానే ప్రత్యేకమైన వేషధారణ చేసుకోరు. మామూలుగా రోజు వారు వేసుకొనే దుస్తులనే కథాగాన సందర్భంలో కూడా ధరిస్తారు. అంతేగాదు వీరు పొడపోతుల వారి లాగానే తమ కళాప్రదర్శన సందర్భంలో ఎలాంటి వాద్యాలను ఉపయోగించరు. తెరచీరలవారి ప్రదర్శన చాల సరళమైనది, సులభమైనది, సామాన్యమైనది. వీరి ప్రదర్శన ఆఖ్యానాత్మకమైనది.

తెరచీరల వారి ప్రదర్శన పూర్తి అయిన తరువాత వారికి, ఎవరికి వారు వారికి తోచినంత డబ్బు కానుకగా

ఇస్తారు. ఆ డబ్బును తీసుకొని తెరచీరల వారు డబ్బు ఇచ్చినవారి పేరు, వారు ఇచ్చిన డబ్బు ఎంతో చెప్పి వారిని, వారి కుటుంబాన్ని గంగమ్మతల్లి చల్లగా చూడాలని, వారికి సాయంగా ఉండాలని దీవిస్తారు. కథ చెప్పడం పూర్తి అయిన తర్వాత తెరచీరలవారు తెరచీర మీద ఉన్న గంగబొమ్మకు హారతి ఇచ్చి ప్రదర్శన ముగిస్తారు. ఈ విధంగా వారి ప్రదర్శన సాగుతుంది.

మన జానపదకళలు ఎంతో గొప్పవి. వాటి విలువ ఎప్పటికి వన్నె తగ్గనిది. అటువంటి కళల్ని ప్రస్తుతం ఉన్నవారు ఆదరించి, భవిష్యత్తు తరాల వారికి కూడా ఆ కళల ప్రాశస్త్యాన్ని తెలిసేలా చేసినప్పుడే అవి సజీవంగా నిలిచి ఉంటాయి అనడం అక్షర సత్యం.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరంగారు
2. జానపద గేయ వాఙ్మయ వ్యాసావలి - నేదునూరి గంగాధరం గారు
3. యాదవుల జానపద ప్రదర్శన కళలు - ఆచార్య మర్రెబోయిన జయదేవ్ గారు
4. జానపద నృత్యకళలు - డా॥ చిగిచెర్ల కృష్ణారెడ్డి గారు

❖ ❖ ❖

జానపద కళలు – పరిరక్షణ మార్గాలు

–డా॥. దేవినేని జ్యోతి, ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

మానవ జీవితం ఎంత పురాతనమైనదో జానపదకళలు కూడా అంతే పురాతనమైనవి. ప్రజలను అలరించి దేదీప్యమానంగా వెలుగొందుతుండేవి. కొన్ని కాలాను గుణంగా వచ్చిన మార్పుల వల్ల కనుమరుగయ్యే స్థితికి వచ్చాయి. కొన్ని అంతరించిపోయాయి. కొన్ని రూపాంతరం చెంది మనగలుగుతున్నాయి. జానపద కళలు మన ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలు. మానవ సమాజం ఎంత పురాతనమైందో, జానపద కళలు కూడా అంతే పురాతనమైనవి. అంతేకాదు జానపద కళలు జన జీవనం నుండి ఉద్భవించాయి. జానపద కళలు మన పూర్వీకుల జీవన విధానంతో పెనవేసుకొని వున్నాయి.

ప్రజల జీవన విధానంలో స్వతసిద్ధంగా పుట్టి, వృద్ధి చెందిన కళారూపాలు కావడం వల్ల జానపద కళా రూపాలు అని పేరొచ్చింది. ఈ కళారూపాలు సామాజి కంగా, సాంస్కృతికంగా పెనవేసుకొని వుండడం వల్ల ఎన్ని సాంఘిక పరిణామాలు వచ్చినా అవి నిలిచే వున్నాయి. జానపద కళారూపాలు మనకు మాత్రమే పరిమితమైనవి కావు. ఏ దేశంలో నైనా వారి అభిరుచులకు అనుగుణంగా జానపద కళలు వుంటాయి.

మన ప్రాచీన కళారూపాలైన కురవంజి, యక్షగానం, తోలుబొమ్మలాటలు, కళాపం, బుర్రకథ, హరికథ, వీధినాటకం, చోడిగాడు, భాగవతమేళం, పగటివేషాలు, వాలకం, రుంజలు (జానపద పాటల వంటివి), భజనలు, పిచ్చిగొంటివాళ్లు, దాసర్లు, చిందుమాదిగలు, బైండ్లు, కాటికావర్లు, జంతరు పెట్టె, గంటి భాగోతులు, విప్రవినోదులు మొదలైన వాటిని జానపద కళారూపా లంటారు. ఇవి కొన్ని మాత్రమే పల్లెల్లో వున్నాయి. పల్లె జనాలను అలరిస్తున్నాయి.

వీటిని స్వాభావిక రూపాలు, వృత్తి సంబంధిత రూపాలు, వ్యంగ్య రూపాలు, మిశ్రమాలు అని విభజించు కోవచ్చు. వీధి నాటకాలు చాలా ప్రాచీనమైనవని హాలశాతవాహనుడు రచించిన గాథా సప్తశతి వల్ల తెలుస్తు న్నది. సుమారు రెండువేల ఏళ్లకు పూర్వమే వీధినాటక లక్షణాలు, దేశివాద్య విశేషాలున్నట్లు నాటి శిల్ప ప్రతికృతుల రూప అవశేషాల వల్ల తెలుస్తున్నది.

"ఉదాత్త రసాన్విత కావ్య నాటక క్రమములు బెక్కు సూచితి" అన్న పద్యం ద్వారా నన్నయ కాలానికే నాట కాదులున్నట్లు తెలుస్తున్నది. జానపద కళారూపాలు దేశి సారస్వత శాఖకు చెందినవి.

జానపద గాయకులు - రుంజవారు, బీదన్నలవారు, వీరముష్టివారు, బవనీల వారు, జంగములు, పిచ్చుక గుంట్లవారు దాసరులు, శారదకాండ్రు మొదలైనవారు. వీరు అనేక రకాల వాద్య విశేషాలతో ఊరూరా తిరుగుతూ వాద్యాలను వినిపిస్తూ పాటలు పాడుతుంటారు. అలాగే కొందరు జానపద కళాకారులు యక్షగానం, పగటివేషాలు, వీధినాటకాలు, తోలుబొమ్మలు, బుర్రకథలు మొదలైన వాటిని ప్రదర్శిస్తుంటారు.

యక్షగానం :

యక్షగానం అంటే దేశీయ ఛందోబద్ధమైన నాటకం. కొందరు దీనిని 'పాట'గా పేర్కొన్నారు. రెండు వేల ఏళ్ళనాడే ప్రచారంలో ఉన్నట్లు భాగవతంలో కృష్ణుని జన్మ సమయంలో గోపికలు ఈ తరహా పాటలను పాడినట్లు దశమస్కంధంలో వర్ణించబడింది. యక్షగానాలు సంగీత ప్రధానమైనవి. అప్పకవి యక్షగానం పాటలు గల ప్రబంధం అన్నాడు. ఎందుకంటే అప్పకవీయంలో యక్షగాన ప్రశస్తి వుంది. అందులో అర్ధచంద్రికలూ, త్రిపుట, జంపే, ఆటతాళము, వీనయక్షగాన ప్రబంధం

బులతుకవచ్చు' అన్నాడు. యక్షగానాలు శ్రీనాథుని కాలంలో చాలా ప్రచారంలో వుండేవి. "కీర్తింతు రెద్దాని కీర్తి గాంధర్వులు ఆంధర్వమున యక్షగాన సరణి" - అన్నదాన్ని బట్టి స్పష్టంగా తెలుస్తున్నది. ఇక తంజావూరు ప్రభువుల కాలంలో యక్షగానాలకు వసంత ఋతువు వంటిది. తంజావూరు రాజుల కాలంలో స్త్రీలు కూడా వేషాలు ధరించేవారు. యక్షగానాలు తెలుగులో సుమారు 400 ఉన్నట్లు చారిత్రక పరిశోధకుల అంచనా. తెలుగు దేశంలో వీధినాటకాలున్నట్లే తమిళదేశంలో 'తెర క్కుత్తు'లనీ కన్నడంలో 'బయలాటము"లనీ వ్యవహారంలో వున్నాయి.

ద్రావిడ భాషయందు మొట్టమొదట కురవంజి అనే దృశ్య రచనలు వచ్చాయి. ఈ కురవలు ఆటవికులు. వీరికి అడుగువేస్తూ నృత్యం చెయ్యడం అటవాటు. అయితే యక్షగానాలలో గేయానికి ప్రాధాన్యం ఉంటే, కురవంజిలో నృత్యానికి ప్రాధాన్యత వుంటుంది.

ఈ యక్షగాన ప్రదర్శనం ఏ రూపంలో ఉంటుందో చూద్దాం..

"ఢక్క హుడక్క జర్ఝరల్
ఝల్లరి యాదిగా గలుగు శబ్ద
పరంపర తాళబద్ధమై
యుల్లసిలం ప్రబంధముల
కొప్పగ నాడుదు రగ్రవేదిపై"

అని బసవపురాణంలో పాల్కురికి సోమన యక్షగాన ప్రదర్శనల రూపం గురించి చెప్పారు.డక్క, హుఢక్క, ఝల్లరి మొదలైన వాద్య విశేషాలతో, గద్య పద్యాత్మకంగా వేదికపై ప్రదర్శించే ప్రబంధాలుగా పాల్కురికి సోమన పేర్కొన్నాడు.

యక్షగానాలలో సాంప్రదాయకమైన హాస్యపాత్రలు కూడా మనకు గోచరిస్తాయి. ప్రతి యక్షగానంలోనూ ఇతివృత్తం వేరైనా హాస్య పాత్రలు ప్రతిదానిలోనూ వుంటాయి. తెలుగులో రచించిన ప్రోలుగంటి చెన్నసోరి సౌభ చరితమే మొదటి యక్షగానమని తెలస్తావుంది. ఇది క్రీ.శ.15వ శతాబ్ది ఉత్తరార్ధంలోనిదని పరిశోధకుల అభిప్రాయం. కవి కాలాన్ని బట్టి కందుకూరి రుద్రకవి 'సుగ్రీవ విజయం' మొట్టమొదటి యక్షగానంగా పరిగణించబడుతుంది. యక్షగానాల ప్రదర్శనలో పేరు గాంచిన కూచిపూడి భాగవతులపేరు 15వ శతాబ్దం నాటికే ప్రచారంలో ఉందనడానికి 1502 నాటి మచ్చుపల్లి స్థానిక చరిత్ర ఆధారం.

చెంచులక్ష్మీ నృసింహుల గాథను ఓబయమంత్రి క్రీ.శ.1600 ప్రాంతంలో 'గరుడాచల మహాత్మ్యం' అనే పేరుతో యక్షగానంగా రచించాడు. వేషాలు వేసుకొని, పాడుతూ ప్రదర్శించే రూపకమే యక్షగానం.

పగటి వేషాలు :

పగటిపూట ప్రదర్శించే వేషాలు కనుక వీటికి 'పగటి వేషాలు' అని పేరొచ్చింది. ఇవి వినోదం ప్రధాన ఆశయంగా, ప్రజల ఆశలకూ, ఆశయాలకు దర్పణంగా దేశంలో ప్రచారం పొందాయి. వీటి గురించి అనేక కథలు ప్రచారంలో వున్నాయి. నాటి పరిపాలకుల దృష్టికి ప్రజా సమస్యలను తీసుకురావడం, వర్తమానాలను చేరవేయడం కోసం ప్రధానంగా ఈ ప్రదర్శనలు ప్రచారంలోకి వచ్చాయని తెలుస్తుంది.

పగటివేషాల ద్వారా రాజులలో మార్పును తేవడం, ప్రజల్లో చైతన్యాన్ని కల్గించడం ప్రత్యేకత. కాకతీయ యుగంలో యుగంధరుడు పిచ్చి యుగంధరుడుగా నటించి 'ఢిల్లీ సుల్తాన్ పట్టుకపోతాన్' అంటూ ఢిల్లీ సుల్తానులను జయించింది పగటివేషంతోనే. కళింగ గంగరాజు పగటివేషాల వారి సాయంతోనే శత్రువులను జయించాడనే కథ ప్రచారంలో వుంది. భారతదేశంలో స్వతంత్ర, సామంత రాజుల పాలనలోనూ చిత్ర విచిత్ర మైన ఈ వేషాలు చాలా ప్రచారంలోకి, వ్యాప్తిలోకి వచ్చాయి. రకరకాల మారువేషాలు ధరించి గూఢ చారులుగా సమాచారాలను అందించే వారని చరిత్ర

చెబుతుంది. వీరు వర్తకులుగా - రత్నాలు, వజ్రాలు అమ్మే వ్యాపారులుగా కోటలోకి ప్రవేశించి రాజును వంశించడం, అక్కడి విషయాలను చూసి, అక్కడి బలహీనతలను సేకరించి, దండయాత్రలు చేయడం జరుగుతుండేవి. అలా ప్రారంభమైనవే ఈ పగటి వేషాలు. వీటిని 'బహు రూపాలు' అని కూడా పిలిచేవారు. భరతకోశంలో, సర్వేశ్వర శతకంలో, పండితారాధ్య చరిత్రలో వీటి ప్రస్తావన ఉంది. చారిత్రక ఆధారాలను బట్టి సుమారు మూడు వందల ఏళ్ళనాడు మైసూరు ప్రాంతం నుండి పల్లావఘుల వెంకటరామయ్య అన్న ఆయన ఆంధ్రదేశం రావడం, రేపల్లెలో ఉంటూ మనవారందరికి పగటివేషాలు నేర్పాడని పరిశోధనల వల్ల తెలుస్తున్నది. పగటివేషాలకు గడ్డిపాడు ప్రధాన కేంద్రం. ఇది కృష్ణా జిల్లాలో ఉంది.

గడ్డిపాడు వారు సుమారు 60 రకాల వేషాలను ప్రదర్శించేవారు. ఈ వేషాలలో నిత్యజీవితంలో వుండేవి కొన్ని, కొన్ని పౌరాణికంగా కొన్ని కల్పిత వేషాలు, కొన్ని హాస్యప్రధానమైనవి. వీరి వేషాలలో వుండే గొప్పతనం నమ్మించడం.

జనంలో విశేష ప్రచారం పొందిన పగటి వేషాలలో ముఖ్యమైనవి శక్తి వేషం, భేతాళుడు, దేవరపెట్టె, భోగ వేషం, పాములవాడు, ఎరుకల వేషం దొమ్మర వేషం, సింగి-సింగడు, జంగమ దేవర, పదాను వేషం, పిట్టలదొర మొదలైనవి. ఇలా పగటివేషాలు తెలుగు ప్రజలకు ఆనందాన్ని తద్వారా విజ్ఞానాన్ని అందిస్తున్నాయి.

వీధినాటకాలు :

వీధులలో ప్రదర్శించే నాటకాలను 'వీధి నాటకాలు' అంటారు. ఇవి దేశి నాటక ప్రదర్శనలు. ఒకప్పుడు వినోద ప్రదర్శనలు అన్నీ వీధుల్లోనే జరిగేవి. ఇప్పటివలె రంగస్థలం, హాలు, కర్టెన్లు ఉండేవికాదు. గ్రామ పంచాయితీల పాలనా వ్యవహారాలన్నీ వీధుల్లోనే ఏ వేప చెట్టుకిందో, రావి చెట్టుకిందో జరిగేవి. రామాయణం, భారతం, భాగవత గాథలూ, బసవపురాణ కథలూ వీధినాటకాలుగా ప్రదర్శించేవారు. ఈ దేశి నాటకాల పురోగతి శివకవుల ఆధ్వర్యంలోనే జరిగింది. వీటిని ప్రదర్శించేవారిని భాగోతులనీ అనేవారు. క్రీ.శ.16వ శతాబ్దం నుండి యక్షగానాలు ఎక్కువగా వచ్చాయి. కూచిపూడి భాగవతులు, జంగాలు వీధినాటకాలను ప్రదర్శించే వారిలో ప్రధానమైనవారు. కూచిపూడివారు ప్రదర్శించే వీధి నాటకాలు ప్రధానంగా రామాయణ, భారత, భాగవత గాథలకు సంబంధించినవే. అంతేకాదు త్యాగరాయ కృతులు, జయదేవుని అష్టపదులు, ముప్ప గోపాల పదాలు, భద్రాచల రామదాసు కీర్తనలు, సారంగపాణి కీర్తనలు, తుంగతుర్తి కృష్ణదాసు కృష్ణలీలలు, అన్నమాచార్య పదాలు, గొల్లకలాపం, భామాకలాపం, దాదినమ్మ వేషం మొదలైన ఎన్నో ప్రదర్శనలిచ్చేవారు.

తోలు బొమ్మలు :

మన ప్రాచీన కళారూపాలలో 'తోలు బొమ్మలు' కూడా ప్రసిద్ధమైనవే. ఇవి క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నాటికే చాలా ప్రచారంలో వున్నాయి. తెలుగువారిప్రాచీన కళా ప్రశస్తిని ఖండ ఖండాంతరాలకు వ్యాపింపచేసిన కళా రూపం తోలుబొమ్మలాట. పాశ్చాత్య దేశాలలో గొప్పగా చెప్పుకునే ఛాయాప్రదర్శనలకు మూలం తోలుబొమ్మలే. మనదేశం నుంచి వలస వెళ్ళినవారు జావా, బోర్నియా, సుమిత్ర, సయాం, కంబోడియా, బర్మా మొదలైన దేశాలలో రామాయణ, భారత కథలను తోలు బొమ్మలాటలుగా ప్రదర్శిస్తుంటారు. వీటిని ప్రదర్శించే వారిని బొందిలీలు, బొందిలీ క్షత్రియులు, బొందిలీ కాపులు అని వ్యవహరిస్తారు. వీరి భాష మరాఠీ. వీరికి ఉన్న ఆస్తి ఒక్క తోలుబొమ్మలే. పాల్కురికి సోమనాథుని కాలంలో ఇది ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ బొమ్మలను రెండు రకాలుగా చర్మాలతో తయారు చేస్తారు. దేవతా విగ్రహాలకు జింక చర్మాన్ని, రాక్షస బొమ్మలకు మేక చర్మాన్ని వాడతారు. ప్రదర్శనకు అవసరమైన వస్తువులు ఒక తెల్లని తెర, హార్మోనియం, తబల, కాగడాలు. వినాయకునిబొమ్మ తెరమీదకు రావడంతో వినాయక ప్రార్థనతో ప్రదర్శన ప్రారంభమవుతుంది.

బుర్రకథలు :

బుర్రకథ ప్రాచీన కాలం నుంచీ ప్రచారంలో వున్న జానపద కళ. రామాయణ కాలానికే ఇవి ఉన్నట్లు తెలుస్తున్నది. వీటిని జంగం కథలు అంటారు. మత ప్రబోధానికి, రాజకీయ ప్రబోధానికి, దేశభక్తికీ నిలయంగా ఉండేవి. జంగం కథలను ఎక్కువగా జంగాలే చెపుతారు. ఈ కథలను ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చినవారు. సిరికి జంగాలు, బుడిగే జంగాలూ, శెట్టి బలిజలు, సెట్టి ఫణిజెలు, ఈతముక్కలవారూ వంశ పారంపర్యంగా ప్రచారంలోకి తీసుకొచ్చారు. శైవ వైష్ణవ కలహాల కాలంలో ఈ కథకు చాలా ప్రాచుర్యం లభించింది. క్రీ.శ.1150 నాటికే ఈ కథలు బాగా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తున్నది. శైవ, వైష్ణవ మతాల ప్రచారాలకు, భక్తి ప్రబోధానికి ఉపక రించిన ఈ బుర్రకథలు ప్రస్తుతం రాజకీయ ప్రచారాలకు ఉపయోగపడుతున్నాయి.

జానపద కళలు సామాన్య జనుల ఆశలకు, ఆశయా లకూ, ఆలోచనలకూ, ఆవేదనలకు ప్రతిబింబాలు కావడం వల్ల ఇప్పటికీ సజీవంగానే వున్నాయి. జానపద కళలు మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు. కాబట్టి ఎంతకాలం మన ఆలోచనల మీద ప్రభావం కలిగి వుంటాయో, అంతకాలమూ అవి ఉంటాయి. ఇవి సార్వ కాలికమైనవి, సార్వజనీనమైనవి. అంటే జానపదకళలు ఒక కాలానికి, ఒక ప్రాంతానికీ చెందినవి కావు. కావున ఏ దేశంలో వున్నా, ఏ ప్రాంతంలో వున్నా అక్కడి ప్రజల ఆలోచనలకు, ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయి. ఇవి వినోదంతో పాటు విజ్ఞానదాయకాలు. జానపద కళారూపాలు సర్వ కళల సమాహార స్వరూపాలు. సంగీతము, నాట్యము, అభినయము, చిత్రకళ మొదలైన వివిధ కళలు జానపద కళారూపాలలో వ్యక్తమవు తుంటాయి. అందువల్లనే పండితులను, పామరులను, స్త్రీలను, పురుషులను, బాలురను, బాలికలను అందరిని ఆనందపరిచే కళారూపాలు జానపద కళలు. తెలుగు దేశంలోని జానపద కళారూపాలు దేశ విదేశాలలో మన కళా ప్రశస్తిని చాటే విజయ పతాకాలు. ఇవి ఎంతో మందికి కొంత వరకు జీవనోపాధిని కల్పిస్తున్నాయి. ఈ విధంగా జానపద కళారూపాలెన్నో తెలుగు కళామతల్లి మణిహారా లుగా వర్ధిల్లుతున్నాయి. ప్రతి కళకు ఒక చరిత్ర, ఒక ప్రత్యేకత ఉంది.

జానపద కళలు - పరిరక్షణ మార్గాలు :

ఏవైనా జన జీవన స్రవంతిలో ఉండాలంటే అను నిత్యం వాటి ఉపయోగం తప్పకుండా జరగాలి. అది కేవలం జానపద కళలు మాత్రమేనని చెప్పలేం. జానపద కళలను జన వ్యవహారంలో ఉంచాలంటే నిత్యం జన సమూహాలకు ఈ కళలకు సంబంధించిన విషయాలను పరిచయం చేస్తుండాలి. లేనిచో ప్రజాదరణ పొందకుండా కనుమరుగౌతాయి. జానపద కళారూపాలను పండుగలు, పబ్బాలు, జాతరలు లాంటి సమయాల్లో, జన సందోహం ఎక్కువ వుండే ప్రాంతాలలో ప్రదర్శింపజేయాలి. ఇలా చేయడం వల్ల జానపద కళలపై ఆసక్తిని పెంచుకుంటారు. వీటి సన్నివేశాలు జనాకర్షణగా ఉండాలి.

నీతి నియమాలను తెలిపే నాటకాలను ప్రదర్శింప చేయాలి. నేటి సమాజానికి ఇలాంటి జానపద కళా రూపాలు ఎంతో ఉపయోగకరం. ఎందుకంటే ఆధునిక కాలంలో పాశ్చాత్య ధోరణులతో, నేటి ప్రపంచీకరణ వల్ల యువత పెడదోవపడుతున్నారు. నీతి నిజాయితీలతో మెలిగిన గొప్ప ఆదర్శ వ్యక్తుల పాత్రలతో నాటకాలను వేయించాలి. ఇలాంటి నాటకాలను చూసినప్పుడైనా ఏదో ఒక మూలన మనం చేస్తుండేది తప్పని ప్రేక్షకులకు తెలుస్తుంది. పురాణ ఇతిహాసాలలోని ఆదర్శప్రాయమైన వ్యక్తుల పాత్రలను తీసుకొని వీధినాటకాలు వేయించాలి. ఉదా: రామాయణంలోని సీతా, రాముల అన్యోన్య దాంపత్యానికి నిదర్శనం. పరమభక్తి భావానికి హను మంతుడు, అన్నదమ్ముల అనుబంధాలకు గుర్తుగా రామ లక్ష్మణ, భరత, శత్రఘ్నులు, భారతంలోని పాండవులు వంటి పాత్రలను ప్రదర్శింపజేయాలి. దేశం కోసం పోరాటం చేసిన స్వతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను ప్రదర్శింపజేయాలి. ఉదా: గాంధీ జీవిత

విశేషాలు, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ వంటి వారి పాత్రలు. జానపద కళలు అంటే ప్రాచీన సాహిత్యానికి పరిమితం కాకుండా మారుతున్ననమాజానికి అనుగుణంగా కొత్తకొత్త పోకడలతో జానపద కళలను రాసి ప్రదర్శనల ద్వారా ప్రదర్శింపజేయాలి. సమాజ హితం కోసం పోరాడిన ఎందరో సంఘసంస్కర్తల జీవిత విశేషాలను జానపద కళారూపాలలో ప్రదర్శింపజేయాలి. ఉదా: వివేకానందుడు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వారు. ప్రభుత్వం చొరవచూపించి ప్రదర్శకులను జిల్లా, మండల, పంచాయితీ గ్రామ స్థాయిల నుండి ఆహ్వానించి వారికి కొన్ని నదుపాయాలు కల్పించి ప్రదర్శనకు అవకాశం కల్పించాలి. నేటి రోజులలో పురాణ, ఇతిహాస పఠనాలు కనుమరుగవుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగ విభాగం దూసుకుపోతుంది. ఇలాంటి వాటికి ధీటుగా పురాణేతిహాసాలలోని ముఖ్య ఘట్టాలను ఆధునిక భాషలో రాయించి ప్రత్యేక తీర్పీదును ప్రదర్శకులకు ఇచ్చి వారి చేత ప్రదర్శింపజేయాలి. ఇలా చేయడం వల్ల పురాణ ఇతిహాసాలలోని పుణ్య వ్యక్తులను గూర్చి ప్రజలకు తెలుస్తుంది. నేటి కాలంలో అనువర్తిత జానపద విజ్ఞానం చాలా ప్రాచుర్యంలోవుంది. కాబట్టి నేటి తరాలకు ఉపయోగపడే అంశాలతో జానపద కళారూపాలను ప్రదర్శింపచేయాలి.

మానవులలో నిభిడీకృతమైన నైపుణ్యాలను బయటకు తెచ్చేందుకు జానపద కళారూపాలు ఎంతో ఉప యోగడపతాయి. ప్రతివారిలోనూ ఏదో ఒకరకమైన నైపుణ్యం అంతర్గతంగా దాగి వుంటుంది. వాటిని వెలికి తీసేందుకు జానపద కళలు సహాయపడతాయి. ఉదా హరణకు కొందరు రాజకీయ నాయకులలాగా మాటలు అనుకరిస్తారు. కొందరు సినీనాయకులు, ప్రతి నాయకులు వంటి వారిని అనుకరిస్తారు. మరికొందరు ప్రకృతిలోని జంతు జాలాల అరుపులు, వాహనాల రణగొణ ధ్వనులు సైతం అనుకరిస్తారు. పాఠశాల, కళాశాల స్నాతక, స్నాతకోత్తర స్థాయిలలో నాటకాలను పాఠ్య ప్రణాళికల్లో పాఠ్యాంశాలుగా పెట్టాలి. కేవలం పాఠ్యాంశంగా మాత్రమే కాకుండా జానపద కళ లను విద్యార్థులచేత ప్రదర్శింపజేయాలి. అలా చేయడం వల్ల పిల్లలలో అభివ్యక్తి భావాలు పెరుగుతాయి. విద్యార్థ లకు ఒక అంశం ఇచ్చి ఆ అంశం మీద జానపద కళలను స్వయంగా రాసి వాటిని విద్యా నిలయాల్లో ప్రదర్శింప జేయాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థులలో నృజనాత్మక శక్తి పెరుగుతుంది. కొందరు వక్తలుగా, కొందరు నాటక కర్తలుగా మరికొందరు సంగీత కళాకారులుగా భవిష్యత్‌లో ఎదగగలరు. నేటి సమాజంలో జానపద కళలు మనగలగాలంటే వీడియో, ఆడియోల రూపంలో చిత్రించి ప్రజలకు అందేవిధంగా కృషి చెయ్యాలి. చిత్రిం చిన వాటిని అంతర్జాలంలో నిక్షిప్తం చెయ్యాలి. ప్రజలకు చేరువయ్యేలా చూడాలి. నేటి సమాజంలో హత్యలు, వరకట్న సమస్యలు, మానభంగాలు, హింసాకాండలు, అసాంఘిక చర్యలు మొదలైనవి ఎక్కువ అయ్యాయి. వీటిని నివారించేందుకు ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు కొన్ని చైతన్య పూరిత జానపద కళలను రాసి కళాకారులచేత ప్రదర్శింపజేయాలి. ఈ విధంగా చేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు తగ్గి మానవతా విలువలు పెరుగుతాయి. పైన తెల్పిన పరిక్షణలే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ జానపద కళలపై మక్కువను పెంచుకోవాలి. వాటిలో వుండే సారాన్ని గ్రహించాలి. స్వయంగా పాత్రలను అనుసరించేలా వుండాలి. కళాకారులను ప్రజలు చేరదీసి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అట్లాగే ప్రభుత్వం తరపున జానపద కళల ప్రదర్శనలకు సహాయ సహకారాలు అందించాలి. అలాగే కళాకారులకు గౌరవ వేతనం ఇవ్వాలి. ఈ విధంగా మనం జానపద కళలను అంతరించిపోకుండా కాపాడుకోవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. సమీక్ష - గొడవర్తి భాస్కరరావు (ఎల్లోరా)
2. జానపద విజ్ఞానాధ్యయనం - ఆచార్య జి.ఎస్.మోహన్
3. దక్షిణ భారతీయ జానపద విజ్ఞానకోశం - ఆచార్య పులికొండ సుబ్బాచారి
4. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణ.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వడిసెల గుండ్లలాగ రివ్వున హృదయానికి తగిలేవి సామెతలు – పొడుపుకథలు

– డా॥. కందెళ శోభారాణి, అధ్యాపకురాలు, విశ్వవిద్యాలయ పి.జి. మహిళా కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, హన్మకొండ.

జనపదం అంటే పల్లెటూరు, దేశం, జనులు నివసించే ప్రదేశం అనే అర్థాలున్నాయి. కాని జానపద విజ్ఞానంలో జనపదం అన్న పదాన్ని ఇంగ్లీష్‌లోని 'ఫోక్' అన్న పదానికి సమానార్థం ఇచ్చే పదంగా వాడడం జరుగుతుంది. ఇంగ్లీష్‌లో 'ఫోక్' అన్న మాటలకు అనేకులు అనేక విధాలుగా అర్థాలు చెప్పుకుంటూ వచ్చారు. కొందరు గ్రామీణ సమాజానికి, గ్రామీణులకు దీనిని పర్యాయ పదంగా భావించారు. మరికొందరు వ్యవసాయ వృత్తిలో నిమగ్నులైన వారికి ఈ పేరు చెందుతుందని భావించారు. మరికొందరు అనాగరికులైన జనసముదాయాన్ని 'ఫోక్' అనే పేరుతో పిలవాలని భావించారు.

మొత్తానికి జానపద విజ్ఞానం సంస్కృతికి సంబంధించిందనే విషయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉంది. సంస్కృతి ఆదిమానవుని కాలం నుంచి నేటి నాగరిక మానవుని వరకు ఆయాకాలాల్లో మనిషి తన అభివృద్ధి కోసం చేసివున్న కృషికంతటికి వర్తిస్తుంది. తరతరాల సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న జనసముదాయానికి పర్యాయంగా దీనిని ఉపయోగించాలనీ స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

జానపద సాహిత్యం గాని, ఇతర రూపాలుగాని ఎక్కువగా గ్రామాల్లోనే లభిస్తాయనడంలో సందేహం లేదు. జానపదులంటే గ్రామీణులని మాత్రమే అర్థం కాదు. ఏ ఒక్క విషయంలోనైనా భావసామ్యం కలిగిన జన సముదాయమంతా జానపదులు. వీరు ఒక భాషకు సంబంధించి లేదా ఒక భౌగోళిక ప్రాంతంలో నివసిస్తూ ఉండటం లేదా ఒక జాతికి, మతానికి లేక వృత్తికి సంబంధించిన వారై ఉండవచ్చు. ఐతే ఈ జనుల గుంపుకు తమవి అని చెప్పుకోగలిగిన సంప్రదాయాలుండాలి.

అలన్ డండన్ లాంటి విద్వాంసులు నిర్దేశించిన జానపద విజ్ఞాన సూత్రాల ప్రకారం సమాన సంప్రదాయాలు కలిగిన ఆటవికులైనా, గిరిజనులైనా, గ్రామీణులైనా, నగరవాసులైనా 'ఫోక్' అనే పదానికి అర్థాలుగా ఉంటారని చెప్పవచ్చు. కాని వీరందరికి సంబంధించే ఆలోచనా విధానంలో తరతరాల సంప్రదాయాల సమాహారం కొంచెమైనా కనిపించాలి.

శ్రమను మరిచిపోవడానికి అల్లుకున్న పదం, పాట, కథ మొదలగు జానపద సాహిత్యంగా పరిగణిస్తున్నాం. జానపద సాహిత్యం మౌఖికంగా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి, ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తూ వచ్చిన వారసత్వ సంపదని మౌఖికేతరమైన ప్రసారం కూడా ఉందని విద్వాంసులు చెప్పారు. మొత్తం మీద సమాజంలోని ఆచార వ్యవహారాలను, ఆహార వివరాలను వివిధ వర్గాల మనస్తత్వాలను, సామాజిక పరమైన ఆలోచనలను, భావాలను, విలువలను జానపద సాహిత్యం ప్రతిబింబిస్తుంది.

ఒక సమాజంలో నివసిస్తున్న ప్రజల జీవన సరళిని జీవిత దృక్పథాన్ని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక భావజాలాన్ని జానపద సాహిత్యంలో గమనించవచ్చు. ఇలాంటి అంశాలను ప్రతి ఫలింపచేస్తూ ప్రజల జీవనంలో భాగమై పుట్టుకొచ్చినవి సామెతలు. సామెతలను సందర్భాన్ని బట్టి ప్రయోగించినప్పుడు ప్రజల జీవితం, ఆ జీవితంలో అనుసరించే, కొనసాగించే అంశాలు ప్రతి

ఫలింపచేస్తాయి. ఈ పత్రంలో కేవలం సామెతలు, పొడుపు కథలు మాత్రమే పరిమితమై చర్చించదలిచాను. ఎందుకంటే సామెతల సంఖ్య కోకొల్లలు. సామెతలు సంస్కృతిలో భాగమే. సామెతలను ఆకారాదిగా కూర్చడం కూడా కనిపిస్తుంది. సామ్యత అనే మాట నుంచే సామెత వచ్చింది. సంస్కృతంలో దీనిని సూక్తి లేక సుభాషితం అని కూడా అంటారు.

సామెతలు వచనశాఖలో కథా రహితంగా చెప్ప బడ్డాయి. కథలేని వచన ప్రక్రియలుగా పొడుపులు, సామెతలు, నుడికారాలు చూడవచ్చు. పొడుపు కథకు జానపద విజ్ఞానంలో అలెగ్జాండర్ క్రాప్సె చివరి భాగంగా సూచించారు. పొడుపులను 'తట్లు' అని శాస్త్రాలని కూడా అంటారు. ఒక వ్యక్తి ఒక వస్తువును నేపథ్యంలో ఉంచి, దానితో పోల్చి చెప్పే పోలికల్ని ఆధారంగా, ఒక ఊటం కింపు తయారు చేస్తారు. ఆ పోలిక ఆధారంగానే ఎదుటి వ్యక్తి అసలు ఉద్దేశింపబడిన విషయాన్ని గ్రహించవలసి ఉంటుంది. ఈ పొడుపు కథను చూస్తే మనకర్థ మవుతుంది.

కిందొక పలక
పైనొక పలక

ఇది అంత్యప్రాసగా, అనుప్రాస లక్షణంగా చూడవచ్చు

పలకల మధ్య
మెలికల తాచు

గేయంలాగ పాడుకోడానికి వీలుంటుంది. దీనికి జవాబు పైపలక - పైదవడ, కింది పలక - కింది దవడ, మధ్యనున్న మెలికల తాచు నాలుక అని అర్థం. బుద్ధికి పదును పెట్టే ప్రక్రియగా, వేడుకగా సాగే వచన ప్రక్రియగా చూడవచ్చు.

మరొకటి

స్థంభాల మీద కుంభాలు
కాళ్ళు, చేతులు, పొట్ట, తలకాయ
కుంభాల మీద కురుగుతొట్టి
వెంట్రుకలు, పేను ఇవన్నీ
కురుగు తొట్టి మీద గుండు

ఈ పొడుపు కథలో దాగి ఉన్నాయి.

గుండుమీద గరకపోసలు
గరక పోసల మీద గాడిద బొర్లుతుంది

సామెతలు - పోలికలన్నీ ఆధారంగా చేసికొని ఏర్పడే విశిష్ట వచనాలు సామెతలు. ప్రతి సామెతలో రెండు భాగాలు చూడొచ్చు. ఒకటి సామెతను విని, దాని వాక్య అర్థాన్ని బట్టి మనం గమనించే విషయం. వాక్యార్థం మనకు బోధించే పరోక్షార్థం. అది సూటిగా మన ఎదుట నిలబడదు. పోలికను మనం అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే మనకు అంతరార్థం అవగతమవుతుంది. వాడే మనిషి స్థాయిని బట్టి ఒకే సామెత రూపాంతరాన్ని కూడా చూడవచ్చు.

మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె
ఉట్టి కెగర లేనమ్మ ఆకాశానికెగురుతుందట
కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తడట

మూడు సామెతల అర్థం ఒకటే అందిస్తుంది. పేద రికానికి సాధ్యం కాని కోరికలు కోరుకున్నప్పుడు ఈ సామెతలు వాడుతారు. సామెతల్లో ఉపయోగించిన భాషను బట్టి అవి పుట్టిన ప్రాంతాన్ని కూడా గుర్తు పట్టడానికి వీలుంటుంది. పలు కోణాల్లో సామెతల్ని అధ్యయనం చేయగలిగితే ఎన్నో విషయాలు అవగతమవు తాయి.

"గొడ్డొచ్చిన వేళ బిడ్డొచ్చిన వేళ" అన్న మాట అంతటా ప్రచారంలో ఉంది. భర్త ఆర్థిక స్థితి దిగజారడానికి తాను కారకురాలు కాకపోయినా పురుషుడు స్త్రీని నిందించే క్రమంలో వాడతారు. స్త్రీల పాటలలో సామెతలు, పొడుపు కథలు అలవోకగా వచ్చి చేరతాయి. స్త్రీ పరంగా పొడుపు కథలను పరిశీలించినప్పుడు స్త్రీల మనోభావాలు స్త్రీ పురుష సంబంధాలు వ్యక్తమయ్యే విధానాన్ని గమనించవచ్చు. స్వేచ్ఛా ప్రవృత్తికి సంబంధించిన పొడుపు కథల లాంటి

పాటలు పాడుకోడానికి జానపద స్త్రీలు ఉత్సాహాన్ని కనబరుస్తారు.

ఒంగాల కట్టివేసి ఒగాల విడిచి పెట్టి
ఒగాల నందుకోని ఉరుకలేదా ? వదినె ఉరుక లేదా?
ఎవ్వాల కట్టివేసి ఎవ్వాల విడిచిపెట్టి
ఎవ్వాల నందుకోని ఉరికినాను వదినె ఉరికినాను
అవ్వూనూ కట్టివేసి లేగాను విడిచిపెట్టి
పాల సరువందుకోని ఉరుక లేదా వదినె ఉరుక లేదా?

ఈ పాడుపు కథలో అంక్షాతిక్రమణం కనిపించినా విడుపులో మళ్ళీ స్త్రీలకు సమాజంలో ఉండే నీతికి సంబంధించిన నియమ పాలనే కనిపిస్తుంది.

ఒక భాషలో అందచందాలన్నింటిది ఒక యెత్తు, కేవలం సామెతలది ఒక ఎత్తు. సామెతలు అన్ని భాష లందు ఉంటాయి. జీవితమే కవిత్వంగా అంగీకరిస్తే సామెతలు లేదా లోకోక్తులు జీవితానుభవాల సూత్ర ప్రాయమైన నగ్న స్వరూపాలుగా భావించవచ్చును. సంఘజీవి అయిన మానవుడు ఎడతెగని ఈ అనంత యాత్రలో తనకు గల అనుభవ సర్వస్వాన్ని, సము పార్జించిన విజ్ఞానాన్ని, పొందిన కష్టసుఖాలను, లోకపు రీతిని చిన్న మాటలలో కుదించి మరల సంఘానికే విడిచి పెట్టటం, అనుభూతి ఎవరికి కలిగిన ఆ సామెతలు ఆ నోటనే వచ్చి ఒకరి నుండి మరొకరికి సంక్రమించి చలా మణి అవుతాయి. చెట్టు మొదలా ? విత్తు మొదలా అనుకున్నట్టు లోకోక్తుల గురించి కూడా చాలా మంది పండితులు చర్చించారు. కొందరభిప్రాయం కవిత్వం ఆరంభదశ లోకోక్తి స్వరూపం. మరికొందరభిప్రాయం కవితా కళకు పతాకస్థాయి సామెత. ఎవరభిప్రాయం ఎట్లున్నా ఆకారంలో స్వల్పమైన పరమాణువలె సామెత కున్న శక్తి మాత్రం అనంతం.

"అల్పాక్షరములు అనల్పార్థ రచన కల్పించుటే కవి వివేకం" అన్న పాల్కురికి మాటలు సామెతలకు అన్వ యించుకోవచ్చును. సామెతలు కొన్ని సూటి మాటలుగా ఉండును. మరికొన్ని ధ్వనిపూరితంగా, అలంకారపరంగా ఉండును.

సామెతలు వడిసెల గుండ్లలాగ రివ్వుమని వచ్చి హృదయానికి సూటిగా తాకును. సామెతలలో సునిశిత మైన హాస్యముంటుంది. ఈ సామెతలు స్త్రీలకు తెల్సి నంతగా పురుషులకు తెలియదని చెప్పవచ్చు. ఎందుకంటే నిత్యజీవితంలో స్త్రీల సంభాషణలో మనం ఈ సామెతలు అధికంగా వింటాము. మా అమ్మ కందాల అనసూయ నోటి నుండి సామెతలు చాలా అలవోకగా జాలు వారేవి. ఇప్పుడాదృష్టం లేకుండా పోయింది. అమ్మ భౌతికంగా లేకపోయినా ఆమె వాడిన సామెతలు ఇప్పటికీ చెవుల్లో మారుమ్రోగుతాయి.

శిష్టకవులు కూడా ప్రజాజీవితం, లోక అనుభవం కలిగినవారే కాబట్టి జాతీయకవులు సామెతలు అధికంగానే వాడారు. తిక్కన, సూరన, వేమన, కదిరీపతి వంటి కవుల రచనలలో సామెతలు అధికంగానే ఉపయోగించారు. జానపద గేయాలలో సామెతలు అధికంగానే ఉంటాయి. (వాటిని ఇక్కడ ప్రస్తావించలేను వేరే వ్యాసం రాస్తున్నాను) కీ॥శే॥ చిలుకూరి నారాయణరావు గారు సుమారు లక్ష సామెతలు సేకరించారని వాటిని గ్రంథ రూపంలో వేయలేకపోయారని తెలుగు జానపద గేయసాహిత్యము పుస్తకంలో ప్రస్తావించారు.

'బాలచంద్రుడు కథ', 'కాటమరాజు కథ', 'దేశింగు రాజు కథ', 'బొబ్బిలి పదము', 'కుశలాయకము', 'రామ కథా సుధార్ణము', 'శతకంఠ రామాయణము', 'నలచరిత్ర పదము', 'శశిరేఖా పరిణయము, గయోపాఖ్యానము జంగం కథ, వీర రాజమ్మ కథ ఇలా చాలా జానపద గేయాల్లో సామెతలు వాడారు. వీటన్నింటిని సేకరిస్తే రాశిపోయవచ్చు.

కొన్నింటిని మచ్చుకుదహరిస్తాను. పేదవాని కోపము పెదవికి చేటు, చల్లకోసము వచ్చి ముంత దాచినట్లు, ఉసురు వున్న ఉప్పమ్మవచ్చు ఊరికి పోవన్నా, ఉన్న ఊరును కన్నతల్లిని వదిలుండరాదు, రాజుల

హృదయము రాయితో సమమండ్రు, అడజన్మకన్న అడవిలో మ్రానై పుట్టుట మేలు, పండిన చేను పనులు మేసితే - కొపులు గట్లు మేసున, (ఆవు చేసు మేస్తే - గూడ గట్టు మేస్తదా) వీటినంటినీ విశ్లేషిస్తే ఎన్నో వ్యాసాలు రూపొందించబడతాయి. కేవలం ముద్రిత సాహిత్యం నుండి మచ్చుకు కొన్ని సామెతలను మాత్రమే ఉదహరించాను. కొందరు సామెతలను సేకరించి పుస్తకంగా ముద్రించిన వారున్నారు. జానపదుల విజ్ఞాన ఖండాగారంలో సామెతలు లోకోక్తులు ఇంకా అనేకంగా ఉన్నాయి.

"తెలుగు సామెతలు - జనజీవనం" ఈ గ్రంథం డా॥. పాపిరెడ్డి నరసింహా రెడ్డి గారిది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన గ్రంథం (1979-80) తెలుగు అకాడమి హైదరాబాదు వారు 2009లో ముద్రించారు. ఈ గ్రంథంలో జనజీవనంలో సామెతలను విశ్లేషణాత్మకంగా వివరించారు. రచయిత తెలుగు సామెతలకు సంబంధించి జరిగిన కృషిలో విషయ సేకరణలో భాగంగా సామెతలను ఒక చోట చేర్చిన వాళ్ళు, వ్యాసాలు రాసినవాళ్ళ గురించి, తనకు అందించిన వాళ్ళ గురించి, సామెతలకు సంబంధించిన పుస్తకాల గురించి చాలా విపులంగా చెప్పారు. తెలుగు సామెతల్ని ప్రచురించిన పత్రికలు, బులెటన్‌లు కూడా ప్రస్తావించారు. మొత్తం మీద సామెతల మీద కృషి బాగానే జరిగిందని నాకర్థమయింది. వినోదిని, గృహలక్ష్మి, గోభూమి, భారతి పత్రికల కృషి కూడా కనిపిస్తుంది. సి.పి. బ్రౌన్ కృషి ప్రత్యేకమైనది వారు రాసుకున్న నోట్స్ "కార్" ఆంధ్రలోకోక్తి చంద్రిక ప్రతిలోనివి అని కూడా ప్రస్తావించారు. సామెతల సంకలన గ్రంథాల ప్రస్తావన, సామెతల ప్రయోగమే దృష్టిగా పుట్టిన రచనలు, తెలుగు సామెతలు ఏకదేశంగా ఉన్న గ్రంథాలు, పీఠికలు, వ్యాసాలు, వ్యక్తుల సేకరణ, తెలుగు సామెతలు- జనజీవనం పుస్తక రచయిత సేకరణ, ఈ విధంగా చాలమంది సామెతల మీద కృషి కనిపిస్తుంది.

ఒక సంఘానికి మరొక సంఘానికి విభిన్నంగా ఉండే సంస్కృతి వ్యక్తి జీవితంలో ఎలా ప్రతిబింబిస్తుందో వివిధ ఉపప్రకరణాలు తెలుపుతాయి. అవి మతం, విద్య, వైద్యం, కళలు, వినోద విలాసాలు, ఆటలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, వస్త్రాలు, ఆభరణాలు, అలంకరణలు, కులాలు, కుల వృత్తులు ఇలా అనేక అంశాలను తడిమే సామెతలు కనిపిస్తాయి.

"ఎంత పొద్దుండగా లేచినా తుమ్మ గంట వద్దనే తెల్లారుతుంది", "ఎంత పెంద్రాలే లేచినా తుమ్మల గంట వద్దనే తెల్లవారుతుంది", "ఏ యాళకాడలేసినా చింత మాకులోల్ల ఊరుకాడ తెల్లారెనంట" అనేవి ఒకే సామెతకు మాండలిక భేదాలు.

పదాన్ని అర్థం చేసుకోలేక కొన్ని చోట్ల మార్పులు చేశారు. "పంజెకేలరా పత్తిధర" అనే దాన్ని పంచే కెలరా పత్తి ధర 'అరసున్ని నమ్ముకొని పురుషున్ని పోగొట్టుకొన్నట్లు' అనేది హర్షుని నమ్ముకొని పురుషుని పోగొట్టుకున్నట్లు అని మార్చిన సామెతలు చూడొచ్చు.

"ఇందు గలడందులేడని సందేహము వలదు చక్రి' అని భాగవతంలో చెప్పినట్లు, సామెతలు సర్వవ్యాపకాలు. లిపి వున్నా లేక పోయినా నాగరికతతో సంబంధం లేకుండా ప్రతి జాతికి సామెతలు సహజ అలంకారాలు. జానపదుల్లోనే సామెతలు ఎక్కువగా పుట్టి, వ్యాప్తిలో ఉంటాయని చెప్పవచ్చు.

ప్రస్తుతం కరోనా వైరస్ ప్రభావం జనజీవనం మీద ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందో ఆ నేపధ్యంలో కూడా సామెతలు ముందుకొచ్చాయి. వాటిని కొన్ని మచ్చుకు ప్రస్తావిస్తాను.

"విడాకుల కోసం వెలుతున్న దంపతులు లాక్‌డౌన్‌లో చిక్కుకున్నట్లు", "అయ్యిందయ్యా పెళ్ళి అయ్యాడయ్యా బండీ", "ఢిల్లీ వాడొచ్చి గల్లీ వాడ్ని చెడగొట్టినట్టు", "విసా స్టాంపింగుకి పోతే క్యారంటీన్ స్టాంపు వేసినట్లు" ఇలా కూడా వాట్సప్ గ్రూప్‌లో వచ్చాయి. ఫార్వర్డ్ చేసినవి. పేరు

తెల్సుకునే ప్రయత్నం చేశాను తెలియలేదు. మొత్తం మీద సామెతలు, పొడుపు కథలు మనిషి జీవితం నుండి పుట్టుకొచ్చి అదే మనుషుల మీద ప్రయోగించబడ్తాయి. సామెతలు జీవన సారమయితే, పొడుపు కథలు మెదడుకు మేత వంటివి.

ఒక రకంగా కథలూ, గాథలు కన్నా సామెతలు జనంలో అధిక ప్రచారంలో ఉండే మాధ్యమాలుగా చెప్పవచ్చు. మౌఖికంగా ఇవి వ్యాప్తి చెందుతాయి. ప్రతిమాటలో అప్రయత్నంగా దొర్లుతుంటాయి. ప్రకృతిలోని మనుషుల, జంతువుల స్వరూప స్వభావాల్ని నూత్రప్రాయంగా వివరించే వాహికలుగా కనిపిస్తాయి. ప్రజల్లో ఇవి అనుభవ జ్ఞానాన్ని కలిగిస్తాయి.

పొడుపు కథలు కూడా ప్రత్యేకమైన వాహికలే. మిగతా వాటికన్నా ఇందులో వైవిధ్యం కనిపించదు. వచన రూపంలో, కథారూపంలో, చిత్ర గణిత రూపాల్లో ఉంటాయి. ప్రయోజనాత్మక దృష్టి ఇందులో ప్రధానం. వ్యక్తి సమూహం, చిన్నా - పెద్దా, ఆడ - మగ అనే విచక్షణ లేకుండా అన్ని సమాజాలూ, అందరూ వీటిని వేయ గలుగుతారు. బుద్ధి వికాసానికి అనువైన మాధ్యమంగా చెప్పుకోవచ్చు.

ఒక దేశంలో వాడుకలో ఉన్న సామెతలు ఆ దేశం విశ్వాసాలను, జీవన విధానాన్ని, ఔన్నత్యాన్ని తెలుపు తాయి. ఏ వ్యక్తి అయినా సామెతలను అనుసరించి తన జీవితాన్ని సక్రమం చేసుకోగలిగితే సుఖాంతంగా బతుక వచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యము, బి. రామరాజు-1958 (జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్-1990)
2. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం హైదరాబాద్-2000.
3. జానపద విజ్ఞాన వ్యాస మంజరి నవంబర్-2008 ఆచార్య పి. జ్యోతి.
4. తెలుగు సామెతలు - జనజీవనం, తెలుగు అకాడమీ హైదరాబాద్-2009

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తిరుమల తిరుపతి గ్రామదేవతలు

– డా॥. కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

భారతదేశంలోని ప్రతి ప్రాంతంలోను ఆయా మతాలకు సంబంధించిన దేవతలు వెలసియున్నారు. ముఖ్యంగా శైవ, వైష్ణవ మతాల్లోని దేవతలతోపాటు జానపదులు గ్రామదేవతలను ఆరాధిస్తున్నారు. కలియుగ వైకుంఠమైన తిరుపతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి తోపాటు అనాదిగా గ్రామదేవతలు కూడా వెలసియున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆరాధిస్తున్నారు. అయితే స్థానికులు, శ్రీ వేంకటేశ్వర స్వామితోపాటు ఇక్కడ వెలసిన గ్రామదేవతలను ఆరాధిస్తున్నారు. ఇలా శిష్టదేవతారాధన, గ్రామదేవతారాధన పద్ధతులు చోటుచేసుకొని రెండు విభిన్న సంస్కృతుల వేదికగా తిరుపతి ప్రసిద్ధికెక్కింది. అయితే తిరుపతి వేంకటేశ్వర స్వామి చరిత్రను ఎందరోకవులు, రచయితలు అక్షరబద్ధం చేసి గ్రంథాలు రచించారు. కానీ తిరుమల తిరుపతిలోని గ్రామదేవతల చరిత్రలు జానపదుల నోళ్ళలో నానుతూ ఉన్నా ఇంతవరకూ ఎవ్వరూ గ్రంథస్థం చెయ్యలేదు. అయితే ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు పేటశ్రీనివాసులురెడ్డి తిరుమల తిరుపతి గ్రామదేవతలకు సంబంధించి "తిరుమల తిరుపతి గ్రామదేవతలు" అనే గ్రంథాన్ని రాసి జానపద సాహిత్యంలో తిరుమల తిరుపతి గ్రామదేవతలకు ప్రాచుర్యాన్ని కల్పించాడు.

మనం ముఖ్యంగా తిరుమల తిరుపతి గ్రామదేవతలను తిరుమల గ్రామదేవతలు, తిరుపతి గ్రామదేవతలు అని రెండు భాగాలుగా విభజించి ఆయా విభాగాల కింద చేర్చిన, ఆయా గ్రామదేవతల గురించి చర్చించుకుందాం. ముందుగా శ్రీ వేంకటేశ్వరస్వామి, అక్కగార్లు, పాచికాల్వగంగమ్మ, హెచ్.టి.గంగమ్మ, బాట గంగమ్మ, గిరిజనకాలనీ గంగమ్మ, బాలగంగమ్మ మొదలగు తిరుమలగ్రామదేవతలను తరువాత తాళ్ళపాక గంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, వేపాలమ్మ, అంకాలమ్మ, నేరేళ్ళమ్మ, మాతమ్మ, కరకమాని గంగమ్మ, దొనకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, పేరెంటాలమ్మ, కాళెమ్మ, అలమేలు మంగమ్మ మొదలగు తిరుపతి గ్రామదేవతలను గురించి విపులంగా తెలుసుకుందాం.

తిరుమలలో శిష్టదేవతారాధన కంటే ముందు జానపద దేవతారాధన ప్రబలంగా ఉందని "VISHNUISM AND SIVAISM : A COMPARISION" (LONDON) School of Oriental and African Studies (1970) అనే గ్రంథంలో GONDA.J అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. శ్రీవేంకటేశ్వరుడు జానపదదైవంగా మొదట పూజింపబడినా తరువాత గ్రామదేవతగా, శక్తిస్వరూపిణిగా రూపుదిద్దుకొని ఎన్నో పరిణామాలు పొంది శ్రీ వేంకటేశ్వర స్వామిగా పూజలందుకొంటున్నాడు. శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రతి గురువారం కుంభం పోయడం, ఆలయ ప్రాకారాలపైన నలువైపులా సింహపు బొమ్మల్ని ప్రతిష్ఠించి ఉండడం వల్ల శ్రీ వేంకటేశ్వరస్వామిని శక్తిదేవతగా భావించాలి. ఈ జానపద శక్తి దేవతను శైవులు శివుడిగా పూజించారు. రాజాదరణ పొందిన వైఖానస వైష్ణవులు తిరుమల దైవాన్ని విష్ణుస్వరూపుడైన శ్రీవేంకటేశ్వర స్వామిగా మార్చి ఆరాధిస్తున్నారు.

తిరుమలకొండల ప్రస్తావన క్రీస్తుపూర్వం నుండి సాహిత్యంలో ఉన్నా అక్కడున్న దైవాన్ని శ్రీవేంకటేశ్వరుడిగా ఎక్కడా పేర్కొనలేదు. జానపదులు వేంకటేశ్వరుని 'మయాన్' అనే జానపదదేవుడిగా ఆరాధించేవారు. 'మయాన్' అంటే నల్లని దేవుడు. హిందూమతం ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించాక

నాటి రాజులు అవకాశాన్ని బట్టి మయాన్‌ను, శిష్టదేవతగా మార్చారు. కొంతమంది శ్రీకృష్ణుడని మరికొందరు శివుడని భావించారు. తిరుమలకొండలు ద్రావిడభాషలో వేంగడం అనేపేరుతో పిలువబడేవి. క్రీ.పూ.2వ శతాబ్దానికి చెందిన తమిళభాషా లక్షణగ్రంథం 'తొలికాప్పియమ్' లోను, సంగమ సాహిత్యంలోను వేంకటాచల ప్రస్తావన ఉంది. కాని అక్కడ వెలసిన దేవునిపేరు చెప్పలేదు. తిరుమలపైన వెలసిన స్వామిని శివుడని, కుమారస్వామి అని, విష్ణువని ప్రబంధాలలో కవులు వర్ణించారు.

అలాగే స్త్రీ దేవతల విషయానికొస్తే తిరుమల మొదటి ఘాటురోడ్డులో మోకాళ్ళ పర్వతానికి ముందువైపు, అవ్వా చారికోన దగ్గర స్త్రీదేవతలైన అక్కగార్లగుడి ఉంది. ఘాటు రోడ్డు పక్కన కొండను ఆనుకొని ఈగుడి ఉండడం వల్ల అలిపిరి నడక మార్గంలో వచ్చే భక్తులు కూడా అక్కగార్లను దర్శిస్తూ ఉంటారు. అక్కగార్లు ఏడుమంది దేవతలు. వీళ్ళు అక్కా చెల్లెళ్లు. అక్కగార్లను గ్రామదేవతల్లాగే ఆరాధిస్తారు. అయితే అక్కగార్లకు జాతరలు, బలులు ఉండవు. అలాగే అక్కగార్ల తరువాత తిరుమలలో పాచికాల్వ గంగమ్మ, హెచ్.టి. కాలనీ గంగమ్మ, బాటగంగమ్మ, గిరిజనకాలనీ గంగమ్మ, బాలగంగమ్మలు కూడా వెలసి ఉన్నారు.

ముందుగా పాచికాల్వ గంగమ్మను గురించి తెలుసు కుందాం. పాచికాల్వ గంగమ్మ తిరుమల ఊరివెలుపల గోగర్భం సమీపంలో పాచికాల్వ ఒడ్డున వెలసింది కాబట్టి ఈ గంగమ్మను పాచికాల్వ గంగమ్మ అనే పేరుతో పిలుస్తున్నారు. ఈ గంగమ్మకు ప్రతి సంవత్సరం కార్తీకమాసం చివరివారంలో జాతర నిర్వహిస్తారు. ఈ గంగమ్మ మొదట శ్రీవారి ఆలయానికి ఉత్తరాన శ్రీ వేంకటేశ్వర స్కూల్‌కు ఎదురుగా ఉండే మంటపంలో ఉండేది. జాతర సమయంలో జంతుబలులను చూసిన తిరుమల తిరుపతి పాలకులైన మహంతులు తిరుమల ఊరిపెద్దలతో చర్చించి పాచికాలువ ఒడ్డున గంగమ్మను ఏర్పాటు చేసుకొని అక్కడే జాతర నిర్వహించుకోమనడంతో అప్పటి నుండి పాచికాలువ ఒడ్డున గంగమ్మను ప్రతిష్ఠించి, అక్కడే జాతరలు నిర్వహిస్తున్నారు.

అలాగే తిరుమలలో శ్రీవారి దేవాలయానికి ఎదురుగా తూర్పు దిశలో హెచ్.టి.కాలనీలో ఉన్న గంగమ్మ రాజరాజేశ్వరిగా రూపాంతరం చెంది "శ్రీదేవి పరమేశ్వరి" అనే పేరుతో పూజలు అందుకొంటోంది. అయినా ఈ గంగమ్మకు ప్రతి సంవత్సరం మే నెలలో జాతర నిర్వహిస్తారు. ఈ గంగమ్మ శిష్టదేవతగా పూజలందుకొంటూ జానపదదేవతగా జాతర జరిపించుకోవడం విశేషం.

అలాగే తిరుమలకు ఉత్తరం వైపు పాపనాశనానికి నడచివెళ్ళే బాట ప్రారంభంలో బాట గంగమ్మ గుడి ఉంది. బాటగంగమ్మకు మే లేదా జూన్ నెలలో జాతర జరుపుతారు. ఈ గంగమ్మ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధీనంలో ఉంది. అలాగే గిరిజనకాలనీ గంగమ్మ. ఈ గంగమ్మ తిరుమల శ్రీవారి ఆలయానికి ఈశాన్య దిశలో పాపవినాశనం టోల్‌గేట్ సమీపాన ఉన్న గిరిజనకాలనీలో వెలసింది. ఈ గంగమ్మకు యానాదులు ప్రతి సంవత్సరం జాతర నిర్వహిస్తారు. యానాదులు కులాచారాల ప్రకారం 'యానాది మేళం (డోలు + తప్పెట్లు)తో పూజిస్తూ బలులిస్తారు. అంతేకాక తిరుమలలో వెలసిన మరో గంగమ్మ బాలగంగమ్మ. ఈ గంగమ్మ గుడి తిరుమల నుండి తిరుపతికి నడచి వచ్చే కాలిబాట ప్రారంభంలో ఉంది. ఒకప్పుడు ఈ గంగమ్మ ప్రస్తుతమున్న లేపాక్షి ఎంపోరియమ్ వైపు 'ముళ్ళగుంత'లో గంగమ్మ పేరుతో పూజలందుకునేది. అప్పుడు ఆ ప్రదేశమంతా తిరుమల స్థానికుల ఇళ్ళతో కిక్కిరిసి ఉండేది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు అక్కడ ఉండే ఇళ్ళను తొలగించి ప్రస్తుతం బాలగంగమ్మ ఉన్నచోటుకు స్థానికులకు తరలించారు. దాంతో స్థానికులు తమతోపాటే గంగమ్మను తీసుకొని యాత్రికుల నడకదారి పక్కనే మళ్ళీ గంగమ్మను ప్రతిష్ఠించుకున్నారు. ఈ గంగమ్మ ప్రతిష్ఠరోజున ఒక పసిపాపకు పూనకం వచ్చి అక్కడ ప్రతిష్ఠించే గంగమ్మకు 'బాలగంగమ్మ' అని పేరు పెట్టమని కోరిందట. అప్పటి

నుండి ఆ గంగమ్మను బాలగంగమ్మగా పిలుస్తున్నారు. తర్వాత కొన్నేళ్ళకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు బస్సుగ్యారేజ్, ధర్మశాలను కట్టడానికి బాలగంగమ్మ గుడిని తొలగించాలనుకొన్నారు. అయితే ఆమె విగ్రహాన్ని చూసి భయపడి వెనుదిరిగిపోయారు. ఈ మహిమాన్విత గంగమ్మ కాలినడక భక్తులు, స్థానికుల చేత పూజలందు కుంటూ ఉంది.

తిరుమలలో వలే తిరుపతిలో కూడా గ్రామదేవతలు పూజలందుకుంటున్నారు. ముఖ్యంగా తాళ్ళపాక గంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, వేషాలమ్మ, అంకాలమ్మ, నేరేళ్ళమ్మ, మాతమ్మ, కరకమాని గంగమ్మ, దొనకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, పేరంటాలమ్మ, కాళెమ్మ, అలమేలు మంగమ్మ మొదలగు దేవతలు వెలసి ఉన్నారు. తిరుపతిలో ప్రధానంగా పూజలందుకుంటున్నగంగమ్మ తాళ్ళపాక గంగమ్మ, తాతయ్యగుంటగంగమ్మ అనే రెండు పేర్లతో వ్యవహరింప బడుతూ ఉంది. తాళ్ళపాక గంగమ్మను పెదగంగమ్మ అని, తాతయ్యగుంట గంగమ్మను చినగంగమ్మ అని వ్యవహరిస్తారు. తాళ్ళపాక గంగమ్మగుడి తాళ్ళపాక చెరువుగట్టు మీద ఉంది. ప్రస్తుతం ఆర్.టి.సి. బస్టాండ్‌కు ముందున్న ప్రధాన కూడలిలో ఈ గంగమ్మ గుడి ఉంది. తాతయ్యగుంట గంగమ్మ గుడి, తుడాఆఫీసుకు ముందు వైపు ఉంది. అంటే మల్లయ్యగుంట కట్టకు, తాతయ్యగుంట కట్టకు మధ్యలో తాతయ్యగుంట గంగమ్మ గుడి వుంది. ప్రజలు తాతయ్యగుంట గంగమ్మకే అధిక ప్రాధాన్యతనిస్తారు. తిరుపతి గంగమ్మను శ్రీవేంక టేశ్వర స్వామికి చెల్లెలుగా భావిస్తారు. అందువల్ల ప్రతి సంవత్సరం జాతర సమయంలో తిరుమల నుండి గంగమ్మ గుడికి గంప,చేట, పట్టుశేషవస్త్రం, పసుపు కుంకుమలు వస్తున్నాయి.

ఇక తిరుపతి గ్రామదేవతల్లో పూజలందుకుంటున్న మరో గ్రామదేవత వేషాలమ్మ. వేషాలమ్మను గంగమ్మకు తోబుట్టువు అంటారు. వేషాలమ్మగుడి పల్లివీధిలో కోర్టుకు ఎదురుగా ఉన్న ఆవరణలో ఉంది. గంగజాతరలో ప్రతివేషము ఈమె వద్దకు రావడంవలన ఈమెను వేషాలమ్మ అని పిలుస్తారు. గంగజాతరలో వేషాలమ్మ గుడి ముందు కోళ్ళను, మేకపోతులను, పొట్టేళ్ళను బలి ఇస్తారు. అలాగే తిరుపతిలో వెలసిన మరో గ్రామదేవత అంకాలమ్మ. అంకాలమ్మగుడి తిరుపతి - తిరుచానూరు రోడ్డులో శ్రీ వేంకటేశ్వరా టాకీసుకు ఎదురుగా ఉంది. అంకాలమ్మ ఆలయం శిల్పశోభితమై రాతి స్తంభాలతో నిర్మితమై ఉంది. అంకాలమ్మకు పూర్వం ఇదే గుడిలో తిరుపతమ్మ అనే గ్రామదేవత ఉండేది. తిరుపతమ్మ విగ్రహం తిరుచానూరు చేరి పద్మావతిగా అమ్మవారి మారింది. తరువాత ఆమెస్థానంలో అంకాళమ్మ విగ్రహం వచ్చి చేరింది.

అలాగే తిరుపతి ప్రజలతో పూజలందుకుంటున్న మరొక గ్రామదేవత నేరేళ్ళమ్మ. నేరెళ్ళమ్మ గుడి తాతయ్యగుంట గంగమ్మ గుడికి దక్షిణంవైపుగల రాతి మంటపంలో ఉంది. పూర్వం గంగమ్మ గుడికి వెళ్ళే మార్గంలో హెడ్‌పోస్టాఫీసు, టెలిగ్రాం ఆఫీసుస్థలం ముందు వైపు సూరావారి తోటలో నేరేడుచెట్టు కింద నేరేళ్ళమ్మ విగ్రహం ఉండేది. ప్రస్తుతం నేరేళ్ళమ్మ అనే పేరుకు ప్రాధాన్యత తగ్గి రాజరాజేశ్వరిగా పిలువబడుతుంది. అలాగే తిరుపతిలో మాదిగకులస్థులచేత పూజలందు కుంటున్న మరో గ్రామ దేవత మాతమ్మ. మాతమ్మ గుడి తిరుపతికి దక్షిణం వైపునగల టి.టి.డి. రెండవ సత్రం వెనుక మాదిగవాడలో ఉంది. తిరుపతిలో సంవత్స రానికొకసారి 'మాతమ్మ కొలుపులు' తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు.

అలాగే తిరుపతి చింతకాయల వీధిలోని ప్రజలతో పూజింపబడే గ్రామదేవత కరకమాని గంగమ్మ. ఈ గంగమ్మ గుడిని యాదవులే నిర్వహిస్తున్నారు. అందువల్ల ఈ గుడిలో పూజాకార్యక్రమాలను కూడా యాదవులే నిర్వహిస్తారు. అలాగే తిరుపతికి వాయువ్యదిశలో మంచాల వీధిలో వెలసిన మరొక దేవత దొనకొండ గంగమ్మ.

దొనకొండ కాటమరాజు చరిత్రకు సంబంధించిన ప్రాంతం. ఈ ప్రాంతంలోని గంగమ్మ కాటమరాజు మొదలగు యాదవులచే పూజింపబడి దొనకొండ గంగమ్మగా ఖ్యాతిగాంచింది. తిరుపతిలోని మంచాలవీధిలో యాదవులు అధికంగా ఉండడం వల్ల వీళ్ళు తమ ఆరాధ్య దైవమైన దొనకొండ గంగమ్మను మంచాలవీధిలో ప్రతిష్ఠించుకుని పూజిస్తున్నారు.

అంతేకాక తిరుపతిలో ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో తిరుపతి పట్టణంలోని బజారువీధి, బండ్లవీధి, కాపువీధి, కర్నాలవీధి, ఆకుతోటవీధి, సున్నపు వీధుల్లో నడివీధి గంగమ్మను ప్రతిష్ఠించి పూజిస్తారు. ఇలా నడివీధి గంగమ్మ తిరుపతి పట్టణంలో ప్రతిసంవత్సరం అన్ని ప్రధాన వీధుల్లో పూజింపబడుతోంది. అలాగే తిరుపతిపట్టణ ప్రజలచే పూజింపబడుతున్న మరొక గ్రామదేవత ముత్యాలమ్మ. తిరుపతికి తూర్పుదిశలో ఆర్.టి.సి. బస్టాండ్‌కు కానింత దూరంలో ముత్యాలమ్మగుడి ఉంది. ఈ ముత్యాలమ్మ, గంగమ్మ సోదరీమణుల్లో ఒకరిగా భావిస్తారు. మరికొందరు సాక్షాత్తు గంగమ్మ అవతారంగా భావిస్తారు.

అలాగే తిరుపతి వేషాలమ్మగుడికి సమీపంలో బండ్ల మిట్టలో వెలసిన మరో గ్రామదేవత మారెమ్మ. మారెమ్మ, గంగమ్మ అక్కచెల్లెండ్లలో ఒకరని ప్రతీతి. ఒకప్పుడు మారెమ్మను ఎరుకుల వాండ్లు పూజించేవారు. ప్రస్తుతం మారెమ్మకు నవరాత్రి ఉత్సవాలు చేస్తున్నారు.

మారెమ్మ తరువాత పేర్కొనదగిన మరో గ్రామదేవత పేరంటాలమ్మ. తిరుపతికి తూర్పుదిశలో ఆర్.టి.సి. బస్టాండు ముందుండే రైల్వేగేటును ఆనుకొని పేరంటాలమ్మ గుడి ఉంది. పేరంటాలమ్మ గుళ్ళో ఒకరాతి ఫలకం మీద పేరంటాలుతో పాటు వీరుడిబొమ్మ కూడా చెక్కబడి ఉంది. అలాగే గాలివీధి మొదట్లో అన్నమాచార్య కళామందిరం సమీపంలో కాళెమ్మగుడి ఉంది. ఒకప్పుడు కాళెమ్మకుఉత్సవాలు జరిపిస్తూ పొంగళ్ళు పెట్టి, బలులు ఇచ్చేవారు. అయితే కాళెమ్మ శిష్టదేవత అయిన కాళికా పరమేశ్వరిగా రూపుదిద్దుకొని గ్రామదేవతారాధనకు దూరమైంది.

అలాగే తిరుచానూరులో ప్రస్తుతం అలమేలు మంగమ్మగా పూజలందుకుంటున్న విగ్రహం ఒకప్పటి తిరుపతి గ్రామదేవత అయిన తిరుపతమ్మదని ప్రముఖ చరిత్రకారుడు గోపీకృష్ణ పేర్కొన్నారు. తిరుపతిలో గ్రామదేవతగా బలులు, పొంగళ్ళు, జాతర్లతో అలరారిన తిరుపతమ్మ విగ్రహాన్ని రాత్రికి రాత్రే సబైయ్యర్లు తిరుచానూరులోని మ్యూజియానికి తరలించారు. తిరుపతి నుంచి తిరుపతమ్మను తొలగించినప్పుడు ప్రజలనుండి, ప్రభుత్వం నుండి తిరుచానూరు సబైయ్యర్లపై వ్యతిరేకత ఏర్పడింది. చంద్రగిరి నవాబు ఆదేశం మేరకు మ్యూజియాన్ని ఆలయంగా మార్చి ఆ ఆలయంలో తిరుపతమ్మ అనే గ్రామదేవతను అలమేలు మంగమ్మగా పూజిస్తున్నారు. కాబట్టి అలమేలుమంగమ్మ శిష్టదేవత అయినా అలమేలు మంగమ్మ విగ్రహం మాత్రం గ్రామదేవత అయిన తిరుపతమ్మదేనని స్పష్టంగా అర్థమవుతుంది. అంతేకాదు ఆనాడు శ్రీనివాసమంగాపురాన్ని అలమేలుమంగాపురం అని పిలిచేవారు. ఈ మంగాపురం హైదర్‌ఆలీ దండయాత్రలవల్లనో లేక కళ్యాణీనదికి వరదలు రావడం వల్లనో అక్కడి అలమేలుమంగమ్మ అదృశ్యమైంది. తరువాత తిరుచానూరు, అలమేలు మంగాపురంగా మారిపోయింది. ఇలా తిరుపతి తిరుమల గ్రామదేవతలు కొందరు కాలక్రమేణా శిష్టదేవతలు రూపాంతరం చెంది ఆరాధింపబడుతున్నారనేది చారిత్రక సత్యం.

ఆధార గ్రంథాలు :

1. తిరుమల తిరుపతి గ్రామదేవతలు - డా॥పేటశ్రీనివాసులురెడ్డి, రుషితేజ పబ్లికేషన్స్, 418, బండ్లవీధి, తిరుపతి - 517501 (2000)

2. తిరుపతి గంగజాతర - డా॥పేటశ్రీనివాసులురెడ్డి, రుషితేజ పబ్లికేషన్స్, 418, బండ్లవీధి, తిరుపతి - 517501 (1991)
3. శ్రీనివాస మంగాపురం మరియు మన ఆలయాలచరిత్ర - గోపీకృష్ణ, ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానములు - తిరుపతి (1980)
4. VISHNUISM AND SIVAISM - A COMPARISION (LONDON) -GONDA.J - School of Oriental and African Studies (1970).

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

దివిసీమ జానపద కళారూపాలు – విశ్లేషణ

-కైలాసపు బాంధవి, తెలుగు పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆంధ్రప్రదేశ్‌లో సీమ అనగా మనకు గుర్తుకు వచ్చేవి మూడు ప్రాంతాలు. అవి రాయలసీమ, కోనసీమ, దివిసీమ. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన ప్రాంతం కాబట్టి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలను రాయలసీమ అని పిలుస్తున్నాము. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని త్రిభుజాకార ప్రదేశం కోనసీమ. ఇది ప్రకృతి రమణీయతకు చాలా ప్రసిద్ధిచెందిన ప్రాంతం. అలాగే దివిసీమకు కూడా విశిష్ట స్థానంవుంది. ఇది కృష్ణా జిల్లాలో గల ఒక చిన్న సారవంతమైన ద్వీపం. దివిసీమ పులిగడ్డ (అవనిగడ్డ) వద్ద డెల్టా ప్రాంతంలో ఏర్పడింది. ఇక్కడ కృష్ణానది బంగాళాఖాతంలో కలిసే ముందు రెండు పాయలుగా చీలి ఒక పాయ కోడూరు మండలం హంసల దీవి వద్ద బంగాళాఖాతంలో కలువగా, మరొక పాయ నాగాయలంక మండలంలోని గుల్లలమోద సమీపంలో బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ దివిసీమలో కూచిపూడి, మొవ్వ, ఘంటసాల, శ్రీకాకుళం, చల్లపల్లి, పెదకళ్ళేపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, హంసలదీవి మొదలైన ప్రాంతాలు చెప్పుకోదగ్గవి.

దివిసీమ జానపద కళారూపాలు – విశ్లేషణ :

దివిసీమ ప్రాంతంలో అనేక గ్రామాలల్లో ఈ నాటికీ జానపద కళలు, జాతర్లు, ఉత్తవాలు, పండుగ సమయాలల్లో కనువిందు చేస్తుంటాయి. జానపద కళలు అయిన పగటివేషాలు, యక్షగానాలు, కోలాటం, భజనలు, డప్పునృత్యాలు మొదలైన కళలను దివిసీమలో కొన్ని గ్రామాలవారు తమ వృత్తిగా స్వీకరించి ఈ జానపద కళలను ప్రదర్శిస్తున్నారు.

పగటివేషాలు :

పట్టపగలు వేషాలు వేసుకుని హావభావాలు పలికిస్తూ రాగమేళ తాళాలతో పండిత పామరులను మెప్పించే కళలు ఈ పగటివేషాలు. అభినయంతో, వాక్చాతుర్యంతో అనుకరించడం ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఆయా పాత్రల్లో ఒదిగి ప్రదర్శిస్తుంటారు. సంఘంలో జరిగే మూఢాచారాల్ని, బలహీనతల్ని వ్యంగ్యంగా ఎత్తిచూపడం వీరి ప్రత్యేకత. ఈ పగటివేష కళాకారులకు దివిసీమలోని గడ్డిపాడు ప్రధానకేంద్రమైంది. ఈ పగటివేషాలలో నిత్య జీవితానికి సంబంధించినవి కొన్ని, హాస్యరసంతో కూడుకున్నవి మరికొన్ని, పౌరాణిక, కల్పనా సంబంధమైన అనేక రకాల పగటివేషాలను వీరు ప్రదర్శిస్తుంటారు. గడ్డిపాడు గ్రామంలో గడ్డిపాడు భాగవతులుగా ప్రసిద్ధిచెందిన వారిలో ప్రస్తుతం పల్లావరులవారు, శ్రీకారంవారు, చూచివారు, బాపట్లవారు, బెల్లంకొండవారు తమ వృత్తిగా ఈ పగటివేషాలను స్వీకరించి దాదాపు ముప్పైముడు రకాల చిత్ర విచిత్రవేషాలు అయిన అర్ధనారీశ్వరివేషం, ఎరుకలసాని, పిట్టలదొర, జంగందేవర, కాశీకావడి, భట్రాజుల, అత్తాకోడలు, దాదినమ్మ, గయ్యాలిపెళ్ళాం, దేవరపెట్టే మొదలైన వేషాలను వీరు ప్రదర్శిస్తున్నారు.

యక్షగానం :

యక్షగానం అతిప్రాచీనమైన కళారూపం. ఇది నృత్య, నాటక, సంగీత, వేష, భాష, అలంకారాల కలయిక. దివిసీమ ప్రాంతవాసులు అయిన కూచిపూడి భాగవతులు సంగీత సాహిత్యాలలోనూ, చిత్ర శిల్ప కళాభినయ నృత్యరీతుల్లో విశేషమైన సాహిత్యం గలవారు. ఈ యక్షగానాలను దక్షిణ భారతదేశమంతటా వ్యాపింపజేసింది కూచిపూడి భాగవతులే. యక్షగానాలలు భారత, భాగవత కథలు, శ్రీకృష్ణపారిజాతం, రుక్మిణీ కళ్యాణం,

కిరాతార్జునీయం, క్షీరసాగరమథనం, హరవిలాసం, భామాకలాపం మొదలైన వాటితోపాటు సంఘసంస్కరణాలు, సమకాలీన అంశాలు ఇతివృత్తాలుగా తీసుకుని యక్షగానాలను ప్రదర్శిస్తున్నారు. ఈ యక్షగానాలనే వీధిభాగవతాలు అని కూడా పిలుస్తారు. కూచిపూడి భాగవతులు ఈ యక్షగానాలను వీధులలో ప్రదర్శించటం చేత వీటికి ఆ పేరు వచ్చింది. దివిసీమలో యక్షగాన కళలకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టినవారు ఎందరో వున్నప్పటికీ ప్రస్తుతం ప్రదర్శిస్తున్నవారు చింతావారు, వేదాంతంవారు, పసుమర్తివారు, జ్యోస్యులవారు, ఏలేశ్వరపువారు, దర్భావారు, భాగవతుల రామయ్య, వేదాంతం పార్వతీశం, వేదాంతం రామలింగ శాస్త్రి మొదలైనవారు కాలానుగుణంగా కళా సృష్టి చేస్తూ ప్రదర్శనలిస్తున్నారు.

డప్పు నృత్యం :

జంతువుల తోలుతో తయారు చేసిన వాయిద్య పరికరమైన డప్పులను కొడుతుంటే వచ్చేశబ్దం ఆధారంగా నాట్యం చెయ్యడాన్ని డప్పునాట్యం లేదా డప్పునృత్యం అంటారు. ఈ డప్పునృత్యాలను మాదిగ కులస్తులు ఎక్కువగా ప్రదర్శిస్తారు. దివిసీమలోని కొన్ని గ్రామాల్లో నేటికీ ఏదైనా కార్యక్రమాన్నిగాని, విశేషాన్నిగాని ప్రజలకు తెలియజెప్పాలంటే ఈ డప్పు ద్వారా, దండోరావేస్తారు. వివాహాలకు, పూజలకు, అమ్మవారి జాతర్లలో ఈ డప్పు నృత్యాలను ప్రదర్శిస్తారు. వాయిద్యం చాలా ఉద్రేక పూరితంగా వుంటుంది. వేపచెక్కలతో చండ్రపుచెక్కలతో చట్రంగా తయారుచేస్తారు. లేగదూడ చర్మాన్ని ఒక పక్క మూసి నిప్పు సెగ మీద చూపి వాయిస్తే కణకణమని శబ్ధం వస్తుంది. ఈ డప్పులతో రంగురంగుల దుస్తులు ధరించి గుండ్రంగా నిలబడి లయబద్ధంగా డప్పులు వాయిస్తూ జానపద గీతాలతో, నృత్యాలతో ఈ కళాకారులు మన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిభింబించేలా ప్రదర్శనలిస్తున్నారు. అయితే వీరు ఎక్కువగా దివిసీమ తాలూకా చిట్టూర్పు, మొవ్వ గ్రామాలల్లో ఉన్నారు. కె.ఏడుకొండలు బృందం, వెంకటేశ్వరరావు బృందం, నాగరాజు బృందం, ప్రకాష్ బృందం, కేశవరావు మొదలైన బృందాలు నేటికీ ప్రదర్శిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోనే గొప్ప కళాకారులగా పేరు పొందారు.

చెక్కభజన :

చెక్కభజనలను లయబద్ధంగా పాటలు పాడుతూ వృత్తాకారంతో తిరిగుతూ భజనచేస్తారు. వీరు చేతిలో చెక్కతో చేసిన చిరుతలు పట్టుకుని మోగిస్తారు. ఈ భజనకు 16 నుండి 20 మంది సభ్యులు ఒక బృందంగా ఏర్పడి, ఆ బృందానికి ఒక గురువువుండి, ఆ గురువు మధ్యలో నుంచుని పాటు పాడుతుంటే బృంద సభ్యులు చిరుతలు వాయిస్తూ పాటను అందుకుని పాడుతూ చెక్కలు మోగిస్తారు. వీరికి తబలా, ఫ్లూటు వాయిద్య సహకారం కూడా వుంటుంది. ఇది చాలా శ్రమతో కూడుకున్న కళారూపం. అందరూ సమానంగా అడుగులు వేస్తూ చేతిలో చిరుతలను ఘల్లుఘల్లు మనేటట్లు మోగిస్తూ అందరూ కలసికట్టుగా అడుగులువేస్తారు. అందరూ ఒకేసారి ఎగరడం, కూర్చోవడం, గుండ్రంగా తిరిగడం, భజన చెయ్యడం ఈ చెక్కభజన యొక్క విశిష్టత. ప్రతి పాటకు నృత్యం, భావం, వరుసలు, తాళం మారుతుంటాయి. ఈ చెక్కభజనను పండుగలు, జాతర్లు, ఉత్సవాలు, ఊరేగింపు సమయాలల్లో చేస్తారు. దివిసీమలో ప్రతి గ్రామంలోనూ ఈ చెక్కభజనలు చేసే కళాకారులు వున్నారంటే వీరు అంతగా ఈ కళను ఆధరిస్తున్నారు.

కోలాటం :

కోలాటం అనేది చాలా ప్రాచీనమైన కళ అయినప్పటికీ దివిసీమ ప్రాంతంలో నేటికీ ప్రజాదరణ పొందుతున్న కళగా గుర్తింపు పొందింది. ఈ కోలాటం పూర్వం వెన్నెల రాత్రివేళల్లోనే ఆడేవారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్ధిష్ట సమయంలేకుండా ఉత్సవాలప్పుడు, ఊరేగింపు, జాతర్ల సమయాల్లో ఆడుతున్నారు. కోల అంటే కర్ర అని, ఆట అంటే ఆడుట లేక నృత్యం చేయుట అని అర్థం. ఈ కోలాటాన్ని చిడతలభజన అనీ, మురళీ

కోలాటం అని పిలుస్తుంటారు. దీనికి వయస్సు నిమిత్తం లేదు. సరి సంఖ్యలో 20 అంతకంటే ఎక్కువ మంది కర్రలు ధరించి పాటను ఆలపిస్తూ లయబద్ధంగా నృత్యం చేస్తూ ఒకరికర్రను మరొకరు కొడుతూ చుట్టూ గుండ్రంగా తిరుగుతూ ఆడతారు. ఈ కోలాట నృత్యబృందానికి ఒక గురువు కూడా వుంటారు. వీరు వస్త్ర నియమాన్ని పాటిస్తారు. వేప లేక టేకు కర్రముక్కలకు పసుపురాసి, కుంకుమ బొట్లుపెట్టి కర్రలను పట్టుకుని కాళ్ళకు గజ్జెలు కట్టుకుని ఆడతారు. పిల్లలు, పెద్దలుతోపాటు స్త్రీలు కూడా ఈ కోలాటాన్ని ఆడతారు. ఈ కోలాటంలో ప్రార్ధన గేయాలు, కరుణరసం, తాత్వికాలు, హాస్య, శృంగార, పౌరాణిక, సాంఘీక, లాలి, మంగళహారతి మొదలైన పాటలు పాడుతూ కోలాటంచేస్తారు.

ముగింపు :

ఈ జానపద కళలను ప్రదర్శించటం ద్వారా దివి సీమలో కులమత బేదాలు లేకుండా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే విధంగా కలసిమెలసి జీవిస్తున్నారు. సామాన్య మానవునికి కూడా అర్ధమయ్యేరీతిలో, వాడుకభాషలో సామాజిక, సాంఘీక ప్రయోజనాలు చేకూరే విధంగా సమాజంలోని బాధల్ని, గాథల్ని, మంచిని, మానవత్వాన్ని ఈ కళల ద్వారా తెలియజేస్తున్నారు. ఇలాంటి కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైవుంది. ప్రభుత్వం వారు కళాకారులకు ఫించను ప్రవేశపెట్టినప్పటికీ అది వారి జీవితానికి సరిపడకపోవడంతో ఇతర వృత్తులవైపు ఆకర్షితులై కళలను వదిలేస్తున్నారు. అందుకే కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో, విద్యా సంస్థల్లో కళాకారులచే ప్రదర్శినలు ఏర్పాటుచేస్తే కళాకారులకు జీవన భృతిని కల్పించినట్లవుతుంది. అదే విధంగా కళలను పరిరక్షిస్తున్న వాళ్ళమవుతామనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగువారి జానపద కళారూపాలు - డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.
2. కళాదర్శనమ్ - కర్నాటి లక్ష్మీనరసయ్య.
3. పగటివేషాలు సామాజిక అంశాలు - తాతా రమేష్‌బాబు.
4. దివిసీమ చరిత్ర - యద్దనపూడి బాబూరావు.
5. ప్రముఖ డప్పుకళాకారుడు - కొమ్మాకూరి ఏడుకొండలుగారితో ముఖాముఖి.
6. కోలాటం, చెక్కభజన కళాకారుడు బోలెం వెంకటేశ్వరరావుగారితో ముఖాముఖి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కడప జిల్లా జానపద దేవతలు – ఉత్సవాలు, పూజా విధానం – ఒక పరిశీలన

– డా॥. యు. కృష్ణమోహన్, చరిత్ర అధ్యాపకులు,, సి.యస్.యస్.ఆర్. డ యస్.ఆర్.ఆర్.యమ్, డిగ్రీ కాలేజ్, కమలాపురం.

జానపదులు ముఖ్యంగా తమ కష్టాన్ని నమ్ము కోవడంలో బాటు ఆకష్టాలు సఫలీకృతం కావాలంటే దైవ సహాయం ఉండాలని భావించారు. దేవుడి ప్రమేయం లేకుండా తమ మనుగడ సాధ్యం కాదని నమ్మారు. అందుకే తమ జీవనానికి ఏ రంగం అయితే ఉప యోగపడుతుందో ఆ రంగానికి సంబంధించిన పని ముట్లను కూడా దేవుడి సృష్టిగా భావించారు. తాము నమ్ముకున్న వృత్తిని దైవంతో సమానంగా భావిస్తూనే ఆ వృత్తి తమకు దేవుడే సంక్రమింపచేశాడని గాఢంగా విశ్వసించారు.

కడప జిల్లా జానపద ప్రాంతాల్లోని జానపదాలలో వెలసినన్ని ఆలయాలు, గుడులు, క్షేత్రాలు మరే ప్రాంతం లోనూ ఉండవేమో! కొండ కోనల్లో, ఆడవుల్లో నివశించే వారు ఆయా ప్రాంతాలలో తమ కులదేవతలకు స్థానం కల్పించుకొని పూజలు నిర్వహించారని మనకు చరిత్ర తెలియజేస్తోంది.

కడప జిల్లా ప్రాంతంలో నల్లమల్ల అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లా పాలకొండలు, వెలికొండల మధ్య విస్తరించి ఉంది. ఈ పర్వతాలు జిల్లా పశ్చిమ తూర్పు భాగాల్లో ఉండగా వీటి మధ్య అనుకొండ, మల్లెల కొండలు, గండికోట నుండి ప్రారంభమైన ఎర్రమల కొండల ఆఖరి భాగాలు, నల్లమల్ల కొండల దక్షిణ భాగం వీటి దిగువన లంకమలకొండలు ఉన్నాయి. సాధారణంగా గిరిజనులు ఈ కొండల, పర్వతాల ప్రాంతాలలో నివశిస్తూ ఉంటారు.

గ్రామ దేవతలు - పూజా విధానం :

పురాతన మానవులు ప్రకృతి వైపరీత్యాల నుండి, ప్రేతాత్మల బారినుండి తమను తాము రక్షించుకొనడానికి ఒక అతీత శక్తిని పూజించారు. ఆ శక్తినే తల్లి దేవతగా భావించారు. ఈ తల్లి దేవతనే గ్రామదేవతగా స్వీకరించి పూజించారు.

మనుష్యులను పీడించు ప్రేతాత్మల నుండి రక్షణకై ఆ మనుష్యుడే భగవద్రూపమును కల్పించుకొని, తనకు సంరక్షకునిగా నిలబెట్టుకొనెను. ఇట్టి భగవద్రూప రూప కల్పనము నందు మొదట కల్పన తల్లి దేవత, అమ్మతల్లి అని - నాయని కృష్ణకుమారి గారు అభిప్రాయపడ్డారు.

మాతృస్వామిక వ్యవస్థలో స్త్రీయే వ్యవసాయకురాలు కావడం, సఫలతకు స్త్రీయే ఆధారమనే అభిప్రాయం ఏర్పడటం, ఆమె సృజనాత్మక శక్తి స్వరూపం అనే భావన ప్రబలటం, గ్రామదేవతల ఆవిర్భావానికి, రూపకల్పనకు, ఆరాధనకు ముఖ్యకారణాలైనవి అని - రావి ప్రేమలత గారు తెలియజేశారు.

గ్రామరక్షణ, అభివృద్ధి కోసం, పాడి పంటలకు చీడ పీడలు సంక్రమించకుండా ఉండడం కోసం, గ్రామంలో తట్టు, ఆటలమ్మ, మసూచి, కలరా వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండడం కోసం నాటి జాన పదులు స్త్రీ దేవతలను ప్రతిష్టించుకొని పూజించి, బలులిచ్చి, జాతరలు, తిరుణాలలు జరిపారు.

కడప జిల్లా జాన పదులు గ్రామ పొలిమేరలను కాపాడడానికి పోలేరమ్మ, యల్లమ్మలను, అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండడం కోసం గంగమ్మ, అంకాలమ్మలను, ఊట బావుల్లో నీరు సమృద్ధిగా ఉండాలని, చెరువు గట్లను కాపాడాలని గంగమ్మ, అక్క

దేవతలని పూజించారు. వీరంతా శిష్ట దేవతలైన రాముడు, కృష్ణుడు, శివుడు, ఆంజనేయుడు, చెన్నకేశవుడు వంటి వారికంటే విశిష్టమైన లక్షణాలతో, పద్ధతులతో జానపదుల చేత పూజలందుకుంటూ గ్రామదేవతలుగా ప్రసిద్ధికెక్కారు. గ్రామ దేవతలు ఊరి పొరిమేరల్లో ఉంటూ, ఊరిలో మశూచి, కలరా వంటివి సోకకుండా కాపాడతారని ఊరికి రక్షకులుగా ఉంటారని ఆరాధించడం మొదలుపెట్టారు అని-పేట శ్రీనివాసుల రెడ్డి అభిప్రాయం.

కడప జిల్లాలోని గ్రామ దేవతలు ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క పేరుతో, ఒక్కొ రకమైన నమ్మకంతో, ఒక్కో రూపంలో, ఒక్కో పద్ధతిలో పూజలు అందుకుంటున్నారు. ఇలా కడప జిల్లా జానపద ప్రాంతాలలో పూజార్హులైన గ్రామదేవతల గురించి తెలుసుకుందాం.

కడప జిల్లా యాభై ఒక్క మండలాలలో విస్తరించి ఉంది. ప్రతి గ్రామంలోను గ్రామ దేవతల ప్రతిష్ఠ జరిపించి పూజలు నిర్వహిస్తున్నారు. కాని అన్ని గ్రామాల గ్రామ దేవతల గురించి తెలియజేయడం ద్వారా విషయం విస్తృతం అయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల జిల్లా జానపద ప్రాంతాలలో ప్రసిద్ధి వహించిన గ్రామ దేవతల గురించి వారి పూజా విధానం గురించి మాత్రమే ఇక్కడ తెలియజేయడం సమంజసం.

నల్లనమ్మ :

వేముల మండలం గొల్లలగూడూరు గ్రామంలో వెలసిన గ్రామదేవత నల్లనమ్మ. గ్రామ పొలిమేరకు లోపలి భాగంలోనే ఊరికి పడమటి వైపు నల్లనమ్మ దేవాలయం నిర్మించబడి ఉంది. ఒకప్పుడు కేవలం పాడుబడ్డ చిన్న దేవాలయం వేపచెట్ల క్రింద ఉండేది. కాని ఇటీవల యెద్దుల మరియు కల్లూరు ఇంటిపేరుగల వారు ధర్మ కర్తలుగా వ్యవహరిస్తున్నారు. అయినా గ్రామ ప్రజలందరు నల్లనమ్మను పూజించడం, బలులివ్వడం, మ్రొక్కులు తీర్చుకోవడం చేస్తాడు. సమీప గ్రామాలలోని కూడా నల్లనమ్మ భక్తులున్నారు.

పూజా విధానం:- యాదవులు ఈ ఆలయపూజారులు. ప్రతి ఉగాది మరుసటి రోజు ఉత్సవం నిర్వహింపబడుతుంది. నాడు కేశఖండన, జంతుబలులు గ్రామ దేవతకు సమర్పించుకుంటారు. ఉత్సవం నాడు గుడి ముందు బోణం రాశిగా పోసి, దానికి ఎర్రటి దారం చుట్టి టెంకాయ నిమ్మకాయలు సమర్పిస్తారు. ఆ తరువాత కేశఖండన కార్యక్రమం నిర్వహిస్తారు. దున్నపోతులను, పొట్టేళ్ళను, మేకపోతులను బలిఇస్తారు. దాదాపు మూడు దున్న పోతులకు తగ్గకుండా సుమారు రెండు వందల పొట్టేళ్ళను, మేకపోతులను బలి ఇస్తారు. అంటే గ్రామం లోని ప్రతి కుటుంబం నుండి ఒక పొట్టేలు కాని, మేకపోతు గాని బలి ఇవ్వబడుతుంది. మధ్యాహ్నం రెండు గంటల నుండి నల్లనమ్మను గ్రామంలోని ప్రధాన రహదారిలో ఊరేగిస్తారు. ఉత్సవ విగ్రహాలు సమకూర్చ బడ్డాయి. ఈ ఉత్సవ విగ్రహాలను అలంకరించిన ప్రభపై ఉంచి నలుగురు వ్యక్తులు భుజాలపై మోస్తూ ఊరే గిస్తారు.

గ్రామ దేవత ఊరేగే సమయంలో చెక్కభజనలు, కోలాటం వంటివి ప్రదర్శింపబడతాయి. నల్లనమ్మ గ్రామం లోని కొంతమందికి పూనడం జరుగుతుంది. నిత్య దీపారాధన జరుపబడుతుంది. ఇటీవలి కాలంలో దసరా ఉత్సవాలు కూడా నిర్వహింపబడుతున్నాయి.

అచ్చవెల్లి గంగమ్మ :

పులివెందుల మండలం తూర్పుదిక్కున పులివెందుల వీరపునాయని పల్లె రహదారి ప్రక్కన అచ్చవెళ్ళి గ్రామ పొలిమేరలో వెలసిన గ్రామ దేవత అచ్చవెళ్ళ గంగమ్మ. కేవలం అచ్చవెళ్ళి గ్రామంలోనే గాక చుట్ట ప్రక్కల గ్రామాలైన పుట్రాయిని పేట, గోటూరు, నల్లజెరువు పల్లె, కోనిరెడ్డి పల్లె, పెండ్లూరు, నాగూరు, అలవలపాడు, పెర్నపాడు, గొల్లలగూడూరు, చింతల జూటూరు, పెద్దజూటూరు, గొంది పల్లె గ్రామాలలో కూడా అచ్చవెళ్ళి గంగమ్మ భక్తులు ఉన్నారు. దాదాపు పదిసంవత్సరాల క్రితం దేవాలయం కొత్త హంగులతో నిర్మించబడింది.

ఈ దేవాలయం దాతల నుండి చందాల రూపంలోను, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోను నిర్మించబడింది.

పూజా విధానం:

నిత్య దీపారాధన నిర్వహింపబడుతోంది. కేశఖండన, మ్రొక్కుబడులు భక్తులు వీలైనప్పుడు చెల్లించుకుంటు ఉంటారు. ప్రతి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహింప బడుతుంటాయి. ఉగాది పర్వదినం మరుసటి రోజు ఉత్సవం నిర్వహింపబడుతుంది. చుట్టు పక్కల భక్తులు జంతుబలులు సమర్పించి మ్రొక్కులు చెల్లిస్తారు.

అక్క పప్పరమ్మ- వేముల మండలంలోని మోపూరు గ్రామంలో వెలసిన గ్రామదేవత అక్కపప్పరమ్మ. గుడిచుట్టూ మైదానంలో ఉంది. గుడికి మాన్యం ఉంది. వేపచెట్టు గుడి చెట్టుగా పూజలందుకుంటోంది.

పూజా విధానం :

కురువ కులస్థులు పూజారులు. నిత్యదీపారాధన నిర్వహింపబడుతోంది. ప్రతి సంవత్సరం తిరునాళ్ళ జరుపు తారు. భక్తులు పొట్టేళ్ళు, దున్నపోతులు, కోళ్ళను బలి యిస్తారు. పశువులకు, మనుష్యులకు కలరా, మసూచి, తట్టు వంటి అంటురోగాలతో బాటు పంటలకు చీడ, పీడలు ప్రబల కుండా ఉండాలని అక్కపప్పరమ్మను పూజిస్తారు.

మైసూరమ్మ :

మైసూరమ్మ తొండూరు మండలం మడూరు గ్రామం తోను, ప్రొద్దుటూరు మండలం తాళ్ళమాపురం గ్రామం లోను వెలసిన గ్రామ దేవత. మడూరు గ్రామంలో వెల సిన మైసూరమ్మ స్పష్టమైన శిల్పంతో చతుర్భుజాలతో చెక్కబడి ఉంది. త్రిశూలం ఖడ్గం, ఢమరుకం, పానపాత్ర ధరించి ఆశీసురాలైన రూపంతో దర్శనమిస్తుంది. గ్రామా నికి దక్షిణ భాగంలో గుడి నిర్మింపబడి ఉంది. ఎదురుగా పోతురాజు విగ్రహం ప్రతిష్ఠించబడింది. ఒక్కడ పూజారులు హరిజన కులస్థులు. ప్రతి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహింపబడుతున్నాయి.

తాళ్ళమాపురంలో వెలసిన మైసూరమ్మ ఒక చిన్న కొట్టంలో రూపరహితంగా ఉంది. కేవలం ఒక చిత్రపటం మాత్రం దర్శనమిస్తుంది. కమలాపురం శాసన సభ్యుడుగా ఎన్నికై మంత్రిగా పనిచేసిన శ్రీ మూలె వెంకట మైసూరా రెడ్డి గారు ప్రభుత్వసహాయంతో తాళ్ళమాపురం మైసూరమ్మకు ఆలయం కట్టించారు. తాళ్ళమాపురానికి పడమటి వైపు గ్రామం చివర గుడి నిర్మింపబడింది. ఈమె భక్తులు మైనూరమ్మ, మైసూరారెడ్డి వంటి పేర్లు పెట్టుకుంటారు.

పూజావిధానం :

తాళ్ళమాపురం మైసూరమ్మ పూజారులు బలికుల స్థులు. నిత్యదీపారాధన నిర్వహింపబడుతోంది. భక్తులు మ్రొక్కుబడులుగా పొట్టేటు, కోళ్ళు సమర్పించుకుంటారు. సుదూర ప్రాంతాలలో వారు కూడా ఈమె భక్తులు ఉన్నారు. కేశఖండన సమయంలో జంట యాటలను బలియిచ్చి అక్కడే వండుకుని తింటారు. ఆహార పదా ర్థాలు ఇంటికి తీసుకొని పోరాదనే నియమం ఉంది. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఓ న్నూరమ్మ :

సింహాద్రిపురం మండలం ఓరవ గంట పల్లెలో వెలసిన గ్రామదేవత ఓన్నూరమ్మ గుండ్రాయి రూపంలో మట్టి అరుగుపై వెండికన్నులు, కోరలతో పసుపు కుంకుమలు పూసిన నలుపురంగులో ప్రతిష్ఠింపబడిన దేవత ఓన్నూ రమ్మ, గుడికి ఎదురుగా పోతురాజు ప్రతిష్ఠింపబడినాడు.

పూజా విధానం :

తలారి కులం వారు ఈ దేవత పూజారులు. నిత్య దీపారాధన నిర్వహింపబడుతోంది. ఉగాది నాడు జంతుబలినిచ్చి సమర్పిస్తారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహింపబడుతున్నాయి.

అంకాళమ్మ :

అంకాళమ్మ గూడూరు గ్రామ దేవత. గూడూరు సింహాద్రిపురం మండలంలో ఉంది. ఈ అంకాళమ్మ ద్వారా గూడూరుని అంకాళ్ళమ్మ గూడూరు అని

వ్యవహరిస్తారు. పులివాహనాన్ని అధిరోహించిన నాలుగు అడుగుల విగ్రహరూపంలో అంకాళమ్మ ప్రతిష్ఠించబడింది. అంకాళమ్మ గుడి గూడూరు గ్రామానికి ఉత్తర భాగంలో ఉంది. గుడి చెట్టు వేపచెట్టు. గుడి చెట్టు ప్రహరీ గోడ నిర్మించబడి ఉంది. పెద్దమ్మ, పోతురాజు, నంది విగ్రహాలు కూడా గుడికి ఎదురుగా ప్రతిష్ఠించబడినాయి.

పూజా విధానం :

పూజారు యాదవ కులస్థులు. నిత్యదీపారాధన నిర్వహింపబడుతోంది. చైత్రమాసం పున్నమినాడు అంకాలమ్మకు కంకణం కట్టడం విప్పడం జరుగుతుంది. ఆది, గురు వారాలలో తిరునాళ్ళు నాలుగైదువారాలు నిర్వహిస్తారు. ఈ రోజుల్లో అంకాళమ్మ దుర్గమ్మగా దర్శనమిస్తుంది. కంకణం కట్టిన ఐదవ రోజు సిదిబడిని ఆలయం చుట్టు త్రిప్పుతారు. అమావాస్య నాడు మగవాడైన గణాచారి స్త్రీ వేషం ధరించి అమ్మవారికి కంకణం విప్పుతాడు. ఆనాడు కత్తికి తలంబ్రాలు పోస్తారు.

పున్నమి నుండి అమాస్య వరకు దాదాపు పదిహేను రోజులు ఏడాదికొకసారి తిరునాళ్ళ జరుపుతారు. కడగ నాగయ్య పల్లెవారు కుంకుమ బండి కట్టుకొని అలంకరించి ఒక పట్టు చీర తెచ్చి అమ్మవారికి అలంకరిస్తారు. దాదాపు ఐదువేల మంది భక్తులు అంకాళమ్మ తిరునాళ్ళకు హాజరౌతారు. ఎదురు గంగమ్మలు ప్రధాన దేవతకు ముందుభాగంలో ప్రతిష్ఠింపబడినాడు. గుడి పైభాగంలో ఉత్తరం వైపు సుబ్రమణ్యస్వామి, అర్ధనారీశ్వరులు, దక్షిణం వైపు నారద, విఘ్నేశ్వరుల చిత్రపటాలు ఏర్పాటు చేశారు. మిగిలిన రెండు వైపుల రాక్షసులు శంఖం పట్టుకొని కాపలాకాస్తున్నారు. మధ్యలో కాళికాదేవి ఈటెతో పొడుస్తున్నట్లు పెద్ద బొమ్మలు ఏర్పాటు చేయబడ్డాయి.

ఆరుమేకలమ్మ :

యర్రగుంట్ల మండలం కోడూరు గ్రామంలో వెలసిన గ్రామదేవత ఆరుమేకలమ్మ, ముక్కోణపు రాతి పీఠంపై నలుపురంగుతో ప్రతిష్ఠింపబడింది. గ్రామానికి ఈ శాన్యంగా ఒక ఫర్లాంగు దూరంలో రేగడి భూముల్లో గుడి నిర్మింప బడి ఉంది. గుడిచుట్టూ మైదానంతో వేపచెట్టు గుడిచెట్టుగా ఉంది.

పూజా విధానం :

నిత్యపూజలు లేవు. పూజారి కూడా లేడు. ప్రతి ఆదివారం వేడుక సమయంలో భక్తులు దీపారాధన చేస్తారు. వర్షాగమనం కోసం, వివాహం సమయాలలో భక్తులు మ్రొక్కుబడులు చెల్లిస్తారు. మాఘమాసంలో జాన్న ముద్దలు పెట్టి జంతు బలులు సమర్పిస్తారు.

భోగాదెమ్మ :

వీరపునాయని పల్లె మండలం అనిమెల గ్రామదేవత భోగాదమ్మ, చతుర్భుజ రాతి విగ్రహం ప్రతిష్ఠించబడింది. త్రిశూలం, ఖడ్గం, ఢమరుకం, పాన పాత్రలు నాలుగు చేతుల్లో ధరించి ఈశీనురాలై నలుపు రంగుతో కూడిన విగ్రహం భోగాదెమ్మ, గ్రామ వాయవ్యదిశలో కొండ క్రింద గుడి నిర్మించబడింది. గుడిచుట్టూ మైదానం ఏర్పాటు చేయబడింది. దాదాపు పద్దెనమిది ఎకరాలు గుడి మాన్యం భూమి పూజారి అనుభవంలో ఉంది. అమ్మవారికి ఎదురుగా పది అడుగుల దూరంలో మండపంలో పోతుల రాజు విగ్రహం ప్రతిష్ఠించబడి ఉంది.

పూజా విధానం :

నిత్య దీపారాధన లేదు. యాదవ కులస్థులు పూజారులు. ప్రతి ఆదివారం పూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం మొలకల పౌర్ణమి శుక్ర, శని, ఆది, సోమ, మంగళ వారాలలో ఐదు రోజులు తిరుణాల నిర్వహిస్తారు. ఈ ఐదు రోజులు రాత్రింబవళ్ళు భోగాదెమ్మను సేవిస్తారు. మ్రొక్కుబడులుగా జంతు బలులు సమర్పించుకుంటారు. దేవతకు సన్న నిమ్మకాయలు, కళ్ళు, కోరలు గొడుగులు, చీరలు భక్తులు సమర్పించుకుంటారు.

సత్తెమ్మ :

కమలాపురం మండలం సంబటూరు గ్రామంలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మ, చతుర్భాజాలతో కూడిన నలుపురంగు రాతి విగ్రహంగా సత్తెమ్మ వెలసింది. సంబటూరుకు రెండు ఫర్లాంగుల దూరంలో గుడి నిర్మించబడింది. గుడి చుట్టూ మైదానం ఉంది.

పూజా విధానం :

పూజారులు హరిజన కులస్థులు. వేడుక సమయాలలో ప్రత్యేక పూజలు నిర్వహింపబడతాయి. ప్రతి ఆది వారం పూజలు నిర్వహిస్తారు. ఉగాది నాడు కుంభం పోసి దున్నపోతును బలియిస్తారు. నిమ్మకాయలు, ఖడ్గం, కళ్ళు, గోర్లు దేవతకు భక్తులు సమర్పించుకుంటారు. అన్ని కులాలవారు ఈ ఉత్సవాలలో పాల్గొంటారు.

ఎల్లమ్మ (చెప్పలమ్మ) (హేలాంబ) :

కమలాపురం మండలం పెద్దచెప్పలి గ్రామదేవత ఎల్లమ్మ. ఈమెను చెప్పలమ్మ అని కూడా వ్యవహరిస్తారు. ఊరికి ఉత్తరం వైపు గుడి నిర్మించబడింది. గుడిలో తూర్పువైపుకు చెప్పలమ్మ ప్రతిష్ఠించబడింది. గుడిచుట్టూ ప్రహరీ గోడ నిర్మించబడింది.

పూజా విధానం :

నిత్యపూజలు నిర్వహింపబడుతున్నాయి. బ్రాహ్మణ కులస్థులు పూజారులు. శుక్ర, ఆది వారాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచబడతాయి. ప్రతి సంవత్సరం చైత్రబహుళ ఏకాదశి నుండి వైశాఖ శుద్ధ పాడ్యమి, తదియ రోజు వరకు తిరుణాల నిర్వహింప బడుతుంది. తిరుణాల రోజున పెద్దచెప్పలి, ఎల్లారెడ్డి పల్లె, ఈ దిగపల్లెలనే మూడు గ్రామాలలో ఊరేగింపుగా చెప్పలమ్మను తీసుకవస్తారు. ఏడు రోజులు తిరుణాల నిర్వహిస్తారు. ఆసాది వాళ్ళు చెప్పలమ్మ కథను తినిపిస్తారు. గుడికి 19 ఎకరాల మాన్యం భూములున్నాయి.

తిరునాళ్ళ రోజులలో దేవతకు జంతుబలులిచ్చి జాన పదులు మ్రొక్కులు చెల్లిస్తారు. చుట్టు ప్రక్కల గ్రామానలకే గాక పొరుగు జిల్లాల వారు కూడా ఎల్లమ్మ తిరుణాలకు దాదాపు 60 వేల మంది హాజరవుతారు. భక్తులు చెప్పలమ్మకు కళ్ళు, చీరలు సమర్పిస్తారు. పుత్తావారి ఈడిగపల్లిలోని గృహంలో గాటిలో ఒక శిలగుండం మట్టిలో పుట్టింది. ఆ శిలనే ఆడబిడ్డగా పుత్తావారు భావించారు. అప్పటి నుండి పుత్తారెడ్డి పెద్దచెప్పలికి దూరమయ్యారు. తిరుణాల రోజున ఈడిగ పల్లె నుండి పెద్ద చెప్పలికి దేవతను ఊరేగింపుగా తీసుకవస్తారు. పుత్తారెడ్డిఇ వంశంలో జన్మించినందున తన సంబంధీకులు గ్రామ పొలిమేరలు దాటి ఉండాలని దేవత కొందరికీ కలలో కన్పించి చెప్పడంతో పుత్తా వంశీయులు పెద్దచెప్పలి వదలిపెట్టి ప్రక్కగ్రామంలో స్థిరపడ్డారు. తోట సుబ్బారావు గారిచే బహుకరించబడిన వెండి కిరీటాన్ని తిరుణాల సమయంలో చెప్పలమ్మకు అలంకరించి ఉత్సవం నిర్వహిస్తున్నారు.

మరియమ్మ :

కడప పట్టణం ఎర్రముక్క పల్లె గ్రామం రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన గ్రామ దేవత మారియమ్మ. ఈ దేవాలయానికి 150 సంవత్సరాల చరిత్ర ఉంది. 1865 సం॥ లో బ్రిటిషు పాలకుల కాలంలో కడప కేంద్రంగా రైల్వేలైను నిర్మాణం జరిగింది. అప్పట్లో ఈ రైల్వే నిర్మాణ పనుల్లో తమిళులు ఎక్కువగా పనిచేసేవారు. అలా ఉద్యోగరీత్యా కడప రైల్వే స్టేషన్‌కు బదిలీపై కొందరు తమిళులు కడపకు వచ్చారు. వారి సంప్రదాయాలకు అనుగుణంగా మరియమ్మ దేవతను ప్రతిష్ఠించుకుని పూజలు నిర్వహించుకొన్నారు.

ప్రస్తుత కడప రేల్వే స్టేషను ప్రాంతం ఆరోజుల్లో కంది పాళెం పేరుతో వ్యవహరింపబడిన దళితవాడు. ఆషాఢ మాసంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వ హింపబడుతున్నాయి. మదరాసు నుండి తమిళులు ఈ తిరునాళ్ళకు హాజరై తమ మ్రొక్కులు చెల్లించుకుంటారు. నిత్య దీపారాధన, పూజలు నిర్వహింపబడుతున్నాయి.

పెద్ద గంగమ్మ :

రామాపురం మండలం అనంతపురం గ్రామంలో పెద్ద గంగమ్మ అనే గ్రామదేవత వెలసింది. చింత చెట్టు గుడి చెట్టుగా గ్రామానికి ఉత్తర దిక్కున ప్రతిష్ఠింపబడింది పెద్ద గంగమ్మ. ఈ గుడికి నాలుగు ఎకరాల భూమి మాన్యం ఉంది. పంచలోహ విగ్రహాలతో చిన్న గంగమ్మ, పోతు రాజులు ప్రతిష్ఠింపబడ్డారు. ఈ చిన్నగంగమ్మ పొన్నత్తల

చేగుట్టు పల్లెలో ఊరి పెద్ద ఇంట్లో చుట్టూబోన (చుట్టల్లో) ఉంచుతారు.

పూజా విధానం :

నిత్యసేవ లేదు. శివరాత్రి తరువాత రెండవ రోజు (అమావాస్యరోజు) గొప్ప తిరుణాల జరుగుతుంది. గొల్ల వారు ఈ క్రమదేవత పూజారులు. ఈ తురుణాల రోజు అధిక సంఖ్యలో జంతు బలులు ఇవ్వడం పరిపాటి. దున్నేపోతులను కూడా బలి ఇస్తారు. ఈ ఉత్సవాలలో లక్షలాది మంది పాల్గొంటారు. పొరుగు జిల్లాలో కూడా ఈ పెద్ద గంగమ్మ భక్తులు ఉండడం విశేషం. తిరుణాల రోజు దేవాలయాన్ని పసుపు కుంకుమ నీటితో ఆలయాన్ని శుద్ధి చేస్తారు. పాల్గుణ మాసంలో ఆది, గురు వారాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామానికి సంభవించిన అదిష్టాలను అంతరింపచేసే భావనతో రక్తం మాంసంతో కూడిన బోజనం కూడును ఊరి పొలిమేరల్లో చల్లి పెద్ద గంగమ్మ తల్లిని శాంతింపచేస్తారు జానపదులు.

తిరుణాల రోజు ఛాందినీ బండ్లు కట్టడం, రాత్రివేళ పాటలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తారు. రైతులకు అవసరమైన పనిముట్లు ప్రదర్శన ఉంటుంది. పెద్దమ్మ తల్లి దగ్గర కొన్న పనిముట్లతో వ్యవసాయం చేసినట్లయితే లాభాదాయకంగా ఉంటుందని భక్తుల విశ్వాసం.

మల్లూరమ్మ :

చిన్న మండెం మండలం మల్లూరు గ్రామంలో వెల సింది మల్లూరమ్మ. 1685-1700 సం॥ ప్రాంతంలో గ్రామ పెద్దల సహాయంతో ప్రతిష్ఠింపబడిన గ్రామదేవత మల్లూరమ్మమ. మాండవ్య నదీ తీరంలో పంచలోహాల విగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఐదు ఎకరాల పంటచేను, ముప్పై కుటలు వరిమడి, నలభై మామిడి చెట్లు మల్లూరమ్మ మాన్యం. ఈ మాన్యం ఆధారంగా వచ్చిన ఆదాయాన్ని తిరుణాల నిర్వహణా ఖర్చులకు వినియోగిస్తారు.

పూజావిధానం :

కురవలు గుడి పూజారులు, మూడు సంవత్సరాలకు ఒకసారి మార్చినెల పౌర్ణమి రోజు (చతర్థశి, పౌర్ణమి) రెండు రోజులు తిరుణాల నిర్వహింపబడుతుంది. తిమ్మారెడ్డి గారి పల్లెలో దేవతా విగ్రహం కాపాడబడుతుంది. తిరుణాల రోజుల్లో మాత్రం అత్తగారి గ్రామమైన మల్లూరు గ్రామం లోని గుడిలో ప్రవేశిస్తుంది మల్లూరమ్మ. ఈ ఉత్సవంలో సుమారు పదివేల మంది భక్తులు పాల్గొంటారు. బయ నోళ్ళు, ఆసదోళ్ళు అమ్మవారు కథలు చెబుతారు. సుద్దుల వాళ్ళు అమ్మవారిని స్తోత్రాలతో కీర్తిస్తారు. కాపులు, బలిజ, కురువ, సుగాలి, ఎరుకల వారు ముఖ్యంగా మల్లూరమ్మ భక్తులు.

నాగారపమ్మ :

సుండుపల్లి మండలం పెదనేని కాల్వగ్రామంలో వెల సిన గ్రామ దేవత నాగారపమ్మ. చాకలివారు కులదేవత అయినా చుట్టుపక్కల గ్రామస్థులందరూ కూడా నాగా రపమ్మను పూజిస్తారు. గుడి పెదనేని కాల్వగ్రామానికి దక్షిణం దిశలో నిర్మింపబడింది. గుడి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించబడింది. ప్రహరీ లోపు మూడు వేపచెట్లు గుడిచెట్లుగా గుర్తించబడ్డాయి.

పూజా విధానం :

చాకలివారు ఈ గ్రామదేవత పూజారులు. ప్రతి ఆది వారం పూజలు నిర్వహింపబుతున్నాయి. జూన్ మొదటి వారంలో ప్రతి సంవత్సరం ఉత్సవాలు చాకలి కులస్థుల ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్నాయి. తిరుణాల మూడురోజులు నిర్వహింపబడుతుంది. శనివారం దాసర్లు, ఆదివారం జాగర్లు, సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. తిరుణాలకు ముందు పదిరోజులు చుట్టపక్కల గ్రామలలో నాగారపమ్మను ఊరేగింపుగా తిప్పుతూ ఉత్సవానికి విరాళాలు సేకరిస్తారు. తిరుణాల రోజు మాన్యం వారిపల్లె ఆసదోళ్ళు అమ్మవారి కథలు చెప్పడం, కళాకారులు చెక్కభజనలు, చాందినీ బండ్లను అలంకరించి తిప్పడం వంటివి నిర్వహిస్తారు.

ముగింపు :

ఈ విధంగా ఎక్కడలేని విధంగా కడప జిల్లాలోని

గ్రామ దేవతలు కలరు. గ్రామీణులు ప్రతిదానికి ఒక నమ్మకాన్ని పెట్టుకొని గ్రామాలలో దేవతలను ప్రతిష్ఠించి గ్రామ రక్షణ కోసం, ఆయురారోగ్య ఐశ్వర్యం కోసం మొక్కుబడులు చెల్లించడం కోసం చేస్తారు.

ఉపయుక్త గ్రంధాలు :

1. తెలుగు జానపద గేయగాథలు - పుట 184.
2. తెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు - పుట. 169.
3. తిరుమల తిరుపతి గ్రామ దేవతలు - పుట. 2
4. విషయసేకరణ : ఎద్దుల బాల గంగిరెడ్డి - గొల్లల గూడూరు గ్రామం, వేములమండలం.
5. విషయసేకరణ : రామిరెడ్డి రాజా రెడ్డి, అచ్చవెల్లి గ్రామం, పులివెందుల మండలం.
6. కడప జిల్లా గ్రామ దేవతలు - జాతరలు-పరిశీలన - డా॥యు.కృష్ణమోహన్ - భావవీణ - పుట.120
7. కడప జిల్లా గ్రామ దేవతలు - శ్రీ పద్మనాభ రెడ్డి - పుట. 10-16.
8. కడప జిల్లా గ్రామ దేవతలు - శ్రీ పద్మనాభ రెడ్డి - పుట. 19.
9. కడప జిల్లా చరిత్ర - దేవాలయాలు - ×ూచీ చంద్రశేఖర్. - పుట. 10.
10. Selected Temples in Kamalapuram - Subba Reddy. R - Page - 20
11. కడప జిల్లా - మహోజ్వల చరిత్ర - వేంపల్లి గంగాధర్ - పుట. 20.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల ప్రదర్శన కళలు

- ఆర్. లక్ష్మీ ప్రసన్న కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

జానపదులు అనగా గ్రామీణులు లేదా పల్లె వాళ్ళు అని అర్థం. జనపదాల్లో నివసించే వారిని జానపదులు అంటారు. వీరు ఆటవిడుపు, వినోదం కోసం చేసే ప్రదర్శనలను జానపదుల ప్రదర్శనలు అని అంటారు. ఇవి మానసికానందాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయి. జానపదుల ప్రదర్శనల రకాలను గురించి తెలియ జేయడమే ఈ వ్యాస ఉద్ధేశం.

తోలుబొమ్మలాట :

తోలుబొమ్మలాట అతి ప్రాచీన కళల్లో ఒకటి. కొండ గుహల్లో కొవ్వు దీపాల వెలుగులో రాతి గోడల నీడలు పడేలా చేసి కథలు అల్లినప్పుడు ఈ కళ పుట్టింది. కీలు బొమ్మలు, ఊచ బొమ్మలులతో ప్రారంభమైన ఈ ప్రక్రియ 'తోలుబొమ్మలాట'గా ఒక పరిపూర్ణత సంతరించుకుంది. "తొంభై ఆమడలైనా పోయి తోలుబొమ్మలాట చూడాలి" అనే నానుడు తోలుబొమ్మలాట ప్రాధాన్యాన్ని తెలియ జేస్తుంది. ఈ తోలుబొమ్మలాట ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు నుండి భారతీయులతో పాటువిదేశాలైన టర్కీ, పర్షియా, గ్రీసు, ఆఫ్రికా, ఇటలీ, ఫ్రాన్సు దేశాలకు కూడా వ్యాపించింది.

తోలుబొమ్మలాటలో తెరకట్టి, తెరవెనక దీపాలు వెలిగించి బొమ్మలచేత చక్కగా నాట్యం చేయిస్తారు. తోలుబొమ్మలాట బృందంలో భర్త రాముడి పాత్రకు వాచికం చెబితే భార్య సీత పాత్రకు వాచికం చెప్పి వంతపాడుతుంది. మిగతా కుటుంబ సభ్యులు మిగిలిన పాత్రలకు అనుగుణంగా పాడుతూ వాచికం చెబు తుంటారు.

తోలుబొమ్మలను మేక చర్మాలతో గాని, జింక చర్మాలతోగాని తయారుచేస్తారు. రాముడు, సీత, ఆంజనేయుడు మొదలైన ప్రధాన పాత్రలకు జింక చర్మాన్ని మిగతా పాత్రలకు మేక చర్మాన్ని వాడతారు. అందుకే తోలుబొమ్మలాటలను చర్మనాటకం అని కూడా పిలుస్తారు. తోలుబొమ్మల్ని తెరమీద ఆడించడానికి వీలుగా వెదురు బద్దను బొమ్మకు మధ్యభాగంలో కడ తారు. బొమ్మను ఆడించాలంటే ఈ బద్దే ఆధారం. హార్మోనియం, తాళాలు, మద్దెల వాయించే వ్యక్తులు వంత పాడుతుంటారు. రథాలు, గుర్రాలు పరుగులెత్తే సమయంలో చెక్కలు టకటకలాడిస్తూ శబ్దం చేస్తారు. మధ్యమధ్యలో వచ్చే కేతిగాడు, జుట్టు పోలిగాడు, బంగారక్క మొదలైన హాస్యపాత్రలు కడుపుబ్బా నవ్విస్తాయి.

వీధి భాగవతం :

'కస్తూరి రంగరంగా
నాయన్న కావేటి రంగ రంగా
శ్రీరంగ రంగ రంగా'

అంటూ పోతన భాగవతంలోని ఘట్టాలను జానపద శైలిలో అభినయిస్తూ గానం చేస్తారు. కూచుపూడి భాగవతం, చిందు భాగవతం, గంటె భాగవతం, ఎరుకల భాగవతం, శివ భాగవతం, చెంచు భాగవతం, తూర్పు భాగవతం మొదలైనవి ప్రసిద్ధి చెందిన వీధి భాగవత కళారూపాలు. పురాణ గాథలను నాట్యరూపంగా ప్రదర్శించే వారిని భాగవతులు అంటారు. భాగవతులు అంటే భగవంతునికి సంబంధించిన కథలను ప్రదర్శించే వారని అర్థం. మనరాష్ట్రంలో ఈ భాగవతాన్ని ప్రదర్శించే వారిలో వివిధ కులాలకు చెందిన వారుండటం విశేషం. వీరిలో ఎర్రగొల్లలు, కూచిపూడి భాగవతులు, జంగాలు, చిందు భాగవతులు, యానాదులు, దాసరులు ముఖ్యులు.

తప్పెటగుళ్ళు :

'శివశివ మూర్తివి గణనాథ
నీవు శివుని కుమారుడివి గణనాథ
గన్నేరు పువ్వులతో గణనాథ
నీకు ఘనంగా పూజలయ్యె గణనాథ'

ఇలా ఎన్ని రకాల పూలతో పూజిస్తారో అన్ని రకాలుగా పాటపాడి ప్రార్థన చేస్తారు. తప్పెటగుళ్ళు ప్రదర్శన కారులు. తప్పెటగుళ్ళు ఉత్తరాంధ్రలో ఎక్కువగా కని పించే జానపదకళ. ప్రదర్శన సమయంలో రంగుల బని యన్లు ధరించి, కాళ్ళకు బరువైన ఎక్కువ శబ్దాన్నిచ్చే గజ్జెలు కట్టుకొని, రంగునిక్కర్లు వేసుకుంటారు. రేకుతో గుండ్రంగా తయారుచేసిన తప్పెటగుండ్లను గుండెకు కట్టుకని రెండు చేతులతో ఉధృతంగా వాయిస్తారు. వలయాకారంగా తిరుగుతూ, లయబద్ధంగా అడుగులు వేస్తూ, గెంతుతూ, తప్పెపట కొడుతూ పాటలు పాడతారు. 20 మంది వరకు ఉండే ఈ బృందంలో తాళం లయ తప్పకుండా వలయాకారంగా తిరుగుతూ నాయకుని అనుసరిస్తూ చేసే నృత్యం అద్భుతంగా ఉంటుంది. పతాక స్థాయికి చేరిన తరువాత వీరు చేసే విన్యాసాలు ఆకట్టుకుంటాయి. రామాయణ, భారత, భాగవత పురాణా లలో గల గాథల్ని గేయాలుగా అల్లుకుంటారు. ఇదంతా మౌఖిక సాహిత్యం.

బుర్రకథ :

'ఓ వీర యోధుడా, ఓ ఆంధ్ర యోధుడా
లేవయ్యా లేచిరావయ్యా లేవయ్యా లేచిరావయ్యా
బంగారు నీ తెలుగుతల్లీ ఫళిఫళి
పాడిపంటల పాలవెల్లి ఫళిఫళి
వీరాధివీరులను గన్నా ఫళిఫళి'

తందానా తాన తందనానా..... అంటూ వంతలు వంత పాడటం బుర్రకథలో మనకు కనిపిస్తాయి. బుర్రలతో చెప్పేది కావడం వలన అది బుర్రకథ అయింది. ప్రధాన కథకుడు తంబూరవాయిస్తూ వంత పాడతారు కొన్ని ప్రాంతాలల్లో గుమ్మెటలను బుర్రలు అంటారు. వీటి సాయంతో నడిచేది కాబట్టి దీనికి బుర్రకథ అని పేరు. ప్రధాన కథకుడు చెప్పే కథకు వంతలుగా ఉంటే వారిలో ఒకరు కథా వివరం చెబుతుంటే, మరొకరు హాస్యం చెబుతూ రక్తికట్టిస్తారు. ఆధునిక బుర్రకథకు ఆద్యుడు బుర్రకథా పితామహుడు షేక్ నాజర్ తెలుగువారి కీర్తిని ప్రపంచం నలుదిశలా వ్యాపింపజేశారు. ఇందులో వీర, కరుణ రసాలు ప్రాధాన్యం ఉంటుంది.

కోలాటం :

కోలాటం భజన సంప్రదాయానికి చెందిన జానపద కళారూపం. కోల అంటే కర్ర అనిఅర్థం.

కర్రలతో ఆడుతూ చేసే భజన అన్న మాట. గ్రామ దేవత పండుగలు, తీర్థ లు, జాతరలు, ఉత్సవాల్లో కళాకారులు దీన్ని ప్రదర్శిస్తారు. కోలాటం ఒక బృంద నృత్యం. కళాకారుల చేతిలో కోలాటం కర్రలు పట్టుకొని నిల్చుంటారు. వారి మధ్యలో జట్టునాయకుడు ఈలవేస్తూ ఏ పదానికి ఏ నాట్యం చెయ్యాలో, ఏ దరువుకు ఎలా స్పందించాలో చెబుతూ ప్రదర్శన నడిపిస్తాడు. కళాకారులు ఒకరికొకరు కర్రలు తాకిస్తూ లయబద్ధంగా వాయిస్తూ పాడుతూ, గుండ్రంగా తిరుగుతూ అడుగులు వేస్తారు. ఎంత వేగంగా చిందులేస్తున్నా చేతిలో కర్రలు శ్రుతి తప్పకుండా వాయిస్తారు. జట్టునాయకుణ్ణి కోలన్న పంతులు, మేళగాడువ అంటారు. జట్టు నాయకుడు నిలిచే ప్రదేశాన్ని 'గరిడీ' అంటారు.

'గుడి గుడి గుండేలమా - గొండేలమ్మా రాగమా
ఏమే గండారమా - ఎండ గాస్తున్నావు'

రామాయణ ఘట్టాలు, కృష్ణుని బాల్యచేష్టలు, భక్తి పాటలు పాడతారు. కోలాటంలో పాటకు అనుగుణంగా నృత్యం చేయడాన్ని 'కోపు' అంటారు. కళలు మానవ నాగరికతను ప్రతిబింబించే దర్పణాలు. ఇవి ఒక తరం నుండి మరొక తరానికి సంస్కృతిని ప్రసారం చేస్తాయి. ఎంత మందికో జీవనోపాధిని కలిగిస్తున్నాయి. వర్తమాన కాలంలో ఆదరణ లేకోవడంతో కళలు కనుమరుగువు తున్నాయి. వీరు ఇతర వృత్తులకు వలస పోతున్నారు. సంస్కృతిని పరిరక్షించుకోవడం అంటే మానవ జాతిని పరిరక్షించుకోవడమే ప్రధాన కర్తవ్యం.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపద నృత్య కళలు - కృష్ణారెడ్డి చిగిచర్ల
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీయస్. సుందరం
3. జానపద గేయవాఙ్మయ వ్యాసావళి - గంగాధరం నేదనూరి

❖ ❖ ❖

జానపద సాహిత్యం – గిరిజన స్త్రీ – లైంగిక వేధింపులు

– బానోతు కృష్ణ, తెలుగు అధ్యాపకులు, అశోక్‌నగర్ సైనిక్ స్కూల్, నర్సంపేట, జి॥ వరంగల్ (రూరల్), తెలంగాణ.

జానపద సాహిత్యానికి ఎంతో పూర్వవైభవం ఉంది. జానపదం అనగానే పల్లె వాతావరణం, జానపదులు అనగానే ఆ పల్లె వాతావరణంలో నివసించే జనాలు అని అర్థం. మానవుడు పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు అతని విధి విధానం మొత్తం జానపద సాహిత్యం కిందకు వస్తుంది. జానపద సాహిత్యం ఒక సమూహానికి (గుంపు) సంబంధించిన అమూల్యమైన ధనరాశిగా చెప్పవచ్చు. జానపద సాహిత్యం ఎప్పటికీ తరగని సంపద. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి, ఒక సమూహం నుండి మరొక సమూహానికి, ఒకరి నోటినుండి మరొక నోటికి నిరంతరం సాగే ప్రవాహిని జానపద సాహిత్యం.

జనపదం అనగా పల్లెటూరు అని అర్థం. జనపదంలో నివసించేవారు జానపదులు. జానపద విజ్ఞానమును Folklore. జానపద సాహిత్యాన్ని Folk literature అని అంటారు. జానపదులు అనగా మోటువారు, పల్లెటూరి వారు, అనాగరికులు, పామరులు, అజ్ఞానులు అని డా॥ బిరుదురాజు రామరాజుగారు వివరించారు. Folk literature, Folklore, Folk songs అను మాటలకు జానపద సాహిత్యం (లేదా) జానపద సారస్వతం, జానపద విజ్ఞానం, జానపద గేయాలు అను మాటలు వాడుట పరిపాటి. చాలామంది జానపద సాహిత్యమునకు, జానపద విజ్ఞానమునకు భేదము ఉందని వివరిస్తూ ఉంటారు. Folklore అను మాటను W.J.Thomas క్రీ.శ.1846లో వాడటం జరిగింది.

జానపద సాహిత్యం, జానపద విజ్ఞానంలో ఒక బాగం. మిగతావి జానపద సాహిత్యంలో తెలుగునాట ప్రచారంలో పాటలు, కథాగానాలు, పురాణగాథలు, స్థలపురాణాలు, కుల పురాణాలు, కథలు, సామెతలు, పొడుపుకథలు, కళారూపాలు, ఆచారాలు, జాతరలు, ఉత్సవాలు, వంటలు, ఊరు, ఇళ్ళు ఆవాసయోగ్యం, అలంకరణలు, ఆభరణాలు, నిల్వ చేసుకునే పద్ధతులు లాంటి బహు ముఖ రూపాలలో జానపద రూపాలలో కనబడుతుంది. జానపద సాహిత్యాన్ని పెక్కుమంది పెక్కు విధాలుగా తమతమ అభిరుచులకు అనుగుణంగా, తమదైన శైలిలో విశేషంగా కృషి చేయడం జరిగింది. వారిలో పండితులు, కవులు, ప్రజలు, పరిశోధకులు, ఉద్యోగులు మరియు జానపద సాహిత్య ప్రేమికులు ముఖ్యులు. వీరు తమకు లభించిన సమాచారం ప్రకారం జానపద సాహిత్యాన్ని ప్రచార, లిఖిత రూపాలలో భద్రపర్చారు.

గిరిజనస్త్రీ – లైంగిక వేధింపులు :

గిరిజనులపై జరిగే లైంగిక వేధింపులు ఆర్థిక సమస్యలతో ముడిపడి ఉంటాయి. గిరిజనులు ఆర్థికంగా సమాజంలో బాగా వెనకబడి ఉంటారు. అందువల్ల పనులు చేయడానికి పట్టణప్రాంతాలకు వెళ్ళడం ఒక కోణమైతే, ఆర్థికంగా వెనకబడి ఉంటారు కాబట్టి అధికారులకు దాసోహంగా ఉండడం మరొక కారణం. గిరిజనులు ఆర్థికంగా బలంగా ఉంటే వాళ్ళు అధికార్ల మాటలు వినరుకదా! ఒక రకంగా గిరిజనులను ఆర్థికంగా ఎదగకుండా అడ్డువడుతుంది గిరిజనుల నుండి ఆశిస్తున్నవారే. అంటే సమాజం మొత్తం ఆర్థిక కోణంలో నడుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

"ఎల్లి" నవలలో ఆ వూళ్ళో పోకిరీ కుర్రోళ్ళు బాజిని చూసి యీలలెయ్యటం కన్నుగీటటం చేస్తూనే ఉన్నారు. బాజి తనను కానట్టు మెదలకుండా వూరుకుంది. అసలే వాళ్ళు ఆస్తికి, కులానికి పెద్దోళ్ళు. ఆ సంగతి బాజి యెప్పుడూ తల్లికి కూడా చెప్పలేదు. ఆ కుర్రోళ్ళల్లో వొకడు బాజికి బాగా దగ్గరికి వచ్చి తెలిసికూడా నీ పేరేంటి పిల్లా అన్నాడు. వొస్తే డబ్బులిస్తాం... వొద్దు అంది యెలాగో గొంతు పెగుల్చుకుని. వొద్దా. పోన్లే వూరికే రా అని భుజం పట్టుకున్నారు యిద్దరూ. నేను రాను నన్ను వొదలండి

అని గింజుకుంది. యేమిట్రా ఆలస్యం అన్నాడు అందులో వొకడు ఆత్రపడిపోతూ. బాజి యెంత గింజుకున్న వొదల్లేదు. భయంతో అరిచినా ఆ చుట్టు పక్కల వినే వాళ్ళు యెవరూ లేరు. బంగారం లాంటి పిల్ల బ్రతుకు నట్టేట్లో ముంచారు సచ్చినోళ్ళు అంది వో తల్లి. రాజ్యం వాళ్ళది మనమేం చెయ్యగలం అంది నాగమ్మ వుస్సురని. మరునటి రోజు సందేలకి చిన్న కుక్కి మంచంలో వొక శవాన్ని తీసుకొచ్చారు సుబ్బన్న గుడిసెకి. అలా కాలవలో పడిన బాజి శవం గుండారుగుడెం లాకులకు పట్టింది.

బాజి చేసుకున్న పాపం ఏమిటి? అని ఆలోచిస్తే ఒంటరిగా చిగురుకు వెళ్ళడమే తప్పు అనిపిస్తోంది. ఎరుకుల కులంలో పుట్టిన బాజి జీవితాన్ని చిగురిస్తున్న చిగురాకులా మొలకల్లోనే తెంపేసినట్టు నాశనం చేశారు. వసంతం లాగా ఎదుగుతున్న తరుణంలో, తెలిసీ తెలియని వయస్సులో లైంగికంగా హింసించి కోల్కోకుండా చేసి, చివరికి పిచ్చిదై, కాలువలో మరణించిన బాజి కథ చదివిన ప్రతివాడికి గుండె పగిలినట్టవుతుంది. అలా కావడానికి కారణమైన గిరిజనేతర యువకులను ఏం చేస్తే బాగుంటుంది? పగటిపూట గిరిజన స్త్రీ ఒంటరిగా తిరిగితేనే బాజిలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. గాంధీగారు చెప్పినట్టు ఏ అర్ధరాత్రో ఒంటరిగా తిరిగితే, ఆ సన్నివేశం చూద్దామన్నా గిరిజన గూడెంలో కనిపించదు.

'ఎల్లి' నవలలో మేము నల్గొండ జిల్లా నుంచి వచ్చినం అని కళ్ళు తుడుచుకుని విషయం చెప్పింది. ఆమెకి వొక కూతురుంది. వాళ్ళిక్కడికి రాబోయే ముందు పెద్దదైంది. పెళ్ళైన పిల్లె. యింకా కాపురానికి పంపలా యీ యేడాది చెరుక్కొట్టుడయిపోయినాక. కాసిని రాళ్ళు యెనకేసి సారెగాని అత్తోరింటికి పంపుదామనుకున్నారు. యిక్కడ చెరుకు కొడుతూ వుండగా యెట్టా మోసం చేశాడో ఆ పాలం ఆసామి కొడుకు ఆ అమ్మాయిని లొంగదీసుకున్నాడు. వీళ్ళకి తెలియనే తెలియదు. చీటికి మాటికి పిల్చి ఆపని యీపని చేయించుకుంటూ వుండేవాడు. చిన్నపిల్ల అని పనులు చెపుతున్నాడేమో అనుకుని బేఫరవాగా వున్నారు. ఆకరికి కొంపమునిగింది. యిప్పుడా పిల్లకి మూడు నెలల కడుపు. యెవరంటే దొర కొడుకని చెప్పింది. యింకేం చేస్తారు వాళ్ళు. యెవరని అడిగితే యేమొస్తుంది."

సాధారణంగా యజమాని లక్షణాలేంటి? తన క్రింద తరగతుల చేత తన ఇంట్లో దాసిగా పని చేయించుకునేది మనం గమనిస్తుంటాం. ఆధునిక కాలంలో కేవలం కింది వర్గాలు మాత్రమే కాదు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ప్రతి కుటుంబం ఏదో ఒక పని చేయడానికి ముందుంటారు. లేకపోతే బతుకు బండి ముందుకు పోదు. అలాంటి పనిచేయించుకున్న లక్షనాలు కల్గిన యజమాని తానే మృగంగా ప్రవర్తిస్తే సామాన్యుని పరిస్థితి ఏమిటి? గిరిజన కుటుంబంతో వ్యవసాయ పనులు చేయించుకున్న దొర, దొర అనే ముసుగుతో దొర కొడుకు ప్రవర్తించిన విధానం వల్ల అమాయక గిరిజన స్త్రీ జీవితం బుగ్గిపాలైంది. లైంగిక దోపిడీకి గురైన కూతురి తల్లిచేత రచయిత్రి "యెవరంటే దొర కొడుకని చెప్పింది. యింకేం చేస్తారు వాళ్ళు. యెవరిని అడిగితే యేమొస్తుంది". ఎంత బాధను దిగమింగుకుంటుందో అర్థమవుతుంది. ఇలాంటప్పుడు గిరిజన స్త్రీ ఒంటరిగా ఎక్కడికి వెళ్ళగలదు? వెళ్ళలేదు.

'అడవి' నవలలో అటువంటి చూపు పక్కకు తిప్పారు. తల్లి పక్కన బిడ్డ కనిపించింది. వయసు పధ్నాలుగేళ్ళు. ఇంకా పెద్దమనిషి కాలేదు. పేరు మోతి. మోతి నిజంగా ముత్యంలా ఉంది. అడవిలో పూసిన దిరిశెన పూవులాగుంది. తేనెలో ముంచిన ఇప్పపువ్వులా ఉంది. మోతి భయం భయంగా సేరేదార్ వైపు చూసింది. కళ్ళను కప్పేస్తున్న జులపాలు, పాములనే కరిచి చంపే గద్దలాంటి ముక్కు, సారాకంపు, అన్నిటికీ మించి వాళ్ళ అయ్య రక్తంతో తడిసిన బూటు కాళ్ళు. భయం భయంగా చూస్తున్న మోతి చేయిని చటుక్కున అందుకున్నాడు సేరేదార్. గారగార ఈడ్చుకుంటూ పంతులు పట్వారి దివాన్ ఖానా లోకి ఈడ్చుకు పోయాడు. అది చూసి నలుగురు కొలాములు ధైర్యంతో ముందుకొచ్చారు. సేరేదార్ లోపలి నుండి గది తలుపు మూసుకున్నాడు.

కొలాములు బలంగా తలుపులు తడుతున్నారు. ఉండీ ఉండీ తలుపులు ఒక్కసారిగా తెరుచుకున్నాయి. తెరుచుకున్న తలుపుల్లోంచి ముందు తుపాకి గొట్టం తర్వాత సేరేదార్ బయటకొచ్చాడు. లమ్డికొడుకుల్లారా... మామీదికే లేస్తారా. బగావత్ చేస్తారా. పిట్టలను కాల్చినట్టు కాల్చి సంపుత. ఏమనుకుంటున్నారో... తెల్సిందా! అంటూ తుపాకి చౌకిదార్‌కు ఇచ్చి... ఎవ్వడు ముందుకొచ్చినా కాల్సిపారేయ్ ముందు. వాళ్ల సంగతి మల్ల జూసుకుందాం. అంటూ లోపలకు దూరి తలుపులేసుకున్నాడు. అర్ధరాత్రి వరకు అలా కళ్ళు నిలేసి ఆ గదివైపు అలా చూస్తూనే ఉన్నారు. అప్పుడు మెల్లగా తలుపులు తెరుచుకున్నాయి.

మోతి తూలుతు బయటకొచ్చింది. వెంటనే చౌకీదార్ తన బాధ్యత జవానుకు అప్పజెప్పి తను మోతీని తీసుకొని పక్కగదిలోకి దూరాడు. ఒకరి తరువాత ఒకరు... ముందు సేరేదార్ తర్వాత చౌకీదార్, మళ్ళీ జవాను, మళ్ళీ ఇంకో జవాను... ఒకరి తర్వాత ఒకరు తుపాకి తూటాను కొలాముల గుండెలకు గురిపెట్టి ఆ ముత్యంతో ఆడుకున్నాడు. చూస్తుండగానే తెల్లవారిపోయింది. అటు ఈ ముత్యం నల్లబడిపోయింది. ఇటు చౌకీదార్ వెంట గదిలోకి వెళ్ళిన మోతి మళ్ళీ లేచి నిలబడలేదు. ఇంకా సేరేదార్ లేవలేదు. అప్పటికే మోతీ ప్రాణం పోయింది.

పన్ను వసూలుకు వచ్చి, నచ్చిన తిండి తిని, నచ్చిన గిరిజన స్త్రీని అపహరించడమే అధికారులకు ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతా? అందుకే కాబోలు గిరిజన స్త్రీలు ఇంతగా లైంగికంగా గురికావడం బహుశా ప్రాచీనకాలం, రాజుల కాలంలో కూడా లేకపోలేదు. మోతి ఇంకా పెద్దమనిషి కాలేని గిరిజన అమ్మాయి. ఆమెను సేరేదార్, చౌకీదార్, చివరికి జవాను కూడా ఆమెను అనుభవించి పువ్వును రాల్చినట్టు మోతి జీవితంతో ఆడుకున్నారు. అందుకే గిరిజనులు అడవిలో క్రూరమృగాలన్నా భయపడరేమో కానీ, ప్రభుత్వ అధికారులంటే, గిరిజనేతరులంటే ఆ జంతువుల కంటే ఎక్కువ భయపడ్తారు.

అధికార్లు గిరిజనులకు హైమన్‌డార్ఫ్ కంటే ఎక్కువ పరిచయమే. కానీ అతడు గిరిజనులకు సేవ చేయడానికి వచ్చాడు. ఆ అధికారులు అతనికంటే ఎక్కువ సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఆ ప్రాంతాలకు నియమించింది ప్రభుత్వం. వాళ్ళు చేస్తున్న సేవ అందమైన గిరిజన స్త్రీలను చేరదీయడం. అందుకే అధికార్లు అంటే గిరిజనులకు భయం. గిరిజన స్త్రీ కొంత చదువుకుంటే కూడా లైంగిక బాధలు తప్పడం లేదు. మార్పు మంచిదే అని పెద్దలన్నారు కానీ, ఆ మార్పు గిరిజనులపట్ల యమపాశాలుగా మారుతుందని 'సరిహద్దు' నవల తెలుపుతుంది. ముందే చెప్పుకున్నట్టు గిరిజనులు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఇటువంటి వాటిని నివారించడం సాధ్యమవుతుంది. "అప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్టుగా ఉంటుంది.

పేదవాడిగా పుట్టడం మనిషి చేసుకున్న పాపం కాదు. అలా అని ధనవంతుడుగా పుట్టడం మనిషి చేసుకున్న అదృష్టం కాదు. అవన్నీ కాలక్రమంలో కనుమరుగై పోతాయి. ఒక్కొక్కసారి పేదవాడే ధనవంతుడుగా మారడం ప్రకృతి భేదం లేనిదాన్ని నిరూపిస్తుంది. కాబట్టి గిరిజనులు డబ్బులు లేక ఉన్నవాడి దగ్గర అప్పు తీసుకోవడమే గిరిజనులు చేసుకుంటున్న పాపం. దానివల్ల గిరిజన స్త్రీలు శీలాన్నే అమ్ముకొనే పరిస్థితి వస్తుందని వారికి తెలియదు. ఈ నవలలో వడ్డీ వ్యాపారి అప్పులుగా డబ్బులిచ్చి, సమయానికి గిరిజనులు చెల్లించలేరనీ తెలిసే, గిరిజనులను మానసికంగా హింస పెట్టడం, చివరికి గిరిజన స్త్రీలను అపహరించడం జరుగుతుందని రచయిత గిరిజన పార్శ్వాలను బయటికి తీసాడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. మోహన్.జి.యస్. 2001 - జానపద విజ్ఞానాధ్యయనం
2. బిరుదురాజు రామరాజు 1978 - తెలుగు జానపదగేయ సాహిత్యము
3. అరుణ 2001 - ఎల్లి. న్యూ సిలబస్ ప్రచురణలు
4. దేశ్‌పాండే, వసంతరావ్ 1988 - అడవి చతురప్రచురణలు.

వివిధ జాంబ పురాణాలలో అరుంధతి – వశిష్ఠుల పెండ్లి వృత్తాంతం – పరిశీలన

– నోముల సుమలత

ఒక సమాజ జీవన విధానం జానపద విజ్ఞానంలో ప్రస్ఫుటంగా కనబడుతుంది. అది జాతి/సమూహం/ప్రాంతం ఏదైనా కావచ్చు. దానికి సంబంధించిన ఒక అమూల్య సంపద. సుమారు వందల యేళ్ళుగా పది శాతం ప్రజలు మాత్రమే చదువుకున్న వారి శిష్ట సాహిత్య పురాణాలున్నాయి. మిగతా తొంభై శాతం ప్రజలు నిరక్షరాస్యులు అయినా వారు సృష్టించుకున్న జానపదాలు, కుల పురాణాలు వర్ణించి, వళ్లెవేసిన తీరును చూస్తే వారు విజ్ఞాన ఖనిలే. పల్లెల సంస్కృతి,సాహిత్య రూపమంతా కులపురాణాలే. ఇవి శిష్ట పురాణాలకు ధీటుగా పోటి చేశాయనవచ్చును. అంతేగాక కుల పురాణాల ద్వారానే జానపదులు సమాజ సమానతలు, అభ్యుదయమును పొందారు. ముఖ్యంగా దళితులు, తాము సృష్టించుకున్న జాంబ పురాణంతో సమస్త సృష్టిలో మేము భాగస్తులమే. మేము సర్వ జనులకు సమానమే. నేడు కులాల-వర్గాల పేర్లతో వక్రీకరించిన వారందరు మా సంతానమే అని చెబుతుంది. అందులో భాగంగానే ఈ అరుంధతి-వశిష్ఠుల కళ్యాణం.

ఈ అనంత విశ్వంలో అనాదిగా అనచవేయబడి ఆర్థిక, సామాజిక సమానతలే కాక వీరి విద్య అభివృద్ధిలను కూడా ఓర్వక తొక్కి వేయబడిన వర్ణమేదో అందరికి తెలిసినదే. భూమాత సాక్షిగా ఈ అవనిపైనా నేటికీ ఒక జాతి మరొక జాతిని తొక్కిపడుతూనే ఉంది. అందులో మగ - ఆడ తేడా లేదు. ఈ ఆధునాతన నాగరికపు ప్రపంచంలో దళిత స్త్రీలకు విలువలు ఏ మాత్రము ఉన్నాయో తెలుస్తూనే ఉంది. ఇది ఈ నాటివి కాదు మను శాస్త్రం నుండి నేటి మన కలియుగం వరకు స్త్రీలను గడ్డి పోచలా తీసేయడం జరుగుతూనే ఉంది. కాగా పురాణాల కాలం నుండి ఇప్పటి వరకు దళిత స్త్రీలను అగ్రవర్ణాలు ప్రేమ పేరుతో, పెండ్లి పేరుతో వంచన చేస్తూనే వస్తున్నారు. ఇలా అగ్రవర్ణాల ప్రేమ వలలో పడి ఎందరో కాలగర్భంలో కలిసి పోయారు. కొందరు మాత్రం కుల వ్యత్యాసాలనే గబ్బిలాల మత్తులను, అగ్రజాతులనే అహంకార రాక్షసులను, కొన మొదలు లేని బూజు సంప్రదాయాలను ఎదిరించి గెలిచిన ఆదర్శ మాతృమూర్తులున్నారు. హిందువులమని చెప్పుకునే సంప్రదాయాలకు, వారి నూతన దంపతులకు ఒక స్త్రీ ఆదర్శనీయురాలైనది. ఆమె ఎవరో కాదు అగ్రవర్ణాలు కడకు గొట్టి అస్పృశ్యులుగా వెలివేసిన దళిత వాడల ముద్దుబిడ్డ అరుంధతి. ఈమే సమస్త మానవాళికి ఆరని జ్యోతి. దళిత వాడలో పుట్టి దళితుల ఆత్మగౌరవాన్ని ఆకాశంలో నిలిపిన తారకేతనమే అరుంధతి. మన దళితుల ఆడ జాతికి జ్యోతియే అరుంధతి. ఆమెను గురించి గానీ, ఆమె వివాహం ఒక బ్రాహ్మణ పురుషునితో జరిగిన వృత్తాంతాలు గానీ అటు శిష్ట సాహిత్యంలోని పురాణాలు, ఇటు జానపద సాహిత్యంలోని పురాణాలు గొప్పగా శ్లాగించాయి. జానపద పురాణాలలో ప్రముఖమైనవి కుల పురాణాలు దర్శనమిస్తాయి. చరిత్రకారులు చెప్పినట్లుగా మానవులంతా కోతి నుండి పుట్టిన వారలే. చేసే పనులనే వృత్తులుగా, ఆ వృత్తులే కులాలుగా మారాయని చెబుతుంటే ఈ సంఘంలో ఇంకా అనేక రూపాలలో అసమానతలు కనిపిస్తున్నాయి.

ఏదేమైనా పురాణాలలో వశిష్ఠ-అరుంధతి కళ్యాణం ఆదర్శనీయంగా ప్రకటించారు. ఆచార్య జయధీర్

తిరుమల రావు గారు దళితులదైన డక్కలి జాంబ పురాణంను మౌఖికంగా సేకరించి "అడుగు వర్గపు పౌరాణిక సాహిత్యం", అని ముద్దాడి దానిని డక్కలి జాంబ పురాణం అనే పేరుతో పుస్తకం తీసుకొచ్చారు. ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు మాదిగల ఆశ్రితులు అయిన నులుక చందయ్యల, గోసంగి జాంబ పురాణంను, మౌఖికంగా సేకరించి "జాంబ పురాణం విజ్ఞాన ఖని"[3] అని మురిసిపోయి పుస్తకంగా తీసుకొచ్చారు. ఇక మచ్చయ్య దాసు విరచితమైన చిందు జాంబ పురాణంను యువ పురస్కార అవార్డు గ్రహీతుడైన డాక్టర్ గడ్డం మోహన్‌రావు పుస్తకంగా తీసుకొచ్చారు. పై మూడు జాంబ పురాణాలలో జాంబవంతుడే సృష్టి ఆది పురుషుడని, అతని ద్వారానే ఈ సమస్త సృష్టి సంతానం ఏర్పడిందని తెలుపు తున్నాయి. ముఖ్యంగా బ్రాహ్మణుడైన వశిష్ఠుడు, దళిత కన్యయైన అరుంధితికి వివాహం ఎలా జరిగింది అనే వివరణ ఈ పురాణాల్లో ఉన్నాయి.

నులుక చందయ్యల జాంబ పురాణంలో అరుంధతి - వశిష్ఠుల ఆదర్శ పెండ్లి :

నులుక చందయ్యలు మాదిగ కులాన్ని ఆశ్రయించి, మాదిగల్లో కుల గురువులుగా బోధ చేస్తూ అనాదిగా జీవిస్తున్నారు. దానిలో భాగంగా వీరు మాదిగలకు వారి కుల మూల పురుషుడైన జాంబవంతుని పురాణంను ప్రవచనం రూపంలో బోధన చేస్తారు. ఆ పురాణంలో భాగంగా బ్రాహ్మణుడైన వశిష్ఠుడు జాంబవంతుని (మాదిగ) మనవరాలును వివాహం చేసుకుందని ఉంది. ఈ పురాణం ప్రకారం జాంబవంతుని మనవడైన మాతాం గునికి, బ్రహ్మలోక బ్రాహ్మణ కన్యయైన శ్యామలాదేవికి అరుంధతి పుట్టింది. అలాగే వశిష్ఠుడు దేవవేశ్యయైన ఊర్వశికి, బ్రహ్మలోక బ్రహ్మకి జన్మిస్తాడు. ఇక్కడ తల్లి మాత్రం బ్రహ్మలోక వెలయాలు, నాట్యగత్తె అయినప్పటికీ తన కొడుకు వశిష్ఠుడు మాత్రం బ్రహ్మజ్ఞానం కల్గి, కుల, జాత్యాంతరాలు (అనాడు లేవు) చూడని వాడు. అతడు ఎదుటి వారి గుణ, విద్య, వివేకాలను మాత్రమే గ్రహించి ప్రాధాన్యతను ఇచ్చేడి వాడు.

జాంబవంతుడు లోక కళ్యాణం కోసం కన్న కొడుకునే చంపుకుని అతని అవయవాలనే పనిముట్లుగా మార్చిచ్చిన త్యాగశీలి. అతని మనవరాలు (అరుంధతి) తన జాతికి, తన వ్యక్తిత్వానికి విలువలు కల్గించే గొప్ప మనసు, ప్రాతివత్యం విలువలు గల స్త్రీ. వశిష్ఠుడు ఆరుగురు చక్రవర్తులకు, యాభైయార్గురు రాజులకు గురువైన వాడు కనుక ఇతడు పెండ్లి చేసుకుంటేనే వారంతా చేసుకుంటా రని అనుకొని భార్యను వెతుకుతూ బయలు దేరాడు. అయితే తనకు కావాల్సిన భార్య గొప్ప సత్ప్రవర్తన కలిగి నదై, పరులను మనసున తలువనిదై, తన నిష్టగరిష్ట శక్తి చేత నీనిచ్చే రాళ్ళు, ఇసుకలను ఆహార పదార్థాలుగా మార్చి వంట వండివ్వాలని అనుకొంటాడు. అలాంటి అమ్మాయి కోసం చాలా దేశాలలో ప్రయత్నించి విఫలుడై చివరగా జంబళగిరిపట్నంలో అరుంధతికి ఆ రాళ్ళు ఇసుక ఇచ్చి పరిక్షించాడు. అప్పుడు అరుంధతి తన ప్రాతివ్రత్యం చేత వాటిని వంటలుగా మార్చింది. అది చూసిన వశిష్ఠుడు సంతోషించి నన్ను నీవు పెండ్లి చేసుకోవాలని అరుంధతిని బతిమాలాడాడు. అందుకు అరుంధతి ఒప్పుకోదు. చివరికి వశిష్ఠుడు జాంబవంతుడిని బతిమాలి అతని అనుమతితో పెండ్లి చేసుకుంటాడు. వీరి వివాహాన్ని అంగీకరించని ఆర్య బ్రాహ్మణులు అరుంధతిని, ఆమె వంశాన్ని నింది స్తుంటే నిప్పులాంటి అరుంధతి ఒక్కసారిగా మండిపడింది. ఒకేసారి మెరుపు వేగంతో ఆకాశంలోకి చేరి అగ్ని జ్వాలలు కురిపించింది. ఆమె పతిభక్తిని, శక్తిని చూసిన సుర, ఆర్య బ్రాహ్మణులంతా ఆమెను శరణువేడినారు. ఆ తర్వాత అమ్మా! మీరు గొప్ప గుణం, ప్రాతివ్రత్యం గల వారు కనుక ఇక మీదట నీవు ఈ ఆకాశంలో నక్షత్రంగా ఉండి దేవ-మానవాదులకు, నవ దంపతులకు ఆదర్శమూర్తివి అవ్వాలి అని వారంతా వేడుకొనగా అందుకు అంగీ కరించిన అరుంధతి అప్పటి నుండి సమస్తులను ఆ ఆకాశం నుండే ఆశీర్వదిస్తున్నది. ఇటు మరల తన భర్తతో కాపురం చేస్తుందని ఈ జాంబ పురాణంలో ఉంది.

డక్కలి జాంబ పురాణంలో అరుంధతి-వశిష్ఠుల ఆదర్శ పెండ్లి :

ఈ డక్కలి జాంబ పురాణంను డక్కలివారు పటం సహాయంతో ప్రదర్శిస్తారు. వీరు తమ దాతృకులమైన మాదిగల మూల పురుషుడైన జాంబవంతుని వృత్తాంతంతో పాటు సృష్టి ఆది నుండి నేటి వరకు జరిగిన సంగతులన్ని ఇందులో తెలుపుతారు.

జాంబవంతుని మనవడైన మాతాంగునికి, శ్వాపతి అనే స్త్రీకి పుట్టిన ఆడబిడ్డే అరుంధతి. వీరిది మాటాంగపురి పట్నం. ఇక జాంబవంతునికి ఒక వేశ్య వల్ల పుట్టిన కూతురే ఊర్వశి అనిఉంది. కాగా ఈ ఊర్వశిని బ్రాహ్మణుడైన పరాశరుడు ప్రేమించడం చేత వశిష్ఠుడు జన్మించాడు. ఇక్కడ ఊర్వశి బ్రహ్మలోక నాట్యగత్తె, వేశ్యస్త్రీ, బ్రహ్మకు సోదరిగా, జాంబవంతునికి జాంబవంతునికి కూతురుగా ఉంది. ఈమె కొడుకు వశిష్ఠుడేమో అమే తల్లితో జన్మ సంబంధం తప్ప ఇతర గుణాలు లేవు. అతడు గొప్ప జ్ఞానం కలిగి, జాత్యాహంకారం లేని వాడుగా ఉంటాడు.

అరుంధతి జాంబవంతుని మనవరాలు కనుక జాంబవంతుని లాగానే జాతి, వ్యక్తిగత ప్రాతివ్రత్యం విలువలు నేర్చుకుంది. ఇక జాంబవంతుడేమో లోకం కోసం కన్న కొడుకునే చంపుకుని విశ్వకర్మలకు పనిముట్లుగా మార్చి ఇచ్చిన గొప్ప త్యాగశీలి. ఇక వశిష్ఠుడు పైన (నులుక చందయ్యల) జాంబ పురాణంలో తెలిపినట్లే దీనిలో కూడా ఇసుక రాళ్ళతో భోజనాలు వండమని వేడుకొని, పరిక్షించి పెండ్లి చేసుకుంటాడు. ఆ తర్వాత ఆమె నక్షత్రంగా మారి అందరికి ఆదర్శ స్త్రీమూర్తిగా ఉంటుంది.

చిందు జాంబ పురాణంలో అరుంధతి వశిష్ఠుల ఆదర్శ వివాహం :

చిందువారు కూడా జాంబ పురాణంను మాదిగలను ఆశ్రయించి యక్షగాన రూపంలో ప్రదర్శిస్తారు. ఈ పురాణంలో అరుంధతి జాంబవంతుని మనవరాలు అని మాత్రమే ఉంది. ఒక వశిష్ఠుడు వేశ్యయైన ఊర్వశికి, బ్రహ్మదేవునికి పుట్టినోడే. వశిష్ఠుని తల్లి బ్రహ్మలోక నాట్యకగత్తె, వేశ్య స్త్రీ, బ్రహ్మ సోదరి, జాంబవంతుని కూతురు అని ఉంది. వశిష్ఠుడు గొప్ప విద్య, గుణ సంపదలుగా కలిగి జాంతి అహంకారం లేని వాడు. అరుంధతియే గొప్ప భక్తి, శక్తి, ప్రాతివ్రత్యం కలిగిన సుగుణ రాశిగాఉంటుంది. తాత జాంబవంతుడేమో గొప్ప త్యాగశీలి. ఇక పై పురాణాలు చెప్పినట్లుగానే వశిష్ఠుడు అరుంధతిని పరిక్షించి, బ్రతిమాలి పెండ్లి చేసుకుంటాడని ఉంది. వీరి పెండ్లి వృత్తాంతాలను బట్టి ఆనాటి కాలంలో కుల-వర్గాలతో పాటు సమాజ అసమానతలు, అస్పృశ్యతలు లేవు. వివాహాలతో కూడా తారతమ్యాలు లేవు. నేడు సమాజంలోని అసమానతలకు కారకులు శిష్ట పురాణాలు, అగ్రవర్ణాలని చెప్పుకునేటోళ్ల వారి పనే.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆచార్య పులికొండ సుబ్బాచారి-కొలనుపాక నులక చందయ్యల ఆది జాంబవ మహా పురాణం
2. ఆచార్య జయధీర్ తిరుమలరావు-డక్కలి జాంబ పురాణం
3. డాక్టర్ గడ్డం మోహన్‌రావు-చిందు జాంబవ పురాణం
4. మన పల్లెటూళ్ల పాటలు, అమ్మాపురం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొ.శ్రీ.తె.వి.వి. వరంగల్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

మడకశిర సరిహద్దు ప్రాంతం యక్షగాన బయలాట – రంగభూమి కళా సాంప్రదాయం

– డా॥. సి. శివన్న, మడకశిర.

అనంతపురం జిల్లా మడకశిర తాలూకా అనంతపురమునకు దక్షిణభాగంలో, కర్నాటక ప్రాంతంలోనికి చొచ్చుకొని పోయినది. మడకశిరకు తూర్పున హిందూపురం తాలూకా (ఆంధ్ర) పడమర హిరియూరు, శిర తాలూకాలు, ఉత్తరాన పావగడ తాలూకా, దక్షిణాన మధుగిరి తాలూకా (కర్నాటక)లు వున్నవి. నైసర్గికంగా ఉత్తరాన పావగడ, నిడిగల్లు కొండలు, పడమర సర్వముఖి నది, దక్షిణాన మధుగిరి కొండ, తూర్పున పెన్నా నదులు ఉన్నాయి.

మడకశిర ప్రాంతంలో తొంభైశాతం కన్నడ భాషను, పదిశాతం మంది తెలుగును మాట్లాడుతారు. ఆంధ్ర ప్రాంతమైనప్పటికీ కన్నడ భాషను ఎక్కువగా మాట్లాడుతారు. తెలుగు భాషపై కన్నడ ప్రభావం ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుంది. రెండు భాషలు మాట్లాడటం వల్ల మూడవ భాష (తెలుగన్నడ) ఉత్పన్నమయ్యే అవకాశం వుంది.

ఈ ప్రాంతంలోని జానపద ప్రదర్శన కళలపైన కూడా ఈ భాష ప్రభావం వుంది. జానపద ప్రదర్శన కళలన్నిటికీ అతి ప్రాచీనమైన జానపద ప్రదర్శన కళ యక్షగానం. యక్ష జాతులు దేవుని ఆరాధన కోసం చేసే గానం యక్షగానం. ఇది పూర్తిగా ద్రవిడ కళ. ద్రావిడ భాషలైన తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం భాషలలో కూడా ఈ యక్ష గానం ఉన్నది. నేటికీ మడకశిర ప్రాంతంలో యక్షగానం ప్రదర్శించబడుతున్నది. ఇది రెండు రకాలు. ఒకటి గానరూప, రెండు ప్రదర్శన రూపం. ప్రదర్శన రూపంలో గానము, ప్రదర్శన రెండూ వుంటాయి.

యక్షగానాన్ని బయలు ప్రదేశంలో ప్రదర్శించడం వల్ల దీనిని బయలు నాటకం అని, వీధి నాటకాలని అంటారు. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు, కడపలాంటి ప్రాంతంలో చిందు అనే జాతివారు ఈ కళను ఎక్కువగా ప్రదర్శించడం వల్ల చిందు భాగవతమని పిలుస్తున్నారు. ఈ ప్రదర్శనను నేటికి ఎక్కువగా మాదిగజాతివారే ప్రదర్శిస్తూ ఉన్నారు. బహుశా! ఆనాటి యక్షజాతివారే నేడు మాదిగలై వుండవచ్చు. మన ఆంధ్రప్రదేశ్ జక్కుల జాతి వారు నివసించి ప్రదర్శించిన గానం యక్షగానం అని పరిశోధకులు నిరూపణ చేసినారు. అనంతపురం జిల్లాలో దీనికి నిదర్శనాలు ఉన్నాయి. జక్కుల చెఱువు గ్రామం (గుత్తి తాలూకా), జక్కులూరు కట్ట (మడకశిర మండలం), జక్కేపల్లి (మడకశిర మండలం) వీటికి నిదర్శనాలు.

మడకశిర ప్రాంతంలో నేటి ఈ యక్షగాన బయలాటను ప్రదర్శిస్తూ తమయొక్క ప్రాచీన వారసత్వాన్ని నిలుపుతున్నారు. మడకశిర తాలూకాలోని యక్షగాన బయలాటలన్నియూ తెలుగు, కన్నడ భాషల్లో ప్రదర్శిస్తూ వుంటారు. ఇక్కడి యక్షగాన బయలాట కళా సంప్రదాయాలు రెండు విధాలుగా పెరుగుతూ వచ్చినవి. వేషభూషణాలను ధరించి నృత్యంతో కూడి రంగమంటపంలో అభినయించడం బయలాట లేక ఆట అనేది ఒకటి. వేష భూషణాలు లేకుండానే భగవంతుని పాటల కనుగుణంగా పాత్రలు నడిపించే ఆశు భాషణల సంవాదం తాళం, మృదంగం లేదా మద్దెల ఇంకొకటి. ఇది ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నడుస్తుంది. రాత్రి నుండి తెల్లవారుఝాము వరకు

వివిధ ఆఖ్యానాలను తన్మయత్వం నొందిస్తారు. తాళమద్దెలను అర్థం చేసుకొన్న వాళ్ళ నుండే ప్రసంగానికి ఎక్కువ రసానుభూతిని కలిగిస్తుంది.

యక్షగాన బయలాటలకు చతుర్ముఖ సౌందర్యం వుంటుంది. భగవంతుని పాటకు వంతపాడే వాళ్ళ రాగం, నాదం, తాళాల లయలుగాన గోష్ఠియై మృదంగ వాద్య నాదంతో సంవాద గోష్ఠియై పాత్రల రసాభినయం నృత్యం, నృత్యాలలో నర్తన గోష్ఠియై మాటల్లో భావస్ఫూర్తిని కలిగి ఆలోచించే విధంగా యక్షగాన బయలాటలు తన కళానైపుణ్య చతుర్ముఖాన్ని ప్రకటిస్తాయి. యక్షగాన బయలాటలు సామాన్యంగా ప్రఖ్యాతి పొందిన ఆఖ్యానాన్ని రాత్రి నుండి తెల్లవారు వరకు ప్రదర్శించే విధానం ప్రాచీన కాలం నుండి ఆచరణలో వుంది. ఇదే సంప్రదాయాన్ని ఇప్పటికీ మడకశిర ప్రాంతంలో కొనసాగుతూ వుండడం పెద్ద విశేషం. ఈ ప్రాంతంలో మూడు గంటల లోపల ప్రదర్శించే ఆఖ్యానాలు ఇప్పటికీ ఇక్కడ దొరకవు. అయితే కొన్ని ప్రాంతాలలో (మడకశిర ప్రాంతం తప్ప) మూడు గంటలలోపు ప్రదర్శించే ఆఖ్యానాలు తెలుగు, కన్నడంలో వచ్చినాయి. ఇక్కడి యక్షగాన బయలాట కళాకారులు ఎవరి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడి ప్రదర్శనలు ఇవ్వరు. వారంతకు వారే తలా స్వంత డబ్బులు వేసుకొని ప్రదర్శనలో పాల్గొంటారు. అప్పులు చేసి మరీ నాటకాలు ఆడుతున్న ప్రాంతం మడకశిర అని చెప్పకమానదు.

నాటక మండలివారు రంగమంటపంలో ప్రదర్శనకు రావడానికి ముందు ప్రసాదన మంటపంలో రంగులను వేసుకోవడానికి సంసిద్ధులౌతారు. మొదట సౌందర్యానికి అవసరమైన రంగులను, ఆయుధాలు, కిరీటాలు మొదలైన ప్రదర్శన ఆభరణాలను పెట్టల నుండి బయటికి తీసి గణపతి పూజ చేసిన తర్వాత పాత్రధారులు తమతమ ముఖవర్ణనలను ప్రత్యేక శిక్షణ పొందిన వ్యక్తితో రంగులను వేయించుకొని పాత్రధారులుగా సంసిద్ధులౌతారు. ఈ పాత్రధారులందరూ తాము ధరించే వేషభూషణాలు వాస్తవిక ప్రపంచానికి భిన్నంగా వుంటాయి. అందుచేత యక్షగాన బయలాటలలో సామాజిక కథాసన్నివేశానికి అవకాశముండదు. ఒక్క హాస్యగారుని పాత్రకు మాత్రం అన్నింటిలో దూరే అవకాశముంది. యక్షగాన, బయలాట కథావస్తువులు పౌరాణిక కథకు చెంది ఉంటాయి. సామాజిక మరియు ఐతిహాసిక ప్రసంగాల విశ్లేషణకు చెందిన నాటకాలు వున్నాయి. పౌరాణిక వస్తువు కూడ జీవన మూల భూత సమస్యకు చెందినది కాదు. దీనిలో కూడా చాలా నవీనతను చూడవచ్చు. యక్షగాన బయలాటలో ముఖ్యంగా ఆకర్షణీయమైనది పాత్రధారుల వేషభూషణాలు. ఇందులో జానపదుల సౌందర్య ప్రజ్ఞ, కల్పనా రమ్యత, వాస్తవికతకు భిన్నంగా యక్షలోకానికి మనలను తీసుకొనిపోయినట్లుగా వుంచడమే ఈ పాత్రల ప్రాముఖ్యత. ఇక్కడ ధరించే వేష భూషణాలు.

1. అతిమానవ వ్యక్తులు ధరించే వేషాలు 2. మానవులు, రాజులు వారు ధరించే దుస్తులు కిరీటాలు 3. రాక్షస పాత్రల వేషాలు, 4. ఋషులు, మునుల వర్గానికి చెందిన వేషాలు, 5. విధూషకుడు లేదా సారధి లేదా హనుమా నాయకుడు ధరించే వేషాలు, 6. స్త్రీ పాత్రధారులు ధరించే వేష-భూషణాలు, ఆభరణాలు.

ఇలా స్థూలంగ విభజించి చెప్పవచ్చు. దేవతల వేషాలలో శ్రీరాముడు, కృష్ణుడు, దేవేంద్రుడు, ఈశ్వర, బ్రహ్మ మొదలైన వాటిలో విశేషంగా కనబడేటటువంటివి మణిమకుట కిరీటాలు, మణులు, విద్యుత్ కాంతికి ఝగఝుజిసి మిరిమిట్లు గొలుపుతుంటాయి. రాజులలో కౌరవుడు, అర్జునుడు మొదలైన పాత్రలు వీరోచితమైన కిరీటాలు, భుజకీర్తులు కలిగి వుంటాయి.

మడకశిర తాలూకాలో వేషాలు అవి ధరించే వస్త్రాలు చూపరులను ఆకర్షించేటట్లు వుంటాయి. నృత్యానికి అనుగుణంగా వుండే వాటినే ధరిస్తారు, అలంకారానికి పసుపు తెలుపు రెండు కలిపి వాడుతారు. ఇది హళది రూపంలో వుంటుంది. తలకు రింగురింగులు కలిగిన విగ్గులను వాడుతారు. యదపై అనేక రకాలైన ఆభ

రణాలు, మెడలో హారాలు, మణిపూసలను వేస్తారు. చేతులకు ఆభరణాలు కట్టుతారు. వీపుభాగం కనబడకుండా భుజం నుండి క్రిందికి వేలాడే విధంగా ఒక శాలువాలాంటి రంగుబట్టను కడుతారు. ఇది నడకకు, నృత్యానికి గంభీరాన్ని సూచిస్తుంది.

మడకశిర ప్రాంతంలో ఎక్కువగా ఉత్తర కర్నాటక సంప్రదాయానికి చెందిన ఆభరణాలను, వేషభూషణాలను వాడుతారు. రాక్షస పాత్రల గురించి మనం ఆలోచిస్తే ముఖవర్ణనలోని వైవిధ్యాన్ని రంగురాయడంలో కనబడుతుంది. ఋషులు, మునులు కిరీటాన్ని ధరించకుండా కావి వస్త్రాలను ధరించి, రుద్రాక్షలను ధరించి చేతిలో కమండలం మరియు దండెన్ని పట్టుకొని వుంటారు. విధూషకుడు లేక సారధి పాత్రధారుడు చేతిలో కట్టె పట్టుకొని హాస్యానికి తగిన వేషాన్ని ధరిస్తాడు. స్త్రీ పాత్రలను సామాన్యంగా పురుషులే ధరిస్తారు.

శృంగార నాయకీలలాగే ఇతర స్త్రీ పాత్రల వైవిధ్యం యక్షగాన బయలాటలలో వున్నవి. ద్రౌపది, అంబ, సైరంధ్రి మొదలైన పాత్రలకు సరియైన వేషాధరణ స్త్రీ పాత్రలుగల విశిష్టత గొప్పగా కనబడుతుంది. స్త్రీ పాత్రలను 14 నుండి 17 సం॥లు గల మగపిల్లలే ఎక్కువగా ధరిస్తారు. కర్నాటకలో బడుగుతిట్టు, ఉత్తర కర్నాటక ప్రాంతంలో రంగమండపం సాంప్రదాయం ఒకే రకంగా వున్ననూ కొన్ని వ్యత్యాసాలు కనబడతాయి. మడకశిర ప్రాంతంలో అర్జునుని పాత్రకు కిరీటం వుంటుంది. ఇది ఉత్తర కర్నాటక సంప్రదాయం. బడుగు తిట్టు సంప్రదాయంలో కెతెకి అనే కిరీటాన్ని ధరిస్తారు. యదకు ఆభరణాలుంటాయి.

ముఖవర్ణన మరియు వేష భూషణాల నుండి పాత్రలు, వేషాలు సిద్ధమై తరువాత సభావందనం పాటను పాడి పాత్రలు రంగస్థలానికి వచ్చేటట్లు చేస్తారు. భాగవతుడు ప్రసాదన మందిరం నుండి ప్రార్థన చేసి, తిరిగి వచ్చి రంగమండపంలో గణపతి, గురుస్తుతి, శారద ఇతర దేవతా స్తుతిని శ్రీకారంతోనే మొదలుపెట్టి, తెరలోపల పూజానంతరం పాత్రధారులను ప్రదర్శనకు వచ్చేటట్లు చేస్తాడు.

మడకశిర ప్రాంతంలో ప్రాచీన కాలం నుండి మొదట సూత్రధారి, నటుల పాత్రలు వచ్చి వసంత కాలం గురించి పాట పాడుతూ నర్తించిన తరువాత విదూషకుడులు లేదా సారధి లేదా హనుమ నాయకుడు వచ్చి వారిని సభకు పరిచయం చేస్తాడు. ఇప్పుడిప్పుడే భాగవతుడే సారధిలా తానున్న స్థలం నుంచే పాత్రలను పరిచయం చేసే పద్ధతి అరుదుగా కనబడుతున్నది. నటి సూత్రధారుల తరువాత శారద లేదా బాలకృష్ణ పాత్రలు వచ్చి వాటిద్వారా తాను నటించే ప్రధానఘట్టం లేదా ఆడే నాటకం పేరును చెప్పి వెళ్ళిపోతారు.

భాగవతుడు ఈ ప్రాంతంలో చేతిలో తాళాన్ని ధరించి వుంటాడు. మొదట భాగవతుడు పాటలను పాడగా వాటిని వంతగాళ్ళు తరువాత పాడుతారు. మనం ముందే చెప్పినట్లు ఈ ప్రాంతంలోని ప్రదర్శనల్నియూ ఉత్తర కర్నాటక సంప్రదాయానికి చెందినవిగా వుంటాయి. నాటక వస్తువులు ఎక్కువగా కన్నడ భాషలోనే వుంటాయి. తెలుగు నాటక వస్తువులు తక్కువ. కన్నడ నాటక వస్తువు తెలుగువారు ప్రదర్శించడం వల్ల మధ్యమధ్యలో తెలుగన్నడ మాటలు మాట్లాడుతారు.

ఈ ప్రాంతంలో భాగవతులు సప్త తాళాలలో ప్రదర్శను నడిపే క్రమం వుంది. 1. ధృవతాళం (14 మాత్రలు), 2. మట్ట తాళం (10 మాత్రలు), 3. రూపక తాళం (6మాత్రలు), ఝంపతాళం (10 మాత్రలు), 5. త్రిపుట తాళం (7 మాత్రలు), 6. అష్టతాళం (14 మాత్రలు), 7. ఏకతాళం (4 మాత్రలు). ఈ విధంగా తాళాలను కొట్టే విధానాన్ని భాగవతుడు ప్రదర్శిస్తాడు. ఇలాగే భాగవతులు పాడే పాటల రాగాలను విభజించ వచ్చు.

యక్షగాన బయలాట కథా వస్తువులను ప్రాచీన కాలంలో కంఠాపాఠం చేసి భాగవతులు చెప్పేవారు. వాక్

సాంప్రదాయంలో యక్షగాన బయలాటలు రాగాలు ప్రచారంలో వున్నందువల్ల ఇప్పుడు వాటిలో కొన్ని రాగాలను మాత్రమే మనగమనానికి వచ్చినట్లున్నాయి. ఇక్కడ పాడే పాటలను ఉత్తర కర్నాటక ప్రాంతంలోని అనేక రాగాలు ఇప్పటికీ మనం గమనించవచ్చు. వాటిలో ఇక్కడి భాగవతులు పాడే 32 రాగాలను మనం చూడవచ్చు (బత్తీస్ రాగా)ఇలాగున్నాయి.

1. నాటి	2. శ్యామకల్యాణి
3. కెదార గౌళ	4. కాంబోధి
5. కళ్యాణి	6. తోడి
7. మదుకుల కాంబోజి	8. నవరోజు
9. ఆనంద భైరవి	10. భైరవి
11. నీలాంబరి	12. అరబి
13. మోహన	14. భూపాళి
15. కాంబోజి	16. బిలహరి
17. దన్యాసి	18. మారవి
19. సావేరి	20. బేగడి
21. ఆసావేరి	22. బ్యాహగ
23. శంకరాభరణం	24. శ్రీరాగం
25. మధ్యమావతి	26. కాఫి
27. కానడా	28. సురటి
29. ముఖారి	30. శుద్ధదేశి
31. పంతురావళి	32. పూర్వీ

ఈ బత్తీస రాగాల వైవిధ్యం యక్షగాన బయలాటల సంగీత వైశిష్ట్యం పొందడమేగాక జతకు మృదంగ (మద్దెల) వాదన కూడా విశేషంగా చేరినది. ఒకటి నుండి ఐదు చరణాల వరకు మృదంగ (మద్దెల) వాదాన్ని వాయిస్తూనే అబ్బురపడే ధ్వని కర్ణానికి మధురంగా వుంటుంది.

మృదంగ లేదా మద్దెల వాదన యక్షగాన బయలాటను ఉత్సాహం పెంచే విధంగా వుంటుంది. నిద్రపోయే వాళ్ళను మేల్కొలిపే విధంగా, ఆకర్షితంగా వుంటుంది. వీటి జతకు భాగవతుని గాత్రకు శ్రుతి పెట్టె ఒకటి వుంటుంది. కొన్ని చోట్ల హార్మోనియాన్ని కూడా వాడటం మనం గమనించవచ్చు. నాటక ప్రసంగంలో ప్రదర్శన పూర్తి అయిన తరువాత తెల్లవారిన తరువాత వాద్య గోష్టులవారందరూ కలిసి పాత్రధారులను కలుపుకొని మహామంగళహారతి పాడి ప్రసాదన రంగమండపంలోకి పోయి, వేషాలను తీసివేసి తిరిగి ఆ గ్రామంలోని దేవాలయానికి పోయి దేవతలకు పూజలు చేసి తదనంతరం సూర్యున్ని ప్రార్థించి మంగళారతిని ఎత్తి కర్పూర హారతి సూర్యునికి ఇచ్చి ముగిస్తారు.

ఆధార గ్రంథాలు :

తెలుగు :

1. తెలుగు యక్షగాన వాఙ్మయ చరిత్ర - డా॥ యస్వీ. జోగారావు, 1961, సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరం
2. తెలుగు మీద కన్నడ భాష ప్రభావం - డా॥ ఆదవాని హనుమంతప్ప, ఎస్.కె.యు.కు సమర్పించిన పి.హెచ్.డి సిద్ధాంత గ్రంథం.

కన్నడ :

1. యక్షగాన బయలాట - శివరామ కారంత్, కన్నడ అధ్యయన సంస్థ, మైసూర్ విశ్వవిద్యాలయం, మైసూరు.
2. కన్నడ నాటక - శమరాయ. త.సు. , రా బుక్‌హౌస్, మైసూరు (1962)
3. సమగ్ర యక్షగాన పరంపరే మత్తు ప్రయోగ - హరిదాస బట్ట కు.సి. (సం), గీతాబుక్ హౌస్, మైసూరు (1968)

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

లంబాడీల నృత్యాలు

– డా॥. లావుడ్య సుజాత, అధ్యాపకులరాలు,తెలుగు విభాగం, యూనివర్సిటీ మహిళా పి.జి కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

జానపద విజ్ఞానంలో జానపద నృత్యానికి ఒక ప్రత్యేక స్థానమున్నట్లే గిరిజనులలో ఒక తెగగా వ్యవహరింప బడుతున్న లంబాడీల నృత్యాలకు కూడ ప్రత్యేకతతో పాటు ప్రత్యేక స్థానం కలదు. నృత్యం మానసిక, భౌతిక విధానాలకు సంబంధించింది. లంబాడీ నృత్యంలో ఆయా భావాలకు తగిన విధంగా డప్పుకొట్టడం, ఆ దరువులకు అనుగుణంగా భంగిమలుండటం వల్ల ప్రేక్షకులను ఆకర్షించి రంజింప చేస్తున్నాయి. లంబాడీ నృత్యాలు జనజీవనంలో ఒక భాగంగా విరాజిల్లుతున్నాయి. అటు వంటి లంబాడీల నృత్యాల తీరుతెన్నులను, సామూహిక నృత్య విశేషాలను క్రింది విధంగా ఉన్నాయి.

లంబాడీలు నృత్యాన్ని "నాచెరో" అంటారు. లంబాడీల నృత్యం వారి జీవితానుభవం నుండి పుట్టింది. పనిపాటల సమయంలో పరిసరాలు, ప్రకృతి ప్రభావాన్ననుసరించి వారి శరీరంలో కలిగిన అవయవచాలనమే లంబాడీ నృత్యం పుట్టడానికి కారణమని భావించవచ్చు.

ప్రాచీనకాలం నుండి జానపద నృత్యాలలో వ్యష్టి నృత్యాలు ఎక్కువ కనిపించవు సమష్టి నృత్యాలకే ప్రాధాన్యం ఎక్కువ. అదే విధంగా లంబాడీల నృత్యంలో కూడ వ్యష్టి కంటే సమష్టికే ప్రాధాన్యం ఎక్కువ. ఆదిమ జాతుల నృత్యాలే జానపద నృత్యాలకు ఆధారమని కొందరు విద్వాంసులన్నారు. ప్రాచీన కాలంనాటి చిందు లాటలు నేటికి చెంచులు, యానాదులు, సవరలు, గోండులు, కోయలు మొదలైన వాళ్ళ కళారూపాలలో ఏ విధంగా నిలిచివున్నాయో, లంబాడీల నృత్యావిశేషాలు కూడ అదే విధంగా నిలిచి ఉన్నాయి. లంబాడీ స్త్రీల సామూహిక నృత్యాలలో కొన్ని సందర్భాల్లో స్త్రీలతో పాటు పురుషులు కూడ చేరి నృత్యం చేస్తారు.

లంబాడీల స్త్రీ పురుషులు చేసే నృత్యాలను 15 రకాలుగా ఉన్నాయి.

అవి

1) డప్పుడారో	2) కమలారో
3) డావ్‌టాంగేరో	4) సరక్‌ణీరో
5) గెరియారో	6) జనావర్‌రెరో
7) పిరేరో	8) నంగారారో
9) లాల్‌బణియారో	10) ఖుణ్ ఖుణియారో
11) సిలమారో	12) సమ్మెళిరో
13) కోలాటం	14) లడి లేదా పై కుందేరో
15) జూర్లో నాచేరో	

పై నృత్యాలను ముఖ్యంగా పండుగలు, పెళ్ళిల్లు, జాతరలు, ఏదైన ఉత్సవాల సందర్భాలలో వీటిని ప్రదర్శిస్తారు. వీరి నృత్యానికి డప్పు ముఖ్యమైన వాద్యపరికరం. నృత్యం చేసేటప్పుడు జతుల ప్రకారం చేస్తారు. జతులు మారుతున్నప్పుడల్లా అడుగులు కూడ మారుతుంటాయి. అయితే ఒక్కొక్క సారి సందర్భాన్ని బట్టి డప్‌డియాతో పాటు ఇద్దరు లేదా ముగ్గురు కూడా డప్పులు వాయిస్తారు. డప్‌డియా కళాకారులు లంబాడీ/బంజార గిరిజనులకు ఆశ్రితకులం. ఈ కళాకారులు డప్పు వాయిద్యాన్ని వాయించడం వలన వీరిన "డప్‌డియా" అంటారు. వీరు లంబాడీ తండాల్లో నివసిస్తూ ఉంటారు. లంబాడీలు పెళ్ళిల్లు, ఉత్సవాలు పండుగలు, జాతరలు వంటి ఏ కార్యక్రమాలు జరిగినా డప్‌డియా వాళ్ళు వచ్చి డప్పు వాయిస్తారు. అదే విధంగా లంబాడీ ఎవరైనా చని పోయినప్పుడు కూడా డప్పు వాయిస్తారు. అంటే పుట్టుక నుండి నుండి మరణం వరకు నిర్వహించే అన్ని కార్యక్రమాలకు అనవాయితిగా వీరు డప్పులు వాయిస్తారు. వివిధ రకాల విన్యాసాలతో డప్పును వాయిస్తూ

లంబాడీలు ఇచ్చే ప్రతిఫలాన్ని తీసుకుంటారు. ప్రధాన తెగలతో ఇంటిపేర్లు కల డప్‌డియా కళాకారులు ఆ ఇంటి పేర్లున్న లంబాడీలకే ఆశ్రితులుగా ఉంటూ వారిచ్చే ప్రతిఫలం తీసుకుంటు జీవిస్తారు. డప్పు వాయించటంలో పురుషులతో పాటు స్త్రీలు కూడ నైపుణ్యాన్ని కలిగి ఉంటారు.

డప్పుడారో :

లంబాడీల సంస్కృతి సాంప్రదాయం ప్రకారం ప్రారంభపు నృత్యంగా స్త్రీలు మొదట 'డప్పుదారో' నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ నృత్యం చేసేటప్పుడు ముందుగా స్త్రీలందరు ఒకే వరుసక్రమంలో నిలబడి ఉంటారు. ముత్తైదువ స్త్రీలు కాళ్ళకు 'వాంకడీలు, పెళ్లికాని యువతులు కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. డప్పుకొట్టగానే వీరందరు ఒకేసారి ముందుకు అడుగులు వేస్తూ పైకి చేతులు తిప్పుతూ నృత్యం చేస్తారు. దప్పు దరువుకు తగినట్లు కాళ్ళను ఆడిస్తూ అడుగులు వేస్తూ తాళం మారగానే అందరూ ఒకేసారి వెనకకు తిరిగి అదే రకంగా అడుగులు వేస్తూ చేతులు తిప్పుతూ నృత్యం చేస్తారు.

ఈ విధంగా ఒకే రకమైన అడుగులతో, ఒకే రీతిగా నృత్య ప్రదర్శనను చేసి అందరి మన్ననలను పొందుతారు. దీని తర్వాత మిగత నృత్యాలను ఒక్కొక్కటిగా ప్రదర్శిస్తారు. కొన్ని సందర్భాలలో డప్పు వాయించే వ్యక్తి నృత్యం చేస్తున్న మహిళలతో పాటు నృత్యం చేస్తు డప్పు వాయిస్తాడు. ఈ నృత్యాన్ని పెళ్ళి, పండుగల సందర్భాలలో చేస్తారు.

కమలారో :

ఈ నృత్యాన్ని సామూహిక నృత్యంగా చెప్పవచ్చు. ముందుగా స్త్రీలంతా కొంత కొంత దూరంలో గుంపులుగా నిలబడి ఉంటారు. డప్పు వాయించటం మొదలు పెట్టగానే అందరూ ఒకే సారి దరువుకు తగ్గట్టుగా క్రమపద్ధతిలో అడుగులు వేస్తూ చేతులను పైకెత్తి కదిలిస్తూ నృత్యం చేస్తారు. ఈ నృత్యం తిన్మార్ డ్యాన్స్ లాంటిది. దరువు వేగం పెంచగానే ఎక్కువ వేగంతో అడుగులు వేస్తూ నృత్యం చేస్తారు.

డావ్‌టాంగెరో :

డావ్‌టాంగ్ అంటే ఎడమ కాళ్ళు అని అర్థం. ఎడమ కాలి మీదనే నృత్యం చేస్తారు కాబట్టి ఈ నృత్యాన్ని ఎడమకాలి నృత్యం అని అంటారు. కుడి పాదాన్ని పూర్తిగా భూమిపై ఆనించి, ఎడమ పాదాన్ని ఒక వైపు ఒరగా పెట్టి నృత్యం చేస్తారు. ఇది సామూహిక నృత్యం. వాద్యానికి అనుగుణంగా ఎవరికి వారే ఎడమనుండి కుడికి, కుడినుండి ఎడమకు తమ చుట్టూ తాము గుండ్రంగా తిరుగుతూ చేతులను పైకి క్రిందికి త్రిప్పుతారు. ఈ విధంగా చేతులను పైకి క్రిందికి తిప్పేటప్పుడు పిడికిళ్ళను మూస్తూ, తెరుస్తూ నృత్యం చేస్తారు.

సర్‌క్‌ణిరో :

రెండు పాదాలను పూర్తిగా నేలపై ఆనించి, పాదాలు పైకెత్తకుండ ఈ నృత్యాన్ని పై నృత్యం లాగానే చేస్తారు. ఈ విధంగా నృత్యం చేయడాన్ని "సరక్‌ణిరో" అంటారు. ఇది కొంత కష్టంతో కూడిన నృత్యం.

గేరియరో :

ఈ గేరియారో నృత్యం కూడ పై నృత్యం లాగానే చేస్తారు. వస్త్రాలంకరణ కూడ అదే విధంగా ఉంటుంది. చర్మ వాద్యాలు ఉపయోగిస్తారు.ఈ నృత్యాన్ని మొదట నెమ్మదిగా ప్రారంభించి తర్వాత వేగం పెంచుతారు.

జనావర్‌రెరో :

జనావర్ అంటే పెద్దపులి అని అర్థం. ఈ నృత్యాల్ని ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా వేషధారణ ఉండదు. మామూలుగా వారి సంప్రదాయ దుస్తులనే ధరిస్తారు. పెద్దపులి నృత్యం చేసే వాళ్ళు కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. పురుషులు కూడ ఈ నృత్యాన్ని చేస్తారు. పెద్దపులి ప్రవేశానికి హంగుగా రెండు డప్పులు గంభీర ధ్వనులు చేస్తూ వుంటే ఆ ధ్వనులతో ఉత్తేజం పొంది, ఎడమపాదాన్ని వెనకకు, కుడిపాదాన్ని ముందుకుపెట్టి

గంభీరపు చూపులతో చేతులను పై కెత్తి పులి గాండ్రించి వస్తున్నట్లుగా నృత్యం చేస్తారు. వాద్యానికి అనుగుణంగా పిల్ల జంతువులను వేటాడినట్లు ఆకలిగొన్న పులిలాగా వివిధ రకాల హావభావలను వెల్లడిస్తూ, వివిధ రకాల చేష్టలు చేస్తూ, పొంచివుండి అమాంతం ఏ మేకపిల్లనో నోటితో కరచిపట్టినట్లు నటిస్తారు.

ఈ నృత్యం చేసేవారు ఇరువురు ఎదురెదురుగా కొంత దూరంలో నిలబడి నృత్యం చేస్తారు. అయితే ముఖ్యమైన సందర్భంలో ఒకేసారి రెండు జంటలు సమానంగా ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

'పిరేరో' :

ఈ నృత్యాన్ని ప్రదర్శించేటప్పుడు కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. స్త్రీలు సమూహంగా చేరి డప్పు దరువుకు అనుగుణంగా వేగంగా నృత్యం చేస్తారు. 'పిరేరో' అనే నృత్యం కూడ ఇదే విధంగా చేస్తారు. ఇందులో స్త్రీ పురుషులిద్దరు పాల్గొంటారు.

నంగారారో :

నంగారా అంటే డప్పు అని అర్థం. నృత్యం ప్రారంభంలో కాళ్లను మెల్లగా ఆడిస్తారు. దరువు వేగం పెంచగానే పాదాల్ని వేగంగా ఆడిస్తూ వలయాకారంలో క్రిందికి వంగుతూ పైకి లేస్తూ తిరుగుతూ చేస్తారు. డప్పు చప్పుళ్లకు దరువు వేగానికి అనుగుణంగా చేసే నృత్యం కనుక దీన్ని నంగారారో అంటారు.

లాల్‌బణియారో :

ఈ నృత్యాన్ని స్త్రీలు మాత్రమే చేస్తారు. అందరు వరుసగా నిలబడి, కుడిపాదాన్ని నేలపై ఆనించకుండా దరువుకు తగ్గట్టుగా ఒక చేయిని పైకెత్తి మరో చేతిని క్రిందికి పెట్టి మణికట్టు, వేళ్ళను వేగంగా తిప్పుతూ, ఒంటికాలి మీదనే వలయాకారంగా తిరుగుతూ నృత్యం చేస్తారు. ఈ నృత్య ప్రదర్శన చాలా కష్టంగా ఉంటుంది. పాటలు పాడుతూ ప్రదరిర్శిచడం ఈ నృత్య లక్షణం.

ఖుణ్ ఖుణియారో :

ఇది సామూహిక నృత్యం. ముందుగా స్త్రీలందరు వరుసగా నిలబడి ఉంటారు. తమ తమ చేతులలో ఖుణ్ ఖుణియాను (దీన్ని ఊపితె గలగల మనే శబ్దం వస్తుంది) పట్టు కుంటారు. డప్పు కొట్టగానే అందరు ఒకేసారి ఖుణ్ ఖుణియాను పిడికిలిలో పట్టుకొని ఊపుతూ దరువు వేస్తున్న వ్యక్తి దగ్గరికి నృత్యం చేస్తూ వెళతారు. దరువు మార్చగానే వెనుకకు తిరగకుండా అదే వరుస క్రమంలో వెనక్కి అడుగులు వేస్తారు. వీరు వెనుకకు అడుగులు వేస్తున్నప్పుడు కూడ ఖుణ్‌ఖుణియాను వేగంగా ఊపుతారు.

'సిలమారో' :

ఈ నృత్యాన్ని కూడ పై నృత్యాల లాగే చేస్తారు. స్త్రీ పురుషులిరువురు పాల్గొంటారు.

సమ్మెళిరో :

సమ్మెళి అంటే గ్రద్ద అని అర్థం. ఈనృత్యాన్ని ఒక్కరు మాత్రమే ప్రదర్శిస్తారు. వారు స్త్రీలు కావచ్చు పురుషులు కావచ్చు. కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనక్కి పెడతారు. గద్ద ఎగురుతున్నప్పుడు తమ రెక్కలను వాలుగా పెట్టినట్లుగా, ఎడమ చేతిని వెనక్కి పెట్టి, కుడి చేతిని కొంతవాలుగా ఉంచుతారు. నేలపై కోడిపిల్లలను వెతుకుతున్నట్లుగా అటూ ఇటూ దృష్టిని సారిస్తూ నృత్యం చేస్తూ వచ్చి, కోడిపిల్లను ఎత్తుకొని పోయినట్లుగా తమ చుట్టూ తాము గుండ్రంగా తిరుగుతారు. ఈ సందర్భంలో డప్పును వేగంగా కొడతారు. ఈ నృత్యం ఎంతో ఉత్సాహంగా సాగుతుంది. పై నృత్యాలన్ని పాటలు లేకుండా చేసే నృత్యాలు.

స్త్రీ పురుషులిరువురు చేసే నృత్యాలు :

లంబాడీల నృత్యాలల్లో స్త్రీ పురుషులిద్దరూ కలసి చేసే నృత్యాలు తక్కువనే చెప్పవచ్చు. ముఖ్యంగా హోళి పండుగ, తీజ్ పండుగల సమయంలో మాత్రమే సామూహికంగా నృత్యాలు చేస్తారు.

సామూహిక నృత్యాలు పాటలతో, వాద్య విశేషాలతో కూడి ఉంటాయి. వాద్యాల మీద రకరకాలైన తాళ

గతులతో తమ కళారూపాన్ని ప్రదర్శిస్తారు. వీరు హోళి పండుగ పదిహేను రోజుల ముందు నుండి గుంపులుగా ఏర్పడి సామూహిక నృత్యాగానాలతో చందాలు వసూలు చేస్తారు. హోళి రోజు తండా నాయకుడి ఇంటిముందు అందరు కలిసి కొలాటం వేస్తారు.

కోలాట నృత్యం :

ఆంధ్ర ప్రజాజీవితంలో అన్ని జానపదకళారూపాలతో పాటు కోలాట నృత్యం కూడ తెలుగు జానపదుల జీవితంలో పెనవేసుకుపోయింది పిల్లలను పెద్దలను అందరినీ అలరించే కళారూపం కోలాటం.

కోలాట నృత్యాలు ప్రతి పల్లెలోను విరామ సమయాల్లో, పండుగ సమయాల్లో ప్రదర్శిస్తారు.

లంబాడీలు తమ కుడిచేతిలో హోళి డండాను (కర్రముక్కను) పట్టుకొని పాటలు పాడుతూ గుండ్రంగా తిరుగుతూ లయానుగుణంగా అడుగులు వేస్తూ కోలాటమేస్తారు. మధ్యలో ఒకరిద్దరు తమ చేతిలో చిరతలు పట్టుకొని శబ్దానికి అనుగుణంగా అడుగులు వేస్తూ వాటిని వాయిస్తారు. నాయకుడు వచ్చిన వాళ్ళకు సారా పోసి సంతోషపరుస్తారు.

ఆంధ్రదేశపు అరణ్యాలలో నివసించే కోయలు, చెంచులు, గోండులు, లంబాడీలు, గదబలు మొదలైన వారు చేసే నృత్యాలను ముఖ్యంగా మూడు విధాలుగా విభజింపవచ్చు. అవి ఆరాధనా నృత్యాలు, వినోద నృత్యాలు, ఋతు సంబంధి నృత్యాలు. ఇవన్నీ బృంద నృత్యాలే. ఇందులో అనేక మంది స్త్రీలు, పురుషులు పాల్గొంటారు. కొన్ని కొన్ని నృత్యాలందు ప్రత్యేకంగా పురుషులు స్త్రీలు వేరు వేరు చేస్తుంటారు".

ప్రాచీన కాలం నుండి నేటి వరకు గోండులు, సవరలు, బిల్లులు మొదలైన ఆదిమజాతులలో సంగీత కళ యొక్క ప్రారంభదశ, మౌలిక స్వరూపం నేటికి నిలిచియున్నది. వారి సంగీతం మూడు నాలుగు స్వరాల కంటే అధిక స్వరవ్యాప్తి లేదు. పై విషయం లంబాడీల పాటలకు కూడ వర్తిస్తుంది. లంబాడీ స్త్రీల సామూహిక నృత్యం గిరిజన నృత్యాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. స్త్రీలు వలయాకారంగా తిరుగుతూ పాటకు తగిన లయతో అడుగులు వేస్తారు. చేతులను లయానుగుణంగా పైకి ఎత్తుతూ క్రిందికి దించుతారు. ఉత్సాహంగా ఆడుతూ పాడుతారు. లంబాడీ స్త్రీల "లడి" నృత్యం వారి నృత్య సంప్రదాయాన్ని చాటుతుంది. లడి నృత్యంలో ఒకరి చేతులు మరొకరు పట్టుకొని గుండ్రంగా తిరుగుతూ, పాడుతూ లయానుగుణంగా వంగుతూ లేస్తూ గంతులు వేస్తూతిరగడం ఈ నృత్యం ప్రత్యేకత.

అటువంటి నృత్యానికి సంబంధించిదే ఈ పాట.

మా జాంవుయే బాదల శారేన - మా లాంవుయే హంసలేరి దోజోడి
ఒన ఘాలేన నాచురే పూలెమాల - మారోజీవా బారిరే పూలెమాల
మాజావుయే బాదల శారేన - మా లాంవుయే భూరియారి దో జోడి
ఒనఘాలేన నాచురే పూలెమాల - మరో జీవా హంసారిరే పూలెమాల
మా జాంవుయే బాదల శారేన - మా లాంవుయే టుక్రీరి దో జోడి
ఒన ఓడన నాచురే పూలెమాల - మాయాడిరి బెటిరే పూలెమాల.

భావం :

"నేను పట్టణానికి వెళ్ళి మెడలోకి రెండు జతల గొలుసులు, రెండు జతల ముక్కెరలు, రెండు జతల ఓణీలు తెచ్చుకొని, వాటిని ధరించి నాట్యం చేస్తాననే భావాన్ని తెలుపుతూ నృత్యం చేస్తారు.

పూలమాల అనేది కేవలం వంతకాదు. నాట్యం చేసే యువతి తన భర్తనే పూలమాల అని సంబోధిస్తుంది. ఇది స్త్రీల మధుర భావనల కొక నిదర్శనం. నాట్యం చేసేటప్పుడు ఆభరణాలతో అలంకరించుకొని అందంగా

కన్పించాలనే స్త్రీల మనోభావాలను ఈ పాట వ్యక్తం చేస్తుంది. జానపద సాహిత్యంలో కొన్ని పాటల్లో కూడ భర్తను "మొగిలిరాజు" గా "బంగారిరాజుగా" సంబోధించే విధానాలు కనిపిస్తాయి.

లడి లేదా పై కుందేరో, జూర్లో నాచేరో ఈ నృత్యాలను స్త్రీ పురుషులు సమూహంగా చేరి పాటలు పాడుతూ నృత్య ప్రదర్శన చేస్తారు.

పై నృత్యాలను ప్రవర్శించేటప్పుడు సాంప్రదాయ దుస్తులను ధరిస్తారు. ఇది ప్రత్యేక అలంకరణలతో ఎంతో ఆకర్షణీయంగా కన్పిస్తాయి. వీరి వేషదారణ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, కట్టుబాట్లు, భాష అన్ని ప్రత్యేకమైనవి. ఈ కళారూపం తెలంగాణ సంస్కృతిలో భాగమై మన అస్తిత్వాన్ని ఎలుగెత్తి చాటు తున్నాయి. నెమలి తన రంగురంగుల పించముతో పురి విప్పి నాట్యమాడుతున్నప్పుడు ఎంత అందంగనైతే కనిపిస్తుందో, అదే విధంగా లంబాడీ మహిళలు తమ సంప్రదాయ దుస్తుల్లో నృత్యం చేస్తున్నప్పుడు కూడా అంతే అందంగా కనిపిస్తారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. గిరిజన సాహిత్యంలో లంబాడీ స్త్రీల జీవన చిత్రణ - డా॥ లావుడ్య సుజాత, దిజ్ఞా పబ్లికేషన్స్-2016, హనుమకొండ.

❖ ❖ ❖

జానపదుల గ్రామ దేవతలు – సాంస్కృతికాంశాలు

– డా॥. వీర్రాల వేంకటేశ్వర్లు, పి.జి.టి.తెలుగు, సెయింట్ జోసఫ్ ఆంగ్ల పాఠశాల, నెహ్రూనగర్, కర్నూలు.

Richard M.Dorson జానపద మతాన్ని సాంఘిక జానపద ఆచారంలో చేర్చాడు. ఈ సాంఘిక జానపద ఆచారంలోని మతసంబంధాలు, దేవతలు లేక కుల సమూహాలు దేవతారాధనలతో కూడి ఉంటాయి. కనుక గ్రామ దేవతారాధనను జానపద మతానికి సంబంధించిన ఒక సాంఘిక జానపద ఆచారంగా పరిగణించవచ్చు.

సంఘంలోని వ్యక్తులు తమచుట్టూ ఏవో కొన్ని అదృశ్య శక్తులున్నాయని విశ్వసించి, చేసే ఆచార విశేషమే జానపద మతం. జానపద మతంలో ఒక అంశమైన గ్రామదేవతారాధన ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది. ఏవో తమకు తెలియని కొన్ని శక్తులు మంచిచెడులతో నిమిత్తం లేక తమను ఆవరించుకొని ఉన్నాయనీ, ఆ శక్తులు వ్యాధుల్ని-ఉప ద్రవాల్ని కలిగిస్తున్నాయనీ ఆదిమానవులు విశ్వసించారు. కనుకనే అతి ప్రాచీన కాలం నుంచీ కూడా గ్రామదేవతారాధన జానపద మతంలో ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించుకొని నేటికీ నిలద్రొక్కుకొని ఉంది.

జానపదులు తమ గ్రామం ఒక శక్తి రక్షణలో ఉన్నట్లు, అదే తమ గ్రామ రక్షణ దైవమని నమ్మి ఆరాధిస్తారు. గ్రామదేవతలు ప్రధాన హిందూ దేవతలైన హరిహరులకు పూర్తిగా భిన్నులుగా కన్పిస్తారు. వీరి ఆరాధనా క్రమం కూడా భిన్నంగా ఉంటుంది. హరిహరులు ప్రకృతికి ప్రతి నిధులు-కాని గ్రామదేవతలు గ్రామ పరిరక్షణ ప్రతీకలు. గ్రామదేవతలు గ్రామాల్లో సంభవించే కలరా, అమ్మవారు, పశువ్యాధుల నివారణకు మాత్రమే పరిమితమైనట్లు కన్పిస్తుంది. కాని హరిహరులను కొలవటంలో ఆధ్యాత్మిక ధోరణి ప్రస్ఫుటమవుతుంది. అయితే లోతుల్లోకి వెళ్ళి పరిశీలిస్తే తాత్వికంగా 'దైవమంతా ఒకటే' అనే విషయం మనకు నిరూపితమవుతుంది.

జానపదులు ప్రధానంగా వ్యవసాయం - పశుపోషణ ప్రవృత్తిగా కలవారు. కనుక వీరు చాలా వరకు స్త్రీ దేవతలను ఆరాధిస్తారు. ప్రాచీన మానవుడు పూజించిన శక్తి దేవతే గ్రామదేవత! ఈ శక్తి పూజా పద్ధతి యొక్క ప్రాచీనత వేదాల్లోనే కాక సింధూనది నాగరికతలో కూడా కన్పిస్తుంది. హిందువుల్లో శక్తి ఉపాసన అనాది నుంచి కన్పిస్తుంది. దేవీ భాగవతం, మార్కండేయ పురాణం, బ్రహ్మాండపురాణం ఇలా పురాణాల్లో శక్తి దేవతకు అధిక ప్రాధాన్యమీయబడింది. ఈమె ఒక విశ్వమాత. శక్త్యు పనిషత్తులో ఈమె సర్వోష్కృష్టమైన నిజస్థితి నిరూపించ బడింది. డా.పుష్పేంద్ర కుమార్ భారత రామాయణా ల్లోను, పురాణాల్లోను శక్తిని గురించిన విషయాల్ని క్షుణ్ణంగా తన Sakti Cult in Ancient India అనే గ్రంథంలో విశ్లేషించారు.

డా.నాయని కృష్ణకుమారి గారు తల్లి దేవతను గురించి ప్రస్తావిస్తూ - "మనుష్యులను పీడించు ప్రేతాత్మల నుండి రక్షణకై ఆ మనుష్యుడే భగవద్రూపమును కల్పించుకొని, తనకు సంరక్షకునిగా నిలబెట్టుకొనెను. ఇట్టి భగవద్రూప కల్పనము నందు మొదటి కల్పన తల్లిదేవత. ఈమెయే జానపదుల గ్రామదేవత. ప్రాచీన సంస్కృత సాహిత్య మున స్థిరతగన్న దేవి యొక్క ఉమా, అంబికా నామ ములు ద్రావిడ శబ్దమునకు మారు రూపములు" అని పేర్కొని, హిందూ దేశ శక్తి యెల్లెడల గ్రామ గ్రామమునను నెలకొనిన జానపదుల మాతృదేవతా లక్షణములను ఇలా వివరించియున్నారు :

1) ఈయమ భయంకర స్వరూపిణి - చతుర్భుజిగా చిత్రింపబడిన ఈయమ శూలి, కపాలి, గదా, ఖడ్గహస్త, లంబ జిహ్వికయగు నీమె వికట దంతయు, విస్ఫారితనేత్రయు, కరాళవదన యునై, భయమును కలిగించుచుండును.
2) ఈమెకు బలి జంతుమాంస ఖాదనమున, రక్త ప్రాశనమున, ఆసన సేవనమున ప్రీతిమెండు.

3) మానవుడీమెను భక్త్యావేశముకన్న భయవివశత తోడనే కొలువబూనును
4) తమ్ము మఱచిన జనులను కష్టముల పాల్జేయుటయు, రోగముల బారి బడవేయుటయు నీమెకు ప్రీతి.
5) పాలిత జనముపై నీమెకు సంతానబుద్ధి యుండుటచే నీమె జగద్ధాత్రి
6) భక్తుల కోరికపై నీమె గ్రామములను పరిరక్షించును. చెలరేగిన యంటువ్యాధుల నదుపున బెట్టును. పశువులను- జనులను, పీడనుండి - గ్రహబాధ నుండి - శత్రువుల నుండి కాపాడును. ఊరి పొలిమేరల రక్షించును. పంట పొలములను - చెఱువు కట్టలను రక్షించును.
7) ఊరియందు వేపచెట్ల క్రిందను, త్రాచుపుట్టల యందును నెలకొని యుండును. కేవలము నాగరూపమున నీమె జానపదులచే నర్చింప బడుటయు కలదు.

(తెలుగు జానపద గేయగాథలు : పుట, 184 & 191)

డా.నాయని కృష్ణకుమారి గారు పేర్కొన్న లక్షణాల్లో మొదటి లక్షణం కొన్ని గ్రామదేవతలకు అన్వయించదని డా.జి.ఎస్.మోహన్ గారిలా పేర్కొంటారు :

"గ్రామదేవత ఆకారం విగ్రహరూపంలో ఉండాలనే నియమం సర్వత్ర కన్పడదు. ఆమె ఒక చిన్న రాయి లేదా బొడ్డురాయి రూపంలోనైనా ఉండవచ్చు. ఆ రాతికి నూనెను అంటించి, పసుపు కుంకుమల బొట్టు పెడతారు. తక్కిన దేవతా లక్షణాలన్నీ సంపూర్ణంగా గ్రామదేవతలకు అన్వయిస్తానటంలో సందేహం లేదు. అట్లని గ్రామ దేవతలు విగ్రహ రూపాల్లోనూ లేకపోలేదు. విగ్రహ రూపంలో ఉండే గ్రామదేవతలకు మొదటి లక్షణం వర్తిస్తుంది"

(జానపద మతం - గ్రామదేవతలు వ్యాసం : పుట, 199)

ఇలా ప్రాచీన మానవుడు ఆరాధించిన శక్తిదేవత లేక తల్లిదేవతే నేటి గ్రామదేవత. ఆ దేవత పేరనే జానపదులు తమ సంతానానికి పేర్లు పెట్టడం కూడా ఆయా చోట్ల నేటికీ కన్పిస్తుంది. ఉదా : ఎల్లమ్మ, మల్లమ్మ, మారమ్మ మొదలైనవారు. ఇక ప్రతి గ్రామంలోని జానపదులు ఆ గ్రామానికి చెందిన దేవతను ఆరాధిస్తారు. అంతేకాదు ఆ దేవత పేరుతో ఉత్సవాలు, జాతరలు నిర్వహిస్తారు. ఇలా చేయడం వల్ల ఆ గ్రామం సుభిక్షంగా ఉంటుందని వారి నమ్మకం.

ఇలా గ్రామాన్ని అధిష్ఠించిన దేవత గ్రామదేవత. సాధారణంగా గ్రామదేవతలకు ఆలయాలు ఊరి పొలిమేరల్లోనే ఉంటాయి. గ్రామదేవత ప్రభావం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్న గట్టి నమ్మకం జానపదులలో నేటికీ నిలిచివుంది. కనుకనే గ్రామంలో మంచి జరగాలన్నా, అపాయం నుంచి తప్పించుకోవాలన్నా, చెడు జరగకూడదన్నా మ్రొక్కుబళ్ళను చెల్లించు కోవటం వారిలో ఒక సంప్రదాయంగా మిగిలిపోయింది. కొన్ని చోట్ల దేవత భక్తునిలో ఆవహించి (పూనకం) జరుగబోయే మంచి చెడులను చెప్పటం కూడా ఉంది. దీన్నే పయిలోకి వచ్చిందని అంటారు. ఇటీవలి కాలంలో తెలంగాణ ప్రాంతంలో బోనాల పండుగ సందర్భంలో ఒకామెకు దేవత పూని, కరోనా కష్ట వివరాలను చెప్పడం గమనించదగిన విషయం.

ఇక సాధారణంగా గ్రామదేవతల్ని పూజించేవారు అబ్రాహ్మణులుగా ఉంటారు. నగరాలలో అక్కడక్కడ మాత్రం బ్రాహ్మణ పూజారులున్నారు. ఈ గ్రామ దేవతల పూజా విధానాల్లోను, ఆచార వ్యవహారాల్లోను ప్రాంతీయ భేదాలు కనబడుతాయి. ఇందులో ఏకసూత్రత అత్యల్పంగా ఉంటుంది. కాని గ్రామ దేవతలను జానపదులు ఒక మూఢ విశ్వాసంతోనే ఆరాధిస్తారు. గ్రామ దేవతల్ని ఆరాధించటం వల్ల సకాలంలో వానలు పడుతాయనీ, పంటలు బాగా పండుతాయనీ నమ్ముతారు. మంగళ, శుక్ర వారాల్లో గ్రామదేవతను పూజించి కోడి పుంజు, పొట్టేలు, మేకపోతు వంటి జంతువుల్ని బలిగా ఇస్తారు.

కొన్ని ప్రాంతాలలో జానపదులు విగ్రహానికి బదులుగా ఏదైనా ఒక రాయిని దేవతగా భావించి, ఆ రాతిని తూర్పు ముఖంగా ఉంచి, మూడు ప్రక్కల పెద్దపెద్ద బండల్ని పాతి, బండలతోనే పై కప్పు వేస్తారు. ఈ గుళ్ళను సాధారణంగా వేపచెట్టు క్రింద నిర్మిస్తారు. కొన్ని గ్రామాల్లో పెద్ద పెద్ద గుళ్ళుంటాయి. ధ్వజస్తంభాలు సైతం ఉంటాయి. ఈ గుళ్ళలోని దేవతలు విగ్రహరూపంలో ఉంటారు. సాధారణ దేవతలకులాగే వీరిని కూడా వేషభూషణాలతో అలంకరిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగు చీరల్ని ధరింపచేస్తారు. సాధారణంగా గ్రామాల్లో పొలంగట్లపైనా, చెరువు గట్లపైనా అధికంగా చిన్న చిన్న బొడ్డురాళ్ళ వంటి గంగమ్మ గుళ్ళు కన్పిస్తాయి. ఇలా గంగమ్మ గుళ్ళను ఉంచటం వల్ల, ఆమె పంటల్ని రక్షిస్తుందని జానపదుల ప్రగాఢ విశ్వాసం.

గ్రామదేవతలనే గాక, ఆ దేవతకు బలినిచ్చే పశువును కూడా జానపదులు అలంకరిస్తారు. బలిని ఇవ్వటానికి ముందు దాని శరీరానికి పసుపు పూసి, వేపాకుల హారం వేస్తారు. కొమ్ములకు కూడా వేపాకుల హారం కడతారు. తప్పెట్లతో బలిపశువును ఊరేగిస్తారు. సామాన్యంగా ఊరేగింపులోను, దాని మెడను కత్తిరించటంలోను హరిజనులే ప్రాధాన్యం వహిస్తారు. నిమ్మకాయలను కోసి పైకి విసిరివేస్తారు. సాధారణంగా ప్రతి గ్రామంలో వెలసిన 'పెద్దమ్మ' దేవతకు దేవర పోతును (ఎనుబోతును) బలియిస్తారు. ఉగాది, దసరా పండుగ రోజుల్లో నగరాల్లో - గ్రామాల్లో గ్రామదేవతలకు నైవేద్యమిచ్చే సంప్రదాయం నేటికీ కన్పిస్తూ ఉంది. నైవేద్యంతో పాటు వస్త్రాభరణాలను సమర్పించడం కూడా కనబడుతూ ఉంది.

ఇక ఆంధ్రదేశంలోని గ్రామదేవతల్లో కొందరు :

పుడవాలమ్మ, కుంకుళమ్మ, రాగులమ్మ, గంగాలమ్మ, సూరమ్మ, కరువలమ్మ, కొండమ్మ, ఎల్లమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, బతుకమ్మ, పోచమ్మ, ఇరుగళ్ళమ్మ, కట్టమైసమ్మ, గుర్రమ్మ / గుర్రలక్కా, జోగులమ్మ / జోగుళాంబ మొదలైనవారు.

పుడవాలమ్మ :

పృథివి, అప్, తేజస్సు, వాయు, ఆకాశం అనే పంచభూతాలతో నిండింది కాబట్టి దీన్ని ప్ర-పంచ-ము అన్నారు. ఆ అయిదింటిలో మొదటిదైన పృథివిని పరిపాలించే అమ్మ (పుడమి+అమ్మ) పుడమమ్మ అవుతుంది. అయితే జానపదులు తమకొచ్చిన చదువులతో ఈ తల్లిని పుడవాలమ్మ అని పిలుస్తూ ఉంటారు. పంటని ఏ నేల అందిస్తూ తమ పిల్లలందర్నీ రక్షిస్తోందో, తమ అభివృద్ధికి కారణమవుతుందో, ఆ తల్లి భూమికి చేసే నైవేద్యాలన్నీ పుడవాలమ్మకే చెందుతాయి. పంట కోత కోయగానే ఈ తల్లి దగ్గర ధాన్యాన్ని ఉంచి, ఎవరి మొక్కుబడి ఎంతో అన్ని బస్తాలనీ ఈ అమ్మకి సమర్పించడం నేటికీ సాగుతోంది.

కుంకుళమ్మ :

ఏ నేల తల్లిని కృతజ్ఞతా పూర్వకంగా ప్రజలంతా సేవిస్తూ ఉంటారో, ముఖ్యంగా రైతులైన జనమంతా ఆమె శక్తిని యథార్థంగా తెలుసుకున్న వాళ్ళో, వాళ్ళు ఆ తల్లిని తమకు పండే పంటకు అనుగుణంగా పేర్లు పెట్టుకొని పూజిస్తూ ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో కుంకుడు కాయల పంటే దొరుకుతుంది. ఆ పంటను అమ్మకి సమర్పిస్తూ, ఆమె పేరును 'కుంకుళ్ళమ్మ' తల్లి అని అన్నారు.

రాగులమ్మ :

రాగులు మాత్రమే ప్రదేశంలో ఉన్న తల్లిని 'రాగులమ్మ తల్లి' అని అంటారు. తల్లి తన పిల్లలకు అన్నాన్ని పెడుతుంది. కనుక ఈ పంట ద్వారా తమకు అన్నాన్ని పెడుతోంది. కాబట్టి ఆ తల్లిని ఆయా పేర్లతో సేవిస్తూ, జానపదులు 'రాగులమ్మ' తల్లి అని అన్నారు.

గంగాలమ్మ :

పంచభూతాల్లో రెండవది గంగ. అంటే నీరు. కేవలం భూమి నుండి ఏ వ్యక్తికీ ప్రయోజనం లేదు. ఆ భూమికి ఆకాశం నుండి పడే వర్షం ముఖ్యమైనది. అంతేకాదు ఆకాశం నుండి వర్షం పడని రోజుల్లో భూగర్భజలం అతి

ముఖ్యమైనది. పై నుండి జలం పడకపోయినా, భూగర్భం నుండి జలం భూమి మీద ఉన్న చెట్ల వేళ్ళకి అందక పోయినా, పంట చేతికి వచ్చే అవకాశం లేదు. కాబట్టి నీటిని ఒక తల్లిగా భావించిన జానపదులు ఆమెను గంగా లమ్మ తల్లిగా భావించారు. ఆమెకి కొలుపుల్ని నిర్వహిస్తూ వచ్చారు. వర్షం రాకపోయిన పక్షంలో కుండలతో నీటిని తెచ్చి ఆమె విగ్రహాన్ని అభిషేకించగానే కుంభవృష్టి కురవడం నేటికీ మనకు కనిపిస్తున్న సత్యం!

కరువలమ్మ :

పంచభూతాల్లో నాలుగవది వాయువు. కరువలి అంటే 'పెద్దగాలి' అని అర్థం. పంటకి గాలి వీచకపోవడ మనేది కూడ ఒక అనుకూల సాధనమని భావించిన జానపదులు వాయువును కూడా ఒక తల్లిగా లెక్కిస్తూ, ఆమెకి కూడ సేవలని చేయడం ప్రారంభించారు. గాలి అనగానే దాని విలువ మనకి తెలియదు. కాని, బాగా ఎత్తైన ప్రదేశాల్లో - కొండలున్న ప్రదేశాల్లో - కొండవాలు ప్రదేశాల్లో వీచే ప్రచండమైన గాలి కొన్ని వందల ఎకరాల పంటని క్షణంలో ధ్వంసం చేసేస్తుంది. అలా 'మామీద కోపించి - మా తిండిని నష్టపరచకు తల్లీ!' అని ప్రార్థించి, ఉత్సవాలను సమర్పించుకునే తల్లి కరువలమ్మ.

కొండమ్మ :

పంచభూతాల్లో అయిదవది ఆకాశం. ఆకాశాన్ని కొండతో పోల్చడమనేది మనకు కన్పిస్తూ ఉంటుంది. నోటిలో కూడా వేలాడుతూ కన్పించే నాలుకను కొండ నాలుక అంటారు. అదుగో అలాంటి కొండమీద లభించే ఏ పంట ఉందో, ఆ పంట ధాన్యం ఏ మాత్రం నష్ట పోకుండా పిల్లలమైన మాకందించవలసిందని ప్రార్థిస్తూ, కోయజాతి వాళ్ళందరూ కూడా నైవేద్యాలను సమర్పించు కునే తల్లి కొండమ్మ. అందుకే పులిగోర్లు, జింక కొమ్ములు, లేడి చర్మాలు, ఏనుగు దంతాలు వీటితో పాటు చిత్ర విచిత్రమైన వాసనలతో ఉండే కస్తూరి, పునుగు, జవ్వాది .... వంటివన్నీ గిరిజన జానపదుల నుండే లభిస్తాయి.

ఎల్లమ్మ :

సహజంగా మన ఇళ్ళలో పనిచేసే స్త్రీలకు ఈ పేరు ఎక్కువగా ఉంటూ ఉంటుంది. ఈ పేరు వింటూనే మనం అదేదో తక్కువ జాతి పేరుగా భావిస్తూ ఉంటాం. కాని అది సరికాదు. చదువులకి ఒక అమ్మ ఉంది. ఆమె పేరు సరస్వతి. ధనానికి ఒక తల్లి ఉంది. ఆమె పేరు ధనలక్ష్మి. లయకర్తిగా ఒక తల్లి ఉంది. ఆమె పేరు పార్వతి. ఈ ఎల్ల (అందరు) తల్లులకీ అమ్మ (తల్లి వంటిది) ఎవరో ఆమె ఎల్ల + అమ్మ = ఎల్లమ్మ. అంటే చదువునీ, ధనాన్నీ, మృత్యువునీ జయించగలిగిన శక్తినీ, రక్షణనీ ఇచ్చే సర్వసమర్థురాలని అర్థమన్నమాట!

పోలేరమ్మ :

ఒక గ్రామం ఇంతటితో అయిపోయిందనీ, అక్కడి నుండి మరో గ్రామం ప్రారంభమైనదనీ తెలియ జేసేం దుకు ఏ సరిహద్దు ఉంటుందో, ఆ సరిహద్దుని 'పొలిమేర' అని అంటారు. ఆ పొలిమేరలో ఉండి తనని దాటి వెళ్ళే ప్రతి గ్రామస్థుణ్ణీ (ఆ గ్రామంలో ఉండేవాడిని) తిరిగి వచ్చేంత వరకూ, కంటికి రెప్పలా రక్షిస్తూ ఉండే తల్లి - పొలిమేర + అమ్మ = పొలిమేరమ్మ. ఇంట్లో తల్లికి నమస్క రించి, ఊరి చివరున్న పొలిమేరమ్మకి నమస్కరించి, తిరిగొచ్చేటప్పుడు పొలిమేరమ్మకి కృతజ్ఞతా పూర్వకంగా మళ్ళీ నమస్కరించి, జానపదులు ఇంటికి రావడం చేస్తూ ఉంటారు. ఈ పొలిమేరమ్మను వీరు తమకొచ్చిన చదువుతో 'పోలేరమ్మ' అని పిలుచుకుంటూ ఉంటారు.

నూకాలమ్మ :

ప్రతి వ్యక్తికీ ఆధారభూతమైనది ఆహారం. ఆహారం లేనిదే ఏ వ్యక్తి జీవించలేడు. ఆ ఆహారం ఒకరికి గోధుమలైతే, ఇంకొకరికి రాగులైతే, మరొకరికి నువ్వులైతే, మరికొందరికి యవధాన్యాలైతే... ఇలా ఒక్కొక్కరికీ ఒక్కొక్క ధాన్యమవుతూ ఉంటే, ఈ అన్ని ధాన్యాలకీ కలిపి పెట్టిన పేరు నూకలు అని. నూకలనగానే బియ్యానికి సంబంధిం చిన ముక్కలని అనుకోకూడదు. ధాన్యమనే అర్థంగా భావించాలి. అలా 'తమకు తిండి గింజలని, సరైన తీరులో

ప్రసాదిస్తున్న - నూకలనిస్తున్న తల్లీ!" అని జానపదులు కొలుచుకొని నూకలమ్మకు నమస్కరిస్తుంటారు. ఈమె కాలక్రమంలో జానపదుల భాషలో నూకాలమ్మగా అయిపోయింది.

బతుకమ్మ :

ఇప్పటికీ తెలంగాణా ప్రాంతంలో ఈ బతుకమ్మ ఉత్సవాలని విశేషమైన తీరులో చేస్తూ ఉంటారు. బతుకునిచ్చే అమ్మ - బతుకమ్మ. ఆమె పేరే క్రమంగా బతకమ్మగా అయిపోయింది. ప్రతివ్యక్తికీ బతుకుని (జీవించడానికి కావలసిన ఉపాధినీ లేదా వృత్తినీ) అందించే తల్లి బతుకమ్మ. ఏ వర్షమనేది లోకంలోని ప్రాణులందరికీ ఆధారమో, అలాగే వర్షాకాలం వచ్చే సందర్భంలో రోగాల నుండి బతుకుని ప్రసాదించవలసిందని నమస్కరిస్తూ ఉండే జానపదుల ప్రార్థనలను అందుకునే తల్లి బతుకమ్మ. బతుకనేది కొందరికి మాత్రమే చెందినది కాదు కాబట్టి ఈమె ఒక ప్రాంతపు దేవత మాత్రమే కాదు.

పోచమ్మ :

'బతకడానికి కొన్ని గంజినీళ్ళున్నా చాలు' అని లోకంలో ఒక నానుడి ఉంది. అలా ఆహారం లేకున్నా, ఆహార ధాన్యానికి సంబంధించిన గంజి కాచుకోవడానికి కావలసిన, ఆ పాటి ధాన్యాన్నైనా ఇస్తూ, గంజిపోసే అమ్మ - పోచమ్మ అవుతుంది. అంటే జీవితానికి తిండి ఉండేలా కాచి రక్షించే తల్లియని అర్థం. కొన్ని ప్రాంతాలలో ఆహార ధాన్యాల కంటే ఆహారాన్ని ద్రవంగా చేసుకుని దానితో జీవించడమే అలవాటున్న జానపదులున్నారు. అలాంటి వారందరికీ ఈ పోసే+అమ్మ - పోచమ్మ పూజనీయురాలు.

ఇరుగళ్ళమ్మ :

లోకంలో కాలాన్ని కొలిచే వాళ్ళు ఇద్దరూ ఇద్దరే! ఒకడు సూర్యుడు, మరొకడు చంద్రుడు. సూర్యుని ప్రకారం కాలాన్ని కొలిస్తే అది సౌరమానం అవుతోంది. చంద్రుని ప్రకారం కాలాన్ని కొలిస్తే అది చాంద్రమానం అవుతోంది. తమిళనాడు ప్రాంతమంతా కూడా సౌరమానం ఆధారంగా ఉంటే, మనం చాంద్రమానం వాళ్ళం. అమ్మవారికి సూర్యుడు కుడికన్ను, చంద్రుడు ఎడమ కన్ను. ఈ సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ రెండు కళలుగా చెబుతుంది శాస్త్రం. కాబట్టి ఇరు = సూర్యుడూ - చంద్రుడూ అనే ఇద్దరూ, కళలు - తనకి కళ్ళుగా కలిగిన అమ్మ, ఆ తల్లి ఎవరో ఆమె జానపదుల భాష ఇరుగళ్ళమ్మ.

కట్టమైసమ్మ :

ఈమె మనకు తెలంగాణ ప్రాంతంలో ఆరాధ్యురాలిగా కనిపిస్తూ ఉంటుంది. ఈమె అసలు పేరు కట్టమూసే అమ్మ. కట్ట అంటే జీవితానికి అవధి అయిన మృత్యువని అర్థం. అలాంటి మృత్యువును మూసే వాయిదా వేయగలిగిన (మృత్యుంజయ శక్తి గల) అమ్మ - కట్టమూసే అమ్మ - కట్టమైసమ్మ. తమకీ, తమ పిల్లలకీ ఏ విధమైన మృత్యు బాధా లేకుండా రక్షించవలసిందని ఈమెకు జానపదులు ఉత్సవాలని చేస్తూ ఉంటారు.

గుర్రమ్మ / గుర్రాలక్కా :

రాజులైన వారికి చతురంగ బలాలుంటాయి. నేలమీద నడిచే ఏ పదాతి దళం, వేగంగా పరిగెత్తే అశ్వదళం, మదించిన ఏనుగులతో నిండిన గజబలం, వీటన్నిటితో పాటు ఆయుధాలని తీసుకుపోయే రథబలం అని ఇలా నాలుగు తీరుల బలాలుంటాయి. వీటిలో ఉత్తమ జాతి గుర్రాలు (కాశీ గుర్రాలు, ఉజ్జయినీ గుర్రాలు ఇలా) లిఖించే ప్రదేశంలో ఉన్న తల్లిని 'గుర్రమ్మ / గుర్రాలక్కా' అని జానపదులు పిలుస్తారు. యుద్ధ సమయాలలో, మిగతా శుభ కార్యక్రమాల్లో జానపదులు అశ్వం మీద ప్రయాణం చేసే సందర్భంలో విజయం చేకూరాలని ఈమెను ఆరాధిస్తుండే వారు.

జోగులమ్మ / జోగుళాంబ :

దేవతామూర్తులను దర్శించే శక్తి కలగాలంటే అది యోగశక్తితో మాత్రమే సాధ్యమవుతుంది. అందుచేత యోగి జనులకు మాత్రమే సాధ్యమయ్యే తీరులో దర్శనాన్ని అందించే తల్లి యోగుల+అమ్మ = యోగులమ్మ. యోగి శబ్దానికి వికృతి జోగి అని. జోగి+లు

= జోగులు. జోగులకు అంటే యోగుల జన్మకి అమ్మ జోగులమ్మ. ఈ తల్లే జానపదుల భాషలో జోగులమ్మ / జోగుళాంబగా మారిపోయింది.

ముగింపు :

ఇలా జానపదులు ఆరాధించే గ్రామదేవతలంతా సంస్కృత సాహిత్యంలో స్థిరమైన ప్రధాన దేవతా స్త్రీ శక్తులు కలిగిన వారే తప్ప, స్థాయి తగ్గిన దేవతాజనం కానే కాదు. సంవత్సర చక్రం అలా రాగానే జానపదులు మొట్టమొదటగా చేసే పండుగ ఉగాది. అంతేకాదు అమ్మవారికి తొమ్మిది రాత్రులపాటు చక్కగా సాగే ఉత్సవాలను కూడా వీరు నిర్వహిస్తారు. కాని మనం వసంత నవరాత్రాలనగానే అమ్మవారు ఏ కంచిలో కామాక్షిగానో, మధురలో మీనాక్షి గానో, విజయవాడలో కనుకదుర్గమ్మ గానో.... ఉంటారని అనుకుంటాం. కాని గ్రామాల్లో కూడా అమ్మ ఉంటుంది. ఆ అమ్మను కొలిచే నిజమైన భక్తులు జానపదులేనని అనటంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. మోహన్, జి.ఎస్ : జానపద విజ్ఞానాధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్స్, బెంగుళూరు (2001)
2. హేమసుందర్ వరప్రసాద్, అవ్వా (సంపా) : భక్తి సుధమాస పత్రిక, శ్రీ ధర్మ పరిషత్ పబ్లికేషన్స్, విజయవాడ. (మార్చి - 2012)

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కడప జిల్లా జానపదుల వైద్యం – ఒక పరిశీలన

– ఎన్.ఐ. వసుమతి, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, యస్.వి. యూనివర్శిటి, తిరుపతి.

సూది మందు అంటే ఈ నాటికి జానపదులు భయ పడతారు. ప్రాచీన కాలం నుండి జానపదులు తమకు గాని, తాము పెంచుకుంటున్న పక్ష్యాదులకు గాని అనా రోగ్యం సంభవించినపుడు ప్రకృతిలో లభించే ఆకులు, ఆకు పసరు, మంత్ర తంత్రుల ఆధారంగా రోగ నివారణకు ప్రయత్నిస్తారు. ఈ విధానం నేటికీ కడప జిల్లా జానపదుల్లో సాగుతూవస్తోంది.

జానపదుల వైద్యాన్ని గ్రామ సీమల్లో నాటువైద్యం అని వ్యవహరిస్తారు. భారతదేశం గ్రామీణ ప్రాంతాలకు నిలయం. నిత్యజీవితంలో జానపదులు ఎదుర్కొంటున్న తమ దేహసంబంధం, మానసిక సంబంధమైన మరియు తమజీవన సహకారులైన జంతువులు, పక్ష్యులు మొదలైన వాటికి ఎదురైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించు కోవడంలో భాగంగా, గ్రామ దేవతలను పూజించడం, మ్రొక్కులు చెల్లించడం, బలులు ఇవ్వడం, ఆకులను, ఆకు పసరులను మందుగా వినియోగించడం చేస్తుం టారు. కడప జిల్లా జానపదులు ఆశ్రయించే వైద్య విధానాన్ని మూడు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి మనుష్యుల వైద్యం, భూత వైద్యం, పశు పక్ష్యాదుల వైద్యం.

మనుష్యుల వైద్యం :

మనుష్యులకు సంక్రమించే రోగాలను నివారించడం కోసం చేసే వైద్యవిధానాన్ని మనుష్యుల వైద్యం అంటారు. ప్రకృతిలో సంభవించే మార్పుల కారణంగా, జానపదుల ఆహారపుటలవాట్ల ద్వారా ఒక్కొక్క సారి జాన పదులు అనారోగ్యానికి గురి అవుతుంటారు. ఈ సమస్యల పరిష్కా రాలుగా వివిధ దశాలలో వివిధ రకాలైన వైద్యం చేయించుకోవడం జానపదులకు అలవాటు ముఖ్యంగా శిశువులను ఆశ్రయించే ఆరోగ్య సమస్యలు, పెద్దలకు ఎదురయ్యే అనారోగ్యానికి పరిష్కారాలు క్రింద సూచించిన విధంగా ఉన్నాయి.

శిశువులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు - వైద్యం :

మనిషి జీవితంలో శైశవ దశ ప్రధానమైంది. ఈ సమయంలో శిశువుల అమాయకత్వం మనకు జ్యోతకం అవుతుంది. జోగాడడం, నడవడం అలవాటైన శిశువులు ఏది మంచి, ఏది చెడు అని ఆలోచించే జ్ఞానం ఉండదు. చేతికి దొరికిన వస్తువులను, పదార్థాలను వెంటనే నోటికి అందించడం, వాటిని త్రాగడం చేస్తుంటారు. తద్వారా అనేక రోగాలకు గురిఅవుతుంటారు. తల్లిదండ్రులు తమపనులలో తాము నిమగ్నమై ఉన్నపుడు శిశువులు అపరిశుభ్ర ప్రదేశాలలో తిరగడం, మట్టి, దుమ్ములాంటివి మీద పోసుకోవడం, బరువైన వస్తువులు మీద వేసు కోవడం ద్వారా అనారోగ్యానికి గురి అవుతారు. చిన్న పిల్లలు సాధారణంగా కోరింతదగ్గు, తరచుగా జ్వరం, కొన్ని కొన్ని సందర్భాలలో అతిసార వ్యాధులకు గురి కావడం సహజం.

వరుస జ్వరం :

దీనినే ఆధునిక పరిభాషలో టైఫాయిడ్ అంటారు. మలేరియా కూడా ఇలాంటిదే. ఈ జ్వరం దోమల ద్వారా మనుష్యులను ఆశ్రయిస్తుంది. రోజు మార్చి రోజు శరీరంలో ఉష్ణోగ్రత పెరగడం వల్ల ఈ జ్వరాన్ని కడప జిల్లా జానపదులు వరుస జ్వరం అంటారు. మిరియపు గింజలు, వెల్లుల్లి రెబ్బలను మిశ్రమంగా నూరి ఒక గుడ్డలో కట్టి శిశువుల మెడకు గాని, చేతి మనికట్టు వద్దగాని కడతారు. అప్పుడప్పుడూ ఈ మిశ్రమం వాసన పీల్చడం ద్వారా జ్వరం నయం అవుతుందిని జానపదుల భావన.

నెలల సంధి లేదా బేదులు :

చిన్న పిల్లలకు దంతాలు మొలిచే సందర్భంలోను లేదా కొన్ని మార్లు మామూలుగా అస్వస్థతకు గురికావడమే గాక బేదులకు గురి అవుతుంటారు. కారణం తల్లి తీసుకొనే ఆహార లోపం మూలంగా కూడా ఇలా జరుగుతూ ఉంటుంది. ఈ అనారోగ్యాన్ని నివారించడం కోసం జానపదులు పాటు చెక్క కట్టించడం, కాటికాపరి వద్ద విభూతి పెట్టించడం వంటివి చేస్తారు.

పెద్దవారికి ఎదురయ్యే ఆరోగ్యసమస్యలు - వైద్యం :

పుష్టికరమైన ఆహారం స్వీకరించకపోవడం వల్ల, దైనందిన కార్యక్రమాలలో పాల్గొన్నపుడు ప్రకృతి ద్వారా సంభవించే అనారోగ్య సమస్యలు పెద్దవారికి కూడా ఎదురౌతాయి. అవి అజీర్తి, పచ్చకామెర్లు, పార్శ్వపునొప్పి, మసూచి, కలరా వంటి అనారోగ్య సమస్యలు.

అజీర్తి :

అతిగా తినడం వల్ల, తమ ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు తినడం వల్ల ఈ అజీర్తి సమస్య ఎదురౌతుంది. సాధారణంగా జానపదులు సరియైన వేళకు భుజించరు. వీలైనపుడు మాత్రమే భోంచేయడం వీరికి అలవాటు. తద్వారా అజీర్తి కలుగుతుంది. దీని నివారణ కోసం జానపదులు తమ వంటింటిలోని ధనియాలను నమిలి మ్రింగడం, జీలకర్ర నిమ్మరసం కలిపి త్రాగడం, మజ్జిగలో జీలకర్ర పొడి, ఉప్పు కలుపుకొని త్రాగడం వంటివి చేస్తారు.

పచ్చకామెర్లు :

సూక్ష్మక్రిములు రక్తంలో చేరి మార్పులు తెచ్చిన కారణంగా పచ్చకామెర్ల వ్యాధి సంక్రమిస్తుంది. దీనినే పసరికలు అని కూడా అంటారు. కారణం కళ్ళు పచ్చగా మారడం, మూత్రం పచ్చగా రావడం, దేహం నిస్సత్తువుఆ ఉండడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు.ఈ వ్యాధి నివారణ కోసం జానపదులు ఎడమ మోచేతి వద్ద రచ్చ వేయించుకుంటారు. ఈ రచ్చ వేసే వారు జమ్మలమడుగు మండలం దత్తాపురంలో ఉన్నారు. మజ్జిగతో కూడిన ఆహారం మాత్రమే తీసుకుంటారు. పచ్చకామెర్ల వ్యాధికి పసరుమందు తీసుకోవడం కూడా జానపదులు ఆశ్రయించిన వైద్యం. ఈ పసరు వారంలో గురువారం మరియు ఆదివారం మాత్రమే ఇస్తారు. మజ్జిగతో ఈ ఆకు పసరు త్రాగడం ద్వారా పచ్చకామెర్ల వ్యాధి నయమౌతుందని కడప జిల్లా జానపదులు నమ్ముతారు.

పార్శ్వపు నొప్పి :

ఇటీవలి కాలంలో దాదాపు నాలుగు శాతం ప్రజలు పార్శ్వపు నొప్పితో బాధ పడుతున్నారు. దీనినే జానపదులు ఒంటి చెంప నొప్పి అని వ్యవహరిస్తారు. ప్రతి దినం సూర్యోదయం మొదలు మిట్టమధ్యాహ్నం వరకు పార్శ్వ భాగంలో ఏదో ఒక వైపు నొప్పిగా ఉండడాన్ని పార్శ్వపు నొప్పి అంటారు. ఈ నొప్పి మనిషిని బాగా కృంగదీస్తుంది.

పార్శ్వపు నొప్పి నివారణ కోసం కడప జిల్లా జానపదులు గుర్రం నాడాతో తయారుచేసిన మెట్టెను కాలి బొటన వ్రేలుకు ధరించడం ద్వారా లేదా గుర్రపుతోక వెంట్రుకలతో తయారుచేసిన సన్నని తాడును కాలిబొటన వ్రేలుకు కట్టుకొనడం వంటివి చేస్తారు.

మసూచి :

మసూచి అనేది ఒక అంటువ్యాధి. ఆటలమ్మ అనే తట్టు అని మసూచిని జానపదులు వ్యవహరిస్తారు. రోగి శరీరంపై బొబ్బలు (దద్దుర్లు) రావడం, కడుపులో మంటగా ఉండడం ఈ వ్యాధి అక్షణాలు. ఈ వ్యాధి సోకిన వారిని ప్రత్యేక గదిలో ఉంచుతారు. అంటువ్యాధి కావడం వల్ల ఇతరులు రోగిని స్పరించుకుండా చూస్తారు.

వేప చిగురును పసుపుతో కలిపి నూరి చిన్నచిన్న ఉండలుగా చేసి రోగికి చేతి తినిపిస్తారు. వేపచిగురు, పసుపు కలిపిన మిశ్రమాన్ని బండారు అంటారు. ఈ మిశ్రమాన్ని రోగి శరీరమంతా పూస్తారు. రోగికి నిరంతరం మజ్జిగ మాత్రం ఇస్తారు. మజ్జిగతో కలిపిన అన్నం ఆహారంగా ఇస్తారు. శరీరంపై వచ్చిన బొబ్బలు (పొక్కులు) మానిన వెంటనే రోగికి బండారు పూసి స్నానం చేయిస్తారు.

మసూచి సంక్రమించిన ఇంటివారు గంగమ్మకు బలి ఇస్తానని మ్రొక్కుకుంటారు. ఏదో ఒక రోజు గ్రామ

దేవతకు బలి ఇవ్వడం కూడా జానపదుల ఆచారం.

మహిళలకు సంక్రమించే వ్యాధులు - వైద్యం :

మనుష్యులలో జీవశాస్త్ర సంబంధంగా మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు ప్రత్యేకమైనది. మహిళలు ఋతుచక్రంలో బహిష్టు కావడం ఒక పరిణామం. జన్యులోపం కారణంగా కొంతమంది మహిళలు బహిష్టు సరియైన వయసులో రాకపోవడం బహిష్టుసమయంలో కడుపునొప్పి రావడం, వివాహనంతరం కొంత మంది మహిళలకు సంతానం కలుగక పోవడం, గర్భవతులుగా ఉన్న సమయంలో పాలు సరిగా పడక పోవడం వంటివి మహిళలు ముఖ్యంగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు. జన్యులోప కారణంగా కొంతమంది యువతులు వయసు వచ్చినా సమర్థ కాకపోవడం జరుగుతుంది. కడప జిల్లా జానపదులు సమర్థకాని యువతికి ఆకు పసరు మజ్జిగతో త్రాగిస్తారు. ఈ ఆకు పసరు ఇచ్చేవారు ప్రత్యేకించి గ్రామాలలో అక్కడక్కడ ఉన్నారు. ఈ ఆకు పసరే వైద్యంగా పరిగణిస్తారు. సుమారు అరవైశాతం మహిళలు బహిష్టు సమయంలో భరించరాని కడుపు నొప్పికి గురి అవుతారు. ఇలాంటి సమయంలో కొంత మంది మహిళలు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు కూడా పాల్పడుతుండడం జరుగుతోంది. బహిష్టు సమయంలో కడుపు నొప్పి రాకుండా ఉండడానికి జాన పదులు ఆకుపసరును సేవించడం వైద్యంగా భావిస్తారు.

సాధారణంగా ప్రసవించిన మహిళల్లో కొంతమందికి బిడ్డకు సరిపడ పాలు ఉండవు. కారణం మహిళల బలహీనంగా ఉండడం, జన్యులోపం, లేదా బలవర్ధకమైన ఆహారం తీసుకపోవడం, బిడ్డకు అవసరమైన పాలు పడడానికి బాలింతకు పొట్టేలు లేదా మేకపోతు తల మాంసాన్ని వైద్యంగా ఇస్తారు. లేదా ఆకు పసరు తీసు కోవడం కూడా వైద్యంగా భావిస్తారు.

జానపదుల భూత వైద్యం :

భూతవైద్యం మంత్ర తంత్రాలతో కూడుకున్నది. జానపద ప్రాంతాలలో నివశిస్తున్న కాటికాపరులు, మంత్రగాళ్ళు, ప్రత్యేకించి కొంత మంది వ్యక్తులు దేహ సంబంధమైన నొప్పులకు కత్తులు, కొడవళ్ళతో మంత్రిం చడం వంటివాటిని భూతవైద్యం అంటారు.

నాడీ శాస్త్రం జాతీయ సంస్థ (NIMHANS) 2016 లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం దాదాపు 14 శాతం మంది భారతీయులు మానసికంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2017 లో భారతీయుల్లో 20 శాతం మంది తమ జీవితంలో ఏదో ఒక దశలో నిరాశా నిస్పృహలతో బాధపడే అవకాశం ఉంది. భారత దేశ జనాభా 130 కోట్లు. దేశంలో మానసిక వైద్యనిపుణులు 4 వేల మంది మాత్రమే. కానీ రోగులు మాత్రం 26 కోట్ల మంది ఉన్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

పేదరికం, అజ్ఞానం, నిరక్షరాశ్యత ఎక్కువగా గల ప్రాంతాలలో మానసిక రుగ్మతలు కూడా అధికంగానే కన్పిస్తాయి. ముఖ్యంగా జానపద ప్రాంతాలలో నిరక్ష రాశ్యత ఎక్కువగా ఉంటుంది. కారణం జనపదాలన్నీ వ్యవసాయరంగం మరియు ఇతర కుటీర పరిశ్రమల ఆధారంగా జీవనం సాగిస్తూ ఉంటాయి. చాకలి, మంగలి, కుమ్మరి, కుమ్మరి వంటి కుటీర పరిశ్రమలన్నీ కూడా వ్యవసాయరంగ ఆదాయంమీద ఆధారపడి ఉంటాయి. కాబట్టి ముఖ్యంగా వ్యవసాయం ఋతుపవనాల ఆధారంగాను, ప్రాచీనకాలంలో భూమి అంతర్భాగంలో ఉన్న నీటిని బావుల ద్వారా, బయటికి తోడడానికి కపిలను ఆశ్రయించడం వల్ల జానపద ప్రాంతాలలో అతివృష్టి, అనావృష్టికి గురియై పేదరికం తాండవించేది. దీనికి తోడు పాఠశాలలు చాలా దూరప్రాంతాలలో ఉండడం వల్ల, వ్యవసాయపనుల్లో తమసంతానాన్ని జానపదులు వినియోగించడం వల్ల నిరక్షరాశ్యత కూడా అధికంగా ఉండేది.

పైన చెప్పిన కారణాల నేపథ్యంలో జానపదులు మానసిక రుగ్మతలకు లోను కావడం, వ్యవసాయ పనులు చేసే సమయంలో అవయవాలు చాలా వరకు నొప్పులకు

గురి కావడం జరిగేది. వీటి నివారణ కోసం జానపదులు భూతవైద్యాన్ని ఆశ్రయించడం అలవాటు. సాధారణంగా దయ్యం పట్టిందనడం, నడుములు ఇరుకు పట్టడం, దేహం అంతా నొప్పులకు గురికావడం వంటివి జాన పదులు ఎదుర్కొంటున్న సమస్యలు. వీటికి నివారణ కోసం జానపదులు ఎలాంటి భూతవైద్యాన్ని ఆశ్రయిస్తారో తెలుసుకుందాం.

దయ్యం ఆవహించడం - వైద్యం :

గ్రామ పొలిమేరల్లో గల బావులలోకి దూకి గాని లేదా ఆ ప్రాంతాలలో ఉరివేసికొని ఆత్మహత్య చేసుకున్నావారి గురించి విషయాలు పెద్దలు కథలుగా పిల్లలకు చెప్పడం వల్లకాని, లేదా ఆ గ్రామంలోని వ్యక్తులు ఎవరైనా ఆత్మహత్య చేసుకొని మరణించిన విధానం తెలిసిన గ్రామస్థులు ఒంటరిగా వెళ్ళినపుడు వారు గుర్తుకు తెచ్చుకొని భయపడ్డం జరుగుతూ ఉంటుంది. మానసి కంగా దుర్బలులైన వారు వారిగురించి వారి చేష్టలు గురించి గుర్తుకు తెచ్చుకొని వారిమాదిరే మాట్లాడం, వదరడం వంటివి చేస్తుంటారు. సాధారణంగా మహిళలే ఎక్కువగా ఇలాంటి మానసిక రుగ్మతలకు గురి అవు తుంటారు. ఇలాంటి వారికి దయ్యం పట్టిందని కాటి కాపరితో గాని, సమీపంలో పేరుపొందిన మంత్రగాడికి గాని చూపిస్తారు.

మంత్రగాడు శ్మశానవాటికలో ముగ్గువేసి, మైదా పిండితో ఒక బొమ్మను చేసి ఆముగ్గులో దయ్యం పట్టిం దని భావించే మనిషిని కూర్చుండ బెట్టి ఎవరిని గురించి అలవాట్లను, అనుభవాలను గురించి ఆ మనిషి చెబు తుందో ఆమెను వేపమండలతో కొడుతూ మంత్రాలు చదువుతూ వెంట్రుకలు పట్టుకొని చాలా తీవ్రంగా హింసి స్తాడు. ఆ హింసకు బలియైన దయ్యం పట్టిన మనిషి మూర్చలోకి వెళ్ళిపోతే దయ్యం పోయిందని, తాను విడిపించానని చెబుతాడు. చూసే వారందరికే నిజంగా దయ్యాన్ని పారద్రోలాడని భావిస్తారు. దయ్యం పట్టడాన్నే గాలి సోకిందని కూడా అంటారు.

1976 ప్రాంతంలో లక్కిరెడ్డి పల్లె ప్రాంతంలో గల బాలతిమ్మయ్యగారి పల్లెలో ఒక మంత్రగాడుండేవాడు. అతని పేరు బాలచెన్నయ్య కాని బాలచెన్ని అనేవారు. దయ్యాలు విడిపించడంలో ఈయన సిద్ధహస్తుడని నాటి జానపదుల నమ్మకం. ఇలా దయ్యాలు విడిపించడంలో కాటికాపరులు కూడా సిద్ధహస్తమే.

మానసిక ఒత్తిడికి గురియై బాధపడుతున్నవారికి స్వస్థత చేకూర్చడం కోసం కొంతమంది అక్కదేవతల పూజను కూడా ఆశ్రయించడం కడప జిల్లా జానపదుల అలవాటు, మానసిక ఒత్తిడికి లోనైనా వ్యక్తి గృహంలో అక్కదేవతల పూజలు చేస్తారు. అక్కదేవతలు ఆవ మోస్తారనే భావనతో కొంతమంది ఊగుతూ, పాటలు పాడి పూజలు నిర్వహిస్తారు. ఇదంతా ఒక హిస్టేరియా కాని వీటిపై జానపదులకు ఎక్కువ నమ్మకం.

బండెన్న, చిన్నగిరిమల్లన్న, నాగమణెమ్మ, చినగిరి తుల్లమ్మ, పెదగిరి మల్లమ్మ వంటివారిని అక్కదేవతలుగా భావించడం జానపదుల నమ్మకం.

జానపదుల పశువుల వైద్యం :

జానపదుల జీవన సహకారులైన జంతువులకు, పక్షులకు అనారోగ్య సమస్యలు ఎదురైనపుడు తగిన వైద్యం చేయించేవారు. ముఖ్యంగా గేదెలు, ఆవులు, ఎద్దులు, కోళ్ళు, మొదలైనవి జానపదుల జీవన సహకారులు.

పాలు, పెరుగు, వెన్న, నెయ్యితో బాటు పంటలకు అవసరమైన సారవంతమైన ఎరువు ఆవులు, గేదెల ద్వారా జానపదులకు లభిస్తాయి. అందువల్ల వాటి ఆలనా, పాలనా బాధ్యతరైతులదే. అదేవిధంగా బావుల నుండి నీళ్ళు తోడడానికి కవిలకు, దుక్కుదున్నడానికి, విత్తనం వేయడానికి, పండించిన పంటను ఇంటికి చేర్చడానికి ఎద్దులు అత్యంత ఉపయోగకరంగా ఉండేవి. వీటికి దెబ్బలు తగిలినపుడు లేదా ఆరోగ్యసంబంధ సమస్యలు ఎదురైనపుడు రైతులు వైద్యం చేయిస్తారు. ముఖ్యంగా పశువులకు అజీర్తి వ్యాధి, గాలికుంట్లు, కాలుకుంటడం, దెబ్బలు తగలడం వంటివి జరుగుతుంటాయి.

అజీర్తి, కడపుఉబ్బడం – వైద్యం :

ఒక్కొక్కపుడు పశువులకు అజీర్తి (జీర్ణంకాకపోవడం) జరుగుతుంటుంది. ఇలాంటి సమయాలలో వాము నీళ్ళును ఎక్కువ త్రాపుతారు. తద్వారా పశువులకు ఎదురైన అజీర్తి తగ్గుతుంది.

గాలికుంట్లు – వైద్యం :

గాలికుంట్లు వల్ల పశువులకు గిట్టలు చీలడం, నడవడానికి కష్టంగా ఉండడం, నెమరు వేయడానికి ఇబ్బంది కలుగడం, నోటిలో పుండ్లు పుట్టడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి నివారణ కోసం ఆకు పసరు త్రాపడం, పెసలు ఉడకబెట్టి పెట్టడం వంటి వైద్యం చేస్తారు.

ముగింపు :

ముఖ్యంగా జానపదులు మనుష్యుల వైద్యంలో గాని, భూతవైద్యంలో గాని, పశువుల వైద్యంలో గాని, వాడే ఆకు పసరు పేర్లు చెప్పరు. అది కేవలం ఒకటి లేదా రెండు కుటుంబాల వారు మాత్రమే వంశపారంపర్యంగా వైద్యం చేస్తుంటారు. ఆకు పసరు విషయం ఇతరులకు చెబితే ఆ మందు సరిగా పనిచేయదని జానపదుల నమ్మకం. ఏదిఏమైనా కడప జిల్లా జానపదులు తమకు గాని, తమ జీవనానికి సహకరించే పశువక్ష్యాదులకు గాని వైద్యం చేయించడానికి శతవిధాల ప్రయత్నం చేస్తారు. అందునా రాయలసీమలో జానపద ప్రజలకు మూఢ విశ్వాసాలు, శకునునాలు, నమ్మకాలు ఎక్కువ. వీరు ప్రస్తుత డాక్టర్ల దగ్గరకు పోకుండా ఇంటి వైద్యం, గ్రామంలో వైద్యం లేదా నాటు వైద్యుల దగ్గర ఇప్పటికి వైద్యం చేయించుకుంటారు. ఈ విధంగా జానపదవైద్య విధానం ఉంటుంది.

ఉపయుక్త గ్రంధాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. - సుందరం. పేజి. 324.
2. కడప జిల్లా జానపద సంస్కృతి, పరిశీలన - మొగలికాలువ పెంచలయ్య - పుట. 55-65.
3. జానపద విజ్ఞానాధ్యయనం - పేజి. 237.
4. విషయసేకరణ : గుర్రాలవీరయ్య - కన్నెలూరు గ్రామం - జమ్మలమడుగు మండలం.
5. విషయసేకరణ : దొంతిరెడ్డి మని రెడ్డి - గొల్లల గూడూరు గ్రామం, వేముల మండలం.
6. విషయసేకరణ : కన్నెగాడి పెదగాటిపాపయ్య, కమలాపురం మండలం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పెద్దింటి అశోక్‌కుమార్ రచనల్లో సామెతలు – పరిశీలన

– ఖ. ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ , తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్, హైదరాబాద్.

సామెతలు గ్రామీణ ప్రజల నిత్య వ్యవహారంలో వినిపించే జీవిత సత్యాలు. భాష ప్రత్యేక అస్తిత్వాన్ని, సాంస్కృతిక నేపథ్యాన్ని తెలుసుకోవడానికి ఇవి ఎంతో తోడ్పడతాయి. "వ్యక్తుల స్వీయానుభూతుల్లోంచి, సామాజిక ఆచరణలోంచి పొందిన అనుభవాల సారమే సామెత". మౌఖిక సాహిత్యంలో భాగమై, సామెత కవులు తమ గ్రంథాల్లో ప్రసంగానుగుణంగా వాడుకోవడం కనిపిస్తుంది. సామెత అనుభవాల నుండి పుడుతుంది. కాబట్టి అనుభవాలు నిరంతరం ఎన్నో కలుగుతుంటాయి. కాబట్టి సామెతలు నిరంతరం పుడుతూ నూతనత్వాన్ని పొందుతుంటాయి. సామెతల్లో మార్పులు రావచ్చు. పాత పదాల స్థానంలో కొత్త పదాలు చేరవచ్చు. వాక్య నిర్మాణంలో మార్పు రావచ్చు. పాత సామెత స్థానంలో తమ నూతన జీవితానుభవాన్ని జోడించి కొత్త సామెత తయారు చేసుకోవచ్చు. ప్రాచీన శబ్దం వ్యవహారంలో లేనప్పుడు దాని స్థానంలో వ్యవహారంలోని నూతన పదాన్ని వాడవచ్చు. ఒక సామెతను ఉపయోగించి అనంతార్థాన్ని వ్యక్తం చేయడం దీని ప్రత్యేకత.

ఒక తరం నుండి మరో తరానికి వస్తున్న వారసత్వ జానపద సంపదలో సామెత ఒకటి. ఇది ఎక్కువగా యతి ప్రాసలతో, గమకాలతో కూడి అక్షరరమ్యత కలిగి ఉంటాయి. సామెతలో ముఖ్యంగా ఉపమాన, ఉపమేయ అను రెండు భాగాలచే ఏర్పడి సరళమైన భాషలో జనాల నోటిలో నానేలా మనసుకు హత్తుకునేవిగా ఉంటాయి. ఒకే భాష అయిన ఒక్కొక్క ప్రాంతంలో ప్రాంతీయమైన యాసలతో, భిన్న పదాలతో సామెతలు విభిన్నరకాలై శబ్ద చమత్కారం కలిగి ఆ భాషకు సౌందర్యాన్ని చేకూరుస్తాయి. ప్రాచీన కవులైన అల్లసాని పెద్దన, వేంకటకవి మొదలుకొని వేమన రాతలతో జీవితసత్యాలను నింపుకొని ఆధునిక కాలంలోని రచయితలకు మార్గదర్శకమై తెలుగు భాషా సౌందర్యాన్ని నిలబెట్టిన జానపద ప్రక్రియ సామెత.

ఆధునిక రచయితలు తమ రచనల్లో విరివిగా ఈ సామెతలను వాడుతూ ఆ రచనలను చాలా సహజత్వంతో సామాన్యుల దగ్గరకు చేరుకునేలా రచనలు చేస్తున్నారు. అలాంటి రచయితల్లో ప్రముఖులు పెద్దింటి అశోక్‌కుమార్‌గారు. ఒక రచన వాస్తవికతకు దగ్గరగా ఉండి, సహజ పరిస్థితులను ప్రతిబింబిస్తూ, ప్రజల వ్యవహార భాషకు దగ్గరగా ఉన్నప్పుడే ఆ రచన సామాన్యుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అలాంటప్పుడే రచయిత తాను చేసిన రచన వల్ల సఫలీకృతుడౌతాడు. సామాన్య పాఠకులనే కాకుండా జానపదుల హృదయాలను సైతం తడిమి చూడగల రచయిత పెద్దింటి అశోక్‌కుమార్. ఈయన తన రచనల్లో సామాన్యుల నిత్యవ్యవహారంలో ఉండే పదాలు, పదబంధాలు, నుడికారాలు, సామెతలు వంటి వాటిని ప్రయోగిస్తూ తెలుగు భాషలోని తెలంగాణ మాండలికానికి వన్నె తెచ్చారు. తాను ఎంచుకునే రచనల్లో సహజత్వాన్ని ప్రదర్శిస్తూ జానపదుల జీవన స్థితిగతులను ప్రతిబింబింప చేస్తున్నాడు. పెద్దింటి రచనల్లోని జానపదుల నోళ్లలో సైతం నానిన కొన్ని సామెతలను ప్రస్తావించదలచుకున్నాను.

"బెల్లం గొట్టిన రాయి లెక్క అట్లనే ఉంటివి"

(జిగిరి, పుట 20) నిశ్చేష్టుడై ఉండడం.

తరగతి గదిలో ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పక విద్యార్థి మౌనంగా ఉన్న స్థితిలో ఉపాధ్యాయుడు ఆ విద్యార్థిని ఉద్దేశించి ఈ సామెతను వాడతాడు.

"గూడు కూలిన పక్షి"

(జిగిరి, పుట 20) ఆశ్రయాన్ని కోల్పోవడం.

ఒక వ్యక్తి తన జీవిత సర్వస్వాన్ని కోల్పోయిన సందర్భాల్లో ఈ సామెతను విరివిగా వాడుతుంటారు.

"ధనం దాసుక తిరుగాలె రోగం చెప్పుక తిరుగాలె"

(జిగిరి, పుట 42) లొక్యాన్ని ప్రదర్శించడం.

మానవ ప్రవృత్తులను గమనించినవారిగా ధనాన్ని దాచుకోవాలని, బాధలను చెప్పుకోవాలని అంటారు. ఎందుకంటే మనిషి సహజ నైజం, ఎదుటివారి దృష్టిలో ఈర్ష్య, అసూయలకు కారణం కావాలని ఎవరూ అనుకోరు. ఇతరులు వారిపై జాలి, ప్రేమను కురిపించాలనే కోరుకుంటారు. కాబట్టి ఇలాంటి సందర్భంలో ఈ సామెతను వాడతారు.

"ముడితె బతకని పిల్ల ముద్దాడితె బతుకుతదా"

(జిగిరి, పుట 44) మృదుత్వం, సుకుమారత్వం.

వధువును అత్తగారింటికి పంపించేటప్పుడు కూతురుపై ప్రేమగల తల్లి తన వియ్యపురాలితో తన కూతురిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పినప్పుడు. ఆమె వ్యంగ్యంగా ముడితె బతకని పిల్ల ముద్దాడితే బతుకుతదా... అంటూ అనేక సందర్భాల్లో ఈ సామెతను వాడుతారు.

''వూచినయన్ని వూలైతయా కాచినయన్ని కాయలైతయా"

(జిగిరి, పుట 48) సానుకూల దృక్పథం.

ఒక వ్యక్తి కష్టానికి తగిన ప్రతిఫలం అందనప్పుడు నిరాశ నిస్పృహలకు లోనైన వ్యక్తిని గురించి ఓదార్చే టటువంటి సందర్భాల్లో ఈ సామెతను ఎక్కువగా వాడుతారు.

"అడ్డెడడ్లకు ఆకులు తెంపపోతే... బుడ్డెడడ్లు దుడ్డె బుక్కిపాయె"

(జిగిరి, పుట 78)

స్వల్ప ప్రయోజనానికి అధిక ప్రయోజనాన్ని కోల్పోవడం.

మార్కెట్‌లో సరుకులు తక్కువ ధరకే వస్తాయని తీసుకుంటే అవి అనతికాలంలోనే పాడైపోయిన సంద ర్భాల్లో ఈ సామెతను వాడుతారు.

"నవ్వేటోల్ల ముందు కాలుజారి పడ్డట్టు"

(లాంగ్ మార్చ్, పుట 107) అవమానపడటం.

సమాజంలో అవమానాలు పడుతున్న తండ్రి తన కొడుకును ప్రయోజకుడిని చేయాలనుకున్నప్పుడు ఆ కొడుకు దానికి విరుద్ధంగా సమాజానికి చీడపురుగువలె మారినపుడు ఆ కొడుకును ఉద్దేశించి ఆ తండ్రి ఆవే దనలో నుంచి వచ్చేదే ఈ సామెత.

"అగ్గిని, సూదిని ఎవరు ముల్లె గట్టలేరు"

(లాంగ్ మార్చ్, పుట 123) సాధ్యం కానిది.

సామాన్యుడైనా, ధనవంతుడైనా చివరకు మృత్యు ఒడిని చేరాల్సిందే. ఆ మరణాన్ని ఎవరూ ఆపలేరు. ఇటువంటి సమయాల్లో ఈ సామెతను విరివిగా వాడ తారు.

"వదురవట్టిన నోరు ఆగుతదా... తిరుగవట్టిన కాలు ఆగుతదా"

(ఊరికి ఉప్పలం, పుట31) సహజ లక్షణం.

తోటి స్నేహితులతో మాటల్లో మునిగి సమయాన్ని మరిచి ఆలస్యంగా ఇంటికి చేరిన కొడుకును చూసిన తల్లి ఈ సామెతను వాడుతుంది.

"దున్నంగవోయి దులపంగ వత్తివి"

(లాంగ్ మార్చ్, పుట 55) సోమరిపోతు.

పనిని ప్రారంభించే సమయంలోనే తప్పించుకొని, తిరిగి ఫలితాన్ని అందుకునే సమయంలో పంపకాలకు వచ్చేవాళ్లను ఉద్దేశించి ఈ సామెతను ఎక్కువగా వాడ తారు.

"తల్లేడు బర్లు దొంగ బర్లె... అన్నట్టు అందరి మాట ఒక్కటే"

(లాంగ్ మార్చ్, పుట 04) ఏకాభిప్రాయం.

ఒక తండ్రి సంతానం అందరూ ఒకే మార్గంలో వెళ్లినా, ఒకే ఆలోచనా దృక్పథం కలిగినా తోటివారు వారిని ఉద్దేశించి ఈ సామెతను వాడతారు.

"తన తప్పు తప్పు గాదు... తన బిడ్డ దొంగ గాదు"

(సంచారి, పుట 16) సమర్థించుకోవడం.

పిల్లలు ఎన్ని తప్పులు చేసినా తల్లిదండ్రులు వారిపై గల ప్రేమతో, వెనకేసుకువచ్చిన సమయంలో తోటివారు ఈ సామెతను వాడటం జరుగుతుంది.

"తెంపి ముడేసిన తాడు ఎంత కురుచనో"

(ఊరికి ఉప్పలం, పుట 26) చులకన భావం.

భర్తను కోల్పోయిన భార్య మాట్లాడే మాటలకు, తీసుకునే నిర్ణయాలకు, సమాజం ఇచ్చే విలువ ఎలాంటిదో తెలిపే సందర్భంలో ఈ సామెతను ఎక్కువగా వాడుతారు.

"ఈతాకు ఇత్తరు, తాటాకు తీత్తరు"

(ఊరికి ఉప్పలం, పుట 27) మోసపూరిత స్వభావం.

మానవ ప్రవృత్తులలో ఒకటైన మోసపూరిత స్వభావాన్ని అంచనా వేస్తూ అటువంటివారితో జాగ్రత్తగా ఉండమని హెచ్చరికలు చేస్తూ ఈ సామెతను వాడతారు.

"ఇరకరాని గండ్లె ఇరికి ఇగిలిచ్చినట్టాయ బతుకు"

(లాంగ్ మార్చ్, పుట 110)

అనుకోని సమస్యల్లో చిక్కుకుని విలవిల్లాడే సమయంలో, తోటివారు వారిని చూసి అపహాస్యం చేస్తున్న సందర్భంలో తనకు తానుగా బాధపడుతున్నప్పుడు అతడి అంతరంగాల్లో స్ఫురించేదే ఈ సామెత.

సామెతలు – పోలికలు :

"నోరు మంచిదైతే ఊరు మంచిదైతది"

(జిగిరి, పుట 78) "పిండితీరు రొట్టె"

పెద్దింటి అశోక్‌కుమార్ "నోరు మంచిదైతే ఊరు మంచిదైతది" అనే సామెతను వ్యక్తుల స్వభావాలను బట్టి అతడి వెనక ఉండే జనాన్ని, అతనికి ఉండే గౌరవాన్ని సూచించడానికి ఈ సామెత వాడాడు. ఈ సామెతకు సారూప్యంగా లోక వ్యవహారంలో గల మరొక సామెత "పిండితీరు రొట్టె" కూడా అదే భావాన్ని సూచిస్తుంది. పై రెండు సామెతల్లో ప్రయోగించే శబ్దాలు వేరు వేరు అయినప్పటికీ ఆ సామెతలు ఇచ్చే అర్థాలు ఒక్కటే.

"పిట్ట బెదిరించి... బట్టపేగు ఎత్తుకుపోయిందట"

(లాంగ్‌మార్చ్, పుట 45)

"కుక్క బెదిరించి... చెప్పు ఎత్తుకుపోయిందట"

అశోక్‌కుమార్ "పిట్ట బెదిరించి... బట్టపేగు ఎత్తుకు పోయిందట" అనే సామెతను ఎదుటి వ్యక్తి దర్పాన్ని ప్రదర్శించినప్పుడు అతడిలోని అల్పత్వాన్ని ఎత్తిచూపే సందర్భంలో ఈ సామెతను వాడతారు. ఈ సామెతకు సారూప్యంగా లోకవ్యవహారంలో గల మరొక సామెత "కుక్క బెదిరించి... చెప్పు ఎత్తుకపోయిందట". ఈ సామెత కూడా అదే అర్థాన్నిస్తుంది. పై రెండు సామెతల్లో ప్రయోగించే పదాలు వేరైనా ఆ సామెతల శబ్దం, లయ, అర్థాలు ఒకేవిధంగా కనిపిస్తాయి.

"గంట ఎగిరిందని ఎద్దు ఎగురుతదా!"

(లాంగ్‌మార్చ్, పుట 55)

"ఎద్దు ఎగరంగనే గంట ఎగురుతదా!"

అశోక్‌కుమార్ "గంట ఎగిరిందని ఎద్దు ఎగురుతదా" అనే సామెతను తన శక్తి సామర్థ్యాలను మరిచి ఒక వ్యక్తి విర్రవీగే సందర్భంలో అణుకువ, సామర్థ్యం కలిగిన వ్యక్తి ఆయనను ఉద్దేశించి దీనిని విరివిగా వాడతారు. ఈ సామెతకు దగ్గరగా లోకవ్యవహారంలో ఉండే మరొక సామెత "ఎద్దు ఎగరంగనే గంట ఎగురుతదా". పై రెండు సామెతల్లో పదాల స్థానాలు మాత్రమే మారాయిగాని అవి ఇచ్చే అర్థం, లయ, శబ్ద సౌందర్యం అన్నీ ఒకేవిధంగా ఉన్నాయి.

"గవ్వ రాకడ లేదు... గడియ రికాం లేదు"

(ఊరికి ఉప్పలం, పుట 63)

"గడియ నిలకడ లేదు... గవ్వ రాకడ లేదు"

అశోక్‌కుమార్ "గవ్వ రాకడ లేదు... గడియ రికాం లేదు" అనే సామెతను ప్రయోజనం లేని పనులను చేస్తూ సమయాన్న వృధా చేసి, ఆ పనుల వల్ల ఎటువంటి

ఆదాయం లేనివారిని ఉద్దేశించి దీనిని వాడతారు. ఈ సామెతకు దగ్గరగా నిత్యవ్యవహారంలో ఉండే మరొక సామెత ''గడియ నిలకడ లేదు... గవ్వ రాకడ లేదు''. పై రెండు సామెతల్లో పదాల స్థానాలు మారుతూ కొత్త పదం ''రికాం'' ఇందులో చేరింది. కానీ అవి ఇచ్చే అర్థం, లయ, శబ్దం అన్నీ ఒకేవిధంగా ఉన్నాయి.

''కూట్లె రాయి తియ్యనోడు... ఏట్లె రాయి తీసినట్లు''

(లాంగ్ మార్చ్, 25)

''ఉట్టికి ఎగరలేని అవ్వ... స్వర్గానికి ఎగిరిందట''

అశోక్‌కుమార్ ''కూట్లె రాయి తియ్యనోడు... ఏట్లె రాయి తీసినట్లు'' అనే సామెతను తనవారిని రక్షించలేని వాడు సమాజాన్ని ఉద్ధరిస్తానంటూ అతని సామర్థ్యాన్ని మరిచి ప్రగల్భాలు పలికినప్పుడు అటువంటివారిని ఉద్దేశించి ఈ సామెతను వాడతారు. ఈ సామెతకు నిత్య వ్యవహారంలో ఉన్న మరొక సామెత ''ఉట్టికి ఎగరలేని అవ్వ... స్వర్గానికి ఎగిరిందట''. పై రెండు సామెతల్లో వేరు వేరు పదాలను ప్రయోగించినప్పటికీ పదాల అర్థం, లయ, శబ్ద సౌందర్యం అన్ని ఒకే విధంగా ఉన్నాయి.

''ఆవులు ఆవులు కొట్లాడుకుంటే... ల్యాగల కాళ్లు ఇరిగినట్టు''

(లాంగ్ మార్చ్, పుట 38)

''అన్నదమ్ములు కొట్టుకుంటే... అవుతలోనికి సందైనట్టు''

అశోక్‌కుమార్ ''ఆవులు ఆవులు కొట్లాడుకుంటే... ల్యాగల కాళ్లు ఇరిగినట్టు'' అనే సామెతను అధికార గర్వంచే రాబోయే ప్రమాద పరిణామాన్ని ఊహించక తలపడితే తద్వారా బలహీనులైన తోటివారికి నష్టం వాటిల్లుతుందని తెలిపే సందర్భంలో ఈ సామెతను వాడతారు. ఈ సామెతకు నిత్య వ్యవహారంలో ఉన్న మరొక సామెత ''అన్నదమ్ములు కొట్టుకుంటే... అవుతలోనికి సందైనట్టు''. పై రెండు సామెతల్లో వేర్వేరు పదాలు, వేర్వేరు అర్థాలను ఇచ్చినప్పటికీ పదాల శబ్ద సౌందర్యం, లయ ఒకే విధంగా ఉన్నాయి. ''అన్నదమ్ములు కొట్టుకుంటే అవతలోనికి సందైనట్టు'' అనే సామెతలో ఐకమత్యం లోపిస్తే తనవారిని సైతం దూరం చేయడానికి అవతలివారు ఆసక్తితో చూస్తుంటారని తెలిపే సందర్భంలో దీనిని ఎక్కువగా వాడుతుంటారు.

''కల్లం దగ్గర కడివెడు వడ్లు పోయిన బాధ ఉండదిగని కంచం దగ్గర కశివెడు అన్నంబోతే బాధ ఉంటది''

(ఊరికి ఉప్పులం, పుట 22)

''ఎనుక ఏనుగులు పోయినా ఏంగాదు గాని ముందట చీమలు పోవద్దు''

అశోక్‌కుమార్ ''కల్లం దగ్గర కడివెడు వడ్లు పోయిన బాధ ఉండదిగని... కంచం దగ్గర కశివెడు అన్నంబోతే బాధ ఉంటది'' అనే సామెతను మానవ సహజ ప్రవృత్తులలో ఒకటైన సంపాదనే ధ్యేయంగా తమ ముందు జరిగే చిన్న చిన్న తప్పులను ఎత్తి చూస్తారుగాని, తమ వెనుక జరిగే అంతులేని అనర్థాలను గుర్తించడానికి కూడా ఆసక్తి చూపరు. ఇటువంటి సమయాల్లో దీనిని విరివిగా వాడతారు. ఈ సామెతకు నిత్య వ్యవహారంలో ఉండే మరొక సామెత ''ఎనుక ఏనుగులు పోయినా ఏంగాదు గాని ముందట చీమలు పోవద్దు''. పై రెండు సామెతల్లో వేర్వేరు పదాలను ప్రయోగించినప్పటికీ ఒకే లయ, శబ్ద సౌందర్యం, అర్థం మనకు గోచరిస్తాయి.

''పోశమ్మ కూడవెడితే... మైసమ్మ మాయం చేత్తది''

(ఊరికి ఉప్పులం, పుట 34)

''సొమ్ము ఒకలది... సోకు ఒకలది...''

పెద్దింటి అశోక్‌కుమార్ ''పోశమ్మ కూడవెడితే... మైసమ్మ మాయం చేత్తది'' అనే సామెతను సంపాదించేది ఒకరైతే ఖర్చు చేసేది మరొకరైనప్పుడు ఇటువంటి అనేక సందర్భాల్లో దీనిని విరివిగా వాడుతారు. ఈ సామెతకు నిత్యవ్యవహారంలో ఉండే మరొక సామెత ''సొమ్ము ఒకలది... సోకు ఒకలది...'' ఈ రెండు సామెతల్లో పదాలు వేరైనప్పటికీ భావం మాత్రం ఒక్కటే.

''మీది కుండ మీదుండగనే.. కింది కుండను మాయం జేత్తడు''

(ఊరికి ఉప్పులం, పుట 05)

''తిమ్మిని బమ్మిని జేత్తడు''

పెద్దింటి అశోక్‌కుమార్ ''మీది కుండ మీదుండగనే... కింది కుండను మాయం జేత్తడు'' అనే సామెతను ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా తనకు అనుకూలంగా మార్చుకుని పూట గడుపుకునే వారిని ఉద్దేశించి దీనిని వాడుతారు. ఈ సామెతకు లోక వ్యవహారంలో ఉన్న మరొక సామెత ''తిమ్మిని బమ్మిని జేత్తడు''. పై రెండు సామెతలు అదే అర్థంలో వాడినప్పటికీ వేరు వేరు పదాలు, శబ్దాలు ఇందులో ఉన్నాయి.

"ఒకడు బండ కాడ చూస్తే... ఇంకొకడు కుండ కాడ చూస్తడు"

(సంచారి, పుట 19)

"ఒకడు గట్టు కాడ చూస్తే... ఇంకొకడు నీళ్ల కాడ చూస్తడు"

అశోక్‌కుమార్ ''ఒకడు బండ కాడ చూస్తే... ఇంకొకడు కుండ కాడ చూస్తడు'' అనే సామెతను సమాజ అభ్యున్నతిలో అందరూ భాగమనే విషయాన్ని మరిచి వారి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించక పనులను చేస్తే, ఎదుటివారి నుండి వచ్చే ఫలితం కూడా అదే స్థాయిలో ఉంటుందని తెలిపే సందర్భంలో దీనిని వాడుతారు. ఈ సామెతకు సారూప్యంగా లోకవ్యవహారంలో గల మరొక సామెత ''ఒకడు గట్టు కాడ చూస్తే... ఇంకొకడు నీళ్ల కాడ చూస్తడు''. పై రెండు సామెతల్లో ప్రయోగించే పదాలు వేరువేరుగా ఉన్నప్పటికీ లయ, శబ్దం, భావం మాత్రం ఒక్కటే.

"పందయి పదేండ్లు గాదు... నందై నాలుగేండ్లు బతికితే సాలు"

(లాంగ్ మార్చ్, పుట 39)

"కాకిలా కలకాలం బతికేకంటే... హంసలా ఐదేండ్లు బతికితే సాలు"

అశోక్‌కుమార్ ''పందయి పదేండ్లు గాదు... నందై నాలుగేండ్లు బతికితే సాలు'' అనే సామెతను సమాజానికి నష్టం కలిగించే వ్యక్తులుగా బ్రతికే కంటే, సమాజాన్ని ఉద్ధరించడానికి అనతికాలంలోనే సమిధలైనవారిగా బతకడమే మేలు అనే సందర్భంలో దీనిని ఎక్కువగా వాడతారు. ఈ సామెతకు సారూప్యంగా లోకవ్యవహారంలో ఉండే మరొక సామెత ''కాకిలా కలకాలం బతికేకంటే... హంసలా ఐదేండ్లు బతికితే సాలు''. ఈ సామెత కూడా ఒకే భావాన్ని స్ఫురింప చేస్తుంది. కానీ ప్రయోగించే పదాలు వేరువేరుగా ఉండి శబ్దం, లయ మాత్రం ఒక్కటే.

ముగింపు :

పెద్దింటి అశోక్‌కుమార్ కథా నేపథ్యాన్ని అనుసరించి, కథాగమనంలో భాగంగా తెలంగాణ ప్రాంత సామెతలను ప్రయోగిస్తూ దానికి అనుగుణంగా సహజమైన శైలిలో వాక్యాన్ని నిర్మిస్తాడు. కాబట్టి వారు చేసిన రచనలన్నింటికి ఆయువుపట్టు తెలంగాణ భాషలోని సామెతలే. తెలంగాణ భాషా అస్తిత్వ మూలాలను గురించి తెలుసుకుంటే తెలుగు భాషా వికాసానికి మరింత పరిపుష్టి చేకూరుతుంది.

నా పరిశోధనాంశమైన ''పెద్దింటి అశోక్‌కుమార్ నవలలు - సామాజిక విశ్లేషణ'' అనే సిద్ధాంత వ్యాసంలో భాగంగా పెద్దింటి అశోక్‌కుమార్ రచనల్లో భాషాంశాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో తెలంగాణ భాషకు సంబంధించిన ఎన్నో పదాలు, పదబంధాలు, నుడికారాలు, జాతీయాలు, సామెతలు వెలుగులోకి వచ్చాయి. ఈ సదస్సును ఉద్దేశించి తెలంగాణ ప్రాంత సామెతలపై పరిశోధన పత్రాన్ని సమర్పించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. ఎడారిమంటలు, పెద్దింటి అశోక్‌కుమార్, చతుర, నవంబర్ 2000
2. జిగిరి, పెద్దింటి అశోక్‌కుమార్, నయనం ప్రచురణలు, నవంబర్ 2011
3. సంచారి, పెద్దింటి అశోక్‌కుమార్, 2011
4. లాంగ్‌మార్చ్, పెద్దింటి అశోక్‌కుమార్, అన్వీక్షికి ప్రచురణలు, 2019
5. రమాపతిరావు, అక్కిరాజు, సామెతలు-పుట్టుపూర్వోత్తరాలు, ఆచార్య తూమాటి దొణప్ప షష్టిపూర్తి సంచిక, డిసెంబరు 1987.

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

దక్షిణ భారతదేశములో చిత్రాంగుల హస్తకళ

- సి. వేణుగోపాల రెడ్డి
దృశ్యకలా విభాగం, బెంగుళూరు విశ్వవిద్యాలయం,
బెంగుళూరు.

- వై. మనోహర రాథ,
పరిశోధక విద్యార్థి జానపద గిరిజన అధ్యయన
శాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

దక్షిణ భారతదేశములో, కర్నాటక రాష్ట్రములోని గదగ జిల్లా మరియు హంపి (విజయనగర సామ్రాజ్య రాజ ధాని)కి సమీపములో "కిన్నాళ" అనే గ్రామము ఉన్నది. ఇక్కడ కిన్నాళ కళ వర్ధిల్లుతున్నది. ఈ కిన్నాళ కళ నుండి ఆ గ్రామానికి కిన్నాళ అని పేరు. ఈ కిన్నాళ కళని "చౌకి" కళ అని కూడా అంటారు. ఈ గ్రామములో 25 కుటుం బాలు ఇప్పటికీ ఈ హస్తకళను వృత్తిగా చేయుచున్నారు. ఈ కిన్నాళ హస్తకళ చేసే వారిని 'చిత్రాంగురు' అని పిలుస్తారు. కిన్నాళ కళ, గోడ చిత్రాలు, చిత్రకళ, బొమ్మలు, దేవస్తాన బొమ్మలు, రథాలు మరియు గృహోపకరణాలు చేసెదరు. కినాళకళ శైలి, రంగులు, ఆకారము, రీతి భారతహస్తకళలో ప్రత్యేకము అని చెప్పవచ్చు. కిన్నాళ కళ మన సాంప్రదాయాలలో ఓ ప్రత్యేకతను సమకూర్చుకున్నది. పరిసర ప్రాంతాలలో సాంప్రదాయక సంబరాలలో మరియు ఉత్సవాలలో ఈ చిత్రాంగురు చేసిన కిన్నాళ కళకు విశేష ఆదరన ఉంది. వీరు ప్రకృతి ప్రేమికులు. కిన్నాళ కళ ప్రకృతికి చాలా సమీపంగా ఉంటుంది.

చారిత్రక నేపథ్యం :

కిన్నాళ కళ గొప్ప సాంఘిక,సాప్రదాయ కలగా వికశించింది. విజయనగర సామ్రాజ్య రాజులు ఈ కళకు విశేష ప్రాధాన్యతను ఇచ్చినారు. విజయనగర రాజులు వీరికి కిన్నాళ గ్రామాన్ని బహమానముగా ఇచ్చి పోషించి నారు. విజయనగర సామ్రాజ్య కాలంలో హంపిలోని విరూపాక్ష దేవస్తానములోని శివ, పార్వతుల విగ్రహాలు, పంపటేశ్వర దేవస్తానం లోని కుడ్య చిత్రాలు, హంపిలోని అద్భుత కొయ్య రథం దీనికి నిదర్శనాలు. క్రీ.శ. 1665న విజయనగర పథనానంతరం ఈ చిత్రాంగురు హరప్పన హల్లి, కంప్లి మరియు కనగిరికి వలస పోయారని చెబు తారు. విజయనగర పథనానంతరం కొప్పాల నవాబు, హైదరాబాదు నవాబు, బీజాపూర్ సుల్తానులు ఈ హస్తకళను విశేషంగా ఆదరించారు.

తయారీ విధానం :

కిన్నాళ కళ చేయుటకు కావలసిన ముడి పదార్థ ములు. చెక్క (కొయ్య), జిగురు, చింతపిచ్చలు, రంపపు పొట్టు, జనుప సంచులు, ఉన్నపురాయి లేదా బలపపు రాయి, పలుచని గుడ్డ, కంచె, రంగులు మరియు వెండి రేకులు.

చెక్క (కొయ్య) :

తేలికపాటి కొయ్యను ఉపయోగింతురు. దానిని పొలకి కొయ్య అని కూడా అంటారు. హలేలేదా హలగత్తి కొయ్యను కూడా ఉపయోగింతురు. గోడ చిత్రాలు చేయుటకు వేప పలకలను ఉపయోగింతురు.

జిగురు :

తుమ్మ జిగురును తెచ్చి పొడిచేసి దానిని పూర్తిగా కరుగబెట్టెదరు.

చింతపిచ్చలు :

చింతపిచ్చలు 12 గంటల పాటు నానబెట్టి దానిని పిండిగా చేసి దానిని బాగా ఉడకపెట్టెదరు. అది జిగురు పదార్థంగా ఉపయోగింతురు. దీనిని "సరి" అంటారు.

కిత్తా :

దీనిని సరిని ఉపయోగించి తయారు చేసెదరు. రంపపుపొట్టు మరియు జనుప సంచులను 12 నుంచి

15 గంటలు నానబెట్టి వాటిని తదుపరి ఎండబెట్టి గరుకాటి బండపైన రుద్దుతారు. రంపపు పొట్టు మరియు జనుము బాగా కలుపెదరు తదుపరి ఈ మిశ్రమాన్ని సరిలో వేసి కలపెదరు. ఈ మిశ్రమాన్ని కిత్తా అంటారు.

బిలిదు :

బిలిదు అనగా తెల్లటి పొడి అని అర్థం. దీనిని సున్నపురాయిని లేదా బలపపు రాయిని పొడిచేసి నీటితో పిండిలా కలిపెదరు. దీనిని పలుచటి గుడ్డ ముక్కపై పూసెదరు.

ఆకరాళ్ళు :

గరుకు రాళ్ళను ఉపరితలాలు నునుపుచేయుటకు ఉపయోగింతురు.

రంగులు :

ప్రకృతి సహజమైన ప్రకృతి రంగులను ఉప యోగింతురు.

చేయు విధానము :

మొదట కావాల్సిన పరిమాణంలో కొయ్య తెచ్చుకొని వాటిని విడి విడిగా చెక్కెదరు తదుపరి గురక రాళ్ళలో వాటిని నున్నగా చేసెదరు. విడివిడిగా చేసిన భాగాలను సిలలు లేదా తంతులతో జోడించెదరు. తదుపరి కిత్తా (చింతపిచ్చలు, రంపపు పొట్టు, జనుము యొక్క మిశ్రమం) చేతితో రాచెదరు. తదుపరి నున్నగా చేసెదరు. పలచని బట్టను మూర్తి చుట్టూ జిగురు సహాయంతో అతికించుదురు. తదుపరి నున్నగా చేసెదరు. ఈ ఉపరితలంపై బిలిదు (రాతి మిశ్రమాన్ని) సమానంగా పూసెదరు. ఈ బిలిదు రంగులకు మూలంగా పనిచేయును. ప్రకృతి రంగులను కంచెల ద్వారా పూసె దరు. ఈ కుంచెలను ఉడుత తోక వెంట్రుకలతో తయారు చేసెదరు. పూర్తిగా రంగులు పూసిన పిదప అంచులను చిన్న కంచెలతో అలంకరంగా తీర్చిదిద్దుతారు. ఈ పూర్తి ప్రక్రియలో ప్రతి అడుగు పూర్తిగా ఎండిన తరువాతే చేసెదరు.

పాత్రలు :

కిన్నాళ కళ ముఖ్యముగా ప్రకృతి మరియు పురాణాల ఆధారంగా చేయుదురు. ఉదాహరణకు ఎల్లమ్మ, మరియమ్మ, రామ, సీత, లక్ష్మణ, హనుమంతుడు, శివపార్వతులు, మంగళగౌరి, వీరభద్ర, లక్ష్మి మరియు దేవతల వాహనాలు అయిన ఏనుగు, గుఱ్ఱం, ఎద్దు, పులి, సింహం, హంస, నెమలి, గరుత్మంతుడు, చిలక మరియు కామధేనువు చేసెదరు. చిత్రపటాలలో ముఖ్య చిత్రము చుట్టూ ప్రకృతి సంబంధమైన పువ్వులు, పక్షులు తీగలు వాటితో కిత్తా సహాయంతో ఉపరితలాన్ని ఉబ్బుచేసి రంగులు పూసెదరు.

అలనాటి సాంస్కృతిక చిహ్నాలుగా నిలిచిన ఈ చిత్రాంగుల కిన్నాళ కళ రాను రాను ఈ ఆధునిక ప్రపంచములో ఇప్పటికీ పోటీపడుతూనే ఉన్నది. ఈ కళాకారులకు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాల సమాయంతోపాటు సామాన్యుల ఆదరన కూడా అవ సరం. ఎంతో అద్భుతంగా వైభవంగా వికశించిన ఈ కళ ఇప్పుడు కనుమరుగవుతున్నదని అనిపిస్తున్నది. ఈ కాలానికి అనుగునంగా ఇప్పుడు వీరు గృహోపకరణాలు, బల్లలు, మందహాసాలు, కుర్చీలు ఇతర సామాగ్రి తయారు చేయుచున్నారు. ఇప్పుడు లభించుచున్న ఆధునిక రంగులు, కుంచెలు, ఉపరితల పదార్థాలు, జిగురు వాడుతూ ఉన్నారు. ఈ కిన్నాళ కళని తదుపరి తరాలా వారి వరకు కాపాడుకోవటం ఎంతో అవసరం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జాంబవ పురాణాలలో జాంబవంతునికి, సూర్యవంశానికి గల సంబంధాలు-పరిశీలన

– నోముల రాజు, పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.

ఎలాంటి అక్షర జ్ఞానం లేకున్న, అశేషమైన పల్లెల్లో జానపద విజ్ఞానం కల్గిన వారలే జానపదులు. వీరి జీవన విధానమంతా జానపద విజ్ఞానమే. వీరి విజ్ఞానం చదువు కొన్నవారు రాసుకున్న శిష్ట సాహిత్యానికి అందనంత ఎత్తులో ఉంటుంది. జానపదులు నిర్మించుకున్న పురాణాలు కులపురాణాలయితే, శిష్టులు రాసుకున్నవి శిష్ట (అష్టాదశ) పురాణాలు కాగా అష్టాదశ పురాణాలలోని విలువలు పండితులకు, అగ్రవర్ణాలకు అర్ధమయ్యి, అనుకూలంగా ఉంటాయి. కానీ కులపురాణాలు మాత్రం పండితులను పామరులను అభ్యుదయాన ఉంచుతుంది. శిష్టుల పురాణాలు కుల-వర్గాలతో సమాజాన్ని చీల్చి అసమానతలు చూపిస్తే కుల పురాణాలు మాత్రం శ్రమను విభజించి వృత్తులుగా మార్చి ఈ వృత్తుల వారంత ఒకే కుటుంబంగా జీవిస్తూ ఒకరికొకరు సహకరించు కుంటుండాలి అని సందేశాన్నిస్తుంది. జాంబవంతుని వల్లనే సృష్టి ఏర్పడింది. అలాగే నేటి కుల-వర్గ, మతాలనేవి కేవలం వృత్తులను, నమ్మకాలను బట్టి ఆ పేర్లు వచ్చాయి. లేదా కొందరు మనువాదుల దుశ్చర్యల వల్ల జరిగింది. దానికి ఉదాహరణగా జాంబవంతునికి, సూర్యవంశానికి మరియు ఆ వంశంలోని రామునికి ఇతరులకు గల సంబంధాలను గురించి వివిధ జాంబ పురాణాలు తెలుపు తున్నాయి. 'ఒక సమాజం లేదా సమూహం అనుసరిస్తున్న జీవన విధానాన్ని, అందులోని వైవిద్యాన్ని, వైభవాన్ని వీటి వెనుక పరంపరా గతంగా వస్తున్న ఒక వ్యవస్థ క్రమాన్ని గుర్తించడానికి జానపద విజ్ఞానం దోహద పడుతుంది'.

జాంబవంతునికి-సూర్య వంశానికి సంబంధాలు:

జాంబవ పురాణం ప్రదర్శించు వివిధ కథకుల కథలలో జాంబవంతునికి సూర్య వంశానికి, శ్రీరామునికి గల సంబంధాలను నులుక చందయ్యల, చిందు, డక్కలి జాంబ పురాణాలలో పలు విధాలుగా తెలుపుతుంది.

నులక చందయ్యల జాంబపురాణంలో ముందర చెప్పినట్లు జాంబవంతుని పుత్ర-పౌత్రాదుల చేత దేవ, రాక్షస, యక్ష, కిన్నెర, మొదలగు వారందరూ ఉద్భ వించారని తెలిసింది. అలాగే పరబ్రహ్మ స్వరూపుడి చేత (దేవుడి) పుట్టిన దేవుడను మనువుకు తన ఏడుగురు భార్యలుండగా, అందులో ఏడవ భార్యైన ప్రభాత కాగా ఈ ప్రభాతకు, దేవడను మనువుకు పుట్టిన కుమారుడె ప్రభాసుడను మనువు. ఈ ప్రభాసునికి, యోగసిద్ధికి (బృహస్పతి చెల్లెలైన) వివాహం కాగా వీరికి "విశ్వకర్మ" అనే ఋషి పుట్టాడు. ఆ విశ్వకర్మకు "పద్మిణి" అనే కూతురు పుట్టగా, ఆమెను సూర్యునకు ఇచ్చి వివాహం చేసెను. (ఇందులో బృహస్పతి శుక్రాచార్యునికి అన్నే. బృహస్పతి, శుక్రాచార్యులిద్దరు జాంబవంతుని సంతతి వారే. అలాగే సూర్యుడు కూడా జాంబవంతుని పౌత్రికల ద్వారా పుట్టినవాడే. ఈ విధంగా జాంబవంతునికి సూర్యునికి గల సంబంధాలు తెలుసుకోవచ్చు.)

ఇలా సూర్య భగవానునికి వైవస్వత మనువు పుట్టెను. (నంకల్పంలో వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంభూద్వీపే, భరతవర్షే, భరతఖండే.....అని ఉంటుంది.) ఆ వైవస్వత మనువుకు ఇక్ష్వాకుడు జన్మించెను. ఇతని వల్లనే ఈ వంశానికి ఇక్ష్వాకు వంశం లేదా ఇన వంశం అనే పేరు వచ్చింది. ఆ తర్వాత ఆ వంశంలో త్రిశంఖుడు, హరిచంద్రుడు, లోహితుడు, మాంధాత, భరతుడు, అంబరీషుడు, దిలీపుడు (ఇతనికే

రఘుండని పేరు కాగా ఇతని పేరుతో రఘువంశం అనే పేరు వచ్చింది.) ఆ రఘుకుని తిలకుడె శ్రీరాముడు. శ్రీరాముని తండ్రి దశరథుడు. పైన తెల్పిన వారు సూర్యవంశంలోని ప్రముఖుల పేర్లు.

రావణుడి వంశంలో తెల్పినట్లుగా రావణాసురుడు అనేక రాచ కన్యలను యుద్ధంలో ఓడించి బందీ చేసి, వారిని పెండ్లాడాడు. వారికి చెరసాలలుండెను. సీతను కూడా అలాగే చేసెను. ఆ సమయంలో జాంబవంతునికి కోతుల దండు నాయకుడైన సుగ్రీవుడు బ్రతిమలాడగా ఆ రాజ్యానికి, ఆ దండుకు మంత్రిగా ఉండెను. అక్కడికి శ్రీరాముడు సీతను వెతుకుతూ కిష్కింధకు వచ్చినాడు. ఆ తర్వాత సుగ్రీవునితో మైత్రిచేసి జాంబవంతుడిని వేడుకొనగా జాంబవంతుడు తన కపి సైన్యంతో లంకకు పోయే వారథి నిర్మించుటలో తన అపార అనుభవం, బలాన్ని, బలగాన్ని బుద్ధిని అందించాడు. (రామ రావణ యుద్ధ సమయంలో తన పుత్ర, పౌత్రాదుల పిల్లలైన వీరే యుద్ధము చేసుకుంటున్నారని, ఇది విధి వికృతమని దానితో సాగిపోయెను. సీతా రాముల చేత వనవాసం తర్వాత రాజ్యాభిశక్తుడిని చేసే వరకు వెంటనే వున్నటు వంటి జాంబవంతుడిని శ్రీరాముడు నమస్కరించి అయ్యా! నేను మీకు ఏమిచ్చి రుణము తీర్చుకోగల నంటాడు. దానికి జాంబవంతుడు నీలాంటి వీరునితో యుద్ధము చేయాలని, అలాగే నాకూతురును నీకు ఇవ్వాలని ఉంది అంటాడు. అందుకు శ్రీరాముడు అయ్యా! జాంబవంతా వచ్చే ద్వాపరయుగంలో నా వంశంలోనే నేను శ్రీకృష్ణుడినై పుట్టగా, మీరు జాంబ వంతుని గానే నాతో పోట్లాడి, మీ కూతురైన జాంబవతిని నాకు భార్యగా కన్యాదానం చేయుదురనెను. చివరికి అలాగే జరిగింది. ఈ విధంగా జాంబవంతునికి, సూర్య వంశ తిలకులకు సంబంధము ఉన్నది.

చిందు జాంబపురాణంలో..

జాంబవంతునికి సూర్యవంశం, శ్రీరామునికి గల సంబంధము గమనించవచ్చు. జాంబవంతుని మనవడైన మాతంగ మహాముునికి, అతని భార్య అజరాదేవికి 1.కళ 2.శ్రద్ధ 3.అనసూయ 4.హావిర్భువు 5.గతి 6.క్రియ 7.ఖ్యాతి 8.అరుంధతి 9.శాంతి అను తొమ్మండుగురు పుత్రికలు పుట్టగా వీరిని వరుసగా 1.మారీచ 2.అంగీరస 3.అత్రి 4.పులస్త్య 5.పులహ 6.క్రతువు 7.భృగు 8.వశిష్ఠుడు 9. అధర్వులనే మహా ముునులకు ఇచ్చి వివాహం చేయగా, వారికి పుట్టిన ఆదిమ, సుర,యక్ష, కిన్నెర, కింపురుష, గంధర్వ, సిద్ధ, సాధ్య, అష్ట దిక్పాలక, నవజాంబవులతో పాటు నవగ్రహాది పతులయిన వారు పుట్టారు. 1.తూర్పుదిశాధిపతి-ఇంద్రుడు 2.ఆగ్నేయ దిశాధిపతి-అగ్ని 3.దక్షిణ దిశాధిపతి-యమ ధర్మరాజు 4.నైరుతి దిశాధిపతి-నైరుతి రాక్షసుడు 5.పడమర దిశాధిపతి-వర్ణుడు 6.వాయువ్య దిశాధిపతి-వాయువు 7.ఉత్తరాన-కుబేరుడు 8.ఈశాన్యమునకు- శంకరుడు అధిపతులుగా ఉంటారు. ముఖ్యంగా నవగ్రహాలు వారి భార్యల వివరాలు గమనిస్తే, 1.సూర్యుడి భార్య-పద్మిని 2.చంద్రుని భార్యలు-అశ్విని, భరణి.....రేవతి అను 27 మంది 3.శనేశ్వరుని భార్య-మణి 4.శుక్రుడు భార్య-కవి 5.బుధుని భార్య-ఇలాదేవి 6.గురువు (బృహస్పతి)భార్య-తార 7.అంగారకుని భార్య-జ్వలిని 8.రాహువు భార్య-కరాళి 9.కేతువు భార్య చిత్రలేఖగా ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఆర్యులు మొత్తం ముప్పైమూడు కోట్ల మంది, అరవైఆరు కోట్ల జాంబవంతులు, తొమ్మిది కోట్ల సిద్ధులు ఇలా చెప్పు కుంటూ పోతే మొత్తం సృష్టి నూటఅరవై తొమ్మిది కోట్లుగా ఉండిరి. వీరు ఏడేడు పద్నాలుగు లోకాలలో జీవిస్తుం టారు. అని వీరంతయు జాంబవంతుని పుత్ర, పౌత్రాదు లతో ఏర్పడినదే.

పైన తెలిపిన చిందు, నులుక చందయ్యల జాంబ పురాణాలలోనే కాక డక్కలి జాంబ పురాణంలో కూడా సూర్యవంశంతో జాంబవంతునికి గల సంబంధం, వంశ క్రమమును తెలుసుకోవచ్చును.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సాహిత్యం – నాడు నేడు

- వీణా రవళి
వీణా వోకల్ ఆర్టిస్ట్, రైటర్ & ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, ఫైవ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, శ్రీ శ్రీనివాస సప్త స్వర కళల అకాడమి - ఛైర్మన్.

- నోరుమంచి వెంకట ప్రభాకరి,
తణుకు,
పశ్చిమ గోదావరి జిల్లా

జనుల నుంచి పుట్టిన సాహిత్యం అంటే జనపదంలో నివసించేవారు జానపదులు. వీరిది జానపద సాహిత్యం. వీటిని జ్ఞాన పదాలు అని కూడా పెద్దలు చెప్పారు. జీవితంలో ప్రతి అంశాన్ని వారు పాటల్లో పాడుతూ నీతి నిమయాలు చెప్పారు. వారి భాష జనులందరికీ తేలికగా అర్థం అయ్యే పద్ధతిలో ఉంటుంది. ముఖ్యంగా ఇందులో పాలం పాటలు. వివిధ పనుల పాటలు ఉంటాయి. పుట్టినరోజు నుండి పెళ్లి మరియు జీవితంలో వివిధ సందర్భాలలో చక్కగా వర్ణిస్తూ పాడుకుంటూ అలసట లేకుండా పనులు ఆనందంగా నిర్వహిస్తుంటారు. అందుకే జాతీయ సంస్కృతి - సంప్రదాయాల జానపద సాహిత్యము అత్యంత ముఖ్యమైనది. కోటానుకోట్ల గ్రామీణ ప్రజలకు ముఖ్యమైనదిగా గుర్తింపు పొందింది.

ఇక్కడ ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి గారి మాటలు గ్రహింపదగినవి. ''జానపద సాహిత్యం సమాజంలోని అడుగు వర్గాల సంస్కృతికి మణిదర్పణం వంటిది. వారి ఆచారాలు, వ్యవహారాలు అందులో ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తూ ఉంటాయి. శుద్ధం, శిష్టం అని రెండు విధాలుగా ఉన్న జానపద సాహిత్యంలో పల్లె ప్రజలు పాడుకునే గేయాలు శుద్ధ విభాగంగాను, పండితులకు ఎక్కువ ప్రమోదాన్ని కల్గించేటట్లు దేవతా స్తుతి పూర్వకంగా కూర్పబడిన గేయాలు శిష్ట విభాగంగాను పరిగణింపబడ్డాయి. శిష్ట సాహిత్యం అగ్రవర్ణాల సంస్కృతికి నిలువుటద్దంగా భాసిస్తుంది''

కొన్ని ఛానల్స్ వారు వీటిపై ప్రత్యేక కార్యక్రమాలు పోటీలు ధారావాహికంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రపంచంలో నాగరికత ప్రాంత దేశాల నుండి అనాగరిక ప్రాంత దేశాల వరకు జానపద సాహిత్య సంగీతాన్ని అందించారు. అంతేకాదు జానవద సాహిత్యము నేటి సంగీత సాహిత్యాలకు మూల పదార్థం లాంటిది. ఈ జానపద సాహిత్యంలో ఆనాటి తరాలఆదరణ, అభిమానం, ఆత్మీయత, గడుసుదనం, అలంకరణలు, వస్త్రాల రంగుల్లో ఉండే పనిపాటలు. అన్ని కూడా ఎంతో రమ్యంగా చిత్రీకరణ ద్వారా తెలుస్తాయి. వారి పాటల్లో కోయిలమ్మలు, చింతపూల రవికెలు, మందారపూలు, మొక్కజొన్న పొత్తులు ఎక్కువగా కనిపిస్తాయి. నండూరి సుబ్బారావు గారి పాటల్లో

"నన్నిడిచి పెట్టేళ్ళినాడే నారాజు మొన్న తిరిగి వస్తానన్నడే" అనే పాటలో

"నీళ్ళు తేబోతోంటే నా వెనుక ఎవరోను నవ్వినట్లుంటాది".

ఇలా ఎంకి శృంగారాన్ని చిక్కని చక్కని పదాల్లో వర్ణించారు.

సుద్దాల అశోక్‌తేజ; గోరేటి వెంకన్న; డా॥ తంగిరాల వేంకట సుబ్బారావు; డా॥ వి.వై.వి. సోమయాజి మొదలైన రచయితలు చాలా కృషి చేసి జానపద సంగీతంలో ఉన్నతస్థాయి వ్యక్తులుగా నేటి తరానికి ఆదర్శ ప్రాయులుగా ఉన్నారు.

అలాగే 'కొమ్మలో కోయిల' పాట సంగీత విద్వాంసులు అందరికి సుపరిచితం. ముఖ్యంగా వీణా వైనికులు ఈమని శంకరశాస్త్రి గారు, చల్లపల్లి చిట్టిబాబు గారు, ఆ కాలంలో నుండి ఈ కాలంలో నా వరకు వీణపై ఒక జానపదగేయం

వాయిస్తున్నాం. చుక్కలు - చంద్రుడు ఇలా ప్రకృతి రమ్యతను చక్కగా వర్ణించారు, వర్ణిస్తున్నారు. అయితే పదాల పలుకులో వెళ్లి అనే పదానికి ఎల్లి అని ల కారం వస్తుంది. అలుపు లేకుండా పాడుతూ పనిని దైవంగా భావించి చేసేవారు కనుక వీరు పెద్ద పీట వేశారు. జానపద పాటలలో సాహిత్యం మెరుపులు ఉండబట్టే ప్రతి యూని వర్సిటివారు ఎంతో ప్రోత్సాహమిచ్చి, జానపద సాహిత్యంపై పరిశోధనల వైపుకు నడిపిస్తున్నారు.

జానపదం ప్రాచీనకాలంలో ఉన్నదనడానికి భారత అరణ్యపర్వంలో జానవదులు పురీ జనులు అన్న ప్రయోగము నిదర్శనంగా ఉంది. ఈ ప్రయోగాన్ని బట్టి పురజన భిన్నులు జానపదులే అని తేలింది. అందువల్ల పామర వాఙ్మయము జానపద వాఙ్మయంగా పిలవ బడుతోంది. ఇది మౌఖిక ప్రధానమైనదని చెపుతారు. అందుకే ఓరల్ లిటరేచర్‌గా పిలువబడేది జానపద సాహిత్యం.

దీనికి కారణం వారు నిరక్షరాస్యులు. ఇప్పటికీ వీరిలో కొందరు ఇదే పద్ధతిలో జీవిస్తున్నారు. కానీ అన్ని రకాల జానపదులు పరిగణనలోకి రావు. వీటిని వేరు పరిచారు. నాగరికులలో విద్య, ఉద్యోగం ఉన్నతి ద్వారా విదేశీ వ్యామోహం ఉన్నట్లుగా వీరికి ఉండదు. అమాయకంగా ఉంటూ పనిపాటలలో లీనమై జీవిస్తారు. అసూయ, ఈర్ష్యద్వేషాలు లేకుండా ఆనందాన్ని ఆస్వాదిస్తూ జీవిస్తారు. నాగరిక సమాజంలో దూరంగా ఉంటూనే, నాగరికులకు సహాయపడుతూ వారు ప్రత్యేకంగా జీవిస్తారు. నాగరికులకు భిన్నత్వం గల మనుషులు జానపదులు. డా॥ వి.వై.వి. సోమయాజి కొల్లేటి పాటల మీద పరిశోధన చేసారు. కొల్లేటి ప్రాంత ప్రజలను గూర్చి చెబుతూ, "నిరక్షర కుక్షులైన జానపదుల గుండెలు చీల్చుకుని గేయరత్నాలు బయల్పడుతున్నాయి. విద్యాగంధంలేని జానపదుని హృదయ నిర్గతాలైన ఈ పాటలే నిసర్గ రమణీయంగా ఉంటాయి. విద్యావంతుల గేయ సాహిత్యం మెరుపుగల కృత్రిమ రత్నాలైతే, జానపదులవి మెరుపులేని సహజ జాతి రత్నాలు" అన్నారు.

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం, సాంఘిక జానపదాలు, వస్తు సంస్కృతి, జానపద కళలు, జానపద భాష అనేవి ముఖ్యమైనవి. కవిత్వం, గేయాలు, గేయ కథలు, వినోదాలు, వాద్య విశేషాలు, ఊరేగింపులు, జాతరలు, వైద్య విశేషాలు, మనకు తెలుస్తున్నాయి. ఇవన్నీ ఈ జానపద పరిశోధనల వల్ల వెలుగులోనికి వచ్చాయి. కొన్ని పురాతన అంశాలు అందుబాటులో లేవు. క్షేత్ర పర్యటన ద్వారా వాటినే మనం తెలుసుకోవచ్చు. పూర్వీకులు తాటి ఆకులు, పనస ఆకులు, రాగి రేకులు, చెట్ల బెరడు, రాళ్ళు, చెక్క బట్టిలపై రాసి పొందుపరిచారు. ఇప్పుడు కాగితాల ద్వారా పబ్లికేషన్స్ వచ్చాక, వివిధ యూనివర్సిటీల వారు ప్రత్యేక శ్రద్ధ వహించి ముందుకు తీసుకువచ్చి అభివృద్ధి పరుస్తున్నారు, వెలుగులోకి తెస్తున్నారు.

మన నిత్య జీవితంలో వాడే మాండలికాలు అనేకం వింటున్నాం. దీవెనలు, తిట్లు అతిశయోక్తి మాటలు అన్నీ జానపద శబ్ద, భాష నుంచే ఉత్పత్తి అయ్యాయి. 90శాతం వీటిలో సంగీతం అంతర్లీనంగా ఉండి జానపదుల జీవన శైలి పాటల్లో ప్రతిబింబిస్తుంది. వీరి వస్త్ర అలంకరణలో దంతాలు పూసలు అద్దాలుగా గాజు పూసలు వాడతారు. ఈ జానపద సాహిత్యం 5 భాగాలుగా ఉంటుంది. 1) గద్యాఖ్యానాలు 2) గేయాలు 3) వీరగాథలు 4) పొడుపు కథలు 5) సామెతలు నిజానికి ఇవన్నీ మన జీవితంలో అంతర్లీనంగా ఇమిడి ఉంటాయి.

ఆది మానవుని ముఖ మండలం నుండి శబ్దరూపంగా వెలువడిన జానపద సాహిత్యం ఎప్పుడు వాక్కురూపంలో రూపుదిద్దుకుందో, ఆనాటి నుండి ఆనంద అనుభూతి, బాధలు, వ్యంగ్యాలు నిజమైన భావావేశాలు మొ॥నవి జానపదుల హృదయం చీల్చుకున్న గేయరత్నాలుగా బయటకు వచ్చాయి. వారి భావాలు అప్పటికప్పుడు అక్కడి ప్రదేశాలను బట్టి ఉత్సవాలు దేవాలయ ఆవరణలోను, పండుగలు పబ్బాలు ఇలా రకరకాల కార్యక్రమాలలో ఆశువుగా చెప్పగల ప్రతిభావంతులు జాన

పదులు. హృద్యంగా సాగే జానపద సాహిత్యం నాడు నేడు కొన్ని భేదాలతో నిలబడి ఉంది. ఒక శిల క్రమంగా అరిగి సాలగ్రామంగా ఆస్తికుల పూజామందిరాల్లో పూజింపబడుతున్నట్లుగా జానపదులు పదుగురి పాటల్లో గాయక గళముల ద్వారా జానపద సాహిత్యం నాటి నుండి నేటి వరకు సంగీత స్వరాలతో, సొగసులతో కలసి మనోరజకంగా వ్యాప్తి చెందింది.

వీరు నిజానికి రససిద్ధి కలవారు రసమయం కాని పాటకు జీవం ఉండదు. ఏ కళ యొక్క పరమావధి అయినా ఆనందాన్ని ఇచ్చి తద్వారా ప్రయోజనం కలుగజేయడం కనుక వీరి గేయ రచన వీరి గేయ గానం అనే రెండు కళలు కలిసి వారికి కావల్సిన ఆనందం శ్రమోపశమనము ఇత్యాది ప్రయోజనాలు ఉన్నాయి. గనుక నేటి తరమే గాక భావితరాలకు కూడా నేటికి అత్యంత ఉన్నతి ఉన్నది. జానపదుల పద ప్రయోగాలకు అర్థాలు తెలుసుకోవడానికి ఎటువంటి నిఘంటువులు లేవు. సందార్భాన్ని బట్టి అర్థాన్ని గ్రహించాలి. ఏ పని చెయ్యాలన్నా శక్తి అవసరము, ఆ శక్తి, ఉత్సాహము ఈ పాటలో ఉంది కనుక ఆనందం ద్వారా ఆయుష్షు పెరుగుతుంది. ప్రాణాయామం, యోగా ద్వారా సాధించే ఈ పరమ అద్భుత ప్రయోజనాలు, పది మంది కలసి చేసే ఆనంద నృత్యాల ద్వారా పొందవచ్చును.

స్వీయ అనుభవాలు :

నా చిన్నతనంలో పొలానికి వెళ్ళడం అక్కడ నాటి జానపదులు ఊడుపులప్పుడు వరుసల్లో పాలంలో వంగుని రకరకాల వేషధారణతో ఎంతో ఆనందంగా పనులు చెయ్యడం చూసి ఆనందపడే దాన్ని. అక్కడ ఏమైనా తినడం, కొబ్బరి బొండాలు తాగడం ఒక అపురూపమైన ఆనందము. దసరాకి ముందు మా ఇంటికి గొంతెమ్మ పాటలు పాడుతూ కొందరు స్త్రీలు వచ్చేవారు వారికి పసుపు, కుంకుమ, బియ్యం దక్షిణగా చిల్లర డబ్బులు ఇచ్చి మా పెద్దవాళ్ళు పంపేవారు. అంతేకాదు ఏడాదికి ఒకసారి వచ్చేవాళ్లకి పాత చీరలు ఇచ్చేవారము. ప్రత్యేకంగా వారి చేత గౌరీ కళ్యాణం పాడించుకుని వినేవారము. వాళ్లు ఏడాది అయ్యింది. ఇప్పుడు వచ్చాము అనేవారు ఇంతవరకు పాలం పనులకు వెడతాము అని చెప్పేవారు. ఒక విధంగా చూస్తే అది సంగీతం అన వచ్చును. మన అన్నమయ్య శ్రీ వేంకటేశ అమృత కీర్తనలు కొన్ని జానపద బాణీలో ఉన్నాయి. విజ్ఞాన యుగంలో కూడా జానపదులు ఆదర్శప్రాయులు అని తెలుస్తోంది.

జానపద సాహిత్యం నాడు-నేడు అనే అంశాన్ని సంగీతపరంగా సమన్వయించి చూస్తే పాటలో ప్రతి మధ్యమం వినిపించదు. జానపద సాహిత్యము స్వర్ణ పదాలతో సంగీత పరిమళాలతో నేటి జానపద సంగీతం కొత్తబాణీలో ఉన్నది. గౌరీ కళ్యాణంలో తల్లిదండ్రులు పెళ్ళి చేయాలని పార్వతీదేవిని అడిగినప్పుడు

"గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో ఉయ్యాలో"

అని పాడుతూ ఎవర్ని పెళ్ళాడతావు అంటే

"కాపు ఇంట పనులు నే చెయ్యలేను.
కోమటి ఇంట అరగిద్ద సోల కొలతలు నేకొలవలేను.
రాజులింట నేను రాచరికపు పరదాలు వద్దు నాకు
బ్రాహ్మలింటా నేను తడి పొడి మడులు కట్టుకోలేను
అంటూ అన్నింటికి సామాన్యంగా ఉండే పరమశివుడినే
పెళ్ళాడుతాను" అని చెబుతుంది.

ఈ పాట పాడించి సంతోష పెట్టేవారము. మేము కూడా సంతోషపడేవారము. ముఖ్యంగా ఆలిండియా రేడియోవారు ఈ విషయాలపై చాలా రకాలుగా రికార్డ్ చేసి గ్రామ సీమలో ప్రసారం చేసేవారు.

1. మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో
   మంచెకాడ కలుసుకో మరువకు మామయ్య
2. గుంటూరు చిన్నదాన గుళ్ళ పెరుల దాన
   బెజవాడ చిన్నదాన బెంగళూరు చిరదాన
3. ఓ చిన్నదాన చింతపూల రవికదాన
   ఈ రవికె మీద మోజు ఏలా లేదే ఓ చిన్నదాన
4. వంగతోటకాడ ఒంటరిగా నేను వెడితే
   వంగపూలు కూడా వెక్కిరించాయి.

5. "నే గోంగూర తోట కెడితే.." మొ॥న పాటలన్నీ నాటి నుండి
నేటి వరకు నిత్యనూతనంగా, సార్వజనీనంగా కనిపిస్తాయి.

జానపద సాహిత్యము నాడు-నేడు కూడా జానపదుల అంశాలు మనకు తెలియకుండానే మన జీవితాలలో ప్రభావితమవుతున్నాయి అంటే కాదనగలమా. జాతీయ సంస్కృతి సౌరభములో అతి ముఖ్యమైన అంగము. ప్రతి దేశానికి అమూల్య సంపద. ఇది ఒక పద్ధతిలో నేర్చు కోవడం కుదరదు. ఇందులో ఎన్నోరకాల రీతులు ఉన్నాయి.

నేటికాలంలో జానపదసాహిత్యం పల్లెలలో పాలాలలో ఉన్నచోటే ఉన్నాయి. పట్టణాలలో ఇవి కనుమరు గయ్యాయి. అయితే మన జీవన స్రవంతిలో మంగళ హారతులు, లాలిపాటలు ఇలా ఏదైన పేరంటంలో అక్కడ క్కడ వినిపిస్తుంటాయి. ఈ మధ్య కెనడా నుండి ఒకామె పెళ్లి పాటలు కావాలని అడిగారు. పాటలు రికార్డ్ చేసి పంపాను. ఈ విధంగా అభిరుచి ఉన్నవారి అభీష్టం నెరవేర్చడం మన బాధ్యత.

దీన్ని బట్టి సాహిత్యలోకంలో నాడు-నేడు కూడా జానపద సాహిత్యానికి ఉన్న సముచిత స్థానం అజరామ రమని తెలుస్తోంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

బతుకాట నవలలోని జానపద కథలు

– యం. అనురాధ లక్ష్మి, లెక్చరర్, యస్.కె.ఎస్.సి. డిగ్రీ కాలేజి, ప్రొద్దుటూరు, కడప జిల్లా.

ఏ భాషలోనైనా మొట్టమొదట జానపద సాహిత్యమే పుడుతుంది. ఇది మౌఖిక సాహిత్యం. అంటే ముఖస్తం గానే ప్రాచుర్యం పొందింది. జనపదం అంటే గ్రామం. అందులో నివసించే వారే జనపదులు. జనుల నుండి పుట్టింది కాబట్టి జానపదం అయింది. కనుక ఇది పల్లె ప్రజల సాహిత్యంగా స్థిరపడింది.

ఈ జానపద సాహిత్యంలో పల్లె ప్రజల జీవన విధానం ప్రతిఫలిస్తుంది. వాళ్ళ నమ్మకాలు, సాంప్రదాయాలు, ఆచా రాలు, ప్రజల అమాయకత్వం ఇవన్ని గేయాల రూపం లోను కథల రూపంలోనూ స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా పిల్లల్ని పెద్దల్ని అలరించడంలో జానపద కథల పాత్ర విశిష్టమైనది. ఈ కథలు మంత్ర తంత్రాల తోనూ, వింత మనుషులు వింత వస్తువులతో కూడి ఉంటాయి. అలాంటి కథలే మనకు వి.ఆర్. రాసాని రాసిన "బతుకాట" అనే నవలలో కనిపిస్తాయి.

ఈ నవలలో భారతానికి సంబంధించిన కొన్ని కథలను రచయిత వివరిస్తాడు. నిజానికి ఈ కథలకు భారతానికి ఎటువంటి సంబంధము ఉండదు కాని జానపదులు పాండవులపై గల ప్రేమతో తాము కల్పించుకున్న పాత్రలను భారతానికి అంట గట్టారని తెలియ జేస్తూ ఈ కథలను వివరించాడు రచయిత. అందులో కొన్ని ముఖ్యమైన కథలు ఇవి.

పోతురాజు కథ :

'బతుకాట' నవల నాటక కళాకారుల జీవితాలను ప్రతిబింబించే చక్కటి నవల. ఇందులోని కళాకారులు 'భారతోత్సవాల' పేరుతో వరసగా నాటకాలను ప్రదర్శి స్తారు. ఈ నాటకాలలో భాగంగా భారతం కొండెక్కే రోజున పోతురాజు విగ్రహాన్ని, ధర్మరాజు తప్ప మిగిలిన పాండు వుల విగ్రహాలను భారత మిట్టలో ప్రతిష్ఠిస్తారు. పోతురాజు విగ్రహం మిగిలిన విగ్రహాల కన్నా భిన్నంగా ఉంటుంది. దీన్నిగమనించిన నాటక కళాకారుల గురువైన సిద్ధోజీ హరిదాసును పోతురాజు కథను గూర్చి చెప్పమని అడుగగా 'ఉడాందాసు' గా పేరు పొందిన ఆ హరి కథకుడు ఈ కథను వివరించాడు.

పూర్వం దండ, కారణ్యంలో గురులింగ మహారాజు విబూధి కోటను నిర్మించుకొని రాజ్యపరిపాలన సాగించే వాడు ఈయన ప్రతి రోజు నేరుగా కైలాసానికి వెళ్లి స్వయంగా శివ పార్వతులను పూజించి వచ్చేంత గొప్ప భక్తుడు. ఇతని ఒక్కగానొక్క కొడుకే పోతురాజు. ఇతడు నాలుగడుగుల ఎత్తుతో నున్న మరుగుజ్జు. పొట్టోడైనా పుట్టెడు తెలివి తేటలున్నాయి. తండ్రి రోజూ కైలాసానికి ఎందుకు వెళుతున్నాడో! తెలుసుకునేందుకు ఒకరోజు తండ్రికి తెలియకుండా తానుకూడా రథానికున్న పెట్టెలో ఎక్కి కైలాసానికి వెళ్ళాడు. గురులింగ మహారాజు నేరుగా శివపార్వతులున్న చోటికి వెళ్ళాడు. పోతురాజు కూడా లోపలికి వెళుతుంటే కాపలా ఉన్న ప్రమద గణాలు మహారాజు కొడకే గదా పోనీలే అని అతనితో "ఒరే! నీవు కైలాసంలో ఎక్కడైనా తిరుగు కాని ఉత్తర దిక్కులకు మాత్రం పోవద్దు" అని చెప్పారు. కానీ ఈ పొట్టోడు ఆ దిక్కుకే వెళ్ళాడు. అక్కడకి పోగా పోగా శివుని ఆయుధా గారం కనిపించింది. అందులో దక్షయజ్ఞంలో వీరభద్రుడు ఉపయోగించిన వీరజాటి, వీరఖడ్గం, ఇంకా ఒక నిమ్మపండు ఉన్నాయి. వీడి చూపు వాటిపై పడింది. వాటిని గూర్చి ప్రమద గణాలను అడుగగా నిమ్మపండు సిరి సంపదలనిస్తుందని వీరజాటి, వీర ఖడ్గం ఉన్న వాళ్ళకి ఓటమి ఉండదని వివరించారు. పోతురాజు ఆ ప్రమద గణాల కళ్ళు గప్పి వాటిని తీసుకొని విబూధి కోటకు వెళ్ళాడు. ఈ విషయం శివపార్వతులకు తెలిసినా తమ భక్తుని కొడుకే గదా అని విడిచిపెట్టారు.

ఇలా ఉండగా పాండవులు అరణ్య వాసం చేసే రోజుల్లో ఒక రోజు భీముడు అడవిలో కట్టెల మోపును తీసుకొని వస్తూ అలుపు తీర్చుకోవడానికి ఆ మోపును విభూది కోటకు ఆనించడంతో ఆ కోట పడిపోయింది. ఇది చూసిన పోతురాజు వీరజాటి, వీర ఖడ్గంతో భీముని మీదకు యుద్ధానికి వచ్చాడు. భీముడు భయపడి పారి పోతుండగా పోతురాజు వదలకుండా వెంబడించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు భీమున్ని రక్షించడం కోసం తాను ముసలి అవ్వగానూ అర్జునున్ని పదహారు సంవత్సరాల అమ్మాయిగాను మార్చి పోతురాజు దగ్గరకు వస్తాడు. పోతురాజు ఆ అమ్మాయిని తనకిచ్చి పెండ్లి చేయమని కోరుతాడు. దానికి కృష్ణుడు 'నీ తండ్రి తలను నరికి తీసుకొని వస్తే పెండ్లి చేస్తాన'ని చెప్పడంతో పోతురాజు నిజంగానే తండ్రి తలను నరికి తీసుకొస్తాడు. కాని గురులింగ మహారాజు తలను ఎవరైనా నేలపై పడేస్తే వాని తల పగిలి చస్తాడని శివుడు వరమిచ్చాడు. ఆ విషయం గుర్తుకు వచ్చి పోతురాజు తండ్రి తలను చేతి లోనే పట్టుకొని తిరుగుతుంటాడు.

పోతురాజు అన్నంత పని చేసుకొని వచ్చినందు వల్ల కృష్ణుడికి భయం పట్టుకుంది. ఏం చేయాలా! అని ఆలో చించాడు పాండురాజు మాద్రీదేవితో కలిసినపుడు అతని రేతస్సు మాద్రి గర్భం నుండి జారి నేలపై పడగా వ్యాసుల వారు దాన్ని శంఖంలో భద్రపరిచారు. ఆ శంఖం నుండి ఒక అమ్మాయి జన్మిస్తుంది. ఆమె పేరు శంఖాదేవి. అచ్చు అర్జునుడి పోలికలతోనే ఉంటుంది. అందువలన శ్రీకృష్ణుడు ఆమెను పిలిపించి పోతురాజుకిచ్చి పెండ్లి జరిపిస్తాడు. తరువాత కొంత కాలానికి పోతురాజుకు కృష్ణుడు చేసిన మోసం తెలిసి ఎందుకిలా చేశావని ప్రశ్నిం చాడు. అందుకు కృష్ణుడు "నువ్వు పాండవులకు కార్య దర్శిగా ఉండి వాళ్ళు అందుకునే పూజల్లో మొదటి పూజ నువ్వే అందుకో" అని వరమిచ్చాడు. అప్పటి నుండి భారతోత్సవాల్లో మొదట పోతరాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజిస్తూ వచ్చారు.

ద్రౌపది – పంచ పాండవులు :

ఉడాందాసు సిద్ధాజీకి ఈ కథను చెప్పాడు. ద్రౌపది ఆది శక్తి స్వరూపిణి. భూభారాన్ని తగ్గించడానికి ఆమె భూలోకంలో ద్రౌపదిగా జన్మిస్తుంది. ఒక సారి శివ పార్వతులు ఏకాంతంగా ఉన్న సమయంలో పార్వతి శివున్ని "నాధా! నాధా!" అని ఐదు సార్లు కలవరిస్తుంది అప్పుడు శివుడు నువ్వు భూలోకంలో పుట్టు అయిదు సార్లు నాధా అన్నావు కాబట్టి నేను అయిదుగురిగా పుట్టి నిన్ను పెండ్లాడతాను అన్నాడట. అందుకని ద్రౌపదిగా పుట్టిన పార్వతిని శివుడు పంచ పాండవులుగా పుట్టి పెండ్లాడని చెప్పాడు.

సాధారణంగా ఒక స్త్రీకి ఐదుగురు భర్తలు అంటే ఎవరైనా ఆమె పాతీవ్రత్యాన్ని సందేహిస్తారు. ద్రౌపది సాక్షాత్తు ఆది పరాశక్తి అని చెప్పినపుడు ఆమె మీద ఉన్న సందేహాలన్ని పటాపంచలయి మరింత గౌరవ భావాన్ని, భక్తిని పెంపొందించి జానపదులలో నమ్మకాన్ని కలిగించ డానికి ఈ కథను కల్పించి ఉండవచ్చును.

ఇలావంతుడు లేక బలిరాముడు :

ఇతని అసలు పేరు నాగార్జునుడు ఇతను ఉలూచి అను నాగకన్యకు అర్జునునికి జన్మించిన కుమారుడు. ఇతడు పుట్టుకతోనే వెయ్యి ఏనుగుల బలం ఎదురు రోమాలు కలవాడు, బ్రహ్మచారి. కృష్ణరాయబారం విఫలమై కౌరవులకు పాండవులకు యుద్ధం తప్పని సరైనపుడు సహదేవుడు ఎదురురోమాలతో జన్మించిన బలశాలిని బలియిస్తే విజయం కలుగుతుందని చెప్పాడు. పాండవులు ఇలావంతుడికి ఈ విషయం చెప్పగానే చాలా సంతోషించాడు. అయితే "జరగబోయే యుద్ధంలో పాల్గొని నా ప్రతాపం నిరూపించుకునే అవకాశం లేకుండా చేశారు కనీసం పాండవుల పరాక్రమాన్ని చూసే అదృష్టమైనా కలిగించండి" అని కృష్ణున్ని ప్రార్థించగా కృష్ణుడు సంతోషించి యుద్ధం మొదలైనప్పటి నుండి ముగిసే వరకు యుద్ధాన్ని దర్శించు అని వరం ఇచ్చాడు.

సాధారణంగా ఏదైనా ఒక పనిని ప్రారంభిస్తున్నపుడు బలి ఇవ్వడము అనేది పల్లెల్లో కనిపిస్తుంది. పంటలు చక్కగా పండాలన్నా, ఒక గృహ నిర్మాణము చేపట్టాలన్నా ఏదైనా ప్రారంభించాలన్నా ఈ బలులు ఇవ్వడమనేది నేటికి చూస్తూనే వున్నాం. ఇక యుద్ధ ప్రారంభంలో బలి కార్యక్రమం లేక పోవడాన్ని జానపదులు జీర్ణించుకోలేక ఈ కథను కల్పించి ఉండవచ్చు.

దుర్యోధనుడు - ఉక్కు శరీరం :

ధృతరాష్ట్రుడికి ఎదుటి వాళ్ళను ఉక్కు శరీరాలుగా మార్చే శక్తి ఉంది. ఆయన ముందు జాగ్రత్తగా దుర్యోధనుడు చిన్నగా ఉన్నప్పుడే కొడుకును, వంటి మీద నూలుపోగు కూడా లేకుండా తన దగ్గరకు రమ్మని చెప్పాడట. అతడు అలాగే వెళుతుంటే గాంధారి ఆపి మొలనుండి తొడల వరకు పుట్టగోచి పెట్టి పంపించిందట. దగ్గరకు వచ్చిన కొడుకును ధృతరాష్ట్రుడు రెండు చేతులతోనూ తడుముతుంటే ఆ భాగమంతా ఉక్కు శరీరంగా మారిందట. తొడ దగ్గరకు వచ్చే సరికి గోచీ అడ్డుగా ఉండటంతో "నీ ఆయువంతా నీ తొడల్లోనే ఉంది పో" అన్నాడట.

సాధారణంగా లోకంలో తండ్రికి పెద్ద కొడుకు మీద తల్లికి చిన్న కొడుకు మీద ప్రేమ ఎక్కువని చెబుతుంటారు. ఇక్కడ కూడా ధృతరాష్ట్రుడు వంద మంది కొడుకులున్నా పెద్ద కొడుకు మీది ప్రేమతోనే ఈ పని చేశాడని జానపదులు ఈ కథను ప్రచారంలోకి తెచ్చివుండవచ్చును.

సహదేవుడు - జోతిష్యం :

పాండురాజుకు కూడా ఒక శక్తి వుంది. తను మరణించిన తరువాత తన శవాన్ని తిన్నవాళ్ళకు చావు వుండదు, ముళ్ళోకాలకు రాజయ్యేంత శక్తి, భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసుకునే శక్తి వస్తుందట. తాను చనిపోయేటప్పుడు పాండవులను పిలిచి తన శవాన్ని పూడ్చవద్దు, కాల్చవద్దు మీరే సమానంగా పంచుకొని తినండి అని చెప్పగా పాండవులు శవాన్ని తినడానికి సిద్ధమయ్యారు. ఈ విషయం కృష్ణుడు తెలుసుకొని "శవాన్ని తింటే వీళ్ళను ఎవరూ జయించలేరు. తర్వాత వీళ్ళను చంపడానికి నేను ఎన్ని అవతారాలెత్తాలో ముందు ఆ పని ఆపించాలి" అనుకుంటూ అక్కడికి వచ్చి "అరే! ఎవరైనా పీనుగును తింటారా? అందులోనూ తండ్రి శవాన్ని తినగూడదు". అని నచ్చజెప్పి దాని కాల్చమన్నాడట ఆయన మాటలు విని పాండవులు కృష్ణుడితో కలిసి కట్టెల కోసం అడవికి వెళ్లారు.

అయితే శవానికి కాపలాగా వున్న సహదేవుడు కృష్ణుడు మాయలమారి తండ్రి శవాన్ని తినకుండా చేశాడు తండ్రి ఉరకనే తినమంటాడా? అనుకుని కత్తిని తీసి కుడి కాలి చిటికెన వేలు కోసి ఒకసారి నమలగానే ఆయనకు పద్నాలుగు లోకాలు కనిపించేశాయి. ఇంకొకసారి నమిలే టప్పటికి ముక్కోటి దేవతలు కనిపించారు. విష్ణువే కృష్ణుడిగా పుట్టిన విషయం తెలిసింది. జరుగుతున్నది జరగబోయేది జరిగినది అన్ని విషయాలు తెలిసి పోయాయి.

ఈ విషయం కృష్ణుడు గమనించి వీడు గనుక మూడో సారి నమిలితే వీణ్ణి ఆ హరిహరాదులు కూడా జయించ లేరని వెంటనే అక్కడికి వచ్చి నోట్లో ఉన్నదాన్ని ఉసేయించాడు అప్పుడు సహదేవుడు నువ్వెవరవో ఎందుకు పుట్టావో, ఎం చేస్తావో నాకు తెలుసు అన్నాడట. అందుకు కృష్ణుడికి కోపం వచ్చి ఈ విషయం ఎక్కడైనా చెపితే నీ తల వెయ్యి ముక్కలు అవుతుందని శాపం ఇచ్చాడు.

దానికి బదులుగా సహదేవుడు కూడా అట్లయితే మా అయిదుగురిలో ఆయుష్షు తీరకుండా ఎవరైనా చనిపోతే వాళ్ళను నీ గుండెల మీద వేసుకొని కాల్చుకోవాలి అని వరమడిగాడట. కృష్ణుడు దానికి సరేనన్నాడు. గుండెల మీద వేసుకొని కాల్చుకోవడమంటే ఆయన కూడా చనిపోయినట్టే కాబట్టి పాండవులకు ఏ కష్టం వచ్చినా వాళ్ళను కాపాడుతూ 'పాండవ పక్షపాతి' అనిపించుకున్నాడు. ఇక సహదేవుడు కూడా అప్పటి నుండి గొప్ప జ్యోతిష్య శాస్త్రవేత్త అయ్యాడు.

'భారతంలో శ్రీకృష్ణుడు పాండువుల వెన్నంటే ఉంటూ వాళ్ళ విజయానికి కారకుడయ్యాడు' అన్న నిజాన్ని ఈ విధంగా చక్కటి కథగా మలచిన జానపదుల గొప్పదనం ఏమిటో మనకు ఈ కథ ద్వారా తెలుస్తుంది. 'ఓ! అందుకేనా శ్రీకృష్ణుడు పాండవులను కాపాడుతూ వచ్చేది' అని నమ్మె పల్లె ప్రజల అమాయకత్వము మనకు ఈ కథ తెలియజేస్తుంది.

ఈ జానపద కథలన్నిటిని కలుపుకొని భారతానికి సంబంధించిన కథలను నాటకాలుగా ఆడడం మనకు రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇవే కాకుండా ఇంకా ద్రౌపది అగ్నిగుండ ప్రవేశం, అర్జున తపస్సు, బలి బండిని ఊరంతా తిప్పడం, బలిరాముని బలి కార్యక్రమాన్ని, దుర్యోధన వధ ఘట్టము మొదలైన వాటిని జానపద రీతిలో జరిపించడం మనము ఈ నవలలో చూస్తాము.

ఈ కథలన్నీ కూడా జానపదుల అమాయకత్వాన్ని వాళ్ళ నమ్మకాన్ని, వాళ్ళ ఆచార వ్యవహారాల్ని తెలియజేస్తాయి. ఆచారాల్ని పాటించడంలో వాళ్ళు చూపే నిమయ నిష్ఠలను ప్రస్ఫుటం చేస్తాయి. ఇవన్నీ జానపదులు వ్యవ హారంలో ఉన్న కథలే అయినా నిజమేనేమో! అని నమ్మ కాన్ని కలుగజేస్తాయి. ఏదేమైనా జానపద కథలు ఇప్పటికీ ఆదరణ పొందుతూనే ఉన్నాయి. మన పేదరాశి పెద్దమ్మ కథలను పోలిన హారి పోటర్ కథలు ప్రపంచమంతా ఎంత ప్రాచుర్యం పొందాయో మనం చూస్తూనే ఉన్నాము.

ఆధార గ్రంథము :

1. బతుకాట నవల - వి.ఆర్.రాసాని.

❖ ❖ ❖

"జానపద దేవతలు – ఉత్సవాలు, ఊరేగింపులు"

– యమ్. అనురాధ, విద్యార్థి, తెలుగు శాఖా విభాగము, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

జానపద విజ్ఞానము :

ప్రాచినుల ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, సాంప్ర దాయాలు, కళలు, సాహిత్యాది విషయాల్ని గమ నించతంలోను మనకు ద్వావిదాలైన సామాగ్రి లభి స్తుంది. ఒకటి తరతరాలుగా గ్రంథస్థం కాక కేవలం మౌఖిక సాంప్రదాయంలో నిలిచిపోయిన విజ్ఞానం. మరియొకటి నాగరికతా ప్రవాహానికి లోనై గ్రంథస్థ రుపమునందిన విజ్ఞానం. మొదటిది సాంప్రదాయక విజ్ఞానం. దీనినే మనము జానపద విజ్ఞానం అంటున్నాము. రెండవది గ్రాంథిక విజ్ఞానం.

మనష్యులు జాతివలెను జానపద విజ్ఞానం కుడా అతి ప్రాచినమైనప్పటికిణి 'జానపదం' అను పద సృష్టి మాత్రం ఇటివలదే ప్రాచీనులు ఈ విజ్ఞానాన్ని జనప్రియులను ప్రాక్తన విషయములు అని పిలిచెడివారు.

సుప్రసిద్ధులైన ప్రాచీన సంస్కృత నాటకకర్తలు జానపద జనపద శబ్దాల్ని ఆయ అర్థాలలో ప్రయోగిం చుటలో 'కీడ' సల్పినవాడు 'భావభుతియని' పేర్కొని వీరు కొన్ని ఉదాహరణ యిచ్చి నిరూపించి యత్నించినారు. ఉదాహరణకు "ఉత్తర రామ చరిత్ర" ప్రధమంకములో దుర్మఖండు రామునితో "ఉపస్తుతి వంతి దేవం పౌర జానపదః" అన్నారు. ఇచ్చట పౌర శబ్దానికి పురవాసు లనియు, జానపద శబ్దానికి గ్రామావాసులనియు అర్థం. భవభూతి ప్రయోగించిన "పౌర జానపదః ప్రజాః" అను పదమును ఎఱ్ఱన స్వీకరించి "జానపదుల్ పురజనులు" అని ప్రయోగించి ఉండవచ్చునను అభిప్రాయాన్ని వెలిబుచ్చినాడు. ఇది సత్సదూరము కాదు. కాళిదాసు "మేఘ దేశాన్ని" ఉద్దేశించి ప్రయోగించి యుండటను గమనించవచ్చును. జ్ఞానపద విజ్ఞానమును మూడు సార్వత్రిక లక్షణములను గుర్తించవచ్చును.

1. సాంప్రదాయక వ్యాప్తి
2. విభిన్న పాఠాంతరం
3. సార్వజనినత

రిచర్డ్. యమ్. డోర్స్ న్ జానపద మాతాన్ని సాంఘిక జానపద ఆచారమును చేర్చియున్నాను. ఈ సాంఘిక జానపద ఆచార మండలి మత సంబంధాలు దేవతలు లేక కుల సమూహలు దేవతరాధనలతో కుదియుండును. కనుక గ్రామ దేవతారాదనను జానపద మతమునకు సంబంధించిన ఒక జానపదాచారంగా పరిగణించవచ్చును.

జానపద దేవతలు – ఉత్సవాలు, ఊరేగింపులు :

సంఘంలోని వ్యక్తులు తమ చుట్టును ఏవో అదృశ్య శక్తులు గలవని విశ్వసించి ఒనర్చిడి ఆచార విశేషమే జానపద మతము. జానపద మతమును ఒక అంశముగా గల గ్రామదేవతరాదనను ఈ విషయమును స్పష్టపరుచు చున్నవి. ఏవో తమకు తెలియని అదృశ్య శక్తులు మంచి చెడులతో నిమిత్తము లేక తమను ఆవరిస్తాయనియు, ఆ శక్తులు వ్యాధుల్ని, ఉపద్రవలని కలిగిస్తాయనియు ఆదిమ మానవులు విశ్వసించినారు. కనుకనే అతి ప్రాచీన కాలము నండియు గ్రామ దేవతారాధన జానపద మతమును విశిష్ట స్థానాన్ని ఆక్రమించి నేటికిని నిలద్రోక్కు కొనియున్నవి.

జానపదులు తమ గ్రామము ఒక శక్తి రక్షణలో వున్నట్లును, అదియే తమ గ్రామరక్షణ దైవమనియును నమ్మి ఆరాధించుచున్నారు. ఉదాహరణకు భీమవరంలో వెలసిన శ్రీ మావుళమ్మ గురించి మనము చెప్పుకోన వచ్చును. భీమవరంలో నకల సంపదలకు దివ్య రూపమైన దేవతగా శ్రీ మావుళమ్మ అమ్మవారిని గ్రామ దేవతగా కొలిచేదివారు.

భీమవరం గ్రామదేవత – శ్రీ మావుళమ్మ :

ఈ అమ్మవారు భీమవరం ఏ విధంగా వేలిచినారు అనేది కుప్తంగా ఈ అమ్మవారు మొట్టమొదటిగా రాయకుదురు అనే గ్రామంలో గ్రామదేవతగా నరబలులు కోరే అమ్మవారిగా ఉండేది అని, ఆ తరువాత వికృత రూపం దాల్చి భీమవరం ఒక మామిడితోటలో అమ్మ వారిగా వెలిసిందని తరువాత ఆమె రూపమును సున్నము, కోడిగ్రుడ్డు సాన ఉపయోగించి తయారు చేసిన ఒక రకమైన పదార్థంతో ఆమె రూపమును అందంగా మలిచినారనియు చెప్పవచ్చును. మామిడితోటలో విలిసి నందున ఆవిడకు మావుళమ్మ అమ్మవారుగా పేరు వచ్చిందని ఒక నమ్మకం. పూర్వకాలం నుంచి చాలా ప్రాముఖ్యత పొందిన అమ్మవారిగా మావుళమ్మ అమ్మవారు గ్రామా దేవతగా అభివృద్ధి చెందుతూ నేటి కాలంలో ఒక ప్రాంతీయ దేవతగా మావుళమ్మ వెలు గొందుచున్నది అని సవివరంగా చెప్పవచ్చును. అమ్మల గల అమ్మ, సమస్త కోర్కెలను తిర్చేడి అమ్మవారిగా శ్రీ మావుళ మ్మ వారిని కొలుస్తూ ఆషాడ మాసము ముందు నుంచి పూర విధులలో గ్రామోత్సవాలను (జాతర లను) జరుపుతుండటం ఇది చాలా అద్భుతంగా జరుగుతుంది. ఆలాగే ప్రతి సంవత్సరం భోగి పండుగా నాడు ప్రారంభించి గుడికట్టి ఎన్ని సంవత్సరములు అయినది అన్ని రోజుల పాటు జాతర మహోత్సవాలను అందంగా ఉండే విద్యుద్దీపాలంకారాలతో చాలా సంతోషంగా సంబరాలు జరుగుతాయని, ఆ సమాయంలో అమ్మవారు వివిధ అలంకరణలు చేస్తారు.

ఈ విధంగా గ్రామదేవతలు గ్రామ పరిరక్షకులుగా వెలుగొందేడివారిని ఒక నమ్మకం, గ్రామదేవతలు గ్రామాలలో సంభవించేడి కలరా, అమ్మవారు(పొంగు), పశువ్యాధులు నివారణకు గ్రామదేవతలను ఎక్కువగా కొలిచేడివారిని తెలుస్తుంది. గ్రామ దైవములలో చాలా వరకు స్త్రీ దేవతలే ప్రాధాన్యము వహించుటను గమ నించవచ్చును. ప్రాచీన మానవుడు పూజించిన 'శక్తి' యే గ్రామదేవత, సాధారణంగా గ్రామదేవతలకు ఆలయాలు ఊరి పొలిమేరలలో నే వుంటాయి. గ్రామదేవత ఎవ్వరును తప్పించుకొనలేరనే ధృడ విశ్వాసం జానపదలలో కద్దు, సాధారణంగా గ్రామదేవతలను పూజించేడి వారు అబ్రాహ్మణులుగా ఉండురు. కాని తంజావురుకు మూడు మైళ్ళ దూరంలో మరియమ్మ దేవాలయంలో బ్రాహ్మణ పూజారులు కలరనియు జంతుబలి Central shrine లో నిషేదింవబదినదినియు Henry Whitehead వివరించాడు. గ్రామ దేవతలను ఆరాధించుట వలన సకాలంలో వర్షాలు పది పంటలు బాగా పండుతాయని జానపదుల విశ్వాసం. గ్రామ సంరక్షణభారము గ్రామ దేవతలదేననేది విశ్వాసం వీరి మనస్సులలో నాటుకుని ఉన్నది.

గ్రామదేవతలు – ఉత్సవాలు, ఊరేగింపులు :

ఇంక ఆంధ్రప్రదేశ్ నందలి గ్రామదేవతలలో కొందురు మారమ్మ, ఎల్లమ్మ, సంకులమ్మ, పోలేరమ్మ, కొండా లమ్మ, దుర్గమ్మ, చూడమ్మ, పెద్దమ్మ, ఇన్నమ్మ, పోచమ్మ, అక్కమ్మ, అంకమ్మ, అంకాలమ్మ, డొక్కలమ్మ, ముత్యా లమ్మ, చల్లాలమ్మ, ఈదెమ్మ, మొదలగువారు. ఆయా పేర్లకు తగట్లుగానే ఆయా గ్రామములలో గ్రామ దేవతలుగా నిత్సం పూజలు అందుకుంటున్నారు.

కొన్ని గ్రామాలలో దేవతలు విగ్రహాల రూపంలో ఉంటారు. వారికి అన్ని రాకల నగలు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, చిరాలను ధరింప చేస్తారు. కొన్ని గ్రామాలలో పొలము గట్టులపైన చెరువు కట్టలపైన అధికంగా చిన్న చిన్న గంగమ్మ గుడులు అనేవి అనగా ఒక రాయిని విగ్రహంగా అనగా దేవతలగా కొలుచుచుండటం మనము ఇప్పటికినీ గ్రామములలో చూడవచ్చును. ఏమైననూ గ్రామదేవత పేరు చెప్పగానే జానపదులలో భయభక్తులు తొణికిసలాడుచుండుటను నేటికి గమనించవచ్చును. పైన ఉఅదహరిమ్చిన విధంగా ఈ జానపద విజ్ఞానమును పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నదిని ఐడి మనందరి సమిష్టి సంస్కృతిక బాధ్యత అని తెలియ జేయుచున్నాను.

ఆధార గ్రంథాలు :

1. జానపద విజ్ఞాన వ్యాసావళి - 1981 డా. జి.యస్.మోహన్, ఎం.ఏ., పి.హెచ్. డి., జ్ఞాన భారతి విశ్వ విద్యాలయం -- బెంగుళూరు
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - 2004 డా ఆర్వీయస్. సుందరం, డి.లిట్ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం - హైదరాబాదు.
3. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం శ్రీ మావుళమ్మ అమ్మవారి దేవాలయంలో నిత్స పూజారిగా ఉండే పండితుని ఇంటర్వ్యూ ద్వారా స్వికరించబడిన శ్రీ మావుళమ్మ కథాంశం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

చిత్తూరు జిల్లా భారతం మిట్ట ఉత్సవాలు

– డా॥. చిలకా అనిత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

మానవుడు దినమంతా కష్టపడి అలసిపోయినపుడు తిరిగి నూతనోత్సాహాన్ని పొందడానికి దోహదపడేవి కళలు. ఆ కళలు ఆచార సాంప్రదాయాలకు అద్దం పట్టేవిగా ఉంటాయి. అలాంటి వాటిలో జానపద కళలలో ప్రాముఖ్యత పొందినవి వీధి నాటకాలు. ఆ నాటకాలలో చిత్తూరు జిల్లాలో ఖ్యాతి గడించినది భారతంమిట్ట కంగుంది వీధి నాటకాలు. వీరు నాటకంగా ప్రదర్సించే మహాభారత ఉత్సవాలు నేటికి ప్రజాదరణ పొందుతూనే ఉన్నాయి. కారణం సంస్కృతీ సాంప్రదాయం ప్రతిబింబించడమే కారణం.

మహాభారత కథకు సన్నాహాలు :

సంవత్సరానికి ఒకసారి తిరుపతి చుట్టుప్రక్క ఉన్న పదిపదిహేను గ్రామాలు తిరుపతికి చేరుకుంటాయి. మహాభారత ఉత్సవాలు జరపటానికి నిర్ణయించుకున్న ప్రదేశమే భారతం మిట్ట. మహాభారతం 18 పర్వాలు పగటి పూట కథ రూపంలోను సాయంకాల సమయంలో వీధి నాటకంగా ప్రదర్శిస్తారు. ఈ ఉత్సవాల నిర్వహణలో ధర్మకర్త ప్రధాన భూమికి పోషిస్తాడు. జులై, ఆగష్టు మాసాలతో రైతుల పంటలన్ని ఇళ్ళకు చేరుకుని ఊపిరి పీల్చుకునే సమయంలో ధర్మకర్త ఆయా గ్రామాల్లో ఉన్న మేటి రైతులను పిలిపించి ఉత్సవాలు ఎలా నిర్వహించాలో నిర్ణయిస్తారు. తలకింతని పంపకం చేస్తారు. ఉత్సవ ప్రారంభాన్ని 'కొడి' ఎక్కడం అంటారు. 'కొడి' అంటే జెండా మీద గరుత్మంతుని ఆవాహం చేసి అష్ట దిక్పాలకులకు బ్రహ్మాది దేవతలను ఆహ్వానించటం సాంప్రదాయంగా కొనసాగుతుంది. ఈ ధ్వజారోహణకు రెండు వారాలకు ముందుగానే ఊరేగింపు బయల్దేరుతుంది. ఈ ఊరేగింపు మొదటగా ఏ గ్రామం నుండి బయల్దేరు తుందో ఆ గ్రామంలో పన్నెండు మంది పెద్దలు మూడు బావుల్లో స్నానమాచరించి ఆ పూటంతా ఉపవాసం ఉంటారు. ఈ ఊరేగింపులో పంచపాండవులు ద్రౌపది, పోతరాజు విగ్రహాలను ఒక్కొక్కరు ఒక్కొక్క విగ్రహాన్ని నెత్తికెత్తుకోవడంతో ఊరేగింపు ప్రారంభమవుతుంది. డప్పులు, పంబలు, కోలాటాలు, చెక్క భజనలు, పిల్లన గ్రోవులతో ఆహ్వానం పలుకుతూ జరిగే ఊరేగింపు కనుల పండుగగా ఉంటుంది. విగ్రహాలు ప్రతి ఇంటి ముందు ఆగుతాయి. పంపకం ఎంతైతే అంత చెల్లించే వరకు విగ్రహాలు అక్కడ నుండి కదలవు. ఆ విధంగా ఆ ప్రాంతంలో ఉన్న గ్రామాలన్ని తిరిగి వసూలైన పంపకంతో భారతోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

రోజుకొక పర్వంగా పద్దెనిమిది రోజులు జరిగే భారతం కథ అంటే అందరికీ పండుగే మరి. ఆ కథను వినడానికి స్త్రీ బాలాది వృద్ధులందరూ భారతం మిట్ట వద్దకు చేరుకుంటారు. పగలు కథ రూపంలో భారతాన్ని కళ్ల ముందు ప్రత్యక్షం చేస్తారు. పొద్దుందునగానే కథ అయిపోవడం తోనే జనాలు ఇళ్ళకు మరలి వంటావార్పు పూర్తి చేసుకొని రాత్రి నాటకానికి హాజరవుతారు. అదొక తిరునాళ్ళగా జరుగుతుంది. నాటకం ఆడేవారు ఎంతో నిష్టగా భక్తిగా ఉంటారు.

భారతంలోని ఘట్టాలు :

1. బకాసుర వధ
2. ద్రౌపది కళ్యాణం
3. అర్జునుని తపస్సు
4. దుర్యోధనుని వధ
5. అగ్ని తొక్కడం ప్రధాన ఘట్టాలుగా కార్యక్రమము కొనసాగుతుంది.

బకాసుర వధ :

ఇది ఒక అద్భుతమైన ఘట్టము. ప్రతి గ్రామంలో

రెండెడ్ల బండిని అందంగా అలంకరిస్తారు. గదను ధరించిన భీముడి పాత్రదారుడు బకాసురుడుకి ఆహారం కొరకు గ్రామాల్లోకి ప్రవేశిస్తాడు. ఆ అందంగా అలకరించిన బండ్లలో ఇంటికొక పళ్లెం అన్నంతో పాటుగా వివిధ రకాల వంటలను ఆ బండితో తెచ్చిపోస్తారు. అలా అన్ని గ్రామాల నుండి బండ్లు బయల్దేరి భారతం మిట్ట వద్దకు వస్తారు. భీముని పాత్ర ధారి మొఖానికి రంగులద్దుకొని తింటూ ఆడుతూ పాడుతూ ప్రజలకు వినోదాన్ని పంచి ధర్మరాజు గుడి వద్దకు వస్తాడు. తర్వాత భీముడికి బకాసురునికి యుద్ధం జరిగి బకాసురుడు మరణించడంతో ఈ ఘట్టం ముగుస్తుంది. పిదప మిగిలిన వంటకాలన్నీ అక్కడున్న వారందరికీ పంపకం జరుగుతుంది.

ద్రౌపది కళ్యాణం :

మహాభారతం నాటకంలో మరో ముఖ్యమైన ఘట్టం ఈ ఘట్టంలో ద్రౌపది కళ్యాణం పగలు పూట కథగా చెప్పి రాత్రికి నాటక ప్రదర్శన సమయంలో గుడిలో పాండవులతో ద్రౌపది విగ్రహాలకు కళ్యాణం జరపటం గమనిస్తాము. ఆ పాయకట్టులో ఉన్న ప్రజలు ద్రౌపదికి పసుపు కుంకుమల కింద చీరె, రవిక, గాజులు, పండ్లు, తాంబూలాలు సమర్పిస్తారు. కొంచెం కలిగిన కుటుంబాలైతే బంగారు మంగళ సూత్రాలను పేదవారు పసుపుకొమ్ము కట్టి ఒడిబాలు (ఒడికట్టు బియ్యం) సమర్పించి కళ్యాణానంతరం తిరిగి ఆ ఒడిబాలును ఇళ్ళకు తీసుకు వెళతారు. అలా తీసుకు వెళ్ళిన వారు వివాహం కాని ఇంట వాటిని పంచితే తద్వారా త్వరగా వివాహాలవుతాయని అక్కడ స్థానికుల నమ్మకం.

అర్జునుని తపస్సు :

ఈ నాటకంలో మరో ఘట్టం అర్జునుని తపస్సు ఘట్టం. దీనిలో శివుని కొరకు ఘోరతపస్సు చేయడం గమనిస్తాము. అర్జునుని తపస్సు కోసం ఆ గ్రామంలో ఎత్తైన కొబ్బరి చెట్టును కాని తాటి చెట్టును కాని అశోకా చెట్టును భారతం మిట్ట వద్ద నిలబడితే దానిపై పీఠ వేసుకుని అర్జునుడు పాత్రదారి కూర్చునే విధంగా అమర్చి దానిపై పసుపు రంగు వస్త్రాన్ని కప్పుతారు. అర్జునుడు ఆ పీఠ మీద కూర్చుని శివుని పాశుపతాస్త్రం కొరకు తపస్సు చేయడం చూపరులను ఆకట్టుకుంటుంది. తపస్సు పూర్తి అయిన తరువాత విబూది పండ్లు, బొరుగులు, శనగలు, పూలు పండ్లను వెదజల్లుతారు. అలా వెదజల్లినవి స్త్రీల కొంగులో పడితే అవి వారి పాలిట మహా ప్రసాదం. దాంతో రోగాలు తగ్గుతాయనో, సంతానం కలుగుతుందనో వారి సమస్యలు తీరతాయని నమ్ముతారు.

దుర్యోధనుని వద :

ఈ ఘట్టం సాధారణంగా ఆదివారం పూటనే జరుగుతుంది. భారతంమిట్ట మీద దాదాపు పది గంటల సమయంలో (సూర్యాస్తమయం తర్వాత) దుర్యోధనుని పెద్ద మట్టి బొమ్మను తయారు చేసి ఎర్రనీళ్ళతో ఒక కుండను నింపి దాన్ని దుర్యోధనుని తొడలో అమర్చుతారు. భీమ, ధుర్యోధనులిద్దరు యుద్ధానికి తలపడగా కృష్ణ పరమాత్ముని సైగతో భీముడు దుర్యోధనుని తొడపై కొట్టగా ఎర్ర నీటితో నింపిన కుండ పగిలి రంగునీరు రక్తంగా ప్రవహిస్తుంది. ఈ ఘట్టం మనోరంజకంగా ఉంటుంది. దుర్యోధనుని వద అనంతరం ఆ బొమ్మకు ఉపయోగించిన మట్టిని ప్రతి ఒక్కరు పోటీపడి ఇండ్లకు తీసుకువెళతారు. దానితో ఇళ్ళు అలకడం లాంటివి చేసుకుంటారు. ఇలా ప్రతి సంవత్సరం మట్టి తెచ్చి ఇంట్లో దాచుకోవడం లేక ఉపయోగపెట్టుకోవడం వల్ల వారు అష్టఐశ్వర్యాలతో తుల తూగుతారని ప్రజల నమ్మకం. ఆ రక్తంతోనే ద్రౌపది శిరోజాలను సిగముడి వేసుకుని ద్రౌపది భీమిని ధైర్య సాహసాలను మెచ్చుకుంటుందని ఈ కథ సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చే ప్రయత్నమే ఈ కథ.

అగ్నితొక్కడం :

ఇది దాదాపు పది నుండి పన్నెండు అడుగులు వెడల్పు ఇరవై అడుగులు పొడవు ఒక అడుగు లోతు కొలతలతో

ఒక అగ్ని గుండం ఏర్పాటు చేసి ఆ రోజు మధ్యాహ్నం ఊరికొక బండికట్టె అగ్ని గుండంలో వేస్తారు. పొద్దువాలిన సమయంలో నిప్ప అంటిస్తారు. సాయంత్రం అగ్నిగుండం కణకణ మండే నిప్పల్తో నిండుతుంది. రెండు బార్ల దూరంలో నిలబడిలా ఆ వేడికి తట్టుకోలేరు.

ఈ అగ్ని తొక్కడాన్నే అగ్ని ప్రవేశం అంటారు. ఈ అగ్ని తొక్కాలనుకునేవారు ఆ పూటంతా ఉపవాస దీక్ష చేసి మూడు బావుల నీటితో స్నానమాచరించి విగ్రహాలను తలకెత్తుకుంటారు. పౌరాణికుడితో పాటు అందరూ అగ్ని గుండానికి మూడుసార్లు ప్రదక్షిణలు చేసి ఒక్కొక్క ప్రదక్షిణకు బారెడు పొడుగు మల్లెదండను ఆ నిప్పుల మీద వేసినట్లు వేసి తీసేస్తాడు. ఆ మల్లెలు వసివాడవు. ఆ సమయంలో అందరూ గోవింద నామస్మరణతో అటు మూడుసార్లు ఇటు మూడు సార్లు అగ్ని తొక్కుతారు. అంతటితో ఈ మహాభారతోత్సవం ముగిసినట్లే.

ముగింపు :

పూర్వం రాజులు పోషించిన వీధి నాటకాలు నాటక కళాకారుల జీవితాలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక విజ్ఞానం నూతన పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో సాంకేతికత వల్ల లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయి. రేడియోలు టి.వి.లు ప్రజల జీవన విధానంతో ఒక భాగమైపోయాయి. వీటిలో ప్రసారం చేసే కార్యక్రమాలతో ఈ జానపద కళలు పోటీపడలేక పోతున్నాయి. కొన్ని మాధ్యమాలు జానపద కళలకు పట్టం కడుతున్నాయి. కొంత మంది జానపదాల మీద ఆసక్తితో ఎన్నో పరిశోధనలు చేశారు. చేస్తూనే ఉన్నారు. వారికి చేయూతనిస్తే ముందు తరాల వారికి ఈ జానపద కళను అందించిన వారమవుతాము. మన జాతి సంపద సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ముందు తరాల వారికి అందించే ప్రయత్నంలో ప్రతి ఒక్కరం భాగస్వాములౌదాం.

ఉపయుక్త గ్రంథాలు :

1. డా॥ యస్. గంగప్ప - తెలుగు నాటకం.
2. డా॥ పులికంటి కృష్ణారెడ్డి - సీమబారతం
3. డా॥ వి. గోవిందరెడ్డి - చిత్తూరు జిల్లా వీధి నాటకాలు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వరంగల్ జిల్లా జానపద గేయకథలలో దేవతారాధన /పూజా విధానం

– డా॥. ధారవత్ సంతోష్‌కుమార్, తెలుగు భాషోపాధ్యాయుడు.

జానపదాలలోని వ్యక్తులు తమచుట్టూ ఏవో కొన్ని అదృశ్య శక్తులు ఉన్నాయని విశ్వసిస్తారు. తమకు తెలియని ఏవో కొన్ని శక్తులు మంచిచెడులతో నిమిత్తంలేక తమను ఆవరించుకొని ఉన్నాయని జానపదులు నమ్ము తారు. ఆ శక్తులే వివిధ రకాల రోగాలను కలిగిస్తాయని బలంగా నమ్ముతారు. అందుకే వారు తమ కుటుం బాను, గ్రామాలను రక్షించాలనే నెపంతో గ్రామదేవతలను పూజిస్తారు. కనుకనే చాలాకాలం నుండి గ్రామదేవతా రాధన జానపదుల మతంలో విశిష్ఠస్థానాన్ని ఆక్రమించి ఈనాటికీ అది కొనసాగుతుంది. ముఖ్యంగా జానపదులు తమ గ్రామం ఒక శక్తి రక్షణలో ఉన్నదని నమ్మి అదే తమ గ్రామ దైవమని ఆరాధించడం,పూజించడం జరుగు తుంది. సమాజంలో ఉన్న వివిధ సమూహాలకు తమ ఆచార, సంప్రదాయాలలో,పూజావిధానంలో కొంత వ్యత్యాసం ఉన్నా దాని ఫలితం మాత్రం దేవతలను పూజించడమే పరమార్థం.

సారమ్మ గేయకథలోని పూజావిధానం అనేక ఆలోచన లను రేకెత్తిస్తుంది పరిశీలిద్దాం.

"పాదం చెలి విపు ఉయ్యాలో పర్వాతాల మల్ల ఉయ్యాలో
కట్ట సింగారించి ఉయ్యాలో కంకనము కట్టి ఉయ్యాలో
దొడ్డి సింగారించి ఉయ్యాలో దొరనము గట్టి ఉయ్యాలో
మందా సింగారించి ఉయ్యాలో మచ్చె లెబి ఉయ్యాలో
మందా మైసి నిన్ను ఉయ్యాలో మావోలు గొలిసెరి ఉ యాలో
ఉరు సింగారించి ఉయ్యాలో ఉరురాడి బోసి ఉయ్యాలో
ఉర ముత్తు నిన్ను ఉయ్యాలో ఉలెలు గొలిసిరి ఉయ్యాలో
కట్ట సింగారించి ఉయ్యాలో కంకనము గట్టి ఉయ్యాలో
దండం దండం ఉయ్యాలో మునెతనె తల్లికి ఉయ్యాలో
తపస్సి దండము ఉయ్యాలో తల్లినె తండ్రికి ఉయ్యాలో
పెరిన నెతులు ఉయ్యాలో తల్లినె కాలెసె ఉయ్యాలో
తప్పకాని దెత్తు ఉయ్యాలో తల్లి గనపతి ఉయ్యాలో
మనమని కత్తుల ఉయ్యాలో మారిబుజమందు ఉయ్యాలో"

మైసమ్మ స్త్రీ దేవత, మాంసాహార దేవత కాబట్టి సాధారణంగా ఈ దేవతకు జంతుబలి కార్యక్రమాలతో ముడిపడి ఉంటుంది. మైసమ్మ ఉన్న ప్రదేశాన్నిబట్టి, పూజా ప్రాధాన్యతబట్టి వివిధ పేర్లతో పిలుస్తారు. మైసమ్మ చెరువుకట్ట మీద ఉంటే కట్టమైసమ్మ, పశువులదొడ్డిలో ఉంటే దొడ్డిమైసమ్మ, చేనులో ఉంటే చేనుమైసమ్మ అని రకరకాల పేర్లతో పిలుస్తూ, కొలుస్తుంటారు. గ్రామ దేవతలను పూజించేవిధానంలో వివిధ వర్గాలమధ్య కొంత వ్యత్యాసం ఉన్నా, వారి భక్తి మాత్రం ఒకటేనని ఈ గేయకథ వివరిస్తుంది. జానపద గేయకథలలో గ్రామ దేవతలైన మైసమ్మ, పోచమ్మ, గంగమ్మ మొదలగువారిని జానపదులు ఎక్కువగా పూజిస్తారు. తద్వారా గ్రామంలో వ్యక్తులను ఒకచోట చేర్చడమే కాకుండా, వారి పరస్పర సంప్రదాయాచారాలను భవిష్యత్ తరాలవారికి అందించే వారవుతారు. దీని మూలంగా జానపదులలో ఐక్య సంఘటనాత్మక భావన పెరిగి సామాజికాచారాలు స్థిరపడుతున్నాయి. ఈ దేవతారాధన ప్రాచీనకాలం నుంచే తరతరాలుగా వస్తూ, నేటికీ వివిధ గ్రామాలలో దేవతలను కొలిచే ఆచారం స్థిరంగా ఉంది. అలాగే మరొక గేయ కథలో

"హరి హరి వొ రామ ఉయ్యాలో హరియనె వొ రామ ఉయ్యాలో
రామనె వొ రామ ఉయ్యాలో సిరామ వొ రామ ఉయ్యాలో

తొక్కుదు భూదేవి ఉయ్యాలో మొక్కుదమ్మ నిను ఉయ్యాలో
మొక్కిన వారికి ఉయ్యాలో మోచ్చం చెందు ఉయ్యాలో
తొక్కిన వారికి ఉయ్యాలో తలగునె దొసాలు ఉయ్యాలో
హరి హరి వొ రామ ఉయ్యాలో హరియనె వొ రామ ఉయ్యాలో
సారెడు కుంకుమ ఉయ్యాలో చంద్రనె పట్నాలు ఉయ్యాలో
మోటుడు కుంకుమ ఉయ్యాలో మోగిలిరెకులు ఉయ్యాలో
గంగా వో గంగా ఉయ్యాలో వొనరైన గంగా ఉయ్యాలో
గంగాను తలవంది ఉయ్యాలో గడిసెరమ్మ ఉయ్యాలో
తొలి తలద్దు మలి తలద్దు ఉయ్యాలో దొనకొండ తలదు ఉయ్యాలో
దొనకొండ ఏలేది ఉయ్యాలో యాదవుల తల దునె ఉయ్యాలో
సివసివ నిను తల దు ఉయ్యాలో సివుడానిను తలదు ఉయ్యాలో
ముందుగా నిను తల దు ఉయ్యాలో ముచ్యాల పోచమ్మ ఉయ్యాలో
సిత్తారి బొమ్మలె ఉయ్యాలో సివునాడిబిడ్డవె ఉయ్యాలో
హరి హరి వొ రామ ఉయ్యాలో హరియనె వొ రామ ఉయ్యాలో
ముందాగా నిను తల దు ఉయ్యాలో ముత్యాలబొమ్మ ఉయ్యాలో
గడియాల నిను తల దు ఉయ్యాలో గాడినె మైసమ్మ ఉయ్యాలో
ఉదయానె నిను తల దు ఉయ్యాలో పురిటి ముత్తమ్మ ఉయ్యాలో
వదలనిన్ తల దు ఉయ్యాలో పర్వతాల మల్లు ఉయ్యాలో
రాగంలో నిను తల దు ఉయ్యాలో రాసి కొండిరన్న ఉయ్యాలో
తోవాల నిను తల దు ఉయ్యాలో దొనకొండ శారాది ఉయ్యాలో
బాటాల నిను తలదు ఉయ్యాలో బాటాల బైరుడా ఉయ్యాలో
గంగా రా వొ గంగా ఉయ్యాలో వొనరైన ఉయ్యాలో
గంగా నితల్ వంది ఉయ్యాలో గడితెరబొదమ్మ ఉయ్యాలో
యిగ్రం తల్వంది ఉయ్యాలో యిడెతెరేది ఉయ్యాలో
హరి హరి వొ రామ ఉయ్యాలో హరియనె వొ రామ ఉయ్యాలో
తిసిన ఉర్థలు ఉయ్యాలో తినంగ వుండగ ఉయ్యాలో
తిరకొల్ తిరంగ ఉయ్యాలో పెద్దింట్ల వుండగ ఉయ్యాలో
తిప్పిగట్టిన గుల్లు ఉయ్యాలో తిగనె టంబలు ఉయ్యాలో
తిరుపతి ఎంకన్న ఉయ్యాలో నెనెమమ్ తలుదు ఉయ్యాలో
మాపు కట్టిన గుల్లు ఉయ్యాలో మానిక్యటంబలు ఉయ్యాలో
మా వూరి పనమట ఉయ్యాలో మాలచ్చిమిని తల దును ఉయ్యాలో
ఎదురు బియ్యం ఉయ్యాలో ఎడంతానాలు ఉయ్యాలో
ఎట్టి కొలిసిరి గంగ ఉయ్యాలో యి ఎర్ర గొలోలె ఉయ్యాలో
పదం బియ్యం ఉయ్యాలో పాదం తానాలు ఉయ్యాలో
పట్టి కొలిసిరి గంగ ఉయ్యాలో పాకానె నాటురు ఉయ్యాలో
ముత్తుం బియ్యం ఉయ్యాలో మూడం తానాలు ఉయ్యాలో
ముత్తి కొలిసిరి గంగ ఉయ్యాలో ముత్తిం గొల్లాలు ఉయ్యాలో
గంగరా వొ గంగా ఉయ్యాలో వొనాడానైన గంగా ఉయ్యాలో"

జానపదుల నమ్మకాలు, పూజావిధానం గురించి సమాచారం పై గేయకథలో మనకు లభిస్తుంది.

సమాజంలో ప్రతిఫలించే అంశాలన్నీ గేయకథ రూపంలో ప్రతిబింబిస్తుంటాయి. గేయకథకు సమాజంలో జరిగే వాస్తవ సంఘటనలకు అవినాభావసంబంధం కలిగి వుంటుంది. దేవుణ్ణి నమ్మినవాళ్ళకు మంచి జరుగుతుందని, నమ్మనివాళ్ళకు చెడు జరుగుతుందని జానపదులు నమ్ముతారు. తాముచేసే ప్రతి పనిలో దైవాజ్ఞ లేనిదే వారు ఏ పనినీ ప్రారంభించరని తెలుస్తుంది. ఈ గేయకథ నేటికీ గ్రామాలలో పాటకజనాలు పాడుకుంటూ, తమ ఆచారసంప్రదాయాలను కాపాడుకుంటున్నారు. శాస్త్రసాంకేతికరంగం ఎంత అభివృద్ధి చెందినా జానపదుల అలవాట్లలో, ఆచారాలలో, సంప్రదాయాలలో ఎలాంటి మార్పు చోటుచేసుకోకుండా, వారి సంస్కృతిని భవిష్యత్ తరాలవారికి అందించాలనే తపన వారి ముందుచూపుకు నిదర్శనం. అలాగే మల్లయ్యదేవుని గేయకథలో జాంబవులకు కలరావ్యాధి సోకడంతో, ఆ వ్యాధిని నివారించడానికి దేవుడు జాంబవుల వాడకు మారువేషంలో వచ్చి తనకు కొన్ని వస్తువులు అడగడం, జాంబవులు తిరస్కరించడం కనబడుతుంది. అంటే జానపదులు ఎవరిని పడితే వాళ్ళను నమ్మరని, తమకు తెలిసినవాళ్ళనే వారు నమ్ముతారనే భావం స్ఫురిస్తుంది. అయితే కథలో ఈ సందర్భంలోనే ఓ స్త్రీకి దేవుడుపూనడం జరిగినదంతా జాంబవులకు చెప్పడం దానితో తిరిగి దేవుడిని పూజించాలనుకుంటారు. వారి పూజావిధానాన్ని గమనిస్తే.....

"య యపకారి యిండ్లనమ్మ రామో రామా
య పెద్దోల ఎల్లమ్మకు రామో రామా
య ఎల్లమ్మ దేవుడు బునె రామో రామా
య ఎమాని చెప్పబట్టె రామో రామా
య దానికి దేవుడు వొచ్చె రామో రామా
య కుండొక్క కల్లు డెన్ రి రామో రామా
య మైసాచి బడ్క రాండి రామో రామా"

అంటూ వారి తప్పులను తెలియచేసి, దేవుడిని పూజించాలని కోరుకుంటుంది. జానపదులు ఎక్కువగా తమ పూజలో భాగంగా అనేకరకాల వస్తువులు, సామాగ్రులను తీసుకొస్తారు. ఎల్లమ్మ దేవత పూనిన స్త్రీకుండనిండా కల్లును, మైసాచిని తీసుకొచ్చి దేవుడిని పూజించాలని చెప్పడం, వారు అలాగే చేసి, తమ తప్పులను మన్నించాలని వేడుకోవడం జరుగుతుంది. అప్పుడు వారు దేవుడు కావాలని అడిగిన వస్తువులను తీసుకొని వెళ్ళడమును చూస్తే.....

"య జాంబవులు జూడరమ్మ రామోజ్య రామ రామా
య కనకాయి డప్పులతోని రామోజ్య రామ రామా
య పురి బయటికి పోయినారు రామోజ్య రామ రామా
య మల్లయ్యను కాలుబట్టిరో రామోజ్య రామ రామా
య దేవుడను కొలెదయ్య రామోజ్య రామ రామా
య బిచ్చగాడు అనుకునాము రామోజ్య రామ రామా
య తప్పులు మన్నించావు రామోజ్య రామ రామా
య అల్లుడా మల్లయ్యను రామోజ్య రామ రామా
య కిరి కత్తి తెత్తమయ్య రామోజ్య రామ రామా
య వొడిసాలు జెనుతాము రామోజ్య రామ రామా
య కిర్రు వొక్క చెప్పులైనా రామోజ్య రామ రామా
య మికైనా దెత్తమాని రామోజ్య రామ రామా
య అడుగులకు మడుగులెసి రామోజ్య రామ రామా
య సప్పుల తొనినైనా రామోజ్య రామ రామా
య జంబవుల పట్నంనైనా రామోజ్య రామ రామా
య మల్లుకొని దిసుకొచ్చె రామోజ్య రామ రామా
య గొరంత బండరైనా రామోజ్య రామ రామా
య బండారి బట్టినాడు రామోజ్య రామ రామా
య జంబవులు మీదనైనా రామోజ్య రామ రామా
య మరిగారి గొట్టినాడు రామోజ్య రామ రామా
య కక్కుడు గాబారాను రామోజ్య రామ రామా
య తక్కువాను అయినాది రామోజ్య రామ రామా"

మల్లయ్య దేవుని జాంబవులు పూజించి, తమ వీధికి తీసుకొచ్చి తమకు వచ్చిన వ్యాధిని నయంచేసుకుంటారు. జాంబవులు మల్లయ్య దేవుడికోసం కాళ్ళకు కిర్రుచెప్పులు, కిరికత్తితో పాటు ఒడిసాలు పట్టుకోనివెళుతారు. అప్పుడు

మల్లయ్య దేవుడు జాంబవులను క్షమించి, వారికి కలిగిన గత్తర వ్యాధినుండి కాపాడుతాడు. జానపదులకు దేవుని మీద ఎక్కువగా నమ్మకం ఉంటుంది. సమాజంలో ఎన్ని ఆధునిక పోకడలు వచ్చినా వారుమాత్రం తమ ఆచార, సంప్రదాయాలను కాపాడుతున్నారని చెప్పవచ్చు.

ముగింపు :

నేను వరంగల్ జిల్లా స్థిరనివాసి కావడంవల్ల, వరంగల్ జిల్లా జానపదుల సంస్కృతి-సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు మరియు కట్టుబాట్లు, జాతరలు, కథలు, గేయకథలు మొదలగు అంశాలను గురించి పరిశోధించాల్సిన అవసరం ఎంతైనావుందని భావించి, నేను ఎమ్.ఫిల్. కాలపరిమితి దృష్ట్యా "తొర్రూరుమండల జానపద కథలు - పరిశీలన" అనే అంశాన్ని ఎన్నుకుని క్షేత్ర పర్యటన ద్వారా మండలం మొత్తం తిరిగి జానపద మౌఖిక కథలను సేకరించి, సేకరించిన కథలను విశ్లేషించి హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఫిల్. పట్టాను తీసుకున్నాను. ఈ జానపద మౌఖిక కథలను సేకరించే క్రమంలో నాకు గేయకథలు కూడా లభించాయి. అందువల్ల క్షేత్రపర్యటన ద్వారా వరంగల్ జిల్లా మొత్తం తిరిగి జానపద గేయకథలను సేకరించవలసిన అవసరంవుందని భావించి "వరంగల్ జిల్లా జానపద గేయకథల అధ్యయనం" అనే పరిశోధనాంశాన్ని ఎన్నుకొని, జానపద గేయకథలను సేకరించి, విశ్లేషించి హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టాను తీసుకున్నాను.

ఉపయుక్త గ్రంథసూచి :

1. కృష్ణకుమారి, నాయిని. 2012-తెలుగు అకాడమి, హైదరాబాదు-తెలుగు జానపద గేయగాథలు.
2. ప్రేమలత, రావి. 2011-తెలుగు జానపద సాహిత్యం పురాగాథలు, ప్రథమ ముద్రణ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. రామరాజు, బిరుదరాజు. 1990-తెలుగు జానపద గేయ సాహిత్యం, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు, తృతీయ ముద్రణ.
4. లింగారెడ్డి, గోపు. 1982-తెలంగాణ శ్రామికగేయాలు, పరిశోధన వ్యాసం, సుష్మా పబ్లికేషన్, కరీంనగర్.
5. వెంకటసుబ్బారావు, తంగిరాల. 2000-తెలుగు వీరగాథా కవిత్వము మొదటి సంపుటము, శ్రీ దేవరాయ రసజ్ఞ సమాఖ్య, బెంగుళూరు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు సినిమాలు – జానపద గీతాలు

– డా॥. కె. రామలక్ష్మి, ఐ.ఐ.టి. చెన్నై.

తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న జానపద గీతాలు తెలుగు చలనచిత్రాల్లో కూడా ప్రవేశించాయి. జానపద గీతాలు గాని జానపద బాణీలో గాని రాసిన పాటలు ఉత్సాహాన్ని రేకెత్తిస్తూ ప్రేక్షకులను చిందులు వేయిస్తాయి. ఆ కారణంగా జానపద గీతాల సాహిత్యాన్ని, బాణీలను సినిమా పాటల్లో నిర్మాతలు, సంగీత దర్శకులు ఉపయోగించుకున్నారు.

జానపదం అంటే దేశ్యం, గ్రామ్యం, పల్లె అని నిఘంటు అర్థాలు. జానపదులు లేక జనపదులు అంటే పల్లెటూరివారని, జానపదం అంటే పల్లెకు సంబంధించినదని అంటారు. రాత కోతలతో సంబంధం లేకుండా పల్లెజనాలు పాడుకొని ఆనందించే పాటలే జానపద గీతాలు. వీటిలో కొన్ని యధాతథంగాను, మరికొన్ని పాక్షిక మార్పుల చేర్పులతో చిత్రాలకు గ్రహించినవి ఉన్నాయి. చిత్ర కథను బట్టి యధాతథంగా కొన్ని జానపద గీతాలు చేరితే మరికొన్ని జానపద గీతాల్లోని పల్లవినో, కొంత భాగాన్నో గ్రహించి కథానుగుణంగా అనుకరించి రాయటం జరిగింది. జానపద గీతాల కర్తృత్వం, కాలం వంటివి జానపద సాహిత్యానికి అతీతంగా ఉండటం వలన వాటిని సినిమాల్లో వినియోగించుకోవడానికి ఎవరి అనుమతి అవసరం లేదు. అలా జానపద గీతాలు సినిమాల్లో ప్రవేశించాయి.

యధాతథాలు :

చలన చిత్రాల్లో జానపద గేయాలను యధాతథంగా వినియోగించుకున్నారు. ఈ క్రింది గీతం తెలంగాణా మాండలికానికి చెందినది.

"ఏటికేతం బట్టి ఎయిపుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరగనన్నా - నేను
గంజిలో మెతుకెరగనన్నా" (చిల్లర దేవుళ్ళు)

"తిన్నెమీద సిన్నోడు - వన్నెకాడ
తేనెతుట్టెలాంటి - ఓ సిన్నవాడ" (భాగ్యలక్ష్మి)

"ఇంటి ముందర సిక్కుడుసెట్టు
ఎట్లగొస్తవో సాగసుకాడ" (భక్తపోతన)

పై తదితర గీతాలన్నీ ఎటు వంటి మార్పులు లేకుండా సినిమాల్లో వాడుకొన్న జానపద గేయాలే.

పాక్షికాలు :

జానపద గీతాల్లో కొంత భాగాన్ని గాని, పల్లవి వరకు తీసుకొని రాసిన సినిమాపాటలే ఎక్కువ. జనానికి సుపరిచితమైన జానపద బాణీలు పాటలు ఉంటే ప్రజలు ఆదరిస్తారని, అటువంటి పాటలను రచయితలు రాసారు. జానపద సాహిత్యాన్ని మేలుకొలుపులు, తత్వాలు, సంవాదాలు, తడిక పాటలు, సరదాలు, సరసాలు, పని పాటలు, బాలలగేయాలు, స్త్రీలపాటలు, వలపుపాటలు మొదలైన ఉపవిభాగాలుగా చేసి విభజించవచ్చు.

మేలుకొలుపు :

ప్రముఖ గీత రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి రాసిన ఈ క్రింది పాట, ఒక పల్లెపాటలోని పల్లవి చరణాలను స్ఫురింప చేస్తుంది.

"తెల్లవారవచ్చె - తెలియక నాసామి
మళ్ళీ పరుండేవు లేరా
మళ్ళీ పరుండేవు - మసలుచు నుండేవు
మారాము చాలింక లేరా...."

జానపద మాతృక!

"తెల్లవారెనమ్మ చెల్లనేమందు
నల్లని నాసామి లేరా
మరల పడుకునేవు మసలు చున్నావు
మర్యాద గాదిక పోరా...."

"శ్రీ సూర్యనారాయణామేలుకో.... మా
చిలకమ్మ బులపాటమూ చూసిపో"
(మంగమ్మగారి మనవడు)

మాతృక "శ్రీ సూర్యనారాయణా మేలుకో
హరి సూర్యనారాయణా మేలుకో"
(జానపద సాహిత్యం - పుట 145)

తత్త్వాలు :

ఐహిక జీవితం పట్ల విరక్తి కలిగించి మనుషుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచేవి. జ్ఞానాన్ని బోధించేవి తత్త్వాలు. పోతులూరి వీరబ్రహ్మం ఎడ్లరామదాను తదితర వాగ్గేయకారుల రచనలు కూడా జానపద వ్యవహారంలో ఉన్నాయి. అయితే సినిమాపాటలు కూడా తత్త్వగీతాలుగా రాయటం జరిగింది. పాత సినిమాల్లో బైరాగులు, సాధువులు మొదలైన పాత్రల ద్వారా ఈ తత్త్వగీతాలను విరివిగా వినిపించేవారు.

గురజాడ రచించిన కన్యాశుల్కంలో ఓ తత్త్వగీతం ఉంది. అది జానపద గీతమే. నాటకంలోని ఆ గీతాన్ని యథాతథంగా కన్యాశుల్కం చిత్రంలో బైరాగి పాత్రతో చిత్రీకరించారు.

"ఇల్లు ఇల్లని యేవు... ఇల్లు నాదని యేవు
నీ యిల్లు యెక్కడే చిలుకా....." (కన్యాశుల్కం)

ఇంచుమించు ఈ పాట పల్లవికి దగ్గరగా ఆరుద్ర ఇలా రాశారు.

"ఇల్లని యేవు ఇల్లాలు అని యేవు
ఇల్లేదిరా వెర్రినరుడా..." (కృష్ణప్రేమ)

సంవాదాలు :

సంవాదం అనే పేరు వినగానే రాధామాధవ సంవాదం, లక్ష్మీనారాయణ సంవాదం వంటివి గుర్తు కొస్తాయి. ప్రాచీన సాహిత్యంలో ఉన్న ఈ ప్రక్రియ జానపదాలలో వికసించింది. వీటిలోని అత్తాకోడళ్ళు, బావా మరదళ్ళు, వదినా ఆడపడుచుల సంవాదాలు సినిమాల్లోకి కూడా వచ్చాయి. అత్తాకోడళ్ళ సంవాదం అనగానే బాగా ప్రాచుర్యం పొందిన ఈ జానపద గేయం గుర్తు కొస్తుంది.

"అత్తలేని కోడలుత్తమురాలు ఓలమ్మీ
కోడలు లేని అత్త గుణవంతురాలు"

ఈ పాటని తెలుగు సినిమాల్లో పలు రకాలుగా రచయితలు ప్రయోగించారు.

అత్త : "కోడలా కోడలా కొడుకు పెళ్ళామా
పచ్చిపాల మీద మీగడ యేదీ?
ఆ వేడిపాల మీద వెన్నలు యేవీ?
నూనెముంతల మీద మరుగులు యేవీ?"

కోడలు : "అత్తరో ఓ అత్త ఆరళ్ళ అత్త
పచ్చిపాల మీద మీగడంటుందా
వేడిపాల మీద వెన్నలుంటాయా
నూనెముంతల మీద మరుగులుంటాయా"
(మనదేశం)

వదినా మరదళ్ళు సంవాదాన్ని సి.నారాయణ రెడ్డి ముచ్చట గొలిపే తీరులో ఇలా రచించారు.

వది : "మరదలా మరదలా తమ్ముని పెళ్ళామా
ఏ మమ్మా వైనమే మమ్మా

ఆడ : వదినమ్మ వదినమ్మ అన్నయపెళ్ళామా
ఏమమ్మా వైన మేంటమ్మా

వది : చక్కని తిలకమ్ము ముక్కున జారింది
ఏమమ్మా అది ఏమమ్మా

ఆడ : వల్లమాలిన చెమట గల్లంత చేసింది
లేవమ్మా... ఇంతే లేదమ్మా" (వరకట్నం)

తడికపాటలు :

జానపద సాహిత్యంలో మరొక ప్రధాన విభాగం తడిక రాయబారం. అలుమగలు, అత్తా కోడళ్ళ మధ్య మాటలు లేనప్పుడు, కోపతాపాలు రేగినప్పుడు ఎవరి మీదో వంక పెట్టో? ఎవర్నో అడ్డు పెట్టుకునో అన్యాపదేశంగా మాట్లాడుతారు. ఎవరూ దొరకనప్పుడు తడికెనో, తలుపునో, పెంపుడు జంతువునో అడ్డుగా పెట్టకొని మాట్లాడడాన్నే

'తడిక రాయబారం' అంటారు. జానపద జీవితాన్ని ప్రతిబింబించే తడిక రాయబారాలు పల్లె పాటల నుండి సినిమాల్లో ప్రవేశించాయి. ఆరుద్ర రాసిన గీతమిది.

మగ : "మాయదారి కీచులాట మా మధ్య వచ్చింది
రాయబారం సేయవే తడికో తడికో

ఆడ : ఆడవగలమారి మాటలకు ఒళ్ళంతా మండుతుంది
రాయబారమెందుకో తడికో తడికో"

(అత్తారింటి కోడలే)

దాశరధి రాసిన ఈ గీతంలో తడిక బదులు 'జాబిలి రాయబారం' ఉంది.

మగ : "అడగవే జాబిల్లి అడగవే
అందాల ఈ వేళ ఈ సిగ్గులు ఎందుకని అడగవే

ఆడ : ఊ చెప్పవే... జాబిల్లీ చెప్పవే
చిన్నారి చెలియకు సిగ్గే సింగారమని చెప్పవే"

(భూలోకంలో యమలోకం)

సరదాలు సరసాలు :

పడుచుజంట అందులోను వరసయినవాళ్ళు సరసాలాడటం సహజం. ఈ క్రింది పాటల్లో బావామరదళ్ళు వయసులో ఉన్న స్త్రీ,పురుషులు పాడతారు. అనిసెట్టి మూలం ప్రతిబింబించేలా సినిమాకుగాను ఇలా రాశారు.

మగ : "రాయుడోరింటికాడ నల్లతుమ్మ చెట్టుకాడ
రాయుడేమన్నాడే ఓబుల్లీ రాయుడేమిచ్చాడే

ఆడ : వంకేవడ్డాణమిస్తా, రంగైన చీరలిస్తా
మంచి పిల్ల నీ వన్నాడు ఓ అబ్బీ"

(కుటుంబ గౌరవం)

మాతృక: "నాయుడోళ్ళింటికాడ నల్లతుమ్మ చెట్టుకాడ
నాయుడేమన్నాడే పిల్లా? అబ్బఎంత వింత గున్నావే పిల్లా
నాయుడోళ్ళింటికాడ నల్ల తుమ్మ చెట్టుకాడ
నాలుగు రూపాయి లిస్తానన్నాడమ్మా"

అలాగే ఆరుద్ర రాసిన ఈ క్రింది పాటకు కూడా జానపద గీతం మూలం ఉంది. నెల్లూరులో యానాది స్త్రీలు పాడే పాటమూలం.

"ఏస్కో నారాజా ఏస్కో అహ ఏస్కో నారాజా ఏస్కో
ఆకేస్కో వక్కేస్కో ఆపైన చూస్కో" (చిట్టితమ్ముడు)

మాతృక: "ఆకేస్కో వక్కేస్కో లవంగాల మొగ్గేస్కో
సాలకుంటె నన్నేస్కో"

అంతేకాక తర్వాతి రచయితలు దాశరధి, వేటూరి తదితరులు కూడా బావామరదళ్ళ సరసాలు గురించి రాసిన పాటలు మధురంగా ఉంటాయి.

"బావాబావా పన్నీరు బావనుపట్టి తన్నేరు
వీధి వీధి తిప్పేరు వీసెడుగంధం పూసేరు"

(గాలిపటాలు)

దాశరధి రాసిన పైగీతానికి ప్రచారంలో ఉన్న జానపద మూలంలోని పల్లవిని తీసుకొని సందర్భం, సన్నివేశానికి అనుగుణంగా పూర్తి చేశారు.

మాతృక: "బావాబావా పన్నీరు బావను పట్టి తన్నేరు
చేదలోకి లాగేరు చెంపముద్రలు వేసారు"

సరసమైన, సరదాలతో కూడిన పాటలు రాయడంలో వేటూరి అందవేసిన చెయ్యి.

"బంగారు చిన్నదానా బాజాబందూల దానా
బాజాబందూల మీద బంతిపూలు సోకే ఓ చిన్నదానా"
(రక్తాభిషేకం).

"సిత్రాంగి వెలిసింది సారంగుడో చిలకల్లే వాలింది సారంగుడో
చుప్పనాతి కళ్ళు నిప్పులా కాల్చుతుంటే చప్పున ముద్దివ్వనా" (పైసిండెటుగారి అబ్బాయి)

పనిపాటలు :

పనిచేసేటపుడు శ్రమను మర్చిపోవడానికి పాడే పాటలు పనిపాటలు. వీటినే శ్రామిక గీతాలు అని కూడా అంటారు. పండిన పంట చేతికొచ్చిన ఆనందంతో స్త్రీలు పాడే పాటను ఆత్రేయ రాశారు.

"పాండవులు పాండవులు తుమ్మెదా
పంచపాండవులోయమ్మ తుమ్మెదా
కన్నెగానె బతుకు గడిచి పోతుంది
నన్నెవరేలు కుంటారు అనుకొన్నది..." జానకి అనుకొన్నదియ

(అక్కాచెల్లెళ్ళు)

మాతృక: "పాండవులు పాండవులు తుమ్మెదా
పంచపాండవులె తుమ్మెదా
ఓయి భామల్లాల తుమ్మెదా, భామల్లాల తుమ్మెదా
పండిన వరిచేయి తుమ్మెదా, పాయల్లు తొక్కింది తుమ్మెదా"

ఈ శ్రామిక గీతాల్లో హైలెస్సా, రేలారేరేలా, హయ్యారే హయ్య వంటి పదాలు కనిపిస్తాయి. వాటికి ఏ అర్థం లేకపోయినా శ్రమను మరిచిపోయేందుకు లయాత్మకంగా ఆలపించేపదాలు చెవికి విన ఇంపుగా ఉంటాయి. పడవ నడిపే సంరంగులకు సంబంధించిన ఈ గీతాన్ని దాశరధి రచించారు.

"సయ్యారి సయ్యారి హైలెస్సా... సయ్యారి సయ్యారి హైలెస్సా
ఉవ్వెత్తు కెరటాల మీదా ఉరిమేటి మేఘాలకిందా"
"ఓహో గంగమ్మతల్లీ... మా బంగారు తల్లీ
పల్లవి కెరటాల కెదురీదరా... సుడిగాలి నెదిరించరా".

పెళ్ళి వేడుకల్లో పసుసు కుంకుమలుగాని, ధాన్యాలు గాని దంచుతున్నపుడు శ్రమ తెలియకుండా ముత్తైదువులు పాడే పాటలు దంపుడు పాటలు.

"రాజుగోరింట పెళ్ళి దంచవో లెంకమ్మా
రాజనాల ధాన్యమంట దంచరో లచ్చమ్మా ఆహా ఆహా

(మా ఇంటి మహారాజు - భువనచంద్ర)

బాలలగేయాలు :

సినీగీత రచయితలు బాల భాషతోపాటు జానపదాలను ఉపయోగించి జానపద శైలితో బాలల గేయాలను రచించారు.

"తప్పెట్లోయ్ తాళాలోయ్ దేవుని గుళ్ళో బాజాలోయ్
చప్పెట్లోయ్ సరదాలోయ్ పిల్లలే బళ్ళో రాజాలోయ్"

(వాగ్దానం - నార్లచిరంజీవి)

"కాళగజ్జి కంకాలమ్మ వేగుచుక్క వెలగ మొగ్గ
ముత్యం బియ్యం మునగచారు... ముత్యాల్లాంటి పిల్లలు మీరు" **(ఆదర్శ కుటుంబం - ఆత్రేయ)**

స్త్రీల పాటలు :

జానపద సాహిత్యంలోని పాటలు చాలా వరకు స్త్రీల పాటలుగా ఉంటాయి. గృహిణులు ఏదో ఒక సమయాన చక్కగా పాడుకుంటారు. ఇవి కూడా సినిమాలో స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. ఆరుద్ర రాసిన ఈ క్రింది గీతంలోని వరుసలు ఓ జానపద గీతం నుండి తీసుకోబడ్డాయి.

"ముత్యమంతా పసుపు ముఖమంత ఛాయ
ముత్తయిదుకుంకుమ బతుకంతఛాయ
ముద్దు మురిపాలాలకు ముంగిళ్ళలోన
మూడు పువ్వులు ఆరుకాయలు కాయ"

(ముత్యాలముగ్గు)

మాతృక: "ముత్యమంతా పసుపు ముఖమంత ఛాయ
ముత్తయిదు నిను జూడ ముచ్చట అగును
ఆరవయిదోతనము ఎవరొద్దనుండ
అరుగులలికే వారి అరచేత నుండ"

దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలుగునాట సంప్రదాయ సిద్ధంగా స్త్రీలుపాడుకొనే పాటలోని పంక్తులను తీసుకొని ఇలా రాశారు.

"గోరింట పూచింది కొమ్మలేకుండా
మురిపాల అరచేత మొగ్గతొడిగింది
ఎంచక్క పండిన ఎర్రచుక్క
చిట్టి పేరంటాలకి శ్రీరామ రక్ష" **(గోరింటాకు)**

మాతృక: "గోపాలకృష్ణమ్మ పెళ్ళయ్యేనాడు
గోరింట పూచింది కొమ్మలేకుండా
మా ఇంట అబ్బాయి పెళ్ళయ్యేనాడు
మల్లెలు పూచాయి మొగ్గలేకుండ
(సంప్రదాయిక విజ్ఞానం - పాతపాటలు)

వలపుపాటలు :

జానపద గీతాలలో చాలా వరకు వలపు ఉంటుంది. ప్రేమ, కామం, శృంగారం అన్నీ దాని కిందకే వస్తాయి. రసరాజమైన శృంగారానికి జానపదులెంత ప్రాముఖ్యత నిచ్చారో సినీరంగం అంతకంటె వ్యామోహం చూపించింది.

"వలచీనానమ్మా వలచీనానమ్మా
వలచినావని తెలిసికాడ" (భార్యాబిడ్డలు - ఆత్రేయ)

మూలం: "పల్లెపదాలు"

"నీకు నీ వారు లేరు... నాకు నావారు లేరు
ఏకంగా ఎగిరిపోదాము ఏటి ఒడ్డున ఇల్లే కడదాము"
(బంట్రోతు భార్య - సినారె)

"ఒలియో ఒలియో ఒలియో రావేలు గలవాడరార పోలిగాడ
ఒలియో ఒలీ పొలియోపోలీ వేయి వేయి గలవాడ రాక పోలీగాడ" (రోజులు మారాయి - కోసరాజు)

మూలం : "ఓలియా ఒలియా ఒలియా రావేలు గల వాడరార పోలిగాడ.

సరికొత్త జానపదాలు :

జానపద గీతాల ధోరణిలో, వివిధ మాండలికాల జానపదాలను గ్రహించి ఆ బాణీల్లో గీత రచయితలు రాస్తున్నారు. తుమ్మెద, వెన్నెల, గొబ్బియల్లో, చందమామ, ఒలియో జాబిలి, కోలుకోలో, ఉయ్యాల, నోమన్నలాలో, గుమ్మాడి, జుంబారే, అమ్మలాలో అబ్బలాలో వంటి జాన పదాలను అక్కడక్కడా పాటల్లో సినీగీత రచయితలు ఉపయోగించుకున్నారు.

"అలికి పెట్టిన ముగ్గు కలకల మెరిసింది తుమ్మెదా ఓ తుమ్మెదా..." (సోగ్గాడి పెళ్ళాం)

"నోము నోమన్నాల నోమన్నలాలో చందమామా..."
(సీతారామయ్యగారి మనవరాలు)

"గోగులుపూచే గోగులుపూచే... ఓ లచ్చాగుమ్మాడి..."
(ముత్యాలముగ్గు)

పై విధంగా జానపదాలను, జానపద గీతాలను యథా తథంగా తీసుకొని రాసినవి కొన్ని అయితే జానపద బాణీలో రాసిన గీతాలు ఎక్కువ. కథాత్మక నేపథ్యాన్ని బట్టి, పాత్రలను బట్టి వాటికనుగుణంగా భాషను మార్చి జాన పద శైలిలో రాసిన సినీపాటలు అశేషజనాన్ని అలరిం చాయి.

ఆధార గ్రంథాలు :

1. డా. పైడిపాల - తెలుగు సినిమా పాట చరిత్ర - స్నేహప్రచురణలు, చెన్నై - 2005
2. డా. పైడిపాల - తెలుగు సినీగేయకవుల చరిత్ర - స్నేహ ప్రచురణలు, చెన్నై - 2010
3. డా. సి. జయంతి చక్రవర్తి - వేటూరిపాట - శ్రీ చక్ర క్రియేషన్స్, విజయవాడ - 2007
4. డా. ఆరవల్లి జగన్నాధాస్వామి - దాశరధి చలన చిత్రగీతాలు - విమర్శనాత్మక పరిశీలన - పాలపిట్ట బుక్స్, హైదరాబాద్ - 2019
5. డా. గుమ్మడి (కె) రామలక్ష్మి - భువనచంద్ర సినీగేయసాహిత్యం - సాహితీ ప్రచురణలు, విజయవాడ - 2019

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నెల్లూరు జిల్లా జానపద కథలలోని సాంఘికాంశాలు

– డా॥. ఆర్. తేరీన కళి, వి.పి.ఆర్. జూనియర్ కళాశాల, నెల్లూరు.

జానపద విజ్ఞానంపై జరుగుతున్న పరిశోధన నేడు కొత్తపుంతలు త్రొక్కుతోంది. ఈనాడు జానపద విజ్ఞానం ఒక ప్రత్యేక శాస్త్రంగా పలువురిచె గుర్తించబడి, ప్రశంస లందుకుంటోంది. జానపద విజ్ఞానంలో ప్రధాన భాగం మౌఖిక జానపద విజ్ఞానం. ఈ మౌఖిక జానపద విజ్ఞానంలో కూడా జానపద కవిత్వం గద్యకథనాలు, సామెతలు, పొడుపుకథలు అని నాలుగు భాగాలుంటాయి. ఇందులో వచన రూపంలో ఉండే ప్రక్రియ గద్య కథనాలు. వీటినే గద్యాఖ్యానాలని కూడా అంటారు. గద్య కథనాలంటే గద్యరూపంలో ఉంటూ కథనాత్మకంగా ఉంటాయని చెప్పవచ్చు. గద్యకథనాలు సాహిత్యాభివ్యక్తి విధానాలే కాకుండా జానపదుల జీవన విధానాన్ని ప్రతిబింబించే సాధనాలుగా కూడా ఉపయోగపడ్తాయి. అందుకే జానపద సాహిత్యంలో ఇవి ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. గద్య కథనాలలో పురాణం, ఐతిహ్యం, కథ అని మూడు భాగాలు.

పురాణం లేదా పురాకథ దేవతాసంబంధం కాగా, ఐతిహ్యం చారిత్రకాంశాన్ని కల్గి ఉంటుంది. ఇక కథలు రంజింప చేయడానికి, ఉల్లాసం కల్గించడానికి ఉద్భవించాయి. జానపదులు తమ బాధల్ని, కష్టాల్ని మర్చిపోవడానికి వినోదం కోసం వీటిని చెప్పుకొంటారు. అందుకే వీటిలో అద్భుత విషయాలు, రోమాంచక వృత్తాంతాలు, కాల్పనిక సంఘటనలు అనేకం ఉంటాయి. ఈ కారణం వల్ల కథలు పురాణ, ఐతిహ్యాల కంటే జనప్రియమైనవి. జానపదుల ఊహల్ని, మన:స్థితిని ప్రతిబింబించడంలో కథల కంటే మించినవి లేవు. ఒకజాతి సంస్కృతిని బహిర్గతం చేయడానికి ఈ కథలెంతో తోడ్పడుతాయి. జానపద విజ్ఞానం మొత్తం మీద ఇంత నివిడి గల ప్రక్రియ మరొకటి లేదు. అందుకే ఈ కథలు జానపద విద్వాంసులను, మానవ శాస్త్రజ్ఞులను, మనస్తత్వవేత్తలను, చివరికి భాషాశాస్త్ర ప్రవీణులను కూడా ఆకర్షిస్తున్నాయి. దీనిని బట్టి జానపద విజ్ఞానంలో, జానపద మౌఖిక సాహిత్యంలో జానపద కథకు ఒక ప్రత్యేక స్థానం ఉందని చెప్పక తప్పదు. దీన్ని ఆధారంగా చేసుకొని నెల్లూరు జిల్లా జానపదుల సాంఘిక జీవనాన్ని కథల ఆధారంగా పరిశీలించవచ్చు. కొన్ని కథలను చూద్దాం....

జానాబెత్తె శాస్త్రం :

ఒక ఊర్లో రామయ్య, రమణమ్మ అనే ఇద్దరు భార్యా భర్తలుండేవారు. వారికి పిల్లల్లేరు. పిల్లల్లేరని కోడిపెట్టను పెంచసాగారు. ఆ పెట్ట జానాబెత్తె గుడ్డు పెట్టింది. గుడ్డులో నుండి జానాబెత్తె పిల్లోడు వస్తాడు. గుడ్డలు కుట్టించ మంటాడు. పెళ్ళి చెయ్యమంటాడు. "నీకు పెళ్ళి చేయ్యాలంటే ఎవరిస్తారు పిల్లనీ? మా వల్ల కాదంటారు" తల్లి దండ్రులు. మహారాజు కూతుర్ని పెళ్ళి చేసుకోనొస్తానని బయలుదేర్తాడు. బెండ్లు, దంటు సప్పలతో బండిని తయారుచేసుకుంటాడు. నాలుగు సజ్జరొట్టెలు తీసుకుంటాడు. మార్గమధ్యలో కర్ర, తాడు, కుంకుమ బరిణా ఎదురొస్తాయి. ముందు కష్టమొస్తుంది తమను బండిలో పెట్టుకోమంటాయి.

ఒక ఊరి పొలిమేరల్లోకి వెళ్తాడు. ఆ ఊరి రాడు అక్కడున్న బ్రహ్మరాక్షసిని చంపిన వాడికి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తానని చాటింపేస్తాడు. ఐదైరుగురు పిల్లలు జానాబెత్తోడ్ని ఎగతాళి చేస్తారు. కర్రనొదుల్తాడు. ఇద్దరు ముగ్గురు ఛస్తారు. కర్ర సాయంతో బ్రహ్మరాక్షసిని చంపేస్తాడు. మళ్ళీ కొంతమంది జానాబెత్తెడ్ని ఎగతాళిగా మాట్లాడతారు. కర్రపోయి ఒక్కడ్ని తప్ప అందర్నీ చంపేస్తుంది. మళ్ళీ సుమారు రెండు వందల మంది

వస్తారు. ఒక్కడు తప్ప అందరూ ఛస్తారు. తర్వాత ఊళ్ళో వాళ్ళందరూ వస్తారు. జానాబెత్తోడు మూడు పుస్తువుల్ని వారి పైకి వదిలేస్తాడు. కుంకుమ బరిణె పెద్ద కోనేరైపోయి అందర్నీ ముంచేస్తుంది. తాడుపోయ్యి అందరి కాళ్ళను బంధించివేస్తుంది. కర్ర పైకి లేచినోడ్ని లేచినట్టే తలలు పగులగొడ్తుంది. సైన్యమంతా చచ్చిపోతారు. చివరకి మహా రాజే వస్తాడు. కర్రదెబ్బతో మహారాజు కన్ను లొట్టబోయి జానాబెత్తోడి కాళ్ళమీద పడతాడు. చివరికి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేసి జానాబెత్తోడితో పాటు పంపిస్తాడు. సొంత ఊర్లో ప్రజలంతా ఘనస్వాగతమిచ్చి మా పిల్లల కంటే జానాబెత్తే వోడు ఎంతో మేలని గొప్పగా చెప్పుకుంటారు. అందరూ సుఖంగా వుంటారు.

ఈ కథలో రామయ్య, రమణమ్మలు పిల్లలేనందుకు కోడిపెట్టను తెచ్చి చాకాలనుకోవడం సంతానం పట్ల వాళ్ళకున్న ఆసక్తిని, తపనకు తెలియజేస్తుంది. అయితే పిల్లలు బదులు కోడిపిల్లల్నే పిల్లలుగా భావించాలను కోవడం Displacementగా కన్పిస్తుంది.

అలాగే గుడ్డులో నుంచి జానాబెత్తే పిల్లవాడు వస్తాడన డానికి ఏ విధమైన హేతుబద్ధత లేదు. ఒక రకమైన Irrational thinkingగా అనుకోవచ్చు. లేదా అదొక Mythగా చెప్పుకోవచ్చు. రాజు కూతుర్ని పెళ్ళి చేసుకోవాలనుకోవడం జానాబెత్తేవాడి High aspiration/ambition. తల్లిదండ్రులు వద్దన్నా, ప్రజలు ఎగతాళి చేస్తున్నా బండి కట్టుకొని బయలుదేరడం అతనిలోని పట్టుదలను (confidence) తెలియజేస్తుంది. కర్ర, కుంకుమ బరిణె, తాడు వంటి నిర్జీవ వస్తువులు సాయంగా రావడం (Dependency of Inanimate objects)గా చూడొచ్చు. ఇక బ్రహ్మరాక్షసితో తలపడ్డం, ప్రజలతో, రాజుతో తలపడ్డం అతని పరిసరాల ఒత్తిడికి నిదర్శనం.

ఈ కథలోని జానాబెత్తేవాడు సామాన్య మానవునికి ప్రతీక. అతని శరీర పరిమాణం, అతను ఉపయోగించిన బండి (బెండు, దంట్లతో చేసినది) అతడి శారీరకమైన దుర్బలత్వాన్ని, అతడి సాంఘీక ఆర్థిక పరిస్థితిని చెప్పకనే చెప్తున్నాయి. రాజు కూతుర్ని పెళ్ళి చేసుకోవాలనుకోవడం ఉన్నత వర్గాల పట్ల జానపదులకుండే ఆకర్షణ వ్యక్త మైతోంది. రాజుతో తలపడి అతన్ని ఓడించడం సామాన్య మానవుడు తనను అణచివేసే యజమానిని ఓడిం చడంగా, అతని కూతుర్ని పెళ్ళి చేసుకోవడం కనిపిస్తుంది.

ఈ కథలోని నాయకునిలో భౌతిక స్వరూపానికన్నా అంతర్గత శక్తులు ఎంతో శక్తివంతంగా ఉన్నట్లు మనకర్థ మౌతుంది. ఒక పక్క తనవాళ్ళు, తన పరిస్థితులు వ్యతి రేకిస్తున్నా, అసంతృప్తి కలిగిస్తున్నా (నిరుత్సాహ పరుస్తున్నా) కాని కథానాయకుడిలో ఆత్మవిశ్వాసం ఏ మాత్రం తగ్గకుండా ఏదో ఒక విధమైన చాకచక్యంతో కొన్ని వస్తువుల సాయంతో అనుకున్నది సాధిస్తూ ఉన్నట్లు మనకు కనిపిస్తాడు.

పిచ్చుక - ముక్కులో ముల్లు :

ఒక పిచ్చుక వడ్ల గింజలేరుకుంటుంటే ముక్కులో ముల్లు గుచ్చుకుంటుంది. మంగలోడ్ని పిలిచి ఆ ముల్లు తీయమంటుంది. వాడు తీయనంటాడు. రాజుతో చెప్పి ఉద్యోగం తీయిస్తానని బెదిరిస్తుంది. అయినా తీయించి నప్పుడు చూసుకోవచ్చునంటాడు. రాజు దగ్గరికెళ్తుంది. మంగలోడ్ని ఉద్యోగం నుండి తీసేయాలంటుంది. తీసేయనంటాడు రాజు. జింకల్తో చెప్పిన మాన్యం తొక్కిస్తా నంటుంది. అయినా వినిపించుకోడు. జింకల దగ్గరి కెళ్ళి రెడ్డి మాన్నెం తొక్కాలంటుంది. తొక్కం ఫో అంటాయి. వేటగాడికి చెప్పి పట్టిస్తానంటుంది. అప్పటికీ పట్టించుకోవు. వేటగాడి దగ్గరికెళ్ళి జింకల్ని పట్టాలంటుంది. నేను పట్టను పో అంటాడు. ఎలుకతో చెప్పి నీ వల కొరికిస్తానంటుంది. అప్పుడు లెక్కచేయడు. ఎలుక కూడా మాట వినదు. పిల్లికి చెప్తానంటుంది. పిల్లి కూడా పిచ్చుక మాట వినదు. అవ్వతో చెప్పానంటుంది. అవ్వ పిల్లికి ముద్ద వేస్తా నంటుంది. తాతతో చెప్పి తన్నిస్తానంటుంది. అయినా అవ్వ వినదు. తాత దగ్గరకు వెళ్ళి అవ్వని తన్నమంటుంది. తన్ననంటాడు తాత. అట్లైతే ఆవుతో చెప్పి తన్నిస్తా నంటుంది. అయినా విన్పించుకోడు. ఆవుతో తాతను

తన్నమంటుంది. తన్ననంటుంది. దూడతో చెప్పి చన్ను కొరికిస్తానంటుంది పిచ్చుక. అవు పట్టించుకోదు. దూడ దగ్గరికెళ్ళి అలాగే చెప్తుంది. అదీ వినదు. కంతిరీగల్తో చెప్తానంటుంది. అయినా విన్పించుకోదు. కంతిరీగలు కూడా చెప్పిన మాట వినవు. ఇక చివరికి విసిగి వేసారి తాటాకు తగలబెట్టి కంతిరీగల తుట్లో బెడ్తుంది.

కంతిరీగలు దూడను కుట్టుతాయి. దూడపాయ్యి అవు చన్ను కొరుకుతుంది. అవు తాతను తంతుంది. తాతబొయ్యి అవ్వను తన్నబోతాడు. అవ్వ పిల్లికి ముద్ద వెయ్యదు. పిల్లి ఎలుకను పట్టబోతుంది. ఎలుగ వేటగాడి వల కొరకబోతుంది.వేటగాడు బొయ్యి జింకల్ని పట్టాలంటాడు. జింకలుపోయి రెడ్డి మాన్నెం తొక్కాయి. రెడ్డి మంగలోడ్ని తీసేస్తానంటాడు. అప్పుడు మంగలోడు చాటుగా పిచికను ముక్కులో ముల్ల తీసేస్తాడు.

ఈ కథలో ఒక ప్రతీకాత్మక అంశం కనిపిస్తోంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ "ది ఇంటర్ ప్రిటేషన్ ఆఫ్ డ్రీమ్స్"లో చెప్పినట్లు "This symbolism is not peculiar to dreams, but is characteristic of unconscious ideation in particular among the people and it is to be found in Folklore, and in poplil, it myths, legends, linguistic idioms, proverbial wisdom and current jokes to a more complete extent than dreams."

పిచ్చుక సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందిన సామాన్య వ్యక్తికి ప్రతీక. తనకు ఎదురైన కష్టాన్ని తొలగించ మని చిన్నవాళ్ళ నుండి పెద్దవాళ్ళ దాకా (మనుషులు కాని, జంతువులు కాని) ప్రాధేయపడ్తుంది. ప్రతి ఒక్కరూ దాన్ని లెక్కచేయరు, పట్టించుకోరు. దానితో విసిగి వేసారి చివరికి సాహసంతో తాటాకును కాల్చి కందిరీగల తుట్టెలో పెడ్తుంది. వలయం పూర్తయి కసిరికొట్టిన మంగలివాడే దగ్గరికి పిలిచి ముక్కులో ముల్లు తీసేస్తాడు.

కథకుని తార్కికత సహసంబంధ ప్రక్రియల కూర్పు ప్రశంసనీయం. ఎన్నో స్థాయిల్లో చిక్కుల్ని ఎదుర్కొంటున్నప్పటికీ పట్టుదలతో చివరిదాకా ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధిస్తామనే నగ్నసత్యం బోధించడం గమనార్హం.

ఒదినె - ఆడబిడ్డల కథ :

"ఒక ఆడబిడ్డ. ఒక వొదిన. వొక రైల్లో ప్రయాణం చేస్తాన్నారు. ప్రయాణం జేసేదపుడు.... ప్రయాణం జేసి యింటి దగ్గరకొచ్చారు. వొదినింటి దగ్గర కొచ్చింది ఆడబిడ్డ. రామ్మా చాలా కాలానికొచ్చారు. పిల్లలందరూ బాగున్నారా? మీ పరిస్థితులెట్లా వున్నాయి. ఏం జేస్తున్నారు? అన్నీ బానే వున్నాయి సేద్యాలు గీద్యాలు బాగనే పండుతున్నాయి. బాగనే ఉన్నాం గాని నాకో పెద్ద చిక్కొచ్చి కూచ్చుంది. ఆ చిక్కుతో నే సచ్చిపోతున్నానొదిన నేనేం జెప్పాల నీకు అన్నదా పాపం ఆడబిడ్డ. ఏం సిక్కమ్మా నీకు అంతగా ఇబ్బందేం వొచ్చిందమ్మ. ఆ(ఏంలేదు....(దీర్ఘం) మాజ్జూస్తే చిన్న కుటుంబమైపోయా ఇదివరకు నా పెళ్ళైనప్పుడు లేదా ఆయనకావున్నే ఆలోచన, దుర్బుద్ధి మరిప్పుడెందు కొచ్చిందో? ఏ డాట్టరు దగ్గరికి దీసకపోయినా ఆ జబ్బు నయం గాలేదు. మరెందుకొచ్చిందో నాకర్థం కావటంలా. స్పష్టంగా....ఏ(విటమ్మా.... ఎందుకొచ్చింది ఆ జబ్బు. ఏటంటే అంటే సాయంకాలమైదో అన్నాం తింటాడు. కడుపు నిండా అన్నం పెడతాను తింటాడు. తరువాత గబక్కన మెలకవొస్తుంగనే ఏ(వే నా కన్నమెప్పుడేశావు అంటాడు. నాకన్నవేయ్ అంటాడు. ఏదో అర్థశేరు బియ్యం వొండుకుంటే మాకు పిలకాయలు పుట్టకముందు మేము సేరికాస్త తిని పడుకునే వార్లం. ఇప్పుడు పిలకాయల్ గిలకాయల్ బుట్టి శేరు బియ్యం ఏసి అన్నవొండినా సందకాడేమో కడుపునిండా పెడతా తింటాడు పడు కుంటాడు. ఒక్క నిదరబోయి మెలకవగాని వస్తే నాకెప్పుడు బెట్టావు? నేనెప్పుడు తిన్నాను యెయ్యమంటాడు. సరే అప్పుడు బెడతాను గదా మళ్ళీనూ అప్పుడు తింటాడు. మళ్ళీ నిదరబోయి మెలకవొస్తే నాకప్పుడన్నం వేయ మంటాడు. ఈ జబ్బు నేనే డాట్టర్ దగ్గరికి దీసకపోయినా నయం గాలేదు నేనేం జేయాల. యీయనతో ఏగలేక

ఛస్తున్నాను అన్నదట పాపం ఆ ఆడబిడ్డ....వొదిన్‌తో. వొదినా నీకష్టాలేవో మంచియ్యేను పాపం యిబ్బంది పడ్తున్నాను. నీ కష్టాలన్నీ కొన్నాళ్ళకాయన్దెల్సుకుంటాడు పోతాడు.

దానికేం ఇబ్బంది లేదు. నా కష్టాన్ని నువ్ జూస్తే నువ్వేమనుకుంటావు. నాకష్టం అంతింతైన కష్టం కాదది. అది నేనెవరికి జెప్పుకునేది కూడా కాదు. నేనే మనసులో కుంగి చస్తున్నాను. మీ యాయనకేవమ్మా వాడు లక్షణంగా ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు వేల రూపాయల జీతం దెస్తన్నాడు. స్కూటరుంది మిద్దుంది నీకేమి తెలివిగల్లోడు. మీయాయన గురించేదో చెప్పబోతున్నావు చెప్పాల్చిన బన్లేదు అనంది. అమ్మా చప్తేనేగాని తెలీదులే కప్పెట్టు కోనుంటే అన్నీ అట్నే ఉంటాయ్. మా ఆయన చెరిత్ర చెప్పా యిను. పొద్దున్నే స్నానం చేయిస్తాను. సూటుబూటు అంతా నేనే ఏస్తాను. బాగా టిఫిను కడుపునిండా బెడ తాను. లోటా నిండా పాలిస్తాను. తాగుతాడు. బండికి పోతాడు. బండేసుకోని చక్కా బోతాడు ఆయనాపీసుకి. నేనేదో కూరగాయలికి పోతాను గదా. ఆ ఆఫీసుకు పోయి సంతకం పెట్టి వేరే పనికి పోయేటపుడు నాకెందురు బడతాడు. ఏవండీ యిట్ట బోతన్నారే అని అడగతాననుకో నేను స్కూటరాపి ఒక్కాలు స్కూటరు మీద పెట్టి ఒక్కాలు కింది పెట్టి నా సాయి కింద నించి పై దాక ఎగాదిగా చూసి (మెడను కింద నుండి పైకి లేపడం) ఎక్కడ్నో చూసినట్టు.... జ్ఞాపకం నిన్ను అంటాడు. నేనేం చావాల. ఆయనింకా నిదరబోయి మేలుకొని నేనెప్పుడు తిన్నానంటున్నాడు. ఈన మేలుకోని జాగర్తావస్తలో వుండి కూడా నిన్నెక్కడ్నో చూసినట్టు గుర్తంటాడు. కొన్నాళ్ళకి నన్నుగూడ మర్చిపోతాడని నేనే దిగులుబడి ఛస్తున్నాను. ఆయన్నిన్ను మర్చిపోలా నువ్వు పెట్టే కూడు మర్చి పోతన్నాడు గానీ నిన్ను మర్చిపోలా. నన్ను మర్చిపోయే పరిస్థితి కొచ్చింది నీ అన్నదమ్ముడు. దానికి నేనేం జెప్పాల అని ఏడ్చిందంట పాపం ఆడబిడ్డ.

వంశ పారంపర్యంగా వస్తున్న ఆచారాలను, పద్ధతు లను వదులుకోవడం మాత్రం ఇష్టపడరు. జానపదుడు బాహాటంగా, నిర్భయంగా పాటిస్తాడు. ఒక దేశ సంస్కృతిని చూడాలంటే జానపదుల విజ్ఞానాన్ని తరచి చూడాలి. వారి సాహిత్యంలోనే సాంఘిక స్థితిగతులు ప్రత్యక్షంగాను ప్రస్ఫుటంగాను కనిపిస్తాయి. జానపద సాహిత్యంలో జాన పద కథలు వాటికి ఆధారంగా ఉంటాయి. జానపదంలోని మిగిలిన విషయాలతో పోలిస్తే కథల పరిధే అధికంగా కనిపిస్తుంది. "The Folktales of a country, more than any thing else, reflects the genius of the people, their beliefs, customs, manners, attitudes and their way of life" అని చెప్పడం సమంజసం.

మౌఖిక ప్రచారాన్ని కల్గినవి జానపద కథలు, గేయాలు. తరతరాలుగా వ్యాప్తి చెందుతూ వస్తున్నప్పటికీ వాటిలో కూడా మార్పులు చెందుతుంటాయి. ఉదాహరణకు గతించిన రాజుల గొప్పతనాన్ని గురించి, నాటి పరిస్థితుల గురించి కథలలో ప్రతిఫలిస్తాయి. సాంఘీక జీవితంలో రాజులు రాజ్యవ్యవస్థ - నెల్లూరు జిల్లాను ప్రాచీన కాలం నుండి శాతవాహనులు, పల్లవులు, చాళుక్యులు, తెలుగు చోళులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు, గోల్గొండ నవాబులు, ఆర్కాటు నవాబులు ఈ ప్రాంతాన్ని పాలిం చారు. ఆ తరువాత ఆంగ్లేయులు ఈ ప్రాంతాన్ని వశ పరుచుకున్నారు. ఇక్కడి ప్రజలపై రాజుల ప్రభావం ఎంతో ఉంది. జానాబెత్తోడు కథలో దాన్ని మనం గమనించవచ్చు. రాజు కూతుర్ని పెళ్ళి చేసుకుంటాడని జానాబెత్తోడు బయలుదేరుతాడు, రాజును మెప్పించి యువరాణిని వివాహం చేసుకుంటాడు.

ప్రయాణ సౌకర్యాలు - "బెండ్లు, దంటు సప్పలతో బండిని తయారుచేసుకుంటాడు" అవసరాన్ని బట్టి గుళ్ళాన్ని, పల్లకీ, రథాలు వంటి ఉపయోగించేవారు. "వొక రైల్లో ప్రయాణం చేస్తాన్నారు" ఆధునిక కాలంలో ప్రయాణ సౌకర్యాలు మార్పులు కథల్లో చోటుచేసుకున్నాయి.

అప్పటి ప్రజల అలవాట్లు, కట్టుబాట్లు - పూటకూళ్ళ ఇళ్ళు, పెంపుడు జంతువులను అంటే కోళ్ళను పెంచు

కోవడం వంటిఅలవాట్లు ఉండేవి. ఎవరి వృత్తులు వారు చేసుకొనే వారు.

ఆహార పదార్థాలు - వరి, జొన్న, సజ్జ, రాగులు వంటి పంటలు పండేవి. వాటినే ఆహారంగా ''నాలుగు సజ్జరొట్టెలు తీసుకుంటాడు'', అదేవిధంగా సముద్రతీర ప్రాంతం కాబట్టి చేపలు, రొయ్యలు, మాంసాహారంగా వాడేవారు.

ప్రస్తుత కాలపు సాంఘీక జీవితం - పూర్వకాలపు సాంఘీక జీవనాన్ని ప్రస్తుత కాలానికి మార్పు కనిపిస్తుంది. జానపద కథల్లోనూ మార్పులు సహజం. పల్లకీలు కార్లుగా, పటాన్ని ఫోటాగా ఇలా ప్రతి అంశంలోనూ ప్రస్తుత కాలానికి అన్వయించి చెప్పడం గమనించవచ్చు. వదిన ఆడబిడ్డ కథలో దాన్ని చూడవచ్చు. ''మీ యాయనకేవమ్మా వాడు లక్షణంగా ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు వేల రూపాయల జీతం దెస్తన్నాడు. స్కూటరుంది మిద్దుంది నీకేమి తెలివిగల్లోడు.''

కుటుంబ సంబంధాలు - సమాజానికి సూక్ష్మరూపం కుటుంబం. జానపదుల్లో ఎక్కువ భాగం ఉమ్మడి కుటుంబాలు కనిపిస్తాయి. నాగరికత పెరిగే కొద్ది మనిషిలో స్వార్థం వెర్రితలలు వేసి కుటుంబవ్యవస్థను నాశనం చేస్తుంది. ఒకరితో ఒకరు ఎలా మెలగాలి, కలసికట్టుగా ఎలా బ్రతకాలి ఈ కథల్లో చూడవచ్చు.

వృత్తులు - జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులంతా వంశపారంపర్యంగా చేసే పనిని వృత్తి అని అనవచ్చు. రైతులు వ్యవసాయం, కూలీలు, హరిదాసులు, మంగలి, కుమ్మరి, పశుపోషణ వంటివి అనేక వృత్తుల వారు ఈ జిల్లాలో కలరు. పిచ్చుక ముక్కులో ముల్లు కథలో చూడవచ్చు ''మంగలోడ్ని పిలిచి ఆ ముల్లు తీయమంటుంది. వాడు తీయనంటాడు. రాజుతో చెప్పి ఉద్యోగం తీయిస్తానని బెదిరిస్తుంది''

కులాలు - ''సజాతీయ సమూహం కులం'' అని అమరకోశం. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు, వృత్తిని బట్టి ఏర్పడినవి మంగలి, కుమ్మరి, కమ్మరి, చాకలి, వ్యాపారులు, మేకలు, గొర్రెలు పెంపకం, పోది చెప్పే వారు వంటివి కనిపిస్తాయి.

ఆహారపు అలవాట్లు - సృష్టిలోని ప్రతిజీవికి మనుగడ సాగించాలంటే ఆహారం అవసరం. ప్రాంతాన్ని బట్టి ఆహారం మారుతుంది. ఆ ప్రదేశంలోని శీతోష్ణస్థితి, పరిసరాలు పండే పంటలకు కారణం. నెల్లూరు జిల్లాలో వరి ధాన్యం అధికంగా పండుతుంది. నెల్లూరు అంటే నెల్ - ఊరు అని అర్థం. తమిళంలో 'నెల్' అంటే ధాన్యం అని అర్థం. ఈ ప్రాంతంలో మేలురకమైన ధాన్యానికి ప్రసిద్ధి కనుకనే ఈ ఊరికి నెల్లూరు అని పేరు వచ్చింది. ఆకుకూరలు తోటకూర, గోంగూర, బచ్చలికూర, పప్పులు, పాలు, పెరుగు నిమ్మ. చింత, మామిడి, ఉసిరి పచ్చళ్ళు గుడ్లు, కోళ్ళు, చేపలు, రొయ్యలు, బాతులు, కుందేళ్ళు వంటివి.

వస్త్రధారణ అలంకరణ - జానపదుల వస్త్రధారణ, అలంకరణలన్నీ సాధ్యమైనంత సరళంగా ఉంటాయి. ''గుడ్డలు కుట్టించమంటాడు.'' జానాబెత్తే శాస్త్రం కథ.

మతం - దేవునికి, మనుజునికి నిరవధికునకును, సావధికునకును మధ్య గల సంబంధమే మతమని చెప్పబడుచున్నది. లేదా మనిషిలో సహజముగానున్న దైవత్వమును అభివ్యక్తీకరించునది మతము. శిష్ట దేవతలతో పాటు గ్రామదేవతారాధన అధికం. గ్రామ దేవతల జాతరలు, తిరువాళ్ళు వైభవంగా జరుపుకుంటారు. భిన్న మతాల వారు ఈ జిల్లాలో జీవిస్తున్నారు.

పండుగలు - ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా పండుగ అనేది ఆ దేశ ప్రజల సంస్కృతి, వారసత్వ సంపదను ప్రతిబింబిస్తుంది. వారి సుఖ సంతోషాలకు అద్దం పడుతుంది. జానపదులు ఆచరించే పండుగల్లో ఏరువాక పున్నమి, దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది ముఖ్యమైనవి. నోములు, వ్రతాలు వంటివి. జిల్లాలో శ్రీరంగనాయకుల స్వామి తిరువాళ్ళు, బిట్రగుంటలోని

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరునాళ్ళు, నర్రవాడు, జొన్నవాడలలో తిరునాళ్ళు చెప్పుకోతగ్గవి. అలాగే వెంకటగిరి పోలేరమ్మ జాతర, సూళ్ళూరుపేట చెంగాళ్ళమ్మ జాతర, కావలి కళుగోళమ్మ జాతరలు ముఖ్యమైనవి. నెల్లూరు నగరంలో జరిగే రొట్టెల పండుగ దేశంలోనే ప్రసిద్ధికెక్కింది.

ఆచార వ్యవహారాలు - ఒక సంఘంలోని ప్రజలు తరతరాలుగా పాటించే పద్ధతుల్ని, ఆచారాలని స్థూలంగా నిర్వచించవచ్చు. కాల ప్రవాహంలో కొన్ని ఆచారాలు మాసిపోయి కొత్త ఆచారాలు రావచ్చు. ప్రతి ఆచారానికి పుట్టుక, ప్రాబల్యం, చావు ఉంటాయని చెప్పవచ్చు. ఉదయాన్నే లేచి బావి దగ్గర స్నానం చేయడం, తల్లిదండ్రులకు దణ్ణం బెటుకోవటం, ఇంటిని శుభ్రం చేయడం, అలాగే బాల్యవివాహాలు వంటి ఆచారం, పెళ్ళి, పేరటాళ్ళు, బారసాల, పాడెగట్టడం వంటివి. "అవ్వతో చెప్పానంటుంది. అవ్వ పిల్లికి ముద్ద వేస్తానంటుంది. తాతతో చెప్పి తన్నిస్తానంటుంది. అయినా అవ్వ వినదు. తాత దగ్గరకు వెళ్ళి అవ్వని తన్నమంటుంది. తన్ననంటాడు తాత" పిచ్చుక ముక్కులో ముల్లు.

విద్య వైద్యం - పూర్వకాలంలో ఉన్నత కులాల వారికి మాత్రమే విద్య. కాని ఇప్పుడు గ్రామాల్లోనూ ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని చదివించాలను కుంటున్నారు. విద్యతో జ్ఞానం వస్తుందన్న నమ్మకం పెరిగింది. వైద్యం జానపదుల వైద్యం నమ్మకాలకు ఎక్కువ ముడిపడి ఉంటుంది. నాటు వైద్యం వీరు సొత్తు. వీరు వాడే పద్ధతులు శాస్త్రీయమైనవి కావు. మంత్ర తంత్రాలతో సహా సరళ పద్ధతులెన్నో వీళ్ళ వైద్యంలో ఉంటాయి.

వినోదాలు వేడుకలు - నాటకాలు, పాటకచేరీలు, హరిదాసులతో కథలు వంటివి అనేకం సందర్భాన్ని బట్టి సంతోషాన్ని తెలియజేయడానికి కనిపిస్తాయి.

పరిసరాలు - జానపద కథకులపై వారి చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం ఎంతైనా ఉంటుదని చెప్పవచ్చు. కథకులు సమాజంలోని వ్యక్తులు కాబట్టి వారికి సమాజంతో అవినాభావ సంబంధం ఉంటుంది. "రామ్మా చాలా కాలానికొచ్చారు. పిల్లలందరూ బాగున్నారా ? మీ పరిస్థితులెట్లా వున్నాయి. ఏం జేస్తున్నారు ? అన్నీ బానే వున్నాయి సేద్యాలు గీద్యాలు బాగనే పండుతున్నాయి" ఒదినె ఆడబిడ్డల కథ.

నెల్లూరు జిల్లాలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఉష్ణమండల ఆకురాల్చు అడవులు, ఉష్ణమండల సతత హరితారణ్యాలు రెండు రకాలు కలవు. తెల్లతమ్మ, దిరిశెనం, చిరుమాను, రేల, తుంకి, ఉసిరి, సార, ఆరి గుంపెన వంటివి, వాటితోపాటు పాల, ఎర్రజువ్వి, కుంకుడు, ముష్టి, నేరేడు. చింత, ఊటి నిమ్మ, అడివినిమ్మ సీతారామపురం, ఉదయగిరి, చిట్టడవులు ఉన్నాయి. పూర్వం దేవాలయాల కోనేరు కొచ్చి మంచి నీరు తీసుకెళ్ళుతుండేవారు జానపదులు. సువర్ణముఖి, కండలేరు, బొగ్గేరు, పిల్లాపేరు, కాళంగి నదులు, పెన్నా నదిని పినాకిని అని కూడా పిలుస్తారు. ఈ జిల్లాలో సోమశిల ఆనకట్ట అతి పెద్దది. దీని పరివాహక ప్రాంతంలో జానపదుల నివాసాలు అధికం. ఇక్కడ తూర్పుకనుములు ప్రధానమైనవి. ఈ ప్రాంతంలోనే పైన తెలిపిన అరణ్యాలు ఉన్నాయి. ఈవిధంగా పూర్వకాలం నుండి ఆధునిక కాలం వరకు జానపదుల సాంఘికాంశాలన్నింటిని ఈ ప్రాంతంలో గమనించగలుగుతాం. విస్తృతమైన జానపద కథలు కలిగిన జిల్లాలో కొన్ని నామమాత్రంగా నేను ప్రస్తావించడం జరిగింది. నెల్లూరు జిల్లా జానపద కథల్లో సామాజిక జీవనం ప్రతిబింబిస్తు ఉంటుంది.

"మనమందరం భారతీయులం - భావితరాలకు సారధులం"

ఆధారగ్రంథాలు :

1. నెల్లూరు జిల్లా జానపద కథలు - డా॥ కె.వి.సత్యనారాయణ
2. చిత్తూరు జిల్లా జానపద విజ్ఞానం - ఆచార్య పేటా శ్రీనివాసులు రెడ్డి

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గిరిజన జానపదం – సృష్టికి మూలపథం

– గొల్లంగి చిన్నబాబు, మెకానికల్ ఇంజనీరింగ్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజీవీడు, కృష్ణా జిల్లా.

మూలాన్వేషణ :

జానపద కళలు అతి ప్రాచీనమైనవి. మానవుల అనుభూతులకూ, మానసిక చైతన్యానికి, విజ్ఞాన వినోదాలకూ ఆనందోత్సాహాలకూ ప్రతీకలై నిలిచాయి. అన్ని కళలకూ పునాదులై అగ్రభాగాన నిలిచాయి. పల్లెప్రజల బతుకు పరిమళానికి, ఆచార వ్యవహారాలకు ఆలవాలం జానపద వ్యాయం. దాన్ని తెలుసుకోవడమంటే మన మూలాలను మనం తడుముకుని మురిసిపోవడమే. మన పూర్వీకుల జీవితానుభవ సారాన్ని అవలోకించి ఉప్పొంగి పోవడమే. జానపద కళా రూపాలు జానపద కళా రూపాలు దృశ్యశాఖకు సంబంధించినవి. వీటిలో యక్షగానం, తోలుబొమ్మలాట, బుర్రకథ, పులి వేషాలు, గొరవ నృత్యం, ఒగ్గుకథ, కోలాటం వంటివి ప్రసిద్ధమైనవి. మౌఖికం, అనామక కర్తృత్వం, జానపద సాహిత్య లక్షణం. వచన జానపద సాహిత్యంలో సామెతలు, పొడుపు కథలు ఎంతో ప్రాచుర్యం పొందాయి.

జనపదం - జానపదం :

జనపదానికి సంబంధించింది జానపదం. జనపద మంటే పల్లెటూరు. అందులో నివసించు వారే జాన పదులు. వారు పాడుకొనే పాటలు జానపదాలు. జానపదులు పాడుకునే గీతాలను జానపద గీతాలు లేదా గేయాలు అంటారు. వీటినే ఆంగ్లములో folk songs అని అంటారు. జానపద జ్ఞానానికి ఆంగ్ల సమానార్థకంగా FOLK LORE పదాన్ని 1846లో ఔ.జి.థాంస్ (పాశ్చాత్య పండితుడు) రూపొందించాడు. తెలుగు జానపద గీతాలు చాలా పురాతన కాలంనుంచి వస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ జానపదగీతాలలో కొన్నిసార్లు చక్కని ఛందస్సు కూడా ఉంటుంది. పదకవితా పితా మహుడు అన్నమాచార్యుల వారు ఆ కాలంలో ప్రసిద్ధము లైన జానపద బాణీలలో చాలా పదాలు రాసారు.

'అలెన్ డెండ'స్ అభిప్రాయంలో ప్రత్యేక సాంప్ర దాయం గల జన సమూహం జానపదులు, జనపదుల నుండి పుట్టినది జానపద సాహిత్యం. జానపద సాహిత్యం ఒక తరం నుండి మరొక తరానికి మౌఖిక ప్రచారం ద్వారా సంక్రమించింది. జనపద గీతం ఒక సవ్వడి. ఇదొక చప్పుడు. సామాన్యమైన రీతి. జానపద, సాంస్కృతిక కళలు, కళా రూపాలు మానవ శ్రమ నుంచి పుట్టినవే. సాంస్కృతి, సంప్రదాయాలకు జానపదం ఒక చిహ్నమైంది. కొందరికి ఉపాధినిచ్చింది. ఎందరినో ప్రోత్సహించింది. కళా కారులను పుట్టించింది. పోషించింది. చెట్టు నుంచి పుట్ట వరకు అన్నింటిని తమ జానపదంలో శిల్పంగా తీర్చి దిద్దారు.

19వ శతాబ్దంలో ఫోక్ అనే పదాన్ని నిర్వచించిన విద్వాంసులు జానపదులంటే కర్షకులని, గ్రామీణులని అభిప్రాయపడ్డారు. జానపదాలు ఏ భాషలో ఉన్నా వినటానికి హాయిగా ఉంటాయి. అర్థం తెలియకపోవచ్చు కానీ భావం మాత్రం తెలుస్తూనే ఉంటుంది. శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని అందించినవి జానపద ప్రదర్శన కళలే. ప్రాచీన సమాజంలో వినోదం కోసం ప్రజలకు జానపద కళామాధ్యమం తప్ప మరొక మాధ్యమం లేదు. శ్రమ శక్తిని మరిచేందుకు జానపద గీతాలు ఆలపించేవారు. పొలాల్లో పాటలు పాడుతూ పనులు చేసుకునేవారు. అలనట తెలీయకుండా లయబద్ధంగా ఒక వ్యక్తి పాడితే కోరస్‌లా మిగిలిన వాళ్లు పాడుతూ పనులు చేసే వారు. జానపద ప్రదర్శన కళలు రెండు రకాలుగా మనకు కనిపిస్తాయి. సర్వ జానపద కళలు వృత్తి జానపద కళలు.

జానపద వారసులు :

భారత సమాజంలో ఆదివాసీలు మూలవాసులు.

అడవితల్లి ముద్దు బిడ్డలు. అటవీ సంపదల పరిరక్షణకై పోరాడుతున్న యోధులు. దోపిడీ, అణచివేతలను ధైర్యంగా ఎదుర్కొంటున్న ధీశాలులు. ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక వారథులు. వందల ఏళ్ళు ఎన్నో అవమానాలను, కష్టాలను ఎదుర్కొన్నారు. కులవ్యవస్థకి కర్కశంగా బలయ్యారు. ఇంతకీ ఈ గిరి జనులు ఎవరు? సమాజం నుండి వివక్షతలను ఎందుకు ఎదుర్కొంటున్నారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకాలంటే గిరిజన తండాలకు వెళ్ళాల్సిందే. అందుకే సీతంపేట, పార్వతీపురం ఐ.టి.డి.ఎ ల పరిధిలో ఉన్న కొన్ని గిరిజన గూడేలకు వెళ్ళి పరిశీలించగా కొన్ని విషయాలు తెలిసాయి. అందులో ప్రధానమైనవి వారి ఆచార వ్యవహారాలు, జానపద కళలు, వేషధారణ, విద్యా విధానం, భాష పరిజ్ఞానం. ఇందులో జానపద కళలని వాటి ప్రత్యేకతలను కూలంకషంగా చర్చించి వివరించడమే ఈ వ్యాస లక్ష్యం.

నెయ్యి గుర్రాలాట :

నాగరికత ప్రభావంతో ఆదివాసీల వస్త్రధారణలో చాలా మార్పులు వచ్చాయి. ఇంతక ముందు కట్టకోవడానికి బట్టలు కూడా లేవు. కానీ ఇప్పుడు వీళ్ళు బట్టలు కొనడానికి చేసే ఖర్చే అధికం. కొన్ని ప్రత్యేకమైన సందర్భా లలో గిరిజనుల వస్త్రధారణ ప్రత్యేకంగా ఉంటుంది. కొత్తగా అలంకరణలు చేసుకుంటారు. అవే వీళ్ళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడతాయి. శ్రీకాకుళం జిల్లా సీతంపేట పరిధిలో గిరిజనులు సంక్రాంతి పండగకి నెయ్యి గుర్రాలాట అని ఓ విన్నూత్న కార్యక్రమం చేస్తారు. ఇందులో ఇద్దరు వ్యక్తులుంటారు. ఒక వ్యక్తి తన ముఖంకి దిష్టి బొమ్మను పోలిన తొడుగును ధరిస్తాడు. ఇంకో వ్యక్తి వెదురు కర్రలతో చేసిన గుర్రం ఆకృతిని ధరిస్తాడు. వీళ్ళిద్దరు ఒకరికొకరు పోటాపోటీగా నృత్యాలు చేస్తారు. వీటిని రెండు రకాలుగా విభజించడానికి వీలుంది. తెలుగు జానపద కళల్లో ఎక్కువగా ఒక కులం వారు వారికి జీవనోపాధినిచ్చే వృత్తిగా స్వీకరించిన కళా కారులు ప్రదర్శించే కళలే ఎక్కువగా మనకు కనిపిస్తాయి.

ఆటలోని మర్మం :

కొన్ని సంవత్సరాల క్రితం గిరిజనులకి తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితి. అలాంటి సమయంలో నేరుగా భిక్షమెత్తుకోలేక ఇలా వినూత్నమైన పద్ధతిలో సంక్రాంతి సమయంలో చుట్టూ పక్కల గ్రామాలలో దాన్యం, డబ్బులు దండుకోవడానికి వెళ్ళేవారు. ఇప్పటికీ ఇదో సంప్ర దాయమైన పద్ధతిగా ఈ ప్రాంతంలో ఉండే ప్రజలు పరి గణిస్తారు.ఈ సంప్రదాయ పద్ధతి నేటి రోజుల్లో అంత రించిపోవడానికి సిద్ధంగా ఉంది. దానికి కారణం అందరికీ సరిపడా తిండి ఉంది. కావల్సిన వసతులున్నాయి. అందులోనూ ఈ నాగరిక సమాజంలోని మనుషులు ఇలాంటి వేషాలు వేయాలంటే మొహమాటా పడు తున్నారు. ఇలా ఈ సంప్రదాయ ఆట మరుగున పడుతుంది. దీనిని ఓ యాచక ఆటగా చూడకుండా సంప్రదాయ కళగా పరిగణించి దీని ఉనికిని కాపాడు కోవాల్సిన బాధ్యత ఈ గిరిజనులపై ఉంది.

మానుపండుగ మహోత్సవం :

భారత దేశంలో అటవీ విస్తీర్ణం ఇంకా మెరుగైన స్థితిలో ఉందంటే దానికి కారణం గిరిజనులే. మర్రి చెట్టు, రావి చెట్టు, వేప చెట్టు వీరికి ప్రత్యేకమైన ఆరాధ్య దైవాలు. సంవత్సరానికి రెండు మూడు సార్లు పూజలు చేస్తారు. డప్పులు, మేలాలతో చెవులకు పసందు, కనులకు విందుగా ఈ పండగలను చేస్తారు. ఆనాటి కాలంలో ఇదో మూఢ నమ్మక ప్రక్రియగా మొదలైంది. కానీ ఇప్పుడు అదే దేశ స్థితుగతులకి అయువు పట్టుగా నిలుస్తుంది. చెట్లలను, జంతువులను కన్న బిడ్డలలా చూసుకొనే సంస్కృతి వీరిది. అందుకే ఇప్పటికీ అడవితల్లి ఒడిలోనే సేద తీరడానికి ఇష్ట పడుతున్నారు.

ఈ పండుగ రోజు తండాలోని ఉన్న గిరిజనులంతా కలిసి రావి చెట్టుకు, వేప చెట్టుకు పూజలు చేయడానికి వెళ్తారు. వెళ్లడమంటే అందరూ వెళ్తారు. మరి వీళ్ళ ప్రత్యేకత ఏంటి అని అందరికీ సందేహం రావొచ్చు. వీళ్ళు పూజలు చేయడానికి వెళ్ళే దారిలో సవర భాషలో

కొన్ని పాటలు పాడుతూ, డప్పులు కొట్టుకుంటూ, డాన్స్ లు చేసుకుంటూ వెళ్లి పూజలు చేస్తారు. అలా ఎందుకు చేస్తారు అంటే? అమ్మలాంటి అడవి తల్లి దగ్గరికి ఆనందంగా వెళ్తున్నామని చెప్తారు అక్కడ గిరిజనులు.

నేటి స్థితి – పరిస్థితి :

జానపద కథలు ప్రయోజనాన్ని ఆశించి పుట్టవు. పుట్టిన తర్వాత ప్రయోజనాన్ని సంతరించుకుంటాయి. జానపద కథలు మౌఖిక ప్రచారంలో ఉండడం వల్ల చాలా మార్పులకు లోనౌతాయి. జానపద కథలు ప్రాంతాలన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఆ మార్పులలో హాస్యం, చమత్కారం, నీతి మొదలైన లక్షణాలు ఎక్కువగా చేరుతాయి. అంతేకాకుండా ఆయా ప్రాంతాల వివరాలు చేరి శ్రోతకు స్థానికతను తెలియజేస్తూ ఆనందింప జేస్తాయి.

నాటకరంగం లేని నాడు మన ప్రజలకున్న కళా రూపాలేమిటి? వారంతా ఎలా జీవించారు. వారి విజ్ఞాన వినోద వికాసాలకు ఉపయోగపడిన కళా రూపాలామేటి? అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే మనకు కనిపించేవి ఆనాటి జానపద కళారూపాలే.

గ్రామీణ సంస్కృతి సంప్రదాయాలను ఒకతరం నుంచి మరో తరానికి మోసుకెళ్లే సాంస్కృతిక సారథులు జానపద కళలు. సమాజంలోని మనిషి జీవన గమనంలో ఎదురయ్యే సుఖ దుఖాలను బాణీలుగా చేసుకుని జనపథం నుంచి ఏర్పడిన అద్భుత కళారూపాలు. మానవ శ్రమ నుంచి పురుడుపోసుకున్న అద్భుత ప్రదర్శనలు. ఒకప్పుడు పల్లెపల్లెనా వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచిన జానపద కళలు నేడు జనాదరణ, ప్రభుత్వ అండదండలు లేక 'కళ' తప్పుతున్నాయి. జానపద కళలపై ఆధారపడిన అనేక కుటుంబాలలో ఆకలి కేకలు కూనిరాగాలై వినిపిస్తున్నాయి. మాతంగుల బతుకులు మట్టికొట్టుకుంటున్నాయి. గంగి రెద్దులు బక్కచిక్కుతున్నాయి. పిట్టలదొర కోటు వెలసిపోయి వెక్కిరిస్తోంది. యక్షగానం ఎక్కడా వినిపించని స్థితికి చేరింది. పగటి భాగవతులు పుట్‌పాత్‌లపై భిక్షగాళ్ళై దర్శనమిస్తున్నారు. హరిదాసులు అన్నమో రామచంద్రా అంటున్నారు.

జానపద కళారూపాలంటే ఈనాడు చాల మందికి అర్థం కావు. జానపదమంటే పల్లెటూరని, జానపదంలో నివసించే వారు జానపదులనీ, వారు పాడుకునే పాటలు గానీ ఆటలు గానీ, నృత్యం గానీ, జానపద కళారూపాలని పెద్దలు నిర్వచించారు.

జానపద గేయాలనీ జానపద సాహిత్యమనీ, జానపద వీథి నాటకమనీ, తోలు బొమ్మలనీ, బుర్ర కథలనీ, పగటి వేషాలనీ, ఇలా ఎన్నో వందలాది జానపద కళా రూపాలు అనాడు పల్లె ప్రజలకు విజ్ఞాన వినోద వికాసాన్ని కలిగించాయి. జిల్లాలోని పలుప్రదేశాల్లో మహిళలు, చిన్నారులు జానపద కళారూపాల్లో ఒకటైన 'కోలాటం' పట్ల ఆసక్తి చూపుతూ నేర్చుకుని ప్రదర్శిస్తుండటం కాస్తంత ఊరట. శారీరక, మానసిక వికాశాన్ని ఇచ్చే కళలు జానపద కళలు.

జానపదం జాతీయ స్పృహ కలిగించే రకం. దీనిలోంచే సాహిత్యం, కళలు, ఇతర భాషా రూపాలు వచ్చాయి. ప్రస్తుత రచయిత ఒంటరిగా తన భావాల్ని, వ్యక్తిత్వాన్ని వ్యక్తం చేస్తారు. జానపద సాహిత్యం సామూహిక, సామాజిక దృష్టి మమేకం అయ్యేలా చేస్తుంది. పర్యావరణం అత్యంత వ్యక్తిగత అవగాహన ప్రదర్శిస్తుంది. 21 శతాబ్దం రచయితలు ఇటీవల మ్యెనింగ్ సంప్రదాయ సంస్కృతిలో ఒక క్రియాశీల వ్యాఖ్యానానికి ఒక ధోరణి చూపాయి. ప్రజారంజక సాహిత్యం పాపులారిటీని రీడర్ రచయితలు ఉపయోగించడం ద్వారా ఒక ఉపచేతన స్థాయి ఇప్పటికే పనిలో అందించిన చిత్రాలు, థీమ్లు తెలియడానికి వద్ద ఆడడానికి అందించారు. అలాంటి "బేన్" జానపదానికి ఉంది.

నేటి అవసరం :

మనిషి సంఘజీవి. అసలు సంఘం అంటే కేవలం మేధావి వర్గం అనో, ధనిక వర్గమో కాదు. సంఘం మీద అవగాహన కలగాలంటే దాని గురించిన సమాచారాన్ని

తెలుసుకోవాలి. దాన్ని అందించడానికి సిద్ధంగా ఉండేది ఆయా భాషల్లోని జానపదం. సంఘం అంటే? సంస్కృతిని ఆచరణలో ఉంచే మనుష్య రూపం. పరస్పరాపేక్షతో తమకు తాము సాంఘిక, ఆర్థిక రంగాల్లో కొన్ని కట్టు బాట్లను నిర్ణయించుకోవడంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వ నముదాయం. సంస్కృతి అంటే సంఘంలో ఒక సభ్యుడిగా ఉంటూ ఆ సంఘంలోని అలవాట్లను, ఆచార వ్యవహారాల్ని, కళారూపాల్ని గ్రహించడం.

జానపద గేయాలు విన్నప్పుడు, కళల ప్రదర్శనల్ని చూసినప్పుడు మానసికంగా, శారీరకంగా ఉన్న అలసట తీరుతుంది. సాధారణంగా జానపద కళాకారులు బీదవాళ్ల, సంచార జీవనం చేసేవాళ్ళు. కళపట్ల అంకిత భావంతో నేర్చుకున్న దగ్గరిని నుంచి ప్రదర్శించే వరకు వాళ్ళు పడే ఆవేదనల్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా వాళ్ళ అంకిత భావం గమనించి, సేవల పట్ల పునరంకితు లయ్యే మానసిక సంకల్పం దృఢ పడుతుంది. కళా కారులు బీదరికం, ఆ పై నిస్వార్థ తత్వం, కచ్చితంగా మానసికంగా మనుషులను తాకుతుంది. దాంతో మనుషుల్లో నిస్వార్థ శక్తి మేల్కొంటుంది. ఉన్నతమైన ఆలోచనలతో వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకొనే అవకాశం కలుగుతుంది.

దేనిమీదా ప్రత్యేకమైన మమకారాలు ఉండవు. కావల్సినంత తృప్తి, ఆత్మవిశ్వాసం జనపదుల్లో ఎక్కువగా ఉంటుంది. దీని గమనించిన మనుషులు నిత్యం తృప్తితో, కావలసినంత ఆత్మవిశ్వాసంతో సేవలు అందించే వీలుంటుంది. సాధారణంగా పండుగల్లో, విందుల్లో, వినోదాల్లో, ఉత్సవాల్లో ఈ నృత్యాలు, పాటలు ఉం టాయి. వాటిల్లో పాల్గోవడం వల్ల మనవాడు అన్న భావన అక్కడ ఉన్న సామాన్య ప్రజలకు కలుగుతుంది. ఎప్పుడూ పనేనా కాసంత కళాపోషణ ఉండొద్దూ.

ఆధార గ్రంథాలు :

1. అంతర్జాలం
2. జనపథం - బండి సత్తెన్న (ప్రజానాట్య మండలి) - ప్రజా శక్తి బుక్ హౌస్
3. తెలుగు జానపద కళారూపాలు - ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి - ప్రపంచ తెలుగు మహాసభలు, 2012
4. తెలుగు జానపద విజ్ఞానం - ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి - ప్రపంచ తెలుగు మహాసభలు, 2012

❖ ❖ ❖

మా ఊరి పండుగలు – నాడు – నేడు

– డా॥. చొగంటి నాగరాజేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం,తూ॥గో॥జిల్లా.

"జనానాం పదం జానపదమ్" జనులకు నెలవైనది జనపదం. జనపదం అంటే గ్రామం. జానపద మంటే జనులందరికీ సంబంధించిన అంశం. ఎందుకంటే ఈనాడు అధిక సంఖ్యాకులైన ప్రజలు నగరాల్లో నివశిస్తున్నప్పటికీ వీరంతా గ్రామీణ మూలాలను కలిగిన వారే. అందుకనే గ్రామాల్లో వలనే నగరాలు, పట్టణాల్లో కూడా మనగ్రామ సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు పాటించడం కనబడుతుంది. అయితే ఈనాటి ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవ ప్రభావంతో జానపద, గ్రామీణ సంస్కృతిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మా ఊరిలో నా చిన్నతనంలో పండుగలు ఏవిధంగా జరిగేవో, నేడు వాటిలో వచ్చిన మార్పులను నా అనుభవాల కోణం నుంచి మీ అందరితో పంచుకోవాలనే ఆకాంక్షతో ఈ వ్యాస రచనకు పూనుకున్నాను.

ఈ సదస్సుకు పత్రసమర్పణ కోసం ఏ అంశంపై రాయాలని ఆలోచించినపుడు నిర్వాహకులు సాధ్యమైనంతవరకు మీ నివాస ప్రాంతాలకు చెందిన అంశాలపై రాస్తే బావుంటుందని సూచించినపుడు దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారు రచించిన వ్యాసం గుర్తుకు వచ్చింది. మా ఊళ్ళో వీధి అరుగు అనే వ్యాసంలో ఆయన వారి ఊరు ఏవిధంగా మారిపోయిందో, తెలుపుతూ వీధి అరుగులు మాయమైపోయాయని, ఒకప్పుడు ఆ ఊరిలో ఎవరెవరి అరుగులు దేనికి ప్రసిద్ధంగా ఉండేవో, ఈనాడెలా మారిపోయారో వివరించారు. ఆ వ్యాసాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ వ్యాసాన్ని రాయాలని భావించాను. మా ఊరిలో నా చిన్నతనంలో పండుగలు జరిగే విధానం, నేడు మారిపోయిన తీరును వివరిస్తూ నా అనుభవాలను మీతో పంచుకోవడమే ఈ వ్యాసోద్దేశం.

చుట్టూ పచ్చని పంటపొలాలతో, మంచినీటి చెరువులతో ఎంతో అందంగా ఉంటుంది మా ఊరు. జాతీయ రహదారి 16పై (పూర్వం-5) తూర్పు గోదావరి జిల్లా జగ్గం పేట సమీపంలో జడ్ రాగంపేట మా ఊరు. దీన్ని జమిందారీ రాగంపేట అని కూడా అంటారు. ఊరు చిన్నది, తక్కువ జనాభాయే అయినా సంస్కృతి, ఆచార వ్యవహారాలను పాటించడంలో మేటి. కొన్ని ముఖ్యమైన పండుగలు ఎలా జరుపుకునేవాళ్ళమో, ఇప్పుడు ఎలా మార్పు వచ్చిందీ వివరిస్తాను.

ముందుగా తెలుగువారు అత్యంత ఉత్సాహంతో ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి గురించి తెలియజేస్తాను.

సంక్రాంతి పండుగ :

తెలుగు ప్రజలు ఎంతో ఇష్టంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. సూర్యుడు మకరరాశిలోనికి ప్రవేశించి, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమయ్యే రోజు సంక్రాంతిగా జరుపుకుంటాం. ఈ పండుగను 3 రోజులు జరుపుకుంటాం మొదటిరోజు భోగి, 2వ రోజు సంక్రాంతి, 3వ రోజు కనుమ పండుగ ఈ సంక్రాంతి పండుగ హడావుడి మా ఊరిలో నెలరోజుల ముందు ప్రారంభ మయ్యేది. ధనుర్మాసంలో శివాలయంలో ఆకాశదీపం పెట్టి నెలగంట కొట్టి ధనుర్మాస ప్రారంభం చేసేవారు. ఆ రోజు నుంచి భోగి వరకు ఉండే నెల రోజుల్లో ఇళ్ళన్నీ శుభ్రపరచుకుని, బూజులు దులిపి సున్నం వేసుకునేవారు ప్రతి ఇంటిలో ఇత్తడి సామానులు పెద్ద పెద్ద గంగాళాలు, డేగిషాల వంటివి బోలెడు ఉండేవి. వాటిని శుభ్రంగా తోమితే బంగారం రంగులో మెరిసిపోయేవి. గడపలకు కూడా రంగులు వేసుకునేవారు. దానితో ఇళ్ళన్ని కళకళలాడుతూ ఉండేవి. ఈ నెలరోజులు ఉదయమే వాకిళ్ళు ఊడ్చి, కళ్ళాపి చల్లి సంక్రాంతి ముగ్గులు పెట్టేవారు భోగిపండుగ

ముందురోజు ఒక్కొక్క వీధిలోని పిల్లలంతా చేరి పెద్ద పెద్ద బుట్టలు, గోనె సంచులు తీసుకుని ఇంటింటికి తిరిగి భోగిమంటలో వేసేందుకు కట్టెలు, పిడకలు సేకరించేవారు. అదొక వేడుక.

ఎప్పుడెప్పుడు పండుగ - ఏడాది పండుగ.
"పండగమ్మా పండగ - మా ఊరొచ్చింది పండగ
అల్లుడెందుకు వచ్చాడు - అరిసెలు తినడానికొచ్చాడు
కోడలెందుకొచ్చింది - కుడుములు తినడానికొచ్చింది."
భోగిమంటవెయ్యాలి - మంచి మంచివి వెయ్యండి
వేసినోళ్ళ పుణ్యం - వేయనోళ్ళ పాపం

అంటూ ఇంటింటికి తిరుగుతూ సేకరించేవారు. మర్నాడు తెల్లవారుఝామునే వీధిమధ్యలో పెద్ద భోగిమంట వేసేవారు. చిన్నపిల్లలం నెల రోజులు ముందు నుండి ఆవుపేడను సేకరించి దానితో పిడకలు చేసి రకరకాల ఆకారాలలో భోగిదండలు గుచ్చుకునేవాళ్ళం. ఆ భోగిమంటలోనే పెద్ద పెద్ద గిన్నెలలో నీళ్ళు కాచుకుని ఆ వీధిలోని వారంతా నలుగులు పెట్టుకుని తలంటు స్నానాలు చేసేవారు. అనంతరం కొత్త బట్టలు ధరించి భోగిదండలు మంటలో వేసి అవి కాల్చి ఆనందించేవాళ్ళం. రెండోరోజు సంక్రాంతి. ఇంట్లో పెద్దలు రకరకాల వంట కాలతో పితృదేవతలకు నివేదిన చేసి సంతృప్తి పరిచేవారు. మూడవ రోజు కనుమ పండుగ. ఆ రోజు రైతులు పశువులను అందంగా అలంకరించేవారు. ఈ మూడు రోజులు పిల్లలు ఉదయమే అందంగా కొత్తదుస్తులు ధరించి అందరూ ఒకచోట చేరి ఆటలు ఎన్నో రకాలు ఆడుతూ ఎంతో ఉత్సాహంగా గడిపేవారు. సంక్రాంతి రోజు ఊరిలోని యాదవులు తప్పెటగుళ్ళు ఆడుతూ వచ్చి శ్రీకృష్ణ కథలు చెప్పేవాళ్ళు. అందరూ ఆనందించి వారికి ధాన్యం, డబ్బులు కానుకలుగా ఇచ్చేవారు. పిల్లలు ఆడుకుంటుంటే ఆడవారు ఒకచోట చేరి కబుర్లు చెప్పుకునేవారు. ప్రతిఇల్లు బంధువులతో కళకళలాడేది. మగవారు వీధి రామాలయం దగ్గరో, రచ్చబండవద్దో చేరి కబుర్లు చెప్పుకుంటుంటే, కొంతమంది యువకులు వీధి అరుగులపై చేరి పేకాట ఆడేవారు. కొందరు పాలాలలో జరిగే కోడిపందాలకు వెళ్ళి ఆనందించేవారు. నెల రోజులపాటు తన హరినామ సంకీర్తనలతో అలరించిన హరిదాసు పండుగ చివరి రోజు వచ్చి అందరినీ కలుసుకుని వీడ్కోలు తీసుకుంటుంటే, అందరూ కుటుంబ సభ్యునికి వీడ్కోలు చెబుతున్నట్టుగా ఆయనకు అనేక రకాల పిండివంటలు, బియ్యం, కూరగాయలు ఇచ్చి సాగనంపేవారు.

కాని నేడు ఇవన్నీ కేవలం మొక్కుబడిగా చేయడం కనబడుతుంది. భోగిమంటకు సరంజామా సేకరించడం లేదు. ఎవరో పెద్దలు మొక్కుబడిగా మంటవేయడం కనిపిస్తుంది. పిల్లల ఆటలు లేవు. వీధి అరుగులపై కబుర్ల కోలాహలం లేదు. వీధిలో పిల్లలే కనబడడం లేదు. అందరూ టి.వి.లకే, ఫోన్లకే అతుక్కుపోయి కూర్చుంటున్నారు. ఎవరింట్లో వారే అన్నట్టుగా నేడు మూడు రోజుల పండగ ముగుస్తుంది. వచ్చే కళాకారులు కూడా తగ్గిపోయారు.

ఉగాది :

తెలుగువారి నూతన సంవత్సరం ఉగాదితో ప్రారంభమౌతుంది. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి సేవించడం ఆరోజు ప్రత్యేకత. తెల్లవారుఝామునే లేచి ఇంట్లో పెద్దలు ఉగాది పచ్చడి తయారు చేసేవారు. పిల్లలం తలంటుస్నానం చేసి కొత్తబట్టలు ధరించి దేవుని పూజ తర్వాత ఉగాది పచ్చడి తినేవాళ్ళం. అనంతరం ప్రతి కుటుంబం వారు అందర్ని తమ ఇంటికి పచ్చడి తినడానికి ఆహ్వానించేవారు. వచ్చిన వారికి ముందుగా కడిగి శుభ్రపరిచిన లేత మర్రి ఆకులలో ఉగాది పచ్చడి వేసి తినమని ఇచ్చేవారు. ఇలా మర్రి ఆకులో ఉగాది పచ్చడి తినడం మా ఊరిలో ఒక ఆచారం. దీనివెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయని మా పెద్దలు చెప్పేవారు. మర్రి ఆకులో ఎన్నో ఔషధగుణాలు ఉండడం వల్ల పచ్చడి ఆ ఆకులో తినడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలను నివారిస్తుందని మాతాతయ్య చెప్పేవారు. ఇలా అందరింటికీ అందరూ వెళ్ళడం సమైక్యతకు

సంకేతంగా ఉండేది. ఆరోజు సాయంకాలం ఎవరో ఒకరు జానపద కళాకారులు వచ్చి కళాప్రదర్శన చేసేవారు.

దీపావళి :

దీపావళి పిల్లలు, పెద్దలు అత్యంత ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకునే పండుగ, దీపావళికి రెండు మూడు నెలల ముందు నుంచే మగపిల్లలు జిల్లేడు కొమ్మలు ఎండబెట్టి కాల్చి బొగ్గుపొడి తయారుచేసి దానిలో పేలుడు పదార్థాలు కలిపి సిసింద్రీలు, తారా జువ్వలు, ఉప్ప పొట్లాలు వంటి బాణాసంచా సామాను తయారు చేసుకునేవారు. వాటిని బాగా పనిచేస్తున్నాయో లేదో ప్రయోగించి చూసుకోవడంతో దీపావళి సందడి రెండు నెలల ముందునుంచే పల్లెలో కనిపించి పండుగ రాకను సూచించేది. దీపావళి రోజు ఉదయం నుంచి పిండివంటలు తింటూ ఆటలలో గడిపి సాయంకాలం కాగానే వీధి అరుగుల నిండా దీపాలు పెట్టి ఆ వెలుగులలో బాణాసంచా కాలుస్తూ ఆనందంగా ఈ పండుగ జరిగేది.

ఈనాడు బాణాసంచా తయారీ చేసే ఓపిక, తీరిక ఎవరికీ లేదు. అప్పటికప్పుడు బాణాసంచా రడీమెడ్‌గా తెచ్చుకుని రెండు మూడు గంటల్లో కాల్చేసి పండుగ జరిపేసుకుంటున్నారు.

దసరా :

దసరా పండుగను చిన్న వయసులో చాలా ఆనందంగా జరుపుకునేవాళ్ళం. శివాలయంలో అమ్మవార్ని ప్రతిష్ఠించేవారు. ప్రతిరోజు ఊరిలోని వారు కుంకుమ పూజలు చేయించుకునేవారు. మా మాస్టారులు మాకు జండాలు తయారుచేసి దసరా బహుమానాల కోసం ఊరిలో అందరి ఇంటికీ పాటలు పాడుకుంటూ ఊరేగింపుగా తీసుకు వెళ్ళేవారు. మాకు అలావెళ్ళడం ఎంతో ఆనందంగా ఉండేది.

ఏదయా మీదయ మా మీద లేదు
ఇంతసేపుంచుట ఇది మీకు తగునా
పావలా బేడైతె పట్టేది లేదు
అర్ధరూపాయైతె అంటేది లేదు
ముప్పావలా ఇస్తే ముట్టేదిలేదు
హెచ్చురూపాయైతె పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు
పిల్లవాళ్ళకు చాలు పప్పు బెల్లాలు" అంటూ

పాడుతుంటే వేపుడుశనగపప్పు, బెల్లం, అటుకులు, కొబ్బరి ముక్కలు మాకు, మాస్టారికి డబ్బులు కానుకగా ఇచ్చేవారు. అదొక అందమైన అనుభవం. దసరాకోసం ప్రత్యేకించి పాటలు కూడా మా గురువులు రూపొందించే వారు. కొంతమంది పిల్లలకు రకరకాల వేషాలు వేసేవారు. ఈనాడు ఇవేవీ కనిపించడం లేదు. నేటి ఉపాధ్యాయులకు ఆ కానుకల అవసరం కూడా లేదు.

వినాయక చవితి :

ముందురోజు మధ్యాహ్నం నుంచి స్కూలు వదిలేసే వారు. మగపిల్లలు వినాయక పూజా పత్రికి పొలాలవెంట వెళ్ళి రకరకాల పత్రి సేకరించేవారు. ఊరి చెరువులోని కలువ పూల కోసం పోటీలు పడి కోసుకునే వారు. ఉగాది రోజు ఉదయమే తలస్నానం చేసి, పాలవెల్లిని అలంకరించి, రకరకాల పళ్ళుకట్టి మట్టివినాయక బొమ్మని నిలిపి, అమ్మచేసిన 'ఆరిది' వంటకాన్ని కుడుములను పెట్టి పూజ చేసుకునేవాళ్ళం. తరగతి పుస్తకాలకు మొదటి పేజీలో పసుపుతో స్వస్తిక్, ఓంకారం రాసి పూజదగ్గర పెట్టి నమస్కరించేవాళ్ళం. మాయింట్లో ఆ రోజంతా ఆరిది మాత్రమే తిని ఉండాలి. భోజనం చేయరాదు. ఇది కొంచెం కష్టంగా ఉండేది. ఆ రోజు దొమ్మరాట కళాకారులు వచ్చి ఊరి చివర బహిరంగ ప్రదేశంలో పెద్దరాట పాతిపెట్టి తమ కళను ప్రదర్శించేవారు. ఒకస్త్రీ తాడుపై కర్ర సాయంతో నడవడం, తాడుపై సైకిల్ తొక్కడం వంటి అనేక విన్యాసాలు చేసి అందరినీ అబ్బురపరిచేవారు. ప్రదర్శనాంతరం ఊరివారు వారికి ధాన్యం, బియ్యం, డబ్బులు ఇచ్చి సాగనంపేనారు.

ఈనాడు వినాయక చవితి పూజ చేసే విధానంలో వచ్చిన మార్పేమిటంటే పూర్వంలా ఎవరింటిలో వారు చేసుకోవడమే కాకుండా అందరూ కలిసి సామూహికంగా ప్రతిమ నిలిపి నవరాత్రులు ఉత్సవాలవలే చేస్తున్నారు. ఇది ఆనందించదగ్గ విషయం.

మా ఊరి శివారులో వీరమ్మ పేరంటాలు అమ్మవారి గుడి ఉంది. ఆమె ఎంతో మహిమగల తల్లి అని ప్రజల నమ్మకం. సంక్రాంతి పండుగ వెళ్ళిన తరువాత ఆమె ఉత్సవాలను తిరునాళ్ళుగా జరుపుతారు. ఆ రోజుల్లో ఖాళీ పొలాలలో వేదికను ఏర్పాటుచేసి గొప్ప నాటకాలను ప్రదర్శింపజేసేవారు. చింతామణి, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, పాండవోద్యోగం వంటి నాటకాలు తెల్లవారే దాకా ప్రదర్శించేవారు. ''జండాపై కపి రాజు'' ''చెల్లియో చెల్లకో''! వంటి పద్యాలు నిరక్షరాస్యులైన పాలేరు యువకులుకూడా కంఠతా పాడుకోవడం జరిగేది. అలాంటి పద్యాలను డబ్బులు ఇచ్చి మళ్ళీ మళ్ళీ పాడించుకునేవారు. మా నాన్నగారితో వెళ్ళి నాకు అర్థంకాక పోయినా అప్పుడు వాటిని చూడగలగడం నా అదృష్టంగా ఇప్పుడు భావిస్తున్నాను. ఈ తిరునాళ్ళలో గరగలను ఆడించే కళాకారులు, పగటి వేషధారులు వేషాలు వేసుకుని ఎడ్ల బండ్లపై ఊరేగుతూ ప్రజలను ఆనందింప జేసేవారు. ఈ పర్వదినాల్లో రాత్రిపూట శివాలయం, రామాలయం నుంచి దేవుళ్ళను పల్లకీలో శోభాయాత్రగా ఊరంతా ఊరేగించేవారు. అందరూ వారికి నివాళి ఇచ్చేవారు. ఊరి పెద్దలు, పిల్లలు ఎంతో ఉత్సాహంగా ఈ యాత్రలో పాల్గొనేవారు.

నేడు ఈ పండుగలు జరుపుకునే విధానంలో సాంకేతిక అభివృద్ధితో మార్పులు వచ్చినా ఆచార సంప్రదాయాలు అలానే కొనసాగుతున్నాయి. అయితే జానపద కళాకారులు మాత్రం రావడం తగ్గిపోయిందనే చెప్పాలి. టి.వి.లు, సినిమాల వంటివి కావలసిన వినోదాన్ని అందిస్తుంటే జానపద కళారూపాలకు ఆదరణ కరువైందని చెప్పాలి.

ఇంకా ఎన్నో విశేషాలు ఉన్నా, ఇక్కడి పరిమితుల దృష్ట్యా వీటిని మాత్రమే చెప్పగలిగాను. మీతో పంచుకోగలిగాను.

ఇవండీ ! మా ఊరి పండుగల విశేషాలు.

ధన్యవాదాలు....

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు జానపద ప్రతీకాత్మక కథలు – మనో విశ్లేషణ

– డా॥. కె.వి. సత్యనారాయణ, తెలుగు

జానపద విజ్ఞానం తరతరాలకు తరగని అపూర్వ పెన్నిధి. అదొక వెలకట్టలేని సంపద. అందుకే ఐక్యరాజ్య సమితి కూడా జానపద విజ్ఞానాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను గుర్తించింది.

జానపద విజ్ఞానంలోను, జానపద సాహిత్యంలోనూ కథలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. జానపదులకు సంబంధించిన సమస్త విషయాలు, ఇందులో ప్రత్యక్షంగా వారి మాటల్లోనే పొందుపరచబడి ఉంటాయి. జానపదుల సాంఘిక జీవనాన్ని అర్థం చేసుకోవాలంటే కథల కంటే మించిన మూలధనం మరొకటి లేదు.

"The folk tales of a country, more than any thing else, reflects the genius of the people, their beliefs, customs, manners, attitudes and their way of life." ఈ అంశమే జానపద విజ్ఞానంలో కథకు విశిష్టతను చేకూర్చి పెట్టింది. ఈ విశిష్టత కారణంగానే కథ ప్రపంచంలోని మానవ శాస్త్రజ్ఞులను, మనస్తత్వ వేత్తలను, భాషా శాస్త్ర ప్రవీణులను ఆకర్షించగలిగింది.

జానపదకథల్లో పురాణ, మత సంబంధమైన, వేదాంత, వినోద, పిల్లల, జంతువుల, సమస్యాత్మక, మోసగాళ్ళ, నీతి, యుక్తి, అతిమానుష, సామెత కథలు వంటి ఎన్నో కథలు ఉన్నప్పటికీ ప్రతీకాత్మక కథలు ఎంతో విలక్షణతను కల్గి ఉంటాయి.

ప్రతీకాత్మక కథలు :

మనం ఏదైనా ఒక విషయాన్ని ప్రత్యక్షంగా చెప్ప లేనప్పుడు లేదా చెప్పకూడని పరిస్థితులున్నప్పుడు ఆ విషయాన్ని పరోక్షంగా సూచిస్తాం. "సింబాలిజమ్" అని ఆంగ్లంలో పిలిచే దీనిని తెలుగులో ప్రతీక వాదం అని అంటారు. దీనిలో వస్తువులు, పాత్రలకు సంకేతార్థ ముంటుంది. లిఖిత సాహిత్యంలో ఎంతోమంది కవులు ఈ ధోరణిలో రచనలు చేశారు. లిఖిత సాహిత్యం కంటే ముందు జానపద సాహిత్యంలో ఈ ప్రతీకాత్మక ధోరణి ఉన్నట్లు నిదర్శనలున్నాయి. ఈ ప్రతీకాత్మక కథలు ఎందుకు చెప్పుకుంటున్నారు. ఈ కథలలో దాగి వున్న అంశాలేమిటి? మొదలైన విషయాల్ని తెలుసుకోవాలంటే మనో విజ్ఞానశాస్త్రమే సరైంది. ఈ శాస్త్రమే కథలలో దాగి ఉన్న మానవుని ఆలోచనల్ని వెలికి తీయగలదు. ఉదాహరణకు 'జానా బెత్తె శాస్త్రం'.

జానా బెత్తె శాస్త్రం :

"ఒక ఊర్లో రామయ్య, రమణమ్మ అనే ఇద్దరు భార్యా భర్తలుండేవారు. వారికి పిల్లల్లేరు. పిల్లల్లేరని కోడిపెట్టను పెంచసాగారు. ఆ పెట్ట జానాబెత్తె గుడ్డు పెట్టింది. గుడ్డులో నుండి జానాబెత్తే పిల్లోడు వస్తాడు. గుడ్డలు కుట్టించ మంటాడు. పెళ్లి చెయ్యమంటాడు. "నీకు పెళ్ళి చెయ్యాలంటే ఎవరిస్తారు పిల్లనీ? మా వల్ల కాదంటారు" తల్లి దండ్రులు. మహారాజు కూతుర్ని పెళ్ళి చేసుకోనొస్తానని బయలుదేర్తాడు. బెండ్లు, దంటు సప్పలతో బండిని తయారు చేసుకుంటాడు. నాలుగు సజ్జరొట్టెలు తీసుకుంటాడు. మార్గమధ్యలో కర్ర, తాడు, కుంకుమ బరిణా ఎదురొస్తాయి. ముందు కష్టమొస్తుంది. తమను బండిలో పెట్టుకోమంటాయి.

ఒక ఊరు పొలిమేరల్లోకి వెళ్తాడు. ఆ ఊరి రాజు అక్కడున్న బ్రహ్మరాక్షసిని చంపిన వాడికి తన కూతుర్నిచ్చి పెళ్ళిజేస్తానని చాటింపేస్తాడు. ఐదారుగురు పిల్లలు జానాబెత్తోడ్ని ఎగతాళి చేస్తారు. కర్రనొదుల్తాడు. ఇద్దరు ముగ్గురు ఛస్తారు. కర్రసాయంతో బ్రహ్మరాక్షసిని చంపేస్తాడు. రాజు తన కుమార్తెను జానాబెత్తే వాడికి ఇవ్వనని సైన్యాన్ని పంపుతాడు. సైన్యంలో కొంతమంది జానాబెత్తోడ్ని ఎగతాళిగా మాట్లాడతారు. కర్రపోయి ఒక్కడ్ని

తప్ప అందర్నీ చంపేస్తుంది. మళ్ళీ సుమారు రెండు వందల మంది సైనికులు వస్తారు. ఒక్కడు తప్ప అందరూ ఛస్తారు. తర్వాత ఊళ్ళో వాళ్ళందరూ వస్తారు. జానాబెత్తోడు మూడు వస్తువుల్ని వారి పైకి వదిలేస్తాడు. కుంకుమబరిణె పెద్ద కోనేరైపోయి అందర్నీ ముంచేస్తుంది. తాడు పాయ్యి అందరి కాళ్ళను బంధించి వేస్తుంది. కర్ర పైకి లేచినోడ్ని లేచినట్టే తలలు పగులగొడ్తుంది. సైనికులంతా చచ్చిపోతారు. చివరికి మహారాజే వస్తాడు. కర్ర దెబ్బతో మహారాజు కన్నులొట్టబోయి జానాబెత్తోడి కాళ్ళ మీద పడతాడు. చివరికి తన కూతుర్నిచ్చి పెళ్ళిచేసి జానాబెత్తోడితో పాటు పంపిస్తాడు. సొంత ఊర్లో ప్రజలంతా ఘనస్వాగతమిచ్చి మా పిల్లల కంటే జానబెత్తేవోడు ఎంతో మేలని గొప్పగా చెప్పుకుంటారు. అందరూ సుఖంగా ఉంటారు.

ఈ కథలో రామయ్య, రమణమ్మలు పిల్లల్లేనందుకు కోడిపెట్టను తెచ్చి చాకాలనుకోవడం సంతానం పట్ల వాళ్ళకున్న ఆసక్తిని, తపనను తెలియజేస్తుంది. అయితే పిల్లల బదులు కోడిపిల్లల్నే పిల్లలుగా భావించాలనుకోవడం Displacementగా కన్పిస్తుంది. అలాగే గుడ్డులో నుంచి జానాబెత్తే పిల్లవాడు వస్తాడనడానికి ఏ విధమైన హేతుబద్ధత లేదు. ఒక రకమైన Irrational thinking గా అనుకోవచ్చు లేదా అదొక వీప్ష్ణ గా చెప్పుకోవచ్చు. రాజు కూతుర్ని పెళ్ళి చేసుకోవాలనుకోవడం జానాబెత్తేవాడి High Aspiration. తల్లిదండ్రులు వద్దన్నా, ప్రజలు ఎగతాళి చేస్తున్నా బండి కట్టుకొని బయలుదేరడం అతనిలోని పట్టుదలను (Confidence) తెలియజేస్తుంది. కర్ర, కుంకుమబరిణె, తాడు వంటి నిర్జీవ వస్తువులు సాయంగా రావడం (Dependency of Inanimate Objects)గా చూడొచ్చు. ఇక బ్రహ్మరాక్షసితో తలపడ్డం, ప్రజలతో, రాజుతో తలపడ్డం అతని పరిసరాల ఒత్తిడికి నిదర్శనం.

ఈ కథలోని జానాబెత్తేవాడు సామాన్య మానవునికి ప్రతీక. అతని శరీర పరిమాణం, అతను ఉపయోగించిన బండి (బెండ్లు, దంట్లతో చేసినది) అతడి శారీరకమైన దుర్బలత్వాన్ని, అతడి సాంఘిక, ఆర్థిక పరిస్థితిని చెప్పకనే చెప్తున్నాయి. రాజు కూతుర్ని పెళ్ళిచేసుకోవాలనుకోవడం ఉన్నత వర్గాల పట్ల జానపదులకు ఉండే ఆకర్షణ వ్యక్తమౌతోంది. రాజుతో తలపడి, అతన్ని ఓడించడం సామాన్య మానవుడు తనను అణచివేసే యజమానిని ఓడించడంగా, అతని కూతుర్ని పెళ్ళిచేసుకోవడంగా కనిపిస్తుంది.

ఈ కథలోని నాయకునిలో భౌతిక స్వరూపానికన్నా అంతర్గత శక్తులు ఎంతో శక్తివంతంగా ఉన్నట్లు మనకర్థమౌతుంది. ఒక పక్క తనవాళ్ళు, తన పరిస్థితులు వ్యతిరేకిస్తున్నా, అసంతృప్తి కలిగిస్తున్నా (నిరుత్సాహపరుస్తున్నా) కాని, కథానాయకుడిలో ఆత్మవిశ్వాసం ఏ మాత్రం తగ్గకుండా ఏదో ఒక విధమైన చాకచక్యంతో, కొన్ని వస్తువుల సాయంతో అనుకున్నది సాధిస్తూ ఉన్నట్లు మనకు కనిపిస్తాడు.

పిచ్చుక - ముక్కులో ముల్లు :

ఒక పిచ్చుక వడ్ల గింజలేరుకుంటుంటే ముక్కులో ముల్లు గుచ్చుకుంటుంది. మంగలోడ్ని పిలిచి ఆ ముల్లు తీయమంటుంది. వాడు తీయనంటాడు. రాజుతో చెప్పి ఉద్యోగం తీయిస్తానని బెదిరిస్తుంది. అయినా తీయించినపుడు చూసుకోవచ్చు అనంటాడు. రాజు దగ్గరికెళ్తుంది. మంగలోడ్ని ఉద్యోగం నుండి తీసేయాలంటుంది. తీసేయనంటాడు రాజు. జింకల్తో చెప్పి నీ మాన్యం తొక్కిస్తానంటుంది. అయినా వినిపించుకోడు. జింకల దగ్గరికెళ్ళి రాజు మాన్యం తొక్కాలంటుంది. తొక్కం ఫో అంటాయి. వేటగాడికి చెప్పి పట్టిస్తానంటుంది. అప్పటికీ పట్టించుకోవు. వేటగాడి దగ్గరికెళ్ళి జింకల్ని పట్టాలంటుంది. నేను పట్టను పో అంటాడు. ఎలుకతో చెప్పి నీ వల కొరికిస్తానంటుంది. అప్పుడూ లెక్కచేయడు. ఎలుక కూడా మాట వినదు. పిల్లికి చెప్తానంటుంది. పిల్లికి చెప్తానంటుంది. పిల్లి కూడా పిచ్చుక మాట వినదు. అవ్వతో చెప్తానంటుంది. అవ్వ కూడా మాట వినదు. పిల్లికి ముద్ద వేస్తానంటుంది. తాతతో చెప్పి తన్నిస్తానంటుంది. అయినా అవ్వ వినదు.

తాత దగ్గరకు వెళ్ళి అవ్వని తన్నమంటుంది. తన్న నంటాడు తాత. అట్లైతే ఆవుతో చెప్పి తన్నిస్తానంటుంది. అయినా విన్పించుకోడు. ఆవుతో తాతను తన్నమంటుంది. తన్ననంటుంది. దూడతో చెప్పి చన్ను కొరికిస్తానంటుంది పిచ్చుక. ఆవు పట్టించుకోదు. దూడ దగ్గరికెళ్ళి అలాగే చెప్తుంది. అదీ వినదు. కంతిరీగల్తో చెప్తానంటుంది. అయినా విన్పించుకోదు. కంతిరీగలు కూడా చెప్పిన మాట వినవు. ఇక చివరికి విసిగి వేసారి తాటాకు తగలబెట్టి కంతిరీగల తుట్లో బెడ్తుంది.

కంతిరీగలు దూడను కుట్టాయి. దూడపాయ్యి ఆవు చన్ను కొరుకుతుంది. ఆవు తాతను తంతుంది. తాత పాయ్యి అవ్వను తన్నబోతాడు. అవ్వ పిల్లికి ముద్ద వెయ్యదు. పిల్లి ఎలుకను పట్టబోతుంది. ఎలుక వేటగాడి వల కొరకబోతుంది. వేటగాడు పోయి జింకల్ని పట్టా లంటాడు. జింకలు పోయి రాజు మాన్యం తొక్కాయి. రెడ్డి మంగలోడ్ని తీసేస్తానంటాడు. అప్పుడు మంగలోడు చాటుగా పిచికను పిలిచి ముక్కులో ముల్లు తీసేస్తాడు.

ఈ కథలో ఒక ప్రతీకాత్మక అంశం కనిపిస్తోంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ "ది ఇంటర్ ప్రిటేషన్ ఆఫ్ డ్రీమ్స్" (The interpretation of Dreams)లో చెప్పినట్లు "This symbolism is not peculiar to dreams, but is characteristic of un conscious ideation in paraticular among the people and it is to be found in Folklore, and in pupil, it myths, legends. linguistic idions, proverbial wisdom and current jokes to a more complete extent than dreams.

పిచ్చుక సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందిన సామాన్య వ్యక్తికి ప్రతీక. తనకు ఎదురైన కష్టాన్ని తొలగించ మని చిన్నవాళ్ళ నుండి పెద్దవాళ్ళదాకా (మనుషులు కాని, జంతువులు కాని) ప్రాధేయపడ్తుంది. ప్రతి ఒక్కరూ దాన్ని లెక్క చెయ్యరు, పట్టించుకోరు. దానితో విసిగి వేసారి చివరికి సాహసంతో తాటాకును కాల్చి కందిరీగల తుట్టెలో పెడ్తుంది. వలయం పూర్తై కసిరి కొట్టిన మంగలివాడే దగ్గరికి పిలిచి ముక్కులో ముల్లు తీసేస్తాడు.

కథకుని తార్కికత, సహసంబంధ ప్రక్రియల కూర్పు ప్రశంసనీయం. ఎన్నో స్థాయిల్లో చిక్కులను ఎదుర్కొం టున్నప్పటికీ పట్టుదలతో చివరిదాకా ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధిస్తామనే నగ్న సత్యాన్ని ఈ కథలు బోధిస్తున్నాయి.

ఇలా తెలుగు జానపద కథల్లో ప్రతీకాత్మత కథలు వినోదాన్నే కాక, విజ్ఞానాన్ని అందిస్తాయనడంలో అతి శయోక్తి లేదు. కథలను విశ్లేషించినందువల్ల కథలలో దాగి ఉన్న మానవ ఆంతరంగిక మనస్తత్వాన్ని వెలికి తీయొచ్చు. సమాజంలో ఎలాంటి పరిస్థితుల్లో జీవిస్తున్న ప్రజలు ఎటువంటి కథల్ని చెప్పుకుంటున్నారో విశ్లేషించ వచ్చు. వాళ్ళ ఆశలు, ఆశయాలు ఏవిటో స్పష్టంగా గ్రహిం చవచ్చు. సామాన్య మానవుడి ఆశలు, ఆశయాలు, కోరికలు, అవి తీరకపోతే అతను పడే అంతర్గత సంఘర్షణ, వీటన్నిటి ఫలితాలు వాళ్ళు చెప్పుకునే జానపద కథల్లో కనిపిస్తాయి. జానాబెత్తే శాస్త్రం, పిచ్చుక - ముక్కులో ముల్లు వంటి ప్రతీకాత్మక కథలు కూడా సమాజంలో నిరాదరణకు గురౌతున్న వర్గాల వారి ఆలోచనారీతిని తెలియ జేస్తున్నాయి.

ఇట్లాంటి అపురూపమైన కథలు ప్రపంచీకరణ నేపథ్యంలో మనకళ్ళ ముందే కనుమరుగవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి అపురూప జానపద కథలను సేకరించి అధ్యయనం చేయడం, ప్రోత్స హించడం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. కృష్ణకుమారి, నాయని - జానపద గేయ గాథలు, తెలుగు అకాడమీ - హైదరాబాదు.
2. బాలస్వామి, బుక్కా - మహబూబ్‌నగర్ జిల్లా - జానపద కథలు, తెలుగు పరిశోధన ప్రచురణ, గాంధీనగర్, హైదరాబాదు.

3. శ్రీనివాసులురెడ్డి పేట - తిరుపతి గంగజాతర, రుషితేజ పబ్లికేషన్స్, తిరుపతి - 1996
4. సుందరం, ఆర్వీయస్ - ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.
5. వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి - సిగ్మండ్ ఫ్రాయిడ్, తెలుగు అకాడమీ - 1993
6. Thompson stith - The Folk Tale Newyork - 1951
7. Usha Namboodripad - Psycho Analitical Theory, Fossils Material

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కొండరెడ్డి గిరిజనుల – పండుగలు

– డా॥. కపిల భారతి, తెలుగు అధ్యాపకురాలు, పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల, వడ్డేపల్లి, వరంగల్లు.

మానవజాతి పరిణామంలో గిరిజనులు, జానపదులు, అభివృద్ధి చెందిన మానవులు అనే దశలు కనిపిస్తాయి. ఆదిమానవుడు ఆటవిక జీవనాన్ని కొండగుహల్లో, చెట్టు తొర్రల్లో గడిపినాడు. అతను మృగాల మధ్య నివసిస్తూ వాటిని చంపితింటూ జీవనం సాగించి క్రమంగా ఒక స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని పంటల్ని పండిస్తూ నలుగురితో కలిసిమెలిసి జీవనం సాగిస్తూ జానపదుడుగా పిలవబడుతున్నాడు. సాంఘీకంగా సాంస్కృతికంగా అభివృద్ధి సాధించి నాగరికతను ఏర్పరుచుకొని నాగరికుడిగా పిలిపించుకుంటున్నాడు. ఈ క్రమాన్ని నాయని కృష్ణ కుమారి గారు అతను (గిరిజనుడు) సంస్కృతి పథంలో పయనించిన ప్రస్తావనాన్ని మూడు దశలుగా విభజించారు.

1) ఆటవిక దశ 2) మోటు దశ 3) నాగరికత దశ

గిరిజనులకు పర్యాయపరంగా ఆటవికులు, వనచరులు, ఆదివాసులనే పదాలు మనకు కనిపిస్తాయి. భారతదేశంలో 461 గిరిజన జాతులు నివసిస్తున్నాయి. అందు తెలంగాణలో 12 గిరిజన జాతులు ఉన్నాయి. ఇందు ప్రతి తెగ కూడా తమదైన ప్రత్యేక జీవన విధానాన్ని కలిగి ఉన్నాయి. అవి గోండు, కోలామ్, ప్రధాన్ / పర్ధాన్, అంధ్, తోటి, చెంచు, కోయ, నాయకపోడు, ఎరుకల, భిల్లు, లంబాడీ, మరియు కొండరెడ్డి.

కొండరెడ్డి గిరిజనులు తూర్పు కనుమల మధ్య ప్రవహించే గోదావరికి ఇరువైపుల ఉన్న కొండల మీద మరియు గోదావరి ఒడ్డు వెంబడి అడవి సరిహద్దు ప్రాంతాలలో దట్టమైన అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అంటే తూర్పు, పశ్చిమ గోదావరి మరియు కొత్తగూడెం భద్రాద్రి జిల్లాల్లో. అతివేగంగా అంతరిపోతున్న గిరిజన తెగలలో ఇదిఒకటి. కొండరెడ్లు పోడు పద్ధతిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే పోడు వ్యవసాయం కంటే అటవీ ఫలసాయం, చేపలవేట, నిత్యం అటవీ వేటలో దొరికే ఆహారం పైననే వీరి జీవనాధారం అధికం.

కొండరెడ్లు తాము నివసిస్తున్న భూమి తమ హక్కుగా భావిస్తారు. వీరిలో సమిష్టి తత్వం ఎక్కువ అది ఆచార సంప్రదాయాల్లో వీరు చేసుకునే పండుగ సమయంలో కనబడుతుంది. అందరిని చల్లగా చూసేది నేల తల్లేనని వీరి విశ్వాసం, అందుకే ప్రతి పండుగను దేవతను భక్తి శ్రద్ధలతో చేస్తారు, కొలుస్తారు.

కొండరెడ్డి పండుగలన్నీ దాదాపుగా వ్యవసాయానికి సంబంధించినవే, దాదాపు పండుగలన్నీ పంట పొలాల దగ్గర, పోడుపాక దగ్గరే చేసుకుంటారు. వీరు జరుపుకునే ముఖ్యమైన పండుగలు భూదేవి పండుగ, పచ్చపండుగ, కొర్రికొత్త, సొప్ప పండగ, లక్ష్మీదేవి పండుగ, పిండి పండుగ, ఎడ్ల పండుగ, మామిడికాయ పండుగ, మామిడి టెంకల పండుగ, పొట్ట పరువు పండుగ బుడమకాయ పండుగ, కొండ దయ్యాల పండుగ వీటితో పాటు ప్రతి గ్రామంలో గల గ్రామ దేవత పేరు మీద గ్రామ దేవత పండుగ, ఈ గ్రామ దేవతగా ముత్యాలమ్మ, సరళమ్మ, మైసమ్మ, గంగాళమ్మ ఇలా ఒక్కొక్క గ్రామానికి ఒక్కొక్క దేవత ఉంటుంది. ఆయా గ్రామం వారు ఆ దేవతలకు "మే" నెలలో ఏదైనా సోమ, మంగళ, బుధ మూడు రోజులు ఉత్సవం చేస్తారు.

భూదేవి పండుగ :

భూదేవి పండుగ పోడు వ్యవసాయం చేసే భూమి వద్దనే చేస్తారు. ఆ ప్రాంతంలో ఉన్న నేరేడు లేక మామిడి లేదా వేప మరే చెట్టు నైనా భూదేవిగా అలంకరిస్తారు. ఆ చెట్టు చుట్టూ శుభ్రపరిచి ఆవు పేడతో అలికి సామ

పిండితో ముగ్గులు వేసి చెట్టుకు చుట్టు పసుపు రాసి కుంకుమ బొట్టు పెడతారు. చెట్టు ముందు అడ్డాకులో అన్నం, మినప్పప్పు కూర నైవేద్యంగా పెట్టి పందిని బలి ఇస్తారు. తర్వాత తమ పంటలు బాగా పండాలని ఇంట్లో వాళ్ళందరు బాగుండాలని కోరుకుంటారు. అక్కడే వంట చేసుకొని తింటారు.

పచ్చపండుగ :

కొండరెడ్లు పైరు పచ్చగా కనబడే సమయానికి పచ్చ పండుగ చేస్తారు. ఈరోజు పైరును కాపాడే గట్టు కాపరి దేవతకు నైవేద్యం పెడతారు. పచ్చ పండుగ కుటుంబ పరంగా వెజ్జుతో కలిసి పోడు వ్యవసాయపు పైరు దగ్గర చేస్తారు. వెజ్జును అడిగి పండుగ చేసే రోజు నిర్ణయించు కుంటారు. వెజ్జు పైరును చూసి పండుగ రోజు చెబుతారు. ఉదయాన్నే ఇంట్లో వాళ్ళందరు కుటుంబవారంతా వెజ్జుతో సహా వంట సామాగ్రితో పాలం - పైరు దగ్గరికి వెళ్తారు. అక్కడ వంట చేసి పైరును కాపాడే దేవత అయిన గట్టు కాపరి దేవతకు చెట్టు దగ్గర అలికి అలంకరించి నైవేద్యం పెడతారు. కొందు పాలం దగ్గర కోళ్ళు కోసుకుంటారు. ఈ దేవత పైరును చీడపీడల నుండి కాపాడుతుందని విశ్వసిస్తారు.

కొర్రకొత్త :

కొండరెడ్లు పండించే కొర్రలు గానీ, సామలు గాని, జొన్నపొత్తులు గానీ పంట చేతికి వచ్చిందనే సమాయానికి ఒక మంచి రోజు నిర్ణయించుకొని ఎవరి ఇంటి వద్ద వారు ఈ పండుగను చేసుకుంటారు. ఏ పంట వస్తే ఆ పండుగ చేసుకున్న తరువాతనే దానిని ఆహారంగా తీసుకుంటారు.

ఇంట్లో ఉండే దేవుని దిమ్మె లేదా ఇంటి ఈశాన్య గోడకు ఆవు పేడతో అలికి సామపిండితో నక్షత్రాలు ఐదు, ఏడు, తొమ్మిది ఇలా బేసి సంఖ్యలో ముగ్గు వేసి కుంకుమ పసుపు చల్లుతారు.

కొర్రలు / జొన్నపొత్తు, సామలతో నైవేద్యం వండి దేవతకు పెడుతారు. జొన్నపొత్తులను కాల్చి లేదా ఉడకపెట్టి కూడా నైవేద్యంగా పెడుతారు. దీనితో పాటు అన్నం, పప్పు కూరలను నైవేద్యంగా పెడుతారు. నైవేద్యంగా మిగిలిన వాటిని ఇంట్లో పెద్దవారికి పెడు తారు. ఈరోజు ఉపవాసంతో ఉండి నైవేద్యం పెడుతారు.

రెండవ రోజు ఇంటి యజమానురాలు ఉదయమే స్నానం చేసి దేవుడి దగ్గర పెట్టిన నైవేద్యాలను పచ్చని చెట్టు కింద వేస్తారు. ఇలా వీరు పండించే ఏ పంటలకైనా పండుగ చేసిన తరువాతనే తింటారు. ఒకవేళ పండుగ చేయకుండా తింటే జబ్బు చేస్తుందని బలమైన విశ్వాసం వీరిలో ఉంది.

లక్ష్మీదేవి పండుగ :

లక్ష్మీదేవి పండుగను 'మే' నెలలో ఏదైనా బుధవారం రోజు చేయాలని గ్రామ పెద్దలందరు కలిసి నిర్ణయించు కుంటారు. ఈ పండుగను పోడు వ్యవసాయం చేసే భూమి దగ్గర చేస్తారు. ముందుగా పోడు చేయాలనుకొనే భూమిలో లక్ష్మీదేవి పండుగ చేసిన తరువాతనే పోడు ప్రారంభిస్తారు.

పండుగ చేసే ప్రదేశంలో గజం పొడవు వెడల్పుతో శుభ్రం చేసి, ఆవు పేడతో అలికి దానిమీద సామపిండితో పూజారి ముగ్గు వేస్తారు. ఇంటి నుండి రాగులు కొబ్బరి కాయ వేపిన శనగపప్పు, బియ్యం, మినప్పప్పు వంటివి తీసుకువస్తారు. అలికినచోట రాయిని కడిగి పసుపు కుంకుమలు, తూర్పు వైపు చూపు ఉండేటట్లు నిలబడి అలంకరిస్తారు. దీనిని లక్ష్మీదేవిగా భావించి పోడు బాగా జరుగాలని మొక్కుకొని కొబ్బరికాయ కొడుతారు. లక్ష్మీదేవి ప్రతిమ ముందు కొద్దిగా తవ్వి రాగులు చల్లుతారు వంట చేసుకొని అక్కడే కుటుంబంలోని వారందరు తిని తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్ళుతారు. ఈ పండుగను ఎవరి పోడు దగ్గరే వారు చేసుకుంటారు.

పిండి పండుగ :

పిండి పండుగ సోమవారం నాడు చేసుకుంటారు. సంక్రాంతి పండుగ సోమవారం ఐతే ఆ రోజు లేదా సంక్రాంతి వెళ్ళిన సోమవారం రోజు పండుగ చేస్తారు. ఈ

రోజు ఇల్లును అవుపేడతో అలికి నక్షత్రపు ఆకారంలో ముగ్గులు పెడుతారు. సోడిపిండితో రొట్టెలు చేసి వాటిని దేవతలకు నైవేద్యం పెట్టి పిల్లలకు పెట్టకుండా వండిన వారే తింటారు. లేదా పండుగ చేసిన వెజ్జుకైన ఇస్తారు. పిండి పండుగ తెల్లవారి చిక్కుడికాయ పండుగ దీనినే 'పప్పు పండుగ' అంటారు. ముందు రోజు కొత్త మినుములు గానీ కందులుగానీ తయారు చేసు కుంటారు. పండుగరోజు అన్నం, కందిపప్పు, మినప్పప్పు, చిక్కుడు కాయ వంటి అడ్డాకుల్లో నైవేద్యం పెడుతారు. అయితే ఈ పప్పు పండుగ చేసే వరకు కందులు, మినుములు వండడం నిషిద్ధం. ఒకవేళ పండుగ చేయ కుండా తింటే జబ్బులు వస్తాయని నమ్మకం.

ఎడ్ల పండుగ :

ఉదయమే ఇంటిల్లోని వారందరు తలస్నానం చేస్తారు. మగవారు అడవికి వెళ్ళి నేరేడు కర్రలు, పాల ఆకులను తీసుకువచ్చి ఇంటి గుమ్మం ముందర చిన్న పందిరి వేస్తారు.ఆ పందిరికింద అవుపేడతో అలికి నక్షత్రపు ఆకారంలో ముగ్గులు వేస్తారు. వారి వారి పశువులను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలతో బొట్టు పెడుతారు. రాగి కుడుములను తయారు చేసి అడ్డాకు నారతో దండ కుచ్చి పశువుల మెడలో వేస్తారు. పందిరిలో అడ్డాకుల్లో అన్నం, పప్పు రాగి కుడుములు చేసి నైవేద్యంగా పెడు తారు. కడిగిని బియ్యం అడ్డాకుల్లో పోసి కోడిని పట్టుకొని బియ్యాన్ని తినిపించి ఆ తరువాత కోడిని బలి ఇస్తారు. అందరు దండం పెడుతూ పశువులు బాగుండలని కోరు కుంటారు. నైవేద్యంగా పెట్టిన అన్నం, పప్పు, రాగి కుడుములను పశువులకు తినిపించి వాటిని అడవికి తోలుతారు. ఆ రోజు నుండి పశువులకు కాపు ఉండదు. మళ్ళీ వర్షాలు పడే సమయంలో ఇంటికి తోలుకు వస్తారు. తెల్లవారి పందిరిని, కర్రలను ఆకులను తీసి పారే నీటిలో కలుపుతారు.

మామిడికాయ పండుగ :

కొండరెడ్లకు అత్యంత ముఖ్యమైన పండుగల్లో మామిడికాయ పండుగ ఒకటి. వీరు నివసించే ప్రాంతాలు సహజంగా దట్టమైన అడవులు, కొండలు, ఆ కొండల మధ్య ఉండే లోయల్లో లంకలలో కొండమామిడి చెట్లు ఎక్కువగా ఉంటాయి. అందువలన మామిడి పండ్లు విస్తృతంగా లభిస్తాయి. కొండరెడ్లు మామిడి పండ్లను బాగా ఇష్టపడతారు. మామిడి కాయ పండుగ చేసే వరకు కనీసం ఆ చెట్టు కింద కూర్చొని తినడం, త్రాగడం లాంటివి చేయరు. అలా తిన్నప్పుడు పూతగానీ, పిందెగాని పడు తుందని భయం.

మామిడి కాయ ముదిరిన తరువాత సుమారుగా మార్చి నెలలో ఏదో ఒక రోజున గ్రామ పెద్దలందరు కూర్చొని పండుగ చేసే రోజు నిర్ణయించుకుంటారు. పండుగ రోజు ఉదయమే ఇల్లును ఎర్రమట్టి, అవు పేడతో అలికి ముగ్గులు పెడుతారు. ఇంటి వాళ్ళంతా తలంటుస్నానం చేసి మామిడి చెట్టు నుండి ఐదు కాయలు తెచ్చి 'గొంది' (పూజకు) పెట్టి అన్నం, అనప పప్పులతో మామిడి కాయ వేసి నైవేద్యం వండుతారు. దీనిని అడ్డాకుల్లో పెడుతారు. ఇప్పటి నుండి మామిడి కాయలు తినడం ప్రారంభిస్తారు. ఈ పండుగకు చుట్టు ప్రక్కల గ్రామాలలో ఉన్న బంధువులను పిలుచు కుంటారు. బంధువులతో భోజనాల అనంతరం ఆడా, మగా తేడా లేకుండా నృత్యాలు చేస్తారు. ప్రతి ఒక్కరు జీలుగు కల్లు త్రాగుతారు. వీరికి ఇది ప్రీతి పాత్రమైనది. పండుగ రోజు సాయంత్రం అందరు ఒక చోటుకు వచ్చి ఆటలు ఆడుతారు. పురుషులు కొయ్యడోళ్ళు, డొజం, స్త్రీలు, గిల్లలు లేదా దామ గుత్తులు (అడవిలో లభించే గొట్టికాయలతో తయారు చేస్తారు) వంటి వాటితో నృత్యం చేస్తారు. ఈ పండుగ రోజు చేసే నృత్యాన్ని మామిడి కాయ నృత్యం అంటారు.

మామిడి టెంకల పండుగ :

మామిడి పండ్లు వచ్చిన తర్వాత ఆ టెంకలతో (పిక్కలతో) ఈ పండుగను ఏ ఇంటి వారు ఆ ఇంటి వారు జరుపుకుంటారు. మామిడి పండ్ల తర్వాత

టెంకలన్నింటిని కుప్పగా పోస్తారు. పండుగకు పది రోజుల ముందు టెంకలను పగులగొట్టి అందులో ఉండే పప్పును బయటకు తీసి ఒక వెదురు బుట్టలో అడ్డాకులు వేసి మామిడి టెంకల పప్పు పోసి దీని మీద అడ్డాకులు కప్పు తారు. రెండు రోజుల తర్వాత ఆ పప్పు నల్లగా మారు తుంది. దాన్ని తీసుకొని రోట్లో పోసి బాగా దంచి దీనిని జల్లెడతో జల్లిస్తారు. దీని ద్వారా వచ్చిన పిండి వెదురు బుట్టలో పోసి దాని మీద నేపాల చెట్టు ఆకులతో గట్టిగా అదిమి దానిన పారే కాలువలో వారం రోజుల పాటు ఉ ంచుతారు. దీని ద్వారా అందులో ఉండే జిడి ప్రభావం తగ్గిపోతుంది. ఆ పిండి బుట్టను తీసి పిండిని ఎండ బోస్తారు. దానితో రొట్టెలు జావ తయారు చేస్తారు. బుధ వారం రోజున మామిడి టెంకల పిండితో జావ, రొట్టెలు చేసి నైవేద్యంగా పెట్టడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశ్యం.

పొట్ట సరువు పండుగ :

కొండరెడ్లు ఈ పండుగను జొన్న, సజ్జ, రాగులు వంటి పంటలు పొట్టకు వచ్చినపుడు గింజ పట్టుటకు ముందు దశలో చేస్తారు. వేసిన కంకిలోని గింజలన్నీ కూడా గట్టిగా ఉండాలని, పంట ఎక్కువ మొత్తంలో చేతికి రావాలని 'తాలు గింజ' కాకూడదనే భావనతో ఈ పండుగ చేస్తారు. దీనిని వ్యక్తిగతంగా జరుపుకుంటారు. ఎవరి పంట పొట్టదశలో ఉంటుందో ఆ పొలం యజమాని ఆ పండుగ చేసే రోజు పొద్దున నుండి ఉపవాసం ఉండి మధ్యాహ్నం సమయంలో చేలో బడ్డి దగ్గర గాని, చెట్టు వద్ద గాని పెద్ద పెద్ద రాళ్ళు ఉంటే ఆ రాయి వద్ద గాని అలికి ముగ్గు వేసి రాయిని పెట్టి దాన్ని అమ్మవారిగా భావించి పసుపు, కుంకుమ, (సోడిపిండిలతో) అలంకరించి (పూలు అంత ముఖ్యం కాదు) ఉంటే కోడి పిల్ల కోస్తారు. లేకపోతే కొబ్బరికాయ కొట్టి అక్కడే అన్నం వండి అన్నం నైవేద్యం పెడ్తాడు. యజమాని అతని కుటుంబం అక్కడే భోజన చేస్తారు.

బుడమకాయ పండుగ :

కొండరెడ్లు అక్టోబర్, నవంబర్ నెలలో వచ్చే ఆహారపు కొరత ఎదుర్కొనేందుకు బుడమకాయ తీగెలను పోడు వ్యవసాయపు పంటలో వేస్తారు. బుడమకాయలు పెద్దవి అయిన తర్వాత ఈ పండుగ చేస్తారు. ఇది వ్యక్తిగతంగా చేసుకునే పండుగ. ఎవరి పొలంలో వారు చేసుకుంటారు. కొందరు ఈ పండుగను ఇంటి వద్ద చేసుకుంటే కొందరు పొలంలో చేసుకుంటారు. ఎక్కడ చేసుకున్నా ఆ రోజు ఆ ఇంటి యజమాని యజమానురాలు ఉపవాసం ఉండి ఇంటి దగ్గర చేసే వారైతే ఇంటి వద్ద ఈశాన్యం మూలలో గోడకు అలికి సోడిపిండితో ముగ్గు వేసి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. బుడమకాయలు యజ మాని కోసుకొని వస్తే ఆ కాయలతో పెసరపప్పుతో గాని మినప్పప్పుతో గాని, చిక్కుడు పప్పుతో అని కలిపి వండు తారు. కొన్నింటిని పచ్చి కాయలు గానే కోసి నైవేద్యం పెడ్తారు. దేవరకు నైవేద్యం పెట్టిన తర్వాత యజమాని, యజమానురాలు అన్నం తింటారు. బుడమకాయ పండుగ చేసుకున్నవారే వారు పెట్టే నైవేద్యం తింటారు. లేనివారు తినరు. ఎవరైనా ఏదైనా తినాలంటే వారు ఆ కాయగూర ఆ ఆకు కూర పేరు మీద చేసుకునే పండుగ చేసుకుంటేనే తింటారు.

కొండ దయ్యాల పండుగ :

కొండరెడ్లు అడవిలో ఉన్న దయ్యాలను శాంతింప జేయుటకు మరియు వీరికి ఎటువంటి ఆపద రాకుండా ఉండేందుకు కొండ దయ్యాలను పూజిస్తారు. కొండరెడ్లు ప్రకృతిని పంటలను, దేవతలుగా ఏ విధంగా పూజిస్తారో దయ్యాలను కూడా పూజించడం వీరిలోనే ఉండే ఆచారం.

కొండ దయ్యాల పండుగను గూడెంలో ఉన్న కొండ రెడ్లంత కలిసి ఉమ్మడిగా చేసుకుంటారు. పండుగ గ్రామ పూజారి ఇంటి ముందు చేస్తారు. ప్రతి ఇంటివాళ్ళు ఇంటిని అలంకరించుకొని తలస్నానాలు చేసి ప్రతి ఇంటి నుండి వంటకు కావలసిన సరుకులు తీసుకవెళ్తారు. ఈ పండుగను వెజ్జు చేస్తారు. అందరు తెచ్చిన వంట సరుకు లతో వెజ్జు అన్నం పప్పుచారు వండుతారు. ఒక రాయికి

పసుపు, కుంకుమ రాసి దాని ముందు అలికి ముగ్గు వేసి అన్నం, పప్పు చారును రెండు అడ్డాకులో నైవేద్యంగా పెడుతాడు. వెజ్జు మరో అడ్డాకులో నూకలు పెట్టి ఎర్ర కోడి చేత తినిపిస్తాడు. అక్కడికి వచ్చిన వారందరు దేవతకు మొక్కుకుంటారు. కోడిని అక్కడే కోసి వంట చేసుకొని అందరు కలిసి అక్కడే తింటారు ఈ రోజు ఊళ్ళో ఇంట్లో ఎవరు వంట చేయరు. ఈ పండుగ చేయడం వల్ల వీరు అడవుల్లో తిరుగుతున్నపుడు దయ్యాలు పట్టకుండా కొండ దేవతలు కాపాడుతారని వారి నమ్మకం. కొండరెడ్లు వారు జరుపుకునే పండుగలన్నీ పంటలను పూజించిన తరువాతనే ఆహారంగా తీసుకోవడమనేది కఠిన నియమంగా భావిస్తారు. వారు ప్రతి పండుగలో ప్రకృతిని పూజించడం కనబడుతుంది. వీరికి జీవనాధారం అయిన అడవిని అడవిలో ఉండే భూదేవిని, గట్టు కాపరిని, తమ పంటలను, దయ్యాలను పూజించి తమకు ఏ ఆటంకం రాకుండా చూడాలనేది వీరి పండుగల ముఖ్యోద్దేశం....

ఉపయుక్తగ్రంథ సూచి :

1) గిరిజనుడు - డా. నాయిని కృష్ణకుమారి
2) కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం - భాషా సాహిత్యాంశాలు - డా. కపిల భారతి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కోనార్ల పౌరాణిక కథాగేయంలో నారదపాత్ర

– డా॥. వి.కె.టి. మహాలక్ష్మి, సహాయ ఆచార్యులు, శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యలమంచిలి.

నారదుని పేరు తెలుగువారికి సుపరిచితం. ఆ పేరు వింటే చాలు హాస్యప్రియుల మోముపై నవ్వులు విరబూస్తాయి. పౌరాణిక గాథల్లో నారదపాత్రకు ఒక ప్రత్యేకత ఉంది. త్రిలోక సంచారియైన నారదుడు కలహ ప్రియుడు. వ్యక్తులమధ్య కలహాలు కల్పించి ఆనందించే నైజం కలవాడు. సాధారణంగా నారదుడు పెట్టిన తగవులు లోకకళ్యాణ కారకాలు కావటం విశేషం. జానపదులకు నారదుని పాత్ర ఉన్న కథలపై మక్కువ ఎక్కువ. జానపదులు నారదపాత్ర ఉన్న కథ వింటూ తగవుల మారి అంటూ మురిసిపోవటం కద్దు.

శిష్ట సాహిత్యానికి సమాంతరంగా జానపద సాహిత్యం సృష్టించబడింది. ముఖ్యంగా భారత, భాగవత, రామాయణాలలో తమకు నచ్చిన ఘట్టాలను తమదైన భాషలో, యాసలో తిరిగి సృష్టించుకోవటం జానపదులకు పరిపాటి. జానపద సాహిత్యంలో తర్కానికి చోటుండదు. మూల కథకు భంగం కలగకుండా కథను నడిపిస్తూనే, కొత్త పాత్రలను చేర్చడం, కథను అటూ ఇటూ మార్చడం, తమకు నచ్చినట్టుగా సన్నివేశాలను కల్పించుకోవటం జానపద సాహిత్యంలో గమనించదగ్గ అంశం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నం జిల్లా, చోడవరం ప్రాంత పరిసరాల్లో నివసించే ''గొల్లల్ని'' ''కోనార్లు'' అంటారు. (సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'కోన' అన్న పదానికి 'గోసమూహం' అనే అర్థం కూడా ఉంది.) కృష్ణుడిని తమ కులదైవంగా భావించే వీరు కృష్ణుడికి సంబంధించిన అనేక గేయాలను గానం చేస్తుంటారు.

పోతన విరచిత భాగవతంలో నారదుడు కంసుని వద్దకు వెళ్లి దేవికీ వసుదేవులు, యాదువులు మొదలగు వారు సురులు గాని నిజంగా నరులు కాదని తెలియ జేస్తాడు.

''ఒకనాడు నారదుండొయ్యన కంసుని యింటికి జనుదెంచి యేకతమున''

కోనార్ల జానపద కథాగేయంలో నారదుడు ఎరుకతలా మారి కంసుడి మదమణిచేవాడు నీ గర్భాన జన్మిస్తాడని దేవకీదేవికి సోది చెబుతాడు.

నారదుడు స్త్రీ రూపం దాల్చిన గాథ దేవీభాగవతంలో ఉన్నట్టు ''పూర్వ గాథాలహరి''లో పేర్కొనబడింది.

''నారదుడు తనకు విష్ణుమాయను తెలియజేయ మనగా, విష్ణువు సరేనని నారదుని ఒక కొలనులో మునిగి రమ్మంటాడు. ఆ కొలనులో మునగగానే అతడు స్త్రీగా మారతాడు. స్త్రీగా మారిన నారదుడిని తాళధ్వజుడనే రాజు వివాహం చేసుకుంటాడు. ఆమెకు పుత్రులు కలుగుతారు. శత్రురాజుల చేతిలో పుత్రులు మరణించగా ఆమె మిక్కిలి దుఃఖిస్తుంది. శ్రీకృష్ణుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి ఓ కొలనులో స్నానం చేసి రమ్మంటాడు. ఆమెకు పూర్వరూపం, పూర్వ స్మృతి లభిస్తుంది. ఇలా నారదుడు విష్ణుమాయను అవగతం చేసుకుంటాడు.

ఇదే కథ చిన్న చిన్న మార్పులతో ఒక స్థల పురాణంలో కూడా ఉంది.

18వ శతాబ్దికి చెందిన తెలుగు కవయిత్రి తరిగొండ వెంగమాంబ రచించిన ''శ్రీ వేంకటాచల మహత్యం''లో సాక్షాత్తు శ్రీనివాసుడే ఎరుకలసాని వేషం ధరించి పద్మావతిని శ్రీనివాసుడు వివాహం చేసుకుంటాడని సోది చెబుతాడు.

కోనార్లు కల్పించిన ఈ కథాగేయంలో నారదుడు తనకు ఆడదాని రూపు అబ్బదని ఎంత మొత్తుకుంటున్నా వినకుండా దేవతలు అతడిని బావిలో ముంచి స్త్రీరూపు తెప్పిస్తారు.

"హరిహర నారాయణ - ఆదినారాయణ
కరుణించి మమ్మేలు కమలలోచనుడా
మానవ శరీరము ఇది మంచి తంత్రము
మాటిమాటికి నిన్ను మన్నింపలేము తండ్రి"

ఇలా మొదలయ్యే ఈ కథా గేయంలో మొదట కంసుడు ఎంత దుర్మార్గుడో చెబుతారు. వీరినోట 'కంస రాజు' 'కమురాజు'గా మారాడు.

"పాపిష్టి కమురాజు వాడుపాడుకానోడు
పాము పడగల మింద అడుగులేసేడు
పుట్టిన బాలల్ని పట్టి చంపుతున్నాడు
పరువైన భూదేవి భరియింపలేక
ధర యందుని పొర్లాడి ఏడుస్తున్నాది."

భూదేవి ఏడుపుకి దేవతలు కంగారుపడ్డారు. నీకేమి తెలుసు, నీకేమి తెలుసని ఆదినారాయణుడు అందర్నీ అడిగి, నారదుడైతే సరిగ్గా చెప్పగలడని అతడిని పిలిచారు.

"కెవ్వున కేకేసి కోకనాదముచేసి
రమ్మని పిలిచేరు వారు దేవతలు
ఎందుకో మమ్మేలు సెలవలానాయని
మడమలెత్తుకుని మరిలగువు నొచ్చాడు
వలపల ఒడినిచేరి వందనం చేసినాడు
దాపల ఒడినిచేరి దండాలు పెట్టినాడు
మనవి మనవియంటు ముందు నిల్చున్నాడు నారద
మునీంద్రుడు"

అలా నమస్కరించి నిలుచున్న నారదుడిని అమ్మ ఏడుపుకు కారణమేమిటని ఆదినారాయణుడు అడిగాడు. అప్పుడు నారదుడు ఇలా వివరించాడు.

"పాపిష్టి కమురాజు వాడుపాడుకానోడు
పుట్టినా బాలల్ని పట్టి చంపుతున్నాడు
పాపమెక్కువాయెను - పున్నెముతక్కువాయెను
అందుకే అమ్మేడ్చెను"

అప్పుడు దీనికి ఏమి దారని దేవతలందరూ ఆలోచించి నారదుడిని ఇలా అడిగారు.

"నారదా నువ్వు ఆడదాని వేషం వెయ్యాలని
దేవతలు అడిగారు నారదమునీంద్రస్వామిని
ముందు వేషమువేసి మోసపోయినాను
ఆడదాని వేషము నాకబ్బదయ్యా" అన్నాడు నారదుడు.

పడుచోడు నారదుడు పారిపోతాడని
పరిగెట్టి దేవతలు వాడికడ రెక్కందుకున్నారు.
తీసుకొచ్చి నారదుడిని బావిలో ముంచారు.
బావి ముంచిన నారదుడు భామరూపొచ్చాడు
భామరూపై బయటకొచ్చినవాడు
సిగ్గు సిగ్గంటు చీరలడిగినాడు
లజ్జ లజ్జంటు నగలడిగినాడు
ఆభరణాలమరించారు వారు దేవతలు
కోనేరు ఒడ్డునె కోదాడి పుట్టింది
కోదాడి దొక రేకు కోసితెచ్చారు
ఎండలో నారేకు ఎండేసినారు
మంచులో నారేకు మాగేసినారు
నీటిలో నారేకు నానేసినారు
బంగారు కత్తులతో బద్దలుగ చేసినారు
బుధవారం రోజు భూమి కుదురుగ తవ్వి
బుట్ట మొదలేసేరు
మంగళవారం రోజు మట్టు మొదలేసేరు
ఆదివారం నాడు అంచేర్పడింది
ముత్యాల తనబుట్ట ముగుదలల్లేరు
పగడాల తనబుట్ట పడతులల్లేరు
వజ్రాల తనబుట్ట వనితలల్లేరు
ఆ ఉన్న ఆ రేకులు మీద నల్లేరు
ఆ ఉన్న ఆరేకులు గిలకలల్లేరు

ఆ బుట్టనెత్తిన పెట్టుకుని, చంకన ఒక బిడ్డతో స్త్రీయైన నారదుడు సోది చెప్పటానికి వెళ్ళాడు.

"నెత్తి నెరకలబుట్ట నెలవంక తన చుట్ట, చిత్తారి
చూపులతో బిడ్డనొక చంకేసుకుని
వీధి వీధులంట సోదిసోదంటు కేకలేసింది, రాచయ్య
వీధిలో ఓ రంభలారా

రండమ్మ సుంగారము ఎరుక చెప్పుదును, నేనెరుక చెప్పిన ఏడు గడియలకి
అడ్డాలలోనా బాల ఆడినట్టుగును, గొల్లయ్య వీధిలో ఓ గొందులారా
రండమ్మ సుంగారము ఎరుక చెప్పుదును, నేనెరుక చెప్పిన ఏడు గడియలకి
ఉయ్యాలలోనా బాల ఊగినట్టగును, బాపన వీధిలో ఓ భామలారా
రండమ్మ సుంగారము ఎరుక చెప్పెదను, సోది సోదంటూ ఏసినా కేకలు
మేడమింద దేవకీ మేలాలకించెను, ఊపొద్దు దాదులారా - ఊపు చాలించండి
పట్టుకుని ఎరుకతని పట్నంలోని, మెల్లిగా మనమేడకి తీసుకుని రండి
అడ్డుకుని ఎరుకతని అంగళ్ళలోన, మెల్లిగా మనమేడకి తీసుకుని రండి

ఈ విధంగా దేవకి ఎరుకతని తీసుకుని రమ్మని దాదుల్ని పంపగా, దాదులు వెళ్లి ఎరుకతను రమ్మని పిలిచారు. అప్పుడు ఎరుకతకు - దాదులకు ఈ విధంగా సంభాషణ జరిగింది.

"మీరాచ వీధిలో కుక్కలుంటాయి, నేను రాను పొండర్ర ఓ దాదులారా
కుక్కలే లేవమ్మ ఏటకెళ్ళాయి, రావమ్మ ఎరుకత రమణి మేడలకు
మీ రాచవీధుల్లో రాజులుంటారు, నేను రాను పొండర్ర ఓ దాదులారా
రాజులే లేరమ్మ రచ్చకెళ్ళేరు, రావమ్మ ఎరుకత రమణి మేడలకు
మీ రాచవీధుల్లో పాములుంటాయి, నేను రాను పొండర్ర ఓ దాదులారా!
పాములే లేవమ్మ పుట్టకెళ్ళాయి, రావమ్మ ఎరుకత రమణి మేడలకు

ఇలా దాదులు ఎరుకతకు నచ్చచెప్పి దేవకి వద్దకు తీసుకొచ్చారు. అప్పుడు దేవకికి ఎరుకతకి మధ్య జరిగిన సంభాషణ

"ఎరుకతకి పడిపీట - తనకు ముక్కాలి పీట, ఎదురుగా కూర్చుని ఎడంచెయ్యి ఇచ్చింది దేవకీ
చెయ్యి చూడనేముందమ్మ చెప్పనేముందమ్మా, అమ్మ నీ గర్భమున బాలుడుడతాడు
అలమామ కమురాజు పొంకమడప నందుకు, ఇక్కడితో ఈసోది ఇకనాపు ఎరుకతాచేడీ
ఇక్కడన్నమాట ఈదిలోనంటే, నీ శిరసు నా శిరసుకొట్టి కమురాజు
కోటగుమ్మాన కట్టుకుంటాడు, ఏగులేస్తే వెయ్యినూరు ఎరుకలొస్తారుగాని
ఇంత చక్కని ఎరుకను ఎపుడు చూడలేదు, ఏ ఊరు ఏ పల్లె ఎరుకుల చేడీ!
మా ఊరు పేరు వృత్తాంతము చెబుతానమ్మా, గోదారి ఒడ్డున గుడిసెలు మాయమ్మ
ఇసుక దిబ్బల మీద ఇల్లులే మాయమ్మ, మాడుగుల పర్వతాలు - మాము తిరుగు పల్లెలు
కులము చెంచునాయుడు కూతుర్నమ్మా, కోన చెంచునాయుడు కోడల్నమ్మా
ఆది చెంచునాయుడు ఆలినమ్మా, మల్ల చెంచునాయుడు మరదల్నమ్మా

అప్పుడు దేవకీ ఎరుకతకు ధనమిచ్చి సాగనంపింది.

కొలక కుంచెడు ధనము కొంగు పోసింది, కొలిచి కుంచెడు ధనము బుట్టలో పోసింది
ఎరకలికి బుట్టనెత్తిన బెట్టి, ఏడడుగులు ఎనక నడిచింది
కడచెంగు తలమాసి, తన నీళ్ళు తను పోసుకుందమ్మ దేవాకి

ఇలా నారదుడి పాత్రమీద ఉన్న మక్కువతో నారదుడికి స్త్రీ రూపు తెప్పించి ఆ ఘట్టాన్ని రక్తి కట్టించారు

కోనార్లు. ఈ పౌరాణిక కథా గేయానికి వ్యాఖ్యానం అనవసరం. వాడుక భాషలో సాగిపోయే ఈ గేయం ఒక్కసారి చదవగానే భావం సుస్పష్టం.ఇందులో శైలి చాలా సహజంగా ఉండి శ్రోతల్ని ఆకట్టుకుంటుంది. పదంతో పాటుగా ప్రాస అలవోకగా అమరిపోయి ఆనందాన్ని కల్గిస్తుంది. ఇప్పటి వరకు మౌఖికంగానే కొనసాగే ఈ కథాగేయం జానపద సాహిత్యాభిమానులు తప్పనిసరిగా చదివి తీరాల్సిన ఘట్టం. ముందు తరాలవారు ముచ్చటగా చదువుకోవటానికి వీలుగా భద్రపరచవల్సిన భాండాగారం.

(నాకు ఈ పౌరాణిక కథాగేయాన్ని పాడి వినిపించిన వారు విశాఖజిల్లా చోడవరం ప్రాంతనివాసి దేవర రాము నాయుడు గారు వయస్సు 70 సంవత్సరాలు.)

ఉపయుక్త గ్రంథాలు :

1. శ్రీ మహాభాగవతము
2. పూర్వ గాథాలహరి
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల ధర్మరాజు తిరునాళ్ళు – పరిశీలన

– డా॥. ఎం. ప్రభావతి

జానపదం అంటే గ్రామం అని అర్థం.పల్లెలలోని సామాన్యుల నుంచి పుట్టిందే జానపద సాహిత్యం.ఏ భాషలో అయినా మొట్టమొదట జానపద సాహిత్యమే పుడుతుంది. అది కూడా మౌఖికంగా ప్రాచుర్యం పొందింది. జానపద విజ్ఞానం అంటే స్థూలంగా జానపదుల జీవన సర్వస్వమని చెప్పవచ్చు.జానపద విజ్ఞానం అనేది ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఒక్కొక్క జిల్లాలో ఒక్కోలాగా గేయాలు, కథలు, పాటలు, దేవతల ఉత్సవాలు, ఊరేగింపులు, తిరునాళ్ళు,జాతరలు వంటి జానపద కళా రూపాలు వేరువేరుగా ఉంటాయి.

"జానపద విజ్ఞానం మానవుని సంస్కృతిలో ఒక భాగం అంటారు"

-డాక్టర్ ఆర్వీయస్ సుందరం గారు.

ఆచార్య జి.నాగయ్య గారు ''జానపద విజ్ఞానం గురించి వివరిస్తూ జానపదులకు సంబంధించినవి మాత్రమే కాక, జానపద కళలు,భాష, నాటకము, జానపదుల ఆచార వ్యవహారాలు,వేషభాషలు" మొదలైనవి చేరుతాయి అన్నారు.

భారతదేశంలో ముఖ్యంగా తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ఒక ప్రత్యేకత ఉంది.మౌఖిక ప్రచారం వల్లనే తరతరాలుగా జానపదుల చేత పూజలందు కుంటున్న దేవతా గణాన్ని జానపద దేవతలు అంటు న్నారు. జానపదులకు దేవుడు లేదా దేవతలపై భక్తి, నమ్మకము చాలా ఎక్కువ అని చెప్పవచ్చు. జానపదులు తమకు కలిగిన కష్టాలను ఏదో ఒక రూపంలో దేవతలు, దేవుళ్ళు వచ్చి కాపాడతారని నమ్మకంతో గ్రామ దేవత ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలు, తిరునాళ్ళు జరుపు కుంటారు. జానపద దేవతలు లేని గ్రామం అంటూ ఉండదు. గ్రామ దేవతలు గ్రామంలోని పంటలను, పశు వులను,ప్రజలందరినీ రక్షిస్తారనేది జానపదుల గాఢమైన విశ్వాసం.

జానపదుల దేవతారాధనలు ప్రాంతాన్ని బట్టి, జనసముదాయాన్ని బట్టి, గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని వారి వారి ఆచారవ్యవహారాలతో రకరకాల గ్రామదేవతల ఉత్సవాలు,ఊరేగింపులు అనేవి ప్రాచీన కాలం నుండి నేటి వరకు కొనసాగుతూవున్నాయి.

చిత్తూరు జిల్లా జానపదుల దేవతా తిరునాళ్ళు :

చిత్తూరు జిల్లా జానపదలు స్త్రీ దేవతలు,పురుష దేవతల తిరునాళ్ళను ఎక్కువగా జరుపుకుంటారు. ముఖ్యంగా మాతృదేవతలైన గంగమ్మ, రెడ్డమ్మ, మాతమ్మ, అంకమ్మ, ఎల్లమ్మ, ద్రౌపదమ్మ, కావమ్మ మొదలైన దేవతలను భక్తి శ్రద్ధలతో జాతరలు, ఉత్సవాలు, తిరునాళ్ళను ప్రాచీన కాలం నుండి నేటి వరకు సాంప్రదాయబద్ధంగా భక్తి,విశ్వాసాలతో శ్రద్ధగా చిత్తూరు జిల్లా వాసులు నిర్వహించుకుంటున్నారు. అలాగే చిత్తూరు జిల్లాలో పురుషుల దేవతలైన తిరునాళ్ళలో ముఖ్యంగా ధర్మరాజులు, వీరభద్ర స్వామి, వరదరాజ స్వామి మరియు ముక్కోటి తిరనాళ్ళు జరుపుకుంటారు.

పుత్తూరు ధర్మరాజు తిరునాళ్ళు :

చిత్తూరు జిల్లాలో ధర్మరాజు తిరునాళ్ళు జరిగే అనేక ప్రాంతాలలో పుత్తూరు ప్రాంతం ఒకటి.పుత్తూరు తిరుపతికి సమీపంలో 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. శల్యవైద్యం (పుత్తూరు కట్టు)కు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. చిత్తూరు జిల్లాలో ధర్మరాజు గుళ్ళు వుండే ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం జూలై,ఆగస్టు నెలల్లో ధర్మరాజుల తిరు నాళ్ళు జరుగుతాయి.ఈ తిరునాళ్ళనే ''అగ్గి తిరునాళ్ళు, ద్రౌపదమ్మ తిరునాళ్ళు,నిప్పు తిరునాళ్ళు'' అనే పేర్లతో కూడా పిలుస్తారు. ధర్మరాజు తిరునాళ్ళు జరిపిస్తే సమయా

నికి వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో జానపదులు ఈ తిరునాళ్ళను చేస్తారు.

ఈ తిరునాళ్ళకు సంబంధించి జానపదుల్లో ఒక కథ ప్రచారంలో ఉంది. పాండవులు దేశాన్ని పరిపాలించి మరణించిన తర్వాత అన్ని ప్రాంతాల్లో కరువు ఎక్కువగా ఏర్పడిందట. అప్పుడు పాండవవంశానికి చెందిన రాజులు వ్యాసమహర్షిని పిలిచి కారణాన్ని అడుగగా,ఆయన పరిష్కార మార్గాన్ని ఈ విధంగా చెప్పాడట.పాండవుల భార్య అయిన ద్రౌపది మహాశక్తి సంపన్నురాలని,ఆమె ఎక్కడ ఉంటే అక్కడ విజయం కలుగుతుందని అందు వల్ల ద్రౌపది, ధర్మరాజు పేర్లతో మహాభారత కథను నిరం తరం విని అగ్ని తొక్కితే శుభం కలుగుతుందని చెప్పాడట. అప్పుడు పాండవ వంశరాజులు పద్దెనిమిది రోజులు, పద్దెనిమిది పర్వాల భారత కథను చెపించ్చి, చివరగా అగ్నిగుండం తొక్కడంతో వారి కష్టాలు తొలగిపోయా యట. అప్పటినుంచి ధర్మరాజు,ద్రౌపదమ్మ తిరునాళ్ళు చేయడం ప్రజల ఆనవాయితీగా మారిందని పుత్తూరు జానపదులు తెలియజేశారు.

పై కథలో ఎంతవరకు నిజం అన్న మాటను పక్కన పెడితే, పుత్తూరు గ్రామ జానపదులకు మాత్రం ధర్మరాజు, ద్రౌపదమ్మ తిరునాళ్ళు చేస్తే వర్షం పడి,పంటలు బాగా పండుతాయనే గాఢమైన నమ్మకం ఉంది.ఆ నమ్మకం తోటే పుత్తూరు జానపదులు నేటికి ఈ తిరునాళ్ళను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. ధర్మరాజు తిరునాళ్ళనే ''ద్రౌపదమ్మ తిరునాళ్ళు'' అని కూడా అంటారు.

ఈ తిరునాళ్ళు ప్రారంభించటానికి ముందు మంచి తిథి, నక్షత్రం చూసి శుభ సమయంలో పసుపు రంగు (గుడ్డ) జెండాను ఎగురవేస్తారు.దీన్నే ''సీకారపు కోడి'' (శ్రీకార పతాక)లేదా ''భారత కోడి'', ''కోడి ఎక్కడం'' అంటారు. ''కోడి''అంటే ''జెండా'' అని అర్థం. ''సీకారి'' అంటే పాటలు పాడేవారు. ''సీకారము''అంటే పాటలు పాడుతూ ఊరూరు తిరిగి తిరునాళ్ళకు కావలసిన డబ్బు, ధాన్యం లాంటి సామాగ్రిని సేకరించడం అని అర్థం. ఆలయ ధర్మకర్త లేద గ్రామ పెద్దలు దారంతో కట్టిన పసుపుకొమ్మును పూజలో వుంచి చేతికి కట్టుకుంటారు. దానిని''కంకణం'' కట్టారు అంటారు. అలా కంకణం కట్టు కున్న వారు తిరునాళ్ళు ముగిసేవరకు గుడి ప్రాంగణాన్ని వదిలి బయటకు వెళ్లకుండా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అటుపిమ్మట ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటు చేసి ఆ అగ్నిగుండం చివరి రోజు వరకు ఆరి పోకుండా జానపదులు తగు జాగ్రత్తలు తీసుకుంటారు.

ఈ తిరునాళ్ళలో ప్రతిరోజూ పగటిపూట భారతం హరి కథగా చెబుతారు.అదే కథను రాత్రుల్లో జానపద కళా కారులు వీధి నాటకం ప్రదర్శిస్తారు. తిరునాళ్ళు జరుగు తున్న ఆ వది రోజులు ఎంతో నందడిగా, జన సందోహంతో కోలాహలంగా, పచ్చని పందిరల నడుమ దేవతల ఊరేగింపులు ఎంతో వైభవంగా, చూడడానికి ఆనందంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది.

పుత్తూరులో ధర్మరాజు, ద్రౌపదమ్మ తిరునాళ్ళు మొత్తం పది రోజులు జరుగుతాయి. కొన్నిచోట్ల పద్దెనిమిది రోజులు జరుపుతారు.ఈ తిరునాళ్ళను చూడడానికి చుట్టుపక్కల వుండే పల్లె ప్రజలు భక్తిశ్రద్ధలతో వచ్చి తమ మొక్కులను తీర్చుకుంటారు.

ధర్మరాజు తిరునాళ్ళలో వీధి నాటకంలో ప్రద ర్శించే అంశాలు :

ధర్మరాజు తిరునాళ్ళలో పది రోజులపాటు రాత్రులలో ప్రదర్శింపబడే అంశాలు ఈ విధంగా ఉంటాయి.

మొదటి రోజు :

పగటిపూట హరికథకుడు చెప్పిన శ్రీకృష్ణలీలలను రాత్రిపూట వీధి నాటకంలో ప్రదర్శిస్తారు.శ్రీకృష్ణ జననం, అశరీరవాణి కంసుడికి శ్రీ కృష్ణుని చేతిలో చనిపోయేటట్లు శాపం ఇవ్వడం, శ్రీ కృష్ణుడు కంసుని చంపడం వంటి ఘట్టాలను జానపద కళాకారులు వీధి నాటక ప్రదర్శనలు చేస్తారు.

రెండవ రోజు :

పాండురాజు కొలువు తీరడం,వేట,శాపం, పాండు రాజు మరణం, పాండవుల జననం, విద్యాభ్యాసం,లక్క ఇల్లు దహనం ఘట్టాలను ప్రదర్శిస్తారు.

మూడవ రోజు :

బకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. దానికన్నా ముందు పగటిపూట హరికథకుడు పగటిపూట కథ ప్రారంభించక ముందే భీముడి వేషం వేసిన వ్యక్తి దున్నపోతుల బండిని తోలుకొని ఇంటింటికి వెళ్లి అన్నం,కూరలు సేకరించి కొత్తగా అల్లిన వెదురుబుట్టలలో నింపు కొంటాడు.తర్వాత బండిని ఊరి పొలిమేరకు తీసుకెళ్ళి కొన్ని వీరగీతాలు పాడి,బకాసుర వేషం వేసిన వ్యక్తి తో తలపడి అతని చంపినట్లు నటిస్తాడు.బకాసుర వధ తర్వాత బీముడు బండిలోని అన్నాన్ని సంతోషంగా నాట కాన్ని తిలకించే ప్రజలకు ప్రసాదంగా పంచిపెడతాడు.ఆ రోజు రాత్రి వ్యాసుని హితువు మేరకు పాండవులు ఏక చక్రపురం అగ్రహారం చేరడం,బకాసురవధ వంటి ఘట్టా లను ప్రదర్శిస్తారు.

నాలుగో రోజు :

ద్రౌపది, సుభద్రల కళ్యాణ ఘట్టాలను ప్రదర్శిస్తారు. పాండవులు ఏకచక్రపుర అగ్రహారం నుంచి బయలు దేరడం, మధ్యలో అంగారపర్ణుడుతో యుద్ధం చేసి అతన్ని ఓడించడం, పాంచాల రాజ్యం చేరి ద్రుపదమహారాజు సభలో ఏర్పాటు చేసిన స్వయంవరంలో అర్జునుడు మత్స్యయంత్రాన్ని కొట్టడం, ద్రౌపదిని పాండవులు పెళ్లి చేసుకోవడం, దుర్యోధనుడు ద్రుపదరాజును బంధించడం, అర్జునుడు ద్రుపదరాజును విడిపించడం వంటి ఘట్టాలను ప్రదర్శిస్తారు. ఆరోజు మొక్కుబడులు వున్న జానపదులు ద్రౌపదికి, సుభద్రకు పెళ్ళి జరిపించి తమ మొక్కులు తీర్చుకుంటారు.

ఐయిదవరోజు :

శకుని మాటలు విని ధర్మరాజు జూదం ఆడడం. జూదంలో సర్వం కోల్పోయి, ధర్మరాజు ద్రౌపదిని తాకట్టు పెట్టడం, నిండుసభలో దుశ్శాసనుడు ద్రౌపదిని వస్త్ర భరణం చేసేటప్పుడు కృష్ణున్ని వేడుకోవడం, కృష్ణుడు ద్రౌపదిని ఆదుకునే ఘట్టాలను ప్రదర్శిస్తారు.

ఆరవ రోజు :

అర్జునుడు ఇంద్రకీలాద్రిపై తపస్సు చేయడం. తపస్సుకు మెచ్చిన శివుడు పాశుపతాస్త్రాన్నివ్వడం వంటి ఘట్టాలు నాటకంగా ప్రదర్శిస్తారు.

ధర్మరాజు తిరునాళ్ళల్లో అర్జునుడి తపస్సు ముఖ్య ఘట్టంగా జానపదులు భావిస్తారు. ఇంద్రకీలాద్రికి ప్రతీకగా తాటి మాను తెచ్చి దానికి మెట్లు అమర్చుతారు.అర్జునుడి వేషధారి పద్యాలు, పాటలు పాడుతూ శివున్ని స్మరిస్తూ చెట్టు చివరికి చేరుకుని, అక్కడి నుండి తన వెంట తీసు కెళ్లిన తమలపాకులు, పువ్వులు, పండ్లను పైనుంచి సంతానం లేనివారు, వరాల కోసం నిరీక్షించే భక్తులపైకి వాటిని చల్లుతాడు. అర్జునుడు విసిరే పండ్లలో అరటి పండు దొరికితే మగబిడ్డ, జామపండు దొరికితే ఆడ బిడ్డ పుడతాడని జానపదులు నమ్ముతారు.

ఏడవ రోజు :

శ్రీ కృష్ణుడు గయునికి శాపం ఇవ్వడం, అర్జునుడు గయునికి అభయం ఇవ్వడం,శ్రీకృష్ణార్జున యుద్ధం వంటి ఘట్టాల్ని ప్రదర్శిస్తారు.

ఎనిమిదవ రోజు :

"కీచకవధ" ఘట్టం, "ఉత్తరగోగ్రహణ" ఘట్టం నాటక ప్రదర్శన చేస్తారు. ద్రౌపది మారువేషంలో సైరంధ్రిగా విరాటరాజు కొలువులో సుదేష్ణ దగ్గర ప్రధాన చెలికత్తెగా ఉంటుంది. ఆమె అందాన్ని చూసి కీచకుడు మోహిస్తాడు. సైరంధ్రి ద్వారా ఈ విషయం తెలుసుకున్న భీముడు మాయోపాయంతో అతి రహస్యంగా కీచకున్ని చంపేసే ఘట్టాలను ప్రదర్శిస్తారు.

ఉత్తర గోగ్రహణం గురించి పాండవులు ఆయుధా లను దాచిపెట్టిన జమ్మి చెట్టుకు ప్రతీకగా ఊరి వెలుపల మైదానంలో నేరేడు కొమ్మను నాటి,అక్కడ అర్జునుడు,

ఉత్తరుని వేషధారులు ఒకపక్క, మరోపక్క కౌరవ వేషధారులు నిలిచి గోవుల్ని మళ్ళిస్తారు. ఈ విధంగా ఇరు వర్గాల మధ్య జరిగే యుద్ధంలో కౌరవుల ఓడిపోయి, పాండవులు గోవుల్ని ఇండ్లకు మరలిస్తారు.నాటకాన్ని చూడడానికి వచ్చిన జానపదులు నేరేడు ఆకుల్ని పశువుల రోగనివారణకు ధూపం వేయడానికి తీసుకెళ్తారు.

తొమ్మిదవరోజు :

శ్రీకృష్ణరాయబారం,అలుగు నిలపడం,యుద్ధబలి, కురుక్షేత్ర యుద్ధం, కర్ణుని మరణం వంటి ఘట్టాలను నాటకంలో ప్రదర్శిస్తారు

"అలుగు" అంటే "కత్తి". యుద్ధాన్ని ప్రారంభించడానికి సూచనగా అప్పటికప్పుడు మట్టితో కుండను తయారు చేసి దాని అంచుపై ఏ ఆధారం లేకుండా యుద్ధకత్తి మొనను నిలబెడతారు. అలా నిలబెట్టిన కత్తికి కర్పూర హారతులిచ్చి పూజచేసి పాండవుల్ని శాంతపరుస్తారు.

మట్టితో పది అడుగుల ఎత్తు ఉండే విగ్రహాన్ని తయారు చేస్తారు. తలను మాత్రం గడ్డితో గాని, కొయ్యతో గాని చేసి పాత గుడ్డలు చుట్టుతారు.అలా చేయబడిన విగ్రహాన్ని జానపదులు "కడబలి రాముడు" అంటారు. "కడ" అంటే మేకపోతు. మేకపోతులాగా బలిరాముడి మట్టి విగ్రహాన్ని బలిగా సమర్పిస్తారు. కాబట్టి దాన్ని "కడబలి రాముడు, ఇలామంతుడు" అని కూడా అంటారు.

పదవ రోజు :

ఈ రోజు మాత్రం దుశ్శాసన,దుర్యోధన వధ ఘట్టాల్ని మధ్యాహ్నమే ప్రదర్శిస్తారు.ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుంది. దుర్యోధన వధ పూర్తిగా గానే అక్కడ ఉన్న జానపదులు నాశనమైన ప్రతిమల మట్టిని ఇంటికి తీసుకవెళ్తారు. దుర్యోధుని చేతిలో ధన రేఖ ఉంటుందని,ఆ మట్టిని ఇంటికి తీసుకెళ్ళి భద్రపరిస్తే ధనధాన్యాలు సమృద్ధిగా లభిస్తాయని జానపదుల విశ్వాసం.

చివరి రోజు రథంలో ధర్మరాజు, ద్రౌపదిల ఊరేగింపు కొనసాగుతుంది. దానిని "తేరు లాగడం" అంటారు. జానపదులు పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించి పురోహితుడు హారతులు ఇవ్వడంతో ధర్మరాజుల తిరునాళ్ళ ముగుస్తుంది.

ముగింపు :

చిత్తూరు జిల్లా సాంస్కృతికంగా ఒక ప్రత్యేకమైన ప్రాంతం. సంస్కృతి, సాంప్రదాయాలకు అగ్రతాంబూల మిచ్చే జానపదులు ఈ జిల్లాలో ఇప్పటికీ వారి ఆచార వ్యవహారాలను పాటిస్తూ ఉన్నారు. జానపదుల జాతరలు, తిరునాళ్ళు, ఉత్సవాలలో అచ్చతెలుగు తనం కనపడుతుంది. చిత్తూరు జిల్లాలోని జానపదులు ఎక్కువగా గ్రామ దేవతల తిరునాళ్ళు చేసుకొని సంతోషిస్తారు.అంతే కాకుండా గంగమ్మ, కావమ్మ వంటి తిరునాళ్ళు కూడా చేసుకుంటారు. ప్రస్తుత కాలంలో పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడిన మనం అనాదిగా వస్తున్న కొన్ని దేవతా ఉత్సవాలను చేసుకోవడం లేదు. జానపద సాహిత్యంపై పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. చిత్తూరు జిల్లా పండుగలు - అరుణ-గెంజి.చర్మేష్మా పబ్లికేషన్స్- 2003.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీయస్.సుందరం.ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ - 1983.
3. జానపదుల నమ్మకాలు - జి. యస్. మోహన్.తెలుగువాణి, ఫిబ్రవరి-మార్చి 1979. పుత్తూరు గ్రామ గ్రంథాలయం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వి.ఆర్. రాసాని రచనలలో జాతీయాలు

– డా॥. పోచంరెడ్డి రాజేశ్వరి, సహాయ ఆచార్యులు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

భావ వినిమయ సాధనం భాష. వ్యక్తీకరణ సందర్భాను గుణంగా ఉంటుంది. భావగాఢత కోసం, శ్రోత మనస్సుకు హత్తుకునేట్టు చెప్పటానికి సామెతలు, జాతీయాలు, అలంకారాలు ఉపయోగించటం పరిపాటి. ఇవి భాషకు పరిపుష్టిని, ప్రత్యేకతను చేకూరుస్తాయి. ప్రతి భాషలోనూ జాతీయాలకు ప్రత్యేక స్థానముంది. శైలీసౌందర్యానికి, భాషాసౌభాగ్యానికి సమాజ సంస్కృతికి చిహ్నాలు, విషయ నివేదనలో భావగాఢతకు, అలంకార చమత్కృతికి ఆలవాలం. ఏ భాషా వ్యవహర్త అయినా ఆ భాషలోని జాతీయాలను ఒంటపట్టించుకుని, సమయానుకూలంగా ప్రయోగించినప్పడే ఆ భాషలో రాణిస్తాడు.

జాతీయానికి తెలుగులో చమత్కారం, నుడికారం, నుడిగట్టు, పలుకుబడి, భాషీయం సమానార్థకాలు. విడివిడి మాటల కలయికే ఆ పదాలకు విడిగాలేని ఒక భావాన్ని స్ఫురింపజేస్తాయి. ఇలా కొన్ని పదాల కలయిక ద్వారా సామూహిక అర్థాన్ని అందించే పదబంధాలను జాతీయం అనవచ్చు. ప్రత్యేకార్థబోధకాలయిన పదాలను కూడా జాతీయాలనవచ్చు. జాతీయాలు లక్షణార్థ ప్రాధాన్యం, సాదృశ్యపూర్వకం, అనుభవాల మూలం, అలంకారిక చమత్కృతి, సాంప్రదాయికత, సంక్షిప్తత కలిగి ఉంటుంది. జానపద కథలు, కళలు, ఆటపాటలు, వృత్తుల నుంచి అనేక జాతీయాలు పుట్టాయి. జానపదుల ఆచార్య వ్యవహారాలు, నమ్మకాల నుంచి అనేక జాతీయాలు జనించాయి.

రాయలసీమ రచయిత అయిన వి.ఆర్. రాసాని సందర్భానుసారంగా రచనలలో జాతీయాలు వినియోగించారు. రాసాని చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతమైన పులిచెర్ల మండలానికి చెందినవారు. కావున వీరి రచనలలో పడమటి మండలాలైన పాకాల, పీలేరు, చిత్తూరు, కలికిరి ప్రాంతాల వ్యవహారంలో ఉండేటటు వంటి జాతీయాలు కనబడుతాయి. ఈ ప్రాంత జాతీయాలను వివరించడమే పత్రం యొక్క ఉద్దేశం.

అట్టుడికినట్లు ఉడికిపాపు :

సంచలన విషయంపై చర్చ జరుగు. పల్లీయులు ఒకరి విషయాలు గురించి మరొకరు చర్చించే అలవాటు ఎక్కువ. సంచలనం కల్గించే విషయాలను ఇంకా ఆసక్తితో అందరూ మాట్లాడుకుంటారు. అందరి నోళ్ళల్లో విషయం చర్చించే సందర్భంలో ఈ జాతీయం ఉపయోగించారు.

అగ్గికి ఆజ్యం తోడగు : చెడుకు ఇంకో చెడు తోడగు.

సర్వసాధారణంగా చెడు పనులు చేసేవారికి చెడ్డవారే స్నేహితులు అవుతారు. ఈ విధముగా చెడ్డవారికి ఇంకో చెడుపనులు చేసేవారితో స్నేహం కుదిరిన సందర్భంలో జాతీయం వాడుతారు.

అన్నేకారి కాలం : చెడుకాలం :

పులిచెర్ల ప్రాంతంలో నాలుగు కుటుంబాలు నాటకాలు వేసి జీవనం సాగించేవారు. అప్పటి కాలంలో కళలకు ముఖ్యంగా నాటకాలకు ప్రాధాన్యం ఉండేది. పల్లీయులు ఎంతో ఆసక్తితో నాటకాలను తిలకించేవారు. జానపదులు నాటకాలను ఆదరించేవారు. క్రమంగా నాటకాలకు ఆదరణ తగ్గిన సందర్భంలో ఈ జాతీయం ఏర్పడింది.

ఇల్తీర్థం : ఇంటిల్లిపాది తీర్థయాత్రకు పోవటం.

ఇల్లు - కుటుంబం. తీర్థం - పవిత్రమైన స్థలానికి పోవడం. పులిచెర్ల ప్రాంతంలో పవిత్రమైన స్థలం తిరుపతి (తిరుమల) కొండ.

కుటుంబం అంతా కలసి మూడు రోజులు తిరుమల యాత్రకు పోవటం, తిరుమల వెంకన్నను కుటుంబం అంతా దర్శించుకోవటానికి వెళ్ళే సందర్భంలో ఈ

జాతీయం రచయిత ఉపయోగించారు. జాతీయం ద్వారా ఆచారం అవగతమైంది. దేవుని పేరు మీద ఆవును పెంచి, ఆ ఆవును అమ్మితే వచ్చిన పైకాన్ని తిరుమల యాత్రకు ఖర్చుపెట్టే ఆచారం ఈ ప్రాంతంలో ఉంది. భక్తిశ్రద్ధలతో దైవదర్శనం తర్వాత ఇంటికి వచ్చి ప్రసాదము దేవుని దగ్గర పెట్టి, ఊరిలో అందరికి ప్రసాదం పంచుతారు.

ఉడుబోతు పిండె : పంట చివరిలో కాసేపిండె

పల్లీయులు చిట్టచివరన పుట్టిన సంతానాన్ని ఉడు బోతు పిండె మాదిరి పుట్టారు అని పోల్చుతారు. పంట చివరలో కాసిన పిండె బలహీనంగా ఉంటుంది. బల హీనంగా చిట్టచివర పుట్టిన సంతానాన్ని పోల్చే సందర్భంలో ఈ జాతీయం ఉపయోగిస్తారు.

ఉబ్బులుకారి సుబ్బడు అయిపోవు : పొగిడితే పొంగిపోవు.

కొందరు తెలివిగా ఇతరులతో పనులు చేయించు కోవటానికి అతిగా పొగుడుతారు. ఆ పొగడ్తలకు పొంగి పోతారు. పొగడ్తలకు పొంగిపోయే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

కత్తుల బోను : కలహించుకునే ప్రవృత్తి

సాధారణంగా పల్లీయులు తగాదాలు పడుతారు. ఒకరిమీద మరొకరు కలహించుకుంటారు. క్రమీణ ఆ తగాదా పెరిగి విపరీతంగా ద్వేషం పెంచుకొని రెండు వర్గాలుగా విడిపోతారు. చివరకు ఒకరిని ఒకరు చంపుకునేటంత ద్వేషంగా మారుతుంది. కలహించుకునే పరిస్థితిలో ఈ జాతీయం ఏర్పడింది. ప్రతి పల్లె ఒక కత్తుల బోను అని రచయిత రచన చేశారు.

కోరుకున్న కొండమీద వానగురియటం : అనుకున్నది నెరవేరటం.

కోరుకున్నటువంటి కోరిక నెరవేరినప్పుడు ఈ జాతీయం వాడుతారు. జానపదులు గ్రామదేవత ఆరాధన చేసి కోరికలు కోరుకుంటారు. ఆ కోరికలు నెరవేరినప్పుడు రచయిత ఈ జాతీయం ఉపయోగించారు.

గంట కొట్టేయు : చనిపోవు

మరణించిన సందర్భంలో వాడుతారు. పల్లెల్లో వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేవి కావు. ప్రసవ సమయంలో మంత్రసాని వచ్చి సుఖప్రసవం చేసేది. మంత్రసాని చెప్పినట్లు గర్భిణులు వినకపోతే గంట కొట్టేయాల్సిందేననే పోలికలో రచయిత జాతీయాన్ని ఉ పయోగించారు.

గుండెకాయ నీళ్ళయిపోవు : బాధ ఎక్కువగు

మనుషులకు కష్టాలమీద కష్టాలు వచ్చి, ఎక్కువ బాధపడుతున్న సందర్భంలో వాడుతారు.

గుంతకాడ నక్క : కాచుకోనుండే వ్యక్తి.

స్వార్థంతో కూడిన వ్యక్తులను, దొంగ మనస్తత్వం కలిగినటువంటి వారిని పోల్చే సమయంలో జాతీయం ఉపయోగిస్తారు.

కండ్లున్న గుడ్డోడు : నిరక్షరాస్యుడు

చదువు లేనటువంటి వారిని గూర్చి చెప్పే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

తలకు నోరు కట్టుకొని అడుగు : అందరిని విచారించు.

జనపదులు ఆవులు, మేకలు, పశువులను ఇంటిలోని సభ్యుల మాదిరిగా చూచుకుంటారు. వాటికి అనారోగ్యం చేసినా విలవిలలాడుతారు. అవి కనబడకపోతే చాలా బాధపడుతారు. వాటిని మేపటానికి అడవికి తీసుకొని పోతారు. అవి అడవిలో మేస్తూ దారి తప్పిపోతాయి. గుంపు దగ్గర ఉంటే రాగలుగుతాయి, లేకపోతే దారి తప్పుతాయి. దారి తప్పిన సందర్భములో వాటిని వెతకటానికి, వాటి జాడ తెలుసుకొనుటకు అందరిని విచారిస్తూ తిరుగుతా వుంటారు. ఈ సందర్భంలో వాడే జాతీయం.

దుమ్ము దుమారించు : విపరీతంగా దూషణలు చేయు.

జనపదులు ఇతరులను ఆవేశంతో, ద్వేషంతో మనసులో ఉన్న బాధను తిట్లరూపంతో దూషిస్తారు. ఈ సందర్భంలో వాడే జాతీయం.

నక్క బిగువు : రోగం లేకున్నా ఉన్నట్లు నటించి, కదల కుండా ఉండడం.

కొన్ని కథలు, అనుభవాల నుంచి సందర్భానుసారం

ఈ జాతీయం ఉపయోగిస్తారు. ఆ పరిస్థితుల నుంచి బయటపడటానికి నటించటం సాధారణంగా రైతులు ఎద్దులతో దుక్కి దున్నుతారు. ఎద్దులు రెండూ ముందుకు కదిలితే ఆ పని పూర్తవుతుంది. కాని కొన్ని ఎద్దులు పనిచేయటానికి పనిదొంగలుగా ఉంటాయి. అటువంటి ఎద్దులను ఎంత కొట్టినా అడుగు ముందుకు వేయవు. మనం కొట్టేకొద్దీ అవి నాలిక బయటికి సాంచి ఇంకా ముడక్కపోతాయి. పైకి మాత్రం లెయ్యవు. ఈ సందర్భంలో రచయిత జాతీయాన్ని ఉపయోగించారు.

పచ్చిగడ్డపారలు ఏమీ వంచేది లేదు : కష్టమైన పని లేదు.

వడ్డె కులంలో పెద్ద బోయసాని లేకుండా ఏ కార్య క్రమమూ జరగదు. ఊరిలో జరిగే ప్రతి సమావేశం ఈమె వచ్చిన తర్వాత మొదలవుతుంది. ఆ గూడెంలో పెద్ద బోయసానికి ప్రత్యేక గౌరవం ఇస్తారు. గూడెం పెద్దలతో బాటు పెద్ద బోయసానికి కూడా ఉండటం వారి ఆచారం. ఆమె ఏమి చేసినా ఎదురు చెప్పకూడదు. ఆమెకు ఎదురు చెప్పితే ఆ కులానికి చేటనే నమ్మకం. ప్రతి కార్యక్రమంలో పెద్ద బోయసాని ఉండాల్సిందే. ఆమె చేసే పని ఏమీలేదు అనే సందర్భంలో రచయిత ఈ జాతీయం ఉప యోగించారు. పులిచెర్ల ప్రాంతంలో వడ్డె కులంలో స్త్రీలకు పెద్దగా కట్టుబాట్లుండవు. ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది. పెండ్లి చేసుకున్న పురుషుడు వదిలిపెట్టినా, ఆమె మరొకరికి పెళ్ళి చేసుకోవచ్చు. ఇలా పన్నెండు మంది మగవాళ్ళతో కాపురం చేసిన స్త్రీకి ఒక ఉన్నస్థానాన్నిచ్చి, పట్టంకట్టి ఆ గూడానికి నాయకురాల్ని చేస్తారు. ఆమెను పెద్ద బోయసాని అంటారు. పెద్ద బోయసాని ప్రతి కార్యక్రమానికి రావాల్సిందే. కాని అక్కడికి వచ్చి ఆమె చేసేది ఏమీలేదు. అది వారి ఆచారం. ఈ సందర్భంలో జాతీయం ఏర్పడింది.

పుంగనూరు పుడింగి : అన్ని విషయాలు తెలిసినవాడు.

చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతంలో పుంగనూరు ఉంది. పుంగనూరు చాలా చిన్న గ్రామం. ఆ గ్రామంలోని ప్రజలకు గొప్పలు చెప్పకునే మనస్తత్వం ఉంది. మాకు అన్ని విషయాలు తెలుసు అనే వారికి ఈ జాతీయం ఉపయోగిస్తారు. రచయిత పుంగనూరు ప్రాంతవాసులకు ఈ జాతీయం ఉపయోగించారు. గొప్పలు చెప్పకునే వారిని ఎవ్వరూ నమ్మరు.

పసురుబాము : హాని చేయని వ్యక్తి

మంచితనం ఉన్నటువంటి మెతక మనస్తత్వం కలిగిన వారిని పసురుబాముతో పోలుస్తారు. పాములలో పసురు పాము కరవదు. ఎటువంటి హాని చెయ్యదు కాబట్టి పసురుబాముతో పోల్చుతారు. కొంతమంది మనుషులు ఎవ్వరికి ఎటువంటి హాని కలిగించరు. అలాంటి వారిని ఉద్దేశించి రచయిత ఈ జాతీయం ఉపయోగించారు.

ముక్కలమురగా తిను : అతిగా తిను.

కొంతమంది ఇష్టమైన వాటిని చాలా ఎక్కువగా తింటారు. పీకలదాకా తినే మనస్తత్వం కలిగినవారికి ఈ జాతీయం వాడుతారు.

మొగలాయి : అన్నింటా సమర్థురాలు

మొఘలు సామ్రాజ్యంలో గొప్పతనం కలిగిన రాజు లకు ఈ జాతీయం ఉపయోగించారు. ఇప్పుడు కూడా అన్నింటిలో సమర్థత కలిగిన వారిని మొగలాయి అని పిలుస్తారు. రచయిత ఒక కథలో చంద్రమ్మ అనే స్త్రీ అన్ని పనులు సమర్థవంతంగా నెరవేర్చుకునే సత్తా ఉంది. అన్ని పనులు ఒక్కతే నెరవేర్చుతుంది. ఈ సందర్భంలో మొగలాయి మా చంద్రమ్మ అనే జాతీయం ఉపయోగించారు. సమర్థులైన స్త్రీలకు, పురుషులకు ఈ జాతీయం ఉపయోగిస్తారు.

రచ్చమింద కూసున్న రాజేంద్ర బోగి : చీకు చింతలు లేనివాడు.

ఎటువంటి బాధలు లేకుండా దర్జాగా కూర్చున్న టువంటి వ్యక్తులకు ఈ జాతీయం ఉపయోగిస్తారు.

రుడ పాతికోడు : నిప్రయోజకుడు

ఎటువంటి ప్రయోజనం లేనటువంటి వారిని ఉద్దేశించి ఈ జాతీయం ఏర్పడింది. ఎటువంటి పనిలేని వారికి వాడుతారు.

సచ్చిదోరుగాలం : చెడుకాలం

పులిచెర్ల ప్రాంతంలో నాటకాలు వేసే కుటుంబాలకు ఆదరణ తగ్గిపోయింది. నాటకాలకు ఆదరణ తగ్గినకాలం అయినా సరే నాటకాలు వేసేవాళ్ళు. ఎంతటి చెడుకాలం వచ్చినా నాటకాలు వేసి జీవనం సాగించేవారు. రచయిత నాటకాలకు ఆదరణ తగ్గిన కాలంలో ఈ జాతీయం ఉపయోగించారు.

కక్షరేఖ కట్టడం : శత్రువును చంపుతామని ప్రమాణం చేయడం.

రాయలసీమలో చిన్న కారణాలతో పల్లెల్లో రెండు వర్గాలు ఏర్పడతాయి. క్రమంగా ఇరువర్గాల మధ్య శత్రుత్వం పెరిగి ప్రాణాలు తీసుకునే స్థితికి దారితీస్తాయి. ఒక వర్గంలోని వారు ఇంకో వర్గంలోని వారిని చంపినప్పుడు, చనిపోయిన వారి ఇంటిలో తలుపులు వేసుకుని చనిపోయిన వ్యక్తి కుమారులు, దాయాదులు తిరిగి మరో వర్గీయులను చంపుతామని, వారి వంశాన్ని నాశనం చేస్తామని ఒక కత్తిని తలక్రిందులుగా పెట్టి, సలిపిండి ముద్ద పెట్టి, పసుపుతాడు చేతబట్టుకుని ఒక్కొక్కరు కత్తిమీద ప్రమాణం చేసి, తలా ఒక పసుపుతాడు కత్తికి కట్టే ఆచారాన్ని 'కక్షరేఖ' కట్టడం అంటారు.

ఒక వర్గం వారు మరొక వర్గం వారిని చంపినప్పుడు ఆ వర్గం వారిని చంపుతామని ప్రమాణం చేసే సందర్భంలో రచయిత ఈ జాతీయం ఉపయోగించారు.

జాతి సంస్కృతీ సంప్రదాయాలను బట్టి జాతీయాలేర్పడతాయి. ఒక భాష సమాజ ప్రత్యేకతను చాటుతాయి. ఒక జాతి అనుభవాలు జాతీయాల్లోయిమిడి ఉంటాయి. జాతీయాలు సృష్టికి పల్లీయులు, వారి జీవనశైలి ఆధారాలు.

ఆధార గ్రంథాలు :

1) గోపాలకృష్ణ రెంటాల : జాతీయాలు పుట్టుపూర్వోత్తరాలు
2) విజయలక్ష్మి మూలె : తెలుగు జాతీయాలు పర్యాయ పదకోశం
3) రాసాని వి.ఆర్. : పయనం, మెరవణి, బతుకాట, మావూరి కథలు.

❖ ❖ ❖

"తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి – సమాలోచన"

జానపద నృత్యాలు

– కె. రంగనాయకులు, పాఠశాల సహాయకులు (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిప్పగిరి, కర్నూలు జిల్లా.

తెలుగు జానపద సాహిత్యం :

జానపదుల చేత సృష్టించబడిన సాహిత్యం జానపద సాహిత్యం. అదే నిజమైన ప్రజా సాహిత్యం. అమరికలు లేని పామర ప్రజల సాహిత్యం. సామాన్య ప్రజల అనుభవాలకు, అనుభూతులకు పరమ నిదర్శనం జానపద సాహిత్యం. జనపదం అంటే గ్రామం. ఇది పల్లెవాసుల సాహిత్యంగా స్థిరపడింది. పల్లెలనుంచి సామాన్యుల నుంచి పుట్టిందే జానపద సాహిత్యం. ఏ భాషలోనైనా మొట్టమొదటి జానపద సాహిత్యమే పుడుతుంది. ఇది మౌఖిక సాహిత్యం. అంటే ముఖ్యంగానే ప్రాచుర్యం పొందింది. అటు తర్వాత లిఖిత సాహిత్యం వెలువడుతుంది. దీన్ని శిష్ట సాహిత్యంగా పరిగణిస్తారు.

జానపద సాహిత్యం ముఖ్యంగా మౌఖిక సాంప్రదాయం వుండేది. ఇది ఒకరి నుంచి మరొకరికి నోటిద్వారా వ్యాపిస్తుంది. ఇది లోకజ్ఞానానికి, సమిష్టితత్వానికి, మనోవికాసానికి తోడ్పడుతుంది.

జానపద సాహిత్యానికి తెలుగులో ఎన్నో వ్యవహార నామాలున్నాయి. ఖండవల్లి లక్ష్మీరంజనం గారు ప్రజా వాఙ్మయం అన్నారు. తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి గారు పదవాఙ్మయము అని, ఆడిదము రామారావు గారు వ్యాస సంగ్రహము అన్నారు. మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు అనాదృత వాఙ్మయము అన్నారు. వావిలాల సోమయాజులు గారు గేయ రచనలు అన్నారు. వేటూరి ప్రభాకర్ శాస్త్రిగారు మధుర కవితలు (మీగడ తఱకలు) అని పిలిచారు. శ్రీపాద గోపాల కృష్ణమూర్తి దేశి సారస్వతం అని అన్నారు.

జానపద సాహిత్యం – పుట్టుక :

జానపద సాహిత్యం ఎప్పుడు ? ఎక్కడ ఎలా పుట్టిందో చెప్పడం సులభం కాదు. జానపద విజ్ఞాన వేత్తలు ఆ విజ్ఞానం పుట్టుక పరిణామాల గురించి ఎన్నో సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రచారంలో వుండే జానపద సాహిత్యంలో భాగమైన గేయాలు, కథలు, సామెతలు, పొడుపుకథలు లాంటి ప్రక్రియలను తులనాత్మకంగా పరిశీలిస్తే ఎన్నో పోలికలు కన్పిస్తాయి.

జానపద సాహిత్య పుట్టుకను తెలుసుకోవాలంటే మానవ శాస్త్రాన్ని, జీవన శాస్త్రాన్ని, మనస్తత్వ శాస్త్రాన్ని ఆశ్రయించాల్సి వుంటుంది.

హృదయంలో కలిగే ఆనందాన్ని, దు:ఖాన్ని, కష్టాన్ని, కారుణ్యాన్ని, ఆవేశాన్ని, ఆదుర్దాను వెళ్ల బుచ్చుకుంటే కాని వాళ్లకు హృదయభారం తీరదు. అదే జానపద సాహిత్య పుట్టుకకు దారి తీసింది.

జానపద సాహిత్యం ఏ ప్రదేశంలో పుట్టి ఏయే ప్రాంతాలకు ప్రసరించిందో చెప్పవచ్చు కాని ఎప్పుడు పుట్టిందో చెప్పడం కష్టం. ఎందుకంటే జానపద సాహిత్యం సమిష్టి సృష్టి, సమిష్టి సంపద. అది అందరి నోళ్ళలో నానుతుంది. అందరిని అలరిస్తుంది. అది ఒకరి సృష్టి అయినా పలువురి చేతుల్లో మెరుగులు దిద్దుకుంటుంది. దాని వికాసం సామూహికమైంది.

జానపద సాహిత్యం ఎందుకు ఎలా పుడుతుందో చెప్పడానికి ఉపయోగించే సిద్ధాంతం. సిగ్మండ్ ఫ్రాయిడ్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కోరికలను అణచి వుంచితే అవి కలలు రావడానికి కారణమవుతాయని

అతని అభిప్రాయం. మానవునిలోని చేతన, సుప్తచేతన, అచేతన స్థితులను విశ్లేషించిన ఫ్రాయిడ్ జానపద సాహిత్యం సామూహిక సుప్త చేతన స్థితిలో పుడుతుందని అభిప్రాయ పడ్డాడు.

జానపద సాహిత్యం స్పష్టంగా, సరళంగా, సున్నితంగా వుంటుంది. జానపద సాహిత్యం వాడుక భాషలో వెలు వడుతుంది. భాష సరళం భావం స్పష్టం శైలి సున్నితం. ఎక్కడా క్లిష్టత కనిపించదు. ఎవరికీ అర్థం కాక పోవడ మంటూ వుండదు. శబ్దాడంబరం లేని వాడుక భాషలో, నిసర్గ మనోజ్ఞమైన భావ సంపదతో సున్నితమైన శైలిలో అందరికి ఆనందాన్ని అందిస్తుంది.

జ్ఞానపద సాహిత్యానికి శాస్త్రీయమైన సంకెళ్లు లేవు. భాషాభేషజాలు లేవు. ఛందోబంధాలు లేవు. అందుకే భాషకు సంబంధించి జానపద సాహిత్యంలో అన్య భాషా పదాలు, మాండలికాలు, వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు కొల్లలుగా దొర్లుతాయి. భాష, వస్తువు, ఛందస్సు, రస పోషణ మొదలైన వాటికి సంబంధించి ఎలాంటి లక్షణాల కట్టుబాట్లు లేవు.

ఏ సాహిత్యానికైనా, రసానందదాయక గుణం ప్రధానం. రసస్ఫూర్తితో సృష్టించబడే జానపద సాహిత్యాన్ని వినగానే అనంతమైన ఆనందం కలుగుతుంది. ప్రౌఢోక్తులు, వక్రోక్తులుండవు. సంకేతంలో పాటు ధ్వని, వ్యంగ్య, ఉక్తి వైచిత్రి లేకపోలేదు. అవన్నీ కలిసి హృదయ రంజకంగా ధ్వనిస్తూ ఆనందాన్ని అందిస్తాయి. మంచిని మంచిగా, చెడును చెడుగా చిత్రీకరించి మంచి చెడ్డల లోతు పాతుల్ని, సత్యాసత్యాలను బయట పెడుతుంది.

జానపద సాహిత్యానికి భిన్న పాఠాంతరాలుంటాయి. వాగ్రూపంలో ప్రచారానికి వచ్చే జానపద సాహిత్యం ఒక్కొక్కరి చేతిలో ఒక్కొక్క రూపాన్ని సంతరించుకోవడం వల్ల భిన్న పాఠాంతరాలేర్పడుతాయి. సంప్రదాయ ప్రభావం ఎక్కువ. సంప్రదాయం అనూచనంగా వచ్చేది. జానపద సాహిత్యం వెనుక ఆ వ్యక్తిగతమైన సంప్రదాయం వుంటుంది. అది వస్తు, భావ ఆచారాల రూపంలో వ్యక్తమవుతుంది.

జానపద సాహిత్యం ముఖ్యంగా వాగ్రూపంలో సంక్ర మిస్తుంది. మౌఖికంగా జీవిస్తుంది. సామాన్య ప్రజల్లో పుట్టి సామాన్య జనుల్లో వ్యాప్తికి వచ్చిన ఈ సాహిత్య వ్యాప్తికి వినికిడే సాధనం. అది అనుశ్రుతంగానే జీవిస్తుంది.

జానపద సాహిత్యంలో విభిన్న రకాల ప్రక్రియ లున్నాయి. అవి జానపద గేయాలు, పాటలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, కళలు, కళారూపాలు, జానపద నృత్యాలు మొదలగునవి.

జానపద నృత్యాలు :

ఇవి ప్రాంతాలను బట్టి నృత్యాలు అనేక రకాలు న్నాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క నృత్యం చేస్తుం టారు. ఇవి పాటలకు అనుగుణంగా లయబద్ధంగా నృత్యాలు చేస్తుంటారు నృత్య కళాకారులు.

గోండు నృత్యం :

ఇది గోండు తెగ ప్రదర్శించే కళారూపం. ఈ నృత్యం అదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లోని భీమ్‌దేవ్ ఆలయం గోండు తెగకు సంబంధించినది. ఇక్కడ గోండు తెగ వారు 15 రోజులపాటు జాతరను జరుపుకుంటారు. గాయకులు, నృత్యకారులు హాజరై భక్తి గీతాలు పాడుతూ వివిధ రకాల నృత్య ప్రదర్శనలు చేస్తారు. ఈ ఉత్సవాల్లో పెండ్లికూతుళ్లు ప్రధాన పాత్ర పోషిస్తారు.

పులి నృత్యం :

తెలుగు ప్రాంతాల్లో ప్రతి పల్లెలో ఈ నృత్యాన్ని ప్రదర్శి స్తారు. పులి నృత్యాన్ని ముఖ్యంగా దసరా, పీర్లపండుగ, సంక్రాంతి పండగల సందర్భాల్లో ప్రదర్శిస్తారు. పులి వేషం జంతు నృత్యాలకు అనుకరణం ఈ కళారూపాన్ని ఎక్కువగా పల్లె ప్రజలు ప్రచారంలోకి తీసుకువచ్చారు.

గుస్సాడీ నృత్యం :

ఆదిలాబాద్ జిల్లాలోని రాజగోండులు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. వీరు సమూహాలుగా చేరి నృత్యాన్ని ప్రదర్శి

స్తారు. ఈ సమూహాలను దండాలి సమూహాలు అంటారు. వీరు నెమలి ఈకలు పొదిగిన, జింక కొమ్ములున్న తలపాగా, కృత్రిమ మీసాలు, గడ్డాలు, మేక చర్మాన్ని ధరిస్తారు. ఇందులో వాయిద్యాలు, డప్పు, తుడుము, పిప్రి, కొలికమ్మ. నృత్యం అయిన తర్వాత వీరు కాళ్లు కడిగి గౌరవాన్ని వ్యక్తం చేయడం ఈ నృత్యం ప్రత్యేకత.

ఉరుముల నృత్యం :

ఉరుము అనేది ఒక చర్మ వాయిద్యం. ఈ ప్రదర్శనలో రమణీయమైన నృత్యాన్ని ప్రదర్శిస్తారు. కాబట్టి ఉరుముల నృత్యం అంటారు. ఈ నృత్యానికి కనీనం ఇద్దరు వ్యక్తులుండాలి. గరిష్ఠంగా ఎంతమందైనా వుండవచ్చు. సాధారణంగా దీనిలో ఐదుగురు సభ్యులు పాల్గొంటారు. ఆకాశంలో ఉరుముశబ్దం ఎలా వుంటుందో ఉరుము అనే చర్మ వాయిద్యాన్ని వాయిస్తే అవిధమైన శబ్దం వస్తుంది.

గరగ నృత్యం :

గరగ అంటే కమండలం, మట్టికుండ లేదా ముంత అనే అర్థం వస్తుంది. ద్రౌపది పాండవులను పెండ్లి చేసుకున్న తర్వాత ఆనందంతో తన చేతిలో వున్న చెంబును తలపెట్టుకొని నాట్యం చేసిందని ఆ చెంబు ఎంతో పవిత్ర మైనదని దాన్నే ఇప్పుడు గరగగా పిలుస్తుందని జీ.ఎస్.మోహన్ తన జానపద విజ్ఞానాధ్యయనంలో పేర్కొన్నాడు. ఈ గరగ నృత్యాన్ని తెలంగాణలో బోనాలు, దేవీ నవరాత్రుల్లోను, గ్రామ దేవతల జాతరలో ప్రదర్శిస్తారు.

సిద్ధి నృత్యం :

సిద్ధిల పూర్వీకులు ఆఫ్రికా నుంచి వలస వచ్చారు. వీరు పండుగ, శుభకార్యాల సమయాల్లో నృత్యాలు చేస్తుంటారు. పురాతనమైన దేశీయ వేషాన్ని ధరించి వివిధ కత్తులు ధరించి నృత్యం చేస్తారు.

కొండరెడ్ల మామిడి కొత్త :

ఖమ్మం జిల్లాలోని గిరిజన రైతులు (కొండరెడ్లు, బైసన్‌రెడ్లు) మామిడి పంట చేతికి వచ్చే సమయానికి ముత్యాలమ్మ కొండదేవత వంటి దేవతలను పూజిస్తూ ఈ నృత్యం చేస్తారు. ఈ నృత్యంలో ఎలాంటి వేషాలు వేయరు.

మయూరి నృత్యం :

ఖమ్మం ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే తెగలు తలకు కొమ్ములను ధరించి వాయిద్య పరికరాలను వాయిస్తూ చేసే నృత్యాన్ని మయూరి నృత్యం అంటారు.

లంబాడి నృత్యం (సుగాలీ నృత్యం) :

వీరు వరినాట్లు, కోతలు ఇంకా ఇతర వ్యవసాయ పనుల్లో వుండే లంబాడీలు చేసే నృత్యాన్నే లంబాడీ నృత్యం లేదా సుగాలీ నృత్యం అంటారు. వీరు తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఎక్కువగా కనిపిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం జిల్లాలో కూడా వున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలో ప్రతి సంవత్సరం కామున్ని పున్నమి రోజున తప్పకుండా నృత్యం చేస్తారు. ఇందులో స్త్రీ, పురుషులు కలిసే నృత్యం చేస్తారు. ఒక పురుషుడు డప్పు కొడితే దానికనుగుణంగా స్త్రీలు రకరకాల అడుగులు వేస్తూ గుండ్రంగా తిరుగుతారు. ఇందు 10 మంది వరకు నృత్య కళాకారులు పాల్గొంటారు.

జ్యోతి నృత్యం :

ఇది కులపరమైన జానపద కళారూపం. రాయల సీమలో తొగట వంశస్తులు భక్తితో తయారు చేసిన జ్యోతిని వెలిగించి నెత్తిమీద పెట్టుకొని చౌడేశ్వరీ దేవిని వర్ణించే పాటల కనుగుణంగా చేసే నృత్యం జ్యోతినృత్యం.

జోగువారి నృత్యం :

ఈ నృత్యాన్ని శవాలను శ్మశానానికి తీసుకెళ్ళే సమయంలో ఒక ప్రత్యేక పద్ధతిలో చేసే నృత్యాన్ని జోగువారి నృత్యం అంటారు.

డప్పు నాట్యం :

జంతువుల తోలుతో తయారు చేసిన వాయిద్య పరికరమైన డప్పులను కొడుతుంటే వచ్చే శబ్దం ఆధారంగా నాట్యం చేస్తారు. దీనినే డప్పు నాట్యం అంటారు.

వీర నాట్యం :

మహబూబాబాద్ జిల్లాలోని కొరవి, కొత్తకొండ

ప్రాంతాల్లో వున్న వీరభద్ర ఆలయాల్లో ఈ నృత్యం చేస్తారు. ఒక చేతితో కత్తి మరొక చేతిలో డోలును ధరించి వీరణమనే పెద్ద డప్పు వంటి చర్మ వాయిద్యం మోగుతుండగా భక్తులు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. సాధారణంగా శివాలయంలో జరిగే ధూప దీప నైవేద్యం సందర్భంగా ఆలయం ముందు వీధుల మధ్యలో వీర నాట్య కార్యక్రమాలు జరుగుతాయి. ఈ నాట్యాన్ని గోదావరి జిల్లాలో కూడా ప్రదర్శిస్తుంటారు.

కోలాటం :

కోలాటం అంటే వివిధ ప్రాంతాల్లో రకరకాలుగా పిలుస్తుంటారు. కోలాటం జట్టులో 20 నుంచి 40 మంది ఆటగాళ్లుంటారు. ప్రతి ఆటగాడి చేతిలో రెండు కోలలుంటాయి. ఈ కోలలను రంగు దారాలతో కానీ గంటలతో కాని అలంకరిస్తారు. ఇందులో పాటలు పాడానికి ఒక గురువుంటాడు. అందరిని గుండ్రంగా నిల్చోబెట్టి ఈయన మధ్యలో వుంటాడు. ఈయన పాట పాడుతుంటే అందుకనుగుణంగా నాట్యం చేస్తుంటారు.

కోయ నృత్యం :

కోయలు పండుగలు, పెండ్లి ఉత్సవాల్లో ఎద్దు కొమ్ము నృత్యాన్ని ప్రదర్శిస్తారు. పురుషులు ఎద్దుకొమ్ములను తలపై ధరించి రంగు రంగు దుస్తులను ధరిస్తారు. ఈ నృత్యంలో సుమారుగా 30 నుంచి 40 మంది పాల్గొంటారు. ఈ నృత్యాన్ని ప్రదానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వుండే కోయలు ప్రదర్శిస్తారు. తెలంగాణలో వరంగల్, ఖమ్మం జిల్లాలో కూడా ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

కుర్రు నృత్యం :

పండుగలు, పెండ్లిళ్లు, పంటలు కోసే సమయంలో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఇందులో 20 నుంచి 30 మంది పురుష కళాకారులు మాత్రమే పాల్గొంటారు. ముగ్గురు వేణువు, ముగ్గురు డ్రమ్ములను మోగిస్తుండగా ఆ శబ్దాలకు అనుగుణంగా నృత్య ప్రదర్శన చేస్తారు. ఈ నృత్యాన్ని కోయలు ప్రముఖంగా ప్రదర్శిస్తుంటారు.

థింసా నృత్యం :

ఈ నృత్యాన్ని రాజ్ గోండులు ప్రదర్శిస్తారు. పండుగలు, పెండ్లిళ్లలో ఈ నృత్యాన్ని స్త్రీలు, పురుషులు ఎవరికి వారే విడిగా సంగీతానికి అనుగుణంగా చేస్తారు. ఈ నృత్యంలో ఉపయోగించే పరికరాలు - పెప్రె, థోలు, కాళికోం మొదలైనవి.

ఆధార గ్రంథాలు :

1) ఎన్.కె. యూనివర్సిటీ, పి.జి. టెక్స్ట్ బుక్స్,
2) అంతర్జాంలోని సమాచారం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద విజ్ఞానం – ఇతర అంశాలు

– కాపర్తి స్వరాజ్యం, పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం

జానపదమంటె పల్లె లేదా చిన్న గ్రామం జానపదులంటే జనపదంలో ఉండేవారు. జానపదులకు సంబంధించింది అది వస్తు రూపమైన, భావ రూపమైన, ప్రదర్శనైన ఏదైనా సరే జానపదత్వమున్నది జానపదం. మొట్టమొదటగా ఈ పదం అమరకోశంలోను, వ్యాస భారతంలోను ఇదే అర్థంలో కనిపిస్తుంది.

జానపదుల్ పురీజనుల సంతసముం బ్రమదం బెలర్ప నీ
దైవ శుభోదయంబ హృదయంబుల గోరుచునున్న వారు స
.....

అంటూ ఎర్రన అరణ్యపర్వంలో జానపదులును గ్రామీనిలనే అర్థంలో ఉపయోగించారు. పల్లీయులు, గ్రామీణులు ఎక్కడుంటే అక్కడ జానపదత్వముంటుంది ఎందుకంటే ఈనాడు జానపదం కేవలం గ్రామాల్లోనే కాదు నగరాల్లోనూ ఉంటున్నారు అందువల్ల జానపదం ఈనాడు అంతటా ఉంది. నగరం చుట్టూ ప్రక్కల సుదూర ప్రాంతాల్లోను ఉంటాయి. ఒకనాడు చేతి వృత్తులు ప్రధానంగా పల్లె పట్టుల్లోనే ఉండేవి ఇప్పుడవి అంతటా కనిపిస్తాయి.

వ్యవసాయిక జీవన, చేతి వృత్తుల బ్రతుకుల్లో జానపదత్వం కొట్టచ్చినట్లు కనిపిస్తుంది ఆధునిక కాలంలో యంత్రాలు అధిపత్యం చలాయిస్తున్న జానపదత్వం కనిపిస్తుంది. పదిమంది ఒక గుంపు ఆ గుంపు మనస్తత్వమే జానపదమని ఆధునిక అమెరికన్, జానపద విజ్ఞాన శాస్త్రవేత్తలు నిర్వచించారు. మనదేశంలో మాత్రం జానపదత్వం జానపదం ప్రత్యేకంగా గుర్తించే విధంగా ఇంకా నిలిచే ఉంది. ఆకారణంగానే జానపదుల కళలు, ఆచార వ్యవహారాలు, జానపద సంస్కృతి, భాష, విశ్వాసాలు, సాహిత్యం, పండుగలు ఆటలు, నేటికీ వేర్వేరుగా గుర్తించి ప్రదర్శించి పరిరక్షించే పద్ధతులు కొనసాగుతున్నాయి. పాశ్చాత్యుల పరిశోధనా పద్ధతుల్ని నిర్వచనాలనీ అధ్యయనం చేస్తూ ఈ దేశంలో కనిపించే దేశీయ జానపదం లేదా భారతీయ జానపదాన్ని ప్రత్యేకంగా నిర్వచించాల్సి ఉంది. అప్పుడే పల్లెల్లో, ప్రకృతిలో పరిసరాల్లో, కళల్లో, సాహిత్యంలో, ఆచారాల్లో, విశ్వాసాల్లో, మతం, కులం, వర్ణం, వర్గం, సంస్కృతి, సంప్రదాయం, ధర్మంల్లో దాగిన జానపదాన్ని మనం గుర్తించినదంతా జానపద విజ్ఞానమవుతుంది . వీటన్నింటిని కలిపి జానపద విజ్ఞానం అంటున్నాం. ఆంగ్లంలో FOLK LORE అనే పదానికి అనువాదం ఫోక్‌లోర్ అనే పదాన్ని డబ్ల్యు.జె. థాంస్ 1846లో రూపొందించారు. జానపద ఆచార, విశ్వాసాలు, కథా గేయాలు, సామెతలు మొదలైన విజ్ఞానం "ఫోక్‌లోర్" అని థాంస్ నిర్వచించారు.

ఒకప్పుడు జానపదులంటే అనాగరికులని, మోటు వారనీ, కర్షకులనే అభిప్రాయముండేది. ఇప్పుడాభిప్రాయం మారిపోయింది. అక్షర జ్ఞానం లేని వారైనా వారి అనుభవసారాన్ని ఈ కాలంలో జానపద విజ్ఞానంగా అధ్యయనం చేయడం జరుగుతుంది ముఖ్యంగా జానపదులు ప్రదర్శన, కళలను పోషించడమే కాదు వాటిని రక్షిస్తారు. అంతేకాదు భాష, సంప్రదాయం సంస్కృతుల్లోని లోతులను అనుశీలించడం జరుగుతుంది.

ఎం. డార్సన్ Folk lore and Folk life అనే గ్రంథం యొక్క ఉపోద్ఘాతంలో జానపద విజ్ఞానం నిత్య చైతన్య స్థితిలో ఉంటుందని చెప్పాడు గత కాలానికి చెందినదయినా జానపద విజ్ఞానం వర్తమానానికి కూడ ప్రతిధ్వనినే. ఆధునిక జీవనానికి కూడా జానపద విజ్ఞానం ప్రేరణ, స్ఫూర్తిని ఇస్తుంది జానపద విజ్ఞానినం ప్రధానంగా మౌఖిక ప్రచారంలో సాగిందనేది గమనార్హం అంతేకాదు సంస్కృతికి సంబంధించినవి. జన సముదాయంలో

సాంప్రదాయకంగా ప్రసారమయ్యేవి ఏ భాషలోనైనా మొట్టమొదటి జానపద సాహిత్యమే పుడుతుంది. ఇది మౌఖిక సాహిత్యం అంటే ముఖ్యంగా ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాతనే లిఖిత సాహిత్యం వెలువడింది. దీన్ని శిష్టసాహిత్యంగా పరిగణిస్తారు. సామాన్యుల నుండి పుట్టిందే జానపద సాహిత్యం, జానపద వాఙ్మయంలో ముఖ్య భాగాలు;

1) జానపద గీయాలు
2) జానపద కళారూపాలు
3) జానపద కథలు
4) సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు

బిరుదురాజు రామరాజు జానపదగేయాలను పిల్లల, స్త్రీల, వేడుక, శ్రామిక పాటలుగా విభజించారు వీటి సాహిత్యానికి కర్తృత్వం తెలియదు. అజ్ఞాతకర్తృత్వం లేదా సామూహిక కర్తృత్వం ఉంటుంది

1) భాష నిసర్గం, సరళం
2) జీవితాలు సంస్కృతితో ముడపడతాయి
3) మౌఖిక సంప్రదాయం ఉంటుంది
4) లోక జ్ఞానానికి, సమిష్టితత్వానికి, మనోవికాసానికి తోడ్పడును

"చందమామ రావె జాబిల్లి రావె
కొండెక్కి రావె, కోటిపూలు తేవె "

లాంటి పిల్లల పాటలు వినోదంతో పాటు భాషా జ్ఞానం అందిస్తాయి. వివిధ రూపాంతారలున్నవి మౌఖికంగా గానీ మరో రకంగా గానీ తరం నుండి తరానికి సంక్రమించెవి జానపద విజ్ఞానంలో చేరతాయని "బ్రూస్ వాండ్" పేర్కొన్నారు ఉదాహరణకు కొన్ని ఊళ్లల్లో ప్రతి సంవత్సరం గౌండ్లవారు ఎల్లమ్మ జాతర జరపడం తరతారాలుగా కొనసాగుతున్న ఆచారం.

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక ప్రాధాన విభాగం ఇది మౌఖిక ప్రచారం ద్వారా ఒక తరం నుండి ఇంకో తరానికి సంక్రమించింది. గేయ, వచన, ద్రుశ్య శాఖ అనే మూడు శాఖలుగా ఈ సాహిత్యం కనిపిస్తుంది. గేయ శాఖలో చిన్నగేయాలు, పెద్దగేయాలు, వచన శాఖలో సామెతలు, పొడుపు కథల్లో కథలు నీతి, అద్భుత, వీర కథా సాహిత్యం. ద్రుశ్య శాఖలో ఆటలు భారతీయా లంకారికుల ప్రకారం పద్యం గేయంగా గద్యం వచనంగా పద్య గద్యోభయమైన చంపును ద్రుశ్య తుల్యంగా భావించడమే సమన్వయం పందొమ్మిదవ శతాబ్దం ప్రారంభం నుండి ప్రపంచంలోని సాహిత్యాభిమానులు జానపద సాహిత్య సంకలనం ప్రారంభించారు అయితే వీరి అభిప్రాయం ప్రకారం గేయాలు, కథాగేయాలు, కథలు, పెద్ద కథలు, ముక్తక గేయాలు, సామెతలు పొడుపు కథలు, తిట్లు, శాపనార్థాలు, మంచెమీద అరుపులు, మల్లెపందిరి కింద గుసగుసలు అనేకం మౌఖికం గానే ప్రచారమయ్యాయి వివిధ ప్రక్రియల్లోని సాహిత్య మంతా వీరి కారణంగా గ్రంధస్తం అయింది. అంతేకాదు లిఖిత స్థాయి నుండి ధ్వని ముద్రిత, రూప ముంద్రిత స్థితికి చేరి అందరికీ అందుబాటులో నిలచింది. మౌఖిక జానపదగేయాలు సాంఘిక చరిత్ర నిర్మాణం తెలుపుతాయి పాల్కురికి సోమనాధుడు పండితాణధ్య చరిత్రలో బసవని కథలు పాడుకునేవారు.

"శ్రీ బసబ పురాణంబు
నేలలు వెట్టంగ నింపు సొంపారు
శైలిచే గ్రాలుచు జదివెడువారు

బనవేశ్వరుడు నంస్కర్త నమాజంలో శైవం మాధ్యమంగా సంస్కరణలు తెచ్చాడు. అంతేకాదు ఆయన జీవితంలో అనేక సంఘటనల్ని ఏలలుగా, చారు గీతాలుగా ప్రజలు పాడుకుంటున్నారు. ఆ ఏలతా, ఆపాటలూ మౌఖిక ప్రచారంలో నేటి వరకున్న నిదర్శనాలు లేవు. అంతేకాక ఆకాలంలో భారతాది కథల్ని తోలు బొమ్మల ప్రక్రియలో ప్రదర్శించేవారు. 12వ శతాబ్దం నుండే ఈకళారూపం ఉంది.

భారతాది కథల చారమతాగుల
నారంగ బొమ్మల నాడించువారు

ఉత్సవాల్లో ఆడిన ఆటలు - పాటలు మౌఖిక ప్రచారంలో అలాగే నిలిచి ఉంటే చరిత్రనిర్మాణానికెంతో ఉపయోగపడేవనది సత్యం. గ్రంధస్థ అంశాలు తప్ప ఆనాటి జానపదుల పాట మౌఖిక ప్రచారంలో నిలచి మనకు లభించలేదు.

జానపద విజ్ఞానంలో రెండవది ''భౌతిక సంస్కృతి'' సాహిత్యంతో పాటు సంస్కృతి లేదా వస్తు సంస్కృతి ప్రధాన పాత్ర వహించింది వివిధ వృత్తుల్లో జీవనం కొనసాగించే మానవునికి ఆయా ప్రత్తి సంబంధ పరికరాలు కావాల్సి వస్తాయి. ఆపరికరాల నిర్మాణంలో, వస్తూత్పత్తిలో తనదైన ప్రత్యేకతను జానపదుడు సంతరించుకున్నాడు వ్యవసాయం, వడ్రంగి, కమ్మరి, నేత, గీత, అల్లిక అలంకరణ ఏదైనా సరే జానపద సంస్కృతి చిహ్నమైతే అది భౌతిక సంస్కృతే. జానపద సాంఘికాచారం మూడవది. జానపద విజ్ఞానంలో వస్తు సంస్కృతితో పాటు సాంఘికాచారాలకు ప్రధాన స్థానముంది జీవిత మలుపుకు గుర్తుగా ఓ పండగో, పబ్బమో ఉత్సవమో, జాతరో జీవితంలో స్థిరపడి కొంతకాలానికి ఒక సముదాయానికి, జాతికి చెందిదై నిలచిపోయి తరం నుండి తరానికి సంక్రమించి స్థిరపడును వేడుకలు, తిరునాళ్లు, ప్రభలు, బోనాలు తీయడం, మంత్రాలు, తాయెత్తులు కట్టించుకోవడం మొదలైనవన్నీ సాంఘికాచారాలే. ఇవేకాక పుట్టుక, చావు వరకు భారతీయ సమాజం అనుసరిస్తున్న షోడశ సంస్కారాలకు కొంత అటు ఇటుగా అనేక ఆచారాలు వచ్చాయి. ముక్కు, చెవులు కుట్టించడం తిలకధారణం, తీనేదీసి అలలకడం, చెట్లకు వివాహాలు, బ్రుందావనాలు, వనవాసాలకు వెళ్లడం, బండ్లు తీయడం, కల్లుసాక పోయడం, కాకి ఇంట్లోకి వస్తే శాంతి అనేక కట్టుదిట్టాలుండడం ఇంకా ఎన్నో అంశాలు ఆచారాల కిందకి వస్తాయి .

ఈ ఆచారాల్లో దురాచారాలుంటాయి సదాచారాలుంటాయి. దురాచారం శాశ్వత కాలాల పాటు నిలవదు కాని సదాచారాలు మాత్రం ఎప్పుడు ఉంటుంది. అయితే అది దేశ, కాల పరిస్థితుల్ని సమన్వయించుకుంటు కొనసాగుతుంది. ఇంటిని అలకడం, ముగ్గులేయడం, కడపలు కడిగే పసుపు కుంకుమలు బొట్లు పెట్టడం ఆరోగ్య విధులైన ఆచారాలు, వివాహ సందర్భంలో తోరణాలు కట్టడం, పోలు, గంధాక్షింతలు, కర్మ ఆచారాలు, ఆచార మనేది ఓకార్యం కార్యాకారణ సంబంధం లేకుండా ఆచారాలు రావు పోవు

ఇంతింతాకు - బ్రహ్మంతాకు

పెద్దలు పెట్టిన - పేరంటాకు

మంగళసూత్ర ధారణం అన్ని ప్రాంతాల్లో లేదు కాబట్టి ఇలాంటివి ఏ ప్రాంతంలో ఏకాలంలో పుట్టాయనేది నిర్ధారించలేం .

''జానపద ప్రదర్శన కళలు'' జానపద విజ్ఞానంలో నాలుగవది, వ్యష్టి నృత్యాలు, సమిష్టి నృత్యాలు, నాటకాలు, సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, వాస్తుకళ తది తరాలు జానపద ప్రదర్శన కళలు. నిత్యం తన ధర్మాన్ని పాటిస్తూనే జానపదుడు ఏ రాత్రి వేళో, ఏ పండుగ పూటనో వినోదంకై తనవైన కళల ప్రదర్శనలో సంతోషం నింపుకున్నాడు యక్షగానాలు, తోలుబొమ్మలాటలు, భజనలు, పగటివేషాలు, గారడి, పులివేషాలు ఇంకా అనేక ఆటలు తనదైన బాణీలో ఆడుతూ పాడుతున్నాడు. ఈ జానపద ప్రదర్శన కళల కారణంగా సర్వభారతీయ భాషల్లోని కళల మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది చివరిది ''జానపద భాష'' సాహిత్యంలో అంతర్భాగమయినా ప్రత్యేక గుర్తింపు పొందింది ఉచ్చరణ మండలిక పదాలు, గ్రామీ నామాలు, అరుపులు మొదలైనవి భాష తిట్లు, ఒట్లు కూడా భాషే . ఒక భాషలోని వివిధ మండలిక క్రియలు గిరివాసి, పురవాసి, గ్రామవాసి ఉచ్చారణలో వైవిద్యం తెలుస్తుంది.

''జానపద విజ్ఞానం'' అనే గ్రంథంలో ఆర్.వి.ఎస్. సుందరం ఎన్నో జానపద వాజ్ఞ్మమ విశేషాలు వివరించారు. ముఖ్యమైనదిగా ''గేయశాఖ'' చెప్పవచ్చు జానపద గేయాలు కథా విరహితాలు , కథా సహితాలు శ్రామిక గేయాలు 'పని-పాట' అనేది తెలిసిందే ఎప్పుడైతే మాన

వుడు పని నేర్చుకుంటాడే అప్పుడే పాట పుడుతుందని నిర్ణయించారు శ్రమను మరిచిపోవడానికి పాట పుట్టిం దనేది గమనార్హం.

"ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపుసొలుపే మున్నది" వానపాటలు, ఏరుపాటలు, రైతు, రోకలి పాటలు, " హైలెస్సా ఓలెస్సా" ఇవాన్నీ శ్రామిక గేయాలు ఇవే కాక పారమార్థిక, పిల్లల, క్రీడాత్మక గేయాలు కలవు పండుగలకు, వ్రతాలకు, నోయులకు కూడ గేయాలు కలవు వావి వరసలకు సంబంధించిన గేయాలు కలవు అంతేకాదు జన జీవనంలోని సర్వాంగాలను జానపద గేయం స్పృశించింది. జానపద సాహిత్యంలో "వచన శాఖ" ఎంతో విస్తృతమైంది. దీనిలో కూడా కథా రహిత కథా సహితాలు కనిపిస్తాయి. కథా రహితాలైనవి సామెతలు, పొడుపు కథలు జాతీయాలు

సామెత అంటే నానుడి "సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు" అనేది తెలుగు భాష ప్రాశస్త్యం , తెలుగువారి గృహ ధర్మం తెలుపుతుంది ఆమెత అంటే విందు సామెత అంటే అనుభవం సంస్కృత సామ్యశబ్దం ఆసాధు రూపం సామ్యత అనీ, సామ్యతే సామెత అయినదనీ, సాటి అయినదే సాటవనీ సాటి జేసి చెప్పడం సామెత గుణమనీ తెలుగు సామెత పీఠకకర్తలు అంటారు సామెతలు సాధారణంగా జన సామాన్యం నుండి పుట్టుకుని వచ్చును వారి అనుభవాలు, అభిరుచులు వానిలో ప్రతి బంబించు చుండుననేది సత్యం. సామన్య కుటుంబ జీవితంలోని చిన్న చిన్న సన్నివేశాల నుండి పుట్టి సామెతలు రూపురేఖలు ఏర్పరుచుకునును అన్నీ ఉన్న విస్తరి అణగే ఉంటుంది ఏమి లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది ఈసామెతలో విస్తరి గురించి చెప్పినట్టుంది కాని మనుషుల వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది బాగా చదువుకున్న వాడు లేదా కలిమి కలవాడు అణిగి ఉంటాడు లేని వాడే గొప్పలకు పోతాడు.

"ఇంటికి ఈలకత్తి , పారుగుకు బంగారు కత్తి" "దీపముండగా ఇల్లు చక్క బెట్టుకోవలెను" "పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా" "చిత్త శుద్ధిలేని శివపూజ లేలరా" "కంచు మోగినుట్లు కనకంబు మోగునా" వేమన పద్యం ల్లోని మూడో పాదం సామెత రూపమే. సామెతల్లో కూడ హాస్య ప్రధానం, కరుణ, శృంగార మొదలైనవిగా కలవు. తీగకు కాయబరువా అనే సామెత వాస్తవికత తెలుపు తుంది.

పొడుపు కథలు :

పొడుపంటే ఉదయం - జ్ఞానం మానవుడెప్పుడు పుట్టాడో పొడుపు కథ అనాడే పుట్టిందనేది నమ్మలిన విషయమే అయితే మానవుని పుట్టుకతోనే సమస్య పుట్టింది. ఆసమస్యల్ని సాహిత్యం ప్రతిబింబించింది. పరిష్కార మార్గాలు సూచించింది. సమస్య నిర్మాణం పొడుపు చెబితే, పరిష్కారం విడుపు చెప్పింది పొడుపు, విడుపును స్పష్టించింది మనిషీ చీకటి లాంటి పొడుపులో ఉదయంలా విడుపు వస్తుంది పొడవడం వల్ల అంటే తట్టడం, వల్ల జ్ఞానం వస్తుంది తెలుగు జానపదుల నోట వేలకొలది పొడుపు కథలు వినిపిస్తున్నాయి వాటి ఆధారంగా పొడుపు కథ "జానపది" అని నిరూపించే వీలుంది. పొడుపు కథల పాదాలు బట్టి ఏకపది , ద్వి , చతు, పంచ, షట్, సప్త, అష్టపది మొదలైన విభాగాలుగా చేయవచ్చు. పొడుపు కథల్లో గ్రహనికి సంబంధించినవి, శ్రామిక, ప్రకృతి, హాస్య, క్రీడ మొదలైన విదాలుగా ఉంటాయి.

పొద్దున్నే పోయి
పెద్ద ఎనుము బావిలో పడె (కపిల)

శ్రామిక జీవనం సూచించేవి. శ్రమ వినోదం కోసం ఉపయోగించారు .

గాలి కన్నా వేగమైందేది (మనస్సు)
చచ్చేదాక చావనిది (ఆశ)

ఇలాంటివి తాత్విక పరమైనవి. మానవ జీవనంలో పెనవేసుకున్న అంశాలు

ఉద్యోగం సద్యోగం లేదు
ఊరంతా వ్యాపకమే తీరిక లేదు (కుక్క)

గొలుసు కట్టు లేకుంటే కుక్కకు పేమిటి ? ఊరంతా తిరిగిరావడమే నిజానికి ప్రహేళికారుని పరిశీలన గమనార్హతే కాదు అంతే అంతరార్థం అందుకో దగ్గది ఆచరించదగ్గది ఇలాంటి వాటిని తిర్యక్ సంబంధి ప్రహేళికలు అంటారు.

జానపద వచన శాఖలో కథలు కూడ భాగమే "ఉండగ ఉండగ అనగా అనగా" తో ప్రారంభమై కథ అతివేగంగా విస్తరించి, కథ ఎవరు చెబితే వారి పేరిట ప్రచారమైంది అమ్మమ్మ కథలు బొమ్మ, అవ్వ మొదలయినవి గ్రామీణ జీవనం, నది, పర్వత, అరణ్య జీవన కథలుగా చెప్పవచ్చు గధ్య కథనాలు పురాణాలు, ఐతిష్యం, కథ విభజించవచ్చు.

దృశ్యశాఖ :

మనషులు ఆడేవి, ఆడించేవని రెండు విధాలుగా ఉంటుంది యక్షగానం, చిరుతల నాట్యం, పగటి వేషాలు, వీధి నాటకాలు మొదలైనవి మనుషులు ఆడేవి తోలు బొమ్మలు, చెక్క బొమ్మలు మొదలైనవి మనుషులు ఆడించేవి యక్షగాన, చిరుతల నాట్యాది సాహిత్యాల్లో గేయాన్ని అనుసరించి వచనం, వచనాన్ని అనుసరించి గేయం వస్తుంది ప్రధాన ద్రశ్య ప్రక్రియలన్ని గేయ వచన మనే చంపూ పద్ధతినే అనుసరించాయిన చెప్పాలి. జానపద విజ్ఞానం , సాహిత్యం జనపదంలో అంతర్భాగాలు.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నల్లగొండ జిల్లా జాతరలు – విశిష్టతలు

– మునగపాటి అరవింద, పరిశోధక విద్యార్థిని ఉస్మానియా విశ్వవిద్యాలయం.

జాతి మేలు చేకూర్చేది జానపద సాహిత్యం. జానపదుల జీవితాలకి సంబంధించిన సమస్త విషయాలు జానపద సంస్కృతిలోనివే. ఆచార సంప్రదాయాలు, ఆట పాటలు, జాతరలు, పండుగలు, వేడుకలు, అలవాట్లు, నమ్మకాలు, భాష, కథలు - దాదాపు అన్ని అంశాలు జానపదుల జీవన సరళిని చాటుతున్నాయి. జానపద సాహిత్యం "దేశీ కవితాశాఖ" కు చెందినది. జానపద సాహిత్యాన్ని "శాబ్దిక కళ" అంటారు. జానపద సాహిత్యం "సంప్రదాయ సాహిత్యం" కన్న అతి ప్రాచీనమైనది.

"జాతరలు" సాంఘిక జానపదాచారాల విభాగానికి చెందినవి. గ్రామీణుల విశ్వాసాలకు జాతరలు దర్పణాలు. "పబ్బం, పండుగ, పండువ, ఉత్సవం, దేవతంతు, జాతర, సాకము, కొలుపు" - అనే పదాలు జాతరకు పర్యాయ పదాలుగా వాడబడ్డాయి. జాతరలు జానపదులకు నూతన చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ఆనందాన్ని చేకూరుస్తాయి. దేవతల మీద వారికుండే శ్రద్ధాశక్తులు, భయభక్తులు జాతర్లలో, ఉత్సవాల్లో వెల్లడవుతుంటాయి. జాతరలు, ఉత్సవాలు, జానపద విజ్ఞానానికి భాష్యాలు, భాండాగారాలు.

జాతర్ల వలన ప్రజలు ఆడ, మగ, పిల్లా, పెద్ద తేడా లేకుండా తమ కష్టాలను, కన్నీళ్ళను మరచిపోయి ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆప్యాయంగా, పలకరించుకుంటూ, చేతులు కలుపుకొంటూ సమైక్యంగా నడుస్తారు.

నల్గొండ జిల్లా చరిత్ర పురాతనమైనది. జాతరలకు నల్లగొండ జిల్లా పెట్టింది పేరు. జానపద విజ్ఞానంలో శైవమత ప్రభావం, వైష్ణవ మత ప్రభావం ఎంత ప్రగాఢంగా ప్రబలి ఉన్నదో జాతరల వలన తెలుస్తుంది. నల్లగొండ జిల్లాలో జరిగే శైవ జాతరలకు, జాతరలు నడిపించే తీరులో, పూజా విధానంలో చాలా వైవిధ్యం కనిపిస్తుంది.

శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి జాతర:

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో జరిగేది. ఈ జాతర ప్రతి సంవత్సరం మాఘశుద్ధ సప్తమి (రథసప్తమి) నాడు ప్రారంభమై శుద్ధ దశమి నాటికి ముగుస్తుంది. ఈ జాతర స్వామివారి కళ్యాణ మహోత్సవంతో ప్రారంభమవుతుంది. ఈ జాతర విశిష్టత ఏమిటంటే జారతలోని పూజారులు బ్రాహ్మణేతర జాతికి చెందిన "తంబళి" కులస్థులు. వీరు వీరశైవులు. వీరికి శివ పూజాధికారం లభించింది. ఇక్కడ మొక్కుబడులుగా తెచ్చిన గొఱ్ఱెలను, మేకలను, కోళ్ళను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని దేవాలయాభివృద్ధికి, ఇతర కార్యక్రమాలకు వెచ్చిస్తారు. జంతుబలి మాత్రం చేయరు. సోమవారం, శుక్రవారం ఆరాధనలు జరుగుతాయి. యాత్రికులు మొక్కుబడిలో భాగంగా, కోవెల వద్ద తలనీలాలు సమర్పిస్తారు. చెర్వుగట్టు జాతర కొత్తదంపతులకు, జానపదులైన ప్రేయసి ప్రియులకు సందడే సందడి.

లింగమంతుని జాతర :

ఈ జాతర రెండు సంవత్సరాలకొక పర్యాయం జరుగుతుంది. సూర్యాపేటకు ఆరుమైళ్ళ దూరంలోనున్న 'దురాజ్‌పల్లి' గ్రామ సమీపంలో గుట్టపైన లింగమంతుల స్వామి వెలసి ఉన్నారు. ఈ జాతర మాఘ పూర్ణిమ రోజు ప్రారంభమవుతుంది. అయిదు, ఆరు రోజులు జాతర సాగుతుంది. ఈ గుట్టను 'పెద్దగుట్ట' అని కూడా అంటారు. ఈ జాతర విశిష్టతలు కేవలం యాదవుల కొరకు ఏర్పడిన జాతర అయినప్పటికీ, అన్ని కులాలవారు పాల్గొంటారు. ఈ గుట్టపైననే చౌడమ్మ అనే శక్తి దేవతల ఉంది. స్వామి సన్నిధికి చేరాలంటే 'తొంభైతొమ్మిది' మెట్లు

ఎక్కి రావలసి ఉంటుంది. లింగమంతుల స్వామికి జంతుబలి అంటే ఎంతో ఇష్టం. మొక్కుబడుల పేర భక్తులు బలి ఇచ్చిన గొఱ్ఱెల, మేకల రక్తం కొండపై ధారలు కడుతుంది. కాని 'రక్తంపై ఈగలు వాలకపోవడం' ఇక్కడి విశేషం.

యాదవులు వీరశైవులు కాబట్టి గజ్జెలు కట్టిన ఎర్ర నిక్కర్లు ధరించి, త్రిశూలాలు, బడిశెలు, ఈటెలవంటి ఆయుధాలను దాల్చి బండ్లముందు చిందులు వేస్తూ - "ఓ లింగా! ఓ లింగా!" అంటూ "లింగో లింగా! ఓ లింగా!" అంటూ లింగమంతుని చేరుకుంటారు. లింగ మంతునికి సమర్పించే "బోనం"లో పొరపాటున కూడ "ఉప్పు" వేయకపోవడం ఇక్కడి విశేషం. స్థానిక కోనేరు లోని నీరు మీద చిలకరించుకొంటే కోరికలు నెరవేరు తాయనే విశ్వాసం బలంగా ఉంది.

స్వయంభూ శంభులింగేశ్వర స్వామి జాతర :

మేళ్ళచెర్వు గ్రామంలో స్వయంభూ శంభు లింగేశ్వర దేవాలయం ఎంతో చారిత్రక నేపథ్యం గలది. ఈ దేవాలయం పేర జరిగే జాతరలకు 'మేళ్ళ చెర్వు జాతర' అని జానపదులు పిలుస్తారు. ఇది కాకతీయుల నాటిదని చారిత్రకుల అంచనా. ఇక్కడ శివలింగం తెల్లని ఆకారంలో, అరడుగుల ఎత్తు, ఒక అడుగు వెడల్పు చుట్టు కొలత కలిగి ఉంది. ప్రతి సంవత్సరం మాఘ బహుళ చతుర్థశి మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకొని, అయిదు రోజులపాటు ఇక్కడ జాతర జరుగు తుంది. ఈ జాతర విశేషం అవుల్ని, దూడల్ని మొక్కుబడి క్రింద చెల్లిస్తారు. వాటిని ధ్వజస్తంభానికి కట్టివేస్తారు. దేవాలయ కమిటీవారు వేలం పాటలో వాటిని అమ్మి ఆ ధనాన్ని జాతర ఖర్చులకు వినియోగిస్తారు. సంతానం లేని స్త్రీలు తడి గుడ్డలతో అయిదు రోజులు దేవుని పూజిస్తే సంతానం కలుగుతుందనే విశ్వాసం భక్తులకు ఉంది.

శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర :

శివవరమైన జాతరలో వ్యవసాయదారులు మొక్కుబడులు చెల్లించే జారతలో ఈ జాతర ఒకటి. ఈ దేవాలయం దేవరకొండ తాలుకా చండూరు మండలం లోని తుమ్మలపల్లి గ్రామంలో ఉంది. మాఘ బహుళ దశమి నుండి మాఘ పౌర్ణమి వరకు ఆరు రోజులు జాతర జరుగుతుంది. ఇది ఒక విలక్షణమైన శివక్షేత్రం. ఇక్కడ రెండు లింగాకారాలు, రెండు గుండాలు, రెండు గోపురాలు ఉన్నాయి. ఈ రీతిగా ఏ శివక్షేత్రంలో లేవు. ఇక్కడి విశిష్ఠత - భక్తులు అగ్నిగుండంలో నడుస్తారు. శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దయవలన తమ పంటలు పురుగు దాడికి గురికాలేదని విశ్వసించి డబ్బాల కొద్ది ఆముదాన్ని దేవునికి సమర్పించుకుంటారు.

మల్లన్న జాతర :

భువనగిరికి ఎనిమిదిమైళ్ళ దూరంలోనున్న మర్యాల గ్రామంలోని చౌదర్‌పల్లిలో మల్లన్న దేవాలయం ఉంది. లింగాకారంలో కాకుండా మానవాకృతిలో ఉంటాడు మల్లన్న దేవుడు. ఈ జాతర ప్రతి సంవత్సరం మాఘ శు ద్ధ ద్వాదశి నాడు ప్రారంభమై, చతుర్థశి వరకు మూడు రోజులు జరుగుతుంది. ఈ జాతర విశేషాలు, "దిష్టి కుంభం" అనే కార్యక్రమం నిర్వహించబడుతుంది. జాతరలో మొక్కుబడులుగా తలనీలాలు కాకుండా మీసాలను, గొడుగులను సమర్పించుకుంటారు. మీసాలు పౌరుషానికి చిహ్నాలంటారు. భక్తులు తమ అహంకారాన్ని త్యజించామని, భగవంతునికి నివేదించటమే ఈ మీసాల సమర్పణలోని అంతర్యం. ఈ జాతర మరో విశేషం మల్లన్న దేవర దగ్గర పూజారి యాదవ కులస్థడుంటాడు. మల్లన్న జాతర సమాచారాన్ని విన్నప్పుడు జంగాల ఘృత హోమ నిర్వహణ చూసినప్పుడు, జానపదులపై వీరశైవ మత ప్రచారం ఎంత గాడంగా ముద్రవేసిందో తెలుస్తుంది. ఈ జాతరలో జంగాలు సమావేశమై నెయ్యితో హోమాన్ని ప్రజ్వలింపజేస్తారు. మల్లన్న జాతరలో యాదవులు, జంగాలు ప్రధాన పాత్ర నిర్వహిస్తారు.

మార్కండేశ్వర స్వామి జాతర :

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ చవితి నుండి మాఘ శుద్ధ దశమి వరకు భూదాన్ పోచంపల్లిలో జరుగుతుంది.

ఏడు రోజులు జరుగుతుంది జాతర పద్మశాలీయులు నిర్వహించే జాతర ఇది. ఈ జాతర విశిష్టత అనాదిగా జానపద జాతరలలో కొనసాగే పూజా విధానానికి భిన్నంగా స్వస్తివాచకం, పూర్ణాహుతి, యజ్ఞం మొదలైన కార్య క్రమాలు చోటు చేసుకున్నాయి. ఇది జారపద నాగరి కతను, వైదిక నాగరికతకు మధ్య దూరం తరిగిపోవుటచే సంభవించిన నూతన పరిణామం.

తిరుమల నాథ స్వామి జాతర :

నల్లగొండ జిల్లాలో జరిగే వైష్ణవ జాతర్లలో విశిష్టమైనది. ప్రతి సంవత్సరం ఫాల్గుణమాస బహుళ సప్తమినాడు ప్రారంభమై, ఏకాదశి వరకు జరుగును. చిట్యాల మండల కేంద్రానికి 5 కి.మీ. దూరంలో నున్న పెద్ద కాపర్తి గుట్టపైన ఈ జాతర జరుగుతుంది. ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణ ఫలహారపు బండ్లు. మొక్కుబడి ఉన్న భక్తులు బండ్లను అందంగా అలంకరించుకొని, ఎద్దులకు పసుపు కుంకుమ లతో పూజలు చేసి ఫలహారాలను బండ్లపై పెట్టి గుట్టపై స్వామి ఆలయం వరకు బండ్లను ఎక్కిస్తారు. ఇక్కడ ఇంకో విశేషం - అన్నం ముద్దలను ఆకాశంలోకి విసిరి వేస్తారు. భక్తుల దేవతల ఆహారంగా స్వీకరిస్తారు. భక్తులు రథోత్సవం నాడు గుమ్మడికాయలను మొక్కుబడిగా సమర్పించుకుంటారు. జాతర జరిగినన్నాళ్ళు అఖండ జ్యోతి వెలుగుతూ ఉంటుంది.

గరిడెపల్లి వెంకటేశ్వర స్వామి జాతర :

నల్లగొండ జిల్లాలో వైష్ణవ జాతరలలో జంతుబలులు ఎక్కడా లేవు. కానీ గరిడెపల్లి జాతరలో సగటున వెయ్యి మేకలకు పైగా బలి ఇవ్వబడుతాయి. స్వామి వారి నైవేద్యంలో మాంసాహార నివేదన ఒక విచిత్రమైన సంప్ర దాయం. ఇప్పుడు పులిహోర, కొబ్బరికాయ నైవేద్యంగా సమర్పిస్తారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి మెడలో మాలవలె, గరిడేపల్లి వేంకటేశ్వరస్వామి మెడలో సాలా గ్రామాల దండ ఉండటం విశేషం.

శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి జాతర :

'అర్వపల్లి' జాతరగా ప్రసిద్ధి. మాఘపౌర్ణమి నాడు జాతర జరుగుతుంది. జానపదులకు శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి పట్ల భక్తి విశ్వాసాలు ఎక్కువ. సంతానం లేని స్త్రీలు ఈ దేవున్ని పూజిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని విశ్వసిస్తారు. నలుబది రోజులు స్వామిని పూజించి ప్రదక్షిణలు చేసినచో, స్వామివారు ఆ భక్తులను అనుగ్రహిస్తారని, స్వామి అనుగ్రహించాడనుటకు సూచనగా స్వామి వారి మెడలోని దండ నుండి పూలు రాలిపడతాయని జానపదులు విశ్వసిస్తారు.

సీతారామచంద్రస్వామి జాతర :

హుజూర్‌నగర్‌లో ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ చతుర్ధశి నాడు ప్రారంభమై వారం రోజులు జరుగుతుంది. సంతానం లేని స్త్రీలు ఈ జాతరలో ధ్వజారోహణ సమయాన 'గరుడముద్ద' అందుకున్నట్లయితే సంతానం కలుగుతుందనే విశ్వానం ఉంది. అందుకే స్త్రీలు ఎక్కువగా ఈ జాతరలో పాల్గొంటారు.

నల్లగొండ జిల్లా జానపద విజ్ఞానానికి ఈ జాతరలు పట్టుగొమ్మలు. జానపద విజ్ఞానంలో శైవమత ప్రభావం ఎంత ప్రగాఢంగా ప్రబలి ఉన్నదో ఈ జాతరల వలన తెలుస్తుంది. వైష్ణవ జాతరలోని ఆచార వ్యవహారాలు, శైవ జాతరలోకంటె కొంచెం భిన్నంగా కనిపిస్తున్నాయి. వైష్ణవ జారతలన్నింటిలో జానపదులు పాల్గొన్నప్పటికీ అక్కడి పూజా విధానాలు, పూర్ణాహుతి, స్వస్తి వాచనం, గరుడసేవ మొదలగునవి కార్యక్రమాలు జానపద జాతరలలో పూజా విధానానికి వ్యతిరేకమనుట యదార్ధం. తెలంగాణ ప్రాంతాల్లోని జాతరలకు, నల్లగొండ జిల్లాలో జరిగే శైవ జాతరలకు జాతరలు నడిపించే తీరులో, పూజా విధానంలో చాలా వైవిధ్యం కనిపిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. నల్లగొండ జిల్లా జాతరలు-పరిశీలన - డా॥ చింతల యాదయ్య.
2. హిందువుల పండుగలు-1987 - సురవరం ప్రతాపరెడ్డి. 3. నల్లగొండ మండల సర్వస్వము-1986 - బి.యన్.శాస్త్రి.

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సాహిత్యంలో – సామెతల విలువలు

-పొన్నక శ్రీనాథుడు, పాఠశాల సహాయకుడు(తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగవరం(గ్రా), చిట్వేలి(మం), కడప జిల్లా.

జీవపరిణామ క్రమంలో జంతువు నుండి వేరు పడిన ప్రాథమికస్థితి ని హోమో సెపియన్స్ అని అంటారు.అంటే బుద్ధిజీవి అయిన మానవుడు ఇలాంటి వ్యక్తి కాలాను క్రమం పరిక్రమిస్తూ సమూహాన్ని సంఘంగా మార్చి ఆ సంఘోపలబ్ధిజీవిగా మారాడు. సంఘం అంటే సంస్కృతిని ఆచరణలో పెట్టే మానవ సమాహారం.ఇందులో పరస్పరాపేక్షతో తమకు తాము సాంఘిక, ఆర్థిక, వ్యవ హారిక రంగాల్లో కొన్ని నిబంధనలను నిర్ణయించుకుని ప్రవర్తించడం. ఇది కాలానుగుణంగా కొన్ని మార్పులకి లోనుకావడం అనివార్యం. ఇలాంటి మానవ సంఘ సంస్కృతి అధ్యయనానికి ప్రారంభమే జానపద విజ్ఞానం.

జానపద విజ్ఞానాన్ని ఆంగ్లంలో 'ఫ్లోక్‌లోర్' అని పిలు స్తారు. ఈ జానపద విజ్ఞానాన్ని అనేక మంది నిర్వచించినా జానపద విజ్ఞానకోశంలో దీనికి 21 నిర్వచనాలు ఇవ్వ బడ్డాయి. ఇది శాబ్దిక కళ లేదా వాగ్రూప కళ అని పేర్కొంటూ "మానవశాస్త్ర పరిభాష లో జానపద విజ్ఞాన మంటే మౌఖిక ప్రచారంలో ఉన్న పుక్కిటి పురాణాలు, ఐతిహ్యాలు, జానపదకళలు, సామెతలు, పొడుపు కథలు, కవిత్వం మరియు కళాత్మక వ్యక్తీకరణ ఉన్న అనేక ఇతర ప్రక్రియలు" అని విలియం ఆర్. బస్కామ్ నిర్వచించారు.

ముఖోద్గతంగా జానపద పరంపరలో వెలుబడిన మాట, పాట, ఆటలు విస్మృతిలో గేయంగా, కథా గేయంగా, జానపద పురాణ ఐతిహ్యాలుగా వచనరూపంలో ఉండే కథలు, సామెతుల, పొడుపుకథలు, మాండలి కాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు.... రూపాలు సంత రించుకున్నాయి.

నిరంతర శ్రోత్సమయమైన భాష అనేక మలుపులు కాలానుగుణంగా తిరుగుతుంది. బాల్య, యవ్వన, వృద్ధాప్య దశలను సంతరించుకంటూ సాగరసంగమం చేసే ఓ నది ప్రస్థానం భాషకి ఉంది. తన సాగర సంగమంతో అస్థిత్వాన్ని కోల్పోయిన నదీస్వరూపం సముద్ర రూపంలో తన వైశాల్యాన్ని ప్రదర్శిస్తుంది. భాష సజీవ మైనది. సర్వత్రా తన స్వరూపాన్ని ప్రదర్శించగలిగింది. తనకు తాను తన రూపాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించు కోగలిన బాషాంశాలు సామెతలు, పొడుపుకథలు, జాతీయాలు. తొలి అడుగు సామెతలతో మొదలెడదాం.

అక్షరజ్ఞానం లేకున్నా ఉన్నా సామెతని ప్రకటించని పామరుడు,పండితుడు లేడు.

"సామెత లేని మాట అమెత(విందు) లేని ఇల్లు" అని ఓ తెలుగు సామెత.

'సామ్య శబ్దానికి సామ్యత అని అసాధారణ రూపం ఏర్పడి సామెత గా రూపొందింది. అదే ప్రచారంలో ఉం దంటారు డాక్టర్ చిలకూరి నారాయణ రావు గారు. పరిసర భాష కన్నడం నుంచి 'సామతి', గాదె, నాణ్ణుడి, తమిళ, మళయాళంలో పళమొళి, పళచొల్లు అన్నది వ్యవహారం. సంస్కృతంలో లోకోక్తి, సూక్తి, సుభాషితం, ఆధునిక భాష ఆంగ్లంలో ప్రోవర్బ్, ఇంకా సరదాగా రాయలసీమ,నెల్లూరు మాండలికాలలో సామెతకి చాటువ, చాటవ అనే వ్యవ హారాలున్నాయి. ఇన్ని మాటలు ఎందుకు 'బేకన్' తత్వవేత్త పదునైన వాక్పరికరాలు గా ఈ సామెతలని పేర్కొంటారు. హమిద్ అనే విద్యాంసుడు ఆహారానికి ఉప్పులాంటిది భాషకు సామెత అంటాడు. కానీ రస్సెల్ గారి మాటని నేను సమర్థిస్తూ అయన అన్నమాటే అనేక మంది జ్ఞానం, ఒకరి చమత్కారం సామెత అన్న మాటతో ఏకభవిస్తూ సామెత గురించి.....

'సామెతలకి ఏ ఒక్కరిని స్రష్ట,ద్రష్ట గా చెప్పలేము.ఇది ఒక అనామక పండిత, పామర వ్యక్తుల జీవితానుభవం లోంచి పుట్టినవి. కొన్ని సందర్భాల్లో పరిమితంగా కొన్ని

సందర్భాల్లో సార్వత్రికంగా వ్యక్తమయ్యే సామెతలు, సూక్తులు, జనాంతికాలు,లోకోక్తులుగా ప్రకటితమౌతున్నాయి. ఇందులో శబ్దాలంకారం, చమత్కారం అన్నింటికి మించి ఓ అనుభవ కథతో కూడివుంటుంది.

లక్షణప్రాయంగా సామెతలు సూత్రపు,ధ్వని, మాదిరి, కథల, సాంప్రధాయం, పౌరాణికం, హాస్యపు, ప్రశారూఎ -ప్రశ్నోత్తర రూప, చారిత్రక వ్యక్తుల-సంఘటనల నుంచి పుట్టిన, వర్తక వ్యాపారం నుంచి పుట్టిన, భూషణాల నుంచి, నీతిబోధకాల నుంచి, ఉపమాన రూపకాల నుంచి, ఆశ్లీల సామెతల నుంచి అనంఖ్యాకంగా కనిపిస్తాయి. రేఖామాత్రంగా ప్రస్తావిస్తా...

సూత్రపు సామెతలు :

కలిమిలేములు కావటి కుండలు

ఉన్నస్థితిని, లేని స్థితిని మనిషి జీవితంలో ముందు వెనుకలుగా జీవిత గమనంలో మోయాల్సిందే. ఇది జనపదం అనుభవం. ఇదే మాటని సంపద ఎలా వస్తుందో ఎలా పోతుందో తెలియదంటూ శిష్ట సాహిత్యంలో సిరితా వచ్చిన వచ్చును సలిలితముగా నారికేళ భంగిన్ అంటూ సిరితా పోయినా పోవును కరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ అంటూ బద్దెన గారు అంటారు. ఇలాగే శ్లిష్టసాహిత్యంలో మాట.

అంత్య నిష్ఠురం కన్నా ఆది నిష్ఠురం మేలు

నిజమాడితే నిష్ఠూరం(యథార్థవాది లోక విరోధి)

ఏడ్చేదాని ఎడమచేతి కింద, కుట్టేవాని కుడిచేతి కింద కూర్చోవద్దు.

సూత్రపు సామెతల్లో విషయ స్థాపనప్రధానం. విధి, నిషేధ అంశాలు కూడా ఇందులో ఉంటాయి. పై సామెతల్లో 1, 2, 3 సామెతల్లో విధిని,విషయ స్థాపన ఉంటే 4 వ సామెతలో నిషేధం ఉంది.

ధ్వని సామెతలు :

ఈ రకం సామెతలు ఏదోరకపు చర్యను తెలియ జేస్తాయి.

తాతముందు దగ్గులా?

ముదిమి కాదు కానీ అనుభవం పైబడిన పెద్దముందు చిరుతలు సుద్దులు చెప్పే సందర్భంలో ప్రతి ఒక్కరూ పలికే సామెతే కానీ ఇంకో మాట కూడా పౌరాణికంగా 'హనుమంతుని ముందు కుప్పి గంతులా' అని చెప్పుకుంటున్నాం.

అందనిపూలు దేవునికర్పణం

మాదిరి సామెతలు :

1. ఇంటిపేరు కస్తూరివారు ఇంట్లో గబ్బిలాల గబ్బు.
2. ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత.
3. ఊరంతా బంధువులే ఉచ్చపోయడానికి తావు లేదు.

మాదిరి సామెతల్లో కొత్త పాత కలయికలుంటాయి. ముందు వెనకల్ని గుర్తించడం కష్టం.

కథల సామెతలు :

1. అంతనాడు కాదు ఇంతనాడు కాదు సంతనాడు పెట్టింది ముంతంత కొప్పు
2. ఎద్దు చూస్తే ముద్దొస్తాంది,ఈడుపు చూస్తే ఏడుపొస్తుంది.
3. కాదు కాదు అంటే నాది నాది అన్నట్ట.

పై రకపు సామెతల్లో అంతర్లీనంగా ప్రాస, చమత్కారంతో పాటు పూర్వరూపంగా ఓ కథ ఉంటుంది. పూర్వ కథ మనంగుర్తించకపోయినా దాదాపుగా ఊహ మాత్రంగా కల్పన చేయబడి ఉంటాయి.

ఉపయుక్తమైన ఆధార గ్రంధాలు:

1. తెలుగు సామెతలు-జన జీవనం- డా॥ పాపిరెడ్డి నరసింహారెడ్డి,విశ్రాంత ఆచార్యులు, ఎస్వీ యూనివర్సిటీ.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం- డా॥ ఆర్వీఎస్ సుందరం
3. జానపద విజ్ఞాన అధ్యయనం- డా॥ జి.ఎస్ మోహన్ 4. బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు- సి.పి బ్రౌన్

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

రాయలసీమ జానపద గేయాలు

– డా॥. ఖి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల, తిరుపతి.

జానపదులంటే పల్లె ప్రజలు. అచ్చమైన దేశీ సాహిత్యం జానపద సాహిత్యం. ప్రజలు వారి కష్ట సుఖాలను, బాధ సంతోషాలను, దుఃఖ ఆనందాలను పాటల రూపంలో వెల్లడిచేయడం వలన, వాటిని జానపదగేయాలుగా పేర్కొంటున్నాము.

ప్రతి మనిషిలోనూ ఏదో ఒక కళ దాగి వుంటుంది. కొప్పరం కవులు మాటలనే ఆశు పద్యాలుగా చెప్పేవారని తెలుసుకున్నాం. కొందరు ఏ విషయాన్నయినా కథల రూపంలో చెప్పగలుగుతారు. మరికొందరు చిత్రలేఖన రూపంలో వివరిస్తారు. అందరినీ అలరించే వారు తమ భావాలను పాటలలో మార్చినవారు. అక్షరజ్ఞానం లేక పోయినా, గొప్ప పదాల కూర్పు తెలియకపోయినా, యతులు, గణాల వంటి బంధనాలకు బంధీకాకుండా కేవలం లయ ప్రధానంగా, మౌఖికంగా అప్పటికప్పుడు అశువుగా పుట్టినవే జానపద గేయాలు. ఇవి మౌఖికంగా ప్రచారమై, కలానుగుణంగా కొన్ని కొన్ని మార్పులకు లోనై, నేటికీ సజీవంగా మన ప్రాచీన సంస్కృతికి ఆనవాల్లుగా మిగిలి ఉన్నాయి.

ఇలా మన ముందుతరం ప్రజలు పాడుకున్న పాటల్లో రాయసీమ ప్రాంత జానపదగేయాలు ప్రత్యేకంగా నిలిచి ఉన్నాయి. మాండలిక పరంగా భిన్నమైన పదజాలాలతో రాయలసీమ ప్రాంతం ఉంది. ఆంధ్రసాహిత్యంలో అతి ప్రాచీనమైన శాసనాలు కడపజిల్లా కమలాపురం తాలూకా పోట్లదుర్తి మాలెపాడు గ్రామాల్లో కనిపించాయి. అందులో దేశీ ఛందస్సులో రగడ, తరువోజ వంటి వృత్తాలు ఉన్నాయి.

ఉత్తర హరివంశం వ్రాసిన నాచన సోమన (14వ శతాబ్దం) రాయలసీమ వారు. వీరి 'వసంత విలాసం' మొదటి లిఖిత జానపద గేయంగా వేటూరి ప్రభాకరశాస్త్రి గుర్తించారు.

"వీణాగానము వెన్నెల తేటా
రాణమీరగా రమణుల పాట
ప్రాణమైన పిన బ్రహ్మణ వీటా
జాణలు మెత్తురు జాజర పాట"

రాయలసీమ ప్రాంతంవాడయిన తాళ్ళపాక అన్నమాచార్యులు (1424-1508) తన చుట్టూ పరిసరాలలో పల్లీయులు పాడుకొనే పటకుబడులు, లయలతో కీర్తనలను రచించి, ప్రజల్లోకి తీసుకువెళ్ళారు.

'సిరుత నవ్వుల వాడు సిన్నెక' అనే నృసింహస్వామిని, దశావతారాలను వర్ణించే కీర్తన జానపద పదాల మేళవింపు. తాళ్ళపాక తిమ్మక్క రచించిన 'సుభద్రా పరిణయం' గానయోగ్యమై, ప్రజలు వివాహ, భజన వేళల్లో పాడేదిగా నిలిచింది.

వేమన్న (17వ శతాబ్ధం) వేదాలుగా ఆటవెలది పద్యాలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. రాయలసీమ జానపద గేయసేకరణ క్రీ.శ.1874వ సం॥ నుండి మొదలయిందని చెప్పవచ్చు. ఆంగ్లేయులు జే.ఎ.బాయ్‌లీ ఎక్కువగా ఈ గేయాలను సేకరించారు. సి.పి. బ్రౌన్ గారు కూడా సేకరణకు చాలా కృషి చేశారు. వీరి కంటే ముందు గోవర్ అనే ఆంగ్లేయుడు కన్నడ, తమిళ, మలయాళ జానపద గేయాలను స్వీకరించి, తెలగులో వేమన పద్యాలనే జానపద గేయాలుగా భ్రమించారు.

అయితే ఈ రాయసీమ గేయ సాహిత్యానికి విశేష ప్రచారం తీసుకొని వచ్చి, పుస్తకాలుగా ముద్రించి, క్యాసెట్‌ల రూపంలో అందించి, రేడియోలలో పాడి, వీధి ప్రదర్శనలు ఇచ్చిన మహనీయులు కీ.శే॥ కె. మునయ్య గారు. తెలుగు అకాడమీ వారు వీరి రచనలను 'రాయలసీమ రాగాలు' అనే పుస్తకంగా శ్రామిక, బాల, తాత్విక వంటి జానపద గేయాలను పూర్తిగా ముద్రించారు.

మునయ్య గారే ఊరూరా తిరిగి, పాటలను సేకరించి, వాటికొక రూపం తీసుకరావడానికి తన జీవితాన్నంతా ఇందుకోసమే దారపోశారు. వాటిని పరిశీలిస్తే మొదట రామాయణ గాథలు కనిపిస్తాయి.

రామాయణ గేయాలు :

జానపదులు మొదట ఆరాధించేది శ్రీరాముడిని, సీతను రామాయణంలోని వివిధ ఘట్టాలను గేయాలుగా పాడుకున్నారు. ఆ అమాయక పల్లీ జనాలకు మండోదరి హితబోధ కూడా గేయమయింది. మండోదరి తన భర్త రావణాసురునికి, తనకు వచ్చిన పీడకలను వివరిస్తుంది. ఆంజనేయుని ఆకారాన్ని ముందుగా దుస్వప్నంగా పొందింది మండోదరి. మూడు మూర్ల తోకవాడు, పచ్చనా మాలవాడు, కోతిమూతి వాడు మన లంకను ముట్ట డిస్తాడు. వారి సీతను వారికే పంపమని చెప్పే హితోక్తులుగా సాగుతుందీ పాట.

మండోదరి : రావణా లెయ్యరా - రవద్దులి కమ్ముకొచ్చె
రాత్రికొక్క కలగంటిరో రావణా
రాత్రికొక్క కలగంటిరో
మరోపాట

సీతమ్మ మహా పతివ్రత. రాముడు అగ్ని ప్రవేశం చేయ మని సీతను ఆజ్ఞాపించినట్లు, లక్షణుడు కూడా వదిన పాతవ్రత్యం నిరూపించి అన్నకు చూపటానికి కొన్ని పరీక్షలు పెడతాడు. ఇది జానపదుల సృష్టి, అవన్నీ పూర్తి చేసుకున్న సీత అయోధ్యకు చేరి, లక్ష్మణుడి భార్య ఊర్మిళతో తన మరిది గొప్పతనాన్ని వివరించే గేయం బహు ప్రసిద్ధం. చెక్క భజనలో ఈ పాట పాడుకుంటారు. పుట్టెడు నువ్వులు నేలపై నాలుగు వైపులా చల్లి కుప్పవేయమన్నాడు నామరిది. పద్నాలుగు సంవత్సరాలు క్రితం ఎండి, నుసికా బోతున్న గజనిమ్మను అప్పుడు పండిన పండుగ పండించ మన్నాడు. ఎప్పుడో ఎండిపోయిన బావిలోంచి నీళ్ళు సృష్టించమన్నాడు. అవన్నీ చేసి నిర్మలచరితగా నిలిచింది సీతమ్మ.

వినవమ్మ ఊర్మిళ - నా ముద్దు సెలెల్లల
లచుమన్న దేవుడమ్మా - నామరిది -రఘు
రాముల తమ్ముడమ్మ - నా మరిది.

పుట్టెడు నూగులు - భూమికి ఎగజల్లి
రాసికట్టమనె - నా మరిది - రఘు
రాముల తమ్ముడమ్మ - నా మరిది.

దశావతారాలు :

రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం జిల్లా కదిరి ప్రాంతంలో వెలసిన నరసింహమూర్తి వెలశాడు. దశా వతారాలను వర్ణించే ఈ గేయం చాలా తక్కువ పద జాలంతో ఉంది.

బేట్రాయి సామి దేవుడా - నన్నేలినోడ
బేట్రాయి సామి దేవుడా
కాటేమి రాయుడా! కదిరి నరసిమ్ముడా
మేటైన వేటగాడ నిన్నే నమ్మితిరా

స్త్రీల పాటలు :

అనుమానపు మొగుడు ఆ ఇల్లాలిని ఎంతో వేధిం చాడు. విసిగించాడు. పాపం ఆ ఇల్లాలు అతిని సూటిపోటి మాటలు భరించలేకపోయింది. చుక్కబొట్టు పెట్టినా, రంగు చీరలు కట్టినా, అద్దంలో చూసుకున్నా సహించలేని తన భర్తను నిందిస్తూ ఓ స్త్రీ పాడుకునే ఈ జానపద గేయం కల్లాకపటం లేని పల్లీయుల మనస్తత్వానికి అద్దం పడుతుంది.

సుక్కబొట్టు పెట్టనీడు
సుట్టాల సూడనీడు
ఎన్నాల్లు కాయిలుంటడో
ఈనాకుసించ
పచ్చబొట్టు పెట్టనీడు
పసుపు సీరె కట్టనీడు
ఎన్నాల్లు కాయిలుంటడో
ఈనాకుసించ

మరో గేయంలో

మెట్టినింట్లో ఆ కోడలికి ఆదరణలేదు అత్తమామలు,

భర్త, తోడికోడళ్ళు, చుట్టుప్రక్కల వారి మాటలకు బాధపడుతు రామచీలుకతో తన బాధలు వెల్లబోసు కుంటోది.

పాపీటి తల్లిదండ్రి రామసిలకా
నన్ను కొండ కింద పల్లెకిచ్చిరి రామసిలకా
నన్ను కంపలోకి తోలినారు రామసిలకా
అగ్నిగుండంలో బేసినారు రామసిలకా
అత్తమాటలు కొత్త సూదులు రామసిలకా
మామ న్యాతలు గులకరాళ్ళు రామసిలకా
మగని మల్లు ఊల బెండ్లు రామసిలకా

జట్టిజాం పాటలు :

కొత్తగా పెళ్ళయిన జంట, భర్త వ్యాపారం కోసం వెళ్లి ఆలస్యంగా వస్తాడు. అలిగిన ఆమెను ఓదార్చే పాట.

ఏమే పిల్లా రంగిన పిల్లా
నీ మకమే సిన్నబాయ - సెప్పే పిల్లా
ఆల్లూరు సంతాకు పోతాన్ పిల్లా
అడిగిన్ని సొమ్ములు తెత్తాన్ పిల్లా
నీకిత్తాన్ పిల్లా నే నోత్తాన్ పిల్లా

ఈ విధంగా రాయలసీమ ప్రాంతాలయిన పులి వెందుల, కర్నూలు, పత్తికొండ ప్రాంతల నుండి వస్తువులు తెచ్చి, ఆమె కిస్తానంటాడు భర్త.

మరో పాటలో భార్య పెంకి మేలం. పనిచేయని బద్ధకస్తురాలు, ఆమె తల్లి కూతురుకు పనిచెప్పదు. సరదాగా చిన్నచిన్న పునరావృత్త పదజాలంతో పల్లె సంసారాన్ని చూపించే పాట ఇది.

భర్త : కసువు చిమ్మే నల్లనాగి గురుగింజ గుమ్మడి
భార్య : సిమ్మను పోరా నల్లనాగి గురుగింజ గుమ్మడి
భర్త : సిమ్మక పతే తంతానూడే గురుగింజ గుమ్మడి
భార్య : అమ్మనూడే తంతాడంట గురుగింజ గుమ్మడి
అత్త : ఎందుకు పిల్లకాడ తంతావంట గురుగింజ గుమ్మడి
అల్లుడు : చెప్పిన పని చేయదత్తా గురుగింజ గుమ్మడి
అమ్మ : చెప్పిన పిని చేస్కోబిడ్డా గురుగింజ గుమ్మడి
భర్త : వడ్లు దంచే నల్లనాగీ గురుగింజ గుమ్మడి

ఇలా సాగుతుంది. ఇందులో గురుగింజ మధ్యవర్తి. మరో సరసమయిన గేయం బహుళ ప్రాచారమైన గేయం.

తుమ్మెదలున్నయేమిరా - దాని కురులు
కుంచెరుగలపైన - సామంచాలాడెవేమిరా

అలాగే.....

ఓరి మొగుడా
ఒయ్యారి మొగుడా
నాకెండ్రకాయ తేలుగుట్టె
ఓరి మొగుడా

అనే గేయం.

వీరగాధ గేయాలు :

వీరగాధ గేయాలలో ప్రముఖంగా చెప్పుకోదగ్గవి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి గేయాలు. ఆంగ్లేయుల పాలనపై తిరుగుబాటు ప్రకటించిన ఉయ్యాలవాడపై భిక్షులు, బుర్రకథకులు కరుణ రసాత్మక గేయాలు నేటికీ ఆలపిస్తున్నారు. డొక్కల కరువు సమయంలో బుడ్డా వెంగల రెడ్డి చేసిన అన్నదానం గురించి కూడా గేయాలు ఉన్నాయి.

నరసింహారెడ్డి గురించిన పాట

సైరా నరసింహారెడ్డి
నీ పేరే బంగారపు కడ్డి

ఇంకా ఎన్నో జానపద గేయాలు కనుమరుగయ్యాయి. నేటి ఆధునిక కాలంలో వాటిని సేకరించి, గ్రంథస్థం చేసే తీరిక, ఓపికలు కనుమరుగవుతున్నాయి. అందుకే తెలుగు సాహిత్య కారులయినా వారు చుట్టుప్రక్కల ఏ పల్లీయులు ఎటువంటి గేయాన్ని ఆలపించినా వాటిని అమూల్యంగా భావించి అక్షర రూపంలో నిక్షిప్తం చేయాలని ఆశిస్తు న్నాము.

ఆధార గ్రంథాలు :

1) చిత్తూరు జిల్లా జానపద గేయాలు - సామాజిక ప్రచురణలు - తిరుపతి - 1992.

2) జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు - జానపద విజ్ఞాన ప్రచురణలు - హైదరాబాదు -1978.

3) జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి - తెలుగు అకాడమి - హైదరాబాదు - 2007.

4) జానపద గేయాలు - గంగప్ప. ఎస్ - జయంతి పబ్లికేషన్స్ - విజయవాడ -1985.

5) జానబద సాహిత్యం - ఎల్లోరా - దీప్తి పబ్లికేషన్స్ - హైదరాబాదు - 1982.

6) తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ పి. నాగయ్య - నవ్య పరిశోధన ప్రచురణలు - తిరుపతి - 1995

7) తెలుగు వారి జానపద కళారూపాలు - డా॥మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - తెలుగు విశ్వవిద్యాలయం -హైదరాబాదు - 1992.

8) తెలుగు బాలగేయ సాహిత్యం - దేవకి. ఎం.కె. - శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం - 1979.

9) రాయలసీమ రాగాలు - కె. మునయ్య - తెలుగు అకాడమి - హైదరాబాదు - 1991.

❖ ❖ ❖

"ప్రాచీన జైన సంస్కృతి క్షేత్రం – కొనకొండ్ల : ఒక పరిశీలన"

– డా॥. డి. సతీదేవుడు, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండ, అనంతపురము జిల్లా.

కొన్ని ప్రదేశాల పేర్లు వినపడగానే ఆ ప్రాంతానికి అనుబంధంగా ఉన్న ప్రాచీన మత సంస్కృతులు, సాంప్రదాయాలు, గత వైభవం స్మృతిపథంలో మెదలుతాయి. కాశీ హిందువులకు, మక్కా ముస్లింలకు, వాటికన్ సిటి క్రైస్తవులకు పవిత్రమైన ప్రాంతాలుగా కాలక్రమం వెంట చెక్కుచెదరకుండా నిలుస్తూవస్తున్నాయి. అయితే కొన్ని ప్రదేశాలు ప్రాచీనకాలంలో ఒక వెలుగు వెలిగి తదనంతర కాలాల్లో మరుగునపడిపోయి ప్రాచీన సంస్కృతి చిహ్నాలుగా మిగిలిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాలు పూర్తిగా తెరమరుగు అవుతున్నాయి. అటువంటి ప్రదేశాలు, వాటి చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందివ్వడం ప్రస్తుత తరాల విధిగా చెప్పవచ్చు. ఇలాంటి ప్రాచీన ప్రదేశాల కోవలోకే జైనమతానికి చెందిన పురాతన క్షేత్రం కొనకొండ్ల వస్తుంది. రెండు వేల సంవత్సరాల క్రితంనాటి చారిత్రక వారసత్వ చిహ్నాలు కొనకొండ్లలో దర్శనమిస్తాయి. అత్యంత విశిష్టమైన, మార్మిక చిహ్నం జంబూద్వీపచక్రం కూడా ఈ ప్రాంతంలోనే నెలకొనివుంది. అలాగే సుప్రసిద్ధ జైనమతాచార్యులు కొండకుందాచార్యులు జీవితం కొనకొండ్లతో ముడిపడి ఉంది. కొన్ని శతాబ్దాలపాటు ఈ ప్రాంతం జైనమత తీర్థంగా, విద్యా కేంద్రంగా, రహస్య మార్మిక తంత్రవిద్యలకు నెలవుగా, దేశం నలుమూలల నుంచి వచ్చిన తాత్వికులు, మునుల చర్చలకు నిలయంగా దేదీప్యమానంగా వెలుగొందిన ప్రదేశం కొనకొండ్ల.

జైనమతం :

క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో నెలకొనివున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల వల్ల నూతన మతాలు ఆవిర్భవించాయి. వాటిలో ప్రధానమైనవి జైనమతం, బౌద్ధమతం. చారిత్రక ఆధారాల ద్వారా జైనమతం చాలా ప్రాచీనమైనదని భావించవచ్చు. వృషభనాథుడు నుండి మొదలుకొని వర్ధమాన మహావీరుడు వరకు 24 మంది తీర్థంకరులు జైన సాహిత్యంలో అగుపిస్తారు. వీరిలో వర్ధమాన మహావీరుడు కృషివల్ల జైనమతం భారతదేశంలో అనేక ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. జీవన ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించిన వారే తీర్థంకురులు అని, ఇంద్రియాలు జయించిన వారు జనుడు అని, మహావీరుని అనుచరులు జైనులు అని, వారు ప్రబోధించిన సిద్ధాంతాలు, త్రిరత్నాలు, పంచ వ్రతాలు జైనమతస్తులకు దిక్సూచిగా తెలుపుతారు. వర్ధమాన మహావీరుని నిర్యాణం తర్వాత ఉత్తర భారతంలో భయంకరమైన కరువు సంభవించింది. ఆ సమయంలో భద్రబాహు నాయకత్వమున పెద్దఎత్తున అతని అనుచర బృందం దక్షిణ భారతంలో వలస వచ్చి స్థిరపడ్డారు. తర్వాత జైనమతం శ్వేతంబర, దిగంబర శాఖలుగా చీలిపోయింది. ఈ దిగంబర శాఖకు మూల ప్రతినిధిగా భద్రబాహు నిలిచారు. భద్రబాహు శిష్య పరంపరలో ముఖ్యుడు కొండకుందాచార్యులు. ఈ కొండకుందాచార్యుల యొక్క జన్మస్థలమే కొనకొండ్ల.

కొండకుందాచార్య :

దక్షిణ భారతదేశంలో జైనమత చరిత్రలో కొండకుందాచార్యులు వారి జీవితం ఒక ఆసక్తికరమైన ఘట్టం. జైన మూలసంఘానికి అధ్యక్షత వహించిన ఆచార్యులలో భద్రబాహుని అనంతరం నాలగవ ఆచార్యుల అసలు పేరు పద్మనంది. ఇంద్రనంది రచించిన శ్రుంతావతరలో పద్మనంది అనే ప్రసిద్ధ ఆచార్యుడు కొండకుండాపురంలో నివసించాడని పేర్కొన్నది. కొనకొండ్లలో లభించిన శాసనంలో సంసారసాగరాన్ని తరించడానికి తరణీయమైన అనేక సిద్ధాంతాలతో ప్రపంచాన్నే జయించిన ప్రసిద్ధ ఆచార్యులు

పద్మనంది భట్టాచార్యులు జన్మస్థలంగా ఈ ప్రదేశం ప్రఖ్యాతి చెందింది అని వర్ణించింది.

జైన సాహిత్య ఆధారాల ప్రకారం, కొండకుందా చార్యులు మహావీరుని నిర్యాణం పొందిన 552 సంవత్సరాల తర్వాత ఆచార్యునిగా బోధనలు ఆరంభిం చారు. క్రీ.పూ. 40లో కొండకుందాచార్యులు 44 ఏళ్ళ ప్రాయంలో మూలసంఘానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆచార్య పీఠం అలంకరించారు. తెలుగు, కన్నడ లిపులు అప్పటికి రూపొందలేదు. కొండకుందాచార్యులు ప్రాకృత భాషలో 84 పాహుడాలు రచించినట్లు జైనమత గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఇతనినే ఎలియాచార్యుడుగా, పద్మ నందిగా వివిధ పేర్లతో పేర్కొన్నాయి. ప్రభాతసారం, సమయసారం, రాయనసారం, ప్రవచసారం, ద్వాదాశాను ప్రేక్ష మొదలైన ప్రసిద్ధ గ్రంథాలు రచించారు.

తమిళులు వేదంగా భావించే కిరక్కురళ్ రచించినది కొండకుందాచార్యులేనని చరిత్రకారుల అభిప్రాయం. మధురైలో జరుగుతున్న సంఘం పరిషత్తుకు దిగంబర సన్యాసి కావడంతో ఇతనికి ప్రవేశాన్ని నిరాకరించారని, కొండకుందాచార్యులు శిష్యుడు తిరువళ్ళువార్‌ను పంపి తన రచనను వినిపించమని తెలిపారు. అయితే పొర పాటున కిరక్కురళ్ గ్రంథ రచయితగా తిరువళ్ళువార్‌ను సంఘ నిర్వాహకులు పొరపాటున పేర్కొనటంతో అలాగే సాహితి చరిత్రలో కొనసాగిందని ప్రతీతి.

ఇప్పటికీ పిల్లలకు విద్యాభ్యాసం చేసేటప్పుడు వాళ్ళతో పలికించి, వ్రాయించే "ఓం నమఃశివాయ సిద్ధమ్ నమః" అనే సంప్రదాయం కొండకుందాచార్యుల సృష్టి అని చెబుతారు. వీరు 95 సంవత్సరాలు జీవించి క్రీ.శ. 44 సంవత్సరంలో తనువు చాలించారు. 51 సంవత్సరాలు జైనమత ఆచార్యునిగా దేశంలో అనేక ప్రాంతాలు పర్యటించి తన జ్ఞానాన్ని, తాత్విక చర్చలు, గ్రంథాల రూపంలో వెలువడించారు. కొనకొండ్లకు దేశం నలు మూలల నుండి జైన మునులు వచ్చి కొండకుందా చార్యుని వద్ద విద్య అభ్యసించారు. సరస్వతి గచ్ఛ లేదా వక్రగచ్ఛ మత శాఖలకు స్థాపకుడిగా, ప్రచారకుడిగా కొండకుందాచార్యులు ప్రసిద్ధి పొందారు.

దక్షిణ భారత జైనమత శాఖలలో అత్యంత ప్రతిభావంతుడైన, ప్రసిద్ధుడైన ఆచార్యుడు కొండకుందా చార్యులు. ఇతను జైనులచే కొండకుంద, కుందకుంద అని రెండు విధాలుగా పిలువబడుతారు. కొండకుందా చార్య గ్రంథం నమయసార వ్యాఖ్య హిందీ రచన ప్రస్తావనలో ఇతడు మహావీరుడు నుంచి పెట్టిన జ్ఞానాన్ని గురుపరంపర ద్వారా పొందినాడని పేర్కొన్నారు. ఇతడు విక్రమ శకారంభంలో జీవించాడని దిగంబర జైన పరం పరలో ఇతనికి గల స్థానం సర్వోత్కృష్టమైనదని చెప్పారు. కొండకుంద, కుందకుండ, పద్మనంది ఒక్కరే. "సర్వజ్ఞు డైన భగవాన్ శ్రీ మహావీర్‌స్వామి, గుణధీర్ భగవాన్ శ్రీ గౌతమిస్వామి తర్వాత ఆ వెంటనే భగవాన్ కుండ కుందాచార్య స్థానం వస్తుంది".

కొనకొండ్ల :

నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురము జిల్లాలో వజ్రకరూరు మండలంలో కొనకొండ్ల గ్రామం గలదు. కొనకొండ్ల గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు దక్షిణంగా 6 కి.మీ. దూరంలో ఉంది. ఇది ప్రస్తుతం మేజర్ పంచాయితి గ్రామంగా రికార్డులలో ఉంది. కొనకొండ్ల ప్రదేశం పడమర వైపు తప్ప మిగిలిన అన్ని దిక్కులలో కొండలు సరిహద్దుగా ఉంటూ, ప్రకృతి రమణీయమైన ప్రదేశాల మధ్య నెలకొని ఉంది. కంబం నరసింహస్వామి కొండ, రససిద్దుల గుట్ట, కరిబసప్ప గుట్టల నడుమ ఈ కొనకొండ్ల కొండ ఉంది.

ప్రాచీన మహర్షివర్యులు కౌండిన్యుడు ఈ ప్రాంతంలో యజ్ఞపూజాది క్రతువులు నిర్వహించడం వల్ల కౌండిన్యేశ్వర పురంగా మొదట పిలువబడింది. కొనకొండ్లలో లభించిన శాసనం ఈ ప్రదేశాన్ని కొండకుండేయ తీర్థంగా వర్ణించ బడింది. ప్రసిద్ధ జైనమతాచార్యులు పద్మనంది కొనకొండ్ల ప్రదేశం నుంచే తన తాత్విక బోధనలు ఆరంభించడంతో అతనికి కొండకుందాచార్యులు అని పేరు వచ్చిందని

చరిత్రకారుల అభిప్రాయం. తద్వారా ఈ ప్రాంతం అసలు పేరు కొండకుండ లేదా కొండకుండి అయివుండవచ్చునని వారి అభిప్రాయం. కాలక్రమేణా ఆ పేరు కొనకొండ్లగా రూపాంతరం చెందింది. శ్రావణబెల్గోలాలో గోమటేశ్వరునికి ఎంత ప్రాముఖ్యత ఉందో, కొనకొండ్ల కొండకుందాచార్యులకు కూడా అంతే ప్రాధాన్యత ఉండేదని జైను కృతులు తెలుపుతున్నాయి.

అనంతపురము ప్రాంతంలో జైనమతాన్ని నొలంబులు, పశ్చిమ చాళుక్యులు, తూర్పు చాళుక్యులు, రాష్ట్ర కూటులు, విజయనగర రాజులు ఆదరించారు. వీరి పోషణలో అనేక జైన కేంద్రాలు వెలిశాయి. వీటిలో కొనకొండ్ల జైనమతంలో దిగంబర శాఖకు మూల బిందువుగా ప్రకాశించింది. ఇలా అనేక శతాబ్దాల పాటు కొనకొండ్ల జైనమత కేంద్రంగా, విద్యా కేంద్రంగా, మార్మిక, తాంత్రిక విద్యలకు నిలయంగా నిలిచింది. అయితే నేడు కొనకొండ్లలో ఒక జైన మతస్తుడు కూడా లేకపోవడం ఆశ్చర్యంగా తోచుచున్నది.

కొనకొండ్ల గ్రామ సమీపాన రససిద్ధుల గుట్ట కలదు. ఈ కొండపైన పైకప్పులేని ప్రాచీన జైనమందిరం ఒకటి కలదు. ఈ మందిరంలో మూడువైపులా గోడలు ఉండి, రెండున్నర అడుగుల ఎత్తు గల రెండు జైన తీర్థంకురుల విగ్రహాలు స్థాపించబడి ఉన్నవి. అవి రెండునూ, కాయోత్సర్గరూపమున అనగా చేతులు వ్రేలాడి నిట్ట నిలువున నిలుచొని ఉన్నట్లు, వారి తలలపై మూడు ఛత్రాలు మలచబడి ఉన్నవి. ఈ విగ్రహాల పార్శ్వ మూలల్లో శాసన దేవతలు కలరు. వారు యక్షులు, యక్షిణిలుగా భావిస్తున్నారు. మునులకు పరిచర్యలు చేస్తూ వారికి తపోభంగం కలగకుండా జాగ్రత్త వహించడం ఈ శాసన దేవతల ఉద్దేశ్యంగా చెపుతున్నారు. తూర్పు వైపు ముఖం పెట్టి ఉన్న ఈ దిగంబరమూర్తులను తర్వాత కాలాలలో శైవులు కూడా పూజించినట్లు తెలుస్తున్నది. ఇద్దరు జైన మునుల దిగంబర విగ్రహాలు వేరువేరు శిలాఫలకాలపై చెక్కబడి ఉన్నాయి. వీరిద్దరు తపస్సు చేసి ఇక్కడే నిర్యాణం పొందినారు. వీరి సంస్మరణార్థం విగ్రహమూర్తులను ఇక్కడ ప్రతిష్టించారు. జంటగా తపస్సు చేయడం జైనమత సాంప్రదాయం.

రససిద్ధుల గుట్టకు దక్షిణ దిశకు ఉన్న మైదానంలో ఒక చిన్న కుంట, మునులు నివసించే మందిరం, పురాతన జైన వసతి కలదు. దానికి ఆనుకొని దిగుడుబావి కూడా ఉన్నది. జైన మునులు కుంటలో స్నానం చేసి, దిగుడు బావి నీరు త్రాగడానికి ఉపయోగించి ఉంటారు.

జైన మునులు తమ మంత్రతంత్రాలు, మార్మిక విద్యలతో స్థానిక ప్రజలను ఆకర్షించడం వల్ల, వారు నివసించిన ఈ గుట్టకు తర్వాత కాలంలో రససిద్ధుల గుట్ట అని పేరు వచ్చింది. సకాలంలో వానలు కురియక పోతే గ్రామ ప్రజలు ఈ మూర్తులకు టెంకాయలు కొట్టి పూజలు చేసి, తమ ఇళ్ళకు వెళ్ళేలోపు వానలు పడేవని ఇక్కడి స్థానికులు తెలుపుతారు. శ్రావణబెల్గోలాలో దొరికిన శాసనం ప్రకారం భరతఖండమున ''కొండకుండ'' ఒకటియే అత్యున్నత ప్రమాణం గల జైనమతావశేషాలు కలిగిన భాగ్యవంతమైన స్థలముగా తెలుపుతున్నది. ఇదే రససిద్ధుల గుట్టపై జైన మందిరం వెనుకభాగంలో ఒక బండపై పద్మంపై నిలబడిన కొండకుందాచార్యుల మూర్తి ప్రతిమ చెక్కి ఉన్నారు. దానికి సమీపంలో ఒక పెద్ద రాతిబండిపై వర్తులాకారంలో జంబూద్వీపచక్రం చెక్కబడి ఉన్నది.

జంబూద్వీప చక్రం :

కొనకొండ్లలో రససిద్ధుల గుట్టపై రాతిబండపై చెక్కిన జంబూద్వీప చక్రాన్ని 1966లో ఈ ప్రాంతంలో సైన్స్ టీచర్‌గా పనిచేసిన ఆర్.వి.చక్రవర్తి మొదటిసారిగా దీనిని గుర్తించి ప్రపంచానికి తెలియజేశారు.

నాడు, నేడు పూజాదికాలలో ''..... జంబూద్వీపే... భరతవర్షే... భరతఖండే'' అని పూజారులు చదువు తుంటారు. కానీ అందులోని జంబూద్వీపం ఏంటో చాలా మందికి తెలియదు. రామాయణం, మహాభారతం, మహాభాగవతం, అష్టాదశ పురాణాలలో తెలిపే

జంబూద్వీపం ఊహాజనితమైనది. వాటిలో పేర్కొన్న జంబూద్వీపం గురించే తెలిపే చక్రం కొనకొండ్లలో రస సిద్ధుల గుట్టపై వాస్తవంగా గలదు.

భారత ఖగోళశాస్త్రంలో అత్యంత ప్రాచీన గ్రంథం సూర్య సిద్ధాంతంలో జంజూద్వీప ప్రస్తావన కనిపిస్తుంది. దాని ప్రకారం ఒకప్పుడు ఆసియా ఖండాన్ని పైనుంచి చూస్తే నేరేడుపండు ఆకారంలో చుట్టూ నీటితో ఉండే దట. జంబూ అంటే నేరెడు. అందుకే దీనిని జంబూద్వీపం అన్నారు. ఈ జంబూద్వీప చక్రం గురించి న్యూనోరోబోస్ విశ్వవిద్యాలయంలో పనిచేసే కొలెట్టి కెయిలట్ రచించిన జైన్ కాస్మాలజిలో విస్తారంగా ప్రస్తావన ఉన్నది. అనంత పురము గెజిట్‌లో 1902లో ఫ్రాన్సిస్ రాసిన పుస్తకంలో ఈ జంబూద్వీప చక్రం గురించి తెలిపారు. 1980 ఆగష్టు 22న వెస్ట్ కోస్ట్ టైమ్స్ పత్రికలో జంబూద్వీప చక్రంపై వార్త ప్రచురితమైంది. భారత పురావస్తు శాఖ వారికి ఈ ప్రాంతంలో సైన్స్ టీచర్‌గా పనిచేసిన ఆర్.వి.చక్రవర్తి జంబూద్వీప చక్రం సమాచారాన్ని అందజేశారు. జంబూ ద్వీప చక్రం చెక్కిన రాయి దాదాపు 2000 సంవత్సరాలు పూర్వానిదిగా గుర్తించారు.

భూమి జైనుల ప్రకారం గుండ్రంగా, వర్తులాకారంగా ఉండి దానిలో భూభాగాలు, వృత్తములుగా ఒకదానికొకటి వృత్తాకారంలో సముద్రాలచే వేరుచేయబడి ఉన్నాయని, మధ్యలో గల భూభాగం జంబూద్వీపం అని భావిస్తారు. జంబూద్వీపం చుట్టూ లవణసముద్రం గలదు. ఇలాంటి ప్రాచీన సంస్కృతి చిహ్నం గల ప్రదేశంలో అక్రమంగా మైనింగ్ జరుగుతుంటే స్థానిక స్కూల్ సైన్సు టీచర్ ఆర్.వి.చక్రవర్తి హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశం మేరకు మైనింగ్‌ను 1996లో ఆపివేశారు. 2002 జూన్ 13న నాటి రాష్ట్ర గవర్నర్ రంగరాజన్ సతీమణి హరిప్రియ రంగరాజన్ కొనకొండ్లను సందర్శించి, రక్షణ చర్యలు తీసుకొమ్మని సూచించారు. 2015 జూలై 4న దేశం నలుమూలల నుంచి 500 మంది జైనులు ఈ ప్రాంతాన్ని సందర్శించి, అహింసా ర్యాలీని నిర్వహించారు. ముంబాయి కేంద్రంగా గల భారత వర్షీయ దిగంబర తీర్థ క్షేత్ర కమిటి కొనకొండ్లను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపొందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది.

ముగింపు :

మన ప్రాచీన సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలు మరియు ప్రభుత్వానిది. పురాతన సాంస్కృతిక చిహ్నాలు గతానికి ప్రతినిధులుగా, వారసత్వ సంపద పరంపరగా భావించి భావితరాలకు అందివ్వాలి. ఇలాంటి ప్రాచీనత, పవిత్రత కలిగిన పురాతన జైన సాంస్కృతిక ప్రదేశం కొనకొండ్ల. ఈ ప్రాంతంలోని మార్మిక చిహ్నం జంబూద్వీప చక్రం, జైన మందిరం, కొండకుందాచార్యుని ప్రతిమను పరిరక్షించే బాధ్యత స్థానిక ప్రజల భాగ స్వామ్యంతో ప్రభుత్వం మరియు జైనమత స్వచ్ఛంద సంస్థలు చేపట్టితే, కొనకొండ్ల ఉత్తమ పర్యాటక కేంద్రంగా రూపొందగలదు. రెండు వేల సంవత్సరాల నాటి గత స్మృతులను కాపాడి వాటి చరిత్రను, వారసత్వ సంపద రాబోయే తరాలకు సురక్షితంగా చేరవేయాలి. తద్వారా భారతీయ సంస్కృతి ఒక ధార లాగా తరతరాలకు సాఫీగా సాగిపోతుంది.

ఉపయుక్త గ్రంథాలు - వనరులు :

1) ఆంధ్రప్రభ దినపత్రిక, జనవరి 6, 1985, పే.9
2) జిందాల్ కె.బి., కుందకుందాచార్య హిజ్ లైఫ్ అండ్ వర్క్, జైన్ జర్నల్, అక్టోబర్ 1992
3) వార్త దినపత్రిక, ప్రభాతవార్త, అనంతపురం, ఆగష్టు 6, 1996
4) ఈనాడు దినపత్రిక, అనంతపురం, మే 21, 1998

5) ఆంధ్రజ్యోతి దినపత్రిక, అనంతపురం, జూన్ 13, 1998

6) ఆంధ్రభూమి దినపత్రిక, అనంతపురం, డిసెంబర్ 17, 1999

7) ఈనాడు దినపత్రిక, అనంతపురం, డిసెంబర్ 29, 2002

8) ఆంధ్రప్రభ దినపత్రిక, అనంతపురం, డిసెంబర్ 18, 2006

9) అనంత వినియోగవాణి మాసపత్రిక, ఏప్రిల్ 2008

10) సాక్షి దినపత్రిక, అనంతపురం, జూలై 30, 2014

11) ఈనాడు దినపత్రిక, అనంతపురం, జూలై 4, 2015

12) ఆదిరాజయ్య ఆర్.సి., రత్నత్రయము జంబూద్వీపము మరియు శ్రీ కుందకుందాచార్యులు, శ్రీ గురుపాద ప్రింటర్స్, హిందూపురం.

13) ఆదిరాజయ్య ఆర్.సి., తీర్థంక వృషభనాథ, శ్రీ గురుపాద ప్రింటర్స్, హిందూపురం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద వైద్యం – ప్రయోజనాలు

– శశికళ యస్, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై

తెలుగు సాహిత్య చరిత్రలో ఒకప్పుడు ఈసడించబడి, అజ్ఞాత వాఙ్మయంగా నిరక్షరాశ్యుల వాఙ్మయంగా భావింపబడి, క్రమక్రమంగా ఆ సమస్యలను పరిష్కరించుకుంటూ, నిరాకరించబడిన చోటనే సగౌరవంగా ఆదరాభిమానాలను పొందుతున్న విజ్ఞానం జానపద విజ్ఞానం. ఇప్పుడు ప్రతి పాత్రలందు భాగమై నిలిచి ముందుకు దూసుకెళ్తుందనే చెప్పవచ్చును. కానీ జానపదంలో కొన్ని అంతరిస్తున్నాయనే తెలుస్తుంది. అందులో ముఖ్యమైనది జానపద వైద్యం విధానం. ఒకప్పుడు ఈ జానపద వైద్యం ఎంతో ప్రయోజన కరణంగా నిలిచింది. ఇప్పుడు టెక్నాలజీలు పెరగడం వల్ల, విదేశీయ ప్రభావం వలన ఆనాటి జానపద వైద్య విషయాలు, వాటి విధానాలు కొంతవరకు అంతరిస్తున్నాయి.

అప్పట్లో ఈ జానపదవైద్యం ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యని గుణం చేస్తుంది. అది చిన్న సమస్య అయినా, పెద్ద సమస్య అయినా నయం చేసే శక్తి జానపద వైద్యం. ఎంతో విలువైన మూలికలతో వైద్యం చేసేవాళ్ళు. ప్రకృతి పరంగా అందే వైద్యం సంపూర్ణంగా ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. మన చుట్టుప్రక్కనే మనకే తెలియని ఆరోగ్యానికి ఉపయోగపడే అపురూపమైన వైద్య సంపద ఉంది. కానీ దానిని మనం గుర్తించలేకపోతున్నాం. జానపదులు ప్రకృతి పరంగా ఎలాంటి మూలిక ఉపయోగం, దానివల్ల ఎన్ని ప్రయోజనాలు అని వాళ్ళకే తెలుస్తుంది. అంతేకాకుండా కొంతమంది ఈ విధానాన్ని తమ వృత్తులుగా ఎన్నుకొని కొనసాగించేవారు. మరి కొందరు తమ ఇళ్ళలోనూ వైద్యం సొంతంగా అందించుకునే వాళ్ళు.

జానపద వైద్యం :

ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్న పెద్దల మాట ఏనాటికైనా గానీ అక్షరాల సత్యం. మనిషి సుఖశాంతులతో జీవించాలన్న ఆరోగ్యం చాలా ముఖ్యం. అందుకే "వైద్యో నారాయణ హరి" అని కొనియాడబడింది. ఈ జానపదుల జీవితాలు బ్రతకటం కోసం నిరంతరం పోరాటంతోనే కొనసాగుతూ వచ్చింది. అందులో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ, కొన్ని అనివార్య కారణాల వలన అనారోగ్యానికి గురి కావడం జరుగుతుంటాయి. ప్రారంభ దశలో సంచార జీవులుగా ఉన్న మానవులు ప్రకృతి సహజగుణాలను ముందుగానే పసిగట్టి, అందుకు తగిన రక్షణ కల్పించుకునేవాళ్ళు. ఏదైనా అనారోగ్యం ఏర్పడితే దానికి ఏమి చేయాలా అని రకరకాల పద్ధతులను అన్వేషించారు.

ఏదైనా ఒక గాయమైనపుడు వెంటనే మట్టిని పూసి, దగ్గరలో ఉన్న చెట్ల ఆకులను తీసుకుని పసరు ఆ గాయంపై రాసిన రెండు రోజులకి ఈ ఆకుల రసం ప్రయోజనకరంగా గుర్తించి, మరలా వాటిని ప్రయోగిస్తూ, ఇంకా ఎన్నో సుసంపన్నమైన మూలికలను సేకరించి, క్రమంగా వాటి రహస్యాలను తెలుసుకొని, అవసరమైనపుడు ఉపయోగిస్తూ, రకరకాల వ్యాధులకు వైద్య విధానాలను కనుగొన్నారు. కొందరు ఈ వైద్యాన్నే వృత్తిగా కూడా చేసుకుని జీవించేవారు. రకరకాల చెట్ల మూలికలను తీసుకువచ్చి, ప్రయోగాలు చేసేవారు. కానీ ఈ జానపద వైద్యం కొందరికే తెలిసేది. ఆ కొందరు తెలుసుకున్న చెట్ల ఆకుల రసాల వైద్యాన్ని ఎవరికీ చెప్పేవారు కాదు. అది వంశపారంపర్యంగా కొనసాగేది. కానీ జానపద వైద్యంలో రెండు రకాల వైద్యవిధానాలు ఉన్నాయి. అవి-

1. ప్రకృతి జానపద వైద్యం, 2. మాంత్రిక - మతాచార జానపద వైద్యం. ఈ రెండింటికి మధ్య జరిగే విషయాలు ఏంటో పరిశీలిద్దాం.

ప్రకృతి జానపద వైద్యం :

ప్రకృతితో కూడిన జానపద వైద్యం అనేది ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆయుష్షు గల ఆరోగ్యం ఉంటుంది. ప్రకృతి జానపద వైద్యం అనేది దేవుడు ఇచ్చిన ఒక గొప్ప వరం. భారతీయ జీవన విధానంలో ఒక భాగమైన ఆహార విధానాలు. మానసిక ఆరోగ్యాన్ని ప్రకృతి ప్రసాదిస్తుంది. ఈ ప్రకృతి వైద్యశాల మన పరిసరాలలోను అరణ్యాల లోను లభించే ప్రకృతిలో లభించే కొన్ని చెట్ల వేళ్ళు, దుంపలు, కాండము, ఆ కాండముపై బెరడు, పుష్పాలు, పత్రాలు, కాయలు, గింజలు మొదలైన గొప్ప ఔషధాలుగా ప్రయోగించేవారు. కానీ మారుతున్న పరిస్థితు లను బట్టి ఆధునిక వైద్యం రావడంతో దీనికి కొంత ఆదరణ తగ్గిందనే చెప్పాలి. దాంతో ఈ వైద్యం నేటి తరాల వారికి దూరమైంది.

కానీ ఆధునిక వైద్యం కూడా మానివేసి మరల ప్రకృతి వైద్యం పట్ల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే ఆయుర్వేదం పేరుతో వైద్యాలయాలు సిద్ధమౌతున్నాయి. ఈ వైద్యంతోనే కాక మాంత్రిక తో ఏర్పడిన వైద్యం కూడా కొంతవరకు ప్రయోజనకరంగా ఉంటుంది.

మాంత్రిక - జానపద వైద్యం :

ఈ వైద్యంలో మానవులు తాము నమ్మిన మాంత్రిక మతాచార ఆచార వ్యవహారాలే వైద్యంగా ఉంటాయి. ఈ వైద్యం దాదాపు ఈనాటి వరకు గ్రామంలో గానీ పట్టణంలో గానీ మంత్రాలు, తంత్రాలుగా కొనసాగుతూనే ఉంది. భూత పిశాచి పట్టిన వాళ్ళకి మంత్రాలతో వైద్యం చేసి వదిలించడం, ఇంటి పరిసరాల చుట్టూ పాము తిరి గితే ఇసుక మంత్రించి చుట్టూ చల్లితే పాము రాదు అని చెప్పే వైద్యం, తేలు కుడితే చెవిలో మంత్రం చెప్పి, మిరియాలు మంత్రించి, వేపాకులతో మంత్రిస్తే తేలు కాటు నుండి ఉపశమనం కలగటం ఇవన్నీ కూడా ఒక ఆచారంగా నమ్మి మాంత్రిక వైద్యాలు ఎన్నో మన గ్రామాల్లో చూస్తుంటాం.

జానపద వైద్యం - ప్రయోజనాలు :

పంటి నొప్పి :

మిరియాలు, ఉప్పు రెండింటిని మెత్తగా పొడిచేసి, నొప్పిగా ఉండే పన్నుమీద కొంచెం సేపు ఉంచాలి. అంతేకాకుండా రెండు మూడు లవంగాలు మెత్తగా నూరి నిమ్మకాయ రసంతో కలిపి చిగురుకు, పన్నుకు తాకిస్తే వెంటనే నొప్పి తగ్గుతుంది. లేదా నీళ్ళలో ఉప్పు కరిగించి ఆ నీళ్ళతో నోరు పుక్కిలించినా పంటి సమస్యలకు ఉప శమనం కలుగుతుంది.

కడుపు నొప్పి :

కడుపులో నులి పురుగులు చేరడంగాని, అజీర్ణం వలన గాని, పెద్దప్రేగులో వచ్చే తీవ్రమైన మంట వలన గానీ నీళ్ళు, రక్త విరోజనాల వలన గానీ వస్తే వాముు ఉప్పు కలిపి తినాలి. బొడ్డు దగ్గర నొప్పిగా ఉంటే జిల్లేడుపాలు వేసి పసుపు అద్దుతారు. అలాగే నీళ్ళలో చక్కెర కొంచెం కలిపి వేడిచేసి తాగినా పొట్ట ఉబ్బరంతోపాటు కడుపు నొప్పి తగ్గుతుంది.

పార్శ్వ తలనొప్పి :

తలకి ఒక భాగం మాత్రమే నొప్పి రావడాన్ని పార్శ్వ తలనొప్పి అంటారు. ఇది అధిక ఆందోళన వలన గానీ, విరోచన మందం వలన గానీ, రక్తపోటు, కంటి సమస్యల వలన, వేరే ఇతర వ్యాధులు సోకడం వలన గానీ రావచ్చు. అందుకే శొంఠిని లేదా శొంఠి కొమ్మును పొడిగా చేసుకొని, దానిని నేతిలో కలిపి, తల పాలభాగాన రాస్తే మంచి గుణం కనిపిస్తుంది. అదే విధంగా ఆ శొంఠి పొడిని నశ్యం వలె పీలుస్తూ ఉన్నా పార్శ్వపు తలనొప్పి తగ్గు తుంది. ఉమ్మెత్త ఆకుల ముద్దను నుదుటి భాగంపై పెట్టిన ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా అల్లము, ఉత్తరేణి, ముళ్ళతోటకూర మొదలైనవి కూడా ఈ పార్శ్వ తలనొప్పి బారినుండి బయట పడొచ్చు.

మూత్ర సంబంధిత వ్యాధులు :

మూత్ర విసర్జన జరిగేటప్పుడు నొప్పి, మంట, సరిగ్గా

మూత్రం రాకపోవడం, కొంతమందికి అధికంగా మూత్రం రావటం లాంటి సమస్యలకు జీలకర్ర చాలా ప్రయోజన కరంగా ఉంటుంది. జీలకర్ర, ధనియాలు తగినంత నీళ్ళు వేసి కొంచెం తాటిబెల్లం వేసి, బాగా మరిగించి కషాయం రాత్రిపూట 15 రోజులపాటు తీసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉండవచ్చు. అలద అడ్డసార, అతి మధురం, అత్తిపత్తి, గంగిరేగుచిట్ట, తోలు కొండికాయ, మామిడి మొదలైనవి కూడా ఉపయోగపడతాయి.

కుక్క కాటు వైద్యం :

కుక్క కాటు వలన రాబీస్ అనే వ్యాధి రావచ్చు. దీనికి తెల్ల జిల్లేడు పుష్పాల యొక్క కేసరలపై ఏర్పడిన ఉపాంగాలను 20 గ్రా ప్రమాణంలో తీసుకుని దానికి తగినంత బెల్లాన్ని కలిపి ముద్ద చేసి, కుక్క కరిచిన వెంటనే కాటుకి గురియైన మనిషికి తినిపించాలి. అంతే కాకుండా ఈ వైద్య విధానంలో నల్ల ఉమ్మెత్త, పాతాళగిరికి, సీమ చింత, చామల నార ప్రయోగిస్తారు.

పాముకాటు :

పాము కరిచిన చోట రెండు మూడు చోట్ల గుడ్డని గానీ, దారాన్ని గానీ గట్టిగా బిగించి కట్టాలి. కరిచిన దగ్గర సిరంజనీతో రక్తాన్ని బయటకు తీయాలి. ఆ తర్వాత నేల కొబ్బరిని ముద్దగా చేసి, పాము కరిచినచోట లేపనంగా పూయాలి. అంతేకాకుండా నల్లతుమ్మ బెరడును 5 మిరియాల గింజలు చేర్చి ముద్దచేసి పాము కరిచిన వెంటనే తినిపించడమే కాక, కరిచిన చోట లేపనంగా రాయాలి. అలాగే ఈ వైద్యంలో పాముదండ, నాగసరం, ఇప్ప, ఆదిపువ్వు, ఆడవి ఉల్లి, గురివింద, తిప్పతీగ , జిల్లేడు మొదలైనవి ఉపయోగిస్తారు.

ఇవి ఇలా ఉండగా మన చుట్టూ ఉన్న పరిసరాలలో పెరిగే మొక్కల వలన కూడా అనేక వైద్య ప్రయోగాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం -

కలబంద :

ఇందులో 6 నుండి 20 రకాలైన ఎమ్రోనోయాసిడ్స్, కార్బోహైడ్రేట్స్ వల్ల దీనిని ఔషధ మొక్కగా భావించవచ్చు. కలబంద చేదుగా ఉన్నా, ఆయుర్వేదంలో మంచి ఔషధంగా ఉపయోగకరంగా ఉంటుంది. దీని రసాన్ని చర్మరోగాలకు, దంత వ్యాధులకు, దగ్గు మొ॥ వ్యాధులకు మనవారు ఉపయోగిస్తారు. ఇంకా ఇవి కండ్ల కలకలోను, చెవిపోటులోను, వడదెబ్బ తగిలినప్పుడు దీని జ్యూస్ సేవిస్తారు. అంతేకాకుండా ఉదయాన్నే దీని లోపల ఉన్న గుజ్జును పరగడుపున తింటే చక్కెర వ్యాధి నయం అవుతుంది. నేటి బ్యూటీపార్లర్స్ కూడా ఫేస్‌ప్యాక్‌లకు సౌందర్యసాధనాలలోను వాడుతున్నారు. ఇలా ప్రతిదానికి ఉపయోగపడే ఎంతో మంచి గుణాలను కలిగియున్న మొక్కగా గమనించవచ్చు.

ఉమ్మెత్త (దత్తూర) :

ఈ ఉమ్మెత్త మొక్కలు ఎక్కడబడితే అక్కడ పెరుగుతూ ఉంటాయి. అయితే ఇవి తక్కువ మోతాదులలో ఔషధాలుగాను, ఎక్కువ మోతాదులో విషంగాను పనిచేస్తాయి. కనుక ఈ ఉమ్మెత్త ఆకులను ఉపయోగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రయోజనాలు :

1. చర్మరోగాలలో ఉపయోగిస్తారు.
2. అంతర్ సంబంధ వ్యాధులలో కూడా ఉపయోగిస్తారు.
3. దీని ఆకులు శరీరముపై వాపు, నొప్పి తగ్గడానికి పైపూతగా వాడతారు.
4. ఇది శ్వాసకోశ వ్యాధుల నివారణలో కూడా ఉపయోగపడుతుంది.
5. దీని వేళ్ళు స్త్రీల గర్భాశయ వ్యాధులు, ముఖ్యంగా ఋతు సంబంధ వ్యాధులను పరిష్కరిస్తాయి.
6. ఉమ్మెత్త ఆకులపై నూనె రాసి, వేడి చేసి కట్టుకడితే సెగగడ్డలు తగ్గుతాయి.
7. ఉమ్మెత్త మొక్కల వేరును ఎండించి, చూర్ణము చేసి, రోజు చిటికెడు తేనెతో సేవిస్తే దగ్గు, ఆయాసము తగ్గిపోతాయి.

8. ఉమ్మెత్త ఆకు రసంతో నువ్వుల నూనె కలిపి రాస్తే పేనుకొరుకుడు, చర్మవ్యాధి తగ్గిపోతాయి.

జీలకర్ర :

దీనిని తీసుకుంటే ఆహారాన్ని జీర్ణం చేసి, ఆరోగ్యాన్ని కాపాడి, సౌందర్య సాధనంగా పనిచేస్తుంది. మనదేశం నుండి ఈ జీలకర్ర ఎగుమతి చేస్తున్నారు. దీని అజీర్ణము, అతిసారము, ఆర్శమొలలు, కామెర్ల నివారణ ఔషధాలలో వాడతారు. జలుబు, నిద్రలేమితో బాధపడేవారు దీనిని వాడితే ఉపశమనం కలుగుతుంది. దీనిని తీసుకున్నందు వలన స్త్రీలలో చనుబాల వృద్ధి కలుగుతుంది. జీలకర్రను నీళ్ళలో వేసి, కాచి వడియగట్టి, ఆ నీళ్ళతో ముఖము కడుక్కుంటే శుభ్రంగా ఉండడమే కాక, ఆ నాటిని తాగితే జలుబు, విరోచనాలు మొదలైన వ్యాధులు నయమవు తాయి.

నేల తంగేడు (స్వర్ణపత్రి) :

ఈ నేలతంగేడు మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో కనిపిస్తుంది. ఈ నేల తంగేడు ఆకులు, కాయలు కూడా "నిన్నేసైడ్" అనే రసాయన పదార్థాన్ని కలిగి ఉంటుంది. ఇది ప్రకృతి సిద్ధంగా పెరుగుతుంది.

ప్రయోజనాలు :

నేలతంగేడు ఆకులను నీడలో ఎండించి, పొడి చేసుకుని 2 చెంచాలు వేడినీటితో సేవిస్తే తేలికగా విరోచన మవుతుంది. నేలతంగేడు ఆకులను పాలతోగాని, టీ డికాషన్‌తో గాని తీసుకుని సేవిస్తే సుఖ విరోచనం అవుతుంది.

పిల్లిపీచర గడ్డలు :

ఈ పిల్లి పీచర గడ్డలను శతవారి పిల్లిగడ్డలని, చంద మామ గడ్డలు అని కూడా పిలుస్తారు. ఈ పిల్లిపీచర గడ్డలను పొడిచేసి, పాలలో వేసుకుని సేవిస్తే కామశక్తి వృద్ధి అవుతుంది. ఈ పొడిని పాలతో కలిపి తాగితే బాలింతలలో చనుబాలు ఎక్కువగా అవుతాయి. అంతే కాదు ఋతుసంబంధ వ్యాధులు కూడా నయమౌతాయి. ఈ పొడిని తేనె, చక్కెరతో కలిపి సేవిస్తే మూత్ర సంబంధ వ్యాధులు తగ్గుతాయి. దీనిని పాలలో కలిపి సేవిస్తే మూత్రాశయంలోని రాళ్ళు కరుగుతాయి.

గోరింట (మరమంతికా) :

గోరింటాకు చూర్ణాన్ని వెన్నతో కలిపి పెదవులపై రాసుకుంటే పగుళ్ళు పోవటమేకాక మంచి కాంతివంతంగా కూడా ఉంటుంది. గోరింటాకును గుంటగలగరాకు రసాన్ని సమానంగా తీసుకుని నువ్వుల నూనెతో కలిపి తలకు అంటించుకుంటే వెంట్రుకలు బాగా పెరిగి నిగనిగలాడతాయి. పిడికెడు గోరింటాకును 10 మిరియాలను కలిపి మెత్తగా నూరి బిళ్ళలు చేసి ఎండించి 40 రోజుల పాటు నీళ్ళతో సేవిస్తే తెల్లమచ్చలు పోతాయి.

తులసి (సురసా) :

ఇది హైందవ కుటుంబంలో నిత్యపూజలు అందుకుంటున్న విశిష్టమైన మొక్క. దీనిని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఇది అనేక వ్యాధులకు చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుంది. ఈ తులసిని రామతులసి, కృష్ణ తులసి, కర్పూరతులసి, గృహతులసి (లక్ష్మీతులసి) అని వివిధ పేర్లతో పిలుస్తారు. మొదట కాలుష్యాన్ని పోగొట్టి, పరిసరాలను శుభ్ర పరుస్తుంది. తులసి ఆకులను నిమ్మ రసంతో కలిపి లేపనంగా తయారుచేసి పూస్తే చర్మరోగాలు పోతాయి. తులసి వేరు రసం త్రాగిస్తే అన్ని రకాల జ్వరాలకు ఉపశమనం కలుగుతుంది. తులసి ఆకు రసాన్ని 2, 3 చుక్కలు చెవిలో వేస్తే చెవిపోటు తగ్గుతుంది. తలసి ఆకు కషాయం రొంప (జలుపు), తలనొప్పి, జ్వరాలను తగ్గిస్తుంది. ఇంకా అనేక మందులలో ఉపయోగిస్తారు.

పుదీన :

పుదీనా కూడా చాలా వరకు వైద్యానికి సంబంధించిన గుణాలు కలిగి ఉంటుంది. జలుబు దగ్గు నుండి ఉపశమనం కలుగుతుంది. మౌత్‌ఫ్రెషనర్‌గాను మంచి ఫలితాన్ని ఇస్తుంది. దీన్ని అన్నిరకాల కూరల్లో కూడా ఉపయోగిస్తారు.

ఇలా చెప్పుకుంటూ పోతే జానపద వైద్యానికి సంబంధించిన వైద్యాలు అనేకం ఉన్నాయి.

ముగింపు :

మన భారతదేశంలో అనేక ఔషధ మూలికలు ఒక గొప్ప వరంగా భావించవచ్చు. మన చుట్టూ ఉన్న పరిసరాల్లో ఎన్నో మనకు తెలియని మూలికలు, వాటి గుణాలు తెలుసుకోలేకపోతున్నాం. అంతేకాకుండా దీనికి సంబంధించి వైద్య పంటలు కూడా కరువయ్యాయి. ఒక ఔషధ మూలికలో ఎన్నో గుణాలు దాగి ఉంటాయి. ప్రతి సమస్యకు ఉపశమనం కలిగే విధంగా ఉంటాయి. చిన్న సమస్య నుండి పెద్ద సమస్య దాకా అన్ని ఔషధ మూలికలు జానపద వైద్యం ద్వారా అందజేయబడుతుంది. కానీ నేటి సమాజంలో చిన్న జలుబుకి కూడా గృహవైద్యం చేసుకోవటానికి ఓపిక లేక మాత్రలు వేసుకోవటం ఒక పనిగా అయ్యింది. దీనివలన మన పూర్వీకులు అందించిన అమూల్యమైన వైద్య సంపద మరుగున పడుతుందని గుర్తించాలి. అయితే మారుతున్న కాలానికి తగ్గట్టుగా మనం కూడా మారాల్సిందే. ఆధునిక వైద్యసదుపాయాలను పొందాల్సిందే, ఉపయోగించాల్సిందే. అలాగని ప్రాచీన జానపద వైద్య సంపదని మరిచిపోకూడదు. అంతేకాకుండ గృహవైద్యం వంటగది వైద్యశాలగా మలచుకోవటం ఇప్పుడు కరువైందనే చెప్పాలి. కనుక ప్రతి ఒక్కరు మన జానపద వైద్యం పట్ల కొంచెం అవగాహన మళ్ళీ పెరిగి, పాటిస్తే కొంతవరకు నేటి సమాజంలో తిరిగి పూర్వం జానపద వైద్యం ప్రచారంలోకి రావచ్చు అని నా అభిప్రాయం.

ఆధార గ్రంథాలు :

1. జానపద జీవితం - ఆచార్య విత్తాలి శంకరరావు.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్.సుందరం.
3. జానపద విజ్ఞాన అధ్యయనం - వి.యస్.మోహన్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రకృతిని ఆరాధించే గిరిజన పండుగలు

– భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రపంచ దేశాలల్లో సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నమైన దేశం భారతదేశం. భిన్నజాతుల సమాహారమైన భారత ఉపఖండంలో అనేక గిరిజన సముదాయాలు నివసిస్తున్నాయి. గిరిజనులు ప్రత్యేక సంస్కృతి. సంప్రదాయాలు, సామాజిక విలువలను కలిగి ఉంటారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల పాశ్చాత్య సంస్కృతిని పాటిస్తున్నా నేటికి గిరిజనులు మాత్రం కొండకోనల్లో అజ్ఞాతవాసం చేస్తూ తరతరాలనాటి జీవనశైలిని, ఆచారాలను, సంస్కృతిని కొనసాగిస్తున్నారు. అయితే గిరిజనుల సంస్కృతి అంతా కూడా ప్రకృతిని ఆరాధించే విధంగా ఉంటాయి. ప్రకృతితో మమేకమవుతూ, ప్రకృతితో జీవనాన్ని గడుపుతూ వీరి సంస్కృతి కూడా ప్రకృతికి ప్రతిబింబించే విధంగా ఉంటాయి. అయితే ఈ నా వ్యాసంలో కొన్ని గిరిజన జాతుల సంస్కృతి సంప్రదాయాలను చర్చిస్తాను. కోయలు, కొండరెడ్లు, బంజారాలు (లంబాడీలు), నాయకపోడులు మొదలైన కొన్ని గిరిజన జాతుల సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సామాజిక కట్టుబాట్లును వివరిస్తాను.

బంజారాలు (లంబాడీలు) :

రాజుల కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య పాలన వరకు సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిస్తూ, తమదైన శైలిలో జీవనం కొనసాగిస్తూ, ప్రత్యేక తండాలుగా ఏర్పాటు చేసుకొని, తోటి కులాల వారిని సమానంగా చూస్తూ, కలిసికట్టుగా తండాలల్లో జీవిస్తున్నారు. రాజపుత్ర వంశీయులైన బంజారాల ప్రధాన వృత్తి పశువుల సంపద, వ్యవసాయం. బంజారాలను తెలంగాణ రాష్ట్రంలో లంబాడీలుగా, ఆంధ్రరాష్ట్రంలో సుగాలీలుగా పిలుస్తారు. అయితే లంబాడీల సంస్కృతి అంతా కూడా ప్రకృతితో ముడిపడి ఉంటుంది. వీళ్ళు చేసే పండుగలు, ఆచార వ్యవహారాలు ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకుంటారు.

బంజారాలు జరుపుకునే మొట్టమొదటి పండుగ 'సీత్లా' పండుగ. ఈ పండుగనే తెలుగులో 'దాటోడి' పండుగ అని పిలుస్తారు. ఈ పండుగ ముఖ్య ఉద్దేశం ప్రజలకు, పశువులకు వచ్చే కీడును తొలగించి, మంచి జరగాలన్నదే ఈ పండుగ విశిష్టత. ఈ పండుగను తండా ప్రజలందరూ కలిసి సంతోషంగా జరుపుకుంటారు. గ్రామస్తులు ఊరు బయట విశాలమైన ప్రాంతంలో భూమి నెలకొన్న ఏడు మహాశక్తుల విగ్రహాల దేవుళ్ళను పూజిస్తారు. పశువులను కూడా తీసుకువస్తారు. పాయసం, గుగ్గిళ్ళతో కూడిన ప్రసాదాన్ని 'ముత్యాలమ్మ' అనే గ్రామదేవత ముందు పెడతారు. ఆ తర్వాత మేకలను, కోడిని కోసి పేగులను రోడ్డుమీద పరుస్తారు. వాటి మీద నించి పశువులను దాటిస్తారు. ఆ తర్వాత మహిళలు పాటలు పాడుతూ ఇంటికి చేరుతారు. ఈ విధంగా పంటలు బాగుండాలని, తమ పశుసంపద అభివృద్ధి చెందాలని, ఎలాంటి కీడు జరగకూడదనే అభిప్రాయంతో ఈ 'సీత్లా' పండుగను నిర్వహిస్తారు.

లంబాడీల మరో ముఖ్యమైన పండుగ 'తీజ్'. ఈ పండుగ తొమ్మిది రోజుల పాటు పెళ్ళికాని అమ్మాయిలు నిర్వహిస్తారు. యువతులు నీతి నియమాలను పాటిస్తూ, ఆకుకూరలు తింటూ నేలపై పండుకుంటూ నిగ్రహంగా ఉంటారు. పెళ్ళికాని అమ్మాయిలంతా ముందు తండా నాయకుని అనుమతితో తీజ్ పండుగను నిర్వహిస్తారు. బావి దగ్గరకు వెళ్ళి, పరిశుభ్రమైన ఇత్తడి బిందెలో నీళ్ళు తెచ్చి, పాటలు పాడుతారు. తరువాత గోధుమలు చల్లిన బుట్టలను తండా నాయకుని ఇంటి ముంగిట్లో అరుగుపై కాని, పందిరిపైన గాని పెడుతారు. మరుసటి రోజు నుంచి తొమ్మిది రోజులపాటు రోజుకు మూడుసార్లు అమ్మాయిలు బుట్టల్లో నీళ్ళు పోస్తూ పాటలు పాడుతారు.

ఏడోరోజు 'ఢమోళి' అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లో బియ్యం పిండితో చుర్మో రొట్టెలు చేసి, వాటిని బెల్లంతో కలిపి ముద్దలు చేస్తారు. మరోవైపు తీజ్ ఉన్న ఇంటి ఆవరణలో సేవాబాయి, మెరామల పూజలు నిర్వహిస్తారు. మెరామల పూజ ఇంటి ముందు జొన్నలు నింపిన గోనెసంచులు ఉంచి, దానిపై ఒక చిన్న బిందెలో నీళ్ళుపోసి, అందులో వేపమండలు వేసి, మేకపోతులను తెచ్చి, గోనెసంచులకు ఎదురుగా నిలబెట్టి, దాని తలకు, కాళ్ళకు పసుపు రాస్తారు. నోటిలో నీళ్ళు పోసి మెరామ్మ తల్లికి బలి ఇస్తారు. ఇక తొమ్మిదో రోజు యువతులు ప్రతి ఇంటికి వెళ్ళి ఉయ్యాల ఆట ఆడుతూ, పాటలు పాడుతూంటారు. మట్టితో బొమ్మలను తయారు చేసి, ఉయ్యాలలో ఊపుతారు. పూజారులైన ఆడపిల్లలు హోమంలో నైవేద్యాన్ని సమర్పిస్తారు. గణగోర్‌ని శివ పార్వతుల ప్రతిరూపంగా భావిస్తారు. చివరికి తండా నాయకుని ఆజ్ఞ మేరకు నదిలోగాని, వాగులో గాని డప్పులు వాయిస్తూ, పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఊరే గింపుగా బయలుదేరుతారు. కొంతమంది యువతులు తీజ్ తెంచిన బుట్టలను తీసుకువస్తారు. వారి పాదాలను సోదులు గజ్జలు విప్పుతుంటే యువతులు ఏడుస్తారు. వారి అన్నదమ్ములు ఓదార్చుతారు. చివరికి తీజ్‌ని నీళ్ళలో నిమజ్జనం చేసి ఇంటికి వస్తారు. ఈ విధంగా బంజారులు తమ సంస్కృతిని నేటివరకు కొనసాగించడం గర్వ కారణమని చెప్పవచ్చు.

కోయలు :

గోదావరి పరివాహక ప్రాంతంలో కోయలు, కొండరెడ్డి, గొత్తికోయలు నివసిస్తున్నారు. కోయ జాతివారిని 'కోయ తోర్' అంటారు. వీరి మాతృభాష కోయ. ప్రకృతి మధ్య సహజీవనం సాగిస్తూ, అడవితల్లిని నమ్ముకొని జీవిస్తు న్నారు. కష్టాన్నే నమ్ముకొని బ్రతికే అమాయకులు కోయవారు. కోయల పండుగలు ఎంతో విశిష్టంగా ఉం టాయి. కోయలు ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు.

భూమి పండుగ లేదా విత్తు పండుగ :

కోయవాళ్ళు తొలకరి సమయంలో చేసే పండుగ 'భూమి పండుగ'. విత్తనాలు చల్లడానికి ముందు పంటలు బాగా పండాలని, జీవితాలు బాగుండాలని భూమితల్లికి గిరిజనులు చేసే పండగనే 'విత్తుపండుగ' అని కూడా అంటారు. కుటుంబమంతా తలంటు స్నానం చేసుకొని, కొత్తబట్టలు ధరించి, గూడెంలో ఉన్న అంబలి, జావ, గంజి గడి ముంతలో కలిపి ఊరుచుట్టూ చల్లడం, కోళ్ళను, మేకలను బలివ్వడం చేస్తారు. ఆ పక్కనే పారే వాగు వద్దకు చేరుకొని వాగులో పెద్ద చెలిమ తీస్తారు. కొత్త పసుపు బట్టలతో ముడి కట్టి పవిత్రంగా భద్రపరిచి, ఇప్పపూల గుత్తులను తీస్తారు. యువకుడి కళ్ళకు గంతలు కట్టి, ఏడాదిలో వచ్చే కార్తుల వరకు ఒక్కొక్కటిగా చదు వుతూ, ఒక్కో ఇప్పపువ్వును చెలిమ నీటిలో వేస్తారు. ఒక కార్తి చదివి వేసిన ఇప్పపువ్వు చెలిమె నీటిలో మునిగితే ఆ మాసంలో భారీ వర్షాలు కురుస్తాయని, సగం మునిగితే ఓ మోస్తరు వర్షాలు పడుతాయని, అసలే మునగకపోతే ఆ కార్తెలో కాలం కాదని నమ్ముతారు. ఆయా కాలాలను బట్టి పంటలు వేస్తారు ఈ భూమి పండుగలో.

పొట్ట పండుగ :

ఈ పండుగను మాఘకార్తి ఆగష్టులో నిర్వహిస్తారు. పిల్లల కోసం పెద్దలు చేసే పండుగ. పంటలు పొట్టకు వచ్చిన సందర్భంగా పిల్లలు తినడానికి జరుపుకునే పండుగ. ఈ పండుగ చేసిన తర్వాతనే ధాన్యం, కంకులు, కూరగాయలు ముట్టుకుంటారు. కోడినిగాని, మేకనుగాని బలిస్తారు. ఈ విధంగా పంటలు తినడానికి వచ్చే ముందు జరుపుకునే పండుగ.

కొత్తల పండుగ, సమ్మక్క పండుగ, పచ్చ పండుగ లేదా చిక్కుడు పండుగ, రెండేళ్ళకొకసారి సమ్మక్క సారక్క పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగలు కోయల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ప్రతిబింబింప జేస్తాయి.

కొండరెడ్లు :

నవ నాగరికతకు దూరంగా దండకారణ్య అటవీ ప్రాంతాలలో నివసించే కొండరెడ్లు ఆదిమవాసి గిరిజన సంతతికి చెందినవారు. జన్మనిచ్చిన తల్లి తర్వాత అడవి తల్లిపై ఆధారపడి జీవిస్తున్నారు. దట్టమైన అడవుల మధ్య ఉండే కొండలపై నివాసాలు ఏర్పాటు చేసుకొని, కొండలపై చెట్లను నరికి, పోడు వ్యవసాయం చేయడం వీరి అలవాటు. వేటతో పాటు వివిధ రకాలైన అటవీ ఉత్పత్తులను సేకరిస్తారు. తేనె సేకరణ, చింతపండు, ముష్టిగింజలు, వెదురుతో వస్తువులు తయారీ, జిగురు సేకరణను చేసి విక్రయిస్తారు.

కొండరెడ్లు తమ ఆచార వ్యవహారాల పట్ల నిష్ట గరిష్టలై వ్యవహరిస్తారు. గర్భవతి అయిన మహిళలను గ్రామం చివరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'కీడుపాక'లో ఉంచడం వీరి సంప్రదాయం. కీడుపాకలో ఉన్న మహిళలు గ్రామస్తులకు తమ ముఖం చూపించరాదు. వారు ప్రసవించే వరకు ఆ పాకలోనే ఉండాలి. సనాతన ఆచార సంప్రదాయ పద్ధతులను అనుసరించి కాన్పులు జరుగుతాయి.

కొండరెడ్లు భూమి పండుగతోపాటు సామకొత్త పండుగ, మామిడికాయ పండుగ, పచ్చల పండుగ, అమ్మ వారు కొలుపు పండుగలను ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. కొండరెడ్లు జనజీవన స్రవంతికి, ఆధునిక ప్రపంచానికి దూరంగా జీవనం సాగిస్తారు.

'మామిడికాయ పండుగ' ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో జరుపుకుంటారు. ఈ పండుగ చేయకుండా, వారి కులదైవానికి నైవేద్యం సమర్పించకుండా ముందుగా ఎవ్వరూ కూడా మామిడికాయను తినడానికి సాహసించరు. ఒకవేళ కుటుంబంలోని వ్యక్తి ప్రక్క గ్రామానికి వెళ్ళినా అక్కడ మామిడికాయలు తిన్నవారి ఇండ్లలో కనీసం మంచినీళ్ళు కూడా ముట్టుకోరు. వారు ఏదైనా తినమని ఇచ్చినా కూడా తినరు. ఒకవేళ తిన్నట్లయితే కనుక వారి కుటుంబంలోని ఎవరికో ఒకరికి జబ్బు చేస్తుందని, లేదా వారు పెంచుకుంటున్న పశువులను 'పులి' పట్టి చంపేస్తుందనేది వారి నమ్మకం.

గురువారం రోజున మామిడికాయను కులదేవతకు సమర్పించే రోజు. పండుగ రోజున గ్రామస్తులందరూ తమ ఇంటిని శుభ్రం చేసుకొని ఇంటి దైవాలకు, దేవరలకు పెట్టుకోవడానికి ఉదయం గ్రామానికి దగ్గరలోని చెట్టు వద్దకు చేరుకుంటారు. కోళ్ళు, వేటలు, పందులు తీసుకొని చేతితో ముట్టుకోకుండా ఒక మామిడి కాయను కూడా తీసుకువెళ్తారు. ముందుగా ముత్యాలమ్మ గ్రామదేవతకు జంతుబలి ఇవ్వడానికి పూజారులు బయలుదేరుతారు. ముత్యాలమ్మ దేవరకు పెట్టగానే, ఊరి ప్రజలు తమ తమ ఇంటి దైవాలకు దేవరలకు పెట్టుకుంటారు. 'ఓరం అన్నం' బలి ఇచ్చిన కోళ్ళు, పందులను కోసి వంట చేస్తారు. ఆ కూరలో మామిడి కాయను ముక్కలుగా కోసి, పులుసు కోసం కూరలో వేస్తారు. వంటలు అయిన తరువాత ముందు వండిన ఓరం అన్నం, కూర కలిపి కులదైవానికి నైవేద్యంగా సమర్పిస్తారు. దేవరకు పెట్టటానికి వెళ్ళిన వారికోసం ఎదురు చూస్తారు. వారు తెచ్చిన కూరలతో వంటలు తయారు చేస్తారు. అందరూ కలిసి భోజనం చేస్తారు. తర్వాత ముత్యాలమ్మ ఊరేగింపు ఆటపాటలతో చిన్న పెద్ద అందరూ నృత్యం చేస్తారు. ఈ విధంగా కొండరెడ్లు మామిడికాయ పండుగను ఘనంగా జరుపుతారు.

నాయకపోడులు :

ఈ తెగ గిరిజనులు పూర్వకాలం అడవిలో దొరికే దుంపలు, పండ్లు, ఆకులు, అలములు, పుట్టకొక్కులు, మాంసం తిని జీవించేవారు. ప్రతి నిత్యం అడవి మీదనే ఆధారపడేవారు. రేపటికోసం ఎలా అనే ఆలోచన లేకుండా ముందుచూపు లేకుండా, దాపరికం నిల్వ చేసుకొనక నిత్యం అడవినే నమ్ముకుని జీవిస్తారు.

పాండవులు అరణ్యవాసకాలంలో అడవుల్లో వున్న ఆదిమ గిరిజన తెగల గూడెంలను ఆశ్రయించారు.

అప్పుడు వారు నాయకపోడు తెగ ప్రజల స్థితిని చూసి, వీరి జీవితాలలో మార్పు తీసుకురావటానికి సంకల్పించారు. ఈ కథ పురాణ గాథలు, కొర్రాజుల కథ ద్వారా స్పష్టం అవుతుంది.

అయితే నాయకపోడులను కొర్రాజులు కొర్ర పంటను పోడుభూముల్లో వేయించి, వీరిచేత పండించారు. వ్యవసాయం ద్వారా ఆహారం సమకూర్చుకోవడం నేర్చుకున్న వీరు తమ జీవితాల్లో మార్పు రావడంతో తమకు వెలుగునిచ్చిన కొర్రాజులను పూజించి, పండిన పంటను నైవేద్యంగా కొత్తల పండుగ పేరున సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. గిరిజన గూడెలలో పంటలన్నీ ఇంటికి వచ్చిన తర్వాత శివరాత్రి ముందు తొలకరి కురిసేలోగా వీలునుబట్టి కొర్రాజుల కొలుపు చేస్తారు. వీళ్ళు కొర్రాజుల కొలుపులో పెద్దమ్మ, సామలదేవమ్మ, ముదిరామక్క, ముత్యాలమ్మ, గుట్టుముసలమ్మ మొదలైన దేవతలను కొలుస్తారు. ఈ విధంగా నాయకపోడులు కొత్తల పండుగ చేస్తారు.

అనాదిగా అడవులను ఆధారం చేసుకొని కొండ కోనల్లో నివసించే గిరిజనుల జీవనం వైవిద్యభరితం. తరతరాలుగా తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రపంచీకరణ ప్రభావం ఉన్నప్పటికి మూలాలను మరువకుండా ప్రకృతిని ఆరాధిస్తూ, తమ సంస్కృతికి, సామాజిక విలువలకు అద్దం పట్టేలా గిరిజనులు అడవుల్లోనే జీవిస్తున్నారు. కొన్ని తెగలు నాగరిక ప్రపంచంవైపు వెళుతున్నా తమ సంస్కృతి పరిరక్షణకై పాటుపడుతున్నారని చెప్పవచ్చు. అయితే ఇటువంటి గిరిజన తెగలెన్నో భారతదేశంలో ఉన్నాయి. వారి సంస్కృతిని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉందని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు - పసుల బుచ్చయ్య
2. సంస్కృతి విన్యాసం - అన్నపురెడ్డి వేంకటేశ్వరరెడ్డి
3. గిరిజన జాతరలు - సిద్ధాంత గ్రంథం (అంతర్జాలం)
4. ఖమ్మం జిల్లా బంజారాల పండుగలు - డా॥ జి. వెంకట్ లాల్.
5. అంతర్జాల వ్యాసాలు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ జానపద కలంకారి దృశ్యకళ

- వై. మనోహరరావు
పరిశోధక విద్యార్థి,
జానపద గిరిజన అధ్యయన శాఖ,
ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- ఆచార్య కె. శ్యామల
జానపద గిరిజన అధ్యయన శాఖ,
ద్రవిడ విశ్వవిద్యాలయం,
కుప్పం.

ఆంధ్రరాష్ట్రంలో శ్రీకాళహస్తి మరియు మచిలీపట్నం రెండు ప్రధాన ముఖ్య కేంద్రాలుగా గుర్తించబడ్డాయి. శ్రీకాళహస్తి 60 మైళ్ళు, ఉత్తరాన తిరుపతి సమీపంలో ఉన్న మరియు దక్షిణాన ఉన్న మచిలీపట్నం తూర్పున ఉన్న హైదరాబాదు 200ల మైళ్ళ తీరంలో ఉన్నది. 'కలం' అనగా 'పెన్' అని, కారి అనగా 'పని' (వర్క్) (కలంకారి) అని అర్థం. ఇది చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో ప్రారంభమైనది.

కలంకారికళ రెండు ముఖ్య కేంద్రాలుగా గుర్తించ బడ్డాయి. ఒకటి శ్రీకాళహస్తి మరొకటి మచిలీపట్నం. రెండు రాష్ట్రాలలో చేసే ప్రక్రియలు విభిన్నముగా ఉంటాయి. కలంకారి అనగా వెదురుతో చేసిన కలంతోను సహజమైన రంగులను ఉపయోగించి వస్త్రాలపై బొమ్మలు చిత్రించే ఒక కళ ఇది. చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తిలో పుట్టింది. మచిలీపట్నం కలంకారి కళ కూరగాయల అద్దకంతో కూడు కొని ఉన్న అచ్చులతో బట్టలపై ముద్రణ వేసే వివిధ చిత్రాలతో కూడినది.

చారిత్రక నేపథ్యం :

కలంకారి కళ ఎప్పుడు ప్రారంభమైనదో తెలియ జేయడానికి ఖచ్చితమైన ఆధారాలు లేవు. ఆధారాలను బట్టి 13, 19వ శతాబ్దాలలో కోరమండల్ తీరం వెంబడి వస్త్రవ్యాపారం బాగా జరిగేది. కాబట్టి డక్కన్ పీఠభూమికి చెందిన అన్ని ప్రదేశాలలోను ఈ కళ విరాజిల్లిందని తెలుస్తుంది.

పురాతన సింధూలోయ హరప్పా నాగరికతకు సంబంధించిన త్రవ్వకాలలో లభించిన ఒక వెండిపాత్ర మీద చిత్రాలు ఉన్న ఒక వస్త్రంపై ఉన్న ఆధారంగా కలంకారి కళ చాలా ప్రాచీనమైనదని తెలుస్తుంది. అనేక ప్రదేశల వద్ద పురావస్తు శాఖ వారు తవ్వకాలు జరిపే వరకు భారతదేశంలో వస్త్రాలను కళాఖండాలుగ చిత్రించే సంస్కృతి పెద్దగా ఎవరికి తెలియదు. ఈ తవ్వకాలలో వివిధ చిత్రాలతో కూడిన భారతదేశ నూలు వస్త్రాలు కనిపించాయి.

బౌద్ధ ఆరామాలు కూడా ఈ కలంకారి వస్త్రాలతో అలంకరించే వారు, అలెగ్జాండర్ కూడా కలంకారి వస్త్రాలను తనతో పాటి తీసుకు వెళ్ళి ఉంటారు. కలం అనగా పెన్ కారి అనగా హిందీ లేదా ఉర్దూలో 'పని' అని అర్థం. మచిలీపట్నం ఓడరేవుకు సౌకర్యాలు సరిగ్గా లేకపోయిన గోల్కొండ నవాబులు పర్షియన్‌ల మధ్య వర్తక సంబంధాల నేపథ్యం నుంచి ఈ పదం ఉద్భవించి ఉండవచ్చు.

తదుపరి కాలానుగుణంగా మద్దతుగా ముస్లింలు మతపరమైన మరియు కొత్త వ్యాపారాల భాగస్వాము లుగా హస్తకళ మార్చుకుందని జానపద నమ్మకాలు. క్రీ.శ. 1560 సమయం ఐరోపా దేశంలో మచిలీపట్నం మరియు శ్రీకాళహస్తిలో ఉద్భవించడానికి కార్పుల్ మరియు తంజావూరు ప్రభువులకు తయారు చేయించారు. ఈ శైలిని మరాఠ మహారాజులచే పోషించబడినది. బంగారు వస్త్రాలపై ముద్రించే వారని, అవి ఛత్రపతి శివాజీ ధరించేవారు.

15వ శతాబ్దంలో మొదలైన రంగులు అద్దకం ఆంగ్లేయుల పాలనలో అంతర్జాతీయ ఉత్పత్తులు పెరిగాయి. 1658-1664 సంవత్సరాలు మధ్య ఒక ఫ్రెంచ్ యాత్రికుడు ఫ్రాలకాయిన్స్ బెర్నిర్ మొగలాయి చక్రవర్తులు టెంటులకు ఉపయోగించే బట్ట గురించి రాస్తూ పై ఎర్రరంగు గలిగిలోతట్లు మచిలీపట్నం కలంతో చిత్రింప బడిన అందమైన అద్దకపు బట్టలను జోడిస్తారు అని వర్ణించారు.

మొగలులు ఈ హస్తకళను గోల్కొండ మరియు కోన సీమ ప్రాంతాల పూర్వపు చాళుక్యుల రాజులలో అందమైన దేవాలయాలలో గోడలపై చిత్రాలను తగిలించేవారు. రథం వెలుపలి భాగాన తెరగా ఉపయోగించేవారు. పురాణ ఇతిహాసాల దృశ్యాలను మరియు పౌరాణిక దృశ్యాలను సంప్రదాయ కలంకారి హస్తకళా చిత్రాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

తదుపరి కాలానుగునంగా ప్రపంచంలో కలంకారి ఉత్పత్తులకు గుర్తింపు, నేత, అద్దకం మరియు కలంకారి కళకు విశిష్టమైన ఆధరణ లభించి వర్ధిల్లిందని కేంద్ర బిందువులైన గోల్కొండ మరియు మచిలీపట్నం వాణిజ్య పరంగా కలంకారి హస్తకళ నిజాం ప్రభువులకు ప్రత్యేకమైన గుర్తింపు మరియు ఆదరణ లభించింది. గోల్కొండ ప్రభువులైన కుతుబ్‌షాలు కలంకారి ఉత్పత్తులను ఎక్కువ కోరే పర్షియన్ వర్తకులలో వ్యాపార సంబంధాలపై ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. కలంకారి ఉత్పత్తులను అవసరాలను బట్టి వివిధ జంతువుల రూపాలు, పుష్పాలతో కూడిన లతల రూపకల్పనలు మొదలైనవి మధ్య ఆసియా సంతల కోసం ప్రత్యేకంగా తయారు చేస్తారు.

19వ శతాబ్దంలో అలంకరణ చిత్రాలుగా అభివృద్ధి చెందింది. శ్రీకాళహస్తి కలంకారి శైలి వ్యక్తిగతం. పురాణ ఇతిహాసాల ద్వారా తీసుకోబడినది. ఈ కళాకారుల్లో ఎక్కువగా బలిజ కులస్తులే ఉండేవారు. వీరు సాంప్రదాయంగా వ్యవసాయంపై కుటీర పరిశ్రమలపై ఆధారపడి నివసించేవారు. ప్రస్తుతం కాళహస్తి చుట్టు ప్రక్కల దాదాపు సుమారు మూడు వందల మందికి పైగా కళాకారులు వస్త్రాలను రంగులను తయారు చేయడం మొదలైన కలంకారికి సంబంధించిన వివిధ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు.

బ్రిటిష్ కాలంలో మచిలీపట్నంలోని కలంకారి అచ్చు పరిశ్రమలు ఉండేవి. తరువాత కాలంలో బ్రిటిష్ వారి విధానాలలో మూతపడ్డాయి. స్వాతంత్ర్యం అనంతరం 1950లో కమలాదేవి చటోపాధ్యాయ అనే కళా ఉద్యమకారిణి కృషితో ప్రభుత్వం ఈ కళ యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, శ్రద్ధ తీసుకోవడంతో పునరుజ్జీవనం పొందింది. అయితే అప్పటికి ఈ పరిశ్రమ మచిలీపట్నం నుండి పక్కనే ఉన్న పెడనకు వెళ్ళిపోయింది. అయినప్పటికీ మచిలీపట్నం కలంకారిగానే పేటెంట్ పొందటంతో పాటు విదేశాల్లోను పేరు పొందింది. కృష్ణాజిల్లా మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాల్లో దాదాపు 10 వేళమంది ఈ వృత్తి చేస్తున్నారు.

చిత్రించే విధానం :

మిక్కిలి ఓర్పుతో కలంకారి అద్దకపు పరిశ్రమలో కలంకారులు ప్రదర్శించే అభిలాషితో, ఉత్సాహంతో వారి అర్పణ భావం ప్రకటితమవుతుంది. మొట్టమొదట బట్టను కళాకారుడు చిత్రించదలచిన క్యాన్వాసుగా తయారు చేసుకుంటాడు. దళసరి పాటిగాడా చేనేత బట్టను శుభ్రంగా ప్రవహిస్తున్న నీటిలో బట్టకు పెట్టిన గంజి, పిండిపోయే దాకా నాలుగైదు సార్లు శుభ్రం చేస్తారు. దీనిని శుభ్రం చేయడానికి సబ్బుగాని, ఇతర డిటర్జెంట్లు గాని ఉపయోగిస్తారు. ఈ విధంగా శుభ్రం చేసిన బట్టను గెదెపాలు కరక్కాయ రసం కలిపిన మిశ్రమంలో ముంచి ఎండలో ఆరబెడతారు. ఈ విధంగా ఆరబెట్టిన బట్ట ఇప్పుడు కలంకారి అద్దకానికి సిద్ధమైంది.

చింతబొగ్గుతో తయారైన బొగ్గు కణికెలతో ఈ బట్ట మీద భావానుగుణంగా హస్తకళా నైపుణ్యంతో చిత్రాలను చిత్రిస్తారు. ఈ చిత్రాలను అన్నభేది ద్రావణంతో సుడిచి

చిత్రాలను చెరగని నల్లరంగుగా తయారు చేస్తారు. సుదీర్ఘమైన ఈ కలంకారి విధానంలో ఇది మొదటి మెట్టు. ఈ విధంగా ఉతికి ఉడకబెట్టి వస్త్రాలపై చిత్రలేఖనం చేసి ఎండబెట్టి కలంకారి అద్దకపు బట్టను పూర్తిచేస్తారు.

కలంకారి చిత్రకారుల హస్తకళా కౌశలాన్ని చూడడం కనులకు విందు. కలాన్ని వ్రేళ్ళతో పట్టుకుంటాడు. కావలసిన రంగులో ముంచిన చిన్న గుడ్డను గానీ, దూదిని గానీ కలంలో పెట్టి వ్రేలితో నొక్కుతూ కావలసిన రంగు ద్రావనాన్ని కలం గుండా ప్రవహింపజేస్తూ పై రేఖాచిత్రాల మీద వర్ణం వేస్తాడు. నిపుణుల చేతిలో సంపూర్ణంగా చిత్రించిన చిత్రాలు చైతన్యవంతంగా తయారవుతాయి. రంగులు కన్నులకు కొట్టవు. నాజూకైన వర్ణాలు, అతి మృదువుగా, కంటికి ఇంపుగా సమరస భావంతో చల్లగా ఉంటాయి.

మచిలీపట్నం పరిసరాల్లోని విధానం చెక్కదిమ్మెల సహాయంతో చిత్ర నమూనాలను బట్టపై అద్దకం చేయడం, రకరకాల నమూనాలున్న దిమ్మెలు (బ్లాక్స్) తయారు చేయించి వాటిని రంగులో ముంచి పరచిన బట్టపైన క్రమ పద్ధతిలో అద్దడం. ఈ పద్ధతిలో శ్రమ తక్కువ. నిపుణుడైన కళాకారుడే చిత్రించనక్కర్లేదు. నైపుణ్యమంతా చెక్కదిమ్మెల తయారిలో ఉంటుంది. ఈ చిత్రాలలోని లోపం, చిత్రాలన్నీ మూగు చిత్రాలు - స్టీరియో టైపుగా ఉండటం, అవే దిమ్మెలు అవే చిత్రాలు.

కనుక నవ్యత తయారిలో రెండవ పద్ధతి కాళహస్తి ప్రాంతంలో ప్రసిద్ధం. ఎంతో నైపుణ్యం శ్రమ అవసరమైన విధానం ఈ చిత్రాలకొక ప్రత్యేక వ్యక్తిత్వం ఉంటుంది. దేనికదే ప్రత్యేకంగా కనిపిస్తాయి. చిత్ర రచనంతా చేతితో చేయవలసిందే. చిత్రాలన్నీ రేఖల ద్వారా సంవిధాన పరుస్తారు.

రంగుల తయారి :

ఆవు పాలు లేదా గేదెపాలతో పాటు కలంకారిలో మైరోబాలను వాడతారు. మైరొబాలన్‌లో లభించే ఫిక్సింగ్ ఏజెంట్లు ఫ్యాబ్రిక్‌కు చికిత్స చేసేటప్పుడు వస్త్రరంగు లేదా రంగును సులంభంగా పరిష్కరించగలరు. ఆలుమ్ సహజ రంగులను తయారు చేయడానికి మరియు (ఫ్యాబ్రిక్) వస్త్ర చికిత్సలో కూడా ఉపయోగిస్తారు. మచిలీపట్న కలంకారికళలో అచ్చు వేయవలసిన అద్దకం మూసలను పెద్ద చెక్కముక్కలతో తయారు చేస్తారు. దీనిని కూర గాయలతో తయారు చేసిన రంగులను ఉపయోగించి చీరలు, యితర దుస్తులపై అద్దకం రంగులను వేస్తారు. ఒక అచ్చు నమునాను తయారి చేయడానికి అనేక రోజులు పడుతుంది. అద్దకం చేతితో అచ్చు వెయ్యడం అనేక ప్రక్రియలతో చాలా విస్తృతమైనది. పూర్తిగా ఒక వస్త్రంపై కలంకారి కళతో కూడిన వస్త్రానికి మంచి ఆదరణ ఉంటుంది. ప్రతి దశలోను దానికి పట్టి ఉంచి రంగులను శుభ్రం చేసి దానిపై పట్టేట్లు జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ కలంకారి కళకు హాని చేయని సహజసిద్ధమైన రంగును వాడుతారు. ఎరుపు రంగును మేదరు చెట్టు వేరు నుండి తీస్తారు. పసుపురంగును దానిమ్మ గింజల నుండి లేదా మామిడి చెట్టు బెరడు నుండి తీస్తారు. నీలం రంగును ఇందిగో నీలగిరి చెట్టు నుండి, నలుపు రంగును మైరోబాలన్ పండు నుంచి తీస్తారు.

ఇనుము, టిన్, రాగి మరియు ఆలుమ్ యొక్క మూలాలు, ఆకులు మరియు ఖనిజ లవణాల (అవుపాలు లేదా గేదెపాలు), పిండి చేసిన పువ్వులను ఉపయోగించడం ద్వారా వివిధ ప్రభావాలను పొంద వచ్చు.

ఉత్పత్తి మరియు మూలాంశాలు :

ఇటువంటి భారతదేశ గాఢత కాక ప్రకృతి దృశ్యాలు, పశుపక్ష్యాదుల చిత్రాలు, ఋతు శోభలను వ్యక్తపరిచే చిత్రాలను కూడా చిత్రిస్తారు. ఈ ప్రాచీన పద్ధతికి ఆధుని కత జోడించి కొత్త నమూనాలను సృష్టిస్తున్నారు. ఆధునిక అభిరుచులకు అనుగుణంగా డోర్‌కర్టెన్స్, వాల్ హ్యాంగింగ్స్ తయారు చేస్తున్నారు. కలంకారి చిత్రాలకు మార్కెట్ క్రమంగా పెరుగుతున్నది.

కలంకారి కళ నైపుణ్యాన్ని బట్టి తయారు చేసిన

రకరకాల వస్తువుల దేశవిదేశాలతోపాటు పర్యాటక ప్రాంతాలలో ఎక్కువ ఉత్పత్తులు జరుగుతాయి. ఇందుకు అనగా ఇవి సహజసిద్ధమైన రంగులను ఉపయోగిస్తారు. ఇవి శరీరానికి ఎటువంటి హాని చేయవు. అందుకు కళాకారులు, వర్తకులు ఈ కళాఖండాలను ఎక్కువగా ఉత్పత్తి చేస్తారు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల గౌరమ్మ ఆరాధన

– తంత్రపల్లి శ్రీరామమూర్తి, తెలుగు అధ్యాపకులు, పి.ఆర్. ప్రభుత్వ.జూ. కళాశాల, కాకినాడ. తూ.గో.జిల్లా.

గ్రామదేవతారాధన :

ఆత్మారాధన దశనుంచి మానవుని మత పరిణామ క్రమం మొదలై భూతారాధన, జంతు ఆరాధన, మాతృదేవతారాధన వరకూ వివిధ దశలుగా పరిణామం చెందింది. "మనుష్యులను పీడించు ప్రేతాత్మల నుండి రక్షణకై ఆ మనుష్యుడే భగవద్రూపమును కల్పించుకొని తనకు సంరక్షకునిగా నిలువబెట్టుకొనెను. ఇట్టి భగవద్రూప కల్పనమునందు మొదటికల్పన తల్లిదేవత" అని నాయని కృష్ణకుమారిగారు వివరించారు. ఈ తల్లిదేవతను గ్రీకులు 'గిమ' అని, రోమన్లు 'తెల్లస్' అని అంటారు. గ్రామ దేవతల్ని పూజించడం అనేది నమ్మకంతో కూడుకున్న విషయం.ఈ దేవతలు రక్తపిపాసని కల్గిఉంటారని ప్రతీతి. ఈ దేవతారాధనలో బలి ఇవ్వడం సర్వసాధారణం. గ్రామ దేవతలు ఎవరూ నిలిపిన మూర్తులుగా ఉండరు. ఎవరో ఒకరికి తాము ఇక్కడ ఉన్నామనే సందేశాన్ని పూనకంలో కాని, కలలో కాని తెలపటం ద్వారా వారి గురించి ఊరంతా తెలు స్తుంది. అక్కడ తవ్వి చూస్తే ఒక శిలకానీ ఉన్న శిలాప్రతిమ కానీ బయలుపడుతుంది. అప్పటినుండి ఈ దేవతారాధన ప్రారం భమవుతుంది. తరువాత కాలంలో ఈ శిలామూర్తుల ప్రక్కన నాలుగు చేతులతో ఉన్న దేవతా విగ్రహాలు తయారు చేయబడి, పెద్దపెద్ద దేవాలయాలు నిర్మాణమయ్యాయి. ఏడాదికొకసారి పౌర్ణమి, అమావాస్యలో ఏదో ఒకరోజు ఈ దేవతలకు ఉత్సవాలు జరగడం జనపదాలలో జరుగుతూ ఉంటుంది. ఏదో ఒక ప్రత్యేకమైన నెలంతా జరిగే ఉత్సవాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా అనేక గ్రామదేవతలను జాన పదులు ఆరాధిస్తుంటారు. అయితే ఈ ఆరాధనకు భిన్నంగా జరిగేదే గౌరమ్మ ఆరాధన, ఉత్స వం. బలులు లేకుండా సాత్వికారాధన చేయబడి కేవలం ఒక నెలలో మాత్రమే గుడిలో ఉండి వెళ్లిపోయే ప్రత్యేక దేవత ఈ గౌరమ్మ. తూర్పుగోదావరి జిల్లా పెదపూడిమండలం పెదపూడి, గండ్రేడులలో ఉన్న గౌరమ్మ ఆరాధాన విశేషాలు తెలపటమే ఈ వ్యాసం ఉద్దేశం.

గౌరమ్మను తేవటం :

ఈ గౌరమ్మ పద్మశాలి కులదేవత. ఈ ఆరాధన దసరాతో మొదలై కార్తిక పౌర్ణమి దాటేంత వరకూ సాగుతుంది. దసరా రోజున పండుతున్న కంకులతో ఉన్న వరి దుబ్బును ఊరిచివర కాలువ వద్ద ఒక ఇత్తడి పాత్రలో పెడతారు. ఆ దుబ్బును కొత్త నూలు పోగుతో చుట్టూ కడతారు. కొబ్బరికాయలు, అరటిపళ్లు, పసుపు కుంకుమలు సమర్పిస్తారు. ఊరి లోకి భజంత్రీలతో తీసుకు వస్తారు. ఉదయం ప్రారంభించి ఊరంతా ఊరేగించి సాయంత్రానికి గుడిలో పెడతారు. ఇది ఆశ్వీయుజ మాసంలో శుక్లపక్ష దశమిరోజు జరుగుతుంది. ఆ ఐదు రోజులు గడిచిపోయాక అమావాస్య దాటిన మొదటిరోజు అనగా అట్లతదియ ముందు పాడ్యమిరోజు ఒక వ్యక్తి తలారా స్నానంచేసి, శుచియైన బట్టలు కట్టుకుంటాడు. ఒక కొత్త తెల్ల తువ్వాలు పట్టుకుని మామిడాడ గ్రామంలోని కుమ్మరికి స్వయంపాకం, దక్షిణ ఇస్తాడు. గౌరమ్మ మట్టిబొమ్మను తలపై ఉంచి తీసుకు వచ్చి అత్తవారింటిగా భావించే పద్మశాలీలైన కానూరివారి ఇంటిలో ఉంచుతారు. పూర్వం మామిడాడనుండి దాదాపు ఎనిమిది కిలోమీటర్లు నడిచే తీసుకువచ్చేవారు. తరువాత రోజుల్లో ప్రయాణ వాహనాలపై తీసుకురావడంగా మారిపోయింది. విదియరోజు ఉదయమే అమ్మవారిని బట్టలు కట్టి, మంగళసూత్రాలు, మట్టెలు ధరింపచేస్తారు. అమ్మవారు పైరెండు చేతులలో; ఎడమ చేతిలో శంఖం, కుడి చేతిలో త్రిశూలం ఉంటాయి. క్రింద రెండు చేతులు

వరద, అభయ హస్తా లు. వెనుక మకర తోరణం కూడా ఉంటుంది. పొడవు అడుగు మాత్రమే ఉంటుంది. విదియ రోజు గౌరమ్మను గుడివద్ద

నిలిపి సాంబ్రాణి పొగవేసి, నైవేద్యాలు సమర్పించి, బాజాభజంత్రీలతో, వేషాలతో, మందుగుండు సామాను కాలుస్తూ బయలుదేరతారు. ఊరేగించి సాయంత్రానికి గుడిలో చేర్చుతారు. అప్పటినుండీ ప్రతిరోజు పద్మశాలీ కులస్తులే పూజాదికాలు నిర్వహిస్తారు. పూర్వం పెద్దదైన మహిళ పూజచేసేది. తరువాత నూకెళ్లవారి మగవారు ప్రధాన పూజారులుగా ఉండేవారు. ఇపుడు తెలుకులవారి అబ్బాయి చేస్తున్నాడు. ఈ గౌరమ్మ ప్రతిమను చెక్కపీటపై స్థిరంగా కదలకుండా ఉండేలా కుమ్మరి తయారు చేస్తాడు. ఈ పీటను తలపై పెట్టుకుంటారు. ఇంటింటికీ వెళుతూ గౌరమ్మ ఆగుతుంది. ఆ ఇంటివారు బియ్యం, ఫలం, పూలు, డబ్బులు సమర్పిస్తారు. వాటిని స్వీకరించి పూజారులు గౌరమ్మకు చూపి, కావిడి బుట్టలలో భద్ర పరుస్తారు. పూలు, పసుపు కుంకుమలు, ఫలాలు తిరిగి ప్రసాదంగా ఇస్తారు. కొంత మంది హారతులు వెలిగించి ఇస్తే వాటిని గౌరీదేవికి చూపిస్తారు.ఈ విధంగా అన్ని కులాల వారు గౌరీదేవిని ఆరాధిస్తారు.

గౌరీదేవి కూడా సాంబ్రాణిధూపం వేసేందుకు నిప్పుల కుంది పట్టుకున్నవారు, కత్తి పట్టుకుని నాట్యం చేసే వ్యక్తి; వీరినే వీరమట్లు (వీరముష్ములు పదానికి వ్యవహారిక రూపము కావచ్చు) అంటారు. డప్పులవాళ్ళు, గౌరమ్మ పీటను పట్టుకొని కాసేవారు, (బరువుతో ఉన్న ప్రతిమ అటూ ఇటూ ఊగి పడకుండా) ప్రభ, (వెదురుతో డైమండు ఆకారంలో చేసినది,దానికి గుడ్డ తెరలు వంటివి కట్టి ఉంటాయి) పూజారులకు సహాయకులు, గౌరమ్మను తలమీద ఎత్తుకున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులు, భక్తులు, సరదాగా వచ్చే చిన్నారులు ఉంటారు. ఇలా చాలా కోలాహలంతో సాగుతుంది ఊరేగింపు. డప్పు చప్పుళ్ళు వినపడగానే ఆ వీధిలోనికి గౌరీదేవి వచ్చిందని చిన్నా పెద్దా అంతా వీధి గుమ్మం వద్ద బయటికి వచ్చి నిలుచుంటారు. పెళ్లి కావలసిన అమ్మాయిలు, సంతానం కావలసిన దంపతులు, మ్రొక్కు పెట్టుకున్న వారు, గౌరమ్మను తలమీద ఎత్తుకుంటారు. అలా ఎత్తుకున్నందుకు భక్తులు దేవాలయానికి కొంత దక్షిణ కూడా ఇవ్వవలసి ఉంటుంది.

గౌరమ్మను జానపదులు గైరమ్మ అంటారు. వచ్చాక గౌరమ్మ దాదాపు నెల రోజులు గుడిలో పూజలందుకుంటుంది. పీఠం మీద కదలకుండా ఉంటుంది. అందుకని జానపదులు ఎవరైనా పనిఉన్నా కదలకుండా, చేయకుండా ఉంటే 'గద్దెమీద గైరమ్మలా' కూర్చున్నావని అంటారు. ఈ నానుడి ద్వారా ఈ గౌరీదేవి ఆరాధన ఎప్పటినుంచో ఉందని తెలుస్తోంది. గౌరమ్మ ఊరేగింపులో గౌరమ్మ కంటే ముందు జానపదులు వేషాలు వేసుకుని తిరుగుతారు. పూర్వం ఈ మొదటి రోజు సాధువు వేషాలు వేసేవారు. కాషాయ వస్త్రాలు, రుద్రాక్షలు ధరించి చేతిలో దండ, కమండలాలు పట్టుకుంటారు. విబూది బొట్లు ; నుదురు, భుజాలు, మోచేతులు, మణికట్టు, గుండెలు, పొట్టపై పెట్టుకుంటారు. బ్రహ్మంగారి పదాలు పాడే వారు. ఈ పదాలన్ని కాలజ్ఞానాన్ని చెప్పేవిగా ఉంటాయి. ఉదాహరణకు:

పల్లవి : నందామయా! గురుడనందామయా! ఆనంద దేవికి నందామయా!
నిశ్చలమయా! గురుడ నిశ్చలమయా! గురువు చెప్పినమాట తప్పాదయా!

1. రావిచెట్టు మీద రాకాని పుడుతుంది, రాజులకు రణరంగమొస్తుందయా!
2. అత్తలకు పీటలు కోడలకు కుర్చీలు, అమిరేటి కాలము వస్తుందయా!
3. ములగచెట్టుమీదముత్యాలు పుడతాయి, ముండలకి రాజరిక మొస్తాదయా!

సాధువు వేషాలు నాలుగురోజులు వేసేవారు. ఇంటింటికీ తిరిగేవారు. ఆ తరువాత మరోవేషం వేస్తారు.

ఇందులో దేవర వేషం, కోయవేషం, మాంత్రికవేషం, తాటకవేషంతో రామలక్ష్మణుల వేషం, పోటువేషం (బుగ్గలో, గొంతులో, కడుపులో కత్తు లు పొడచుకు వచ్చి నట్లు) ఇలా ఉండేవి. దీపావళి రోజున మందులవేషం వేసేవారు. దేవర భార్య ఒక చెక్కమందిరంలో గౌరమ్మ చెక్కబొమ్మ ఉన్నది ఎత్తుకుంటుంది. దేవర కింద పంచె, పైన గౌనులాంటి చొక్కా వేసుకుంటాడు. పెద్ద పెద్ద మీసాలతో చేతిలో ఒక తాడు పట్టుకుంటాడు.మందిరాన్ని పెద్దకాపుల ఇంటివద్ద, కూడళ్లలోను నిలిపి అనేక రకాలైన గారడీ విద్యలు చేసేవాడు. ప్రజలంతా దానికి ఆశ్చర్య పోతారు. మధ్య మధ్యలో హాస్యోక్తులు, ఛలోక్తులు విసిరి అందరినీ నవ్విస్తాడు. సరసోక్తులు, శృంగారోక్తులు చెప్పి గ్రామ పెద్దలను ప్రసన్నం చేసుకుంటాడు. అపుడు అతనికి డబ్బులు ఇస్తారు. గౌరమ్మ ఉత్సవానికి చందా కూడా అడుగుతారు. వారు ఇంత అని చెప్పి పద్దురాయ మంటారు. కోయవేషాలలో జానపదులు వినోదం కోసం పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. ఆ పాటలు గౌరీ దేవిపై భక్తిని తెలిపేవి కొన్నయితే, సమాజంలోని అన్ని వర్గాల వారిని వ్యంగ్యంగా విమర్శించేవి కూడా ఉన్నాయి. శృంగార సంబంధమై వినోదాన్ని పంచేవి ఎక్కువ ఉన్నాయి. జానపదులు శృంగార ప్రియులు. "ఎట్టి గేయములందైనను జానపదుల ప్రేమ కలాపములు, సాంఘిక నియమోల్లంఘనములు, పరస్ప రాకర్షణములే కాననగును...జానపద వాఙ్మయమునందు జీవితము యథాతథముగ నగ్న తేజముతో భాసించును" అని బిరుదురాజు రామరాజుగారన్నట్లు ఎటువంటి అచ్ఛాదన లేని మాటలను విసిరి పాటలను పాడుకొనే ఆనందించే మనస్తత్వం కలిగి ఉంటారు. అందువలనే ఏ ఉత్సవ సంబంధ సాహిత్యమైనా వీటితో నిండి ఉంటాయి. ఉదాహరణకు

భక్తి : మూడేళ్లకొకసారి, వస్తాది మనగౌరి/
ముచ్చటగా మనమంతా కలిసి ఆడాలి
లబజనక లబజనక లబోలబో లబజనక

వ్యంగ్యం : కాపుల కుర్రోడు కారుమీది డ్రైవరు/ జీతం తక్కువని మీసం దువ్వేడు
లబజనక లబజనక లబోలబో లబజనక

శృంగారం : జంపరు జాకెట్లు జబ్బల దాకా బాడీలు/
అందులో ఉన్నాయి రెండు నల్లగేదెలు
లబజనక లబజనక లబోలబో లబజనక

పైరెండు పాదాలు పాడేటపుడు చప్పుళ్లు, నాట్యం ఆపేసి పాటగాడు పాడతాడు. అందరూ ఆగిపోయి ఉత్సుకతతో అతడు చెప్పేదానిని వింటారు. వంత పాడతారు. రెండు పాదాలు పూర్తయ్యాక గుంపుగా లేదా ఒకరికి ఒకరు ఎదురు పడి కాలు ఎత్తి నాట్యం చేస్తారు. మామూలు రోజులలో పనితో, శ్రమతో మునిగి పోయే జానపదులకు ఇది ఒక ఆటవిడుపు. అందుకే వారంతా ఉత్సాహంగా పాల్గొంటారు. ముఖ్యంగా యువకులు ఆనందంగా వేషాలు వేయడం, నృత్యాలు చేయడం చేస్తారు. నాటకాలు వేసే పాత్ర ధారులు వీరికి మేకప్ వేయడం జరిగేది. దాదాపు నెలరోజులు వేసే వేషాలు వేసేవారు. దీపావళి రోజున మందుల వేషాలు వేసేవారు. "కడుపునొప్పి మందు, కాలునొప్పిమందు, కంటిచూపు మందు, వశీకరణ మందు" అంటూ మందులు అమ్మే వారిగా రకారకాల ఆకులు, మూలికలు అమ్మినట్లు చేతికి ఇస్తుంటారు. వాటికి డబ్బులు ఇమ్మని అడుగుతూ సరసోక్తులతో అందరినీ నవ్విస్తూ ఉంటారు. తరువాత కాలంలో ఈ వేషాలు మానేసారు. కేవలం గౌరమ్మ, సాంబశివుడు వచ్చినపుడు మాత్రం ప్రదర్శించేవిగా మిగిలాయి. ప్రజలకు తీరిక లేకపోవడం, నగరాలకు వలస వెళ్లిపోవడం, ఎక్కువ మంది విద్యావంతులై వేషాలు వేయడానికి సిగ్గుపడడం వంటి కారణాల వలన నెలరోజుల వేషాలు, వేషాలలో రకాలు తగ్గిపోయాయి.

వేషాలు వేయడంలో సరదా మాత్రమే కాక ఒక శాస్త్రీయత కూడా ఉంది. "ఆడవేషంలో చూసుకోవాలని కొందరి మగవారికి, పిల్లలకు వివిధ వేషాలు వేసి చూసు

కోవాలని తల్లిదండ్రులకు, వికృత రూపాల్లో చూసుకోవాలన్న విపరీత భావనలు ఉన్నవారికి ఉంటాయి. దీనికి సంఘం, సభ్యత అడ్డు వస్తాయి. కనుక జాతర్లను అవకాశంగా తీసుకొని, దానికి పవిత్రతను ఆపాదించి ఆచరిస్తుంటారు. ఫ్రాయిడ్ 'సైకో ఎనాలసిస్' ప్రకారం" అవ్యక్త చేతనలలో అణచి పెట్టబడి యున్న కోర్కెల నుంచి భద్రత సాధించడానికి కళ ఒక మంచి పరికరం" కాబట్టి వేషాలు వేయడం వల్ల అటువంటి వారిలో ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారు. కాబట్టి మానసిక ఒత్తిడి తగ్గడానికి వేషాలు వెయ్యడం పూర్వులు కనిపెట్టిన అమోఘ మార్గం".

అట్లతదియ నోములు :

గౌరమ్మ వచ్చిన మరునాడే అట్లతదియ. ఇది ప్రధానంగా ఆడవారి పండుగ. కన్నె పిల్లలు, కొత్త కోడళ్లు, ముత్తైదువులు అట్లతదియ నోము నోచు కోవడం తెలుగు వారి ఆచారం. స్త్రీలు ఉదయం తలారా స్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు. సాయంత్రందాకా ఉపవాసం ఉంటారు. సాయంత్రం గౌరమ్మకు పూజచేసి చుక్కను చూసి అట్లు తింటారు.

తెల్లవారు జామునే చద్ది అన్నం తిని ఆడుకోవడం, పగలు ఉయ్యాల లూగడం, ఆటలు ఆడడం ఈరోజు స్త్రీలందరూ చేసేవారు. ఇలా నోములు నోచే స్త్రీలు గౌరమ్మకు దొంతుకు పన్నెండు చొప్పున ఆరు వరుసలు పేర్చి నైవేద్యం పెడతారు. మాంగల్యభాగ్యం కలగడానికి, దానిని కాపాడడానికి ఉన్న ప్రధానదేవత గౌరమ్మే అని భావిస్తారు. అందుకని పద్మశాలీ మహిళలంతా విధిగా ఈ నోము నోచుకుంటారు. నైవేద్యం పెట్టిన అట్లలో కొన్ని పూజారి ప్రసాదంగా ఇస్తాడు. కొన్ని తాను తీసుకుని మిగతావన్నీ అందరికీ పంచుతాడు. పండగ పరమార్థమే పంచటం కదా! గౌరమ్మ వచ్చిన దగ్గరనుండి దాదాపు నెలరోజులు సాయంత్రం మొదలుపెట్టి 'పదం' పాడేవారు. వీటిలో బాలనాగమ్మకథ, కాంభోజరాజు కథ, అపురూప చింతామణి కథ మొదలైనవి ఉండేవి. ప్రధాన పాటకత్తె పాడితే ఇద్దరు మహిళలు వంత పాడేవారు. మొదట్లో పద్మశాలి మహిళ పాడేది. ఆ తరువాత దళిత మహిళ పాడేది. ముగింపులో "నిద్దరో గైరమ్మా నిద్ద రోవమ్మా! కరణాలు మునిసిబులూ నిద్దరోయారు...." అంటూ జోలపాల పాడి ముగించేవారు. ఆ విద్య తరువాతి తరానికి అందకపోవడం, టీ.వి. ల ప్రవేశంవలన ఈ పదాలు పాడే, వినే వారు లేకపోవడవ వలన ఇపుడు ఈ పదాలు లేవు.

సాంబశివుడు రావడం :

ఆశ్వీయుజమాస శుక్లపక్ష త్రయోదశిరోజు కుమ్మరికి స్వయంపాకం, దక్షిణ ఇచ్చి గౌరమ్మ విగ్రహం తెచ్చి నట్లే సాంబశివుని మట్టిబొమ్మను తెస్తారు. సాంబశివుడు వృషభవాహనంపై ఉంటాడు. పైరెండు చేతులలో కుడివైపు డమ రుకం, ఎడమవైపు శంఖం ఉంటాయి. క్రింది కుడిచేయి అభయహస్తం, ఎడమచేయి త్రిశూలం ధరించి ఉంటాయి. కానూరి వారి ఇంటిలో ఆ రాత్రి ఉంచుతారు. చతుర్దశి రోజు ఉదయాన్నే వస్త్రాలు ధరింప చేస్తారు. వెండి త్రిశూలం, నాగాభరణం, యజ్ఞోపవీతాలు అలంకరిస్తారు. అక్కడనుండి గుడికి తీసుకు వస్తారు. సాంబ్రాణి ధూపాలు, నైవేద్యాలు సమర్పిస్తారు. జంగము వాడు గంట కొడుతూ, ఆగిన ఇంటివద్ద శంఖము ఊదుతుంటే, భజంత్రీల వాయిద్యానికి అనుగుణంగా వీరమట్లు నాట్యం చేస్తారు. కూడా వెదురు బద్దలతో చేసి, తెరలతో అలంకరించిన ప్రభ ఉంటుంది. మందుగుండు సామాను కాలుస్తూ వేషాలు ముందు నడుస్తుంటే సాంబశివుడు ఊరేగుతాడు.

సాంబశివుడు వచ్చిన రోజు ప్రధాన ఆకర్షణగా పులి వేషాలు ఉండేవి. డప్పుల వాయిద్యాలకు అనుగుణంగా మనుష్యులు ఒళ్లంతా పసుపురంగు, నల్లచారలు పులుముకొని, పులిముఖాలతో, తోకలు తగిలించుకొని నాలుగు కాళ్లతో నడిచినట్లు చిత్ర గతులతో ఆడతారు. అప్పటిదాకా రాసిన పద్యాలన్నీ ఆ రోజుతో వేషాలయి పోయాయని, సంబరం దగ్గరకు వచ్చిందని, చందా

డబ్బులు నిర్బంధించి అడిగి తీసుకునేవారు. తరువాతి కాలంలో చందా ఊరిమీద అడగడం మాని పద్మ శాలీ కులస్తులే ధనాన్ని ఇంటికింత అని సమీకరించుకుంటు న్నారు. దర్శనానికి వచ్చే టికెట్ డబ్బులు, గుడివద్ద అడిగి తీసుకునే చందా డబ్బులతో సంబరం జరుపుతున్నారు.

పద్మశాలీలందరికీ కార్తిక పున్నమి నోములు చాలా ప్రధానమైనవి. ఇంటిలో ఎక్కడా బూజు, పాచిలేకుండా దులిపి, కడిగి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం వరకు ఇంటిల్లిపాదీ ఉపవాసం ఉంటారు. సాయంత్రం బూరెలు, పిండి వంటలు వండుతారు. అందరూ గుడికి వెళ్లి గౌరీ సాంబశివులకు బూరెలను నైవేద్యంగా సమర్పిస్తారు. గుడి వాకిలిలో సాయంత్రం దీపపు సెమ్మె (ఇత్తడి చెట్టు)లో దీపాలు వెలిగిస్తారు. ఊరేగింపులో కొత్త దంపతులు, పుత్రసంతానం కోరేవారు సాంబశివుణ్ణి తలమీద ఎత్తుకుంటారు. అడపిల్లను కావాలనుకున్న వారు గౌరమ్మను ఎత్తుకుంటారు. ఇంటిలో ఎవరైనా ఎత్తు కుంటే కుటుంబసభ్యులు కూడా వెళతారు, ఆ వీధిలో వారుకూడా కొంతదూరం సాగనంపి వెనక్కి వస్తారు. ఇక మోయలేనని చెబితే పూజారి సహాయకులు ఎత్తు కుంటారు. ఎత్తుకున్నవారికి, కూడా వచ్చిన వారికి అరటి పండ్లు ప్రసాదంగా ఇచ్చిపం పిస్తారు.

గౌరమ్మ సంబరం :

సాంబశివుడు సంబరానికి ముహూర్తం నిర్ణయించి ముహూర్తపురాట వేస్తారు. సంబరం మంచిరోజు చూసి బుధవారంగా నిర్ణయిస్తారు. సంబరంలో పాల్గొనే బ్యాండు వాళ్లు, వేషాలవాళ్లు, మేళాలవాళ్లు, సహాయకులు; ఇలా చాలామంది సాయంత్రానికే ఊరికి చేరుకోవాలి. రవాణా, ప్రయాణ సౌకర్యాలు తక్కువగా ఉండే ఆ కాలంలో ఇంత మందికి సరిపడే వంటదినుసులు, కూరగాయలు తేవటం కష్టం. పెదపూడిలో బుధవారం సంత జరుగుతుంది. సంతరోజు సులభంగా కొనుగోలు చేసి అందరికీ భోజ నాలు అమర్చవచ్చు అనేమో ఇప్పటికీ బుధవారం మాత్రమే సంబరం జరుపుతున్నారు. ఊరిలోని ఆడపడు చులంతా తమ భర్త, పిల్లలతో సంబరానికి తప్పనిసరిగా రావడం ఒక సంప్రదాయం. సంబరం రోజు గౌరీశంకరుల విగ్రహాలను ఎదురెదురుగా ఉంచి పూజ చేస్తారు. తెల్లవారుజామునే 'నౌబత్‌ఖానా' (పిల్లసన్నాయి) పాడి గౌరీశంకరులకు మేలుకొలుపుతుంది. ఉదయం నుండి ఊరిలోవారు, పొరుగూరివారు దర్శనానికి వస్తారు. అత్త లాలు, గెలలు, చీరలు, కొబ్బరి కాయలు, తల నీలాలతో భక్తులు మ్రొక్కులు తీర్చుకుంటారు. సాయంత్రం ఎనిమిది గంటల ప్రాంతంలో దర్శనాలు పూర్త వుతాయి. భోజనాలు చేసిన బ్యాండు వారు గుడివద్ద నిలుచుని భక్తిగీతాలు వాయిస్తారు. ఆ తరువాత మిగిలిన బ్యాండులు, విచిత్ర వేషాలు, కోయమేళాలు, బుట్ట బొమ్మలు చివరిగా బండిమీద వేషాల వంటివి వరుసగా గుడివద్ద ఆడి వరుస క్రమంలో బయలు దేరతాయి.

సంబరం రాత్రివేళ కాబట్టి వేషాలు కనిపించడానికి దీపాలు ఉంచేవారు. విద్యుత్ లేని కాలంలో గ్లాస్ లైట్లు, (పెట్రోమాక్సులైట్ల కంటె పెద్దవిగా ఉండి అద్దాలతో పెద్ద పరిమాణంలో ఉండేవి) తరువాత కాలంలో పెట్రోమాక్సు లైట్లు కూలీలు తలమీద మోస్తూ ప్రదర్శన కనిపించేలా చేసేవారు. తరువాత కాలంలో ఒక కర్రకు ట్యూబులైటు అమర్చి కూలీ పట్టుకు తిరుగుతుంటే జనరేటరును బండిలో ఉంచి సంబరం కూడా తిప్పేవారు. ఇపుడు విద్యుద్దీపాలతో అటువంటి ప్రయాసలేకుండానే చేయ గలుగుతున్నారు. వేషాల చివర జంగమువాడు, వీర ముట్లు, ప్రభలు, పూజారులు, సహాయకులు, మందు గుండు సామాను కాలుస్తుండగా గౌరీశంకరులు ఇంటింటికీ ఆగి అందరి పూజా దికాలు గ్రహించి అను గ్రహిస్తారు. తెల్లవారి ఐదుగంటలతో సంబరం ముగు స్తుంది. మధ్యాహ్నం వరకు గౌరీ శంకరుల ఊరే గింపు సాగుతుంది. ఇంటి ఆడపడు చుగా భావించే నూకెళ్ల వారింటిలో గౌరమ్మకు పానుపువేస్తారు. వసుపు కుంకుమలు, నైవేద్యాలు సమర్పించి ఒడికట్టు కడతారు.

బంగారు వెండి ఆభరణాలు తీసి భద్రపరుస్తారు. వాయిద్యాలతో ప్రజలంతా వెంటరాగా గౌరీ సాంబశివుల మట్టి ప్రతిమలను చెరువులో నిమజ్జనం చేస్తారు. దాదాపు ఏభై సంవత్సరాల క్రితం రెండు వర్గాలవారు దుబ్బును తేవటంతో కొత్త గౌరమ్మ ఏర్పడింది. అప్పటి నుండి ఏడాది విడిచి ఏడాది కాక ప్రతి ఏడాది అంటే ఒక ఏడాది పాత గౌరమ్మ, మరో ఏడాది కొత్తగౌరమ్మ ఆరాధన జరుగుతోంది. గండ్రేడు గ్రామంలో ఎనభై ఏళ్ళ క్రితం పద్మశాలీ కులస్తులయిన శ్రీ వట్టూరి వెంకన్నగారు దసరా రోజు వరిదుబ్బును తెచ్చి, అట్లతదియకు గౌరీ దేవిని నిలిపి ఈ ఆరాధన ప్రారంభించారు. దీపావళికి సాంబమూర్తిని తెచ్చి ఆ తరువాత పదిరోజులకే బుధ వారం నాడు సంబరం చేయటం మొదలు పెట్టారు. ఇప్పటికీ ఆ కుటుంబం వారు ఆ విధంగానే చేస్తున్నారు. మిగతా కులాలు వారు సహకరిస్తున్నారు. ఇక్కడ గుడిలో గణపతి సహితులైన గౌరీసాంబమూర్తుల సిమెంటు విగ్రహాలు ఉన్నాయి. పద్మశాలీలు పూర్వంనుండి శివారాధకులు. మార్కండేయ వంశజులమని చెప్పుకుంటారు. అందువలన వారికి ప్రధానమైన అట్లతదియ నోము, కార్తిక పున్నమి నోము శివాంకితమైన ఉత్సవాలుగా జరుపుకోవడం ప్రధానాంశంగా కనిపిస్తుంది. ఒక వర్గం కొలిచే దేవతాస్థానం నుండి గ్రామదేవతగా గౌరమ్మ పూజలందుకుంటోంది. ఆదిదంపతుల ఆరాధన అందరికీ శ్రేయస్కరమే కదా!

ఆధారగ్రంధాలు :

1. గ్రామదేవతారాధన- శాస్త్రీయత-ఎస్ అనిత-'వాఙ్మయి'త్రైమాసిక పత్రిక-2001.
2. తెలుగు జానపద గేయసాహిత్యము-డా.బి.రామరాజు-తెలుగు సాహిత్య అకాడమీ-2015.
3. శ్రీ జక్కా శ్రీనివాసరావు-గండ్రేడు-55 సం.లు
4. శ్రీ తంత్రవహి ఉమామహేశ్వరరావు-పెదపూడి-79 సం.లు
5. శ్రీ తిప్పాన భాస్కర్-పెదపూడి గౌరమ్మ ఆలయకమిటీమెంబరు-54 సం.లు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సోయగం – పగటి వేషం

– డా॥. కొమ్మనబోయిన సుజాత, లెక్చరర్, ప్రభుత్వ మహిళా కళాశాల, (స్వయంప్రతిపత్తి) గుంటూరు.

జాతికి జీవం జానపదం. ఒక జాతియొక్క సంస్కృతి ఆ జాతియొక్క జానపద విజ్ఞానంలో నిక్షిప్తమై ఉంటుంది. మన తెలుగు జాతికి తనదైన అద్భుతమైన జానపద విజ్ఞాన సంపద ఉంది. మన జానపద విజ్ఞానంలో ఒక భాగం జానపద కళారూపాలు. ఆ జానపద కళారూపాల్లో ఒక భాగం "పగటి వేషాలు". ఈ 'పగటి వేషాలు' విశిష్ట మైన, ప్రాచీనమైన జానపద కళ. అన్ని వర్గాల వారిని, అన్ని ప్రాంతాల వారిని అలరించిన అద్భుత జానపద కళ. ఒక్క మన తెలుగు దేశంలోనే కాక భారతదేశమంతటా కూడా వివిధ పేర్లతో ప్రదర్శించబడిన, ఆదరించబడిన కళారూపమిది. కర్నాటకలో వీటిని 'బహురూపి' లేదా 'హగలు వేషద ఆట' అని తమిళనాడులో 'పగల్ వేషం' అని అంటారు. బహురూపియా పేరుతో మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్ మొదలైన ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ జానపద కళారూపం ప్రదర్శించబడుతుంది. పగటిపూట ప్రదర్శించే కళారూపాలు కావడంచేత వీటికి పగటి వేషాలు అనే సార్థక నామధేయం కలిగింది. ఈ పగటి వేషాలను బహురూపులు అని కూడా అంటారు. 'బహురూపము' అనే మాట పాల్కుర్కి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో తొలిసారిగా పేర్కొన్నాడు. తర్వాతి కవుల కావ్యాల్లో కూడా ఈ ప్రయోగం కనిపిస్తుంది. తెలుగునాట ఈ పగటివేషాలను ప్రదర్శించేవారిలో ప్రధానంగా గడ్డిపాడు భాగవతులు, కూచిపూడి భాగవతులు, బుడిగె జంగాలువారు కలరు. మొత్తం 64 పగటి వేషాలను ప్రదర్శించే వారని తెలుస్తుంది. పగటి వేషాల్లో కొన్ని నిత్య జీవితానికి సంబంధించినవి. కొన్ని పౌరాణిక వేషాలు, కొన్ని కల్పనా వేషాలు, మరికొన్ని హాస్యరసంతో కూడుకున్నవి. అయితే వీటిని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించ వచ్చు.

ఒకే వ్యక్తి ప్రదర్శించే కళారూపాలు :

ఉదా : పిట్టలదొర, బ్రాహ్మణ వితంతువు, కోయ వేషం, వీరబాహు వేషం, అర్ధనారీశ్వరవేషం, శక్తి వేషం మొదలగునవి.

సామూహిక ప్రదర్శన కళారూపాలు :

ఉదా : మందులవాళ్ళు, గొల్లబోయడు, సోమ యాజులు, సోమిదేవమ్మ, పాములవాళ్ళు, కాశీకావళ్ళు, చిట్టిపంతులు మొదలగునవి.

హావభావ వ్యక్తీకరణలో, వేషరచనలో, గాన ఘణితుల్లో, వాక్చాతుర్యంలో, గొప్ప నేర్పు, నైపుణ్యాలు కలిగిన ఈ పగటివేష కళాకారుల ప్రతిభ ఎనలేనిది. పగలు గ్రామాల్లో వీధులవెంట సంచారం చేస్తూ తమ కళాప్రదర్శన చేస్తారు. ఈ కళాకారులు ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి సంచారం చేస్తూ వేషాలాడుతూ పొట్టపోసుకుంటారు. జాతరల్లో, పండుగల్లో, ఉత్సవాల్లో ఎక్కువగా వీరి ప్రద ర్శనలు నిర్వహించబడతాయి. ఇళ్లముందు, నాలుగురోడ్ల కూడళ్ళవద్ద, రచ్చబండల వద్ద లేదా వీధుల్లో వీటిని ప్రదర్శిస్తారు. ఆహార్యం, భాష ప్రధానాంశాలుగా ఈ పగటి వేషాలు ప్రదర్శించ బడతాయి. వీరు ఏ వేషం వేసినా, ఆ వేషం వేసినట్లుగా కాక ఆ వేషంలో ఆయా పాత్రల్లో సహజ సుందరంగా ఇమిడిపోతారు. గొర్రెలుకాచే గొల్లల పాత్రలు ధరిస్తే అక్షరాలా గొర్రెల కాపరులను గుర్తుకు తెచ్చేవారు. వీరిలో మరొక ప్రత్యేకత భాష. యే పాత్రను ధరిస్తే ఆ పాత్రకు తగినట్లుగా భాషను ప్రయోగించేవారు. అంతేకాకుండా ఏ ప్రాంతానికి వెళితే ఆయా ప్రాంతాల వ్యావహారిక భాషలను, యాసలను, మాండలికాన్ని ప్రయో గించగల ప్రతిభ ఈ కళాకారుల సొంతం. ఈ కళాకారులు పెద్దలద్వారా వినికిడిగా పురాణాలు, ఇతిహాసాలు, అష్టపదులు, అన్నమాచార్య కీర్తనలు నేర్చుకొని ఆయా

పాత్రల వేషధారణకి తగినట్లుగా అభినయించి ప్రజల్ని మెప్పిస్తారు. ఈ పగటి వేషాలలో కొన్నింటిని రేఖామాత్రంగా చూద్దాం.

గొల్లబోయడు :

పగటివేషాల్లో అతిప్రాచీనమైన, హాస్యభరితమైన వేషం గొల్లబోయడు. ఈ పగటివేషంలో మొత్తం 3 పాత్రలుంటాయి. 1) గొల్లబోయడు, 2) గొల్లబోయడి గురువు, 3) సాయిబు. గొల్లబోయడు అమాయకమైన పాత్ర. ఇతను మాటల మధ్యలో ఎన్నో పొడుపు కథలు పొడుస్తాడు. సాయెబు, గొల్ల బోయడుల మధ్య సంభాషణ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. అధికారుల్లో అవినీతిని ఎండగట్టే వేషమిది.

పిట్టల దొర :

పగటి వేషాల్లో వింతైన వేషం పిట్టలదొర. ఎగుడు దిగుడుగా ఉండే కాకి డ్రిల్లుప్యాంటు, కాకిచొక్కా, నల్ల కళ్ళజోడు, చేతిలో తిరగేసి పట్టుకున్న తుపాకి. ఇదీ ఇతని వేషం. ఇక వాక్చాతుర్యానికి వస్తే అనర్గళంగా మాట్లాడుతూనే ఉంటాడు. సమయాన్ని బట్టి, సందర్భాన్నిబట్టి మాట్లాడుతూ రకరకాలుగా ప్రగల్భాలు పలుకుతూ ఉంటాడు. బడాయిగా ప్రగల్భాలు పలికేవారికి బుద్ధివచ్చేలా చేయడమై ఈవేషంయొక్క ఔచిత్యం.

హల్లో సార్, గుడ్ మార్నింగు సార్, సలామాలేకుం, హల్లో వణక్కం సామి వణక్కం, నమస్కారమండీ ఇలా కనిపించిన వారినందరిని పలకరిస్తాడు. నేను సార్ పిట్టల దొరని. మా తాత గుట్టలదొర, మా నాన్న తట్టలదొర సార్. మీ తాత దగ్గర మాతాత మూడు గ్రామాలు అప్పు తీసుకున్నాడు సార్. అది కాలక్రమేణా ఐదు గ్రామాలైంది. అరువుసొమ్ము బరువు చేటని ఆ ఐదు గ్రామాలను తట్టలోపెట్టుకొని నెత్తిన మోసుకొని వస్తుంటే తస్సాదియ్య కాకి వచ్చి తట్టతో సహా కాళ్ళతో తన్నుకుపోయింది సార్.

అన్నట్టు మీలాంటి గొప్పవారు అలా చేసేరేమిటి సార్, మా నాయనమ్మ మూడో పెళ్ళికి రమ్మని కాకివెంట కాకి, కాకివెంట కాకి చొప్పున వంద కాకులను పంపించాను సార్. వెళ్ళిన కాకి తిరిగొచ్చిన పాపాన పోలేదు. మీరు రాకపోయేసరికి మీకోసం నేనే వద్దామని బయలుదేరాను సార్. విమానం మీదొద్దామంటే పట్టీలు కొట్టి పడిపోద్దేమోనని, రైలుమీదొద్దామంటే పట్టాలు తప్పుద్దేమోనని, కారు మీదొద్దామంటే దేనికైనా గుద్దుకుంటుందేమోనని, బండిమీదొద్దామంటే బోల్తా పడుద్దేమోనని, ఓడయితే మునిగిపోద్దేమోనని ఆలోచనచేసిన వాడినై కాలినడక అన్నిటికంటే కావలసిందని భావించి ముక్కుకు సూటిగా బయలుదేరి వచ్చానుసార్. తమ ఇంటికి కాలినడకన వచ్చానని చిన్నచూపు చూడకండి సార్. మా ఇంట్లో బోల్డెంత బంగారం ఉంది. మొన్నే గుమ్మడికాయంత బంగారం కుక్కముడితే గోడవతల పారేయించా సార్. గోదాట్లో ఏడొందల ఎకరాలు మాదే సార్... ఇలా అనర్గళంగా సాగిపోతూ ఉంటుంది పిట్టలదొర సంభాషణ. కాలాన్నిబట్టి, సమయం, సందర్భాలను బట్టి సంభాషణ సాగుతుంది. మొత్తానికి సరదాగా మాట్లాడుతూ నవ్వుతూ, నవ్వించే పగటి వేషధారి పిట్టలదొర.

బ్రాహ్మణ వితంతువు వేషం :

పగిటివేషాల్లో హాస్యానికి పెద్దపీట వేయబడిందని చెప్పవచ్చు. ఈ బ్రాహ్మణ వితంతువు వేషం కూడా అట్టిదే. భర్తకంటే ఆచారాన్నే ఎక్కువగా ప్రేమించిందేమో అన్నట్టుగా ఉండి నవ్వించే పాత్ర ఇది.

"శ్రీరంగ రంగ రంగా మాయన్న కావేటి రంగరంగ" అంటూ ప్రవేశించి కనిపించిన వారినెల్లా చనువుగా పలుకరిస్తూ "ఏమండోయ్ బాగున్నారా! అయ్యో నేనండి అలా చూస్తారేం నేను రామతులసిని. అయ్యోరామా! మర్చిపోయారల్లే ఉంది, అంతా క్షేమంగా ఉన్నారా. నేనూ క్షేమమే. నిక్షేపంగా ఉన్నానండి. మా పంతులుగారా! పోయారండి, అయినా మా పంతులుగారు ఈ కాలం వారిలా ఉండేవారా ఏమిటి? మూరెడు మీద జానెడు మనిషి. మా పంతులుగారు వ్రాతలో మహా తెలివైనవారు. ఇక మేతలోనా అఖండులు, మాకేం తక్కువ, మాకేం లోటండి! ఇంటిముందు పాడె, ఇంటి యెనుక పాడె.

ఇంటి పక్కన పాడె మా ఇంటిచుట్టూరా పదిళ్ళు పాడే. అంటే అదేనండీ పాడీ పంటలునూ." అంటూ అనర్గళంగా మాట్లాడుతూ కడుపుబ్బా నవ్వించే పగటివేషం ఈ బ్రాహ్మణ వితంతువు వేషం.

వీరబాహు వేషం :

తాలె లెల్లియ్యాలో శివతాలె లెల్లియ్యలో
యింటనున్న యీరులకి దండామయ్యో
చేతనున్న కత్తికే దండామయ్యో

యిన్నారండి బాబయ్య యిది మా లెల్లియ్య పాటండీ బాబయ్య. ఇది మా సంకురాత్రి సంబరంలో పాడేత్తా మండీ బాబయ్యా! మేం పెద్ద కులన్ధలమండి బాబయ్యా, మమ్మల్ని యెవ్వరూ ముట్టుకోరండి పొలాల్లోకి వెళ్ళినప్పుడు పెద్దపెద్ద రైతులు మేము కల్సి పనులు సేసుకుంటామండి. అక్కడ ముట్టుకుంటామండి. ధాన్యం తెచ్చినప్పుడు, గాదెల్లో పోసినప్పుడు, యింట్లో ధాన్యం బస్తాలు నిల్వయేసినపుడు అంటు ముట్టు ఏమీ ఉండదండి. కాని యీదిలో కొస్తేమాత్రం మీరంతా అరుగు మీద, మేము యీదిలో నిలబడాలండి. యిదండీ సంగతి. ఈవిధంగా మాట్లాడుతూ సమాజంలోని అసమానతలని అంటరానితనాన్ని నిలదీసే, ప్రశ్నించే చక్కని పగటివేషం వీరబాహు వేషం.

మందులపెట్టె :

చేతుల్లేని తెల్ల చొక్కాలు రకరకాల పూసలదండలు ధరించి ఉంటారు. ఈవేషంలో దాదాపు ఐదారుగురు ఉంటారు. వారిలో ఒకరిద్దరు స్త్రీలు కూడా ఉంటారు. రకరకాల మూలికలు వీరిదగ్గర ఉంటాయి. వాటిని చూపుతూ అనర్గళంగా మాట్లాడుతూ ఈ పగటివేష ప్రదర్శన సాగుతుంది.

మాసేతి మాత్రండి వైకుంఠయాత్రండి. మాదగ్గర శానా శానా మందులుండాయండీ మాం ఒక్కరికి మందిత్తేనండీ తొంబండుగురు పోతారండీ. అసలకండీ రోగిపోతే గాని రోగం పోదండీ, మా మందిత్తేనండీ రోగి రోగం ఒక్కసారే పోవాలండి. ఈవిధంగా అనర్గళంగా మాట్లాడుతూ సాగే పూర్తి హాస్యరస పగటి వేషం ఇది.

సోమయాజులు - సోమిదేవమ్మ :

"ముసలి మొగుడు - పడుచు పెళ్ళాం" (కన్యా శుల్కం దురాచారం) అనే భావనకు చెందిన ఆచారాన్ని ఎద్దేవా చేసే పగటివేషమిది. 80 సం॥ల ముసలి వేషంతో సోమయాజులు, 18 సం॥ల స్త్రీ వేషంతో సోమిదేవమ్మ, ఒకరిద్దరు శిష్యులు ఈ వేషంలో ఉంటారు. వీరిమధ్య సంభాషణ హాస్యరస భరితంగా ఉండి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది.

సోమయాజులు : సోమా! ఒసే సోమా!

సోమిదేవమ్మ : అబ్బబ్బా... ఈ సోమా! సోమా! అనే నోటికి విధి, విరామం లేదు కదా! ఆ దవడలెన్నడయినా పచ్చివెలక్కాయ చిప్పల్లాగా నొక్కుకు పోతే సుఖ పడుదును.

సోమయాజులు : (శిష్యుడితో) ఒరేయ్ మీ అమ్మగారే మిట్రా అంటుంది.

శిష్యుడు : నిన్ను తిడుతుందండి!

సోమయాజులు : నిన్న తిడితే ఇవాళట్రా చెప్పడం.

శిష్యుడు : నిన్న కాదండి! ఇవాళేనండి! మిమ్మల్ని తిడుతుందండి.

సోమయాజులు : ఆ... అయ్యో... అయ్యో! భర్తని తిట్టవచ్చునటే. పాపం కదుటే.

సోమిదేవమ్మ : నావల్ల పాపముంటే నా పనుపు కుంకాలేపోతాయి మీ వల్ల పాప ముంటే మీరే మట్టిగొట్టుకు బొడ్రాయి పాలై మట్టిగొట్టుకుపోతారు.

సోమయాజులు : అయ్యో... అయ్యో గోడ దెబ్బ, చెంపదెబ్బ రెండూ నాకేనటే.

ఈవిధమైన సంభాషణలతో సాగుతుంది ఈ పగటి వేషం.

శక్తి వేషం :

చిన్న పిల్లలనేకాక పెద్దవాళ్ళని కూడా భయపెట్టే పగటివేషం శక్తివేషం. లక్ష్మణునిచే ముక్కు చెవులు

కోయించుకున్న శూర్పణక శక్తిరూపు దాలుస్తుంది. రక్తసిక్తమైన ముఖం, ఒకచేతిలో వేపమండలు, మరోచేతిలో కొరడాతో వికృతరూపంలో ఉండే శక్తి వేషాన్ని చూస్తే అందరూ భయపడతారు. పగటివేష కళాకారులు చివరిలో శక్తివేషాన్ని ప్రదర్శిస్తారు. శక్తివేషం వేస్తే ఆ గ్రామ దేవతలు సంతోషిస్తారని, గ్రామం చల్లగా ఉంటుందని అప్పటి పెద్దల నమ్మకం. ఈ శక్తివేషంతో పగటి వేషాలు అయి పోయినవని తలచి మరునాడు ఆ కళాకారులు వస్తే బహుమతులు ఇచ్చేవారు.

ఈవిధంగా పగటివేష కళాకారులు దాదాపు 64 పగటి వేషాలు ప్రదర్శించి ప్రజలను అలరించేవారు. రాత్రిపూట కన్నా పగటిపూట రకరకాల వేషాలువేసి ప్రజల్ని ఆకట్టు కోవడం అనేది కష్టమైన విషయం. వీరి ఆహార్యంలోనే వీరి ప్రతిభ కనిపించేది.

ఆనాటి ప్రజలకు ఏకకాలంలో విజ్ఞాన, వినోదాల్ని పంచిన ఈపగటి వేషాలు నాటి పరిపాలకుల దృష్టికి ప్రజా సమస్యలను తీసుకురావడంలో ఉపయోగపడ్డాయి. పాలకుల్లోని అవినీతిని, ప్రజల్లోని అజ్ఞానాన్ని, ఎద్దేవాచేసి ప్రజలకు మంచిచెడు బోధించడంలో కూడా ఈ కళలు ఉపయోగ పడ్డాయని చెప్పొచ్చు. అయితే ఈనాడు సరైన ఆదరణ లభించకపోవడంతో దాదాపుగా ఈ కళారూపాలు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. తిరిగి ఈ కళల్ని పునరుద్ధరించుకొనవలసిన గురుతర బాధ్యత మన తెలుగుజాతిపై ఉంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1) తెలుగు నాటక వికాసము - డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు.
2) పగటివేషాలు - వాటి ప్రాచీనత - విభూతి భవాని లింగం.
3) కూచిపూడి పగటి వేషాలు - డా॥ ఆర్. వాసుదేవసింగ్.
4) సాహిత్యానుశీలన - ప్రొఫెసర్ ఎస్. గంగప్ప.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద కళల పై ప్రపంచీకరణ ప్రభావం

– నరేష్ భూక్య, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

జనపదం అంటే ఊరు,దేశం,ప్రజలు నివసించే ప్రాంతం అనే అర్థాలున్నాయి. జానపదుల అంటే గ్రామాలలో నివసించేవారని,కర్షకులని,అనాగరికులని విద్యవిహీనులనే భావం ఉండేది.ఈ భావం ఈనాడు పూర్తిగా మారిపోయింది.నేడు జానపదత్వం లక్షణం కలవారే జానపదులని అర్థం స్థిరపడింది. ఈ లక్షణాలు ఉన్నవారు పల్లె ప్రాంతాలవారే కాక నగరాలలో కూడా ఉండవచ్చు. ఏదైనా ఒక విషయంలో భావసామ్యం కలిగిన జనుల సమూహం జానపదులనవచ్చు.జానపద విజ్ఞానం అనేది మౌఖికంగా ఒక తరం నుంచి ఇంకొక తరానికి చేరుతూ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువు టద్దంలా కనిపిస్తాయి.

తెలుగువారికి అపురూపమైన జానపద కళా వారసత్వం ఉన్నది. జానపద కళా సాహిత్యం ద్వారా జాతి యొక్క సంస్కృతి తెలుస్తుంది. ఒక జాతి నిర్మాణానికి అవసరమైన ఆకారాలు జానపద కళలు అందిస్తాయి.ఇలాంటి సంస్కృతీ వారసత్వాన్ని కాపాడుకోవటం మన బాధ్యత. ఎన్నో రకాల జానపద కళలు తమ ప్రదర్శనలతో తెలుగు నేలను సుసంపన్నం చేశాయి.శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని అందించినవి జానపదకళలు. ప్రాచీన సమాజంలో ప్రజలకు జానపదకళలు తప్ప వేరే మార్గం ద్వారా వినోదం లభించే మాధ్యమం లేదు.శిష్టుల కళా రూపాలు ప్రభువుల రాజ నగరాలలో మాత్రమే ఉండేవి. సామాన్య జనానికి అవి అందని ద్రాక్షే సామాన్య జన జీవన విధానాన్ని వస్తువుగా చేసుకొని ప్రదర్శించిన కళలు జానపద కళలు.

భిక్షుక గాయకుల వల్లనే జానపద సాహిత్య ప్రక్రియ లెన్నో ఈనాటికీ మన మధ్య నిలిచి ఉన్నాయి. జానపద విజ్ఞానంలో జానపద కళారూపాలు ఒక ప్రధాన విభాగం. జాతి, కుల, మత, వర్గ, ప్రాంతాల వారిగా వివిధ వైరుధ్యాలతో కూడిన జానపద కళలు కళారూపాలు మనదేశంలో కలవు. జానపద విజ్ఞానాన్ని మౌఖిక జానపద సాహిత్యం,సాంఘిక జానపద ఆచారాలు, వస్తుసంస్కృతి, జానపదకళలు, జానపదుల భాషగా వర్గీకరించారు.

అరనిమిషంలో అణువిధ్వంసాన్ని సైతం సృష్టించగల అద్భుత శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కాలంలో ప్రపంచీకరణ ప్రభావం దేశంపై అన్ని రంగాల్లో ఉన్నది. అలాగే జానపద కళారూపాల పైన కూడా ప్రభావం చూపుతున్నది.ప్రపంచీకరణ వలన సంస్కృతి సాంప్రదాయాలు మార్పునకు గురవుతున్నందున కళా రూపాల్లోనూ మార్పులు వస్తున్నాయి.కొన్ని కళారూపాలు పూర్తిగా తమ ఉనికిని కూడా కోల్పోతున్నవి. జానపద కళల ప్రధానంగ ప్రాంతాలను, సంస్కృతులను, కులాలను, మతాలను ఆశ్రయించి వివిధ రకాలుగా ఉన్నవి. జానపద కళలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. మౌఖిక కళలు. 2. ప్రదర్శిత కళలు.జానపద కళలు ఒక సంప్రదాయం పై ఆధారపడి ఉంటుంది. కొన్ని దశాబ్దాలకు పూర్వం జానపద కళారూపాలు ఆధునిక ప్రపంచంలో వాటి రీతి తీరుతెన్నులు మార్పు జరిగిందని గమనించవచ్చు. కళరూపాల ప్రదర్శన మొదలుకొని పూర్తిగా కళరూపమే మారేంతగా ఈ ఆధునిక పరిజ్ఞాన ప్రభావాన్ని చూపిస్తున్నాయి.సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్ది కళరూపాల్లో మార్పులు సంభవిస్తుంది.

కళ అనే మాట ఆంగ్లంలో''ఆర్ట్''అనే శబ్దానికి సమానార్థక పదం.'' బుద్ధి సూక్ష్మతనుపయోగించి మనుష్యుడు కల్పించేది కళ''. ఈ కళ భావన శక్తిని రేకెత్తిస్తుంది. జాతీయ, ప్రాంతయ, ఆర్థిక వ్యవస్థలు, సమాజాలు, సంస్కృతులు

ప్రపంచస్థాయిలోని వాణిజ్య, సమాచార, రవాణా, సాంకేతిక పరిజ్ఞానం, వలసీకరణ మార్గాల ద్వారా సమ్మిళిత మయ్యే క్రమమే ప్రపంచీకరణ.

ఒక నాడు కళా ప్రదర్శన సమాచారం ఊరూర ఢంక వేస్తూ ప్రచారం చేసేవారు.కాని నేటి ఆధునికత వల్ల పత్రికలు, టీ.వీ, రేడియో ద్వారా ప్రచారం జరుగుతుంది.

ప్రపంచీకరణ వలన పాశ్చాత్యుల సంస్కృతి ఇక్కడున్న సంస్కృతులను ప్రభావితం చేయడం వలన పాశ్చాత్యుల సంస్కృతిని పాటించేలా చేయడం జరుగుతున్నది. దీని వలన ఇక్కడున్న సంస్కృతులు నశించి కొత్త పాశ్చాత్య సంస్కృతిని అవలంబిస్తున్నారు. జానపద కళలు పూర్తిగా ఇక్కడి సంస్కృతిని అనుసరిస్తూ కళా ప్రదర్శన చేయడం జరుగుతున్నది.పాశ్చాత్య సంస్కృతిని పాటించటం వలన జానపద కళారూపాల పై పెను ప్రభావం చూపి జానపద కళలు కూడా నశిస్తున్నాయి.ఆధునికత అనే పేరుతో జరుగుతున్న ప్రపంచీకరణ వలన జానపద కళారూపాలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నవి.

ఆంగ్లభాషపై మోజుతో జానపద కళారూపాల మౌఖిక సాహిత్యం మరుగున పడుతుంది.సినిమా టీ.వీ ఛానల్స్ వలన జానపద కళారూపాలకు ఆదరణ తగ్గిపోతున్నది. సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వలన ప్రతి వ్యక్తి చేతిలో చరవాణి చేరుకోవడం వలన జానపద కళలు తమ ఉనికిని కోల్పోతున్ననవి. పాశ్చాత్యుల కళలకు ఆదరణ పెరగడం వలన జానపద కళలకు తీవ్ర నష్టం జరుగుతున్నవి.

డప్పు కళ :

డప్పు కళారూపంలో ఒకప్పుడు తోలు డప్పు ఉండేది. ప్రపంచీకరణ ప్రభావంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వలన ప్లాస్టిక్ డప్పులు రావడం పూర్తిగా డప్పు రూపం మార్పు రావడం జరిగింది. శుభ, అశుభ కార్యాలలో డప్పు కళారూపాలను ఉపయోగించేవారు. ఇప్పుడు ఈ కళ కనుమరుగవుతుంది. పులి, ఎలుగుబంటి, నెమలి లాంటి వివిధ జంతువుల వేషాలు వేసుకొని వివిధ పండుగలకు జంతువుల్లాగా నృత్యాలు చేసే కళ ఉండేవి. ఈ కళలు ఇప్పుడు పూర్తిగా కనుమరుగయ్యాయి.

పగటి వేషాలు :

ప్రజా వినోదం ఆశయంగా వివిధ వేషాలు వేసుకొని ఇంటి గడప, వీధులలో పగటిపూట ప్రదర్శనలు ఇస్తుంటారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ కాలంలో టి.వి, సినిమాల ప్రభావం వల్ల పగటివేషాలకు ఆదరణ కరువై ఈ కళ కనుమరుగైంది.

కోలాటం :

కోలలు పట్టుకొని ఆడే ఆట కోలాటం.పల్లెల్లో రాత్రి విరామ సమయంలో కోలాటం ఆడుతుంటారు.పెద్ద పెద్ద తిరణాలు,జాతర్లు,దేవుళ్ళ ఉత్సవాలలోనూ బహిరంగ విధులలో కోలాటం ప్రదర్శిస్తారు. కొందరు ఒక బృందంగా ఏర్పడి కోలాటం ఆడతారు.బృంద నాయకుడు పాడుతుంటే మిగతావారు వంతులుగా పాడుతూ ఆడుతుంటారు. బృందా గానానికి బదులుగా ప్రస్తుతం అక్కడ అక్కడ డీ.జే శబ్దాలకు అనుకూలంగా కోలాటం ఆడుతున్నారు.

చెక్కభజన :

చెక్కతో చేసిన చిరుతలు పట్టుకొని నాయకుడు మధ్యలో ఉండి పాడుతుంటే పాటకు అనుకూలంగా చిరుతలు వాయిస్తూ వృత్తాకారంలో తిరుగుతూ ఆడుతూ పాడుతూ నృత్యాన్ని చేస్తారు. పగలంత పనులు ముగించుకొని రాత్రి సమయంలో ప్రతి పల్లెల్లో చెక్కభజన బృందం ప్రదర్శన చేస్తూ ఉండేవారు.పూర్వం రోజులలో చెక్క భజన బృందాలు లేని గ్రామాలు ఉండేవి కావు. రాను రాను టివి,సినిమాల ప్రభావం వల్ల గ్రామాలలో ఈ కళ కనుమరుగైంది.

కర్ర సాము, కత్తి సాము :

సాము గారడీ అనబడే ఈ కళలు ఆత్మ రక్షణకై వినియోగించబడే ఒక పురాతనమైన కళలు. పూర్వము

గ్రామ సంరక్షణార్థం యువకులకు ఈ కళలో శిక్షణ ఇచ్చేవారు.రక్షణ సాధనంగా ఈ కళను వినియోగించేవారు. అప్పుడప్పుడు జాతరలు ఉత్సవాలు జరిగే సందర్భములో ఈ కళా ప్రదర్శనలు ఉండేవి.కాలానుగుణంగా ఈ కళలు కలగానే మిగిలిపోయాయి.

చిందు బాగోతం :

చిందు బాగోతం ప్రదర్శనకి ప్రధానంగా ఒక రంగ స్థలం ప్రత్యేక అలంకరణ ప్రత్యేక వాయిద్యాలు కలిగి ఉంటాయి. ఈ ప్రదర్శన ప్రారంభానికి ముందు సాంప్ర దాయమైన పద్ధతులు కూడా ఉంటాయి.అందులో ప్రకృతి దేవతలైన పంచభూతాలని ప్రార్థించడం ప్రార్థన గీతాలు ఆలపించడం వంటివి ఉంటాయి.కథా గానం చేస్తూ దానికి అనుకూలంగా నృత్యం కూడా చేస్తారు కళా కారులు సహజ సిద్ధమైన రంగులను వాడేవారు కాని సాంకేతిక పరిజ్ఞానం వలన కృత్రిమమైన అలంకరణ రంగులు ఉపయోగిస్తున్నారు.వీరు వాడే పరికరాలలో ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించటం గమనించవచ్చు.

తోలుబొమ్మలాట :

పురాణాలు, కావ్యాలలోని పాత్రల ఆహార్యం విశేషా లను తోలుతో బొమ్మలు తయారు చేసి తనదైన మాటలు గానాలతో దారముల సహాయముతో ప్రదర్శన చేసేది తోలుబొమ్మలాట. ఈ కళారూపం 19, 20 శతాబ్దాలలో నాటకాల ప్రాధాన్యత పెరగడం వల్ల తన ఉనికిని కోల్పోతూ వచ్చినది.శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వలన సినిమాలు ప్రజలను సమ్మోహితుల్ని చేయటం వలన ఇంట్లోనే జనరంజకంగా వివిధ ఛానల్స్ రావడం వలన తోలుబొమ్మలాట కనుమరుగైంది.

బుర్రకథ :

పల్లె పదాలతో వంతకుల హాస్యములతో ప్రధాన కథకుడు ఇద్దరు వంతులుగా ఉండి ఈ కళను ప్రదర్శి స్తారు. ప్రస్తుతానికి ఈ కళ సినిమాల ప్రభావం వలన ఆదరణ కోల్పోయి తన ప్రస్థానం గగనంగా మారిపోయి ఉన్నది. ప్రస్తుతానికి ఎక్కడో ఒకచోట ఈ కళను కొంత మంది ప్రదర్శిస్తున్నారు.

జానపద కళలు పల్లె సంస్కృతి సాంప్రదాయాలకు మరోరూపంగా ఉండేవి.ప్రపంచీకరణ ప్రభావం వలన సంస్కృతులలో మార్పులు రావడమే కాకుండా జీవన విధానం కూడా మారినది. ఈ విషయాలు జానపద కళల పై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ప్రపంచీకరణ వల్ల చాలా మట్టుకు జానపద కళలు తమ ఉనికిని కోల్పోయాయి. జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఈ సమాజము మీద ఉన్నది.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు వారి జానపద కళారూపాలు- డా. మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం- డా.ఆర్.వి.యస్.సుందరం.
3. జానపద కళ సంపద-తూమాటి దోణప్ప
4. ప్రపంచీకరణ-భాష-సంస్కృతుల విధ్వంసం.- అద్దేపల్లి రామ్మోహన్ రావు.
5. సామ్రాజ్యవాదం-సంస్కృతి -కళలు. కడియాల రామ్మోహన్ రావు

❖ ❖ ❖

సామెతలు – సామాజిక ప్రయోజనం

– డా॥. కసట నరేందర్, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, నిజాం కళాశాల, హైదరాబాద్.

సామెతలు సామాజిక జీవనంలో ప్రత్యేకమైనవి. ఎవరు సామెతలు ప్రయోగిస్తారో వారు ప్రత్యేకంగా గుర్తింపు పొందుతారు. అలాంటివారు గొప్ప ఉపన్యాసకులుగా, వ్యాఖ్యాతలుగా రాణిస్తారు.

సామెతలు శబ్ద సౌందర్యానికంటే అర్ధ నిగూఢతను కల్గిఉంటాయి. ఒక వ్యక్తి ఎదుటి వ్యక్తికి తన భావాన్ని తెలిపే సందర్భంలో సామెతను వినియోగిస్తాడు. అపుడు అవతలి వ్యక్తిని అర్థం చేసుకుంటాడు. వ్యక్తి తన మనసులోని భావాలను స్పష్టంగా ఆవిష్కరించడానికి సామెతలు ఎంతో ఉపయోగపడతాయి. అందువల్ల ఎదుటివ్యక్తికి విషయం కూలంకషంగా అవగతమవుతుంది. వ్యక్తి సంఘజీవిగా వెలుగుతున్నాడు. అతనికి ఒక భాష ఉంటుంది. అది అతని మాతృ భాషకూడా అవుతుంది. ఆ భాషలో ప్రయోగాలు చేయడానికి కూడా సామెతలు ఉపయోగపడతాయి.

సామెతలు – నిర్వచనం :

'సామ్య' శబ్దానికి 'సామ్యత' అనే అసాధారణరూపం ఏర్పడి 'సామెత'గా మారిందని ప్రముఖ పరిశోధకులు సాహిత్యవేత్త డా. చిలుకూరి నారాయణావుగారి అభిప్రాయం. ఈ సామెత పదం క్రీ.శ. 15వ శతాబ్దానికే వరహా పురాణంలో తొలిసారిగా ప్రయోగించబడింది. సామెతపై ఆంగ్లపరిశోధకులు లోతైన పరిశోధనలు చేసారు. నిర్వచనాలు ఇచ్చారు. అంతేకాదు సామెత లక్షణాలను వెలువరించారు.

ఆంగ్లంలో సామెతను ప్రోవెర్బ్ అని పిలుస్తారు. తెలుగులో సామెతను 'లోకోక్తి', 'నానుడి', 'శాస్త్రం', 'జనశృతి' అని పిలుస్తారు.

సామెతలు ప్రధానంగా తక్కువ పదాలతో ఎక్కువ భావాన్ని వెల్లడిస్తాయి. Much Matter decocted in a few words అని Thomas Fuller వెల్లడించాడు. Earl Russel ఇంచు మించు ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. The wit of one and the wisdom of many సామెత అనేది అనుభవంలో నుంచి పుడుతుంది. ప్రతినిత్యం మనిషికి ఎదురయ్యే సమస్యలు అలాగే ఆనంద వినోదాలు అతనికి జీవిత గుణపాఠంలాగ ఉంటాయి. మొత్తంగా మనిషి జీవిత అనుభవ పాఠాలలోనుండి యాదృచ్ఛికంగా ఉద్భవించేవి సామెతలని చెప్పాలి.

సామెతను గూర్చి ప్రముఖ జానపద పరిశోధకులు ఆర్వీఎస్ సుందరం ఇలా అన్నారు. జానపద విజ్ఞానంలోని అన్ని అంశాలలాగే సామెతలు కూడా సాంప్రదాయకమైనవి. వాటి ప్రత్యేకత వివేకవంతంగా ఉండడమన్నది సామెతల పుట్టుకకు సంబంధించినది. (ఆంధ్రుల జానపద విజ్ఞానం పేజి.నెం.172)

సూక్ష్మంలో మోక్షం అన్నట్టుగా తక్కువ పదాలతో విస్తృతమైన అర్థం వచ్చేలా చెప్పేవి సామెతలు. ఇవి నీతివంతమైనవి. ధర్మబద్ధమైనవిగా ఉండి హితోపదేశాన్ని వ్యక్తపరుస్తాయి.

'సామెత' అనగా జనవ్యవహారమైన 'ఉక్తి' నలుగురి నోటవడి నలిగిన మాట అని అర్థం.-దివాకర్ల వేంకటవధాని.

A short popular say in that expresses effectively some complet truth or us fed thought (Random house of dictionary)పరిపూర్ణమైన సత్యాన్ని లేదా మంచి ఆలోచనను చెప్పి చిన్నదైన, బాగా వ్యాప్తిలో నున్న మాట.

అందరి నిర్వచనాలను పరికించినపుడు 'సామెత' ప్రధానలక్షణం. ముక్కుసూటిగా ఉండి అనంతమైన అర్థాన్ని తెలుపుతుంది. సామెతలు మానవ జీవన అనుభవంలోంచి వచ్చినవే అని తెలుస్తుంది.

సామెతలు – లక్షణాలు :

'సామెత'లకు ప్రధానంగా ఎనిమిది లక్షణాలు ఉన్నాయి. 1. సంక్షిప్తత, 2. వాక్యరూపంలో ఉండటం, 3. అనుభవరూపంలో ఉండటం, 4. తీక్షణత, 5. వివేకవంతమైన అంశాన్ని కలిగి ఉండటం, 6. సార్వజనీనత, 7. ఉపదేశాత్మకత, 8. వాచ్యార్థం కంటే వ్యంగానికే ప్రాధాన్యత మివ్వటం (జానపద విజ్ఞానాధ్యయనం - సామెతలు - డా. జి.ఎస్. మోహన్)

సామెతలపై పరిశోధనలు చేసిన సి.వేదవతి తమ 'నుడి-నానుడి' గ్రంథంలో సరళత, సహజత, సంక్షిప్తతతో పాటు సర్రున దూసుకుపోయే సూటిదనం, సామెతకు ముఖ్యలక్షణాలు అన్నారు.

పాశ్చాత్య పండితుడు 'రెవ. జోహన్ వర్డ్' సామెతలకు ఉండాల్సిన లక్షణాలు చెప్పాడు. 1. సంక్షిప్తంగా ఉండుట, 2. స్పష్టంగా ఉండుట, 3 బహుళప్రచారంలో ఉండుట, 4. అలంకారికమైనదిగా ఉండటం, 5. ప్రాచీనత్వాన్ని కలిగి ఉండుట అవి పలువురి నోళ్లలో నలిగి ఉండటం నిజం.

మరి కొందరు పరిశోధకులు పోలిక, స్పష్టత, సంక్షిప్తత, శ్రావ్యత, ప్రాచుర్యత, అనుభవశీలత, ధ్వని, కూడా ఉండాలని పేర్కొన్నారు.

'సామెత'లు స్పష్టంగా, సంక్షిప్తంగా ఉండి వినూత్నమైన భావార్థాన్ని తెలియ జేసేదిగా ఉండాలి. అంతేకాదు అనుభవపూర్వకంగా వచ్చిన సామెతలు మానవ చైతన్యానికి, జాగ్రత్తకు ఉపయోగపడేవిగా ఉన్నాయి.

పెద్దవారు చాలా సందర్భాలలో 'మనిషికో మాట పశువుకో దెబ్బ' అంటారు. మాటవల్ల మనిషి, దెబ్బవల్ల పశువు మారుతుంది. అని వారి అభిప్రాయం కనుక 'మాట' అంటే మంచి సూక్తి అదే సామెతగా చెప్పాలి.

సామెత ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా మనిషి మారవలసిన, మార్చుకోవల్సిన పద్ధతులను చెబుతుంది. అలాగే అతనిలో ఉండే లోపాలను, దోషాలను, తప్పులను ఎత్తి చూపుతుంది. గొప్పవాడైతే అతని గొప్పతనాన్ని త్యాగవంతుడైతే త్యాగాన్ని, లోభి అయితే, రాక్షసుడైతే రాక్షసత్వాన్ని కూడా వెల్లడిస్తాయి సామెతలు.

సామెతలపై చాలా అధ్యయనం జరిగింది. పరిశోధనలు జరిగాయి. ఆర్.ఎస్.బాగ్స్ సామెతలలో ఆరు విభాగాలు చెప్పాడు. 1. ఉపయోగాన్ని చెప్పేవి - Proverbial Metaphor. 2. సూటిగా సాధారణీకరణంచేసి చెప్పేవి- Proverbial Apothogam 3.జనుల గూర్చి స్థలాలను చెప్పేవి - Blason populaire 4. ఉదాహృతవాక్యం తమాషాగా అంతమయితే - Proverbial wellerisam 5. సామెతలను అనుకరించే పదబంధాలు - Proverbial phanses 6. సామెతలలాంటి పోలికలు `Proverbial comparison.

జానపద విజ్ఞానం – సామెతలు :

'సామెత'లు గేయాలలోను, కథల్లోనూ భాగం అయిన జానపదుల జీవిత అనుభవ లోతుల్లోంచి పుట్టినవి. అవి జానపదుల కాలంలో వికాసం చెందాయి.

ప్రతి సందర్భంలోనూ సమయానుకూలంగా జానపదులు చెప్పిన మాటలు పదబంధయుక్తమై వెల్లడయి ఉంటాయి. మొదట్లో 'నుడి' నానుడు అనే మాటలు ఉండవచ్చు. కాలక్రమంలో వాటిని సామెతలుగా అభివర్ణించి ఉంటారు.

జానపదులు అనేకమైన కట్టుబాట్లకు, అలవాట్లకు, పద్ధతులకు, ఆచారాలకు లోనై ఉంటారు. వారి నియమాలు, జీవనవిధానం కఠినంగా ఉంటుంది. ప్రకృతిని ఎక్కువగా ఆరాధించడం, శిలలను, పుట్టలను చెట్లను దైవంగా భావించడం వారికి ఉన్న అలవాటు. ఇక పండగలు, పబ్బాలు చాలా విలక్షణమైనవిగా ఉంటాయి. ఒకరకంగా జానపదుల జీవనవిధానమే విలక్షణ

మైనది. ఆనందసమయంలో, విలాసనమయంలో, విషాద సమయంలో పాటలు పాడటం, ఆటలు ఆడటం వారి ప్రత్యేకత. ఎవరు రాసారో తెలియదు, ఎవరు చెప్పారో తెలియదు కాని పాటలు, మాటలు అన్ని జీవిత అనుభవంలో ప్రయోగించబడినాయి. అజ్ఞాత కర్తృకమైన జానపద సాహిత్యం ఎంతగొప్పదో మనకు తెలుసు. పాటలు, కథలు, సృష్టించినట్టుగానే జానపదులు సామెత లను కూడా సృష్టించారు. అందుకే ఆధునిక నాగరికత సమాజం వరకు సామెతలు కాలంతోపాటు ప్రయాణిం చాయి. అందుకే 'సామెతలేని మాట ఆమెత లేని ఇల్లు' ఉండదంటారు.

సామెతలు సాంఘిక చరిత్ర నిర్మాణానికి, సాంఘిక జీవిత నిరూపణకు ఆధారాలు ప్రాచీన సంస్కృతికి నిలువు టద్దాలు. సామెతలను ఒక విజ్ఞాన ఖనితో పోల్చవచ్చు. (జానపదవిజ్ఞానాధ్యయనం - తెలుగు సామెతలు - సాంఘిక జీవితం డా. జి.ఎస్.మోహన్ పేజి. నెం. 117)

సామెతలు - సామాజిక ప్రయోజనం :

'సామెత'లు జానపద విజ్ఞానంలో ఒకభాగం అని ముందు చెప్పుకున్నాం. అవి ప్రధానంగా రెండు రకాలు 1. మౌఖిక సంబంధమైనవి 2. లిఖిత సంబంధమైనవి లేదా గ్రంథస్తమైనవి.

కావ్యాలు, పురాణాలు ఇతిహాసాలు మొదలైన గ్రంథా లలో ఉన్న సామెతలు లిఖితాలు. మౌఖిక సామెతలు అంటే మనిషి ముఖతః వ్యక్తీకరించడం వల్ల అవి ఒకరి నుంచి ఒకరికి బహుళ ప్రచారం పొందినవి.

సామెతలు ప్రధానంగా విషయనిష్ఠత కలిగి ఉంటాయి. సామాజిక ప్రయోజనం పొందుతాయి. మనిషి 'భాష'ను వాహకంగా చేసుకుంటాడు. ఆ భాషను ఉప యోగిస్తున్నప్పుడు స్టైల్‌ను అంటే శైలిని ఆపాదిస్తాడు. అప్పుడు అతను మాట్లాడే భాషలో శబ్దసౌందర్యం, అర్థసౌందర్యం కలిగి ఉంటుంది. భాష అందరి మన్ననలను పొందుతుంది. అపుడు అతను ప్రత్యేకంగా గుర్తించబడతాడు.

భాషలో ఎవరైతే సృజనాత్మకత, సమయస్ఫూర్తిని కలిగి ఉండి పదబంధాలను ప్రయోగిస్తాడో అతని భాష విశేషంగా గుర్తింపు పొందుతుంది. అలాంటి గుర్తింపును కోరుకునేవారు స్వల్ప అక్షరసముదాయంలో విశేషమైన భావార్థాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు 'సామెత'లను వినియోగిస్తాడు.

సమాజంలో స్తబ్ధత, నిరాశ, నిస్పృహాకలిగి సోమరులుగా ఉన్నవారిని, లోభి, గుణం, దుర్మార్గం, ధనాశ, అత్యాశ, అన్యాయం, అధర్మం ఉన్నవారికి - చైతన్యవంతమైన దృక్పథాన్ని కలిగించే సందర్భంలో సామెతలు అనివార్యమైనాయి.

పండగలు, పబ్బాలు, వినోదాలు, దు:ఖం, సంతోషం, ఉత్సాహం సమయంలో కూడా సామెతలు అలం కారికమైన శబ్దసౌందర్యాన్ని కల్గిస్తాయి. ఒక్కొక్క సామెతలో విపులమైన భావార్థం లేకపోలేదు. అంతేకాదు అనుభవ పూర్వకమైన జీవిత రహస్యాలు, జీవితవిశేషాలు లౌకికమైన విజ్ఞానాన్ని అందిస్తాయి.

కొన్ని సామెతలు సూటిదనంతో ఉన్నా పోల్చి చెప్పే సామెతలు కూడా ఉన్నాయి. విషయమే కాకుండా సామెతలలో వస్తువుకూడా ప్రధానమైందే.

సామెతలు ప్రధానంగా సందేశాత్మకంగా, ఉప దేశాత్మకంగా ఉంటాయి. అవి గతానికి వర్తమానానికి వాహికలుగా ఉంటాయి. మనిషి సక్రమమైనదారిలో నడవ నప్పుడు అతనికి సత్ప్రవర్తనను కల్గించి సజ్జనుడిగా చేసే అవకాశం సామెతలకు ఉంది. ఆ సందర్భంలో పౌరాణిక కాలానికి సంబంధించిన, భారత, రామాయణ కాలానికి సంబంధించిన సామెతలను నేటికి ఉపయోగించి ఆనాటి విలువలను, సామాజిక అనుసరణను తెలియజేస్తాయి.

ఉదా : 'వింటే భారతం వినాలి - తింటే గారెలు తినాలి' 'రామాయణం అంతా విని రామునికి సీత ఏమైతది' అనేవి నేటి కాలపుమనిషి ప్రవర్తనను, మనస్తత్వాన్ని ప్రశ్నిస్తాయి. సమాజంలో పాటించవలసిన

విలువలను, పద్ధతులను సామెతలు వెల్లడిస్తున్నాయి. కనుక వాటివల్ల మనిషి తన ప్రవర్తనను తన పద్ధతులను మార్చుకుని సమాజంలో ఉండవలసి తీరును గ్రహిస్తాడు.

కన్నడంలో 'వేద సుళ్ళాదరూ గాదెసుళ్లల్ల' సామెత గురించి గొప్పగా చెప్పారు దాని అర్థం 'వేదం అసత్యమైన సామెత అసత్యం కాదు' నన్నయ సత్యవాక్యం ఎంత గొప్పదో తన భారతంలో చెప్పాడు.

సమాజంలో సామెతలు విషయనిష్ఠత, వస్తుతత్త్వం, సత్యనిష్ఠతను కలిగి ఉన్నాయి. అవి చారిత్రకమైన, సాంఘిక, సాంస్కృతిక, స్థల విశేషాలను పురాణసంబంధ విశేషాలను వెల్లడిస్తూ మంచి సమాజం నిర్మించడానికి ఉపయోగ పడతాయి.

తెలుగు సాహిత్యంలో 'సామెతలు' విశేషమైన గుర్తింపును పొందాయి. నపద పాటలలోను, కథలలోను, నాటకాలలోను ప్రయోగించిన సామెతలు తాళపత్రాలతో ప్రారంభమైన కావ్యాలలో, ప్రబంధ కావ్యాలలో, లౌకిక కావ్యాలలో కూడా ప్రయోగించబడినాయి. ప్రాచీన కవులు తమ కావ్యాలలో సామెతలను సందర్భనహితంగా వర్ణించారు.

సామెతలు సంబంధ ప్రయోగాలు :

లోకంలో 'మాటను' సమయానుకూలంగా, సందర్భోచితంగా, సమయస్ఫూర్తిగా వాడుతారు. అలాగే సామెతలను వాడుతారు. కాలక్రమంలో అవి నిలిచిపోయి బహుళ ప్రచారాన్ని పొందుతూ వస్తున్నాయి. వాటి పుట్టుక ఎపుడో తెలియకపోయినా, వాటి పాత్రను గొప్పగా చెప్పుకోక తప్పదు. ఏ పని చేయడం చేతకాని వారికి, సోమరులకు, అసమర్థులకు కాలం విలువ తెలియనివారికి సూటిగా గుచ్చుకునే సామెతలు ఉన్నాయి. 'ఆకలి రుచి ఎరుగదు, నిద్రసుఖమెరుగదు', 'కుక్కతోక వంకర, 'చెవిటివానిదగ్గర శంఖం ఊదినట్లు' చెప్పితె వినకుంటే చెడంగ చూడాలి! 'మాటలు కోటలు దాటుతై కాళ్లు కడపదాటుతై'. 'మింగమెతుకులేదు మీసాలకు సంపెంగనూనె', 'మనిషికోమాట గొడ్డుకోదెబ్బ' 'ముచ్చట్లకు మూతులు సాపితే పని సంకనాకిపోద్ది', 'వానికి తోచదు. ఎవరు చెప్పినా వినడు'. 'అందని ద్రాక్ష పుల్లన', 'మనసుంటే మార్గముంటుంది'. 'పరుగెత్తి పాలు తాగే బదులు నిలబడి నీళ్లు తాగడం మేలు', 'మంత్రాలకు చింతకాయలు రాలవు', 'కుక్కతోక పట్టి గోదారిని ఈదినట్లు', 'ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళను తాగించినట్లు', 'కూర్చుని తింటే కొండలైనా అరుగుతాయి', 'హనుమంతుని ముందర కుప్పిగంతులు', 'భయంలేని కోడి బజార్లో గుడ్డు పెట్టినట్లు', 'పువ్వు పుట్టగానే పరిమళించినట్టు', 'మానవ సేవయే మాధవసేవ', 'సన్యాసి సన్యాసి రానుకుంటే బూడిద రాలినట్టు', 'నేల విడిన సాము', 'మొక్కై వంగనిది మ్రానై వంగునా'.

నైతికతను తెలియజెప్పె సామెతలు కూడా ఉన్నాయి. అవి ప్రాచీన సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్నాయి. అవి జనవ్యవహారంలో ఉన్నాయి. 'పులిని చూచి నక్క వాత పెట్టుకొన్నదట', 'తిని తొంగుంటే మడిసికి గొడ్డుకూ తేడా లేదు', 'చెఱపకురా చెడేవు', 'అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు', 'అప్పులేనివాడు అధిక సంపన్నుడు', 'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ', 'ఆరోగ్యం మహా భాగ్యం', 'అబద్ధమాడితే అడపిల్లలు పుడతారు', 'ఉన్న ఊరును కన్న తల్లిని మరచిపోవద్దు', 'ఊరు విడిచిన మనిషి వనం విడిచిన కోతి బాగుపడదు', 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి', 'ఇల్లు పీకి పందిరేసినట్లు', 'ఇల్లు అలుకగానే పండగకాదు', 'ఉత్తర చూసి ఎత్తరగంప', 'కోటి విద్యలు కూటి కొరకే', 'కులం కన్న గుణం మిన్న', 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ', 'తిన్నింటి వాసాలు లెక్క పెట్టినట్టు', "పేరుకు పెత్తనమిస్తే తలంతా కొరికిందట', 'పగటికలలు నిజంకావు', 'పండితపుత్ర పరమశుంఠ', 'పిట్ట కొంచెం కూత ఘనం', 'పుట్టికో బుద్ధి జిహ్వకో రుచి', 'యధార్థవాది లోకవిరోధి', 'శతకోటి ఉపాయాలకు అనంతకోటి దరిద్రాలు', 'శ్రీరంగనీతులు దిక్కుమాలిన చేతలు', 'నోరు మంచిదైతే ఊరు మంచిది', 'కడుపులో లేనిది కావలించుకుంటే ఏముంది', 'అనువుగాని చోట అధికుల

మనరాదు', 'తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడు', 'కూటి కోసం కోటి విద్యలు', 'చిత్తం శివుని మీద భక్తి చెప్పులమీద', 'గాడిదకేం తెలుసు గంధం చెక్కల వాసన', 'నిండా మునిగిన వానికి చలేముంది'.

పనిలో ఏదైనా ఆటంకం వస్తే చెప్పే సామెతలు 'రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పదు', 'చుట్టు తిరిగైనా సుఖంగ పోవాలె', 'దిక్కులేని వాడికి దేవుడే దిక్కు', 'తగరాని కాలం వస్తే ఏకు మేకు అయితది', 'పిండి కొద్ది రొట్టె', 'పగటి కలలు నిజం కావు', 'పెద్దల మాట చద్దన్నం మూట', '

విశ్వాసాలు, నమ్మకాలలో ఉపయోగించే సామెతలు పెళ్లి సంబంధం మాట్లాడటానికి వెళ్లినపుడు, 'గతికితే అతకదు', 'ఊరకరారు పండితులు', 'శుభస్యశీఘ్రం', 'నూరు అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయాలి', 'చల్లకోసం వచ్చి ముంత దాచటమెందుకు', 'పదిమందిలో పాము చావదు', 'దిక్కులేని వాడికి దేవుడే దిక్కు', 'దంచినమ్మకు బుక్కిందే కూలి'.

బాగానవ్వుకునే లేదా హాస్యపు సామెతలు 'ఆత్రపు పెళ్లికొడుకు అత్తవెంట పడ్డాడట', 'దొంగలు పడ్డ ఆరునెల్లకు కుక్కలు మొరిగినట్లు', 'పొట్టోనికి పుట్టెడు బుద్ధులు', 'పెండ్లికి పిలిస్తే పురుడుకు వచ్చినట్లు', 'చంకలో పిల్లను పెట్టుకుని ఊరంతా వెతికినట్టు'.

పోలిక సామెతలు :

'కంచుమోగినట్లు కనకంబుమోగునా', 'పిండి కొద్ది రొట్టె', 'బెల్లం సుట్టు ఈగలు ముసిరినట్టు', 'ఉల్లి చేసే మేలు తల్లి చేయదు', 'గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు', 'కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్టు'. 'పిల్లకాకికేమి తెలుసు ఉండేలు దెబ్బ', 'గుళ్ళం గుగ్గిల్లు తింటే గాడిదకు కడుపునొప్పి', 'కళ్ళు విరుగదు పాము చావదు'. 'చంద్రునికి ఓ నూలుపోగు', 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు', 'చెవిలో పువ్వు'.

రకరకాల సామెతలు 'మనిషి' జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రతినిత్యం తాను చెప్పదలచుకున్న మాటకుముందు సామెత చెప్పడం మనిషికి అలవాటు. పాతకాలం మనుషులలో ఈ అలవాటు ఎక్కువ. ఉపన్యాసకులు, పండితులు, ఆధ్యాత్మికవేత్తలు తమ ప్రసంగాలలో, సమయానుకూలంగా సందర్భ సహితంగా ఉదాహరణలుగా 'సామెతలు' చెప్పుతూ ప్రేక్షకులను అలరిస్తుంటారు. అవి వారికి వినోదంగాను, ఆటవిడుపుగాను ఉంటాయి. ప్రేక్షకులు ప్రసంగకర్తలను బాగా అభిమానిస్తారు. వారు చెప్పిన మాటలను ఆచరణలో పెడతారు. శ్రవణాలంకారమై అర్థప్రధానంగా ఉండటం వల్ల ప్రసంగాలపై అమితాసక్తిని ప్రేక్షకులు చూపిస్తారు.

ఆధార గ్రంథాలు :

1. జానపదవిజ్ఞానాధ్యయనం - శ్రీనివాస పబ్లికేషన్స్, 2001-డా.బి.ఎస్.మోహన్, బెంగుళూరు.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం- 1983, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. మన తెలుగు సామెతలు - శాస్త్రాలు- నవ్యసాహిత్య పరిషత్తు - కరీంనగర్ 2020 - డా. మలయశ్రీ

❖ ❖ ❖

కాకిపడిగెల ప్రదర్శనా సంప్రదాయం

– సోనభోయిన సతీష్, తెలుగు అధ్యాపకులు శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్.

కాకిపడిగెల ప్రదర్శన :

వీరు మూడు సందర్భాలలో ప్రదర్శిస్తారు. 1. త్యాగం తీసుకున్నప్పుడు, వీటినే "త్యాగం కథలు" అంటారు. 2. ముదిరాజ్ వాళ్లలో ఎవరైనా చనిపోయినప్పుడు, వీటినే 'చావు కథలు' అని అంటారు. 3. త్యాగం కథల అనంతరం చెప్పే కథలు. ఎంతో కొంత డబ్బు తీసుకొని ప్రదర్శిస్తారు. వీటినే "ఉల్కా కథలు" అంటారు.

కాకి పడిగెల వారు త్యాగం నిర్ణయం చేసుకున్న తర్వాత మంచిరోజు చూసుకొన కథను ప్రారంభిస్తారు. మంచి రోజు అంటే తిథులు, వారాలు చూసుకొంటారు. తిథులు తెలిసినవారు పంచమి, దశమి, ఏకాదశి, త్రయోదశిలలో ప్రారంభిస్తారు. కొందరు వారాలు మాత్రమే చూస్తారు. సోమ, బుధ, గురు, శుక్ర వారాలలో కథను ప్రారంభిస్తారు.

త్యాగం కథలు :

ఈ త్యాగం కథలు వారి కట్టడి ప్రకారం మూడు సంవత్సరాల కొకసారి ఆయా గ్రామాలకు పోయి ముదిరాజు వాళ్లు ఇచ్చే నిర్ణీత మొత్తాన్ని తీసుకొని చెప్పే కథలు. ముదిరాజ్ వారి ఇళ్లలో ఎవరైనా చనిపోతే దినాల రోజు గాని సంవత్సరీకం రోజు గాని చనిపోయిన వారి పేరు మీద కథలు చెప్పుతారు.

ఉల్కా కథలు :

త్యాగం కథలు అయిపోయిన తర్వాత ముదిరాజ్ వాళ్ళ కోరిక మేరకు డబ్బులు తీసుకొని కథలు చెబుతారు.

ప్రదర్శించే రోజులు - కథలు :

కథలు ముదిరాజ్ వాళ్లు ఇచ్చే త్యాగం/తేగంను బట్టి ఆధారపడి ఉంటుంది. పూర్వం ఐదు లేదా తొమ్మిది రోజులు ప్రదర్శించేది కాని నేడు ఐదు రోజుల నుండి ఇరవై ఐదు రోజులు కూడా చెబుతున్నారు. నేడు ముప్పైవేల రూపాయలు త్యాగం ఇస్తే పదిహేను కథలు ఇరవై ఐదు రోజులలో చెబుతున్నారు.

త్యాగాన్ని బట్టి మహాభారంతలోని ఏ కథనైనా అంటే పాండవుల పుట్టుక నుండి కురుక్షేత్ర యుద్ధం వరకు ఉన్న కథలను ఘట్టాలుగా విభజించి ఎన్ని రోజులైనా చెబుతున్నారు.

వీరు ఎన్ని రోజులు చెప్పినా చివరి రోజు కథ చెప్పి సాయంత్రం పెద్దమ్మ పండుగ చేస్తారు.

ప్రధానంగా వీరు చెప్పే కొన్ని కథలు :

1. ముదిరాజుల వృత్తాంతం, 2. పాండవుల పుట్టుక, 3. ధర్మరాజు జూదం, 4. పాండవ వనవాసం, 5. విరాట కొల్వు, 6. ద్రౌపదీ స్వయంవరం, 7. బకాసుర వధ, 8. కీచక వధ, 9. గారముల కోట / గారముళ్ల కోట, 10. సుభద్రా పరిణయం, 11. కర్ణుని పెళ్ళి, 12. సహదేవ కళ్యాణం, 13. గోవుల చెర, 14. శశిరేఖ పరిణయం, 15. నవలోక పెళ్ళి/సత్యనవలోక, 16. రంబ రంపాల / రంపాలరాజు, 17. మాయాబజార్, 18. గదా యుద్ధం, 19. భీష్మ మరణం, 20. భీమ విషవన్నం, 21. అభిమన్య మరణం/పద్మవ్యూహం, 22. దుర్యోదన మరణం, 23.కురుక్షేత్రం, 24. అల్లిరాణి, 25. లక్షా గృహం / లక్కా గృహం / హిడంభాసుర వధ, 26. రాజసూయ యాగం, 27. భీమాంజనేయ యుద్ధం, 28. శ్రీకృష్ణ రాయభారం.

రంగస్థలం / స్టేజి :

కథ చెప్పడానికి ప్రదర్శనా స్థలాన్ని ముదిరాజ్ ఇండ్ల మధ్యలో కొంచెం విశాలంగా ఉన్న స్థలాన్ని ఎన్ను కుంటారు. ఎండాకాలం అయితే వారి ఇండ్ల దగ్గరలో చెట్లు ఉండి నీడ ఉన్న ప్రాంతాన్ని చూసి రంగస్థలాన్ని

కట్టుకుంటారు. పూర్వం ఐదుగురు ముదిరాజులు (భార్యలు ఉన్నవాళ్ళు మాత్రమే) అడవికి పోయి ఐదు కట్టెలు కొట్టుకొచ్చి ఈ ఐదుగురు స్టేజిని కట్టేవాళ్ళట. ఆ తర్వాత అడవికి పోయి కట్టెలు కొట్టుక రాకుండా అందు బాటులో ఉన్న కట్టెల సహాయంతో ఐదుగురు నిర్మించే వారట. కాని నేడు ముదిరాజుల సహాయంతో కళాకారులే స్టేజి ఏర్పాటు చేసుకుంటున్నారు.

నాలుగు గుంజలు నాలుగు వైపులా నాటి, పైన అడ్డంగా కట్టెలు వేసి పైన చాందిని[6] వేస్తారు. వెనుక పైన ఒక కట్టె అడ్డంగా కట్టి ఉంచుతారు. దీనికి పటం కట్టుతారు. పూర్వం పైన తాటికమ్మలు వేసే వాళ్ళట. ఇప్పుడు క్రింద రెండు చాపలు వేస్తారు. వెనుక ఒక బల్ల వేస్తారు. దానిపైన హార్మనీ పెట్టి వాయిస్తారు. ఈ స్టేజి తూర్పు ముఖంగా గాని, ఉత్తర ముఖంగా గాని ఉండే విధంగా నిర్మిస్తారు.

ప్రదర్శన సమాయత్తం :

కథా ప్రారంభం :

కథా ప్రారంభానికి ముందు రంగస్థలం దగ్గర ప్రేక్షకులు రావటం కోసం నగారా కొడతారు. ఆ తర్వాత మహాభారతంలోని పాటలు పాడుతారు. ప్రేక్షకులు కూడిన తర్వాత కథను ప్రారంభిస్తారు.

కథా ప్రారంభంలో అనుష్ఠానం :

ఆ రోజు చెప్పదలుచుకున్న కథకు సంబంధించిన ఘట్టాన్ని పటంలో తీసి దాని ముందు గజ్జెలు, తాళాలు, ఉంచి ఊదిబత్తిలు ముట్టించి, కొంచెం కుంకుమ చల్లి, కొబ్బరికాయకు మూడు బొట్లు పెట్టి ఈ కథ నిర్విఘ్నంగా కొనసాగాలని మొక్కి కొబ్బరికాయ కొట్టుతారు. అయితే పూర్వం ముదిరాజ్ వాళ్ళలో కుల పెద్ద చేత కొట్టించేవారట కాని నేడు ప్రధాన కథకుడే కొట్టుచున్నాడు.

ప్రధాన గాయకులు - పంతలు :

కథ చెప్పేవాళ్ళు మొత్తం ఐదుగురు ఉంటారు. వీరిని మేళం అంటారు. వీరిలో ఒకరు ప్రధాన కథకుడు, ఇద్దరు వంతలు. ఒకరు హార్మని వాయిస్తాడు. ఇంకొకరు తాళాలు కొడతాడు. ఈ ఇద్దరు వంతలలో ఒకరు మద్దెల నడుముకు కట్టుకొని వాయిస్తాడు.

ప్రదర్శకుల వేషధారణ :

ప్రధాన కథకుడు తెల్ల ధోవతి రంగు లాల్చి తొడుక్కొని నడుముకు ఒక పంచ కట్టుకొని ఉంటాడు. వంతలు ధోతి, అంగీలు తొడుక్కొని ఉంటారు.

వాద్యాలు :

వీళ్ళు ప్రధానంగా మద్దెల, హార్మనీ తాళాలు, నగారా ఉపయోగిస్తారు.

ప్రదర్శనా క్రమం :

ప్రధాన కథకుడు పటం ముందు కొబ్బరికాయ కొట్టి పటం ముందు ఉన్న గజ్జెలను తీసుకొని కాళ్ళకు కట్టుకొని అదే విధంగా పటం ముందు ఉన్న కట్టెను కూడా తీసుకొని చేత పట్టి గణపతి ప్రార్థన చేస్తారు. ఈ గణపతి ప్రార్థన చేసేటప్పుడు ప్రధాన కథకుడు ముఖం పటంవైపు ఉంచి పటం పక్కగా నిలబడి చేస్తారు.

గణపతి ప్రార్థన :

గణపతి ప్రార్థన సరస్వతీ ప్రార్థన చేసి కథను ఈ విధంగా ప్రారంభిస్తారు. "వినుడు జనులారా! ఇంపు సొంపుగా ఇంపుగ కథను మీరు వినాలి, పాండవుల కథను చెబుతున్న రాజాధిరాజులారా అని కొందరు ప్రారంభిస్తే ఇంకొందరు "మహాభారత కథ ఎట్టిదనగా అని కొందరు మొదలు పెట్టతారు.

ప్రధాన కథకుడు కథ చెబుతుంటే వంతలు తదను గుణంగా వంత పాడుతారు. వచనం సమయంలో ప్రధాన కథకుని ఒక వంత లేదా సహాయకుడు వచనానికి అను గుణంగా ద్వంద్వార్థాలతో కూడిన హాస్యం చేస్తాడు. అప్పటికప్పుడే ఈ ముగ్గురు వెనుక ఉన్న ఇద్దరు కల్సి సంఘటనకు అనుగుణంగా పాత్రలుగా అనుకొని సంభాషించుకొంటారు. ప్రధానకథకుడు విశ్రాంతి తీసుకొంటే ప్రధాన వంత కథను కొనసాగిస్తాడు. ఆ తర్వాత ప్రధాన

కథకుడు అందుకుంటాడు. (చెప్పుతాడు) అవసర మనుకుంటే కొందరు రెండు లేదా మూడు రోజులకొకసారి కథ చెప్పకుండా విశ్రాంతి తీసుకొంటారు.

ప్రతిరోజు కథను గనుక చెప్పినట్లయితే అలసట కలుగడమే గాక నోరు బొంగురు పోయే అవకాశం ఉంటుందట. ఈ విశ్రాంతి తీసుకున్న రోజు కొందరు వేటకు వెళ్లుతుంటారు.

ఒసుగులు :-

కథా ప్రదర్శనలో కల్యాణ ఘట్టాలు వచ్చినప్పుడు ఒసుగుల్లు చదివించమని తీసుకుంటారు. కథా ప్రదర్శన చివరలో మంగళహారతి పాడిన తర్వాత ప్రేక్షకులు తమకు తోచినంత డబ్బులు ఇస్తే కూడా తీసుకుంటారు.

వీరు ఈ ఒసుగులు తీసుకున్నప్పుడు దీననార్తి పెడతారు. కథ మధ్యలో కల్యాణం సమయాల్లో తీసుకునే కట్నాల సందర్భంలో ఈ విధంగా దీవనార్తి పెడతారు.

పెద్దమ్మను తీయుట / పెద్దమ్మ పండుగ :

త్యాగం కథలు అయిపోయిన చివరి రోజు ఉదయం తొమ్మిది గంటలకే కథ ప్రారంభించి మధ్యాహ్నం (పండ్రెండు గంటల వరకు ముగించి సాయంత్రం మూడు లేదా నాలుగు గంటలకు పెద్దమ్మను తీసే కార్య క్రమం మొదలు పెట్టుతారు.

పెద్దమ్మ పండుగ చేసే విధానం :

రంగస్థలం దగ్గరనే పటం వేలాడదీసిన దగ్గర ముందర అలికి పచ్చపిండితో ముగ్గు వేస్తారు. రంగస్థలం / స్టేజికి పైన మామిడి ఆకుల తోరణం కడతారు. ముదిరాజుల కులపెద్ద భార్య ఒక్కపొద్దు ఉండి బోనం తయారు చేస్తుంది. ఈ బోనాన్ని అందంగా పసుపు కుంకుమలతో పూజించి (అలంకరించి) ఉంచుతుంది. అదే విధంగా ఘటపుకుండ (కల్లుకుండ)ను గౌండ్ల వాళ్ల ఇంటి దగ్గర నుండి తెచ్చి దానికి కూడా బొట్లు పెట్టి ఉంచుతారు. బోనాన్ని కులపెద్ద భార్య ఎత్తుకుంటుంది. కులపెద్ద ఘటపు కుండను ఎత్తుకుంటాడు. డప్పుచప్పళ్లతో కులపెద్ద ఇంటి దగ్గర నుండి తీసుకొస్తారు. కొన్ని గ్రామాలలో ప్రతి ముదిరాజు ఇంటి నుండి కూడా బోనం తేవడం జరుగుతుంది. ఈ బోనాలు అన్నీ తెచ్చి పటం ముందు పెట్టి ఉంచుతారు. ప్రధాన కథకుడు వచ్చి పటంలో ఉన్న పెద్దమ్మను తీసి ఉంచుతాడు.

పెద్దమ్మ ముందర ఒక ఇస్తారి వేసి ముందుగా కుల పెద్ద తెచ్చిన బోనంలో నుండి కొంచెం తీసి ఇస్తారిలో పెట్టుతాడు. ఆ తర్వాత మిగతా ముదిరాజు కులస్థులు తెచ్చిన బోనాల నుండి కొంచెం కొంచెం తీసి ఇస్తారిలో పెడతాడు. దీన్ని నజరు పడి అని అంటారు. అలాగే ప్రక్కకు ఆరు పదులు ఆరు చిన్నచిన్న ఇస్తార్లుగాని లేదా మర్రి లేదా మోదుగాకులలో గాని కొంచెం కొంచెం బోనం నుండి తీసి పదులుగా పెడతాడు.

ఈ ఆరు పడులలో ఐదుపడులు ఐదుగురు పాండవులకు అరవది శ్రీకృష్ణునికి పెట్టి సమర్పిస్తారు. ఆ తర్వాత ఘటపు కుండలోని కల్లును పెద్దమ్మ ముందర ఆరబోసి పెద్దమ్మ తల్లిని ప్రార్థిస్తారు.

ముదిరాజ్ వాళ్ళు పెద్దమ్మను ప్రతిష్ఠించుకుంటే :

ముదిరాజ్ వాళ్ళు అందరూ కల్సి చందాలు ఇంటింటికి వేసుకొని గుడి కట్టి పెద్దమ్మను ప్రతిష్ఠించు కున్నట్లయితే ఆ ప్రతిష్ఠించే కార్యక్రమం కాకిపడిగెలవారే నిర్వహించాలి. ముదిరాజ్ వాళ్ళు ఊరి వెలుపల గుడికట్టి సిమెంట్‌తో గాని రాయితోగాని చేయించిన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. ఆ ప్రతిష్ఠించే ముందు ఐదు రోజులు లేదా తొమ్మిది రోజులు కథ చెప్పి తర్వాత పెద్దమ్మ దేవతను ప్రతిష్ఠించే కార్యక్రమం. ప్రతిష్ఠించే రోజు పెద్దమ్మను గుడి దగ్గరకు తీసుకుపోయేటప్పుడు గ్రామంలోని గ్రామ దేవతలందరికి కొబ్బరికాయలు కొట్టుతారు. అలాగే తీసుకుపోయేటప్పుడు ఏమైనా శక్తులు అడ్డగిస్తే కోడి గుడ్లను విసిరేస్తారు. అవసరమైతే కోడిని కోస్తారు. తీసుకుపోయి ప్రతిష్ఠించి సుమారు నాలుగు యాటలను కోస్తారు.

అలాగే గుడి ముందు కూడా నాలుగు లేదా ఆరు యాటలను కోస్తారు. అంటే మొత్తం సుమారు పండ్రెండు యాటలను కోస్తారు. సుమారు రెండు బస్తాల కొబ్బరి కాయలు కొడతారు. పెద్దమ్మను ప్రతిష్టించే సమయంలో రాగి రేకులపైన యంత్రాలు రాసి, పెద్దమ్మను నిలబెట్టి దగ్గర గోతిలాగ తవ్వి అందులో పెట్టి కొంచెం బంగారం కూడా అందులో పెట్టి పెద్దమ్మను ప్రతిష్టించుతారు. ఈ ప్రతిష్టా కార్యక్రమం చేసినందుకు కాకిపడిగెలవారు నేడు పదివేల నుండి ఇరవైవేల వరకు తీసుకుంటున్నారు. ఈ ప్రతిష్టించే రోజు ముదిరాజ్ కులం వాళ్ళు అందరూ బోనం చేసుకొని వచ్చి ఆరగిస్తారు. కొబ్బరికాయలు కొడుతారు. ఈ కోసిన యాటలలో ఒకటి లేదా రెండు కాకిపడిగెల వారికి ఇస్తారు. మిగిలిన యాటలను ముదిరాజ్ వాళ్ళు కోసుకొని అందరూ పాళ్ళ ప్రకారం పోగులు వేసుకొని తీసుకుంటారు. ఈ విధంగా ప్రతిష్టించిన వారం రోజులకు తిరుగు వారం అని ఏ రోజు అయితే ప్రతిష్ఠిస్తారో మళ్ళీ అదే రోజు అందరూ బోనాలు చేసుకొని పోయి ఆరగింపు చేసి అక్కడనే భోజనాలు చేసి వస్తారు. ఈ కార్యక్రమానికి దగ్గరి బంధువులను పిలవటంతో పాటు తమ తమ ఆడబిడ్డలను అల్లుళ్ళను తప్పకుండా పిలుచుకుంటారు.

కళాకారుల స్థితి :

కాకిపడిగెల వారి స్థితిని గమనిస్తే ఆర్థిక విషయంలో పూర్వమునకు ఇప్పటికి కొంత మెరుగైనట్లు అనిపిస్తుంది. కాని ఆదరణ విషయంలో కొంత తగ్గింది. వారి అభిప్రాయం ప్రకారం ఈ తరం పోతే మమ్మల్ని చూసే వారు, ఆదరించే వాళ్ళే ఉండరేమో అని అంటున్నారు. ఇక వారి సామాజిక పరిస్థితి చూస్తే దయనీయమైన పరిస్థితే, చాలా మందికి నివాస స్థలాలు లేవు సంవత్సరం మొత్తం ముదిరాజుల ఇండ్లలోనే కాలం గడుపుతున్నారు. కొందరికి స్థలం ఉన్నా గృహాలు లేవు. కట్టుకోవడానికి డబ్బులు లేవు. ఇంకొందరికి పక్కా గృహాలు లేవు. గుడిసెలలో, గుడారాలలో జీవనం సాగిస్తున్నారు.

1. త్యాగం : కాకిపడిగెలవారు కథలు చెప్పినందుకు కట్టడి ప్రకారం పొందే డబ్బులు.
2. వరి పంట నూర్పుడు సమయంలో
3. కొర్రచేన : కొర్రలు అనే ధాన్యం పండించే చేను, పంట, ఆహారపు పంట.
4. కమ్మల బుట్టెడు : తాటికమ్మలతో బుట్ట అల్లుతారు. ఈ బుట్టలో ధాన్యం నింపుకుంటారు. ఇచ్చి, పుచ్చుకునేటప్పుడు పంట వచ్చి ఇచ్చేటప్పుడు "కమ్మల బుట్టెడు" అవుతది అనే పదం వాడుతారు.
6. చాందిని : స్టేజికి పైకప్పుగా ఉపయోగించే మెరుపు గుడ్డను చాందిని, చాందినీ పరదా అంటున్నారు.
7. యాట : బలి జంతువు అయిన గొర్రె / మేక
8. ఒసుగులు: మంగళహారతిలో ప్రేక్షకుల మధ్యకు వచ్చినప్పుడు ప్రేక్షకులు హారతి పళ్ళెంలో వేసే డబ్బులు ఒసుగులు అంటారు.
9. బోనం : కొత్త మట్టికుండలోగాని రాగి సర్వలోగాని పసుపు వేసి అన్నం వండి ఆ పాత్రకు పసుపు కుంకుమ బొట్లు పెట్టి దాని మూతికి వేపాకులు కట్టిన దానిని బోనం అంటారు.
10. జడత : బలి జంతువు మెడలో వేపాకు కట్టి, నోట్లో కల్లు, బెల్లం నీళ్లు పోసి, దాని ఒళ్ళు జలదరించేలా చేయడాన్ని జడత పట్టుట అంటారు.
11. బలి : గొర్రె లేదా మేక యొక్క గొంతును కాకిపడిగెలవాడు కోసి రక్తాన్ని తాంబాలంలో పట్టడం. పట్టిన రక్తంతో గడుక, అన్నం నిమ్మకాయలు కలిపి ఇండ్లపై చల్లడాన్ని బలి చల్లుట అంటారు.
12. బలి చాట: బలి చల్లడానికి ఉపయోగించే కొత్త చేట.

13. సప్ప : గొర్రె లేదా మేక యొక్క కాలు మొత్తం భాగం.

14. పోగులు : గొర్రె, మేకలను బలిచ్చిన తర్వాత కోసిన తరువాత ఎంతమందికి పంచాలో, ఆ విధంగా సమంగా కుప్పలు వేసి ఉంచుటను పోగులు అంటారు. వాటిని ఎవరిది వారు గిన్నెలో ఎత్తుకుంటారు లేదా ఎత్తి పంపిస్తారు.

15. పిక్క : మోకాలు నుంచి పాదం మధ్యలోని భాగాన్ని పిక్క అంటారు.

16. ఓపానశక్తి: తనకు చేతనైనంత

❖ ❖ ❖

తెలుగులో జానపద సాహిత్యం– పాశ్చాత్యుల అధ్యయన విధానం

– గడ్డం నాగేందర్

జానపద విజ్ఞానం ఒక సమూహానికి సంబంధించిన ఒక అమూల్యమైన సంపద ఒక తరం నుంచి మరో తరానికి, ఒక సమూహం నుంచి మరో సమూహానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అందుతున్న తర గని విజ్ఞాన సంపద అది. ఇందులో ప్రజల జీవితానికి సంబంధించిన విలువైన విజ్ఞానం ఆరోగ్యానికి సబందించిన ఆయుర్వేదం, మూలికలు, పనిముట్లు, ఆహారపు అలవాట్లు, పాడుకొనే పాటలు, మాటలు పాటిస్తున్న సంస్కృతి సంప్రదాయాలు అనేవి ఆయా సమూహాలకి సంబంధించిన జీవన విధానాన్ని, వైవిధ్యాన్ని, ఆ విధానంలో ఏర్పర్చుకొన్న వ్యవస్థని, ఆ వ్యవస్థ మీద పొందుపర్చుకొన్న నమ్మకాన్ని, అనుభవ వైవిధ్యాన్ని చూపిస్తుంది. అది పునాదిగా భావించి వర్తమాన జీవన రీతుల్ని నిర్దేశిస్తుంది. జానపద విజ్ఞానం భవిష్యత్తు జీవితానికి ఆధారంగా ఉన్నాయి. అందులో ఒక సమూహానికి చెందినా, సాంస్కృతిక జీవనం, వాడె పరికరాలు, వారి కట్టుబాట్లు, ఆలోచన, హృదయ స్పందన కనబడుతుంది. సమాజం లేదా సమూహం చలనశీలి కనుక ఆ స్వభావం జానపద విజ్ఞానంలో కూడా ఉంటుంది తెలుగు నాట ప్రచారంలో ఉన్న పాటలు, కథాగానాలు, పురా గాథలు స్థల పురాణాలు, కుల పురాణాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, కళారూపాలు, ఆచారాలు, అనుష్టానాలు, జాతర్లు, ఉత్సవాలు, పండుగలు, దేవతలు, ఆటపాటలు, ఆరోగ్య జాగ్రత్తలు, వంటలు వార్పులు, వృత్తులు - విజ్ఞానం, పరికరాలు పనిముట్లు కొలమానాలు, చెట్లు చేమలు, ఊరు - ఇల్లు ఆవాస యోగ్యం చేసుకొన్న తీరు,అలంకరణలు ఆభరణాలు, నిల్వ చేసుకొనే పద్ధతులు లాంటి బహుముఖ రూపాలలో జానపద విజ్ఞానం కనబడుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, సమాచార సాంకేతిక పరిణామాలు తెలుగు వారి జీవన విధానంలో కూడా మార్పులు తెస్తున్నాయి. ఆనాటి పని పాటలు మారినాయి. ఆహార రీతులు, ఆరోగ్య జాగ్రత్తలు, కాపురానికి కుదురయిన ఇల్లు, కుటుంబ వ్యవస్థలో మార్పులు స్పష్టంగా కనబడుతున్నాయి హరిత విప్లవం' వ్యవసాయ జగత్తునే మార్చివేసింది. స్వయం స్వావలంబన సన్నగిల్లింది. ప్రజలు తర తరలనుండి పాటిస్తున్న సంప్ర దాయ విజ్ఞానానికి మెరుగులు దిద్దుకోవడం పక్కన పెట్టి ఇనాటి సమాజానికి అనుకరణల మీద మోజు పెరిగింది. 'ప్రపంచీకరణ పరవళ్లు తొక్కుతుంది. ఇండియా, అమెరికా, ఆఫ్రికా ఇంకా వివిధ ప్రాచిన తేగల జీవన విధానం పరిశీలించిన కొందరు ప్రాచ్యత జానపద పరిశోధకులున జానపద సాహిత్యం అధ్యనం లో బాగంగా వారి అనుభవంలోకి వచ్చిన వివిధ సిద్ధాంతాలను నేటి ఆధునిక పరిశోధకులకు సూచించారు .

జానపద విజ్ఞానం - నిర్వచనం :

జానపదం అంటే గ్రామీణ ప్రాంతం అని అర్థం. అమరకోశం, వ్యాసభారతంలో దీని ప్రస్తావన ఉంది. ఎర్రన అరణ్యశేషంలో గ్రామీణులు అనే అర్థంతో 'జాన పదులు' పదాన్ని ప్రయోగించాడు. జానపద విజ్ఞానం అనేది ఫోక్లోర్ అనే ఆంగ్ల పదానికి అనువాదం. 1846లో డబ్ల్యు.జె. థామస్ అనే ఆంగ్ల జానపద విజ్ఞాన శాస్త్రవేత్త ఫోక్లోర్ పదాన్ని రూపొందించాడు.

'Folk lore' అనే పదం ను అంగ్ల పదానికి సమా నార్థకం 'జానపద విజ్ఞాన' ఈ ఆంగ్ల పదాన్ని మొట్టమొదట డబ్ల్యు. జె. థామ్సన్ పండితులు 1846 లో "ది అథా నీయం అనే పత్రికకు రాసిన వ్యాసంలో సూచిం చినట్లు మన తెలుగు జానపద పరిశోధకులు తెలిపారు.

జానపద విజ్ఞానం పండితుల వారికి పరిశోధన అనుసరించి నిర్వచించారు. మొదట ఈ పదాన్ని సృష్టించిన థామ్సన్ దృష్టిలో folk (జానపదం) అంటే నిరక్షరాస్యులైన జాన పదులు. LORE ''అంటే విజ్ఞానం, చదువు సంధ్య లు లేని పల్లె ప్రజల విజ్ఞానమే జానపద విజ్ఞానం అని పేర్కొన్నాడు. కేవలం పల్లె ప్రజల విజ్ఞానమే జానపద విజ్ఞా నం కాదని జానపద మనస్తత్వం ఉన్న జన సమూ హం ఎక్కడ ఉన్నా వారిది జానపద విజ్ఞానం అవుతుందని ''అలన్ డండాస్ అభిప్రాయం The term Folk can be refers to any Group of people what so ever who share at list one common factor..... ఒక వృత్తి గాని కులానికి గాని మతానికి గాని జాతి గానీ చెందిన జన సమూహంలో సామ్యం కనిపిస్తే ఆ సమూహాన్ని జానపదులను వారి విజ్ఞానాన్ని జానపద విజ్ఞానం అంటారు. రిచర్డ్ ఏం డార్సన్ జానపద సాహిత్య పరిచయం చేస్తూ ఇలా నిర్వచించాడు. Folklore is an echo of the past, but at the same time it is also the vigorous voice of the present. Folklore and the Folklife, Introduction, (ఆంధ్రుల జానపద విజ్ఞానం. 1983. పు.2)

తెలుగులో జానపద సాహిత్యం :

జానపద కళలు, ఆచారవ్యవహారాలు, సంస్కృతి, జానపద సాహిత్యం మొదలైన వాటన్నింటిని కలిపి జానపద విజ్ఞానం అంటారు. జానపద సాహి త్యం దీనిలో ఒక భాగం. జానపదులంటే అనాగరికులు, మొం టు వారు, కర్షకులు అనే అభిప్రాయం ఉండేది. జానపదులు నిరక్షరాస్యులైనప్పటికీ ప్రస్తుతం వారి జీవిత అనుభవ సారాన్ని జానపద విజ్ఞానంగా, పరిశోధనాత్మకంగా అధ్య యనం చేస్తున్నారు. జానపదుల ప్రదర్శన కళల్ని పోషించి పరిరక్షిస్తున్నారు. జానపదుల భాష, సంప్రదాయం, సంస్కృతీవిశేషాలను నిశితంగా పరిశోధిస్తున్నారు.

తెలుగు జానపద విజ్ఞాన అధ్యయనం నూరేండ్ల చరిత్ర కల్గింది. సి.పి. బ్రౌన్ జె.యె. బోయల్, నందిరాజు చలపతిరావు దగ్గరినుంచి నేటి దాకా జానపద విజ్ఞాన బహుముఖాంశాలకు సంబంధించిన సేకరణ, అధ్య యనం నిర్విరామంగా జరుగుతుంది. తెలుగు జాన పద విజ్ఞానానికి సంబంధించినంత వరకు జే.ఏ. బోయల్ మొదటి క్షేత్ర పర్యాటకులు. పరిపాలనా పరమైన కార్య క్రమాల్లో భాగంగా ఒక బంగళాలో బస చేసినపుడు తన మనస్సుకి గిలిగింతలు పెట్టిన ఒక పాటను విని వాళ్ల దగ్గరికి వెళ్లి ఆ పాట తాలూకు వివరాల్ని, అర్థాల్ని సేకరించినాడు. ఆయనే సర్వాయి పాపన్న కథని కూడా సేకరించి మౌకిక సంప్రదాయం పద్ధతిలో యాచకులు, కొందరు బుడగాజంగాలు, విరముష్టి, కాకిపడగల వార్లు, కునపులిండ్ల వారు, గౌడజెట్టి ఇంకా ఇతర చాల ఆశ్రిత కులాలకు అనుసరించి పడే పాటలు ,పద్దులు ,గేయాలు సేకరించి పుస్తకాలు వేయించారు. తెలుగులో జానపద సాహిత్యం మీద బిరుదురాజు రామరాజు గారితో ప్రారంభమయిన పరిశోధన మూడు వందలకు పైగా పి.హెచ్.డిలు, మరో మూడు వందల పైగా ఎం.ఫిల్ పట్టాలు ఈ రంగంలో వచ్చాయి.ఇంకా జరుగుతున్నాయి. వృత్తిగాకపోయినా సొంత డబ్బు ఖర్చు పెట్టుకొని, పల్లెపల్లెలు, మారుమూల ప్రాంతాలు తిరిగి, ప్రజలతో కలగల్సిపోయి వాళ్ల మాటల్ని, పాటల్ని, ఆచారాల్ని, అలా ఎన్నో విషయాలని సేకరించి నేపథ్య వివరాలను, సందర్భ ప్రాధాన్యాన్ని వివరిస్తూ భావితరాల కోసం వేల వేల పేజీల సేకరణను ఇచ్చిపోయిన నేదునూరి గంగాధరం గారు వ్యక్తి కోసం వేల వేల పేజీల సేకరణను ఇచ్చిపోయిన నేదునూరి గంగాధరం గారు వ్యక్తి కాదు ఒక సంస్థ. టేకుమళ్ల కామేశ్వరరావు, హరి ఆదిశేషువు, తూమాటి దొణప్ప బిరుదురాజు రామరాజు లాంటి పండితుల అధ్యయనం జానపద సాహిత్యం శిష్ట సాహిత్యానికే తీసిపోదు అనే విషయం చెప్పుతుంది. నాటి నుంచి నేటి దాకా అధ్యయనాలు కొత్త పుంతలు తొక్కుతూ, జానపద విజ్ఞాన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. తెలుగు జానపద విజ్ఞాన రూపురేఖల్ని ఒక దగ్గర చేర్చి గ్రంథం ఆంధ్రుల

జానపద విజ్ఞానం కర్త ఆర్వీయస్ సుందరం. ఇంకా ఇతర జానపద సాహిత్యం పరిశోధకులు మన పూర్వికులు పాడుకొనే పాటలు, సంప్రదాయ విజ్ఞానం లాంటి విషయాలు పరిశోధకులు నేటి సమాజం ముందు ఉంచారు. గత అధ్యయనం చాలా వరకు ప్రక్రియాత్మక మయింది. అందులో కనబడే జీవనరీతులు ఏ సమూహానికి, లేక ఏ ప్రాంతానికి లేక ఏ కాలానికి సంబంధించినవో నిర్ధారించడం అంత సులభం కాదు.

జి ఎస్ మోహన్ గారు జానపద విజ్ఞానాన్ని విద్యా గ్రంధాలు నమోదు లేని సామాన్య జనులలో అనేక రూపాలలో రూపంలోనూ ఉదాహరణ పూర్వకంగా ప్రవహిస్తున్న సాంప్రదాయబద్ధమైన సాంస్కృతిక విజ్ఞానమే జానపద విజ్ఞానం నిర్వహించారు. రిచర్డ్ ఎం. డార్సన్ 1972లో 'ఫోక్లోర్ అండ్ ఫోక్లైఫ్' గ్రంథ ఉపోద్ఘాతంలో జానపద విజ్ఞానాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి..

మౌఖిక జానపద విజ్ఞానం :

జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఇతి హాసాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవన్నీ ఈ విభాగంలోకి వస్తాయి

సాంఘిక జానపదాచారాలు :

పుట్టుక, వివాహం, మరణం తదితరాంశాలకు సంబంధించిన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం మొదలైనవన్నీ ఈ విభాగంలో చేరతాయి

వస్తు సంస్కృతి :

భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులే కాకుండా కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోనే చోటు పొందుతాయి. చిత్రకళ, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, ఆహార సామగ్రి, పూజా సామగ్రి, శిలా విగ్రహాలు, దారు విగ్రహాలు తదితర వస్తు రూపాంశాలెన్నో ఈ విభాగంలో వస్తాయి.

జానపద కళలు :

సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగంలో చేరతాయి. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాటలు, యక్షగానం, వీధి భాగోతం, కోలాటం, పగటి వేషాలు, బహురూపుల గారడీ విద్యలు మొదలైనవి ఈ విభాగంలో వస్తాయి.

జానపద సాహిత్య అధ్యయనంలో భాగంగా పరిశోధకులు జానపద సాహిత్యం ఈ క్రమంలో వారి పరిశోధన అనుభవంలో వచ్చిన నూతన విషయం విశదీకరిస్తూ కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఇది ముఖ్యంగా మౌఖిక సంప్రదాయం వలన ఒక తరం నుండి ఇంకో తరానికి ఒక సమూహం నుండి ఇంకో సమూహానికి మధ్య ఏ విధమైన జానపద విజ్ఞానం అంద పడిందో ఈ సిద్ధాంతాల ఆధారంగా పరిశోధన చేశారు. జానపదులకు చదువు లేక పోవడం వల్ల గేయాలను ఇలా నోటి ద్వారా - ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తాయి. విరి పాటలు గేయాలు పాటించే విషయాలు రాసి ఉంచడం జరగదు ఒకరు పాడగా మరాకరువిని చేర్చుకుంటారు తండ్రుల ఆస్తి తర్వాత తనానికి సంక్రమించినట్లు జానపద గేయ సంపదకూడా పాతతరం నుండి కొత్తతరం వారికీ మౌఖికంగా అందజేయబడుతుంది.

జానపద సిద్ధాంతాలు - ప్రతిపాదకులు :

1. మానవ శాస్త్రీయ సిద్ధాంతం - ఆండ్రూల్యాంగ్
2. భారతమూల సిద్ధాంతం - థియొడర్ బెన్ఫె
3. వలసవాదం - థియొడర్ బెన్ఫె
4. ఇండో -యూరోపియన్ సిద్ధాంతం - గ్రిం సోదరులు
5. స్వప్నమూల సిద్ధాంతం - లుడ్విగ్, లైస్నర్
6. చారిత్రక భౌగోళిక సిద్ధాంతం (ఫిన్నిస్ వాదం) - ఫిన్నిస్

జానపద సాహిత్యం లో ప్రధానంగా జానపద ,విజ్ఞాన్ని గుర్తించడానికి ప్రధాన కొన్ని లక్షణాలను జానపద సాహితి పరిశోధకులు వాళ్ళ రచనలో తెలిపారు . జానపద గేయాలు ఏకాలంలో ఈచింపబడ్డాయో తెలియదు , శిష్ట సాహిత్యంలో కవి గురించిన వివరాలు, ఎప్పటి రచన అనేది తెలుస్తాయి కాని జానపద గేయాలు రచయిత ప్రస్తావన ఉండదు. ఇక శైలని బట్టి కాలాన్ని ని ర్ణయిస్తా మంటే గేయాట ఎప్పటికప్పుడు మారి పోతుంటాయి అందుకే జానపద గేయాలు పాతవి కావు, కొత్తవి కావు.

మానవ శాస్త్రీయ సిద్ధాంతం – ఆండ్రూల్యాంగ్ :

భారతీయ ఉపఖండంలోనీ మానవియ శాస్త్రాన్ని అనుసరించి జరిగిన రచన సాంప్రదాయం ఉన్నప్పటికీ, మౌఖిక సంప్రదాయాలు, ముఖ్యంగా ఆహ్లాద కరమైన జానపద కథనాలు, దురదృష్టవశాత్తు మనం ఎక్కువగా పరిశోధించడం లేదు. మానవీయ శాస్త్రం సంబంధించి పరిశోధకులు సంవత్సరాలుగా అభివృద్ధి చేసిన కఠినమైన విశ్లేషణాత్మక సాధనాలకు ఉపయోగించి పరిశోధన జరగాలి. భారతీయ కుల వ్యవస్థ, సాంఘిక నిర్మాణం, కుటుంబ బంధుత్వాలు, గ్రామ పరిస్థితులు. ప్రజల ఆచార సంప్రదయాలు. మొదలైన వాటిపై అధ్యయనాలు పాశ్చాత్య భారతీయ పండితుల దృష్టిని ఆకర్షించాయి, ఫలితంగా విలువైన అధ్యయనాలు జరిగిన తర్వాత జాన పద అధ్యయన సిద్ధంతాల ఆధారంగా మన జానపద గాథలు, విజ్ఞానాన్ని పరిశోధన అధ్యయనం విధానం తెలుస్తుంది. మౌఖిక సంప్రదాయాలు దురదృష్టవశాత్తు ఇలాంటి ప్రతిస్పందనను పొందలేదు . మనమందరం అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న ఈ విషయాన్ని అనుసరించి మౌఖిక సంప్రదాయాల క్రమబద్ధమైన అధ్యయనం అవసరం ఎంతో ఉంది అని నేటి పరిశోధ కులు గమనిచాల్సిన విషయం .

మన దేశ నాగరికత మీద జానపద శాస్త్రాల విద్యార్థు లకు భారతదేశం వలె ఇంకా ఇతర దేశాల మధ్య ఉన్న వైవిధ్యం అలానే ఇరు దేశాల్లో ఒకే విధమైన అంశాల సంబంధాలను తెలుసుకోవడానికి ఇంకా అనుకున్నంత అధ్యయనం జరగలేదు. ఒక సమూహానికి, లేదా దేశానికి మూలాన్ని ఆర్యన్ సంస్కృతికి దేశంలోని ప్రారంభ ద్రావిడ ఇతర ఆర్య ఇతర సంస్కృతుల జీవన విధానం ఆర్యన్ సంస్కృతుల చట్రంలోకి, దాని రూపాన్ని ఇక్కడ ఉన్న సమాచారాని సేకరించడం, ప్రాథమికమైనవి కాక పోయినా, మనం అర్థం చేసుకొనే నమూనాలో నిరంతరం అధ్యయనం చేయడం ఎంతో అవసరం. మొదటి ఇలాంటి అధ్యయనం వల్ల ఎన్నో విషయాలు అర్థం చేసు కోడానికి విలు ఉంటుంది, రెండవది ఇతర జానపదుల నాగరికతల పరిశీలిస్తే మౌఖిక సాహిత్యం లోని వైవిధ్యానికి అర్థం చేసుకొనే వీలుంటుంది.

భారతీయ మూలా సిద్ధాంతం – థియొడర్ బెన్ఫే:

భారతీయ జానపద వీరులు రామాయణం, సంస్కృత పురాణాలు చరిత్రలో కృష్ణుడు,రాముడు,ఇలాఎందరో పురాణపురుషుల పాటలు మనదేశంలో ఉన్నాయి. ఈ గొప్ప వీరుల గురించి ఇతిహాసాల సంబంధించి రాసిన వ్రాతపూర్వక సాహిత్యంలో వారికి చోటు దొరికింది. కానీ భారతీయ సాంస్కృతిక వ్యవస్థలో, భారతీయ జానపద వీరులు ఎక్కువగా ప్రాచుర్యం పొందాయి. భారతదేశ కులాలు తెగలు తమ భాష మతం ఆచారాల ద్వారా సంస్కృతి వైవిధ్యాలను గుర్తించవచ్చు. దేశం మొత్తం లో పేరు పొందిన వీరులు తో పాటు, ప్రాంతీయ వీరులు స్థానిక జానపద, గిరిజన వీరులు ప్రజల జ్ఞాపకార్థం సజీవంగా జానవదులు పాడే పాటల్లో ఉన్నారు. సంతాలులు, గోండ్స్ ఉదాహరణలు తీసుకుందాం. సంతల్స్ వారి సంస్కృతి వీరులు బీర్ ఖేర్వాల్, బిడు చందన్ ఉన్నారు. గోండ్స్ వారి జానపద హీరో రాంజీ గోండు కొమరం భీం బంజారా జానపదలు పాడుకునే పాటలు సంత్ సేవాలాల్ ఇలాంటి మహనీయుల గురించి జానపద గేయాలు పాటలు జానపద గేయాలు గ్రామాల్లో పాడుతుంటారు.వీళ్లు ధీరులు మాత్రమే కాదు, భారతీయ జానపద కథానాయికలు కూడా

భారతదేశ సంస్కృతిని సంప్రదాయాలు చరిత్ర విషయంలో గణనీయమైన పేరు ప్రఖ్యాతులుకలిగి ఉన్నారు. ఇతర గిరిజనులకు చెందిన జానపద ఇతిహాసాలు స్త్రీ ఆధారంగా పాడుకునే పాటలు ఎన్ని ఉన్నాయి వాళ్ళ సంప్రదాయాలు అందులో కనిపిస్తాయి.

మనదేశంలో జానపదులు పాడుకునే పాటలలో గొప్ప వీరులు, స్త్రీమూర్తి గురించి ఎక్కువగా వీర గాథలు మౌఖిక సాహిత్యం లో ఉన్నాయి. వ్రాతపూర్వక గ్రంథాలకు విరుద్ధంగా తెలుగులో జానపద సాహిత్యం మౌఖికంగా ఉంది.జానపద అంశాలకు సంబంధించి కట్టు కథలు, ప్రాచీనంగా జానపదులు అల్లిన కథలు కూడా నేటికీ గ్రామాల్లో పాడుతుంటారు. ఇవి నిజంగా జరిగాయి లేదో ఎవరికి తెలియదు.జానపదుల వీరుల్ని ప్రజలు దైవంగా పూజిస్తారు. వీరి ఆశీర్వాదం తీసుకొని గ్రామాల్లోని కొన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తారు.దీన్ని భారతీయ మూల సాంప్రదాయం చెప్తారు.

వలస సిద్ధాంతం - థియొడర్ బెన్ఫె :

థియోడర్ బెన్ఫె (1809 - 1881) మరొక జర్మన్ భాషా శాస్త్రవేత్త ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ సంస్కృత-ఆంగ్ల నిఘంటువును సంకలనం చేయడానికి ఎవరు బాగా ప్రసిద్ధి చెందారు. అయితే,అతను జానపద కథల యొక్క సైద్ధాంతిక మేధో వికాసానికి చాలా సహకారం అందించాడు.

భారతీయ సాహిత్యంలోని పంచతంత్రం జర్మన్లోకి అనువాదం అవ్వడంతో దీని మీద అధ్యయనాలు భాష,ఇంకా కథ మూలాల మీద అత్యంత సమగ్రమైన పరిచయంతో బెన్ఫె పరిశోధనల ద్వారా ప్రాచీన భారతదేశ సంస్కృత కథలు ఐరోపా కథల మధ్య సారూప్యతలు పరిశీలించి ఇవి జన్యు సంబంధం కారణంగా ఉండవని అభిప్రాయపడ్డారు. మాక్స్ ముల్లర్ ఆర్యులు మీద పరిశోధించిన విధానంలో ఈ విషయాలు విశదీకరించారు, జానపద కథలను చాలా వరకు బెన్ఫె పరిచయం చేశారు దేశంలో వివిధ ప్రాంతాలు ప్రయాణించి నప్పుడు కనిపించే కొన్ని కథ సాహిత్యం ద్వారా వలన ఇతర దేశాల్లో భారతీయ తత్వం కనిపిస్తుంది. పురాతన భారతదేశం నుండి ఇతర ప్రాంతాలకు ప్రవేశించినట్లు వలసవాదం సిద్ధాంతం వలన గుర్తించవచ్చు. జానపద కథలు మొదట మౌఖిక సాహిత్యం ఒకరినుంచి ఒకరికి సంక్రమించే క్రమంలో ఇవి యూరప్ ఇతర ప్రాంతాలకు ప్రజల ద్వారా 'వలస వచ్చాయి' అనే విషయలు వలస వాదం ద్వారా తెలుస్తుంది. ప్రజల మధ్య సాంస్కృతిక సంబంధాల ద్వారా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కూడా చేరాయి. బెన్ఫె కూడా ఏ విధంగా ఇతర దేశాలకు గాథలు చేరాయని ఖచ్చితమైన మార్గాలను అధ్యయనం చేశాడు. జానపద కథలు భారతదేశం నుండి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వలస వచ్చాయి. జానపద కథలు ఇతర జానపద రూపాల పరమాణు మూలాన్ని కేంద్ర ఇతివృత్తంగా చూడవచ్చు. జాకబ్ గ్రిమ్ మాక్స్ ముల్లర్ పరిశోధనల ద్వారా ఇతర ఫిలాజిస్టుల చేసిన రచనలు చేశారు.ఇంకా బెన్ఫె సిద్ధాంతం వలన ఫిన్లాండ్లోని చారిత్రక-భౌగోళిక పరిశోధన విధానాలను ప్రభావితం చేశాయి. యూరోప్ దేశాలోని విద్యార్థులు జానపదుల మూలాలను కనుగొనేందుకు వలస వాద దృష్టితో విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోదనలు చేశారు.

ఇండో-యూరోపియన్ సిద్ధాంతం-గ్రిం సోదరులు:

ఇండో-యూరోపియన్లు సిద్ధాంతాన్ని చారిత్రక భాషాశాస్త్రం అనుసరించి పరోశోధన చేసారు పద్దెనిమిదవ శతాబ్దం చివరలో, భారతదేశంలో నివసిస్తున్న బ్రిటిష్ న్యాయమూర్తి విలియం జోన్స్ అధ్యయం చేసి భారతదేశంలోని అనేక చారిత్రక భాషలలో సారూప్యతలను గమనించాడు, జోన్స్ ఒక సాధారణ మూలాలను కనుగొనే ప్రయత్నం చేశాడు. అతని పరిశోధన విధంగా చారిత్రక భాషాశాస్త్ర రంగానికి, కాలక్రమేణా భాషాల లో జరుగుతున్న మార్పుల మీద అధ్యయనలు ప్రారంభం అయ్యాయి. అప్పటి నుండి పరిశోధకులు అద్భుత వీర కథలు, జానపదులు పాటలు సేకరణ ద్వారా బాషా

విషయాలు పరిశీలిన చేశారు . గ్రీం బ్రదర్స్ తో పాటు రెండు శతాబ్దాలలో జరిగిన పరిశోధన ఆధారంగా, వివిధ దేశాలలో ఉన్న ప్రజల "మాతృభాష" సాధారణ స్వభావాన్ని పరిశీలిస్తూ ఇండో-యూరోపియన్ అని పిలువబడే దాని సంస్కృతి మూలబాషా గా ఒక అధ్యయనం ప్రారంభించారు. దీని ద్వారా ఇండో-యూరోపియన్ భాషల మధ్య గల సంబంధాన్ని సంస్కృతి,నాగరికత పాశ్చాత్య నాగరికతలో కొంత భాగం అయినట్లు తెలిపారు. ఇండో-యూరోపియన్ల మూల సిద్ధాంతం వలన ఆధునిక జానపద సాహిత్య అధ్యయనం ఎంతో ప్రాముఖ్యమైన అంశంగా ఉంది. ఈ అంశానికి సంబంధించి 1700 సంవత్సరాల చివరలో భాషా శాస్త్రవేత్తలు ఈ విషయం పైన విస్తృతమైన, పరిశోదనలు జరిపారు. ప్రత్యేకించి, భారతదేశంలో నివసించిన బ్రిటిష్ న్యాయమూర్తి విలియం జోన్స్ మరియు 1786 లో ఇండో-యూరోపియన్ నాగరికత విషయాలను సూచించిన మొదటి వ్యక్తి. జోన్స్ ఈ నూతన పరిశోధన ద్వారా వెల్లడైన కొత్త కొత్త అంశాలు భాషాశాస్త్రంలో అలాగే జానపదులు మాట్లాడే భాషలు మధ్య ఉన్న సంబంధాన్ని చారిత్రక భాషాశాస్త్రం ఆధునిక జానపద విజ్ఞాన శాస్త్రాన్ని పరిచయం చేశారు.

జోన్స్ తర్వాత ఇంకా ఇతర పరిశోధకులు ఇండో-యూరోపియన్ భాష కోణం నుండి భాషాలను రికార్డు చేయడం ప్రారంభించిన తర్వాత, ఈ సిద్ధాంతాన్ని ధృవీకరించే సాక్ష్యాలు అన్ని కోణాల నుండి చూపించే ప్రయత్నం చేశారు జానపదుల బాషా, పదజాలం మరియు వ్యాకరణంలో సమాంతరాలు పరిశీలించి విదేశీ భాషలలో పోల్చి చూసారు. ప్రత్యేకించి అప్పటి పురాతన భాషలు: లాటిన్, గ్రీక్ మరియు సంస్కృతం. చివరిది భారతదేశం నుండి వచ్చిన పురాతన రచనలైన వేదా భాష, ఇతిహాసాలు లో ఉపయోగించే భాషను దగ్గరగా పరిశీలన చేయడం వల్ల సంస్కృతానికి లాటిన్ , గ్రీకు భాషలతో బలమైన సంబంధం ఉందని పరిశోధకులు దృష్టికి వచ్చింది.

స్వప్న మూలా సిద్ధాంతం- లుడ్విగ్, లైస్నర్ :

ఆస్ట్రియన్ మనస్తత్వవేత్త అయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856-1939) రచనల ద్వారా ఆత్మనూన్యత, మానసిక సంఘర్షణలకి సంబంధించిన విషయాలు ఇరవయ్యవ శతాబ్దపు విద్యావేత్తలలో, సాహిత్యకారుల ను బాగా ప్రభావితం చేసింది. వ్యక్తి తన కోసం వ్యక్తి అనుభవించే మానసిక సంఘర్షణ మీద పరిశోధనలు చేసి జానపదుల మానసిక పరిస్థితి మీద విస్తృతంగా అధ్యయనం చేసి వాళ్ళు పాడే పాటలు, వాళ్ళు చేసే సంప్రదాయ నృత్యాలు, వీర గాథలు పరిశీలించి వారి మానసిక ప్రభావాన్ని గుర్తించారు. "ది ఇంటర్ప్రిటేషన్ ఆఫ్ డ్రీమ్స్" (1899), "జోక్స్ అండ్ దేర్ రిలేషన్" వంటి పుస్తకాలను అచేతనంగా ఉన్న మనిషి ఆలోచన సరళి గురించి, మనస్తత్వం గురించి విశ్లేషించారు. ఒక వ్యక్తి కోరికల కనడం ద్వార అతని లేదా ఆమెలో ఉపచేతన కలిగే భావాలు మంచి సామాజిక అనుభవంలో వచ్చిన అవగాహన అప్పటి పరిస్థితులకు అనుకూలంగా ఆలోచనలు వ్యక్తి యొక్క ఆవేశాలుతో కూడిన వచ్చిన కథలు, కథనాలు ఫ్రాయిడ్ పోస్ట్-ఫ్రాయిడియన్ మానసిక విశ్లేషణ ద్వారా కొత్త విషయాలను కనుగొని ఇరవయ్యవ శతాబ్దపు విద్యా వేత్తలు సాధారణ ప్రజాలలో జానపద అధ్యయనాలు చేయడం కొత్త ఒరవడి సృష్టించింది, ఆ తర్వాత కొత్త జానపద పరిశోధక సైద్ధాంతిక పద్ధతులను తీసుకువచ్చరు. దినిమీద పరిశోధన చేసిన లుడ్విగ్, లైస్నర్ జానపద సాహిత్యం లో స్వప్నమూల సిద్ధాంతానికి అనుసరించి కొన్ని అంశాలను పరిశీలన చేసాడు .దీని తర్వాత ఇతర పరిశోధకులకు ఇది ఒక మార్గం చూపినట్లు అయ్యింది.

చారిత్రక భౌగోళిక సిద్ధాంతం (ఫిన్నిస్ వాదం) - ఫిన్నిస్ :

మన దేశ సాహిత్యం లో ప్రాచీనమైన మూల ఆధారం గా చెప్పబ్బడే పంచతంత్రం లోని ఈ కొన్ని కథలు మనకి ఎంతో నచ్చుతాయి.ఇవి యూరోప్ లో ఉన్న భాషల్లోకి అనువాదం అయ్యాయి. అక్కడ జానపదుల లోని ఇతర

కథల ప్రభావం ఈ కథల మీద ఉందని చెప్పడం ద్వారా భారత దేశం లోని ఈ కథలు పుట్టుకి మన దేశం మూలమని వాదాన్ని ఇది నిరాకరిస్తోంది. అయినా బెన్ఫీ మార్గదర్శకత్వంలో కొంత మంది పరిశోధకులు కథల్ని తులనాత్మకంగా అధ్యయనం చేశారు. ఒకే విధమైన సమాన అంశాలు కలిగిన కథల్ని ఒకచోట చేర్చడం జరిగింది. వీటి ద్వారా కొన్ని కొత్త విషయాలు తెలిసాయి. భారతదేశంలోని సాహిత్య కథ గ్రంథాలు పాశ్చాత్య జాన పద కథల మీద ప్రభావం చూపించాయి. అనే విషయం అవగతం అవుతుంది. ప్రపంచ సాహిత్యం లో జానపదుల కథల విషయం లో కొద్దిమెర కథ వస్తువుల సామ్యానికీ ఇతర దేశాల సాహిత్యం ప్రభావమే కారణం కావడానికి ఎవ్వరూ నిరాకరించలేరు. దీనికి (Theory of Borrowing) అనేది ఎంతో కట్టుబడి ఉంది.

బెన్ఫె అభిప్రాయపడినట్టుగా భారతదేశం అన్ని కథలు పుట్టినిల్లని నేడు పరిశోధకులు అంగీకరించక పోయినా, కథల పుట్టుకకి కారణమైన అనేక దేశాల్లో భారతదేశం కూడా ముఖ్యమైందని అంగీకరించారు. భారతదేశ కథలు యూరోపు దేశాలకి వలసపోయిన చారిత్రక, భౌగోళిక మార్గాలను అన్వేషించడానికి ప్రయత్నించాడు. ఒక విధంగా స్కాండినేవియా పరిశోధకులు ముఖ్యంగా ఫిన్లాండ్ సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. వీళ్ళు ఈ కథల పుట్టుక, చరిత్ర, ఆ కథలు ప్రయాణం చేసిన మార్గాల (భౌగోళికంగా) అన్వేషణకి కృషి చేశారు. వీళ్ళు ముఖ్యంగా ఫిన్లాండ్ దేశపు జాతీయ ఇతిహాసల మీద తమ దృష్టిని నిలిపి ఆ కథా మూలాన్ని, అది ఇతర దేశాల్లో చేసిన ప్రయాణ మార్గాలను అన్వేషించారు. అందువల్లనే ఈ వాదాన్ని చారిత్రక - భౌగోళిక సిద్ధాంతం అనీ, ఫిన్లాండ్ దేశంలో ఈ పదం ఉపయోగించడం వల్ల దీన్ని "ఫినీష్ మెథడ్" అనీ అంటారు. రిచర్డ్ ఎం.డార్సన్ జానపద విజ్ఞాన పరిశోధకుడు 'జానపద విజ్ఞానం- జానపద జీవితం' అనే గ్రంథంలో ' ఇది గత కాలానికి సంబంధించింది కాదని, వర్తమాన కాలానికి కూడా ప్రతిధ్వని' అని అన్నారు. నిత్యం చైతన్య స్ఫూర్తి ఉన్న జానపద విజ్ఞానం ఆధునిక జీవితానికి ప్రేరణ కలిగిస్తుంది.

భారతదేశంలో జానపద అధ్యయనానికి దారులు వేసిన వారిలో భారతదేశానికి 1874లో ఉద్యోగరీత్యా వచ్చిన జె.ఎ.బోయల్ జానపద సాహిత్యం పట్ల అభిమానంతో దక్షిణ భారతదేశానికి సంబంధించిన ఆరు జానపద గేయ గాథలను సేకరించి 'ఇండియన్ ఆంటిక్విటీ' అనే గ్రంథాన్ని ప్రచురించారు. దీనిలో సర్వాయి పాపని కథ ప్రసిద్ధి. జానపద గేయగాథలను సేకరించిన తొలి పాశ్చాత్యుడు బోయల్. అలానే తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన సి.పి.బ్రౌన్ జానపద సాహిత్యానికి బొబ్బిలి కథ, కుమార రాముని కథ, పల్నాటివీరచరిత్ర, కాటమరాజు కథ, కామమ్మ కథ వంటి ప్రసిద్ధ గాథలు సేకరించి ప్రచు రించారు. జానపదులకు సంబంధించిన భాషలో చెందిన మార్పులు గమనించడానికి భాషా శాస్త్రవేత్తలు పూను కోవచ్చు. చరిత్రకారులకు, మనస్తత్వ శాస్త్రవేత్తలకు కూడా కొంత కూడా పరిశోధక అంశాలు దొరక్కపోవు. జానపద సాహిత్యాన్ని పోగు చేయడం, అందులోని మెరుపుల్ని రేఖా మాత్రంగా చూపించడం అంతే. ఇప్పటి పరిశోధన ఎక్కువ భాగం ఇంత వరకే పర్మితమై వుంది. ప్రమాణాల లాగా వుండిపోయిన ఆ గేయాల నుండి, కథల నుండి కొత్త విషయాలు గ్రహించాల్సి వుంది. మనల్ని గురించి మనం పూర్తిగా మన జానపద మూలాల గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేసి జానపద గాథలను వెలికితీసే కృషి తప్ప కుండా చేయాల్సి వుంది.

ఆధార గ్రంథాలు :

1. సుందరం,ఆర్ వి ఎస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు. 1983.

2. సుందరం ఆర్. వి. ఎస్.జానపద సాహిత్యం, యువ భారతి సాహితి సాంస్కృతిక సంస్థ, సికింద్రాబాద్, 1988.

3. భక్తవత్సల రెడ్డి ఎన్. తెలుగు జానపద విజ్ఞానం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము ,హైదరాబాద్, 2012.

4 దోణప్ప తూమాటి, జానపద కళా సంపద, విశాలాంధ్ర పబ్లిక్ హౌస్, హైదరాబాద్, 1987.

5 మోహన్ జి ఎస్, జానపద విజ్ఞాన అధ్యయనం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్, 2001.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నెల్లూరు జిల్లా గ్రామదేవతల కథలు – వైశిష్ట్యం

– తలారి సుజాతమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఒక దేశంలోని మత పరిణామాలను ఆచార వ్యవహారాలను మానవ మనస్తత్వాలను ప్రతిబింబింప చేసి జాతి సమైక్యతకు దోహదపడేవి "పురాగాథలు". వివిధ సాహిత్య ప్రక్రియలకు కళలకు మూలం పురాగాథ లే ప్రాచీన మానవుని మనస్తత్వానికి ప్రతీకలైన పురాగాథలు జానపద విజ్ఞానంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకున్నాయి.

పురాణ గాథలు ప్రాచీన కాలానికి చెందిన జగత్ సృష్టిని దేవతలను నమ్మకాలను వివరించే గాథ. పురా గాథలు వివిధ ప్రాణుల సృష్టిని గురించి, కర్మకాండలు ఉత్సవాలు జాతరలు ఎందుకు ఏ విధంగా ఏర్పడ్డాయి అనే అంశాల గురించి పురాగాథ వివరిస్తుంది.

జానపద సాహిత్యం లోని ఇతర శాఖలలాగా పురా గాథల్లో కూడా పునరుక్తి ఉంటుంది. పునరుక్తి కథను ప్రారంభించడముంటుంది. ఒక కథలో చెప్పబడిన పాత్రల పేర్లు ఊర్ల పేర్లు ఇతర కథలు తరచుగా కనిపిస్తుంటాయి. ఒకే సన్నివేశాలు వర్ణనలు అనేకసార్లు ఆవృతం అవుతుంటాయి. పునరుక్తులు కథను శ్రోతలకు గుర్తు ఉండేటట్లు చేస్తాయి. జాతరలు పండుగలు చేసేటప్పుడు ఒకే కథను ఎన్నోసార్లు చెప్పడం జరుగుతుంది. ఎన్నో గ్రామ దేవతల జాతర్ల ను జరిపించిన, కథలను చెప్పించిన కథకుడు కథా సంకల్పంతో చాతుర్యాన్ని చూపిన ఆచారం ప్రకారం ఒకే కథను చెప్తాడు, దీనివల్ల ఆ ఆచారంలోని అంతరార్థం తెలుసుకొని దాని విలువ, ఆధిక్యం గుర్తించడానికి వీలుంటుంది. దేవత అనుగ్రహానికి పాత్రులవుతారని జానపదుల ప్రగాఢ విశ్వాసం.

బ్రాహ్మణులు ఆలయాలల్లో పూజ చేయడానికి అర్హులైన విధంగా గ్రామదేవతల కథలను చెప్పే అర్హత కొన్ని ప్రత్యేక కులాల వారికి ఉంటుంది. గ్రామదేవతల కథలను సృష్టించి పాడేవారు నిమ్న జాతుల వారే. గొల్ల కులంలోని కురుమ, బీరన్నలవారు, బైండ్లవాళ్ళు, గొల్ల సిద్ధులు, శారదకాండ్రు, పిచ్చి కుంటలు, మాల దాసరులు మొదలగువారు రామాయణ భారతాది కథలను చెప్తారు. ఆంధ్రదేశంలో గ్రామ దేవతల కథలను పౌరాణిక కథలను చెప్పే వృత్తి గాయకులు ఉన్నారు. వారి కథే కులవృత్తి తరతరాల నుండి వాగ్రూపంలో జీవిస్తున్న ఈ కథలు కొన్ని కులాల వారికి పూర్వీకుల నుండి సంక్రమించిన సంపదలు.

గ్రామ దేవతల కథలు అజ్ఞాతకర్తృత్వాలు. ఇవి మౌఖికమైనవి వీటికి ప్రత్యేకంగా కవులు గానీ రచయితలు గాని ఉండరు. పురాగాథలు వినడమే వీరి వ్యాప్తికి సాధనం జానపదులకు చదువు సంధ్యలు లేకపోవటంవల్ల కలం కాగితాలు ప్రసక్తి అస్సలు ఉండవు. ఎంతో సరళంగా సహజమైన శైలిలో ఉంటాయి. ఈ కథలు ఒక తరం నుండి మరో తరం వారికి సంక్రమించిన మౌఖిక సంపద అని చెప్పవచ్చు. ఈ కథలకే గ్రామ దేవతల కథలని ప్రాచీన కథలని దైవ కథలు అనే పౌరాణిక కథలు అని వ్యవహారిక నామాలున్నాయి.

గ్రామదేవతల కథలను పరిశోధనాంశంగా తీసుకుని నెల్లూరు జిల్లా వెంకటగిరి పరిసర గ్రామ ప్రాంతాలైన నిడిగల్లు, కామకూరు, జయంపు ప్రాంతాలలో క్షేత్ర పర్యటన చేసిఈ గ్రామదేవతల కథలను చెప్పడమే వృత్తిగా జీవిస్తున్న కథకులను ప్రత్యక్షంగా కలిసి వారినుండి గ్రామదేవతల కథలను వారి వృత్తి వివరాలను జీవన విధానాన్ని సంస్కృతి సాంప్రదాయాలను సేకరించాను. గ్రామ దేవతల కథలు చెప్పేవారు ఆసాదులు, మాల దాసరులు అనే తెగల వారు ఉన్నారు. వీరు వాళ్ల పూర్వీకుల నుండి మౌఖికంగా వచ్చిన వారసత్వ సంపదగా భావిస్తున్నారు. కథను ఏవిధంగా చెబుతారు ఎంతమంది ఉంటారు అనే విషయాలను వివరించడం జరిగింది.

1. తలారి పెంచలయ్య, వయస్సు - 73, కామకూరు గ్రామం, బాలాయపల్లి మండలం, నెల్లూరు జిల్లా
2. దాసరి దేవయ్య వయస్సు -67 నిడిగల్లు గ్రామం, బాలాయపల్లి మండలం, నెల్లూరు జిల్లా.

వీరి నుండి కొన్ని గ్రామ దేవతల కథలను మంత్ర విధులను గూర్చిన సమాచారాన్ని సేకరించాను. నేను సేకరించిన గ్రామ దేవతల కథలు జిల్లా పరిధిలో చాలానే ఉన్నాయి. వాటిలో మూడింటిని గూర్చి విశ్లేషణ చేస్తూ వివరించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.o

1. అంకమ్మ కథ
2. పోలేరమ్మ కథ
3. ముత్యాలమ్మ కథ

గ్రామ దేవతల కథ ప్రదర్శన పండిత పామరులను ఆకట్టుకున్న కళారూపం. కథ చెప్పే కథకుడు మంచి ధారణా శక్తి కలిగిన వాడుగా ఉండి, వినే శ్రోతలను సైతం కంటతడి పెట్టించే నేర్పు కలవాడిగా ఉంటాడు. కథకుడు కథ చెబుతున్నప్పుడు తాను ఆ కథలో లీనమై ఆ కథలో ఉన్న నాయకుడు తానే అనుకుని తనలో తాను హావభావాలను ప్రకటిస్తూ , కథలోని సన్నివేశాలను పాత్రలను శ్రోతల హృదయాలను హత్తుకునేటట్లు అభినయంతో వర్ణిస్తాడు. గ్రామాల్లో జరిగే జాతరలో ఉత్సవాల్లో వీరిని పిలిపించి గౌరవ మర్యాదలతో గ్రామ పెద్దలు గ్రామవాసులు ఆదరించడమే కాకుండా మంచి భోజనం బస ఏర్పాటు చేస్తారు.

గ్రామదేవతల జాతరలో వీరిదే అగ్రతాంబూలం. జాతరలో జంతుబలులు, పూజలు, నైవేద్యాలు వీరే దగ్గరుండి జరిపిస్తారు. గ్రామదేవతల కథలను తొమ్మిది రాత్రులు లేదా మూడు రాత్రులు గాని చెప్పడం జరుగుతుంది. గ్రామదేవతల పుట్టుపూర్వోత్తరాలు యుద్ధాలు రాక్షసులను తుదముట్టించడం, శాంతి యాగాలు ప్రకృతి, జంతువుల సృష్టి, విషయాలకు సంబంధించిన అనేక ఉపకథలన్నీ గ్రామదేవతల కథలల్లో చూడగలము. తొమ్మిది రోజులు చెప్పే కథల్లో అనేక ఉపకథలు వస్తాయి. గ్రామీణ ప్రజానీకం పండిన పంటలతో వారికి జరిగిన శుభ సూచికలకు ప్రతీకగా మరియు వారి గ్రామ దేవత అనుగ్రహంతో సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలకు జాతరలు, ఉత్సవాలు జరిపిస్తారు.

కథ చెప్పే కథకునికి కుడివైపున ఎడమవైపున వంత పాడటానికి ఇద్దరు వ్యక్తులు ఉంటారు. ఒకరు పంబ జోడు వాయిస్తాడు. మరొకరు సుతి చేస్తూ వంట పాట పాడతాడు. కథకుడు రాగయుక్తంగా హావభావాలతో కథలు చెబుతాడు.

అంకమ్మ కథ :

కథ ప్రారంభ గీతం :

గ్రామానికి గ్రామ దేవత అంకాలమ్మ రా॥
నువ్వే దగ్గర దివ్వెల వెలుగు అంకాలమ్మరా॥
నువ్వు లేని దగ్గర చీకటి కోన అంకాలమ్మ రా॥
కోరిన వారి కొమ్మలిద్దరు అంకాలమ్మ రా॥
కొంగున బంగారు ఇస్తే అంకాలమ్మ రా॥
కా వరించిన రాజుల బట్టి అంకాలమ్మ రా॥
కండలు చెండాడిన ఆవుగా అంకాలమ్మ రా॥

పాట పాడి అంకమ్మ కథను కథకుడు వివరిస్తాడు. అంకమ్మ రాక్షస సంహారానికి యుద్ధానికి వెళ్తున్నా ఆ సమయంలో ఏ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని వెళుందో ఆ ఘట్టాన్ని కథకుడు ఇలా వివరిస్తాడు.

అంకమ్మ తల్లి తిప్పరపురాళ్ళ కోటల మీద దుంబినీ అనే రాక్షసుల మీదకు యుద్ధానికి పోవాలి. ఆమెకు తగునైన వాహనం కావాలని తమ్ముడైన పోతురాజును పిలిచింది. తమ్ముడా! నేను కోటల మీదకి యుద్ధానికి పోవాలి. నాకు తగునైన వాహనం కావాలి తమ్ముడా! అని అడుగుతుంది. అప్పుడు పోతురాజు అక్క మాటలు విని కొండ గిరి పర్వతాలకు వెళ్లి లేడి వాహనం తీసుకొని అక్క అంకమ్మ దగ్గరకు తెస్తాడు. తమ్ముడా! ఈ లేడి వాహనం నన్ను మోయలేదురా అంటుంది. హంస వాహనం, నెమలి వాహనం, గరుడ వాహనం తెస్తాడు.

అన్ని వాహనాల వైపు తేరిపార చూస్తుంది. అక్క ఇన్ని వాహనాలు నిన్ను మోయలేని అంటున్నావు. ఇక ఏ వాహనం నిన్ను మోస్తుందని అడుగుతాడు. నాయనా నన్ను మోయాలి అంటే ఈరోజు రాత్రి నా దేవళంలో నిద్ర చేయి, తెల్లవారు ఝామున మూడు గంటలకు లేచి, చేయి తడి వస్త్రాలు విడిచి, పొడి వస్త్రాలు ధరించి, వీరతాడు భుజాన వేసుకుని కొండ గిరి పర్వతాలకు పో అని చెబుతుంది.

తమ్ముడా! ఆ పర్వతాలలో ఉండ్ర, సండ్ర కోరింద, సలవ నిమ్మల కింద పోతు పెంటీ అనే రెండు నక్క బావలు పండ్లు ఫలహారాలు భోంచేసుకుని సలవ నిమ్మల కింద చల్లగా నిద్ర పోతూ ఉంటాయి. నువ్వు పోయి నల్లేరు పొద కింద కూర్చో, పోతు పెంటి నక్క బావలు తెల్లవారుఝామున నాలుగు గంటలకు లేస్తాయి. తూర్పు సముద్రము పోతాయి. అక్కడ స్నాన పానము, సంధ్య జపములు. వైదీర్చుకుని మరలా తిరిగి వాటి వాటి గృహాలకి వెళ్తాయి. ముందుగా వెళ్ళేది పెంటి నక్క. వెనుక వెళ్ళే పోతు నక్కను మడిమిటోకించి కుడి కాలు జవిరి పట్టు ఆ నక్క అక్క, అక్క, అక్క అని మూడు కేకలు అరుస్తుంది. పెంటి నక్క నీ మీదికి వస్తుంది. నీ పై నుండే వీర తాడుతో మూడు దెబ్బలు కొట్టు పెంటి నక్క భర్తను వదిలి వెళ్లిపోతుంది. అప్పుడు చెట్టులో ఉండే నల్లేరు పెరికి పోతు నక్క నోటికి కళ్ళింవెయ్యి. నా దగ్గరకు తీసుకొనిరా నక్క వాహనం మీద కొలువుదీరి తిప్పరపు కోటల మీదకి యుద్ధానికి పోతాను అని చెబుతోంది.

తిప్పరపుకోటలో దుందుభి అనే రాక్షసుడు ఎవరి దగ్గర చావు లేకుండా వరం తెచ్చుకుంటాడు. సాధువులు, సత్పురుషులు, సనకాది మహా మునులు యజ్ఞం చేస్తున్నారు. ఆ యజ్ఞం భంగం చేయడానికి రాక్షసులు పెళ్ళలు పెళ్ళలుగా రక్తమాంసాలను ఆ యజ్ఞంలో వేస్తున్నాయి. సాధువులు, సత్పురుషులు, మహామునులు నన్ను గూర్చి ప్రార్ధన చేస్తున్నారు. వారికి నేను ప్రత్యక్షమై ఆ రాక్షసులను సంహరిస్తానని, వారికి అభయమిచ్చి యజ్ఞాన్ని నిర్విరామంగా జరుపుకోమని చెప్పాను. అని పోతురాజుకి చెప్పి నక్క వాహనం మీద తల్లి యుద్ధానికి బయలుదేరుతుంది. ఆ మహాతల్లి రాక్షసుల మీద యుద్ధం చేస్తుంది. ముక్కు మున్నూరు రాక్షసులను చంపితే నాలిక నన్నూరు రాక్షసులు ఎగబడి వస్తున్నారు. రక్తంగాని భూమి పడితే గోటికి అరు నూరు శంఖమునా పదివేల రాక్షసులు ఎగబడి వస్తున్నాయి. తన కుమారుడు రవ్వదేవి రాజును అడ్డ ఒడిన కట్టుకొని యుద్ధం చేస్తుంది. రాక్షసులు కోపులు కోపులుగా పుట్టుకురావడం చూసి, ఆది పరాశక్తి తన నాలుకను భూమిని పరచి రాక్షసుల రక్తం కింద పడకుండా తల్లి నాలుకతో పట్టి ఆ రాక్షసుల నందరినీ మింగి జీర్ణించుకుంటుంది. వారితో యుద్ధం చేసే రాక్షసులను తుదముట్టించి అలసి నిమ్మల కింద సేద తీరుతుంది. తల్లి కాళ్ల దగ్గర ఉన్న నక్క, తల్లి అని పిలుస్తుంది. అప్పుడు అంకమ్మ తల్లి తనకు యుద్ధంలో వాహనంగా మారి సహాయం చేసిన నక్కకు అభయ మిస్తుంది. నాకు నా బిడ్డలు జరిపే జాతరలోగాని, కొలుపులో గాని నా ముగ్గు గీస్తారు. నా కాళ్ల దగ్గర నీ బొమ్మ గీస్తారు. అంటే మొదటిగా పూజలందుకునేది నీవే కనుక నువ్వు నన్ను గూర్చి సందకాడ, సగం రేతిరి కాడ తెల్లవారుజామున 4 గంటలకు అక్కా, అక్కా, అక్కా, అని నన్ను తెలుచుకో అని చెప్పి, నక్కను విడి పిస్తుంది. ఆ కారణంగా నక్కలు అక్కా, అక్కా, అక్కా, అని అరుస్తాయి. ఈ కథ ద్వారా నక్క చరిత్ర మనకు తెలు స్తుంది.

పోలేరమ్మ కథ :

ఈ కథను దండకముతో ప్రారంభిస్తారు. ఈ కథను తొమ్మిది రాత్రులు చెబుతారు. నేను ఆసాదు మారయ్య కథ అనే ఒక కథను విశ్లేషిస్తున్నాను.

ఓం శ్రీమన్ మహా రేణుక
దుర్జన మహం మాయి
శారదాం చాముండి
అండ పురా పుర శక్తి

అండా అండము నీవు పిండాండము నీవు
ఓం నమో భగవతి
నావల్ల తప్పులుంటే నన్ను మన్నించు
నీ పాదపద్మముల సాక్షి.....

అంటూ దండకం చెబుతారు. ఈ దండకం లోనే పోలేరమ్మ జీవితం పుట్టుపూర్వోత్తరాలు గురించి ఉంటుంది. ఆసాదు మారయ్య పోలేరు తల్లి చెమట వరపుత్రుడు. మారయ్యకు ఏడుగురు భార్యలు ఉన్నారు. వాని ఏడో భార్యకు సంతానం కలిగి పురిటి మంచంలో ఉంది. అమ్మవారు బండ్లను తోలుకొని దాసూరు పట్నం పోతున్నది. కొంత దూరం బండ్లు పోయినాయి. కనక దేవి రాజు పట్నం సమీపాన బండ్లు పోతున్నాయి. ఆ బండ్ల మీద పోతురాజు కొలువుదీరి ఉండాడు. అమ్మ వారు పోలేరు తల్లి ఆ బండ్లకు ముందు చిన్న మాయ వేషం ధరించి, జనప కట్ట వలె కురులు విరబోసుకుని, మూడు ఒంపులు పోయిన ఊతకర్ర కుడి హస్తం పట్టింది. 7 చిల్లులు పోయిన బాండవ ఎడమ హస్తాన పట్టుకున్నది. అడుగు పెడితే అద్దెడు మల్లెలు రాలుతున్నాయి. పాదం ఎత్తి పెడితే పెడు మల్లెలు రాలుతున్నాయి. బండ్లకు ముందు అమ్మ ఊతకర్ర సైగతో పోతుంది. 84 ఘటాల ఏనుగులు బండ్లను తోలుకు పోతున్నాయి. అటు సగం రాత్రి వేళ, ఇటు రాత్రివేళ కలికి, గాంధారి మరిచి నిద్రపోయేటి కాలంలో అమ్మవారి బండ్లు నరబలి, రక్త బలి, త్యాబలి, కుంభ బలి, కోబలి అంటూ బండ్లు నాగ లోకం కృంగి పోతాయి. ఈ విషయాన్ని చెప్పడానికి తమ్ముడు పోతురాజు అక్కా అంటాడు.

ఏమి తమ్ముడా! అంటాది. అక్క మన బండ్లు నరబలి, రక్త బలి అంటూ కృంగి పోతున్నాయని చెప్తాడు. అప్పుడు తల్లి తన దివ్య దృష్టితో ఈ విషయాన్ని గ్రహించి తమ్ముడా! పోతురాజు ఇదిగో నా చెమట వరాన పుట్టిన వర పుత్రుడు ఆసాదు మారయ్య దగ్గరకు పోయి, ఈ విషయం చెప్పి తీసుకురా నాయన అని చెప్పి పంపు తుంది.

పోతురాజు మారయ్యకు సంగతి చెబుతాడు. ఇది విని మారయ్య భార్యలు అక్కడి నుండి వెళ్లిపోతారు. ఇలా వెళ్లిపోయిన భార్యలను గూర్చి కథకుడు చక్కగా చమత్కారంగా వర్ణిస్తాడు.

సరిలో దాగింది చల్ల చిన్నది
మూల కూర్చున్నది మురికి నాటి చిన్నది
అలిగి పోయింది అరవిళ్ళ చిన్నది
దాగి పోయినది దావిళ్ళ చిన్నది
పారిపోయినది పాకనాటి చిన్నది
రెడ్డితో పోయి చెప్పినది రెడ్డి భీమ చిన్నది
వేరే పోయినది ఏకరిళ్ళ చిన్నది.

ఏడో భార్య కడగొట్టు భార్య మగబిడ్డను ప్రసవించి ఉంది. అప్పుడు ఆసాది మారయ్య ప్రసవించి ఉన్న భార్య దగ్గరకు వెళ్లి కన్నీరు పెట్టుకుంటాడు. మహాసాధ్వి అయిన మారయ్య భార్య భర్తను చూసి కారణం అడుగుతుంది. ఏమయ్యా నాథ నీకొచ్చిన కష్టమేనని అడుగగా మారయ్య పోలేరు తల్లి ఆజ్ఞను భార్యతో చెబుతాడు. అప్పుడు పురిటి వస్త్రాలతో ఉన్న తన భార్య పసికందును తీసుకొని ధైర్యం చెప్పి తల్లి దగ్గరకు వెళ్ళదాము పద అంటుంది. మారయ్య భార్య త్యాగబుద్ధికి సంతోషించి తల్లి దగ్గరకు తీసుకుపోతాడు. తల్లీ! అంటాడు. కుమారా! నీ భార్య బిడ్డను నరికి పొలి కూడు కలిపి బండ్ల చుట్టూ చల్లరా అంటూ ఆజ్ఞ చేస్తుంది. తల్లి చెప్పిన విధంగా మనసులో దుఃఖాన్ని దిగమింగి తన భార్య బిడ్డలు రక్తంతో పొలి కూడు కలిపి బండ్ల చుట్టూ తిరిగి చల్లుతాడు. ఈ క్రమంలో మారయ్య కు తోడుగా చాకలి మడియాలని ముందు పంపుతుంది. వీళ్ళిద్దరూ తల్లికి సహాయం చేస్తారు. అప్పుడు తల్లి మారయ్యను నందల కోనేరులో స్నానం చేసి రమ్మని చెబుతుంది. మారయ్య స్నానం చేసి వస్తుండగా తన భార్య కుమారుడు బతికి తనకు ఎదురు వస్తారు. మారయ్య తల్లి కాళ్ళమీద పడి ఏడుస్తాడు. కుమారా! నీ త్యాగానికి, నీ భార్య త్యాగానికి మీరు ఎన్నటికీ నా వర

పుత్రులుగా చరిత్ర చెబుతుంది. మీతోనే నా జాతర వేడుకలు జరుగుతాయని అభయమిస్తుంది.

అలాగే చాకలి మడియాలకు కూడా నీవు చేసే వృత్తిలో నన్ను తలుచుకుంటూ, అంటే బట్టలు ఉతికేటప్పుడు చాకలి ఉస్సాం, ఉస్సాం, ఉస్సాం అంటూ నన్ను తలుచుకో అని చాకలికి అభయమిచ్చి ఆదిపరాశక్తి రూపం ధరించి నవ వీర కొణతం, బండి వీర కొడవలి, జాతరకత్తి చేత ధరించి ఆదిపరాశక్తి రూపాన వీరికి దర్శనమిచ్చి యుద్ధభూమికి బండ్లను తోలుకొని బయలుదేరుతుంది తల్లి.

ముత్యాలమ్మ కథ :

ఆది పరాశక్తి అవతారాల్లో మరో అవతారం ముత్యాలమ్మ. ఈమెకు కూడా తమ్ముడు పోతురాజు. కనుపూరు గ్రామదేవతగా వెలసింది.ఆ ఊరి చెరువు ప్రతి ఏటా వరదలు వచ్చి, చెరువు తెగిపోవటం, గ్రామాన్ని ముంచడం గ్రామంలో ప్రాణనష్టం అస్తి నష్టం జరగడం జరుగుతుంది. ఆ గ్రామ ప్రజలు ముత్యాలమ్మ ను వేడుకోగా తల్లి చెరువుకట్టకు శిలా విగ్రహ రూపంలో అడ్డుగా నిలిచి, వరద నుంచి ఆ గ్రామ ప్రజలను కాపాడుతుంది. ఇక్కడే ఆమెకు గుడి కట్టించి గ్రామవాసులు ఆమెకు పూజలు జాతరలు జరిపిస్తూ భక్తిశ్రద్ధలతో ఆమెను కొలిచేవారు. పిలిచిన వారికి పలికి కొంగు బంగారం చేసేది. ఆ గ్రామ వాసులకు వివాహాది శుభకార్యాలకు తల్లి అనుగ్రహంతో ఆమె నగలను తీసుకునేవారు.

ఈ సంగతి గమనించిన కొందరు దుండగులు తల్లిని పిలిచి నగలు ఇమ్మని కోరి దొంగిలించగా వారు శిలా విగ్రహాలుగా మారారని కథ కూడా ఉంది.

గ్రామ దేవతల కథలు ప్రదర్శిస్తూ పూర్వకాలంలో రాజాదరణ పొంది, బంగారు కంకణాలను పట్టు వస్త్రాలను, మాగాణి, మాన్యాలను, గోవులను బహుమతులుగా పొంది, గౌరవ మర్యాదలతో జీవనం సాగించిన ఈ కథకుల జీవితాలు నేడు దుర్భర స్థితిలో ఉన్నాయి. నేటి తరంవారు ఈ వృత్తికి స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయ వృత్తులను ఎంచుకున్నారు. అన్ని వృత్తులకు తల్లి వ్యవసాయం అటువంటి వ్యవసాయమే కనుమరుగైపోతుంది. వాణిజ్య పంటల మోజులో పడి వ్యవసాయాన్ని మర్చిపోతున్నారు. ఒక ప్రక్క నగరీకరణ మరో ప్రక్క మీడియా ప్రభావం ప్రజలను ఆకర్షితులను చేయడమే కాకుండా పాశ్చాత్య దేశాల సంస్కృతి మోజులో పడి మన పండుగలు, జాతరలు, వేడుకలు మరిచిపోతూ మన సంస్కృతి సంప్రదాయాలకు దూరం అవుతున్నారు. ఈ నేపథ్యంలో జానపద కళాకారులకు జీవనభృతి కొరవడుతుంది. వీరు ప్రజాదరణ కోల్పోయి తినుటకు తిండి లేని పరిస్థితులు నెలకొన్నాయి. వీటన్నింటికీ కారణం ప్రపంచీకరణ ప్రభావమని చెప్పవచ్చు.

జానపద కళాకారులను ప్రభుత్వం గుర్తించి వారికి ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసి వారికి జీవన భృతి కల్పించి జానపద సాహిత్యాన్ని కాపాడుకోవాలి. జానపద సాహిత్యం అనేది ఒక రత్నాల గని వంటిది. దానిని తవ్వి తీసే కొద్దీ విలువైన వజ్రాలు బయట పడతాయి. ఈ విలువైన జానపద సంపదను కాపాడుకు నే బాధ్యత మన అందరి మీద ఉంది. అంతేకాదు భావితరాలకు జానపద సాహిత్య సంపదను అందించేవారిమి కాగలము.

ఆధారిత గ్రంథాలు :

1. తెలుగు జానపద సాహిత్యం - పురా గాథలు - డాక్టర్ రావి ప్రేమలత
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డాక్టర్ ఆర్వీయస్ సుందరం
3. తెలుగు వీరగాథా కవిత్వము - ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు
4. తిరుపతి గంగజాతర - ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి

❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద పండుగలు

- ముక్కాబిక్షపాగర్, పరిశోధక విద్యార్థి, జానపద కళల విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

జానపదం :

జానపదలు అంటే జనం అనియు లేదా పల్లెటూరు. దేశం జనులు నివసించే ప్రదేశం అనే అర్థాలున్నాయి. కాని జానపద విజ్ఞానంతో జానపదం అన్న పదాన్ని ఆంగ్లభాషలో Folk (ఫోక్) అన్నపదానికి సమాన అర్థం ఇచ్చే పదంగా వాడటం జరుగుతుంది. ఇంగ్లీష్ Folk (ఫోక్) అన్నమాటకు అనేకులు అనేక విధాలుగా అర్థాలు చెప్పుకుంటూ వచ్చారు. కొందరు గ్రామీణ సమాజానికి గ్రామాలకు దీనిని పర్యాపదంగా భావించారు. మరి కొందరూ వ్యవసాయ వృత్తిలో నిమగ్నలైనవారికి ఈపేరు చెందుతుందని భావించారు. మరికొందరు అనాగరికులైన జనసముదాయాన్ని Folk అనే పేరుతో పిలవాలని భావించారు. సంస్కృతిని అది ప్రవర్తిల్లిన కాలాన్నిబట్టి ప్రాంతాన్ని బట్టి 1.ఆటవిక, 2.జానపద, 3.నాగరిక సంస్కృతులుగా విభజించడం వీలుంది. తరతరాలుగా సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న జనసముదాయానికి పర్యాయపదంగా ఉపయోగించాలని ఈ వివర్ణ స్పష్టం చేస్తుంది.

పండుగలు :

తెలుగునాట పండుగలు పబ్బాలు, నోములు, వ్రతాలు, ఉత్సవాలు, ఊరేగింపులు జాతరలు కొలుపులు తరతరాలుగా సమాజంలోని వివిధ వర్గాలమధ్య వ్యక్తుల్ని ఒక్కచోట చేరుస్తున్నాయి. ఎక్కువమంది పాల్గొనకపోతే పండుగలకు గాని ఉత్సవాలకు గాని ఇలాంటి మరే సాంఘికాచారాలకు గాని కళాకాంతులు రావు. జన సమూహంలో నిలిచి ఉన్న నమ్మకాలు సంప్రదాయాలు క్రియా రూపాన్ని దాల్చగా పండుగలు ఏర్పడ్డాయి. మొదట ప్రకృతి ఆరాధనగా ప్రారంభమై వ్యవసాయ సంస్కృత కాలంలో స్పష్టరూపాన్ని పొంది తర్వాతి కాలంలో ఇంకా క్లిష్టస్వరూపం సంపాదించి చివర ప్రాచీన ఆచారాలు సూర్యగుణాన్ని మాత్రం కలిగి ఉత్సాహాన్ని, ఉల్లసానిన కలిగించేవిధంగా పండుగలు రూపొందాయి. సాంఘిక సంక్షేమం కోసం విశేష సందర్భంలో జానపద విశేషాలు సంప్రదాయాల కలబోతగా ఆచరించే సంక్లిష్టమైన అంశమే పండుగగా చెప్పవచ్చు.

ప్రకృతికి సంబంధించిన పండుగలు, వ్యవసాయానికి సంబంధించిన పండుగల చాలా ప్రాచీనమైనవిగా చెప్ప వచ్చు. చాలావరకు పండుగలకు మూలం ప్రాచీన కాలపు కర్మకాండలనడంలో సందేహం లేదు. ముస్లింల పండుగలో రంజాన్, బక్రీద్, మొహర్రం (పీర్లపండుగ) మిలాద్ఇన్‌నభి, ఈదూల్‌ఫిత్రా, రబీ ఉల్ అవ్వల్ మొదలగునవిగాను, క్రిష్టియన్ పండుగలలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ డే, క్రీస్టియన్ డే మొదలుగునవిగాను అదేవిధంగా బౌద్ధులలోగురుపూర్ణిమ, బుద్ధజయంతి, షిక్కులలో గురునానక్ జయంతి, గురు అర్జున్‌సింగ్ సంస్కరణ దినోత్సవాలు, వైశాభిపండుగ, మాఘీ పండుగలు ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చును.

బోనాలు :

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో అతి ముఖ్యమైన పండుగ బోనాలు. దీనినే "లష్కర్‌బోనాలు" అని లేక "మహంకాళిబోనాలు" అని పిలుస్తారు. వివిధ రూపాలలో ఉన్న 'ఆదిశక్తి' పేర్లతో పిలుస్తూ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగనే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపండుగగా గుర్తించింది. బోనాలపండుగ అమ్మవాని (శక్తి) పూజించే హిందువుల పండుగ. ఈ పండుగ ప్రధానంగా హైదరాబాదు, సికింద్రా బాద్ జంటనగరాలలోను, తెలంగాణలోను జరుపు

కుంటారు. ఈ పండుగను రాయలసీమ కొన్ని ప్రాంతాలలో జరుపుకోబడుతుంది. బోనాల పండుగ సాధారణంగా జూలై లేక ఆగస్టు లో వచ్చు ఆషాడ మాసంలో ఈ పండుగ ప్రారంభం అవుతుంది. ఈ పండుగ మొదట గోల్కొండ లోని "జగధాంబిక" ఆలయంలో ప్రారంభమై తరువాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి ఆలయంలో బోనాల పండుగను నిర్వహిస్తారు. ఆ తరువాత చివరగా లాల్ దర్వాజా సింహవాహిని ఆలయంలో ఇతర చోట్ల నిర్వహిస్తారు. పూర్వకాలంలో ఈ పండుగ రోజున దుష్టశక్తులు పారద్రోలటానికి ఆలయ ప్రాంగణంలో ఒక దున్నపోతును "బలి" ఇచ్చేవారు. నేడు దున్నపోతుకు బదులుగ కోడి పుంజులను, మేక, గొర్రెపోతులను బలి ఇవ్వటం జరుగుతుంది. ఈ పండుగల రోజున స్త్రీ పురుషుల, పిల్లలు అందరూ చాలా పరిశుభ్రంగా ఉంటూ అమ్మవారికి బోనం సమర్పించుకోవటం జరుగుతుంది. స్త్రీలు పట్టుచీరలు నగలు ధరిస్తారు. కొందరు స్త్రీలు తలపై బోనంను ఎత్తుకుని పూనకాలు (సీగాలు) ఊగుతారు. వేప కొమ్మలతో, పసుపులతో బొట్టు, పెట్టుకుంటు భక్తుల యొక్క కోరికలను తీర్చుతుంటారు. పూనకం వచ్చిన స్త్రీలను "అమ్మవారిగా" మొక్కుతారు. బోనాలను డప్పు చప్పుల్లతోను భక్తజనసమూహంతోను చాలా ఆడంభరంగా జరుపుతారు. అమ్మవారి ప్రతిమను రథంపైన పెట్టి రథాన్ని లాగడానికి రెండు కొమ్ములు తిరిగిన గొర్రెపోతులను కట్టి ఊరేగిస్తారు. ఊరేగింపులో తొట్టెలను మరియు ప్రసాదం బండిని కూడా ప్రదర్శనలలో కనబడుతుంది.

బోనాల ఊరేగింపులో అత్యంత ప్రధానమైనది పోతరాజు. దేవి అమ్మవారి సోదరుడైన పోతురాజును మనిషి చేత ప్రతిబింబిస్తారు. ఇతను చాలా బలిష్టంగా ఉండి గంభీరత్వాన్ని కలిగి ఉంటాడు. ఇతనిచేత పండుగ సమూహాన్ని నడిపించడం అనవాయితి. ఇతను (పోతురాజు) ఒంటిపైన పసుపు కుంకుమలతో అలంకరించుకుంటాడు. వెంట్రుకలను ఈరపోసుకుని కాళ్ళకు గజ్జెలను నడుమొకు గజ్జెలను కట్టుకుంటాడు. చేతిలో ఇరగోల లేదా చెర్నకోల (జనుముతో తయారుచేసిన తాడులాంటిది) పట్టుకుని డప్పుల వాయిద్యానికి అనుగుణంగా ఆడుతూ సందడి చేస్తూ అందర్ని కొడుతూ మీసాల దువ్వుతూ భయ భ్రాంతులకు గురిచేస్తాడు. కొన్ని ప్రాంతాలలో ఇతను దేవాలయం ముందు అమ్మవారికి గొర్రెలను గావు పట్టడం కూడా చేస్తారు. ఇలా చేయడం ద్వారా అమ్మవారు శాంతిస్తుందని వారి నమ్మకం. పోతరాజు వేషం వేసేవారు గ్రామాలలోను బైండ్లవారని, భవానీలు అని వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. వీరు అమ్మవారికి కొలుపు చేసేటపుడు చేతిలో ఈరగోల పట్టుకొని పసుపు చేతిలో వేపాకును, నిమ్మకాయలను చేతిలో పెట్టుకొని మంత్రస్త అమ్మవారి పూనకం వచ్చేవారిపై చల్లుతారు. వీరు మంత్రించే విధానంతో ఒక్కసారిగా వారిపై అమ్మవారు ఆవహిస్తుంది. పాటలు కూడ పాడుతారు.

"అమ్మరావే దేవిరావే
దేవిరావే మహంకాళిరావే
రావేరావే పెద్దమ్మరావే ॥అమ్మమ॥

పచ్చాని కొమ్మలతో పందిర్లు వేసినాము
మామిడాకులు దెచ్చి తోరణాలు కట్టినాము
పసుపు కుంకుమ దెచ్చి నీ పట్టు పరినెరినాము తల్లీ
... ॥అమ్మ॥

గటపు కుండలదెచ్చి
గావు పిల్లలు పట్టి
గండదీపాలు పెట్టి గడిలోన పెట్టేము
॥అమ్మ॥

మమ్ములను కాపాడే మహంకాళి రావమ్మ
భక్తులను కాపాడే బంగారు తల్లివమ్మ
॥అమ్మ॥

అంటూ పోతరాజులు, బైండ్లు పాటలు కీర్తిస్తూ పాడుతారు. ఈ బోనాల పండుగ మొదట రోజులలోను, చివరిరోజులలో ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండుగ ముగిస్తారు.

మొహర్రం – పీర్లపండుగ :

మహమ్మదీయులు ప్రధాన పర్వదినాలలో మొహర్రం ముఖ్యమైంది. మొహర్రం అనగా శోకం. అరబ్బీ హిజరీ శకం ప్రారంభంనుండి మొహర్రం పండుగ మొహర్రం నెలపేరుగా వాడుకలోనికి వచ్చింది. ఆనాటి ర్బబలా యుద్ధంలో మరణించిన వారి స్మృతి చిహ్నంగా దు:ఖసాగరంలో మునిగి ఉండే కార్యక్రమమే మొహర్రం. వాడుకలో పంజా-కా-ఈద్, ఆషురా పీర్లపండుగలుగా పిలుస్తారు.

మొహర్రం ఉత్సవంలో షియాలు సంప్రదాయం బద్ధంగా దీక్షతో చేస్తుంటారు. మొదటి పద్ధతిలో మొహర్రం ఆలమ్‌లను కొలువదీర్చడడం అతిముఖ్యమైన భాగం. వీటినే 'పీర్' అని 'పంజా' అని పిలుస్తారు. ప్రతి ఆలమ్ కొన్ని ప్రత్యేక భాగాలను కలిగి ఉంటుంది. ప్రవక్త అల్లుడు 'అలీ' పేరున్న పేరు అరచేయి ఆకారంలో ఉంటుంది. ఈ ఆలమ్‌లను బంగారం, వెండి, రాగి, ఇత్తడి మొదలైన లోహాలతో తయారుచేస్తారు. మొహర్రం నెల మొదటి రోజునుండి కార్యక్రమాలు మొదలవుతాయి. ఈ నెలలో చంద్రుని చూసిన తర్వాతనే ఆలమ్‌లు గల పీర్లపెట్టెను అర్చకుడు (అలీమ్) ఇంటి దగ్గర్నుండి లేదా ఊరిలో ఉండే పీరీల కొట్టం (మసీద్) లనుండి తీసి శుభ్రపరిచి పీర్లచావడితో ప్రతిష్ఠిస్తారు. ఈ రోజుల్లో షియాలు నల్లని దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేస్తారు. మాంసహారం ముట్టరు. పీర్లచావిడిలో పేర్లతో పాటుగా, దట్టి(వస్త్రాలు), ఊద్‌దాన్ అలవా(గుండం) లను ఉంచుతారు.

దట్టి :

పీర్లకు క్రిందిభాగాన వ్రేలాడదీసిన దీర్ఘచతుస్రాకార వస్త్రం ఈ వస్త్రం ఆకుపచ్చగ గాని, ఎరుపు, పసుపు రంగులలో ఉండి దీనిపైన ఖురాన్‌లోని వాక్యాలను ఈ దట్టిపై అల్లిక చేస్తారు.

ఊడదాన్ :

లోహంతోగాని, కుమ్మరి మట్టితోగాని తయారయిన ప్రత్యేకమైన పాత్ర. ఇందులో నిప్పులపై సాంబ్రాణీవేసి పీర్లకు పొగవేస్తారు. మిగిలిన బూడిదను హిందువులు విభూతిలా తలచి తిలకధారణ చేస్తారు. చిన్నపిల్లలకు చెడుగాలులు, భూతాలు, దయ్యాలు కీడు జరగకుండా మంత్రించి ఈ బూడిదను బొట్టుగా పెట్టి నోటిలోకి ఔషదంగా ఇస్తుంటారు.

అలవా(అగ్నిగుండం) :

పీర్లచావిడికి ఎదురుగా అలవా త్రవ్వుతారు. మొహర్రం రోజుల్లో ఇందులో నిప్పును రాజేసి, పీర్లను ఎత్తుకున్నవారు నిప్పుకణికలపై నడుస్తారు. ఈ గుండంచుట్టూ అందరు కలిసి లయబద్ధంగా నృత్యంచేస్తూ పాటలు పాడుతారు.

తెలంగాణ ప్రాంంలో హిందుముస్లింలు మత సామ రస్యంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. పాటలు పాడుతారు.

ఉదా :

1. ఓ .. ఓ .. జంబియా ఒలంపల్లి జంబియా
   నాతోటి మాట్లాడు నాంపల్లి జంబియా
   ఏమేమికావలె స్వామికి పెద్దగుట్ట మౌలాలిక్
   ఊదులుగావలె స్వామికి, దట్టిలుగావలె స్వామికి
   ॥ఓ ఓ జాంబియా॥

2. ఓ .. ఓ.. కసిమయ్యా, పోతవయ్య కసిమయ్యా
   దట్టీలన్న మాయలేదు పోతడేమో కసిమయ్య
   ॥2॥

   షరబత్ అన్న ఒడువలేదు పోతడేమో
   కసిమయ్య
   ॥ఓ ఓ కసిమయా॥

   నాడలన్న మాయలేదు పోతడేమో కసిమయ్య
   పువ్వాలన్న మాయలేదు పోతడేమో కసిమయ్య
   ఊదులన్న గాలలేదు పోతడేమో కసిమయ్య
   పువ్వులన్న మాయలేదు, ఊదులన్నగాలలేదు
   ॥2॥

పైన పేర్కొన్న పాటలలో హసిమయ్య అనే వీరుని పేరుతో తలుస్తూ పాటలు పాడతారు. అంటే హసిమయ్య అంటే వీరునికి ఇష్టమైన (పీర్లకు) ఊదులు, దట్టీలు, నాడలు మొదలగువని ఇంకా మాయలేదు అంటే

మైలపడలేదు. బాగానే ఉన్నాయి కాని పోతడేమో అంటే పీర్లను చెరువులకు తీసుకుపోతరేమో అని అంటే పండుగ అయిపోతుందని. దేవుడు వెళ్ళిపోతాడు అనే భావంతో పాటలు పాడుతారు. పండుగ అయిపోతుందని పై పాట యొక్క సారాంశం.

బతుకమ్మ పండుగ :

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబం బతుకమ్మ పండుగ. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల పండుగ. రంగరంగులతో కూడిన తీరొక్క పువ్వులతో బొడ్డెమ్మలాగ బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజించి తొమ్మిది రోజులు జరుపుకునే పర్వం.

భాద్రపదం అమావాస్య లేదా పెత్రమావాస లేదా పెద్ద అమాసరోజు నుండి ఆశ్వయుజ అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పూజలు కొనసాగుతాయి. చివరిరోజు (9వ రోజు) ఆశ్వయుజ అష్టమినాడు ఉపవాసం పాటిస్తూ స్నానాధికాలు ముగించుకుని, తొలుత చిన్నబతుకుమ్మను పేర్చుతారు. గౌరవమ్మను నిల్పుకొంటారు. ఈ పండుగలో ప్రధానంగా గుమ్మడి ఆకులు, గునుగు పువ్వులు, తంగేడు ఉవ్వులు, బీరపువ్వులు మొదలైన రకరకాల పువ్వులను వాడుతారు. బతుకమ్మలను తయారుచేయడం ఎంతో కళాత్మకంగా ఉంటుంది. స్త్రీల అందరూ నీనాబేధం, కులం, మతం, పెద్ద, చిన్న ధనిక, పేద మొదలైన వర్గ బేధాలు లేకుండా మహిళలందరు కలిసి ఏక కుటుంబం వ్యక్తుల్లాగా అరమరికలు లేకుండా ఒక చోట చేరుతారు. ఆనందంగా ఆడుతూ పాడుతూ ముచ్చట్లతో కాలక్షేపం చేస్తారు. ఒకరి కష్టసుఖాలలో మరొకరు పాలుపంచుకుంటారు. బంధుత్వాలు కలుపుకుంటారు. స్నేహితులతో కలిసి బాల్య స్మృతులను నెమరువేసుకుంటారు. నగలు, నాణ్యాలు పెట్టుకొని తమ తాహతును ప్రదర్శించుకుంటారు. పెద్దపెద్ద కుటుంబాలలో ఆడవారికి వర్తించే కుటుంబ నియమావళికి కూడా ఈ పండుగ నాడు ఆటవిడుపు. ఇక మిగిలిన ఆడవారికి ఈ పండుగలో ఆటవిడుపు ఉంటుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమేలేదు. అత్తింటి ఆరళ్లు, పుట్టింటి గొప్పలు పరస్పరం చెప్పుకోవడానికి ఇది ఒక చక్కని అవకాశం. ఘోషాలు, పరదాలు వదిలి సిగ్గును పక్కకు పెట్టి, కొత్త కోడండ్లు ఊరివారికి పరిచయమౌతారు. తమ తమ ఇంటిలో పేర్చుకున్న బతుకమ్మలను ఊరిలోని గ్రామచావిడి వద్దగాని లేదా వారియొక్క వీధిలోని చౌరస్థలలో గాని పెట్టి ఆటలు ఆడుతారు. అందరుచేరి వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడుతారు. బతుకమ్మలను మధ్యలో పెట్టి చప్పట్లు కొడుతు ఆడుతారు. ఇందులో కొన్నికొన్ని గుంపులగా చేరి కూడా ఆడుతారు. ఒకరు పాట పాడుతుంటే అందరు కల్సి వెనుకాల వంత పాడుతారు. ఈ పాటలలో ముఖ్యంగా "గౌరీదేవికి" సంబంధించిన పాటలే పాడుతారు. ఎందుకంటే బతుకమ్మ అనగా పార్వతీదేవిగా, లక్ష్మీదేవి ప్రతిరూపంగా భావించి పాటలు పాడుతారు.

"రామరామ ఉయ్యాలో
రామనే శ్రీరామ ఉయ్యాలో
రామరామానందీ ఉయ్యాలో
రాగమెత్తరాదు ఉయ్యాలో
అ రామ ఒ రామ ఉయ్యాలో
అయోధ్యపతి రామ ఉయ్యాలో

అంటూ పాటలు రాగయుక్తంగా పాడుకుంటూ ఆడతారు.

ఇలా పాటలు పాడుకుంటూ సాయంత్రం వరకు ఆడుతారు. అక్కడినుండి ఊరు బతుకమ్మలు చేరే చోటికి దేవాలయం వద్దకుగానీ, చెరువు ఒడ్డుకు గానీ లేదా వాగు ఒడ్డుకు గానీ వెళ్తారు. అక్కడ ఓపిక ఉన్నంతసేపు ఆడ్తారు. ఆ తర్వాత బతుకమ్మలను నీటిలోకి తీసుకెళ్లి పాటలు పాడుతూ వదిలేస్తారు. గౌరవమ్మను ఓలలాడిస్తారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటారు. వరస్పరం గౌరవించుకుంటారు. వారి వెంబడి తీసుకెళ్ళి సద్దులను ఆహార పదార్థాలను పులిహోర లేదా మలిధ, పెరుగన్న ఇతర తీయ్యటి ఆహారపదార్థాలు తింటారు. తిరిగి ఇళ్ళకు పాటలు పాడుతూ వస్తారు. ఇలా కలిసి మెలిసి మత, వర్గ బేధం లేకుండా పండుగలో ఆనందాన్ని పొందుతారు.

హోళీపండుగ :

హోళీపండుగ యావత్‌భారత ఖ్యాతిని ఆర్జించిన పండుగల్లో హోళి పండుగ ఒకటి. ఆంధ్రతెలంగాణ దేశంలో ఈనాడు కొన్నిప్రాంతాల్లో మాత్రం హోలి ఆచరించడం జరుగుతుంది. అయితే ఒకప్పుడు చాలా వైభవంగా జరిగేదనడానికి అల్లోనేరెళ్ళు, కాముని పాటలు, జాజిర పాటలు మొదలయినవి తెలుపుతున్నాయి. ఈ పండుగ పాల్గుణ శుద్ధ పౌర్ణమికి కాముని పున్నమి అని పేరుతో జరుపుతారు. తెలంగాణ ప్రాంతంలో పండుగకు వారంరోజుల ముందునుండి చిన్నపిల్లల, బాలురు, బాలికలు హోళి ఆటలు ఆడతారు. బాలురూ రెండు కాలలను తయారుచేసుకుంటారు. ఇవి మూరెడు పొడుగుంటాయి. వీటిని తుమ్మ, వెదురు, రాలే చెట్ల నుండి కర్రలను తయారుచేసుకుంటారు. సాయంత్రం వేళలో ఒక జట్టుగ చేరతారు. ఒక్కొక్క జట్టు (Group) లో 10 నుండి 12 మంది ఉంటారు. జట్టులో ఒకరు లీడరుగా ఉంటాడు. ఈ జట్టు ఇతనిపై నడుస్తుంది. జట్టు నాయకుడు పాటలు పాడుతారు. వీరు పాడే పాటలలో జానపద జాజిరి పాటలు, హాస్యపు పాటలు, కాముని పాటలు వంటి అనేక రకాల పాటలుపాడుతారు. పాడుకుంటూ ఊరిలో ఉండే అన్నివీధుల్లో బిక్షాటన చేస్తారు. కొందరు భిక్షంగా ధాన్యాలను, పైసలను వేస్తారు. వేయకపోతే అక్కడ మోటపాటలు అంటే వారిని తిడుతూ పాడుతారు.

"రింగు రింగుబిళ్ళ రూపాయి దండ
దండకాదుర దామెర మొగ్గ
మొగ్గ కాదుర మోతుకునీడ
నీడ కాదుర నిమ్మలబావి
బావి కాదుర బచ్చలికూర
కూరగాదుర పాసరమీసం
మీసం కాదుర మిరియాల పొడి
పొడి కాదుర పోతురాజు"

కొన్ని హాస్యపు పాటలు కూడా పాడుతుంటారు.

అంటు అనేక రకాలుగా పారుతారు. చివరిరోజు అనగా కామదహనం రోజు రాత్రి ఊరంత భిక్షాటన చేసిన తరువాత వారు వాడిన కర్రలను కామున్ని కాల్చె ప్రదేశంలో వేస్తారు. ఈ కర్రలతో పాటుగ కొందరు పిడకలను కూడా వేస్తారు. ఈ కర్రలతో పిడకలను కుప్పగపోసి మధ్యలో కామున్ని బొమ్మను పెట్టి కాల్చీవేస్తారు. కొందరు ఇంటిలో ఉన్న ఇరిగిపోయిన కూర్చీలు కట్టెలను కూడా వేస్తారు. పాటలు పాడుతుంటారు. తెల్లవారిరోజున హోళి జరుపు కుంటారు.

ముగింపు :

మానవులు పుట్టిన అనాది కాలంనుండి అతను శ్రమశక్తిని నమ్ముకుని తనకు అలసట గూర్చి బాధలను మరిచిపోవడానికి పండుగలను పబ్బాలను జరుపుకునే వారు. కాలానుగుణంగా ఆనందంకోసం తన జీవితంలో అనాధిగా క్రమంగా కొనసాగుతూ వచ్చాయి. క్రమంగా కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మానవుడు కూడా విలాసజీవితానికి అలవాటు పడ్డాడు. ఇలా తను అలవర్చుకున్న అలవాట్లను నాటి జీవనాన్ని సంస్కృతి పూర్తిగా మరిచిపోవడం జరుగుతుంది. ఇలా జరగడం వల్ల కళలు, సంప్రదాయాలు కనుమరుగై పోతు న్నాయి. నేటికాలంలో రానున్న తరాలకు పండుగ అంటే ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు దొరక్కపోవచ్చు. కాబట్టి ప్రతిఒక్కరు సంస్కృతి సంప్రదాయాలను కాపాడు కోవడానికి కృషిచేయాలి.

ఆధారగ్రంథాలు :

1. జానపద కళారూపాలు - ఆచార్య బిరుదురాజు రామరాజు
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా.ఆర్వియస్ సుందరం
3. తెలుగువారి జానపద కళారూపాలు - డా.మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
4. స్త్రీల పాటలు - ఆచార్య నాయని కృష్ణకుమారి

❖

భావకవుల భావాలలో జానపద సంస్కృతి – ఆంధ్రప్రశస్తి

– పత్తిపాటి భువనేశ్వరి, పరిశోధక విద్యార్థిని, కృష్ణా విశ్వవిద్యాలయం.

జానపదం అంటే గ్రామీణ ప్రాంతం అని అర్థం. అమర కోశం, వ్యాసభారతంలో దీని ప్రస్తావన ఉంది. ప్రముఖ నిఘంటువులలో జానపదానికి అర్థం ఈవిధంగా వివరించటం జరిగింది. శబ్దరత్నాకరంలో జానపదం అంటే దేశం, గ్రామం, గ్రామ సమూహమని, జానపదుడు అంటే మనుష్యుడు అని అర్థముంది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో జానపదం అంటే పల్లె, గ్రామం, జనులుండేతావు అనీ, జానపదుడు అంటే జనకు, మనుష్యుడు, పల్లెల్లో ఉండేవారు అని అర్థాలు ఉన్నాయి. జానపదులంటే పురజనులని ఎఱన అన్నాడు .జానపదంపై విస్తృతమైన పరిశోధనలు చేసి ఆచార్య బిరుదురాజు రామరాజుగారు తమ సిద్ధాంత వ్యాస గ్రంథాలలో జానపదం అంటే పల్లెటూరని, జానపద ముందుండువారు జానపదులని పేర్కొన్నారు. ఒకప్పుడు జానపదమంటే కేవలం పల్లెటూరని అర్థముంది. కాని తరువాత బ్రతుకుదెరువు కోసం పల్లెటూరు నుండి నగరానికి ప్రజలు వెళ్ళటంవల్ల వీరి వాఙ్మయం, విజ్ఞానం నగరవాసులతో వినిమయం చెంది జానపదం యొక్క అర్థానికి విస్తృతరూపం ఏర్పడింది. ఇలా ఆధునిక దృక్పథంతో చూస్తే గ్రామీణులు, గిరిజనులు, నగరవాసులు అందరూ 'జానపదులు' అనే పరిధిలోకి వస్తారు.

జానపద సాహిత్యం ఎప్పుడు, ఎక్కడ, ఎలా పుట్టిందో చెప్పటం కష్టం. జానపద సాహిత్యం చాలా ప్రాచీనమైనది. జానపద సాహిత్యాన్ని తెలుగు కవులు రకరకాలుగా నిర్వచించారు. జానపద సాహిత్యాన్ని శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు, దేశీసారసత్వమని పేర్కొనగా,ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ప్రజావాఙ్మయం అని, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మధుర గీతాలని, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు అనాదృత వాఙ్మయంగా నిర్వచించారు.

జానపద సాహిత్యంలో గేయం, కథ, సామెత, దేనిని తరచి చూచినా సంస్కృతి లోతులు గోచరిస్తాయి. జానపద సాహిత్యం అధ్యయనం చేయటంవల్ల ప్రజల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతి తెలుస్తుంది. సామాజిక చరిత్ర అవగతమవుతుంది. సంస్కృతికి సంబంధించిన అంశాలు కాలగర్భంలో కలసి పోకుండా జానపద సాహిత్యం కాపాడుతుంది. జానపద సాహిత్యం జనజీవనంలో ప్రధానభాగమై ప్రజల లోక జ్ఞానానికి, మనోవికాసానికి, ఉల్లాసానికి తోడ్పడుతుంది.

ఆంధ్రుల నిజమైన సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే జానపద విజ్ఞానమే ఎక్కువగా ఉపయోగపడుతుంది. జానపద విజ్ఞానంలో జానపద సంస్కృతి ఒక భాగం. జానపద సంస్కృతి అనేక అంశాల సమాహారం. జానపదుల పుట్టుక నుండి మరణం వరకు మధ్యలో నడిచే అనేక విషయాలు జానపద సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ఆచార వవహారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, వివాహాలు, వేడుకలు, ఆటలు, పాటలు, ఉత్సవాలు, వ్రతాలు, నోములు, జాతరలు, పండగలు, కళలు, భాష మొదలైనవన్ని జానపద సంస్కృతిలో భాగమే. ఇంకా వివరంగా చెప్పాలంటే మానవుని జీవన విధానాన్ని ప్రతిబంబించేదే జానపద సంస్కృతి.

ఇటువంటి జానపద సాహిత్యాన్ని జానపద సంస్కృతిని భావకవులు తమ భావాలలో ఎలా వెలువరించారో తెలియజేయటమే నా పత్ర సమర్పణ యొక్క ప్రధాన ఉద్దేశం.

"సౌరభములేల చిమ్ము పుష్ప ప్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పాఱు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?".

అన్నారు. ప్రముఖ భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు.

ఆధునిక తెలుగు కవితా ధోరణుల్లో భావ కవిత్వం ఒకటి. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో మొదటిసారిగా తెలుగు సాహిత్యంలో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగు బాటుగా వచ్చిన కవిత్వం భావకవిత్వం. తెలుగుదేశంలో భావకవిత్వ ఉద్యమం మూడు దశాబ్దాలు (1910-1940) కొనసాగింది. భావకవిత్వంపై ఆంగ్ల 'రొమాంటిక్ పొయట్రి' ప్రభావం ఉంది. భావకవిత్వాన్ని "కాల్పనిక కవిత్వం" అని కూడ అంటారు.

తెలుగు సాహిత్యంలో "భావకవిత్వం" అనే పదాన్ని మొదటిసారిగా గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు వాడారు. తర్వాత కవులందరూ ఆయనని అనుసరించారు. రాయ ప్రోలు సుబ్బారావుగారి కావ్యాల్లో "భావపదం", "భావ గీతం" మొదటిసారిగా కనిపిస్తాయి. విశ్వనాథ సత్య నారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి కావ్యాలలో "భావ గీతం" ప్రయోగించబడింది. ఈ భావకవిత్వాన్ని రాయ ప్రోలు సుబ్బారావు 'అభినవ కవిత్వం' అనీ, కృష్ణశాస్త్రి "కాల్పనిక కవిత్వం" అనీ, దువ్వూరి రామిరెడ్డి "గీత కవిత్వం" అనీ నోరి నరసింహశాస్త్రి "నవ్య కవిత్వం" అనీ పేర్కొన్నారు.

భావకవిత్వాన్ని నిర్వచించినవారిలో విశ్వనాథ సత్య నారాయణ, కవికొండల వెంకటరావు, డా. సి. నారా యణరెడ్డి ప్రముఖులు.

"కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము. ఒక అంతర్నిగూఢతపము, ఒక చిన్న కావ్యములో ఊద బడినచో" అది భావకవిత్వమని విశ్వనాథ నత్య నారాయణగారు నిర్వచించగా, కవికొండల వెంకట రావుగారు "భావము యొక్క కవితా స్వభావము భావ కవిత్వం" అన్నారు. డాॱసి. నారాయణరెడ్డిగారు "వస్తు భావరచనలలో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వము" భావ కవిత్వమని పేర్కొన్నారు.

పై నిర్వచనాలను పరిశీలిస్తే విశ్వనాథ సత్యనారా యణగారి నిర్వచనము లాక్షణికంగా, కవికొండల వెంకట రావుగారి నిర్వచనము తార్కికంగా, డాॱసి. నారా యణరెడ్డిగారి నిర్వచనం పరిశోధన దృష్ట్యా ఉత్తమంగా ఉన్నాయి.

భావకవులలో ప్రముఖంగా పేర్కొనదగివారు అడవి బాపిరాజు, వేడుల సత్యనారాయణ శాస్త్రి, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, కవికొండల వెంకటరావు, రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, శ్రీరంగం నారాయణ బాబు, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, దేవరకొండ బాలగంగాధర తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, శ్రీమతి బసవరాజు రాజ్యలక్ష్మమ్మ, శ్రీమతి పుట్టపర్తి కనకమ్మ మొదలైనవారు.

భావకవులు వెలువరించిన భావకవిత్వంలో స్వేచ్ఛా ప్రియత్వం, ఆత్మాశ్రయత్వం, మనన ప్రాధాన్యం, ఖండ కావ్యతత్వం, ఆరాధనాతత్వం, మానవతావాదం, సంక్షిప్తత, మొదలైన లక్షణాలు కనిపిస్తాయి.

భావకవులు తమ కవిత్వాన్ని ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, ఆధ్యాత్మిక కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, మానవతావాద కవిత్వం, స్తుతి కవిత్వం స్మృతి కవిత్వం, బాలగేయ కవిత్వం వంటి వివిధ రూపాలలో వెలువరించారు.

భావకవుల భావాలలో జానపద సంస్కృతి వాన చినుకుల మొదలై, వర్షపు జల్లుగా మారి, నదీ ప్రవాహంలా వరవళ్ళు త్రొక్కుతూ ప్రవహించింది. ప్రముఖ భావకవులైన రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, తుమ్మల సీతా రామమూర్తి చౌదరి, పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలైనవారు రచించిన తృణకంకణము, కష్టకమల, తెలుగుతోట, ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, గబ్బిలం, రాష్ట్రగానము, పఱిగపంట, సంక్రాతి తలపులు, పెను గొండ లక్ష్మి కావ్యాలలో జానపద సంస్కృతి వర్ణన ఆంధ్ర ప్రశస్తిగా రూపాంతరం పొందిందని నేను చేసిన పరిశోధన ద్వారా తెలియజేస్తున్నాను.

కట్టుబొట్టు తీరు, ఆటపాటలు, వేడుకలు, పండుగలు, మొదలైనవి జీవన విధానానికి సంబంధించి నవి మరియు జానపద సంస్కృతిలోని భాగాలు. రాయప్రోలు సుబ్బారావుగారు తృణకంకణం కావ్యంలోని నాయిక ద్వారా జానపదుల సంస్కృతిని ప్రశంసిస్తూ వర్ణించిన తీరును మనం గమనించవచ్చు.

'జిలుగుపూల కలంకారి చీరజార
చిందు సందెడు కుచ్చెళ్ళ చెదరనీక
మాటిమాటికిని కాలి కడియాలు మలుపుకొనుచు'.

మగువకు మంగళస్థానమైన వదనంలో తిలకరేఖను దిద్దుకొని, కాటుకకళ్ళతో, ఎరుపంచు గళ్ళపావడా పాదాలపై జీరాడుతుంటే, జడలో పైడి జడకుప్పెలు అందాన్ని ఇవ్వగా, మెడలో కాసులదండలతో తెలుగు ఆడపడుచు వీరి రచనలలో ప్రస్తుతించబడింది.

"గాజులాడ గలగలమని
పరికిణీలు విసిరి తిరుగ
గింగిర తిరిగే పరికిణీలలో
పమిటెల చెంగులు పంజల జారగ
కాళ్ళగజ్జెలను కంకణంబులును
లయ తప్పని తాళములయి మ్రోయగా"

ఇలా ఆటపాటలతో హాయిగా కాలం గడిపే దృశ్యం రాయప్రోలువారి రచనలో దర్శనమిస్తుంది.

అలాగే తెలుగు కన్యలు ఆడిన చెమ్మచెక్క, నాలుగు స్తంభాలట, కోలాటము, గొబ్బిళ్ళు, బొమ్మల పెండ్లిండ్లు, అట్లతద్దె ఉయ్యాలలవంటి ఆటలు ఈయన రచనలో ఆంధ్రత్వాన్ని సంతరించుకొని ప్రశంసించబడ్డాయి.

విశ్వనాథ సత్యనారాయణగారు 'ఆంధ్రప్రశస్తి' కావ్యంలో చేసిన సాంస్కృతిక ప్రశస్తిని మనం గమనించవచ్చు. వేంగి పూర్వకాలంలో ఆంధ్రుల రాజధాని. ఈ ప్రాంతమును ఎందరో మహానుభావులు ఎంతో వైభవంగా పరిపాలించారు. ఈ వేంగి వైభవాన్ని విశ్వనాథగారు "ఆంధ్రప్రశస్తి" కావ్యములోని 'వేంగి క్షేత్రము' ఖండికలో చేసిన సాంస్కృతిక ప్రశస్తి నాటి ప్రజల సంస్కృతిని ప్రతిబంబిస్తుంది.

విశ్వనాథగారు ఈ ఖండికలోని
ఈ పాలాలెంత చేవెక్కించుకున్నవో
గుండె వ్రయ్య సముద్ర గుప్పుఁడడలె

దానత నభాగ్రపాత నిర్యన్నిదాన
మైన యీ చోటను పభోగ్యమయ్యే నేడు.

అను పద్యంలో ఈ పాలాలు ఎంతో చేవ గలిగినవని, వీటి శక్తికి సముద్రగుప్పుడే హడలిపోయాడని, ఈ నేల ఎంతో పవిత్రమైనదని, ఇచ్చట చిత్రరథస్వామి సేవలందుకున్నాడని, ఇక్కడ పల్లవ రాణులు చేసిన వ్రతములు, పూజలవల్ల లక్ష్మీదేవి నివాస మేర్పరచుకొన్నదని, ఈ భూభాగం శరత్కాలపు వెన్నెల వంటి కీర్తిని పొందినదని, ఇక్కడ ఎక్కడ తవ్వినా బంగారమేనని ప్రశంసించారు.

దీనిని బట్టి పల్లవ రాజుల పరిపాలనలో వేంగి సిరి సంపదలు, భోగభాగ్యాలతో తులతూగిందని, చిత్రరథ స్వామి సేవలందుకోవటంతో ఇక్కడ నేల పవిత్రంగా మారిందని ప్రజలు నిరంతరము పూజలు, వ్రతాలు చేస్తూ భక్తిభావంతో జీవించేవారని తెలుస్తున్నది. ఇది నాటి ప్రజల జీవన సంస్కృతికి నిదర్శనంగా చెప్పవచ్చు.

జాషువా అచ్చమైన తెలుగుకవి అతని కవిత్వం తెలుగుదనంతో తొణికిసలాడుతూ ఉంటుంది. జాషువాకు తెలుగుభాష, తెలుగు సంస్కృతి, తెలుగు జాతి అంటే ఎంతో ఇష్టం ఆ మక్కువతోనే జాషువా "గబ్బిలం" కావ్యంలో తెలుగు సంస్కృతిని ప్రశంసిస్తూ వర్ణించాడు.

జాషువా దళితుని రాయబారాన్ని మోసుకొని కైలాస గిరికి వెళ్ళే గబ్బిలంతో తెలుగు ప్రాంతమంతటిని ఒకసారి దర్శించమన్నాడు. కంచర్ల శ్రీకృష్ణుడు ఏలిన నగరం

వినుకొండ రాయని రాజ్యం, పల్నాటి రాజ్యం. కొండవీటి రాజ్యం, గుంటూరు మండలాన్ని దర్శించుకొని పొమ్మన్నాడు. ఆ తెలుగు ప్రదేశాలను దర్శించుకుంటే జన్మ తరిస్తుందని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని జాషువా కవి పద్యరూపంలో ఇలా వర్ణించాడు.

ఉడుకు నెత్తుట చేతులు కడిగికొన్న
కాలపురుషుని పెనుదుండగములు దలచి
మనసు నలిగిన గుంటూరు మండలంబు
నరసి పోవమ్మ జన్మ ధన్యత వహింప
ప్రొద్దునకు వన్నె బెట్టిన
యిద్దరు భాస్కరులు పుడమినేలగ సొగసుల్
దిద్దినది మేన వయసున
పెద్దది గుంటూరు సీమ పెరసీమలలో

అంటూ తాను జన్మించిన గుంటూరు సీమపై గల మమకారాన్ని ఇలా వెలిబుచ్చారు.

కారంపూడి తిరునాళ్ళు, కోడిపందాల కోలాహలం, కొండవీటి రాజుల ఉన్నతి, వేమన ఆశువుగా కవిత్వం చెబుతూ తిరుగాడిన ప్రాంతాలను చూడవలసిందేనని తెలిపాడు. ఇవి నాటి ప్రజల సంస్కృతికి ప్రతీకలన్నాడు.

జానపదుల సంస్కృతిలో ఆచారాలు, సంప్రదాయాలు, పండగలు, కళలు, వంట-వార్పు మొదలైనవి భాగమే తుమ్మల వారు సంక్రాంతి శోభను తన కావ్యాలతో ఎంతో రమ్యంగా వర్ణించారు సంక్రాంతి వేళ సంక్రాంతి వంటకాల రుచులను తెలియజేస్తూ ప్రశంసించిన పద్యాన్ని మనం గమనించవచ్చు.

లేగటి పాలలో గ్రాగిమాగిన తీయ
తీయ కప్పర భోగిపాయసంబు

క్రొత్త బెల్లపు తోడికోడలై మఱిగిన
మదురు గుమ్మడిపండు ముదురు పులుసు
జిడ్డుదేరిన వెన్నెల గడ్డపెరుగు

రండురండని పిలిచె సంక్రమణ లక్ష్మి

గేదెలు, ఆవులు ఈనే సమయం కాబట్టి లేగటిపాలు దొరుకుతాయి. అటువంటి పాలతో చేసి పాయసం ఎంత తియ్యగా, కమ్మగా ఉంటుందో అరుచి అనుభవిస్తేనే తెలుస్తుంది. పైర వంకాయలు కాసే సమయంలో లేత కరివేపాకుతో తిరగమోతవేసి చేసే లేత వంకాయ వేపుడు కూర, రుచి చూడవలసిందే. సంక్రాంతి సమయంలో కొత్తబెల్లం వేసి చేసే గుమ్మడికాయ పులుసు గురించి ఇక చెప్పనక్కరలేదు. లేగటి పాలు కాచి మరగబెడితే తెల్లని వెన్నెలవంటి గడ్డపెరుగు తయారవుతుంది. ఆ పెరుగు రుచిలో ఉండే కమ్మదనం అనుభవిస్తే తప్ప తెలియదు.

తెలుగునాట సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చేది ఇంటి ముంగిలిలో ముగ్గులు, ముగ్గుల్లో గొబ్బిమ్మలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలు, కోడిపందాలు మొదలైనవి. తుమ్మలవారు సంక్రాంతి సమయంలో వీటి ప్రాముఖ్యతను తెలుపుతూ ఇలా ప్రశంసించారు.

ఈ కోడిపందెంబు లేమి చెప్పిడినయా
ఆంధ్ర జాతీయ శౌర్యాభివిప్ప
ఈ రంగవల్లిక లేమి తెల్పెడినయా
తెలుగునారీ కళాధీన బుద్ధి
ఈ గంగిరెద్దు వాడేమి పల్కెడినయా
మరుగువడ్డ తెనుంగు మాటతేట
ఈ గొబ్బి సంబరం బేమి చాటెడి నయా
తనివి గొల్పెడి నాంధ్ర ధర్మభిక్ష

తుమ్మలవారు కోడిపందాలు తెలగుజాతి శౌర్యానికి ప్రతీకలన్నాడు. తెలుగు ఆడపడుచుల కళా నిపుణతకు రంగురంగుల రంగవల్లికలు నిదర్శనమన్నాడు. గంగి రెద్దులు ఆడించేవారు మాట్లాడే భాష జాన తెనుగన్నాడు. గొబ్బిళ్ళు తెలుగు సంప్రదాయానికి, తెలుగు ధర్మనిరతికి చిహ్నాలన్నాడు.

తుమ్మలవారు 'సంక్రాంతి తలపులు' రూపంలో స్వీయ అనుభూతులు మనతో పంచుకున్నాడు.

"వెచ్చని గడ్డిపై నడుగువేయుచు మంచుమొయిళ్ళ బంటుగా
వచ్చిన సీతురక్కసికి వంగక గిత్తలబంతి దోలుచున్
బుచ్చిన కొయ్యలో బివురు పుట్టునటుల్ వలిపాట పాడుచున్
రెచ్చిన జవ్వనంబును స్మరియించెద నీ మకరోత్స వమ్ములన్"

తుమ్మలవారు మంచి వయస్సులో ఉన్నప్పుడు సంక్రాంతికి ముందు పంట నూర్పిళ్ళు జరుగుతున్న సమయంలో కళ్ళంలో నూర్పిడి చేసిన గడ్డిని చలిని కూడ లెక్క చేయకుండా 'గిత్తలబంతి' ఊపుతూ వలిపాట పాడిన మధురానుభూతులను మకర సంక్రాంతి గుర్తుకు తెస్తుంది అన్నారు. ఇక్కడ కవి తన స్వీయ అనుభవాన్ని తెలియజేస్తూ పరోక్షంగా రైతు శ్రమను వివరించాడు.

సంస్కృతి నుండి భాషను విడదీసి చూడలేము. పుట్టపర్తి నారాయణాచార్యులుగారు 'పెనుగొండ లక్ష్మి' కావ్యంలో తెలుగు కవులు, వారి కావ్యాలను గుర్తు చేసుకోవటం ద్వారా భాషపై తమకు గల అభిమానాన్ని ఇలా ప్రశంసించారు.

కృష్ణరాయలకాలంనాటి సాహిత్య, భాషా, స్వర్ణయుగ వైభవాన్ని మన కనులముందు నిలిపాడు.

తెనుగు రాయని పల్కు పాలతికి దానిమ్మ
రసములో నుగ్గుపాల్గలిపి పోసి
ముసలి ముప్పున మీసమును దువ్వు మారాడు
నృపతి, గుండెలకును నీరుదట్టి
తిరుమలరాయ పృథ్వీశులే నవ్వు, వె
న్నెలలోన గురవంపు మొలకవోసి
రామభూషణ కవిరాజు కోకిలచేత
బలికించు హిందోళ గలియబలికి

'దేశభాషలందు తెలుగులేస్స' అని తెలుగుభాషను కొనియాడిన శ్రీకృష్ణదేవరాయలును కమ్మని తెలుగుభాష నుడికారమును తీర్చిన మూలపురుషుగా ప్రశంసించాడు.

ఇలా భావకవుల భావాలలో జానపద సంస్కృతి ఆంధ్రప్రశస్తి రూపంలో పరిమళించి, పరవశించింది.

ఆధార గంథాలు :

1. తెలుగు సాహిత్య విమర్శన సిద్ధాంతాలు - ప్రొఫెసర్ వెలమల నిమ్మన్న - దళిత సాహిత్య పీఠం - విశాఖపట్నం - 2014.
2. రాయప్రోలు రచనల పరిశీలన - తత్త్వవివేచన - ఎం. లావణ్య సరస్వతి -ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాదు - 1988.
3. ఆంధ్రప్రశస్తి - విశ్వనాథ సత్యనారాయణ - శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్ - 2010.
4. గబ్బిలం - జాషువా తాత్విక స్వప్నం - గుర్రం జాషువా పరిశోధన కేంద్రం - తెలుగు అకాడమి- హైదరాబాదు - 2012.
5. తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి కవిత్వం - వ్యక్తిత్వం - అమూల్యశ్రీ - రత్నజ్యోతి పబ్లికేషన్స్ - గుంటూరు -1995.
6. చారిత్రక లఘుకావ్య త్రయం - అనుశీలన (హంపీ క్షేత్రం, పెనుగొండ లక్ష్మి, కీర్తి తోరణము) - కాట్నపల్లి ప్రియదర్శిని -2005.

❖ ❖ ❖

జానపద విజ్ఞానంలో సంగీత వాద్యాలు – పరిరక్షణ, పరిపోషణ

– మోత్కూరి అనిల్ కుమార్, పరిశోధక విద్యార్థి, జానపద కళల శాఖ, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం.

ఆది మానవుని కాలం నుండి నేటి నాగరిక మానవుని వరకు ఆయా కాలాల్లో మనిషి తన అభ్యున్నతి కోసం చేసిన కృషి, సంస్కృతి. ఈ సంస్కృతి జానపదుల జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, దుస్తులు, ఆటలు, వంట, వైద్యం, కళలు, సంగీళతం మొదలగునవి జానపద విజ్ఞానంలో భాగాలు.

అరవై నాలుగు కళల్లో సంగీతం ఉత్తమమైనది, మొదటిది. ఇది సామూహికంగా వికాసం చెందిన కళ, సాంప్రదాయబద్ధమైన సంగీతం, శాస్త్రీయ సంగీతం, ఇది మార్గ సంగీతం, జానపదుల సంగీతం, ఇది దేశి సంగీతం, సాంప్రదాయకంగా జనసముదాయంలో ప్రచురమైన సంగీతం జానపద సంగీతం వైవిద్యాం కనిపించిన జాన పద సంగీతం సరళమైంది.

- జానపద గేయాలలాగే జానపద సంగీతం కూడా గ్రామ సీమల్లో పుట్టి పెరిగాయి.
- ప్రకృతి దత్తంగా వచ్చిన శ్రుతి జ్ఞానమే జానపద సంగీతానికి జీవనని చెప్పివచ్చు.
- సంగీతంలో వాద్య సంగీతం, గాత్ర సంగీతం, సాహిత్యం అన్నవి మూడు ప్రధాన భాగాలు వాద్య సంగీతం ప్రత్యేకంగ ఉండవచ్చు, లేక గాత్ర సంగీతానికి సహకారిగా ఉండవచ్చు.

ఆదిమానవుని కాలంలో మనషులు, మృగాలను ఎదిరించి బ్రతకే క్రమంలో అడవిలో సంచరించెపట్పుడు ఎవరికైన మృగాలు ఎదురైతే ఆ విషయాన్ని మరొకరికి తెలుపడం కోసం ఒక విధమైన అరుపులు చేసేవాడు ఆ శబ్దాలు వీరత్వానికి సంబంధించనవిగా, ఒక వ్యక్తి ముందు మరొకరిని మృగాలు చంపి తినడం చూసిన సందర్భంలో ఆ వ్యక్తి భయపడుతు పెద్దగ అరుస్తు పరెగెత్తుతాడు. ఆ అరుపులను భయానికి సంబంధించి నవిగా, బాగ ఆకలి వేసినప్పుడు తినడానికి ఏమి దొరకనప్పుడు చేసిన అరుపులను దుఃఖానికి సంబంధించినవిగా గుర్తించారు. ఇలా ఒకరు చేస్తున్న శబ్దాలను మరొకరు గ్రహించి గుంపులు గుంపులుగా ఏర్పడక జీవనం కొనసాగిస్తుండగా, వీరత్వానికి సంబంధించిన శబ్ద రావడం గమనించి, అక్కడికి వెల్లి చూస్తే ఒక వ్యక్తి శంఖుని ఉదుతున్నాడు. అప్పటి నుండి వీరత్వానికి సంబంధించిన శబ్దం చేయడానికి శంఖుని ఉపయోగించారు. అదే విధంగా గెదె కొమ్ముని ఊదినప్పుడు భయానికి సంబంధించిన శబ్దం వెదురు గొట్టలోంచి శృంగారానికి సంబంధించిన శబ్దం, విల్లు వీటినప్పుడు, దుఃఖ పూరిత శబ్దం రావడం గమనించిన మానవులు అప్పటి నుండి తమ భావాలను తెల్పడం కోసం ఆయా వాద్యాలను, వస్తువులను ఉపయోగించారు.

ఆ వాద్యాల నుండి వచ్చి శబ్దాలను అనుసరిస్తు జీవి స్తున్న గుంపులు రోజు రోజుకు ఎదగడం, అనుసరించి గుంపులు మృగాల చేతిలో బలయ్యేవారు. ఈ వాద్యాల ఆధారంగా కాలక్రమేన వివిధ రకాల వాద్యాలు కనుక్కో వడం ప్రారంభించారు. రోజులు మారుతున్న కొద్ది చర్మంతో వివిధ రకాల వాద్యాలను తయారు చేయడం నేర్చుకున్నారు. ఢంక, ఢమరుకం, డప్పు, ఇలా వీరు జంతువులను తరమడం కోసం తయారు చేసుకున్న వాద్యాలను రాజుల కాలం వచ్చేసరికి సాంకతి వాద్యాలుగా ఉపయోగించారు.

జానపద వాయిద్యాలు – రకాలు :

మన భారతదేశంలో 600 కంటే ఎక్కువ వాయిద్యా లున్నాయని ఆర్.వి.ఎస్. సుందరం గారు "ఆంధ్రుల జానపద విజ్ఞానం" అనే గ్రంథంలో తెలిపారు. వీటిలో కొన్ని తంత్రి వాయిద్యాలు, కొన్ని లోహ వాయిద్యాలు,

కొన్ని చర్మ వాయిద్యాలు, మరికొన్ని డదే వాయిద్యాలు ఇవన్నీ చేతితో తయారు చేసినవె. ఈ వాద్యాలను సూక్ష్మంగా వర్గీకరించిన కొందరు మేళ వాయిద్యాలు, లయ వాయిద్యాలు, సంగీత వాయిద్యాలు, దేవాలయ వాయిద్యాలు, రణ వాయిద్యాలు, జానవద వాయిద్యాలుగా విభజించారు. ఈ వాయిద్యాలన్నీ పరిశీలిస్తే తెలుగు రాష్ట్రాలలో వివిధ సంగీత వాద్యాలు కనిపిస్తాయి. వాటి వివరాలు

1. తాటి ఆకు, 2. దంతె ఆకు, 3. ర్యాల కాయ, 4. తుమ్మ కాయ, 5. ఆదివాసీ నగార, 6. నగర నగార, 7. డప్పులు, 8. తుడుం, 9. మధ్యస్థ నగారా, 10. గోండి తుడుం, 11. మట్టి ధంకా, 12. బస్తర నగారా, 13. దుబ్బు వాద్యం, 14. ఔజం, 15. వీరణాలు (జోడు), 16. రుంజులు, 17. చామల్లాలి, 18. మూగ, 19. కోయడోలు, 20. గోండీ డోళ్ళు, 21. గోండీ డప్పు, 22. సంభళ్ జోడు, 23. ఆదివాసీ మద్దెల (చిన్నది/పెద్దది), 24. ధమరుకం (ఇత్తడి), 25. బుఱ్ఱకథ బుఱ్ఱ, 26. కడ్డీ వాద్యాలు, 27. కోయడోలు పెద్దది, 28. మార్చా, 29. డింకీ, 30. పెద్ద జేగంట, 31. పిల్లంగోయి జోడు, 32. గోండి సన్నాయి చిన్న (జోడు), 33. గుల్లకట్టు, 34. ఛోన్ కా, 35. పెద్ద ఇత్తడి జమిడిక, 36. చెక్క జమిడికలు, 37. డప్పులు (తెల్లవి), 38. కోయ కిరీటం, 39. పెద్ద అక్కుం, 40. బుజ్జి (ఏక్ తారా), 41. రావణ్ హట్ట, 42. విల్లు వాద్యం, 43. అక్కుం (చిన్నవి), 44. కొమ్ముబూర, 45. ఆదివాసీ కిన్నెర, 46. తుతూర, 47. గిల్లకాయలు, 48. పెద్ద గజ్జెలు, 49. మధ్య గజ్జెలు, 50. చిన్న గజ్జెలు, 51. మెడ గజ్జెలు, 52. సన్నాయిలు, 53. కాలికోం, 54. బిగుల్, 55. పిల్లనగోయి, 56. గంపులు, 57. చిడతలు (చిన్నవి) 58. పెద్ద తాళాలు, 59. చిన్న తాళాలు, 60. లెజిం, 61. అందెల జోళ్ళు, 62. లేంక్, 63. చిడతలు (పెద్దలి), 64. చిన్న కాలిగజ్జెలు, 65. పెద్ద కాలిగజ్జెలు, 66. నడుం గజ్జెలు, 67. అడ్డం గజ్జెలు, 68. జేగంట, 69. చిన్న చేతి గంట, 70. తాటి బూర, 71. చిన్న పెద్ద గంటలు, 72. ఇత్తడి గుల్లకట్ట, 73. ఖోన్, 74. కిన్నెర వాయించే గజ్జెలు, 75. చిన్న మట్టి మద్దెల, 76. మట్టి చర్మ వాద్యం, 77. చిన్న ఆదివాసీ డోలు, 78. ఇత్తడి ఛత్రీలు, 79. ఇత్తడి కంజీర జోడు, 80. ధమరుకాలు, 81. గుజ్జడి మొగ్గలు, 82. పెద్ద బిగుల్, 83. గవ్వల పేర్లు, 84. చెక్క వాయిద్యం, 85. శారద, 86. బుడికెలు, 87. కొర్రాజుల వాద్యం, 88. కర్ర జేగంట, 89, వాద్యం, 90. బుర్రవీణ, 91. ఘుంగురు, 92. పెద్ద గుంగురు, 93. కాస్టనెట్, 94. పెద్ద తాళం, 95. అగోగో, 96. హ్యాండ్ స్కార్ఫన్, 97. పెద్ద తాళాలు, 98. తవిల్, 99. జాంబె, 100. తాన్‌పుర (బుర్రకథ), 101. చోటా తానురా, 102. సరోద్, 103. రబాబ్, 104. సారంగి, 105. ఉద్, 106. నుర్ సేబే, 107. మృదంగం, 108. ఘటం, 109. గోపిచంద్, 110. బీన్, 111. కబాజ్, 112. కర్ర పేటి, 113. అగోగో, 114. నట్టువాంగం (తాళం), 115. మోర్సింగ్, 116. నగస్వరం, 117. స్టిక్స్, 118. సారంగి, 119. కంజర, 120. పర క్యుమినన్ పార్క్, 121. కాబల్, 122. నట్టువాంగం తాళం, 123. వుడెన్ పరస్కూసియన్, 124. జాంబే, 125. కర్ర చప్పట్లు, 126. బుర్రకథ తంబూర, 127. తాన్‌పురి, 128. సింబుల్స్.

పై వాటిలో అనేక సంగీత వాద్యాలు ఉన్నప్పటికీ ఒకానొక కాలంలో జానపదుల చేతుల్లో వెలుగు వెలుగొంది, ఇప్పుడు అవి కనుమరుగై పోయాయి. వీటిలో కొన్నింటిని చూద్దం.

కనుమరుగవుతున్న జానప సంగీత వాద్యాలు :

తాటి ఆకు :

తాటి చెట్టు ఆకుని తీసుకొని దాన్ని చిన్న చిన్న చీలికలుగ చేసి చుట్ట ఆకారంలో వచ్చేటట్టు గుండ్రంగా చుట్టాలి. మూరెడు పొడవు వచ్చేవరకు ఆకు చీలికలను చుట్టి, సన్నగ ఉండె వైపు నరత కొట్టి, ఆకు కొనలతో చిన్న పికలాగ చేసి నోటితో గాలి ఊదితే పీ.. పీ.. అని శబ్దం వస్తుంది. పండుగల సమయంలో ఈ వాద్యాన్ని ఉపయోగించేవారు. చిన్న పిల్లలు ఎక్కువగా తయారు

చేసుకుని సరదగా ఊదేవారు.

దంతె ఆకు :

దంతె చెట్టు ఆకుని తీసుకుని ఆకు మొదట కడల ఉంటుంది. దాన్ని తీసేసి, ఆకు చివర నుండి చుట్టు ఆకాంలో చుట్టి చేతితో పట్టుకొని సన్నగ ఉండే వైపు నుండి నోటితో గాలి ఊదితే పీ... అనే శబ్దం వస్తుంది. వేసవి కాలంలో అయితే ఎక్కువ శబ్దం వస్తుంది. ఈ దంతె ఆకు వాద్యంలో పల్లె వాసులు పాటలు కూడ పాడేవారు.

ర్యాల కాయ :

ర్యాల చెట్టు కాయలు బాగా ఎండితే తర్వాత వాటిని తీసుకువచ్చి చేతితో ఊపితె అందులో ఉండే గింజలు ఊగి గళ్ళు, గళ్ళు అనే శబ్దం వస్తుంది. గేయాలకు అనుగునంగా ఆ కాయలను ఊపేవారు. పండగల సమయంలో డప్పు, డోలు వాద్యాలకు సహకారంగా గజ్జల శబ్దం కోసం ఈ కాయలను ఉపేవారు.

తుమ్మ కాయ :

తుమ్మ చెట్టు కాయలు భాగా ఎండితే తర్వాత గళ్ళు గళ్ళుమనే శబ్దం వస్తుంది. వీటిని తీసుకువచ్చి కాయకు రెండు చివర్ల దారం కట్టి నృత్యం చేసేవారు. కళ్ళకు కట్టేవారు. నృత్యకారులు ఎగిరినప్పుడు గజ్జల శబ్దం వచ్చేది. చిన్న పిల్లలు కూడా వారి కాల్లకు కట్టుకుని నృత్యం చేసేవారు. నేడు మనకు కనిపించే ఇత్తడి గజ్జలు లేనపుడు తమ గజ్జలనే ఎక్కువగా ఉపయోగించేవారు.

సంగీత వాయిద్యాలు :

గుమేళా :

గుమేళా అనే వాయిద్యాన్ని కుమ్మరిమట్టితో తయారు చేస్తారు. లోపలి భాగం అంతా డొల్లగా ఉంటుంది. స్థూపక ఆకారంలో ఉంటుంది. ప్రక్కన మేక చర్మంతో సాగదీసి బిగిస్తారు. దండరి నృత్యం జిరగే సమయంలో గోండు జాతివారు ఈ వాయిద్యాన్ని అద్భుతంగా వాయిస్తారు.

డగుడు :

డగ్గుడు అనే వాయిద్యాన్ని సవరజాతివారు ఉప యోగిస్తారు. ఈ వాయిద్యం ఆకారం మద్దెలలా ఉంటుంది. దీనిని శ్రీకాకుళం జిల్లాకు చెందిన సవరలు వారి జాతిలో ఎవరైన మరణించినప్పుడు నంతాప సమయంలో వాయిస్తారు. అలాగే పితృదేవతలకు శ్రద్ధ కర్మలు జరిపే ఆగ్రగామ సమయంలో ఉపయోగిస్తారు.

కిరిడి :

ఈ వాయిద్యాల పేర్లే ఎంతో ఆసక్తి కలిగించేవిగా ఉన్నాయి. కిరిడి వాయిద్యం మట్టితో తయారు చేయబడే డ్రమ్ము వాయిద్యం. పై భాగాన మేక చర్మాన్ని అమరుస్తారు. రెండు చిన్న కర్రపుల్లలతో మోరేబాణికి అనుగుణంగా ఈ వాయిద్యాన్ని ఉపయోగిస్తారు.

తుడుము :

అర్ధగోళాకారంలో ఉండే మట్టితో తయారు చేయబడ్డ వాయిద్యమిది. పైన మేక చర్మాన్ని బిగించి కడతారు. అర్ధగోళం పైభాగం పైన తోలు పట్టీలు చర్మఆన్ని బిగించి ఉంచుతాయి. తాళ్ళ చుట్టుపైన ఈ వాయిద్యాన్నే ఉంచి, తోలు పట్టాలతో వాయిస్తారు. ముఖ్యంగా దింసా నృత్యాలలో దీనిని ఉపయోగిస్తారు. సామంత జాతివారు గోండులు ఈ వాయిద్యాన్ని ఎక్కువగా వాడుతారు.

తంత్రే వాయిద్యాలు :

కిన్నెర :

ఇది అనేక తంత్రులు కలిగిన శృతివాయిద్యాలు ఉత్తరాదిన కొన్ని గిరిజన జాతులలో వాడుకలో ఉన్న కిన్నె వాయిద్యాన్ని పోలి ఉంటుంది. ఇంచుమించు గిటారులాగా ఉంటుంది. లోపల ఖాళీగా ఉన్న సుమారు 20 అంగుళం వెదురుపై మైనంతో మధ్యగా నగుమెట్లను అతికిస్తారు. మెట్లపై నుండి రెండు తంత్రులను బిగిస్తారు. వెదురుకు ఒక చివర స్వర పేటిక ఉంటుంది.

క్రింగ్రి :

తుంత్రులూ, చర్మం బిగించిన స్వరపేటిక ఈ వాయిద్యంలో ముఖ్య భాగాలు స్వరపేటికను చదరంగా కొయ్యతో తయారు చేస్తారు. ఫిడేలువలే ఉండి ఈ వాయిద్యాన్ని అత్యంత విలువైనదిగా పరిగణిస్తారు.

వర్ధనులలో అందరికంటే ప్రముఖులైన వ్యక్తి ఈ వాయిద్యాన్ని వాయిస్తాడు. ఆ సమయంలో చిన్నవారు తప్పెట్లు వాయిస్తూ బాణాలు ఊదుతారు.

వాయిజనో శబ్ద వాయిద్యాలు :

నాగస్వరం :

ఎరుకలలో ఒక కులమైన పాములవాళ్ళు వాయించే వాద్యమిది. పాములను ఆడించటానికి ఇది ఉప యోగపడుతుంది. త్రాచుపంచి పాములను సైతం పాముల వాళ్ళు నాగస్వంతో మచ్చిక చేస్తారు. ప్రస్తుతం వాయిద్యం, వాయిద్యకారులు కనుమరుగై పోతుంది. అక్కడక్కడ మాత్రమే కనిపిస్తుంది.

వెదురు పిల్లన గ్రోవి :

గోదావరి ప్రాంతంలో ఎక్కువ గ్రామాలలో ఇది బహుళ ప్రచారంలో ఉంది. ఇతర చోట్ల కూడా పల్లె ప్రజలు అభిమానించే వెదురు వాయిద్యమిది. ఊదేచోట ఒక రంధ్రమూ, మధ్య నుంచి రెండవ చివరి వరకు ఐదు చిన్న రంధ్రాలు ఉంటాయి. సాధారణంగా ఇది 21 సెంటీ మీటర్ల పొడవు ఉంటుంది.

తేతిడి :

సవరలు ఉపయోగించే ఈ వాయిద్యం గేదే కొమ్ముతో తయారు చేసినది. దీని పొడవు 12 నుంచి 15 అంగుళాలు ఉంటుంది. సన్నగా చివరన ఉండే వెదురుతో చేసిన సన్నని గొట్టాన్ని పేకగా అమర్చుతారు. బాగా దమ్ముపట్టి ఊదినప్పుడు పెద్దగా శబ్దం వస్తుంది.

జానపద వాద్యాలు పరిరక్షణ అవస్యకత :

ఎన్నో వాయిద్యాలు తెలుగు రాష్ట్రాలలో ఉన్నప్పటికి సగానికి పైగ వాద్యాలు కనుమరుగై పోతున్నాయి. దానికి కారణం ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మరియు పాశ్చాత్య సంస్కృతి జానపదులపై ప్రభావం చూపడం, టి.వి. మాధ్యమాలు, సోషల్ మీడియా మాధ్యమాలు కూడ జానపద వాద్యాల కనుమరుగై పోవడానికి కారణం అవుతున్నాయి. ఒకప్పుడు, సంస్కృతిలో భాగమైన వాద్యాలను పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉంది. ముఖ్యంగ ఎవైతే కనుమరుగౌతున్నయో వాటిని సేకరించి, జానపద సంగీత వాద్య మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆయా సంగీత వాద్యాలపై పరిశోధనలు చేయాలి. ఆయా సంగీత వాద్యాలలో నిష్ణాతులైన కళా కారులను గుర్తించి సంగీత ప్రాధాన్యతను తెలిపే విధంగ ప్రదర్శనాలు ఏర్పాటు చేసి డాక్యుమెంటేషన్ చెయ్యాల్సిన అవసరం ఉంది. అదే క్రమంలో ఔత్సాహికులైన కళా కారులకు సంబంధిత వాద్యాలపై ప్రత్యేక శిక్షణ శిభిరాలు ఏర్పాటు చేయాలి. సంగీత వాద్యాలను తయారు చేసే వారిని గురించి వారిచే వాద్యాలు తయారు చేయించాలి. ఆయా కళాకారులకు ప్రభుత్వం చేయితనందించే విధంగా ఉచితంగ సంగీత సాధనలను అందించే చర్యలు చేపట్టాలి.

విషయ ధాతలు :

1) ప్రొఫెసర్ జయదేవ్ తిర్మల్ రావు, 2) డా॥ మనోజ, 3) కె.బాబుజీ, 4) కె.సుర్యభగవంతరావు, 5) ఎ. నరసింహ, 6) యం.విజయ, 7) యం.పద్మజ.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు జానపద కళారూపాలు - డా॥ మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి.
2. జానపద సంగీతం-పరిరక్షణ (వాజ్మయి) - డా॥ వన్నె గోపాల్.
3. జానపద నృత్యము, శాస్త్రీయ, నృత్యము (వాజ్మయి) - మటేటి అనిల్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ జానపద నృత్యాలు

– యం. సతీష్, పరిశోధక విద్యార్థి, జానపద కళల విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

జానపద నృత్యం :

ప్రదర్శింపబడే జానపదకళల్లో అత్యంత ప్రాచీన విభాగానికి చెందిన ప్రక్రియ నృత్యం ఇది. మతాచారణ కార్యకలాపాల్లో ఒక భాగంగా అవతరించి తర్వా లౌకిక కళగా మార్పును పొందింది. ఆదిమానవుల నృత్యాలకు మూలమైన ఆధారాలు.

నృత్య దాతువునుండి నృత్యం అనే పదం ఉత్పన్న మైంది. నృత్ అంటే గాత్ర విక్షేపం ఇది అంగికభయాన్ని సూచిస్తుంది. నృత్యమంటే ఒక సంగీత సరణి యొక్క తాళలయలను అనుసరించి అంగ, ప్రత్యాంగ, ఉపాం గాలను క్రమపద్ధతిలో విన్యాసం చెయ్యడం. అంటే రస భావాలు తక్కువైనా, తాళలయలను అనుసరించి చేయబడి అంగ విక్షిపమే నృత్యం.

ఒక సంగీతం సరణి యొక్క అర్థాన్ని కూడా అనుస రించి భావభినయం చేయడం నృత్యం. సంగీత సరణిలో పొదగబడిన సాహిత్యాన్ని గమనించి అందులోని ప్రతి పదం యొక్క అర్థాన్ని అంగిక చలనాదులతో ప్రదర్శిం చడం నృత్యంలోని విశిష్టత అనగా భావతాళయుతమైన గితాభినయమే నృత్యం. ఇది దేహానికే గాక మనసుకు కూడా క్రమశిక్షణ అలవాటు చేసేకళ. ఇది మానవుని మనోగతాభిప్రాయాలను అంగిక చలనం ద్వారా శక్తి వంతంగా వెల్లడించే ప్రక్రియ. తెలంగాణ రాష్ట్రము ఆదివాసులకు ప్రసిద్ధి. వీరిలో ఎక్కువగా జాతుల వారు ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నారు. ఈ జిల్లాలో అడవి చాలా ఎక్కువ ఆదివాసిలలో సుమారుగా 33 జాతులున్నాయి. జానపద, గిరిజన నృత్యాల్లో యక్షగానం, కోలాటం, గుస్సాడి నృత్యం, ధూలానృత్యం లాంటి మొదలగు నృత్యాలు ముఖ్యమైనవి.

థులా నృత్యం :

థులా అనే కళారూపం సర్కారు ఆంధ్రదేశంలోని కాని, రాయలసీమ ప్రాంతంలో కాని ఎక్కడా కనిపించక పోయినా, తెలంగాణ ప్రాంతంలో మాత్రం అధిక ప్రచారంలో ఉంది.

ఇది ముఖ్యంగా శ్రమజీవుల కళారూపమని, అంత కంటే ముఖ్యంగా ముస్లింలు జరుపుకునే పీర్లపండుగకు సంబంధించిందనీ, జయధీర్ తిరుమలరావు గారు 'ప్రజా కళారూపాలు' అనే తమగ్రంథంలో వివరించారు. ఇది శ్రమజీవుల కళారూపమైనా శ్రమజీవులందరూ ఈ కళారూపంలో పాల్గొన్నట్లు మనకు పెద్ద ఆధారాలు లేవు. ఇందులో అందరూ కలిసి సామూహిక నృత్యం చేస్తారు. పాటకూ, పాటకూ సంబంధించిన ఆటకూ సంబంధించిన జానపద కళారూపం థూల కళారూపానికి సంబంధించిన పాటల్లోగాని, పదాల్లోగాని అతిచిన్నదిగాను, అంతకంటే కథావస్తువు అతి చిన్నదిగానూ ఉంటుంది.

ముఖ్యంగా మొహరం పండుగల్లో జరిగే పీర్ల పండుగలో థులా ఎక్కువ ప్రచారమైనా, ఆ కళారూపాన్ని తెలంగాణా పోరాట సమయంలో సాయుధదళాల్లో ఉన్న ముస్లింసహోదరులు, ఇతర శ్రమజీవులూ కూడా బాగా ఉపయోగించుకున్నారు. దళాలకు సంబంధించిన క్యాంపులో ఉన్నవారందరూ వలయాకారంగా నిలబడి, ఒకరు పాట ప్రారంభించి, ఆ పాటను సామూహికంగా అందరు అందుకుని, ఆ పాటకు తగిన అడుగులను అందరు ఒకే రీతిలో క్రమశిక్షణతో లయబద్ధంగా థులా పాటను పాడుకునేవారు.

కోలాటం :

ఇది ఒకప్పుడు స్త్రీల కళారూపంగా తెలుస్తుంది. చంద్రగిరి, శ్రీశైలం మాచేర్ల శిల్పాల్లో కోలాటాన్ని చేస్తున్న

స్త్రీల భంగిమలే ఇందు తార్కాణంగా చెప్పొచ్చు. కోలాటం లోని రకాలను కోపులని అంటారు. కోపులు కూడా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉంటాయి. నాటి స్త్రీల కోలాటాన్ని కొన్ని కారణాలవల్ల పురుషులు నేర్చుకుని ప్రదర్శిస్తున్నారు. ఆడ, మగ, కలిసి కూడా అక్కడక్కడా కోలాటం చేస్తున్నారు. కోలాటం నాడు దేవాలయాల్లోను, రాజప్రాసాదాల్లోను ప్రదర్శించేవారు. అలాగే ప్రతి పల్లె లోనూ నేటికి కోలాటబృందాలను చూడవచ్చు. ఈ కోలాట బృందాలు జాతరల్లో కొలుపులు, ఉత్సవాలు పండుగ సమయాల్లో, వెన్నెల రాత్రిల్లోనూ, తీరిక సమయాల్లోనూ ప్రదర్శిస్తుంటారు. కోలాటాలను ఒకనాడు స్త్రీల భరతనాట్యంలాగా పట్టుచీర, రవికలను ధరించి అనేక ఆభరణాలను ఒంటినిండా ధరించి తలనిండ పూలు చుట్టుకొని వాలు జడవేసుకుని కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కోలాటం వేసే వారని శిల్పాలను బట్టి చెప్పొచ్చు. అయితే నేడు కోలాటం వేసేవారు సాధారణ అలంకారణలతో కోలాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే ఒకప్పటికన్నా ఇపుడు కోలాటం మీద యువతలో వ్యామోహం తగ్గడం వల్ల ఆసక్తి ఉన్న కళాకారులను, గురువులను నియమించుకొని నేర్చుకోవడం ప్రదర్శనలు ఇవ్వడం మనం గమనిస్తున్నాం.

గంగిరెద్దులాట :

రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ కనిపించే కళారూపం ఈ గంగిరెద్దులు గంగిరెద్దాలమయ్యా .. మేము గరిబోల మయ్యా ... అని పాడుతూ గ్రామగ్రామంలో వీళ్లు అపడప్పుడు దసరా, సంక్రాంతి పండుగ సమయాలలో కనిపిస్తుంటారు. వీళ్లు ఒక గంగిరెద్దును ఎన్నుకొని దీనికి బాగాముస్తాబు చేసి తీసుకొస్తారు. ఒక్కొక్క ఇంటికి వెళ్లి అయ్యగారికి దన్నంపెట్టు అమ్మగారికి దన్నంపెట్టు "డూ ..డూ..డూ బసవన్నా" అంటూ గంగిరెద్దు చేత కొని కదలికలు చేయిస్తారు. గంగిరెద్దులోళ్లు యాదవులలో భాగమని చెప్పుకుంటారు. కాని గొల్లలకు వీరికి ఎటువంటి సంబంధాలు లేవు. గంగిరెద్దుల కులస్థులలో మగవారు గంగిరెద్దు పట్టుకొని వూరంతా తిరిగి ఆడవారు గ్రామాలలో కరక్కాయలు, దగ్గు మందులు గులికలు అమ్మేవారు. నేడు ఆ పరిస్థితులు మారటంతో ఆడవారు ఫ్యాన్సీ సామానులైన బొట్టు, కాటుకలు, తిలకాలు, అద్దాలు, పేనలు(దువ్వెనలు) ఊరూరా అమ్ముకొని వస్తున్నారు. కొన్నిచోట్ల ఆడవారు ఈత చాపలు, బుట్టలు, డబ్బులు బలెం ఇచ్చి చనిపోయిన వాళ్ల పూర్వీకుల మీదపాటలు పాడించుకునేవారు. అయితే నేడు అలాంటి సంప్రదాయానికి కొంతగండి పడిందని చెప్పవచ్చు. పాతకాలంలా వాళ్లను ఆదరించే వారు తక్కువయ్యారు. ప్రభుత్వాలు కూడా ఈ కళను పెద్దగా ప్రోత్సహించడం లేదు.

డప్పునృత్యం :

డప్పు అనేది ఒక వాయిద్యం రెండు నుండి మూడు అడుగుల వ్యాసార్ధం గల గుండ్రటి చెక్క చట్రానికి లేత మేకతోలుతో చేసిన వాద్యపరికరమైన డప్పులను పుల్లలతో కొడుతుంటే పుట్టుకొచ్చే నాద ప్రభంజనం చూసే వారిని కూడా నాట్యం చేయిస్తుంది. వాయిద్యాన్ని వాయించే టప్పుడు నిప్పు మంట సెగతో కాపుతారు. ఆ వేడికి చర్మ కణ్‌కణ్ మనే శబ్దాన్నిస్తుంది. దీని చట్రానికి ఒక చోట ఒక తాడు దూర్చుతారు. ఈ తాడు భుజానికి తగిలించు కోవడానికి వీలుగా ఉంటుంది. ఈ తాడుతో డప్పును భుజానికి తగిలించుకొని డప్పును పొట్టభాగంలో ఆనించి ఎడమచేతి డప్పును బిగుతుగా పట్టుకుంటారు. ఈ చేతిలో ఒక అడుగు పొడవు ఉన్న పుల్ల ఉంటుంది. కుడిచేతిలో దాదాపు 9 అంగుళాలు పొడవు అంగుళం మందం ఉండే కర్ర ఉంటుంది. ఈ కర్ర పుల్లను కుడిచేఇలో డప్పుపై లయబద్ధంగా కొడుతుంటారు. కుడిచేతి కర్రతో కొట్టిన తర్వాత ఎడమచేతి పుల్లతో ఒకసారి డప్పు కొడుతారు. కుడిచేతి కర్రశబ్ధం పెద్దగాను ఎడమచేతి పుల్లశబ్ధం చిన్నగాను ఉండి, రెండు వేరువేరు ధ్వనులతో వినడానికి ఇంపైన శబ్దానిస్తాయి. ఈ డప్పు పై కుడి చేతి కర్రముక్కతో రకరకాల జతులు వాయిస్తారు. చేయి తిరిగిన కళాకారులు ఎడమచేతి పుల్లతోను రకరకాల లయ విన్యాసాలు చేస్తారు. ఇలా లయబద్ధంగా డప్పును కొడుతు

ఆ శబ్దానికి అనుగుణంగా అడుగులు వేస్తు డప్పు నృత్యం చేస్తుంటారు.

ఈ డప్పు చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే గ్రామాధికారులు వ్యవస్థలో ప్రభుత్వ ఆదేశాలను వార్తలను ప్రజలకు అందజేయడానికి చాటింపుద్వారా డప్పును వాడేవారు. గ్రామదేవతల జాతర్లలో అమ్మవారికి బోనాలు పెట్టేటప్పుడు అమ్మవారికి మేకపోతులను బలిచ్చేటప్పుడు బోనాల ఊరేగింపులో కొలుపుల ఊరేగింపులో డప్పు దరువులు ప్రధానపాత్ర వహించేవి తర్వాత ఆవే డప్పులు లయ విన్యాసాలతోపాటు నృత్య విన్యాసాలను సంతరించుకున్నాయి. పెండ్లిండ్లు, శవాల ఊరేగింపులకు, ఉత్సవాలు ఊరేగింపులకు డప్పు దరువులు ప్రధానమయ్యాయి. తర్వాత వినోద కళారూపంగా వేదికలపై రకరకాల సర్కస్‌పద్ధతి విన్యాసాలను సమకూర్చుకుని కులుకులతో కమ్మని ధ్వనులతో మంచి కళారూపంగా ఎదిగింది. గిరిజన సంస్కృతిలోను, హరిజన సంస్కృతిలోను ప్రథమభాగంగా జనించిన డప్పు ఈ రోజు జానపద సంస్కృతిలో నాయకా పాత్రలో ఉంది. పలురకాల ఆకారంలో భారత దేశమంతటా కన్పించే ఈ డప్పు తెలంగాణ రాష్ట్రంలో శాస్త్రీయ సంగీత లయ విధానాన్ని జోడించుకున్నది. తద్వారా సినిమాలలో చోటు చేసుకున్నది. మాదిగ కులంవారికే పరిమితమైన డప్పు విస్మృత ప్రచారానికి రావడానికి, చాలా కులాల వారికి నేర్చుకునేందుకు ప్రీతిపాత్రమవడానికి బీజాలు పడింది. 15-20 మందిగల నాట్యబృందం కాళ్లకు గజ్జలు కట్టి డప్పులను వాయిస్తు చేసే నాట్యాన్ని ఉత్సవాలు, ఊరేగింపులకు ముందుగా ఏర్పాటు చేసారు. దేశంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ రసవత్తర నాట్యాన్ని అన్నీ ప్రాంతాలకు, అన్నీ రాష్ట్రాలకు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

బతుకుమ్మ నృత్యం :

భూమి మీద పుట్టిన ప్రతి జీవికి ఒక ఊరు పేరు ఉన్నట్లుగానే నా తెలంగాణ ప్రాంతానికి ఒక ఊరు పేరుతోపాటు, నాది అని చెప్పుకునే ఒక పండుగ ఉంది. అదే బతుకమ్మ. భారతదేశంలో ఏ రాష్ట్రానికి లేని విశిష్టత తెలంగాణకు ఉంది. ఆ విశిష్టతను తెలియజేసేదే బతుకమ్మ పండుగ. తెలంగాణ స్త్రీలు తమ అస్తిత్వంకోసం పడ్డ ఆరాటాల పోరాటాల ప్రతిరూప ఫలితమే బతుకమ్మ పండుగ.

ప్రకృతి (స్త్రీ) యౌవనసూచిక బతుకమ్మ పండుగ. స్త్రీ మూర్తి మానవత్వానికి, భూదేవి సఫలతా చిహ్నానికి స్త్రీ పునరుత్పత్తి శక్తికి, స్త్రీ దేవతరాధనకు ప్రతీక బతుకమ్మ. పండుగ, మానవ మనుగడకు ఆధారమైన మాతృత్వం గురించి మహిళ జీవిత సార్థకత గురించి, సాంకేతిక రూపంలో తరతరాలకు వివరించే పండుగ బతుకమ్మ పండుగ.

ముఖ్యంగా బతుకమ్మ పండుగ దసరా పర్వదినాన జరుపుకుంటారు. ఆశ్వయుజశుక్లపక్ష పాడ్యమి నుంచి మొదలుపట్టి నవమి నాటికి పూర్తిచేస్తారు. మహాలక్ష్మిని పూజచేస్తారు. జానపదులు పాటపాడుతారు. జానపద స్త్రీలు తలంటు స్నానంచేసి రకరకాల పువ్వుల్ని పళ్లెంలో లేదా ఆకులమీద, వెదురు డబ్బాల మీద గోపురాకారంలో ఎత్తుగా పేరుస్తారు. పైన చిన్నచిన్న పసుపు ముద్దల్ని లక్ష్మీదేవిగా భావిస్తారు. పూజగదిలో మూలబతుకమ్మ పెడతారు. స్త్రీలు కొత్త బట్టల్ని కట్టుకుని బతుకమ్మల్ని గుడిదగ్గర లేదా ఇంటి ముంగిట పెట్టే చుట్టు గుండ్రాకారంగా తిరుగుతూ చేతులతో లయాత్మకంగా చప్పట్లు కొడుతు బతుకమ్మ నృత్యం చేస్తారు. ప్రతిరోజు సాయంత్రం మొదలుకొని చీకటి పడేవరకు పిల్లలు పెద్దలు కలిసి ఆటపాటలతో బొడ్డెమ్మను పూజించి పప్పు బెల్లాలతో పలహారాలను పంచి పెట్టి బొడ్డెమ్మతో కూడిన పీటను పూజగదిలో పెడ్తార. బతుకమ్మ పండుగ చివరిరోజు గౌరవమ్మను నీళ్లలో ఓలలాడించడం చద్దులను పంచి పెట్టడం తలపిస్తుంది. ఇలా బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలు సంప్రదాయబద్ధంగా చేస్తు ఆటపాటలతో

కొనసాగిస్తున్నారు. అంతేకాక ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్రీయ పండుగగా ప్రకటించడం మరో విశేషంగా చెప్పవచ్చు.

లంబాడి నృత్యం :

తెలంగాణ ప్రాంతంలో చెప్పుకోదగిన జానపద గిరిజన నృత్యం లంబాడి నృత్యం. ఈ నృత్యం తెలంగాణ ప్రాంతం లోని దాదాపు అన్ని జిల్లాల్లో చేసే నృత్యం లంబాడ నృత్యం. ఇది స్త్రీలు, పురుషులు కలిసి చేసే నృత్యం. వరినాట్లు కోతలు ఇంకా ఇతర వ్యవసాయ పనుల్లో మునిగితేలే బంజారాలు ఎదమరిచి వేడుకగా చేసే నృత్యమే "లంబాడి నృత్యం" రంగురంగుల గుడ్డముక్కల్ని అతుకుతూ, అద్దాలు, పూసలు కుట్టిన బట్టల్ని వెండి, దంతం, ఇత్తడి ఆభరణాలను ధరించి పంటపొలాల్లో కాళ్లగజ్జెలు, చేతి కంకణాల సవ్వడితో లయబద్ధంగా చేసేది లంబాడి నృత్యం. ఈ నృత్యంలో స్త్రీలు పాడే పాటలు వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ రాష్ట్రంలో పెళ్ళిల్లు, హోళి ఏరువాక సందర్భాల్లో బంజారాలు ప్రదర్శి స్తారు.

గుస్సాడి నృత్యం :

తెలంగాణ ప్రాంతలోని గిరిజన తెగకు చెందిన గోండు జాతివారు చేసే చెప్పుకోదగిన జానపద గిరిజన నృత్యం గుస్సాడి నృత్యం. ఇది గోండు జాతివారు చేసే నృత్యం. ఆదిలాబాదు జిల్లా రాజగోండులకు దీపావళి పెద్ద పండుగ. చలికాలం ప్రారంభమయ్యేసరికి పంటలన్నీ చేతికి వచ్చి ఉంటాయి. తాము చెమటోడ్చి చేసిన కష్టం, ధాన్యలక్ష్మిగా నట్టింట చేరి ఉంటుంది. గోడులందరూ ఆటపాటలతో కాలక్షేపం చేసే రోజులు ప్రారంభ మౌతాయి. రకరకాల వస్త్రాభరణాలు వేసుకుని యువ జనులు సంగీత వాయిద్యాలతో అతిథులుగా పొరుగు గ్రామాలకు తరలి వెడతారు. కొమ్ములూదుతూ, తప్పెట్లు వాయిస్తూ యాత్రలు సాగిస్తారు. గోండుల పురాణా గాధలలోని "దండిరియా రౌడ్, సిసి సేదా రౌడ్" అనే కథానాయకులను అనుసరిస్తూ ప్రతి సంవత్సరం నృత్యాలు చేస్తారు.

గోండు యువకులు 20 నుంచి 40 మందిదాకా చేరి చేసే దండారి నృత్యంలో గుస్సాడి నృత్యం ఒక భాగం గుస్సాడి నృత్యంలో ఎందరో పాల్గొనవచ్చు.

దీపావళి నెలలో సాంప్రదాయకమైన ఈ నృత్యం జరుగుతుంది. పౌర్ణమి నాడు కార్యక్రమం ప్రారంభ మౌతుంది. చతుర్ధశ వరకూ జరుగుతుంది. గుస్సాడి నర్తకునికి కావాల్సిన సామాగ్రిలో ముఖ్యమైనవి నెమలి పింఛంతో తయారుచేసిన తలపాగా. ఇందులో గొర్రెపోతు కొమ్ములను కూడా అమర్చుతారు. కృత్రిమగడ్డాలు, మీసాలతో వేషం కడతారు. మేకతోలు కప్పుకుంటారు.

పోతరాజు నృత్యం :

తెలంగాణ ప్రాంతంలో చెప్పుకోదగిన నృత్యాలలో చెప్పుకోదగిన పోతరాజు లేదా పోతురాజు నృత్యం. గంగమ్మ, పెద్దమ్మలాంటి గ్రామదేవతల మగాడిగ పూజలు అందుకునేవారు. "పాడు ఊరికి మంచపుకోడు పోతురాజు" అనేది తెలుగు సామెత. బమ్మెరపోతురాజు ఆంధ్రభాగవత రచయిత బమ్మెర పోతనకి మరోపేరు. పోతురాజు లేకుండా ఏ కొలుపు, ఏ జాతర, ఏ తిరు నాళ్లు, ఏ బోనాలు జరుగవు.అంత ముఖ్యమైనవాడు ఈ పోతరాజు. మైసమ్మ, పోచమ్మ ముత్యాలమ్మ, ఎల్లమ్మ మారమ్మ, ఈదమ్మ, దుర్గమ్మ, మహాకాళి, పెద్దమ్మ మొదలైన దేవతలందరి కోటకు కావలిగా పోతలింగమైన శివుని ఆజ్ఞ మేరకు నిలుస్తాడు. పోతరాజు గ్రామదేవత ఉత్సవాలలో పూనకంతోఉన్న పోతరాజు తన దంతాలతో మేక పోతును కొరికి తలను మొండెంనుండి వేరుచేసి పైకి ఎగురవేస్తాడు. దీనినే "గావుపట్టడం" అంటారు. గ్రామదేవతల ఊరేగింపులో ముందుగా పోతురాజు విగ్రహము ముందుంటుంది. ఈ ఊరేగింపులో కొందరు పురుషుల పోతరాజు వేషం ధరించి ఆడతారు. అలాగే ధరణసంబంధిత నాటకాలు వేసేటప్పుడు ముందుగా పోతురాజు విగ్రహాన్ని పెట్టేనాటకము ఆడుతారు. ఇది

వంశపారంపర్యంగా వస్తున్న ఆచారం. పోతురాజులు శరీరమంతా పసుపు, తెలుపు, ఎరుపు రంగులు పూసుకొని చేతిలో కొరడాలతో చప్పుళ్ళకు లయాత్మకంగా నాట్యం చేస్తారు.

పేరణి నృత్యం :

పేరణి నృత్యం లేదా పేరణి శివతాండవం తెలుగువారి ఒక ప్రాచీన నృత్యం. దీన్నే ''యోధుల నృత్యం'' అని కూడా వ్యవహరిస్తారు. పూర్వకాలంలో యోధులు యుద్ధరంగానికి వెళ్ళబోయే ముందు పరమశివుడి ముందు ఈ నాట్యాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రదర్శించేవారు. ఒరుగల్లును దాదాపు రెండుశతాబ్దాల పాటు పాలించిన కాకతీయుల హయంలో ఈ కళ బాగా ఫరిడవిల్లింది. ఈ నృత్యం మనిషిని ఉత్తేజపరుస్తుందని శివుడికి నివేదనగాను పరిగణిస్తారు. ఈ కళకు సంబంధించిన ఆధారాలు ఓరుగల్లుకు సమీపంలో ఉన్న రామప్ప దేవాలయంలో గల శిల్పకళలో గమనించవచ్చు. లయబద్ధంగా సాగే డప్పుల మోత దీనికి సంగీతం. ఈ కళాకారులు నాట్యం చేస్తూ ఆ పరమశిశుణ్ణి తమదేహంలోకి ఆహ్వానించి అలౌకికమైన అనుభూతిని పొందడానికి ప్రయత్నిస్తారు. కాకతీయుల శకం ముగియగానే ఈ కళ దాదాపుగా కనుమరుగైపోయింది. మళ్ళీ ఆంధ్ర నాట్య పితా మహులుగా పిలువబడే ఆచార్య నటరాజ రామకృష్ణ కృషితో మళ్ళీ తెలుగులో వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రీయ నృత్యంగా ప్రకటించడం జరిగింది. కానీ ఇటీవలి కాలంలో ఈ నృత్యానికి అంతగా ఆదరణ లభించడం లేదు. నృత్యంపై మక్కువ ఉన్న వాళ్ళకు నృత్యం నేర్పించి ఇంకా వెలుగులోకి తీసుకొని రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముగింపు :

జానపద నృత్యాలు పూర్వకాలంలో పనియొక్క అలసటను మరిచిపోవడానికి వారియొక్క మానసిక ఒత్తిడిని, శ్రమను మరిచిపోవడానికి ఈ జానపద నృత్యాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే ఇపుడు ఉన్న పరిస్థితులలో టీ.వీలు గాని లేదా సెల్‌ఫోన్ గాని ఇతర సామాజిక మాధ్యమాల వలన జానపదులు గాని లేదా ప్రజలు ఈ కళారూపాలను మరిచిపోతున్నారు.

పూర్వం జానపదులు కాలక్షేపం కోసం వీదిదగ్గర గాని లేదా ఊరిమధ్యలో గూమిగూడి నృత్యాలు చేసేవారు. అయితే ఈ రోజులలో జానపదనృత్యాలు ముఖ్యమైన పండుగల సందర్భాలలో మాత్రమే ఆడడం మనం చూస్తున్నాం. అవి బతుకమ్మ గాని లేదా బోనాల పండుగ లలో డప్పునృత్యం, పోతరాజు నృత్యాలాంటివి మాత్రమే మనం ఎక్కువగా గమనిస్తున్నాం అయితేజానపద నృత్యాలు చూసేవాళ్ళకు ఆకర్షణీయంగాను, చేసేవాళ్ళకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా ఉంటాయి. జానపదనృత్యాలు ఒక్కొక్కటి ఒక్కోవిధంగా ఉంటాయి. కొన్ని మనలో ఉత్సాహాన్ని నింపుతే, పేరణిలాంటి నృత్యాలు మనలో పోరాటస్ఫూర్తిని నింపేవిధంగా ఉం టాయి. ఇలా కొన్నినృత్యాలు మనకు తెలియకుండానే మనలో శారీరక శ్రమను, అలసటను మర్చిపోయేవిధంగా చేస్తాయి. అయితే ఈ జానపద నృత్యాలు ఎప్పుడు అంత ప్రాముఖ్యతను సంతరించుకోవడం లేదు. పాశ్చత్య సంస్కృతి వలన, సినిమాలలో చేసే పాశ్చాత్య నృత్యాలకు ప్రజలు బాగా ఆకర్షితులు అవుతున్నారు. కనుమరుగు అవుతున్న ఈ జానపద నృత్యాలు వెలికితీసి ప్రజలకు తెలియజేయడమే కాకుండా భవిష్యత్ తరాలకు అందిం చడం ఎంతైనా అవసరం.

ఆధారగ్రంథాలు :

1. జానపద విజ్ఞానం - డా. ఆర్.వి.ఎస్. సుందరం 2. జానపద కళారూపాలు - డా.మిక్కిలినేని రాధకృష్ణ
3. జానపద నృత్యాలు - ఆచార్య చింగి చేర్ల కృష్ణరెడ్డి 4. తెలుగు జానపద విజ్ఞానం సమాజం సంస్కృతి సాహిత్యం - ఆచార్య నాయిని కృష్ణకుమారి

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఉత్తరాంధ్ర జానపద సంస్కృతి – సంప్రదాయాలు పండుగలు

– చిప్పకుల శ్రీలక్ష్మి, విజయనగరం.

జానపద దినోత్సవం :

జనపదాలలో నివసించే జానపదులు తరతరాలుగా వస్తున్న తమ యొక్క సంస్కృతి, సంప్రదాయం మూలాలను నిలుపుకునేందుకు వాటిని కళారూపాలుగా ప్రదర్శిస్తారు. విజ్ఞానం - వినోదం ప్రబోధాత్మకంగా విషయ ప్రధానంగా ఉండే వీటిని జానపద కళారూపాలు అంటారు. వాటిని గ్రామదేవత పండుగలలో, జాతరలో, ఉత్సవాలలో, పొలంపనులు చేసేటప్పుడు సందర్భాను సారంగా ప్రదర్శిస్తారు.నాగరికులు వారిని అనాగరికులని, గత జీవులని తేలికభావంతో అంటారు. 1846వ సంవత్సరంలో డబ్ల్యు.జె.థేమ్స్ ఒక పత్రికకు లేఖ రాస్తూ వీటిని ఫోక్ అనవచ్చా? అని అడిగారు. అప్పటి నుండి (22-08-1846) జానపదం అనే మాట వాడుకలోకి వచ్చి ఆరోజును ప్రపంచ జానపద దినోత్సవంగా జరుపుతున్నారు. వారికి సంబంధించిన ప్రతి పదాన్ని జానపద అని పిలవటం పరిపాటి అయ్యింది.

సంస్కృతి నిర్వచనం :

ఒక సమాజంలో ఉన్న వస్తువు వినియోగం, సంపన్నత, జానపద వ్యవహారాలు కూడా సంస్కృతి. అంతేకాక మానవ సంబంధాలు, ఆచార వ్యవహారాలు కూడా సంస్కృతిలో భాగమే. అలాగే కళలు,విజ్ఞానం,నైతికత కూడా సంస్కృతే.

యునెస్కో(ఐక్యరాజ్యసమితి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ) ఈ విధంగా నిర్వచించారు. ఒక సమజానికి లేదా సమూహానికి చెందిన ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, లౌకిక, వైజ్ఞానిక, భావోద్వేగ అంశాలు ఆ సమాజపు సంస్కృతి అవుతాయి. కళలు, జీవన విధానం, సహజీవనం, విలువలు, సంప్రదాయాలు,విశ్వాసాలు ఈ సంస్కృతిలో భాగాలే.

జానపద సంస్కృతి అంటే వారి కళలు, చేతిపనులు, పనిముట్లు, దుస్తులు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, వైద్యం, పాటలు, ఆటలు, భాష-వ్యక్తీకరణ, లిపి, సాహిత్యంఅన్నీ కలిపినదేవారి సంస్కృతి - సంప్రదాయం. వీటిని విడివిడిగా చూడలేము. పల్లె సంస్కృతి, పట్టణ సంస్కృతి, ఆటవిక సంస్కృతి,గిరిజన సంస్కృతి అని విడదీసుకున్నా ప్రతి ఒక్కరి సంస్కృతిని సంప్రదాయాలను భావాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదీ. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 28 లక్షలు గిరిజనులు ఉన్నారు. వీరు అనేక తెగలకు చెందినవారు.

జానపదులలోని కొన్ని తెగల పేర్లు :

ఉత్తరాంధ్రలో సముద్రమట్టానికి సుమారు 3500 అడుగుల ఎత్తున కొండలపైన, కొండలోయలలో నివాసముంటున్న 11మండలాల్లో సుమారు 3500 గ్రామాల్లో 9.5 లక్షలు జనాభా ఉన్నారు. వీరు అనేక పేర్లతో పిలువబడతారు. గిరిజనులనీ, ఆదివాసులనీ,అడవి మనుషులనీ పిలవబడే వీరు ఒకరి కింద దాస్యం చేసి బ్రతకడం కంటే స్వతంత్రమైన బ్రతుకును, స్వేచ్ఛను కోరుకుంటారు. నాగరికతకు దూరంగా తమదైన సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పాటిస్తున్న అడవి తల్లి ముద్దుబిడ్డలు. వీరిలో జాతాపు,కోయ, సవర, చెంచు, ఎరుకలు, బొంగ,బాన,బొత్తద, కోన, నొగం, పంగు, బొడియా అనుపేర్లతో అనేక శాఖలున్నాయి. భగవత, వాల్మీకి, పైడి, కొండదొర, కొండకాపు, కొండరెడ్డి, మన్నెదొర, గొడియాపోర్జ, గదబ, కాటియా, ఖోండు వంటి గిరిజన తెగలకు చెందినవారు ఉన్నారు. వీరిలో కొందరు కొండ జమీందారులుగా, కొందరు గ్రామాధికారులుగా పాలించారు.

జానపదుల వృత్తులు :

ఆటవిక జాతుల వారికి భక్తి విశ్వాసాలు, అమాయ కత్వంతో పాటు మూఢనమ్మకాలు ఎక్కువ.వేట,పశు పోషణ, ఆహార సేకరణ, అటవీ ఫలసేకరణ, పోడు వ్యవసాయం చేస్తారు. కొర్రలు, రాగులు, చాదలు, సజ్జలు, సామాలు, జొన్నలు, వొరిగెలు, అరికెలు మొదలైన చిరుధాన్యాలు పండిస్తారు. సవరలు అనే ఆదిమ నివాసులు కొండలమీద ఎండిన చెట్లు కొట్టి కర్రలు తెచ్చి కాబడి కట్టి ఇస్తారు. కొండ సరుకులైన పుట్టతేనె, అల్లం, పసుపు, కొండచీపుళ్లు, కందులు, ఇప్పపువ్వు వంటివి తెచ్చి అమ్ముతారు.బదులుగా వారికి కావాల్సిన పూసలు,, కంచు పాత్రలు, ముతకనూలు బట్టలు కొనుక్కోవడానికి కొండ దిగి వస్తారు. సంతలో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు అమ్మకాలు జరిపినప్పుడు వస్తుమార్పిడి విధానాన్ని పాటి స్తారు. అందువలన స్థానిక వర్తకుల దగ్గర మోసపోతుం టారు. సవర భాష నేర్పుకోవడానికి సాహితీవేత్తలు గిడుగు రామ్మూర్తి వంటి వారు వారితో స్నేహంచేసి వారి ఆచార వ్యవహారాలు తెలుసుకుని తమ రచనల ద్వారా ప్రపంచా నికి పరిచయం చేశారు.

సవరలతో నేస్తం కట్టడమంటే మంచిరోజు చేసి నేస్తం కట్టదలచిన సవర వ్యక్తి కుండెడు తేనే, అరటి పళ్ల గెల, పసుపుకొమ్ములు, నాలుగు కొండ చీపుర్లు కట్ట, మండిగ నిండా జొన్నలు, అల్లం, పొగాకు తీసుకుని, నేస్తం కట్టదలచిన వారింటికి వస్తారు. ఆయన అతిధిని ఆదరించి కుర్చీలో కూర్చోపెట్టి ఆ కానుకలను అందుకుంటారు. ఒక ఎరుపు రంగుతలపాగాను, రెండు కమలా ఫలాలను, తవ్వెడు బియ్యాన్ని, పసుపు కొమ్మును, అల్లం ముక్కను, పానకాన్ని, రెండు పొగాకు చుట్టలు అతనికి ఇస్తారు. గడీ ఇశాన్, గడీనం అని మూడుసార్లు అని చీపురు పుల్లలు ఒకరి చేతినుంచి మరొకరు మార్చుకుని రెండు ముక్కలు చేసి పారవేస్తారు. ఆ సవర మాటలకు అర్థం 'నా స్నేహితుడా! నీ స్నేహితుడను'. చీపురు పుల్లలు విరిచి పారవేయడం ప్రమాణం చేయడానికి. ఈ విధంగా ఒక సవరదొరతో స్నేహం కట్టి, స్వచ్ఛమైన సవర భాషను నేర్చుకుని, వారిసంస్కృతి సంప్రదాయాలను అర్థం చేసు కోవడానికి కొండల్లోనే గడపాలి.

ఆచార వ్యవహారాలు :

వీరి ఆచార వ్యవహారాలు ప్రత్యేకంగా ఉంటాయి. అనేకమైన దేవి దేవతలను పూజిస్తారు. సూర్యుని, అమ్మ తల్లిని, ఆకాశాన్ని కూడా కొలుస్తారు. దేవతలకు బలులు ఇచ్చే ఆచారం ఉంది. కోళ్లు,మేకలు, ఎనుబోతులు మొదలైన జంతువులను బలి ఇస్తారు. శకునాలను పాటి స్తారు. సర్పాలను, పాముపడగలను చేతిపై, భుజాలపై, నుదిటిపై పచ్చబొట్టు పొడిపించుకుంటారు. చేతులపై కుటుంబ సభ్యుల పేర్లను పచ్చబొట్టుగా ఉంచు కుంటారు. గారడీ చేసేవాళ్లు, పాములను ఆడించే వాళ్లు, రోడ్లుపై ఇంద్రజాలం చేసే వాళ్లు, కనికట్టు చేసేవాళ్ళు, మనకు నిత్యం కనిపించేవారు. ఇప్పుడు వారి సంఖ్య తగ్గింది. బాణామతి, చేతబడి, చిల్లంగిపెట్టడం దెయ్యాలు భూతాలు పట్టాయని వాటిని వదలగొట్టేం దుకు వ్యక్తులను హింసించడం ఇప్పటికీ మనకు కనిపిస్తూ ఉంటుంది. వారికి నోటి నుండి పళ్లు బలవంతంగా ఊడబెరకడం, వెంట్రుకలను తీసి గుండు చేయించడం, వస్త్రములను ఊడదీసి నగ్నంగా ఊరేగించడం, చెట్టుకు కట్టేసి కొట్టడం, నిలువునా కిరోసిన్ పోసి దహించడం మొదలగు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ఈ సంఘటలను మీడియా తమ ప్రచారం కోసం కాక, వారిలో అవగాహన కల్పించడం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం చేయాలి.

జానపదనృత్యాలు వాద్య పరికరాలు :

పగలంతా కొండలలోనూ, లోయలలోనూ పని పాట లతో అలసిపోయిన వీరు సాయంత్రానికి ఒక చోటికి చేరి వయోభేదాలు మరచి నృత్యంచేస్తారు. వీరి నృత్యాలు థింసా, కోయ డాన్స్,గరగ నృత్యం గజ్జలనృత్యం, చెట్టు భజన, పూసలనృత్యం, నాగిని నృత్యం, వీరనాట్యం, తప్పెటగుళ్లు, తోలు బొమ్మలాటలు, ఇంద్రజాలం,

యక్షగానం, బుర్రకథ, నాటకం, తూర్పుభాగవతం, బయలాట, మయూరి, కట్టి బాజా, కర్రి నాట్యం, గదబ మొదలైన అనేక గిరిజన నృత్యాలు ప్రసిద్ధి పొందినవి. ఈ నృత్యాలు చేసేటప్పుడు గిరిజన వాద్య పరికరాలైన తుడుము,జోడు బూరలు, పాము బూర, కొమ్ము బూర, ఏక్తారా సన్నాయి, సరిగె, డప్పు డమరూ మొదలైన వాయిద్యాల సమ్మేళనంతో వినిపించే గిరిజన సంగీతానికి అనుగుణంగా వారు లయబద్ధంగా సామూహిక నాట్యం చేస్తారు.

థింసా నృత్యం :

ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల జీవనశైలిలో సంప్రదాయానికి ప్రతీకగా వీరికి మాత్రమే తెలిసిన థింసా నృత్యంకు ఎంతోప్రాధాన్యత ఉంది. జానపదుల పండుగలలో ప్రధాన ఆకర్షణ థింసా నృత్యం. అరకులోయ కు సమీపానగల చంపి గ్రామం థింసా నృత్యం పుట్టిన గ్రామం. కళాకారులకు పెట్టిన పేరు దాదాపు 30 మంది గిరిజన మహిళలు ఒకరినొకరు చుట్టూ వలయంగా ఏర్పడి గిరిజన సంగీతానికి అనుగుణంగా పాదాలు కదుపుతూ చేసే నృత్యం. వాద్య పరికరాలను మగవారు వాయిస్తూ ఉండగా స్త్రీలంతా నృత్యం చేస్తారు. పార్వతీపురం ప్రాంతంలో దీనిని జట్టు నృత్యం అంటారు. అలాగే సందర్భానుసారం వచ్చే కంది కొత్త పండుగలోనూ, పెళ్లి వేడుకలలోనూ చుట్టుప్రక్కల గ్రామాలలోని స్త్రీలు అందరు కలిసి రెండు ఉజ్జీలుగా ఏర్పడి పెళ్లికూతురికి రెండు వైపులా జట్టుకట్టి పాటలు పాడుకుంటూ తీసుకువస్తారు.

వివాహ వ్యవస్థ :

వీరు చిన్న వయస్సులోనే వివాహం చేస్తారు. వరుడు, వధువుకు శుల్కం కింద ఆవు, గేదే, పంది, జత కోళ్లు, ఇత్తడి బిందెలు, ధాన్యం ఇవ్వాలి. సంతానం కలగక పోయినా ఇష్టం లేకపోయినా అమ్మాయి వరుడు తన కిచ్చిన శుల్కాన్ని తిరిగిఇచ్చేసి వేరొకరిని వివాహంఆడే అవకాశాన్ని సంప్రదాయం వారికి ఇచ్చింది.

వస్త్రధారణ :

గిరిజన స్త్రీలు చీరకట్టులోనూ, జుత్తుని ముడి వేసుకోవడంలోనూ విభిన్నంగా ఉంటారు. చేతుల నిండా కొయ్యగాజులు, కాళ్లకు లావుగా ఉండే పట్టాలు, ముక్కుకి నత్తు, చెవులకు 4 లేదా 5 రంధ్రాలకు రింగులు వంటివి పెట్టుకుంటారు. మెడలో అనేక పూసల హారాలు ధరిస్తారు. ఆరోజుల్లో బంగారు, వెండి నాణేలను ఆభరణాలుగా ధరించేవారు. స్త్రీలు జాకెట్లు ధరించరు. ఆధునిక నాగరికత తెలిసిన వారు ఆ అలవాటుకు స్వస్తి చెబుతున్నారు.

జానపదుల వైద్యం :

వీరు వైద్యాన్ని నాటువైద్యం అని నాగరీకులు పిలుస్తారు. ప్రకృతిలోని వస్తువుల రోగ నిరోధక గుణాలను కనిపెట్టి వాటిని ఔషధాలుగా వాడుకుంటారు. ఆకులను, వేర్లను ఉపయోగించి కల్వములో నూరి గోలీలుగా, కషాయంగా వాడతారు. సంవత్సరంలో ఏయే ఋతువులలో ఏయే చెట్టు మూలికలను తెచ్చుకోవచ్చు చూసి ఎండబెట్టి చూర్ణం కింద చేసుకుని అనుపానంతో తీసుకుంటారు. దీనిని నాటువైద్యం అని కొట్టిపారేయకుండా శాస్త్రీయతను అర్థం చేసుకునిసాంకేతికను జోడించి ప్రజలకు అందజేయాలి.

జానపదుల మతం - ఆలయాలు - జాతరలు - పండుగలు :

జానపదులు తమకు తెలియని అతీత శక్తులేవోతమ చుట్టూ ఆవరించి ఉన్నాయని వ్యాధులు, ఉపద్రవాల రూపంలో గ్రామంలో ఉన్న తమను, పంటపొలాలనూ, పశువులనూ బాధిస్తున్నాయని నమ్మి గ్రామదేవతల రూపంలో వారిని కొలవడం ప్రారంభించారు.ఆ దేవతా శక్తికి చూపించే కృతజ్ఞత పండుగలు, జాతరల రూపంలో వ్యక్తీకరిస్తారు.పండుగలలో సంస్కృతి సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆటలలో, నృత్యంలో ప్రదర్శిస్తారు. దేవతలను కొలిచేటప్పుడు కుల మత, రాజకీయాలకు అతీతంగా కొలుస్తారు.

పండుగలు – జాతరలు :

ఉత్తరాంధ్రలో గైరమ్మ సంబరాలు, నందన్న ఉత్సవాలు చేస్తారు. గ్రామీణ స్త్రీలు పంటలు బాగా పండాలని, వర్షాలు బాగా పడాలని దశమి తర్వాత చేసుకుంటారు. గౌరీపూర్ణిమ రోజున నందన్నను తెస్తారు. విజయనగరం పైడితల్లమ్మ,అనకాపల్లి నూకాలమ్మ,విశాఖపట్నం కనక మహాలక్ష్మమ్మ, రాయగడ మజ్జి గౌరమ్మ, శంబర పోలమాంబ, సంచాం అసిరితల్లి, కార్తీక శుద్ధ చవితి నాడు కంచమ్మ పండుగ, ఎర్ర గుమ్మడికాయ సాగునోవా పండుగ, బల్లి పోరోగ్ పండుగ, ఎల్లమ్మ, రెండు పాములు మెలితిరిగి ఉన్న శిల్పం, ఎరుకమ్మ, 4 అడుగుల ఎత్తుగల కర్ర జాలియ దేవుడు, చింతచెట్టుకింద గల రాయి దేవతగా తొల్లిడి కోత, గండ్రగొడ్డలి ఆకారంలో పూజింప బడే మందెంగి దేవత, చిన్న కోడిగుడ్డు ఆకారంలో పెద్ద దేవుడు, మూడు ఇనుప ముక్కల రూపంలో గంగదేవత, పంటల దేవుడు, శంకుదేవుడు, పుట్టలోని బంకమట్టి, నందిదేవుడు, చిన్న గుండ్రని రాయిజకర దేవుడు,రాయి ఆకారంలో అమ్మతల్లి పండుగ,మూడు ఇత్తడి గిన్నెలు గ్రామదేవతలుగా పూజింపబడతాయి. ఈ గ్రామ దేవతలు వేపచెట్లకింద, పాము పుట్టలోనూ, శిలారూపంలోనూ, కత్తి, నాగలి, శూలం మొదలైన ఆయుధాల రూపంలోనూ వెలుస్తాయి. ఆలయ పూజారిని జన్ని అని, ఎజ్జోడని, దాసరోడని అంటారు.

గ్రామదేవతల ఉత్సవాలలో ప్రధానంగా :

1. చాటింపులు, ధ్వజస్తంభం ఆరోహణం- అవరోహణం, వాహన సేవలు, అగ్నిగుండం తొక్కడం, గరగలు, ఘటాలు, మొక్కబడులు, పాలధార, అంజలిరథం,తొలేళ్ళోత్సవం, సిరిమానోత్సవం, ఉయ్యాల-కంబాల, తెప్పోత్సవం, రథోత్సవం మొదలైనవి సుమారు నెలరోజులు ఉంటాయి.
2. కళాకారులకు సంబందించి జముకు, తోలు బొమ్మలాట, పులివేషం, పగటి వేషాలు, కత్తిసాము - కర్రసాము, ఇంద్రజాలం,బుర్రకథ, తూర్పు భాగవతం,హరికథలు, పురాణాలు మొదలైన జానపద కళలు ప్రదర్శింపబడతాయి.
3. దేవతలకోసం గ్రామస్థులు థింసా,చెక్కభజన, పండరి భజన, తప్పెటగుళ్లు,గరగనృత్యం, వీర నాట్యం, కోలాటం, నృత్యాలు చేస్తారు. అందరూ పాల్గొంటారు.
4. గ్రామదేవత పండుగలో జానపదులు వాయించే విశేష వాద్య పరికరాలు తుడుము, మోరీ,డోలు, కిరిడి, డప్పు, బాకా, జోడు కొమ్ములు,సన్నాయి, పిన్నల కర్ర ముఖ్యమైనవి.
5. గ్రామదేవతల పండుగలలో దేవతలకు పుట్టింటి వారు గానీ, అత్తింటివారు గానీ, తరతరాలుగా కుటుంబ పెద్దలు కానీ, గ్రామస్థులు కానీ, ధర్మ కర్తలు కానీ ఏర్పరచిన ట్రస్టు కానీ, సంస్థానాధీశులుగాని, రాజులుగాని ఇచ్చిన మాన్యాలు, భూములుపైన వచ్చిన ఆదాయంతో జాతరను నిర్వహిస్తారు. లేదా హుండీలలో నగదు రూపంలో, కానుకల రూపంలో వచ్చే ఆదాయం కూడా ఖర్చు పెడతారు. నెల రోజులు వివిధ వస్తుసేవలను అందించే వ్యాపారస్తులు, పండుగకు వచ్చే బంధువుల రాకపోకలు చాలా ఉత్సాహంగా ఉంటుంది.

జానపద కళాకారులకు మెరుగైన జీవితాన్ని అందిస్తూ వారి కళలను, వాద్య పరికరాలను, వారి పాటలనూ, సాహిత్యాన్ని భద్రపరుచుకుని ముందు తరాల వారికి అందించవలసిన బాధ్యత మనందరిదీ!

పరిశీలించిన గ్రంధాలు :

1. గిడుగు రామ్మూర్తి గారి పరిశీలన
2. జానపద విజ్ఞానాభ్యుదయం-డాక్టర్ జి.ఎస్ మోహన్

3. తెలుగు వెలుగు మాసపత్రికలోని వ్యాసాలు
4. ఆంధ్రజ్యోతి దినపత్రిక వ్యాసము 22-08-2019
5. విజయనగర వైభవానికి దిక్సూచి(2017)- చివుకుల శ్రీలక్ష్మి
6. తెలుగు జానపద కళారూపాలు (2012) ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి
7. విజయనగరం జిల్లా గ్రామ దేవతలు ఒక పరిశీలన(2005)-డా॥శ్రీమతి నందివాడ అన్నపూర్ణ
8. ఉత్తరాంధ్ర జానపద కళలు(2005)- డా॥ బద్రి కూర్మారావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సామెతలు

- చుక్కాగొలయ్య, పరిశోధక విద్యార్థి, జానపద కళల విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ,తెలంగాణ.

సామెతలు :

సామెతలు జనవ్యవహారంలో వినవచ్చే మణిపూస ల్లాంటి వాక్యాలు. ఇందులో వ్యక్తిజీవితంలోనూ సంఘ జీవితంలోనూ అనుభవం చేత గోచరమయ్యే సత్యాలుం టాయి. సామెతల కారణంగా సంభాషణ చమత్కారంగా ఉంటుంది. విషయం హృదయానికి, మనస్సుకు హత్తు కొని పోయేటట్టుగా ఉంటుంది. ఇవి జనవనహారంలో బాగా తెలిసిన, వ్యక్తి పొందిన వాక్యాలు. నలుగురి నోటపడి నలిగిన వాక్యాలు. ఈ కారణంగా 'సామెత లేని మాట సామెత (అనగావిందు) లేని ఇల్లు అంటారు. సామెతలు బాహ్యాస్వరూపంలో చిన్నగా ఉన్నా ఇవి ధ్వన్యర్థాన్ని కలిగి ఉండడం వల్ల కంటికి కనిపించని విధంగా మనసుకు కొన్నిసార్లు గాయంచేసి, నొప్పిస్తాయి. చేతిలో ఆయుధం లేకుండా, గాయం స్వరూపం తెలియ కుండా తమ పనితాము చేసుకుపోతాయి. విల్లుపట్ట కుండా బాణం వదలడం లాంటిది సామెత. అదే కొన్ని సార్లు మనసుకు ఆహ్లాదాన్ని కలిగించి గంభీర సన్నివేశాన్ని తేలిక పరుస్తుంది. సామెతలు ఎప్పుడు పుట్టినా, ఎలా పుట్టినా అవి చమత్కారంగా సాలంకారంగా ఉంటేనే కల కాలం నిలుస్తాయి. ఇవి వాడుకలో ఉంటేనే వాటికి విలువ. డబ్బు మారకం, కరెన్సీ (నాణముల, నోట్లు) ఎంతో సామెతలు కూడా అంతే వాడుకలో ఉన్నంతసేసే వాటి విలువ ఉంటుంది.

సామెత - పదవివరణ :

సామెత అనే పదం 'సామ్యం' అనే దానినుండి ఏర్పడింది. దృష్టాంతమనే అర్థంలానే హంగరీ భాషలో పెల్డబెగెడ్ (Pelda begged) అని అంటారు.

అరబ్బి భాషలో మతల్ అని

ఆంగ్లం భాషలో - ప్రోవెర్బ్ (Proverb)

సంస్కృతం - సూక్తి, సుభాషితము

తమిళంలో - పళమొళి (పాతమాట)

కన్నడంలో - గాదె, నాణ్ముడి

హిందీ - కహవత్

అనియు వివిధ భాషలలో వివిధ పేర్లతో సామెతలను పిలుస్తారు. తెలుగుభాషలో సామ్యము నుంచి సామెత ఆవిర్భవించింది. కాబట్టి సామెతల్లో కూడా తప్పనిసరిగా ఏదో ఒక పోలిక ఉంటుంది. సామెత అనే పదాన్ని మొదటిసారిగా వరాహపురాణంలో (15వ శ॥) తొలిసారిగా ప్రయోగించబడ్డది.

సామెతకు పర్యాయపదాలు, నానుడి, లోకోక్తి, శాస్త్రం, జనశ్రుతి, రాయలసీమ ప్రజలు ముఖ్యంగా అనంతపుర మండల వాసులు "అదేమో శాస్త్రంచెప్పినట్లు" అని ప్రయో గిస్తారు. నెల్లూరు సీమవాసులు సామెతను -సాటువ, చాటువ, చాటవ అని అంటారు.

పై సామెతల్లోని వివరణ ఏమిటి అంటే పటేల్, పట్వార్లు ఉన్న కాలం నాటివ్యవస్థను, భార్యపై భర్త దౌర్జన్యాన్ని, తెలంగాణ సమాజాన్ని సూచిస్తుంది.

సమాజ అవసరాలకనుగుణంగా పాత సామెతల స్థానంలో కొత్తకొత్త సామెతలు వెలుగుచూస్తునే ఉంటాయి. కొన్ని పాతవాటికి అనుకరణలు పుట్టవచ్చు. కొన్నింటిని కొత్తగానే సృష్టించవచ్చును. దేశచరిత్రను జాతిసంస్కృతికి, ప్రాచీన భాషా స్వరూపానికి మానవ నైజానికి సామెత అద్దంపడుతుంది. నాగరికత వికసిస్తున్న ఆధునిక సమాజంలో సామెతల వాడుక క్రమంలో క్షీణిస్తుంది. సామెతలు కనుమరుగైపోతున్నాయి. కానీ, ఇప్పటికి సామెతలు పల్లెసీమలలో రాజ్యమేలుతున్నవి. జానపదులు లేక పల్లీయుల నోళ్ళనిండా సామెతలే నర్తిస్తుంటాయి. ఊటలుగా ఊరుతుంటాయి. వారు నోరువిప్పితే చాలు

సామెతలు పరిమళం గుప్పుమంటుంది. ఏదోఒక సామెత ప్రసిద్ధి చెందింది అంటే సామెతలేని మాట విందులేని ఇల్లు లాంటిదట. సంభాషణలోసామెతల ప్రాచుర్యాన్ని నొక్కి చెప్తుంది. ఈ సామెత జాతికి, భాషకు విందు, పసందు చేసేవి సామెతలు, తరతరాలు తరచి చూసిన జీవితాలు, వడబోసిన అనుభవాలు, రాబోయే తరాలకు పరంపరగా అందించే వారసత్వ మౌఖిక విజ్ఞానం సామెతలు.

సామెతలు – విభజన :

సామెతలు చాలా సంక్షిప్తమైన వైవిధ్యమైనవీ కావడం చేత వాటిని వర్గీకరించడం కష్టసాధ్యం. వీటి విభజనను విద్వాంసులు ఎన్నో మార్గాలను సూచించా. సామెతలను విభజించడంలో ముఖ్యంగా రెండు పద్ధతులున్నాయి. ఆకారాదిగా విభజించడం. దీనిలో రెండు ఉపమార్గాలున్నాయి. 1.సామెతల మొదటి మాటను తీసుకొని అకారాదిగా అమర్చడం లేక సామెతల్లో ముఖ్యమైన పదాన్ని తీసుకొని లకారాదిగా కూర్చడం. వస్తువును ఆధారంగా చేసుకొని వర్గీకరించడం జరిగింది. ఈ సామెతలను కొన్ని రకాలుగా పేర్కొనడం జరిగింది. వాటిలో

1. సూత్రపు సామెతలు
2. ఉపమాన రూపక సామెతలు
3. నీతిబోధక సామెతలు
4. పౌరాణిక సామెతలు
5. ప్రశ్నరూప ప్రశ్నోత్తర సామెతలు
6. సాంఘిక, వ్యవహారాల, విశ్వాసాలు, నమ్మకాలు
7. వ్యక్తిగత సామెతలు
8. హాస్యపు సామెతలు
9. వ్యవసాయ సామెతలు
10. శబ్దాలంకార సామెతలుగా పేర్కొనడం జరిగింది.

ఈ సామెతలు కొన్ని రకాల లక్షణాలు కలిగి కనిపిస్తాయని విమర్శకులు భావిస్తున్నారు.

1. సంక్షిప్తంగా ఉండటం, 2. ప్రచారరూపంగా ఉండటం, 3. సౌమ్యంగా కలిగి ఉండటం, 4. తరతరాల అనుభవ మూలం, 5. చప్పదలచుకున్న విషయాన్ని ప్రభావవంతంగా చెప్పడం, 6. విస్తృతంగా పదిమందికి తెలిసినవి. పదేపదే పదిమందీ వాడేవి అయిఉండటం. 7. ఒక భావాన్ని లేదా అంశాన్ని సుబోధకంగా, దృష్టాంత పూర్వకంగా చెప్పడం, 8. లోకజ్ఞానానికి, జాతి అనుభవానికి సరిపోలి ఉండటం, 9. చెప్పిన విషయాన్ని అందరూ గుర్తించే సత్యాన్ని లేదా ప్రయోజనకరమైన ఒక ఆలోచనను రేకెత్తించేదిగా ఉండటం. 10. ఒక అంశాన్ని చెప్పటంలో అలంకారం, చమత్కారం తరుచుగా ఉండటం, 11. యతి, ప్రాసలు, శ్రావ్యత కలిగి ఉండటం, 12. సంపూర్ణ వాక్య రూపంలో ఉండటం.

పైన పేర్కొన్న లక్షణాలను సామెతలు కలిగి ఉంటాయి.

"అత్తలేని కోడలు ఉత్తమురాలు – కోడలు లేని గుణవంతురాలు"

వివరణ :

పై సామెత అత్తాకోడళ్ళ అనుభవం నుంచి పుట్టింది. ఎలాగ అనగా కోడలుగా ఉన్న ఇంటిలో అత్తలేక పోతే కోడలు ఎలాంటి గొడవలు లేకుండా గుణవంతురాలుగ కనిపిస్తుంది. అదేవిధంగా కోడలు లేని అత్త అంటే ఇంట్లో కోడళ్ళు లేకుంటే ఇతరులతో మర్యాదలగూర్చి గొప్పగా చెపుతుంది.

"కరణంతో కంటుపడితే కాడికదలడు"

వివరణ :

పూర్వకాలంలో గ్రామపరిపాలన భాగంలో పటేల్, పట్వారి, కరణం అనే అధికారులుండేవారు. కరణం అనేవాడు భూమి ఆస్తి పన్నులను కొలతలను నిర్వహించే వాడు. ప్రజలమీద పెత్తనం చెల్లించేవాడు. కాబట్టి వాడితో గొడవ పెట్టుకుంటే భూమికప్పం(పన్ను) కట్టమంటాడు కాడి (నాగలి) దున్నకుండా ఆడుకుంటాడని అర్థం.

"కరక్కాయ కన్నతల్లి వంటిది"

వివరణ :

ఇది ఆరోగ్యవంతులైన రోగుల అనుభవం నుండి

పుట్టింది. కరక్కాయను దగ్గు, జలుబుకు వాడీ వాడు అంటే మనకు కన్నతల్లి ఎలాచూసుకుంటుందో కరక్కాయ కూడ వేసుకుంటే అమ్మలాగా మంచి చేస్తుంది.

"మబ్బు విడిచిన ఎండ, మొగణ్ణి విడిచిన ముండ"

వివరణ :

వర్షం పడి అప్పుడే పొద్దు పొడిచినట్లు ఎండకొట్టడం అంటే జోరుగా ఉండటం అని దీని యొక్క అర్థం.

"అయినవారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో"

వివరణ :

సంబంధలోని దగ్గరివారికి విందులో విస్తరి ఆకులో భోజనం పెట్టడం సంబంధంలేని వారికి ఇంట్లో కంచాల్లో పెట్టడం అంటే దగ్గరి వారిని చిన్నచూడటం అని అర్థం.

"రామాయణం రంకు, భారతం బొంకు"

వివరణ :

రామాయణంలో లేనిది ఉన్నట్లుగ కల్పించి చెప్పడం, భారతంలో లేకున్నగా ఎక్కువగా ఉందని అబద్దం ఆడటం.

"వసు దేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నట్లు"

వివరణ :

కష్టం వచ్చినప్పుడు ఎంతచిన్నవాడైన సరే వాడికి ప్రాధేయపడటం అని అర్థం.

"తన నేరనమ్మను తీర్థంల జాడూ, తాగ నేరనమ్మను తాళ్ళుల జూడు"

వివరణ :

అతిగ తిండిబోతులు తెల్వకుండ జాతరలో నేర్చుకోవాలి. తాగటోనికి తాళ్ళే లోకం అన్నట్లు.

"ఇంటికి పెద్దకొడుకై పుట్టడం కన్నా గాడిదై పుట్టడం మేలు"

వివరణ :

ఒక ఇంట్లో అన్ని బాధ్యతలను మోసేది ఇంటిలో ఉన్న పెద్దకొడుకే. అందుకే గాడిద ఎంత బరువును ఎత్తిన ఓపికగా పోతుంది. ఉంటుంది. అంటే అన్నీ బాధ్యతలలో కంటే గాడిదకు ఎలాంటి కష్టం ఉండదు అని అర్థం.

"పందికేమి దెలుసు పన్నీటి వాసన"

వివరణ :

చెడ్డవానికి మంచిగురించి తెలువదు అన్న అర్థంలో వాడుతారు. పంది మోరీలబురదలో పొర్లుతుంది. దానికి సువాసన తెల్వదు. కాబట్టి దీనిని మంచి చెడ్డలకు వాడుతారు.

"కాకి ముక్కుకు దొండపండు"

వివరణ :

అందవిహీనంగా ఉన్నోడికి అందాన్ని కల్పించి చూపడం.

"కాకిపిల్ల కాకికి ముద్దు"

వివరణ :

ఇక్కడ తన అన్నభావం ఉన్నచోట ప్రేమ ఎక్కువగా ఉంటుంది. కాకి నల్లగా ఉంటుంది. కాని దానికి కూడా అందం ఉంటుంది. ఎవరికి వారే ముద్దుగా కనబడతారు అని వాక్యంలో వాడుతారు.

"చేతులు కాళాక ఆకులు పట్టుకోవడం"

వివరణ :

పూర్తిగ చెడిపోయిన తరువాత మంచి చేయడం, బాగుచేయడం అనగా ఏదైనా ఒక పనిని చెడిపోయిన తరువాత ఆలోచించి బాగుచేయడం వల్ల ఫలితం ఉండదు అని అర్థం.

"పెళ్ళికి వెళ్తూ పిల్లని చంకన బెట్టుకొని వెళ్ళాడట"

వివరణ :

అశుభం జరగడం అనగా శుభకార్యానికి వెళ్ళేటప్పుడు పిల్లి ఎదురురావడం అశుభమని భావించడం.

"పరుగెత్తి పాలు తాగడం కన్నా నిలబడి నీళ్ల తాగడం మేలు"

వివరణ :

మనకు ఉన్నదానితో సంతృప్తి చెందడం అనే అర్థంలో వాడుతారు. లేనిదానికోసం వెతుకులాడక, మనకు ఉన్నదాంట్లో సంతోషంగా ఉండటం.

"ఆకలి రుచి ఎరుగదు- నిద్రసుఖమెరుగదు"

వివరణ :

అతిగ ఆకలిగా ఉన్నప్పుడు నాలికకు ఎలాంటి రుచి అవసరం ఉండదు. అలాగే నిద్రబాదున్నప్పుడు ఎలాంటి చోటు అయిన సరే నిద్ర పోవడం జరుగుతుంది.

"మంచం మీద మొగుడు- మంచం దిగితే యముడు"

వివరణ :

భార్యభర్తలు ఎప్పుడు పోట్లాడుకోవడం అనగా ఒక భర్తతన భార్యను కష్టపెట్టడం జరుగుతుంది. ఇందులో రాత్రంత భార్యగాను, పగలంత పరాయిస్త్రీగా దూషించడం అన్నవాక్యం అర్థం.

"పేరుకు పెరుమాళ్ళు - తినేది అయ్యవారు"

వివరణ :

భక్తులు దేవునిపేరుమీద కానుకలు ఇస్తే, వానిని అనుభవించేది అయ్యవారు (పూజారులు) దీనినే ఒకరి పేరుతో ఇంకోకరు తినుడు అర్థం.

"పంటకు పెంట - వంటకు మంట"

వివరణ :

వ్యవసాయ సాంప్రదాయంలో వాడుతారు. పంట పండాలంటే ఎరువు (పెంట) వేయాలి. అదేవిధంగా వంట వండుకోవాలి. అంటే మంట మండాలి అని అర్థం.

"తగువు జెప్పు ధర్మరాజా అంటే దుడ్డె బర్రె నాదే అన్నడట"

వివరణ :

ఒక వ్యవసాయరైతు దగ్గర ఒక బర్రె దుడ్డె గురించి ఇరువురికి గొడవ జరుగుతుంది. వారిద్దరికి న్యాయం చెప్పడానికి ఒక పెద్దమనిషిని పిలుస్తారు. అతను వారికి న్యాయంచేయడం వదిలేసి ఈ బర్రె దానికి పుట్టిన దుడ్డె నాదే అని అన్నాడట. అనగా ఇరువురి మధ్యలో ఇంకోకరు ఎత్తుకెళ్లినట్లు.

"అడగంది అమ్మయినా అన్నంపెట్టదు"

వివరణ :

అడగకుంటే ఏదైనా ఊరికే ఇవ్వరు అని అర్థం.

"కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందన్నారు"

వివరణ :

మన యొక్క తప్పును మనమే బయటపెడితే మనకే అవమానం అన్న అర్థంలో వాడుతారు.

"నోరు మంచిదైతే ఊరు మంచిదయితది"

వివరణ :

మంచిగ మర్యాదపూర్వకంగా పలకరిస్తే అంత మంచేదవుతుంది.

"అత్తమీద కోపం, దుత్తమీద చూపినట్లు"

వివరణ :

ఒకరిమీద ఉన్న ఆవేశాన్ని మరొకరి మీద ప్రయోగం చేయడం. దీనినే ఈవిధంగా చూపవచ్చు. కోడలును ఇంట్లో అత్త తిడుతుంది. దానికి కోడలు కోపంతో అత్తను ఏమి చేయలేక వంటింట్లో ఉన్న ఏదోఒక పాత్రను పగలకొడుతుంది.

"ఇంటిగుట్టు లంకకు చేటు"

వివరణ :

ఇంటిలో రహస్యాన్ని బయటపెడితే ఇల్లే ప్రమాదంలో పడుతుందని అర్థం.

"కోర్టుకెక్కి ఓడినోడు కోర్టులేడిశిండు, గెలిసినోడు ఇంట్లేడిశిండు"

వివరణ :

ఓడిపోయినవాడు తాను ఓడిపోయినందుకు, కోర్టునే బహిరంగంగానే ఏడ్చాడు. తాను కోర్టుచుట్టు తిరిగి తిరిగి అప్పులు అయినందువల్ల ఏడ్చాడు. గెలిచినవాడు సంతోషించక ఇంటికి వచ్చి తను కూడ ఏడ్చాడు.

"ఉంటే ఉగాది లేకుంటే ఏకాశి"

వివరణ :

డబ్బులు ఉన్నప్పుడు పండుగ చేసుకోవడం, లేకుంటే

ఉపవాసం ఉండటం, అనగా ఏదైనా దాచుకుని మితంగా తినాలి. ఖర్చులు వృధాపెట్టరాదని అర్థం.

"చదువు సారెడు, బలుపాలు దోసెడు"

వివరణ :

చదువడం రాకపోయిన గాని రాయడానికి పెన్నులు పెన్సిల్లు బోలేడున్నాయి అని అర్థం. చదవడం తక్కువ. రాయడం ఎక్కువ అని అర్థం.

"పాడి ఉంటే పని తీరదు"

వివరణ :

ఆవులు పాలిచ్చేవి ఉంటే పని తీరదని అర్థం, మానవులు వ్యవసాయానికి కన్నా ముందు పాడి (పాల ఉత్పత్తులు) మీదనే ఆధారపడి జీవిస్తారు.

"పెంట తవ్వుతుంటే పెంకాసులు ఎల్తుంటై"

వివరణ :

పై వాక్యంలో రెండు అర్థాలున్నాయి. మొదటిది పెంట అనగా గ్రామాలలో వృధా ఇంట్లో చెత్తను ఒక కుప్పలాగా పోస్తారు. దీనినే పెంట అంటారు. అంటే ఈ పెంటను తవ్వుతుంటే పూర్వం దానిలోవేసిన కంపు అంత బయట పడుతుందని అర్థం. రెండవది ఒక తప్పు వెతుకుతే గతంలో చేసిన తప్పులన్నీ బటయపడుతాయని అర్థం.

"దున్నపోతు ఈనిందంటే చెంబుతీరా పాలు పిండుదాం అన్నట్లు"

వివరణ :

తెలివి తక్కువ తనాన్ని ప్రదర్శించడం.

"కందికి సమరుండదు, కాపుకు నెనరుండదు"

వివరణ :

కందిపప్పుకు చమురురాదు, అలాగే కాపు వానికి దయాగుణం ఉండదని అర్థం.

"వెలమలున్న ఊరు కొంగలుతొక్కిన పాలం ఒక్కటే"

వివరణ :

వెలమలు అనగా కాపు కాలంలో ఒక తెగవారు ఒక ఊరిలో ఉంటే ఆ ఊరు అభివృద్ధిచెందదు. అలాగే నాటేసిన పొలం అంత కొంగలు తొక్కడం వలన వరి మునిగిపోతుంది. కనుక పంటపండదు.

ముగింపు :

జానపద జీవనంలో సామెతలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. ఆనాటి కాలంలో జానపదులు వారి ఆలోచనలను, నియమాలను, పనులను జీవన విధానాలను సామెతల రూపంలో చెప్పుకునేవారు. కొందరు శ్రమనుండి అలసటను పొందడానికి ఒకరిమీద ఒకరు సామెతలను వదులుతు పనులను చేసుకునేవారు. నేటికాలంలో అలాంటి ఆచారాలు సంప్రదాయాలు కనుమరుగైపోతున్నాయి. జానపదులు జీవనస్థితిగతులు మారడం వల్ల పల్లెలను విడిచి పట్టణాలకు వలస వెళుతున్నారు. పట్టణాలలో జీవన మార్పులవల్ల సంస్కృతిని మరిచిపోతున్నారు. కాబట్టి ఆనాటి కళలన్నీ కాపాడుతూ నేటితరాలకు వాటియొక్క విలువలను తెలియజేయడం అందరి బాధ్యతగా చెప్పవచ్చును.

ఆధారగ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. సుందరం
2. తెలుగు జానపద సామెతలు - బి.దామోదరావు
3. తెలుగు సామెతలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1998
4. తెలుగు సామెతలలో సంఘచిత్రణం - టి.ఇ. రామనర్సయ్య

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గ్రామ దేవత కలికిరి ఎల్లమ్మ తిరునాళ్ళు

– డా॥ పి. కుమారి నీరజ, తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ పిజి కళాశాల, పుత్తూరు.

గ్రామ దేవతలు గ్రామాలను కాపాడుతుంటారు. ప్రజల కోర్కెలను నెరవేరుస్తూ దొంగలనుండి, రోగాల బారినుండి ప్రజలను, పంటలను, పశుసంపదను కంటికి రెప్పలా కాపాడుతూ ప్రజలకు పెద్దదిక్కై పూజలందు కుంటుంటారు. వీరు ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడుతుంటారు.

ఎల్లమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, చౌడమ్మ, ముత్యా లమ్మ,పెద్దింటమ్మ, మూలస్థానమ్మ, కావమ్మ, మాతమ్మ ఇలా ఎందరో దేవతలు వివిధ ప్రాంతాల్లో గ్రామ దేవతలుగా ఆరాధింపబడుతున్నారు. గ్రామ రక్షణకోసం పోతరాజు, వీరభద్రుడు వంటి పురుష దేవుళ్ళు ఉన్నారు. వీరందరినీ ప్రసన్నం చేసుకోవడానికి గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు ఉత్సవాలు చేస్తారు. వాటినే జాతరలని, సంబరాలని, తిరునాళ్ళని పిలుస్తారు.

చిత్తూరు జిల్లాలో తిరుపతి మదనపల్లె జాతీయ రహదారి మధ్యలో తిరుపతికి 75 కిలోమీటర్ల దూరంలో కలికిరి అనే ఊరుంది. ఆ గ్రామ దేవత ఎల్లమ్మ. ఇక్కడ ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా తిరనాల జరుగు తుంది. ఈ దేవత చాలా మహిమగలదని ప్రజల నమ్మకం. అందుకు నిదర్శనం ఈ గుడి అభివృద్ధేనంటారు.

కలికిరి అంటే కలికి నిలయం. ఈ గ్రామ నామం అనేకార్థాలను సూచిస్తోంది. నల్లని స్త్రీలు ఉండే పల్లె అనీ, అందమైన ఆడవారున్న గ్రామమనీ, అడవి పందులు (కిరి అంటే పంది అని అర్థం) తిరిగే స్థలమని, నెమళ్ళు నివసించే ప్రాంతమనీ, సంపదలకు నిలయమనీ, సామర్థ్యానికీ, శూరత్వానికీ పేరు పొందిన ప్రాంతమనీ అనేకార్థాలు. కల్లు అంటే రాళ్ళు. ఈ ప్రాంతంలో రాళ్ళు ఎక్కువగా ఉండటం వల్ల ఈ పేరు వచ్చివుండవచ్చు.

ఒక కథ ప్రచారంలో వుంది. కలికమ్మ, మలికమ్మ అనే అక్కచెల్లెండ్లైన భోగం స్త్రీల పేరుమీద కలికిరి వచ్చిందని గ్రామస్థుల కథనం. వీరిద్దరూ తమ దగ్గరున్న ధనంతో గ్రామం చుట్టూ కోట కట్టించి కట్టడి చేశారు. అంతేకాదు గ్రామంలో పాలాలను సస్యశ్యామలం చేయడానికి ఒక పెద్ద చెరువును త్రవ్వించారు. దానికే కలికిరి చెరువని పేరు.

3వ శతాబ్దంలో పల్లవరాజులు, ఆ తర్వాత చోళ రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. 13 వ శతాబ్దంలో చోళరాజ్యం పతనమవడంతో సాళువ రాజులు, యాదవ రాజులు ఈ ప్రాంతాన్ని ఏలారు.1324వ సంవత్సరంలో ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ ఈ ప్రాంతాన్ని ఆక్రమించు కున్నాడు కానీ చాలా కాలం అతని పాలన జరగలేదు. 1326కు ఈ ప్రాంతం విజయనగర సామ్రాజ్యంలో కలిసిపోయింది. తర్వాత 330 సంవత్సరాలకు అంటే 1656లో గోల్కొండ నవాబుల పాలనలోకి వచ్చింది. 1801లో ఈ ప్రాంతం ఇంగ్లీషువారి పాలనలోకి వచ్చింది. 1911 ఏప్రెల్ ఒకటిన చిత్తూరు జిల్లాను ఏర్పరిచారు బ్రిటిష్ వారు. కలికిరి గ్రామం అలా చిత్తూరు జిల్లా వాయ ల్పాడు తాలూగా మేడికుర్తి ఫిర్కాకు చెందినది. ప్రస్తుతం కలికిరి మండల కేంద్రం.

జానపదులు ఎల్లమ్మగా కొలిచే ఈ దేవత రేణుకాదేవి. ఈమె జమదగ్ని మహర్షి భార్య. పరశురాముని తల్లి. ఈ ఎల్లమ్మ అనే మాట అచ్చ తెలుగు. మహారాష్ట్ర, కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాల్లోనూ ఎల్లమ్మ అనే గ్రామ దేవత ఉన్నట్లు తెలుస్తోంది.

ఆంధ్ర ప్రాంతాన్ని పాలించిన కాకతీయుల కులదేవత ఎల్లమ్మ. విజయనగర రాజుల గ్రామదేవత పట్టణం ఎల్లమ్మ.

కలికిరి ఎల్లమ్మ ఆ ప్రాంతానికి ఎలా వచ్చిందనడానికి కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కలికిరి గ్రామంనుండి జంగం కులస్థులు ముత్యాలు, పగడాల వ్యాపార నిమిత్తం

పైదేశం అంటే కర్ణాటక పోయేవారు. ఇప్పటికీ వెళ్తున్నారు. కర్ణాటకలో జంగమకులం వారిని లింగాయతులు అంటారు. బళ్ళారి, బెల్గాం,ధార్వాడ జిల్లాల్లో వారి వ్యాపారం బాగా జరిగేది. అందులో ధార్వాడ జిల్లాలోని సమదుత్తి అనే గ్రామంలో తరచూ బస చేసేవారు. వీరు అసిమి సంచి (రెండు అరలుగా వుండే కావడి సంచి)ని భుజానికి తగిలించుకుని తిరిగేవారు. ఇందులో వ్యాపార సామగ్రి, నిత్యావసర వస్తువులు భద్రపరచుకునేవారు.

ఎల్లమ్మ జంగమలను చేరడం :

ఒకసారి కలికిరి చెరువుముందర పల్లెలోని కొందరు జంగమలు ముత్యాలు, పగడాలు, విలువైన రాళ్ళు తీసుకుని పైదేశానికి వ్యాపారనిమిత్తం వెళ్లి ధార్వాడ జిల్లాలోని సమదుత్తి గ్రామంలోని శివాలయంలో బస చేశారు.

వ్యాపారంలో బాగా లాభం రావటంవల్ల హాయిగా నిద్రపోయి మరుసటిరోజు ఉదయమే ఊరికి తిరుగు ప్రయాణమయ్యారు. కొంతదూరం వెళ్ళగానే శివయ్య అసిమి సంచి బరువుగా తోచి కిందికి దించాడు. నా సంచిలో నా గుడ్డలు తప్ప ఏమీ లేవే. ఇంత బరువుగా ఎందుకుంది? అని లోపల చూశాడు. నాలుగైదు వీసెల బరువున్న గుండ్రాయిని బయటికి తీసి, నిరేయ్! మన వాళ్ళెవరో ఆట పట్టించడానికి నా సంచిలో ఈ గుండ్రాయిని వేశారు అని దాన్ని విసిరేశాడు. అందరూ ప్రయాణం సాగించారు. మళ్ళీ కొద్ది దూరం వెళ్ళేసరికి శివయ్యకు అదే పరిస్థితి. రాయి సంచిలో చేరింది.

సాయంత్రమైంది. రాత్రి అందరూ దారిలోని ఒక గ్రామంలో ఉన్న చిన్న గుడిలో విశ్రమించారు. శివయ్య తమవారిలోని పెద్దాయనతో నిఅన్నా! ఈ గుండ్రాయి సమదుత్తి నుండి నన్ను వెన్నాడుతూనే వుంది. ఎంతగా వదిలించుకోవాలనుకున్నా వదలడంలేదు. ఇదేమైనా భూతమా? దయ్యమా?ు అని భయపడుతూ చెప్పాడు.

అందరూ ఆ గుండ్రాయిని తడిమి చూశారు. పెద్దాయన నిమనం పరమ శివుని భక్తులం. నిత్యం ఆయన్ను తలుచుకుంటుంటాం. శివుడు భూతనాథుడు. భూత పిశాచాలేమైనా మన దేవర పేరు వింటేనే ఆమడ దూరం పారిపోతాయి. ఈ గుండ్రాయి ఏ దేవతో అయి వుంటుంది. ఏదో కారణం వల్ల మన వెంటబడుతూంది. మనల్ని పీడించడానికైతే కాదు. ఎవరూ భయపడద్దు అని అందరికీ ధైర్యం చెప్పాడు.

అందరూ శివనామ స్మరణ చేస్తూ నిద్రపోయారు. తెల్లవారుజామున శివయ్యకు ఒక కల వచ్చింది. ఆ కలలో శివయ్య కళ్ళముందు వెలుగులతో ఒక దేవత ప్రత్యక్షమైంది. నిశివయ్యా! మీరంతా గుండ్రాయి రూపంలోని నన్ను చూచి భయకంపితులవుతున్నారు. మీకెలాంటి భయమూలేదు. నేను పురాతన కాలంనుండీ గ్రామస్థులందరిచేతా నిత్యపూజలందుకునే దాన్ని. ఆ గ్రామంలోకి ఏ దుష్ట శక్తీ ప్రవేశించకుండా వారిని కాపాడేదాన్ని. రానురాను ఆ గ్రామంలోకి మీలాంటి లింగాయతులు వచ్చిచేరారు. వారందరూ నా తండ్రైన పరమ శివునికి ఆలయం నిర్మించుకున్నారు. లింగాకారంలోని ఆయన్ను పూజిస్తూ నన్ను విస్మరించారు. నేను పరాయిదాన్ని కదా! నాది దిగువదేశం. తూర్పు కొండల్లో వుంది. నా తండ్రి దండుగిరిరాజు. నేను శివభక్తురాలిని. ఎల్లవేళలా శివుని తలంపే నాకు. నా తండ్రి నన్ను మార్చాలని చూచాడు. వీలుగాక నన్ను పట్టించుకోవడం మానేశాడు. ఇటువైపు ఒక శివభక్తి బృందం వస్తూ వుంటే వారివెంట వచ్చేశాను. సమదుత్తి నచ్చడంతో ఇక్కడే ఉండిపోయాను. కానీ ఇప్పుడు నేను దిగువ దేశం వెళ్ళి నాకు నచ్చినచోట స్థిరపడుదామని అనుకున్నాను. మీరు నా తండ్రికి పరమ భక్తులు కాబట్టి మీ వెంట వస్తే నాకు మంచి చోటు దొరుకుతుందనే నమ్మకంతో మీ వెంటబడ్డాను.ఎల్లలు కాపాడే దేవతను నేను అందుకే నన్ను ఎల్లమ్మ అంటారు. మీరెవరూ భయపడాల్సిన పనిలేదు. మిమ్మల్ని వెన్నంటి కాపాడుతాను. అని చెప్పింది.

శివయ్య నితల్లీ! నీకిష్టమైనచోటుకి నిన్ను తీసుకుని పోతాను. ఐతే నేను వ్యాపారంకోసం ఇట్లావచ్చి చానారోజులైంది. నా భార్యా బిడ్డలు నాకోసం ఎదురు చూస్తూ వుంటారు. అక్కడికి పోయిన తర్వాత నీకు నచ్చినచోటుకు

నిన్ను చేర్చే బాధ్యత నాది అన్నాడు. ఎల్లమ్మ మంద హాసంతో అదృశ్యమైంది.

శివయ్య కలవరింతలకు మెలకువ వచ్చిన పెద్దాయన నిశివయ్యా! శివయ్యా!ు అని తట్టి లేపాడు. శివయ్య తన కల గురించి అందరికీ చెప్పాడు. అందరూ ఆనందంతో ఊరికి బయలుదేరారు. కొన్ని రోజులకు స్వగ్రామం చేరారు.

శివయ్య భక్తితో తన వెంట వచ్చిన గుండ్రాయిని పూజగదిలో పెట్టాడు. అతని కుటుంబ సభ్యులూ, చెరువు ముందర వల్లెలోని జంగమలందరూ నిత్యం ఆ గుండ్రాంయిరూపంలోని ఎల్లమ్మ దేవతను పూజించ సాగారు. ఎల్లమ్మ తల్లి తమ అదృష్టంవల్ల ఆడపడుచుగా తమయింట చేరిందని అపురూపంగా చూసుకున్నారు.

ఆలయ నిర్మాణం :

మళ్ళీ ఒకరోజు శివయ్యకు ఎల్లమ్మ దేవత కలలో కనిపించి నిశివయ్యా! ఈ ప్రాంతం నాకు నచ్చింది. ఇక్కడి స్త్రీల మనస్సు శరీరమూ చాలా అందంగా కనబడు తున్నాయి. పురుషులు కూడా ధర్మం, నీతి తెలుసుకుని మెలుగుతున్నారు. నాకీ ప్రాంతం బాగా నచ్చింది. నా కోసం ఎవరైనా గుడి కట్టిస్తే నేను ఇక్కడే నిలిచిపోతాను అని చెప్పింది.

తెల్లవారుజామునే శివయ్య ఈ విషయం అందరికీ చెప్పాడు. గ్రామ పెద్దలు ఈ విషయం ఆలోచించారు. మనం తాత ముత్తాతల కాలంనుండి పరమశివున్నే ఇలవేల్పుగా కొలుస్తున్నాము. మరో దేవత ఆలయాన్ని మన పల్లెలో నిర్మించడంవల్ల, ఆ శివుడికి ఆగ్రహం కలుగుతుందేమో అని భయపడ్డారు.

పెద్దాయన నిశివయ్యా! ఎల్లమ్మ తల్లి నీ వెంట వచ్చింది. ఆమె నీకు సాకుడు బిడ్డతో సమానం. మన యింటి ఆడబిడ్డను మన యింటిలోనే పెట్టుకోకూడదు కదా. ఆమెను మరోచోటుకు చేర్చాలి. మన బిడ్డ మనకు దగ్గరలోనే ఉండేటట్లు కలికిరికి ఆమెను చేరిస్తే బాగుంటుంది అన్నాడు.

ఊరందరికీ పెద్దాయన చెప్పింది నచ్చింది. ఐతే గుడి కట్టాలంటే భక్తితో పాటు డబ్బూ కావాలి కదా అట్లాంటోళ్ళు కలికిరిలో ఎవరున్నారో కనుక్కుందాం అంతా ఆ ఎల్లమ్మ తల్లే చూసుకుంటుందన్నారు గ్రామ పెద్దలు.

కలికిరిలో భూకామందులూ, ధనవంతులూ కొందరే ఉన్నారు. వారిలో భక్తితత్పరత, ధర్మగుణం, న్యాయ మార్గాన్ని అనుసరించేవారెవరా అని వెతికారు. చివరకు ఊరందరూ నిబంగారు పిచ్చుకు అని ముద్దుగా పిలుచు కునే భూకామందు, ధర్మ తత్పరుడు, గొప్ప దాత సాదా సీదాగా కనిపించే రెడ్డివారి గంగిరెడ్డివారు ఇందుకు తగిన వ్యక్తి అని నిశ్చయించుకున్నారు.

జంగమలందరూ ఆయనవద్దకెళ్లి విషయమంతా వివ రించారు. ఆయన ఇది నా అదృష్టమని వెంటనే ఆమెను దర్శించుకుని ఆనంద పరవశుడై ఎల్లమ్మ తల్లి గుడి కట్టడానికి పూనుకున్నాడు. జంగమలతో కలిసి పురో హితుని వద్దకెళ్లి విషయం చెప్పారు. ఎల్లమ్మ తల్లి శక్తి రూపిణి. అంటే అపర కాళికాదేవి. ఆమె రాక్షసులనెందరినో చంపి, ఉగ్రరూపిణిగా మారింది. ఆమెను శాంతింప జేయాలంటే బలులివ్వాలని, అందుకు బ్రాహ్మణులు ఒప్పుకోరని, శూద్రులనే పూజారులుగా పెట్టుకోమని, కాకతీయులు కూడా అలానే చేశారని సెలవిచ్చాడు పురోహితుడు.

మంత్రతంత్రాలు తెలిసిన కంసల కృష్ణమాచారిని ఇందుకు తగినవాడిగా నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి కలికిరికి దక్షిణాన్నున్న గంగిరెడ్డి చేన్లో తూర్పు ముఖంగా ఎల్లమ్మ గుడిని నిర్మించాలని నిశ్చయించు కున్నారు.

బ్రాహ్మణులు, వైశ్యులు వీరిలో కలవరు. క్షత్రియులు అప్పటికి కలికిరిలో లేరు. తక్కిన అన్ని కులాలవారూ గుడి నిర్మాణానికి పూనుకున్నారు. జంగమలు ఊరూరా తిరిగి ప్రచారం చేస్తూనే, రైతులవద్దనుండి ధాన్యం సేకరించారు. తుమ్మలపేట, చింతమాకుల పల్లెలనుండి వడ్డెర కులస్థులు రాళ్లు కొట్టే పనికి పూనుకున్నారు. అలా అన్ని కులాలవాళ్ళూ కలిసి ఈ ఆలయాన్ని నిర్మించారు.

విగ్రహ ప్రతిష్ట :

అమ్మవారిని ఎలా ప్రతిష్టించాలనే సందేహం. మళ్ళీ ఎల్లమ్మ తల్లి శివయ్య కలలో కనబడి నివచ్చిన రూపం లోనే ప్రతిష్టిస్తే తానే అసలు రూపంతో వెలుస్తానని, తనకు ఏడుపడగల నాగేంద్రుడున్న కిరీటం తయారు చేసి పెట్టమని చెప్పిందట. అంతేకాదు అసలు రూపంతో వెలిసిన తర్వాత అందరితో మాట్లాడుతాననికూడా చెప్పిందట.

ఒక శుభముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠ జరుగగా లింగాకృతిలోని ఎల్లమ్మ చెప్పినట్లే ఉగ్రరూపాన్ని చూసి భయపడతారని శిరస్సు మాత్రమే ఉండేటట్లు నిజరూపం లోకి మారిందట. ఏడుపడగల నాగేంద్రుడు కిరీటమై అమ్మవారి శిరస్సును అలంకరించగా, అత్యంత సుందర మైన చిరునవ్వు ముఖంతో, భూమిపైనుండి అప్పుడే తలపైకెత్తినట్లు అందరికీ దర్శనమిచ్చిందట.

అమ్మవారికి గంగిరెడ్డివారు నూతన పట్టు వస్త్రాలు సమర్పించగా, కృష్ణమాచారి తమ కులవర్గంతో ఏడు తలల కిరీటాన్ని అమ్మ వారికి అలంకరించగా, శివయ్య పుట్టింటి సారె సమర్పించాడు.

గ్రామస్థుల కోరికమేరకు శివయ్య అడగ్గా అమ్మవారు మాట్లాడి తనకు చాలా ఆనందంగా వుందని, గ్రామాన్ని కాపాడుతానని, ధర్మంగా అడిగిన వారి కోరికలు తీరుస్తా నని, సంతాన భాగ్యం కలిగిస్తానని, సత్యం పలికే వారిని రక్షిస్తూ, అసత్యం పలికే వారిని శిక్షిస్తానని పలికిందట.

అప్పటినుండీ గ్రామస్థులు తగాదాలను అమ్మవారి వద్దే తీర్చుకునేవారు. సత్యం పలుకుతూ, సత్యం పలికించే ఎల్లమ్మను అందరూ సత్తెమ్మ అని కూడా పిలుస్తారు. సత్యం పలికించడమే కాదూ అడిగిన వారికి భూత భవిష్యత్ వర్తమానాలను కూడా చెపుతుండేది. అయితే దీని వల్ల మంచికంటే చెడే ఎక్కువ జరగడంతో పూజారి కృష్ణమాచారి అమ్మవారి నోటిని కట్టేశాడని అందరూ చెప్పుకుంటారు. అప్పటినుండి ఆమె పిలిస్తే పలకదు కానీ ప్రజల కోర్కెలను మాత్రం నెరవేర్చేది.

తిరునాళ్ళు :

అప్పటినుండి ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో శుక్ల ఏకాదశి సమీపఘడియలో వచ్చే శనివారం నుండి ఎల్లమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఉత్సవాలు జరగడానికి రెండుమూడు వారాలముందే చాటింపు వేస్తారు. ఆ చాటింపును ఇక్కడ సోలిం అంటారు. దీన్నే ఎల్లమ్మ తల్లి గ్రామ పర్యటనగా భావిస్తారు. సంవత్సరానికొకసారి ప్రజల క్షేమ సమాచారాలను విచారించడానికి, తనకు తిరునాళ్ళు జరిపితే శుభం కలుగుతుందని గుర్తు చేయడానికి, అన్ని కులాలవారూ గుడివద్దకు చేరి వారి వారి విధులు నిర్వర్తించాలని గుర్తుచేస్తూ గ్రామ పర్యటన చేస్తుంది.

ఎల్లమ్మకు అక్క చెల్లెండ్లు ఆరుమంది. వీరందరికీ పోతలరాజు తమ్ముడు. అక్క అంకాళమ్మ, తమ్ముడు పోతరాజు అంగరక్షకుడుగా వెంటరాగా పల్లకిలో నలుగురు వ్యక్తులు మోస్తూ ఉంటే, మేళతాళాలతో ఎల్లమ్మ తల్లి సోలిం తిరిగివస్తుంది.

ముందుగా ఎల్లమ్మ పుట్టినిల్లు చెరువుముందరపల్లెకు వెళ్లి అక్కడ ఒక రాత్రి బస చేస్తారు. మరుసటిరోజు ఎల్లమ్మ అక్క అంకాళమ్మ పుట్టినిల్లు తుమ్మలపేట పల్లెకు వెళ్తారు. ఇలా శుక్రవారం వరకు 21 రోజులు గ్రామ పర్యటన చేసి శుక్రవారం రాత్రికి గుడికి చేరుకుంటారు. శనివారం మధ్యాహ్నం జాతర ప్రారంభమౌతుంది.

తిరునాళ్ళలో మొదటి రోజు కార్యక్రమాలను జాగారం అని పిలుస్తారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి గుడిని శుభ్రపరుస్తారు. గంగిరెడ్డివారి వంశస్థులు పట్టువస్త్రాలు తీసుకుని వస్తారు. కంసల గుడాచారి అంటే తండా కృష్ణమాచారి వంశీకులు ఆభరణాలు తీసుకుని వస్తారు. పుట్టింటి వారు చెరువుముందర పల్లెలోని పత్రి ఇంటిపేరుగల జంగమలు పసుపు కుంకుమలు తీసుకుని వస్తారు. ఇలా ఎల్లమ్మ, అంకాళమ్మలకు సాయంత్రం ఆరు గంటలకు అభిషేకం చేసి అలంకరించడంతో తిరునాళ్ళకు అంకురార్పణ జరుగుతుంది.

రాత్రి 9.30 నుండి 12.00 గంటలవరకు ఆసాది ఎల్లమ్మ కథను విన్పిస్తాడు.

అర్ధరాత్రి పాలపొంగు ప్రారంభమవుతుంది. పుట్ట నుండి తెచ్చిన మట్టితో పొయ్యి ఏర్పాటు చేసి, కొత్త కుండలో పాలుపోసి, అందులో 5 లేదా 11 రూకలేసి ఎండిన ఉత్తరేణి పుల్లలతో మండిస్తారు. పాలు కాగు తుండగా ఆ రూకలను వట్టి చేతులతో బయట తీస్తారు. పాలు ఎటువైపు పొంగితే ఆ వైపునున్న ఊరు పైరు పచ్చలతో కళకళలాడుతుందని ప్రజల విశ్వాసం. ఆ కుండలో బియ్యం, బెల్లం వేసి నైవేద్యాన్ని సిద్ధం చేయడానికి పూనుకుంటారు. పాలకుండపైనున్న మూకుడులో మంచినూనె, ఆముదమూ పోసి, పెద్ద దూదివత్తి పెట్టి వెలిగిస్తారు. అది నాలుగు రోజులవరకూ వెలిగే అఖండదీపం. చివరిరోజు ఆ నైవేద్యాన్ని సిద్ధల బావి వద్ద అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి తర్వాత భక్తులకు పంచుతారు. అది అప్పటికప్పుడే చేసినట్లుం డటం విశేషం.

పాలపొంగు తర్వాత ఆ రాత్రి రెండున్నర మూడున్నర గంటలప్పుడు బిడ్డలులేని స్త్రీలు సంతానంకోసం వరపడుతారు. వరపడే స్త్రీలు కలికిరి పెద్దచెరువులోని సిద్ధల బావిలో మునిగి తడి బట్టలతో ఎల్లమ్మ గుడి ముందు సాష్టాంగ నమస్కారం చేస్తూ పొర్లు దండాలు పెడతారు.

3.30 గంటలకు బలిహారం ప్రారంభమౌతుంది. అష్ట దిక్పాలకులను సంతృప్తి పరచడానికి విజయకేతనమైన ధ్వజస్తంభానికి దిష్టి తగలకుండా ఉండటానికి బలిహారం ముద్దలను పెడతారు.మేకపోతును నరికి, దాని రక్తాన్ని అప్పుడే వండిన అన్నంలో కలిపి ఆ అన్నాన్ని తొమ్మిది ముద్దలుగా చేస్తారు. ఆ ముద్దలను ఎనిమిది దిక్కుల్లో ఎనిమిది, గుడి ముందున్న బలిపీఠం దగ్గర ఒకటి పెడతారు.

ఈ కార్యక్రమమంతా సూర్యోదయం లోపలే జరిగిపోవాలి.

ఎల్లమ్మ తిరునాళ్ళలో రెండవ రోజు ఆదివారం చాలా విశేషమైంది. అందరూ కోరుకున్నది జరుగుతుంది. బోనాల పండుగ దినంగా ఈ దినం ప్రసిద్ధం.

మద్ది, వేప కలపలతో తయారు చేసిన తేరుపై ఉదయం అమ్మవారి మెరవణి ప్రారంభమౌతుంది. పూర్వం నిర్దేశించిన వీధులగుండా అమ్మవారి ఊరేగింపు జరుగుతూంటే వారివారి ఇళ్ళముందుకు రాగానే భక్తులు అమ్మవారికి పూజా సామగ్రి సమర్పించి హారతు లందుకుంటారు. మధ్యాహ్నం వరకూ ఈ రథోత్సవం జరుగుతుంది.

తర్వాత సిద్ధపూజ జరుగుతుంది. ఎల్లమ్మ తండ్రి సత్య గిరిరాజు లేదా దండుగిరిరాజుకు రాక్షసులతో యుద్ధం జరిగేటప్పుడు తండ్రికి సహాయంగా ఎల్లమ్మ వెళ్తుంటే ఆదిసిద్ధులవారు ఆమె వెంట తన పరివారంతో వెళ్లి రాక్షసుల్ని సంహరిస్తాడు.అందుకు కృతజ్ఞతగా ఎల్లమ్మ గుడిముందు సిద్ధపూజ జరుగుతుంది.

కలికిరి పెద్దచెరువులోని జీవ పుష్కరిణిలాంటి బావే సిద్ధలబావి. ఆదివారం మధ్యాహ్నం భవిష్యత్తు బాగుం డాలని బాలురు, యువకులు, సంతానంలేని వారు, ఇతర కోర్కెలతో పురుషులు ఉదయంనుండి ఉపవాస దీక్షతో సిద్ధల బావిలో స్నానం చేసి, విబూధి ధరించి, రకరకాల చెట్ల ఆకులను సిద్ధలబావి నీటిలో తడిపి గుడిలోకి తీసుకొస్తారు. ఆ ఆకుల కట్టను ఉత్సవమూర్తుల ఎదుట చప్పిడి గుగ్గిళ్ళు, పానకం పాత్రల్లో పెట్టి నైవేద్యంగా సమర్పిస్తారు.

సిద్ధుల మండపంలో అమ్మవారు ఉయ్యాల ఊగుతుండగా రాయచోటినుండి వచ్చిన కథకులు సిద్ధుల కథలను గానం చేస్తారు. మూడున్నర గంటలకు కథ పూర్తికాగానే సిద్ధులకు చప్పిడి గుగ్గిళ్లు, పానకంతోపాటు ఆకులుకొన్ని తుంచి దీక్షాపరుని జోలెలో వేస్తారు. ఇంతటితో వీరి ఉపవాసం ముగుస్తుంది.

తర్వాత సిళ్ళు బోనాల కార్యక్రమం ప్రారంభమౌతుంది. కలికిరి చుట్టుపక్కల ప్రాంతాల్లోని స్త్రీలు మేళతాళాలతో

బోనం తెస్తారు. ఇత్తడి పళ్లెంలో బియ్యం బెల్లంతో చేసిన సలిబిండి ముద్ద పెట్టి అందులో దీపం వెలిగించి చుట్టూ దూది పుల్లలు అందంగా అలంకరిస్తారు వీటినే రాగ దీలు అంటారు. నగరి (నాయుని వారి పల్లె) బోనం ముందుగా సమర్పిస్తారు. అమ్మవారి గుడిని దోచుకోవడానికి వస్తున్న దొంగలను నగరిలోని ఏకిల దొరలు ఎదుర్కొన్నందుకు వారికీ గౌరవం దక్కింది.

మొదటి బోనం అమ్మవారి గుడిని చేరగానే ఒకప్పటి కలికిరి కోట బురుజు స్థానంలోని పెద్దవేపమానునుండి మంటలు వచ్చి చుట్టుపక్కల ప్రాంతాలను సువాసనా భరితం చేసి తర్వాత అవే ఆరిపోతాయని, చెట్టుకు ఎలాంటి హానీ జరుగదని చెప్తారు.

స్త్రీలు బోనాలతో వస్తే, పురుషులు వారివారి శక్తిమేరా కోళ్ళు, పొట్టేళ్ళను బలివ్వడానికి తీసుకొస్తారు. ఈ జంతుబలులు ఇప్పుడు తగ్గాయి. ఇదంతా అర్ధరాత్రి వరకూ జరుగుతుండగా చాందినీ బళ్ళు ఊరేగింపుగా వస్తాయి. కోర్కెలు తీరిన భక్తులు ఎద్దులను, బండ్లను టెంకాయ మట్టలు, వేప కొమ్మలు, పూలతో అలంకరించి మేళతాళాలతో వస్తారు. ఈ బండ్లకు ముందు కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తుంటారు. ఇప్పుడు ఎద్దుల బండ్ల స్థానంలో విద్యుద్దీపాలంకరణతో ట్రాక్టర్లు దర్శన మిస్తున్నాయి.

సోమవారం ఉదయంనుండి అమ్మవారి సర్వదర్శనం వుంటుంది. రాత్రి ఏడుగంటలకు లంకాదహనం జరుగు తుంది. తొమ్మిదిగంటలకు అమ్మవారి పుష్పపల్లకి ఊరేగింపు జరుగుతుంది.

ఉత్సవాల్లో అలిసిపోయిన ఉత్సవ మూర్తులకు చివరి రోజైన మంగళవారం స్నానం చేయిస్తారు. దీన్నే పాగేట అంటారు. కలికిరి ప్రాంతంలో నదులు లేనందున నాలుగు ఏర్ల నీళ్లు కలిసే బావిలో అమ్మవార్ల విగ్రహాలకు సంపూర్ణ స్నానం చేయించి, గుడికి తీసుకెళ్ళి కొత్తబట్టలతో అలంకరించి అర్చనలు చేస్తారు.

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కల్లిపాటు ప్రారంభమవుతుంది. రాయచోటి ప్రాంత కథకులు అమ్మవారి మహిమలను కథలరూపంలో విన్పిస్తారు. దీన్నే కల్లిపాటు అంటారు.

రాత్రి ఏడెనిమిది గంటలకు గావు మొదలౌతుంది. అమ్మవారిని సంతృప్తి పరచడానికి అనువంశికంగా కుటుంబంలోని ఒక వ్యక్తి మేక పిల్లను గొంతుకొరికి, ఆ మాంసాన్ని పచ్చిగానే తినేస్తాడు. ఇదిప్పుడు చాటుమాటుగా జరుగుతోందని, మాంసమంతా తినకుండా గొంతు కొరికిన ప్రాంతంలోని కొద్దిమాంసాన్ని మాత్రమే తింటారని చెప్తారు.

గావు తర్వాత శాంతి కార్యక్రమం జరుగుతుంది. కల్లి పాటులో పాల్గొన్నవారు అమ్మవార్ల మీద పసుపు నీళ్ళలో వేపాకు మండలు ముంచి చల్లి శాంతపరుస్తారు.

ముగింపు :

సోలింలో తన ఆహ్వానం మేరకు తన గుడికి వచ్చి, తన తిరునాళ్ళలో పాల్గొని, నిర్విఘ్నంగా సంబరాలు నెరవేర్చినందుకు అక్కగార్లకు ముత్తయిదువ వాయనా లిచ్చి వీడ్కోలు పలుకుతుంది. ఈ కార్యక్రమం అర్ధరాత్రి జరుగుతుంది. దీన్ని గ్రామస్థులెవరూ చూడకూడదని నియమం.

ఈ ఉత్సవాల్లో వివిధ రకాల తినుబండారాలు, వ్యవసాయానికి, వంటకు పనికొచ్చే వస్తువులు, పిల్లల వినోదం కోసం వివిధ యంత్రాలు నెలరోజులపాటు ఉంటాయి.

ఇలా ఈ తిరునాళ్ళు పెద్దలు నిర్ణయించినట్లుగా సుమారు రెండు శతాబ్దాలనుండి రంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి.

ఉపయుక్తాలు :

1. కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ కథ - అల్లీ రామకృష్ణ - 2007 2. ఉమ్మడి శెట్టి మణి - ఆలయ పూజారి
3. అశోకరెడ్డి - ఆలయ ధర్మకర్త 4. ఊరి ప్రజలు

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పాలూరుప్రాంత గంగమ్మ దేవర ఉత్సవ వైశిష్ట్యం – పరిశీలన

– ఎస్. గంగాధరరెడ్డి, పరిశోధక విద్యార్థి (యుజిసి.ఎస్.ఆర్.ఎఫ్), యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

జానపదవిజ్ఞానం తరతరాల తరగని మానవసంపద. జానపద సాంఘికాచారాలలో జాతరలు, దేవరలు ముఖ్యమైనవి. జానపదుల జీవన విధానాలలో ఆచారాలు - సంప్రదాయాలు, విశ్వాసాలు, నమ్మకాలు, సాహిత్యం, కళలు మొదలైనవి జాతరలు, దేవరలలో ప్రతిబింబిస్తుంటాయి. అంతేగాక జానపదుల మూలసంస్కృతిని రక్షిస్తూ జాతి సమైక్యతకు దోహదం చేస్తాయి.

గ్రామీణ సంస్కృతికి అద్దంపట్టే ఉత్సవాలలో 'గ్రామ దేవరకు' విశిష్టస్థానం ఉంది. ఈ దేవరకు మూలం ఎన్నో వేల సంవత్సరాల నుంచి సంప్రదాయంగా వస్తున్న "మాతృ దేవతారాధన". కాలక్రమంలో ఇది గ్రామ దేవతారాధనగా రూపాంతరంచెందినది.

పల్లె ప్రాంతాల్లో గ్రామదేవరను ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా భిన్న ఆచారాలతో నిర్వహిస్తారు. ప్రతి గ్రామదేవరకు ఒక చరిత్ర ఉన్నట్టే - కడప జిల్లా తొండూరుమండలం "పాలూరు" గ్రామదేవరకు విశిష్టమైన చరిత్ర ఉంది. గ్రామ లెక్కల ప్రకారం (గ్రామపెద్దల రాతప్రతి అముద్రిత గ్రంథం) 1946 నుంచి దేవరను నిర్వహిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ ఉత్సవాన్ని రెండు రోజులపాటు (శని, ఆదివారం) గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారు.

దేవర చేయడానికి ముందు (శివరాత్రి పర్వదినం తర్వాత) బోయలు (తళారి) వారు గ్రామ ప్రజలందరిని (రెడ్డి, కమ్మ, కాపు) ప్రతి ఇంటికి వెళ్ళి దేవర విషయం మాట్లాడడానికి సావిడి దగ్గరకు రమ్మని పిలుస్తారు. గ్రామ దేవరపెద్దలు మొదటగా శాలివాహనులను (కుమ్మరి), యాదవులను (గొల్ల), బోయ (తళారి), రజకులు (సాకలి), నాయిబ్రాహ్మణులు (మంగళి), దళితులలో ఉపకులాలైన (మాల మాదిగ) వారిని క్రమపద్ధతిలో పిలుస్తారు. దేవర ఉత్సవం జరపటం అందరికీ ఇష్టమని ఒప్పుకున్న తర్వాత వారం రోజులు ముందుగా గ్రామ చాటింపు వేయిస్తారు.

అమ్మవారిని శాలివాహనులు (కుమ్మరి) ఆడబిడ్డగా, రజకులు కోడలు, నాయిబ్రాహ్మణులు మనవరాలుగా, దళితులలో ఉపకులంవారు (మాదిగ) మాతగా భావిస్తారు.

ఈ దేవర ఉత్సవంలో ఒక్కో కులానికి ఒక్కో పనులు నిర్ణయింపబడటం ఎన్నో సంవత్సరాల నుంచి గ్రామాచారంగా వస్తున్నది.

రజకులు (సాకలి) : గంగమ్మకు గుడి కట్టుట

యాదవులు (గొల్ల) : 4 గొర్రెపిల్లలు, గొర్రె ఇవ్వటం

నాయిబ్రాహ్మణులు (మంగళి) : వాయిద్యం వాయించటం

బోయలు (తళారి) : దున్నపోతును నరకటం

దళితులు ఉపకులాలు : (మాల) బలి చల్లటం, శిరస్సు మోయడం, కాపలా ఉండడం, (మాదిగ) పలకలు వాయించటం, కొంగోలుకత్తి, తుడుము, కొమ్మును ఊదేవారితో సహా వేవర పోతకు గెట్టి కోయడం మొదలైనవి

దేవరలో ముడుపులు పంపకం ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది.

అసాదివారు : దళితుల ఉపకులం (మాల)

- ఘటం కడవ తీసుకురావడం - సాధారణంగా ఈడిగవారు. కాని వారు లేనందున ఈ ముడుపు తళారివారు స్వీకరించారు (రథం బండి తయారు చేయించుటకు వెళ్లటం)
- దేవరకు 4 రోజుల ముందు గంగమ్మను కూర్చోబెట్టడానికి స్థలాన్ని చూచి పరిశుభ్రంగా

చేయవలసిన బాధ్యతను ముడుపుగా రజకులు, దళితులు స్వీకరిస్తారు.

మొదటి రోజు కార్యక్రమాలు :

దళితులలో ఉపకులాలైన (మాల, మాదిగ) వారు దేవరకు ముందురోజు శుక్రవారం సాయంత్రం తంగేడు పూలు, జిల్లేడుపూలు తీసుకొస్తారు. గ్రామ పెద్దలు ఇచ్చిన చెండుమల్లెలు తీసుకొని ఈ మూడు రకాల పూలు కలిపి శనివారం ఉదయం పొద్దుపొడిచిన తర్వాత మొదట రెడ్డిగారి పాత ఇంట్లో చల్లి తదుపరి గ్రామంలోని ప్రతి ఇంట్లో చల్లుతారు. పూలు చల్లిన తర్వాత ప్రతి కుటుంబం వారు తమ ఇంటిని శ్రుభం చేసుకోవటం సాంప్ర దాయంగా వస్తుంది (ప్రజల సమ్మతంన మొదట దళిత ఉపకులాలుగా మొదట మాల - మాదివారు గింజలు పెట్టించుకోవచ్చు).

సాధారణంగా గ్రామదేవరలో ప్రతి కులానికి మేటీలు (ప్రధానపాత్ర) వహిస్తాయి. వీరిని కార్యనిర్వాహకులుగా చెప్పవచ్చు. రెడ్డికులాలలో కంచర్ల ఇంటిపేరు గలవారికి 4 కుటుంబాలు (దాయాదులతో సహా) మేటీగా ఉంటాయి. వీరు దేవర ఉత్సవంలో ప్రముఖస్థానాన్ని కలిగి ఉంటారు.

గ్రామంలో యల్లమ్మ దేవాలయం వద్ద కుమ్మరివారు మట్టితో గంగమ్మను చేయుటకు ఆసాదివారు సెలవిస్తారు. (గ్రామంలో ప్రజలందరిని ఈ కార్యక్రమం చేయటం సమ్మతమా అని అడగటం) తర్వాత కుమ్మరి వారు గంగమ్మను చేస్తారు. ఈ క్రమంలోనే దళితులలో ఉపకులాల వారు (మాల-మాదిగ) గంగమ్మకు బలి ఇవ్వడానికి సిద్ధం చేసిన దేవరపోతు (దున్నపోతు)ను మొదటగా యాదవుల ఇంటి దగ్గర పూజించుకొని తిరిగి 'సావిడి' దగ్గరకు వస్తారు. అక్కడి నుంచి దేవర పోతును ఊరంతా తిప్పడానికి ఆసాది వారితో సెలవిప్పించుకొని ఊరంతా తిప్పుతారు (తలభాగం మాల, దేవరపోతు వెనక భాగం మాదిగవారు). ఈ సందర్భంలో దళిత ఉప కులాలైన (మాదిగ) వారు గ్రామంలో ప్రజల సమ్మతమున గింజలు పెట్టించుకొంటారు). పిదప రజకులు గంగమ్మకు గుడి కట్టడానికి ఆసాదివారు సెలవిచ్చిన తర్వాత గుడికట్టడం ప్రారంభిస్తారు. రజకులు గుడి కట్టడానికి, శాలివాహనులు (కుమ్మరి) వారు గంగమ్మను చేసినందుకు మామూల్లు ఇవ్వటం ఆనవాయితీ ఇలా ఉంది.

శాలివాహనులు (కుమ్మరి) - 5 సోల్ల బియ్యం, చిట్టెడు పెసరబేడలు, 5 కొబ్బెర గిన్నెలు, 5 సన్నిమ్మపండ్లు, 5 కర్జూరపు పండ్లు, 5 దక్షిణలు)

రజకులు - పసుపు, కుంకుమ ముగ్గుపిండితోపాటు 5 సోల్ల బియ్యం, 5 కొబ్బెర గిన్నెలు, 5 సన్నిమ్మపండ్లు, 5 దక్షిణలు.

శాలివాహనులు (కుమ్మరి) గంగమ్మను చేసిన తర్వాత గ్రామస్థులంతా తప్పెట్లతో, వాయిద్యాలతో, బాణ సంచాతో కలిసి యల్లమ్మ గుడి దగ్గరకు చేరుకుంటారు. గుడిలో నుంచి గంగమ్మ బయటకు తెచ్చిన తర్వాత గొర్రెపిల్లను బలిచ్చి అమ్మవారికి దిష్టితీసి విసిరేస్తారు. ఆ దిష్టిపిల్ల బ్రతికితె కుమ్మరివారు, చనిపోతే రజకులు తీసుకుంటారు. తదుపరి గంగమ్మను 'సావిడి' దగ్గరికి తెచ్చేటప్పుడు 101 బెంకాయలు కొడుతూ 101 నిమ్మ కాయలు కోసి పైకి విసిరేస్తూ వస్తారు. (ఈ నిమ్మకాయలు తింటే మంచి జరుగుతందని ప్రజల నమ్మకం).

రజకులు గంగమ్మవారికి సిద్ధం చేసిన గుడిలో జొన్నలు పోసి గంగమ్మను కూర్చోబడెతారు. బోయ(తళారి) వారు ఘటం కడవను గంగమ్మ గుడి దగ్గరకు తెస్తారు. ఇందుకు బత్తెంగా 5 సోల్ల బియ్యం, 5 కొబ్బెర గిన్నెలు, 5 విస్తరాకులు, 5 రకాల పండ్లు, 5 సన్నిమ్మపండ్లు, 5 తాంబూలాలు, 5 దక్షిణలు ఇవ్వటం ఆచారంగా వస్తున్నది. తర్వాత కంచర్ల ఇంటిపేరుగల మేటీల్లో ఒకరు (శింగారెడ్డి) మొదటగా 'మసిబాణం'ను (కుండలో జొన్న కూడు + కుండకు చుట్టూర కూర్చిన అత్తరాసులు) తీసికొని తప్పెట్లతో వాయించుకుంటూ వచ్చి గంగమ్మకు అర్పి స్తారు. తర్వాత ఉంది ప్రజలంతా కుంభం కూడు

తీసుకురావాలని గ్రామపెద్దలు దండోరా వేయిస్తారు. దేవరపోతును ఆహుతి ఇవ్వటానికి ముద్దపెడతారు. దేవర పోతు తల కడిగి ఆసాదివారు సెలవిచ్చిన తర్వాత దేవర పోతును నరుకుతారు. వెంటనే దేవరపోతుకు గెట్టు నరికి నోటికి కరిపిస్తారు. అదేవిధంగా బానంగొర్రెన నరికిన తర్వాత గొర్రె గెట్టనరికి నోట్లో కరిపిస్తారు. (బానం గొర్రెలో సమభాగాలు - రజకులు + బోయ + శాలివాహనులు + నాయిబ్రాహ్మణులు + ఆసాదివారు) పిదప దళితుల ఉపకులాలు (మాదిగ) దేవరపోతు పొట్టకోసి, కొవ్వు పారతీసి దళితులు (మాల) వారికి ఇవ్వాలి. వారు కొవ్వు కరిగించి దేవరపోతు శిరస్సుమీద దీపం వెలిగిస్తారు. అంతేగాక 'జొల్ల' తడికెతో కూడిన నల్ల కంభల్లతో కప్పు తారు.

బలిచల్లటం :

రెడ్డిగారి మేటీలలో (మిద్దెలోల్లు) కంచర్ల పేరుగలవారు రెండవ మేటీ అమ్మవారికి బలిచల్లటానికి ఒక చాటను ఇస్తారు. దీనినే "బలిచాట" అంటారు. దళితులు (మాల) వారు ఆ చాటను తీసుకుంటారు. అమ్మవారికి గొర్రెపిల్లను బలిచ్చిన తర్వాత ప్రేగులు తీసి, జంధ్యం వేసుకొని, దొమ్మ నోటికి కరిపించుకొంటారు. అంతేగాక రక్తం, వేపాకు, బాణ అన్నం కలిపి ఒక చాటలో వేసుకొని ఊరి చుట్టూ బలి చల్లుతారు. గవిని దాటిన మరుక్షణం పేగులు, దమ్మ విసిరేస్తారు. బలిచల్లే క్రమంలో దారి చుట్టూ అక్కడక్కడ 4 టెంకాయలు కొట్టి నిమ్మకాయలు కోస్తూ విసిరేస్తూ "కోబలి - కలెజగో" అంటూ అరుస్తూ ఈలలు, కేకలు వేస్తూ గవిని దగ్గర మంట దాటివస్తారు. ఈ సమయంలో బలిచల్లే వ్యక్తికి టవాల్ కప్పుతారు. ఈ నేపథ్యంలో బలిచల్లడానికి వెళ్ళిన తర్వాత ఊరిలో బురుజు దగ్గర గొర్రెపిల్లను కోసి బలిచల్లి తిరిగి వచ్చే టప్పుడు ఆ పిల్లను తీసుకొస్తారు. ఉదయం 6.30 గంటలకు కంచర్ల ఇంటిపేరుగల 4 మేటీలవారు ముద్ద పెట్టి అక్కడ గొర్రెను నరికిన తర్వాత ఊర్లో గ్రామ ప్రజలు యాటలు నరుక్కోవచ్చు. దేవర పోతును నరికిన తర్వాత ఆ పోతు నుంచి వచ్చే రక్తాన్ని ఇతర ఊరు వ్యక్తులు తాకకుండా జాగ్రత్త పడతారు. ఎందుకంటే దేవర ఫలితం వేరే ఊరికి వెళ్తుందని ఒక విశ్వాసం. అంతేగాక ఎవరైనా కావాలని తాకితే వారిని చంపడానికి కూడా వెనుకాడని పరిస్థితి కనిపిస్తుంది.

రెండవ రోజు కార్యక్రమాలు :

రెండవరోజు కార్యక్రమంలో భాగంగా, దళితుల ఉపకులాల వారైన (మాదిగ) అమ్మవారికి రథము బండి చేయుటకు 'సుంకేసులచెట్టు' కొయ్యను తీసుకొస్తారు. రథం బండిని పక్క ఊరికి చెందిన కొవ్వూరు ఆచారివారు చేస్తారు. ఇందుకు బత్తెంగా 5 సోల్ల బియ్యం, 5 కర్జూరపు పండ్లు, 5 సన్నిమ్మపండ్లు, 5 కొబ్బెర గిన్నెలు, 5 తాంబూలాలు, 5 దక్షిణలు ఇస్తారు. రథం బండిని అమ్మవారి దగ్గరికి తీసుకురావటానికి ఆసాదివారు సెలవిచ్చిన తర్వాత గొర్రెపిల్లను ఆహుతి ఇచ్చి రథం బండిని (మాదిగవారు) తెస్తారు.

రెడ్డి గారు మేటీలలో ఒకరు మొదటగా (శింగారెడ్డి) నగర బాణాన్ని (పులగం) అమ్మవారికి సమర్పిస్తారు. తర్వాత ఊరంతా బానాలు తెస్తారు. ఇంకో మేటీలోగల రెడ్డిగారు (నలపురెడ్డి) శిరస్సు చాటను అమ్మవారికి ఇస్తారు. గంగమ్మకు చివర మేటివారు ఆభరణాలు తెస్తారు. తర్వాత ఆసాదివారు సెలవిచ్చిన తర్వాత గంగమ్మను గుడిలో నుంచి బయటకు తీసుకొస్తారు. బోయ (తళారి) వారు దేవరపోతు శిరస్సు ముందు వెనుక భాగానికి నీళ్ల పోసి కడుగుతారు.

గంగమ్మను గవిని దాటించేటపుడు శాలివాహనులు (కుమ్మరి) గంగమ్మను, శిరస్సును దళితులలో ఉపకులాల వారు (మాల) రథము బండిని, ఘటకడవను (మాదిగ) తీసుకెళ్లాలి. అంతేగాక అమ్మవారికి చెప్పులు, చేలకాలను వెంట తీసుకొంటారు. గంగమ్మను గ్రామంలో 'జిలకరపంపు' ప్రదేశలలో కూర్చోబెడతారు. కొంత సమయం అమ్మవారి కథను చెపూ గంగమ్మను బూతు

మాటలతో తిడతారు. అలా తిట్టడం అమ్మవారికి ఇష్టం అని జానపదులు చెప్తారు. పూర్వం దేవరలో వేషాలు ధరించుట, జ్యోతుల నృత్యం ఉండటం విశేషం.

అమ్మవారిని గ్రామ ప్రజలందరిని ఆసాదివారు దీవించిన తర్వాత గంగమ్మకు ఆభరణములు తీసి జాగ్రత్తగా చేయటం కుమ్మరివారిదే బాధ్యత. అమ్మవారిని పొలిమేరకు పంపేటప్పుడు రజకులు అమ్మవారిని, శిరస్సును దళిత ఉపకులం (మాల), రథం బండి, ఘటం కడవను (మాదిగ) దళితులు తీసుకెళ్ళాలి. గంగమ్మకు కండ్లు కోరలు అలానే ఉండాలి. రజకులకు టెంకాయలు నిమ్మపండ్లు వడిలోపోసి (బాకు) ఇచ్చి పంపాలి. అంతేగాక గ్రామ పెద్దలు, రజకులు, దళితులు (మాల మాదిగ) వారికి సద్దికట్టి పంపిస్తారు. పొలిమేర గట్టుకు (5.30) చేరిన తర్వాత అమ్మవారిని తూర్పు మొఖం వైపు కూర్చో బెట్టాలి. శిరస్సు పడమర భాగానికి తిరిగి విడిచి పెట్టాలి. ఒకవేళ సిరస్సును ఇంటికి తెచ్చుకోవాలంటే ఒక కొమ్మ ఊడగొట్టి భూమిలో పాతి, ఒక కొమ్మ తెచ్చుకుంటారు. మాదిగవారు రథంబండి, ఘటం కడవ అమ్మవారి దగ్గర పెట్టి, ఈ మూడు కులాలవారు సద్ది తిని వెనక్కి తిరిగి చూడకుండా రావాలి.

ముగింపు :

గ్రామదేవరలు సంస్కృతిని పరిరక్షిస్తూ దేశంలో భిన్నత్వంలో ఏకత్వం సాధించటానికి ఉపయోగకరంగా ఉంటాయి. జాతరలు, పండుగలు, దేవరలు నిర్వహించే విధానాన్ని లిఖితరూపంలోకి తెస్తే భావిభారత పౌరులకు సంస్కృతి నాగరికత పరిణామ క్రమాన్ని వ్యక్తం చేయుటకు అవకాశమేర్పడుతుంది. ఈ దేవరలు చేయటం ద్వారా గ్రామం సర్వవిధాల సుఖ సంతోషాలతో ఉంటుందని జానపదుల విశ్వాసం.

ఆధారాలు :

1. క్షేత్రపర్యటన - విషయసేకరణ : గ్రామ పెద్దలు దేవరకు సంబంధించిన అముద్రిత గ్రంథం.
2. మౌఖిక సమాచారం - విషయ సేకరణ :
   పేరు : కంచర్ల వెంకటరెడ్డి (68) - సెల్ : 9493719853
   శిరిగిరెడ్డి ఈశ్వరరెడ్డి (56) - సెల్ : 9063606485
   ఊరు : పాలూరు గ్రామం, తొండూరు మండలం, కడప జిల్లా.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అపురూపమైన కళారూపం – పగటివేషం

– డా॥. బుశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ఎ.పి. ట్రిపుల్ ఐటి, ఆర్.కె.వ్యాలీ, కడప.

కళ :

కళ శబ్దానికి పూర్వులు చంద్రునిలో 16వ భాగం, కాలంలో ఒక భాగం, 32 కాష్ఠల కాలం. కాష్ఠ అంటే 18 రెప్పల పాట్ల కాలం, రాశిచక్రంలో 21600 భాగాలు, రాశిలో 1800 భాగం, సప్తధాతువులలో ఒకటి, ఏక మాత్రాత్మకమైన లఘువర్ణం, ద్రుతప్రకృతికము కానిది, స్త్రీరజస్సు, నౌక, కపటం, మణిసిల, సంఖ్యానం, శిల్పం, చతుష్షష్టి కళలో ఒకటి అనే అర్థాలు తెలిపారు. ఈ అర్థాలలో చతుష్షష్టి కళలకే ఈ పదం అన్వయించబడుతున్నది. రసానందాన్ని కలిగించునది కళ. ఈ కళల సృష్టికర్తలు ఆదిమానవులు. దానిని జానపదులు విస్తృత పరచినారు. వీరు కొన్ని వందల కళలను సృజించారు. వారి ప్రతి కళ నాన్యతో దర్శనీయమైన ప్రతిభతో కూడుకొని ఉంది. వారి నైపుణ్యానికి దీటువచ్చే ఆధునిక పరిజ్ఞానం ఏదీ లేదనవచ్చు.

జానపద కళలు :

జానపదుల ప్రతికళ ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలతో వివిధ ఆహార్యాలతో, బీభత్సకర విన్యాసాలతో, నిపుణతతో, నిరుపమాన విన్యాసంతో కూడి ఉంటుంది. అలాంటి కళల్లో చెప్పదగినవి వీర నాట్యం, చిందు భాగోతం, అర్ధనారీశ్వరం, దేవరపెట్టె, మరగాళ్ళు, ఒగ్గు కథ, జముకు, కీలుగుర్రాలు, చెంచులక్ష్మి వీధి భాగోతం, పల్లె సుద్దులు, పగటి వేషాలు, కొమ్మునృత్యం, పల్లెపదం, గురవయ్యలు, తప్పెట గుళ్ళు, గరగలు, కాళీమాత, జడకోలాటం, గంగిరెద్దులు, సంకీర్తన భజన, చెక్కభజన, హరిదాసులు, పండరిపాట, బుర్రకథ, తూర్పు భాగవతం, పులివేషాలు, చెంచుభాగవతం, బుట్టబొమ్మలు, మోడి, తోలు బొమ్మలాటలు వంటివి అనేకం ఉన్నాయి. వీటిలో చెప్పదగిన ఎన్నదగిన కళారూపం పగటి వేషం.

పగటి వేషాలు :

పగటి వేషాలు దాదాపుగా ఏకపాత్రాభినయానికి ప్రతీకలు. వేషధారణలో వైవిధ్యం, సంభాషణ లేదా వాచికాభినయంలో ప్రత్యేకత హాస్యరస స్ఫూర్తికి దోహదపడతాయి. దాదాపు అన్ని పగటి వేషాలు కళాకారుల ప్రతిభ ఆధారంగానే వ్యాప్తిలో ఉన్నాయి. అయితే కొన్ని పగటి వేషాల ప్రదర్శనలో ఇద్దరు లేదా ముగ్గురు పాత్రదారులుండటం వల్ల నాటిక ప్రక్రియలో భాగంగా వీటిని కొందరు పరిగణిస్తున్నారు. అయితే నాటకానికి దీనికి చాలా వ్యత్యాసం ఉంది.

కొంత వేదాంత విషయాలు, కొంత లోకాచారాలు, మరికొన్నిట్లో కుల, మతాలు - మూఢవిశ్వాసాలపై అధిక్షేపం ఇలా పగటి వేషధారులు స్పృశించని విషయాలు లేవు. కొన్ని సంభాషణల్లో సంస్కృత శ్లోకాలు, తెలుగు పద్యాలు, సామెతలు, మాండలిక భాష ఉపయోగించటం ఓ విశేషం. శ్రీ విభూతి భవానీ లింగంగారు 'పగటి - వేషాలు - వాటి ప్రాచీనత' అన్న గ్రంథంలో దాదాపు 34 పగటి వేషాలు గుర్తించి ఆ వేషాల తీరు తెన్నులు, సంభాషణలు గ్రంథస్థం చేశారు. వాటిని ఇలా పేర్కొనవచ్చు.

1) ఆది బైరాగి వేషం, 2) బుడబుక్కలవారి వేషం, 3) సాతానివైష్ణవుల వేషం, 4) మందుల వాళ్ళ వేషం, 5) సోమయాజులు, సోమదేవమ్మ వేషం, 6) ఫకీరు సాహేబు వేషం, 7) లంబాడీల వేషం, 8) బోడి బ్రాహ్మణ స్త్రీలవేషం, 9) వీరబాహు వేషం, 10) గొల్ల బోయిడు వేషం, 11) భట్రాజుల వేషం, 12) కోయవాళ్ళ వేషం, 13) కోమటి, లింగబలిజ వేషం, 14) దేవరశెట్టి వేషం, 15) దేవాంగుల వేషం, 16) అత్తరు సాయిబుల వేషం, 17) శిద్ధి కంచినీ వేషం, 18) కారువా సోమయాజుల వేషం, 19) ఎరుకల సోదివేషం, 20) పిట్టల దొర వేషం,

21) వడ్డి వుప్పర వేషం, 22) కొమ్మ దాసరి వేషం, 23) కాశికావిళ్ళ వేషం, 24) చిట్టిపంతులు - పఠానీవేషం, 25) హరిదాసు వేషం, 26) కన్నకైరుడు వేషం, 27) జంగం దేవర వేషం, 28) పాములోళ్ళ వేషం, 29) గంగిరెద్దుల వేషం, 30) అర్ధనారీశ్వర వేషం, 31) పఠాన్ వేషం, 32) శక్తివేషం, 33) రంభ శుక ఋషి వేషం, 34) శారదా వేషం, ఇవేగాక మరికొన్ని వేషాలు కూడా వేస్తున్నారు.

ఒకనాడు భారతదేశంలో సామంతరాజులు, స్వతంత్ర హిందూ ముస్లిం రాజులు పాలనలో గూఢచారులుగా మారువేషాలు ధరించడం, కోటలో చొరబడి రాజులను వంచించడం, చీరల వర్తకులు గానూ, జ్యోతిష్కులు గానూ, గాజుల శెట్టి వేషాలతోనూ, సోదె అమ్మగానూ, కురవంజి వేషాలతోనూ, భట్రాజు వేషాలతోనూ, ప్రవేశించి రాజుల గుట్టు మట్టులు తెలుసుకొని యుద్ధం ప్రకటించేవారు.

పగటి వేషాల ద్వారా సంఘంలో ఉండే మూఢ నమ్మకాలనూ, దోపిడీగాండ్లనూ, లంచగొండులనూ, దుష్టశక్తులు సంఘాన్ని ఎలా మోసం చేస్తున్నాయో, ఎవరికీ నొప్పి తగలకుండ, హాస్యధోరణిలో గుట్టును బయలు చేసేవారు. వీరు పగలే వేషాలు ధరించి బజారులు తిరుగుతూ, కూడలిలో నిలబడి ప్రజ్ఞావిశేషాలను వివరించే వారు. రోజుకొక వేషం చొప్పున 60 రకాల పాత్రలను ధరించేవారు. ఈ వేషాలు వేసేవారు కృష్ణాజిల్లా కూచిపూడి, గడ్డిపాడు, దెందులూరు, అనకాపల్లి, కాకినాడ, నరసిరావు పేట, నెల్లూరు మూలపేట, జంగాలు మొదలైన ప్రాంతాలవారు పగటి వేషాలను అద్భుతంగా ప్రదర్శించే వారు. వీరి వారసత్వాన్ని స్వీకరించిన కళాకారులెందరో ఆంధ్రదేశమంతా తిరుగుతూ తమ కళను ప్రదర్శిస్తున్నారు. వీరి ప్రదర్శనలో హాస్యం ప్రధానమైనది.

ఇక్కడ ఒకటి రెండు పాత్రల హాస్య సంభాషణలను పేర్కొనడం జరిగింది.

బోడి బ్రాహ్మణస్త్రీల వేషం :

ఈ వేషధారి ఇలా అంటాడు.

'మా పంతులు గారే పోయారండి. అయినా మా పంతులు గారు ఈ కాలం మగవారిలా ఉండేవారా యేమిటి? మూరెడు మీద జానెడి మనిషి. పిడికెడు జంధ్యం, జానెడు జుత్తు, గుమ్మడికాయంత బొజ్జ, క్రింద అమలాపురం కొబ్బరి కాయంత...

అదేమిటోనండి! మా పంతులు గారున్నంత కాలం నా పాదం ఎప్పుడూ వీధుల్లోనే గాని యింట్లో యేరోజు వుండలేదండి. ఇక పంతులుగారు పోయిన తరువాత అటు పంతులుగారి స్నేహితులు, యిటు నా స్నేహితులు ఎక్కేవారు దిగేవారు, ఎక్కేవారు దిగేవారు అంటే మా గుమ్మం మెట్లండి... ఎవర్ని కాదన గలం చెప్పండి. అందరితోటి సమానంగానే ఉంటున్నానండి.

మా పంతులుగారు పోయారు అన్న విచారమే లేదండి. కాని బుర్ర మీద వెంట్రుకలే లేవన్న దిగులు తప్ప. అదేమిటో నండి మా పంతులుగారు ఉన్నంత కాల నాకు సంతానం కలగలేదు. పంతులుగారు పోయిన మూడు సంవత్సరాలకు ఈ కుర్రాడు కలిగాడు" అంటారు.

ఇలా ఈ బోడెమ్మ పగటి వేషంలో కొంచెం హాస్యం, ఆ హాస్యం మాటున శృంగారం, జాణతనం ఉండి ప్రజలను నవ్విస్తుంది.

అత్తరు సాహెబు వేషం :

ఈ వేషధారి ఇలా అంటాడు.

"ఇది హెరాయిల్ సర్కార్! తల్కి రాసుకునే అమ్లా వుంది. గంజాం అమ్ల దీనికింద బలాదూర్! ఒక్కసారి తల్కి అమ్లా రాస్తే మీ తల యింక దువ్వే పని లేదు సర్కార్. అంతా గుండు హైపోతాది. కుంకుడు కాయల ఖర్చు తగ్గుతుంది. నూనె ఖర్చు తగ్గుతుంది. వేడి తగ్గుతాది. హీట్ పెర్గుతాది. ఇట్లాంటి అత్తర్ సెంట్లు అమ్లా తీస్కోండి సర్కార్! సలామాలేకుం!" అంటాడు. ఈ మాటలు విన్న ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుతారు. ఈ కళారూపానికి నేడు ఆదరణ కరువవుతున్నది. దాని మూలంగా ఈ కళారూపంలో దాగివున్న మన జీవన సంస్కృతి తెరమరుగవుతున్నది. అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలదేననవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కళాదీపిక - ప్రత్యేక సంచిక, సెప్టెంబరు 2015
2. తెలుగు నాటకరంగ వికాసం - పి.ఎస్.ఆర్. అప్పారావు
3. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
4. సాహిత్య శిల్ప సమీక్ష - పింగళి లక్ష్మీకాంతం
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీయస్ సుందరం
6. తెలుగు జానపదగేయ గాథలు - ఆచార్య బి. రామరాజు

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అనంతపురం జిల్లా జానపద వీధినాటక కళారూపాలు

– డా॥. ఈ. మురళీధర్, యస్.వి డిగ్రీ పీజి కాలేజ్, అనంతపురము.

రాయలసీమలో యక్షగానాల తరువాత వీధి నాటకాలు, బుర్రకథలు, విచిత్ర వేషాలు, తోలు బొమ్మలాటలు, హరికథలు మొదలైనవి విరివిగా ప్రదర్శిస్తూ ఉండేవారు. వీటినే బయలాటలనీ, బయలు నాటకాలనీ అనేవారు. వీటిని మాలపల్లెలో ఉన్న దాసరులు అనేవారు ప్రదర్శిస్తూ ఉండేవారు. వీరిని దాసుళ్ళనీ, కొమ్మాయి దాసుళ్ళనీ, మాల దాసరులనీ పిలువబడుతూ ఉండేవారు. హరిజనుల్లో ఒక తెగగానూ వారిలో అతీతులుగానూ ఉండేవారు. శూద్ర జాతులు బ్రాహ్మణులను కూడా గూడెపు ప్రజలు గౌరవిస్తారు. ఒకనాడు వీటిని దాసరులు ప్రదర్శించినా, ఈనాడు అనేక మంది వాటిని ప్రదర్శిస్తూ జీవయాత్ర చేస్తున్నారు. వీరు ప్రదర్శించే నాటకాలు అన్నీ వ్రాతప్రతులుగానో, లేక తాటియాకు గ్రంథాల్లో లేక ప్రత్యేక వ్యక్తుల కంఠస్థంగానే నిలిచి ఉన్నాయి. ఒక్కొక్క దేశంలో ఉన్న ముఖ్య నాయకునికి అనేక నాటకాలు కంఠస్థం అయి ఉంటాయి. అయినా ఇప్పటికి రాయలసీమ పల్లెల్లో అనేక నాటకాలు బయలు పాటకాలు ఉన్నాయి.

నాటి మేటి నాటకాలు దొడ్డకవి వ్రాసిన విజయం, కుమ్మరి బాలయ్య వ్రాసిన సారంగధర, రుద్రకవి వ్రాసిన శశిరేఖా పరిణయం, గరుడాచల యక్షగానం మొదలైన నాటకాలన్నీ నేటి రాయలసీమలో ప్రచారంలో ఉన్నాయి. నాలుగురు కూడిన నడి బజారులో నాటక ప్రదర్శన, సవరించిన పాత్రల మధ్య సంవాదం జరుగుతుంది. ప్రదర్శనా పద్ధతి ఊరు మధ్య పెద్ద బజారులో నలుగురు సమకూడే ప్రదేశంలో పెద్ద గడలతో పందిరి వేసి, చుట్టూ మామిడి తోరణాలు కట్టి, పందిరిలో ఎత్తులో దిబ్బ పోసి, ప్రదర్శనానికి ముందు మద్దెల తాళాలతో కొంచెం సందడి చేసేవాళ్ళు. అంతకు ముందు ప్రదర్శనకారులు ఇంటింటికి వెళ్ళి రాత్రి ప్రదర్శనానికి రమ్మని ఆహ్వానించేవారు. ప్రదర్శనానికి లైట్లు, తెరలు ఉండేవి కావు. తెరలకు బదులు దుప్పట్లు ఉపయోగించేవారు. లైట్లకు బదులు దివిటీలు వెలిగించేవారు. గ్యాసులైట్లు వచ్చిన తరువాత పై విధానాలు పోయాయి.

తబలా వాయిద్యం :

ఈ యక్షగానాల్లో స్త్రీ పాత్రలు పురుషులే ధరించేవారు. భుజకీర్తులు ధరించేవారు. కిరీటాలు పక్షుల రెక్కలతో సొంపుగా తయారు చేసేవారు. వేషధారణలో ఆయా అరపాలకు తగిన ఎరుపు, పసుపు, పచ్చ రంగులను ఉపయోగించేవారు. ప్రతి పాత్ర ప్రవేశానికి ఒక హంగామా చేసేవారు. ఈ విధంగా ప్రేక్షకుల్లో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించేవారు. ముఖ్యంగా ప్రధాన పాత్రలు యముడు, కంసుడు, రావణుడు మొదలైన పాత్ర ప్రవేశాల్లో నిప్పులు గ్రక్కుతూ పాత్రలు వచ్చేవి. ఈ నభారంగమునకు విచ్చేసిన అమాత్యులెవరండి? అని ప్రశ్నిస్తే గ్రుచ్చినట్టు పాత్ర పరిచయం చేసేవారు. ఆ తరువాత నాటక ప్రారంభం. నటుడు వల్లించిన ప్రతి పాటకూ హంగు చేస్తారు. ఈ విధమైన బయలు నాటకాలు రాయల సీమలో ఉన్న పల్లె ప్రాంతాల్లోనూ ప్రదర్శింపబడుతూ ఉండేవి.

వెదురు చాపల వీధి నాటక రంగస్థలం :

ఆనాడు రాయలసీమలో ప్రదర్శించటానికి తగిన ప్రదర్శనా శాలలు లేవు. వెదురు చాపలు, తడికెలూ, గోనెసంచులు కప్పలతో నాటకశాలలు నిర్మించుకునే వారు. ప్రతి నాటక సమాజమూ మంచి క్రమశిక్షణతో రంగస్థలాన్ని పవిత్రంగా ఎంచేవారు. నాటకాలలో వాయిద్యాలలో హార్మోనియం, తబలా, మృదంగం, పిడేలు ఉపయోగించేవారు. వేషధారణలో నఫేదు, అర్ధశం

ఉపయోగించేవారు. ఉత్తమ పాత్రలన్నిటికి విలువైన చెంకీ కోటులను, మంచి తల పాగాలను తురాయిలను ఉపయోగించేవారు. విగ్గులకు బదులుగా వారివారి శిరోజాలనే విగ్గులుగా పెంచుకునేవారు. బళ్ళారికి పేరుతెచ్చిన బయలాటలు పూర్వం నుంచీ బళ్ళారి ప్రాంతంలో బయలాట అనే జానపద కళాకారులు బహుళ ప్రచారంలో ఉండేది. ఆంధ్రప్రదేశపు వీధి నాటక ప్రదర్శనానికి, ఈ బయలాట ప్రదర్శనానికీ ఎంతో సన్నిహిత సంబంధ ముంది. ఈనాటికీ ఈ కళారూపం బళ్ళారి చుట్టుప్రక్కల గ్రామాల్లో ప్రదర్శింపబడుతూ ఉన్నాయి.

అనంతపురం మెరువణి :

మెరువణి అంటే వధూవరుల ఊరిగింపు అని అర్థం. అనంతపురం, బళ్ళారి, కర్నూలు జిల్లాలోనూ మెరువణి అనే ప్రత్యేకమైన వేడుక వాడుకలో ఉందనీ, పెళ్ళి ఉత్సవానికి సంబంధించిన తలంబ్రాల సంబరం తరువాత రాత్రిపూట మెరువణి బండి మీద నూతన దంపతులు ఊరేగేటప్పుడు తమకు గల చీరలు నగలు పదిమందికీ ప్రదర్శించటానికి అదొక మంచి అవకాశమనీ ఊరేగింపులు, ఓ వాద్యబృందం నాయకుడు చెబుతాడు. చదివే ఓజు అన్నది బిరుదు అని తూమాటి దోణప్పగారు తమ జానపద కళాసంపదలో వివరించారు. ఆడవారూ, ఆడంబరాలు, ఉభయపక్షాల వారికి అదొక మంచి అవకాశం. బంగారం, పట్టుచీరలతో రెపరెపలాడుతూ ఏడువారాల నగల నిగనిగలతో ప్రతి ఒక అమ్మాయి కోవెలలోని అమ్మలాగా, మహాశిల్పి చెక్కిన బొమ్మలాగా ఊరేగింపులో కనిపించాలని ఉవ్విళ్ళూరుతుంటారు. ఇంట లేకపోయినా, పొరుగింటినుంచో, పుట్టింటినుంచో ఎరువు తెచ్చిన బరువు సొమ్ములన్ని ఒంటినిండా ధరిస్తారు. ఊరేగింపులో రెండెడ్ల బండిని సాధారణంగా వాడుతారు. కాని ప్రస్తుతం నేటి నాగరికతను అనుసరించి లాపులేని మోటారు కారు వాడుకలోకి వచ్చింది. పెళ్ళికొడుక్కి కుచ్చుల తలపాగా లేదా రుమాలు, తలపాగా పైన కలికి తురాయి బాసికం, చేతిలో పడిబాకు, మెడలో చంద్ర హారాలు, పూలదండలు, ముంజేతికి కంకణాలు, సిల్కు దుస్తులు, పెళ్ళికూతురుకు పూలజడ, మేలిముసుగు, బాజుబందుల మెడలో కాసులపేరు, రవ్వదుద్దులు, బుగ్గ కాటుకబొట్టు, పాపిటబిళ్ళలు, రవ్వల ఒడ్డాణం, నుదుట బాసికం మొదలైనవి.

స్త్రోత్ర పాఠానికి ఉదాహరణ :

వోహ వోహ యోయ్ పాగల
రాతి గుండు పగల గొట్టగ వచ్చు
కొండలన్నిటి పిండి గొట్టవచ్చు
విశ్వాభిరామ వినుర వేమ.

కుచ్చుల్ల తురాయి - పచ్చల్ల పల్లకి
ఐదేళ్ళ కుంగరాలు - ఆస్తి కడియాలు,
ఇదిగో అంటే - ఇరవై మంది పని బడితే పాదాల కడ,
పదివేల మంది నారప్ప ముట్టింది,
ముత్యమై పట్టింది బంగారమై,
ఎద్దుతొక్కిన భూమి యెయి వుట్లు పండింది.
గాదె పెట్టిన తోన కనకసిరి పంట పండె
మారుగేరీ సబ్బండు జాతులు
డెబ్బైయేడు కులాలు, తగ్గినా ముగ్గినా
కంటికి రెప్పై, కాలికి చెప్పై కాపాడో జోపానం చేసినాడు.

అదే పోత, ముసురు తొట్టిలో మూల్గుతుంటాడో
దొంతకుండల్లో దొల్లు తుండాడో
బాన కడుపుతో పాకుతుండాడో
దోని కడుపుతో దోకు దుండాడో యాడాడ ఉండాడో,
యెక్కడుండాడో పెండ్లికొడుకు అన్నదమ్ముల కింద
డక్కోలా హాయి డక్కోలు బరాబరి వాహోయి బరాబరి.

వీరు ప్రదర్శించే నాటకాలు అన్నీ వ్రాతప్రతులు గానో, లేక తాటియాకుల గ్రంథాల్లోనో ప్రత్యేక వ్యక్తుల కంఠస్థం గానే నిలిచి ఉన్నాయి. ఒక్కొక్క దేశంలో ఉన్న ముఖ్య నాయకునికి అనేక నాటకాలు అడేవారు. అతను మరణిస్తే, అతనితోపాటే ఆ నాటకాలు కూడా అంతరించిపోతున్నాయి.

ఆధారగ్రంథాలు :

1. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి 1992
2. జానపదకళా సంపద - తూమాటి దోణప్ప
3. భారత్ డిజిటల్ లైబ్రరీ - 2007-2017 (ఆర్కీవ్)
4. జానపద కళారూపాలు - అనంతపురము - ఆణిముత్యం (సంకలనం)

❖ ❖ ❖

"బతుకమ్మ పండుగ విశిష్టత – పాటలలోని సాహిత్య పరిశీలన"

– లేళ్ళపల్లి శ్రీదేఖరమేఘ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

మన భారతదేశం గొప్ప సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లు. ఈ సాంప్రదాయాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా, ఒక్కో ప్రత్యేకతతో ఉంటాయి. ఈ సంస్కృతి, సాంప్రదాయాలు, ఒక తరం నుండి ఇంకో తరం వారికి వారసత్వంగా వస్తాయి. ఇలా ఒక్కో తరం వారికి చేరడం వలన సంస్కృతి, సాంప్రదాయాలు బ్రతికి, భవిష్యత్ తరాలవారికి వారధిగా నిలిచి అందరికి మన గొప్ప సాంప్రదాయం తెలిసేట్టుచేస్తుంది.

తెలంగాణ ప్రాంతంలో మాత్రమే జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ బతుకమ్మ, మహిళలు,చిన్న పిల్లలు, ఎంతో ఆసక్తిగా భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ ఇది. ఈ బతుకమ్మ పండుగ గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.

ముందుగా చారిత్రక పరంగా ఈ బతుకమ్మ పండుగ గురించి తెలుసుకుందాం.

తెలంగాణా ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పాలించారు. వారి దగ్గర వేములవాడ చాళుక్యులు సామంతులుగా వుండేవారు.క్రీ.శ.973 సం. లో ఈ చాళుక్య రాజైన "తైలపాడు" రాష్ట్రకూటులలో చివరి రాజైన "కర్కుడిని" చంపి కళ్యాణ చాళుక్య రాజ్యాన్ని నెలకొల్పాడు. క్రీ.శ 997 సం.లో తైలపాడు చనిపోవడంతో అతని కుమారుడు "సత్యాశ్రయుడు" రాజ్యాధికారాన్ని చేపట్టారు. ఆ సమయంలో వేములవాడలో ప్రసిద్ధిగాంచిన రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో కొలువైన "రాజరాజేశ్వరి" అమ్మవారు ఆపదలో ఉన్నవారికి అండ దండ గా ఉండేదనిదని అప్పటి ప్రజల నమ్మకం. ప్రజలే కాదు చోళ రాజు "పరాంతక సుందర చోళ" కూడా రాష్ట్ర కూటుల నుండి ఆపద వున్నప్పుడు రాజరాజేశ్వరి అమ్మ వారికి భక్తుడిగా మారాడు. ఆ అమ్మ వారే తనను రక్షించింది అని నమ్మి అతని కుమారుడికి "రాజ రాజ" అని పేరు పెట్టాడు. అతనే క్రీ.శ.985 నుండి క్రీ.శ 1014 వరకు ఆ రాజ్యాన్ని పాలించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుంది.

రాజరాజ కుమారుడు "రాజేంద్ర చోళ" సేనాపతిగా ఉండి, చాళుక్య రాజైన సత్యాశ్రాయుడిని ఓడించి విజయం సాధించారు. ఆ విజయానికి గుర్తుగా ఆ రాజరాజేశ్వరి ఆలయాన్ని కూల్చి వేసి అందులో ఉన్న శివ లింగాన్ని తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. ఆ శివలింగం కోసం 1006 సం. లో ఒక ఆలయ నిర్మాణం చేపట్టారు. రాజరాజ చోళ క్రీ.శ.1010 సం.లో ఆ అలయ నిర్మాణం పూర్తి చేసి, భారీగా ఉన్న ఆ శివలింగాన్ని ఆ ఆలయంలో ప్రతిష్టించాడు. ఆ ఆలయమే ప్రఖ్యాతి గాంచిన "బృహదీశ్వరాలయం". ఈ సమాచారం శాసనాల ద్వారా చోళ రాజులు తెలియబరచారు. ప్రస్తుతం వేములవాడలోని ఉన్న భీమేశ్వరాలయ శివలింగానికి తంజావూరు లోని బృహదీశ్వరాలయం లోని శివలింగానికి మధ్య సారూప్యత కనిపిస్తుంది. వేములవాడ లోని శివలింగాన్ని పార్వతీదేవి నుండి వేరుచేసి తంజావూరుకి తరలించినందుకు తెలంగాణ ప్రజల మనసు బాధ పడింది. బృహదమ్మ(పార్వతీదేవి) నుండి శివలింగాన్ని వేరు చేసినందుకు తమ దుఃఖాన్ని చోళులకు తెలియ చేయడానికి మేరు పర్వతంలాగా పూలను పేర్చి బతుకమ్మను చేయడం మొదలు పెట్టారని తెలంగాణ వాసులు చారిత్రక ఆధారాలతో విశ్వసిస్తున్నారు. బృహదమ్మ పేరు నుండి ఈ బతుకమ్మ అనే పేరు పుట్టిందని ఇక్కడి వారి విశ్వాసం.

అలా తెలంగాణా మహిళలు ప్రతిసంవత్సరం బతుకమ్మను పేర్చి 9 రోజులు ఈ బతుకమ్మ పండుగ ఆనవాయితీగా చేయడం మొదలుపెట్టారు అంటారు.

దాదాపు 1000 నం పైనుండి ఈ పండగను ప్రతి సంవత్సరం ఘనంగా ఈ తెలంగాణా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

తెలంగాణ ప్రాంతంలో మాత్రమే జరుపుకునే అతి ముఖ్యమైన ఈ పండుగ బతుకమ్మ పండుగ.ఈ పండుగ తెలంగాణ ప్రజలందరికీ ప్రీతిపాత్రమైనది. భగవంతుణ్ణి పూలతో పూజించటం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆన వాయితీ. అయితే, పూలనే గౌరీదేవిగా భావించి పూజించటం ఈ ప్రాంతవాసుల ప్రత్యేకత. మహిళల మధ్య, కుటుంబాల మధ్య, ప్రేమానురాగాలను పెంచి సమాజంలో ఐకమత్యం పెంచే అద్భుతమైన పండుగ ఈ బతుకమ్మ.

బతుకమ్మ పండుగను పెత్రమావాస్య (భాద్రపద బహుళ అమావాస్య) నుండి తొమ్మిది రోజులు జరుపుకుంటారు. ఆశ్వయుజ శుక్ల అష్టమి అనగా, దుర్గాష్టమి నాడు అత్యంత వైభవంగా పుట్టింటి నుండి అత్తగారింటికి బతుకమ్మను పంపిస్తున్నట్టు భావించి స్త్రీలంతా కలిసి దగ్గరలోని చెరువులో అయినా, కొలనులో అయినా ఓలలాడిస్తారు. నీటిలోవదులుతారు.

బతుకమ్మ పండగకు సంబంధించి ప్రచారంలో ఉన్న ఒక కథ :

పూర్వము చోళ దేశములో ధర్మాంగుడు అనే రాజు వుండేవారు. అతని భార్య సత్యవతి.వారు సంతానం కోసం నూరు నోములు నోముకుని నూరు మందిని కంటారు. వారు అత్యంత శూరులైనా కూడా శత్రువుల చేతిలో చనిపోతారు.ఆ బాధతో రాజు,రాణి రాజ్యం వదిలిపెట్టి వనములో నివసిస్తూ లక్ష్మీ దేవి గురించి ఘోర తపస్సు చేస్తారు. ఆ లక్ష్మీ దేవి వీరి తపస్సుకు మెచ్చి ప్రత్యక్షం అయి ఏ వరం కావాలో తెలుపండి అంటుంది. అప్పుడు రాణి సత్యవతి లక్ష్మీ దేవితో నువ్వే నాకు కుతురిలా నా కడుపున పుట్టాలి అని కోరుతోంది.అందుకు లక్ష్మీదేవి సంతోషం చెంది తథాస్తు అని ఆ రాణికి కూతురిలా పుడుతుంది లక్ష్మీ దేవి. ఆ సమయంలో మునులు, ఋషులు, అత్రి, వశిష్ఠ మహ ఋషులు కూడా వచ్చి ఆ లక్ష్మీ దేవికి బ్రతుకడానికి వచ్చినది కనుక "బతుకమ్మ" అని పేరు పేరు పెడతారు. ఆ రాజు రాణి ధన్యులుగా భావించి సంతోషముగా వారి రాజ్యానికి వెళ్ళి చక్కగా రాజ్యపాలన చేస్తాడు. కొంతకాలానికి శ్రీమహా విష్ణువు "చక్రాంగుడు" అనే పేరు తో రాజు వేశములో ఈ రాజు ఇంటికి వచ్చి, వారి పుత్రికైనా లక్ష్మీ దేవిని వివాహం చేసుకుని ఇల్లరికంగా ఉంటాడు. వారు పిల్లా పాపలతో, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉంటారు. రాజ్యం సకల సౌకర్యాలు, అష్టైశ్వర్యాలతో సుభీష్టంగా ఉంటుంది. రాజు, రాణి, బతుకమ్మ రూపంలో లక్ష్మీదేవి, విష్ణువు రూపంలోని చక్రాంగుడు పిల్లా పాపలతో సిరి సంపదలతో సంతోషంగా ఉంటారు.

అలా ఈ జగతిలో శాశ్వతంగా ఆ లక్ష్మీ దేవి బతుకమ్మ గా ప్రతి సంవత్సరం వచ్చి తొమ్మిది రోజులు పుట్టింటికి వచ్చినట్టు వచ్చి, ప్రజల మధ్య ఉండి అందరికి అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలిగించి చివరి రోజు అత్త వారింటికి వెళ్తున్నట్టుగా ఆ పూలబతుకమ్మను నీటిలో సాగనంపి, మళ్ళీ ఏడు రావాలని ఆ గౌరిదేవి లా, లక్ష్మీ దేవి రూపంలో ఉన్న బతుకమ్మను మహిళలంతా వేడుకుంటారు.

ఈ పండుగలో పూలకెంత ప్రధాన్యముందో పాటలకీ అంతే ప్రాధాన్యముంది. బతుకమ్మ పాటలన్నీ ఎప్పుడో పూర్వకాలంలో అజ్ఞాత మహిళలు ఆశువుగా అల్లినవే. సరళమైన భాషతో, రాగయుక్తమైన శైలిలో బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే అందమైన పాటలివి. వీటిలోని సాహిత్యవిలువలు అమూల్యమైనవి. ఎంతో సులువైన పదాలతో అందరూ పడుకునేట్టు ఉంటాయి.

జానపద, పురాణేతిహాస, చారిత్రక ఘట్టాలతోపాటు సున్నితమైన మానవ సంబంధాలు పాటలలో ప్రధాన వస్తువులు.

బతుకమ్మ పండుగ వర్షాకాలంలో వస్తుంది. ఈ సమయంలో ప్రకృతి అంతా పూల వనంలా అందంగా కనిపిస్తూ కనువిందు చేస్తుంది. రకరకాల, రంగురంగుల పూలు విరబూస్తాయి. ఈ కాలంలో ప్రకృతిలో లభించే అడవిపూలనే ఎంచుకొని బతుకమ్మను పేర్చుతారు. తంగేడు, గునుగు, కట్ల, గోరంట, గుమ్మడి, రుద్రాక్ష, మందార, గన్నేరు, సీతజడల పూలు మొదలైనవాటితో ఎంతో ఆకర్షణీయంగా బతుకమ్మను తీర్చిదిద్దుతారు.

ఔషధ గుణాలున్న ఈపూలను వాడటం వలన వర్షా కాలంలో వచ్చే జలుబు, జ్వరాలను నివారించుకోవచ్చు. పూర్వం ప్రతి ఊరిలో చెరువులు తటాకలు ఉండేవి. ఆ నీరే ఊరివారంతా తాగేవారు.ఈ బతుకమ్మ ఆడిన తర్వాత ఔషధ విలువలున్న బతుకమ్మలను ఆ నీటిలో వదలడంతో ఆ నీరు తాగిన వారికి ఆ వర్షాకాలం లో వచ్చే జలుబు, జ్వరాలు లాంటివి తగ్గిపోయేవి.ఎన్నో జబ్బులు నివారించడంలో తంగేడు వంటి అడవిపూలు మంచి ఔషధంలాగా పనిచేస్తాయి. ఆధునిక వైద్యులు కూడా ఈవిషయాలను ఒప్పుకుంటున్నారు.

ఇక నైవేద్యాల విషయానికొస్తే... ఈ తొమ్మిది రోజులూ ఆరోగ్యాన్ని ప్రసాదించే ధాన్యాలనే నైవేద్యాలలో ఉపయోగిస్తారు. రోజుకొక రకమైన పులిహోర, చివరి రోజైన సద్దుల బతుకమ్మ రోజు తొమ్మిది రకాల సద్దులు (పులిహోరలు) చేస్తారు. చింతపండు, నువ్వులు, కొబ్బరి, పల్లీలు, పెసరపొడి, ఆవపొడి, దద్దోజనం (పెరుగన్నం), బెల్లం అన్నం, నిమ్మకాయ, మామిడికాయ... ఇలా అందుబాటులో ఉన్నవాటితో చేస్తారు.

సద్దుల బతుకమ్మను తీసుకొని చెరువు దగ్గరికి వెళ్ళి నప్పుడు ప్రసాదంగా నువ్వులపొడి, పల్లీలపొడి, కొబ్బరి పొడి, నెయ్యి కలిపిన సత్తుపిండి, తులసీదళాలు మొదలై నవి నైవేద్యంగా తీసుకెళ్తారు. వర్షాకాలంలో శరీరానికి వేడి కలగాలని నువ్వులు, పల్లీలుమొదలైనవి బెల్లంతో కలిపి నైవేద్యం చేస్తారు. దీని ద్వారా ఐరన్, ప్రోటీన్లు లభించి ఆరోగ్యంగా ఉంటారు అందరూ. అందుకే ఈపండుగ ఆరోగ్య ప్రదాయిని అని కూడా చెప్పుకోవచ్చు.

బతుకమ్మకు పాడే పాటలు జీవితంలోని ఎన్నో రకాల కోణాలను తెలియజేస్తూ మంచి విషయాలు చెప్పేవిగా ఉంటాయి. అటువంటి కొన్ని పాటలను పరిశీలిద్దాం.

బతుకమ్మ పండుగ తెలిసిన ప్రతీ ఆడపడుచుకు తెలిసే పాట ఇది...

ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ
ఏమేమి కాయప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వప్పునే గౌరమ్మ
తంగేడు కాయప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వుతోని ఆడెవారెవ్వరో పాడెవారెవ్వరో
అందాన పుట్టినా బంగారు బాలలు
నెలకొన్న నెలరాజులే గౌరమ్మ
ఎప్పటికి వైభోగమే గౌరమ్మ
ఇంకేమి పువ్వప్పునే గౌరమ్మ
ఇంకేమి కాయప్పునే గౌరమ్మ

ఇలా గుమ్మడి, గునుగు, గోరంట, కట్ల, మందార అంటూ రకరకాల పూలను చెప్తూ పాట పాడుతారు. దీన్ని బట్టి ఆకాలంలో దొరికే ఔషధ గుణాలున్న పూల గురించి మనకు తెలుస్తుంది.

జనకు జనకునింట్లో కోల్
సత్య జనకునింట్లో కోల్
పుట్టింది సీతమ్మ కోల్
పురుడే కోరింది కోల్
పెరిగింది సీతమ్మా కోల్ పెళ్ళి కోరింది కోల్

అంటూ సీతాకళ్యాణం పాట.

శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో
చేయబూనితినమ్మ ఉయ్యాలో
కాపాడి మమ్మేలు ఉయ్యాలో
కైలాస రాణి ఉయ్యాలో

అంటూ మహిళలందరూ తమ పసుపుకుంకుమలను

కాపాడి, సకల సౌభాగ్యాలు ఇవ్వమని ఆ గౌరీదేవిని కోరేపాట. ఈ పాట ద్వారా స్త్రీల భక్తి తెలుస్తుంది.

గొల్లభామలమ్మా చక్కని
గోపిక స్త్రీలమ్మా చక్కని
పదహారు వేల స్త్రీలు భామలు
పడుచు కన్యలమ్మా భామలు

అంటూ గోకుల కృష్ణుడు, గోపికల మధ్య రాసక్రీడల పాట. ఈ పాట ద్వారా కృష్ణ లీలలు తెలుస్తాయి.

కలవారి కోడలు కోల్
కలికి కామాక్షి కోల్
వచ్చిరి అన్నలు కోల్
వనములు దాటి కోల్

పండుగకి అన్నలు అక్కచెల్లెళ్ళని పుట్టింటికి తీసుకెళ్ళడానికి వాళ్ళ ఇంటికి వచ్చి వారి అత్తమామల అనుమతి తీసుకొని తోబుట్టువులను తమతో తీసుకెళ్ళే పాట. ఇటువంటి పాటల వల్ల కుటుంబం, సంస్కృతి, సాంప్రదాయం, బాంధవ్యాలు, బాధ్యతలు తెలుస్తాయి. చక్కటి ఉమ్మడి కుటుంబాల వ్యవస్థను తెలిపే పాట ఇది.

ఇద్దరక్క చెల్లెల్లు ఉయ్యాలో
ఒక్కురికిచ్చే ఉయ్యాలో
ఒక్కడే మాయన్న ఉయ్యాలో
వచ్చన్న పోడాయే ఉయ్యాలో

అంటూ ఈ బతుకమ్మ పండగ 9 రోజులు అక్క చెల్లెళ్ళను తొడబుట్టిన అన్నలు తీసుకెళ్ళి కట్నకానుకలు పెట్టి పంపించే ఆచారం మనకు తెలుస్తుంది. ఆచార వ్యవహారాలు, సాంప్రదాయం, కుటుంబ బాంధవ్యాలు తెలుస్తాయి.

రోజు బతుకమ్మను ఓలలాడించే పాట పాడుతారు.

ఇసుకలో పుట్టిన గౌరమ్మా
ఇసుకలో పెరిగిన గౌరమ్మా
పసుపులో పుట్టిన గౌరమ్మా
పసుపులో పెరిగిన గౌరమ్మా

ఇలా కుంకుమలో, పూలలో, అక్షింతలలో పుట్టిన గౌరమ్మా అంటూ అన్నింటినీ కలిపి చెప్తూ, అన్ని కులాల పేర్లు కూడా చెప్తూ పాట పాడుతారు.అంటే, అందరూ కులమతాలను వీడి, వాటికి అతీతంగా కలసికట్టుగా ఈ పండుగను స్త్రీలు, పిల్లలు కలసి చేసుకుంటారని అర్థమవుతుంది.

చివరగా బతుకమ్మను నీళ్ళలో వదిలి మళ్ళీ ఏడు రావాలని వేడుకుంటూ ఓలలాడించే పాట.

హిమవంతు నింట్లో పుట్టి
హిమవంతు నింట్లో పెరిగి

అంటూ శ్రీమహాలక్ష్మి రూపమైన బతుకమ్మను గౌరీదేవిగా భావించి పుట్టింటి నుండి అత్తవారింటికి పంపిస్తున్నట్టుగా భావిస్తూ అత్తవారింట్లో ఎలా మసలుకోవాలో తెలియజేస్తూ సాగే పాట ఇది.

అత్తమామల పట్ల బుద్ధి కలిగి వుండాలి, ఎవరితో ఎదురు తిరిగి మాటకు మాట సమాధానం ఇవ్వకూడదు, ఎక్కువగా బయట తిరుగకూడదు సాయంత్రం నిద్ర పోవటం మంచిది కాదు, కాళ్ళతో భూమిని తన్నకూడదు, పెళ్ళై అత్తవారింటికి వెళ్ళిన ఆడపిల్లల ప్రవర్తన వలన తల్లిదండ్రులకు, అత్తమామలకు చెడ్డపేరు రాకుండా, కుటుంబ గౌరవమర్యాదలు కాపాడాలి అని, అసలు స్త్రీలు ఎలా మసులు కోవలో తెలియజేస్తున్నట్టుగా ఉంటుందీ పాట.

పెళ్ళైన ఆడపిల్లలు పండుగ సందర్భంగా పుట్టింటికొచ్చే అనవాయితీ ఉండబట్టి చిన్ననాటి స్నేహితులందరినీ కలుసుకోవచ్చని పెళ్ళైన మహిళలంతా ఈ పండుగ కోసం ఆసక్తిగా, ఉత్సాహంగా ఎదురు చూస్తుంటారు.ప్రతి సంవత్సరం స్త్రీలు అందరూ వారి చిన్ననాటి స్నేహితులను ఈ తొమ్మిది రోజులలో ఒకసారైనా తప్పక కలుస్తారు. స్నేహానికి, ఐకమత్యానికి ప్రతిరూపం ఈ బతుకమ్మ పండుగ.

ఈ విధంగా బతుకమ్మ పండుగ భక్తిని పెంపొందించే

పండుగ. అంతేకాక ఆరోగ్యాన్ని, కుటుంబ బాంధవ్యాలను, ప్రకృతిని, సుఖసంతోషాలను, సంస్కృతీ సాంప్రదాయాలను, ఐకమత్యాన్ని తెలియజేసే సంపూర్ణమైన విశిష్టత కలిగిన పండుగ.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు వారి జానపద కళారూపాలు (మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి గారు రచయిత)
2. డా.ఎం.ఎన్.చార్య గారి సంకలనం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గిరిజనులు (యానాదులు) సంస్కృతి – జీవన విధానం

– పులి చెంచయ్య, పరిశోధక విద్యార్థి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

"అనాది" అనే సంస్కృత పదం నుండి "యానాది" అనే పేరు ఉద్భవించింది. యానాదము అనగా సముద్ర తీరము అని అర్థం.

యానాదులు సహజంగా మంగోలాయిడ్ జాతికి చెందినవారని 1865వ సం॥లో నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట యానాదులను పరిశీలించిన డా॥జాన్‌షార్ట్ అభిప్రాయపడ్డారు. అయితే 1909వ సం॥లో శ్రీహరికోట దీవి పరిసరాలలోని యానాదులను పరిశీలించిన తర్‌స్టన్ అనే శాస్త్రవేత్త వీరిని ప్రోటో ఆస్ట్రలాయిడ్ జాతికి చెందినవారని తెలియచేశారు. అయితే వీరు ద్రవిడభాషా తరగతికి చెందినవారని ప్రధానంగా మాట్లాడేభాష తెలుగు అయితే ప్రత్యేక యాసకల్గి చూపరులకు తమాషా కల్గే రీతిలో ఉంటుంది.

తెలుగుజాతికి పునాదులు వేసిన ఆధ్యులో యానాదులు ఒకరు. వీరికి అనాదిగా వస్తున్న క్రమమే "యానాది" గా పేరొందినది అని పద్మభూషణ్ శ్రీ వెన్నల కంటి రాఘవయ్యగారు తన "యానాది" గ్రంథంలో పేర్కొన్నాడు. యానాదులు చెంచుతెగ నుండి వేరుపడి ఏర్పడిన తెగ. అందుకే కొండమీద చెంచు కొండ దిగిన వాడు యానాది అని అనాదిగా చెప్పడమే కాక వీరిరువురికి చెంచోరు (చెంచులక్ష్మి) ఆరాధ్యదేవత అయింది.

ఒక యానాది ఏ పనిచేయాలన్నా తొలుతగా చెంచమ్మను ప్రార్థించి ప్రారంభిస్తారు. నేడు నెల్లూరుకు ఆమడ దూరములోనే జొన్నవాడగ్రామం ప్రక్కన గల నరసింహకొండ ఆ ఆనవాలుకు గుర్తుగా విరాజిల్లుతున్నది. నేటికి నరసింహకొండలో ప్రతి ఏడాది తిరునాళ్ళలో నరసింహస్వామిని అల్లుడుగానూ, చెంచులక్ష్మి తమ ఇంటి ఆడబిడ్డగా భావించి కళ్యాణానికి వెళ్ళి తలనీలాలు సమర్పిస్తారు.

యానాది తెగ ఆవిర్భావము :

యానాదుల ప్రధానంగా 90% నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు, కడప జిల్లాలోనే ఎక్కువగా వుండటం చేత మిగతా జిల్లాల్లో అరుదుగానే విసిరేసినట్లు ఉండుటచేత యానాది తెగ ఆవిర్భావం గురించి శాస్త్రవేత్తలు వివిధ రకాల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అయితే మొత్తం మీద యానాదుల జన్మస్థానం నెల్లూరుజిల్లాలోని ప్రపంచస్థాయి అంతరిక్ష వైభవ ప్రభావాన్ని పొందుతున్న శ్రీహరికోటయేనని ప్రఖ్యాత పురాతత్వ శాస్త్రవేత్తలు సీవెల్, మెకంజి, జాన్‌షార్ట్, తర్‌స్టన్ లాంటి వారు వక్కాణించారు. వీరు నెల్లూరుజిల్లాలో 2011వ సం॥ జనాభా లెక్కల ప్రకారం 2.80 లక్షల మంది, రాష్ట్రంలో షుమారుగా 11 లక్షలమంది వున్నారని గిరిజన సంఘాలు తెలియచేస్తున్నాయి.

యానాది తెగ వైభవం :

శ్రీహరికోట 1950వ సంవత్సరానికి పూర్వం ఒక చిన్న ద్వీపం. చుట్టూత పులికాట్ సరస్సు (ఉప్పునీటి సరస్సు) మధ్యలో విశాలమైన భూభాగం అందులో దట్టమైన చెట్లు, అరణ్యాలు వుండేవి. పులికాట్‌సరస్సులో చేపల వేటతో మరియు శ్రీహరికోట దీవిలోని పండ్లు, కాయలతో ఎంతో స్వేచ్ఛగా మకుటంలేని మహారాజులాగా యానాదులు వెలుగొందుతున్న సమయంలో ఈ దీవిలోకి ప్రప్రథమంగా 1835వ సం॥లో ఈస్ట్‌ఇండియా కంపెనీ వారు వచ్చి స్వాధీనపరుచుకున్నారు. తద్వారా వీరి జీవితంలో విషాదఛాయలు మొదలైనవి. ఈ దీవిపై యానాదులు అధికారం కోల్పోయినారు. ఫలితంగా బ్రిటీష్‌వారికి బానిసలుగా మారారు. ఈస్ట్‌ఇండియా కంపెనీవారు మద్రాసు నుండి సముద్ర ఉపరితలం ఆనుకొని వుండే "బకింగ్ హామ్ కెనాల్" ద్వారా వస్తువులను

రవాణా చేసేవారు. బ్రిటీష్‌వారి వస్తువులను రవాణాచేసి దినసరి కూలీలుగా మారారు. నాటి మద్రాసు బ్రిటీష్ ప్రభుత్వం యానాది పిల్లలను చదివించుటకై ప్రత్యేక పాఠశాల కొరకు అడవి ఫలితంగ అనగా కలప, పండ్లు, కాయలు, తెనే మొదలగు ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంలో 7 శాతం నిధులను కేటాయించి ఖర్చు చేసిందని 1864వ సం॥లో ఈ దీవిని సందర్శించి పరిశీలించిన జాన్‌షార్ట్ తెలియచేశారు.

1861వ సం॥లో ఈస్ట్‌ఇండియా కంపెనీ ప్రభుత్వం అడవి ఫలితం వల్ల వచ్చే మొత్తం ఆదాయాన్ని యానాదుల సంక్షేమానికే ఖర్చు చేశారని ఒక పాఠశాలన నిర్మించారని తర్‌స్టన్ తెలియచేశారు.

యానాదులలో రకాలు :

యానాదులు వారి చేసే వృత్తులను ఆధారం చేసుకొని ప్రధానంగా నాలుగు రకాలుగా విభజించారు.

అవి :

1. మంచి యానాది లేదా రెడ్డియానాది(Cultivators and Servants)
2. అడవి యానాది (Those living in Forests)
3. పాకి యానాది (Scavengers)
4. చల్లా యానాది (Those who collect left out food from leaf plantes in the dustbins)

మొత్తం మీద పైన పేర్కొన్న యానాది తెగల్లోను ప్రధానంగా అబద్దాలు చెప్పడం అమానుష్యంగా భావిస్తారు. అలా చెబితే చెంచోరు (చెంచులక్ష్మి) భాదిస్తుందనేది వీరి ప్రగాఢ నమ్మకం. కపటమెరుగని అమాయక జీవులు. వీరు తరతరాలుగా మోసపోవడం తెలుసుగానీ, మోసగించడం తెలియదు. అందుకే రైతులు వీరిని చేపలు చెరువులు, పొలాలకు మరియు ధాన్యానికి కాపలాదారులుగా పెట్టుకుంటారు. ఒక యానాదిగా పిలిచి నేను నీకు మేలు చేస్తానంటే పక్కున నవ్వి మిన్నకుండిపోతారు. నిరాశ నిస్పృహ వారి అనుభవాలు ద్వారా సంక్రమించాయి. ప్రతినిత్యం మోసపోతూ వుండుట చేత సహజంగా నమ్మరు నమ్మితే ప్రాణాలైనా ఇస్తారు. ఇది వారి నైజం.

ఆచార వ్యవహారాలలో రాజీపడరు. వీరికి ప్రత్యేక సాంప్రదాయ నృత్యం వుంది. యానాదిమేళ, కీలుగుర్రాలు, తప్పెట్లు గిరిజన నృత్యాలు హాస్యంగానే వుంటాయి. ఇటీవల కాలంలో వీరి హాస్యనృత్యాలు, కీలుగుర్రాలు దర్శనమిస్తాయి. నేడు అత్యంత ప్రజాధరణ పొందిన జబర్ధస్థు పుట్టింది యానాది మేళంలోంచే అని కొన్ని గిరిజన సంఘాలు తెలియచేస్తున్నాయి.

వివాహ వ్యవస్థ :

కన్యాశుల్క అవశేషాలతో కూడిన పరస్పర అవగాహన వివాహ పద్ధతి ఉంది.

నిశ్చితార్థం :

పెద్దల సమక్షంలో కాబోయే వధువుకు అబ్బాయి తల్లిదండ్రులు ''కమ్మ'' లేక గొలుసు తొడగటం ద్వారా కోడలుగా చేసుకున్నట్లు లెక్క అంటే వధువును కొన్నట్లుగా భావిస్తారు. ముహూర్తము పెద్దలే నిర్ణయిస్తారు.

వధూవరుల పెండ్లి విషయంలో ఇరువురు మేన మామల పెత్తనం వుంటుంది. పెండ్లి అయిన తర్వాత వారి సాధకబాధలుతో వీరు పంచుకోవాల్సి ఉంటుంది.

మేమమామ రుసుం :

పెళ్ళి సమయంలో వధువు మేనమామ పెళ్ళిపందిరి ఏర్పాటుచేసినందుకు ప్రతిగా వరుడు తల్లిదండ్రులు పందిటి రుసుం పేరుతో తూముడు బియ్యం, 100-00 నుండి 500.00లు వరకు ఇవ్వాల్సి వుంటుంది. ఏ కారణం చేతనైనా ఈ రుసుం చెల్లింపులో తేడావస్తే పెళ్ళి ఆగిపోయే అవకాశము ఉంది.

ఈ రకమైన పద్ధతిని ''రూక'' అంటారు. పెళ్ళి సమయంలో వధువు తల్లికి ఒక పళ్ళెంలో చీర, రవిక, ఆకు వక్కలు ఇవ్వాల్సి వుంటుంది. ఇవన్నీ ముగిసిన తర్వాత యానాదులకు ఒక ప్రత్యేక మంగళమేళం ఉంటుంది. దీని ద్వార కులపెద్ద పురోహితుడుగా వ్యవహ

రిస్తాడు. పెద్దలందరి సమక్షంలో పెళ్ళి జరిపిస్తారు. అయితే ఏదైన కారణం చేత వధువు గాని, వరుడు గాని పెళ్ళైన తర్వాత విడిపోదలచుకుంటే వివాహానికి అయిన ఖర్చు అంతా పెద్దల సమక్షంలో బాధితులకే చెల్లించాలి. లేని పక్షంలో మేనమామ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. వివాహ సమయంలో ఖర్చును ఇరువురు సమంగా భరించాల్సి ఉంటుంది.

నేడు పాశ్చాత్య సంస్కృతి ప్రభావం, అశ్లీల సినిమా, సంస్కృతి ప్రభావం వలన పటిష్టమైన యానాది వివాహ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది. ఫలితంగా నేడు పెళ్ళైన, కాకపోయిన ఇష్టమైన వారితో పలాయనం చెందటం, మరలా మరలా అలా జరుగుతుండటం గమనార్హం.

కర్మక్రియలు, పురుడు, పెళ్ళిళ్ళు రోజులలో చాలా ఉత్సాహంగా ఉండేందుకు సాంప్రదాయక నృత్యం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. కష్టసమయంలో బాధలను సమంగా పంచుకుంటారు.

సోది :

యానాదులకు నమ్మకాలు, దేవతారాధన ఎక్కువ. ఇంటిలో ఏదైన కీడు, చికాకు లేదా బాధలు, అసంతృప్తులు వుంటే వీరు వెంటనే సోదెకు వెళతారు. సోది యానాదులు మాత్రమే పాడగలిగే ఒక అద్భుతమైన సంస్కృతి. సోదెలో సోదికుడు ప్రధానపాత్ర పోషిస్తాడు. వారికి అనుకూలంగా భార్య గాని, కూతురు గాని సోధికుడికి అనుకూలంగా పాటను కొనసాగిస్తుంది. మధ్యలో మంటరగిల్చి ఆరిపోకుండా ఆమె వేడిచేస్తూ వుంటుంది. సోదికుడి తప్పెట వాయిస్తూ ఇష్టదైవాలను అవాహన చేస్తూ వుంటాడు. యానాదులు వారి కులదైవాలు సోదికుడి చేత తాము కలిగిన అశాంతిని ఇంట్లో జరిగే పరిణామాలకు కారణాలు తెలియజేస్తూ పరిష్కారాలు తెలియజేస్తారు. ఈ సోదెలు తమ పితృమూర్తులు, చనిపోయిన వారి బంధువులు కూడా వచ్చి మాట్లాడతారు. ఈ విధంగా తెల్లవారుజాము దాక జరుగుతుంది. అప్పటికి కుదరకపోతే ప్రక్కరోజు కూడా కొనసాగిస్తారు.

సమారాధన :

ఇష్టదైవమైన వెంకటేశ్వర్లు స్వామి ఏడాదొకసారి సమారాధన చేయడం ఆచారం. ఇంట్లో జరిగే ఏ శుభకార్యానికి ముందు సమారాధన చేయడం ఆచారం. ఇందులో బంధువులందరినీ పిలుచుకొని పెద్ద వేడుకగా చేస్తారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆరాధిస్తారు. ఈ సందర్భంగా దేవుడు వాలడం జరిగి వారిచేత జరగ బోయేవి, జరగాల్సినవి చెప్పడం సాధారణంగా జరుగుతుంటాయి. వినోదం కోసం వారు యానాది మోటు మేళం ఏర్పాటు చేస్తారు. వరుసైన వారితో సరసాలు, చలోక్తులు చూడముచ్చట గొల్పుతాయి.

జీవన విధానం :

ఒకప్పుడు చెరువులు, వాగులు గుంటలలో స్వేచ్ఛగా చేపల వేట చేస్తూ ఆనందదాయక జీవనం గడిపిన యానాదులకు నేడు ప్రభుత్వం వీటిని వేలం వేయుచున్నందున వేలం పాడలేని గిరిజనులు అందులోను చేపల పట్టే దినసరి కూలీలుగానే మారారు. ఫలితంగా చేపల చెరువులు, గుంటలు పెత్తందారుల చేతుల్లోకి పోయాయి. వీరికి సాంప్రదాయ వృత్తిగా వున్న చేపలవేట నుండి ప్రత్యామ్నాయ వృత్తులను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పులికాట్, కొల్లేరు మొదలగు సరస్సులలో వీరు పట్టిన చేపలను కొందరు దళారీలు తక్కువ ధరకు కొని మార్కెట్లో ఎక్కువ రేటుకు అమ్మి లాభార్జన గడిస్తున్నారు. ఫలితంగా వీరు మోసపోతున్నారు. యానాదులు పట్టే చేపలకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం లోను మరియు వలలు, పడవలు, ఆర్థిక సహాయం అందిచడంలోను శ్రద్ధ చూపనందున ఇతర వృత్తులను ఎంచుకుంటున్నారు. దాదాపుగా 75 శాతం యానాదులు కూలీలుగాను, 15 శాతం చేపలు పట్టేవారు గాను, 5% నన్నకారు రైతులుగాను, 5% కాపలాదారులుగాను జీవనాన్ని కొనసాగిస్తున్నారు. యానాదులు విద్య, వైద్యం, అందక తీవ్ర

ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా సరియైన పోషక ఆహారం లేక మహిళల ప్రసవ మరణాలు పెరుగుచున్నాయి. ఎక్కువగా గిరిజన కాలనీలలో వారి గుడిసెలకు తలుపులు లేకపోవడంతో ఇంటి కాపలాగ పిల్లలు వుండవలసిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా వారు డ్రాప్ అవుట్‌గా మారాల్సి వస్తుంది. ప్రభుత్వ యుద్ధ ప్రాతిపదిక మీద ప్రతి గిరిజన కుటుంబానికి పక్కా గృహాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాంప్రదాయ వృత్తులకు రక్షణలేదు. నేను కడు దయనీయం గాను, దుర్భరంగాను, మరియు ప్రధాన రోడ్లు, చెట్ల క్రింద వెదురుబొంగులు ఈత పుల్లలతో బుట్టలు అల్లుకుంటూ కనీసం స్థిరనివాసం లేకుండాను అక్కడక్కడ దుర్భనమిస్తుంటాడు. గతంలో సంచార జీవనం గడిపిన ఈ తెగ నేడు రాష్ట్రవ్యాప్తంగా విసిరేసి నట్లుగా మైదాన ప్రాంతాలలోను అక్కడక్కడ ఏజెన్సీ ప్రాంతాలలోను జీవిస్తున్నారు.

ఆధార గ్రంథాలు :

1. యానాది - శ్రీ పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్యగారు.
2. భారతీయ గిరిజనులు - నదీమ్ హస్‌నైన్.
3. గిరిజన జీవితం - కథాసాహిత్యం - జి.శైలజమ్మ.
4. అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు - కచ్చల రంగారెడ్డి.
5. నెల్లూరు మాన్యువల్.

❖ ❖ ❖

కొల్లేటిపాటలు – గ్రామీణ సంస్కృతి

– డా॥. తొడేపల్లి వీరలక్ష్మి, ప్రథమ శ్రేణి ఆంధ్రోపాధ్యాయిని, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.

కృష్ణాజిల్లా, ఆకివీడు పట్టణానికి సమీపంలో ఉన్న కొల్లేటి ప్రాంతం, సంస్కృతి - సాంప్రదాయాలకు ఆలవాలం. డా॥ వడ్డూరి ఏడుకొండల సోమయాజి కొల్లేటి క్షేత్ర పర్యటన చేసి, కొన్ని చిత్రపటాలను పొందుపరచి గేయాలను సేకరించి అక్కడి గ్రామీణ ప్రజల సంస్కృతిని "కొల్లేటి పాటలు - ఒక పరిశీలన" అనే పుస్తకాన్ని వ్రాసి తమ తల్లిదండ్రులకు అంకితమిచ్చారు. తెనాలి రామలింగని కథలపై పిహెచ్.డి. చేసారు.

"గ్రామాణాం సమూహో గ్రామతా, గ్రామముల యొక్క సమూహం గ్రామతా. 'బృందే-పిగ్రామః" గ్రస్యత ఇతి గ్రామః. గ్రసు అదనే అని ధాతువు. అంటే అనుభవింప బడునది" 1 అని అమరకోశం చెప్పింది. కొల్లేరు ప్రాంతం 44 గ్రామాల, లంకల సమూహం. సంస్కృతి గురించి డా॥. వజుల కమలాకర్ గారు 22-4-2007లో తణుకు, గ్రంథాలయంలో చెప్పిన అంశంలో తెలుస్తోంది. సంస్కృతి అంటే పరిష్కరించడం. ప్రగతిని నిరోధించే వాటిని అధిగమించడానికి చేసే ప్రయత్నం. ఆంధ్ర వాచస్పత్యంలో సంస్కృతి అంటే సామూహికంగా జీవించే విధానమే అని ఉంది. శ్రేష్ఠము, శక్తి, హృద్యము సంస్కృతి లక్షణాలే గానీ నాగరికత లక్షణాలు కాదు. వడ్లు వడ్లుగా తిన్నా, బియ్యంగా తిన్నా ఆహారమే. అన్నంగా తింటే అది సంస్కృతి. సంస్కృతి ఒక జీవనది. సంస్కృతి సనాతనమైనదే కాదు. వినూత్నమైనది కూడా. మానవ జీవిత సంస్కృతి కూడా అటువంటిదే. సంస్కృతిని విభజించి పంపిణీ చేసే శక్తి ఒక్క సాహిత్యానికే ఉంది.

కొల్లేటి క్షేత్ర పర్యటన చేసిన డా॥ వి.వై.వి. సోమయాజులు ప॥గో॥జిల్లాలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. శ్రీ లలితా గ్రంథమాల వ్యవస్థాపకులు, కన్నాపురం వాస్తవ్యులు. శ్రీ వడ్డూరి అచ్యుత రామ కవి, శ్రీమతి సీతామహాలక్ష్మి దంపతుల పుత్రుడు. డా॥ తంగిరాల వేంకట సుబ్బారావు గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్. పట్టా పొంది "ధనంజయుడు సోమయాజి" అని శుభాశీస్సులు పొందారు. డా॥ జి. యస్.మోహన్; డా॥ జి.ఎన్. రెడ్డి ప్రభృతుల ప్రశంసలను అందుకున్నారు. ఉత్తమ వ్యక్తిత్వంతో సదా శోభించిన సోమయాజి కలం నుండి ఆంధ్రోదాహరణము, కవితా మంజూష, శ్రీ సిద్ధాపుర హనుమత్ సంస్కృత సుప్రభాతం మొ॥నవి వెలుగు చూసాయి. పలు ప్రతిష్ఠాకరమైన వేదికలపైన, తి.తి.దే.లో అనేక ఆధ్యాత్మిక, ధార్మిక, సాహిత్య ప్రసంగాలు చేసారు. ప॥గో॥జిల్లా, తణుకు ఉన్నత పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయునిగా పనిచేసి పదోన్నతిపై తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పదవీ విరమణ చేసి పరమపదించారు. నేను వీరితో కలిసి పనిచేయడం, నా పిల్లలిద్దరు వీరి వద్ద విద్యనభ్యసించడం, మా సుకృతం. వీరి అర్ధాంగి శ్రీమతి అన్నపూర్ణ సంస్కృత ఉపాధ్యాయురాలు. తణుకు జోన్ ఉప విద్యాశాఖాధికారిణిగా పదవీ విరమణ చేసి తణుకులో నివాసం ఉంటున్నారు.

1980-81 మధ్యకాలంలో దుస్తర కార్యమైన కొల్లేటి క్షేత్ర పర్యటన తమ భుజ స్కంధాల మీద వేసుకుని పల్లె పాటలను సేకరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. తమ తల్లిదండ్రుల ముఖతః పాటలు విని, అభిరుచి కల్గి, జిజ్ఞాస పెంపొంది కొల్లేటి పాటలపై పరిశోధన చేసారు. ఇక్కడ ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి మాటలు గమనింపదగినవి. "ఆధునిక విమర్శలో సామాజికస్పృహ ప్రముఖస్థానం వహిస్తుంది అంటే సామాన్య మానవుని జీవన యాత్రలోని సుఖదుఃఖమయమైన ఘట్టముల యదార్ధ చిత్రణ జానపద సాహిత్యంలో ప్రస్ఫుటంగా

కనబడుతుంది" అన్నారు. ఈ నేపథ్యంలో భాగంగా కొల్లేటి ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక జీవన విధానం సాంఘిక ఆచారాలు, కట్టుబాట్లు, వస్తు సంస్కృతి, కులాలు, వృత్తులు, నమ్మకాలు, జాతరలు, వేడుకలు, ఉత్సవాలు, విందులు, క్రీడలు, దొమ్మరాట, తోలుబొమ్మలాట, కోడి పందాలు మొదలైన వినోదాలు, భారతీయ వస్త్రధారణ, గృహనిర్మాణం, గ్రామ ప్రజల మనస్తత్వం, జానపదత్వం, సంఘీభావం; చిట్కా వైద్యం, శాపాలు, తిట్లు, ఆశీస్సులు, పొడుపు కథలు, సామెతలు, వీరగాథలు, గేయ గాథల ద్వారా పాటల పుట్టుకతోపాటు భాషా విశేషాలు మొదలైనవి కనిపిస్తున్నాయి. చిట్కా అంటే అందుబాటులో చవుకగా దొరికే వస్తువుతో ప్రయోజనం పొందడం. శివయోగ సారంలో పద్యాలను, దండి దశ కుమార చరిత్రలో వర్ణనలను ఉదహరించి కొల్లేటి చరిత్రను డా॥ సోమయాజి సప్రమాణంగా చూపించారు. దీనిని బట్టి సమస్యలను అధిగమిస్తే ఏదీ కష్టం కాదని తెలుస్తోంది. ముందుగా కొల్లేటి ప్రాంతం గురించి తెలుసుకుందాం.

పెద్దింట్లమ్మ కోవెలకు నెలవైన కొల్లేటికి సంబంధించిన కథ డా॥ టి.వి. సుబ్బారావు గారి తెలుగు వీర గాథా కవిత్వం అనే సిద్ధాంత వ్యాసంలో ఉంది. సుమారు 100 చదరపు మైళ్ల వైశాల్యం గల జలమయ ప్రాంతం. ఇది కొల్లేటి సరస్సుగా ప్రఖ్యాతి వహించింది. స్థూలంగా అండాకారంలో ఉండి మెరకగా ఉన్న ఈ సరస్సు బంగాళాఖాతంలో ఒక భాగం. దీనికి ఇరువైపులా కృష్ణా - గోదావరి నదులు సముద్రంలో సంగమించేటప్పుడు ఒక దాని దక్షిణపు చివర మరో దాని ఉత్తరపు కొనతో కలుస్తోంది. ఈ విధంగా ఏర్పడిన భూభాగం కొల్లేటిని సముద్రపు నీటి నుండి విడదీస్తోంది. కొల్లు అనే గ్రామ దేవతను వీరు ఆరాధిస్తారు. అందువల్ల కొల్లేరుగా వ్యవహరింప బడింది. ఇది పట్టణ వాసన తగలని మారుమూల ఉన్న మరో ప్రపంచం.

ఇక్కడ వంశపారంపర్యంగా గ్రామ పెద్ద ఉంటాడు. అతని ఆజ్ఞకు అందరు బద్ధులై ఉంటారు. ప్రతీ ఏటా ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నుండి తిరునాళ్లు జరుగుతాయి. నత్తగుల్లల వ్యాపారం బాగా జరుగుతుంది. వడ్డి జాతివారు ఎక్కువ. కొంత మురికి నీరు కలవడం వల్ల వ్యవసాయ కూలీలు వలస వెళ్లి తిరిగి వస్తారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉంది. కులాంతర వివాహాన్ని అంగీకరించరు. పురుషులకు బహు భార్యాత్వం ఉంది. సచ్ఛీలురు. సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను అతిక్రమించరు. ఆచారః ప్రభవో ధర్మః అని కదా! ఆచరతి ఇతి ఆచారః ఆచరించబడేది ఆచారం. వంశంలో ఉన్నది, పెద్దలు చెప్పినది ఆచారం. వీరిని పాటలు పాడమంటే 'ఓహో జంభాయిలే పదాలు పాడమంటారా। అంటారు. దోనె కొల్లేటి సైకిలు. పడవ కొల్లేటి కారు. డప్పు ముఖ్యమైన వాయిద్యం. కొల్లేటి స్త్రీలు పగలంతా పురుషులతో సమానంగా శ్రమించి ఒక పద్ధతి ప్రకారం కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారు. వీరు శారీరకంగా అబలలు. మానసికంగా సబలలు. దుష్టుల కుతంత్రాల నుండి వ్యూహాత్మకంగా తప్పించుకుంటూ, నదా అప్రమత్తతతో వ్యవహరిస్తారు. తమ కుటుంబానికి సమయస్ఫూర్తిని రక్షణకవచంగా మలచుకుంటారు. ఇప్పటున్న ముని మాణిక్యం గారి కాంతం కథలు స్ఫురణకు వస్తాయి. కొందరు స్త్రీలు పాడడానికి ఇష్టపడరు. ఇక్కడ ప్రజలు దోనెలు, పడవలు నడుపుతూ, చేపలు వేటాడుతూ, చేపలు అమ్ముతూ, ఊడ్పు ఊడుస్తూ, కోతలు కోస్తూ తుంగచాపలు అల్లుతూ జానపద గేయాలను ఆలపిస్తారు. హేళనాత్మకంగా చమత్కార జనితంగా, హాస్యస్ఫోరకంగా పోరాట పటిమతో, భక్తి పురస్సరంగా, దుర్మార్గాలు, హత్యలు మొదలైన వాటితో కరుణ రసాత్మకంగా, శృంగార రసభరితంగా, వేదాంతత్వాలుగా కొల్లేటిపాటలు కనిపిస్తున్నాయి. ఇంటికి ఒకే గుమ్మం ఉంటుంది. జమ్ము ఇళ్లు, చుట్టు ఇళ్ళు కట్టుకుంటారు. వినాయక చవితి, శ్రీరామ నవమి ఉత్సవాలు జరుపుకుంటారు. గూటీబిళ్ల, బచ్చాలు,

చెమ్మచెక్క, కాళ్ళాగజ్జి మొదలైన క్రీడలున్నాయి. దసరా, సంక్రాంతి, గొంతెమ్మ పండుగ, అట్ల తదియ, కోర్ల పున్నమి మొదలైన పండుగలు బాగా చేస్తారు. మద్దిరావమ్మ దేవతను పశువుల సంరక్షక దేవతగా పూజించి సంబరాలు చేస్తారు. గొంతెమ్మ పండుగను ఆశ్వయుజ బహుళ తదియ నుండి ప్రారంభిస్తారు. ఇది అట్ల తదియ కూడా. "మండలాలుమండలాలు - మా వూళ్ళోయమ్మ; పసుపు కుంకుమ నీకు - మావూళ్ళోయమ్మ" అని కుంతి చరిత్రను గానం చేస్తూ ఇంటింటికి వెళ్లి డబ్బులు, పసుపు, కుంకుమలు తెచ్చి పసుపును పెద్ద ముద్దగా చేసి కుంతీ దేవిని గొంతెమ్మ పేరిట పూజిస్తారు. మండలం అంటే 40 రోజుల దీక్ష. మార్గశిర పూర్ణిమ దత్త జయంతి ఇదే. కోర్ల పున్నమి ధనుర్మాసంలో వస్తుంది. ఆనాడు "యముడా! నీ కోరలు పీక" అంటూ మూడుసార్లు కొయ్య రొట్టెను కొరికి తల చుట్టూ త్రిప్పుకుని కుక్కకు వేస్తారు. బ్రహ్మ దేవుని కుమార్తె కోటి నోము పట్టిందని, ఆ నోము ఉద్యాపనకు ఒక పుత్ర తగ్గుతుందని, ధనుర్మాసంలో చాలా మంది మరణిస్తారని, జానపదుల నమ్మకం. ఇది కాలభైరవుని పూజించడం.

ఇక్కడ ప్రతి ఏటా జాతర జరుగుతుంది. 40 రోజులపాటు ఊరేగింపులు, అర్చనలు, నివేదనలు ఉంటాయి. కాగడా వెలిగించడం, సాంబ్రాణి ధూపం, ముద్దహారతి, పసుపు, కుంకుమ, అరటి, వేప, మామిడి, కొబ్బరి ఆకులను ఉపయోగిస్తారు. ఇవన్నీ క్రిమి సంహారకాలు. వేప పువ్వు టీకా మందు వంటిది. జంతు బలి ప్రధానంగా ఉంటుంది. వందలకొద్దీ ఎడ్ల బండ్లను అలకరించి, రకరకాల వేషాలు ధరించి జాతర ముందు రోజు ఊరంతా ఊరేగుతారు. ఇక్కడ 'కారువాయి' నృత్యం ముఖ్య వినోదం. కారువాయి నృత్యం అంటే పురుషులు బొగ్గు మసి, పసరులు, అందుబాటులో ఉన్న రంగులు పులుముకుని స్త్రీ వేషాలు ధరించి శృంగారపరమైన పాటలు పాడుతూ నృత్యం చేయడం. జాతరలో కొంత మంది గరగలను శిరస్సు మీద పెట్టుకుని వేపాకులతో గ్రామమంతా ఊరేగుతారు. ప్రతి గుమ్మం దగ్గర గరగలను పెట్టుకొన్నవారి కాళ్లమీద నిండు బిందెతో నీళ్లు, మజ్జిగ, పసుపు, కుంకుమ పోస్తారు. దీనిని 'వార' పోయడం అంటారు. ఇలా చేస్తే కడుపు చలవ అని నమ్ముతారు.

ఒక పందిపిల్లను తలపైకి ఉండేలా గ్రామ దేవత గుడి దగ్గర ఒక పొలిమేర పుంతలో పాతిపెడతారు. గ్రామంలో ఉన్న పశువులన్నింటితో ఆ పంది పిల్లను త్రొక్కిస్తూ దాటిస్తారు. ఆ పశువులు నాలుగు పొరిమేరలు దాటి తిరిగి వస్తాయి. రక్తంతో కలిపిన అన్నం చేటలో పెట్టి అర్ధరాత్రి నాలుగు పొలిమేరల్లో అక్కడక్కడ చల్లుకుంటూ వెడతారు. దీనిని 'పొలిచేట' అంటారు. మరో దేవత రాకుండా ఉంటుందని వీరి నమ్మకం. దీనిని అవైదికం అంటారు. ఇది క్షుద్రారాధన. పొలిచేట ఎవరూ చూడకూడదంటారు. ఆడపడుచులను పిలిచి దేవతగా పూజిస్తారు.

కొల్లేటి జానపదులకు రక్షరేకులు, దిగదిడుపుల మీద నమ్మకం. దిగ దుడుపులు అంటే దిష్టి తీయడం. నూనె గుడ్డ, వరిపిండి జ్యోతులు, ఎండుమిర్చి, ఉప్పు, గొబ్బెమ్మ, మసి బొగ్గు, నల్ల జీడిగింజలు దిష్టితీస్తారు. నిండు అన్నం గిన్నెలో నుండి కొంత తీసి 3 ముద్దలు చేసి, పసుపు, కుంకుమ కలిపి ఎర్ర అన్నం, పచ్చ అన్నం, తెల్ల అన్నంగా దిగదుడిచి కుక్కకు వేస్తారు. ఒక చెంబు నిండా నీళ్లు, పువ్వులు, ఆకులు, పసుపు, కుంకుమ, ఉప్పు కలిపి ఆ నీళ్లు దిగదుడిచి జనం నడిచే రోడ్డు మీద అడ్డంగా పోస్తారు. వీటిని 'కిసర నీళ్లు' అంటారు. కొన్ని అనారోగ్యాలను అమ్మవారి ఆగ్రహంగా భావిస్తారు. తేలు, పాము, కుడితే మంత్రాలు వేస్తారు. బెణుకు నొప్పులకు మంత్రం చదువుతూ ఇనుప అట్లకాడతో పై నుండి క్రిందకు నొప్పి ఉన్న చోట తోముతూ క్రింద నేల మీద కొడతారు. ఈ మంత్రాలు తరువాతి తరాల వారికి గ్రహణ సమయంలో ప్రవాహ జలంలో నిలబడి నేర్పుతారు. బాలెంతలు పురిటిస్నానం అయ్యాక మూడు బెడ్డ ముక్కలను పురిటి గదిలో పెట్టి కొత్తెమ్మ, కొర్రమ్మ,

ఎన్నెమ్మగా పూజిస్తారు. పై వన్నీ మారెడ్డి సీమ ప్రాంతంలో కూడా ఉన్నాయి.

జానపదులు అలౌకికానందానుభూతిని పొందుతున్న లౌకిక మేథావులు "సమేంద్రో మేథయా స్పృణోతు" 3 అని ఉపనిషద్వాక్యం. మేథ అంటే భగవంతుని కోసం కృషి చేయడమే. మేథస్సు కలవాడు మేథావి. అంటే సమస్త మైన వాక్కులు వ్యాప్తమై ఉన్నవాడు. లౌకిక ప్రజ్ఞా మేథా. "ప్రజ్ఞా నవనవోన్మేష శాలినీ ప్రతిభామతా (భట్టతాతః). లోకంలో ప్రజ్ఞా ప్రాభవాలు కలిగి ఉండడం. సద్గుణ సంపన్నుడై, సక్రమ మార్గానువర్తిగా ఉండాలి. అలా ఉన్నవాడే లౌకిక మేథావి. ఇవన్నీ కొల్లేటివాసులలో కని పిస్తాయి.

స్త్రీల పాటలలో లాలిపాటలు, జోల పాటలు, కన్నీటి పాటలు, వేడుక పాటలు వినిపిస్తాయి. "పద్దాలమ్మా నీ కల్లు పైక్కెలేదురా. మావిడాడ కల్లు రోయ్ చేతులో గళాసురోయ్" అనే పాటలో కొందరు స్త్రీలు పురుషులతో పాటు మద్యపానం, ధూమపానం చేస్తారని తెలుస్తోంది. చుట్టకాలిస్తే తిన్న పదార్థం జీర్ణమవుతుందని భావిస్తారు.

"గాజు లొచ్చినయి బుల్లోడో - నీ బాబుని లేపరా బుల్లోడా; మాటి మాటికి ఓలమ్మో - నేనేమని లేపుదు నోలమ్మో"

ఈ పాటలో పురుష స్వామ్య వవస్థ ఉందని, ఇంటి యజమాని ఇష్టానుసారం కుటుంబమంతా నడుచుకుం టారని తెలుస్తోంది. "ఏడవకురా లవ కుమార కుశలా ఏడవకు" అనే మరోపాట పల్లవిలో భక్తి పారవశ్యం పెల్లుబికి వస్తుంది. రామాయణంలోని పాత్రలను ప్రస్తావిస్తూ తన్మయత్వంతో పాడుతూ ఉత్తమ వ్యక్తిత్వ సౌధానికి పునాదిరాళ్లుగా ఉగ్గుపాల వయస్సు నుండే భావి పౌరులను తయారు చేస్తారు. స్త్రీ పురుషులు ఆడుతూ పాడుతూ పనులు చేసుకుంటూ శ్రమను మర్చిపోతారు. పొలం దున్నడం అనే పదాన్ని రతి క్రీడకు బదులుగా ప్రయోగిస్తారు. యాకోబు భార్య కటికతల గొంతెమ్మ ప్రతి సంఘటనలో లీనమై పాడిన జానపద వాగ్గేయకారిణి.

"నా మేనత్త కొడుకువిరో - బావయ్యోరి బావ" అనే పాట వల్ల మేనరికపు వివాహాలున్నాయని, ఇంటిపేరులో మార్పు ఉంటే వైవాహిక సంబంధానికి సుముఖంగా ఉంటారని తెలుస్తోంది. ప్రభుత్వాన్ని ధైర్యంగా విమర్శిస్తారు. "ఎంతో చక్కని తల్లి గంగాబావానీ; ఎంతో చక్కని తల్లి తిరివేణోయమ్మ" అని పాడుతూ పచ్చి కొబ్బరికాయ, పండుఫలాలూ, దీప ధూప నైవేద్యాలను పాటరూపంలో గంగమ్మ తల్లికి భక్తి పురస్సరంగా సమర్పించుకుంటారు. పడవ నడపడానికి తెడ్డు పట్టుకునే ముందు గంగమ్మ తల్లిని ప్రార్థిస్తారు.

ఒక వృద్ధురాలు తన వయోభారాన్ని ఒప్పుకోదు. పళ్ళు ఊడిపోయాయి. "ముసలిదాన్ని కాదురా మూణ్ణెల్లు చిన్నాదాన్నిరా ఇంగువా బెల్లాము తింటే పళ్లు ఊడిపోయెరా సంపెంగా నూనె రాత్తే చెంపలూ నెరిశాయిరా" అని జవాబిచ్చింది. బాలెంతలు పురిటిస్నానం చేసాక, చెక్క ఇంగువ, బెల్లం నూరి చిన్న చిన్న ఉండలుగా చేసి వాత ప్రకోపం తగ్గడానికి మింగుతారు. అది పళ్లకు తగిలితే పళ్లు పటుత్వం తగ్గి ఊడిపోతాయి. ఈ ఉండలు నీళ్లతో మ్రింగకూడదు. మింగాక పాతబెల్లం బుగ్గన పెట్టుకోవాలి. ఇంగువ తగిలి పళ్ళు ఊడిపోయాయని తనది చిన్న వయసేనని చెప్పడం చమత్కారంగా ఉంది.

కొన్ని తత్వాలు శ్రవణపేయంగా మనోహరంగా ఉంటాయి. ప్రస్థాన త్రయాన్ని ఆకళింపు చేసుకుని ఆత్మను చిలకగా సంభోధిస్తూ "నాది నాదనియేవు ఇల్లు నాదనియేవు; నీ యిల్లు ఎక్కడే చిలకా...."

స్థూల - సూక్ష్మ కారణ శరీరాల వ్యత్యాసాన్ని గమనించి మనసుకు శిక్షణ నిస్తారు. జీవాత్మ ఇంద్రియ వశమైనది. సంసారం బీజరూపంలో ఉన్న శక్తి. అదే వాసనాబలం.ఇది సాంసారికమైన అంతఃకరణ బలం. ఇది సామాన్యు లందరికి ఉంటుంది. బుద్ధి, మనస్సు కలిస్తే అంతఃకరణ అవుతుంది. భగవంతుడొక్కడే అనే అద్వైత స్థితి, బ్రహ్మానంద సదృశత్వం వీరికి ఉంది. కేవలం శ్మశాన వైరాగ్యమే కాకుండా నిత్యా నిత్య వివేచన స్థిరీకృతమైన

ధార్మికులు. జన్మమెత్తినందుకు సఫలీకృతం చేసుకోవాలనే నత్యాన్ని పూర్తిగా తెలిసినవారు. ఆత్మ విశ్వాసం, మానవత్వపు విలువలు, తాత్త్విక చింతన, త్యాగశీలత, పాపభీతి, సచ్ఛీలత, తన్మయత్వపు స్థితి, అమాయకత్వం, దార్శనికత, పరస్పర ప్రేమానురాగాల మేళవింపుతో మరో ప్రపంచపు జీవులుగా సంతృప్తికరంగా కొల్లేటి ప్రాంత వాసులు తమ సంస్కృతిని ప్రతిబింబింపజేస్తూ జీవిస్తున్న భావ దారిద్ర్యం లేని భోగజీవులు. యోగజీవులు.

ఇతిశమ్

ఉపయుక్త గ్రంథాలు :

1. అమరసింహుడు, అమరకోశము, జయలక్ష్మీ పబ్లికేషన్స్, గురుబాల ప్రబోధికావ్యాఖ్య హైదరాబాదు 1996.
2. శంకర భగవత్పాదులు, తైత్తిరీయోపని, వావిళ్ల రామస్వామి శాస్త్రులు, షత్ప్రశ్నత్రితయం అండ్ సన్స్, శిక్షావల్లి (భాష్యం) చెన్నపుర్యామ్ 1928.
3. సుబ్రహ్మణ్యశాస్త్రి వేదుల, జానపదగేయ సాహిత్య ప్రభ, ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్, విశాఖపట్టణం 19-9-2002.
4. సోమయాజి వి.వై.వి., కొల్లేటి పాటలు, వెంకట రమణ ప్రింటర్స్, ఒక పరిశీలనము, తణుకు, 1986, డిశంబరు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద కళలు – యక్షగానము

– డా॥. సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబునగరు.

తెలుగు ప్రాంతములో యక్షగానమును బయలాట, వీధిభాగోతం (వీధి భాగవతం) పేర్లతో వ్యవహరిస్తారు. అయినప్పటికి రెండింటి ప్రదర్శనలో కొంచెం తేడా ఉంటుంది. యక్షగానకళాకారులకు శారీరక ధృఢత్వము కూడా వుండాలి. భాగోతులకు(భాగవతులకు) లేకపోయినా సరిపోతుంది. ఏమైనా సాయంత్రం నుండి తెల్లవార్లు, గ్రామంలో బయలుప్రదేశంలో ప్రదర్శించే ఆట కాబట్టి దీనిని 'బయలాట' అంటారు. పురాణ సంబంధ కథ వుంటుంది. కాబట్టి భాగోతం (భాగవతం)అంటారు. వీధిలో ప్రదర్శించటం వల్ల వీధిభాగోతం(వీధిభాగవతం) అంటారు. ఈ ఆటలు గ్రామ ప్రజల విజ్ఞాన, వినోదాలకు కారణాలు అనడంలో సందేహం లేదు. భారత, రామాయణ, భాగవత మహాకావ్యాలు పండితులకు అర్థమయ్యేవయితే జానపదులకు సులభంగా ఆ మహా కావ్య కథలు అర్థం కావడానికి కొంతమంది కళాకారులు వీటిని వేషాలు వేసి ఆటలు ఆడి వారిని ఆనందములో తేలియాడిస్తారు.

జానపద కళారూపాలలో తోలుబొమ్మలు, పిచ్చుక గుంటలు, దాసర్లు, చిందుభాగవతులు, వీరముష్టి కథలు, గొల్లకళారూపాలు మొదలైనవి ఎన్నో వున్నప్పటికి, గ్రామంలో సాయంత్రం నుండి ఉదయం వరకు ఆబాల గోపాలం, ఇంటిల్లిపాది కలిసి చూసి అందరు ఇష్టపడే జానపద ప్రక్రియ ఈ 'యక్షగానం' యనడంలో సందేహం లేదు. ఇది పూర్వం 'జక్కుల' యను ఒక తెగవారు ప్రదర్శించే కళగా కూడా చెబుతారు. జక్కుల గానం జక్కగానంగా అతర్వాత యక్షగానం అయ్యింది. యక్ష గానం కొంచెం ఆడిన తరువాత ఆ వూరి దొరో, రెడ్డో వచ్చి మళ్ళీ మొదటి నుండి ఆడమని ఆజ్ఞాపించేవారు కాబట్టి 'రెడ్డొచ్చె మొదలుపెట్టు' లాంటి సామెతలు పుట్టినవి. యక్షగానం మొదట యక్షులను ఒక జాతి ప్రజలు పాడుకొను కథ వున్న పాట. కాబట్టి యక్షగాన మన్నారు. ఈ యక్షగానం 15వ శతాబ్ది నాటికి ఒక సాహిత్య ప్రక్రియగా స్థిరపడింది. శ్రీనాథుడు రచించిన భీమ ఖండంలో...

"కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి"

యంటు యక్షగానమను పేరు తెలుగు సాహిత్యములో మొదటిసారిగా కనిపిస్తుంది.

ఈ యక్షగాన కళ 'లలిత కళల సమాహార కళ'. ఇందులో చిత్రలేఖనం (పాత్రల అలంకరణ), శిల్పం (పాత్రల ప్రదర్శనతీరు), నాట్యం (పాత్రలు రంగస్థల ప్రదర్శన), కవిత్వం (కవి మాటలు,పాటలు), సంగీతం (తాళం, మద్దెల, హార్మోనియం), అన్ని ఉంటాయి కాబట్టి యక్షగాన కళ 'లలిత కళల సమాహార కళ' యని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఈ కళ భారతదేశంలో కర్ణాటక రాష్ట్రంలోని ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి, శివమొగ్గ జిల్లాలు, కేరళ రాష్ట్రంలోని కాసరగోడు జిల్లాలవారు అత్యధికంగా ఆదరించారు, అభిమానించారు. బెంగుళూరులో ఇంకా బాగా ఆదరించారు. తరువాత ఇది దేశంలోని వివిధ ప్రాంతాలకు పాకింది. అట్లే తెలుగు ప్రాంతానికి కూడా వచ్చింది. పాత్రధారి ముందు పాడుతుంటే వెనుక పాడేవారిని (హిమ్ము+మేళం) హిమ్మేళం అంటారు. అంటే పాత్రధారికి మద్దతుగా పాడే పాట. ఈ హిమ్మేళం వారే తాళాలు కొడతారు. మద్దెల, హార్మోనియం నేర్పరులు వాటిని వాయిస్తారు. తాళం కొట్టే నేర్పరులు కూడా వుంటారు. పాత్రధారి వెంటనే దర్శకుడు వుంటాడు. అతనిని 'ఆటపంతులు' అంటారు. పాత్ర ధరించిన

కళాకారునికి ఏదైనా రాకపోతె ఈ ఆటపంతులే పాడుతాడు. తరువాత హిమ్మేళం పాడుతుంది. సంగీత సాహిత్య ప్రదర్శనలతో జానపదులను బాగా ఆకట్టుకొనే కళ ఈ యక్షగానము.

తెలుగు సాహిత్యంలో మొట్టమొదట జానపద కళారూపం గురించి 11వ శతాబ్దంలో నన్నయ భారతావతారికను పరిశీలిస్తే...

రాజరాజ నరేంద్రుడు నన్నయతో...

విమల మతింబురాణములు వింటి ననేకములర్థ ధర్మ శా
స్త్రముల తెఱంగెఱింగితి నుదాత్త రసాన్విత కావ్య నాటక క్ర
మముల పెక్కు సూచితి జగత్పరిపూజ్యములైన ఈశ్వరాగ
మముల యందు నిల్పితి బ్రకాశముగా హృదయంబు భక్తితోన్.

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో...

ప్రథమ పురాతన పటుచరిత్రముల
గ్రమంద బహునాటకము లాడువారు అని

శ్రీనాథు (వినుకొండ వల్లభరాయు)ని రచనయైన క్రీడాభిరామంలో...

లెస్సగాగ కిరాట యీ లేమచరిత
మాడుదురు నాటకంబుగ నవనిలోన

అని విస్పష్టంగా చెప్పడం వల్ల పూర్వం ఏదో ఒక జానపద కళ ప్రదర్శనగా వుండేదని దానిని నాటకం అంటున్నారని తెలుసుకోవచ్చు. ఇది ఏరకమైన నాటకమో నన్నయగాని, పాల్కురికి సోమనగాని, శ్రీనాథుడుగాని తెలుపలేదు. బహుశా దేశీయ కళారూపాలలో బహుళ ప్రచారములో వుండి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న యక్షగానమై వుంటుందని నా అభిప్రాయము.

దక్షిణభారతంలో గోలకొండను పరిపాలించిన కుతుబ్షాహీ వంశ రాజైన ఇబ్రహీం కుతుబ్షా (మల్కిభరాముడు) ఆస్థానంలోని కందుకూరి రుద్రకవి రాసిన "సుగ్రీవ విజయం" తొలి తెలుగు యక్షగానముగా పరిశోధకులు నిర్ణయించారు. ఇది దాదాపు ప్రతి పల్లెటూరిలో ప్రదర్శించిన యక్షగానం. తరువాత తమిళనాడులోని తంజావూరు పాలకుడైన రఘునాథభూపాలుని కొడుకు విజయ రాఘవుని కాలంలో తెలుగు యక్షగానాల రచన విరివిగా సాగింది. ఆ తరువాత హైదరాబాదు రాష్ట్ర పాలకులైన ఆసఫ్జాహీ రాజుల కాలంలో కూడా ఈ ప్రక్రియ పరిఢవిల్లింది. స్వాతంత్ర్యానంతరము సినిమా, టీవీలు రానంత వరకు ప్రజల విజ్ఞాన, వినోద సాధనములు జానపద కళలే.

ప్రస్తుతము అంతరించిపోతున్న జానపద కళలలో యక్షగానం ఒకటి. ఒకప్పుడు పల్లెటూర్లలో బహుళ ప్రదర్శనలు జరిగిన యక్షగానాల గురించి అందులో 'రామాంజనేయ యుద్ధం' అనే యక్షగానాన్ని ఉదాహరణగా కొంత పరిశీలిద్దాం.

పల్లెటూళ్ళో ప్రదర్శింపబడిన వాటిలో...

- సుగ్రీవ విజయం (వాలి సుగ్రీవుల కథ)
- గరుడాచలం (చెంచులక్ష్మి)
- పద్మవ్యూహం (అభిమన్యుని వధ)
- సారంగధర (చిత్రాంగి కథ)
- భీమసేన విలాసం (కీచక వధ)
- కూచకొండ రామాయణం (సుందరకాండ)
- గోపన్న (భక్త రామదాసు)
- గయోపాఖ్యానము (కృష్ణార్జున యుద్ధం)
- యయాతి చరిత్ర (రామాంజనేయ యుద్ధం)

మొదలగునవి.

ఇప్పుడు రామాంజనేయ యుద్ధం గురించి...

యక్షగానాలలో పాటలను దరువులు అంటారు. ఒక్కొక్క పాట ఒక్కొక్క దరువులో, భిన్నతాళగతిలో వుంటాయి. ఆది తాళం, జంపె తాళం, ఏకతాళం మొదలగునవి.

ఆట ప్రారంభంలో విఘ్నం కలగకుండా విఘ్నేశ్వర

ప్రార్థన చేస్తారు. విఘ్నేశ్వర పాత్రధారి ప్రవేశించి ఆటకు శుభం కలుగునట్లు ఆశీర్వదిస్తాడు.

కథలో యయాతి వేటకు వెళ్ళినప్పుడు, వశిష్ట విశ్వామిత్రులకు నమస్కరించినపుడు ఒక దరువు

దరువు :

గురువరోత్తమా!
చరణములకు పూజచేసెదన్
కరుణాకర భక్తోద్ధరణ భయహరణ
శుభచరణములకు నేడు నేను పూజజేసెదన్.

విశ్వామిత్రునితో...

దరువు :

వందనము మీ పాదారవిందములను పొందుగా పూజింతును
ముందున్న జన్మము నందున్న నగముల
ముందెన గాధి నందన నేడు.

విశ్వామిత్రుడు రామునితో...

దరువు :

తెలిపెదాను రామా ! ఘనవార్త బలధామా !
ఆలకించి విను నీలవర్ణ పరిశీలము దెలిపెదను.

విశ్వామిత్రుడు యయాతి మీద కోపముతో...

దరువు :

భ్రష్ట నా పాదంబులు ముట్టబోకు రా! పా
పిష్ట నీ కిట్టి మధమా!

యయాతి విశ్వామిత్రునితో...

దరువు :

అల్ల మునివల్లభ ! నా వల్ల నేరమేమి స్వామి
యుల్లమందున కోప మల్లుకొనకు మౌనిసాంద్రా!

ఈ విధంగా యక్షగానములో ఎన్నెన్నో దరువులను చెప్పుకోవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. భారతావతారిక : నన్నయ
2. పండితారాధ్య చరిత్ర : పాల్కురికి సోమన
3. భీమఖండం : శ్రీనాథుడు
4. ఆంధ్రుల సాంఘిక చరిత్ర : సురవరం ప్రతాపరెడ్డి
5. సమగ్రాంధ్ర సాహిత్యం : ఆరుద్ర
6. రామాంజనేయ యుద్ధం (యక్షగానం) రచన : బెల్లాది నాగప్ప

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద గేయ సాహిత్యం – అన్నమయ్య

–(కొరడ) భమిడి కమలాదేవి, ప్రిన్సిపాల్, రాయసం రాజ్యలక్ష్మి సంగీత నృత్య కళాశాల , తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.

"అన్నమయ్య రచించిన వేల వేల సంకీర్తనల్లో జానపద రీతుల్ని, దేశి సాంప్రదాయాల్ని, ఇతివృత్తాల్ని లయ ప్రధానాలుగా తాళాశ్రయాలుగాజేసి దేశివాఙ్మయాన్ని నిర్మించాడు. పద కవితకు ఇతడే ఆద్యుడు. అందుకే ఇతడు పద కవితా పితామహుడుగా ప్రశస్తికెక్కాడు"

రాగాన్వితమైన గద్యమే తొలి పాట. తల్లి బిడ్డను ముద్దాడుతూ "నా బంగారు కొండేడి, నా వరాల పేరేడి" నా మొహరీల దండేది, నా అప్పడుగాచిన వెన్నేది! ఇలా ముద్దు మాటలతో, గద్యఖండాలతో తల్లినోట రాగంతో కూడిన పదాన్ని లయ అంతర్లీనంగా ఉండి నడిపిస్తుంది. మాటకంటే పాటకు పదునెక్కువ. అందుకే ఏ భాషలోనైనా పద్య కవిత కంటె ముందు పద కవితే పుట్టినదని పరిశీలకుల భావన. పద కవిత ఎంత నిసర్గ మధుర మయినా, నిరాడంబరమయినా, ప్రౌఢ వాఙ్మయంలో స్థానం (పొందలేక) ఆశింపక, గాలిలో పుట్టి, గాలిలో సంచరిస్తూ, పుట్టుకధారుఢ్యం వలన సజీవమై ఉంటుంది. వీటికి సార్వస్వత ప్రతిష్ఠను సంపాదింపచేసినవారు ద్విపద కావ్యకర్తలు. ఇందుకు మూల పురుషుడు పాల్కురికి సోమనాధుడు. తన పండితారాధ్య చరిత్రలో - "పదములు, తుమ్మెద పదములు ప్రభాత పదములు (మేల్కొలుపులు) నివాళి పదములు. వెన్నల పదములు "బాడుచు నాడుచు బోయిరట" అన్నమాచార్యులు ఈ విధములైన పదములన్నిటినీ జానపదులరీతిలో పాడి నాడు, వ్రాసినాడు. ఆనాడు అన్నమయ్య పద రచనా ధ్యేయం వైష్ణవ మత వ్యాప్తి. తానుకొలిచే కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుని యెడల భక్తిని శరణాగతినీ పామరులకు కూడా అందించాలన్న తపన వారిది. అందుకే జానపదులకోసం, వారి మాటల్లో వారి పలుకు బళ్ళతో వారికోసమే చేసిన రచనలు కోకొల్లలు, ఆ స్వామిని అన్నమయ్య మాటల్లో వేడుకోవడం ఎంత సౌలభ్యమో ॥

ఉదా॥ వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని॥ వే॥

1) చ॥ ఆమటి మొక్కులవాడే ఆది దేవుడే వాడు తోమని పళ్ళాలవాడె దురిత దూరుడే
2) చ॥ వడ్డీ కాసులవాడె వనజనాభుడే; పుట్టుగొడ్రాం డ్రకు బిడ్డ లిచ్చె
3) చ॥ ఎలమికోరిన వరాలిచ్చే దేవుడే వాడు అల మేల్మంగ శ్రీ వేంకటాద్రినాథుడే॥

శ్రామికులు వరినాటేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, పడవ నడిపేటప్పుడు మొ॥న సందర్భాలలో పాటలల్లి పాడుకుంటూ తమ శ్రమను మరిచిపోతారు. ఉ॥ గడ్డి మోపు బరువును మోసే ఎంకి లయబద్ధంగా అడుగువేస్తూ

"పొద్దుగూకి పోతోంది పోదామా పోదామా
ఆలమంద లిల్లు సేరె గడ్డి మోపు బరువైపోయె.
మాయదారి ముల్లు కాలిలో దిగబడె మావో.
"పుల్లా పుడకా పొగెయ్యాల గూట్లో దీపం వెలిగించాలా.
కుండలోని కింత కూడొండుకోవాల మావో".

ఇలాంటి గేయాలు శ్రామిక గేయాలనబడతాయి.

నిత్య జీవితంలోని ప్రధానాంశాలలో ఇంటింటా వాడ వాడలా ఈ పాటలు వినవస్తాయి. వీటి ఆరంభం చెప్పడం మానవ జాతి పుట్టుక చెప్పడం. సాహిత్యంలో మాత్రం వీటి ప్రస్తావన ప్రాచీన కాలం నుండి ఉన్నది.

"ఇటువంటి పాటలతోకూడిన ఆటలే తరువాత కాలంలో యక్షగానములైనవి. కాని పామరజనులు, ముసలమ్మలూ పాడుకొను పాటలు, గీతములు మొ॥న వియే ఆంధ్ర భాషా సారస్వతమునకు తల్లి వ్రేళ్లు. వీటి నుండే అన్నమయ్య స్ఫూర్తిని పొంది పదములు వెల యించినాడని చెప్పవచ్చు. అటువంటి జానపదుల

పాటలు రాయలసీమ పల్లెల్లో జరిగే దేవోత్సవాలలో, బయలాటలలో, జాతర, తిరునాళ్లల్లో అన్నమయ్య విని ఆ బాణీలు మనసుకు హత్తుకోగా ఆయారీతుల్ని తన పద రచనకు వాడుకున్నాడనవచ్చును".

"జగన్నాథుని జానపద నాయకుని చేసి, కొండంత దేవుడిని జానపదుల మధ్యలోకి తెచ్చి, 'తమవాడే' నన్న భరోసా కల్పించాడు. ఇందువల్ల సామాన్య జన జీవన స్రవంతిలో వెంకన్న యెడ అనురక్తితో కూడిన శరణాగతికి దోహదపడ్డది. ఆ రోజుల్లో పొలాల్లో పడుచు జంటలు జాజర పాట పాడుకుంటూ ఆడేవారట".

ప॥ **జగడపు చనవుల జాజర - సగినల మంచపు జాజర**
మొల్లలు తురుమున ముడిచిన బరువున మొల్లపు సరసపు మురిపెమున
వేంకట పతిపై వెలదులు నించేరుసంకుమదం బుల జాజర॥

వైవిధ్యంతో అలరారే వీరి రచనల్లో తుమ్మెద పదాలూ, లాలి, జోల, ఛాంగుభళా, చందమామ, మేలుకొలుపు, పెళ్ళిపాటలు, గొబ్బిళ్ళు, సువ్వి పాటలూ.. ఓహ్ ఎన్ని రకాలో. జానపదుల యాసలో దశావతారాలను పాడిన తీరు శ్లాఘనీయం.

ప॥ **సిరుతనవ్వుల వాడె సిన్నిక్కా వాడు వెరపెరుగడు సూడవె సిన్నిక్క**

చ॥ **పొలసుమేనివాడు బోర వీపువాడు సెలసుమోరవాడు** సిన్నిక్క
పొలసుమేనివాడు - మత్స్యావతారం
సెలసుమోరవాడు - వరాహావతారం
బోరలీసువాడు - కూర్మావతారం
కొలసుల వంకల కోరలతో భూమి వెలసినాడు సూడవె సిన్నిక్క ॥సిరుత॥

చ2॥ **మేటి కురచవాడు, మెడమీద గొడ్డలి సీటకాలవాడు** సిన్నిక్క
ఆటదాని బాసి అడవిలో రాకాసివేటలాడీ సూడవె

చ3॥ **బింకపు మోతల పిల్లంగోవివాడు సింకసుపులవాడు** సిన్నిక్క
కొకక కలికియై కొసరిగూడె నన్ను వేంకటేశు డుసూడవె సిన్నిక్క

వీరి రచనల్లోని లయ ఈ పదాల్ని సామాన్యుల మనసుల్లో నింపి, వాటి అర్థాన్ని భావించుకుని ఆనందించేలా చేస్తాయి. ఇంకా ఇలాటివే... చక్కని తల్లికి ఛాంగుభళా; చందమామ రావో; మేడలెక్కి నిన్నుజూచి కూడేననే యాసచేత వాడు దేరి ఉస్సురంటిరా - ఓ వెంకటేశ యాడనుంటి విందా కానురా! అంతటి సంస్కృత రచనల దిట్టా, తన పాండితీ ప్రకర్షనంతా పక్కన పెట్టి, సామాన్య జనులకు సర్వేశ్వరుని చేరువచేసి వారి బతుకుల్లో స్వామిని ఒక భాగం చేశాడు.

"చందమామ రావో జాబిల్లిరావో కుందనపు పైడి కోర వెన్నపాలు తేవో", "జ్యో వచ్చుతానంద జోజో ముకుందా రావె పరమానంద రామగోవింద" ॥జో॥జో ॥ ఇలా వీరి జోలపాటలు, చందమామ పాటలు పాడుతూ తాము యశోదలై తమ పసివారిని చిన్ని కృష్ణులుగా చేసి మురిసిపోతారు తల్లులు అనాటి నుండి ఈనాటికీ.

"ఆంధ్రదేశంలో వ్యవసాయం వృత్తిగాగల వారి జీవిత విధానాల్లో 'సువ్వి' ప్రధానమైనది. ధాన్యం దంచినప్పుడు శ్రమను పోగొట్టుకునే ప్రయత్నంలో ఒక గతిలో, రీతిలో, రోకటిపోటు విరామంలో చేసే శబ్దం 'ఇన్'. దీని శబ్దానుకరణపదం - సువ్వి. వీటినే సువ్వి పాటలుగా గ్రామీణులు పాడుకుంటుంటారు."

ఉ॥ "అత్తలేని కోడలుత్తమురాలు - ఓయమ్మో - కోడల్లేని అత్త గుణవంతూరాలు - ఆ - సువ్వి - ఆ- సువ్వి". ఇది ఒకప్పుడు పల్లెల్లో ధాన్యందంచుతూ పాడిన సువ్వి. ఆంధ్రదేశంలో అన్ని ముఖ్యమైన సందర్భాలలోను, పసుపో, నువ్వులో, ధాన్యమో దంచడం సాంప్రదాయం. ఈ సువ్వి పాటలనే అన్నమయ్య శ్రీకృష్ణుని పరంగా పాడి వాటి సౌందర్యాన్ని, స్థాయినీ ఇనుమడింపజేశాడు. జానపదులకు భాగవతకథలు చేరువచేశాడు.

ప॥ ''సువ్వి సువ్వి సువ్వాలమ్మా నవ్వుచు దేవకి నందనుగనియె''॥ అంటూ రేపల్లెలో శ్రీకృష్ణుని జనన సందర్భంగా ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్న వైనం ఇందులో వస్తువు. మంగళకరమైన శిశు జననం తర్వాత ముత్తైదువలందరూ చేరి పసుపు దంచడం, పాటలు పాడటం లోక వ్యవహారం. అన్నమయ్య తానూ ఓ గోపికగా గోకులాష్టమి పండుగ చేసి ఆనందించాడు. పాటలో - చంద్రోదయం. దేవతలకి భీతికలగడం, కంసుని గుండెలు దిగ్గురనటం, పూలవానలు కురియడం గాడిద కూతలకి కంసుడు దాని నోరు మూయడం, యుగం గడిచి కలి ప్రవేశం, శ్రీదేవితో కూడి శ్రీనివాసుడు కలియుగ దైవం కావడం.. ప్రస్తావించాడు. గొబ్బి పాటల్లో గోవిందునికి చేరువచేసాడు.

ప॥ కొలని దోపరికి గొబ్బిళ్లో యదుకుల స్వామికిని గొబ్బిళ్లో
కొండ గొడుగుగా గోవులగాచిన కొండొక శిశువునకు గొబ్బిళ్లో
దండగంపుదైత్యులకెల్లను తలగొండు గండనికి గొబ్బిళ్లో॥

ప॥ గురుతెరిగిన దొంగ కూగూగూ వీడెగురిలోని దాగీని కూగూగూ
గోపీ కృష్ణ సంవాదం, చెంచిత వెంకటేశ్వరుల సంవాదం
అత్తకోడళ్ల (సరస్వతీ లక్ష్మీ) సంవాదం.

ఇంకా ఇలా ఎన్నో సంవాద గీతాలు రచించారు.

అన్నమయ్య అద్వితీయ ప్రతిభాశాలి. ఋషికల్పుడు. పదం యొక్క అనంత రూపాలను తన రచనలలో ప్రదర్శించాడు. మాటల్లో ఉన్న భాషని కావ్యంలో వాడి ఆ భావాలకు స్థాయిని పెంచిన ఘనత అన్నమా చార్యులదే. తన సంకీర్తనా భాండాగారంలో జానపద బాణీలకు సముచిత స్థానం కల్పించిన మహోన్నతుడు అన్నమయ్య.

తెలుగు జీవితపు ఆటపాటలను, సుఖదుఃఖాలను, తెలుగు పడుచుల ఆశలను, స్వప్నాలను, వలపు ఒద్దికలను, తెలుగు ప్రేమికుని శృంగార వీరత్వములను అలమేల్మంగా వెంకటేశ్వరులను నాయికా నాయకులుగ చేసి ప్రదర్శించిన గొప్ప వాగ్గేయ కారుడూ, మహాకవీ అన్నమయ్య.

ఇతిశమ్

ఉపయుక్త గ్రంథసూచి :

1. రజనీకాంతరావ్ బాలాంత్రపు, ఆంధ్రగేయ వాఙ్మయ చరిత్రప్రాచీన ప్రతి
2. రామకృష్ణయ్య. కోరాడ, దక్షిణదేశ భాషా సారస్వతములు - కోరాడ మహదేవ శాస్త్రి, దేశి వ్ర కా శ కు లు, మద్రాసు 1994
3. శారదాపూర్ణ. శొంఠి తాళ్లపాక అన్నమాచార్యుని శొంఠి పబ్లికేషన్స్, సంగీత నృత్య కళాభిజ్ఞత యు.యస్.ఎ. 1998
4. శారదాపూర్ణ. శొంఠి, అన్నమాచార్యులవారి టి.టి.డి. పబ్లికేషన్స్, శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనలు, 1980.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద కళలు – ప్రపంచీకరణ ప్రభావం

– డా॥. ఉడుము రవీన్స్, తెలుగు మెంటార్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణా జిల్లా.

మనిషి తన ఉనికిని కాపాడుకునే క్రమంలో ఎన్నోఉత్తాన పతాలు చూశాడు. తన జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునే క్రమంలో ఎన్నింటినో అలవర్చుకున్నాడు. మనిషి తను చేసే పనిలో ఉత్సాహాన్ని ఊరటను పొందటం కోసం పాటను సృష్టించుకున్నాడు. పాటతో పాటు ఆటను జతచేసి చిందేశాడు. కాలక్రమంలో అలాంటివన్నీ కళలుగా అభివృద్ధి చెందాయి. మానవుడు వీటన్నింటినీ ఆస్వాధిస్తూ, తన జీవితాన్ని ఆనందంగా, ఆహ్లాదంగా గడుపసాగాడు. కాలక్రమంలో అనేకానేక మార్పులు చోటుచేసుకున్నాయి.

20వ శతాబ్ధం నాటికి ప్రపంచ స్థితిగతులను పూర్తిగా మార్చివేసే విధంగా మూడు అంశాలు తెరపైకి వచ్చాయి. అవి ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ.

ఈ మూడింటిలో అత్యంత ప్రభావవంతమైనది ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణ ప్రభావం అమెరికా నుండి అమలాపురం వరకు ప్రపంచం నలుమూలలు ఆవహించిందని నిస్సందేశంగా చెప్పవచ్చు. ఈ ప్రపంచీకరణ ప్రభావం మన దేశ సంస్కృతికి మూలాలైన మన జానపద కళలపై కూడ పడిందని చెప్పడం కంటే, దీని ప్రభావం వల్ల జానపద కళలు కుదేలై మూలన పడ్డాయని చెప్పడం మరింత సమంజసంగా వుంటుంది.

కృష్ణాజిలా నూజివీడు మండలం రేగుంట గ్రామంలో నేటికి జానపద కళారూపాలు ప్రదర్శించేవారు వుండటం ఆసక్తికరమైన విషయం. వీరు ప్రధానంగా పౌరాణిక నాటకాలు, బుర్రకథలు ప్రదర్శిస్తూ తమ జీవనాన్ని సాగిస్తున్నారు. నేను ఈ ప్రాంతంలో క్షేత్ర పర్యటన చేయటం ద్వారా తెలుసుకోగలిగాను. దీని ఆధారంగా ఈ పత్రాన్ని రాయడం జరిగింది.

రేగుంట గ్రామంలో పౌరాణిక నాటకాలు, బుర్రకథలు ప్రదర్శించే కుటుంబాలకు మూలం కుమారపు ఫ్రాన్సిస్. ఈయన చిన్నతనం నుండి పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ వుండేవారు. తద్వారా వారి తరువాత తరాలు కూడా ఈ కళారూపాలను ప్రదర్శించడాన్ని వారసత్వంగా స్వీకరించడం ముదావహం. ఫ్రాన్సిస్ గారి మూడోతరం 'ప్రేమ్‌సాగర్'. ఈ తరం కూడా కూడా ముత్తాత వార సత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఈ ప్రదర్శనలు ఇచ్చే వారంతా ఒకే రక్తసంబంధీకులు కావడం గమనార్హం. వీరు ప్రధానంగా బుర్రకథలు, పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ వుంటారు.

పౌరాణిక నాటకాలు :

అవి చింతామణి, సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, దావీదు విజయం, ధనవంతుడు - లాజరు, కృపామయుడు. వీటిలో మొదటి నాలుగు హైందవ నాటకాలు, మిగిలిన మూడు క్రైస్తవ నాటకాలు.

చింతామణి :

ఈ నాటకంలో వేశ్యావృత్తి వల్ల ఏ విధంగా కుటుంబాలు పతనమైపోతాయో తెలియచేయడం ప్రధాన ఉద్దేశం.

సత్యహరిశ్చంద్ర :

నాటకం, సత్యం యొక్క గొప్పతనం తెలియచేయడం.

బాలనాగమ్మ :

ఈ నాటకంలో తల్లీకొడుకుల మధ్య వుండే ప్రేమాను బంధాలను వివరించడం జరుగుతుంది. దీనిలో బాల నాగమ్మ, మాయల ఫకీరు ప్రధాన పాత్రలు. మాయలు ఫకీరు అనే వ్యక్తి, తనకున్న మాయమంత్రాల ద్వారా ఇతర స్త్రీలను లోపరుచుకుంటాడు. మహాపతివ్రత అయిన

బాలనాగమ్మను కూడా లోబరుచుకునే ప్రయత్నం చేస్తాడు కానీ అవేవీ ఫలించవు. చివరికి తన మాయావిద్య ద్వారా బాలనాగమ్మను ఒక కుక్కగా మార్చి, 18 సంవత్సరాలు బంధిస్తాడు. తర్వాత బాలనాగమ్మ కొడుకైన బాలవర్ధనుడు తన తల్లిని విడిపిస్తాడు. ఏ మాయల ద్వారా అయితే మాయల ఫకీరు అందరినీ చెరపట్టాడో అదే మాయల చేత పతనమౌతాడు. ఈ నాటకం మనిషి జీవితంలో వున్న ఉత్తానపతనాలను, విలువలు, కుటిలనీతులను తెలియచేస్తుంది.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మ :

ఈ నాటకంలో దేవునికి మ్రొక్కుబడులు చేసి మర్చిపోయే మానవ మనస్తత్వాన్ని వివరించడం జరుగుతుంది. అంతేకాక, విధి యొక్క గొప్పతనాన్ని తెలియ చేస్తుంది.

దావీదు విజయం :

ఈ నాటకం ద్వారా దేవునికి ఇష్టకరంగా జీవిస్తే, దేవుడు ఎలాంటి వారినైనా ఉన్నత స్థితికి నడిపిస్తారనేది దీనిలోని సారాంశం.

ధనవంతుడు - లాజరు :

ఈ నాటకంలో, పేదల ఎడల దయ కలిగి వుండాలి అనే విషయాన్ని చెప్తూనే... మరణం తరువాత మనిషికి ఒక జీవితం వుంది అనే సత్యాన్ని తెలియచేసే కథ ఇది.

కరుణామయుడు :

ఈ నాటకంలో దేవుడు మనవాళి ఎడల ఎంత ప్రేమను చూపించాడో వివరిస్తూ... పాపులకోసం ఏ విధంగా సిలువలో బలిఅయ్యాడో ఈ నాటకంలో కళ్లకు కట్టినట్లు చూపించడం జరిగింది.

బుర్రకథ :

ఇది కూడా నూజివీడు కళాకారుల వారసత్వంగా పునికిపుచ్చుకున్న కళ. పూర్వం గ్రామాల్లో ప్రజలు వినోదం కోసం బుర్రకథలు చెప్పించుకునే వారు. కాలక్రమంలో ఈ సంస్కృతి అంతరించిపోతోంది.

బుర్రకథ - పాత్రలు :

ప్రధానంగా ఇందులో నాలుగు పాత్రలుంటాయి. కథకుడు, వంతపాడేవాడు, హాస్యకారుడు, రాజకీయకుడు.

వాద్యాలు :

తంబుర, డక్కీలు (గుమ్మెట్లు), డోలక్. నూజివీడు కళాకారులు తమ పూర్వీకులు 1933లో ముసునూరు మండలం రమనక్కపేటలో తయారుచేయించుకున్న తంబురనే ఇటీవలి కాలం వరకు ఉపయోగించడం అందర్నీ ఆశ్చర్యపరిచే విషయం.

బుర్రకథ - వస్తువు :

దీనిలో ప్రధానంగా కురుక్షేత్రం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణరాయభారం, రంభ గర్వ భంగం, పాండవుల పుట్టుక మొదలైన కథలు బుర్రకథలోని ప్రధాన కథావస్తువులు. క్రైస్తవ సాహిత్యంలోని యోసేపు చరిత్ర, సంసోన్ చరిత్ర, పూలగంప మొదలైన అంశాలను కూడా బుర్రకథలోని కథావస్తువులుగా తీసుకోవడం జరుగుతుంది.

ఈ బుర్రకథను ప్రధానంగా రాత్రిపూట ప్రదర్శిస్తూ వుంటారు. రాత్రి పది గంటలకు ప్రారంభిస్తే, తెల్లవారు జాము నాలుగు గంటలకు ముగిస్తారు.

బుర్రకథలు చెప్పించుకను సంస్కృతి అంతమైపోతున్న ఈ కాలంలో కూడా ఒడ్డి రాజులు, తెలగ ఉప్పరులు అనే సామాజిక వర్గానికి చెందిన వారు ఈ నాటికి ఈ కళను ఆదరించడం ఆనక్తికరమైన విషయం. ఈ కులస్తుల్లో ఎవరైనా మరణించిన సందర్భంలో ఒక రాత్రంతా జాగారం ఏర్పాటుచేసి, ఆ సమయంలో ఈ బుర్రకథను ప్రదర్శింపచేయిస్తారు. కొన్ని సందర్భాలలో దేవస్థానాల దగ్గర కూడా ఈ ప్రదర్శనలు జరుగుతాయి. ఎక్కడైనా ప్రదర్శనలు ఇస్తే దానికి 4-5వేల వరకు పారితోషకం ఇవ్వడం జరుగుతుంది.

బుర్రకథ కోసం ఎవ్వరూ ఆహ్వానించని రోజుల్లో వీరు, వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్లడం జరుగుతుంది. ఏవిధమైన ఉద్యోగం చేయడానికి వీరు పెద్దగా మక్కువ

చూపించరు. కారణం ఏంటని అడిగితే దానికి సమాధానంగా బుర్రకథ కోసం ఎప్పుడు, ఎవరు పిలుస్తారో తెలియదు... అలాంటప్పుడు ఉద్యోగంలో వుంటే సెలవులు దొరకక, ఇబ్బంది పడవలసి వస్తుంది, అంతే కాక, ఉద్యోగం కంటే కళాప్రదర్శనే ముఖ్యంగా భావిస్తాము అంటారు.... నూజివీడు కళాకారులు పెదజోజిగారు.

కళాప్రదర్శనకు ఇచ్చే పారితోషకంలోనే వారు ప్రయాణ ఖర్చులు, దుస్తులు, అలంకరణ సామాగ్రి అన్నీ చూసుకోవాలి. కాబట్టి పారితోషకం మీకు గిట్టుబాటు అవుతుందా అని అడిగిన ప్రశ్నకు 'కళాకారుడికి డబ్బు ముఖ్యం కాదు, కళను ప్రదర్శించేటప్పుడు మేము పొందే మానసిక ఆనందం ముఖ్యం. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం, డబ్బుతో కొలవలేం' అంటున్నారు ప్రేమ్‌సాగర్ గారు.

నేటి కాలంలో ఈ జానపద కళలకు అంతగా ఆదరణ లేదని, మేము కళలను నమ్ముకొని జీవించడం వల్ల కొన్ని ఇబ్బందులు పడక తప్పడంలేదని చినజోజి అంటున్నారు.

ఈ ప్రపంచీకరణ ప్రభావం వల్ల కళ, ఒక అమ్మకపు వస్తువుగా మారిపోయింది. సాంస్కృతిక ప్రపంచీకరణ అన్ని దేశాలను ఆవహించివేసింది. నేటి అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రపంచ అతిపెద్ద సమాచార కమ్యూనికేషన్ సంస్థలు, వినోద సంస్థలతో ఏకమై ఒక కార్పోరేషన్‌గా ఏర్పడి, అన్నిచోట్ల విస్తరిస్తున్నాయి. ఉదాహరణకు: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రచురణారంగమైన 'టైమ్', అతిపెద్ద వినోద పరిశ్రమ అయిన వార్నల్ బ్రదర్స్ సంస్థలో విలీనమైపోయి, టైమ్ వార్నర్ సంస్థగా అవతారమెత్తింది. తాడిని తన్నేవాడుంటే, వాడి తలని తన్నేవాడున్నట్లు... 'అమెరికా ఆన్‌లైన్' (ూూూ) ఈ టైమ్ వార్నర్ సంస్థను కొనేసింది. అదే విధంగా స్పైడర్‌మాన్ సినిమా తీసిన వాల్‌సిడ్నీ సంస్థ, మార్వెల్ సంస్థను కొనేసింది. ఈ విధమైన బహుళజాలి సాంస్కృతిక వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున వస్తువులను సృష్టించి ప్రపంచ ప్రజల మీదికి వదులుతున్నారు. ఇవి ప్రజల అభిరుచులలోని వైవిధ్యాన్ని నాశనం చేసి, వారిని ఒక మూసధోరణిలోకి తెస్తున్నాయి. ప్రజలందరినీ ఒకేరకమైన అభిరుచులు కలిగిన వారిలా మార్చడం వల్ల, వారు ఒకే రకమైన సాంస్కృతిక వస్తువులను తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం సులువైపోతుంది.

ప్రపంచీకరణ వల్ల మన దేశంలో ఎన్నడూలేని విధంగా పశ్చిమ దేశీయుల భావాలు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, వినోదం వంటివి మన దేశంలో కూడా అభివృద్ధి చెందుతూ వున్నాయి. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున విస్తరించిన టీవీ, ఇంటర్నెట్, సెల్‌ఫోన్ వంటి సాంకేతిక సమాచార సాధనాలు ఈ సంస్కృతిని మరింత వేగంగా వ్యాపింపచేస్తున్నాయి.

ప్రపంచీకరణ సంస్కృతి, బహుళజాతి సంస్థల వస్తువులను అమ్ముకోవడానికి ఉపయోగపడటమే కాదు, సంస్కృతినే వ్యాపార సరుకుగా మార్చేశాయి. దీని ప్రభావంతో వినోద సంబంధమైన అంశాలన్నీ అమ్మకం సరుకు కావడంతో ధన సంపాదన కోసమే కళ అనే సంస్కృతి పెరిగింది. హింసాత్మక ప్రవృత్తి, క్షుద్ర సాహిత్యం, సెలబ్రిటీ సంస్కృతి రూపంలో ప్రదర్శిత మౌతున్న ఈ కుళ్లు సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడటం కళాకారుల ప్రధాన కర్తవ్యం. ఈ సందర్భంలో మతోన్మాద సంస్కృతి గురించి కూడా ఆలోచించాలి. సామ్రాజ్యవాదం ప్రపంచదేశాలపై ఎదురుదాడికి దిగటం వల్ల, ప్రజల్లో అసంతృప్తి ఏర్పడి అది మతోన్మాదం వైపు దారితీస్తోంది. మన దేశంలో కూడా ప్రపంచీకరణకు, విదేశీ సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడే పేరుతోనే మతోన్మాద సంస్కృతి విజృంభిస్తోంది అంటారు ఎస్.వెంకటరావు గారు తన 'కళారథం-ప్రగతిపథం' అనే వ్యాసంలో.

ముగింపు :

నేడు ప్రజా కళాకారుల ముందు మూడు ప్రధాన అంశాలున్నాయి. కాసుల సంస్కృతిని తిరస్కరించడం, మతోన్మాదాన్ని ఫ్యూడల్ సంస్కృతిని ఎదిరించడం. కళ కళలోసం కాదు అనేది ఆంధ్ర ప్రజానాట్య మండలి నినాదం. ఈ నినాదాన్ని పెట్టుబడి దారులు ఎప్పుడో

అర్థంచేసుకొని కళను ప్రజలకోసమే ఉత్పత్తి చేసి, కళను కాసుల కోసం ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే మనం కళ ప్రజల కోసం అనే నినాదంతో ముందుకు సాగవలసి ఉంది. ఒకప్పుడు శ్రామిక జీవుల నుండి ఉత్పన్నమైన కళలు నేటి కాలంలో వారికి దూరమయ్యాయి. తిరిగి కళను వారి దగ్గరికి చేర్చవలసిన అవసరం ఎంతైనా వుంది.

దీనికోసం ప్రజానాట్య మండలి కార్యకర్తలు ప్రతి గ్రామానికీ పట్టణానికి తమ కార్యకలాపాలు విస్తరింప చేయాలి. ఆయా ప్రజలు వారి సంస్కృతి, సాంప్రదాయాలకు చెందిన కళారూపాలను సృష్టించి, అందరినీ పాల్గొనేటట్లు చేయాలి. తద్వారా భవిష్యత్ తరాలకు కళను, కళాకారులను అందించిన వారమౌతాము.

ఆధార గ్రంధాలు :

1. క్షేత్రపర్యటన: కృష్ణా జిల్లా నూజివీడు మండలం రేగుంట గ్రామం: జానపద కళాకారుల వద్దకు. ఫిబ్రవరి, 2020, డా. ఉడుము ఝాన్సీ, ట్రిపుల్ ఐటీ, నూజివీడు.
2. ముఖాముఖి: నూజివీడు మండలం రేగుంట గ్రామం: జానపద కళాకారులతో ముఖాముఖి, ఫిబ్రవరి, 2020, డా. ఉడుము ఝాన్సీ, ట్రిపుల్ ఐటీ, నూజివీడు.
3. ప్రపంచీకరణ సంస్కృతి: తెలకపల్లి రవి సంకలనం: ప్రజాశక్తి బుక్స్ హౌస్, అక్టోబర్, 2014
4. ఆంధ్రుల జానపద విజ్ఞానం: ఆర్వీఎస్. సుందరం: 2003

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సాంఘిక ఆచారాలు

– భూక్య సుజాత, పరిశోధక విద్యార్థి, జానపద కళల విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

సాంఘిక ఆచారాలు మానవులంతా ఒక జాతికి చెందినవారు అని పెద్దలు చెబుతారు ఋగ్వేదం అధర్వణ వేదాలలో మానవులంతా కలిసిమెలిసి జీవించాలి సహజీవనం చేయాలి అన్నదమ్ముల్లా మెలగాలి అందరు కలిసిమెలిసి జీవించాలి అంత సమానం అనే విషయాల్లో జాన పదులకు దగ్గరగా ఉంటాయి దీనివల్ల జానపదా లలో ప్రదర్శించే ప్రతి జానపద నృత్యం, జాతర్లు, ఉత్స వాలు, ఊరేగింపులు, ప్రతి పని గ్రామాలలో కలిసికట్టుగా గుంపుగా చేరి గ్రామ చావిడి దగ్గర మాట్లాడుకునే గ్రామ అభివృద్ధి కోసం పశు సంపద కోసం గ్రామాలలో ఎలాంటి రోగాలు సోకకుండా గ్రామదేవతల కథనాలు హరికథలు కళారూపాలు ప్రదర్శించి ఆచారం గ్రామీణ వ్యవస్థలో ఒక భాగం.

మానవులు ఎవరైనా వారికి అనుభవం ఉన్నా కళారూపాన్ని ఉత్సవంలో ప్రదర్శిస్తారు ఆ ప్రదర్శన చాకచక్యంని 'కళ'గా భావిస్తాము జానపదం అంటే పల్లెటూరు జానపదాలలో నివసించేవారు జానపదులు అని సులభంగా చెప్పవచ్చు ఇలా చెప్పినవారు సాహిత్య కారులు.

జానపద విజ్ఞానం లో మొదట చెప్పుకోదగినవి సాంఘిక ఆచారాలు జానపద కవిత్వం, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, భాష శబ్ద సంబంధమైనది అందుకే భాష తప్పించి మిగిలిన వాటిని కొందరు శాబ్దిక కళలు ఉన్నాయి. మరికొందరు జానపద సాహిత్యం అన్నారు. భాషతో కూడా సాహిత్య ప్రక్రియలను చేర్చితే మౌళిక జానపద విజ్ఞానం అనే పేరును వాడవచ్చు మౌళికేతర ప్రక్రియలో కళాత్మకమైన వాటిని కలల కింద చేరిస్తే ఇక మిగిలేవి సాంఘిక ఆచారాలు, సంస్కృతి.

మౌఖిక జానపద విజ్ఞానానికి వస్తు సంస్కృతి కి నడుమ వారధిగా సాంఘిక ఆచారాలు ఉన్నాయి వీటిలో కొన్ని మౌఖిక ప్రక్రియల సహాయాన్ని మరికొన్ని వస్తు సంస్కృతి అపేక్షిస్తాయి.

మౌఖిక జానపద విజ్ఞానం :

మంత్రాలు, సుత్తులు, ఆటల్లో పాటలు, వినోద గీతాలు వేడుకలు మొదలగునవి.

వస్తు సంస్కృతి :

పూజావిధానాలు, ధార్మిక కర్మకాండలు, ఆటలు వస్తువులు, వైద్య వస్తువులు మొదలగునవి అయితే మొత్తం మీద సాంఘిక చరిత్రలో మానవుని సామూహిక జీవనానికి సంబంధించినది ఇది కొన్ని శాబ్దిక కళలు సహాయాన్ని అపేక్షితాయన్నది నిజమే సాంఘిక జీవితంలో మానవునికి ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమించి ఆచారాలతో ఎన్నో విధానాలు ఉన్నాయి ఇవి వ్యక్తిగత మైన కాళాలుంటాయి ఒక సంఘం ఆశయాలను ప్రతి బింబిస్తాయి సాంఘిక ఆచారాలు శిర్షిక క్రింద ఉన్నాయి.

సాంయి పుట్టుక, పెండ్లి, మరణం, మొదలగు వాటికి సంబంధించినది

ఫి యి- జానపదుల నమ్మకాలు
కా యి- జానపదుల మతం దేవతాగణం
చా యి నోములు, వ్రతాలు, జాతరలో, పండగలు
రా యి- ఆటలు, వినోదాలు
లు యి- జానపద వైద్యం

జానపద వైద్యం కూడా సాంఘిక ఆచారాలలో ఒకటి వైద్యం వస్తు సంస్కృతి లో చేరుతుందని అనిపించవచ్చు అయితే జానపద వైద్య ముఖ్యం కాదు మందులు ముఖ్యం కాదు నమ్మకం ముఖ్యం ఏ మందులు వాడక

పోయినా నమ్మకం ఉంటే జానపదులకు రోగాలు నయమవుతాయి లేదా అయినట్లు అనిపిస్తుంది జానపద వైద్యం లో అనుసరించే పద్ధతులు శాస్త్రీయమైనవి కాదు మంత్ర తంత్రాలతో సహా సరళ పద్ధతుల ఎన్నో జానపద వైద్యం లో ఉన్నాయి ఇవన్నీ సాంఘిక ఆచారాలే.

జననం :

మనిషి జీవితంలో మొదటి ఘట్టమైన పుట్టుకకు సంబంధించిన ఆచారాలు ప్రతి సమాజంలోనూ కని పిస్తాయి మొదటి కాన్పు పుట్టింటిలోనే జరగాలనే ఆచారం తెలుగువారి లోనే కాదు అన్ని వారిలో కనిపిస్తుంది. పితృ ప్రధాన కుటుంబాలలోనే ఈ ఆచారానికి కారణం లేక పోలేదు వివాహ అనంతరం భర్త ఇంటికి వెళ్ళిన స్త్రీకి కొన్ని నెలల తర్వాత ఇంటి మీద అంటే తనువు పుట్టి పెరిగిన ఇంటిమీద గాలి మళ్లడం సహజమే. భర్త ఇంటికి వెళ్లిన స్త్రీకి కొద్దికాలానికే ఏమైనా కడుపు పండితే స్త్రీకి పుట్టింటికి వెళ్లాలనే కోరిక తీరుతుంది ఏదిఏమైనా మొదటి కాన్పు పుట్టింట్లో జరగాలని ఆచారం వెనుక సమంజసమైన కారణం కూడా కనిపిస్తుంది స్త్రీకి మొదటి కాన్పు ఒక కొత్త అనుభవం కాబట్టి మానసిక ఆందోళనకు గురి కాకుండా ఉండాలంటే కనిపించిన వారి సాన్నిధ్యం చాలా అవసరం పుట్టి పెరిగిన పరిసర ప్రాంతంలో తిరగాలి అనే కోరిక ఉంటుంది. ఈనాడు వీటిలో చాలా వరకూ మరు గున పడిపోయాయి అయినా స్థూలంగా స్త్రీ గర్భవతి అయినప్పటి నుంచి ప్రసవించే వరకూ అనుసరించాల్సిన ఆచారాలు ఇంకా మిగిలి ఉన్నాయి గర్భవతిని 7 నెలలో పుట్టింటికి పిలుచుకుని వస్తారు సీమంతం అన్నది గర్భవతిగా ఉన్నప్పుడు చేసే వేడుక ఆచారం ఆ గర్భిణీ స్త్రీ ని చక్కగా అలంకరించి ముత్తయిదువులచేత పసుపు కుంకుమలు అక్షింతలు ఇప్పించి ఆశీర్వదిస్తారు గర్భిణి కి ఇష్టమైన పదార్థాలన్నీ చేసి పెడతారు ప్రసవమ యిందంటే ఆ ఇంట్లో పురుడిని చెబుతారు బిడ్డకు ఐదో రోజు వచ్చే వరకూ ఈ పురుడు ఉంటుంది మరణం ఎవరి ఇంట్లోనైనా సంభవిస్తే 'అంటూ' అనే పేరుతో మహిళగా భావించడం జనన కాలంలో కూడా అలాగే మైలగా భావించడం చూస్తే పుట్టుకకు మరణాన్ని మన వారు జీవితంలోని రెండూ అతి ముఖ్య ఘట్టాలుగా భావించింది తెలుస్తుంది. బిడ్డ జన్మించిన తర్వాత జాతకర్మ ముఖ్యమైంది ఊరి పురోహితుడికి బిడ్డ జన్మదినం సమయం చెప్పి జాతకం రాసి ఇవ్వాల్సిందిగా చెబుతారు బిడ్డ పుట్టిన తిథి నక్షత్రాలను శుభ శుభాలను పురోహితుడు నిర్ణయిస్తాడు మూల నక్షత్రం వంటివి మేనత్తకు అశుభమని మరో నక్షత్రం మరొకరికి అశుభమని శాంతి చేయించడం ఈ నాటికీ ఉంది ప్రసవమైన 11వ రోజు సామాన్యంగా నామకరణం జరుపుతారు బిడ్డను తొట్లలోవెయ్యడం కూడా వేయడం జరుగుతుంది ఉయ్యాలలో బిడ్డను పడుకోబెట్టి ఉయ్యాల పాటలను పాడే సంప్రదాయం ఉంది నామకరణం చేసి బిడ్డ చెవిలో పేరు చెప్పి లోకానికి అప్పజెప్తారు పైన చెప్పినా లాంటి ఆచారాలు తెలుగు వారి ఇండ్లలోనే కాక ప్రపంచం అంతటా అనేక జాతుల్లో కనిపిస్తాయి.

పెద్దమనిషి :

ముందుగా దేనిని ముట్టుకోనివ్వకుండా దూరంగా నిల్చోపెడతారు ఇంట్లో వాళ్ళను సంప్రదించి చాకలి వాళ్లను పిలిచి తొలి స్నానం పసుపురాసి చేయిస్తారు

ఓ మూల చాప పరిచి చాప పక్కన గుప్పెడు బియ్యం పోసి చుట్టు పక్కన వాళ్లను కూడా పిలుస్తారు అందులో ఓ చిన్న చెక్క బొమ్మను పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి పెడతారు పెద్ద ముత్తైదువులు మరియు చాకలి కులంలో ఓ స్త్రీ ఇద్దరు కలిసి చాప మీద కూర్చోపెడతారు అమ్మాయి ముఖమునా నిండుగా పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టి కొడుకును రెండు చేతులతో తల మీద నుంచి పడేలా రెండు ముక్కలుగా వత్తుతారు

అమ్మాయికి మొదట వడి ఆరోజు నింపుతారు అది కుడకలు, బెల్లం, నువ్వులు, బియ్యం, పసుపు, కుంకుమ వడి నింపుతారు పెద్ద మనిషి అయినా మొదటి రోజు మొదటి స్నానం అయ్యాక ఆ బట్టలు ఇంట్లో ఉంచరు చాకలి వాళ్లు తీసుకుని వెళుతుంది

అమ్మాయి దగ్గరకు ఎవరు వచ్చినా కుంకుమ పెట్టి తనకు నచ్చిన ఆహారం ఇస్తారు వచ్చిన వారికి ఆ అమ్మాయి ఆశీర్వాదం తీసుకుంటుంది ఇంట్లో వాళ్ళు వచ్చినా వారి కాళ్ళకు పసుపు రాసి వారు తీసుకువచ్చిన పల్లెం ఖాళీగా తీసుకోకూడదు అని ఆ అమ్మాయి దగ్గర ఉన్న ఏదైనా తీపి పదార్థం అయినా బియ్యం, కుడుక ఏదైనా పెట్టి ఇవ్వచ్చు కానీ అంటూ ముట్టు తగలనివ్వద్దు మూడవరోజు కుటుంబంలో దగ్గర వాళ్ళు రెండవ స్నానం చేయించి తను వాడిన బట్టలు, దుప్పట్లు ఉతికి వేస్తారు

అమ్మాయికి పసుపురాసి కుంకుమ పెట్టి రకరకాల పిండివంటలు పెట్టి వడి నింపుతారు మళ్లీ ఐదోరోజు మూడవ స్నానం ఎనిమిదవ రోజు నాలుగవ స్నానం చేయిస్తారు ఇలా చుట్టాలు అందరూ తమకు తోచిన వంటకాలు వండి అమ్మాయికి పడతారు.

ఈ తొమ్మిది రోజుల్లో ప్రతి రోజు పెట్టేది నువ్వులు, బెల్లం, ఎండుకొబ్బరి, రోకలిలో దంచి చిన్నచిన్న ఉండలు చేసి ఆ అమ్మాయికి పడతారు నువ్వులు వేడి చేస్తుంది కాబట్టి ఋతుక్రమం సరిగా అవుతుంది అని బెల్లం అరుగుదలకు ఎండుకొబ్బరి అరగడానికి సమయం పడుతుంది కానీ ఎక్కువగా ఆకలి అవ్వకుండా ఉండటం కోసం వాడతారు ఇల్లు మొత్తం శుభ్రం గా చేసుకుని అమ్మాయికి ఐదవ స్నానం చేయించి పట్టు ఈ వస్త్రాలు ధరించి వేడుకగా జరుపుకుంటారు.

వివాహం :

మొదట పెళ్లిచూపులు జరుగుతాయి సామాన్యంగా ఈ తంతువు ఆడపిల్ల ఇంట్లో జరుగుతుంది పెళ్లి సంబంధాలలో కొన్ని ఆచారాలు ఉన్నాయి మేనమామ మేనత్త బిడ్డలు అయితే జతకాదులు చూడవలసిన అక్కడే లేదు మేన కోడల్ని పెళ్లి చేసుకునే సంప్రదాయం బాల్యవివాహం కాలంలో ఉండేది కాని ఇప్పుడు చాలా వరకు తగ్గి పోయింది బంధువుల్లో పెళ్లి సంబంధం చూసేటప్పుడు పిల్లనిచ్చి మళ్లీ తీసుకోకూడదని నియమాన్ని పాటిస్తారు. దీనిని కొండ మార్పిడి అని పిలుస్తారు పెళ్లిచూపులు వెళ్ళినప్పుడు ఆడపెళ్ళి వారి ఇంట్లో భోజనం చేయకూడదని నియమం ఉంది

"కతికితే అతకదని" సామెత. నిశ్చితార్థం ప్రత్యేకంగా చేస్తే చెబుతారు లేకుంటే వరపూజ సమయంలోనే అది అయింది అనిపిస్తారు.

పుట్టుక పెద్దమనిషి కావడం ప్రాణి సహజమైనవి కానీ వివాహం సాంస్కృతిక వ్యవస్థను ప్రాణి సహజమైన కామ కలాపానికి వివాహం అక్కరలేదు బిడ్డలను పెంచి పెద్ద చేయాల్సి రావడం వల్ల కుటుంబ వ్యవస్థ ఏర్పడడం వల్ల వివాహమనే కార్యం సాంస్కృతికంగా ఏర్పడింది అయితే ఇది ఆదిమ కాలంలో ఆ జాతుల్లో పెద్ద కర్మ కాండ గా తయారై వ్యూహం అంటే భయపడే ఇంతగా కష్టమైంది నేటికీ హోమం ముందు కూర్చుని వధూ వరులు సతమతమై ఎందుకొచ్చిన పెండ్లిరా అనుకునే వారు అయితే నేడు చాలా వరకూ వివాహం వేడుకగా తయారైంది వివాహానికి సంబంధించిన వర్ణనలు వివాహాలు మన సాహిత్యం ప్రారంభమై ఉన్నాయి వివాహ సంబంధమైన ఆచారాలు ఒక్కొక్క ప్రాంతానికి కులానికి కాలానికి మార్పులు ఉంటాయి తెలుగు వారి పెళ్లిళ్లు నాలుగు రోజులు జరుగుతూ ఉండేవి. ఉత్తర పెళ్లి జరిగిన తరువాత ''దినచతుష్టయనంతరమున'' బంధువులు వెళ్ళినట్టుగా చెప్పడం జరుగుతుంది.

వివాహం ముందు నిశ్చితార్థం ఒక ఆచారం వధువును పెద్దలు చూడటం పెళ్లి నిశ్చయించడం నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోవడం ఆచారం నిశ్చితార్థ కాలంలో కన్యకు "ముద్రరోహణం" చేయడం ఈ కాలంలో తెలుగు వారి ఆచారం.

వివాహ ఆచారాలు ఒక్కొక్క కులంలో ఒక్కొక్క రకంగా ఉంటాయి తాళిబొట్టు, తాళి కమ్మలు ద్రావిడ ఆచారానికి కొందరి అభిప్రాయం అయితే ప్రాచీన కాలపు తెలుగు గ్రంథాలలో తాళిబొట్టు ను గురించి లేదు.

తెలంగాణ ప్రాంతంలో పెళ్లి పనులు కట్నం పూలతో ప్రారంభమై అప్పగింతలతో పూర్తి అవుతాయి కట్నాల పాటలు త్రిశ్రగతిలో ఉంటాయి.

సువ్వి సువ్వి రామచంద్ర సువ్వి సువ్వి కీర్తి సాంద్ర సువ్వి సీతమ్మ మాకు శుభములిమ్ము అన్న పాటలు అధిక ప్రచారంలో ఉంది కొన్ని జానపద పాటలలో వివాహ వర్ణన వధూవరులు వివాహ మండపం, వర్ణన మొదలైనవి అంబరం గూర్చి కృత సంపంగితో గోవిందు నకు నులుగుపూసిపాటలు నలుగు సంప్రదాయాన్ని తెలుపుతాయి లక్ష్మిపూజకె ఆవిరేణిపూజ అని పేరు వధూవరులతో కూరుట కుండలిముందు పత్తి విత్తులు నటిస్తారు.

మరణం :

జననం మరణం మధ్య చాలా లంబాడి తెగలు ఒక మనిషి చనిపోతే తను ఆప్తుడని కోల్పోయినందుకు చాలా బాధ పడతారు ఆ మనిషి వెళ్లి కాకపోయి ఉంటే పాడి కట్టి తీసుకెళ్తారు అదే పెళ్లి అయి ఉంటే ఆ మనిషి చివరి స్నానం చేయిస్తారు అదేవిధంగా ప్రతి గడప నుంచినీళ్ళు తీసుకు వస్తారు ఎందుకంటే అందరూ కోరుకుంటారు అది ఆచారం కూడా స్నానం అయ్యాక తన భార్యకు కూడా స్నానం చేయించి కొత్త చీర కట్టించి పూలు, గాజులు, బొట్టుపెట్టి ఉంచుతారు.

ఆ శవం పాడి ఎక్కించే ముందు కొంతమంది వధువు లతో తన మంగళ సూత్రం, పూలు, గాజులు, తీసేసి పుట్టింటివారు తీసుకొచ్చిన తెల్లచీర కట్టిస్తారు ఎవరైనా చివరి స్నానం చేయించండి వారు పాడే మీద మోసుకెళ్లే వాళ్లూ కాళ్లకు నీళ్లు పోస్తారు అలాగే ప్రతి ఇంటి నుంచి తనను దహనం చేయడానికి కావలసిన కట్టెలు ఒక్కొక్క ఇంటి నుంచి సేకరిస్తారు ఇలా అందరూ స్వచ్ఛందంగా పాడపంచుకుంటారు.

శవం అంత్యక్రియల్లో రెండు విషయాలు పాటిస్తారు పెళ్లికాని వారైతే భూస్థాపితం చేస్తారు శవానికి కట్టి మూస్తారు పెళ్లి అయిన వాళ్లకు దహనం చేస్తారు శవాన్ని మోయడానికి "పాడే" అంటారు అక్కడే మేకపోతును కోసి పీడ తొలగిపోతుంది అని నమ్ముతారు ఇది మూడవ రోజు అంత్యక్రియల అనంతరం తడిబట్ట స్నానమాచ రించి, వేరుగా మృతుని ఇంటికి వచ్చి వెలిగించిన దీపాన్ని చూపిన అనంతరం సమావేశమవుతారు కర్మకాండలు జరుప వలసిన రోజును నిర్ణయించి ఎవరి ఇళ్ళకు వెళ్ళి పోతారు.

ముందుగా నిర్ణయించిన ప్రకారం కర్మకాండలను జరిపి రోజున బంధువులు అందరూ చేరుకుంటారు వచ్చేటప్పుడు తమ శక్తి అనుసారం ఇప్పసారా, కోడికూర, ధాన్యం ఇలా తనకు నచ్చినవి అన్ని అలా చేస్తారు కర్మ కాండ ఆత్మశాంతికి జరిపించపడుతుంది మృతునికి "జీవగంజి"గా కోళ్లను మేకలను కోసి ఇప్ప సారా పూసి నైవేద్యం సమర్పిస్తారు.

ఐదవ రోజు :

దీనిని చిన్న కర్మ అంటారు

చిన్న కర్మ :

ఈ దినకార్యం ఐదోరోజు జరుపుతారు దీనిని "పసుపు నీళ్లు చల్లుకోవడం" అంటారు ఆ రోజు నా మరణించిన వారిని ఎవరైతే స్మశానానికి తీసుకెళ్లారో వారిని తీసుకొచ్చి ముందుగా స్నానం చేయిస్తారు ఆ తర్వాత ఊరి పెద్దలకి స్నానం చేయిస్తారు ఆరోజు ఇంట్లో కోడిని కోస్తారు అప్పుడు ఊరిలోని ముఖ్యమైన పెద్దలకీ ఇంటిలో ఉన్న బంధువు లకు జనాలు బట్టలు భోజనం తయారు చేస్తారు అన్ని తయారు చేసుకొని స్మశానం దగ్గరికి వెళ్లి బూడిద ఒక పసుపు నీళ్లు చల్లి బూడిద తో బొమ్మ చేసి ఒక పుల్ల గుచ్చి దానిపైనా కోడి ఈకను గుచ్చుతారు దాని దగ్గర చిన్న పందిరి వేసి మరణించిన వారి అలవాట్లను బట్టి అన్ని పందిరి దగ్గర పెడతారు.

పెద్ద దినకార్యం :

ఇది 11వ రోజు చేస్తారు. రేపు దినం అనుకుంటే సాయంత్రం "తలగోరు" ఉన్న చోటుకు వెళ్లి దానిని విప్పి

దానిలో ఉన్న రూపాయిని ఎముక ని కలిపి కడతారు. ఆ రూపాయిని ఒక తెల్ల గుడ్డలో కట్టి మరణించిన వారి ఆడబిడ్డ చీర చెంగుకి పెడతారు అప్పుడు ఇంటికి తీసుకొస్తారు వచ్చిన తర్వాత గుడ్డ విప్పి కడిగి పసుపు రాసి రూపాయిని గుడ్డలో కట్టి ఒక పీటపై ఉంచుతారు దానిని దాహంగా దొప్పలో గంజి, ఇంకో దొప్పలో నీళ్లు ఆకులో నిండకుండా బువ్వపప్పు పెడతారు తెల్లవారితే పెద్ద దినకార్యం ఆ రోజు ఉదయం శవాన్ని పెట్టినవారికి స్నానాలు చేయిస్తారు తర్వాత పెద్దలకి స్నానం చేయిస్తారు స్నానాలు చేయించడం అంటే ఇంట్లో వేడి నీళ్లు లేదా చల్లని నీళ్లు గాని దగ్గర పెడితే వారే స్నానం చేస్తారు దీనినే స్నానాలు పోస్తారు అంటారు ఆ రోజు కోడిని కోస్తారు కోడి రక్తాన్ని "పెతర బువ్వలు" తయారుచేయ డానికి కొద్దిగా పక్కకు తీయాలి అలా తీసిన వాటిని ఆడబిడ్డ ప్రత్యేకంగా పెతరాలకు (పెద్దలు వంట వండు తుంది ముందుగా పెతర్లకి గ్రంధులకు) ఒక విస్తరాకులో పడతారు తలగోరును మాత్రం ఒక తెల్ల కొత్త ఖండ్వలో పెడతారు పవన్ ని పట్టుకొని నీళ్ళుపారే నది, చెరువు, దగ్గర ఒడ్డులోకి వెళ్లి చిన్న పందిరి లేదా ఏదో ఒక చోటికి చిన్నగూడును వారి ఇంటి పేర్లను బట్టి కడతారు.

దహనం చేసినట్లయితే తలగోరులో రూపాయితో ఒక చిన్న ఎముక ఉంటుంది శవాన్ని పూడ్చినట్లయితే రూపాయి ఒకటి మాత్రమే ఉంటుంది తలగోరును గోదా వరిలో కలపాలి అనుకున్నవారు గోదావరి ఒడ్డున పందిరి వేసి ముందుగా తెల్ల కండువలో ఉన్న తలగోరును నీళ్లలో నూనెను అందరూ కడుగుతారు ఒక ఆకుపై దానిని పెడతారు ఆ పందిరి దగ్గర లేదా గూడు దగ్గర ఆకుల మీద బువ్వ పప్పు దొప్పలలో సారా, కల్లు, చుట్టలు, అలా తనకు నచ్చినవి అని పెట్టి మళ్లీ కొంత కండువ లో అక్కడ పెట్టినవి అన్ని మరణించిన వారికి తమ్ముడు లేదా వరసకి తమ్ముడు అయ్యేవారికి కండువా వినక అతను గోదావరివైపు తిరిగి కండువ లో వస్తువు కింద పడకుండా పట్టుకుని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లి గోదావరిలో మునిగి పోతారు అతడి వెనక ఉన్న అందరూ మునుగుతారు అప్పుడు ఏ వస్తువు పైకి రాకుండా గోదావరిలో మట్టి కింద కప్పుతారు అందరూ స్నానాలు చేసి ఇంటికి వస్తారు ఇంటిలో మళ్లీ పెద్దలకు అకాల లో అన్నం, పప్పు, కోడికూర పప్పు కలిపిన అన్నం (దేవుని పడిని) ఆ ఇంటిలోని వారు బంధువులు ముఖ్యమైన పెద్దలకు కొద్దికొద్దిగా పెడతారు అందరూ ఒక గిన్నెలో చేతులు కడుగుతారు అప్పుడు గొందులకి పెట్టిన బువ్వ లను కూరలను గోదావరిలో తలగోరును కండువాలో కలిపిన వ్యక్తి ఒక్కడే మాట్లాడకుండా తింటాడు గొందు లకు పెట్టిన ఆకులుదొప్పలు చేతులు కడిగిన గిన్నెలోని నీళ్లను అవన్నీ పట్టుకొని వెనుకకు తిరిగి చూడకుండా కొద్ది కొద్దిగా పారపోసుకుంటూ బయటకు వెళ్తాడు.

ముగింపు :

సాంఘిక ఆచారాలు పూర్వం ఇలా ఉండేవి కానీ ఇప్పటి కాలంలో అవి ఏమీ లేవు అప్పటి ఆచారాలు అనుభవాలు నమ్మకాలు ఆ కాలంలో ఒక స్త్రీ ప్రసవం అవ్వాలంటే పొద్దంతా పని చేసి వచ్చి ఆమెకు నొప్పి వచ్చినప్పుడు ఊర్లో ఉన్న మంత్రసాని పిలిపించి ప్రసవం అయ్యేవారు అలాగే పెద్దమనిషి, వివాహం, మరణం అప్పటి కాలంలో ఇలా జరిగేది.

సాంఘిక ఆచారాలు ఇప్పటికీ గిరిజన ప్రాంతాలలో అలాగే కొనసాగుతూనే ఉన్నాయి వారు అనారోగ్యంతో ఉంటే దావకానకి వెళ్ళకుండా చెట్లు వనరులతో వాళ్ళు వారి ఆరోగ్యం నయం చేసుకుంటారు.

ఉపయుక్త గ్రంథాలు :

1) ఆంధ్రుల జానపద విజ్ఞానయ-డా. ఆర్వీయస్ సుందరం
2) తెలుగు జానపద కళారూపాలు- ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి

ఆరె జానపద సాహిత్యం – పరిశీలన

– డా॥. కె. రత్నశేఖర్, ఆంధ్రోపన్యాసకులు, ఎస్.వి.కె.పి డిగ్రీ కళాశాల, పాదిలి, ప్రకాశం జిల్లా.

జానపద సాహిత్యం విశ్వజనీనమైనది. అది ఒక జీవ నది వంటిది. పుట్టిన ప్రతి వ్యక్తి మొట్టమొదట జానపదుడే. ఎలాగంటే ప్రతిఒక్కరికీ ఆది గురువు తల్లి. ప్రతివ్యక్తీ పుట్టుకతో మాతృప్రేమను ఆస్వాదించేవారే. తల్లి లాలి, జోల పాటలన్నీ జానపద సాహిత్యంలో భాగమే. ఆ తరు వాత పరిణామ క్రమంలో వారివారి పరిస్థితులనుబట్టి పండితులుగానూ, పామరులుగానూ వెలుగొందటం మనకు కనిపిస్తూనే ఉంది. కాబట్టి ప్రతివ్యక్తీ జానపదుడే అని అనడం సబబే అని నా ఉద్దేశం. ఎంతో విస్మృతి కలిగిన జానపద సాహిత్యంలో ఆరె జానపదుల సంస్కృతి, సాహిత్యాన్ని పరిచయం చేయడం ఈ వ్యాసంలోని ప్రధాన ఉద్దేశం. ఈ వ్యాసం రాయడానికి ప్రధానమైన ఆధారం పేర్వారం జగన్నాథంగారు. ఆయన ఆరె జానపదులపై, వారి సాహిత్యంపై పరిశోధన చేసి అనేక విషయాలను వెల్లడించారు. వారి పరిశోధనల, రచనల ఆధారంగా నేనీ విషయాలను తెలియ పరుస్తు న్నాను.

జనపదం గురించి, జానపదుల గురించి, వారి సాహిత్యం గురించి జ్యోత్స్నారాణిగారు తెలియజేస్తూ "జనపద మనగా పల్లెటూరు. జనపదాల్లో ఉండేవారు జానపదులు. జానపద సంబంధమైనది జానపదం... జాన పద సాహిత్యం, సాంప్రదాయిక విజ్ఞానం లేదా జానపద వాఙ్మయం అనుమాటలన్నీ శబ్దభవాలే. జనపదం జాన పదం అన్నమాటలు అతి ప్రాచీనమైన వైదిక సాహిత్యంలో బ్రాహ్మణాల్లోనూ, ఉపనిషత్తులలో దర్శనమిస్తాయి. వాటిలో జనపదం అంటే ప్రదేశం, దేశం, జనసమూహం అని అర్థం" (శరత్ జ్యోత్స్నారాణి,ఎస్.1991:117)అంటూ 'జనపదం' అనే పదాన్ని వేదాలు రచింపబడిన కాలం నుండే దేశివాచకంగా ప్రయోగించబడిందన్నారు.

మన నాగరికత, సంస్కృతి జానపద విజ్ఞానంలో దాగివున్నాయని పేర్వారం పేర్కొంటూ "జానపద సంస్కృతి లోనే మన వైశిష్ట్యం దాగి ఉన్నది. ఈ సంస్కృతిలోనే మనజాతి జీవనాడి స్పందిస్తుంది. ఇదే జాతి జీవనశైలికి గుండెకాయ వంటిది. దీని మూలాల్లోకి వెళ్లి తరచి చూస్తే ఎన్నో అద్భుతాలు బయటపడే అవకాశాలున్నాయి. ఆ సంపదలోంచి మన తాత ముత్తాతలు మాట్లాడిన ముచ్చట్లు వినిపిస్తాయి. వాళ్ల ఆకార రూపు రేఖలు మన కనుల ముందు కదలాడతాయి. మన అమ్మమ్మలు పాడే విసుర్రాతి పాటల్లో ప్రాచీన కాలంనాటి కుటుంబ గాథలు ధ్వనిస్తుంటాయి. మనజాతి మనుగడకు కారణమైన తల్లి వేరెక్కడుందో, నాగేటి చాళ్లలో కాపుబిడ్డలు రాల్చిన చెమట బిందువులు సాక్ష్యం చెబుతాయి. మన నాగరికతా సంస్కృతుల లోతుపాతులు పుడమితల్లి పుటల్ని తెరిస్తే తెలుస్తుంది" (జగన్నాటకం.2005: 40)అని మన మూలాల్లోకి వెళ్లిచూడాలన్నారు. తాత ముత్తాతల ముచ్చట్లు, వారి ఆకార రూపురేఖలు మన కనులముందు కదలాడుతూ, అమ్మమ్మలు పాడే విసుర్రాతి పాటల్లో ప్రాచీన కాలంనాటి కుటుంబ గాథలు ధ్వనిస్తుంటా యన్నారు.

"జానపద వాఙ్మయంలో జానపదుల విజ్ఞానమంతా చేరుతుంది. దీనిలో జానవద కథావాఙ్మయం, మూఢవిశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, మంత్ర తంత్రాలు, శాస్త్ర విజ్ఞానం అనగా భౌతిక విజ్ఞానం, పారమార్థిక విషయాలపై జనపదుల పరిజ్ఞానం వారి భావాలు, పొడుపుకథలు, సామెతలు, వినోదాలు, వేడుకలు మున్నగు పెక్కు విశేషాలు చేరుతాయి" (శరత్ జ్యోత్స్నారాణి,ఎస్.1991:121) అని జానపద వాఙ్మయంలో కనిపించే అంశాలను తెలియజేశారు. జానపదుల

ఆచారాలు ఎక్కువగా మూఢవిశ్వాసాల మీద ఆధార పడతాయి. భౌతిక విజ్ఞానం వారికి ఉన్నప్పటికీ సాంప్ర దాయం వారిని ముందుకు వెళ్లనీయకుండా చేస్తుందని చెప్పవచ్చు. అందుకే నేటికీ వారు తమ ఆచార సంప్ర దాయాలను కాపాడుకుంటూ ఉంటారు. జానపద విజ్ఞాన అధ్యయనం నిరంతరంగా, నిర్విరామంగా సాగాలి. ఇప్పటి వరకు దానిని పట్టించుకోక ఎంతో విజ్ఞానాన్ని కోల్పోయాం. పాశ్చాత్యదేశాలు మనకన్న ముందుడి అమూల్యమైన జానపద విజ్ఞానాన్ని సంరక్షించుకుంటూ పరిశోధనలు చేస్తున్నారు. మనం కూడా ఆ దిశలో ప్రయాణించి జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాలి. అందుకోసం ప్రజలు, ప్రభుత్వము, మేధావులు, విద్యాసంస్థల సహకారం అవసరం.

జానపద సాహిత్యంలో పేర్వారం చేసిన కృషి అపార మైనది. ఆయన చేసిన పని ఇతరులెవురైనా చేస్తే అంత సమగ్రంగా, పరిశోధనాత్మకంగా ఉండేదికాదు. ఎందు కంటే ఆరెమరాటీలు అని చెప్పబడే తెగకు చెందిన సాహి త్యాన్ని సేకరించి, తెలుగు సాహిత్యంతో పోల్చి అమూల్య మైన సైద్ధాంతిక విషయాలను వెల్లడించారు. అందుకోసం ఆయన ఆంధ్రదేశమంతటా క్షేత్రపర్యటనచేసి మౌఖిక రూపంలోని సాహిత్యాన్ని సేకరించి, పరిశోధించి, కథలను, గేయాలను తెలుగు సాహిత్యంతో తులనాత్మక అధ్య యనం చేశారు. అనేక పరిశోధనాత్మక వ్యాసాలను రాసి ప్రచురించారు. తన పిహెచ్.డి. గ్రంథం 'ఆరె జానపద సాహిత్యం - తెలుగు ప్రభావం' దానికి నిదర్శనం.

పేర్వారం జగన్నాథం ఆరె తెగకు చెందినవాడు. కాబట్టి వారి గురించి స్వయంగా చెప్పుకున్నారు. "మేము ఆరె వాండ్లం. మా గురించి చాలామందికి తెలియదు. కొన్ని వందల సంవత్సరాల క్రితం మహారాష్ట్రం నుండి కరువు కాటకాలవల్లనో, యుద్ధాలవల్లనో కొన్ని వేల మరాఠీ కుటుం బాలు తెలంగాణాకు వలసవచ్చి గ్రామాల్లో శాశ్వతంగా స్థిరపడినాయి. వీరు ప్రధానంగా వ్యావసాయిక వృత్తిని అవలంబిస్తారు. మద్యం, మాంసం ముట్టని శాఖాహారులు. ఎక్కువమంది లింగధారులైన వీరశైవులు. కొద్దిసంఖ్యలో శ్రీవైష్ణవం స్వీకరించిన వాళ్ళున్నారు. తెలంగాణా గ్రామ సీమల్లో మాత్రమే ఆరెవాళ్లు నివసిస్తూంటారు. తెలంగాణ లోని పలు గ్రామాలకు 'ఆరెపల్లె'లనే పేరున్నది. అక్కడ వాళ్ల సంఖ్య ఎక్కువ. ఆరెవాళ్లు లేని ఊర్లే అధికం. వీళ్లు తమలో తాము ఆరెభాషలో మాట్లాడుకుంటారు. ఇతరులతో మాత్రం అచ్చమైన తెలుగులో వ్యవహరి స్తుంటారు. అట్లా పుట్టుకతోనే వీళ్లకు ఆరెభాషతో పాటు తెలుగు కూడ సమంగా అబ్బుతుంది. ఆరెభాష అంటే మరాఠీకి తెలంగాణంలో ఏర్పడిన తద్భవమన్నమాట. వీళ్లు మహారాష్ట్రలోని మరాఠా తెగకు చెందినవాళ్లు. కనుక వీళ్లను ఆయుధోప జీవులుగా భావించవచ్చు. వీళ్ల ఇండ్లల్లో తెలంగాణా సాయుధపోరాట కాలందాకా ఆయుధాలుండెడివి. నిజాం కాలంలో కొద్దిమందికి మాత్రం పోలీసు పటేలు పతనులుండెడివి. అందువల్ల వీళ్లను గ్రామాల్లో ఆరెపటేండ్లని వ్యవహరిస్తుంటారు. తెలం గాణా గ్రామ సీమల్లోని సాంఘిక వ్యవస్థలో ఆరెవాళ్లదొక ప్రత్యేక కులంగా స్థిరపడింది. వీళ్లు తెలంగాణా సాంస్కృ తిక జీవితంలో పూర్తిగా లీనమైనారు. ఆర్థిక రాజకీయ విద్యారంగాల్లో మాత్రం ఆరెవాళ్లంతా వెనుకబడి వున్నారు" (సాహితీ సౌరభం.2004:40).

18వ శతాబ్దానికి చెందిన నుదురుపాటి వెంకన్న ఆంధ్ర భాషార్ణవములో 'ఆరె' పదానికి 'ఆరె మరాఠీవాడైన మహా రాష్ట్రుడే' అనే అర్థం చెప్పారు. ఆధునిక తెలుగు నిఘం టువుల్లో 'ఆరె' పదానికి మరాఠీ వాడనీ, 'ఆరెము' అనే పదానికి మరాఠీభాషఅని అర్థం రాశారు. ఆంధ్ర వాచ స్పత్యములో 'ఆరె' అనగా మరాఠీ వాడని, 'ఆరెము' నకు అతిఅవ భాష లేక ద్రావిడ భాష అనే అర్థం చెప్పారు. శబ్ద రత్నాకరంలో ఈ పదాలను యుగళంగా గుర్తించారు. ఈ విధంగా నిఘంటువులలో 'ఆరెపదం' వాడబడింది.

కాకతీయుల కాలం నుండి ఈ మరాఠాలు తెలుగు దేశానికి వలసవచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. కాకతీయులకు, దేవగిరి యాదవ

రాజులకు తరచు యుద్ధాలు జరుగడం వలన, యుద్ధం కోసం వచ్చిన మరాఠా సైనిక కుటుంబాలు తెలుగు దేశంలో స్థిరపడ్డాయి. అలాగే మహారాష్ట్ర దేశం తరచు కరువు కాటకాలకు గురవుతూ ఉండడం కూడా ఒక కారణ మని, ఈ విధంగా వచ్చిన వారిని దక్షిణ భారతంలో ఆర్యులని పిలిచేవారు. ఈ ఆర్యశబ్దమే క్రమంగా 'ఆరె'గా మారింది. వీరిని తెలంగాణంలో - ఆరెవాళ్ళు, ఆరె మరాఠాలు, ఆర్య క్షత్రియులుగా సర్కారాంధ్ర రాయల సీమలో-ఆరె కాపులుగా పిలుస్తున్నారు. వీటిలో మరాఠా క్షత్రియ వంశాలకు చెందిన కుటుంబాలుగా కొన్ని పరి గణిస్తున్నారు. అంతేగాక వీరి వంశనామాలలో ఎక్కువ భాగం మరాఠా క్షత్రియ వంశనామాలతో సరిపోతున్నాయి. కొందరి వంశనామాలు తెలుగు గ్రామనామాలను బట్టి ఏర్పడ్డాయి.

Edgar Thurston "Castes and Tribes of Southern India" గ్రంథంలో 'ఆరె' పదానికి ఇచ్చిన వివరణలో మదరాసు రాష్ట్రంలోని ఆరెవాళ్ళను గురించి మాత్రమే రాశారు. కాని హైదరాబాదు రాష్ట్రంలోని తెలం గాణలో నివశించే ఆరెవాళ్ల గురించి ప్రస్తావించలేదు. అంతేకాక అందులోని ఆధారాలనుబట్టి వారు వ్యవ సాయం ప్రధాన వృత్తిగా కలిగిన క్షత్రియులని, ఆయా ప్రాంతీయ ప్రత్యేకతలను బట్టి, భిన్న భాషా ప్రాంతాలను బట్టి వీళ్ల ఆచార వ్యవహారాల్లో వ్యత్యాసం కనిపిస్తూ, జనసాంద్రతలేని ప్రాంతాల్లో కొందరు భాషనుకూడా మరచిపోయారని, వీరు తమిళనాడు, కర్ణాటకలో స్థిరపడి ఇప్పటికీ తమ భాషా సంస్కృతులను కాపాడుకుంటూ ఆరెవాళ్ళుగా పిలువబడుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో హసన్ జిల్లాలో 'ఆరెహల్లి' అనే గ్రామం ఉంది. హల్లి అనగా 'పల్లి' అని అర్థం. తెలంగాణలో ఆరెపల్లి అనే పేరుగల గ్రామాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఆ గ్రామాలలో ఆరెవాళ్ళ జనాభా ఎక్కువ. ఒంగోలులో 'మరాఠీపాలెం', సత్తెనపల్లిలో 'మరాఠివీధి' అని వీధులకు పేర్లు పెట్టుకొని జీవిస్తున్నారు.

ఆరెవాళ్ళ ప్రత్యేకతలను గురించి పేర్వారం చెప్పారు. అందులో వారు 1. వ్యవసాయాన్ని వృత్తిగా కలిగినవాళ్లు కూడా శాకాహారులని, 2. వారికి యజ్ఞోపవీతం లేదని, 3. వీరు క్షత్రియులు కావడంవల్ల తెలంగాణలో గ్రామ రక్షణకు సంబంధించిన 'పోలీసు పటేలు' పదవులను నిర్వహించారని, 4. వివాహాది కార్యక్రమాల్లో క్షత్రియుల ఆచార వ్యవహారాలను పాటిస్తున్నారని, 5. తెలంగాణా సాయుధ పోరాటకాలం వరకు తరతరాలుగా సంక్ర మించిన ఆయుధాలు వారివద్ద ఉండేవని, 6. ఛత్రపతి శివాజీని వీళ్ళు తమ నాయకుడుగా ఆరాదిస్తుంటారని, 7. వ్యక్తులపేర్ల చివర 'జి' చేర్చడంగానీ 'రావు' పదాన్ని చేర్చడంగానీ లేక రెండూ చేర్చి పలుకడం ఆచారంగా ఉందన్నారు.

తెలుగు సాహిత్యంలో ఆరెపదం ప్రయోగం :

తెలుగు సాహిత్యంలో ఆరెవాళ్లకు ప్రత్యేకస్థానం ఉందని, ఆరె జానపదులుగా పిలువబడే వీరికి ప్రత్యేక సాహిత్యం కూడా ఉంది. ఆరెవాళ్ల సాహిత్యం తెలుసు కునేముందు తెలుగు సాహిత్యంలో ఆరె పదాన్ని ప్రయో గించిన వారి గురించి తెలుసుకోవాలి. ఈ విషయాలను పేర్వారం జగన్నాథం తెలియజేశాడు. ''తెలుగు సాహిత్యంలో 'ఆరె' అను పదాన్ని ప్రయోగించిన వాళ్ళలో తనకు తెలిసినంత వరకు పాల్కుర్కి సోమనాధుడు మొట్టమొదటి వాడుగా కనిపిస్తున్నాడు. ఈతడు 'ఆరె' అను పదాన్ని మొదటిసారిగా ప్రయోగించడమేకాక ఆ పదాలను గ్రంధస్థం చేసినాడు కూడ. ఇట్లా ఆరెభాషను సోమనాధునివలె గ్రంధస్థం చేసినకవి మరొకడు లేడు. వృషాధిప శతకంలో వేరువేరు భాషల్లో పద్యాలు చెపుతూ ఆరెభాషలో కూడ ఒక పద్యం రచించినాడు. అది-

"దేవవరా తుమ్మీ చ గురుదేవ మ్మ ణూనుతరీ, తుమ్మీ చ గో
సావరురా తుమ్మీ చ, తమసాచ ప్రసాద, అమీ కృపాకరా
యీవగదా" యటంచు, నుతియించెద నిన్నును
నారెభాష దే
వా వినుతార్యలీల, బసవా! బసవా! బసవా! వృషాధిపా!

దీనికి కీ.శే. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు ఈ విధంగా తాత్పర్యం వ్రాసినారు. ''దేవోత్తముడవు నీవు గురుదేవుడవని, వృషభేశ్వరుడవని నిన్ను చెప్పెదను. నీ యొక్క అనుగ్రహము. నన్ను దయచూచువాడవు నీవేకదా యని నుతింతిను''. ఐతే కొన్ని ప్రతుల్లో ఈ పద్యంలోని ''ఆరెభాష'' అను పదానికి బదులుగా ''ఆర్యభాష'' అని పాఠాంతరం కనిపిస్తున్నది. ''ఆర్య'' క్రమముగా ''ఆరె''గా మారిందని చెప్పడానికి ఇది కూడ ఒక నిదర్శనం. ''ఆరె'' అనుపదం ఈ సందర్భంలో భాషాపరంగా వాడబడింది'' (సాహిత్యావలోకనం.1982:92) ఈ విధంగా 'ఆరె'పదం ఈ సందర్భంలో భాషాపరంగా వాడబడిందన్నారు..

తరువాత సోమనాధుడు రాసిన 'పండితారాధ్య చరిత్ర'లో కొన్ని ద్విపదలను ఆరెభాషలో రాశాడన్నారు. చిలుకూరి నారాయణరావు ఒకపద్యం అర్ధం కనుక్కోవ డానికి ఎంతో ప్రయాసపడి మహారాష్ట్ర పండితులతో చర్చించి, అది ఆధునిక మహారాష్ట్ర భాషతో గానీ ప్రాచీన మహారాష్ట్ర భాషతోగానీ సరిపోలడం లేదని చెప్పారు. ఇందులో సోమనాథుడు 'ఆరె' పదాన్ని దేశపరంగా, జాతిపరంగా వాడారన్నారు. కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో ఆరె పదమును జాతిపరంగా ప్రయోగిం చాడన్నారు. అలాగే 16వ శతాబ్దానికి చెందిన శ్రీకృష్ణదేవ రాయలు 'ఆముక్తమాల్యద' గ్రంథంలో విలుబుత్తురు వర్ణన సందర్భంలో 'ఆరె' పదాన్ని జాతి వాచకంగా వాడారని జి.వి.సుబ్రహ్మణ్యం 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' గ్రంథంలో పేర్కొన్నారు. ''విలు బుత్తూరు వర్ణనమంతా ఒకయెత్తు; ఆ వూరి ఆరెకులగాథ, పొలయలుక దంపతుల గాథ మరొకయెత్తు. ఈ క్రింది పద్యాలు తెలుగు వారికి సుపరిచితాలు.

'తలఁబక్షచ్చట గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకు లుషస్స్నాత ప్రయాత ద్విజా
వలి పిండీకృత శౌటిక ల్సవి దదావాసంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గ న్వెనబారు వానిఁగని నవ్వు న్నాలి గోప్యోఘముల్' (1.65)

కేదారాలలో బాతులు భాగవతోత్తముల పిండికృత శాటికల్లాగా భ్రమను గొల్పించాయి. ఆ భ్రమకు లోనైన ఆరెకులు ప్రియురాండ్ర పరిహాసాలకు పాలయ్యారు. ఇదొక్క చక్కని గాథలాంటి గ్రామజీవన వర్ణనాంశం... ఊరి వెలుపల ఆరెకుల జీవితంలో... మనోజ్ఞంగా ప్రతి ఫలించింది'' (సుబ్రహ్మణ్యం,జి.వి.2002:258).

పొన్నెకంటి తెలగనార్యుడు 'యయాతి చరిత్ర'లో ఆరె పదాన్ని భాషాపరంగా ప్రయోగించాడు. ''16వ శతాబ్దానికి చెందిన పొన్నెకంటి తెలగనార్యుడు తన యయాతి చరిత్రలో-

"అరభి ఫారసి గుజరాతి యారె మచ్చతెనుగు కన్నోజి మొదలుగా తెలిసివ్రాయ దారిగన్నట్టివాడు గతాతభాను"

అంటూ భాషాపరంగా ఆరె పదమును ప్రయోగించి నాడు'' (సాహిత్యావలోకనం.1982:94). అలాగే అన్నమాచార్య కీర్తనల్లో కూడా 'ఆరె' పదం ప్రయోగిం చాడనే విషయాన్ని వేటూరి ఆనందమూర్తి తెలియజేశారు. ''అన్నమాచార్య కీర్తనల్లోనూ ''ఆరె''పదం ఉ దహరింపబడినట్లు తెలియవస్తున్నది. డాక్టర్ వేటూరి ఆనందమూర్తి గారు తెలిపినారు'' (సాహిత్యావ లోకనం. 1982 : 94). ఈ విధంగా తెలుగు సాహిత్యంలో 'ఆరె' పదాన్ని దేశపరంగా, జాతిపరంగా, భాషాపరంగా ప్రయోగిం చారు.

'ఆరె' అను పదం తెలుగు సాహిత్యంలోనేకాక ఇతర భాషా సాహిత్యాల్లో భాషాపరంగా కనిపిస్తుందని పేర్వారం పేర్కొన్నారు. ''కర్నాటక రాష్ట్రంలో మాలంగి అనుచోట హొయసల యాదవులచే వేయించబడిన శాసనంలో ''ఆరె'' పదం భాషాపరంగా వాడినట్లు ప్రొఫెసర్ యస్ ఆర్. కులకర్ణిగారు వ్రాసినారు. ఇది 12వ శతాబ్దానికి చెందిన శాసనమట. తంజావూరును పరిపాలించిన మహా రాష్ట్ర ప్రభువగు షాహజీరాజు తన ''పంచభాషా

విలాసము" అనే మరాఠి నాటకంలో "ఆరెమాతు" అనే పదాన్ని ప్రయోగించినాడు. "మాతు" అనగా "మాట" అని అర్థం. ఈతడు 18వ శతాబ్దారంభం దాకా జీవించిన వాడు. తెలుగులోనూ అనేక యక్షగానాలు రచించినాడు" (సాహిత్యావలోకనం.1982:94-95).

ఆరె జానపద గేయాలు - గాథలు :

ఆరెభాషకు లిపిలేకపోయినా వాళ్ల ఇండ్లలో ఏదైనా శుభకార్యం జరిగితే తప్పకుండా ఆరె జానపద గేయాల్ని పాడుతున్నారు. పెండ్లి జరిగినా, పిల్లలకు పేరుపెట్టినా, పుట్టింటికి చెల్లెల్ని తీసుకపోవడానికి అన్న వచ్చినా, ఆరెవాళ్ల ఇంటి ఆడపడుచులు పాటలుపాడి బంధువుల్ని అలరిస్తుంటారు. 'గొంధళీలు' అనబడేవారు జానపద ప్రదర్శనలిస్తూ ఊరూరా తిరుగుతూ ఆరెభాషకు సంబంధించిన జానపదగేయాలు పాడతారు. ఆరెభాషకు సంబంధించిన జానపదగేయాలూ, ఆరెవాళ్లకు సంబంధించిన గాథలూ నేటికీ వాళ్ల నాలుకలపై నర్తిస్తూ ప్రాణం నిలబెట్టుకుంటున్నాయి. వాళ్ల సాంస్కృతిక, సాంఘిక జీవితానికి అవి నిలువుటద్దంలా భాసిస్తున్నాయి.

ఆరెవాళ్లలో తెగలు :

గోంధళీలు ప్రత్యేకమైన మరాఠీతెగ. వీరు తెలంగాణలోని ఆరెవాళ్లను ఆశ్రయించి ఆరెభాషలో వీధి భాగోతాల్ని ప్రదర్శిస్తూ జీవిస్తుంటారు. వీరు మాట్లాడేది ఆరెభాష. వీరు మాంసాహారులు. ఆరెవాళ్లకు, వీరికి సంబంధ బాంధవ్యాలు ఉండవు. కొన్ని ఇంటిపేర్లు మాత్రం ఈ రెండు తెగల్లో సమంగా ఉన్నాయి. గోంధళీల గురించి పేర్వారం వివరిస్తూ "మరాఠీభాషలో 'గోంధళ్' అంటే సంగీత వాయిద్యాలతో కూడిన ఒకరకమైన భజన కార్యక్రమమన్నమాట. వివాహాది శుభకార్యాల్లో మహారాష్ట్రులు ఈ గొంధళ్‌ను విధిగా నిర్వహిస్తారు. దీన్ని వృత్తిగా స్వీకరించి వివాహాది శుభకార్యాల్లో ఆటపాటలతో భజన కార్యక్రమాలతో రంజింపజేసేవాళ్లను మహారాష్ట్రంలో గొంధళీలంటారు. ఈ గొంధళ్' అన్న పదం 'గొండిలి' నుంచి వచ్చి ఉంటుందని పండితులు కొందరు అభిప్రాయపడుతున్నారు. 'గొండిలి' లేక 'గొండ్లి' అంటే కుండలాకార నృత్యమని నిఘంటువు లంటున్నాయి. 'గొండిలి' అన్నపదం 'క్రీడ' అనేపదానికి వికృతి అనికూడ కొందరు పండితులూహిస్తున్నారు. తోలుబొమ్మలాటలో 'గాంధోలిగాడు' అనేఒక పాత్ర ఉంటుంది" (సాహితీ వసంతం.1992:67) వీటన్నింటినీ పరిశీలిస్తే ఈ పదాలన్నీ ఒకే కుదురునుంచి పుట్టి ఉంటాయి.

అలాగే రంగ్రేజులు, ఆరె బుడుబుడుకల వారి గురించి పేర్వారం వివరించారు. "మరాఠీ మాతృభాషగా కలిగి 'రంగ్రేజ్' లనబడుతున్న వాళ్లుకూడ ఆంధ్రదేశంలోని పలుపట్టణాల్లో నివశిస్తున్నారు. వీళ్లను 'భావసారి క్షత్రియుల'ని కూడ అంటుంటారు. బట్టలకు రంగు లద్దడం, బట్టల వ్యాపారం వీళ్ల ప్రధానవృత్తి. వీళ్లుకాక 'ఆరెబుడుబుడుకల' అనేవాళ్లు కూడ ఉన్నారు. వీళ్లు వేషాలుకట్టి డమరుకంవంటి చిన్న వాయిద్యంతో ప్రాత:కాలమందే ఊరు తిరుగుతూ ఇంటింటికివెళ్లి జోస్యం చెప్పి ప్రజల మన్ననలుపొంది భిక్ష తీసుకుంటుంటారు" (సాహితీ వసంతం.1992:67).

సురభి కళాకారులు మహారాష్ట్ర నుండి వచ్చిన మరాఠా సైనికులు. శివాజీ మరణాంతరం ఆంధ్రదేశానికి వచ్చి స్థిరపడ్డారు. వీరిని ఆంధ్రదేశంలో అనేక పేర్లతో పిలుస్తున్నారు. వీరు ఆంధ్రదేశంలో వ్యవసాయ, వాణిజ్యరంగంలో స్థిరపడ్డారు. మరికొందరు తోలుబొమ్మలను ఆడించేవారు. ఆ తరువాత నాటకాల్ని ప్రదర్శించి తెలుగు నాటక రంగాన్ని అభివృద్ధి పరిచారని పేర్వారం పేర్కొన్నారు. "ఈ సురభివాళ్ళు మహారాష్ట్రంనుండి ఆంధ్రదేశానికి వలస వచ్చి స్థిరపడ్డారు. శివాజీ మరణానంతరం మరాఠా సైనిక కుటుంబాలెన్నో ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లి ఆయా ప్రాంత ప్రజల సాంస్కృతిక జీవితంలో అంతర్భాగమై పోయారు. అట్లా వచ్చిన కుటుంబాలు కొన్ని రాయల సీమలో కూడా స్థిరపడ్డారు. వీరు క్షత్రియులు. వీరిని ఆంధ్రదేశంలో ఆరెమరాఠీలు, ఆరెకాపులు, ఆరెక్షత్రియులు మొదలగు పేర్లతో పిలవబడ్డారు. ఈ విధంగా

వచ్చినవారు కొందరు వ్యవసాయ వాణిజ్యాది రంగాలలో స్థిరపడగా, మరికొందరు తోలుబొమ్మలను ఆడించే వృత్తిని స్వీకరించారు. వీరు మొదట తోలుబొమ్మలను ఆడించినా తరువాత ఆ వృత్తిని మానేసి తెలుగు నాటకాల్ని ప్రదర్శించడం ప్రారంభించారు. వీరు తెలుగు నాటక రంగాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి పరచినారు" (సాహితీ వసంతం. 1992 : 71). సుప్రసిద్ధమైన ఆరె మరాఠీల కథ 'ముగ్గురు మరాఠీలకథ' సినిమాగా తెలుగులో ప్రచారం పొందింది.

ఆంధ్రదేశంలో తోలుబొమ్మలు ఆడించేవారు ఆరె మరాటీలని, తోలుబొమ్మలనాడించే ప్రక్రియ మహారాష్ట్ర నుండి వచ్చిందని, కోస్తాంధ్రలో నివశించిన వారు కొందరు ఈ వృత్తిని స్వీకరించారన్నారు. "వీళ్ళు నేడు ఆంధ్ర దేశమంతా వ్యాపించి ఉన్నా ఎక్కువగా కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ముఖ్యంగా కాకినాడ సమీపాన మాధవ పట్నంలో అధిక సంఖ్యలో నివసిస్తున్నట్లు తెలుస్తున్నది. వీళ్ల కూడ మహారాష్ట్రం నుండి తెలుగుదేశానికి వలస వచ్చిన మరాఠా సైనిక కుటుంబాలకు చెందినవాళ్లే. వీళ్ళు తోలుబొమ్మలాటల్ని ప్రదర్శిస్తూ ఆంధ్రదేశమంతటా సంచరిస్తుంటారు. వీళ్ళు కూడ ఆరెమరాఠీలలో ఒక తెగకు చెందినవాళ్లే" (సాహితీ వసంతం.1992:71-72).

ఆరెవాళ్ళ సంస్కృతి :

ఆంధ్రదేశంలోని అనేక కులాలతోపాటు ఆరెవాళ్లదొక కులంగా స్థిరపడిపోయింది. వారిని ఆరె, ఆరెకాపులు, ఆరెమరాఠీలు, ఆర్య క్షత్రియ వంటి నామాలతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఆరెవాళ్ల ఆచార వ్యవహారాలు, వాళ్ల సాంస్కృతిక విశేషాలూ వారు నేటికీ సంరక్షించుకుంటూ వచ్చిన ఆరె జానపద సాహిత్యం ప్రత్యేక విశిష్టతను సంతరించుకుంది.

ఆరెవాళ్ళు ఆయుధోపజీవులని, సనాతనంగా వీరిదగ్గర ఆయుధాలుండేవని, శాఖాహారులని, క్షత్రియులుగా పరిణింపబడుతున్నారని, వారికి యజ్ఞోపవీతం లేదని, గోత్రనామాలు కూడా చాలామందికి తెలియవని, శుభకార్యాలలో భవానీమాతను ఆరాదిస్తారని, ఆమే వారికులదైవమని, ఆమెను అంబాభవానీ అని కూడా అంటారన్నారు. లోహంతో చేసిన త్రిశూలం వంటి రెండుమొనల 'ద్విశూలం' భవానీ మాతకు చిహ్నంగా ఉపయోగిస్తారని, ఈ మాతను ఆరాదించి శుభకార్యాన్ని ప్రారంభిస్తారన్నారు. "ఆరెవాళ్లు శాకాహారులు. క్షత్రియులుగా పరిగణింపబడుతున్నారు. వీళ్లకు యజ్ఞోపవీతం లేదు. గోత్రనామాలు చాలా మందికి తెలియదు. ఏ కొందరో చెప్పగలిగినా అవి ఋషుల పేర్లు కావు. ఆరె వాళ్లు అన్ని శుభకార్యాల్లోనూ భవానీమాతను ఆరాధిస్తుంటారు. ఈమే ఆరెవాళ్లందరికీ కులదైవం. ఈమెను అంబాభవానీ అనికూడ అంటారు. లోహంతో చేసిన త్రిశూలంవంటి రెండు మొనల "ద్విశూలం" భవానీ మాతకు చిహ్నంగా ఉపయోగిస్తుంటారు. ఈ భవానీ మాతను ఆరాధించనిదే ఏ శుభకార్యాన్నీ ప్రారంభించరు. సాధారణంగా ఆరెవాళ్లంతా శైవులో లేక వీరశైవులో అయి ఉన్నారు" (సాహితీ వసంతం.1992:102).

పండుగలు :

తెలుగువారు చేసుకునే పండుగలన్నీ వీరు ఆచరిస్తారని, ఉగాది నుండి కాముని పున్నమ దాకావచ్చే పండుగలన్నీ స్థానిక ఆచారాల ప్రకారం జరుపుకుంటారని పేర్వారం చెప్పారు. అలాగే తెలంగాణకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను కూడా ఆచరిస్తారని, స్థానికంగా ఉండే ప్రజలతో కలిసి పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ వంటి దేవతల్ని కొలుస్తారన్నారు. వేములవాడ, కొత్తకొండ, పాలకుర్తి, ఐనవోలు, కొమురవెల్లి వంటి శైవక్షేత్రాల్లో ప్రతి సంవత్సరం జరిగే జాతరలందు సమధికోత్సాహంతో పాల్గొంటారు.

ఆషాడ శుద్ధ పూర్ణిమనాడు ఆరెవాళ్ళు 'అకాడిపునిం' పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. అంతకు నాలుగురోజులముందు శుద్ధ ఏకాదశినాడు తొలిఏకాదశి వచ్చినా, దానిని ఆచరించక, ఈ పండుగనాడు ఉపవాసం

ఉండి, పాయసంవండి భవానీదేవికి నైవేధ్యంపెట్టి, ఉపవాసం అయ్యాక అందరూ కలసి భోజనం చేస్తారు. నాగపంచమి పండుగను ప్రత్యేక పద్ధతిలో శ్రావణ శుద్ధ పంచమినాడు జరుపుకుంటారు. నాగులపంచమినాడు సోదరుడు వచ్చి చెల్లెల్ని పుట్టింటికి తీసుకువెళ్ళే ఆచారం వీరికి ఉంది. ఆ సమయంలో కొన్ని ఆరెపాటలు పాడుకుంటారు. కరువు వచ్చినప్పుడు వర్షంకోసం పాడే పాటలు - చేసే ప్రార్ధనలు ఆరెవాళ్లలో ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. తెలుగునాడులో వర్షంకోసం కప్పలకు పెళ్లిచేసే ఆచారం మాత్రమే ఉంది. ఆరెవాళ్లలో నామకరణ మహోత్సవం ప్రత్యేక పద్ధతిలో జరుగుతుంది. మహారాష్ట్రలో 'పట్వాయి' అనే గ్రామదేవత ఉంది. ఆమె పిల్లల దేవతగా ప్రసిద్ధికెక్కి వారి సంక్షేమంకోసం ఆరాధింపబడుతుంది. ఈ గ్రామ దేవత ఆరాధనకూడా ప్రత్యేకంగా చేస్తారు. ఈ విధంగా ఆరెవారి పండుగలు అతి ప్రాచీనమైనవి. వారు మహారాష్ట్ర నుండి వచ్చిన కాలంనాటి కొన్ని ఆచా రాలు, ఇప్పటికీ ఉన్నాయి. భారత ప్రజల సాంస్కృతిక సమైక్యతను రాజకీయంగా ఏర్పడిన సరిహద్దులుగానీ, భాషాపరమైన ఎల్లలుగానీ, ప్రజల్ని విడదీయలేదు. ఆరెవాళ్ల జానపద సంస్కృతినీ, సాహిత్యాన్నీ పరిశీలిస్తే తమదైన ప్రత్యేక భాషా సాహిత్య సంస్కృతుల్ని పరిరక్షిస్తూ గ్రామీణ సాంఘిక జీవితంలో ఒదిగిపోయారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. జగన్నాథం, పేర్వారం (సంక) :1982. 'సాహిత్యావలోకనం'. చైతన్య సాహితి, హనుమకొండ
2. జగన్నాథం, పేర్వారం (సంక) :1992. 'సాహితీ వసంతం'. సాహితీ బంధు బృందం, హనుమకొండ
3. జగన్నాథం, పేర్వారం (సంక) :2005. 'జగన్నాటకం'. సృజనలోకం, హనుమకొండ
4. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్ : 1991. 'ఎల్లోరా రచనలు సమగ్ర పరిశీలన', వెంకటరమణ పబ్లిషర్స్, హైదరాబాదు.
5. సుబ్రహ్మణ్యం, జి.వి : 2002. 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు'. తెలుగు అకాడమి, హైదరాబాదు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల దేవత – లక్ష్మీదేవర ఉత్సవాలు – ఊరేగింపులు

– యం. మూధఖి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మం.

సుప్రసిద్ధులైన "ప్రాచీన సంస్కృత నాటక కర్తలలో జనపద, జానపద శబ్దాలను ఆయా అర్థాలలో ప్రయోగించడంలో 'క్రీడ' సల్పినవాడు మహాకవి భవభూతి అని పేర్కొని వీరు కొన్ని ఉదాహరణలిచ్చి నిరూపించ ప్రయత్నించారు. ఉదాహరణకి ఉత్తర రామ చరిత్ర ప్రథమాంకంలో దుర్ముఖుడు రాముడితో 'ఉపస్థువంతి దేవం పౌరజానపదా:' అన్నాడు. ఇక్కడ పౌర శబ్దానికి పురవాసులని, జానపద శబ్దానికి గ్రామవాసులని భవభూతి ప్రయోగించిన "పౌరజానపదా : ప్రజా: అనే పదాన్ని ఎఱ్ఱన స్వీకరించి "జానపదుల్ పురీజనులు" అని ప్రయోగించి యుండవచ్చునన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.కాళిదాసు మేఘసందేశంలో 'జనవధూ' అని పల్లెపడుచును 'బ్రహ్మావర్తం జనపదం' అని దేశాన్ని ఉద్దేశించి ప్రయోగించి యుండడాన్ని గమనించవచ్చు.

ఓగేటి అచ్యుత రామశాస్త్రి (1977-109) జనపదము అంటే గ్రామము దేశ విభాగము, దేశము అని అర్థం. జానపదమన్నా ఇదే అర్థమని విశ్వనిఘంటువులోని "భవేజ్జనపదో జానపద్యోపి జనదేశమో" అన్న వాక్యం వల్ల సిద్ధిస్తుంది. కాగా జనపదం నందు జానపదం నందు నివసించు ప్రజలు జానపదులు. జనపదానికి, జానపదానికి, జానపదులకు సంబంధించినదే జానపదం'. బిరుదు రాజు రామరాజు (1978-7) "జానపదమనగా పల్లెటూరు". ఆర్యావర్త పుణ్యభూమిర్మధ్యం, విన్ధ్య హిమాగమో: నివృజ్జన పదే దేశ విషయాతూ పవర్తనమ్" అని అమరము జనపదముల యందుండు వారు జానపదులు. వాళ్ల పాడుకునే పాటలు లేదా గేయాలు జానపద గేయాలనబడును". బి. రామరాజు "జననామ్ పదమ్ జానపదం" అని జానపద శబ్దానికి నిర్వచనం చెప్పబడింది. జనపదం - జానపదం అనేవి తెలుగు సాహిత్యంలో జానపద వాఙ్మయాన్ని గూర్చి చెప్పేటప్పుడు ప్రయోగించడం కలదు. జనపదం అన్నా, జానపదమన్నా ఒకటే. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (1990-13) "జానపదమంటే పల్లెటూరని జనపదాలలో నివసించువారు జానపదులని, వారు పాడుకునే పాటలు గాని, ఆటలు గాని, నృత్యం గాని జానపదకళారూపాలని నిర్వచించారు. ఈ జానపద కళారూపాలలో ఒకటి లక్ష్మీదేవర.

నాయకపోడులు లేదా పద్మనాయకులుగా పిలువబడే గిరిజనుల యొక్క ప్రధాన దేవత. నాయకపు తెగవారినే పాండవ నాయకులు, పద్మనాయకులు, నాయక జాతి, నాయకపు, నాయకపు వాళ్లు, నాయక పోళ్ళు, నాయకపోడ్లు అనే పేర్లతో పిలుస్తారు. వీరు నివసించే ప్రాంతాలను నాయకపుగూడేలుగా పిలుస్తారు. సోషియో కల్చరల్ ప్రొఫైల్ ఆఫ్ ట్రైబ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పుస్తకంలో నాయకపోడుల గురించి నాయక అనునది మూల పదంగా నాయకపు + వాడు = నాయకపోడుగా మారిందని పూర్వీకుల కాలం నుండి వీరు ప్రధానంగా పోడు వ్యవసాయం ఆచరించడం వలన వీరికి నాయకపోడులనే పేరు వచ్చిందని, మానవశాస్త్రకారుల అభిప్రాయంగా తెలిపారు. వీరు మాట్లాడేది సరళంగా లేకపోయినా భాష మాత్రం తెలుగే.

నాయకపోడ్లు తెలంగాణ రాష్ట్రంలోని నూతనంగా ఏర్పడిన ములుగు జిల్లాలోని సమ్మక్క సారలమ్మ వనదేవతల పేరు మీద జరిగే మేడారం జాతరలో

ప్రధానంగా సమ్మక్కకు ఆడపడుచుగా లక్ష్మీదేవరను భావిస్తారు. నాయకపోడుల ఇలవేల్పు లక్ష్మీదేవరకు సంబంధించిన కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. మహాభారతంలో ద్వాపరయుగంలో నందిగామ ఘట్టంలో కృష్ణార్జునులు నందిగామ రాజుపై యుద్ధానికి వస్తారు. ఈ యుద్ధంలో తలపడినట్లైతే కృషార్జునులు ఓడిపోతారనే ఉద్దేశంతో స్వయంగా "లక్ష్మీదేవి నందిగామ రాజుతో యుద్ధం చేసి గెలుస్తుంది. విజయంతో తిరిగి వస్తున్న లక్ష్మీదేవిని దూరంగా చూసి నందిగామ రాజు అని పొరపాటుగా భావించి దూరం నుండే అర్జునుడు బాణం వేసి లక్ష్మీదేవి శిరస్సును ఖండిస్తాడు. ఆమె శిరస్సు తెగి అడవిలో పడుతుంది. ఈ పొరపాటును గమనించిన శ్రీకృష్ణుడు లక్ష్మీదేవి తలకోసం వెతుకగా దొరకకపోయే సరికి గుర్రం తలను తెచ్చి అతికిస్తారు. తరువాత కొద్ది రోజులకు తెగిపడిన లక్ష్మీదేవి తల అడవిలో నివసించే నాయకపోడులకు దొరుకుతుంది. ఆ తలను వారు తెచ్చి కృష్ణుడికి ఇవ్వగా కృష్ణుడు వెంటనే లక్ష్మీదేవికి తగిలించిన గుర్రం తలను తీసివేసి అసలు తలను అతికిస్తాడు. గుర్రం తలను గిరిజనులైన నాయకపోడులకు ఇచ్చి ఇది మీ ఇంటి లక్ష్మీదేవరగా పిలవబడుతుందని కృష్ణుడు చెబుతాడు. అప్పటి నుండి గిరిజనులలో ఒక తెగవారైన నాయకపోడులు వారికి లభించిన గుర్రం తలనే లక్ష్మీ దేవరగా భావించి జాతరలో ప్రముఖ పాత్ర వహిస్తారు.

లక్ష్మీదేవర ఉత్సవం :

తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా రెండు సంవత్సరాల కొకసారి జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర దక్షిణాసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి కెక్కింది. 1996లో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. 12 ఏళ్ళకు ఒకసారి జరుపుకునే కాశీ పుష్కరమేళాలకు, పూరీ జగన్నాధయాత్రకు, తిరుపతి బ్రహ్మోత్సవాలకు, వివిధ ప్రాంతాలలో జరుపుకునే దేవతా ఉత్సవాలకు భిన్నంగా మేడారం జాతర ఆదివాసి గిరిజన సంప్రదాయంలో జరుగుతుంది. కోయలు ఆరాధించే ఈ దేవతలు ప్రాకృతిక దేవతలు, రూపరహిత దేవతలు. విగ్రహారాధన చేయరు. ఈ జాతరలో ప్రధానమైన ఉత్సవం లక్ష్మీదేవర. మేడారం జాతర జరిగే బుధవారానికి ముందు వచ్చే ఆదివారంతో ఈ ఉత్సవం మొదలవుతుంది. వెదురుతో తయారు చేయబడిన గాదె పెట్టెలో భద్రపరచబడిన పద్నాల్గు ప్రతిమలు 1. లక్ష్మీదేవర 2. కృష్ణస్వామి 3. పోతురాజు 4.హిడింబి రాక్షసి 5. ఆడరాక్షసి 6.గురిసింగబోయడు 7.గురిపోతు 8.పంది రాజు 9.ధర్మరాజు 10.భీముడు 11.అర్జునుడు 12.నకులుడు 13.సహదేవుడు 14.సాంబశివుడు వీటిని కొబ్బరి నీళ్లతో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడుస్తారు. వాటికి పసుపు, కుంకుమలు చల్లి, అగరువత్తుల ధూపం వేసి, పోతురాజుకు కోడిని బలిచ్చి, లక్ష్మీదేవరకు కొబ్బరి కాయ, చక్కెర నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ విధంగా వరుసగా ఆది, సోమ వారాలు పూజలు నిర్వహిస్తారు.

మంగళవారం పూజాది కార్యక్రమాలు నిర్వహించి మద్యం, మాంసం ముట్టకుండా ముందుగా పోతురాజును వీధి మొదట్లోకి తీసుకెళ్లతారు. పరిసరాల్లో ఎవరూ లేరని చూసుకుని నిమ్మకాయను మధ్యకు కోసి రెండు ముక్కలను రెండు వైపులకు పడవేస్తారు. పసుపు, కుంకుమలు చల్లి, కోడిగ్రుడ్లు పగులగొట్టి, కోడిని మెడ కోసి ప్రక్కకు పడవేసి మరల పోతురాజును గుడిలోకి తీసుకువస్తారు. కర్రతో తయారు చేయబడిన పల్లకి వలె ఉన్న ఫొజు అనే నిర్మాణాన్ని ముందుగా గులాబి రంగు వస్త్రంతోను, తరువాత ఆకుపచ్చరంగు వస్త్రంతోను పైన ఎరుపురంగు వస్త్రంతోను అలంకరిస్తారు. ముందు భాగంలో లక్ష్మీదేవర ప్రతిమను అమరుస్తారు. ఫొజు మధ్యలో ఉన్న ఖాళీస్థలంలో మనిషి తలతో నిలబెట్టి ఊరేగిస్తారు. లక్ష్మీదేవరతో పాటు మిగిలిన ప్రతిమలను తలా ఒకరు పట్టుకొని సుమారు ఇరవైనుండి ముప్పై మంది వరకు కాలికి చెప్పులు ధరించకుండా చల్వాయి నుండి సోమలగడ్డ, రంగాపూర్, ఇప్పలగడ్డ, నార్లాపూర్ మీదుగా కాలినడకన మేడారానికి బుధవారం

ఉదయం చేరుకుంటారు. లక్ష్మీదేవరను ధరించిన వ్యక్తికి వంశపారంపర్యంగా పూజలు నిర్వహిస్తున్న వారి ఇంటి నుండి ఒడివాల బియ్యం (నూనె, పసుపు కలిపిన బియ్యం) ఆకు, రెండుపోకలు, కుడక, మూడు ఖర్జూరపళ్లు, ఎర్రజాకీటు ముక్క వీటన్నింటిని తెల్ల తువ్వాలలో పోసి ముడుపు కట్టి నడుముకు కడతారు. గురువారం సాయంత్రం సమ్మక్క తల్లి గద్దెల వద్దకు వచ్చిన సమయంలో సమ్మక్కతో పాటు లక్ష్మీదేవరను కూడ ఆహ్వానిస్తారు. గద్దెల వద్దకు దేవతతో పాటు వెళ్లి లక్ష్మీ దేవరను ధరించిన వ్యక్తి నడుముకు కట్టిన ముడుపును గద్దెలవద్ద సమర్పిస్తారు. గురువారం రాత్రి మేడారంలో నిద్రచేసి శుక్రవారం మధ్యాహ్నం వరకు మొక్కులు తీర్చుకుని తిరిగి కాలినడకన వచ్చిన దారివెంట ప్రయా ణించి వారి స్వస్థలానికి చేరుకుంటారు. తిరుగువారం పండుగను మళ్లీ బుధవారం రోజు పోతురాజుకు కోడి పిల్లను బలిచ్చి లక్ష్మీదేవరకు నైవేద్యం పెట్టి జాతర తంతు ముగిస్తారు. ఈ సమయంలో మరియు దసరా పండుగ నాటికి వచ్చే కొత్త పంటను తమ ఇలవేల్పు లక్ష్మీదేవరకు నైవేద్యంగా పెడతారు. ఈ కార్యక్రమాన్ని అంతా ఒక ఉత్సవం మాదిరిగా నాయకపోడ్లు జరుపుకుంటారు.

మేడారం జాతర జరిగే సమయంలో కంకవనం మరియు గజస్తంభానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. జాతరకు వారం రోజుల ముందు మంచి రోజు చూసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. చల్వాయి గ్రామం పాలిమేరలో ఉన్న వట్టివాగు సమీపంలోని అడవి నుండి వీటిని తీసుకురావడానికి ప్రత్యేకంగా 5 నుండి 12 సం॥ల వయసు కలిగిన ఐదుగురు మగపిల్లలను నియ మిస్తారు. వారిని డోలీ చప్పుళ్లతో కొబ్బరికాయలు, నిమ్మ కాయలు, పసుపు, కుంకుమ, కోడిగ్రుడ్లు, కోళ్లు తీసుకుని పూజారులు, శివసత్తులు, కులస్తులు ఊరేగింపుగా అడవికి బయలుదేరుతారు. ఈ ఐదుగురు బాలలను పాండ వులుగా భావించి వాగు ఒడ్డున ఐదు చెలమలు తీసి ఆ నీటితో వారికి స్నానం చేయించి పసుపు కుంకుమలతో అలంకరించి అడవిలోకి తీసుకెళతారు. సమీపంలోని కంక వనాన్ని మరియు గజస్తంభానికి అవసరమైన పాలకర్రను వేళ్లతో సహా పీకుతారు. ఆ వేళ్లకు పూజారులు తెచ్చిన ఎర్రగుడ్డ, పసుపు, కుంకుమ, నిమ్మకాయలను వేళ్లకు కట్టి పిల్లలు ఐదుగురి చేతికి ఇచ్చి గ్రామంలోని ఆలయ సమీపంలోకి తీసుకువస్తారు. గజస్తంభాన్ని ఆలయ ముఖద్వారానికి ఎదురుగా ప్రత్యేకంగా గద్దెను నిర్మించి ఎర్రమన్నుతో అలికి ముగ్గులు వేసి పసుపు, కుంకుమలు జల్లి పిల్లలతో తీసుకువచ్చిన కంకవనం మరియు పాలకర్రతో చేసిన గజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తారు.

ఊరేగింపు :

ఉత్సవాన్ని ఉపయోగించే ప్రతిమలలో ప్రధాన ప్రతిమ లక్ష్మీదేవరను చింతకర్రతోను, మిగిలిన ప్రతిమ లను పొన్నకర్రతోను తయారు చేస్తారు. ఉత్సవాల సమయంలో వాగులో దొరికే మెతక రంగు రాళ్ళతో మరియు చెట్ల ఇగురులనుండి, కాయలనుండి చిరు మాను జిగురుతో తయారుచేసిన రంగులను వేస్తారు. వీరు ఈ కార్యక్రమాన్ని మంచి శుభదినం చూసుకుని నిర్వహిస్తారు మరియు లక్ష్మీదేవర ఉత్సవాన్ని ప్రతి 15 రోజులకొకసారి గ్రామంలో వర్షాలు, అనారోగ్యం, పంటల కోసం వివిధ కారణాలతో పూజలు నిర్వహించి ఊరే గిస్తారు. చల్వాయిలోనే కాకుండా వెంకటాపూర్, నగరం పల్లె, గుర్రంపేట, బూర్గుపేట, శాపల్లి, ఘణపురం, రొయ్యూరు, సింగారం ప్రాంతాలలో కూడ మేడారం జాతర సమయంలో లక్ష్మీదేవరకు పూజలు నిర్వహించి ప్రదర్శనలు చేస్తారు.

ఆధార గ్రంథాలు :

1) జానపద విజ్ఞానాధ్యయనం - జి.ఎస్.మోహన్.
2) ప్రకాశం జిల్లా జానపద కళారూపాలు - విస్తాలి శంకర్‌రావు.
3) ఈనాడు దినపత్రిక.
4) క్షేత్ర పర్యటన.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

నెల్లూరు జిల్లా గ్రామ దేవతలు – ఉత్సవాలు, జాతరలు

– కాటంగారి బాబు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

దేవతారాధన మన దేశంలో అనాదిగా వస్తున్న ఆచారమే. ఋగ్వేద కాలం నుంచి ఇంద్ర అగ్ని, యమ, వరుణినితో పాటు అతిది అనే స్త్రీ దేవతకు కూడా ప్రాధాన్యం ఉన్న ది. సమాజంలోని వ్యక్తులు తమ ఉనికిని మూలకారకుడైన మానవాతీత మూర్తి ఉన్నాడని విశ్వ శించడం వల్ల దైవ స్వరూపం పైన నమ్మకం ఏర్పడింది. త్రైత్తరీయోపనిషత్తులో కాత్యాయిని పరదేవతగా బావింప బడినది. ముండకోపనిషత్తులో 'కాళీ' 'కరాళి' అనే శబ్దాలు 'దేవి' పరంగా వాడబడ్డాయి. కాబట్టి అతిప్రాచీన వేద వాఙ్మయం స్త్రీ దేవతలకు ప్రాధాన్యం ఇచ్చింది. భారతీయ తత్వాన్ననుసరించి ప్రకృతి స్త్రీ శక్తి కాగా, ప్రకృతికి అతీతమైన తత్వం పురుషుడుగా భావించబడింది. సర్వ విధాల, సర్వ మంగళాలను ఇవ్వగల దేవతీ 'శక్తిదేవి' సర్వచరాచర సృష్టికి ఆధారభూతమైన శక్తి స్వరూపమే సర్వాన్ని నిర్వహిస్తుంది. అనాదిగా స్త్రీకి బాధ్యతలు ఎక్కువ కాబట్టి మాతృస్వామిక విధానం ఏర్పడి సర్వవిధాల కుటుంబ సంరరక్షణకు తోడ్పడే మాతృమూర్తి దేవతా స్థానాన్ని పొంది అందరికి 'స్త్రీ' అంటే దైవీ భావన ఏర్పడింది. కాబట్టి సర్వ విధాల కుటుంబ సంరక్షణకు తోడ్పడే మాతృమూర్తినీ ఉతకృష్టురాలైన మాతృదేవతను మానవుడు ఆరాధించాడు.

గ్రామమయమైన భారతదేశంలో గ్రామాల పరిరక్షణ కోసం గ్రామదేవతలను పూజించే విధానం అనాదిగా వస్తుంది. దుష్టశక్తుల నుండి గ్రామాన్ని రక్షించే వారే గ్రామ దేవతలు ప్రకృతిలో ప్రభవించే అనేక వివత్తులకు ఏదో మహాశక్తియే కారణమని తలచి, ఆ శక్తిని మంత్ర తంత్రాలు, నైవేద్యాల ద్వారా వశం చేసుకోవచ్చని ఊహించి, ఆ రూపాన్ని రాతితోను, చెక్కతోను మలచుకొని పూజించగా గ్రామాల్లో శక్తి విశ్వమాతగా ఆరాధింప బడుతోంది. మధ్యయుగంలోను, ఆధునిక యుగంలోను శక్తి స్వరూపిణి అయిన గ్రామక దేవతల ఆరాధన నిరాటంకంగా కొనసాగుతూనే వున్నది.

జానపదుల మతంలో గ్రామదేవతారాధనకు ప్రత్యేక స్థానం వుంది. నెల్లూరు జిల్లాలో మాతృదేవతకు ప్రధాన స్థానం ఇవ్వబడింది. ఈ ప్రాంతంలో గ్రామ దేవతలను 'దేవీ' 'తాయి'గా పిలుస్తారు. 'తాయి' అనే పదం ప్రక్కన తమిళనాడు ప్రభావంగా వచ్చిందని చెప్పవచ్చు. ఇక్కడ దేవతా విగ్రహ స్వరూపం ఆదిశక్తికి ప్రతీక. ఈ దేవతలు గ్రామంలోని ఎవరో ఒక భక్తునికి కలలో కనిపించిగానీ వ్యక్తుల మీద పూనడం వలనగాని తమ ఉనికిని, కోరికలను వ్యక్తీకరించుకొనం తమ మహాత్మ్యాన్ని గురించి వారి ద్వారా చెప్పించడం వంటి కథలకు ప్రసిద్ధంగా ఉన్నాయి. ఈ దేవతలు జంతుబలులను కోరుతుంటాయి. తన కోరికలను చెల్లించిన వారిని, వారి కుటుంబాలకు ఎల్లప్పుడు అభయహస్తనిస్తుంది. గ్రామంలో కరువు కాటకాలు లేక పాడిపండలు అధికంగా ఉంటాయని, అంటు వ్యాదులు రానివ్వక భూతప్రేతాత్మలు నుండి గ్రామాలను రక్షిస్తూ ప్రజలకు సంతాన ప్రాప్తిని కలిగిస్తూ ఉంటుందని గ్రామీణుల దృఢ విశ్వాసం.

నెల్లూరు జిల్లాలో గ్రామదేవతలు 100 మంది దాకా వెలసి ఉన్నారు. సరిహద్దు దేవతలు, వలస వచ్చిన దేవతలు, గ్రామ నామ దేవతలు, కులదేవతలు, పేరంటాండ్రు, మన ప్రకృతి వ్యవసాయ సంబంధ దేవతలు మొదలైన రీతిగా గ్రామ దేవతలు పూజింపబడుతున్నారు. వీరిలో సరిహద్దుల సంఖ్య అధికంగా ఉంది. వీరేగాక అయ్యగారప్ప, గొలగమూడయ్య, పోతురాజు మొదలైన పురుషదేవతలు కూడా ఉన్నారు.

గ్రామ దేవతలకు సంబంధించిన గుళ్ళు, గోపురాలు,

నెల్లూరు సమీపంలో అధిక సంఖ్యలో నెలకొని ఉన్నాయి. గ్రామ దేవతల ఆలయాలు చిన్నవిగా అతి సామాన్యంగా ఉంటాయి. వీటిలో కొన్నింటికి గోపురాలు ఉండవు. విమానాకారంలో కొన్నింటికి గోపుర నిర్మాణం కానవస్తుంది. కొన్ని దేవాలయాల్లో ప్రతిష్టంపబడిన దేవతా విగ్రహాలు తదితర విగ్రహాలు, మండపాలపై నిర్మించబడిన సింహాది విగ్రహ శిల్పాలు మనవారి శిల్పకళకు నిదర్శనాలు. సామాన్యంగా ఈ గ్రామ దేవతలు ఆలయాలు చతురస్రాకారంలోను, దీర్ఘ చతురస్రాకారంలోను నిర్మింపబడి వున్నాయి. కొన్ని దేవాలయాలలో ప్రజల సౌకర్యార్థము గుళ్ళు చుట్టు గదులు, ఆవరణలో కానవస్తాయి. నాలుగు కర్రలు కాని, బండలను కాని పాతి తాటాకు పందిరి వేసిన చిన్న చిన్న గుళ్ళు కూడా నెల్లూరులో కానవస్తాయి. ఇవి అతి సామాన్యంగా ఉంటాయి.

నెల్లూరు జిల్లా గ్రామ దేవతల పూజా విధానంలో ఇంచుమించు సమ్యాలు కనిపించినా కొన్ని సందర్భాలలో ఆయా దేవతల ప్రాధాన్యాన్ని బట్టి నిత్య పూజలు, కొలువులు సంప్రదాయ బద్ధంగా జరుగుతాయి. ఆది, మంగళ, శుక్రవారాల్లో ఈ దేవతలకు విశేష పూజలు జరుగుతాయి. 'నాగారపమ్మ' వంటి దేవతలకు 'నాగుల చవితి' నాడు ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. పువ్వులు, కర్పూరం, నిమ్మకాయలు, టెంకాయలు, అగరవత్తులు వంటి ముఖ్యమైన పూజా సామాగ్రిలను దేవతలకు అర్పించుకొంటారు. సంవత్సరంలోని ముఖ్యమైన పండుగలనాడు ఈ దేవతలకు బ్రహ్మాండమైన పూజలు జరుగుతాయి. గ్రామంలో అంటు వ్యాధులు రాకుండా దేవతలకు 'అంబళ్ళు' పోసి ఆరాధిస్తారు. చాకలి వాళ్ళు 'జలగండం' నుంచి రక్షణ పొందేందుకు గంగమ్మను పూజిస్తారు. పంటలు బాగా పండాలని మొలకల పున్నమి నాడు దేవతారాధన ప్రత్యేకంగా చేస్తారు.

గ్రామ దేవతలకు నిత్యపూజలే కాకుండా ఆయా దేవతలకు ప్రత్యేకమైన పర్వదినాలలో 'ఉత్సవాలు-జాతరలు' చేయడం అనాదిగా వస్తున్న ఆచారమే. జానపదుల తల్లి స్వరూపరాలైన శక్తి దేవతలను నమ్మి, గ్రామ రక్షణ కోరి ఆయా దేవతలకు సంబంధించిన ఉత్సవాదులు ఏటేటా వైభవంగా నిర్వహిస్తారు. విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా గ్రామీణుల భావాలలో గ్రామ దేవతారాధన విషయమై ఎటువంటి మార్పు లేదు. అందరూ ఒక చోట కలిసి సంపూర్ణమైనటువంటి మానసిక ఆనందంతో ఏ సంప్రదాయాన్ని వదిలిపెట్టకుండా ఈ జాతరలు ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా దేవతారాధన ఒక వైపు చేస్తూ, బలి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దేవతలకు కానుకలర్పిస్తూ ఉండటం కాక వేషాలేసుకొని దేవతల కథలను నీరావేశం ఉట్టిపడేలా వర్ణిస్తూ ఆకర్షణీయంగా నృత్యాలు చేస్తూ ఈ ఉత్సవాలను కడువైభవంగా జరుపుకుంటారు. నెల్లూరు జాతరలో వెంకటగిరి పోలేరమ్మ, కావలి కలుగోళమ్మ, నర్రవాడ వెంగమాంబ, కనువూరు ముత్యాలమ్మ, అల్లూరు పోలేరమ్మ, గొట్టిగుండాల అంకమ్మ మరియు నెల్లూరు జిల్లా తీరప్రాంత గ్రామాలలో బంగారమ్మ చాలా ముఖ్యమైనవి.

గ్రామ దేవతల కథలు కడు రమ్యాలు, ఈ కథలలో వారి అద్భుత రసాభినివేశం వ్యక్తమవుతుంది. పురాణంలోని శివుని పాత్రను గ్రహించి అతనితో పోలేరమ్మను, నక్కను జతపరచి వర్ణించడం, వారి ప్రతాపరుద్రుని ఓరుగల్లునకు వచ్చి రాజుతో విరోధమేర్పరచుకొని అతనిని శిక్షించిన కథకుడు విచిత్రంగా వర్ణింపబడింది. గ్రామ దేవత మహాత్మ్యాన్ని వర్ణించి ప్రజలతో భక్తి భావాన్ని పెంపొందించడమే ఈ కథలలో ముఖ్యోద్దేశం. గ్రామ దేవత శక్తి సంపన్నతకు ఈ కథలు ప్రబల నిదర్శనాలు అంకమ్మ ధర్మబోదానికి తన ప్రభావాన్ని ప్రదర్శించడానికి కొమ్మలేని చెట్టును కాయించి, తాడులేని ఉయ్యాల లూగుతూ తన అద్భుత శక్తిని ప్రదర్శించింది. ఇవి గ్రామీణుల అద్భుత రససంపన్నతకు కథాకల్పనకు ప్రబల నిదర్శనాలు. గ్రామ దేవతలకు సంబంధించిన పాటలెన్నో ప్రచారంలో ఉన్నాయి.

ఉత్సవాలలో, జాతరల్లో మనకు ప్రస్ఫుటంగా కనిపించేవి జానపదుల కళారూపాలు, పగటి వేషాలు, పులి, ఎలుగుబంటి వేషాలు, నాటకాలు, వీధి నాటకాలు, హరికథలు, బుర్రకథలు, బొమ్మలాటలు, నృత్యాలు, నాద్య విశేషాలు వీరదాళ్ళు మొదలైనవెన్నో ఈ సందర్భంగా ఉత్సాహవంతంగా ప్రదర్శింపబడతాయి. భక్తి విషయమై జానపదులకు గల ధృఢమైన అభి ప్రాయాల కారణంగా వారి గ్రామ దేవతలపై సంపూర్ణమైన విశ్వాసమేర్పడి ఆయా భక్తుల జీవితంలో అనుభవ పూర్వకంగా జరిగిన కనివినీ ఎరుగని అపూర్వ సంఘటనలు ఎన్నో వర్ణింపబడ్డాయి. అంకమ్మ, మాంకాళమ్మ, మోపూరమ్మ, చెంగాళమ్మ, జ్వాలాముఖి మొదలగు గ్రామ దేవతలు ప్రదర్శించిన అపూర్వమైన శక్తి ప్రదర్శనాంశాన్ని గ్రామీణులు చక్కగా వర్ణించారు. వాటిలో నిజనిజాలు ఎలా ఉన్నా జానపదులను సన్మార్గంలో నడిపించి వారిలో దైవభక్తిని పెంపొందించడానికి ఈ కథలు, అపూర్వ సంఘ టనలు ఎంతో తోడ్పడుతాయి. మతంలో ప్రధాన భాగమైన దేవతారాధన అధ్యయనం వల్ల మన ప్రాచీన సంప్రదాయాల స్థిరత్వం.

జానపద సాంఘికాచారాలకు సంబంధించిన అనేక అపూర్వమైన అంశాలు, జానపదుల ముగ్ధ భక్తికి ముందు తరాల వారికి సన్మార్గాన్ని ఏర్పరచ డానికి అనుకూలమైన పరిస్థితులు కన్పిస్తాయి. అదే సమయంలో జీవహింస, మూఢ భక్తి వంటి కొన్ని అంశా లను త్యజించినట్లయితే గ్రామ దేవతారాధనలో అన్ని అమూల్యంశాలే అని నిక్కచ్చిగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీయస్.సుందరం
2. జానపద విజ్ఞానాధ్యాయనం - జి.ఎస్. మోహన్
3. నెల్లూరు జిల్లా గ్రామ దేవతలు పరిశీలన - డా॥ పెంచల లక్ష్మమ్మ
4. తెలుగు జానపద గేయ గాథలు - డా॥ నాయిని కృష్ణ కుమారి

❖ ❖ ❖

గుంటూరు జిల్లా సముద్ర తీరప్రాంత – జానపదుల పెండ్లి పాటలు

– డా॥. కొగిత సుభ్భిరెడ్డి, లెక్చరర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, బాపట్ల.

జానపద కళలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, జానపద సాహిత్యం మొ॥ వాటినన్నింటిని కలిపి జానపద విజ్ఞానం అంటారు. జానపద సాహిత్యం దీనిలో ఒకభాగం. జానపదులంటే అనాగరికులు, మొరటువారు, కర్షకులు అనే అభిప్రాయం ఉండేది. జానపదులు నిరక్ష్యరాస్యులైనప్పటికి ప్రస్తుతం వారి జీవిత అనుభవసారాన్ని జానపద విజ్ఞానంగా, పరిశోధనాత్మకంగా అధ్యయనం చేస్తున్నారు. జానపదుల ప్రదర్శన కళల్ని పోషించి పరిరక్షిస్తున్నారు. జానపదుల భాష, సంప్రదాయం, సంస్కృతి విశేషాలను నిశితంగా పరిశోధిస్తున్నారు.

యం.డార్సన్ అనే జానపద విజ్ఞాన పరిశోధకుడు 'జానపద విజ్ఞానం-జానపద జీవితం' అనే గ్రంథంలో 'ఇది గత కాలానికి సంబంధించినది కాదని, వర్తమాన కాలానికి కూడా ప్రతిధ్వని' అని అన్నారు. నిత్యం చైతన్య స్ఫూర్తి ఉన్న జానపద విజ్ఞానం ఆధునిక జీవితానికి ప్రేరణ కలిగిస్తుంది.

జానపద నిర్వచనం :

'జనానాం పదమ్' జనులకు నెలవైంది అని జానపద శబ్దానికి వ్యుత్పత్తి. జనపద సంబంధమైనది జానపదం. జనపదం అంటే పల్లెపట్టు. ఈ పల్లెపట్టుకు సంబంధించిన వారు జానపదులు. కష్ట సుఖాల్లో బావావేశాకు లోనైనప్పుడు వారి గుండెలోతుల్లోంచి అప్రయత్నంగా వెలువడే పాటలే జానపద గేయాలు.

జానపద గేయ లక్షణాలు :

జానపద గేయాలకు ఒక ప్రత్యేకమైన కవి అంటూ లేకపోవడం, గేయ స్వరూపం స్థిరంగా ఉండకపోవడం, రచనాకాలం నిర్ధారణగా తెలియక పోవడం, కేవలం మౌఖిక ప్రచారంతోనే జీవించడం, సులభశైలితో సాగడం, పాడుకోవడానికి వీలుగా ఉండటం, ఆశు రచనలై ఉండటం,పునరావృత్తిని కలిగి ఉండడం, వస్తువు సామాన్య ప్రజలకు పరిమితమైంది కావడం, శృంగారానికి ప్రాధాన్య మివ్వడం అనేవి ప్రత్యేక లక్షణాలుగా చెప్పుకోవచ్చు.

ఆంధ్ర దేశములో అనేక చోట్ల ఈ జానపదాలు వివిధంగా కనిపిస్తాయి. అందునా గుంటూరు జిల్లా సముద్ర తీర ప్రాంతమున ఉన్న అడవిపల్లె, పేరలి, తుమ్మల పాలెం, సూర్యలంక, కప్పలపాలెం, పిన్నబోయినవారి పాలెం మొ॥లైన ప్రాంతాలలో జానపదుల జానపదాలను అందులోను పెండ్లి విషయములో వివిధంగా పాడే పాటలను అందరికి పరిచయం చేయడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

గుంటూరు జిల్లా సముద్ర తీర ప్రాంతం లోని జానపదుల పాటలలో పెండ్లికుమారునికి, పెండ్లి కుమార్తెను అడిగే విషయం దగ్గర నుండి, వారికి నలుగు వేయడానికి అందరినీ పిలవడం, వారికి నలుగు వేసేప్పుడు పాడే పాటలు, పాన్పు మీద పాడే పాటలు, మంగళహారతుల పాటలు, పెండ్లి కుమారుడిని, పెండ్లి కుమార్తెను ఆట పట్టిస్తూ చమత్కారంతో పాడే పాటలు ఇవన్నీ పెండ్లి పాటలక్రిందకే వస్తూంటాయి.

జానపదుల పెండ్లిపాటలలో మొదటిగా పెండ్లి కుమారునికి పిల్లనడగటానికి ఒక చెల్లి - అన్నల మధ్య జరిగిన సంభాషణ ఎంత చక్కగా ఉందో క్రింది పాటలో చూద్దాం.

పాట :

ఆరు నూరు ఆమడ నుండి - అన్న -పెళ్లి అవుతుందని
ఆశతో వస్తిరా అన్నయ్య - నేడు పిల్లనడుగనొస్తి రన్నయ్య
అన్నయ్య బలరామ-యభిమన్యునకు పెళ్లి

కన్యనడుగనొస్తి రన్నయ్య-నేడు పిల్ల నడుగ నొస్తిరన్నయ్య

1. దండాన కోకలైగో - పెట్టెలో సొమ్ములైగో
కట్టుకు పోవమ్మ చెల్లెలా- నీవు పెట్టుకు పోవమ్మ చెల్లెలా ॥2 సార్లు॥
దండాన కోకలొద్దు - పెట్టెలోసొమ్ములొద్దు
పిల్ల నడుగనొస్తిరన్నయ్య నేడు కన్యనడుగనొస్తి రన్నయ్య

2. ఆవులు మందలైగో - లేగలు దూడలైగో
తోలుకు పోవమ్మ చెల్లెలా - నీవు తోలుకు పోవమ్మ చెల్లెలా
ఆవుల మందలొద్దు - లేగ దూడలొద్దు
పిల్ల నడుగనొస్తిరన్నయ్య నేడు కన్య నడుగనొస్తి రన్నయ్య

3. బర్రెల మందలైగో - గొర్రెల మందలైగో
తోలుకు పోవమ్మ చెల్లెలా - నీవు తోలుకు పోవమ్మ చెల్లెలా
బర్రెల మందలొద్దు-గొర్రెల మందలొద్దు
పిల్ల నడుగనొస్తిరన్నయ్య నేడు కన్య నడుగనొస్తి రన్నయ్య

ఈ విధంగా ఎన్నో సాకులు చెప్పిన అన్నయ్యను ఒప్పించి ఆ చెల్లి తన కొడుకుకు పెళ్లి నిశ్చయించుకోని, ఆపెండ్లి ఎలా చేయాలో ఎలాంటి అరుగురు వేయాలో తోరణాలు ఎలా కట్టాలో వివరించే ఈ పాటను చూద్దాం

పాట :

పెళ్లి జేయరే బాలకు- ఓ జనులారా
పెళ్లి జేయరే బాలకు
పెళ్లి జేయరే బాలకిప్పుడిళ్ళుళ్ళు తిరిగిన
రెండు ఘడియలు-వీధిలో ఊరేగు బాల

1. అండ అరుగులు వేయరే - యా బాలలకు
అదుగో ద్వార్ణము గట్టరే "2"
అదిగో ద్వార్ణము - ఎదురు మెరియగా
రెడంభేరి వీధిలో యిక
కొదమ సింహం రథం తోయగా
కోటి సూర్యులు కొలలు బాల "పె"

2. ఇడసి వల్లెటేయరే - యాబాలలకు
ఎగసి గొడుగులు బట్టరే -ఇడసి వల్లెటేయరమ్మ
ఎగసి గొడుగు బట్టరమ్మ
నాయికగా నన్నెలడని - నమ్మలేక తలంబ్రాలు బోసా ॥పె॥

ఈ విధంగా జానపద పాటలు పల్లెల్లో వాడుకలో ఉండేవి, అయితే నేటి యాంత్రిక జీవన విధానంలో పట్టణాలకు ఉద్యోగాల నిమిత్తం ప్రజలు అనేకులు వలసలు పోయి, అచ్చట స్థిరపడడం వల్ల నేడు ఆ జానపద పాటల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కావున ఈ పాటలపై పరిశోధన చేసి, వాటిని పరిశీలించి మరళా వాటికి పూర్వవైభవం తేవడం ఎంతైనా అవసరం.

పై పెళ్లి పాటలో పెళ్లి ఏ విధంగా చేయాలో, ఇంటికి ద్వార్ణము కట్టి, ఎలాంటి అరుగురు వేయాలో, పెండ్లి కుమారున్ని, పెళ్లి కూతురుని ఏలాంటి గొడుగులతో ఊరేగించాలో చక్కగా వర్ణించిన జానపద పాట. పెళ్లి అనేది మానవ జీవితములో ఓ మధురమైన అపురూపమైన ఘట్టం. అలాంటి మధురాతి మధురమైన ఈ ఘట్టంలో పాడే పెండ్లి పాటలు రసమాధుర్యంగా, ఆహ్లాదంగా, ఆనందంగా కన్నుల పండువగా ఉంటాయి. ఈ వేడుకలలో పాడే ప్రతి పాట ఒక ఆపాత మధురమే.

పెళ్లి తంతులో జరిగే ఘట్టములో తర్వాత వధూ వరులను ఒక చోట చేర్చి నలుగు వేయడానికి ఇరుగు పొరుగు వారిని ఎంతో ఆనందంగా సంతోషంగా పెండ్లి కుమారుని తల్లి ఎలా పిలుస్తుందో ఈ క్రింది పాటలో చూద్దాం.

పాట :

రమ్మనవే నలుగుకి
నాతి తోడ వేగమే
చెలి- రమ్మనవే నలుగుకి
1. అల్లెలు, మల్లెలు, మంచి విరజాజులు చెలి ॥2॥

అల్లెలు మల్లెలు అవి కొన్ని తెప్పించి
కొల్లగ నీ పైన జల్లుట జల్లుట

2. పువ్వులు బుక్కయి - పుణ్య శాలి దెచ్చెనే చెలి
పువ్వులు బుక్కయి అవి కొన్ని తెప్పించి
కొల్లగ నీపైన జల్లుట జల్లుట

3. గంధము కస్తూరి - జ్ఞానులు కడు దెచ్చిరి చెలి
గంధము కస్తూరి-అవి కొన్ని
కొల్లగ నీపైన జల్లుట జల్లుట

4. అత్తరు పన్నీరు-అతివలేమో తెచ్చిరి చెలి
అత్తరు పన్నీరు-అవి కొన్ని తెప్పించి
కొల్లగ నీపైన జల్లుట జల్లుట

పై జానపద పాటలో ఒక పెండ్లి ఇంటి కుమారుని తల్లి ఏ విధంగా తన కుమారుని పెండ్లి నలుగుకి ఇరుగు పొరుగు వారిని పిలుస్తుందో నలుగుకి వచ్చేప్పుడు ఒంటరిగా రాకుండా "నాతితోడ వేగమే" అంటూ మరో పేరంటాన్ని తోడుపెట్టుకోని రమ్మని వచ్చేటప్పుడు అల్లెలు మల్లెలు మంచి విరజాజులు, పువ్వులు, పన్నీరు, గంధము, అత్తరు, కస్తూరి కొల్లలుగా తెప్పించి వధూవరుల మీద జల్లున జల్లాలి అని, వారు వాడిన ప్రాసలు, వీనుల విందుగా వారు పాడిన ఈ పాట కడు రమ్యంగా శ్రోతలకే కాక పెరంటానికి వచ్చిన వారందరికి సమ్మోహనాస్త్రంలా ఉంది. జానపదుల రాగం కూడా మనస్సుకు హత్తుకునే విధంగా నలుగు వేడుక కళ్లకు కట్టినట్లుగా వర్ణించిన జానపద పాట ఇది.

పెళ్లి తంతులో నలుగు తరువాత ఘట్టం స్నానం చేయించడం. నలుగులో వేసిన పసుపు , అత్తరు పన్నీరు ఇవన్నీ శుభ్రంగా పోయే విధంగా స్నానం చేయించే టప్పుడు ఏ విధంగా అమ్మలక్కలు చేయిస్తారో మనోహరంగా వర్ణించే ఈ పాటను చూద్దాం

పాట :

వారి తండ్రి సుబ్బారావు-ఘనుడాయినాడే
వారింటి ముందాల వజ్రాల బాయి
వజ్రాల బాయికి వరసేరు పరిచే
ముత్యాల బాయికి మూలేరు పరిచే
రత్నాల బాయికి రాయేరు పరిచే
వాడవాడలక్కలిని పిలిపించినారే
పిలిపించి బిందెలను ఇప్పించినారె
ముక్కెరతొ చెంతాండు- ముత్యాల కడిగే
ముదితలు తోడారె-యాబావి నీళ్లు
అక్కలు తోడారె-సెలయేళ్ల నీళ్లు
చెలులు తోడారె - సెలయేళ్ల నీళ్లు
గుళ్లా కమ్మ నీళ్లు - గుక్కన్న దెచ్చి
బావిలో నీళ్లన్ని - బాటలో దెచ్చి
వెండి కాగుల తోటటి - వేడినీళ్లు దెచ్చి
పైడి కాసుల దోటి - చన్నీళ్లు దొరిపి
పట్టామని పోశారె-పదిచెంబులు
లగ్గామని పోశారె - నాలుగు చెంబులు

పై పాటలో వధూవరులకు నలుగు పెట్టిన తరువాత తలంటు స్నానం చేయించడం పెండ్లిలో ఒక ఘట్టం. ఆ సందర్భంలో బావిని ఎలా నిర్మించారో ఆ బావి దగ్గరకు వాడవాడక్కలని పిలిపించి బిందెలతో నీరు తెప్పించి వెండి కాగులతో పైడి కాగులతో స్నానం చేయించిన ఘట్టం అద్భుతం. ఈ పాట అనుప్రాసలతో అంత్య ప్రాసలతో మనోహరంగా వర్ణించబడింది.

జానపదుల పాటలలో ఉండే సౌందర్యం, వర్ణన, కమనీయం, రమణీయం, అనిర్వచనీయం అందరి హృదయాలలో తనదైన ముద్రవేసి శ్రోతలకు వీనుల విందులు చేసి వారి హృదయాలను పరవసింపచేయగల శక్తి ఒక్క జానపద గేయాలకే సాధ్యం. అందుకే జానపద గేయాలు అజరామరంగా నిలిచి ప్రజల నాలుకలలో ఈ నాటికీ లాస్యం చేస్తున్నాయి. ఇలాంటి జానపద సంపదను కాపాడుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉంది. అపురూప సంపదైన ఈ జానపద గేయాలకు సుస్థిర స్థానం కల్పించి వాటిని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గ్రామదేవత ఉత్సవాలు – ఊరేగింపులు

– ఎం. రమా గీతా దేవి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చీపురుపల్లి, విజయనగరం జిల్లా.

జనపదాలలో నివసించేవారు జానపదులు. ప్రాచీన భారతావని జానపదులు నివసించే ప్రాంతంగా ఉండేది. వారి విజ్ఞాన సర్వస్వం జానపద విజ్ఞానంగా పరిగణిస్తాం. ఇందులో భాగమే గ్రామదేవతల జాతరలు. మన భారతీయ సంస్కృతిలో భాగం ఆగమవిజ్ఞానం. ఆగమశాస్త్ర లక్షణములకు లక్ష్యములు దేవాలయాలు విష్ణ్వాది దేవాలయాలు అసమానతా పరిధి కలిగి ఉండడం చేత సార్వత్రికం, సార్వజనీనం కాలేకపోయినవి. గ్రామదేవతల విషయం అలాకాదు, సార్వజనీనంగా, సార్వత్రికమై పురోభివృద్ధి చెందుచున్నవి. ఇది వర్తమాన జానపద వికాసానికి ఎంతైనా అవసరం. జానపదాభివృద్ధే దేశ సౌభాగ్యం. రాత్రి పగలు రెక్కలుముక్కలు చేసుకుని శ్రమించి పొట్టపోసుకునే గ్రామీణులకు అక్షర సంపాదనా అవకాశం, సౌకర్యంలేని రోజుల్లో తమ పల్లె తప్ప తక్కినవి తెలియని జానపదులకు జ్ఞానాన్ని, శక్తిని ఇచ్చి నడిపించేది గ్రామదేవత.

ప్రకృతికి మారురూపం స్త్రీ. సృష్టికి మూలం స్త్రీ అని, ప్రకృతిని స్త్రీరూపంలో ఆరాధించే ఆచారం ప్రాచీన కాలంనుంచి భారతదేశంలో ఉంది. ప్రాచీన మానవుడు సంచార జీవితాన్ని విడిచి స్థిరనివాసం ఏర్పరుచుకుని, వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించడం జరిగింది. పంటలు బాగా పండడానికి గ్రామంలో పశువులకు ప్రజలకు రోగాలురాకుండా రక్షించడానికి అమ్మవారు శక్తిరూపం దాల్చి గ్రామదేవతగా వెలసింది అని జానపదుల భావన. దుష్టశక్తుల బారినుండి గ్రామాన్ని కాపాడే దేవతకు కోపం వస్తే గ్రామాన్ని నాశనం చేస్తుందనే విశ్వాసం గ్రామీణుల్లో కలదు. ఆమెకు ఆగ్రహం కలుగకుండా జాతరలు చేయడం జరుగుతూ వస్తోంది. జానపదులకు భక్తితోపాటు భయం, విధేయత కన్పిస్తుంది. గ్రామదేవతలు ముఖ్యంగా జానపదుల ఆరాధనా దేవతలు. మాంత్రిక, తాంత్రిక అతీంద్రియ శక్తులేవో ఉంటాయని అవే సుఖ, దుఃఖాలకు మూలమని నమ్మటమే గ్రామదేవతల పుట్టుకకు కారణం. మరణించినవారి ఆత్మ తనకు నివాసస్థలంగానున్న శరీరమును విడిచిపెట్టినా నశించదు. బాహ్యప్రపంచంలో చెట్టు, పుట్టలను, రాయిరప్పలను, జంతువులను ఆశ్రయించి వుంటుంది. అలా ఆశ్రయించిన ఆత్మకు ప్రత్యేకమైన రూపంలేకుండా ఒక రాతినో, కొయ్యనో ఆత్మ చిహ్నంగా నిలబెట్టుకుని భయం, సంభ్రమాలతో దానిని ప్రసన్నం చేసుకునే పద్ధతి ఆదిమ జాతులలో వ్యాపించి ఉన్నది. ఆత్మారాధన దేవతాభావనగా రూపుదాల్చిన తరువాత మొదటి కల్పన తల్లిదేవత.

పోషించే తల్లి పోచమ్మ, పొలిమేర దగ్గర పోలేరమ్మ, మరణాన్ని రాకుండా చేసే మరిడమ్మ మొదలైన వారందరు రక్షించే తల్లిదేవతలు. ఆంధ్రదేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలో రాజాంలో పోలిపల్లి పైడితల్లి, కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి, పలాసలో జామి ఎల్లమ్మతల్లి, అనకాపల్లి నూకాలమ్మ, పాడేరు మోదకొండమ్మ, విజయనగరం ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి ఉత్సవాలు ప్రజల ఐక్యతకు, ఆప్యాయతలకు, అనురాగాలకు, జ్ఞానానికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

విజయనగరం జిల్లా మొరకముడిదాం మండలం బిల్లలవలస గ్రామంలోకూడా పైడితల్లి జాతర ఉత్సవం జరుగుతుంది. మరిడమ్మ, బంగారమ్మ, పైడితల్లి ముగ్గురు దేవతలను ఈసందర్భంగా పూజిస్తారు. ప్రతి ఏడాది వేసవికాలం మొదలైన తరువాత చైత్రవైశాఖ మాసాలలో ఈ ఉత్సవం చేస్తారు. నెల రోజులముందు గ్రామపెద్దలు, గ్రామస్థులు అంతా కలిసి మాట్లాడుకుని పండుగ చాటింపు వేస్తారు. వారాలు జరుపుకుంటారు.

అయితే 12సం॥ కొకసారి గొప్ప వేడుకగా చేస్తారు. అప్పుడు ఘటాలు ఊరేగించడము, జంతువులను బలి ఇవ్వడం, రథాలు ఊరేగించడం వాలకాలు వేయడం మొదలైన ఉత్సవాలు జరుగుతాయి.

చాలా కాలం క్రితం ఊరి పొలిమేరల్లో పడమట దిక్కున ముషిడిక చెట్టుక్రింద మరిడమ్మ అవతరించింది అంటారు. హరిజన పేటలో పుట్టి ఊరిమధ్యలో కొలువైంది పైడితల్లి అమ్మవారు. ఊరి పొలిమేర తూర్పు దిక్కున బంగారమ్మ పుట్టింది అంటారు. వారి ప్రతి రూపంగా వేపకర్రతో చేసిన కొయ్యబొమ్మలను పూజిస్తారు. ఈమధ్యనే బంగారమ్మ, పైడితల్లికి గుడులు కట్టారు.

పూజారులు :

శిష్టదేవతలకు పూజారులున్నట్లే గ్రామదేవతలకు పూజారులుంటారు. గ్రామదేవతల జాతర ఉత్సవాల్లో గ్రామదేవతల పుట్టినింటివారు, మెట్టినింటివారు అయిన కాపు, చాకలి, గొల్ల, కమ్మరి, గవర మొదలగు కులాల వారు పూజారులుగా ఉంటారు. ఒక దేవతకు ఒక వంశమువారే వంశపారంపర్యముగా పూజాలు ఉంటారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి పుట్టింటివారు పూసపాటివారు. ఆ తల్లి పూసపాటి ఇంటి ఆడపడుచు. ఆ వంశీయులే పసుపు కుంకుమలు పట్టుబట్టలు ముందుగా ఇస్తారు. అయితే శ్రీపైడితల్లి సిరిమాను పతివాడ వంశమువారే అధిరోహిస్తారు పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. మొదట అమ్మవారి విగ్రహాన్ని పెద్దచెరువులో నుండి తీసినవారు కనుక ఆ తల్లినుండి ఎల్లప్పుడు సిరిమాను పతివాడ వంశంవారు అధిరోహించాలని వరం పొందారు.

బిల్లలవలస గ్రామంలో కూడా బుద్ధరాజు కుటుంబీకులు అంపోలునుండి హరిజనులు తీసుకు వచ్చిన పైడితల్లి అమ్మవారిని ప్రతిష్ఠించి ఆ తల్లికి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. మాలపల్లిలో పైడమ్మతల్లి వెలసిన తరువాత ఊరిలోకి వస్తుంది. ప్రతిపూజారి ఇంటికి తల్లిగా తిరుగుతుంది. మొదట పూజారులైన బుద్ధరాజు కుటుంబీకులు మూడుబిందెలతో తల్లికి స్నానం చేయిస్తారు. కొత్తచీర కడతారు. బుద్ధరాజువారు, కోట్లవారు ఎలకలవారు, శనపతివారు, పోతలవారు పూజారులుగా వ్యవహరిస్తారు.

భోగం పెట్టుట :

గ్రామదేవతల ఉత్సవాల్లో ఆ ఊరి పెద్దలు, అందరు కలసి పండుగ ఎప్పుడు చేయాలను కుంటున్నారో నిర్ణయించుకుంటారు. ఆ నిర్ణయించిన తారీఖున గ్రామ ఆచారలనుబట్టి పండుగ మొదలవుతుంది. గ్రామ ఆచారంబట్టి 3, 5, 9, 11, 15 ఘటాల వరకు పెడతారు. కొన్ని మట్టివి, కొన్ని ఇత్తడివి ఉంటాయి. వీటిని నియమించబడిన వ్యక్తులచేత ఊళ్ళో మేళతాళాలతో ఊరేగిస్తారు. ప్రతిఇంటివారు ఆ ఘటాలలో బియ్యం, పళ్ళు, కాయలు, పప్పు, డబ్బులు మొదలగునవి వేస్తారు. బియ్యం పప్పుతో పులగం, లేకుంటే కేవలం బియ్యంతో పులిహోర వంటివి చేసి తల్లికి భోగం పెడతారు (ఘటాలు ఊరేగించడంద్వారా వచ్చిన బియ్యాన్ని వండుతారు). వీటితోపాటు తెలగపిండి, మునగాకు కూర, అట్లు, అప్పాలు, బూర్లు, పప్పు, పులుసు మొ॥ వాటితో అన్నాన్ని దేవతముందు పెడతారు. దీన్నే కుంభం అంటారు. ఘటం అని కూడ వ్యవహరిస్తారు. ఈ ఘటాలకు ఊరేగింపుగా ఏర్పాటు వాయిద్యాలతో తిప్పుతారు. తీసుకువచ్చి మరడమ్మ చెట్టుదగ్గర కుప్పగా పోసివేస్తారు. మరడమ్మ, బంగారమ్మ జాతరలు పైడితల్లి జాతరలో భాగంగా చేస్తారు.

అమ్మవారు వెనుక తొమ్మిది ఘటాలు పట్టుకుని ఊరేగింపుగా వెళతారు. అవి 1) బుద్ధరాజు కానేలరాజు వారి ఘటం, 2) బుద్ధరాజు బుచ్చిరాజు ఘటం, 3) పైడితల్లి ఘటం, 4) కూడు ఘటం, 5) పిల్లఘటం (పోతలవారి ఘటం), 6) ఎలకలవారి ఘటం, 7) శనపతి వారి ఘటం, 8) కోట్లవారి ఘటం, 9) జంగిడి (జంగిడిలో అరటిపళ్ళు, కొబ్బరికాయి, పసుపు, కుంకుమ, గాజులు, కాటుక, అద్దం, చీర జాకెట్టు తదితర పూజా సామాగ్రి

పెడతారు). ఒక్క జంగిడిని మాత్రం ప్రతిసంవత్సరం వారాలప్పుడు తిప్పుతారు. అమ్మవారు హరిజనవాడ నుండి బయలుదేరి మొదటి పూజారులు బుద్ధరాజుల ఇంట స్నానంచేసి కొత్తచీర ధరించి మిగతా పూజారులందరి ఇంటికి ఊరేగుతుంది. ఊరంతా ఊరేగుతూ చివర స్నానం కోట్లవారింట చేస్తుంది.

12 సంవత్సరాల కొకమారు చేసే రథోత్సవంలో రథం ఎక్కేది కోట్ల వంశీయులే. రథంమీద ప్రధాన పూజారుల్లాగా ఉంటూ వస్తున్నారు. కొయ్యరథంపైన అడ్డంగా చిన్న కర్రను వేసి దానిమీద కోట్లవారి పూజారిని కూర్చోబెడతారు. కోట్ల సూర్యనారాయణ ప్రస్తుతం పూజారిగా ఉన్నాడు. రథంమీద 5గురు పూజార్లు కూచుంటారు. బుద్ధరాజ వంశీయులు, పోతలవారు, శనిపతివారు, కోట్లవారు, ఎలకలవారు కూర్చుంటారు. పెళ్ళికొడుకులాగా, పెళ్ళి కూతురులాగా మొదలగు వేషం వేస్తారు. పూజారి గొడుగు పట్టుకుని ఏటికర్ర పట్టుకుని (నాగలి పూజకర్ర భూమి దున్నేటప్పుడు ఉపయోగించే కర్ర) కూర్చుంటాడు. అందరు భక్తితో రథంపైకి వేసే పళ్ళు విసురుతూ ఉంటారు. వాటిని ఈ కర్రతో కొడుతూ ఉంటాడు పూజారి. ఏటికర్ర పట్టుకోవడానికి రైతులు పంటలు పండించడానికి ఉపయోగించే నాగలి కర్రను పూజించడం జరుగుతాయి. గ్రామాలలో ఒకే కుటుంబాలవారు, తరతరాలుగా తల్లికి మొదట పూజ చేసినా మిగిలిన గ్రామస్తులందరూ కూడా కులమతాల బేధంలేకుండా ఆ తల్లిని ఎంతో శ్రద్ధ భక్తులతో ఆరాధించడం, తమ గ్రామానికి గ్రామ ప్రజలందరికీ మేలు జరగాలని జాతరలు చేస్తామని కలిసికట్టుగా మొక్కుకుంటారు. గ్రామదేవతారాధన గ్రామీణులలో ఐకమత్యం నెలకొల్పడానికి దోహదం చేస్తుంది.

జాతరలలో బలులు :

మానవ మానవాతీత శక్తులమధ్య సంబంధాన్ని కల్పించేది బలి. ప్రాచీన మానవుడు బలిని ఇవ్వడంలోని ముఖ్యోద్దేశ్యం దేవునితో సంబంధాన్ని పెట్టుకోవాలనే కాని దేవునికి కానుక ఇవ్వడం కాదని "వైట్‌హెడ్" అభిప్రాయం. భగవంతుని దగ్గర నివేదించిన మాంసం, లేదా పండును ఆరగించుటవలన భగవంతుడు సంబంధము పెట్టుకొన్నానని ఆదిమ మానవుడు భావించాడు. 'రాబర్ట్ స్మిత్' అభిప్రాయం.

బలి అనేది గ్రామదేవతల జాతలలో సాధారణంగా కనిపించే ఆచారం. తన కోరికలు తీరాలంటే తల్లి శాంతించాలంటే తొలిరోజుల్లో నరబలులు ఇచ్చేవారు. ఇప్పటి కాలంలో జంతు బలులు కూడా ప్రభుత్వం నిషేధించింది. అయినప్పటికీ జంతువులను బలి ఇచ్చే ఆచారం కొన్ని ప్రాంతాలలో ఉన్నది.

"మెదడు మొదలగు వానిలో ఆత్మ యుండుననే భావనే బలి పశువులు చంపబడినపుడు ఆయా అంగములే ప్రత్యేకముగా దేవతల ఆహారభూతమగుటకు కారణమని డా॥ నాయని కృష్ణకుమారిగారు పేర్కొన్నారు."

బలిలో భాగంగా జరిపే ఉత్సవాలు :

పాలధార :

ఈ పాలధార ఉత్సవాన్ని విజయనగరం జిల్లాలో గాజులరేగ, బిళ్లలవలస, మొయిద, పాలవలస, కెల్ల మొదలగు ఇతర గ్రామాలవారు ఆయా దేవతల సంబరాల్లో భాగంగా జరుపుతారు. ఈ ఉత్సవాన్ని సాయంత్రం ప్రారంభిస్తారు. బిల్లలవలస గ్రామంలో ఈ ఉత్సవ ప్రారంభం అక్కడ పైడితల్లి రథం బయలు దేరడంతో మొదలౌతాయి. పాలధార ఉత్సవంలో మొదట పసుపు, కుంకుమలతో పూజించినటువంటి ఒక గొర్రెను తీసుకు వచ్చి దాని బొడ్డుకింద గంటుపెట్టి, ప్రేగులు బయటకు తీసి దాని పొట్టను మరల యథాప్రకారంగా కట్టేసి అక్కడే ఉంచుతారు. ఊరి బారికలవారు ఈ కార్యక్రమాన్ని చేపడతారు. బయటకు తీసిన ప్రేగులను జంధ్యంవలె (పెడ జంధ్యం) ఎడమవైపు మెడలో ధరిస్తారు. ఈవిధంగా ధరించాక గ్రామపొలిమేరలంతా తిరుగుతాడు. అతని వెనకాల గ్రామంలోవారు కర్రలు కత్తులు శబ్దాలుచేస్తూ

అతనితోపాటే పాలిమేరల్లో తిరుగుతారు. ఈవిధంగా చేస్తే ఆగ్రామంలోకి ఏ దుష్టశక్తి రాదని గ్రామస్థుల నమ్మకం. బారిక గ్రామ పాలిమేరలు తిరిగి ఆ గొర్రె ఉన్నచోటికి వచ్చినంతవరకు ఆ గొర్రె బతికే ఉంటుంది. ఒకవేళ ఆ గొర్రె చనిపోతే దాని ప్రేగులను వేసుకున్న బారిక చని పోతాడని అంటారు. కాని ఈవిధంగా ఏ గ్రామదేవతల ఉత్సవాల్లో జరగలేదంటారు. బారిక గ్రామ పాలిమేరలు తిరిగివచ్చి పెడజంధ్యాలు వేసుకున్న పేగులను తీసి ఆ గొర్రెమెడలో ఎప్పుడు వేస్తాడో అప్పుడే అది చనిపోతుంది. దాన్ని తల్లి ప్రసాదంగా భావించి అతడు దానిని తీసు కుంటాడు. తెల్లని రంగుగల ప్రేగుని పాలధారకి ఉప యోగిస్తారు.

పొట్టబలి :

వరిపొట్ట పొడిచేటప్పుడు (వెన్ను మొలకెత్తేటప్పుడు) ఈ బలి చేస్తారు. కోడి, గొర్రెలను కోసి రక్తంతీసి బియ్యం లేదా అన్నంలో కలిపి వరిచేలు అంతా చల్లుతారు. ఇలా చేయడంవలన దుష్టశక్తులు, చీడపీడలు బారిన పడకుండా పంటలుబాగా పండుతాయని గ్రామీణుల విశ్వాసం.

ఎనుబోతు బలి :

బంగారమ్మ జాతరలో భాగంగా ఎనుపోతుని బలివ్వడం కూడా ఇక్కడ ఆచారంగా వస్తూ ఉంది. సంవత్సరం ముందు ఎనుపోతుని అమ్మవారికి మొక్కుగా చూపించి ఊరిలో వదిలివేస్తారు. ఎనుపోతుని అందరూ పూజిస్తారే తప్ప ఏ వరిచేలో వేసినా దండించరు. సంవత్సరం తరువాత పండుగ చాటింపు వేసాక పండుగ నాడు అమ్మవారి ఎదుట ఎనుపోతును బలిఇచ్చి ఆ మాంసాన్ని పంచుకుంటారు.

మొక్కులు :

గ్రామీణులకు గ్రామ దేవతలకు సంబంధించి కొన్ని నమ్మకాలుంటాయి. ఎవరికైనా అనారోగ్యం కలిగినపుడు దాన్ని తగ్గించమని కోరుకోవడం తగ్గితే పుసుపు కుంకుమ, చీర జాకెట్టు పళ్ళములు, కాటుక, అద్దం, భరిణులు సమర్పించుకుంటారు. కాగడాలు వెలిగించడం, ఘటులు పట్టుకోవడం, అమ్మవారికి కొయ్యిబొమ్మలు చేయించడం, తడిబట్టలతో పొర్లుదండాలు పెట్టడం, కోళ్ళు, కావిళ్ళు ఇవ్వడం ఇలా చాలా ఉంటాయి.

వాలకాలు :

జాతర చాటింపు తరువాత బుర్రకథలు, కోలాటం వంటి వాటితోపాటు రోజుకో వేషం చొప్పున కోతివేషం, ఎలుగు బంటి వేషం, మొగుడు పెళ్ళాల వేషం వంటి వాలకాలు వేయడం జరుగుతుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1) తెలుగు జానపద సాహిత్యం పురాణగాథలు - శ్రీమతి రావి ప్రేమలత
2) నాయని కృష్ణకుమారి - తెలుగు జానపద గేయగాథలు.
3) విజయనగరం జిల్లా గ్రామ దేవతలు - డా॥ శ్రీమతి కడలి అన్నపూర్ణ.
4) బిల్లల వలస గ్రామ పైడితల్లి పూజారుల - కోట్ల సూర్యనారాయణ, కోట్ల బంగారునాయుడు, బుద్ధరాజు కుటుంబీకులు, శివవర్మ.

❖ ❖ ❖

ఉరుముల నృత్యం

– డా॥. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, అనంతపురము.

ఉరుముల నృత్యం అనంతపురము జిల్లాలో ప్రసిద్ధమైంది. జిల్లా సరిహద్దులలోని కర్ణాటక ప్రాంతాలకు విస్తరించింది. మాలల లోని ఒక తెగవారు ఈ కళా రూపాన్ని సంప్రదాయంగా అనుసరిస్తారు. ఉరుములకు వీరణము అనే పేరు కూడా ఉంది. జానపద ప్రదర్శన కళారూపాలలో బృంద నృత్యానికి ఇది చెందుతుంది. ఉరుము వాయిద్యాన్ని వాయిస్తూ, పాడుతూ నృత్యం చేస్తారు.

మేఘగర్జనలకు నెమలి పురివిప్పి నాట్యం చేస్తుంది. ప్రకృతిలో ఇలాంటి దృశ్యాలను చూసి జానపదులు ఉరుములు తయారు చేసి ఉంటారు. ఉరుములు వాయించే సందర్భంలో కుంచెల నృత్యం ఇప్పటికీ చేస్తారు. కుంకాలాట అని కూడా అంటారు. కుంచెలను నెమలీకలతో తయారు చేస్తారు. కుంచెలను రెండు చేతులతో తలమీద ఉంచుకొని నలుగురు వరుసగా నిలబడతారు. ఉరుములతో వారికి పూనకం తెప్పిస్తారు. ఉరుములు ఇలా ప్రకృతి నేపథ్యంగా పుట్టి కళారూపంగా విస్తరించింది. ఇదే అనంతర కాలంలో వైష్ణవ సంప్ర దాయంలో భాగమైంది. విజయనగర కాలంలో మాల దాసరుల వలె, ఉరుముల వారికి ప్రత్యేక గౌరవం, మాన్యాలుండేవి.

ఉరుముల వాయిద్యం పుట్టుక వెనుక ఉన్న ఒక జానపద కథను 'తెలుగు జానపద వాద్యాలు' వ్యాసంలో డా. చిగిచర్ల కృష్ణారెడ్డి గారు వివరించారు. పదమూడోవ శతాబ్దం ఆరంభంలోని మొఘలుల కాలంలో అక్కమ్మ గార్లు అనే నాగదేవతలు నరులకు మహిమలు చూపి దేవాదుల కొండలో(కళ్యాణదుర్గం కొండ) ఉండాలని నిర్ణయించుకొంటారు. ఆ కొండ అనువైనదో కాదో అని పాలకొండలలోని బ్రహ్మముని వద్దకు వెళ్ళి తెలుసు కోవాలనుకొంటారు. అక్కమ్మ గార్ల రాకను తెలుసుకొని బ్రహ్మముని పాలకొండ గుహలో దాక్కొంటాడు. అక్కమ్మ గార్లు ఆ గుహ వద్దకు వెళ్ళి పిలిచినా బ్రహ్మముని బయటకు రాడు. ఆకాశంలో ఉరిమే ఉరుములను వాయిద్యాలతో ధ్వనింపచేసి కొండంతా ప్రతిధ్వనించేలా చేయాలని పూనుకొంటారు. వీటిని వాయించడానికి రెండు మట్టి బొమ్మలుగా సినన్ని సింగరయ్య, కావిరేవు సాయన్నలను అక్కమ్మ గార్లు సృష్టించి జీవం పోసారు. కంచు, మేక చర్మంతో తయారు చేసిన ఉరుము వాయిద్యాన్ని వాయించమన్నారు. మేము అర్హులము కాదని ఆ మట్టి బొమ్మలనుండి తయారైన వారు అనగా నారాయణ మహిమతో జనించిన మీరు ఉరుములను వాయించాలని అక్కమ్మగార్లు అన్నారు. మాలలైన మిమ్మల్ని నా భక్తులు ఆదరిస్తారని అక్కమ్మ గార్లు అభయమిచ్చారు. వారి ఉరుముల వాయిద్యానికి పాలకొండలు ఊయలలా ఊగాయి. ఉరుముల శబ్దాలతో ప్రతిధ్వనించాయి. ఆ ఓంకార నాద శబ్దానికి బ్రహ్మముని బయటకు వచ్చి పంచాంగం చూసి స్థల విషయం తెలిపి, ఉరుముల కళాకారులను ఆశీర్వాదం చేసాడు. మాలలైన ఉరుము వాయిద్యకారులు అనంత రకాలంలో అక్కమ్మగార్ల మహిమలు చెబుతూ, వృత్తి సంప్రదాయం పాటిస్తూ వస్తున్నారు. ఈ కథ ఆధారంగా చూస్తే వైష్ణవ సంప్రదాయంలో భాగంగా ఉరుము వాయిద్యకారులు ప్రారంభమైనట్టు కనిపిస్తుంది. ఈ వాయిద్య కారుల పేర్లు, సంప్రదాయాలు వైష్ణవంతో ముడిపడి ఉన్నాయి.

బుక్కపట్నం మండలం, సిద్ధరామపురం గ్రామంలోని ఉరుముల కళా సంప్రదాయం వారసత్వంగా కొన సాగిస్తున్న సత్యం అనే కళాకారుడు తెలిపిన మరో

ఇతివృత్తం కూడా ఉరుముల వారికి ఉన్న వైష్ణవ సంబంధం తెలుపుతుంది. విజయనగరంలో శైవుల దాడులలో అనేకమంది దాస భక్తులు, ఉరుముల వారు చనిపోయారు. బైకూరి కంటకరాజు ఈ మారణహోమం కొనసాగించాడు. ఒక రోజున రాచవీధిలో ఉరుము కొట్టుకొంటూ నారాయణ భక్తుడు రాగా అతని మెడ నరికి వేసారు. తల ఎగిరి ఆదిశేషునిపై పవళించిన విష్ణుమూర్తి పాదల చెంత పడింది. విష్ణుమూర్తి తిరిగి దాసునికి ప్రాణం పోసి నిలిపాడు. ఆ దాసరి వారసులమే ఈ వృత్తిలో ఉన్నామని ఉరుముల కాళాకారుడు సత్యం తెలిపాడు. వీటిని బట్టి వైష్ణవ సంప్రదాయంలో ఈ ఉరుములకు సంబంధం ఉందని తెలుస్తుంది. తరువాత కాలంలో జీవనోపాధికై ఇతర ఆలయాలకు, కార్యాలకు కూడా వీరు కొనసాగుతూ వస్తున్నారు.

ఉరుము వాయిద్యం కంచుతో గుండ్రంగా డ్రమ్ములా నిర్మాణం చేసి, ఇరువైపులా మేకచర్మంతో బిగిస్తారు. అందంగా అలంకరిస్తారు. కుడి భుజం మీదుగా తాడుతో వేలాడుతూ, పొట్టపై ఎడమవైపుగా ఉరుమును వాల్చుకొని ఉంటారు. ఎడమచేతితో కదురు పుల్లతో బూర్.. బూర్.. బూర్ అని పైకి, కిందికి లయాత్మకంగా గీస్తూ ఉరుములా శబ్దం ధ్వనింప చేస్తారు. కుడిచేతిలోని పుల్లతో డబు, డబు, డబు అని కొడుతుంటారు. ఉరుమువలే గుండెజలదరించేలా శబ్దం వెలువడుతుంది.

తలకు రుమాలు చుట్టుకొని, బండారు, కుంకుమ నామం పెట్టుకొని, ఎర్రని,పచ్చని శాలువలు భుజాలపై వేసుకొని, మెడలో కాసులదండ, కాళ్ళకు పట్టీలతో ఇద్దరు మొదలు లేదా ఐదారు మంది గుంపుగా వాయిస్తారు.

గంగమ్మ దేవతల వద్ద ప్రతి మంగళవారం మేలుకొలుపు పాటలు, అమ్మవారి కథాగేయాలు పాడతారు.

ఒక గంగ మేలుకొలుపు పాట ఈ విధంగా ఉంది.

మేలుకొనవే వో మేలుకొనవే
అమ్మనీవు పుట్టక ముందేనాడుగా
యిగమూ లేదూ జగమూ లేదు
... మే...

అమ్మ మచ్చు మాయల వో గంగినీవూ
పీనిగీలు తినే పిశాచివో
... మే....

సామి గంగ లేని వో తానమేలేదు
గంగలేని వో జలకమ్మే లేదు
... మే...

సామీ నీవు పుట్టకముందే నాడూ
నరుడు లేడు నారాయనుడే లేడు
... మే...

యిష్టుడు వో యీసురుడు లేడు
ముప్పది కోట్ల వో మునులే లేరూ
... మే....

డెబ్బది కోట్ల వో దేవతలే లేరు
అమ్మపాప జాతి నలవీర గంగవూ
... మే...

దావలిడ నేవో ఆదిశక్తి దావలిడలే.

(జానపద నృత్య కళ - డా. చిగిచర్ల కృష్ణారెడ్డి, పుట-77)

... ఇలా లయ బద్ధంగా గేయం సాగుతుంది.

అక్కమ్మ గార్లు, శ్రీ రాజుల గుళ్ళు, వీర తిమ్మయ్య, వీర నారాయణ స్వామి, పోతలయ్య, కాటమయ్య, బొమ్మయ్య, కాటమయ్య, చల్లా పరమ్మ గుళ్ళలో పూజా, ఉత్సవ కార్యక్రమాలలో ఉరుములు వాయిస్తారు. పై ఆలయాలలో పూజారులకు పూనకం తీసుకరావడానికి ఉరుములను ప్రధానంగా వినియోగిస్తారు.

మేలుకొలుపు పాటలలో కుడిచేతిపుల్ల వాయిస్తారు. నృత్యంలో రెండు వైపులా వాయిస్తారు. గుండ్రాకారంగా ఉంటూ రెండుకాళ్ళను పెనవేసుకొని, శరీరంమంతా ఊపుతూ ఎగురుతూ నృత్యం చేస్తారు. సరిసంఖ్యలో ఎదురెదురుగా అటు ఇటు తిరుగుతూ, తల అటు ఇటు తిప్పుతూ నృత్యం చేస్తారు. మొదట తెలిపిన కుంచెల నృత్యం వీరావేశంతో సాగుతుంది.

వీరి మంగళహారతి గేయంలో సుబ్బారావు పేట గంగమ్మ, పెదకోట్ల చౌడమ్మ, ముష్టూరి నలకాటమయ్య, చిల్లారి నలకాటమయ్య, దాదులూరి పోతలయ్య, మైసూరి మిడిమాలదేవత, నసనకోట ముత్యాలమ్మ, బుక్కచర్ల నల్లాలమ్మ, కదిరి నరసింహా, ఏడుకొండల వెంకటేషుడు, దిగువ తిరువతి గోవిందరాజులు, అలివేలుమంగ, బీబి నామనాంచారి, వీర నారాయణ స్వామి, పసిబాలనారన్న, మగుడుపల్లి బయన్న, తాటిచెర్ల పెద్దయ్య, చంద్రగుత్తాలమ్మ, మేటకోర్ల పెద్దమ్మ, పోతలయ్య, ఆది శక్తి గంగ తదితర దేవతలను స్తుతించడం ఉంది.

అనంతపురము జిల్లాలో సనప, తోపుదుర్తి, గుంజేపల్లి, ముష్టూరు, సిద్ధరామపురం, గూగుడు, మాదాపురం తదితర అనేక గ్రామాలలో వీరికి కేటాయించిన గుడికట్టు ప్రకారం ఆయా ఆలయాలకు అనుబంధంగా ఉంటారు. కేవలం గుళ్ళకు అనుబంధంగానే కాకుండా ఆయా గ్రామాలలో ఇంటి కాపులున్న గ్రామాలలో కథలను కూడా గానం చేస్తారు. ఒకో కథ రెండు మూడు రాత్రులు సాగుతుంది.

అక్కమ్మగార్ల కథ, చెన్నకేశవుని కథ, ఎరికలమ్మ కథ, రాజుల స్వామి కథ, పడుగు నాగులమ్మ కథ ఇలా పన్నెండు కథలను ఉరుముల వారు కథాగేయాలుగా గానం చేస్తారు. ఇందులో సిద్ధరామపురం ఉరుము కళాకారుడు సత్యం చెప్పిన పడుగు నాగులమ్మ అనే వీరకథను పరిశీలిద్దాం.

"పందలకుంట సిద్ధయ్యనాయుడు ఒక పాలేగారు. అంతకు మించి గొప్ప మాంత్రికుడు. తన మాయలు, మంత్రాలతో ప్రజలను బయపెట్టెవాడు. చివరకు ఆ దుర్మార్గుడి వల్ల స్త్రీల మాన ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయింది.

నల్లజోడుపల్లెలో నల్లజోడు శిరన్న, కామలాదేవికి చాలా కాలంగా సంతానంలేదు. ఒక్కగానొక్క సంతానం కోసం వారు ఎన్నో ప్రయాసలు పడ్డారు. నల్లజోడుపల్లి కనికిలి కొండ అక్కమ్మగార్ల పుణ్యాన వారికి జోడు సంతానం కలిగారు. వారే పడిగు నాగులమ్మ, గొడుగు నాగులయ్యలు. తమ పిల్లలను ఎంతో అల్లారు ముద్దుగా పోషించుకొన్నారు. కనికిలి కొండ అక్కమ్మ గార్ల మహత్యం ఆనోట ఈనోట విని అక్కమ్మ గార్ల అంతు చూడాలని సిద్ధయ్య వెళ్తాడు. పెళ్లీడు వచ్చిన పడిగు నాగులమ్మ అక్కమ్మ గార్లకు సేవచేస్తుంటుంది. నాగులమ్మ సిద్ధయ్య కంటబడింది. ఎలాగైనా అమెను వశపరచుకోవడానికి సిద్ధయ్య పన్నాగం పన్నుతాడు. చివరకు తన మంత్రశక్తితో స్వాధీనం చేసుకొని తన పందలకుంట పాళేనికి నాగులమ్మను తీసుకెళ్తాడు. నాగులమ్మ లొంగలేదని చిత్ర హింసలు పెడతాడు. నాగులమ్మను మంత్రాల మరిగట్టు పై కూర్చో పెట్టి మంత్ర, తంత్రాలతో వశపరుచుకోవాలని చూస్తాడు.

అక్కమ్మ గార్లు పార్వతీ పరమేశ్వరుల రూపంలో నాగులమ్మను కాపాడాలని వస్తారు. పార్వతీదేవి సిద్ధయ్య కూతురు లింగేశ్వరి రూపంలో మంత్రాల మరిగట్టుకు చేరుతుంది. నాగులమ్మ సోదరుడు నాగులయ్య నన్ను చెర పట్టడానికి పగబట్టాడానికి వస్తున్నాడని సిద్ధయ్యకు చెబుతుంది. సిద్ధయ్యకు మంత్రంపై నిలకడ తప్పుతుంది. అదే సమయంలో మరోవైపు పరమేశ్వరుడు సిద్ధయ్య రూపంలో కోటలోని సిద్ధయ్య కూతురు లింగేశ్వరి వద్దకు వెళ్తాడు. ఇక అన్ని మంత్ర తంత్రాలు వదిలేస్తానని, నాగులయ్య అనే రూపవంతునితో నీకు వివాహం చేస్తానని సిద్ధయ్య రూపంలోని పరమేశ్వరుడు చెబుతాడు. తండ్రి మాటకు లింగేశ్వరి సరే అన్నది. కోటలోని కాళీకామాత ఆలయంలోని రెండు గండదీపాలను ఆర్పేయమని మాయా రూపంలోని పరమేశ్వరుడు అంటాడు. లింగేశ్వరి సొరంగ మార్గంలో వెళ్ళి కాళీకామాత ఆలయంలో దీపాలు ఆర్పివేస్తుంది. దీంతో సిద్ధయ్య శక్తి పోతుంది. మంత్రాల మరికట్టు వద్ద సిద్ధయ్య శక్తిహీనుడైపోతాడు. పార్వతీ పరమేశ్వరులు మారువేషాలలో ఈ విధంగా సిద్ధయ్య నుండి నాగులమ్మను కాపాడుతారు. నాగులమ్మ వీర

సింహరూపం దాల్చి కనికిని కొండ అక్కమ్మ గార్ల కొండ లోని కలుబరిగెకి చేరుతుంది.

జరిగిన వ్యవహారమంతా సిద్దయ్య తెలిసుకొని సరైన సమయం కోసం వేచి ఉంటాడు. సింహా రూపంలోని నాగులమ్మపై సిద్దయ్య పగపడతాడు. నాగులమ్మ అన్న నాగులయ్య తన చెల్లెలు కోసం దేశదేశాలు, అడవుల వెంబడి వెతుకుతుంటాడు. సిద్దయ్య మనుషులు నాగులయ్యను గుర్తించి అడవిలో దాడి చేస్తారు. చని పోయాడని వదిలేస్తారు. కానీ కొన ఊపిరితో నాగులయ్య బతికే ఉంటాడు. వీరఓబనపల్లె దేవిరెడ్డి పెద్దిరెడ్డి అతని తలారులతో అడవికి వెళ్ళి ఉంటాడు. కొన ఊపిరితో ఉన్న నాగులయ్యను రెడ్డి తన ఇంటికి తీసుకొచ్చి కాపాడతాడు. నాగులయ్యకు యుద్ధవిద్యలు నేర్పిస్తాడు.

సింహ రూపంలోని నాగులమ్మను చంపాలని సిద్దయ్య నిర్ణయించుకుంటాడు. తన శక్తి అందుకు చాలదని గుర్తిస్తాడు. చుట్టుపక్కల పాళే గాళ్ళకు కబురు పంపుతాడు. కనిగిని కొండలోని సింహాన్ని చంపిన వారికి తన పాళేంలో సగం, తన కుమార్తె లింగేశ్వరినిచ్చి పెళ్ళి చేస్తానని సిద్దయ్య ప్రకటిస్తాడు.

వీరఓబనపల్లె పెద్దిరెడ్డికి సిద్దయ్య కబురు అందు తుంది. అక్కమ్మ గార్ల కొండల్లోని సింహమే నాగులమ్మను తినేసింటాదనే వీరు కూడా భావిస్తుంటారు. ఆ సింహాన్ని నాగులయ్య సంహరిస్తాడని పెద్దిరెడ్డి ప్రకటిస్తాడు.

నాగులయ్య వీర సింహాన్ని ఎదుర్కొంటాడు. ఆ వీరసింహం రూపంలో తన చెల్లెలు ఉందని తెలియదు. తన అన్న చేతి కత్తిదెబ్బకు సింహ రూపంలో ఉన్న నాగులమ్మ పడిపోతుంది. రక్తం మడుగుల్లో నుండి నాగులమ్మ నిజరూపం పొంది సిద్దయ్య చేసిన అన్యాయం గురించి తన అన్నకు చెబుతుంది.

నాగులయ్య, పెద్దిరెడ్డిలు పందులకుంట సిద్దయ్య పాళెం చుట్టుముట్టి బంధించి నాగులమ్మ వద్దకు తెస్తారు. ఆమె చేతిలోనే సిద్దయ్య ప్రాణాలు పోతాయి. తర్వాత నాగులమ్మ కనిగిలి కొండలోని అక్కమ్మగార్ల వద్ద రాతి మడుగులో తెప్పలా నిలిచిపోతుంది. ఒకరకమైన పచ్చని గడ్డితో ఇప్పటికీ ఆ తెప్ప నీటిలో మునగకుండా తేలుకొనే ఉంది".

ప్రతిసంవత్సరం అనంతపురము జిల్లా, ఓ.డి.సి మండలం, కనికిలి కొండ సమీపాన నల్లజోడుపల్లె, దొన్ని కోటవారిపల్లె, వీరవోబనవారిపల్లి తదితర గ్రామాల వారు నాగులమ్మను వీరవనితగా గౌరవిస్తూ పూజలు చేస్తారు. తరతరాలలుగా నాగులమ్మను నేటికీ స్మరించుకోంటారు. నల్లజోడుపల్లి అక్కమ్మ గార్ల పూజ సందర్భంగా, సిద్ద రామపురం ఉరుముల కళాకారులు పాడే పద్యంగా ఈ కథ సాగుతుంది. ఒక వీరగాథలా సాగే ఈ కథను గమనిస్తే మంత్రాల సిద్దయ్య చేతిలో బందియై పోరాడిన నాగులమ్మ వీరవనితగా కనిపిస్తుంది. నాగులమ్మ వంశీ కులు, అయా కాపులు, భక్తులు తమకు సంబంధించిన కథలను ప్రత్యేకంగా ఉరుముల కళాకారులతో చెప్పించు కొంటారు.

చెన్నకేశవస్వామి కథను అన్ని వర్గాలవారు ఉరుముల కళాకారులతో చెప్పించుకొంటారు. అలనాటి వైష్ణవ మత విస్తరణ, ప్రచారంలో భాగంగా దాసరుల వ్యవస్థ లాగా, ఉరుముల కళారూపం కూడా సాంస్కృతికంగా కొన సాగిందని తెలుస్తుంది. ఈ విషయమై మరింత అధ్య యనం జరగాలి.

కొద్దిమంది మాత్రమే ఉరుముల కళాకారులు ఇప్పటికీ అనంతపురము జిల్లాలోని వివిధ గ్రామాలలో ఉన్నారు. వారికి సరైన ప్రోత్సాహం ఇవ్వవలసి ఉంది. వారి వద్ద నుండి కథాగేయాలు, కథలు సేకరించి భద్రపరచవలసి ఉంది. అలనాటి సాంఘీక, సాంస్కృతిక, భాషా చరిత్ర నిర్మాణానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి.

ఆధారాలు : 1. జానపద నృత్యకళ - డా॥చిగిచర్ల కృష్ణారెడ్డి. (ప్రచురణ:1989)

ఆదివాసి పద్మాల్‌పురి కాకో దేవత ఉత్సవాలు

– సంతోష కుమార్ ముత్తినేని, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మంచిర్యాల.

ఈ ఆలయం ఉమ్మడి ఆదిలాబాద్ నేటి మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం, గుడిరేవు గ్రామంలో ఉంది. ఈ గ్రామ సమీపంలోని గోదావరి తీరాన పద్మాల్ పురి కాకో దేవాలయం ఉంది. గిరిజన గోండుల కొంగు బంగారం ఈ దేవత. ఇది

పూర్వకాలంలో నిర్మించబడింది. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక ఆలయం ఇది అని చెబుతారు. ప్రస్తుతం ఈ దేవాలయం వరదల తాకిడికి శిథిలమై పోయింది. ప్రస్తుతం అక్కడే చెట్టు క్రింద విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పద్మాల్‌పురి కాకో దేవతా ఉత్సవాలు ప్రతి సంవత్సరం జరుగుతాయి. దసరా తరువాత వచ్చే పౌర్ణమి నుండి దీపావళి వరకు ఆధ్యాత్మిక సంబరాలు కొనసాగుతాయి.

ఈ రోజులలో గోండు ప్రజలు వివిధ ప్రాంతాల నుండి తరలి వస్తుంటారు. ఒకప్పుడు ఎడ్లబండ్ల ద్వారా వచ్చేవారు. ఇప్పుడు వివిధ వాహనాల ద్వారా చేరు కుంటారు. ఈ ఉత్సవాలకి కుటుంబ సభ్యులందరు వస్తారు.

పూజా విధానం :

వచ్చిన వారు నేరుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఆ తరువాత పద్మాల్‌పురి అమ్మవారు చెంతకు చేరుకుంటారు. అందరూ క్రొత్త బట్టలు ధరిస్తారు. రకరకాల పిండి వంటలు తయారు చేస్తారు. అక్కడే ఆలయం వద్ద ఉన్న రోలులో పప్పు ధాన్యాలతో తయారు చేస్తారు. అమ్మవారికి వారుచేసిన అప్పాలు, మేక మాంసం నైవేద్యంగా సమర్పిస్తారు.

గిరిజన గోండు జాతిలోని అన్ని దేవతలకు తల్లి ఈ పద్మాల్‌పురి కాకో అమ్మవారు. వారి నివాస ప్రాంతాలలో దండారి పండగ పూజలు నిర్వహించి తరువాత పద్మాల్ పురి అమ్మవారిని దర్శించుకుంటారు.

కొత్త కోడళ్ళను పరిచయం చేయుట :

ఈ సందర్భంగా తమ కొత్త కోడళ్ళను అమ్మవారికి పరిచయం చేస్తారు. వంశాభివృద్ధికి కరుణ చూపాలని వేడుకుంటారు. నూతన దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి మొక్కుల తరువాత జరిగే గుస్సాడి ఉత్సవాల్లో నూతన వధూ-వరులు ఉత్సాహంగా పాల్గొంటారు.

గుస్సాడి నృత్యాలు :

ఆదిమ జాతుల నృత్యములు జానపద నృత్యములకు ఆధారమని, జానపద నృత్యములు శాస్త్రీయ నృత్యము లకు పునాదులని Prajesh Banerji గారి అభిప్రాయం.

గోండు నృత్యాలలో సామూహిక ధర్మం ప్రధానమైనది. మాటకన్నా, పాటకన్నా, నృత్యం ప్రధానమైంది. అది మానవుని కాలములో బావాభివ్యక్తికి మాధ్యమముగా రూపుదాల్చిన కళారూపం నృత్యం. ఇదే మొట్టమొదటి కళారూపం. గుస్సాడి నృత్యం సందర్భంగా పాడే గీతాలు క్రింది విధంగా ఉంటాయి.

గుస్సాడి పాట :

ఏత్మ వాతా దాద ఏత్మ వాతర్మ
బడె దేఱున ఏత్మ వాత
బాను కియనా దాద బాను కియనారో
ఏత్మ సారుదా బాను కియానా
గుసాడి వాతర దాద
గుస్సాడి వాతరో
బాడె నటులన గుసాడి వాతరో
గుస్సాడి వాతరో దాద గుసాడి వాతరో

బహన కియన దాద బహనుకియాన

.....

పద్మాల్‌పురి కాకో ఆలయ ఆవరణలో గుస్సాడి నృత్యాలు ఎంతో అలరిస్తాయి. ఈ సంబరాల్లో సాంప్ర దాయ వాయిద్యాలను ఉపయోగిస్తారు. గుస్సాడి వేషంలో ఉన్నవారిని భక్తి ప్రపత్తులతో కొలవడం వారి ఆచారం. అడవి బిడ్డల ఆటపాటలతో గోదావరి మురిసిపోతుంది. ఈ పక్షం రోజుల వేలాదిగా తరలివస్తున్న గోండు బిడ్డలతో సమీప గుడిరేవు గ్రామం పులకించి పోతుంది. గోండుల ఆది గురువు యౌదాన్ ఆత్మ ప్రతి రూపాన్ని ఏత్మపేన్, అకాడిపేన్, గుస్సాడిపేన్ అని వివిధ పేర్లతో పిలుచు కుంటారు. పద్మాల్‌పురి కాకో ఉత్సవాలలో ఈ దేవుళ్ళ వేషాలు కట్టి ఎంతో పవిత్రమైన దీక్షలతో నృత్యాలు చేస్తారు. ఆదిమ కాలం నుంచి తమ సంస్కృతిని పరిరక్షించుకుంటూ ఇంకా నగరిక ప్రపంచానికి దూరంగా అడవుల్లో నివసిస్తూ ఆదిమ సంస్కృతిని పాటిస్తున్నారు.

వేషధారణ :

గోండులు ఎంతో భక్తి భావంతో కఠిన నియమాలు పాటస్తూ నేలపై పడుకుంటారు. కాళ్ళకు చెప్పులు కూడా ధరించక పవిత్ర దీక్షాపరులుగా ఉంటారు. వీరి శరీర మంతా బూడిద, మసి మొదలైనవి పూస్తారు. శరీరమంతా నల్లని, ఎర్రని బొట్లను, కాళ్ళకు, చేతులకు సున్నంతో దట్టమైన తెల్లని చారలు గీసి ఉంటాయి. జంతు చర్మం లేదా నారతో చేయబడిన గడ్డాలు, మీసాలు అలంకరించు కుంటారు. అడవిలో దొరికే రకరకాల పూసలు, విత్తనాలతో చేయబడిన గొలుసులను మెడలోనూ, కాళ్లకు ధరిస్తారు. నడుముచుట్టూ మూడు నుండి నాలుగు గజ్జెలు ధరిస్తారు. మేక లేదా జింక చర్మాన్ని ఎడమ భుజానికి వేసుకుంటారు. కుడి చేతిలో రెండు అడుగుల పొడవు ఉండే పవిత్రమైన "రోకల్" ఉంటుంది. తలకు వెదురుతో చేయబడిన వృత్తాకారంలో నెమలి ఈకలు వరుసగా పేర్చి రూపొం దించిన టోపి ధరిస్తారు.

వాయిద్యాలు :

ఈ ఉత్సవాలలో వివిధ రకాల వాయిద్యాలను ఉపయోగిస్తారు. ప్రతి వాయిద్యం ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. డప్పు, తుడుము, పిప్రే, బాకా, తప్పెట మొదలైనవి వీరు వాడే సంగీత వాయిద్యాలు. ఈ పరికరాలను గోండులు పరమ పవిత్రంగా భావిస్తారు. నాట్య ఆరంభానికి ముందు వీటికి పూజ చేస్తారు.

గోండు భాషలో గుస్సాడి అంటే "అల్లరి" అని అర్థం. పద్మాల్‌పురి కాకో ఆలయం గోదావరి తీరాన ఉండటంతో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. గోదావరి ఒడ్డున పచ్చని పొలాలు, ప్రకృతి రమణీయంగా ఉం టుంది. రాత్రిపూట అందరూ ఒకచోట నెగడి కాగుతారు. ఈ దేవాలయ ప్రాంతాన్ని గుడిరేవు గ్రామ పరిసర ప్రజలు "జల్‌జావర" అని పిలుస్తారు. ఈ ఆలయం గోదావరి తీరాన ఉంది. దీని ప్రక్కనే గోదావరిలోకి వెళ్ళడానికి దారి (రేవు) ఉంది. ఈ దారి ద్వారానే గోదావరి అవతలి జిల్లా జగిత్యాల గ్రామాలకు రాకపోకలు సాగించేవారు. గుడి ప్రక్కన రేవు ఉండటంచే ఈ గ్రామాన్ని గుడిరేవుగా పిలిచారు.

నాది గుడిరేవు గ్రామమే. నా చిన్నప్పటినుండి గోండు గుస్సాడి వేషధారణ ఆలయ పరిసరాలలో చూస్తున్నాను. గోండులు "రామ్ రామ్" అని పలకరించుకుంటారు. వీడ్కోలు సమయంలోనూ "రామ్ రామ్" చెప్పుకుంటారు.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. గిరిజన సాహిత్యం - ఆచార్య ఎం. గోనా నాయక్

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద బాల సాహిత్యం – అద్భుత కథలు

– జి.చక్రపాణి, తెలుగు పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

జానపద సాహిత్యంలో ఒక విభాగంగా బాలసాహిత్యం వెలుగొందుతూ వచ్చింది. అది కాలక్రమేణా అభివృద్ధి చెందుతూ నేడు ప్రత్యేకంగా బాలసాహిత్యంగా రూపు దిద్దుకుంది. జానవద బాల సాహిత్యం లోని డా.యం.హరికిషన్ సేకరించిన కొన్ని అద్భుత కథల గురించి నేను ప్రస్తావిస్తాను.

తరతరాలుగా ఒకరి నుండి మరొకరికి మౌఖికంగా సంక్రమిస్తున్న జానపద బాల సాహిత్యం ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో మరుగున పడిపోతుందని చెప్పడంలో సందేహం లేదు. బాలసాహిత్యంలో ఎనలేని కృషి చేస్తున్న డాక్టర్ యం.హరికిషన్ గారు కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాలన్నీ తిరిగి వాటిని పిల్లలచేత సేకరించి "పిల్లలు చెప్పిన కథలు"అనే సీరీస్‌గా "కిర్రు కిర్రు లొడ్డప్పా, ఠింగురుబిళ్ళ, నక్కబావ-పిల్లిబావ, చిలక ముక్కు ఊడిపాయ, నలుగురు మూర్తులు, ఒకటి తిందునా... రెండు తిందునా...."లాంటి వైవిధ్యభరితమైన శీర్షికలతో చాలా సంకలనాలను వెలువరించారు. ఇలా జానపద బాల సాహిత్యాన్ని జనబాహుళ్యానికి పరిచయం చేసి మరుగున పడకుండా కాపాడగలిగారని చెప్పవచ్చు.

దేవతలు, రాక్షసులు, మాంత్రికశక్తి ప్రదర్శనలు, భయానక సంఘటనలు అద్భుత కథల్లోని ప్రధానాంశాలు. జానపద సాహిత్యంలో ఇలాంటి కథలు ఎక్కువ. ఇవి అద్భుతరసంతో పాటు వినోదం కలిగించి పిల్లలను నిద్రాణ స్వభావం నుండి మేల్కొలుపుతాయని చెప్పవచ్చు.

జానపద బాలసాహిత్యంలో అవ్వలు తాతలు ఇప్పటికీ చెప్పే కథ "రింగురు బిళ్ళ". ఈ జానపద కథలో అద్భుత మేంటంటే రింగురు బిళ్ళ అని అనగానే ఎదుటివారు కింద పడి మరణించడం.

తల్లిదండ్రులు లేని మనవడిని పెంచిన అవ్వ బడి ఈడు రాగానే బాగా చదువుకోమని బడకి పంపుతుంది. అక్కడ వాన్ని చూసిన పిల్లలంతా వాడు లావుగా ఉండడంతో దుబ్బోడొచ్చాడు దుబ్బోడొచ్చాడని ఒకటే ఎగతాళి చేయసాగారు. మరుసటి రోజు నుండి నేను బడికి పోనని ఏడ్చుకుంటూ మొండికేస్తాడు. అవ్వ చీర కొంగుతో కళ్ళనీళ్ళు తుడుస్తూ "ఈరోజు ఎవరన్నా దుబ్బోడని వెక్కిరిస్తే వెంటనే రింగురుబిళ్ళ అను" అని చెప్పి పంపిస్తుంది.

వాడు బడికి వెళ్లగానే పిల్లలందరూ "మళ్ళా దుబ్బోడు బడికొచ్చినాడ్రోయ్...మీమీ సద్దన్నం మూటలు జాగ్రత్త రోయ్"మని ఎగతాళి చేయడం ప్రారంభించారు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి అవ్వ చెప్పినట్లు "మీకందరికీ ఠింగురు బిళ్ళ" అని అరిచాడు. అక్కడి పిల్లలంతా కిందపడి చని పోయారు. టీచర్ తరగతిలోకి రాగా, జరిగిందంతా చెప్పాడు వాడు. టీచర్‌కు కోపం వచ్చి దుబ్బోడా అంటూ కొట్టాడు. దుబ్బోడనేసరికి కోపం వచ్చింది వాడికి "సారుకు ఠింగురుబిళ్ళ" అన్నాడు. అక్కడ పిల్లలు లేక టీచరు లేకపోవడంతో బోర్ కొట్టి ఇంటికొచ్చాడు. అంత తొందరగా తిరిగి వచ్చిన మనవన్ని చూసి "అప్పుడే వచ్చావురా తిని తిని ఒళ్ళు పెరిగింది గానీ బుద్ధి పెరగలేదు దుబ్బనాయాల"అని తిడుతుంది. అంతలా ప్రేమించే అవ్వ కూడా దుబ్బనాయాల అని తిట్టే సరికి చాలా కోపం వచ్చింది వానికి."అవ్వకు ఠింగురుబిళ్ళ"అన్నాడు. అంతే అవ్వ చనిపోయింది. ఆకలవుతుంది ఏం చేయాలో అర్థం కాలేదు. అద్దంలో చూశాడు వాని బొమ్మ వానికే లావుగా వెక్కిరిస్తున్నట్లుగా కనపడింది. వెంటనే కోపంగా అద్దంలోకి వేలు చూపిస్తూ "నీకు ఠింగురుబిళ్ళ" అన్నాడు. వాడూ చనిపోయాడు.

ఈ కథ ద్వారా చిన్న పిల్లలను వాళ్ళకు నచ్చని పేరుతో పిలిస్తే రోషం వస్తుందని, ఎగతాళి చేస్తే ఏడుస్తారని

తెలుస్తుంది. అతీంద్రీయ శక్తి ద్వారా మంచి జరిగితే బాగుంటుంది. కానీ చెడు జరిగితే చివరికది మన వినాశనానికే దారితీస్తుందని తెలియజేస్తుంది.

బాలలకు సంబంధించిన కథల్లో బాలలనే హీరోలుగా చూపించడం వల్ల బాలలలో ఒక స్ఫూర్తిని నింపవచ్చు. అలాంటి అద్భుత కథ "వేలెడంత పొట్టెగాని కథ". ఇంటి బయట కసువు కొడుతున్న అవ్వకు కోడిగుడ్డు దొరుకుతుంది. ఆమ్లెట్ వేసుకుందామని పగలగొట్ట పోతే లోపలినుండి'' అవా...అవా... జాగ్రత్త....కాస్త నెమ్మదిగా పగలగొట్టు"అని మాటలు వినపడతాయి. కోడిగుడ్డు నుండి మాటలు రావడమే అద్భుతం. నెమ్మదిగా పగలగొట్టగా బొటనవేలెడంత చిన్న పొట్టెగాడు బయట పడతాడు.ఆ అవ్వ వానికి చిన్న రంగుల బట్టలువేసింది. వాడు చెక్క ముక్కలతో చిన్న బండి తయారుచేసి ఎలుకల్ని కట్టి బండిమీద ఊర్లో తిరుగుతుండగా రాగిబిళ్ళ దొరుకుతుంది.అవ్వకివ్వగా ఆమె"రాగిబిళ్ళ దొరికినవారికి రాజుగారి కూతురుతో పెళ్లి జరుగుతుందట పోయి చేస్కోపో"మని పంపుతుంది.

పొట్టోడు ఎలకల బండిపై వెళుతుంటే నల్లపిల్లి ఎదురై నేనూవస్తా తీసుకెళ్ళమంటుంది. పిల్లిని ఎడమచెవిలోకి ఎక్కించుకున్నాడు. చిరుతపులి ఎదురవగా కుడిచెవిలో ఎక్కించుకున్నాడు. సముద్రం అడ్డు రాగా నీటినంతా తాగేస్తాడు.ఇక్కడ చెవిలోకి జంతువులు ఎక్కించుకోవడం సముద్రాన్నంతా మింగడం అద్భుతంగా తోస్తాయి. రాజభటులు అడ్డుపడినా వారి కాళ్ళ సందుల్లో దూరి సరాసరి రాజసభలో నిలబెడతాడు బండిని.నా అనుమతి లేకుండా ఎవర్రా అని రాజు కోపగించగా భయపడకుండా ''నీ కూతురును పెండ్లి చేసుకోవడానికి వచ్చానని మర్యాదగా పెండ్లి చేయ"మంటాడు పొట్టోడు.

"వేలెడంతలేవునా కూతురు కావాల్నా...వీడిని కోళ్ళ కొట్టంలో వదలండి అవి పొడుచుకుతింటా"యంటాడు రాజుగారు. పొట్టోడు చెవిలో నుండి పిల్లిని వదులుతాడు. మరలా ఎద్దులకొట్టంలో వేయగా చిరుత పులిని వదులుతాడు. పొట్టోన్ని ఎండుగడ్డిలో వేసి కాల్చుతుండగా నోటిలోని సముద్రాన్ని వదులుతాడు. పొట్టోడు సామాన్యుడు కాదని తెలుసుకొని తన కూతురినిచ్చి పెండ్లి చేస్తాడు రాజుగారు. ఈ కథ చదవగానే భైరవద్వీపం సినిమాలో బాలకృష్ణపై ఎక్కి తిరుగాడే పొట్టిమనుషులు గుర్తుకొచ్చారు. సాహసం చేస్తే ఏదైనా సాధ్యమేననే సందేశం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఇంట్లో మూడు పూటలా అన్నంలేని స్థితి రామయ్యది. ఎలాగైనా సంపాదించుకొస్తానని మూడు రొట్టెలు కట్టుకొని బయలుదేరాడు. రాత్రైంది. మిత్రుడు సోమయ్య ఇంట్లో పడుకొని ఉదయమే బయలుదేరాడు.అలా వెళుతుండగా రాత్రౌతుంది.అక్కడే మర్రి చెట్టు క్రింద తిని పడుకుందామనుకుంటాడు. సద్దిమూట విప్పి "ఒకటి తిందునా... రెండు తిందునా...మూడు తిందునా...." అని గట్టిగా అరిచాడు. ఆ చెట్టుపైనే ఉన్న పిరికి దయ్యం పిల్లలు అదిరిపడి మమ్మల్నే తింటాడేమో చాలా ధైర్యవంతుడులా ఉన్నాడు. ఒక్కడే వచ్చాడు అనుకొని రామయ్య కాళ్ళమీద పడి మమ్మల్నేం చేయొద్దని వేడుకున్నాయి. నువ్వేం కావాలంటే అది ఇస్తామన్నాయి.డబ్బుకావాలన్నాడు రామయ్య. సరేనని అవునిచ్చి "ఇది మామూలు అవు కాదు ఇది వేసే పేడలో వజ్రాలు, రత్నాలు, బంగారు దొరుకుతా"యని చెప్పాయి.ఇక్కడ పేడలో వజ్రాలు, రత్నాలు, బంగారు దొరుకడం అద్భుతమే. ఇంటికి వస్తుండగా సోమయ్య ఇంట్లో రాత్రి బసచేసి జరిగిందంతా చెప్తాడు. టక్కరి సోమయ్య ఆవును మార్చేస్తాడు. అది తెలియని సోమయ్య ఇంటికి వెళ్ళిన తర్వాత పేడలో వెతుకగా ఏమీ కనిపించవు. దయ్యం పిల్లలు మోసం చేశాయని రాత్రికి మర్రి చెట్టు చేరుకుంటాడు. దయ్యం పిల్లలు భయపడి ఇసుర్రాయి నిచ్చి దీన్ని విసురుతూ ఏమి కోరితే అవి బయటకు వస్తాయని చెబుతాయి. మళ్లీ సోమయ్య ఇంట్లో షరామామూలే ఇసుర్రాయి మారుతుంది. ఇంటికి వెళ్లి పరిశీలించగా నిరాశే మిగులుతుంది. ఇక్కడ ఇసుర్రాయిలో నుండి కోరిన వస్తువులు రావడం

అద్భుతమే. మళ్ళీ రామయ్య కోపగించి మర్రిచెట్టు చేరగా"ఎక్కడో ఏదో మోసం జరుగుతోంది"అనుకున్నాయి దయ్యం పిల్లలు."ఈ దుడ్డుకర్ర నీ మాట తప్ప ఎవరి మాట వినదు. ఏం కోరుకుంటే అది తెచ్చి ఇస్తుంది. దీన్ని తీస్కపో"అన్నాయి. సోమయ్య ఇల్లు చేరాడు రామయ్య. రామయ్య నిద్ర పోగానే ఆ కర్రను తీసుకొని నాకు వజ్రాలు కావాలి, రత్నాలు కావాలి అంటూ గాల్లో తిప్పాడు.అది రామయ్య మాటనే వింటుంది కదా! సోమయ్యను చితకబాదింది. సోమయ్య రామయ్య కాళ్ళమీద పడి క్షమించమని అవును, ఇసుర్రాయిని ఇచ్చేశాడు.

ఈ అద్భుతమైన జానపద కథలో దెయ్యాలు పిరికి వడం కొంచెం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. మిత్రున్ని మోసం చేయరాదని మోసగిస్తే తగిన శాస్తి జరిగుతుందని తెలుస్తుంది. దుడ్డుకర్ర నుంచి ఏమి కోరితే అవి రావడం అద్భుతమే.

ఇలాంటిదే కట్టెలు కొట్టుకునే పేదవాడి కథ "భం...భం...చుకచుక". డబ్బు సంపాదన కోసం వెళ్లగా వెళ్లగా రాత్రికి అడవిలో పాతబడిన మేడ కనబడుతుంది. తలుపు తట్టగా ఇద్దరు ముసలి దంపతులు ఆశ్రయ మిచ్చారు. బయట పాతగా ఉన్నా లోపల బంగారంతో మెరిసిపోతుంది. కిర్రు మని శబ్దంరాగా పేదవాడు లేచి చూశాడు. ముసలి వాళ్ళిద్దరూ పెట్టెలో నుండి రెండు ఎర్రటోపీలు తీసుకొని తలా ఒకటి పెట్టుకొని భం...భం...చుకచుక అనగానే మాయమయ్యారు. తర్వాత పెట్టె తెరవగా మరో టోపి కనిపించింది.దాన్ని పెట్టుకొని భం..భం..చుకచుక అన్నాడు. వెంటనే తాను రాజభవనంలో తేలాడు. ముసలివారిద్దరూ అక్కడ బంగారం సర్దడం చూశాడు. వారి కంటే ముందే కొన్ని నగలు సర్దుకుని వచ్చేశాడు. ఇంటికి పోగా భార్య దురాశతో మరిన్ని తెమ్మంది. ఇలా చాలా సార్లు బంగారు మాయమౌతుంటే అనుమానం వచ్చి మాటువేసి పట్టుకున్నారు. ఉరిశిక్ష విధించారు.చివరికోరిక చెప్పమనగా ఆ ఎర్రటోపి పెట్టుకోవాలనుందన్నాడు.టోపినివ్వగా మాయమయ్యాడు. ఈ కథలో మాయమవడం అద్భుతం. ఇలాంటి కథలు బాలలను చాలా బాగా ఆకట్టుకుంటాయి. ఈ కథ దురాశ దుఃఖానికి చేటు అని తెలియజేస్తుంది.

ఎవరిని తక్కువ చూపు చూడరాదని తెలియజేసే మరో కథ "ఎలుక గాడు". రాజుకు ఏడుమంది భార్యలు ఎవరికీ సంతానం లేదు. ముని వారికి ప్రసాదంగా ఏడు పండ్లనిచ్చాడు. ఆరుగురు వెంటనే తిన్నారు. చిన్న భార్య మాత్రం తర్వాత తిందామని పక్కన పెట్టగా సగం వరకు ఎలక తినేసింది. ఏమైనా కానీమ్మని దాన్ని తినిందామె. ఈమెకు మాత్రం ఎలుకంతకొడుకే పుట్టాడు.ఇది అద్భు తమే. ఆరుగురు వీన్ని ఎగతాళి చేసేవారు. వేటకు వెళు తుండగా ఎలుకగాన్ని రానివ్వకపోవడంతో గుర్రం తోక పట్టుకొని వారివెంట వెళ్ళాడు. అడవిలోకి వెళ్ళిన తర్వాత గుర్తించి తీసుకువెళ్ళారు. వేటాడుతూ దారితప్పారు. దట్టమైన అడవిలో ఒక ముసల్ది పదిమంది పిల్లలతో కనిపించింది. రాత్రికి ఇక్కడే పడుకుంటామనగా సరేనని పిండివంటలు పెట్టింది.

ఎలక గానికి అర్ధరాత్రి గుర్రాలరుపులు వినిపించాయి. తలుపు తెరవడానికి యత్నించిన గానీ రాలేదు. కిటికీలో నుంచి బయటకొచ్చి చూడగా రాక్షసి పదిమంది పిల్లలతో ఒక్కో గుర్రాన్ని పీక్కుతింటుంది.రాక్షసి పక్కన పడిన తాళంచెవి తీసుకుని వచ్చి తాళంతెరచి అన్నలను తాటి చెట్టుపైకి ఎక్కించాడు. గుర్రాలన్నీ తిన్న రాక్షసి వీళ్ళను తిందామని చూడగా కన్పించలేదక్కడ. కుక్కలా వాసన పసిగట్టి తాటిచెట్టుపైనున్నవారిని తినాలని చూసింది. దుబ్బరాకాసి నిలబడగా ఒకదానిపై మరొకటి ఎక్కి దుడ్డు కర్రతో కొట్టసాగాయి. ఎలుకగాడు ఉపాయంతో మెల్లగా చెట్టునెక్కి ముళ్ళుతో రాక్షసి కంట్లో పొడిచాడు. అవి క్రింద పడి చనిపోయాయి. అప్పటినుండి ఎలుక గాడిని వారిలో కలుపుకున్నారు.

పండ్లు తింటే పిల్లలు పుట్టడమనేది కథలో అద్భుత

మని చెప్పవచ్చు. అంతచిన్నగున్న వాడు రాక్షసి నుండి రక్షించడం అద్భుతంగా అనిపిస్తుంది. జానపద బాలల కథల్లో అద్భుత కథలు పిల్లలను బాగా ఆకర్షిస్తాయి. చిత్రవిచిత్రమైన మలుపులతో ఉత్కంఠతను రేకెత్తించి ఆసక్తిని కల్గిస్తాయి. కథలపట్ల, సాహిత్యం పట్ల ఇష్టాన్ని పెంచుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి అద్భుత కథలు హరికిషన్ గారి కథల్లో ఇక్కడ చర్చించని చాలా కథలు మనకు దర్శనమిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. ఒకటి తిందునా... రెండు తిందునా - డా.యం. హరికిషన్
2. కిర్రు..కిర్రు..లొడ్డప్పా - డా.యం.హరికిషన్
3. ఠింగురు బిళ్ళ - డా.యం.హరికిషన్
4. నక్కబావ - పిల్లిబావ - డా.యం.హరికిషన్
5. నలుగురు మూర్ఖులు - డా.యం.హరికిషన్
6. బాలసాహిత్యం - ఆచార్య యం.కే.దేవకి

❖ ❖ ❖

మడకశిర ప్రాంతంలోని జానపద వైద్య విధానం

– డా॥. పి. శివలింగప్ప , తెలుగు అధ్యాపకులు, మడకశిర

మడకశిర ప్రాంతం అనంతపురం జిల్లాకు దక్షిణాన కర్నాటక ప్రాంతంలోనికి చొచ్చుకొని ఉన్నది. మడకశిరకు తూర్పున హిందూపురం తాలూకా (ఆంధ్ర) పడమర హిరియూరు, శిర తాలూకాలు, ఉత్తరాన పావగడ తాలూకా, దక్షిణాన మధుగిరి తాలూకా (కర్నాటక)లు వున్నవి. నైసర్గికంగా పడమర సర్వముఖి నది, దక్షిణాన మధుగిరి కొండ, తూర్పున పెన్నా నదులు, ఉత్తరాన పావగడ, నిడిగల్లు కొండలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా కన్నడ భాషను మాతృభాషగా కలిగి ఉన్నారు. అధికార భాష తెలుగు అయినప్పటికీ ఇండ్లల్లో కన్నడ భాష, బయట తెలుగు భాష మాట్లాడేవారు కన్పించినప్పుడు మాత్రమే తెలుగు భాషలో మాట్లాడుతారు. ఈ ప్రాంతంలో ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, జానపద వైద్య విధానం మొ॥ అన్నీ కన్నడ ప్రాంతానికి అనుసరించి ఉంటాయి. ఈ ప్రాంతం ద్విభాష ప్రాంతం. ఒక్కొక్కప్పుడు తెలుగన్నడమనే మూడవ భాషను మాట్లాడుతారు. నేను ఈ ప్రాంతంలో ఉండే జానపద వైద్య విధానాన్ని గురించి రెండు మాటలు చెప్పడానికి ఇష్టపడుతాను.

జానపదం అంటే జనపదాల్లో వుండే వారిని జానపదులంటారు. వాళ్ళ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు దేశ పద్ధతిని అనుసరించి వుంటాయి. శిష్ట వ్యవహారానికి పూర్తిగా భిన్నంగా వుంటాయి. జానపదులు తమ కష్టసుఖాలను ప్రకృతి దేవతలకు చెప్పుకోవడం, వృక్షాలను తమ ఆరాధ్య దైవంగా పూజించడం, తమ కష్టాలను వాటితో చెప్పుకోవడం మనం గమనించవచ్చు.

తమ ఆరోగ్యాలు బాగాలేకపోతే తాము పెంచి పోషించిన మొక్కలు, వృక్షాల యొక్క బెరళ్ళ ద్వారా అనారోగ్యాన్ని నయం చేసుకోవడం మనం గమనించవచ్చు.

వైద్యం అంటే చికిత్స అని అర్థం. రోగ నివారణ కోసం చేసే చికిత్సను గురించి తెలిపే శాస్త్రాన్ని "వైద్యం" లేక "వైద్యశాస్త్రం" అంటారు. వైద్యం అనేది ఎప్పుడు పుట్టిందో చెప్పడానికి ఎవరి తరము కాదు. మనిషి జీవితంలో సుఖదు:ఖాలున్నట్లే ఆరోగ్యం, అనారోగ్యం ఉంటాయి. భూమిమీద మానవుడు పశుపక్ష్యాదులు పుట్టినప్పుడే వైద్యం కూడా పుట్టిందని చెప్పవచ్చు.

జానపదులు తమ పరిసరాలలో వుండే మొక్కలతో కలిసి జీవిస్తారు కాబట్టి ఏ మూలికను దేనికి ఉపయోగించాలో వాళ్ళకు అనుభవం వల్ల తెలుస్తుంది. జానపద వైద్యం అంటే నమ్మకం ముఖ్యం. వైద్యం చేసే వ్యక్తి వాడే మొక్క పేరు చెప్పడు, పారితోషికం తీసుకోడు. తీసుకుంటే ఆ వైద్యం పనిచేయదనే గట్టి నమ్మకం వుంది. ఒకవేళ పారితోషికం తీసుకొన్నా డబ్బు రూపంలో కాక పండ్లు, పూలు వంటి వస్తువుల రూపంలో తీసుకుంటారు.

జానపద వైద్య విధానం అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా పనిచేయదు. ఉదా ; ఉష్ణ మండలాల్లో పనిచేసేవి శీతల మండలంలో పనిచేయక పోవచ్చు, అలాగే శీతల ప్రాంతాల్లో పనిచేసేవి ఉష్ణమండలంలో పనిచేయక పోవచ్చు. జానపద వైద్యం ఆయా నేల, ప్రాంత స్వభావాన్ని బట్టి కచ్చితంగా మారుతుంది.

మడకశిర ప్రాంతంలోని జానపద వైద్యాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

1. ప్రకృతి జానపద వైద్యం
2. తాంత్రిక మతాచార వైద్యం

ప్రకృతి జానపద వైద్యం :

ప్రకృతిలో లభించే వస్తువులతో చేసే వైద్యం ప్రకృతి జానపద వైద్యం. ప్రకృతిలో లభించే వస్తువులకు రోగాలను బాగుచేసే ఔషధ గుణాలుంటాయి. ఇవి మూడు రకాలు.

1. వృక్ష సంబంధ వైద్యం (లేక) సస్య సంబంధ వైద్యం, 2. ప్రాణి సంబంధ వైద్యం, 3. ఖనిజ సంబంధ వైద్యం.

వృక్షసంబంధ వైద్యం :

దీనినే సస్య వైద్యం అని కూడా అంటారు. ఇందులో ముఖ్యంగా చెట్ల మూలికల నుంచి లభించే ఔషధం. చెట్ల నుండి లభించే ఆకులో, పూలో, కాయలో, పండ్లు, విత్తనాలు, కాండం, వేరు మొదలగు వాటితో చేసే వైద్యం.

ప్రాణి సంబంధ వైద్యం :

ఇందులో మరలా రెండు విభాగాలున్నాయి. 1. ఇంట్లో పెంపుడు జంతువలకు చేసే వైద్యం. 2. జంతువుల ద్వారా లభించే పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, గోమూత్రం, ఆవు పేడ, మాంసం, ఎముకలు, చర్మం, వెంట్రుకలు మొ॥ వాటిద్వారా చేసే వైద్యం.

ఖనిజ సంబంధ వైద్యం :

అంటే మట్టి, ఉప్పు, రాయి మొదలగు వాటితో చేసే వైద్యం

మంత్ర తంత్ర వైద్యం :

మన జానపదుల ఆచార వ్యవహారాలకు సంబంధించినది. జానపద ఔషధాల ద్వారా కాకుండా మంత్ర తంత్రాల మీద ఆధారపడి చేసే వైద్యం. ఇది మౌఖిక సంప్రదాయానికి సంబంధించినది. వంశపారంపర్యంగా వచ్చేది. ఇది గృమవైద్యమ అసలు సిసలైన వైద్యం. జానపద వైద్యంలో శస్త్ర చికిత్సకు ప్రాధాన్యం ఉండదు. ప్రకృతి ప్రసాదించిన వస్తువులతో పెద్దపెద్ద రోగాలకు కూడా నయం చేసే శక్తి వారికి ఉంది. వేపాకు, పసుపు లాంటి వస్తువులతో శరీరంలో ఏ భాగమైన కుళ్ళి పోకుండా కాపాడే నైపుణ్యం వాటికి వున్నది.

మడకశిర ప్రాంతంలో వాడుకలో ఉన్న జానపద వైద్యం :

మడకశిర ప్రాంతంలో జానపదులు, గ్రామీణులు వివిధ రకాల వ్యాధులను నయం చేసుకోవాడానికి వివిధ జానపద వైద్య పద్ధతులను వాడుతున్నారు. క్షేత్ర పర్యటన ద్వారా వాటిని వెలుగులోకి తేవడం నా వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

తేలుకాటుకు వాడే వైద్యం :

సీమజాలి చెట్టు ఆకును చేతితో ముట్టకుండా కేవలం నోటిద్వారానే ఆ ఆకులను చెట్టు నుండి నోటిలోకి తీసుకొని నమిలి తేలుకాటు వేసిన వైపునకు వ్యతిరేక వైపు చెవిలో ఊదుతారు. తేలు కుట్టగానే కుట్టిన తేలునుగానీ, మరో తేలును కానీ పట్టుకొని, దాని కొండిని కాల్చి వచ్చే పొగను కుట్టిన చోటుకి పెడతారు.

పాముకాటు :

ఈ ప్రాంత జానపద వైద్యులు పాముకాటుకు చేపలు కడిగిన నీళ్ళను తాగితే పాము విషం హరిస్తుందని భావిస్తారు.

ఫిట్స్ (వాయి) :

దున్న పిల్లను ఈనిన ఎనుము యొక్క గడ్డపెరుగు, నల్లమూతి విడి ఆకులు నున్నగా నూరి ఈ మూడింటిని కలిపి, అరచేతిలో ఒక స్పూనంత వేసి తాగించాలి. ఇలా మూడు పూటలు తాగిస్తారు. 21 రోజులు తప్పని సరిగా పత్తెం పెడతారు.

ఇసుభు :

చిత్రమూలిక మొక్క నుండి పిడికెడు రెమ్మలను తీసుకొని చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించాలి. వాటిని వేపుడు బాండ్లిలో వేసి నలుపురంగు వచ్చేవరకు వేయించి దించి పక్కన పెట్టాలి. బాగా చల్లారిన తర్వాత వాటిని పౌడర్‌లాగా మంచి శుభ్రమైన రాయిపైన నూరాలి. దాన్ని రాసుకోవడానికి వీలుగా కొబ్బరి నూనెతో కలిపి దాన్ని ఇసుభున్న చోట రాసుకోవాలి. ఉదయం సాయంత్రం రాసుకొని సెనగపిండితో కడగాలి. ఇలా చేస్తే ఒక్క రోజులోనే దురద పోయి రోగం నయమవుతుంది.

తెల్లబట్ట/ ఎర్రబట్ట :

ఇసమ్‌దారి ఆకుల రసం అరపావు, కండ చక్కెర అరపావు, రాతినీరు కొద్దిగా, జీలకర్ర, రెండు యాలక్క బుడ్లు కొద్దిగా నల్లమూతి ఆకు అంతా నూరి అరపావు

నాటి ఆవు పాలు కలిపి తాగించాలి. ఒక వేళ నాటి ఆవు పాలు దొరకక పోతే దంపుడు బియ్యం గంజి కలిపైనా మూడు రోజులు సేవించాలి.

ఊళుకడ్డీ/పురుగుకడ్డీ :

నేల తంగెడు వేరు తీసుకొని నీళ్ళ ముట్టక ముందు నోటి ఎంగిలితో రుద్ది ఆ స్థలం మీద రాయాలి. ఊళు కడ్డీ నయం అయ్యేంత వరకు రోజుకోసారి రాస్తుండాలి. రోజుకోసారి కడుగుతుండాలి. (దుగ్గప్ప భార్య నరసమ్మ, ఉదుగూరు, అమరాపురం మండలం, వయస్సు 73సం॥, 16.03.2012)

బహిష్టు :

కొద్దిమంది యుక్త వయస్సు వచ్చిన బాలికలు బహిష్టు కారు (సమర్థ) అలాంటి వారికి బహిష్టు కావడానికి "బయటి ముసుగు"లోని ఆకురసం తాగితే సమర్థరా లౌతుంది.

ఉబ్బసం :

కుప్పాకును చేతితో రుద్ది ఒక తెల్ల వస్త్రంలోవుంచి రసం పిండుకోవాలి. తరువాత తగినంత తల్లిపాలు కలిపి పాపకు తాగిస్తే ఉబ్బసం నయమవుతుంది. టీ డికాషన్‌లో నిమ్మరసం కలుపుకొని తాగితే ఉబ్బసం తగ్గుతుంది. ధనియాలు, మిరియాలు, శొంఠి, ఆవాలు, నూనెలో వేయించి, వేడి అన్నంలో నెయ్యి వేసి, అన్నం మధ్యలో పెట్టుకొని తింటే ఉబ్బసం మాయమవుతుంది.

పైసురుకు (ఉడుగ్గా ఉండటం) :

అలోవేరా ఒక కొమ్మ తీసుకొని కొనవైపు, కిందిభాగం తీసివేసి మధ్యభాగంలో లోపలి భాగాన్ని తీసుకొని ఏడు సార్లు నీళ్ళల్లో కడగాలి. తెల్లని గడ్డను తెల్లని గుడ్డలో ఉంచి, ఒక రాత్రి అంతా తగినన్ని నీళ్ళల్లో నానబెట్టాలి. ఆనీటితో రాతినార, రాతి చక్కెర కలిపి ఉదయం, సాయం కాలం పరగడుపున తొమ్మిది రోజులు తాగితే నయమవు తుంది.

ముట్టుకుట్టు నొప్పి :

(మూడు) కొన్ని జిలకర, మూడు మిరియాలు, మూడు తెల్లపాయలు, జమ్మిఆకు పిడికెడు తీసుకొని నున్నగా నూరి ఐదు మాత్రలు చేయాలి. ఆ గుళికలు ఉదయం, సాయంకాలం ఒక్కొక్క గుళిక తీసుకోవాలి. ఇలా రెండు రోజులు మింగాలి. మిగిలిన ఒక గుళికను మరుసటి రోజు ఎప్పుడైనా తీసుకోవచ్చు. తప్పనిసరిగా వీళ్ళు ముట్టుకు ముందు గుళికలు మింగాలి. ముట్టు కుట్టు నొప్పి తగ్గి బిడ్డలు కూడా పుడతారు. తొమ్మిది రోజులు పత్యం ఉండాలి. (కెంగేరప్ప కుమారుడు తిమ్మప్ప, సింగేపల్లి, గుడిబండ మండలం, 70సం॥లు, 18.03.2012)

కెమిరె/ పొడిదగ్గు :

ఈ వ్యాధి అమ్మ కడుపులో నుండి అప్పుడే బయట పడ్డ బిడ్డకు సోకుతుంది. కెమిరె వ్యాధి సోకితే రక్తపు ముద్దగా ఉన్న బిడ్డ మరణించే ప్రమాదం ఉంది. మరలె చెక్క, రావి చెక్క, వేపచెక్క, ఉవ్వరిసె చెక్క (ఈచెట్లు బాగా బలిసి ఉండాలి) ఈ చెట్ల నుంచి చెక్కను తీసి ఎండబెట్టాలి. వీటి రసాన్ని నీటితో కలిపి మూడు నెలల గర్భవతిగా ఉన్నప్పుడే తల్లులకు తాగించాలి. తిరగి ఆమెకు ఆరు నెలలకు మరోసారి, 9 నెలలకు ఇంకొకసారి తాగిస్తే, బిడ్డ పుట్టిన తరువాత ఆ బిడ్డకు ఈ రసం తాగిస్తే కెమిరే వ్యాధి నుంచి బిడ్డను కాపాడుకోవచ్చు. ఆ బిడ్డకు తెల్లని గుడ్లఓ దంచిన చెక్కపొడి మరియు తల్లిపాలు కలిపి నోటిలోకి పిండాలి. బిడ్డ పుట్టిన 3 వ రోజు లేదా ఐదవ రోజు ఇలా బిడ్డ నోటిలోకి వేయాలి. 1, 3, 5, 7, 9 నెలల్లో ఒక్కొక్కసారి పెట్టినా బిడ్డ ఆరోగ్యానికి మంచిది.

చర్మకారులు చర్మం పదును పెట్టే కుండలో నుంచి నీటిని తీసుకొని ఆ నీటిని వేడిచేసి తల నుంచి పాదం వరకు పూసిన వ్యాధి నయం అవుతుంది. (శ్రీమతి రంగమ్మ, మోపురుగుండు, గుడిబండ మండలం, వయస్సు 52సం॥లు, తేది. 14.03.2012)

పల్లేరు చెట్టు (నగ్లికాటు మొక్క) :

పల్లేరు చెట్టు వేర్లు, కాండం, నీడలో ఆరబెట్టి పొడరు తయారు చేసి వస్త్రంగాళితం చేసి 'టీ'గా తాగాలి. ఈ టీ

నరాలను బలపరుస్తుంది. మగతనాన్ని రెట్టింపు చేస్తుంది. మూత్ర సంబంధమైన రోగాలు పోతాయి. (ఎ. నారాయణ మాదిగ, అమరాపురం, మడకశిర తాలూక)

మొలలు :

ఉత్తరేణి వేరును బియ్యం కడిగిన నీళ్ళతో నూరి, అందులో తేనె కలిపి కొద్దిరోజులు వరుసగా తాగాలి. నీరుళ్ళిపాయ కూర తింటే మొలల రోగం అంతరిస్తుంది. బెల్లంలో కరక్కాయ చూర్ణం కలిపి భోజనానికి ముందు తీసుకోవాలి లేదా చేమాకు కూరగాని, వేడిపండ్లు కూర గాని అన్నంలో తింటుంటే మొలల వ్యాధి రాదు.

విరోచనాలు :

లేత దానిమ్మ పిందనుగాని, చిగుళ్ళుగాని మజ్జిగలో నూరి ఆ రసాన్ని తాగాలి. గసగసాలు వేయించి పొడిచేసి అన్నంలో వేసుకొని తింటే త్వరగా నయమవుతుంది. లేదా ఆవాలు బెల్లం మెత్తగా నూరి కొద్దిగా తీసుకొన్నా విరోచనాలు తగ్గుతాయి. కొత్త కుండలో నీళ్ళు పోసి, కలకండ వేసి నానబెట్టి ఆ నీళ్ళు తాగితే చీము బేదులు పోతాయి. పచ్చి అరటికాయ తిన్నా నయమవుతుంది. పల్లేరాకును పెరుగుతో నూరి కొద్దిగా తిన్నా విరోచనాలు నయమవుతాయి. నేరేడు చెక్క రసాన్ని మేకపాలతో కలిపి తాగితే రక్త విరోచనాలు పోతాయి. సాధారణంగా తంగేడు చెట్టు చిగుళ్ళు తిన్నా నయం అవుతుంది.

మలబద్ధకం :

ఒక గ్లాసు బార్లీ నీళ్ళల్లో రెండు చెంచాలు తేనె కలపుకొని తాగితే సుఖంగా విరేచనం అవుతుంది. రోజూ మూడుపూటలా నిమ్మరసం తాగితే మలబద్ధకం నయమవుతుంది.

నోటిపుండ్లు :

ఎండు కొబ్బరి, గసాలు నమిలి ముగ్గలో పెట్టుకోవాలి. నోటి పుండుకు కుసుమపాలు కూడా బాగా పనిచేస్తుంది. జామ ఆకుల రసం కానీ, కషాయం కానీ నోట్లో వేసుకొని పుక్కిలించవచ్చు. దానిమ్మ పిందెలు చాలాసేపు నమిలి ఉమ్మేసినా నోటిపుండు నయమవుతుంది.

పులిపిర్లు :

జిలకర్ర నూరి పెడితే పులిపిర్లు పోతాయి. నీరు, సున్నం, అల్లం సమానంగా అరగదీసి రాసినా నయం అవుతుంది. ఊదుబత్తితో కాల్చినా అరిగి పోతాయి. పులిపిర్లు ఉన్నచోట సన్నని దారంతో కాస్త బిగుతుగా కట్టితే మూడు నాలుగు రోజులలో ఊడి పోతాయి.

గర్భం పోవడానికి :

మందార పువ్వు, నువ్వులు, బెల్లం బాగా నూరి ఉదయం పరగడుపులో తినాలి. లేదా నల్లజిలకర్ర, బెల్లం దంచుకొని తినాలి. బొప్పాయి పండు తిన్నా గర్భం పోతుంది.

పేనుకొరుకుడు :

పేను కొరుకుటకు రెండు రకాల ఔషధం ఉపయోగంలో వుంది. పేను కొరికిన చోట బ్లేడుతో కొద్దిగా పైపైన గీకి మోదుగు విత్తనం నిమ్మరసంతో రుద్ది పెట్టాలి. ఇలా చేసినప్పుడు ఇన్ఫెక్షన్ కావచ్చు లేదా జ్వరం కూడా రావచ్చు. అందుకు ఎలాంటి భయాందోళన చెందన వసరం లేదు. కేవలం కాయ ఆకు రసం పిండి ఆ రసాన్ని పేనుకొరికిన చోట పెట్టాలి. దీన్ని రెండుసార్లు పెడితే వ్యాధి నయం అవుతుంది. మొదట ఒకసారి పెట్టిన తరువాత రెండవసారి వారం, పది రోజుల తర్వాత తిరిగి పెట్టాలి. (మంగళి చిదానంద, అమరాపురం)

భరతమాత తన ఉదరంలో అనేక రకాల ఔషధ మొక్కలను కలిగి తన బిడ్డలను రక్షించుకొన్నట్లుగా ఒక తల్లి రూపంలో ఆచార్య దేవకి గారు సామాన్య కుటుంబ స్త్రీ మాదిరిగా మనకు కన్పిస్తారు. ఇక్కడ ఈమె ఒక జానపద వైద్యురాలిగా, గృహిణిగా, విశ్వవిద్యాలయ ఆచార్యురాలిగా, శాంతమూర్తిగా కనపడటం అతిశయోక్తి కాదు. "ఎంత ఎదిగినా అంత ఒదిగి ఉండు" అనే లక్షణం వీరిలో కనిపిస్తుంది. ఒక సామాన్య స్త్రీ యొక్క ఆరాటం, ఆతృత, తపన ఈమెలో కనిపిస్తుంది. తనచుట్టూ ఉన్న మొక్కలను ఎలా ఉపయోగించుకోవాలో "తెలుగునాట

జానపద వైద్య విధానాలు'' అనే గ్రంథంలో చక్కగా తెలిపినారు. మడకశిర ప్రాంతంలో జానపద వైద్య విధానంపై ఒక ప్రత్యేకమైన పరిశోధన గ్రంథం రావలసిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పక తప్పదు.

ఆధార గ్రంథాలు :

1. ఆచార్య ఎం.కె. దేవకి - తెలుగునాట జానపద వైద్య విధానాలు, (ముద్రణ 1999)
2. ఆచార్య జి.ఎస్. మోహన్ - జానపద విజ్ఞానాధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్స్, బెంగళూరు,2001
3. ఆచార్య ఆర్వీఎస్ సుందరం - ఆంధ్రుల జానపద విజ్ఞానం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,2004

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద గేయ రచనలు – ఛందో సంగీత లీతులు

– డా॥. వొన్నెరెడ్డి భవాని, తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వడిగ్రీకళాశాల, చేబ్రోలు.

జనపదం అంటే జనులు నివాసముండే ప్రదేశం ప్రశాంతమైన పల్లెపట్టులలో శ్రామిక జీవుల స్వేదంలో అమాయక ప్రజల ఆలోచనలో అప్రయత్నంగా అలవోకగా జాలువారిన మకరంద ఝురియే జానపద సాహిత్యం జనుల బాధలనుండి సంతోషాలనుండి ఏర్పడిన భావనా వీచికనే మనం జానపద సాహిత్యంగా భద్ర పరుచు కున్నాము. ఈ సాహిత్యం మొదట ఎక్కడపుట్టిందో ఎలా పుట్టిందో ఖచ్చితంగా చెప్పలేము. ఈ గేయం వీరు రచించారు అని తారీఖులు బేరీజువేసి కాలనిర్ణయం చేయలేము. ఇది ఒక శాబ్దిక కళ " ముఖే ముఖే సరస్వతి" అన్నట్లుగా ఒకరివద్దనుండి మరొకరికి సంప్రాప్తించినకళ "జానపదులే పురీజను"లని ఎఱ్ఱన జానపదశబ్దము గ్రామ వాసులు లేక పల్లెప్రజలు అనే అర్థములో వాడియున్నారు. ఈ జానపద వాఙ్మయము మనకు ఎక్కువగా గేయ రూపములోనే కన్పించుచున్నది. ఈ జానపద వాఙ్మయమును జ్యూ బ్రౌన్‌దొరగారు లోకమునకు పరిచయము చేసినారు. మన ఆచార వ్యవహారములకు, సంప్రదాయమునకు పట్టుగొమ్మ జానపదసాహిత్యమే జాతిజీవన ప్రతిబింబమే ఈ జానపద సాహిత్యము.

"సంగీతమపిసాహిత్యమ్ సరస్వత్యాఃస్తనద్వయమ్
ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతమ్"

ఈ శ్లోకమును పరిశీలించిన ఇక్కడ చెప్పబడిన రెండు లక్షణాలు మనకు జానపద సాహిత్యంలో ఒదిగినట్లుగా మనకు కన్పిస్తున్నది. అంతేకాదు "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః"

అన్నట్లుగా సంగీతానికి శిశువులను పశువులను మైమరపింప జేయగలశక్తి వున్నది. ఈ జానపద వాఙ్మ యములోని ఛందోరీతులను పరిశీలించి నట్లుయితే ప్రాచీన ద్రావిడ కవిత్వం మూడు లేక నాలుగు పాదాల తో కూడిన పద్యాలరూపంలో వుంది. క్రీ॥శ 9వ శతాబ్దిలోనే ద్రావిడ భాషలలోకి స్రగ్ధరవృత్తం వచ్చింది. కన్నడ సాహిత్యంలో చంపూకావ్యాలు వెలిశాయి. తెలుగులో సత్యాశ్రయుడు అనే చాళుక్యరాజు దేశికవితకు ప్రాధా న్యత నిచ్చి తెలుగు రచనలను ప్రోత్సహించాడు.

"మును మార్గకవిత దేశంబున వెలయంగ దేశికవిత బుట్టించి తెనుం
గుని విడి రంధ్ర విషయంబున జనసత్యాశ్రయుని దొట్టి చాళుక్యనృపతో

ఆరచనలేవీ మనకు కన్పించడంలేదు. కాని తరువోజ, అక్కరలు సీసములు మొదలైనవి శాసనాలలో మనకు కన్పిస్తున్నాయి. దేశి రచనా రీతులన్నింటిలోనూ లయాను గుణములైన మాత్రాగణములే కనబడుతున్నాయి. అందువలననే అవి పాటకి అనువుగా వున్నాయి. తెలుగు పాటల్లోని ఛందోరీతుల్ని తెలుసుకోవాలంటే మనం ద్రావిడ సాహిత్యాన్ని కూడా పరిశీలించాలి. ఉదా:- తమిళ భాషలో ప్రాచుర్యంలో వున్న కొన్ని ఛందోలక్షణాలు 1) కూత్తెమానై అను తమిళ ఛందములో చివరిగణంలో తప్ప అన్నిగణాల మొదటి అక్షరాలకి మైత్రివుంది. ఒకొక్కసారి గణంవిడిచి గణంలో కూడా వుండవచ్చు బాలల గేయాలలో

1) గుడు గుడు గుంచం గుండేరాగం
   పాములపట్నం పగడారాగం
2) చమ్మ చక్క చారెడేసి మొగ్గ
   అట్లు పొయ్యంగ ఆరగించంగ

ఒరు ఉమావై అనే మరోఛందంలో పద్యం నాలుగు పాదాల్లోను ఒకొక్క పాదంలో మొదటి గణం యొక్క నాల్గోగణం యొక్క మొదటి అక్షరాలకి మైత్రి ఉండాలి.

పువ్వు పేరే జాజిపువ్వు
పురము పేరే అయోధ్యాపురము
దేవి పేరే సీతాదేవి

తోడై అనేఛందములో తుదిగణాలకిగాని అక్షరాలకు గాని మైత్రి వుంటుంది.

1) లాలిశంక సదాలాలితకుమారా
   లాలి పటుతాండవోల్లాస ఘనధీరా
2) భూదేవి కూతుర్ని కోయిలారో
   జనకుని కూతుర్ని కోయిలారో
   దశరథుల కోడల్ని కోయిలారో
   శాంతకు మరదల్ని కోయిలారో

వృషభగతిరగడ భేదమేమో అన్పించేవిధంగా ఏడు మాత్రల నాలుగేసి గణములున్న ఈ గేయము

"గుమ్మడేడేగోపీదేవీ
గుమ్మడేడే కన్నతల్లి
గుమ్మడిని పాడుమాపగదే మా అమ్మగోపెమ్మా "

తెలుగు జానపదగేయ ఛందములలో షట్పది ఒకటి అప్పకవి ఆరు పాదాలుండాలనీ ఒకొక్క పాదానికి ఆరింద్ర గణములు ఒకచంద్రగణము పాదంలో మూడు ప్రాసయతులుండాలన్నాడు.

శ్రీ తరుణిరో నేశ్రీరఘురాముడ
జేరి కవాటము తీవే
జేరి కవాటము తీవే
ఖ్యాతిగ శ్రీరఘురాముడవైతే
కోతుల జేర గదోయీ

అనుదానికి ఉదాహరణగా చెప్పవచ్చును. భోగ షట్పదిలో మొదటి రెండు పాదాల్లోనూ నాలుగేసి మూడు మాత్రలగణాలు మూడో పాదంలో ఆరుమూడు మాత్రల గణాలు తర్వాత ఒక గురువు వుంటాయి తెలుగులోని లాలిపాటలు వీనిలోకే చేరుతాయి.

సువ్వి సువ్వి రామచంద్ర
సువ్వి సువ్వి కీర్తిసాంద్ర
సువ్వి సీతమ్మ మాకు శుభములీవమ్మా

భామినీషట్పది అనుదానిలో 3+4 3+4 మాత్రలున్న గణాలు మూడవపాదంలో 3,4 3,4 3,4 2 మాత్రా గణాలుంటాయి.ముత్యాలసరాలు భామినీషట్పదుల కోవలోకేవస్తాయి.

తులసి యింట నుంచువార్ని
తులసి పూజచేయువార్ని
తులసియందు భక్తియుంచి తొలగువారినీ
తులసిజూచి మ్రొక్కువార్ని
తులసి యనుభవించువార్ని
తెలిసినీవు వారి దిక్కు చూడకు

ఇలా పరివర్ధని, వార్ధిక షట్పది, అష్టపది, కళిక, ఉత్కళిక మున్నగు ఛందములు జానపద గేయాలలో మనకు కన్పిస్తాయి. తుమ్మెదపాటలు, అల్లోనేరెళ్ళు, వెన్నెల పాటలు, చిలుకపదములు, కోవెలపాటలు, అప్పగింత పాటలు, శోభనములు, సుద్దులు, ఐరేని పాటలు తాళబద్ధ మైన మాత్రాఛందమునకు ఒదిగినవేనని చెప్పవచ్చును.

సహజపాండిత్య బిరుదాంకితుడైన పోతనామాత్యుని గేయసాహిత్య ప్రియత్వము కందములో వ్రాసిన ఈ జోలపాటలో చూడవచ్చు.

జోజో కమలదళేక్షణ
జోజో మృగరాజమధ్యజోజోకృష్ణా
జోజో పల్లవ కరపద
జోజో పూర్ణేందువదన జోజోయనుచున్

గోపస్త్రీలు వ్రేపల్లెనుండి బృందావనమునకు వెళ్ళి నపుడు శ్రీకృష్ణునికి జోలపాడిరి. చేమకూరవేంకట కవి "సుభద్రా పరిణయము" నందు కళ్యాణఘట్టములో "మంచిలగ్నమున కంకణముల్ కరపంకజంబులన్ బెట్టిరి మేనులన్ నలుగు మేలిమ్మృగమద చందనంబులన్ జుట్టిరి కైశికంబుల విశుద్ధమనోహర పుష్ప మాలికల్ పట్టిరి పేరంటాండ్రు ధవళంబులు పాడుచు" అని చెప్పిన మాత్రాఛందము మనకు కన్పిస్తుంది. లయసమన్విత

మైనపుడు సహజకవులు కూడా ఛందస్సువాడకుండా వుండలేకపోయారు.

జానపదగేయాలలోని సంగీతజ్ఞానమును పరిశీలించినపుడు ఆంధ్రులసంగీత సాంప్రదాయాల్నీ నాటి సంగీత కళనుగురించి తెలుసుకోవాలంటే భరతుని నాట్యశాస్త్రము. సంగీతరత్నాకరము మొదలగు గ్రంథాలనుచూడాలి. ఈ సంగీతంలో మార్గ సంగీతమని దేశి సంగీతమని రెండు రకములు జానపదగేయములు దేశి సంగీత సంప్రదాయంలోకి వస్తాయి. నేడు జానపద వాఙ్మయంలో వెలికి తీసిన పాటలన్నింటినీ పేరుపేరునా వరుసగా ఏరాగంలో ఏతాళంలో పాడాలో వివరించడం కేవలం సంగీత శాస్త్రంలో కృషిచేస్తూ జీవితాన్ని అంకితం యిచ్చిన వారికిగాని సాధ్యపడవు.

కొన్నిపాటలు మాత్రం ఏ విధంగా సంగీతశాస్త్రానికి లోబడి వున్నాయో చెప్పవచ్చును.

"జో అచ్యుతానంద జోజోముకుందా
లాలిపరమానంద రామగోవింద జోజోజోజో"

అను అన్నమయ్యపాట నవరోజ్‌రాగంలో పాడవచ్చునని జంపెతాళంపడుతుందని ఏడుస్తున్న పిల్లల్ని సముదాయించడానికి వారికన్నాశబ్దంచేస్తూ "ఉళూళూ ఆయీ ఆయీ ఆపదలుగాయీ చిన్నవాళ్ళనుగాయి శ్రీరంగశాయి" అంటూ నెల్లూరులో భైరవీజన్యమైనరాగంలోనూ పాడుతూ పిల్లలను నిద్రపుచ్చుతారు ఇంకా " కొండమీద వెండిగిన్నె"

"అట్లుతద్దోయ్‌ఆరట్లోయ్" అనేవి తెలుగు బాల బాలికలు సరదాగా పాడే పాటలు వీటికి ఆదితాళం పడుతుంది.బొబ్బిలి కథ తాళమాలికదాన్ని సామాన్యంగా మోహన రాగంలో త్రిశ్రగతిలో మధ్యస్థాయిలో ఎత్తుకొని పాడతారు వీరగాథల్లో ప్రఖ్యాతిగాంచిన పల్నాటి వీర చరిత్రని పంబజోడూతిత్తీ సహాయంతో భావానుగుణంగా అడుతూ కథకులు పాడతారు. నందికేశ్వరుడు రచించిన అభినయదర్పణం ఒక్క ఆంధ్రదేశంలోనే లభించిందట అందుచేత నృత్యనరస్వతి కూచిపూడిలో వర్ధిల్లినదనీ చెబుతారు.

తెలుగునాట విద్యావంతుల ఆదరణ లేకపోయినా రాజకీయం చేసి నిరుత్సాహపరచినా కోలాటపుభజనలు యింకా సజీవంగానే వున్నాయి. కోలాట భజనకీర్తినలలో తెలుగువారి ఆరాధ్య దైవమైన భద్రాద్రి రాముడిమీదా బాలకృష్ణుడిమీద, గోపికా సంవాదము,రుక్మిణీకృష్ణుల వాదము మొదలైన విషయాలు సరసంగా అతి సులభ శైలిలో వర్ణించబడ్డాయి.

"గొల్లవారి వాడలకు కృష్ణమూర్తీ నీవు
యేవిపనుల కొచ్చినావు కృష్ణమూర్తి
పాలుకొనవచ్చినానె గొల్లభామా మంచి
పాలుబోసి నన్నుబంపుగొల్లభామా
కొత్తకోడలనునేను కృష్ణమూర్తీ నీవు
అత్తగారి నడుగవయ్యా కృష్ణమూర్తీ
కొత్తకోడలనీవైతే గొల్లభామా నీకు
రొక్కమిత్తుపుచ్చుకోవె గొల్లభామా నీవు
రొక్కమేమి మాకు వద్దు కృష్ణమూర్తీ నీకు
కోటప్ప కన్నయియ్యి కృష్ణమూర్తీ"

రాముని సంబంధంగా

"ఆటలాడిరీ బెండ్లాటలాడిరీ
వాటముగా కొనగోటనమీటుచు
సూటిదప్పకను నేటుగ కుశలవు
లాటలాడిరీ బెండ్లాట లాడిరీ"
మల్లె పందిరదిగో - సుందరి
మాధవుడల్లదిగో - మొల్లసుగంధులు
మొనసి కొల్వగా - కల్లగాదు ఓపల్లవపాణిరో
మల్లెపందిరదిగో

ఇద్దరు బాలికలు ఒకరిచేతులనొకరుపట్టుకొని అడుగులు కలిపి తిరుగుతూ "ఒప్పులకుప్ప ఒయ్యారి భామా" అని ఆడేటప్పుడు అందులో పదవిన్యాసము అభినయ విన్యాసమూ మనం గమనించవచ్చును.

సారంగపాణి రచన మూడోభాగంలో గ్రామీణభాషలో వ్రాయబడిన గేయాలే కన్పిస్తుంటాయి.

"అగ్గితిరణాలంట అజ్జునికతలంట
అవురా యెంతసొద్దేమే భారతీకత
అవురా యెన్ని వింతలే
సుగ్గీవు జయములు దీనిసుట్టుబలాదూరు
అగ్గురోరపు అయ్యోర్నడిగేనీసాచ్చిగ "

అనేధోరణిలో నడిచే ఈ జానపదగేయములు రేడియోవారిచే సేకరించబడినవి.

"కొలిచితే వేణుగోపాల దేవుని కొలవవలెను
తలచితేవిష్ణుచారిత్రంబులు తలచుచుండవలెను
ఓజనులారా"

అంటాడు. క్షేత్రయ్యపదాల్లో భామాకలాపంలో నృత్య సరస్వతి పట్టం కట్టుకున్నట్టు సాక్షాత్కరిస్తుంది. క్షేత్రయ్య పదాలు భక్తి భావాన్ని పెంపొందించే రసగుళికలు. జావళీలు అనే పేరుతో జన సామాన్యంలో వ్యాప్తి పొందాయి. అక్షరరమ్యత వల్ల నృత్యానికి అనువుగా వుండడం చేత మధురభావాలతో కూడినవి కావడం వల్ల బాల బాలికలు యువతులూ ఈ పదాలను పాడి అభినయించి రసానుభూతిని కల్గించగలిగారు.

కాఫీరాగంలో పాడే

"అదొనే మోవి తనకుదానె వదలెనేనీవ" అనుపదమూ

తోడిరాగంలో త్రిపుటలో

''ఇన్నాళ్ళవలెగాదమ్మా మువ్వగోపాలు డెన్ని నేర్పినాడమ్మా" అనేపదము

ఆహిరిలో ''పచ్చి యొడలిదానర'' అని రేపు వత్తువుగానిపోర। అనునది ఆనందభైరవిలో ఆదితాళంలో పాడుతూ అభినయించే ''శ్రీపతినుతుబారికినే - నోపలేకనినువేడితే కోపాలా? మువ్వగోపాలా అనే పదాలు ప్రఖ్యాతిపొందాయి. నాట్యాచార్యులైన కూచిపూడి వారు ఈ పదాల్నీ భామాకలాపాల్నీ పాడి అభినయం చేసి సాంప్రదాయాల్ని నిలబెట్టారు.

ఈ విధంగా జానపదగేయములు ఛందోబద్ధములై లయాన్వితములై జనుల మనస్సును ఆకట్టుకొనుచున్నవి. సంగీత సారములను తెలియజేస్తూ సాహిత్య సొరభాలను విరజిమ్ముతూ జానపదగేయములు ప్రజలదైనందిన జీవితములో భాగస్వామ్యం కల్పించుకున్నాయి. జనుల మనసురంజింప చేసే ఈ జానపదగేయములు సుస్థిరములని చెప్పవచ్చును.

ఆధార గ్రంధాలు :

1. ఆంధ్రుల జానపదవిజ్ఞానం : ఆచార్య ఆర్వి-యస్.సుందరం
2. జానపదవాఙ్మయము : శ్రీహరి ఆదిశేషువు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అనంతలో అంతరిస్తున్న జానపద కళారూపాలు

– డా॥. బత్తల అశోక్‌కుమార్

పెనువేగంగా విస్తరిస్తున్న పాశ్చాత్య నాగరికతా ప్రభావం దేశీయమైన ఎన్నో కళల్ని, సంప్రదాయాల్ని, సాంస్కృతిక వారసత్వాన్ని తన పొట్టనపెట్టుకుంది. ఆ పాశ్చాత్య ప్రభావం మూలంగా కళల కాణాచి అయిన అనంతపురము జిల్లాలో దాదాపు కనుమరుగైపోయిన రెండు కళారూపాల్ని పరిచయం చేయాలన్న స్పృహతో ఈ మాటలను మీ ముందుంచుతున్నాను.

నేటి ప్రపంచీకరణ, పాశ్చాత్య సంస్కృతీ ప్రభావాల వల్ల ఎన్నో జానపద కళలకు పుట్టినిల్లుగా భావించే అనంత పురము జిల్లాలో జానపద కళారూపాల వైభవాన్ని వివ రిస్తూ, వాటి స్థితిగతులు, కనుమరుగవడానికి కారణాలను వివరించే ప్రయత్నం చేయడం, ముఖ్యంగా అనంత పురము జిల్లా అణిముత్యంగా భావించే "మెరవణిగద్య", ఆంధ్రదేశంలో మరెక్కడా కనిపించని "జట్టిజాము" కళా రూపాల ఉనికిని వివరించే ప్రయత్నం చేయడం ఈ పరిశోధనా వ్యాస ముఖ్యోద్దేశ్యం.

జానపద కళారూపం :

జనపదమంటే పల్లెటూరనీ, జనపదంలో నివసించే వారు జానపదులనీ, వారు పాడుకునే పాటలుగానీ, ఆటలుగానీ, నృత్యంగానీ, జానపద కళారూపాలేనని మన పెద్దలు నిర్వచించారు.

జానపద సాహిత్యమనీ, జానపద గేయాలనీ, జానపద నృత్యమనీ, జానపద సంగీతమనీ, జానపద వీధి నాటకమనీ, తోలుబొమ్మలనీ, బుర్రకథలనీ, యక్షగానా లనీ, జముకుల కథలనీ, పిచ్చుకుంటల 'కథ'లనీ, పగటివేషాలనీ, బయలాటలనీ, చెక్కభజనలనీ..... ఇలా ఎన్నో వందలాది జానపద కళారూపాలు పల్లీయులకు విజ్ఞానాన్నీ, వినోదాన్నీ కలిగించాయి.

శతాబ్దాలుగా రాజులు పోయినా, రాజ్యాలు పోయినా జానపద కళలు మాత్రం ప్రజా హృదయాలలో అలాగే నిలిచి ఉన్నాయి. ఎన్ని ఆటుపోటులు వచ్చినా, ప్రజలు వాటిని పోషించారు. కళలనూ, కళాకారులనూ కన్న బిడ్డలుగా చూసుకున్నారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో అన్ని కళారూపాలను వారు నిలబెట్టుకోలేకపోయారు. అనంతపురము జిల్లాలో ఒకప్పుడు ఎంతో వెలిగి నేడు అంతరించిన, ప్రాభవం కోల్పోయిన జట్టిజాము, మెరవణి గద్యల గురించిన చిరు పరిచయమిది.

జట్టిజాము కళారూపం :

సంక్రాంతిలాంటి పండుగల సందర్భంగా ఇంటి ముందు రంగవల్లులను అలంకరించి, ఆ ముగ్గుల మధ్య పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి వాటిపై పేడతో చేసిన గొబ్బెమ్మలు ఉంచి యువతులు వాటి చుట్టూ చేరి "గొబ్బియలో గొబ్బియలో" అంటూ గుండ్రంగా తిరుగుతూ, పాటలు పాడుతూ, చప్పట్లు చరుస్తూ, ఒంగుతూ లేస్తూ నృత్యం చేస్తారు. ఇది కోస్తా ప్రాంతంలో ముఖ్యంగా కనిపిస్తుంది.

ఇలాంటి కళారూపమే గుజరాత్‌లోనూ, మహా రాష్ట్రం లోనూ "గర్భానృత్యం"గా ఉందనీ, అదే గొబ్బి నృత్యం కావొచ్చనీ, "లాలీ గర్భా ప్రభేదమే" జట్టిజాముని పోలే నృత్యమనీ, ఆచార్య తూమాటి దొణప్పగారు "జానపద కళాసంపద(పుట190)లో వివరించారు.

జట్టిజామంటే తాళపత్ర ప్రధానకళ అనీ, గొబ్బిలోలాగా ఈ కళారూపంలో గుండ్రంగా చుట్టిరావడం ఉండదనీ, కోలాటంలో మాదిరి చేతిలో కోలలుగానీ, చెమ్మచెక్కలో మాదిరి గెంతడంగానీ ఉండదనీ, కాలు కదపకుండానే ఉన్నవాళ్ళు ఉన్న చోటే ఉండి జట్టిజాము చేయవచ్చని తెలిపారు శ్రీ దొణప్పగారు.

"జట్టిజాములో చేతులు చరచుట, అంటే చప్పట్లు లాంటివి ఉంటాయి. నిటారుగా నిలబడి ఉభయ పార్శ్వాల్లో ఉద్ధికత్తెలతో ఒద్ధికలు చెడకుండా ఒకసారి కుడి ప్రక్కకూ, ఆవెంటనే ఎడమ ప్రక్కకూ పార్శ్వముఖ భంగిమలో ఓరగా తిరిగి ఆయావేపుల ఉండేవారి అర చేతుల్ని తన చేతులతో తట్టుతూ పాడుతూ ప్రదర్శించేది జట్టిజాము" (తెలుగువారి జానపద కళారూపాలు, డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, పుట 304)

మహిళలకు సంబంధించిన కళారూపం :

ఇది పూర్తిగా స్త్రీలకు చెందిన కళారూపమని చెప్పవచ్చు. ఇందులో ప్రప్రథమంగా చేతి కోలల్ని ఉపయోగించినట్లు ఊహిస్తున్నారు. "సంస్కృతంలో చేతి కోలలని అర్థమిచ్చే "యష్టి"ని ప్రాకృతంలో 'జామ' అంటారని, అందుకు ఉదాహరణగా జామపాటల్లో "వెన్నెలాయలో... వెన్నీ దాయలో వెన్నిటీ" అనే పదాలుంటాయని ఆర్వీఎస్ సుందరంగారు జానపద విజ్ఞానంలో వివరించారు".

జట్టిజాము వేయాలని నిర్ణయించుకొన్న స్త్రీలు ఆరోజు సాయంత్రమే తమ వంటపనుల్ని ముగించుకొని, ఇంట్లోవారికి భోజనంపెట్టి నలుగురూ ఒక చోటికి చేరతారు. అందరికీ అనుకూలంగా, విశాలంగా ఉన్న ఇంటి ముందు స్త్రీలు గుమికూడతారు. ముఖ్యంగా ఈ కళను ప్రదర్శించేందుకు చైత్ర, వైశాఖ, కార్తీక, మార్గశీర్ష మాసాలు అనుకూలం. స్త్రీలు చిన్నతనం నుంచి వాళ్ళ అమ్మమ్మల ద్వారా, అమ్మలద్వారా, అత్తల ద్వారా, నాయనమ్మల ద్వారా వింటుండే పాటలు కంఠస్థమై ఉంటాయి. ఈ కళారూపంలో పాల్గొనాలంటే నలుగురు లేక అంతకంటే ఎక్కువమంది సరిసంఖ్యలో ఉండాలి. ఉన్నమొత్తంలో సరిసంఖ్య (2,4,6,8) వచ్చేవారు ఒక జట్టు, బేసిసంఖ్య (1,3,5,7)లో వచ్చేవారు ఒక జట్టుగా ఏర్పడతారు. ఇరుజట్లవారు కలిసి గుండ్రంగా నిలబడతారు. మిగిలినవారు ప్రేక్షకులుగా ఉంటారు. ఒకజట్టువారు పాటలో ఒక పాదాన్ని పాడితే రెండవ జట్టువారు వంతపాడతారు. ప్రతిసారీ పూర్వపాదాన్ని తిప్పి తిప్పి పాడుతారు. అన్ని పాదాల్ని అలాగేపాడీ, పాదాంతంలో చివర "తుమ్మెదా, నడియలో, వెన్నిదాయలో, వెన్ని లాయలో, రామరామా కోదండరామా, రామాంజనా స్వామి, శ్రీరామ నారాయణ" అని కంఠాలు కలుపుతారు.

రెడ్డొళ్ళ కుచ్చెండ్లే	॥తుమ్మెదా॥
తేలైన కుట్టింది	॥తుమ్మెదా॥
యాయేల్కి కుట్టింది	॥తుమ్మెదా॥
నడిమేల్కి కుట్టిది	॥తుమ్మెదా॥
మా యమ్మి చెప్పండి	॥తుమ్మెదా॥
మందైన బంపమని	॥తుమ్మెదా॥
మాయమ్మ దెచ్చిన మందు	॥తుమ్మెదా॥
మరిమంటలాయె	॥తుమ్మెదా॥
మా వాళ్కి జెప్పండి	॥తుమ్మెదా॥
మందైన బంపమని	॥తుమ్మెదా॥
మగడు దెచ్చిన మందు	॥తుమ్మెదా॥
మరిమంటలాయె	॥తుమ్మెదా॥
ఎదురింటి చిన్నోణ్ణి	॥తుమ్మెదా॥
ఇంటికి బిలవండి	॥తుమ్మెదా॥
మందు మంత్రమేసె	॥తుమ్మెదా॥
మది సల్లనాయె	॥తుమ్మెదా॥

ఇందులో ఒక రెడ్డి యువతి తన సరసుని దగ్గరకు చేరుకోవడానికి ఒకసాకుగా ఈ విధంగా చేసిందని జానపదులు పాడుకోవడం కనిపిస్తుంది. ఇలాంటి జట్టిజాముల పాటలు ఎన్నో అనంతపురము జిల్లా గ్రామీణ ప్రాంతాలలో ఒకప్పుడు పరిఢవిల్లాయి.

కనుమరుగైపోయిన జట్టిజాము :

ప్రస్తుత పరిస్థితులనుబట్టి చూస్తే ఈ అరుదైన జట్టిజాము కళారూపం కనుమరుగైపోయిందని చెప్పవచ్చు. ఇందుకు అనేక కారణాలు చెప్పుకోవచ్చు. అందులో ముఖ్యంగా ....

- గ్రామీణ ప్రాంతాలలో పంటలు పండక పల్లీయుల్లో అధికభాగం తమ పొట్ట నింపుకునేం

దుకు, కుటుంబాన్ని పోషించుకునేందుకు అధికంగా శ్రమించడం, ఉపాధి నిమిత్తం పట్టణాలకు వలసపోవటం.

- పాశ్చాత్యీకరణ వల్ల మానవుల జీవితాల్లో మార్పు చేసుకోవడం, సంఘం నుంచి ఏకీకృత భావన రావడం.
- ప్రపంచీకరణ ప్రభావంతో వార్తా ప్రసారాలు, సాంకేతిక విప్లవంతో మొదలైన టీవీ ప్రసారాలు, సదరు గ్రామీణ మహిళల్ని ఇంటికే పరిమితం అయ్యేలా చేశాయి.
- ఇటీవలి కాలంలో పెరిగిన టీవీ సీరియల్ పుణ్యాన నలుగురు స్త్రీలు ఒక చోట చేరడమే మానేశారని చెప్పవచ్చు.

జతకట్టడమే జరగనప్పుడు ఇక జట్టిజాము గురించి పట్టించుకునేదెవ్వరు?.

అనంత ఆణిముత్యం మెరవణిగద్య :

మెరవణి అంటే వధూవరుల ఊరేగింపు. ఇది పెళ్ళి తర్వాత జరిగే తంతు. పెళ్ళి కొడుకును, పెళ్ళి కూతురిని పెళ్ళి అయిన రోజు సాయంత్రం (రాత్రి) అందంగా అలంకరించిన ఎద్దుల బండిలో కూర్చోబెట్టి, డప్పులు, మేళాలతో ఊరంతా ఊరేగించేవారు. ఇది రాయలసీమ జిల్లాలైన అనంతపురము, కర్నూల్ జిల్లాలు, కర్ణాటకలోని బళ్ళారి ప్రాంతంలో కనిపిస్తుంది. అయితే ముఖ్యంగా ఇది అనంతపురము జిల్లాలోని ఒక ఆణిముత్యమైన కళారూపమని చెప్పుకోవచ్చు. వాస్తవానికి ఈ మెరవణి అనేది ఆడంబరాలు చూపించేందుకే అయినా ఇందులో గ్రామీణుల అలంకార ప్రియత్వం, ఊరేగింపులో ఎడ్లబండిని తీర్చిదిద్దే రమ్యత్వం మెచ్చుకోకుండా ఉండలేము.

ఊరేగింపు సందడి :

ఈ మెరవణి గద్య సంస్కృతిపై పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్ర ప్రభావం కొంతమేర కనిపిస్తుంది. మెరవణికి అలంకరించిన బండిపై కుర్చీలలో పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు వారికి ముందు వెనకల పెళ్ళింటివాళ్ళ పిల్లలు, బండితోలే వ్యక్తికి మంచి వేషం, పెళ్ళికూతురు, పెళ్ళికొడుకులు చీకట్లో బాగా కనిపించేందుకు వెలుతురుకోసం ఇలాయికట్లు (కిరోసిన్ దివిటీలు - కర్రకొనకు ఇనుప చువ్వను బిగించి దానికి నూలుబట్టను చుట్టి, కిరోసిన్‌లో బాగా నానబెట్టిన అనంతరం వెలిగిస్తారు), కిరోసిన్ లైట్లు (పెట్రోమాక్స్ లైట్లు),గ్యాస్‌లైట్లు పట్టుకునేవారు, ఇరుసులు, అచ్చులు ఎత్తేవారు, పటాకులు (బాణాసంచా) కాల్చేవాళ్ళు, బండికి నాలుగువైపులా పెండ్లికి వచ్చిన బంధుగణం మెరవణిలో వెళుతూ ఉంటే వారిని చూడ్డానికి ఊరిజనం, వీధులనిండా, మిద్దెలపై జనాలు ఉండే ఆ ఘట్టం ఒక మధురమైన అనుభూతిని నింపుతుందనడంలో సందేహంలేదు.

ఈ ఊరేగింపు జరుగుతున్న సందర్భంలోనే బండికి పూర్తి ముందువైపున మేళగాళ్ళు, వాద్యకారులు, తప్పెట్లు కొట్టేవారు, రంగురంగుల దుస్తులు ధరించి ఉంటారు. ముఖ్యమైన కూడలి స్థలాలు, రచ్చకట్ట దగ్గర మెరవణి బండిని ఆపుతారు. ఇరుసులు ఎత్తేవారు తమ ప్రదర్శను చేపడతారు. ఇనుప అచ్చులు లేదా బండి ఇరుసులను ఎత్తి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తారు. ఇరుసులు ఎత్తేవారు ఎక్కువమంది ఉంటే పోటీలు కూడా పడతారు. ఎవరు ఎక్కువ బరువును ఎత్తుతారో అని పందేలు కూడా వేస్తారు. అనంతరం మెరవణి గద్య వుంటుంది. అప్పుడు వాద్యకారుల గుంపు నాయకుడు మెరవణి గద్యను ఆశువుగా పఠిస్తాడు. ఇందులో రెండు రకాలుగా గద్య ఉంటుంది. ఒకటి పొగిడింపు అయిదే రెండోది నింద రూపంగా ఉంటుంది. ఆ సందర్భానికి తగ్గట్టు వేళాకోలానికేగానీ, వ్యక్తిగత విమర్శగా దానిని భావించరు జానపదులు.

పొగిడింపు గద్య :

వోహో హోయ్ హోయ్
పగలరాతి గుండు పగల గొట్టవచ్చు

కొండలన్ని పిండిగొట్టవచ్చు
విశ్వదాభిరామ వినురవేమా

.....

తూమటోళ్ళ నారాయణప్ప అంటే
చప్పన్నారు దేశాలలో సరదారు
ముప్పైఆరు పల్లెల్లో మంజూరు
యెక్కంగా గుర్రాలు - యేడూర్ల పెత్తనం
కుచ్చుల్ల తురాయి - పచ్చల పల్లకి
ఐదేళ్ళ కుంగరాలు - ఆస్తి కడియాలు
ఇదిగో అంటే - ఇరవైమంది
పనిబడితే పాదాల కడ - పదివేలమంది

..... ఇలా సాగిపోతుంది. తమకు మెరవణిలో పాడేందుకు పైకం(ధనం) ఇచ్చినందుకు ఆ పెళ్ళిపెద్దను పొగుడుతూ... అతన్ని అపర దానకర్ణుడుగా, అతని వైభోగాన్ని దేవతలరాజు దేవేంద్రుని వైభోగంతో పోలుస్తూ గద్యను పఠిస్తారు. ఇదే సందర్భంలో వారికి డబ్బులు ఇచ్చి వరుసైన వాళ్ళను తిడుతూ (వేళాకోలం) చేస్తూ పాడమని కోరేవారూ ఉంటారు. దీన్నే తెగిడింపు గద్య (నింద గద్య) అని అంటారు.

వొహొ హొయ్
చీచీచీ చీమల పుట్ట - రెక్కలేని కోడిపెట్ట
నీ నోట్లో పుండుబుట్ట - నిన్ను ముదిరి పెట్ట
నీ కాళ్ళూడగొట్ట - వొహొ హొ
పెండ్డికొడుకు బావమర్ది - పేడిమూతి
పెద్దయ్య ఉండాడే - యలకను జూస్తే యదబడతాడు
పిల్లిని జూస్తే పారిపోతాడు
పీతిరి గుంతల్లో పొర్లాడి
జలారి గుంతల్లో జలకాలాడి
చినుగుల చల్లాడం గట్టుకోని
గోనిపట్ట రుమాలు జుట్టుకోని.....

ఇలా ఎగతాళి చేస్తూ సాగుతుంది.

ప్రస్తుత ప్రపంచీకరణ, పాశ్చాత్య పోకడల నేపథ్యంలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, ప్రాచీన కళారూపాలు కనుమరుగవుతూ వస్తున్నాయి. ఈ మెరవణి స్థానే "రిసెప్షన్" వచ్చింది. సహపంక్తి భోజనాల బదులు "బఫేసిస్టం" నడుస్తోంది. అనంతపురము జిల్లాలో ఎంతో వెలుగు వెలిగి నేడు కనుమరుగైన జట్టిజాము, మెరవణి గద్యలను ఒకసారి స్మరించుకుందాం.

ముగింపు :

అనంతపురము జిల్లాలో ఒకప్పుడు ఎంతో ఆదరణ చూరగొని ఆణిముత్యాల్లా వెలిగిన జానపద కళలు క్రమ క్రమంగా తెరమరుగయ్యాయి. అలాంటి వాటిలో జట్టి జామును ప్రదానంగా పేర్కొనవచ్చును. నేటి ఆధునిక యుగంలో మనిషి తన మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చు కుంటున్న సందర్భంలో ఇలాంటి కళలు తెరమరుగు కాక తప్పదు. వివాహాల సందర్భంలో సైతం అనేక మార్పులు వచ్చాయి. దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో పెళ్ళి వేడుకలు అసలు లేవనే చెప్పాలి. నిత్యం కరువుతో అల్లాడే అనంతపురం జిల్లాలో ఆధునిక పోకడలు లేక పోలేదు. ఉన్నవాళ్ళు ఆడంబరంగా పెళ్ళిల్లు చేస్తున్నా, ఆణిముత్యంలాంటి మెరవణిని, అందులో కీలకమైన మెరవణిగద్య గురించి ఏమాత్రం పట్టించుకోలేదనే చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. జానపద విజ్ఞానం - ఆర్వీఎస్ సుందరం
2. తెలుగువారి జానపద కళారూపాలు - డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
3. జానపద కళా సంపద - ఆచార్య తూమాటి దొణప్ప
4. జానపద నృత్యకళ - డా. చిగిచర్ల కృష్ణారెడ్డి
5. సంగీతం - నృత్యం - నాటకం - ఆంధ్రప్రదేశ్ జానపద కళోత్సవాల సంచిక (1970)
6. ప్రజా కళారూపాలు - డా. జయధీర్ తిరుమల రావు.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కర్నూలు జిల్లా జానపద కళారూపాలు – వాద్య పరికరాలు

– డా॥. బి. చిన్న వెంకటేశ్వర్లు, తెలుగు అధ్యాపకులు, ఆదోని ఆర్ట్స్ & సైన్స్ కాలేజి, ఆదోని, కర్నూలు జిల్లా.

అటవికులు సూర్యుడే భగవానుడుగా, ప్రకృతే దేవతగా ఆరాధించారు. ఆదిమానవుడు వేసిన తొలికేక ప్రకృతిలో ప్రతిధ్వనించినప్పుడు లయాన్వితమైన ఆ ధ్వనిని అనుకరిస్తూ అతను చిందులు వేసినపుడు ఆట పాట పుట్టాయని విజ్ఞులు అంటారు. మౌలికమైన ఈ ఆట పాటలు అతని మేథోవికాసంతో పాటు ఎదిగి నగిషీలు దిద్దుకొని బహు కళారూపాలుగా వెలిశాయి. జానపదులు సృష్టించిన నిసర్గ మధురమైన ఈ కళారూపాలే జాతి సంస్కృతికి మూల సంపదలై నిలిచాయి.

కర్నూలు, కడప, చిత్తూరు,అనంతపురం జిల్లాలు రాయలసీమ ప్రాంతంలో భాగంగా ఉన్నాయి.

రాయలసీమ ప్రాంతంలో దేవాలయాలు ఎక్కువగానే ఉన్నాయి. యోగులు, బాబాలు, తాత్వికులు కూడా చాలా మందే ఉన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలవారు కొలుచుకునే గ్రామదేవతలు కూడా బాగానే కనిపిస్తారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి ఏటా దేవాలయాల చెంత, గ్రామ దేవతలున్న ప్రాంతాల్లో జాతరలు, తిరునాళ్ళు జరుగుతుంటాయి. ఇది పల్లెపట్టు సంస్కృతిని తెలియజేస్తుంది. తెలుగునాట ఇతర ప్రాంతాలకు భిన్నంగా సీమకే ప్రత్యేకించిన తిరునాళ్ళు ఉన్నాయి.

కర్నూలు జిల్లా రాయలసీమ ముఖద్వారంగా ఉన్న ఒకప్పటి ఆంధ్ర రాష్ట్ర రాజధాని కందనవోలుగా పిలిచే ఈ జిల్లా కాలక్రమేన కర్నూలు జిల్లాగా మారి 53 మండలాల నివాసిత ప్రాంతాలను నెలకొల్పుకొన్నది.

కర్నూలు జిల్లా వ్యవసాయానికి పెట్టింది పేరు. మంచి సారవంతమైన నల్లరేగడి భూముల్లో వరి, జొన్న, పత్తి, పొద్దుతిరుగుడు, పొగాకు పంటలు పుష్కలంగా పండుతాయి. ఎర్రనేలలో వేరుశనగ, కంది, టమోటా, సద్దలు, అలసందలు, వాము పండిస్తారు.

పల్లెలు సుభిక్షంగా ఉండడం వల్ల వృత్తి కళాకారులు భిక్షాటనం మీద జీవనం గడిపేవారు ఈ ప్రాంతానికి క్రమం తప్పకుండా వస్తుంటారు. వాళ్ల ద్వారా జిల్లా వాసులందరికీ జానపద కళలతో పరిచయం ఏర్పడ్డమే గాక, వినోదం పుష్కలంగా లభిస్తున్నది.

జానపద కళల్లో రంగస్థలం మీద ప్రదర్శించే కళలు కొన్ని ఉన్నాయి. ఇవి ప్రధానంగా సాహిత్యానికి సంబంధించినవి. సాహిత్య సంబంధ కళలు అంటే హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, వీధినాటకం మొదలైనవి ఈ కోవకు చేరుతాయి. కర్నూలు జిల్లాలోని కళారూపాల్లో సాహితీ సంబంధిత రంగస్థల కళలలు చోటు చేసుకున్నాయి.

కర్నూలు జిల్లా -సాహిత్యేతర ప్రదర్శన కళలు ప్రత్యేకంగా రంగస్థలం ఏర్పాటు లేకుండా వీధి చావిళ్ళలో, ఇళ్ల ముంగిళ్లలో కథా ప్రాధాన్యం లేకుండా చిన్న చిన్న సంభాషణలతో, పాటలతో, పద్యాలతో రక్తి కట్టించే పగటి వేషాలు, పులివేషాలు, కర్రసాము, బీరప్పడోలు, జ్యోతి నృత్యం, గొరవయ్య నృత్యం, నందికోలు సేవ, లంబాడి నృత్యం, ఆసాది నృత్యం, కోలాటం, చెక్కభజన, గంగిరెద్దులాట లాంటి కళారూపాలు సాహిత్యేతర ప్రదర్శన కళలు.

తోలుబొమ్మలాట :

'తొంబై ఆమడ దూరం వెళ్లి తోలు బొమ్మలాటను చూడాల'ని నానుడి ఉన్నది. తోలుబొమ్మలాట జానపదుల రూపకాలలో విశిష్టమైనది. వారి కళానైపుణ్యానికి గీటురాయి వంటిది తోలుబొమ్మలాట. దీనిలో చిత్రకళ, ఆట, సాహిత్యం, గాత్ర సంగీతం, వాద్య సంగీతం ఉండడం వల్ల ఇదొక సమాహారకళగా జానపదులను అలరిస్తుంది. తొలుబొమ్మలాడించే వారు తెర వెనుక ఉండి పద్యాలు, పదాలు, దరువులు చెబుతూ ఆయా

పాత్రలకు తగినట్టు సంభాషణలు, సంధివచనాలు పలుకుతూ కథను నడుపుతారు. దీనిలో గద్యపద్యాలలో పద్యానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. గేయాలకు కూడా తగిన స్థానముంది. తెలుగువారి తోలుబొమ్మలాటకు రామాయణ, భారత ఇతివృత్తాలే ప్రధాన ఆలంబనాలుగా ఉన్నాయి. పాండవ జననం, లంకాదహనం, కీచక వధ, ప్రహ్లాద చరిత్ర, మైరావణ చరిత్ర మొదలైన ఇతివృత్తాలతో తోలు బొమ్మలాటను ప్రదర్శిస్తారు. సూత్రధారులు ముఖారి, మధ్యమావతి, ఆరభి, ఆనందభైరవి రాగాలతో గేయాలను ఆలపిస్తారు. తోలుబొమ్మలాట ఊరి బయట ఖాళీ బీడు ప్రాంతంలో వేదిక ఏర్పాటుచేసి ప్రదర్శిస్తారు. కృత్రిమంగా వేదికను నిర్మిస్తారు. ముందు భాగాన తెరగా (స్క్రీన్) తెల్లచీర ఉంటుంది. మగపాత్రల వెనుక మగ వారు, ఆడపాత్రల వెనుక ఆడవారు ఉండి బొమ్మలను కదిలిస్తూ కథను నడిపిస్తారు. ఆట రాత్రి సుమారు పది గంటలకు ప్రారంభమై తెల్లవారు జాము వరకు జరుగుతుంది. మొదట వినాయకుని తరువాత సరస్వతిని విష్ణువును ప్రార్థించి ఆట ప్రారంభిస్తారు.

తోలుబొమ్మలాట అంటే చాలు రాముడు, లక్ష్మణుడు, సీత, ఆంజనేయుడు, రావణుడు పాత్రలతో పాటు కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, అల్లాటప్పగాడు వంటి హాస్యపాత్రలు ప్రధానంగా వస్తాయి. ఈ పాత్రలు గ్రామీణుల మనస్సులపై విశేష ఆదరణ చూపాయి. తోలుబొమ్మలాటలో ప్రధానకథకు ఎంత ప్రాముఖ్యత వుండేదో, ఈ హాస్యపాత్రలకూ అంతే ప్రాధాన్యత ఉండేది. ఈ పాత్రలకు సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రలద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢనమ్మకాలను ఎండగట్టేవారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపులు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యాలు కూడా ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిల్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ఉంటాయి. తోలుబొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతాలకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. ఈ తోలుబొమ్మలను తయారు చేయడానికి జింక, దుప్పి, గొర్రె, మేకల చర్మాన్ని ఉపయోగిస్తారు. మొదట తోళ్ళను పారదర్శకంగా చేసి కొలతలు గీసుకొని కత్తిరిస్తారు. రంగులను ఒక్కసారిగా వేయకుండా దశల వారిగా వేస్తారు. జిగురు పూసి దారం పురిపెట్టి బొమ్మల అవయవాలను కీళ్ళ దగ్గర కుట్టి కలుపుతారు. ఏ కోణంలోనైనా త్రిప్పడానికి అనుకూలంగా కుడతారు.

బుర్రకథ :

'బుర్రమ్మోట అనే వాద్యాల సహకారం వల్ల ప్రవర్తితమయ్యే కథాగేయమే బుర్రకథ'. కన్నడంలో దీనికి గుమ్మటి అనిపేరు. తెలుగుదేశంలో బుర్ర, గుమ్మటి వాద్య విశేషాల వల్లనే దీనికి బుర్రకథ అనే పేరు స్థిరపడింది.

బుర్రకథ పాటకు కందనవోలు గడ్డ తందానతాన, తయిదాన తాన తందానా... అంటూ సాగే బుర్రకథకు తలలు ఊపని వారు కర్నూలు జిల్లాలో లేరని చెప్పవచ్చు. సీతారాముల వారి వనవాసం గురించి కంటనీరు పలికేలా, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీరచరిత్ర గురించి రోమాలు నిక్కబొడిచేలా, అన్నదాత బుడ్డా వెంగళరెడ్డి దానకర్ణుడంతటి గొప్పవాడని, వీరాభిమాన్యు శౌర్యాన్ని వివరిస్తూ అయ్యో పాపం పసివాడు అనిపించే శ్రోతలను మంత్రముగ్ధులను చేసే ప్రాచీన జానపదకళారూపం బుర్రకథ. అలాగే పల్నాటి యద్ధం, అల్లూరి సీతారామరాజు వంటి అనేక కథనాలపై వేదిక మీద ప్రత్యేక ఆహార్యం, కథకు తగిన హావభావాలతో రాగతాళ నృత్యాభినయ మెరుపు విన్యాసాలతో కూడిన బుర్రకథ ప్రదర్శనలు కర్నూలు జిల్లా వాసులకు కనువిందు కలుగజేస్తున్నాయి.

ఈ విధమైన తందాన కథని
"వినరా! భారత వీర కుమారా!
విజయము నీదేరా! తందానా తాన!!

"సై సైరా! నరసింహారెడ్డి! రెడ్డీ!
నీ పేరే బంగారపుకడ్డీ !! తందాన తాన !!
"ధీరుడమ్మా! నరసింహరెడ్డి"
శూరుడమ్మా! నరసింహారెడ్డి తందాన తాన!

ఇలాంటి కథలను గేయాల రూపంలో పాడుతూ మధ్యమధ్యలో 'తందాన తాన' అంటూ ఉంటే వినేవారికి వీనుల విందుగా ఉంటుంది.

బుర్రకథలను చెప్పేవారిని బుడిగజంగాల కథకులు అని, తందాన కథకులు అని పేరు పొందారు. వీరు ఉపయోగించే సంగీత సామగ్రి తాంబూర డివికీ (డక్కీ) - గగ్గెర్లు (అందెలు) కాలిగజ్జెలు, వీరి వేషధారణ, తలపాగ ఏదో ఒక రంగులో ఉంటుంది. పంచెకట్టు అంగీపైన నల్లని కోటు, శాలువ, కాలికి గజ్జెలు, మెడలో కొన్ని పూసల దండలు చెవులకు కుండలాలుంటాయి. ఈ వేషధారణ చూస్తూ ఉంటే చూపరులకు అదొక ఆనందాన్ని కల్గించక మానదు. వంతలు చెప్పడానికి ఆడవారు ఇద్దరు సాధారణ స్త్రీల దుస్తులలోనే ఉంటారు. బుర్రకథ కళాకారులు పంటల కాలంలో గ్రామాలకి వస్తుంటారు. బుర్రకథ ప్రదర్శనలో ముగ్గురు బృందంగా, అందులో మధ్య పాత్రధారి ముఖ్య కథకుడు, మగవాడి వద్ద బుర్ర - తంబూర, ఎడమ చేతిలో గగ్గెర్లు (చిటికెలు) కాళ్ళకు గజ్జెలు వాడితే అటూ ఇటూ ఇద్దరు స్త్రీలు లేక పురుషులలో ఒకరు వంత కథకు మరొకరు హాస్య కథకులుగా గుమ్మెటులతో ఉంటారు. గుమ్మెటలు కంచుతో చేయబడి ఒకవైపు కోలగా సన్నగా ఉండి తెరచుకున్న మూతి వంటిదిగా ఉండి, మరోవైపు తోలుతో కప్పిపెట్టబడినదిగా ఉండి ఇద్దరు వంతలు చెప్పడానికి అనువుగా ఉన్న పరికరాలు, గుమ్మెట మీద "ధిం - త -ర" అనే గతి బుర్రకథ వరుసల్లో కొడతారు. బుర్రను ఉపయోగించి చెప్పే కథనే బుర్రకథ అని, తంబూర కథ అని, తందనాకత అని పిలుస్తారు.

హరికథ :

ప్రాచీన కళారూపాలలో ఆబాలగోపాలాన్ని ఆకర్షించి ఆనందింపజేసే ప్రక్రియలలో 'హరికథ' ఒకటి. ఈ హరికథలో వస్తువు రామాయణ, భారత, భాగవతాలేకాక చారిత్రక, సాంఘిక కథలు కూడా ఉంటాయి. ప్రధానంగా హరికథలు దైవభక్తికి సంబంధించినవిగా ఉంటాయి.

శ్రీమద్రమారమణ గోవిందా...హా! అంటూ హరి కథకులు హరికథను ప్రారంభిస్తారు. అంతకుముందు ఇష్టదైవాన్ని ప్రార్థనచేసి మళ్ళీ శ్రీమద్రమారమణ గోవిందా... హా! అని ప్రేక్షకులచేత అనిపిస్తారు. ఈ హరికథ కేవలం హరిలీలలను మాత్రమే చెప్పడం జరుగుతుంది, అది రాత్రిపూటనే. హార్మోనియం, తబలా పరికరాల సహకారంతో హరికథకులు గానం చేస్తారు. ఒకే కథకుడు గొంతెత్తి గానం చేస్తూ మధ్యమధ్య కథని అభినయ పూర్వకంగా వివరిస్తూ, కాళ్ళకు గజ్జెలు, మెడలో పూలమాల ధరించి, పంచకట్టుతో పై వస్త్రం లేకుండా, చేతిలోని చిఱతలతో తాళం వేస్తూ లయబద్ధంగా నృత్యం చేస్తూ ప్రేక్షకులను రంజింపచేస్తాడు. రామాయణ, భారత, భాగవతం వంటి ఆధ్యాత్మిక సంబంధిత పురాణేతిహాసాల కథలను తెలిపి, ప్రజలకు ముక్తి మార్గంపట్ల పయనించే టట్లు చేయడమే ప్రధాన కర్తవ్యం. అలాగే అలౌఖిక ఆనందంతో పాటు ఆధ్యాత్మిక తత్వాన్ని బోధించే హరికథ లంటే వృద్ధులే కాదు, చిన్న పిల్లలు కూడా ఇష్టపడతారు. హరికథకులు గానం చేసే కథల మధ్యమధ్యలో విసిరే చలోక్తులు, పిట్టకథలు భక్తులను కదలనీయకుండా ఆనందపరుస్తారు. ఈ విధమైన హరికథలను పురుషులే కాదు స్త్రీలు కూడా సాధారణ దుస్తులతో హరికథకులుగా ఏకధాటిగా మూడు గంటలకు పైగా కథా గానం చేస్తారు. హరికథా కాలక్షేపాలు ఒకరోజు మొదలు వారం రోజుల వరకూ చెబుతుంటారు. ఇలాంటి హరికథలను చెప్పడానికి ప్రత్యేక వేదిక లేకపోయినా, గ్రామ చావిడిలోనూ, దేవాలయ ప్రాంగణంలోనూ, పాఠశాలల ఆవరణాల లోనూ గ్రామస్థులు ఏర్పాటు చేస్తుంటారు. ఈ కథకులు ఊరూరా తిరుగుతూ కథలు చెబుతూ ఉంటారు. గ్రామ పెద్దల అధ్వర్యాన ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కథకులు ఇంత మొత్తమని అడగరు.

రాత్రిపూట చెప్పిన కథను బట్టి గ్రామవాసులే చందాల రూపకంగా వసూలు చేసి కథకులకు అందజేస్తూ ఉంటారు. ఆ మొత్తంలోనే తన వెంట వచ్చిన కళాకారులకు అందజేయవలసి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో నైతే ధనంతోపాటు ధాన్యం, అలాగే క్రొత్త వస్త్రాలను కథకులకు ఇచ్చి సత్కరిస్తారు పల్లెవాసులు.

వీధి నాటకం :

కర్నూలు జిల్లా నాటక రంగం మూడుపువ్వులారు కాయలుగా విరాజిల్లింది. సామాన్య మానవులు గ్రామీణ నేపథ్యం కలవారు. పల్లెవాసుల ఆట పాటలే జానపద నాటకాలకు నాంది. జానపదులు వీధి నాటకాలను వీధి కూడళ్ళలోనే కాకుండా గుడి ముందు, లేదా గ్రామ పెద్ద ఇంటిముందు కూడా ప్రదర్శిస్తారు. నిరంతర కష్టాల కడలిలో ఉన్న మానవ జీవితానికి మానసిక ప్రశాంతతతో పాటు సత్ప్రవర్తనను నాటకాలు నేర్పుతాయి. రాత్రి 9 గంటల నుంచి ఉదయం ఆరుగంటలవరకు ఎక్కడా విరామం లేకుండా ప్రేక్షకులను నిరుత్సాహ పర్చకుండా, ఎవరినీ నిద్రపోనీయకుండా చివరి ప్రేక్షకుడి వరకూ వినపడేలా మధురమైన గానం, మాటలతో ప్రేక్షకులను ఆనందపరిచే స్వచ్ఛమైన జానపద కళారూపమే వీధి నాటకం. ఇది కర్నూలు జిల్లాలో ఎక్కువ ప్రచారంలో ఉన్నది. ప్రతి మండలంలోనూ, ప్రతి గ్రామంలోనూ ఈ కళారూపం చూడని ప్రేక్షకులు అంటూ ఉండరు. ఈ వీధి నాటకాన్ని అంత గొప్పగా కర్నూలు జిల్లాలో ప్రదర్శిస్తారు. ఈ వీధి నాటకం ప్రదర్శించడానికి ముందు అంటే దాదాపు 40 రోజులకు పైగా గ్రామవాసులకు శిక్షణ, దర్శక పాత్రకు గురువు బాధ్యతలు స్వీకరిస్తాడు. ఒక్కొక్క నటుని గొంతునూ, శారీరకావస్థలను పరిశీలించిన పిదప నటుడిని పాడమనడం, ఆ విధంగా నటులను పరీక్షించి పాత్రలను ఎన్నుకుంటారు. రోజు సాయంకాలం గురువు సమక్షాన, నటులు పాటలు గానీ, డైలాగ్స్ గానీ, నాట్య పద్ధతులు గానీ శిక్షణ పొందేవారు. సరిగ్గా చేయకపోతే గురువు తానే స్వయంగా ఆడి, పాడి చూపిస్తాడు. నాటక ప్రదర్శనకు రెండు గంటల ముందు మేకప్ తయారు కావడం జరుగుతుంది. నాటకాల ప్రదర్శనలో సంగీత పరంగా మద్దెల, తాళాలు, గజ్జెలు హార్మోనియం, తబలా, డప్పులు ఉపయోగించగా స్టేజి అలంకరణ, కర్టెన్లు, మైక్‌లు, లైటింగ్, డ్రస్సింగ్, మేకప్ మేన్ పోషణ వంటి హంగామా కూడా ఉంటుంది. అన్ని కులాలవారూ ఈ నాటకాలను రాత్రిళ్ళు నిద్రసైతం మాని తిలకిస్తారు. ముఖ్యంగా వీరు ప్రదర్శించే వీధి నాటకంలోని కథాంశాలలో కీచకవధ- రామాయణ- పరశురాముని కథ - పతివ్రత నాగమ్మ కథ - బొబ్బిలి యుద్ధం కథ - కురుక్షేత్రం - రాయబారం - పడకశేను - తారకాసుర వధ - భువన విజయం - ద్రౌపది వస్త్రాపహరణం- వీరాభిమన్యు సత్య హరిశ్చంద్ర, రామాంజనేయయుద్ధం -మయసభ- చింతామణి - అల్లూరి సీతారామరాజు - శ్రీ వీరబ్రహ్మేంద్ర గారి జీవిత చరిత్ర, ఉషా పరిణయ నాటకాలు ప్రధానమైనవిగా చెప్పవచ్చు. వీటితోపాటు సాంఘిక నాటకాలు కూడా ప్రదర్శింపబడుతాయి.

కర్నూలు జిల్లా ప్రత్యేక జానపద కళారూపం :

గొరవయ్య నృత్యం :

గొరవయ్య శివలీలల్లో ఒక అవతారం మణి మల్లాసురులు అనే రాక్షసుల్ని సంహరించటానికి శివుడు ఎత్తిన అవతారం గొరవయ్య తలపై ఎలుగుబంటి చర్మం, కిరీటంలాగా, నడుముకు బండారుతిత్తి మెడలో గవ్వల దండ కంబటి నిలువుటంగీ కుడిచేతిలో డమరుకం ఎడమచేతిలో పిల్లనగ్రోవి ఉంటుంది. శ్రీశైల మల్లి కార్జునుని మీద అనేక రకాల గేయాలు పాడుతారు. జిల్లాలో దేవర గట్టుమల్లయ్య కొండ జాతర దసరా పండగ రోజు జరుగుతుంది. ఆలూరు మండలంలోని దేవరగట్టు దగ్గర గొరవయ్యల జాతర పెద్దగా జరుగుతుంది. కురబ కులంలో ఒకరు తప్పనిసరిగా గొరవయ్యగా మారి వంశాచారాన్ని పాటిస్తారు. నృత్యం చేస్తారు. పాటలు పాడుతారు. ప్రతి ఇంటి దగ్గరకొచ్చి పాటలు ఇలా పాడుతారు.

1. **శివా మల్లేశ్వరా**
   కాపాడప్పా
   గూడెదుద్దలు కలిగి
   గూటావులు కలిగి మల్లేసునట్లు
   మగబిడ్లు కలిగి
   శివా మల్లేసుగట్ల మగబిడ్లు కలిగి
   శివా మల్లేశ్వరా కాపాడప్పా
2. **శివుడు నీవయ్యా శ్రీశైల మల్లయ్య**
   కానగరావయ్య శివయ్య
   సిక్కు జడల వాడు శివనీల కంఠుడు
   పై నిండా యిబూది మహాశివుని
   మెడలోన రుద్రాక్షలు దేవాది దేవా
   సన్నా కమ్మిడి తెచ్చి సరిమడతవేయించి
   గుండు మల్లెల పైన శివుని కొప్పుపెట్టి
   పాలు బెల్లం పోసి మహాశివుని
   మనసారా కొలిసెనె దేవాది దేవా
   శ్రీశైలంలోని పుణ్యక్షేత్రాన్ని దర్శిద్దాం రండి

   అంటూ పాడుకొనే గేయం.
3. **శివకొండకని పోదాముారారమ్మా**
   మల్లయ్య కొండ సామినే సూతముారారమ్మ
   శివాపురమికి పడమటుంట
   శిద్దులేలే మల్లయ్య కొండ
   సిన్నగనే పోదాముారారమ్మా
   అపరవతాలకు మెల్లగనే పోదాముారారమ్మా.

   ఇలా సాగుతుంది గేయం

కోలాటం :

కోలాటం అంటే కర్రతో ఆడే ఆట. ఇందులో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది రెండు చేతులతోనూ కర్రముక్కలు పట్టుకొని పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ లయానుగుణంగా అడుగులు వేస్తూ ఒకరి చేతి కర్ర ముక్కలను వేరొకరి చేతికర్ర ముక్కలకు తగిలిస్తూ ఆడతారు. ఈ కోలాటం కర్నూలు జిల్లాలోని ప్రతి పల్లెలోనూ ఉంది. సాధారణంగా కోలాటాన్ని తిరుణాళ్ళ సమయంలోనూ, ఉత్సవాల్లోనూ పిల్లలు, పెద్దలు మరియు స్త్రీలు ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు. కర్నూలు జిల్లాలోని విజయనగర కట్టడాలపై (శ్రీశైలం, తాడిపత్రి దేవాలయాలు) కోలాటం ఆడుతున్న నర్తకీ మణుల శిల్పాలను నేటికీ మనం చూడవచ్చు. దసరా నవరాత్రుల సంబరాలలో కోలాటం రంగు రంగుల కర్రలతో నృత్యం చేస్తారు. కోలాటం పట్ల ఆసక్తి ఉన్న కొందరు ఒక బృందంగా ఏర్పడి, ఈ నృత్యాన్ని చేస్తారు. కళాకారులందరూ వర్తులాకారంగా నిలబడి ఇష్టదేవత ప్రార్థన చేసిన అనంతరం ఆట ప్రారంభిస్తారు. ఇలా ఆటతో పాటు పాట కూడా పాడుతారు.

శివ శివ మూర్తివి గన నాత .. శివ ..
నువు శివుని కుమారుడవు గన నాత
యిద్ది నీదె బుద్ది నీదె గన నాత .. శివ ..
నిన్ను యిగినేశ్వరుడందురు గన నాత .. శివ ..
సదువు నీదె సాము నీదె గన నాత
సారస్వతి నీకు చందము గన నాత .. శివ ..

కోలాట బృందం వారంతా తలకు గుడ్డా, ఒళ్ళుపై బనీను నడుముకు దట్టీగుడ్డ, పంచెకట్టుతో పాటు కాళ్ళకు గజ్జెలు కడతారు. అందరూ ఒకే విధమైన దుస్తులతో చూడముచ్చటగా ఉంటారు. కోలన్న ఆటగాళ్ల బృందం నాయకుణ్ణి కోలన్న పంతులని పిలుస్తారు. ఇరవై నుంచి నలబై మంది ఆటగాళ్ళు ఇందులో ఉంటారు. ఆటగాళ్ళ సంఖ్య మాత్రం ఎప్పుడూ సరిసంఖ్యలోనే ఉంటుంది. కోలాటంలో అనేకమైన గతి భేదాలుంటాయి. వాటిని కోపులు అంటారు. కోపు అంటే నాట్యగతి భేదం. ప్రాంతాలను బట్టి కోపుల పేర్లు మారుతూ ఉంటాయి. రాత్రీ, పగలూ ఈ ప్రదర్శనలుంటాయి. పల్లెలలో వీటికి చదువు అవసరం లేదు. జ్ఞాపకశక్తి ఉంటే చాలు. ఈ కోలన్నలన్నిటి కన్నా జడకోలన్న చాలా విచిత్రంగా ఉంటుంది. ఈ ఆట ఆడే జట్టులో పన్నెండు, పదహారు, పద్దెనిమిది మంది

ఉండవచ్చు. కొన్ని ప్రాంతాల్లోనైతే వారి వీలును బట్టి మైకును గాని, హార్మోనిస్టుగాని కోలాటం కోసం ఏర్పాటు చేస్తారు. గురువుగారు మొదట విఘ్నేశ్వరుణ్ని తలుస్తూ పాట పాడుతాడు. ఆ తరువాత తనకు కోలాట విద్య నేర్పిన గురువును జ్ఞాపకం చేసుకొని ఆట ప్రారంభిస్తాడు. కోలాట ఆట ప్రారంభ సమయాన హార్మోనియం, మృదంగం, వేణువు, తాళాలు వాయించే వారితో కూడి గురువు చిన్న వలయం మధ్యలో కుదురుకుంటాడు. లోపల చుట్టు తిరుగుతూ ఆటగాళ్ళను త్రిప్పుతూ ఉంటాడు, ప్రతివ్యక్తి చేతుల్లోనూ రెండు కోలలు ఉంటాయి. ఆ కోలలు రంగుదారాలతో, గంటలతో గాని అలంకరింపబడి ఉంటాయి. వాళ్ళ చేతుల్లోని కోలలకు రంగురంగుల దారాలు ముడివేసి ఉంటాయి.

కర్నూలు జిల్లాలో ప్రతి మండలంలోనూ కోలాట బృందాలు ఉన్నాయి. కోలలతో కోలాటాన్ని మొదలు పెట్టేటప్పుడు 'యిరుడ తయ్యా తయ్యా తద్దిమితా' అంటూ తాళం 'తక తక తక గతి'లో గరువు కొడుతూ పాట యెత్తుకుంటాడు. కోలాటగాళ్ళంతా కర్రలను తాళగతిలో చిరుకులు వేస్తూ గుండ్రాకారంగా తిరుగుతూ పై కోపులు వేస్తారు. నిలుపుకొనేటప్పుడు 'తయ్యకు తద్దిమిత' అని గురువు అంటూనే అందరు కుప్పటి కట్టి కొట్టి నిలబడతారు. ఈ కోలాట సంప్రదాయంగా ఆట గాళ్ళలో పురుషులతో పాటు స్త్రీలు కూడా సాధారణ వస్త్రాలతో కోలాటం ఆడటం జిల్లాలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది.

మచ్చుకొక పాట చూడండి.

కోలు కోలన్న కోలు కోలో నాసామి
కొమ్మ లిద్దరు మంచి జోడూ
ఆ రాజు నన్నూ బిల్వడమ్మా నాసామి
రాజ గోపాలుడే కొమ్మా
ఇంతలింతల సీరగట్టీ నాసామి
ఈత పేళ్ళా రయిక దొడిగి
సొబ్బమైనా జొన్న సేలో నాసామి
దోసకాయకు మోసపోతీ ... కోలు ...

ఇలా సాగుతుంది గేయం

చెక్క భజన :

కర్నూలు జిల్లా ప్రాంతంలో ఒక అపురూపమైన కళ చెక్క భజన. ప్రకృతిలోని వనరులను ఉపయోగించుకొని సంగీతాన్ని సృష్టించడం జానపదులకే తెలుసు. ఇందులో భజన చేయడానికి వాడే చెక్కలు పొడవుగా ఉండే పలకలను పోలి ఉండడం వల్ల చెక్కభజన, పలకల భజన అని కూడా అంటారు. రెండు చెక్కలను లయాత్మకంగా కొట్టడం ద్వారా అద్భుతమైన సంగీతాన్ని సృష్టించి, దానికి అనుగుణంగా అడుగులు వేయడం ద్వారా ఒక కొత్త భంగిమను జానపదుడు సృష్టించుకున్నాడు. ఎలాగంటే ఒకటిన్నర అడుగు పొడవు, మూడు అంగుళాల వెడల్పు, చెక్కకు మధ్యలో రెండు అంగుళాలను తొలచి వాటిలో ఇనుప లేదా ఇత్తడి రేకులను బిగిస్తాడు. ఒక్కొక్క చిడతకు పైభాగాన ఒక గుండ్రని లోహపు ఉంగరం తాపడమై ఉంటుంది. చిడతల్ని ఆడించే వ్యక్తి కింది చెక్కకు సంబంధించిన ఉంగరంలో బొటనవేలును, పై చెక్కమీది ఉంగరంలో చూపుడువేలును దూర్చి రెండింటినీ బెసికిపోకుండా కుడిచేతిలో పట్టుకొని ఒకదానికొకటి తాటిస్తుంటాడు. ఎడమ చేతిలో రంగు రంగుల చేతి రుమాలుతో కాళ్ళకు కట్టుకున్న గజ్జెలతో పాట లయకు అనుగుణంగా అడుగులు వేస్తూ వలయాకారంలో తిరుగుతూ నృత్యం చేస్తూ ఉంటారు.

లంబాడీ నృత్యం :

ఆంధ్రప్రదేశ్ అంతటా కనిపించే సంచార జాతి లంబాడి జాతి. వీళ్ళనే బంజారాలనీ, సుగాలీలని అంటారు. లంబాడీ స్త్రీలందరూ నాట్యం చేయగలవారే. ఈ నృత్యంలో క్లిష్టత లేకుండా, చాలా సరళంగా మనోహరంగా ఉంటుంది. నిత్య జీవితంలోని పని పాటలను అనుకరిస్తూ ఈ నృత్యాలు ఉంటాయి. విత్తులు చల్లడం, నాట్లు, పంట కోతలు మొదలైన చర్యల నన్నిటినీ వాళ్ళ నృత్యాలలో అనుకరిస్తారు. వాళ్ళ వస్త్రాలకు, అద్దాలు, పూసలు మొదలైన వస్తువుల కుట్టుపనులతో కళ్ళు చెదిరేట్లుగా తయారు చేసుకుంటారు. ఇత్తడి

కడియాలు, గవ్వల దండలు, కొమ్ము గాజులు, మొదలైన వన్నీ మణికట్టునుంచి మోచేతి వరకూ తగిలించు కుంటారు. వాటి చప్పుళ్ళు గలగల లాడుతూ, వాళ్ళ నృత్యానికి లయాత్మక ధ్వని విశేషాన్ని అందిస్తూంటాయి. దసరా, దీపావళి, హొళీ పండుగ సందర్భాలలో లంబాడీలు, గృహాల ముందు యాచనకోసం వచ్చి నృత్యం నెరుపుతూ పాటలు పాడుతారు. ఇరవైమంది యువతులు, చేతులు తిప్పుతూ నడుములు కదిలిస్తూ, నృత్యం చేస్తుంటే చూడ ముచ్చటగా ఉంటుంది.

హొలీ పండుగ సందర్భంలో బస్సులు, లారీలు తదితర వాహనాలను ఆపి 'చెమ్మకేళీరే హొళీ' అంటూ పాడుతూ తమ నృత్యకేళిని ప్రదర్శించే గిరిజన యువతులు కర్నూలు జిల్లాలోని కొన్ని తాండాల్లో కని పిస్తారు. 'షామ్ ఖేలోరె హొళీ' అనే పాట వ్యవహార సరళిలో చెమ్మా కేళిరే హొలీగా రూపాంతరం చెందింది. ప్రత్యేకంగా ప్రదర్శనకోసం ధరించే వేషాన్ని లంబాడీలు నిత్యం ధరించి ఉంటారు. లేత ఎరుపు రంగులో ఉండే ఈ వస్త్రాల మధ్య పొదిగి ఉన్న చిన్న చిన్న అద్దాల నగిషీలు ఆకర్షణీయంగా ఉంటాయి. వీళ్ళు పాడే జానపదంలో 'అద్దాల కేమఢీ ఛేలీ మాగీచ లటలేటెయానియా కాదారి భూంక్‌డీ' అంటూ మేకల కాపరులైన లంబాడీల పాటల్లో గిరిజన సాంప్రదాయం ఉట్టిపడుతుంది. కర్నూలు జిల్లాలో పాణ్యం సమీపంలో సుగాలి మెట్ట, లక్ష్మయ్య కుంట తాండా, ఉల్లిందకొండ తాండా, లక్ష్మీనగరం తాండా, పత్తికొండ తాండాలలోని లంబాడీలు నృత్య బృందాలను కల్గి ఉన్నాయి. పత్తికొండ గిరిజన తాండాలలో శంకరమ్మ బృందం పలుసార్లు పాదుపులక్ష్మి అక్షర కళాజాతరలలో పాల్గొని ప్రశంసలు పొందింది.

పగటి వేషాలు :

జానపదుడి వీధి ప్రదర్శన కళారూపాలలో పగటి వేషాలు ఒకటి. చాలా జానపద కళారూపాలు మత పరంగానో, కులం పరంగానో, వాయిద్యాల పేరుతోనో పిలవబడితే కేవలం ప్రదర్శనా నమయాన్ని బట్టి పిలువబడే పగటి వేషాల కళ, పగటి పూటనే వేషాలు ప్రదర్శింపబడడంచేత ఇవి పగటి వేషాలయ్యాయి. పగటి వేషాల పైటేషాలని, మారు వేషం అని కూడా అంటారు. పగటివేషాల వారు బుడిగ జంగాల కులస్థులు. వీరు పగటి వేషాలతోనే జీవనం సాగిస్తున్నారు. పగటి వేషాలను స్థానిక పగటివేషాలని, సంచార పగటి వేషాలని విభజించ వచ్చు. 1. స్థానికులు వేసేవి స్థానిక పగటి వేషాలు. 2. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తూ ప్రదర్శించే వారిని సంచార పగటి వేషాలని అనవచ్చు.

హరిదాసులు :

హరిదాసులు పల్లెల్లోకి ప్రవేశిస్తే నిజంగా సంక్రాంతి పండుగ సంబరాల కళ వచ్చినట్టుగా ఉంటుంది. గ్రామీణ వాతావరణంలో ప్రొద్దు తెలతెలవారుతుండగా, శీతలగాలి విజృంభించే సమయంలో ఇంటి ముంగిట మహిళలు ముగ్గులు వేస్తూ అక్కడక్కడ కనిపిస్తుంటారు. ఆ దారంటే దైవం పంపిన అతిథులుగా గడప గడపకూ హరిదాసులు నుదటన ఊర్ధ్వపుండ్రాలు, మెడలో పూలదండలు, కాళ్లకు గజ్జెలు, చేతులతో తంబూర, చిడతలు, ఒంటిని చుట్టు కొని పసుపు బట్టలు, తలమీద అక్షయపాత్ర అందులో భక్తులు సమర్పించు బియ్యం కోసం శిరస్సును పడుతూ, ఇంత బరువులను మోస్తూనే, 'హరిలో రంగ హరి' అంటూ శుభగీతాన్ని వినిపిస్తుంటారు హరిదాసులు. వీరు కర్నూలు జిల్లా పల్లె ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తున్నారు.

బుడబుక్కల వేషం :

ప్రతి యాచకునికీ ఒక వేషధారణ ఉంటుంది. పురుషులకే పరిమితమైన వేషం బుడబుక్కల వేషం. వీరు తెల్లని ధోవతి దానిమీద అంగీ వేసుకుంటారు. కొందరు ధరించిన వస్త్రాలమీద ఒక నల్లకోటు గాని, రంగుల శాలువా గాని ధరిస్తారు. ముఖం మీద గుబురు మీసాలు తలకు పాగా చుట్టుకొని, చేతుల్లో బుడబుక్కలు పట్టుకొని వాయిస్తూ తిరుగుతారు. నొసట అడ్డనామాలు దిద్దుకొని బుజానికి జోలె సంచి తగిలించుకుంటారు. చెవులకు నీలాల గాజు పోగులు ధరిస్తారు.

ఎఱుకుల సోదె :

గిరిజన జాతులలో ఎరుకుల జాతి ఒకటి. వీరు పూర్వం అరణ్య ప్రాంతాలలోనూ, కొండ ప్రాంతాలలోనూ నివసిస్తూ ఉండేవారు.

ప్రస్తుతం గ్రామాల చివరిలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వీరు నల్లమల అటవీ ప్రాంతంలో దొరికే వెదురును చిన్న చిన్న దబ్బలను చేసుకోవడం వీరి ప్రధాన వృత్తి. గంపలు, తడికెలు, బండిజొల్లలు, జల్లెడలు, ఇసనకర్రలు, బుట్టలు అల్లడం, ఈత ఆకుతో కుంచె చీపుర్లు తయారుచేయడం, స్త్రీలు సోది చెప్పడం. కొన్ని ఎరుకలసాని మాత్రం ఏకపాత్రగా "సోదెమ్మ సోదో" అంటూ సోదె చెబుతూ ఉంటుంది.

కర్నూలు జిల్లా పరిధిలోని వీరి నివాసా ప్రాంతాలైన శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె, పాణ్యం, కర్నూలు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, మహానంది, మొదలైన మండలాల్లో ఎరుకలు జీవిస్తున్నారు.

గంగిరెద్దులాట :

మహారాజ వ్యవస్థ అంతమైపోయిన తర్వాత చాలా వరకు కళల పోషణ ఆదరణ లేక వీధిదారి పట్టాయి. కళాకారులు గడప గడపకు తిరిగే యాచకులయ్యారు. అందులో గంగిరెద్దుల వాళ్లు ఒకరు.

గంగిరెద్దుల వాళ్లు కొన్ని ప్రాంతాలలో సంక్రాంతి పండుగకు ముందుగానే దసరా పండుగనాడే వేషం కడతారు. దాతల నుంచి నాలుగు డబ్బులు రాల్చు కోవడమే వారి ఉద్దేశం. అయినా ఆశీర్వాదపూర్వకంగా వినయ విధేయతలతో వ్యక్తులను బట్టి వారు యాచిస్తారు. యాచకుడు చెప్పిన మాటలను తూ.చ. తప్పకుండా గంగిరెద్దులు పాటించి మెడలో ఉన్న గంటలు గలగలలాడిస్తూ తల త్రిప్పటం చూసేవాళ్లకు ఎక్కడలేని ఆనందాన్ని, ముచ్చటను కలుగజేస్తాయి.

గంగిరెద్దులాట వాళ్ళు రామలక్ష్మణ సీతమ్మల ఆట, ఆలు మగలు అలిగిపోవడం ఆటలను ఆడిస్తారు. ఎద్దును పూర్తిగా మనిషిపై నిలబెట్టుకోవడం లాంటి (ఆ ఎద్దు ఊపిరి బిగబట్టి నిలబడతాయి) ఆటలను ప్రదర్శించి ప్రజల మెప్పు పొంది వారిచ్చిన గింజలను, గుడ్డలను దానంగా స్వీకరిస్తారు.

జానపద గాయకులు :

ఒక జాతి వైభవానికి, సంస్కృతికి, దర్పణాలుగా నిలిచేవి జానపద కళారూపాలు. అలాంటి కళారూపాలు సమాజంలో కులాలు, ఉపకులాలతో పాటు పుట్టి ప్రచారం పొందాయి. కులాలు, ఆచార విశ్వాసాల పరి రక్షణ కోసం, ప్రచారం కోసం పామరులు పండితులను అనుసరిస్తూ, అనుకరిస్తూ మాత పురాణం, గౌతమపురాణం వంటి గ్రామదేవతల పురాణాలతో పాటు కుల పురాణాలను కూడా ఏర్పరచుకున్నారు. పామరులు తమ వృత్తిపైన, కులంపైన గౌరవాభిమానాలను తమకే కాకుండా ఇతర కులాల వారికి కూడా కల్గించడానికి పెంపొందించడానికి కథలను కల్పించుకున్నారు.

పిచ్చుక కుంట్లవాళ్ళు :

ఆంధ్రదేశంలో ప్రాచీనకాలం నుంచి ప్రచారంలో ఉన్న కళారూపం పిచ్చుకకుంట్లు కళ, ఈ కథను పిచ్చుక కుంటులనే జాతివాళ్ళు కర్నూలు జిల్లా ప్రాంతాలలో చెబుతుంటారు. ఈనాటికీ వెనుకబడిన ప్రాంతాలలో నివసిస్తూ వంశ గోత్ర నామాలను వర్ణిస్తూ చెపుతారు. వీరు చెప్పే కథల్లో రెడ్ల కులగోత్రాల వంశ చరిత్ర ప్రాముఖ్యతగల రెడ్ల పురాణం. ఇంతేగాక శ్రీనాథ మహాకవి రచించిన చారిత్రకమైన వీరోచితమైన 'పల్నాటి వీరచరిత్ర' కథను ప్రారంభిస్తే దాదాపు పదిహేను రాత్రుల వరకూ చెబుతారు. వీరి కథల్లో శృంగార, వీర, కరుణ, రసాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఉంటుంది. ప్రస్తుతం వీరు అవసరాలకు అనుగుణంగా తోలుతిత్తి లేదా గంటతిత్తిని శ్రుతిగా వాడుకునేవారు. ఇప్పుడు వాటికి బదులుగా హార్మోనియాన్ని, డమరుకాలకు బదులు గుమ్మెటను వంతలకు వాడుతున్నారు.

కర్రసాము :

కర్రసామునే కట్టె విద్య అని కూడా అంటారు. రాయల సీమలోని కర్నూలు జిల్లాలో ప్రతి ఏడాది మొహరం పండుగ (పీర్లపండుగ) రోజుల్లో, జాతర సమయాల్లో కర్రసామును ప్రదర్శిస్తారు. పీర్లను ఊరేగించేటప్పుడు ఆరు అడుగుల వెదురు కర్రను తీసుకుని వివిధ అడుగుల్లో తిప్పడం, ఇద్దరు వ్యక్తులు కర్ర యుద్ధం చేయడం, ఆరు అడుగుల ఇనుపకడ్డీకి ఇరువైపులా గుడ్డను చుట్టి అగ్గిని వెలిగించుకొని తిప్పడం, గుండ్రని చట్రాన్ని తయారు చేసుకొని దానిచుట్టూ దివిటీలను వెలిగించుకొని మధ్యలోని అడ్డుకర్రను పట్టుకొని తిప్పడం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. కిరోసిన్, దివిటీల సహాయంతో నోటినుంచి మంటను వెదజల్లడం వంటివి ఎంతో కళాత్మకంగా ఉంటాయి.

బూరుబూరు సుంకులమ్మ :

శక్తికి నిదర్శనం సుంకులమ్మ. స్త్రీ స్వరూపంగా బొమ్మను తయారుచేసుకొని, గంపలో పెట్టుకొని వేప మండలు, గాజులు, బండారు పెట్టి స్త్రీలు నెత్తినెత్తుకొని చిన్న 'ఉరుము' వాద్యాన్ని బూర్‌బూర్‌మంటూ వాయిస్తూ పురుషుడు కొరడా పట్టుకొని లంగాను ధరించి నడుముకు గజ్జెలు కట్టుకొని ముందర వస్తుంటాడు. అలా ప్రతి కూడలి దగ్గర బొమ్మను దింపి ఇల్లిల్లూ తిరుగుతూ అడుక్కుంటూ పొట్టగడుపుకొంటున్నారు. కొరడా 'పెళపెళ మని తన వీపుకు కొట్టుకుంటాడు. చేతినుంచి రక్తాన్ని చుక్క చుక్కలుగా కారుస్తాడు. అది చూడలేక ఇంటిలోని వారు వెంటనే భిక్షం పెట్టటం పంపించటం జరుగుతుంది. శరీర మంతా రక్తపు మరకలతోనే ఉంటాడు. అలా ప్రతి నెలకు రెండునెలలకొకసారి ఊరూరా తిరుగుతూ 'సుంకులమ్మ' దేవతను ఊరేగిస్తూ ఉంటారు. ఉరుము వాద్యాన్ని ఇలా వాయిస్తారు.

బూర్ బూర్ బూర్
బూర్ బూర్ బూర్
బూర్ బూర్ బూర్.

జానపద వాద్యాలు :

మానవజాతి అంత పురాతనమైనవి జానపద వాద్య పరికరాలు. పట్టణ ఆవిర్భావానికి ముందు అంతా గ్రామీణ ప్రాంతమే. ప్రజల ఆహార సముపార్జనలో ఉత్పత్తి పరికరాలు ఎలానో పనుల్లో విశ్రాంతి సమయాల్లో పండగ పబ్బాలు, పెళ్లిలాంటి శుభకార్యాల్లో ఈ వాద్యాలు అలాంటివి. కొన్ని అశుభ కార్యకాండలలో, గ్రామ దేవతల ఉత్సవాల్లో ఇవి ఉండి తీరాల్సిందే.

కుండ :

రెండు చేతుల వ్రేళ్లతో 'తక తక తక' అనే లయకోసం గతి కోసం కొడతారు.

తప్పెట :

పల్లెజనాల బాధలను మరచిపోవడం కోసం పుట్టిన తొలి జన రంజక సాధనం తప్పెట. ఊళ్లో ఎక్కువమంది జనం కోసం చేయవలసిన ప్రకటనలను, చాటింపు వేయడం కోసం తప్పెట ఉపయోగపడుతుంది. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా కనిపించే వాద్యం తప్పెట. పెళ్ళికి, చావుకి, పుట్టుకకు, పండుగలకు, జాతర్లకు, శుభా -అశుభాలకు దరువును బట్టి తెలుస్తాయి. పీర్లపండుగ సందర్భంలో 'అల్లాయిగుంత' (చావిడి ముందు తవ్వే 'అగ్ని గుండం' చుట్టూ తిరుగుతూ వేసే అడుగులు) 'సావూశేన్ ... దూలే ...' అనే విన్యాసం చివరికి వారిని వైమరపింపచేసి అగ్నిగుండంలో ఒట్టి కాళ్ళతో పరిగెత్తిస్తుంది. కర్నూలు జిల్లా వెంకాయపల్లె 'ఎల్లమ్మ' దగ్గర నాగలాపురం సుంకలమ్మ దగ్గర మోగే 'తప్పెట విందు' గ్రామీణుల ప్రధాన వినోద ప్రక్రియగా చెప్పుకోవచ్చు. గడివేముల పెద్దమ్మ దేవర జాతరలో "జగ్‌నకన్" అనే వరుస తప్పెటపై రకరకాల కోపులు మాదిగ వంశ పారంపర్యులు తప్పెటగతులు కొడతారు. ఇలా తప్పెట రెండు పుల్లలతో లయాత్మకంగా కొడతారు.

ఉరుము :

రెండు పుల్లలతో కొడతారు. ఎడమచేతి పుల్లతో 'బూర్ బూర్' కుడిచేతి పుల్లతో 'డబు డబు' అనే శబ్దాలు పుట్టిస్తారు.

బీరప్పడోలు :

కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి చెరుకులపాడు, డోన్, ప్యాపిలి, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం ప్రాంతాల్లో బీరప్పడోలు అత్యంత ప్రధాన ఆకర్షణగా ప్రాచుర్యం పొందింది. చాలా పెద్ద పరిమాణంలో ఉండే ఈ డోలును గ్రామాల్లో కొన్ని ప్రత్యేక కుటుంబాలైన కురుబ కులంవారు బీరప్ప దేవునికి డొల్లలుతో మేలు కొలుపులు చేయటం అనవాయితీ. బీరప్పడోలు చాలా పెద్దవిగా ఉండి, ఆవైపూ ఈవైపూ తోలుతో మూయబడి ఉంటాయి. చాలా పెద్దవిగా గుండ్రంగా ఉన్నందువల్ల తాళ్ళతో ఆవైపూ ఈవైపూ బాగా బిగించి ఉంటాయి. మెడకు డోలు తగిలించుకొని ఎడమచేతి అరచేతితో "డప్ డప్" కుడిచేతిలోని జానెడు పొడవు కర్రతో దండం అంటూ దిల్లం బల్లం అనే గతిలో కొడతారు.

డక్కి :

చిన్న గిన్నె పరిమాణంలో ఉంటుంది. ఒక వైపు తోలుతో బిగించి ఉంటుంది.

పిల్లనగ్రోవి :

పశువుల కాపర్లు నోటితో గాలి ఊదుతూ నాగ స్వరంలా లయాత్మకంగా ఊదుతారు. గొరవయ్య నృత్యంలో కూడా పిల్లనగ్రోవి ఊదుతారు.

సన్నాయి (మేళం) :

మేళం గంగిరెద్దులవారు మంగలి వారు ఊదుతారు. శుభకార్యాలలో మేళం తప్పనిసరి. రాగాలాపన గంగిరెద్దుల వారు పాడుతారు. ప్రత్యక్షంగా వీటి నాదం వినాలి.

గాలితిత్తి :

భిక్షాటన చేస్తూ చర్మంతో తయారు చేసిన తిత్తి రెండు వెదురు బొంగులు చిన్నవి అమర్చి ఒకదాని వెంబడి గాలిని ఊదుతూ మూస్తూ ఉంటారు. వదిలితే హార్మోనియం శబ్దం వస్తుంది.

శంఖం :

సముద్రంలో దొరికే శంఖం తీసుకొని బైరాగులు దీన్ని శక్తి కొద్దీ గాలి ఊదితే లయాత్మకమైన శంఖం శబ్దం వస్తుంది. శివాలయాల్లో ఉంటాయి.

జవికిని :

తీగను చేత్తో లాగుతూ ఉండి జుము జము జముక్ జముక్ యిరడ జముకు అనే శబ్దం వస్తుంది.

తంబూర :

నాలుగు తీగలుంటాయి. ఒక్కొక్క తీగ ఒక్కో స్థాయిని కలిగి ఉంటుంది.

ఏకనాదం :

ఒక తీగ వుంటుంది. చూపుడు వ్రేలితో తీగను మీటుతుండగా టింగ్ టింగ్ అనే శబ్దం వస్తుంది. ఎరుకల వాళ్ళు (స్త్రీలు) 'ఏక్‌తార' మీటుతూ, సోదె చెప్పుతారు.

డోలు :

రెండు ప్రక్కల తోలుండి, ఎడమవైపు కర్రతో కొడుతూ, కుడి చేతితో తట్టుతారు.

రణడోలు (రామడోలు) :

ఒక ప్రక్క చర్మం ఉన్న వాయిద్యం పెద్ద రామ డోలును పెద్ద కర్రతో, చిన్న రామడోలును రెండు చిన్న కర్రలతోనూ వాయిస్తారు. దీనిని దేవాలయపు ఉత్సవాల్లోనూ పెళ్ళి ఊరేగింపుల్లోనూ వాడుతున్నారు.

కొమ్ము :

వంపు తిరిగిన మేళం పెళ్లి పల్లకి ఊరేగింపు, ఉత్సవాలలో ప్రత్యేకంగా ఉపయోగిస్తారు.

ఒగ్గు (డమరుకం) :

బుడబుక్కలవారు, గొరవయ్యలు ఒగ్గును ఉపయోగించి లయాత్మకమైన ధ్వనిని కలుగచేస్తారు. ఇది డంబెల్ ఆకారంలో ఉంటుంది. మధ్య చిన్నగా చేత్తో

పట్టుకోవడానికి వీలుగా ఉంటుంది. రెండు చివర్లలో వెడల్పుగా ఉంటుంది.

చిఱుతలు :

చెక్కభజన కళాకారులు, హరికథకులు, హరిదాసులు రెండు చెక్కలతో తయారైన చిఱుతలతో ఇంపైన శబ్దాన్ని కలిగిస్తారు. దీర్ఘచతురస్రాకారంలో ఉంటూనే కొంత వృత్తాకారంలో ఉంటాయి. ఒక్కొక్కదాని మధ్యలో చేతి వేళ్ళను దూర్చడానికి హ్యాంగర్ ఉంటుంది.

నాగస్వరం :

పూర్వకాలం నుంచి నేటివరకు మానవుడు ఊదు వాయిద్యం అను నాగస్వరంతో విషసర్పాలను నృత్యం చేయిస్తాడు. మధ్యలో లావుగా ఉండి అవతలా ఇవతలా చిన్నగా వెదురుగొట్టం ఉంటుంది.

వెదురుగొట్టంపై రంధ్రాలుంటాయి. వీటిని చేతివేళ్ళతో మూస్తూ తెరవడం ద్వారా నాగస్వరం వినిపిస్తాడు.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

క్షేత్ర పర్యటనలో జానపద పరిశోధకుల సమస్యలు

– డా॥. చవ్వా వెంకటరెడ్డి, ఉపన్యాసకులు, హైదరాబాదు.

అమ్మ లాలిపాట, గోరుముద్ద, మీగడ పెరుగు, నవ నీతం వీటి రుచులను మనం ఏవిధంగా మరచిపోలేమో జానపదాన్ని, జానపద సంస్కృతిని అలాగే మరచిపోలేము. జానపద విజ్ఞానం అనండి, జానపద సాహిత్యం అనండి, 19, 20 శతాబ్దాల్లో విశ్వవ్యాప్తంగా విభిన్న ప్రక్రియల ద్వారా తమ సత్తా చాటుకున్నాయి. దీనికి ప్రధాన కారణం పరిశీలన, పరిశోధన. అయితే ఈ రెంటిలో పరిశీలన కన్నా పరిశోధన అధిక ప్రభావం చూపింది. పరిశోధన అంటే ఒక సిద్ధాంత రూపకల్పన. అది పరిశోధకుని ఓపిక, లక్ష్యం, శ్రమలపై ఆధారపడి ఉంటుంది. శ్రీశ్రీ అన్నట్లు-

"ఏది తనంత తానై నీ దరికి రాదు
శోధించి సాధించాలి"

అన్న భావజాలం పరిశోధనకు ఆలంబన అనవచ్చు. అయితే ఆ పరిశోధన విజయవంతం కావడంలో అధిక ప్రాధాన్యత కలిగింది 'క్షేత్ర పర్యటన'. పై శ్రీశ్రీ భావం పరిశోధనలో అధిక భాగాన్ని ఆక్రమించే క్షేత్రపర్యటనలో నూటికి నూరు శాతం ఉపయుక్తమౌతుంది.

క్షేత్ర పర్యటన అన్ని పరిశోధనాంశాలకు ఒకే విధంగా అన్వయించదు. కొన్ని రకాల పరిశోధనలకు క్షేత్రపర్యటనల ఆవశ్యకతే ఉండదు. శిష్టసాహిత్యంపై, సంప్రదాయ కళారీతులపై పరిశోధనలు చేస్తున్నప్పుడు కొంత ఏర్పడ వచ్చు. అయితే జానపదాంశాలపై పరిశోధన చేస్తున్నప్పుడు మాత్రం దీని ఆవశ్యకత పెరుగుతుంది. మరీ ముఖ్యంగా అముద్రిత సాహిత్యంపైగానీ, మౌఖికంగా ఉన్న కళా రూపాలపైగానీ, కళాప్రదర్శనలపైగానీ పరిశోధన చేస్తున్న ప్పుడు మరింత కీలకం అవుతుంది.

మనిషికి శ్వాస ఎంత ముఖ్యమో పరిశోధనలో క్షేత్ర పర్యటన అంతే కీలకం. క్షేత్ర పర్యటన పరిశోధనకు ఎంతో ముడిసరుకు అందిస్తుంది. క్షేత్ర పర్యటన అనుభవాలను, వాటిలో ఉండే సాధక బాధకాలను వివరిస్తూ ఆచార్య బిరుదురాజు రామరాజు ఈ విధంగా తెలియజేశారు-

"పరిశోధన అనుకోగానే ఇల్లలకగానే పండగ' అన్న చందం కాదు. దానికి శ్రమ, ఓపిక, ప్రణాళికాబద్ధమైన క్షేత్ర పర్యటన, సాధన సంపత్తి మొదలైన హంగులు కావాలి. ఉప్పుకారాలు తగు మోతాదులో వేస్తే చెడని కూరలా పరిశోధనలో క్షేత్ర పర్యటన ద్వారానే మనం ఎన్నో విషయాలను తెలుసుకోగలుగుతాం. ఇక సమస్యలంటారా అవి ఎలాగో తప్పవు..... పరిశోధనను పేలవం చేసే క్షేత్ర పర్యటన వల్ల కలిగే అనర్థాలు లేకపోలేదు. పరిశోధనకు చక్కని ప్రణాళిక ఎంత అవసరమో అది విజయవంతం అయ్యే నేపథ్యంలో నిర్దిష్ట ప్రణాళిక క్షేత్ర పర్యటనకు అవసరం."

ఇక్కడ ఈ సందర్భంలో పై భావాల్ని తెలియ జేయడానికి ప్రధాన కారణం వారి పరిశోధనా కాలంలో పూర్తి క్షేత్ర పర్యటనే వారి పరిశోధనకు మూలకం కావడం. వారు తెలంగాణలోని మారు మూల గ్రామాలకు కేవలం బస్సు సౌకర్యాన్ని మాత్రమే ఉపయోగించుకున్న వైనాలను ఎంతో వివరణాత్మకంగా తెలియజేశారు. ఆనాటి కార్య క్రమంలో ఆచార్య రామరాజు పై ప్రసంగం విన్న తరువాత (నేను ఆ కాలంలో ఆ కళాశాలలో పని చేశాను) ఈ వెబ్ నార్‌కు ఈ అంశాన్ని ఎంపిక చేసుకోవడం జరిగింది.

సామాన్యంగా పరిశోధనాంశం జానపదం అయి నప్పుడు అందులో ప్రక్రియ పాట కావచ్చు, ప్రదర్శన కళలు కావచ్చు, జాతర్లు కావచ్చు, బుర్రకథ కావచ్చు, ఒగ్గు కథ కావచ్చు... ఏదైనా తీసుకోండి. ఈ అంశాలలో పరిశోధకుడు క్షేత్ర పర్యటన ప్రదేశానికి సంబంధించిన అనేక అంశాలను ముందుగా దృష్టిలో పెట్టుకోవాలి. తాను పర్యటించే ప్రదేశం, అక్కడ కలవాల్సిన వ్యక్తుల గురించి

సరైన భోగట్టాను సేకరించాల్సి ఉంటుంది. సాధారణంగా క్షేత్ర పర్యటనలో పరిశోధకుడు తాను కలవదలచుకున్న వ్యక్తులు, వారి విద్యాస్థాయిని దృష్టిలో పెట్టుకుని, తాను ఏ సమాచారం సేకరించాలనుకుంటున్నాడో దానిని వారికి అర్థమయ్యే సులభమైన ధోరణిని పాటించాలి. ఎందుకంటే క్షేత్ర పర్యటనలో సమయం, సమాచార సేకరణ రెండూ కూడా ప్రాధాన్యతను కలిగి ఉన్నవనే విషయాన్ని ప్రాథమికంగా గుర్తుంచుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికను రూపొందించుకోవాలి.

క్షేత్ర పర్యటనలో తగిన కాల ప్రణాళికను రూపొందించుకోవాలి. జానపద సాహిత్యంలో ప్రదర్శిత కళల పరంగా క్షేత్ర పర్యటనలో పరిశోధకుడు ఆయా ప్రదర్శక బృందాలకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ, వారితో సాన్నిహిత్యాన్ని ఏర్పరచుకోవాలి. కొన్ని సందర్భాలలో వారు సమాచారం ఇవ్వడానికి నిరాకరించినప్పుడుగాని, ప్రదర్శనలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఓరిమి వహించాలి. ప్రధానంగా క్షేత్ర పర్యటనలో పరిశోధకుడు విషయ సేకరణకు అనుగుణమైన విధి విధానాలు రూపొందించుకోవాలి. భాష, అభివ్యక్తీకరణ ఈ రెంటి విషయంలో తాను వారికి దగ్గరగా ఉండేలా చూసుకోవాలి.

ఆంధ్రుల జానపద విజ్ఞానంపై పరిశోధన చేస్తున్న కాలంలో క్షేత్రపర్యటనలో ఎదురైన అనేక సమస్యలను ఆచార్య ఆర్వీయస్ సుందరం పలు సందర్భాలలో ఉటంకించారు. ఆ కాలంలో గ్రామాలలో పర్యటన అంటే రహదారులు, రవాణా, వసతి వంటి విషయాలలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది. సేకరించిన సమాచారాన్ని భద్రపరచుకోవడంలో ఎంత జాగ్రత్త వహించినా కొంత ఇబ్బంది తప్పలేదు. అంటే సేకరించిన సమాచారం గ్రంథస్తమైనా, వ్యక్తుల పరంగా సంభాషణ అయినా, పాటల రూపంలో సేకరించిన సమాచారమైనా కొన్ని ప్రకృతి వైపరీత్యాల వల్ల వాటిని కోల్పోయే ప్రమాదముంది.

ఆచార్య మాదిరెడ్డి అండమ్మ తమ పరిశోధనా నిమిత్తం చేసిన క్షేత్ర పర్యటనలో స్త్రీగా తాను ఎదుర్కొన్న అనేక అనుభవాలను ఇలా తెలియజేశారు.

"నా పరిశోధనా క్షేత్ర పర్యటనలో ప్రాణాలకు తెగించి ఆయా ప్రదేశాలను చేరుకోవడంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నాను. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం అంతంత మాత్రంగా ఉండేది. వాటిని ఉపయోగించుకోవడంలో ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వచ్చేది. నేను ఆ ప్రదేశాలకు చేరుకోవడంలో ఒకసారి రాత్రి 9 గంటల కాలం అయింది. ఆ కాలంలో గ్రామాల్లో విద్యుద్దీపాల కొరత ఉండేది. నిర్మానుష్యత నేను చేరుకోవలసిన ఇంటికి గల దూరం నాలో కొంత భయాన్ని కలిగింప జేసినా, తెచ్చి పెట్టుకున్న ధైర్యాన్ని ఆయుధంగా చేసుకొని నడవడం జరిగింది. ఈ నేపథ్యంలో నేను క్షేత్రపర్యటనలో సేకరించవలసిన సమాచారాన్ని త్వరగా సేకరించడానికి కావలసిన సరంజామాతో పాటు నా భుజానికి తగిలించుక్ను సంచిలో కారపు పొట్లం, స్క్రూడ్రైవర్ మొదలైన చిన్న పరికరాలను కూడా తీసుకెళ్ళడం జరిగింది. ఇది ప్రధానంగా మహిళా పరిశోధకులకు జానపద సాహిత్య పరమైన అంశాలను ఎన్నుకున్నప్పుడు పాటించవలసిన పద్ధతులుగా తెలియజేస్తున్నాను.

ఇది ఒక కోణమైతే ఆ కాలంలో లభ్యమైన పాత్రాలు అన్నీ కూడా తిరగ రాయాల్సి వచ్చేది. ఎందుకంటే ఈనాడు ఉన్న జిరాక్స్ సౌకర్యం అనాడు గ్రామీణ వ్యవస్థలో కనిపించేది కాదు. దీనివల్ల ఎక్కువ సమయం పట్టినా పరిశోధన మీద ఉన్న ఉత్సాహం అడ్డంకులను అధిగమించేలా చేసింది.

పరిశోధనకు సంబంధించిన విషయ సేకరణలో ప్రధానంగా పాటలు పాడేవారుకానీ, కళాప్రదర్శన చేసేవారు గానీ అంత తొందరగా మన దారికి రారు. కానీ వారిని మన దారిలోకి స్నేహ పూర్వక వాతావరణం ద్వారా తీసుకురావలసి ఉంటుంది. అలాగే కొందరు మన నుంచి ద్రవ్యాన్ని ఆశిస్తారు. కొన్ని సందర్భాలలో వారు కోరిన మందు ఇత్యాదులను మనం వారికి అందించవలసి

ఉంటుంది. కొందరు ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని మధుపానం చేసి నిదురపోయిన పరిస్థితులు కూడా లేకపోలేదు. అయినా వారి నుంచి సమాచారం సేకరించడంలో ఓరిమి వహించాల్సి ఉంటుంది. అందువల్ల 'జండర్' పరంగా కాక పరిశోధకుల పక్షాన ఈ విషయాలు తెలియజేస్తున్నాను. వారు చెప్పిన అంశాన్నే తిరిగి తిరిగి చెప్తున్నా పునరుక్తిగా భావించక మొత్తం సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది."

ఆచార్య అండమ్మ పైన తెలిపిన అంశాలన్నీ పరిశోధకులకు కరదీపికలుగా భావించవచ్చు. ఇక పరిశోధకునికి క్షేత్ర పర్యటనలో నిర్ధారిత ప్రదేశం జానపద కళలు, సంస్కృతికి కేంద్రంగా ఉండాలి. కొన్ని సందర్భాలలో జానపదులు తమ ఊరికి వచ్చిన పరిశోధకుని కొత్త వ్యక్తిగా భావిస్తారు. ఒక పట్టాన నమ్మరు. కొన్ని ప్రాంతాల్లో ఎగువ కులంవారు దిగువ కులంవారితో కలిసి తిరగడాన్ని తప్పుగా భావిస్తారు. దీనికి అమాయకత్వం, అవిద్య ప్రధాన కారణాలుగా భావించాలి.

క్షేత్ర పర్యటనకు వచ్చిన పరిశోధకుని కొత్తవానిగా భావించడంవల్ల వారిలో భయం చోటు చేసుకుండడం జరుగుతోంది. ప్రధానంగా బాల కళాకారుల విషయంలో వారి కళను నమోదు చేశాక, బహుమానాల వంటివి ఇస్తే, ఆ చర్యల్ని అపార్థం చేసుకుని, వారిని పిల్లలను ఎత్తుకు పోయేవాళ్ళన్న భావంతో దాడి చేసిన సంఘటనలు కూడా జరిగాయి. అలాగే పరిశోధకుడు పాటల సేకరణలో ఏజెన్సీ ప్రాంతంలో తిరుగుతున్నప్పుడు పోలీసుల మనుషులని గ్రామస్తులు, నక్సలైట్లని పోలీసులు అనుమానించిన సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నట్లు కొందరు పరిశోధకులు చెప్పారు.

క్షేత్ర పర్యటనల్లో జరిగిన చేదు అనుభవాల కారణంగా తమ పరిశోధనలకు మధ్యలోనే తిలోదకాలు ఇచ్చినవారూ లేకపోలేదు. అయితే ఈనాడు పరిశోధకులు అధునాతన సాంకేతిక సమాచార వ్యవస్థలైన యూట్యూబ్, వాట్సప్ తదితరాలను ఆశ్రయించడం ద్వారా కొంత సమాచారాన్ని సేకరించ గలుగుతున్నా, వాటి ప్రామాణికతను నమ్మలేని కారణంగా తప్పుడు సమాచారాన్ని నమ్ముకోవడం కూడా మనం గమనించవచ్చు.

అలాగే పలు సందర్భాలలో పరిశోధకునికి క్షేత్ర పర్యటనలో ఎదురయ్యే ప్రధాన సమస్యలు కులం, భాష, భావప్రకటన. వివాహం అయిందా లేదా అన్న అంశాలు ఆ పరిశోధకుని ఇబ్బందులకు గురి చేస్తాయి. పరిశోధకుడు ఇలాంటివాటిని నైపుణ్యంతో దాటుకు రావాలి.

ఈనాడు పరిశోధకులు గాని, ఇతర ప్రసార, ప్రచార మాధ్యమ సంస్థలు గాని జానపద సాహిత్యాన్ని, జానపద విజ్ఞానాన్ని డాక్యుమెంట్ చేసే విషయంలో పలు అంశాలు వాస్తవాలకు దూరంగా ఉంటున్నాయనేమాటలు వినవస్తున్నాయి. ఇందుకు కారణం వేగం, పోటీ సమాచార సేకరణకు అవరోధాలు కావడమే. పరిశోధకులు తమ పరిశోధన కాలంలో అధిక భాగం పూర్తయ్యాక చివరి నిమిషంలో పడే ఆత్రుత, వారి క్షేత్ర పర్యటనలను బలపరచకపోగా, వారికి సమస్యలను మరింత పెంచుతున్నాయి.

జానపద వృత్తులు, కళలకు సంబంధించిన కళాకారులు ఆయా కళలకు ఆదరణ తగిన కారణంగా, జీవిక కోసం గ్రామాలను వదిలి నగరాలకు వలస పోతున్న కారణంగా పరిశోధకులకు క్షేత్ర పర్యటన ద్వారా సమాచార సేకరణ అసాధ్యం అవుతోంది. దీన్ని గూడా ఒక సమస్యగానే పరిగణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరుగుతున్న పట్టణీకరణ, సమాచార సాంకేతికతలలో వచ్చిన పెను మార్పుల కారణంగా జానపదులు, ఇతరులు అన్న భేదం తగ్గిపోతున్నది. ఫలితంగా జానపద కళలను ప్రదర్శించేవారు తగ్గిపోతున్నారు. ఉన్నవారు సైతం పట్టణీకరణ కారణంగా తమ కళలకు దూర మౌతున్నారు. ఈ కారణంగా పరిశోధకుడు సేకరించే సమాచారం సంపూర్తిగా జానపద ధోరణిలో ఉండే అవకాశాలు తగ్గిపోతున్నాయి. పరిశోధకుడు ఈ విషయాన్ని దృష్టిలో

ఉంచుకోవాలి. అయితే ఈ సమస్యలను ఎదుర్కోవడంలో పరిశోధకులు కొత్త దృక్పథాలను ఏర్పరచుకోవాలి. అంకితభావంతో, మంచి ప్రణాళికతో క్షేత్ర పర్యటన రంగాన్ని ఏర్పరచుకోవాలి. దేశ కాలమాన పరిస్థితులకు లోబడి ఇంకా గ్రామీణ వ్యవస్థలో మిగిలి ఉన్న వృద్ధుల ద్వారా సమాచార సేకరణ చేయాలి. ఉదాహరణకు చిందు ఎల్లయ్య తాను మరణించేవరకూ ఏ పరిశోధకుడు తనింటికి వచ్చినా వారిని ఆదరించి, తన అనుభవ జ్ఞానాన్ని పంచేవాడు. ష్కామ కర్మ, చిందు భాగోతం శాశ్వతం కావాలన్నదే లక్ష్యంగా ఆయన సమాచారాన్ని పంచుకున్నాడు.

'జానపదులు జ్ఞానపదులు' అన్న మాటను నిజం చేయాల్సిన బాధ్యత పరిశోధకులదే. ఇంతకీ ఆ మాట అన్నవారెవరో తెలుసా 'ఆరుద్ర'.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆరె జానపద గాథలు, డా॥ పేర్వారం జగన్నాథం, జానపద వాఙ్మయ పరిశోధక మండలి, వరంగల్, 1986
2. వివేచన పరిశోధక సంచిక, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ, సంపాదకులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, మార్చి 2000 మరియు మార్చి 2001, హైదరాబాద్
3. కదంబం 'తెలుగు సాహిత్య ప్రక్రియలు రూపాలు' మూసి సాహిత్య సంచిక, సంపాదకులు డా॥ సాగి కమలాకర శర్మ, మూసి సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక, 2014
4. 'లోచూపు' సాహిత్య విమర్శనా వ్యాసాలు, రాసాని, విశాలాంధ్ర, 2014
5. 'తెలుగు ప్రపంచం' ప్రత్యేక సంచిక, 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు-2019, డిసెంబర్ 27, 28, 29 - విజయవాడ, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, విజయవాడ, 2019
6. పాలపిట్ట ప్రత్యేకసంచిక, జూన్ 2014, హైదరాబాద్

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

బంజారాల జీవనంలో పొడుపు కథలు

– డా॥. పి.భగ్లు నాయక్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో.

బంజారాల జీవనం ప్రకృతితో ముడిపడి ఉంటుంది. వారు అడవిలో వేటకు వెళ్ళినప్పుడు, పొలం పనులు చేస్తున్నప్పుడు, వివాహ సమయంలో తమ బంధు మిత్రులతో సంభాషించుకొనే సమయంలో వారి పొడుపు కథలను ఉపయోగిస్తూ ఉంటారు. బంజారా భాషలో పొడుపు కథలను 'వదోడేర్ సాకి' అంటారు. అనగా విప్పే కథలు. 'ఫోడేర్ సాకి' అనగా పగులకొట్టే కథలు అని 'నాణకి సాకి' అనగా చిన్నకథ అని వ్యవహరిస్తున్నారు. బంజారా పొడుపు కథలను పరిశీలించడం ద్వారా వారి జీవిత విధానాలను, ఆచార వ్యవహారాలను, మానవ సంబంధాలను తెలుసుకోవచ్చు.

బంజారా పొడుపు కథలు :

జానపద సాహిత్యంలో పొడుపు కథలకు ప్రత్యేకత ఉన్నట్లే, బంజారాల పొడుపు కథలలో దాగి ఉన్న అద్భుతమైన విజ్ఞానాన్ని వెలికి తీయాలనే ఉద్దేశ్యంతో నల్లగొండ జిల్లా క్షేత్ర పర్యటనలో లభించిన పొడుపుకథలను 1.ప్రకృతి సంబంధమైనవి 2.వ్యవసాయ సంబంధమైనవి 3.వంట సామాగ్రి సంబంధమైనవి 4.కుటుంబ సంబంధమైనవి 5.వాహన సంబంధమైనవి 6.శరీరావయవాల సంబంధమైనవి 7.పశు, పక్షి, క్రిమి కీటకాల సంబంధమైనవి 8.వృక్ష సంబంధమైనవి 9.వస్తు సామాగ్రి సంబంధమైనవి 10.ఇతర సంబంధమైనవిగా వర్గీకరణ చేసి పరిశోధన పత్రం పరిధి దృష్ట్యా విశ్లేషణ చేస్తాను.

ప్రకృతి సంబంధమైనవి :

1. అత్త జావూ ఓత్త జావూ రావేర్ జడేమా జావూ.జావూ జత్త పళ ఛేని, ఫళేమా బిజ్జా ఛేని(హొళా) హరిచంద్ పి. వయస్సు70 లచ్య తండా, త్రిపురారం మండలం నల్లగొండ జిల్లా

అర్థం : ఇక్కడ, అక్కడ ఎక్కడ పోయినా ఆకాశపు టంచుల దాకా పోయినా ఫలం లేదు అందులో గింజలు లేవు(వడగండ్లు)

వివరణ :

వర్షాలు కురిసినప్పుడు పడే వడగండ్ల వానతో వారు అనుభవించిన కష్టనష్టాల ద్వారానే ఈ పొడుపు కథ పుట్టి ఉంటుంది. ఏ ప్రాంతానికి పోయిన ఆకాశపు అంచుల దాకా ప్రయాణిస్తున్న ఎక్కడ ఫలం లేదు. ఆ ఫలంలో విత్తు లేదు. ఫలం లేనిది, విత్తు లేకుండా సహజ సిద్ధంగా పండేదని విప్పడం విశేషం.

2. టాంగే ఛేని పణన్ చాలచ, అంకి ఛేని పణణ్ రోవచ(మబ్బు)హేము ఎస్. వయస్సు25 సపావత్ తండా, గుర్రంపోడ్ మండలం నల్లగొండ జిల్లా.

అర్థం : కాళ్ళు లేవు గాని నడుస్తది కళ్ళు లేవు గాని ఏడుస్తది(మబ్బులు)

వివరణ :

కాళ్ళు లేకున్నప్పటికి నడిచేది, కళ్ళు లేకున్నా ఏడిచేది ఏదని పొడవగా సహజంగా కాళ్ళు లేకుండా ఏ జీవి నడవదు కదా, కాని ఇక్కడ నడుస్తుందట. అలాగే కళ్ళు లేకుండా ఏడవడమంటూ ఉండదు. కాని మబ్బు అని విప్పడం వలన ఈ పొడుపు కతకున్న విషయం అర్థమవుతుంది.

వ్యవసాయ సంబంధమైనవి :

1. అప్ ఆపే ఘర్ బేటి బాపేర్ ఘర్ భర్తార్ దేకన్ హసనాల్ కరతో బేటీర్ గర్భం ట్యారజా(సాళేర్ మండ్యా)తోల్చ ఆర్. వయస్సు62 జలగంబాయి తండా, పెద్దఅడిశర్లపల్లి మండలం

అర్థం : కొడుకు తండ్రి ఇంట్లో, కూతురు పుట్టింట్లో భర్తను చూసి స్నానం చేస్తే గర్భం వచ్చింది(వరి మొలక)

వివరణ :

పుట్టింటికి పోయిన కూతురు భర్తను తలుచుకొని స్నానం చేస్తే ఆమెకు గర్భం వచ్చిందని పొడుపును పొడవడం జరిగింది. సాధారణంగా ఆడ, మగ కలయిక వలన గర్భం వస్తుంది. కాని భర్తను చూసి స్నానం చేస్తే గర్భం రావడమనేది చాలా ఆసక్తికరమైన విషయం. అయితే ఆ గర్భం అనేది వరిమొలక అని విప్పడం ద్వారా స్త్రీ గర్భాన్ని మొలకతో పోల్చి కథను పొడవడం వారి విజ్ఞానానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

2. ఛో సాదరి తీన్ పామణ్ పక్కా ఫరేన్ జాగ్ ఛేని(రండీర్ బోడిగ్యా)తోల్చ ఆర్. వయస్సు62 జలగంబాయితండా, పెద్దఅడిశర్లపల్లి మండలం నల్లగొండ జిల్లా.

అర్థం : ఆరు చాపలు, ముగ్గురు బంధువులు పక్కా తిరగడానికి జాగ లేదు(ఆముదం కాయ)

వివరణ :

ఈ పొడుపు కథలో ఆరు చాపలున్నా బంధువులు ముగ్గురే ఉన్నారు. కాని పక్కా తిరగడానికి జాగ లేదని పొడవగా దానికి ఆముదం కాయ అని విప్ప కథ. అంటే ఆముదం కాయలో మూడు విత్తులు ఉంటాయి, కాని అది రెండు రెక్కలతో మూసుకొని ఉంటుంది. అలా రెండు రెక్కలతో మూడు కాయలు మొత్తం ఆరు అవుతాయి. అందుకే ఆ మూడు కాయలను బంధువులతోను, ఆరు రెక్కలను చాపలతోను పోల్చి ఈ కథను చెప్పడం జరిగింది.

వంట సామాగ్రి సంబంధమైనవి :

1. ఏక్ ఉతర్‌జా అజేక్ చడ్‌జా(బాటి)సామా డి. వయస్సు 90 లచ్యతండా, త్రిపురారం మండలం

అర్థం : ఒకటి దిగిపోతుంది, ఇంకోకటి ఎక్కుతుంది (రొట్టె)

వివరణ :

ఒకటి దిగిపోవడం మళ్ళి ఇంకొకటి ఎక్కడం అని పొడవడం దానికి రొట్టె అని విప్పడం వలన విషయం స్పష్టమవుతుంది. రొట్టెలు చేసేటప్పుడు ఒకదాని తరువాత మరొకటి వేస్తుంటారు. తమ అనుభవంలో ఎదురయ్యే సంఘటనలను పొడుపు కథగా మలచి చెప్పుకోవడం విశేషం.

2. కాళ్ గావడి హాత్ ఫేరేదేని(తవ్వా)సామా డి. వయస్సు 90 లచ్యతండా, త్రిపురారం మండలం

అర్థం : నల్లని ఆవు చెయ్యి నిమరనివ్వదు(పెనం)

వివరణ :

నల్లని ఆవు చెయ్యి నిమరనివ్వదు అనేది పొడుపు. సాధారణంగా ఏ రంగు ఆవు అయినా మనుషులను దగ్గరకు రానీయకుండా ఉండదు. తాము పెంచుకునే ఆవులు అయితే మరి ఈ విషయంలో తేడా ఉండదు. కాని దీనికి పెనం అని విప్పడం వలన అవునని అనుకుంటారు. అందుకే కాలుతున్న పెనంపై చేతులు పెడితే మాడిపోవడం ఖాయం అందుకనే పెనాన్ని నల్లని ఆవుతో పోల్చి చెప్పడం జరిగింది.

కుటుంబ సంబంధమైనవి :

1. తార్ ధణి కతరా పర్ ధణి కతరా(బేటా బేటి)బిచ్యా ఉ. వయస్సు55 పోర్లగడ్డతండా, సంస్థాన్‌నారాయణపూర్ మండలం

అర్థం : నీకు మొగుళ్ళు ఎంత మంది, పర మొగుళ్ళు ఎంతమంది(కొడుకులు, కూతుళ్ళు)

వివరణ :

నీకు మొగుళ్ళు ఎంత మంది, పరమొగుళ్ళు ఎంత మంది అని పొడవగానే సాధారణంగా మొగుడు ఒక్కడే ఉంటాడు. కాని మొగుళ్ళు, పరమొగుళ్ళు అంటే అర్థం కాదు. దానికి కొడుకులు, కూతుళ్ళు అని విప్పినప్పుడు విషయం అర్థమవుతుంది. ఇంట్లో ఉండే కొడుకులు మొగుళ్ళుగా తయారవుతారని, కూతుళ్ళను పర ఇంటికి ఇవ్వాల్సిందే కాబట్టి వారు పరమొగుళ్ళు అని పోల్చి చెప్పబడింది.

వాహన సంబంధమైనవి :

1. గాబణ్ గోయి గట్లా చడేని(బళదూర్ బండి)రాంచంద్ పి.వయస్సు90 పలుగుతండా, త్రిపురారం మండలం

అర్థం : గర్భంతో ఉన్న ఉడుము కొండ ఎక్కదు (ఎద్దుల బండి)

వివరణ :

గర్భంతో ఉన్న ఉడుము కొండ ఎక్కదు అని పొడిస్తే దానికి ఎద్దుల బండి అని విప్ప కథ ఉంది. కొండల్లో, గుట్టల్లో నివసించే బంజారాలు ఎద్దుల బండినే తమ రవాణా సౌకర్యంగా ఉపయోగించుకుంటారు. అయితే ఎగుడుదిగుడుగా ఉండే కొండల దారిలో భర్తితో ఉన్న ఎద్దులబండ్లు కొండ ఎక్కని సందర్భాలు ఉంటాయి. వాటినే పొడుపు కథగా మలిచి గర్భంతో ఉన్న ఉడుముతో ఎద్దుల బండిని పోల్చి చెప్పడం జరిగింది.

శరీరావయవాల సంబంధమైనవి :

1. పోలేసే లాకడేమా బత్తీస్ ఇండా(దాంత్)రాములు ఎస్. వయస్సు85 జానారెడ్డికాలని, అనుముల మండలం

అర్థం : శిథిలమైన మొద్దులో ముప్పై రెండు గుడ్లు (దంతాలు)

వివరణ :

శిథిలమైన మొద్దులో ముప్పై రెండు గుడ్లు అని పొడవడంతో, మొద్దులో గుడ్లు ఎలా సాధ్యమని ఆలోచన వస్తుంది. కాని దంతాలు అని విప్ప కథ చెప్పినప్పుడు అర్థం తెలిసిపోతుంది. నోటిని శిథిలమైపోతున్న మొద్దు తోను, దంతాలను గుడ్లతోను పోల్చి చెప్పడం విశేషం.

2. పాంచ్ ఆదిమి ఘాలేవాళ్ ది ఆదిమి దేకేవాళ్, తీస్‌పర్ ది ఆదిమి ఖాయేవాళ్ (అంగళి, ఆంకి, దాంత్)లసకరియా ఆర్. వయస్సు55 గాంసిరాం తండా, దేవరకొండ మండలం

అర్థం : ఐదుగురు పెట్టేవాళ్ళు, ఇద్దరు చూసేవాళ్ళు, ముప్పై రెండు మంది తినేవాళ్ళు(చేతివేళ్ళు, కళ్ళు, దంతాలు)

వివరణ :

ఐదుగురు పెట్టేవాళ్ళు, ఇద్దరు చూసేవాళ్ళు, ముప్పై రెండు మంది తినే వాళ్ళని పొడుపు కథ పెట్టేవాళ్ళు, తినేవాళ్ళంటే ఎవరికి అర్థం కాదు. కాని చేతివేళ్ళు, దంతాలు అని విప్పడం వలన విషయం అర్థమవుతుంది. చేతికున్న ఐదు వేళ్ళు నోట్లో ముద్దను పెట్టడం వలన, ముప్పై రెండు దంతాలతో ఆహారాన్ని నములుతాం. ఇదంతా రెండు కళ్ళతోనే చూస్తూ చేస్తాం. శరీరవయవాలను మనుషులుగా పోల్చి చెప్పడం విశేషం.

పశు, పక్షి, క్రిమి కీటకాల సంబంధమైనవి :

1. సర్ సోటాక పూంచళ్ మోటా ఊంపర్ ణ్యాన్ చర మోట్ కరతా భణా నసిబేమా ఆంక్ న సమ్ క ఓర్ పాంక్(భాణియా)వసరాం ఆర్. వయస్సు90 నందియాతండా, పెద్దఅడిశర్లపల్లి మండలం

అర్థం : చిన్న రోకలి పెద్ద తోక పైన రెక్కలుంటాయి (తూనీగ)

వివరణ :

ఈ పొడుపు కథలో చిన్న రోకలి పెద్ద తోక, రెక్కలుంటాయి. ఎగురుతుంది కళ్ళుంటాయి అని పొడిస్తే రెక్కలు, తోక కళ్ళుండి ఎగిరేది ఏమిటని ఆశ్చర్యపోవడం సహజం కాని తూనీగ అన ఇకథను విప్పినప్పుడు విషయం అర్థమవుతుంది. ఇక్కడ తూనీగను రోకలితో పోల్చి చెప్పడం జరిగింది.

2. ముండిమా మాస్ ఛేని, పూంచడియాతో భేజో వంగావతో కేదేన్ తార్ మలకేన డగరజో (మకోడా) వసరాం ఆర్. వయస్సు90 నందియాతండా, పెద్దఅడిశర్లపల్లి మండలం

అర్థం : తలలో మాంసం లేదు తోకలో మెదడుంది. చేతనైతై అర్థం చెప్పి నీ ఊరికి వెళ్ళు(గండుచీమ)

వివరణ :

తలలో మాంసం లేదు తోకలో మెదడుంది అది

ఏంటిదో చెప్పి నీ ఊరికి వెళ్ళమన్నాడట. తలలో మాంసం లేకుండా ఏ పక్షి, పురుగు, జంతువు అయినా ఉంటుందా? అని ఆలోచిస్తే ఉండదు. ఇంకా తోకలో మెదడు ఉంటుంది. దానికి గండుచీమ అని విప్పు కథ. అయితే గండుచీమకు తోకలో మెదడుందని చెప్పడం విశేషం.

వృక్ష సంబంధమైనవి :

1. ఊంపర్ ద్వాళో వచ్చ రాతడో పాక్‌తీన కాళో (ఢాగడార్ పూల్) రాములు ఎస్. వయస్సు85 జానారెడ్డికాలని, అనుముల మండలం

అర్థం : పైన తెలుపు మధ్యలో ఎరుపు పక్కలో నలుపు(మోదుగు పూలు)

వివరణ :

పైన తెలుపు మధ్యలో ఎరుపు పక్కలో నలుపుగా ఉండేవి ఏమిటి? అని కథ పొడవగా మోదుగుపూలు అని విప్పు కథ ఉంది. మోదుగుపూలు పైన తెల్లగాను, తరువాత ఎర్రగాను, కింద నల్లగాను ఉండి చూడ ముచ్చడగా ఉంటాయని మోదుగు పూల ప్రత్యేకత చెప్పబడింది.

2. ఆడో కాటూ హూబో కాటూ ఫేరన్ కాటూతో పుట్టో. ఏర్ ఆదోడ్ న కతో గాండ్ మరాన్ ఊట్టో(ఆకేర్ ఝాడ్)ఖామ్లా ఆర్. వయస్సు85 బాల్యనాయక్‌తండా, నాంపల్లి మండలం

అర్థం : అడ్డంగా కోస్తా, నిలువుగా కోస్తా, తిప్పి వీపు కోస్తా దీని అర్థం చెప్పకపోతే దెబ్బలు తిని పోవాలి(జిల్లేడు ఆకు)

వివరణ :

బంజారాలు కథలు చెప్పుకుంటున్నప్పుడు సవాళ్ళకు, ప్రతిసవాళ్ళు విసురుకోవడం జరుగుతుంది. ఈ పొడుపు కథలో అడ్డంగా కోస్తా, నిలువు కోస్తా, వెనుక తిప్పి కోస్తా అదేమిటో చెప్పమని సవాలు చేస్తూ దీనికి సమాధానం చెప్పకపోతే దెబ్బలు కొట్టించుకొని పోవాలని చెప్తాడు. అయితే దీనికి జిల్లేడు ఆకు అని విప్పినప్పుడు అదేలా అని సందేహం కలుగుతుంది. బంజారాలు జిల్లేడు ఆకును చుట్ట ఆకుగా ఉపయోగిస్తారు. ఆ ఆకులో పొగాకు చుట్టడానికి ముందే ఆ ఆకును నిలువునా రెండుగా చీల్చి, ఒక భాగాన్ని తీసుకొని మళ్ళి దానిని అడ్డంగా కోస్తారు. ఆకును తిప్పి వెనక వైపు ఉండే నరాన్ని నోటితో తీస్తారు. తరువాత పొగాకు చుట్టుకుంటారు.

వస్తు సామాగ్రి సంబంధమైనవి :

1. హాత్ హాతేళి ఘూరళ్ కేళి దాడేర్ సాళీన్ చాందేర్ భ్యాన్(ఆరసి)సామా డి. వయస్సు90 లచ్యతండా, త్రిపురారం మండలం

అర్థం : అరచేతిలో మేడిపండులాంటిది సూర్యునికి మరదలు, చంద్రునికి చెల్లెలు(అద్దం)

వివరణ :

అరచేతిలో మేడిపండులాంటిది, సూర్యుడికి మరదలు, చంద్రునికి చెల్లెలు అని పొడవగా అదేమిటని అనుకుంటాం కాని దానికి అద్దం అని విప్పినప్పుడు సూర్యుని శక్తిని, చంద్రుని వెలుగును ఒక దగ్గర కలిగింది అద్దం అని, అద్దాన్ని సూర్యునికి మరదలుగాను, చంద్రున్ని చెల్లెలుగాను చెప్పబడటం విశేషం.

2. హేట సన్యా ఊంచ నారి చ వనస పతిర్ మాయి, అన్ కావచ పణణ్ పాణి పియేని మార్ నాం కాయి(ళటి)చందు ఇ. వయస్సు60 బాల్యనాయక్‌తండా, నాంపల్లి మండలం

అర్థం : కింద గుడ్డ పైన స్త్రీ ఉంది. అడవిలో అన్నం తింటుంది కాని నీళ్ళు తాగదు నా పేరు ఏమిటి? (తిరుగలి)

వివరణ :

కింద గుడ్డ పైన స్త్రీ అడవిలో ఉంది. అన్నం తింటుంది కాని నీళ్ళు తాగదు నా పేరు ఏమిటని పొడుపు కత చెప్పగా అడవిలో స్త్రీ ఉండడం ఏమిటి? అన్నం తిని నీళ్ళు తాగకుండా ఉండే స్త్రీ ఉంటుందా? అనే ప్రశ్నలు వస్తాయి. కాని తిరుగలి అని విప్పినప్పుడు అసలు

విషయం అర్థమవుతుంది. తిరుగలి కింద గుడ్డ పెట్టి, అందులో ధాన్యం గింజలను వేసి తిప్పితే పిండి రాలుతుంది కాని నీళ్ళను పోయడం జరగదు కదా అందుకే తిరుగలిని స్త్రీతోను, ధాన్యాన్ని అన్నంతోను పోల్చి చెప్పడం జరిగింది.

ఇతర సంబంధమైనవి :

1. షారే అవడా వడేర్‌ఝూడ్ పడతో ఊటేని (ముగ్గు) దసరు ఎన్. వయస్సు60 నపావత్‌తండా, గుర్రంపోడ్ మండలం

అర్థం : పట్నమంతా మర్రిచెట్టు పడితే మళ్ళి లేవదు(ముగ్గు)

వివరణ :

పట్నమంతా మర్రిచెట్టు కింద పడితే మళ్ళి లేవదని చెప్పినప్పుడు, నేల మీద కూలితే దానిని కొమ్మలుగా నరికి తీయవచ్చు కాని అది ముగ్గు అని విప్పినప్పుడు నేల మీద వేసిన ముగ్గును మళ్ళి తీయలేమని ముగ్గును మర్రిచెట్టుతో పోల్చి చెప్పడం ఈ పొడుపు కథ విశేషంగా చెప్పవచ్చు.

ముగింపు :

బంజారాల పొడుపు కథలు ఒక తరం నుండి మరొక తరానికి చేరుతూ, మరికొన్ని కొత్త పొడుపు కథలు పుట్టుకొచ్చి కలిసి వారి జీవనవిధానం, సంస్కృతి, ఆచార సంప్రదాయాలను తెలుపుతున్నాయి. వారి పెళ్ళి, పండుగ సమయాలలో, పంచాయితీలు జరిగే సందర్భంలో ఒకరు పొడుపు కథను పొడుస్తు ఉంటే మరొకరు విప్పుతుంటే అక్కడున్నవాళ్ళు ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు. ప్రకృతి, వ్యవసాయం, క్రిమి కీటకాదులకు, వృక్ష, జంతువులు మొదలైనవి వారి జీవన విధానం బంజారాల పొడుపు కథలలో తెలియవస్తున్నాయి.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. గోనానాయక్ ఎం.2002 సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు హైదరాబాదు:పద్మశ్రీ గ్రాఫిక్స్
2. చినియానాయక్ బి 1998 బంజారా చరిత్ర సంస్కృతి-ప్రగతి అనంతపురం:హోధీరాం బావాజి పబ్లికేషన్స్
3. భగ్గు పి. 2014 నల్లగొండ జిల్లా గిరిజన సాహిత్య, సాంస్కృతిక అధ్యయనం హైదరాబాద్ విశ్వవిద్యాలయం(అముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం)
4. రామరాజు:బి. 1958 తెలుగు జానపద గేయ సాహిత్యం హైదరాబాదు: జానపద విజ్ఞాన ప్రచురణలు
5. మోహన్ జి.ఎస్ 2010 జానపద విజ్ఞానాధ్యయనం కుప్ప: ద్రావిడ విశ్వవిద్యాలయం
6. సుందరం ఆర్వీఎన్. 1983 ఆంధ్రుల జానపద విజ్ఞానం హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

❖ ❖ ❖

బంజారా సంస్కృతి, సాంప్రదాయాలు – ఒక విశ్లేషణ

– బానోతు స్వామి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

సర్వమతాలు, సదాచారాలు, భిన్నత్వంలో ఏకత్వం, సంప్రదాయాలకు మారు పేరు రత్నగర్భగా పేరుగాంచిన భారతదేశం. అటువంటి మనదేశంలో కొన్ని వందల సంవత్సరాల క్రిందట అరబ్బు దేశాల నుండి బ్రతుకు జీవుడా అని పొట్టను చేత పట్టుకొని ఈ పవిత్ర భూమిలో స్థిరపడ్డారు. అంగ్లేయులు, తరుష్కులు, మొఘలులులాగా వ్యాపారం కొసమో, వాణిజ్యం కోసమో మన దేశానికి వచ్చి రత్న వైడూర్య, మణిమాణిక్యాలు, మన మాన, ప్రాణా లను దోచుకొని పోయినట్లు వారు దోచుకొని పోలేదు. ఈ నేల, ఈ మట్టి ఋణం తీర్చుకోవాలని భావించి రవి అస్తమించని బ్రిటీష్ రాజ్యాన్ని గడగడలాడించి రక్కసుల కంబంధ హస్తాల నుండి భరతమాతను రక్షించి, ఈ పవిత్ర భూమిపై స్థిరపడిన వారే "బంజారా రాజపుత్రులు".

బంజారాలు వారు నిర్వహించే విధులను బట్టి లణ ధియా బంజారా పమార్ బంజారా, గోర్ బంజారా అని వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. మనదేశంలో ఆది వాసులు, బంజారాలు, మణిపూర్, మేఘాలయ, సిక్కిం, పంజాబ్, గుజరాత్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, రాజస్తాన్లలో చౌహాన్ , పమార్, రాథోడ్, పట్నాయక్లుగా పేరుగాంచారు. ఈ రాష్ట్రాలలో వీరితో పాటు చెంచు, గదభ, సవర, తోడాలు, తోటీలు, ఎరుకల, కొండదొర, కోయదొర, కొండరెడ్లు అడవులలో అరణ్యాలు, పర్వతాలు, గుహలు, కొండలలో నిరసిస్తూ ప్రకృతి సంపదను స్మగ్లర్ల నుండి కాపాడి మనకు మంచి గాలిని అందించడంలో, సకాలంలో వర్షాలు కురవడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. మిజోరాం, మేఘాలయ, అరుణాచలప్రదేశ్, సిక్కింలో తోదలు, గదబ, సవర వంటి గిరిజన సంచార జాతులపై ప్రముఖ ఆంత్రోపాలజిస్ట్ ముజుందార్ ఎన్నో పరిశోధనలు చేసి నేటికి ఆ గిరిజన జాతులు డబ్బుతో అవసరం లేకుండా జీవిస్తున్నారంటే వారి జీవనశైలి నాటి ఋషులు, మహర్షులు, జీవన విధానానికి దర్పణం పడుతోంది. మనదేశం అటవి పర్యా వరణ హక్కుచట్టం చేసి ఆ బాధ్యతను నిర్వహించవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అటవి శాఖలకు అప్పచెప్పకుండా సకాలంలో గిరిజన జాతులైన ఆదివాసీలు, చెంచు, సవర, గదబ, గోండులు, దంజారాలకు అప్పజెప్పింది అంటే వారి యొక్క నీతి నిజాయితీని మనం శిరసావహించి నమస్కరించవలసిందే. నాటికి గిరిజనులు పేదలుగా వుండి పోవడానికి కారణం వారు కేవలం పశుపోషణ, అటవి ఉత్పత్తులపై ఆధారపడి జీవించడమే.

నేడు ఎంతో ధనవంతులుగా పేరుగాంచిన గిరిజనేత రులు ఎవరు కూడా పుట్టుకతో ధనలక్ష్మీ పుత్రుడు కాదే. పుట్టినపుడు రెండు ఎకరాలు పొలం వున్నవాడు నేటికి వేల కోట్లు ప్రోగు చేసుకొన్నాడు. 50సంవత్సరాల క్రితం పూరి గుడిసెలో వుండే గిరిజనేతరులు నేడు కోటకు ఎదిగారు అంటే వారు బలశారులు, వీరులు, ధీరులు కాదు, వీరు కష్టపడి చెమటోడ్చి సంపాదించలేదు. వీరు భారతావనిలో వుండే సహజ సంపదలైన భూగర్భ సంపదలను అక్రమంగా వెలికి తీసి, అడవులలోని విలువైన కలప సంపదలను దొంగలించి, ప్రభుత్వాలకు మోసం చేస్తూ అక్రమార్జన ద్వారా ధనాన్ని ప్రోగు చేసు కున్నారు. నాగలి పట్టి దుక్కి దున్ని పంట వార్పు చేసి ధనవంతులు కాలేదు. గిరిజనులు, కట్టెలు, తేనే సేకరించి, పశుపోషణ' చేస్తూ నేటికి జీవిస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోవలసిన గిరిరజనేతరులు గిరిజనులను నీచంగా చూస్తున్నారు. అంటే వారి నీచ సంస్క్ృతికి ఇది అద్దం పడుతుంది.

మన ఆంధ్రప్రదేశ్లో గిరిజనులలో 33 జాతులు

న్నాయి. అందులో ముఖ్యమైన ఆదివాసీ గిరిజన జాతులైన గోండులు, కోయ, గదబ, సవర, తోదలు. విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలు, మన్యం తీర ప్రాంతాల్లో, అరకు లోయలలో నివసిస్తున్నారు. నేటికి వీరు అటవి ఉత్పత్తులను సేకరించి - జీవనం సాగిస్తూ అడవులను కాపాడుతున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అరకు లోయ, విశాఖ మన్యంలో పండే కాఫీకి హక్కులు గిరి జనులవే అని చట్టం చేసినా అవి పూర్తిగా అమలు కావడం లేదు. ప్రకృతిని ఆరాదించి సంపదలను దోచుకోకుండా అడవి తల్లిని నమ్ముకొని జీవించే బంజారాలు, మిగిలిన గిరిజనులు గొప్పవారే. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 వున్న, అడవిని, అటవి సంపదకు కాపాడడానికి ఐ.ఎ.ఎస్. స్థాయి అధికారి, ఎందరో ప్రభుత్వ అధికారులు వున్నా, వారి జీతభక్యాల కోసం ప్రతి యేటా వేల కోట్ల రూపా యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్నా లక్షల కోట్లు విలువ చేసే ఎర్రచందనం, టేకు, గంధం, మిగిలిన వన్య సంపద అన్యాకాంత్రం అయ్యాయి. అడవి బిడ్డలైనా గిరిజనులను నాయకులు బెదరించి వారి ద్వారా ఈ అక్రమార్ధన చేసి చివరకు గిరిజనులకు బలిచేయడం అనేది తల్లి రొమ్ము పాలు త్రాగి రొమ్మును గుద్దడం లాంటిదే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవి ఉత్పత్తులపై గిరిజనులకు హక్కులు కల్పించాలి. పసుపు, చింతపండు, తెనే, కుంకుడు కాయలు, విస్తరాకులు వంటి ఎన్నెన్నో ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని తక్కువ ధరకే గిరిజన కార్పొరేషన్ (ట్రైకార్) ద్వారా ప్రజలకు అందు బాటులో తెచ్చిన అధికారులు సైతం రాజకీయ రాబంధు లకు లొంగి కొందరు అటవీ సంపదలను హరింప చేస్తున్నారు. మరికొందరు అయితే, నిజాయితీ గల అధికారులను సైతం హతమార్చి అటవీ సంపదలను కొల్లగొట్టి అక్రమ మార్గంలో విదేశాలకు తరలించి వేల కోట్లు కొల్లగొట్టుతున్నారు. అటవి సంపదలు తరలించే టప్పుడు ఎన్నో చెక్‌పోస్టులు దాటి, చివరకు వేరే రాష్ట్రాలలో సైతం దాటి, పడవల విమానాల ద్వారా విదేశాలకు అటవి సంపద తరలిపోతోంది అంటే ప్రతి స్థాయిలో నల్లధనం నదిలో నీరు ప్రవహిస్తున్నట్లు ప్రవహిస్తున్నది. అన్నమాట. ఇది గమనించిన మన రాష్ట్ర ప్రభుత్వం "వనమిత్ర" అని పేరు పెట్టి అప్పజెప్పింది అంటే బంజారాలు, గిరిజనులు అడవి తల్లిని కాపాడి దేశ, రాష్ట్ర సంపదలను సంరక్షించే వారిగా కీర్తింపబడ్డారు. కాని గిరిజనులు -వివక్షకు గురై కనీస అవసరాలకు కూడా దూరమై రోగపీడితులై బాధ పడుతున్న గూడెంలు ఎన్నెన్నో వున్నాయి. తెలంగాణలో ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో బంజారాలు అధికంగా వున్నారు. అదిలాబాద్ కరంనగర్ జిల్లాలో కోయ, గోండులు అధికంగా వుండి వనదేవతలను ఆరాధిస్తూ అడవులను కాపాడుతున్నారు.

బంజారాల సంస్కృతి ఆచారాలు హిందూ మతానికి ఆదర్శమైన విధం :

ఇంతకు మునుపే చెప్పినట్లు దంజారాలు దేశభక్తి గల వీరులు, ధీరులు భరతమాత నుదుటిపై తమ రక్తతిలకం దిద్దిన దేశభక్తులు. ఇలా ఎందుకు చెబుతున్నా నంటే ప్రముఖ చరిత్రకారుడు కల్నల్టాడ్ చెప్పినట్లు సిద్ధాంతాలు, ఆచారాలు, కట్టుబాట్లు, మత పెద్దలు చెప్పినట్లు అనుసరించడంలో చౌహాన్, పమార్, రాథోడ్, నాయక్, సుగాలి, లంబాడిలుగా పిలవబడే "బంజారాలు ఆచరించినట్లు ఎవరు ఆచరించరని పరిశోధనల ద్వారా తెలియజేశారు. ప్రతి మతంలో వున్నట్లే బంజారాలలో కూడా భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. అయినప్పటికీ 'తాండా' పెద్ద అయిన "నాయక్", కార్భారీ (మంత్రి) డావో (సలహాదారు)ల సలహా మేరకు క్రమశిక్షణ లోపించినపుడు 'నసాభ్' అనే పంచాయితీ పెట్టి మందలిస్తారు. అంతేకాదు పెద్దలను గౌరవించాలనే ఆచారం ఎప్పుడైతే గాడి తప్పు తుందో ఆచార, వ్యవహారాలు, పాటించని, అధికారంతో రాజ్యానికి అధిపతి అయినా సరే, జిల్లాకు కలెక్టరు అయినా సరే సగరాలు, పట్టణాల నుండి 'తాండా'లకు వచ్చినపుడు ఖచ్చితంగా నేటికి తాండా హిందూధర్మ, సనాతన, వైదిక ధర్మాలను పాటించవలసిందే. అలా పాటించని వ్యక్తికి

దండన ఉద్యోగాలలో స్థిరపడిన వారు ఖచ్చితంగా వారి మతాచారాలను, హిందూధర్మ సంస్కృతిని ఆచరిస్తారు. 'తాండా' పెద్ద అయిన నాయక్ పర్యవేక్షణలో డావో, కార్ భారీ, ఒక చోట సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేస్తారు. ఎక్కడో చెట్టుకోమ్మపై పుష్పించి వికసించి సుదూరానికి సైతం సుగంధ పరిమళాలను వెదజల్లి సకల జీవులలో ఉత్తేజాన్ని ఎలా అందిస్తుందో, అదే విధంగా యుగోస్లేవియాలో పుట్టి మనదేశానికి అడుగుపెట్టి భరతమాత నుదుటను ముద్దాడి నేను సైతం నీ బిడ్డలకు సేవ చేసానని మురికి కూపంలో చిక్కుకుని, దారిద్రంతో విలవిలలాడుతున్న కలకతా నగరానికి వచ్చి సేవ చేసి తరించి "భారత రత్న" పొందిన దైవదూత మదర్ థెరిస్సా సమస్త విశ్వానికి ఆదర్శప్రాయం. అదే విధంగా జాతి, ఉపజాతి ఏదైనా దేశభక్తి, అచారవ్యవహారాలు పాటించడంలో దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్తాన్, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా, గుజరాత్ మొదలగు రాష్ట్రాలలో విస్తరించి వున్న పమార్, చౌహాన్, రాథోడ్, సుగాలి' లంబాడిలుగా పిలువబడే 'బంజారాలు' క్రమ శిక్షణ, హిందూధర్మ ఆచారాలు కట్టుబాట్లు పాటించడంలో ఇతర మతాలకు ఆదర్శనీయం. ఇంకొక విషయం మనం గమనించాలి. దేశభక్తిని చాటడంలో, ఆచార, కట్టుబాట్లు హిందూధర్మపరిరక్షణలో దేశంలోనే పేరుగాంచిన వారు "సిక్కులు". వీరే బంజారాలకు ప్రేరణ. ఇరువురు భారత దేశమనే రథానికి చక్రాలవంటి వారు ఇలా చెప్పడంలో అతిశయోక్తి లేదు. చరిత్రకారులు చెబుతున్నదే నేను చెబుతున్నాను.

గిరిజన 'బంజారా'ల వివాహ పద్ధతులు ఆచారాలు, సంస్కృతికి మూలం :

గిరిజన తెగల్లో ప్రముఖమైన బంజారాలు అనబడే నాయక్లు, సుగాలి, లందాడీలు, వీరి శైలి, అచారాలు అన్ని కూడా జీవిత పరమార్థాలను, సంస్కృతిని, సాంఘిక, నైతిక, ఆధ్యాత్మిక విలువలను బోధించే విధంగా వుంటుంది. హిందూధర్మం, సంస్కృతి ప్రకారం వివాహం అష్ట విధములుగా వుంటుంది. అవి.

బ్రహ్మ వివాహం	దైవ వివాహం
ఆర్ష వివాహం	ప్రాజాపత్య వివాహం
అసుర వివాహం	గాంధర్వ వివాహం
రాక్షస వివాహం	పైశాచిక వివాహాలు

పైవన్నీ ఐతరేయబ్రాహ్మణంలో 3వ అధ్యాయంలో వివాహం యొక్క విశిష్టతను క్రింద విధంగా వివరించారు.

"సాలంకృత కన్యాదానం సద్గుణార్థం
మనోహితాసహ సంకల్పిత దక్షిణాం
తుభ్యమహం సంప్రదే నమమ సమమ॥

సద్గుణవంతుడైన వరుణ్ణి అన్వేషించుకొని వధుపు తండ్రి వరునికి కన్యాదానంతో పాటు దక్షిణల రూపంలో బంగారు, వెండి, ధనమును ఇస్తాడు. అంతేగాకుండా లక్ష్మీదేవి స్వరూపమైన కుమార్తెకు బంగారునగలతో అలంకరించి కన్యాదానం చేస్తారని ప్రతీతి.

వేదాలలో ప్రాచీనమైనది, సర్వశాస్త్రాలకు నిలయమైన ఋగ్వేదంలో వివాహం గురించి చక్కగా వర్ణించారు.

రూపం హీరణ్యం పశవో వివాహ
రయించ పుత్రాంగశ్చ దగ్నిర్మహ్యా - మధో ఇమాం

ధార్మికత అనేది వివాహానికి గొప్ప ప్రతీక. వివాహ ప్రస్తావన మహాభారతంలోని శాంతిపర్వంలో ఇలా చెప్పడం జరిగింది.

నగృనహం గృహ మిత్యాహుః గృహినీ గృహ మభ్యతే।
గృహంతు గృహిణీమీనకుం అరణ్య సదృభశ్యం మతం॥

సనాతన హిందూ ఆచారం ప్రకారం ప్రాచీన భారత దేశంలో సద్గుణవంతుడైన వరుణ్ణి వెతికి కన్యాదానం చేసేవారు. కాలక్రమంలో విధి వక్రీకరించి భర్త చనిపోతే, ఆ స్త్రీకి నరకప్రాయం కాకూడదు అనే ఆలోచనతో చని పోయిన భర్త యొక్క తమ్మునితో (దేవర్) తిరిగి ఆ స్త్రీకి వివాహం చేసేవారు అప్పటి ఆచారం ప్రకారం వాలి కూడా సుగ్రీవుణ్ణి ఓడించి సుగ్రీవుని భార్యనూ చేసుకున్నాడు. ద్రౌపది పంచపాండవులకు భార్య అయింది. అంటే బహుభార్యత్వం (పాలీగమీ) ఆ కాలంలోనే వుంది.

వంశోద్ధరణకు బహుభార్యత్వం ఆచరణలోకి వచ్చింది. ఇదే ఆచారం, సాంప్రదాయం గిరిజనులలోని బంజారా లలో వుంది.

హిందూ వివాహంలాగానే తాండా సంస్కృతిలో బంజారాల వివాహ సంప్రదాయం చాలా ముఖ్యమైనది. వీరు కొన్ని శతాబ్దాల నుండి తమ వైవాహిక అచారాలను అలాగే ఆచరించుకుంటూ ర్వ్వడం చేత వివాహ పదతిలో ప్రత్యేకతలు కన్పిస్తాయి. పూర్వ సంచార జీవులైన ''ఉంజారాలు' సంవత్సరకాలంలో నాలుగు నుండి ఆరు నెలలు వ్యాపారం, పశుపోషణ కోసం వలస సంచారం పోయేవారు.

బంజారాలలో 'సగాయి' అనే వధూవరులకు నిశ్చితార్థం చేయు విధం :

వంద సంవత్సరాల మునుపు బంజారాల వివాహం చాలా ఖర్చుతో, విందు, వినోదాలతో వారం రోజులు జరిగేవి. జీవిత పరమార్థం, ఎలా జీవించాలి దేశభక్తి, గురుభక్తిని, బోధించే విధంగా పెళ్ళిలోని ఘట్టాలు వుండేవి. అవి కథలు, పాటల రూపంలో వుండేవి. బంజారాల సంస్కృతి ప్రాచీనమైనది, ఆదర్శమైనది. బంజారాలు ధనం దాచుకోవడానికి ఇష్టపడరు. అందుకే బంజరాలు పేదవారుగా మిగిలారు. బంజారాలలో అబ్బాయికి ఒక అమ్మాయిని చూడడానికి ఎన్నో అంశాలను పరిశీలిస్తారు. అందరికి నచ్చితే 'సగాయి' అంటే నిశ్చితార్థం చేసుకుంటారు. బంజారాలలో ప్రధానంగా నాలుగు ఉప వంశాలున్నాయి. అని పమార్, రాథోడ్, చౌహాన్, వడిత్యా. మాతృ గోత్రస్తులకు కాకుండా వేరే గోత్రం వారికి ఇచ్చుకుంటారు. రాథోడ్లలో రకాలు వన్నాయి. వీటిలో వరుసకు అయ్యే వారితో సంబంధాలు కుదర్చుకుంటారు. ఉదాహరణకు రామస్వామి తాండా అబ్బాయికి పూజారి తాండా అమ్మాయికి సంబంధం కుదిరినపుడు, ఇరు తాండాల పెద్దలు, తాండా 'నాయక్' సమక్షంలో 'సగాయి' అంటే నిశ్చితార్థం చేసుకుంటారు. దీనినే బంజారా భాషలో ''గోళ్ ఖాయోరో నోక్తా'' అంటే నిశ్చితార్తంలో భాగంగా అప్పట్లో అందుబాటులో వుండేది 'బెల్లం' ఒక్కటే కాబట్టి, పసుపు కుంకుమ నీళ్ళు వరున అయ్యే వారిపై ఆనందంతో చల్లుకొని, అగ్ర వారి నోటిలో బెల్లం పెడుతారు. సంతోషంతో వారి వారి తాండాలకు వెళుతారు.

ఈనాటి బంజారా సమాజంలో అబ్బాయి-అమ్మాయిని చూడడం నిశ్చితార్థం వంటి కార్యక్రమాలు ఆధునిక హంగులతో ఒక్క రోజులోనే జరుగుతున్నా ప్రాచీనంగా తరతరాల నుండి వసతున్న పై ఆచారాలు ఈ నాటికి కొనసాగుతున్నాయి. పాటించాలి లేదంటే ధాండ్ అంటే జరిమానా వేస్తారు తాండా పెద్ద ''నాయక్''.

బంజారా అబ్బాయికి వరుసకు అయ్యే అమ్మాయితో నిశ్చితార్థం చేస్తారు దీనినే బంజారా భాషలో ''సగాయి'' అంటారు. లక్ష్మీదేవి స్వరూపమైన అమ్మాయిని కోడలిగా ఇస్తున్నందుకు ఒక రూపాయిని అమ్మాయి తండ్రికి ఇస్తాడు అబ్బాయి. తండ్రి. ఈ రూపాయి బిళ్ళను 'సాకెర్ రప్యా' అంటారు (అంటే నిశ్చితార్థం జరిగేటప్పుడు వరుని తండ్రి వధువు తండ్రికి కన్యాదానానికి బదులుగా ధనంగా ఒక్క రూపాయిని ఇస్తాడు.) ఈ రోజల్లో ఈ రూపాయి ఇస్తూ, బంగారు నగలను పెళ్ళికి ముందే అమ్మాయి తండ్రికి అప్పగిస్తారు. దేశంలోని అనేక రాష్ట్రాలలో ఈ ఆచారం ఇప్పటికీ కొనసాగుతూంది. పెండ్లి అయిన మరుక్షణం వధువు వరునితో అత్తారింటికి వచ్చేటప్పుడు, వరుడు నాలును కోడెదూడలను అమ్మాయి వారికి ఇచ్చే సాంప్రదాయం వుంది. ఎందుకు ఇలా ఇస్తారంటే. పురాణాలలో చెప్పినట్లు కన్యాదానం మహాదానం, పుణ్యదాయకం వరుడు కన్యాదానం అందుకొన్న తర్వాత మామ గారికి 'గోదానం' చేస్తాడు. అందులోను కోడెదూడలను ఎందుకు ఇస్తారంటే బంజారాల వృత్తి ఆనాడు పశువాషణ కాబట్టిటి ఈ సంప్రదాయం పెండ్లికి ముందే ఖరారు అవుతుంది కాబట్టి దానని కరార్ -ధరార్'' (నిశ్చయం) అంటారు. వరరాలలో వుంటున్నాసరి ద్రీడిలను స్వీకరించకపోతే వాటి విలువలను లెక్కించి దానికి సరిపడ ధనాన్ని వరుని తండ్రి వధువు తండ్రికి ఇస్తాడు. ఇటువంటి ఆధ్యాత్మిక

విలువలతో వధువు తండ్రిని గౌరవించే సనాతన ధర్మం బంజారాలలో కనబడుతుంది.

బంజారా వివాహ వ్యవస్థలో పురోహితునిగా బంజారా పూజారి "భగత్" ఉండుట :

ఆనాటి బంజారా వివాహ వ్యవస్థలో వివాహాలు జరపడానికి ప్రత్యేకంగా బ్రాహ్మణ పురోహితుడు వుండడు. ఆయా తాండాలలో భవాని, మరిమామ కేంకాళి అంటే దుర్గామాతను పూజలు జరపడానికి "బాల్యం నుండే సన్యాసం తీసుకొని వుండే అమ్మవారి ఉపాసన చేసి, అమ్మవారి అనుమతితో ఓ పెండ్లి వయస్సు రాగానే ఆ దుర్గామాత ఎవరిని సూచిస్తుందో ఆ వధువును చేసుకుంటాడు. అటువంటి నిష్టాగరిష్టులు, దేవి ఉపాసకులైన బంజారా పూజారులే హిందూ మత పద్ధతిలో, బంజారా మంత్రాలను పఠిస్తూ పెళ్ళి జరిపిస్తారు. ఈనాడు అవుతున్నట్లు నా పరిశోధనలో తేలింది. రాజస్తాన్లో కొన్ని ప్రాంతాలలో ఈ ఆచారం ఇప్పటికీ కొనసాగుతుంది. కొన్ని ప్రాంతాలలో బ్రాహ్మణ పురోహితుడు వుంటాడు. ముందుగా బంజారాల ఆచారం గుజరాత్, మహారాష్ట్ర, ఒరిస్సా ప్రకారం బంజారా పూజారితో పెండ్లి ఆచారాలు ముగించి తర్వాత బ్రాహ్మణ పురోహితునితో పెండ్లి జరిపిస్తున్నారు కాని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మొదట బంజారా భగత్ (బంజారా పురోహితుడు) కొన్ని సాంప్రదాయ కార్యక్రమాలు ముగించిన తర్వాత వివాహ కార్యక్రమాలు హిందూ సాంప్రదాయం ప్రకారం బ్రాహ్మణ పురోహితునికి పెండ్లి జరిపించే బాధ్యతను ఇస్తున్నారు.

బంజారాలలో (వేతేడూ కరేరో) పెళ్ళి కొడుకును చేయు విధం :

"పెండ్లి కుమారునికి చొక్కా ధోవతి ఎర్ర రుమాలు 'ఖొళ్' అనే ఎర్రటి దుప్పటి, కఠారి (కత్తి)ని ధరింపచేస్తారు. భుజానికి కొతళొ (సంచి) అనే దానిని వెండి కడియాలు, చెవులకు వెండి కమ్మలు, 'కొణదరో' అనే మొలత్రాడును నడుంకు, భుజం మీద ఎర్రటి శాలువను కప్పుతారు.

పెండ్లి కొడుకు ఎప్పుడైతే ఆడపిల్ల వారి ఇంటికి రాగానే అమ్మాయి ఆమె ఇల్లు వదలి తమ బంధువుల ఇంటోనే ఉంటుంది. తాను పెళ్లి అయ్యేంత వరకు ముసుగును ధరిస్తుంది. ముసుగు జారిపోకుండా ఉండేందుకు గజ్జెలతో తయారు చేసిన తితరి అనే అదాలతో తయారు చేసిన దానిని కుట్టుకుంటారు.

పెళ్ళి కొడుకు (వేతడు) పెళ్ళికి (సాడి తాండేరో) అంకురార్పణ చేయుట :

పెళ్ళికొడుకును చేయడాన్ని బంజారా భాషలో సాండి తాండేరో చేయడం అంటారు. ఇది పెళ్ళికి అంకుర్పారణ. ఈ కార్యక్రమంలో పెళ్ళికొడుకు వారి ఇంట్లో సాడి తాండేరో అనే కార్యం ఉంటుంది. వదాయి రోజు అనగా మగపెళ్ళి వారి ఇంట్లో విందు భోజనం రోజు దుప్పటి కప్పిస్తారు. ఈ దుప్పటి దాదాపు 12 మూరల వరకు పొడవుగా ఎర్రగా ఉంటుంది. దీనిని పెద్దలందరూ కలిసి మడత పెట్టి పెళ్ళి కొడకుకు పైనుండి క్రింది వరకు తన శరీరాన్ని ఇతరులకు కనబడకుండ కప్పుతారు. తలకు ఎర్రటి తలపసాగాను, ఖడ్గమును చేతిలో, చంకలో సంచిని ఈ దుప్పటిని తాండా నుండి వేతడు (కొతోళ్) వీటిని ధరింపచేస్తారు. ఈ దుప్పటిని తాండా నుండి వేతడు (పెళ్ళికొడుకు) ఆడపెళ్ళి వారింటికి పోయే ముందు కప్పిస్తారు. దీనిని తాండాలోని నాయకులు నలుగురు పట్టుకొని అందులో ఒక రూపాయి బిళ్ళను వేస్తారు. అది దొర్లుతూ పొర్లుతూ చివరగా బొమ్మ బొన్నసు చూసి, అప్పుడు పెళ్ళి కొడుకును అమ్మాయి వారి ఇంటికి పంపిస్తారు.

మగ పెళ్ళివారు అమ్మాయివారి తాండాకు సమిపంలో వచ్చి నిలబడతారు. తాండాలో ప్రవేశించి, ముందుగా తాండా నాయకుని ఇంటికి వెళ్ళి తమ నమస్కారాన్ని "రాం రాం" అని శ్రీరాముని పేరు స్మరిస్తూ పలకరిస్తారు. వారు కూడా "రాం రాం" అని చెప్పి, క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకుని కంచు చెంబులో మంచినీళ్ళు ఇస్తారు. తర్వాత ఈతాకులతో అల్లిన చాపపై కూర్చోబెడతారు.

తర్వాత తాండా నాయకుడు ఆడపెళ్ళి వారికి కబురు పంపుతాడు. తాండా నాయకుని సమక్షంలో షెళ్ళి కొడుకుని పెళ్ళికుమార్తె వారి ఇంటికి తీసుకుపోతారు.

వరుడు ప్రతిరోజు పెళ్ళి ప్రారంభం నుండి పెళ్ళి చివరి వరకు తమ ఇంటికి చేరే వరకు దుప్పటిని ముసుగుగా (ఘూంటో) కప్పుకొని నిండుగా ఉండాలి. కొత్త పెళ్ళి కొడుకు(వేతడు) ప్రతిరోజు తాండా నాయకునికి ఉద యాన్నే ఆకు వక్కలతో హుక్కాను తన రెండు చేతులతో నమస్కరించి అందించాలి. అప్పుడు నాయక్ సంతృప్తి చెందకపోతే తోడి పెళ్ళికొడుకు (లేరియా)తో పెళ్ళి కొడుకుకు మంచి సంప్రదాయాన్ని పాటించమని చెప్పి పంపుతారు.

బంజారాలలో వరుడు పెళ్ళికి ముందు ఇచ్చే విందు "పదాయి" :

"పదాయి" అనగా వడుగు అని అర్థం, ఈ కార్యం బంజారాలలో పెళ్ళి కుమారుని ఇంట్లో చేసే కార్యమిది. ఇది పెళ్ళికి శుభముహూర్తంగా ఆదివారం లేదా వేరే రోజును నిర్ణయిస్తారు. ఇది అబ్బాయి వారి ఇంట్లో జరిగే కార్యం. ఈ కార్యక్రమం తాండా నాయకుని ఆధ్వర్యంలో జరుగుతుంది. బంధుమిత్రుల సమక్షంలో తాండా వారి సమక్షంలో గోసాయి బాబా సాక్షిగా ఈ కార్యాన్ని నిర్వ హిస్తారు. వెళ్ళి కుమారునికి స్నానం చేయించి రాత్రి వేళలో ఒక సూదిని తీసుకొని మోదుగు కాడాకు గుచ్చి దీపం మీద బాగా ఎర్రగా కాల్చి పెళ్ళికుమారునికి ఎడమ భుజంపై మూడు (3) వాతలు పెడతారు. తర్వాత పెళ్ళి కుమారుని తమ్ముడికి కూడా ఈ వాత పెడుతారు. ఒకవేళ పెళ్ళి కుమారుడికి తమ్ముళ్ళు లేకుంటే ఒక ఓక్రా పెడతారు. ఓక్రా అనగా గోనై సంచి అందులో ధాన్యాన్ని ఉంచి ఆ ధాన్యపు బస్తాకు వాత పెడతారు. వదాయి కార్యం ధేమా గురువు అయిన బంజారాల ధనవంతుని తలచుకొని, అతను నియమించిన గోసాయి బాబాను (మంత్రి) స్మరించుకొని ఈ వాత పెడతారు. ఈ వాత పెట్టేటప్పుడు గోసాయి బాబా మంత్రాన్ని చదువుతారు.

ఈ 'వాత పెట్టే ముందు తాండాలోని ప్రజలందరి సమక్షంలో గోసాయిదాబా మంత్రం క్రింది విధంగా ఏడుసార్లు చదివి వాత కార్యం నిర్వహిస్తారు. తాండా భగత్ (బంజారా పూజారి) చెబుతాడు.

తాండా నాయకుడు పెండ్లి కూమారునికి అతని తమ్మునికి వాతల్లు పెడతారు. ఒకవేళ పెండ్లి కుమారుడికి తమ్ముడు లేకపోతే గోనె సంచికి వాతలు పెడతారు. పెండ్లి కుమారుని తమ్ముడికి ఒకసారి వాత పెడితే తిరిగి అతని పెళ్ళికి వాత పెట్టరు. ఇలా పెట్టుటకు గల కారణం మోస గించి వేరే వివాహం చేసుకోకూడదని ఈ ఆచారం ద్వారా తెలుస్తుంది.

ఈ గోసాయిబాబా ఎవరు అనగా పూర్వం పమార్, రాథోడ్, చౌహాన్ పడ్యియా అనే బంజారాల నాలుగు గోత్రాల వారందరికి ధన ధాన్యాన్ని యిచ్చే పెద్ద భూస్వామి, పమార్, రాథోడ్, చౌహాన్ రాజుల దగ్గర నుండి కప్పం వసూలు చేయటానికి గోసాయిబాబాను దేమా గురువు నియమించాడు. ఈ గోసాయిబాబా బంజారాల నుండి కప్పం వసూలు చేసే బాబాగా నియమింప పడ్డాడు. బంజారాలకు అన్ని విధాల చేదోడు వాదోడుగా సహాయ సహకారాలను అందించి, బంజారాల వ్యాపారానికి పరోక్షంగా ప్రోత్సహించిన గురువుగా భావిస్తారు. అతని నామ ధేయాన్నే పెళ్ళికి ముందు అతను రక్షిస్తాడని నమ్మి వారి పేరు మీదుగా వాతలు పెడతారు. దీనినే "గోసాయి బాబార్ దాగేర్ గీద్" అని అంటారు. 'బంజారాలు ఈ మంత్రం ఏడుపార్లు చదివి చివరిగా చురుకు అంటిస్తారు పెళ్ళికుమారునికి ఎర్రటి బట్టతో తయారు చేసిన 12 మూరలు కల్గిన దుప్పటి శరీర భాగం మొత్తం కనబడ కుండా దుప్పటిని కప్పుతారు. ధోతి, రుమాలు, చొక్కా చంకకు కొతళో, ఖడ్గం, కటారి డాండీయా, నడుముకు (కొన్ దరో) అనేపండి మొలత్రాడు, చేతులకు వెండి కడియాలు, చెవులకు మర్కి అనే వెండి

పోగులను, మెడలో వెండితో తయారు చేసిన చంద ర్మార్ అనే గొలుసును కంటెను ధరింపచేస్తారు. ఆ తర్వాత

పెళ్ళి కమారుని దుప్పటి వెనుక భాగాన స్వస్తిక్ అనే శుభముహూర్తపు బొమ్మను వేస్తారు. ఈ గుర్తును గంధము, పసుపు, కుంకుమ ఆముదపు నూనెలో నాలింటిని కలిపి చాలా మందంగా ఈ గుర్తును పెళ్ళి పెద్దలు దుప్పటి మధ్య భాగంలో వేస్తారు. దీనికి అర్ధం ఏమంటే సాధారణంగా బంజారాల వివాహాలలో పురోహితుడు ఉండడు. కుల పెద్దగాని భగత్ అనే గుర్తును శుభ ముహూర్తంగా భావించిన విధంగానే బంజారాలు కూడా 'చోకోపూరేరో నోక్తా' అనగా శుభ ముహూర్తంగా భావిస్తారు. ఈ గుర్తును వేసినప్పటి నుండి పెళ్ళి కార్యక్రమాలు అన్ని శుభంగా జరుగుతాయని వీరి నమ్మకం. పెళ్ళి కుమారునికి అన్ని విధాల రంగుల బట్టలతో అలంకరిస్తారు. దీనినే 'సాడి తాండేరో' కార్యంఅని వ్యవహరిస్తారు.

బంజారా పెళ్ళి కొడుకుక తొడి పళ్ళి కొడుకు (లేరియా) వుండడం సంస్కృతికి దర్పణమైన విధం :

పెళ్ళి కుమారుడు అమ్మాయి వారింటికి వెళ్ళేటపుడు అతనితో పాటు ఒక సమర్థుడైన దూతను పంపుతారు. ఇతనే సద్గుణవంతుడై వెళ్తాడు. పెళ్లి అయ్యేంత వరకు ఇతనిని తిరిగి రానివ్వరు. ఆడ పెళ్లి వారి తాండాలో ఎన్నో జటిల ప్రశ్నలకు, తమాషాలకు జవాబు ఇవ్వాలి. ఇతనికి అన్ని రకాల యోగత్య పరీక్షలు అవమానాలు ఉంటాయి. వాటన్నింటిని సమర్థవంతంగా పూర్తి చేయాలి. పెళ్ళి ప్రారంభం నుండి చివరి వరకు పెళ్ళి కుమారునికి తోడుగా ఉండాలి''. ఈ తోడి పెళ్ళి కొడుకును బంజారా భాషలో 'లేరియా' అంటారు.

బంజారాల వివాహాలలో ముఖ్యంగా ఐదు కార్యక్రమాలు జరుగుతాయి. అమ్మాయివారి ఇంట్లో జరిగేవి.

1. ఘోటారో నోక్తా అనగా బెల్లం పానకం తయారు చేసే కార్యక్రమం
2. వాయారొ నోక్తా అనగా - పెళ్లి కార్యక్రమం
3. చూడేరొ నోక్తా అనగా - ముత్తెదు కార్యక్రమం
4. వాయారొ నోక్తా - అనగా
5. గొటేరొ నోక్తా అనగా - విందు భోజనము
6. నవలేరిన్ ఒళాయేరో నోక్తా అనగా - అప్పగింతలు

పై కార్యక్రమాలన్ని పెళ్లి కూతురి ఇంట్లో జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు అయ్యే ఖర్చులు మొత్తం మగ పెళ్లి వారు భరిస్తారు. ఈ కార్యక్రమాలు దాదాపు రెండు నెలల వరకు పూర్తి అవుతాయి లేదా 15 రోజులలో కూడా పూరి చేసుకుంటారు. ఎవరి ఆర్థిక స్తోమతను బట్టి వారు పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. అన్ని కార్యక్రమాలు పూర్తి అయ్యేంత వరకు పెళ్ళి కొడుకు అమ్మాయి వారి ఇంట్లోనే ఉంటాడు. ఇతనికి ప్రతిరోజు రెండు పూటల స్నానం, మూడు పూటల భోజనం సంతృప్తిగా వడ్డిస్తారు. ప్రతి రోజు పాలు, పెరుగు, పప్పు, నెయ్యి, ఆకుకూరలు, మాంసము, మత్తు పానీయాలు మొదలగు పౌష్టిక ఆహారాన్ని అందిస్తారు. ఈ కొబ్బరిని నెయ్యిలో నానాపెట్టి అందిస్తారు. బంజారాలు 'రాం, రాం! అనే రెండు సార్లు శ్రీరాముణ్ణి తలచుకొని నమస్కారాలు చేస్తారు''.

బంజారా పెళ్ళిలో పానకం (గోటా గోళేరో నోక్తా) చేయు విధం :

సనాతన హిందూ ఆచారంలో, హిందూ పండుగలైన ఉగాది, శ్రీరామనవమి పర్వదినాలలో జిలకర, బెల్లం, యాలకులు వంటి సుగంధ ద్రవ్యాలతో పానకం చేసి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, పురుషోత్తముడైన ఆ శ్రీరామునికి నివేదిస్తారు. బంజారాల వివాహాలలో మొదట శ్రీరాముణ్ణి అర్చించి ఈ పానకాన్ని నివేదించిన తర్వాత పెళ్ళి కార్యక్రమాలు చేస్తారు. ''ఈ కార్యక్రమంలో పెండ్లి కొడుకు పెళ్ళి కూతురు ఇదరు వేరు వేరుగా, తమ తరపున ఇంటింటికి తిరిగి, ఈ రోజు మా పెళ్ళిలో గోళేరో నోక్తా అంటే! పానక కార్యక్రమం ఉన్నది. కావునా అందరూ తప్పకుండా రండి అని పిలుస్తారు. తాండాలోని పెద్ద మనుషులు యువతీ యువకులు, తాండా నాయకులు, చిన్న పెద్దలందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆడవారందరూ కలిసి పెళ్ళి కూతురికి ఏడుపుపాట (ఢావళో) నేర్పిస్తారు. ముత్తెదులందరు కలిసి

ఆట పాటలతో పాటు నృత్యం చేస్తారు. తర్వాత అప్పుడే తెచ్చిన కొత్త కుండలలో తాండా వారందరికి సరిపోయే విధంగా బెల్లం పానకాన్ని తయారు చేసి ఇస్తారు రామాయణం వంటి ఇతిహాసాలలో ఈ పానకం తయారి ప్రాముఖ్యత గురించి చెబుతుంది. పానకం తయారీలో కొత్త బాన అంటే పెద్ద కుండలో రాత్రి వేళ బెల్లం, నీరు, మిరియాలు కొద్దిగా దంచి వేస్తారు. రాత్రంతా నానడం వల్ల మిశ్రమం తయారు అవుతుంది. ఎంతో శక్తిని ఈ పానకం ఇస్తుంది. రుచిగా వుంటుంది. ఈ పానకం సేవింపడం వల్ల ఆరోగ్యంగా వుంటాము. బంజారాలలో పెండ్లి నాడు ఏడురోజులు జరిగేది. వేడు మూడు రోజుల పాటు జరుగుతుంది. కాబట్టి పెండ్లికి వచ్చిన వారికి నూతనతేజం శక్తికి ఇది తోడ్పడుతుంది. ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగల్లో దేవ దేవులు సైతం ఈ ఆచారం పాటించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

అ బంజారాల నాటి వివాహ పద్ధతి ప్రాచీన సంస్కృతిక దర్పణం-"సగాయి" నిశ్చితార్థం :

అంతకు మునుపే మనం బంజారాల వివాహ, ఆచార పద్ధతుల గురించి తెలుసుకొన్నాము. అబ్బాయికి వరుస అయ్యే అమ్మాయిని చూసి, ఇరువురి తల్లిదండ్రులు, అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చినపుడు ప్రతి మతంలోను, ప్రతి జాతిలోను ''నిశ్చితార్థం'' చేసుకుంటారు. అలాగే బంజారా రాజపుత్రులలో ఇదే ఆచారం వుంది. అబ్బాయి - అమ్మాయిలు ఇరువురు ఇష్టపడినపుడు పెద్దలు వీరికి నిశ్చితార్థం చేస్తారు. దీనిని బంజారా భాషలో 'సగాయి' అంటారు.ఈ ప్రక్రియలో భాగంగా మొదట అబ్బాయికి వరుస అయ్యే అమ్మాయి కోసం అన్వేషణ చేస్తారు. ఏ 'తాండా'లో అయితే తనకు కోడలుగా అమ్మాయి సరిపోతుందో ఆ తాండా పెద్ద 'నాయక్'కు కబురు పంపుతాడు అబ్బాయి తండ్రి. ఆ తాండా 'నాయక్'. ఆ తాండాలో వుండే అమ్మాయి తండ్రికి కబురు పెడతాడు. అమ్మాయి తండ్రితో కలసి నాయక్ అబ్బాయి యొక్క గుణగణాలు తెలుసుకుంటారు. చివరకు ఇరు తాండాల 'నాయక్'లు అమ్మాయి - అబ్బాయి తల్లిదండ్రులు అంగీకారానికి వచ్చినపుడు, అమ్మాయి వారి తాండాకు వెళ్ళి, 'సగాయి' చేస్తారు. నాటి బంజారాల నిశ్చితార్థంలో బెల్లం, తాంబూలం ముఖ్యమైనవి. తర్వాత మత్తుపానీయం మరియామ గుడి దగ్గర, లేదా కేంకాళి అంటే పెద్దమ్మతల్లి గుడి ముందర లేదా ఆ తాండాలో ఎక్కడైన గ్రామ పెద్దలను పిలిచి అందరికి సరిపడ బెల్లం, తాంబూలం తెప్పిస్తారు. ఈ బెల్లాన్ని భాగాలుగా చేస్తారు. అందులో మొదటి భాగం గ్రామ దేవతకు, రెండవభాగం, సద్గురు సేవాలాల్ మహారాజ్‌కు తీసిన తర్వాత, బెల్లాన్ని అబ్బాయి తండ్రికి వారి తాండా నాయక్‌కు ఇస్తారు. తర్వాత అబ్బాయి తండ్రికి తర్వాత మిగిలిన వారందరికి నోటి తీపి చేయడానికి బెల్లం, తాంబూలం ఇస్తారు. తర్వాత ఇరువురి 'రంగ్' అంటే రంగులు చల్లుకొని ఆనందపడి, 'రామ్ రామ్' అని ఆలింగనం చేసుకుంటారు. తర్వాత ఎవరి స్తోమతను బట్టి విందు చేసుకుంటారు.లక్ష్మీదేవి స్వరూపమైన మీ అమ్మాయిని మా ఇంటికి ఇస్తున్నారు కాబట్టి రూపాయి బిళ్ళ ఇచ్చి ఇదిగో లక్ష్మీదేవి అని ఇస్తారు. దీనిని 'సాకెరోరప్యా' అంటారు. దీనితో పెళ్ళి ఖరారు అయిపోతుంది.

బంజారా వివాహ వ్యవస్థలో 'వదాయి', 'హవేలి' చేయుట, గోవుల కసువు దిబ్బకు మొక్కుట ఆదిమ సంస్కృతి :

బంజారాల వివాహవ్యవస్థలో మొదటి ఘట్టం సగాయి అంటే నిశ్చితార్థం తర్వాత పెండ్లి, పెండ్లిలో మొదటి రోజు బంజారాలలో 'వదాయి' చేస్తారు. అంటే పోట్టేలు కోసి అందులో ఏడు మూలుగలు తీసి ఉప్పు వేయకుండా పసుపు నీటిలో ఉడికించి వరునికి ఇస్తారు. సూదిని కాల్చి కుడి భుజంపై మూడు వాతలు పెడతారు. ప్రతి వాతకు ఒక నియమం వుంటుంది. జీవిత పరమార్థం గురించి చెబుతారు. జీవితం యొక్క విలువలు మరిచిపోకుండా వుండడానికి అలా చేసారేమో మిగిలిన తాండ్రా వారందరికీ

మాంసాహారం విందు ఇసలారు. ఇది రాత్రివేళలో జరుగుతుంది. ఇప్పటి బంజారా వివాహాలలో తప్పకుండా సగాయి, వదాయి వుంది. జగాల కులాలలో వదాయి జరిగేటపుడు కేవలం బెల్లం పొంగలి 'లాప్సీ' చేసి శాఖాహార భోజనం పెడతారు. కాని ఎక్కువ బంజారా కులాలలో మాంసావార ఆచారం వుంది. నాటి కాలంలో, అమ్మాయి పెండ్లి కూతురు అయ్యాక తాండాలోని ఇంటింటికి పెళ్ళి తనను ఆశీర్వదించమని కోరేది. తాండాలో వుండే దేవుని ఎద్దుపై నవవధువు బల్యా, ఘోగురి, చెవేలాగాంతో, చోట్లా, భూరియా అంటే పెద్ద ముక్కు పుడక వేసి దేవుని ఎద్దు 'సాండ్'పై నిలబడి తను పుట్టి పెరిగిన తాండాకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులు, సోదరులను ఉద్దేశించి ప్రమాణం చేసేది కూడా 'భగత్' అనే బంజారా పూజారులతో వివాహం జరిపించుట లేదు.

హిందూ వివాహ వ్యవస్థలో అరుంధతీ నక్షత్ర దర్శనం అపురూపమైన ఘట్టం. దంజారా వివాహ వ్యవస్థలో ఈ అరుంధతీ నక్షత్ర దర్శనంతో పాటు, బంజారాల ప్రత్యేక ఆచారం వుంది. అదే "గోవుల పేడదిబ్బ" (కసువుల దిబ్బ) ను మొక్కుట, వధువు ఇంట్లో పెండ్లి అయ్యాక బంజారా 'భగత్' అంటే పూజారి వధు, వరులను 'అవుల దిబ్బ' అంటే కసువు దిబ్బకు మ్రొక్కిస్తారు. దీని వెనుక పరమార్థం దాగి వుంది. బంజారాల ప్రధాన వృత్తి పశుపోషణ.

బంజారాలలో అంత్యక్రియలు జరిపే విధం - హైందవ సంస్కృతికి ప్రతీక :

మహాభారతంలోని 'భగవద్గీతలోని రెండవ అధ్యాయం సాంఖ్యయోగంలో అర్జునునితో పరంధాముడైన ఆ శ్రీకృష్ణభగవానుడు జనన మరణాల గురించి చక్కగా వివరించాడు. మరణం అనేది శరీరానికే వుంది. ఆత్మకు లేదు. మానవ దేహం నశించినప్పుడు ఆత్మ శరీరాన్ని వదిలి వేరే శరీరాన్ని అన్వేషిస్తుంది. ఎవరు చేసుకున్న పాప, పుణ్యాలను బట్టి పునర్జన్మ లభిస్తుంది అని చెప్పాడు. అంతేకాదు ఈ సృష్టిలో పుట్టిన ప్రతిజీవి మరణించక తప్పదు మరణించిన ప్రతిజీవి పుట్టుక తప్పదు. జీవించి యున్నంతకాలం ఎవరైతే భగవన్నామస్మరణ చేస్తూ, పరోపకారం, సమాజసేవకై పాటుపడుతూ దయ, కరుణ వంటి సాత్విక లక్షణాలు కలిగి వుంటారో వారికి తప్పకుండా ఉన్నత జన్మ అయిన మానవజన్మ ప్రాప్తిస్తుందని దేవదేవుడు, పరంధాముడైన శ్రీ కృష్ణభగవానుడు అర్జునునితో చెప్పాడు.

బంజారా రాజపుత్రులైన నాయకలు మరణించినపుడు హిందూ ఆచారం ప్రకారమే అంతిమ క్రియలను పెద్ద కుమారుని చేత జరిపించినా హిందూ ఆచార వ్యవహారాలు, సంస్కృతికి బంజారా సంస్కృతికి తేడా చాలా కనపడుతుంది. వ్యక్తి మరణించిన తర్వాత చాలా వరకు బంజారాలలో వారి వారి పాలాలలో పూడ్చి పెడతారు. శవాన్ని పూడ్చినరోజు సాయంత్రం వేళ ఊరికి బయట దాయాదులు బంధుమిత్రులు కలసి మరణించిన వ్యక్తి యొక్క ఆత్మ శాంతం కలగాలి అని మేకపోతు లేదా పొట్టేలును బలి ఇచ్చి, 'సాళై' అంటే రక్తం, పొట్ట, ప్రేగులు మూలుగ ఎముక కలిసి చేసిన కూర మరియు జొన్న రొట్టెలు మిశ్రమాన్ని నివేదిస్తారు. అంతేకాక బెల్లం పొంగళిని పెడతారు. దీనితో పాటు ధూమ, సురాపానం, సిగరెట్, మందును పెడతారు. తర్వాత చితికి కొరివి, పెట్టిన కుమారునికి, ఆ తర్వాత కుటుంబ సభ్యులకు అందరికి మాంసాహార భోజనం పెడతారు. పెద్దవారైన స్త్రీలు అయినా సరే పై విధంగా చేయాల్సిందే. ఊరికి బయట ఆ సాంప్రదాయం చేయడం అయిపోయాక, చినిపోయిన వారి ఇంటిలో చనిపోయిన వ్యక్తి చిత్రపటాన్ని పెట్టి, దీపం వెలిగించి మూడు రోజులు దీపం ఆరిపోకుండా జాగ్రత్తపడతారు. ఈ మూడు రోజులు రాత్రంతా భజన పాటలు, గరుడపురాణ పఠనం ద్వారా జాగరణ చేస్తారు. అలా చేయడంలో హిందూ, సనాతన సంస్కృతి దాగివుంది.

భగవద్గీతలోని 8వ అధ్యాయమైన అక్షర బ్రహ్మ యోగంలో మోక్షం, పునర్జన్మ గురించి అర్జునునికి శ్రీకృష్ణ భగవానుడు వివరించాడు. మానవుడు మరణ సమయం

నందు అయిన నన్ను స్మరించుకున్నవాడు నన్ను అంటే దైవత్వాన్ని పొందుతాడు. అని 5వ శ్లోకములో చెప్పాడు. అలాగే వ్యక్తి జీవిత చరమాంకంలో దేని గురించి ఆలోచించి మక్కువ్, ఆశ పెంచుకుంటాడో మరు జన్మలో వాటిని అనుభవిస్తాడని 6వ శ్లోకంలో వివరించాడు. మనిషి జీవిత చరమాంకములో మరణానంతరం మూడు రోజుల పాటు అ భగవంతుని కొరకు మనం ఆరాధించినా మరణించిన వ్యక్తి ఆత్మ భగవంతుడైన ఆ పరమాత్మలో ఐక్యమై మోక్షం లభిస్తుందని బంజరాలు ఈ వైదిక ధర్మాన్ని ఆచరిస్తారు. ఇది హైందవ సంస్కృతికి చిహ్నం.

ఈ కార్యక్రమం అయిపోయిన తర్వాత ఒక ఇత్తడి పళ్ళెం నిండా అన్నం పెట్టి దానిపై మూత పెట్టి రాత్రంతా అలాగే వుంచుతారు. తెల్లవారు జామున మూత తీసి ఆ అన్నాన్ని పరిశీలిస్తారు. దానిపై ఏ జంతువు గుర్తులు ఏర్పడితే ఆ జంతువు శరీరంలో ఆ వ్యక్తి అత్మ ప్రవేశించినట్లుగా బంజారాలు భావిస్తారు.

ఏ జంతువుల శరీరంలో ఆ ఆత్మ ప్రవేశించుతున్నట్లు ఆనవాలు కనబడకపోతే అప్పుడు మరణించిన వ్యక్తి యొక్క ఆత్మ పరమాత్మలో ఐక్యం అయిందని అర్థం చేసుకోవాలి. మరి ఏ విధంగా ఇది తెలుసుకోవాలి. ముందే చేస్తారు. మూడవ రోజు రాత్రి అన్నం వండుతారు. దీనిని కంచు పెళ్ళెంలో పెట్టి దానిని గట్టి మూతతో కప్పుతారు. ఆ రోజు రాత్రి అంతా, మరణించిన ఆ బంజారా వ్యక్తి పునర్జన్మ గురించి తెలియజేయమని ఆ భవానికి భజనలు చేసారు. మరుసటి రోజు సూర్యోదయం కాక ముందే, రాత్రి కంచుపళ్ళెం నిండా అన్నం వేసి దానిపై కప్పిన మూతను తొలగించి చూస్తారు. ఆ అన్నం పై ఏర్పడిన జంతువుల గుర్తులను బట్టి మరణించిన ఆ బంజారా వ్యక్తికి ఏ జంతువు రూపంలో పునరను సంటుందో చూస్తారు. ఒకవేళ అన్నంపై ఎటువంటి జంతువులు, పక్షులు, సర్పాల గుర్తులు లేకపోతే అతనికి పునర్జన్మ వుండదని భావిస్తారు. అతని ఆత్మ పరమాత్మలో ఐక్యమైందని నిర్ధారిస్తారు. కేరళలో ప్రసిద్ధ ఆలయాలలో ఈ అంశాన్ని నేడు చెప్పుతారు.అంతేకాక మనం ముందు అనుకున్నట్లు, శవాన్ని పూడ్చిన తర్వాత, అందరూ మట్టి వేసి వచ్చాక రేగుచెట్టు అంటే బోరేరోజాడున్ ప్రదక్షిణగా వచ్చి దాని ఆకును గిల్లి వస్తారు. దీని వెనుక ఒక పురాతన మూఢాచారం దాగి ఉన్నట్లు కర్నూలు జిల్లా కాలేనాయక్ తాండాకు చెందిన గాంగూ నాయక్ అనే వృద్ధుడు వివరించాడు.

ఆధార గ్రంథం :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం-ఆర్.వియస్ సుందరం, 1983
2. బంజార చరిత్ర-సంస్కృతి, ప్రగతి-డి.చీలియానాయక్,1998
3. భారతదేశం-గిరిజన సముదాయాలు-మజుందర్, 1986
4. షుగాలి సంస్కృతి, భాషా సాహిత్యాలు, సిద్ధాంత గ్రంథం- డా॥ యం. గోనానాయక్, 2002 కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరబాద్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద గేయాలు – హాస్యం

– డా॥. కొఱిదల శోభ, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల, తిరుపతి.

జనపదానికి సంబంధించింది జానపదం. జనపద మంటే పల్లెటూరు. జనపదంలో నివసించే వారు జాన పదులు. వారు పాడుకునే పాటలు జానపదాలు అని భావించేవాళ్ళం ఒకప్పుడు. కానీ ఇటీవలి కాలంలో - మారిన కాలాన్ని బట్టి, దాన్ని అనుసరించి వచ్చిన సామాజిక మార్పులను బట్టి ఏదైనా ఒక విషయంలో భావ సారూప్యం కలిగిన జన సముదాయానికి; ఒక భాషకో, వృత్తికో, జాతికో, ప్రాంతానికో సంబంధించిన జన సమూహానికి చెందిన వారిని జానపదులుగా చెబు తున్నారు. ఆధునిక దృక్పథంతో చూస్తే గ్రామీణులు, గిరిజనులు, నగరవాసులు అందరూ జానపదులుగానే గుర్తించబడతారు. జానపదులకు చెందిన విజ్ఞానమే జానపద విజ్ఞానం. జానపదుల కళలు, వారి ఆచారాలు, సంప్రదాయాలు, సాహిత్యం, సంస్కృతి వంటివి జానపద విజ్ఞానానికి చెందినవి. జానపద విజ్ఞానంలో ఒక భాగమే జానపద సాహిత్యం.

సాధారణంగా నాగరికులలోనో, పండితలోకంలోనో పుట్టి ప్రచారం పొందేది శిష్ట సాహిత్యమైతే, జన సామాన్యంలో పుట్టి ప్రచారం పొంది అందరి నాలుకల మీద నాట్యమాడేది జానపద సాహిత్యం. ప్రపంచంలోని ఏ భాషా సాహిత్యానికైనా ఆ భాషలోని జానపద సాహిత్యమే ఆధారమని పరిశోధకుల భావన. అందుకే జానపద సాహిత్యం అనాది. అదే ఏ సాహిత్యానికైనా పునాది అంటారు. మన తెలుగు సాహిత్యానికి కూడా జానపద సాహిత్యమే మూలం. శిష్ట సాహిత్యం కంటే ఎక్కువగా సామాజిక చరిత్రను, చారిత్రక విశేషాలను, భాషా పరిణామాలను తనలో ఇముడ్చుకున్నది, ఆంధ్రుల నిజమైన సంస్కృతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడేది, జన జీవనంలో ప్రధాన భాగమై ప్రజల లోక జ్ఞానానికి, కాలక్షేపానికి, మానసిక వికాసానికి, ఆనందానికి తోడ్పడేది జానపద సాహిత్యం.

జానపద సాహిత్యంలో ఒక ప్రధాన అంశం జానపద గేయాలు. జానపదుల అనుభవం, హృదయ స్పందనలకు ప్రతిబింబం, సరళత, సహజత్వాలకు నిలయం, సంగీత, సాహిత్యాలతో కూడిన సామాన్యుని భావగీతం జానపద గేయం. ఆర్వీయస్ సుందరం గారి మాటల్లో - గేయ రూపంలో భావప్రధానంగా వెలవడే ఆశు రచన జానపద గేయం. జానపద గేయాలు అజ్ఞాత కర్తృకాలు, మౌఖికాలు. ఇవి రెండు రకాలుగా కనిపిస్తాయి. ఒకటి - కథ లేకుండా ఎక్కువగా ఆత్మపరత్వంతో కూడుకున్న గేయాలు. రెండు - కథ ప్రధానంగా భావగీతాత్మక లక్షణంతో అలరారే కథాగేయాలు. గేయరూపంలో వుండే కథ కథాగేయమవు తుంది. అనేక తరాలనుండి పలు ప్రాంతాలలో మౌఖికంగా ప్రచారంలో వుండే కథ జానపద కథాగేయ మవుతుంది. జానపద గేయాలలో - జానపదుల ఆహార పానీయాలు, కట్టు, బొట్టు, కష్టం, నష్టం, చావు, పుట్టుక, పెళ్ళి, వినోదం, భక్తి, వలపు వంటి మానవ జీవితంలోని అన్ని విషయాలు, రామాయణ, భారత, భాగవత కథలకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. జానపద గేయాలను - పారమార్థి కాలు, పౌరాణికాలు, సామాజికాలు, చారిత్రకాలు, మత సంబంధాలు, భక్తి, శృంగార, అద్భుత, హాస్యాది రస ప్రధానాలు అని కొన్ని రకాలుగా విభజించుకోవచ్చు. వీటిలో వేడుక పాటలు, బాంధవ్య గీతాలు, పిల్లల పాటలు, తుమ్మెద పాటలు, భ్రమర గీతాలు, చెక్కభజన పాటలు, వీధిగాయకుల పాటలు, జాజఱులు, ఏలలు, నాట్లు, కలుపు, కోతల పాటలు లాంటివి చెప్పుకోదగినవి.

తెలుగులో బాగా ప్రాచుర్యంలో వున్న కథాగేయాలలో - సీతా కల్యాణం, సీతమ్మవారి అలక, లక్ష్మణదేవర నవ్వు,

ఊర్మిళాదేవి నిద్ర, గంగా గౌరీ సంవాదం, పల్నాటి వీర కథ, బొబ్బిలి యుద్ధం, కావమ్మ కథ, ముగ్గురు మరాఠీల కథ, సర్వాయి పాపడు కథ ముఖ్యమైనవి. ఈ జానపద గేయాల్లోని హాస్యాన్ని పరిశీలించడమే ప్రస్తుత అంశం.

నవరసాలలో హాస్యం ఒకటి. వికృత ఆకారం, వేషం, వాక్కు, చేష్టలవల్ల హాస్యం కలుగుతుంది. హాస్యం బ్రహ్మానంద సహోదరమని మన పూర్వీకులు భావించారు. అంటే మనవారికి హాస్యం పట్ల వున్న అభిమానం తెలుస్తుంది. పాశ్చాత్యులతో పోల్చి చూస్తే తొందరగా హాస్యాన్ని పండించే అధిక్షేప కావ్యాలు, ప్రహసనాలు, హాస్యపాత్రలు, వ్యంగ్య కృతులు తెలుగులో కాస్త తక్కువనే చెప్పాలి. కాని పాశ్చాత్య సాహిత్య ప్రభావితులైన కొందరు ఆధునికులు పాశ్చాత్యుల మార్గంలో నడిచి తెలుగులో చక్కటి హాస్యాన్ని పోషించారు. మొక్కపాటివారి బారిష్టరు పార్వతీశం, గురజాడ వారి గిరీశం వంటి పాత్రల్లో పాశ్చాత్య హాస్య పాత్రల్లో కనిపించే హాస్యం, చమత్కారం కొంత వరకు కనిపిస్తుంది. నాగరికులకు వున్నట్లే జానపదులకు కూడా సుఖదుఃఖాలు, నవ్వు ఏడుపులు వుంటాయి. తాత్కాలికంగానైనా దుఃఖాన్ని తొలగించి, నవ్వును తెప్పించేది, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించేది హాస్యం. ఆ హాస్యాన్ని జానపదులు ఎప్పుడు, ఏవిధంగా ఆశ్రయించారో, వారి సాహిత్యంలో ముఖ్యంగా జానపద గేయాలలో ఎలా చోటుచేసుకుందో పరిశీలిద్దాం.

కేవలం హాస్యపూరితాలైన గేయాలు తెలుగులో కొద్దిగానే లభిస్తున్నాయి. వినోదగేయాల్లో హాస్యం ప్రధానంగా కనిపిస్తుంది. జానపద గేయాలలో వెూటు హాస్యంతో పాటు మృదువైన, సున్నిత హాస్యం కూడా చిత్రించబడింది. అల్పమైనదానిని గొప్పగానో, గొప్పదానిని అల్పంగానో వర్ణించడం కూడా హాస్యాన్ని పుట్టిస్తుంది. నస్యపుకాయను పోగొట్టుకున్నవాడు దానికోసం -

"పోతీవిగదవే నా ముద్దుకాయ - పోతివి గదవే నస్యపుకాయ ॥పోతీ॥
కట్టా పోవకు పోడిం పొట్టానిండాబోసి - పిట్టావలె నిన్ను పట్టాక తిరుగుదు ॥పోతీ॥
తులము వెండిపెట్టి గజ్జెలు చేయిస్తి - అప్పు దీరక ముందె చెప్పాక పోతీవి ॥పోతీ॥
కట్టనూరికాడ కర్నాల బాయిల - తానమాడబోతె దానమైపోతివి ॥పోతీ॥

అంటూ ఏడవ సాగాడు. నస్యపుకాయ సాధారణ వస్తువు. అది పోయినందుకు దానిని వర్ణిస్తూ ఏడవడం నవ్వు పుట్టిస్తుంది.

వాక్చమత్కారంతో హాస్యాన్ని పుట్టించే జానపద గేయాలూ తెలుగులో వున్నాయి. 'స్త్రీ చమత్కారమ'నే శీర్షికతో వున్న గేయంలో -

స్త్రీ - **ఒకరీకి చేయినిచ్చి - ఒకరీకి కాలునిచ్చి ఒకరీకి నడుమునిచ్చి - కూకున్ననోయి రాజా - కూకున్ననోయి రాజా**
పురు - **ఎవరీకి చేయినిచ్చి - ఎవరీకి కాలునిచ్చి ఎవరీకి నడుమునిచ్చి - కూకున్నవోయి జాణ - కూకున్నవోయి జాణ**
స్త్రీ - **గాజుల్కు చేయినిచ్చి - అందెల్కి కాలునిచ్చి వాడ్డాణానికి నడుమునిచ్చి - కూకున్ననోయి రాజా - కూకున్ననోయి రాజా**

ఈ పాటలో స్త్రీ చెప్పిన మాటలు వినగానే సందేహం కలుగుతుంది. ఇది శృంగారానికి సంబంధించింది అని పిస్తుంది. కానీ ఆ స్త్రీ సమాధానం చెప్పిన తర్వాత అనుమానం తొలగిపోతుంది. పైగా ఆశించిన సమాధానం రాక, చప్పటి సమాధానం వచ్చి హాస్యాన్ని కలిగిస్తుంది.

కొన్ని గేయాలు ప్రాసలతో వినోదాన్ని కలిగిస్తాయి. వాటిలో -

"పిట్టమ్మ పిట్ట - ఏమి పిట్ట
చిలక పిట్ట - ఏమి చిలక
పచ్చ చిలక - ఏమి పచ్చ
ఆకు పచ్చ - ఏమి ఆకు

అనే గేయం అర్థాంతరన్యానంతో వినోదాన్ని కలిగిస్తుంది, పిల్లలకు శబ్దశక్తిని, జ్ఞాపకశక్తిని కలిగించడానికి ఉపయోగపడుతుంది.

హాస్యం మనిషి నిత్యజీవితాన్ని సుఖమయం చేయ డానికి దోహదపడుతుంది. జీవితంలోని స్తబ్ధతను పోగొట్టి ఉల్లాసాన్ని చేకూరుస్తుంది.

"దోవంట పోతుంటే రంగనాయకా - ఒక సద్దసేను అడ్డమాయ రంగనాయకా
సద్దసేను అడ్డమాయె రంగనాయకా - ఒక సద్దెన్ను కోసుకుంటి రంగనాయకా
ఒక సద్దెన్ను కోసుకుంటి రంగనాయకా - వాడు సేనిగల్ల కాపొచ్చె రంగానాయకా
సేనిగల్ల కాపొచ్చా రంగనాయకా - వాడు కేకమీద కేకేశ రంగనాయకా
కేకమీద కేకేశ రంగనాయకా - వాడు కాకులు తోల్తాడనుకొంటి రంగనాయకా
కాకుల్దోళ్ళ గీకులదోళ్ళ రంగనాయకా - వాడు ఎగిరి జుట్టు పట్టినాడే రంగనాయకా
ఎగిరి జుట్టు పట్టినాడే రంగనాయకా - వాడు పేండ్లు జూస్తాడనుకొంటి రంగనాయకా
పేండ్లు జూడ్ల గీండ్లు జూడ్ల రంగనాయకా - మంచెకీడ్చి కట్టినాడే రంగనాయకా
మంచెకీడ్చి కట్టినాడె రంగనాయక - రెండు తీండ్ర తీగలు పెరక్కొచ్చా రంగనాయకా
తీండ్రతీగలు పెరక్కొచ్చా రంగనాయకా - వాడు ఉ య్యాల కడతాడనుకొంటి రంగనాయకా
ఉయ్యాల గట్లా గియ్యాల గట్లా రంగనాయకా - రెండు సింత మొలికలు పెరక్కొచ్చా రంగనాయకా
రెండు సింత మొలికలు పెరక్కొచ్చా రంగనాయకా - నేను ఏమో అనుకొంటి రంగనాయకా
నేను ఏమో అనుకొంటి రంగనాయకా - వాడు పీకు మీదా పీకు పీకే రంగనాయకా

అనే స్త్రీల పాటలో మృదువైన, సభ్యమైన హాస్యం మనల్ని ఆకట్టుకుంటుంది. అలాగే జానపదగేయ గాథలలో కూడా చక్కటి హాస్యం గిలిగింతలు పెడుతుంది. పెద్ద పనికి చిన్న ప్రయత్నం, చిన్న పనికి పెద్ద ప్రయత్నం కూడా హాసజనకమే అవుతుంది. సాధారణంగా నిద్ర పోయేవారిని పిలిచి లేపుతారు, తట్టి లేపుతారు. కానీ ఒక కథాగేయంలో కుంభకర్ణుని నిద్రలేపడానికి రాక్షసులు - ఏనుగులతో తొక్కించడం, గుణపాలతో కాల్చడం, చెవు లలో సీసం కరిగించి పోయడం అనేవి అసాధారణ విష యాలు. కుంభకర్ణుని భీకరాకారం, మొద్దు నిద్ర వర్ణించే ఈ సందర్భంలో హాస్యం పోషించబడింది.

భారత కథతో కూడిన గేయగాథల్లో శశిరేఖ అభి మన్యుల వివాహకథ అద్భుతాంశాలతో, హాస్య సన్ని వేశాలతో ఆసక్తిదాయకంగా సాగుతుంది. బలరాముడు తన కుమార్తె శశిరేఖకు దుర్యోధనుని కొడుకు లక్ష్మణునితో శశిరేఖకు ఇష్టంలేని పెళ్ళి చేయ సంకల్పించినపుడు ఘటోత్కచుడు తన మాయతో శశిరేఖను తీసుకెళ్ళడం, ద్వారకకు వచ్చి ఘటోత్కచుడు శశిరేఖ రూపంలో పెళ్ళి పీటల మీద కూర్చుని పక్కనే వున్న లక్ష్మణుడికి ఒకసారి భూతంగా, ఇంకొకసారి పాముగా, మరోసారి సింహంగా కనపడి బెదిరించడం, లక్ష్మణుడు భయపడి పీటలమీద నుంచి పారిపోవటం వంటి చర్యలు మనకు నవ్వు పుటి స్తాయి.

"లక్ష్మి - గౌరీదేవి నీ శంభుని గళమున నలుపేమిటె ఓయమ్మా - నలుపేమిటే ఓయమ్మా
పార్వతి - నారీమణి నీ విష్ణుదేవుడు నలుపుగాదటె కొమ్మా - నలుపుగాదటె కొమ్మా
లక్ష్మి - బిరుదు లేక నీ కాంతుడు జగములో భిక్షమెత్తుటేమమ్మా - భిక్షమెత్తుటేమమ్మా
పార్వతి - బలము లేకను బలిచక్రవర్తిని అడగ లేదటే కొమ్మా - అడుగలేదటే కొమ్మా"

అంటూ సాగిన ఈ కథాగేయంలో లక్ష్మీ పార్వతుల సంభాషణ వాక్చమత్కృతితో కూడిన చక్కటి హాస్యానికి ఉదాహరణ.

'బకాసుర వధ' కథాగేయంలో కూడా హాస్యం కని పిస్తుంది. భీముడు బకాసురుని కోసం బండెడు ఆహారాన్ని తీసుకెళ్తూ దారితో ఆ ఆహారాన్ని తింటూ, పాడుతూ, ముఖానికి పూసుకుంటూ వెళ్ళే సందర్భం ఎంతో వినోదాన్ని కలిగిస్తుంది.

ఈ విధంగా జానపద గేయాలు, గేయగాథల్లో హాస్యపు మాటలు, అతిశయోక్తులు, ప్రగల్భోక్తులు, గూఢార్థ పదప్రయోగాలు, వాక్‌చమత్కారం, అధిక్షేపం, వికృత వేషధారణ వంటి వాటి ద్వారా చక్కటి హాస్యం పోషించ బడింది.

ఆధార గ్రంథాలు :

1. నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు - ప్రత్యేక సంచిక - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 2012
2. వాఙ్మయి - త్రైమాసిక తెలుగు సాహిత్య పత్రిక - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - (అక్టోబర్ - డిసెంబర్) 2003
3. జానపద గీతాలు - సంకలనం - తాడాల నిబ్బరాజు - రోహిణి పబ్లికేషన్స్ - విజయవాడ
4. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బి.రామరాజు - 1990
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆచార్య ఆర్.వి.ఎస్.సుందరం.

❖ ❖ ❖

జానపద కళారూపాలు – ఒగ్గు కథ

– రవిందర్ అచ్చ, పి.జి.టి., తెలుగు ఉపాధ్యాయులు, మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, వెంకటాపూర్ గ్రామం & మండలం, ములుగు (వరంగల్), తెలంగాణ.

కళారూపాల ఆవిర్భావానికి, నృత్యగాన పుట్టుకకు, కావ్యసృష్టికి, మానవ నాగరికతకు మూలం జానపదమే. అందుకే జానపదమే జ్ఞానపథమన్నారు విజ్ఞులు. జానపద కళలు మహోన్నతమైన మన దేశ సంస్కృతికి పట్టు కొమ్మలు. మానవ నాగరికతా వికాసంలో వీటి పాత్ర అనన్య సామాన్యం. పురాణ గాథల ఆధారంగానే ఈ కళారూపాలు విస్తృతమై వైవిధ్యభరితంగా తయారైనాయి. అలాంటి కళారూపాల్లో వృత్తి కళాకారులు చెప్పే ఒగ్గు కథ ఒకటి. తెలంగాణకే సొంతమైనది ఈ ఒగ్గు కళారూపం. జానపద కళల్లో వృత్తి కళాకారుల సేవ మరువలేనిది. వందల సంవత్సరాలుగా ఈ కళారూపం సజీవంగా ఉంటూ వస్తున్నదంటే వారిని ప్రశంసింపవలసిందే. ప్రాచీన కళారూపాలను వృత్తి కళాకారులు ఆధునీకరిస్తూ దేశి కళనే ఎంతగానో సుసంపన్నం చేస్తూ వస్తున్నారు. అందుకు యావత్ తెలుగు ప్రజలు వారికి రుణపడి ఉంటారనేది విస్మరించొద్దు.

జానపద కళలకు నామకరణం కళాకారులు ఉపయోగించే వాయిద్యాలవల్లే చేసినట్టుగా కనిపిస్తోంది. ఒగ్గు కళా ప్రదర్శనకు ఉపయోగపడే 'ఒగ్గు' వాయిద్యం కారణంగా ఈ కళకు 'ఒగ్గు' అనే పేరొచ్చింది. వైవిధ్యమైన ఒగ్గు కళ తెలంగాణ ప్రాంతంలో మాత్రమే సజీవంగా ఉంది. జముకుల కథ, బోనెల కథకు సాటివచ్చే వైవిధ్య కళ ఒగ్గు కథకుండడం విశేషం. కురుమ జాతికి పూజారులగా ఉన్న ఒగ్గులు ఈ కథా ప్రదర్శనని అద్భుతంగా ప్రదర్శిస్తారు. ఒక్క తెలంగాణలోనే దాదాపు 500 పైగా ఒగ్గు కళా బృందాలు తమ కథా ప్రదర్శనల ద్వారా ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం తమ పథకాల ప్రచారం కోసం నియమించిన కళారూపాల్లో ఒ ఒగ్గు కథకే పెద్ద పీట వేసింది.

కళారూప ప్రదర్శన :

ఒగ్గు వృత్తి కళాకారులు నలుగురు లేదా ఐదుగురు ఈ కథాగాన ప్రదర్శనలో పాల్గొంటారు. వీరి కథాగానానికి ఉపయోగపడే వాయిద్యాలలో ప్రధానమైంది 'ఒగ్గు' (డమరుకం). దానితోపాటు పిల్లనగ్రోవి, వీరణం, డోలు, పెద్ద తాళాలు సమయ సందర్భాలను బట్టి వాయిద్యాలను ఉపయోగిస్తారు. కళాకారులందరూ వేషధారణతోపాటు, ఆభరణాలను ధరిస్తారు. ఈ కళాబృందంలో ఒకరు ఆడవేషం కడతారు. కాళ్లకు గజ్జెలు ధరించి అద్భుతంగా నృత్యం చేస్తారు. ప్రధాన కథకుడు, సహ కథకుడు కథాగానం చేస్తుంటే మిగతావారు వాయిద్యాలు వాయించుకుంటూ వంత పాడుతారు. కొన్ని సమయాల్లో కథను అద్భుతమైన బోనం నృత్యంతో ముగించే సంప్రదాయం 'ఒగ్గు' కథాగాన ప్రదర్శనలో ఇటీవలే ప్రవేశించింది. ఒగ్గు కళాకారుల నైపుణ్యం వల్ల బోనం నృత్యం ప్రేక్షకుల్ని ఎంతగానో అలరిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

ఈ ఒగ్గు కథ కళారూపం కళాకారుడు ఇటీవల మరణించిన చుక్క సత్తయ్య, మిద్దె రాములు ఈ ఇద్దరి వల్లే ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. వీరిద్దరేగాక వనం రాజయ్య, ఒగ్గు సతీష్, బైరి మల్లేష్ లాంటి కళాకారులెంతమందో ఈ కళారూపాన్ని మేటి కళారూపంగా తీర్చిదిద్దుతూ వస్తున్నారు. వీర్ల ఐలయ్య, మల్లెల వీరప్ప లాంటి 'ఒగ్గు' కళాకారులు బీరన్న కథలను చెప్తూ జీవిస్తూ వస్తున్నారు.

ఒగ్గు జాతి పుట్టుక :

ఒగ్గు కళాకారుల ఆవిర్భావం గురించిన కులోత్పత్తికి సంబంధించిన పురాణగాథ ఒకటి కనిపిస్తోంది. చంద్రికాపురినేలే రాజు, ఆయన భార్య డొక్కా మహాదేవి కుమారుడు మల్లిఖార్జునుడు. జానపదులు చెప్పుకునే మల్లన్న ఈయనే. భ్రమరాంబ తల్లిందడ్రులను జూదంలో

ఓడించి బ్రమరాంబను చేపట్టాలని పందెం కాస్తే మల్లన్న గెలిచి ఆమెను పెండ్లాడాడు. గెలిచిన మల్లన్న మీద భ్రమరాంబ ఏడుగురు సోదరులు ఘోరయుద్ధం చేసి, ఓడిపోయి బానిసలవుతారు. ''నేను ఊరూరా దేవునిగా వెలసినప్పుడు మీరు ఏడుగురు సోదరులు ఒగ్గి లొంగిన వారై నా కథలను చెప్తూ జీవించండ''ని విముక్తి చేశాడు. అలా ఒగ్గిన వారే ఒగ్గులైనారు. వారే కురుమ కులానికి పూజారులైనారు.

కురుమజాతికి ఆరాధ్యదైవాలైన మల్లన్న, వీరన్న కథాగానాలను ఒగ్గు కథల్లో చెప్తూ అప్పటి నుండి జీవనం గడుపుతూ వస్తున్నారు. శైవక్షేత్రాలైన కొమురెల్లి మల్లన్న, కట్టమల్లన్న, ఐనవోలు గుడుల వద్ద, శ్రీశైలం లాంటి పెద్ద ఆలయాల వద్ద పట్నాలు వేసి భక్తుల చేత మొక్కులు చెల్లిస్తారు. ఎల్లమ్మ దేవత ప్రసాదించి ఏడు గవ్వల హారాన్ని మెడలో ధరించి వారు దైవ కార్యాలను నెర వేరుస్తుంటారు. కొందరు ఒగ్గులు మల్లన్న దేవుని విగ్రహా లను కావడిలో పెట్టుకొని ఊరూరా తిరుగుతూ తమ భక్తిని చాటుకొంటారు. నెత్తిని విరబోసుకొని, నుదిటిన పసుపు రాసుకొని, కండ్లకు కాటుక దిద్దుకొని, ఎర్రని పొట్టి అంగీని, మువ్వల లాగుని ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టుకొని నృత్యం చేస్తూ నిరంతరం శివారాధనలో ధన్యులవుతుంటారు.

ఒగ్గులు చెప్పే వీర పురాణ గాథలు :

ఒగ్గులు చెప్పే కథల్లో ఇతిహాసాలే ఎక్కువ. వాటిలో మల్లన్న, బీరన్న కథలు ఆ జాతి చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబిస్తున్నాయి. ఉత్పత్తి కులాలకు చెందిన వృత్తి గాథలో మల్లన్న కథకు అధిక ప్రాధాన్యమే ఉంది. ఇది జానపద పురాణమే అయినప్పటికీ శిష్ట పురాణాలంత పవిత్రతని, ప్రాధాన్యాన్ని సంతరించుకొంది.

గోగులూరి కొల్లాపురాన్ని పాలించే ఆదిరెడ్డి నీలమ్మల కొడుకు మల్లిఖార్జునుడు. సంతానం కలిగిన తర్వాత ఆదిరెడ్డి దంపతులు శివనామస్మరణ మరుస్తారు. అప్పుడు శివుడు తన బిడ్డ అయిన ఎల్లమ్మతో కొల్లాపురాన్ని పాడు చేయిస్తాడు. సంపద కోల్పోయిన వారు బతకడానికి పొరుగు దేశానికి పోతే శివభక్తిలేని వారిని కూలికి కూడా పిలవలేదు. ఉండడానికి ఇల్లు కూడా దొరక్క అడవుల పాలవుతారు. ఇదంతా శివుని కోపంవల్లే జరిగిందని ఆయన్ని వేడుకొన్నంతనే పూర్వవైశబం సమకూరింది. అప్పుడప్పుడే ఎదుగుతూ వచ్చిన మల్లన్న దానం చేసేం దుకు పూనుకున్నాడు. దానధర్మాలు పెళ్లైన వారు చేస్తేనే పుణ్యముంటుందని మాయా శివుడు చెప్పగానే పెళ్ళి వైపు మనసు మళ్లింది. అంతే ఆయన వరసగా భ్రమరాంబను, రత్నాంగిని, మ్యాడల దేవిని, గొల్ల కేతమ్మలను పెండ్లా డాడు. ఇక్కడ నలుగురు వధువులు నాలుగు వర్ణాలకు ప్రతీకలు. మల్లన్న మక్కా దేశానికి వెళ్లి పసుపు (భండారి) సాధించుకు రావడం ఒగ్గు కథల్లో వీరోచిత ఘట్టంగా వర్ణితమైంది. సాక్షత్తు శివుడే మల్లిఖార్జునునిగా అవతరిం చాడని కురుమ జాతి విశ్వాసం.

ఒగ్గు కథలో రెండో వీరోచిత గాథ బీరన్నది. శివ పురాణంలోకి వీరభద్ర విజయం కథలో ఈ బీరన్న వీర భద్రుని అవతారమని పేర్కొంది. ఈయన చేతిలోని ఖడ్గం జాంబవతుని నుండి లభించిందంటారు. దైవాంశ సంభూ తుడైన బీరన్న నాగులకొండ (కాశీ) రాజు గర్వమణచ డానికే పుట్టడమే గాదు ఆయన కూతురైన కామారతిని పెండ్లి చేసుకొంటారు. వీరభద్రుడే బీరన్నగా అవతరించ డాని కురుమజాతి విశ్వసిస్తోంది.

ఉద్రిక్తపరిచే సాహిత్యం :

ఒగ్గు కథా గాన ప్రదర్శనంతా దాని సాహిత్యం ద్వారానే ఆదరణ పొందుతోంది. ఒగ్గు కథలు వీర రసాత్మకమైనవి. డోలు, పిల్లనగ్రోవి, పెద్ద తాళాలు, వీరణం లయాత్మకంగా మోగుతుంటే వేదిక దగ్గర ఉద్రిక్త వాతావరణం వెల్లి విరుస్తోంది. ఒగ్గు కథలో జాతీయాల్లాంటి వచనాలు, దర్పుల్లో పోటీలు, చత్తీలో గానప్రవాహం ఉరుకులు పెడుతుంది. కథకుని ప్రతిభంతా కథనాన్ని శృంగార, హాస్యలు పండించడంలోనే రాణించింది.

అన్ని వర్గాల శ్రోతలను మైమరిపించే సాహిత్యమై నందువల్ల ఒగ్గు కథా సాహిత్యమంతా ప్రజా సాహిత్యంగానే గుర్తించారు. ఆ ఒగ్గు కథ సాహిత్యం మేలైన సాహిత్యంగానే

పరిగణించడానికి కారణాలను పరిశీలిద్దాం. ఒగ్గు కథా గానమంతా ఏలల్లో లయ ప్రధానంగా సాగిపోతుంటుంది. అంతేకాదు వారలను వర్తనాలైతేనేమి, వర్ణ వ్యత్యయాలు, నూతన పద గుంఫనాణాలెన్నో వృత్తి సంస్కృతిలోంచి పుట్టాయి. మరీ ముఖ్యంగా దీహెనా గేయాలు, సుడి సుద్దులు సామాన్య హృదయాలను సైతం రసరమ్యం చేస్తాయి.

'అల్లో నేరడల్లో అల్లో నేరడల్లో అల్లల్లా నేరడి అల్లా నేరడి అల్లో నేరడల్లో
మల్లిఖార్జునుడైన మహా వీరుడైన అల్లో నేరడల్లో
మామల పట్నం చేరి వస్తుంటే అల్లో నేరడల్లో
అల్లల్లా నేరడి అల్లా నేరడి అల్లో నేరడల్లో.....

అంటూ ఒక అద్భుత లయలో దరువు సాగిపోతుం టుంది.

అలాగే మనస్సులను రసానందంలో ముంచే మరో దరువు

'జరిగింజ గిరిమల్లెలో జరిగింజ గిరిమల్లెలో
సాదు జంగమయ్య బయలెల్లినాడే
జరిగింజ గిరిమల్లెలో
జరిగింజ గిరిమల్లెలో జరిగింజ గిరిమల్లెలో
అయ్యా పోదామంటేనూ తొవ్వ లేదాయె జరిగింజ గిరిమల్లెలో
పొయ్యేటి తొవ్వలో మల్లెలు పూసెను జరిగింజ గిరిమల్లెలో
జరిగింజ గిరిమల్లెలో జరిగింజ గిరిమల్లెలో.....'

అంటూ దరువు సాగి మన మనస్సులను రస ప్లావితం చేస్తోంది.

'దేవదారి తుమ్మ తీయాలో నా సామి దేవదారి తుమ్మ తీయాలో
జంగమూ బయలెల్లి వత్తాయున్నాడు దేవదారి తుమ్మ తీయాలో
గణ గణ గణ గణ గంట కొట్టి నా సామి దేవదారి తుమ్మ తీయాలో
గుబ గుబ గుబ గుబ శంఖం పట్టి నా సామి దేవదారి తుమ్మ తీయాలో'

దీని నడకతోపాటు శాబ్దిక లయ మరింత మనస్సును దోచేస్తుంది.

జానపద కథాగానాల్లో సంవాదాలు ఎక్కువ కని పిస్తాయి. అవి మనుచరిత్ర లాంటి పద్య సంవాదాలను తలపిస్తుంటాయి.

'బావి కాడా ముద్దు బాలా బేలా నీవెవ్వరో
ఎవ్వరైతే నేమి కానీ నిల్లరాదు పొమ్మికా
కొమ్మ చాటున దాగిన కమ్మా నీవెవ్వరో
ఎవ్వరైతే నేమి కానీ మందలించా నీవెవ్వరో
హంసలాగా నడిచి వచ్చె అతివా నీవెవ్వరో
మాటలో మాట గలుపుట మర్యాద గాదోయి'

చుక్క సత్తయ్య రచించి పాడిన ఒగ్గు దర్వులో పోలికలను సునాయాసంగా గుర్తు పట్టొచ్చు.

ఇక ఒగ్గులు కథ సందర్భంలో చెప్పే సుడిసుద్దులు జోతిశ్శాస్త్రం అనుసరించి ఉన్నట్లుగా కనిపిస్తాయి. అరుంధతి పురాణంలో ఆమెని చూపినప్పుడు ఈ సుడి సుద్దుల ప్రస్తావన వచ్చీవచ్చినట్టుగానే బీరన్నకు వధువును చూసేటప్పుడు కూడా సుడిసుద్దులు చెప్తారు. అవి ఎట్లా ఉంటాయో వినండి.

'తుంపురేంటికాలంలో ఆ వధువు జగడామారి. నెత్తిన మాడ ఉంటే ఇంటికి బర్కతుండదు. పాపట్ల సూది ఉంటే మామకు గండం. మొండి శిఖ ఉంటే ఆ ఇంటికి దీపం ముట్టించే గతి ఉండదు. కనుబొమ్మలు కలిసుంటే మారు మనువు తప్పదు. పుక్కిట సుడి ఉంటే ఆడపిల్లలు పుడతారు. రొమ్ముకుంపటి ఉంటే పాలుతాగే పాపకి గండం. తొడ సర్పం ఉంటే మొగనికి కీడు. ఎదురు పిక్కలు ఉంటే గొడ్డురాలు.' ఇలాంటి విశేషాలెన్నో ఉన్నాయి.

ఆధార గ్రంథాలు :

1. వరంగల్ జిల్లా ఒగ్గు కథ-సాహిత్య అనుశీలన - కె. సతీష్ కుమార్.
2. కళా తెలంగాణం - తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ముద్రణ.
3. జానపద గాయకులు బీరన్నలు - వి. గంగాధర్.
4. జానపద కళలు - తెలంగాణ ప్రభుత్వ తెలుగు వాచకం (ఎనిమిదో తరగతి).

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

వేట వేంకటేశ్వరస్వామి దేవాలయము

– పరుచూరి విజయలక్ష్మి, కె. ఆర్. కె. ప్రభుత్వకళాశాల, అద్దంకి.

జానపదులు అంటే జనపదాలలో నివసించే వారు. జానపదులు అంటే విద్యావిహీనులైన కర్షక జనులని, గ్రామీణులని అనాటివిద్వాంసులు అభిప్రాయ పడ్డారు.. జానపద విజ్ఞానాన్ని ఇంగ్లిష్ లో ' ఫోక్ లోర్ ' అని డబ్ల్యు. జె. థాంస్ పేరుంచారు. జానపదులకు చెందిన ఆచారాలు, నమ్మకాలు, కథాగేయాలు, సామెతలు మొదలైన విజ్ఞానమే 'ఫోక్ లోర్ ' అని థాంస్ వచించాడు.

జానపద విజ్ఞానాన్ని నాలుగు విభాగాలుగా విభజించ వచ్చు.

మౌఖిక జానపద విజ్ఞాన జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఐతిహ్యాలు, గద్య కథలు, సామెతలు,పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు, మొదలైనవన్నీ, ఈ విభాగంలోనివే.

సాంఘిక జానపదాచారాలు :

పుట్టుక, వివాహం, మరణం,ఆచారాలు,కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు ఆటలు జానపద వైద్యం, మతం, నమ్మకాలు, మొదలైనవి ఈ విభాగం లోనివి.

వస్తు సంస్కృతి :

భౌతిక జీవితానికి సంబంధించిన అన్నీ వస్తువులు ఈ విభాగంలో చేరుతాయి. కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోకే వస్తాయి. చిత్రకళ, శిల్పకళ, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, పూజా సామాగ్రి, శిలా విగ్ర హాలు, దారు విగ్రహాలు, మొదలైనవి ఈ విభాగంలో చేరుతాయి.

జానపద కళలు :

సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కలలన్నీ ఈ విభాగంలో చేరుతాయి. గాత్ర సంగీతం, వాద్యసంగీతం, తోలుబొమ్మలాటలు, యక్షగానం, వీధి భాగవతం, కోలాటం, పగటివేషాలు, గారడీ విద్యలు మొదలైనవి ఈవిభాగంలోకి చేరుతాయి.

దేవాలయాలు, అక్కడ వెలసిన దేవుడిగురించి చెప్పే కథలు, అక్కడి ఆచార వ్యవహారాలు, నమ్మకాలు అన్నీ కూడా జానపద సాహిత్యంలో ఒక భాగం.ఇది కాదనలేని నిజం.

అందుకే ఇప్పుడు నేను చెప్పబోయే విషయం ఒకదేవాలయం గురించి,అక్కడి ఆచార వ్యవహారాల గురించి. తిరుపతిలో నిత్య కళ్యాణ ఉత్సవాలతో వెలుగొందుతున్న శ్రీ వెంకటేశ్వరుడు వేట వెంకటేశ్వరుడు పేరుతో వెలిసిన క్షేత్రం గురించి చెబుతున్నాను.

తెలంగాణాలో ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని మర్రిగూడెంలో ఈ వేట వేంకటేశ్వర స్వామి దేవాలముంది.ప్రాచీన లిఖిత ఆధారాలను పరిశీ లిస్తే శాలివాహన శకం 1525 వ సంవత్సరము ఆశ్వయుజ శుద్ధ విదియ రోజు అవతరించినట్లు పూర్వ చరిత్ర చెబుతుంది.

15 వ శతాబ్దిలో వెడ్డి వెంగళప్పయ్య అనే మూగవాడు భార్య, ఒక కూతురు, కొడుకుతో గార్లలో నివసిస్తూ ఉం డేవాడు. ఇతడు తనకున్న కొద్దిపాటి పొలంలో పెసలు, కందులు, నువ్వులు పండించుకొని కుటుంబాన్ని పోషిం చుకునేవాడు. ఇంతలో అనుకోకుండా అతని భార్య చనిపోతుంది. 5సంవత్సరముల పిల్ల, 8 సంవత్సరముల పిల్లవాడు ఇద్దరినీ తీసుకొని పొలానికి వెళ్ళేవాడు.ఆడపిల్ల ఎవరితో మాట్లాడకుండా ఆ పొలం చుట్టుపట్ల అడవి ప్రాంతంగా ఉన్న ప్రదేశంలో ఏరాయి కనిపించినా దేవుడుగా భావించి పూజలు చేస్తూ భక్తిలో మునిగి

పోతుండేది. ఒక రోజు పొలంలో పనిచేసి అలసిపోయి ఈ చిన్న పిల్లలతో నేను చేయలేక పోతున్నాను. వెంకట రమణా ఎక్కడున్నావు? కాపాడు అని దీనంగా వేడు కున్నాడు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత వెంకటేశ్వరుడు తిరుపతి నుండి వేటకు బయలు దేరుతున్నప్పుడు ఈ వెంగళప్పయ్య వేడుకోలు విని ఒక గుర్రం మీద రాజులాగా ఆయన వద్దకు వచ్చి నన్ను ఎందుకు పిలిచావు? అని అడుగుతాడు. అప్పుడు వెంగళ ప్పయ్య నీవు ఎవరో రాజులాగా ఉన్నావు నేను పిలిచింది వెంకటేశ్వరస్వామిని నీవు నాకేమీ చేయగలవు?అని సైగ చేస్తే నేను తిరుపతి వెంటేశ్వరున్నీ నన్ను ఎందుకు పిలిచావు అనగా ఆ వెంగళప్పయ్య అయ్యా నేను ఈ పిల్లలతో చేయలేక పోతున్నాను.ఆ పీల్ల ఏమో కనిపించిన రాయినల్ల దేవుడు అంటూ మొక్కుతుంది తప్ప ఉలకడు పలకదు ఏమి చెయ్యాలో తెలియడంలేదు.నువ్వు ఇక్కడే ఉండి నన్ను కాపాడు అని వేడుకుంటాడు.

అది విని వెంకటేశ్వరుడు నేను వేటకు బయలు దేరినప్పుడు నన్ను పిలిచావు కనుక వేటవెంకటేశ్వరుడు పేరుతో ఇక్కడేఉంటాను.ఈకలియుగం అంతము వరకు మీవంశము వారే నాకు సేవ కైంకర్యాలు చేయండి. అంతే కాకుండా భక్తురాలైన నీ కుమార్తెను నాలో ఐక్యము చేసుకుంటాను అని ఆపాపను తనలో ఐక్యము చేసు కుంటాడు. నేను ఇక్కడ ఉండటానికి గుడి కట్టించమని చెబుతాడు. వెంగళప్పయ్య గార్ల లోని వెలమదొరలవద్దకు వెళ్ళి సైగలతో విషయం వివరించటానికి ప్రయత్నించగా వారికి అర్ధంగాక వెంగళప్పయ్యను పంపించి వేస్తారు. ఆతడు వెను తిరిగి వచ్చి వెంకటేశ్వరుడికి విషయం వివరించగా స్వామి అతని నాలుకమీద బీజాక్షరాలు వ్రాస్తాడు. వెంటనే వెలమ దొరల వద్దకు వెళ్ళి విషయం స్పష్టంగా చెప్పడంతో వారంతా వెంగళప్పయ్య మాట్లాడం చూసి ఆశ్చర్యపోయి ఈవింత ఏమిటో చూద్దామని బయలు దేరి స్వామి ఉన్న ప్రదేశమునకు వచ్చుచుండగా స్వామి గో రూముతో అక్కడి నుండి ప్రస్తుతం దేవాలయ మున్న ప్రాంతంలో ఒక జువ్వి చెట్టుకింద ఉన్న నల్ల శిలలలో వెలుస్తాడు. దొరలతో వచ్చినవెంగళప్పయ్య అక్కడ గో పాదముద్ర తప్పస్వామి కనిపించకపోవుటచే విలపించాడు. అపుడు స్వామి వెంగళప్పయ్య కొడుకుకు పూని నేను తిరుపతి వెంకన్నను, వేటకు బయలు దెరుతున్నపుడు ఇతడు పిలిస్తే ఇక్కడకు వచ్చాను. ఇక్కడకు కొద్దిదూరంలో జువ్వి చెట్టుకింద ఉన్న నల్ల రాతిలో వెలిశానని, అక్కడే గుడికట్టి ప్రతిష్టించమని, కలియుగాంతం వరకు ఈ వెంగళప్పయ్య వంశస్థులే నాకు కైంకర్యాది సేవలు చేస్తారని చెబుతాడు. ఈ వంశములో 7 వ తరంలో సంతానము ఉండదు.అపుడు వారు దత్తత తీసుకొని నాపూజలు చేస్తే సరి లేకుంటే తిరిగి నేను తిరుమ లకు వెళతాను అని చెబుతాడు .

అంతేగాక మధ్యప్రదేష్ లోని భూపాల పట్టణములో ఒంటిమీసం రాజు మామిడితోటలోని పుట్టలో ఐదు విగ్రహాలున్నాయి వాటిని తెచ్చిఉత్సవాలు చేయమని ఆదేశిస్తాడు. వీళ్ళంతా విగ్రహాల కోసం బయలుదేరగానే అక్కడ రాజుకు కలలో పుట్టలో విగ్రహాలు కనిపిస్తాయి. భటుని కిచెప్పగాఅతడుమనతోటలో పుట్టే లేదని చెబుతాడు. వీళ్ళు వెళ్ళి విగ్రహాలు అడుగగా రాజే స్వయంగా వచ్చి తోటలోని పుట్టలోని వెంకటేశ్వరుడు, శ్రీదేవి, భూదేవి, చక్రపెరుమాళ్ళు, తిరువెంగళాళ్వారు విగ్రహాలను ఇస్తాడు. వాటిని తీసుకొనివచ్చిగుడికట్టడానికి ప్రయత్నించగా ఏడుసార్లు పైకప్పు దగ్గర వరకు వచ్చి దేవాలయం కూలిపోయింది. మరలా కట్టడానికి ప్రయత్నించగా స్వామి వారి స్వయంగా నేను వెంగళ ప్పయ్య ఇంటిలోనే వారి పిల్లలతో పాటు ఉంటాను అని చెబుతాడు. ఆ కట్టిన గుడిలో లక్ష్మీ నారాయణుని ప్రతిష్ట చేశారు. ఇప్పటికీ గార్లలో ఈ దేవాలమున్నది. ఉత్సవాలు జరిగేటపుడు ఈ ఐదు విగ్రహాలనుమర్రిగూడే0 లో స్వామి వెలసిన దేవాలయం వద్దకు తీసికొని వెళ్ళి ఉత్సవాలు ముగిశాక మరలా గార్లకు తీసికొని వచ్చి యధావిధిగా పూజలు చేస్తారు.

ఇక్కడి ప్రత్యేకతలు :

ఎక్కడా లేనివిధంగా ఇక్కడి వేంకటేశ్వర స్వామికి మీసాలు ఉంటాయి. ఒకచేతిలో ఖడ్గము, ఒకచేతిలో డాలు కనిపిస్తుంది. ఉత్సవ విగ్రహాలకు కూడా అమ్మ వార్లతో సహా చేతిలో ఖడ్గము, డాలు, నడుముకు వెళ్ళాడే కత్తులు ఉంటాయి. మరో ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ జంతు బలి ఉంటుంది. వేట వెంకటేశ్వరుడు కనుక వేటలు బలి ఇవ్వడం జరుగుతుంది అని చెబుతుంటారు. అయ్యవార్లు వెంకటేశ్వరుడికి బలి ఇవ్వడం ఏమిటి దీనిని అడ్డుకోవాలని అనుకున్నపుడు వాళ్ళంతా కడుపునొప్పితో బాధపడ్డారట. వేటలను బలి ఇస్తామని మొక్కుకున్నాక తగ్గిందట. అప్పటినుండి బ్రాహ్మణులు,వైశ్యులుకూడా బలి మొక్కులు మొక్కుకొని ఆబలిని తినేవారికి ప్రసాదంగా ఇవ్వడం ఇప్పటికీ జరుగుతుంది. చాత్తాడ వంశము వాళ్ళే ఇప్పటికీ పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ దేవుని వీసాల వెంకటేశ్వరుడు అనే పేరుకూడా ఉంది. విదేశీ ప్రయాణాల కోసం వీసాల కోసం మొక్కు కుంటే వెంటనే పని జరుగుతుంది అని బాగా నమ్ముతారు. ఆ నమ్మకంతోటే వందల కిలోమీటర్లదూరంనుంచి ఈదేవాలయానికి వస్తుంటారు. అంతేకాక ఈ దేవుని సంతాన ప్రదాత అనికూడా అంటారు. ఇక్కడ జరిగే పారువేట ఉత్సవములో మర్రిగూడెం లోని దేవాలయం నుండి మొదటగా స్వామి కనిపించిన చోటున్న గోపాద ముద్ర దగ్గరకు అశ్వ వాహనం మీద స్వామిని తీసికొని వెళతారు. అక్కడ అయ్యవారు కూరగాయలను ఖండించి బలిలా ఎగురవేస్తారు. ఆముక్కలు కొంగులో పడినవారు సంతాన వతులు అవుతారని నమ్ముతారు.

ఆశ్వయుజ తదియ నాడు ఇక్కడ బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. విశ్వక్సేనారాధనతో ఈ ఉత్సవాలు మొదలవుతాయి. పౌర్ణమి రోజు స్వామివారికళ్యాణం జరుగుతుంది. ఈ కళ్యాణానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమంటే తిరుపతినుండి వచ్చే దారిలో డోర్నకల్లు దగ్గరలో అమ్మపాలెం నుండి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, మట్టెలు, సారె వస్తుంది. ఆ తలంబ్రాలు వచ్చాకే కళ్యాణం జరుగుతుంది. దానికి కారణం ఏమంటే అమ్మ పాలెంలో ఒక పాప స్వామివారిపై చూపే భక్తికి మెచ్చి స్వామి తనలో ఐక్యము చేసుకుంటాడు. అందు వలన ఆ ఊరి బిడ్డ స్వామిని వివాహమాడింది అని నమ్మివారే ఆడపిల్లతరుపునుంచి తెచ్చేవన్ని తెచ్చి కళ్యాణం జరిపిస్తారు.

తిరపతిలో వలెనే ఇక్కడ కూడా బ్రహ్మోత్సవాలలో అన్నీ రకాల వాహన సేవలు చేస్తారు. ఇక్కడ వాహకులుగా పద్మసాలీలు ఉంటారు ఇది మరో ప్రత్యేకత. విశ్వక్సేనా రాధనతో మొదలైన ఉత్సవాలు చక్ర స్నానంతో ముగు స్తాయి. వెంగళప్పయ్య వంశములోని 11 వ తరము వారు ఇప్పుడు స్వామివారి సేవ కైంకర్యాలు నిర్వహిస్తున్నారు.

ఈ దేవాలయ విశేషాలు ఇప్పటికీ ప్రజలనమ్మకాలలో సజీవంగా ఉన్నాయి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సామెతలు – సామాజికత

– ఎలగొండ రాములు, తెలుగు పండిట్, జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ స్కూలు - ఇటికాలపల్లి, నర్సంపేట మం॥, వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ.

జానపద సాహిత్యంలో భాగం సామెతలు. మనుషుల నిత్యజీవితంలో అనివార్యం సామెతలు. సంక్షిప్తంగా ఒక అప్రియమైన సత్యాన్ని చెప్పే సారభూతమైన వాక్యం సామెత. పదునైన భావం, లోతైన విషయ సూక్ష్మం, వివేకవంతం, విజ్ఞానదాయకం, అధిక్షేపం, సంపూర్ణ అలంకారికం కలిగి ఉండి... ఒకటి లేదా రెండు వాక్యాలలో ఉండే సాహిత్య ప్రక్రియ సామెత. నానుడి, లోకోక్తి, శాస్త్రం, జనశ్రుతి... అనేవి సామెతకు పర్యాయ పదాలు. ఇంగ్లీషులో ప్రోవెర్బ్ (Proverb)ను తెలుగులో సామెత అంటారు. సామెతలలో సాహిత్యపరమైన సౌందర్యం, సాంస్కృతిక పరమైన విలువలు, సామాజిక విలువలు మొదలగునవి ఉన్నాయి. సామెతలు పోలికలను ఆధారంగా చేసుకొని ఏర్పడే విశిష్ట వచనాలు. సామెత అనే మాట 'సామ్యత' నుంచి వచ్చింది. 15వ శతాబ్దంలో వరాహపురాణంలో తొలిసారిగా సామెత అనే పదం ప్రయోగించబడింది. సామెతను హిందీ భాషలో 'కహావత్' అనీ, కన్నడ... తళు భాషల్లో 'గాదె' అనీ అంటారు. తమిళులు 'పళమొళి' అనీ, మలయాళీలు 'పళించోల్' అనీ సామెతలను వ్యవహరిస్తారు.

నిత్య జీవితంలో మానవుడు సుఖదుఃఖాలను రెండింటినీ సమానంగా అనుభవిస్తాడు. తాను అనుభవించిన దాన్ని ఇతరులకు ఉపదేశాత్మకంగా, సందేశ రూపంలో చిన్న వాక్యంలో అందిస్తాడు. అల్పాక్షరాలలో అనల్పభావాన్ని, అనుభవాన్ని సూటిగా చెప్పగలుగుతాడు. సామ్యతను చూపించి, సామెతగా రూపొందిస్తాడు. జీవితం అనుభవాల కూడలి. అటువంటి అనుభవాల సంగమంలో జనించేదే సామెత. కేవలం అనుభవాలనుంచే కాకుండా కథలలోని నీతుల నుంచి కూడా ఏర్పడిన సామెతలెన్నో ఉన్నాయి. ఉదాహరణకి... 'పోరు నష్టం, పొందు లాభం', 'ఇద్దరూ పోట్లాడితే, మూడోవాడికి లాభం' మొదలగునవి.

సామెతలు అనుభవాల నుంచి పుట్టాయని అనుకొన్నప్పుడు, ఆ అనుభవం కేవలం ఒక్కనిదే కాదు, జన సామాన్యులందరిది కూడా. సామెత కూర్పు మాత్రం ఒక్కడిదే కావచ్చు. కాని, అది పలువురి అనుభవం మీద ఆధారపడి ఉంటుంది.

సామెతలను 'మౌఖిక ప్రచారాలు' అని, 'గ్రంథస్థాలు' అని రెండు రకాలుగా చెప్పవచ్చు. నన్నయ, ధూర్జటి, శ్రీనాథుడు, పెద్దన, నాచన సోమన, వేమన, పాల్కురికి సోమనాథుడు... మొదలగు కవులు తమ తమ గ్రంథాలలో సామెతలను ఉటంకించారు. వీటిని 'గ్రంథస్థ సామెతలు' గా చెప్తారు. గ్రంథస్థం కానటువంటివి మౌఖికాలు.

2020 అక్టోబర్ 15, 16 & 17 తారీఖులలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పెదనందిపాడులో గల ఆర్ట్స్ & సైన్స్ కాలేజి (522235) లోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో "తెలుగు జానపద సాహిత్యం, సంస్కృతి సమాలోచన" అనే అంశంపై రెండురోజుల అంతర్జాల అంతర్జాతీయ సదస్సు - వెబినార్ - జూమ్ ద్వారా నిర్వహించబడుతున్న బృహత్కర కార్యక్రమంలో పత్ర సమర్పణ కొరకు రూపొందించిన పరిశోధనా వ్యాసమిది. 'జానపద సామెతలు - సామాజికత' అనే పత్రాన్ని ఈ సదస్సు కోసం రచించాను. జానపదుల్లోని సామెతలు... సామాజిక తత్వాన్ని కలిగి ఉన్న తీరును తెలియజేయడమే ఈ వ్యాసోద్దేశం.

'సాహిత్యం' అంటేనే సమాజానికి హితం (మంచి) చేకూర్చేదని అర్థం. లిఖిత సాహిత్యం కంటే, మౌఖిక

(జానపద) సాహిత్యం ప్రాచీనమైనది. ఎంత ప్రాచీనం అంటే, మనిషి చరిత్రంత ప్రాచీనం. మనిషికి ఈ భూమ్మీద ఎంత చరిత్ర వున్నదో, జానపద సాహిత్యానికీ అంతే చరిత్ర వున్నదనుటలో ఎటువంటి అతిశయోక్తి, అత్యుక్తి లేదు.

మనిషి సామాజిక జీవి. కనుక జానపద సాహిత్యమూ సామాజికమైనదే. జానపద సాహిత్యంలో సామెతలను సామాజిక కోణంలో వివరించే ప్రయత్నం ఈ పత్రంలో జరుగుతున్నది.

నీతిని బోధించే సామెతలు : ఇటువంటి సామెతలలో నీతి ప్రధానం. కథలలో నుంచి కూడా ఇలాంటి సామెతలు పుట్టి ప్రచారంలో ఉన్నాయి.

ఉదా : 'పులిని చూచి నక్క వాతలు పెట్టుకున్నట్లు.'

సూత్రపు సామెతలు :

ఇలాంటి సామెతలలో సామెతలు సూత్రప్రాయంగా ఉండటమే కాకుండా, ఏదైనా ఒక విషయాన్ని స్థాపించడం జరుగుతుంది.

ఉదా : 'దుష్టుని చూచి దూరంగా ఉండు.'

విధి, నిషేధ సామెతలు కూడా ఇందులోనే చేరాయి.

నిషేధం :

'ఏడ్చేవారి ఎడమచేతి కింద, కుట్టేవారి కుడిచేతి కింద కూర్చోవద్దు.'

ప్రశ్నోత్తర సామెతలు :

ఈ రకమైన సామెతలలో ప్రశ్నతో కూడిన సామెతలే కాకుండా, ఒకరు ప్రశ్న వేసినట్టు, మరొకరు సమాధానం చెప్పినటువంటి సామెతలు ఉన్నాయి.

ఉదా : 'ఆవు నలుపైతే, పాలు నలుపా?'

శబ్దాలంకార సామెతలు :

ఇలాంటి సామెతలు ప్రాసలు, అనుప్రాసలు, యమకం. మొదలగువాటితో కూడి వినసొంపుగా ఉంటాయి.

ఉదా : 1. 'సామెత లేని మాట అమెతలేని ఇల్లు'
2. 'అన్ని దానాలకంటే, నిదానమే ప్రధానం'.

ఉపమానపు సామెతలు :

వీటిని పోలిక సామెతలు అంటారు. ఒక వస్తువును మరొక వస్తువుతో పోల్చి చెప్పడం ఇందులోని విశేషం.

ఉదా : 1. 'గానుగ రోలు లాంటి నడుము'.
2. 'తల ముగ్గుబుట్టలాగుంది'.

పై సామెతల్లో నడుమును గానుగ రోలుతోను, తలను ముగ్గుబుట్టతోను పోల్చడం గమనించవచ్చు.

న్యాయం సామెతలు :

సాక్షులను, వాదులను, న్యాయాన్యాయాల్ని దృష్టిలో వుంచుకొని ఏర్పడిన సామెతలివి.

ఉదా : 'సాక్షి కాళ్ళు పట్టుకోవడం కన్నా, వాది కాళ్ళు పట్టుకోవడం మంచిది.'

సామాజిక సామెతలు :

సమాజంతో అనుబంధాన్ని కలిగియుండే సామెతలివి.

ఉదా :

లోకులు పలుగాకులు.

లేడికి లేచిందే పరుగు.

వడ్డించేవాడు మనవాడైతే, ఎక్కడ కూర్చున్నా ఒకటే.

వండుకున్నమ్మకు ఒకటే కూర, అడుక్కుతినే అమ్మకు అరవై ఆరు కూరలు.

రాజ్యం వీరభోజ్యం.

రాజుల సొమ్ము రాళ్ళపాలు.

అసలే కోతి, ఆపై కల్లు తాగినట్లు.

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు.

మితం తప్పితే, హితం తప్పుతుంది.

ముందు నుయ్యి, వెనుక గొయ్యి.

మనిషికి మాటే అలంకారం.

మంత్రాలకు చింతకాయలు రాలవు.

మాటలు కోటలు దాటును, కాలు గడప దాటదు.

మనసుంటే మార్గముంటుంది.

పెద్దల మాట చద్దుల మూట.

ఇట్లా ఎన్నో సామెతలు సామాజిక చైతన్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే సామాజిక అణచివేతను కలిగి ఉండే సామెతలూ తక్కువేం లేవు. ముఖ్యంగా స్త్రీలను అవమానించే సామెతలు గమనించవచ్చు.

ఉదా :

విధవకు మొక్కితే, 'నావలెనే వెయ్యేళ్లు వర్ధిల్లు' అన్నది.

స్త్రీ వంటింటి కుందేలు.

మోచేతి దెబ్బ - మొగుడింటి కాపురం.

మొగుడిని కొట్టి, మొగసాల కెక్కినట్లు.

ముగ్గురు ఆడవాళ్ళు కూడితే, పట్టపగలే చుక్కలు పొడుస్తాయి.

ముందు మురిసినమ్మ, పండుగ గుర్తెరుగదు.

మాటలలో పడి మగనిని మఱచినట్లు.

ఉల్లి చేసిన మేలు - తల్లి చేయదు.

అత్తమిత్తి, ఏరాలు కత్తి.

అబద్దాలాడితే ఆడపిల్లలు పుడతారు.

అమ్మ పెట్టాపెట్టదు, అడుక్కొని తినానివ్వదు.

ఆడపెత్తనం తంబళ్ళ దొరతనం.

ఆడదానికి అలుసిస్తే తలకెక్కుతుంది.

ఆలు బెల్లం, తల్లి విషం.

ఈ విధంగా మహిళల్ని అవమానపరిచే సామెతలు ఎన్నో వున్నాయి. మహిళా ఉద్యమాల కారణంగా నేడు ఎంతో చైతన్యం వచ్చింది. మహిళల్ని గౌరవించే పరిస్థితులు ఏర్పడినాయి. మహిళలపై జరిగే దారుణాలకు మూలకారణాలు ఏవో గుర్తించి, వాటిని తొలగించే ప్రయత్నాలు జరిగితే మహిళలకు మంచి రోజులు వస్తాయి. మిగతా సామాజిక సమస్యల మూలాల్ని కూడా గుర్తించి, వాటి పరిష్కార దిశగా ప్రయత్నాలు కొనసాగినప్పుడే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ సామెతలు, జాతీయాలు (2008) - సంపాదకులు : కర్ర ఎల్లారెడ్డి
2. మన తెలుగు సామెతలు (2018) - ప్రచురణ : నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం (1983) - డా॥ ఆర్వీయస్.సుందరం
4. సందర జానపదం (2017) - డా॥ ఆర్వీయస్. సుందరం
5. తెలుగు సాహిత్యం (2015) - ప్రచురణ : హైదరాబాద్ స్టడీ సర్కిల్.
6. తెలుగు సాహిత్య చరిత్ర (1998) - డా॥ ద్వానా శాస్త్రి
7. తెలుగు సర్వస్వము - బుక్3 (2017) - దేవిరెడ్డి రామకృష్ణారెడ్డి
8. జానపద విజ్ఞానాధ్యయనం - డా॥ జి.యస్. మోహన్.

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద విజ్ఞాన పరిశోధనలు – నూతన ఆవిష్కరణలు

– డా॥. తరపట్ల సత్యవెరెయుు, తెలుగుశాఖాధిపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ప్రవేశిక :

మన జన జీవన సంస్కృతికి ప్రతిబింబం జానపదం. మన ప్రాచీన జనజీవన విధానంతోపాటు ఆనాటి ఆచార సాంప్రదాయాలు ఆహార వ్యవహారాలు, సామాజిక అంశాలు ఇలా అనేకమైన విషయాలు జానపద విజ్ఞానంలో కనిపిస్తాయి. అనాదృత వాఙ్మయంగా నిరాదరణకు గురైన జానపద సాహిత్యం ఇప్పుడు నూతన ఆవిష్కరణలకు వినూత్న పరిశోధనలకు పునాదిగా నిలిచింది. మన మూల భాషకు, అసలైన అమ్మ భాషకు నిజమైన మాతృకగా నిలిచింది. కేవలం జానపదం అంటే అనాగరికుల అహారపు అలవాట్లూ కాదు, పనిపాటల సమ్మేళనంతో ఆవిర్భవించిన ఆశుకవిత్వమూకాదు. అసలైన మానవ జీవన సంస్కృతికి మూలాధారమైనదే జానపదం. అందుకే జానపద విజ్ఞానం అనేక శాఖలుగా, ఉపశాఖలుగా విస్తరించింది. అందుకే వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. కేవలం భారతదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా జానపద విజ్ఞానం నూతన ఆవిష్కరణలతో పరిఢవిల్లుతుంది.

ముఖ్య ఉద్దేశ్యం :

జానపద విజ్ఞానంపై వచ్చిన, వస్తున్న పరిశోధనలు పరిశీలిస్తే ఇంతవరకు జానపద సాహిత్యంలో గేయాలపై ఎక్కువగా పరిశోధనలు జరిగాయి. రెండవ స్థానంలో కథా సాహిత్యం, కళారూపాలపై జరిగాయి. ప్రస్తుతం జానపద విజ్ఞాన పరిశోధనల్లోను పరిశోధకుల్లోనూ నాణ్యత కొరవడింది. లోతైన పరిశోధనలు, తులనాత్మక పరిశోధనలు, ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు, శాస్త్ర సాంకేతిక విజ్ఞానానికి తగ్గట్టుగా పరిశోధనలు జరగడం లేదు. ఈ విషయాన్ని అంగీకరించకతప్పదు. క్షేత్ర పర్యటనకు వెళ్ళే పరిశోధకుల స్థాయి తగ్గిపోయింది. కేవలం పిహెచ్.డి పట్టా కోసమే పరిశోధనలు జరిగే స్థాయి పెరిగింది. అందుకే భావితరాలకు ఉపయోగపడే విధమైన జానపద విజ్ఞానంలో ముఖ్యంగా భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జానపద మూలాంశకథలు, మూలాలు, శిష్ట సాహిత్యంలో కనబడుతున్న కథలకు, ఉపాఖ్యానాలకు మూలరూపాల అన్వేషణ, ఆవిష్కరణలపై దృష్టిసారించాలి. వాటిపై విశ్లేషణాత్మక, వివరణాత్మక, తులనాత్మక, చారిత్రక, సాంస్కృతిక, వారనత్వ భాషాంశాలతోపాటు కుల విజ్ఞానం మీద పరిశోధనలు ఎలా జరగాలో, జరిగాయో వివరించే ప్రయత్నమే ఈ పరిశోధనపత్రం యొక్క ముఖ్యఉద్దేశ్యం.

ప్రధానాంశాలు :

జానపద విజ్ఞానాన్ని ఇప్పటివరకు పాశ్చాత్య, ప్రాశ్చ్య పండితులు, పరిశోధకులు విభజనలో మౌఖిక సాహిత్యం, వస్తు సంస్కృతి, సాంఘిక ఆచారాలు, ప్రదర్శన కళలు అని తెలుస్తోంది. అందులో మరలా ఆర్.ఎస్. బోగ్స్ విభజించిన గ్రూపులో విజ్ఞాన పరిధి విస్తృతమైనదిగా కనిపిస్తుంది. అందులో మరొక విభజనను గమనిస్తే ఒక్కొక్క విభాగం నుండి అనేక విభాగాలు కనిపిస్తాయి. విషయాన్ని బట్టి చూస్తే పురా కథలు, ఐతిహ్యాలు, జనప్రియ కథలు, కిన్నెర కథలు వంటివి కనిపిస్తాయి. ప్రదర్శన కళారూపాల విషయానికొస్తే భక్తి ప్రధానమైనవి, ఉభయ ప్రధానమైనవి, వినోద ప్రధానమైనవిగా గమనించవచ్చు. అలాగే గేయాల విభజనలో పౌరాణిక గేయాల నుండి హాస్య గేయాలవరకు అనేక గేయాలు కనిపిస్తాయి. ఇవన్నీ ఇప్పటి వరకు జరిగిన పరిశోధనల విభజన.

ఆధునిక కాలంలో జానపద విజ్ఞానపరిధి విస్తృతంగా పెరిగింది. జానపదం అంటే కేవలం పల్లె కాదు, నాగరీకరించబడ్డ ప్రాంతాల్లో ఉండే నగర జానపదం, పట్టణ

జానపదంగా విభజించవచ్చు. జానపద సాంస్కృతిక మూలాలు ఎక్కడ ఉంటే అక్కడ ఆ జానపదానికి ఆయా పేర్లు స్థిరపడుతున్నాయి. అలాగే మాండలిక జానపద విజ్ఞానం, కుల విజ్ఞానంలో కూడా ప్రధానమైన అంశాలు కనిపిస్తాయి. వాటితోపాటు మత సంబంధమైన అంశాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. వీటిపై పరిశోధనలు జరగవలసి ఉంది.

కులవిజ్ఞానం - భాషా పరిశీలన :

జానపద సాహిత్యంలో అనేకమైన వృత్తులకు సంబంధించిన సాహిత్యం కనిపిస్తుంది. ఆశ్రిత గాయకులు ప్రత్యేకమైన స్థానాన్ని వహిస్తారు. వారే సంచార, విజ్ఞాన గ్రంథాలయాలు. వారి నుండి, వారి కళల నుండి అనేకమైనటువంటి సాంస్కృతిక మూలాలు కనిపిస్తాయి. వారిలో దాసరులు, దొమ్మర్లు, జంగాలు, చెంచులు, ఎరుకలు, మాస్టీడీలు, గంగిరెద్ద వారు, రెల్లి వారు, పంబల వారు, బొండాల వారు, మందుల వారు, వీరు ముష్టలు, మల్లికాసుల వారు ఇలా ఎంతోమంది ఆశ్రిత కులాల వారు కనిస్తారు. వారి కుల విజ్ఞానంతోపాటు వారి భాషాపై విస్తృతమైన పరిశీలన, పరిశోధన జరగవలసి ఉంది. ఇప్పుడు జరగవలసిన పరిశోధనల్లో కులవిజ్ఞానం ప్రధానంగా తీసుకుంటే అనేక కుల పురాణాలు వెలుగులోనికి వస్తాయి. ఉదాహరణకు జాంబ పురాణం, గౌడ పురాణం వంటివి చెప్పుకోవచ్చు. వాటి సేకరణ అంత సాధ్యంకాదు. అయినా పరిశోధకులు, పర్యవేక్షకులు ప్రత్యేక దృష్టితో విశ్వవిద్యాలయాల్లో, వివిధ సంస్థల్లో పరిశోధనలకు శ్రీకారం చుట్టవలసిన అవసరం ఉంది. వాటివల్ల మన ప్రాచీన కుల సంప్రదాయాలు, భాషా సాంప్రదాయలు వాటికి సంబంధించిన అసలైన మూల రూపాలను వెలికితీసే ప్రయత్నంచేసి ఈతరానికి అందించవచ్చు.

జానుదులు - ఆహార సంస్కృతి :

ప్రస్తుతం జనపదాలలో ప్రకృతి పచ్చదనం, స్వచ్ఛదనం కనిపించడం లేదు. పల్లెలన్నీ పట్టణపు హంగులతో కనిపిస్తున్నాయి. ప్రకృతి అందమంతా కృత్రిమమై అనారోగ్య వాతావరణానికి ఆహ్వానం పలుకుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. ఆధునిక విజ్ఞానం పేరుతో పర్యావరణం కలుషితమై దుర్గంధానికి దగ్గరైంది. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ వేగం పుంజుకొని పార్శిల్ సంస్కృతి గ్రామంలో విస్తరించింది. రుతువులకు తగ్గట్లు వాతావరణానికి తగ్గట్టు ప్రకృతి వనరులు ఉపయోగించుకొని ఏకాలంలో దొరికే ఆహార పదార్థాలు ఆకాలంలో తినే గ్రామీణులు ఇప్పుడు పూర్తిగా మారిపోయారు. దానికి కారణం వేగం పుంచుకున్న ప్రపంచీకరణ వాతావరణమే అన్నది వాస్తవం.

ఇటువంటి వాతావరణంలో జనపదాలలో ఉండే మన పూర్వీకులు బ్రతికిన కాలాన్ని లెక్కవేస్తే శతాయుష్షుకు మించే బ్రతికారు. వాళ్ళు సేకరించిన ఆహార సంపద, పండించిన పంటలు, వేసిన ఎరువులు, మోసిన బరువులు, చేసిన సాగు, సాహసాలు, గుర్తుచేసుకుంటే వారు ఎన్నోరెట్లు ఆరోగ్య కరమైన జీవితంతోపాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించారు. శ్రమజీవులు ప్రకృతిలో పుట్టి, ప్రకృతిలో పెరిగి రోగాలకు మరణాలకు దూరంగా ఉండటానికి కారణం వారి ఆహారపు అలవాట్లే. ఈ సందర్భంలో ముందుచూపుతో వారు తయారు చేసుకున్న ముడిసరుకులు, దాచుకున్న ధాన్యపు నిలవలు, వాటిని ప్రకృతి వస్తువులతో నిర్మించుకున్న గాదె, పొనక వంటివి ఇప్పుడు కనబడటంలేదు. అపరాలు విషయంలో కందులు, మినుములు, పెసలు, శనగలు, ధాన్యం నిల్వ చేయడానికి వాడిన పాత్రలు, వస్తువులు ఇప్పటికీ వారి వద్ద శాస్త్ర సాంకేతిక విజ్ఞానానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అలాగే ఉప్పు, కారం వంటి వాటిని నిల్వ చేసుకోవడానికి వాడిన పాత్రలు, తీసుకున్న జాగ్రత్తలు ఒక్క సారి శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలి. ఇక పచ్చళ్ళ విషయంలో ఆవకాయ, మాగాయ, నిమ్మకాయ, దబ్బకాయ, గజ నిమ్మకాయ, చింతకాయ వంటి వాటిని నిల్వ చేయడంలో వాటిని ఉపయోగించడంలో ఆనాటి పద్ధతులపై పునఃపరిశీలన ఉంది. అవి పెట్టడంలోను, వాడటంలోను

ప్రత్యేక నియమాలు పాటించడం కూడా విశేషమే. అలాగే చేపలు, మాసం వండటానికి ఉపయోగించే పాత్రల్లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. వంటనూనె విషయంలో కూడా ఆరోజుల్లో గానుగ నూనె, వేరుశెనగ నూనె చెప్పుకోదగ్గవి అలాగే కొబ్బరి నూనె వంటివి కూడా ప్రకృతిలో దొరికినటు వంటి సహజసిద్ధమైన వనరులుగా భావించాలి. ఈ పద్ధతులపై ప్రత్యేక అధ్యయనం చేస్తే అప్పటికీ ఇప్పటికీ ఉన్న ఆరోగ్యంపై అనేక విషయాలు తెలుసుకోవడానికి వీలౌతుంది.

ప్రకృతిలో దొరికే చేపలు - రకాలు :

ప్రకృతిలో లభించే వనరులను జానపదులు ఆహారంగా ఎలా స్వీకరించారో వాటిలో ఏ ఔషధ గుణా లున్నాయో, పోషక పదార్థాలున్నాయో పరిశీలించాల్సి ఉంది. సాధారణంగా పల్లెల్లో పచ్చగా కనిపించే చేలు, చెరువులు, కాలువలు చెప్పుకోదగ్గవి. విరివిగా దొరికే రుచికరమైన చేపలను పరిశీలిస్తే వాటిలో చేదుపరిగెలు, మట్టగడసలు, కొరమేను, గొరకలు అందులో మరలా రాతిగొరకలు, మట్టిగొరకలు, సాగుడాయలు, బొమ్మి డాలు, ఉలకలు, కట్టెపరిగెలు, చీరమేను, ఆలుగులు, రామాలు, కొమ్మురాయిపాము, బొచ్చుపరిగెలు, ఇంగి రాయలు, మార్పులు, రొయ్యలు, బెందలు, నత్తలు, మొలలు ఇవన్నీ చుట్టూ ప్రక్కల ఉన్న వాతావరణంలో దొరికే సహజసిద్ధమైన కూరలుగా స్వీకరించారు.

కాయకూరలు :

ఆకుకూరల్లో ముఖ్యంగా పశువుల ఎరువులతో సేంద్రీయ పంటలుగా కనిపించే గోంగూర, తోటకూర, పొన్నగంటి ఆకు, మునగాకు, అరటిపువ్వు, కొత్తిమీర వంటివి కాలానుసారంగా వాడేవారు. ఆరోజు సహజ సిద్ధంగా లభించే కాయల్లో అరటి, బీర, గుమ్మడి, కాకర, మునగ వంటివి వాడేవారు. వీటితోపాటు తాటికాయలు, ముంజుకాయలు తినేవారు. ఇటువంటి సహజ సిద్ధమైన ఆహార పదార్థాలను స్వీకరించడవల్ల జానపదులు బలవర్ధకంగాను, ఆరోగ్యవంతులుగాను ఉన్నారని తెలస్తుంది.

జానపదుల వైద్యం :

ఈ రోజు మానవుని ఆయు ప్రమాణం తగ్గడానికి కారణం మనం తీసుకుంటున్న ఆహార పదార్థాలు, మారిన ఆహారపు అలవాట్లు. అందువల్లనే ఆరోగ్యవంతమైన ప్రపంచం కనబడదు. అనాడు జానపదులు పాటించిన ఆహార నియమాలు, తీసుకున్న పద్ధతులు గమనిస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. వాటిలో వైద్య పద్ధతులు చెప్పుకోదగ్గవి. చిన్నగా తలపోటు వస్తే సారిడాన్ వాడటం, అమృతాంజన్ రాయడం అలవాటైపోయింది. కాని ఆరోజుల్లో వంటగదే ఔషధానికి నిలయంగా ఉండేది. పరిసరాల ప్రకృతే ప్రయోగశాలగా ఉండేది. ఉదాహ రణకు తలపోటు వస్తే ఆముదపు ఆకులు తలపై వేసు కొని బట్టచుట్టుకుంటే అరగంటలో నయమయ్యేది. అలాగే జలుబు చేస్తే వేడి నీళ్ళలో పసుపు వేసి ఆవిరి పట్టేవారు. పిల్లలకు జలుబు చేస్తే ఆయుష్షు పట్టుమీద పసుపు వేస్తే తగ్గేది. పొట్టలో నులిపురుగులు ఉంటే ఆముదాన్ని ఔషధంగా ఇచ్చేవారు. ఇలా ఎన్నో అంశాలు జానపద వైద్యంలో కనిపిస్తాయి. జానదప వైద్యంలో ముఖ్యంగా నాటువైద్యం, మూలికా వైద్యం, పసరు వైద్యం, బెరడు వైద్యం, చిట్కా వైద్యం చెప్పుకోదగ్గవి. వీటిపై పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది. జనపదాలలో కనిపించే ప్రతిమొక్క ఔషధగుణం కలిగియున్నదే.

మత విధానం - ఆరాధన పద్ధతులు :

జానపద విజ్ఞానంలో గ్రామ దేవతల మీద పరి శోధనలు ఎక్కువగానే జరిగాయి. వాటితోపాటు మత విధానంపై అనేక అంశాలపై పరిశోధనలు జరగాల్సి ఉంది. తీర్థాలు, తిరుణాళ్ళు వాటి నేపథ్యం, నమ్మకాలు, నియమాలు వాటి నేపథ్యాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాల్సి ఉంది. అంతేకాకుండా మానసిక శాస్త్ర

అధ్యయనంతోను మానవీయ కోణంలోను సామాజిక స్పృహతోను అధ్యయనం చేయాల్సిఉంది. అప్పుడే అసలైన ఆరాధనా పద్ధతులకు మూలమైన భావనలను గుర్తించ గలుగుతాం.

సాంఘిక అంశాలు - మానవీయ కోణం :

సమాజంలో ఎంతోమంది కళాకారులు ఆయా కళా రూపాల ద్వారా సామాజిక చైతన్యాన్ని, భక్తి తత్వాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించారు. కాని వారి బ్రతుకుల్లో చీకటే రాజ్యమేలుతుంది. కొంతమంది కళారూపాలతో పాటు కాలగర్భంలో కలిసిపోయారు. మరికొంతమంది మిణుకుమిణుకుమంటూ చమురులేని దీపంలా ఆకలి బాధతో అలమటిస్తున్నారు. వారు నేర్చుకున్న కళ ఈరోజు కనిపించడంలేదు, వారు పడ్డ శ్రమను గుర్తించేవారు లేరు. అందుకే వారి సాంఘిక జీవన విధానంపై జీవన శైలిపై విస్తృతమైన సేకరణ, పరిశోధనలు జరగాలి. ఆ కుటుం బాల నేపథ్యాన్ని వారి వారసత్వ నేపథ్యాన్ని సేకరించ గలగాలి. సాంఘిక స్థితిగతులను సామాజిక హోదాను, కుల సంప్రదాయాన్ని, మత సంప్రదాయాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మానవీయ కోణంతో అందరూ ఒక అడుగు ముందుకు వేయాలి.

నూతన ఆవిష్కరణలు :

ప్రపంచీకరణ విజ్ఞానపథంలో పరిశోధనలుకూడా కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నాయి. కాలానికి తగ్గట్టు శాస్త్ర సాంకే తిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పరిశోధన పద్ధతుల్లో మార్పులు వచ్చాయి. అందులో భాగంగా ఇప్పుడు జాన పద విజ్ఞానం తులనాత్మక అధ్యయనంతో ముందుకు సాగాలి. ముఖ్యంగా విభిన్న కోణాలలో జానపద విజ్ఞానాన్ని పరిశీలించి పరిశోధించాలి. అందులో హిస్టారికల్ ఫ్లోక్‌లోర్, కల్చరల్ ఫ్లోక్‌లోర్, యాంత్రోపాలజికల్ ఫ్లోక్‌లోర్, ఆర్కి యాలాజికల్ ఫ్లోక్‌లోర్, లింగ్విస్టిక్ ఫ్లోక్‌లోర్, కంపేరేటివ్ ఫ్లోక్‌లోర్, గ్లోబల్ ఫ్లోక్‌లోర్‌గా విభజించి నూతన ఆవిష్క రణకు నాంది పలకాలి. అప్పుడే జానపద విజ్ఞానం యొక్క ఆవశ్యకత, ప్రాధాన్యత, ప్రత్యేకత ప్రంచానికి తెలస్తుంది.

ముగింపు :

జానపద విజ్ఞానంపై జరగవలసిన పరిశోధనల్లో ముఖ్యంగా కుల విజ్ఞానం, మత సాంస్కృతిక విజ్ఞానం, వైద్య పద్ధతులు, భాషాంశాలు, ఆహార సంస్కృతి, సాంఘిక అంశాలు, ఆరాధనా పద్ధతులు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టవలసి ఉంది. కేవలం నామకాగా పి.హెచ్‌డి పట్టం కోసం కాకుండా రేపటి తరానికి విజ్ఞానాన్ని అందించే విధంగా నూతన ఆవిష్కరణలకు శ్రీకారంచుట్టి జానపద విజ్ఞానాన్ని వాటి విశిష్ఠతను భావితరానికి అందించే ప్రయత్నంచేద్దాం.

ఆధార గ్రంథాలు :

1) ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆచార్య ఆర్వీఎస్ సుందరం
2) తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు
3) జానపద ప్రదర్శన కళారూపాలు - డా॥ తరపట్ల సత్యనారాయణ
4) జానపదం - డా॥ తరపట్ల సత్యనారాయణ
5) కోనసమీ తంబుర కథలు - డా॥ తరపట్ల సత్యనారాయణ

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాకి పడిగెల పటం కథ

– పల్లెమోని జయమ్మ, టి.జి.టి., తెలుగు ఉపాధ్యాయురాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు), జడ్చర్ల గ్రామం & మండలం, మహబూబ్‌నగర్, తెలంగాణ.

కాకి పడిగెల వారు ముదిరాజ్ కులం వాళ్లకు ఆశ్రిత కులం. ఒక సంవత్సరం తప్పించి ఒక సంవత్సరం తమ హక్కు గల గ్రామాలకు పోయి పటం ఆధారంగా పాండవులకు సంబంధించిన కథలు చెప్పి త్యాగం అడుక్కొని జీవితాన్ని గడిపే వృత్తి కళాకారులు ఈ కాకిపడిగెల కళాకారులు.

వీళ్ళు వరంగల్ జిల్లా వివిధ ప్రాంతాలలో నివాసం ఏర్పరచుకొని సంవత్సరంలో ఎనిమిది నెలలు దేశాలు మీద కథలు చెబుతూ సంచార జీవనం కొనసాగిస్తూ - కేవలం నాలుగు నెలలు మాత్రం తమ ఇండ్ల దగ్గర ఉంటారు.

వీరు వరంగల్ జిల్లాలోనే కాక కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో కూడా ఉన్నట్లు సమాచారం.

కాకిపడిగెల కులోత్పత్తి :

పూర్వం ముదిరాజ్ వాళ్లలో ఐదుగురు అన్నదమ్ములు కలిసి పెందోట వనం చేసి ఆ వనానికి ఈ ఐదుగురు అన్నదమ్ముల్ని కావలి (కాపలా) ఉంచారు. అయితే ఒక రోజు అవుసలీ బ్రహ్మ (కంసాలి) పండ్లు పెట్టమని వీరి గోటకు వచ్చాడు. అతనికి పండ్లు పెట్టలేదు.

దీనితో అవుసలి బ్రహ్మకు కోపం వచ్చి ఒక బంగారు కాకిని చేసి ప్రాణం పోసి పెందోట వనంలోని పండ్లన్నీ పాడు చేయడానికి తోట మీదకి పంపించాడు. ఆ కాకి పెందోట వనంలోని పండ్లన్నీ తింటూ పాడుచేస్తుంటే ఆ ఐదుగురు ముదిరాజ్‌లకు కోపం వచ్చింది. అందులో చిన్నోడు ఒక బాణం తీసి ఆ కాకికి వేస్తే అది రెక్కలు విరిగి పడిపోయింది.

అమ్మకు కోపం వచ్చి "ముదిరాజ్ వాళ్లం, మనం మాసం తినేవాళ్లం కాదు. సూర్యుణ్ణి చూసి సుక్కబొట్టు పెట్టం, చంద్రుణ్ణి చూసి చంద్రవంక పెట్టం, వరాహావతారం (పంది) ఎదురొచ్చిందంటే ఏడు నూతుల్లల్ల స్నానం వచ్చేవాళ్లం. అట్లాంటి నీవు కాకిన చంపి కాకిని పట్టుకొని వచ్చినావు కాబట్టి కాకి పగిడెల వానిపై పక్కకుండాలి అని శపించింది.

దానితో అమ్మా! నీవు శపించావు కాబట్టి నేను పక్కకే ఉంటాను అని అన్నం తినకుండా పక్కకుంటే అయ్యో కొడుకు అన్నం తినడం లేదని - కొడుకా! ఎన్ని రోజులు ఇట్ల అన్నం తినకుండా పక్కకుంటావు బాడ్డా అని అన్నం తీసుకుపోయి అన్నం పెడుతుంది. అప్పుడు అమ్మా! నీవు పక్కకు కూర్చొని అన్నం పెట్టినావు కాబట్టి నీ ఇంట్లో నాకు అన్నం సొత్తు ఉంటుంది. నీవు తెచ్చి పెడితేనే తినాలి కాని... నేను నీ ఇంట్లోకొచ్చి తినను. అంటే అప్పుడు ఆ తల్లి మన ఇండ్లళ్ల ఎవరైనా పుడితే పురుడు కట్టం, చస్తే చావుకట్టం నీకు ఇస్తం అని కట్టుచేసి పాండవులంటే మనకిష్టము కదా! వాళ్లకు సంబంధించిన వృత్తాంతము చెబుతూ మమ్ముల్ని అడుక్కొని బ్రతుకు బిడ్డ అని చెప్పింది. అప్పటి నుంచి కాకి పడిగెల వాడై పాండవుల కథ చెబుతూ జీవనం గడుపుతున్నాడు.

ఇట్లా కొంతకాలానికి ఊరికే నోటితో చెప్పితే సరిగా అర్థమయితలేదని గుడ్డ మీద మహాభారతానికి సంబంధించిన బొమ్మలు వేయించి బొమ్మలు చూపిస్తూ కథ చెప్పడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదేవిధంగా కథ చెబుతూ ముదిరాజ్ వాళ్లను త్యాగం / తేగం అడుక్కొని జీవిస్తున్నారు.

దేశాల మీదకు పోయే ముందు చేసుకునే అనుష్టానం :

దసరా పండుగ వెళ్లిన తర్వాత తమతమ మేళాలను

సమకూర్చుకొని దేశాల మీదికి పోయే ఒకరోజు ముందు ఎవరికి వారు తమ ఇంట్లో పెద్దమ్మ పండుగ చేస్తారు. ఆ రోజు ఇల్లు శుభ్రంగా అలుక్కొని అందరూ స్నానాలు చేసి ఇంట్లో నైరుతీ దిశలో రెండు కట్టెలు పాతి తూర్పుకు ముఖం ఉండేవిధంగా పటం కట్టి, పటంలో ఉండే పెద్దమ్మ బొమ్మను తీసి పాలతో వండిన పరమాన్నం బదులుగా పెడతారు.

ఈ పడులు పెద్దమ్మకు, ఐదుగురు పాండవులకు, కృష్ణదేవునికి పెట్టి ఊదిబత్తీలు ముట్టించి, పప్పు ఫలహారం ఆరగింపు చేసి, కొబ్బరికాయ కొట్టి పెద్దమ్మకు మొక్కు తారు. అవ్వా! పెద్దమ్మ తల్లి! మేము దేశాల మీదికి పోతు న్నాము. మమ్మల్లి చల్లగా చూడాలి. మా పిల్లల్ని మంచిగ చూడాలి. మాకు ఏ హాని కలగకుండా చూడాలి' అని మొక్కి కోడిని లేదా ఏటను కోస్తారు. తర్వాత పడులను కుటుంబ సభ్యులు తింటారు.

తర్వాత ఆ కోసిన కోడి లేదా ఏట మాంసం వండుకొని ముందుగా ఒక డొప్పలో ఆయాలు సాయాలు (ముఖ్య మైన భాగాలు) పెద్దమ్మ దగ్గర పెట్టి ఆరగింపు చేసి ఆ తర్వాత తింటారు. సాయంత్రం సమయంలో పటం చుట్టి జాగ్రత్తగా పెడతారు.

ఈ విధంగా చేసిన తెల్లారి పొద్దున్నే లేచి మూటాముల్లె సద్దుకొని మద్దెల, హార్మోనియం పట్టుకొని మేళం మొత్తం ముందుగా అనుకున్న ఊరికి పోతారు.

ఊరికిపోయి ముందుగా కులపెద్ద ఇంటికిపోయి నమస్కరించి ఆయన ఇంటి దగ్గరనే వీళ్ల సామాగ్రి పెట్టి' అయ్యా! మీ అడ్డివాళ్లమొచ్చినాము. మేము ఇంత మందిమి వచ్చినాము. మాకు భోజన వసతి, ఉండటానికి ఇల్లు వసతి కల్పించాలని" కోరతారు. ఆ కులపెద్ద సరే అని కులం వాళ్లందరికీ తెలియజేసి భోజన వసతి ఏర్పాటు చేస్తారు.

ఉండటానికి కులపెద్ద ఇంటి దగ్గర చోటు లేకుంటే వేరే ఇళ్లలో వసతి కల్పిస్తారు. అంతకు వసతి లేకుంటే వీళ్లే ఒక గుడారం ముదిరాజ్ ఇండ్ల సమీపంలో వేసుకుని ఉంటారు. ఈ సమయంలో వీళ్లకు రోజుకు ఒకరు బియ్యం, ఉప్పు, పప్పులు ఇస్తారు. కథ చెప్పినన్ని రోజులు కల్లు లేదా సారాకు కూడా డబ్బులిస్తారు.

త్యాగం నిర్ణయించుకునే విధానం :

వీళ్లు పోయి కలిసిన తెల్లారి కులపెద్ద అందరినీ కూడగడతాడు. కాకిపడిగెల వాళ్లు ఒక చాపవేసి అందులో మద్దెల, హార్మోనియం సహాయంతో మహాభారతానికి సంబంధించిన పాటలు పాడి వినిపించిన తర్వాత ముది రాజ్ వాళ్లు అందరూ కలిసి ఆలోచించుకుని త్యాగం నిర్ణయం చేస్తారు.

తర్వాత ముదిరాజ్ వాళ్లను పొగుడుతారు. ఫలానా గ్రామం ముదిరాజ్ సంఘం వాళ్లు మనకు త్యాగం / ఫలానా ఇంత దయలతలచి ఇస్తున్నారు కావున వాళ్ల కుటుంబం భార్యాబిడ్డలు సల్లగ ఉండాలి. పెద్దమ్మ దీవెన కలిగి అందరూ శుభంగా ఉండాలి. జయీ భవ, విజయీభవ అని అట్లాగే పంచ పాండవులు మరియు కృష్ణదేవుని కృప వల్ల అందరూ మంచిగుండాలే జయీ భవ, విజయీభవ అని పొగుడుతారు.

అయితే వీళ్ళకు ఒప్పుకున్న త్యాగం ఎన్ని ముదిరాజ్ ఇండ్లయితే ఉంటాయో ఆ ఇండ్ల వాళ్లు వాళ్ళ ప్రకారం చేసుకొని ఇస్తారు.

ప్రదర్శనా విధానం :

కాకి పడిగెల వారు త్యాగం నిర్ణయించేసుకున్న తర్వాత మంచిరోజు చూసి కథ ప్రారంభిస్తారు.

సమయం :

కాకి పడిగెల వారు సాధారణ పటం కథను మధ్యాహ్నం పూటనే చెబుతారు. అంటే ఉదయం పదకొండు గంటలకు ప్రారంభించి ఐదు గంటల వరకు ముగిస్తారు. కళ్లాల సమయంలోనైతే గ్రామ ప్రజల పొద్దందాక పనుల మీద ఉంటారు కాబట్టి ఆ సమయంలో రాత్రిపూట చెబుతారు.

సందర్భం :

కాకి పడిగెల వారు దసరా పండుగ వెళ్లిన తర్వాత బయలుదేరి రోహిణి కార్తె ప్రవేశం వరకు దేశాల మీద ఉండి కథలు చెబుతారు. వారి హక్కుల గల గ్రామాలు తిరుగుతూ త్యాగం / తేగం కట్టడి తీసుకుంటూ కథలు చెబుతారు.

కాకిపడిగెల వారు పటం కథతోపాటు.... కొన్ని యక్ష గానాలు, నాటకాలు కూడా వేస్తారు. పటం కథ చెప్పిన తర్వాత ముదిరాజ్ కోరిక మేరకు డబ్బులు తీసుకొని నాటకాలు వేస్తారు.

ప్రదర్శించే రోజులు - కథలు :

వీరు పటం కథ ముదిరాజ్ వాళ్ల ఇష్టానుసారం ఐదు రోజులు / తొమ్మిది రోజులు చెబుతారు. ఐదు రోజులు చెబితే ఐదు రోజులకు కథ చెప్పి ఐదవ రోజు సాయంత్రం పెద్దమ్మ పండుగ చేస్తారు. తొమ్మిది రోజులు చెబితే తొమ్మిదవ రోజు కథ చెప్పి ఆరోజు సాయంత్రం పెద్దమ్మ పండుగ చేస్తారు.

ఐదు రోజులు పటం కథ చెబితే సాధారణంగా మొదటిరోజు సహదేవుని కల్యాణం, రెండోరోజు సుభద్ర కల్యాణం, మూడోరోజు గరిమళ్లకోట, నాల్గవరోజు ఆదిపర్వము ఐదోరోజు సభాపర్వం చెబుతారు

లేదా ఇవేకాకుండా ముదిరాజ్ వాళ్లు మహా భారతంలోని వేరే ఏ కథ చెప్పమన్నా ఆ కథ చెబుతారు.

ఒక తొమ్మిది రోజులు పటం కథ చెప్పినట్లయితే - రెండు రోజులు సహదేవ కల్యాణం, ఒకరోజు సుభద్ర కల్యాణం, రెండు రోజులు గరిమళ్లకోట, రెండు రోజులు సభాపర్వం, రెండు రోజులు విరాటపర్వం చెబుతారు లేదా పద్మవ్యూహం, విరాటపర్వం, గోవుల చెరకు సంబంధించిన కథ చెబుతారు.

స్టేజి ఏర్పాటు :

కాకి పడిగెల వారు ముదిరాజ్ వాడలోనే విశాలమైన స్థలంలో పటం కట్టే విధంగా రెండు గుంజలు నాటి పటం కట్టి కింద చాపవేసుకొని చెబుతారు. ఇక నాటకాలు ప్రదర్శిస్తే మాత్రం చుట్టూ నాలుగు గుంజలు నాటి పదరాలు కట్టి పైన ఒక పరదా వేసి కింద బల్లలపైన చెబుతారు.

ప్రదర్శకుల వేషధారణ :

పటం కథ చెప్పేటప్పుడు సాధారణ వేషధారణతోనే చెబుతారు. అంటే మామూలుగా ధోతి, కమీజు వేసుకుని నడుముకు ఒక పంచె కట్టుకొని చెబుతారు.

పటం తయారీ :

వీరి పటాన్ని నకాశివాళ్లు తయారు చేస్తారు. ముందుగా వీల్ల గుడ్డ ప్రత్యేకంగా నేయించి ఇస్తే వాళ్లు పద్దెనిమిది వారాలకు సంబంధించిన బొమ్మలు వేసిస్తారు. అయితే ఈ పటాలు వేసి వాళ్లకు పటం వేసిన తర్వాత ఏదో ఒక చెడు జరుగుతుందిట. అంటే ఆ ఇంట్లో ఎవరైనా చనిపోవడం గానీ లేదా అతనే చనిపోవడం గానీ జరుగు తుందట. అయితే ఇలా జరగకుండా ఉండటానికి నియమ నిష్టలతో ఉండి పటాన్ని గీసి మంత్ర తంత్రాలు చేసుకుంటూ ఉంటే మాత్రం చెడు నుంచి కాపాడు కోవచ్చు.

ఈ పటం వేసేవారు చేర్యాలలోనూ, అవిశపురంలోనూ ఉన్నారు. పటం నలభై మూరల పొడవుండి రెండు మూరల వెడల్పు ఉంటుంది. పటాల చివరలో కంక కట్టెలు గానీ, తునికి చేపగానీ, జిల్రేగ కలిగిన కర్రతో చేసిన గుండ్రటి కట్టెలు ఉంటాయి. దానికి ఈ పటం చుట్టి ఉంటుంది. కథ చెప్పిన తర్వాత పటాన్ని గట్టిగా చుట్టి దానికి ఒక వర్క్ కాగితం (ప్లాస్టిక్ పేపర్) చుట్టి కురవని మరియు ఎలుకలు లేని ప్రదేశంలో పెడతారు.

మేళం ఎంపిక :

దేశాల మీదికి పోయే ముందు మేళాలుగా తయారవు తారు. వారివారి కంఠాలను బట్టి నైపుణ్యాన్ని ఎంచుకొని మేళం తయారవుతారు. పటం కథ అయితే ముగ్గురు లేదా నాగకాలకు అయితే ఎనిమిది తయారవుతారు.

పటం కథ చెప్పేటప్పుడు ముగ్గురు లేదా నలుగురు ఉంటారు. ముగ్గురు ఉన్నట్లయితే ఇకరు ప్రధాన కథకుడు, మరొకరు సహకథకునిగా వ్యవహరిస్తూ తాళాలు లేదా మద్దెల వాయిస్తారు. ఇంకొకరు తాళాలు వాయిస్తారు. నలుగురైతే ఒకరు ప్రధాన కథకుడు, ఒక సహకథకుడు, ఒకరు మద్దెల, ఒకరు తాళాలు వాయిస్తారు.

కథా ప్రారంభం :

త్యాగం నిర్ణయం అయిన తర్వాత కులపెద్ద ఇంటికి సమీపాన గానీ లేదా ముదిరాజ్ వీధిలోనే కొంచెం విశాలమైన స్థలంలో గానీ ఒక స్టేజీ ఏర్పాటు చేసుకొని మంచిరోజు చూసుకుకొని అంటే ఎక్కువగా విదియ, తదియలలోగాని లేదా అష్ట నవమిలు రాకుండా చూసి సోమ, బుధ, శుక్ర వారాల్లో గానీ కథను ప్రారంభిస్తారు.

కథ ప్రారంభించే ముందు పటం కట్టి పటంలోని పెద్దమ్మ బొమ్మ తీసి దానిముందు కొబ్బరికాయ, పూలు, ఊదిబత్తీలు, మంగళహారతి, నెమలి ఈకల కట్ట పెట్టి నెమలి ఈకల కట్టతో పటాన్ని తుడిచినట్లు వేసి ముందుగా గణపతి ప్రార్థన, సరస్వతి ప్రార్థన చేస్తారు. తర్వాత పెద్దమ్మ ముంగిట ప్రధాన కథకుడు కొబ్బరికాయ కొట్టి ఆ రోజు ఏ కథ అయితే చెబుతాడో ఆ కథకు సంబంధించిన బొమ్మలను తీసి ఉంచి కథ ప్రారంభిస్తాడు.

నాటకాలు ప్రదర్శించే సమయంలో కూడా రంగస్థలం మీద ఒక కొబ్బరికాయ కొట్టి ప్రదర్శన ప్రారంభిస్తారు.

ప్రధాన కథకుడు కథ చెబుతుంటే సహ కథకుడు సందర్భాన్ని బట్టి వివరిస్తాడు. కథను అనుగుణంగా ప్రధాన కథకుడు కట్టెతో బొమ్మలు చూపిస్తూ వివరిస్తుంటాడు. ఈ విధంగా కథ చెబుతుంటే మద్దెల, తాళాలు వాయిస్తారు.

వీరు ఐదురోజులు గానీ తొమ్మిది రోజులు గానీ కథ చెపితే మధ్యమధ్యలో రెండురోజులకొకసారి విశ్రాంతి తీసుకుంటారు. చివరిరోజు సాయంత్రం పెద్దమ్మ పండుగ చేస్తారు. నాటకాలు ప్రదర్శిస్తే వేషధారణ చేసుకొని ప్రత్యేకంగా స్టేజీ ఏర్పాటు చేసుకుని ప్రదర్శిస్తారు.

ప్రదర్శనలోని అనుష్టానాలు :

వీరు ప్రదర్వన ఇచ్చేటప్పుడు మధ్యమధ్యలో కొన్ని అనుష్టానాలు నిర్వహిస్తారు. పూర్వకాలంలో కౌరవులు చనిపోయేటప్పుడు ఆ సందర్భంలో ఒక కోడిని కోస్తారు. అలాగే ద్రోణుడు చనిపోయిన దగ్గర, సైంధవుడు పడిపోయిన దగ్గర కోడిని కోస్తారు.

సహదేవ కల్యాణం సమయంలో పెండ్లిలాగా చేసి కట్నాలు చదివించమని కట్నాలు తీసుకుంటారు. అలాగే శశిరేఖ పరిణయం సమయంలో కూడా పెండ్లి లాగా చేసి కట్నాలు చదివించమని కట్నాలు తీసుకుంటారు.

త్యాగం కథల అనంతరం :

త్యాగం కథలు చెప్పిన తర్వాత వేరే వాళ్లు ఎవరు చెప్పమన్నా కథలు చెబుతారు. కానీ ముదిరాజ్ వాడలోనే కథలు చెబుతారు. కథ మధ్యలో ఎవరైతే కథ చెప్పిస్తారో వాళ్ళ పేర్లు చదువుతారు. ఇలాంటి సమయంలో ఐదు వందల పదహారు నుంచి వెయ్యి నూట పదహార్లు తీసుకుంటారు.

ఇక చావుకథలు చెప్పినట్లయితే చనిపోయిన వారికి ఉండే బంగారం, వెండి కడాలు ఉంటే అవి ఇవ్వమని తీసుకుంటారు. చనిపోయిన వారి మీద ఆభరణాలు లేకపోతే కథ చెప్పినందుకు వాళ్లు ఆశ్రితుని బట్టి (వ్యక్తిని బట్టి) ఎంత ఇచ్చినా తీసుకుంటారు. కొందరు మేకలు, గొర్లు కూడా ఇస్తారు.

ఆర్థిక పరిస్థితి :

కాకి పడిగెల వారి స్థితిని గమనించినట్లయితే వెనుకటికి ఇప్పటికి కొంచెం మెరుగుగా ఉన్నట్లు చెప్పవచ్చు. ఎందుకంటే.... వెనుకట నూట పదహార్లు త్యాగం ఇస్తే ఇప్పుడు ఐదు వేలు, పదివేలు ఇస్తున్నారు. కానీ చాలా మందికి పక్కా గృహాలు మాత్రం లేవు. గడ్డితో కప్పబడిన ఇండ్లే ఉన్నాయి. గతంలో మాదిరిగా కంటే కళాకారుల సంఖ్య కూడా తగ్గుతుంది. కొందరు యువకులు ఇతర వృత్తులను చేపట్టి జీవనం సాగిస్తున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానద విజ్ఞానంలో ఆశ్రిత సాహిత్యం - పి. సుబ్బాచారి.
2. పౌరాణిక జానపద గేయాలు - ఒక పరిశీలన - టి. లక్ష్మినర్సయ్య.
3. పటం కథలు - తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ముద్రణ.
4. కళా తెలంగాణం - తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ముద్రణ.
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదకళలు, కళారూపాలు, వాద్యపరికరాలు

– డా॥. కందేపి రాణిప్రసాద్, సిరిసిల్ల.

జానపద కళలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, జానపద సాహిత్యం మొదలైన వాటన్నిటినీ కలిపి 'జానపద విజ్ఞానం' అంటారు. జానపదుల తరతరాల సంస్కృతిని తెలియచెప్పేదే జానపద విజ్ఞానం అవుతుంది. జనపదం అంటే ఊరు, దేశం, ప్రజలు నివసించే ప్రాంతం అనే అర్థాలున్నాయి. జానపదులు అనే పదాన్ని గ్రామీణులు అనే అర్థంలో ఎర్రన అరణ్యశేషంలో వాడారు. జానపద విజ్ఞానం అనే పదం ఆంగ్లంలో ఫోక్‌లోర్ అనే మాటకు సమానార్థకంగా వాడుతున్నారు. డబ్ల్యూ.జె.థామస్ అనే ఆంగ్ల జానపద విజ్ఞాన శాస్త్రవేత్త 'ఫోక్‌లోర్' అనే పదాన్ని వ్యవహరించారు. జానపద విజ్ఞానాన్ని శాబ్దిక కళ లేదా వాగ్రూప కళ అని విలియమ్ ఆర్.బాస్కమ్ అనే శాస్త్రవేత్త పేర్కొన్నారు. ఇంకా ఇలా నిర్వచించారు - "మానవ శాస్త్ర పరిభాషలో జానపద విజ్ఞానమనగా మౌఖిక ప్రచారమున గల పుక్కిటి పురాణములు, ఐతిహ్యములు, జానపద కథలు, సామెతలు, పొడుపుకథలు, కవిత్వము మరియు కళాత్మక వ్యక్తీకరణము గల అనేక ఇతర ప్రక్రియలు." (Standard dictionary of folklure, mythology and legend, Vol.I Ed. Marina Leach P.No.396) జానపద విజ్ఞానంలో వారి భాష, సాహిత్యం, నమ్మకాలు, ఆచారాలు, పండుగలు, దుస్తులు, కళలు, వంట, వైద్యం, కుట్లు, అల్లికలు వంటివన్నీ చేరతాయి.

జానపద కళలకు తెలుగుభూమి పండిన పొలం లాంటిది. ఎన్నోరకాల జానపదకళలు తెలుగు నేలను సుసంపన్నం చేశాయి. ప్రాచీన కాలంలో వినోదం కోసం సాధారణ ప్రజలకు జానపద కళలు తప్ప మరొక మాధ్యమం లేదు. ప్రావీణ్యులైన కళాకారుల కళలు రాజమహళ్ళకు, రాజులకు పరిమితమయ్యేవి. అవి సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేవి కావు. జన సామాన్యానికి అందుబాటులో ఉండి వారి జీవితాల్నే వస్తువులుగా తీసుకొని ప్రదర్శింపబడేవి జానపదకళలే. అంతేకాక మన పురాణాలు అన్నింటిని దృశ్యంగా మలిచి మామూలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చి, వారికి పురాణాల పట్ల అవగాహన కలిగించింది కూడా ఈ జానపద కళలే. తెలుగురాష్ట్రాల్లో ఎన్నో జానపద కళలు ఈనాటికీ సజీవంగా ఉండి, యుగయుగాలుగా వాటి వైభవాన్ని చాటుతున్నాయి. ఎప్పటినుండి ఈ కళలు ఆరంభమయ్యాయో చెప్పడానికి సరియైన ఆధారాలు ఏమీ లేవు. కాని జానపద సాహిత్యమే జానపద కళలకన్నా ముందుందని మాత్రం చెప్పడానికి అవకాశమున్నది. సంస్కృతి కొంత పరిణామ దశను చేరుకున్న తర్వాతే జానపద కళలు క్రమంగా జీవం పోసుకొని ఉండవచ్చు. ఆధునిక నాటకాలకు జానపద నాటకాలే మూలాలు. రెండువేల సంవత్సరాల క్రితందిగా భావిస్తున్న భరతుని నాట్యశాస్త్రంలో దేశి నాటక రూపక ప్రక్రియల గురించిన వివరాలు ఉన్నాయి. క్రీ.శ.1200 ప్రాంతం నాటి పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్ర, బసవ పురాణాలను దేశి సాహిత్యంలో రచించాడు. ద్విపద ఛందస్సు జానపద సాహిత్యానికి దగ్గరగా ఉంటుంది. చాలా జానపద గేయాలలో ఈ ఛందస్సు రూపాలు ఉంటాయి.

జానపదుల కళారూపాలు నాటకరంగానికి మాతృకలై విలసిల్లాయి. ఈ కళారూపాలను ఎక్కువగా ప్రదర్శించేది భిక్షుక గాయకులే. జానపద భిక్షుక గాయకుల వలననే జానపద సాహిత్య ప్రక్రియలు ఈనాటికీ నిలిచి ఉన్నాయి. ఈ భిక్షుక గాయకులు సంచారశీలురు. సంచారశీలురైన ఈ భిక్షుక గాయకులు తమ భిక్షావృత్తి ద్వారా శైవ, వైష్ణవ, శాక్తేయాది మతప్రచార సాహిత్యాన్ని తమ గానంలో ఇమిడ్చి పాడుతుంటారు. ఈనాటికి కూడా భిక్షుక గాయ

కులే జానపద సాహిత్య సంరక్షకులు. ఒక్కొక్క కులాన్ని ఆశ్రయించుకొని ఒక్కొక్క భిక్షువులు ఉండేవారు. మతప్రచార దశలో ఆయా మతాలు, అనుసరించిన కులాల వారిని కీర్తిస్తూ ఆయా గ్రామాలు తిరుగుతూ పాటలు పాడుతూ కథాగానం చేస్తూ జీవించేవారు. గానంలో మార్గ, దేశి అనే రెండు పద్ధతులున్నాయి. సంగీత శాస్త్రబద్ధమైన పాటలు పాడే విధానానికి 'మార్గ పద్ధతి' అని పేరు. జనసామాన్య ప్రజలను ఆనందపరిచే గాన పద్ధతే 'దేశిపద్ధతి'. ఈ దేశి గానమే జానపదులకు ఆనంద పారవశ్యం కలిగించే కళ. ఒకరు పాడితే వైయుక్తికం అంటారు. హరిదాసులు, బాలసంతులు వీరికి ఉదాహరణలు. ఇద్దరు లేక ముగ్గురు కలిసి పాడినా లేదా కథలు చెప్పినా యుగళమవుతుంది. శారదగాళ్ళు, ఒగ్గులు, బుడిగెజంగాలు వీరికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. గొరవయ్యలు, ఉరుములవాళ్ళు, వీరముష్టలు, భాగవతుల వాళ్ళను సమిష్టి గానానికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. జానపద భిక్షుక గాయకులు ఆయా సందర్భాలను బట్టి నృత్యగానాలు చేస్తూ సంచార జీవితం గడుపుతారు. వారి కుటుంబాలు, పిల్లా జెల్లా, ఇళ్ళు, గొడ్డు గోద - వాద్యాలు, వేషధారణ వస్తువులతో సహా వారితోపాటు గ్రామగ్రామం పయనిస్తుంటాయి. భిక్షుక గాయకుల్లో ప్రతివ్యక్తికి గానంతోపాటు వాద్యవాదనంలో నైపుణ్యం ఉంటుంది. ఇవి మొదట్లో ప్రచారం కోసం మొదలైనప్పటికీ కాలక్రమాన పొట్టకూటికి పనికొచ్చాయి. ఈ భిక్షుక గాయకులను శైవ, వైష్ణవ, శాక్తేయ, సర్వకుల, హరిజన, గిరిజన, భిక్షుక గాయకులుగా వర్గీకరించవచ్చు. కథాత్మకం, కథావిరహితం, దీర్ఘకాలిక కథాత్మకం, లఘు కథాత్మకం, ప్రదర్శనాత్మకం, పటప్రదర్శనం, నృత్య రహితం, నృత్యసహితం, ఆహార్యసహిత, ఆహార్యరహిత, సంభాషణాత్మకం వంటి అనేక పద్ధతులు భిక్షుక గాయకులలో కనిపిస్తాయి.

ఆయా కులాల వారిని ఆశ్రయించుకొని జీవించే భిక్షుక గాయకులను ఈ క్రింది పట్టిక ద్వారా గమనించవచ్చు.

1. బ్రాహ్మణులను - విప్రవినోదులు
2. వైశ్యులను - మైలారు భటులు, వీర ముష్టలు
3. రెడ్డి కమ్మ వెలమలను - పిచ్చుక కుంట్లు, సాతానులు
4. యాదవులను -మందెచ్చులు, పొడ పోతుల వాళ్ళు, బొమ్మల వాళ్ళు, పూజ గొల్లలు, తెరచీరల వాళ్ళు, పెద్దింటి గొల్లలు, బైకానివాళ్ళు, ఒగ్గులు, బీరన్నలు, రాజన్నలు
5. కురుమలను - బీరప్పలు, గొరవయ్యలు, మైలారు భటులు, ఒగ్గులు
6. గొండ్లవాళ్ళను - గొడశెట్టీలు, జెట్టీలు
7. పద్మశాలీలను - కూనపులివాళ్ళు, వడిగె రాజులు, సాధనాశూరులు
8. విశ్వకర్మలను - రుంజలు, ఆవజకాండ్రు
9. ముదిరాజులను - పాండవుల వాళ్ళు, కాకి పడిగెలవాళ్ళు
10. కుమ్మరివాళ్ళను - పెక్కర్లు

భిక్షుక గాయకులు ఆయా కులాలకు, తెగలకు సంబంధించిన కులోత్పత్తి కథలను చెపుతూ, వారిని సంతోషపెట్టి తాము జీవితాన్ని సాగిస్తున్నారు. వారిలో మందెచ్చుల వాళ్ళు, కొండరెడ్లు, ఆసాదివాళ్ళు, పంబాల వాళ్ళు, వీరవిద్యావంతులు, పిచ్చుకకుంట్లు, పరిక ముగ్గుల వాళ్ళు, పాములవాళ్ళు, పూసలవాళ్ళు, చిందు వాళ్ళు, కాకిపడిగెల వాళ్ళు, ఉరుములవాళ్ళు, దాసరి వాళ్ళు, బదనీలు, గంగిరెద్దుల వాళ్ళు, బహురూపులు, కొమ్ములవాళ్ళు, శారదకాండ్రు, బాలసంతులు, గొల్ల సుద్దులవారు, ఎరుకలసోది, బుడిగె జంగాలు, దొమ్మ

రాటలు, అద్దంసింగ్‌వాళ్ళు, రుంజవాళ్ళు, కూనపులులు, వీరముష్టలు, గొంథళీలు, కాటిపాపలు, భాగవతులు, సాలూనివాళ్ళు, గొరవయ్యలు, సాధనాశూరులు, పాండవులవాళ్ళు, గంజికూటివాళ్ళు, బైరాగులు, మాలదాసర్లు, గౌడజెట్టీలు వంటివారు ఎందరో ఉన్నారు. వీరు ప్రదర్శించే కళారూపాలే కాక చెక్కభజన, డప్పుల నృత్యం, పగటివేషాలు, చిరుతల భజన, కప్పల కావడి, నామాల సింగడు, వీరభద్ర విన్యాసాలు, కత్తుల గారడీ, బుట్ట బొమ్మలు, తోలుబొమ్మలాట వంటి కళారూపాలు ప్రజలను అలరిస్తున్నాయి.

మండెచ్చుల వాళ్ళు :

బొమ్మలవాళ్ళు అని కూడా అంటారు. కథలు చెప్తూ, మట్టిబొమ్మలు లేదా చెక్కబొమ్మలు చూపిస్తూ తెరపై బొమ్మలు ప్రదర్శిస్తూ కథాగానాలు చేస్తూ, సంచార జీవనం చేస్తుంటారు. కథా ప్రారంభానికి ముందు శారదను, గణపతిని, గంగను, శ్రీకృష్ణుని, వివిధ క్షేత్రాల మల్లన్నలను ప్రార్థించి కథ చెప్పడం ప్రారంభిస్తారు. ప్రధాన కథకుడు తెల్లని ధోవతి, చొక్కా, నెత్తికి రుమాలు, చేతిలో వెండి పాన్ను కర్ర, కాళ్ళకు గజ్జెలు, చెవులకు పోగులు, ఎర్రరాళ్ళ పెద్ద కమ్మలు, ముక్కుకు పోగు, భుజానికి దండకడియం, వేళ్ళకు రాగి ఉంగరాలు వంటివి ధరిస్తాడు.

వీళ్ళు ఇత్తడి ఢమరుకం, పెద్ద డోలు, రణభేరి, గంటపట్టిన త్రిశూలాలను వాద్యాలుగా వాడతారు. వచనరూపంలో కథాగానం చేస్తూ, మధ్యమధ్య కథా సంబంధిత పాటలను వేగంగా పాడతారు.

శారదకాండ్రు :

తెలంగాణలో వీరి సంఖ్య అత్యధికంగా ఉన్నది. జానపద భిక్షుక గాయకుల్లో వీరికి ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. బుడిగెజంగాల్లోని ఒక శాఖవారే శారదకాండ్రు. శారద అనే వాయిద్యాన్ని చేతబట్టుకొని వాయిస్తూ కథలు చెప్పడం వల్ల వీరికాపేరు వచ్చింది. వీళ్ళకు శివుడు ఆరాధ్యదైవం. "అంబా శారదాంబా జగదంబా శారదాంబా; అంబంబ భారీ, అంబ భారతీ, అంబా శారదాంబా" అంటూ శారద ప్రార్థన చేస్తారు. తందాన, భళిభళి, సైసై అనే పదాలు యుద్ధవర్ణనల్లో వాడతారు.

శారద అనే తంబూరా వాద్యాన్ని వాయిస్తూ కథలు చెబుతారు. తెలుగుదేశంలో కిన్నెర, తంబూరాలను 'శారద' అనటం ప్రచారంలో ఉంది. దీన్ని చెక్కతో చేసి, రాగి, ఉక్కు మొదలైన తీగలు బిగించి తయారుచేస్తారు.

పిచ్చుక కుంట్లు :

వీరు రెడ్లు, కమ్మలు, యాదవులను, కాపులను యాచిస్తూ కథలు చెపుతారు. ఈ పేరుకు కాళ్ళులేని వాళ్ళు, అనూరులు అనే అర్థాలున్నాయి. త్రిమూర్తుల వివాహ సమయంలో వాళ్ళ గోత్రాలు చెప్పేందుకు ఒకరు కావలసివచ్చి వీళ్ళను తయారుచేశారట. ప్రధాన కథకుడు మోకాళ్ళ వరకు ధోవతి కట్టి, నెత్తికి పాగా చుట్టి, తెల్లని చొక్కా ధరించి, ఎడమచేత డాలు, కుడిచేత కత్తి పట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని గానం చేస్తుంటాడు. 'శ్రీమల మలిదేవ చెన్నుడో' అంటూ మాచెర్ల చెన్నకేశవుని వర్ణిస్తారు.

వీళ్ళు గంట, ఢక్కి, తోలుతిత్తితో పాటుగా కొందరు తప్పెటలను కూడా వాద్యాలుగా వాడుతుంటారు. ఎండబెట్టిన గొర్రెతోలును సంచిగా కుట్టి, గుమ్మడికాయ ఆకారంలో తయారుచేసి వాయిస్తారు.

పరికిముగ్గులవాళ్ళు :

వీరు సోదిచెప్తూ, పచ్చబొట్లు వేస్తూ, భూతవైద్యం చేస్తూ, శారద కథలు చెప్తూ సంచారం చేస్తారు. సరస్వతి, వినాయకుడు, కనకదుర్గ మొదలైన దేవతలను ప్రార్థిస్తారు. 'అయ్యో తందాన దేవనందనాన' అంటూ దరువులు వేస్తూ బాలనాగమ్మ, కాశీమజిలీ, శరబంధి రాజు, జరాసంధ కథ, కాంభోజరాజు కథ, నలదమయంతి కథలు చెబుతారు.

ఏక్‌తార లేక దండెలనే వాద్యంతో సోది చెపుతూ, పచ్చబొట్లు కూడా వేస్తారు. భూతవైద్యం కూడా చేస్తారు. శారదగాళ్ళవలె తంబురపై కథలు చెబుతారు.

తప్పెటగుళ్ళు :

ఈ కళారూపం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నం జిల్లాలలో విస్తృత ప్రచారంలో ఉన్నది. దీన్ని యాదవకులం వాళ్ళు ప్రదర్శిస్తారు. పొట్టిచేతుల జుబ్బాలు, నిక్కర్లు వేసుకున్న కళాకారులు గుండెల్ని అనుకున్న తప్పెటల్ని వాయిస్తూ నృత్యం చేస్తారు. వీరి దుస్తులు ఎర్రరంగులో ఉండటం వల్ల నృత్యం అందంగా ఉంటుంది. కాళ్ళకు మరియు నిక్కర్లకూ గజ్జెలుంటాయి.

తప్పెటలు, గజ్జెలు దీనిలో ముఖ్యమైన వాద్యాలు. ఇది నృత్యప్రధానమైనది.

చెక్కబొమ్మలాట :

''మన దేశంలో కొయ్యబొమ్మలాటలకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది'' అని ఆర్వియస్.సుందరం గారు తలిపారు. మగబొమ్మలు ఒకటిన్నర అడుగుల నుండి రెండున్నర అడుగుల వరకు ఉంటాయి. ఆడ బొమ్మలు చిన్నవిగా, సౌమ్యంగా ఉంటాయి. స్త్రీ పాత్ర లకు గాజులు, హారాలు, రంగు రంగుల వస్త్రాలను కూడా ధరింపజేస్తారు. కొయ్యబొమ్మలను బూరుగు, పత్తి మొదలైన కర్రలతో చేస్తారు.

కొయ్యకాళ్ళు :

కాళ్ళకు కొయ్యలు కట్టుకొని నృత్యం చేయడాన్ని కొయ్యకాళ్ళ నృత్యం అంటారు. ఇందులో ఎక్కువగా పురుషులే చేస్తారు. ఉత్సవాల్లో, జాతర్లలో, సంతలలో కొయ్యకాళ్ళ నృత్యం ఈనాటికీ ప్రదర్శింపబడుతున్నది. వీళ్ళు కొయ్యకాళ్ళతో నృత్యం చేస్తుంటే డప్పులు, వేరే వాద్యాలు మోగుతుంటాయి.

గరగనృత్యం :

ఇది చాలా పురాతమైనది. ఆంధ్రదేశంలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. దీనిని 'ఘటనృత్యం' అని కూడా అంటారు. గరగ అంటే కుండ అని అర్థం. ద్రౌపది తన వివాహ సమయంలో ఆనందంతో వక్కనున్న కలశాన్ని తలపైకెత్తుకొని చిందులు వేయటంతో ఈ నృత్యం పవిత్రతను ఆపాదించుకుంది. ముత్యాలమ్మ, ఆంకాళమ్మ, పోలేరమ్మ, మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ మొదలైన గ్రామదేవతల జాతర్లలో గరగలు ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ గరగనృత్యం శక్తి ఆరాధన అని చెప్పవచ్చు. అందుకే శక్తికి సంబంధించిన పూజల్లో కుండలు ప్రధానపాత్ర పోషిస్తాయి.

ప్రజలలో ఉత్సాహం, ఉల్లాసాలను పెంపొందిం చేందుకు ఈ కళారూపాలు ఎంతో తోడ్పడతాయి. ఈ జానపద కళారూపాలు ప్రజల్ని ఒక్కటిగా చేసి, సమైక్యతకు దోహదం చేస్తుంది.

భారతదేశంలోని జానపదగేయాల సంగీతాంశాలు శాస్త్రీయ సంగీతానికి మూలమని విద్వాంసుల అభి ప్రాయం. జానపద సాహిత్యంలో జానపద గాయకులు గానం చేసే గేయాలు, కథాగేయాలు ఎంతో ప్రాము ఖ్యతను సంతరించుకున్నాయి. జానపద గాయకుల్లో ప్రతి ఒక్కరికీ గానంతో పాటు వాద్యవాదనంలో ప్రావీణ్యత ఉంటుంది. భిక్షుక గాయకుల వాద్యవిశేషాలను గురించి పరిశీలిద్దాం!

జానపద భిక్షుక గాయకుల్లో బుడిగెజంగాలకు ప్రత్యేకమైన స్థానమున్నది. తెలంగాణలో అధిక సంఖ్యలో ఉన్నారు. విభూతి, రుద్రాక్షలు, లింగాలు ధరించి శైవ కథలు గానం చేస్తారు. వీరు కిన్నెర, బుడిగె, గుమ్మెత పట్టుకొని కథలు చెబుతారు. నిడుపాటి సన్నని మూతిగల పాత్రను బుడిగె అంటారు. బుడిగెను వాయిస్తూ కథాగానం చేయటం వలన బుడిగెజంగాలు అనే పేరు వచ్చింది. వీరిలో కొందరు పగటివేషాలు వేయడం, వైద్యం చేయడం, హస్తసాముద్రికం చెప్పడం కూడా చేస్తారు.

గాయక భిక్షుకుల్లో ఒగ్గులు అనేవారు ఆంధ్రరాష్ట్రంలో అత్యధిక ప్రజాదరణ కలిగినవారు. స్థూపాకారంలో ఉన్న ఇత్తడి లోహపు పరికరాన్ని రెండు వైపులా మేకతోలుతో మూస్తారు. రెండు గరాటా చివరలు కలిపితే ఎలా ఉంటుందో అలా ఢమరుకం వలె ఈ పరికరం ఉం

టుంది. దీని మధ్యభాగంలో రెండు నూలు దారాలు కట్టబడి ఉంటాయి. చేతివేళ్ళ మధ్య ఈ పరికరాన్ని ఉంచి ఆడించినపుడు ఒకవిధమైన శబ్దం వస్తుంది. దీనినే 'ఒగ్గు' అంటారు. ఒగ్గు కథకులు ఇంకా డోలు, తాళం, జగ్గు, కంజీర మొదలైన వాద్యాలను ఉపయోగిస్తారు.

గంగిరెద్దులవాళ్ళు సంక్రాంతి పండుగ సమయంలో ఎద్దులను అలంకరించి ఆడిస్తారు. డోలు, సన్నాయి అనేవి గంగిరెద్దుల మేళంలో ప్రధానమైనవి. సన్నాయిపాట, డోళ్ళ ఆర్భాటం, ఎద్దు ఓర్పు, ఆడించేవాని నైపుణ్యం ప్రధానమైనవి.

రుంజలవాళ్ళు విశ్వకర్మ కులోద్భవాన్ని గురించి చెపుతూ, విశ్వబ్రాహ్మణ కులాలను ఆశ్రయించుకుని జీవించేవారు. రుంజ అనేది ఒక వాయిద్య విశేషం. ఇది మూడు, మూడున్నర అడుగుల ఎత్తు ఉంటుంది. దీనిని ఇత్తడి, కంచు, పనస చెక్కలతో తయారు చేస్తారు. రుంజమేళంలో కంచు తాళాలను వేస్తూ ఆరుగురు సభ్యులు వాయిస్తారు. ఇలా రుంజ వాయించేటప్పుడు కొమ్ముబూరలను, చిన్న శృతి హార్మోనియంను కూడా ఉపయోగిస్తారు.

పాండవులవాళ్ళు కిన్నెరను వాయిస్తూ కథాగానం చేస్తారు. కిన్నెరకు ఒక తీగ ఉంటుంది. కిరీటి, చెట్టె, తొడుగు, సొరకాయ, రంధ్రం, తీగ, అతుకు, పిడి, చిలుక, దండ అనే భాగాలతో కిన్నెరను తయారు చేస్తారు. ఇంకా మద్దెలను, తాళాలను కూడా ఉపయోగిస్తారు.

కాకివడిగెలవాళ్ళు ముదిరాజులు, తెనుగువాళ్ళను యాచిస్తూ సంచార జీవనం చేస్తారు. కథలో వీళ్ళు వాడే పటం నలభై, నలభైఐదు అడుగుల పొడవుంటుంది. ఆకుపచ్చ, పసుపుపచ్చ, నీలం, ఎరుపు మొదలైన రంగులతో అడుగు, అడుగున్నర చిత్రాలు వేస్తారు. 'ఎ' ఆకారం గల రెండు కట్టెల పంగల్లో చిత్రాన్ని ఉంచి ప్రదర్శిస్తారు. మద్దెల, శారద వంటి వాయిద్యాలూ వాడతారు.

బైండ్లవాళ్ళు జమిడికలను వాయిస్తూ జీవనం గడుపుతారు. పెద్ద జమిడికను ఇత్తడి, పంచలోహాలతో చేస్తారు. దీని ధ్వని మహా భయంకరంగా ఉంటుంది.

ఉరుములవాళ్ళు శక్తి సంప్రదాయానికి చెందిన వారిలో ప్రసిద్ధులు. వీరు వాయించే డోలును 'ఉరుము' అంటారు. డోలు కొట్టే పుల్లను జిగరపుల్ల లేదా కోరుకొట్టే పుల్ల అంటారు. ఉరుముకు 3 లేక 8 గజ్జెలుంటాయి.

బాలనంతులు కంచుగంటలు, శంఖాలతో శైవ సంబంధమైన పాటలు పాడుతారు. రుద్రాక్షలు, లింగం ధరించి 'హరహర శంభో మహదేవా' అంటూ గంట వాయిస్తూ భిక్షకు వస్తారు. భిక్ష తర్వాత శంఖం ఊదుతూ మరొక ఇంటికి వెళతారు.

మాలదాసర్లు కటి వాద్యంతో గానం చేస్తారు. కటి వాయిద్యాన్ని పనస, టేకు చెక్కతో చేస్తారు. జలతరంగిణి ధ్వని వలె మనోహరంగా ఉంటుందీ వాదనం.

'కొమ్ము' వాద్యంతో ఊదేవాళ్ళను 'కొమ్ములవాళ్ళు' అంటారు. జాతర్లలో, కొలుపుల్లో, పుణ్యక్షేత్రాల్లో, ఊరేగింపుల్లో ఈ కొమ్ములవాళ్ళు ఎక్కువగా ఊదుతూ ఉంటారు.ఎద్దులు, ఆవుల చర్మలతో చేస్తారు.

కూనపులులు పటాలను ప్రదర్శించే గాయకులు. వస్త్రాలపై వర్ణచిత్రాలు చిత్రించి సినిమారీలు వలె తిప్పుతూ కథలను చెబుతారు.

జంగాల వాళ్ళు కిన్నెరను, తంబురను మీటుతూ ఇద్దరు వంతలు పాడుతుండగా కథలు చెబుతారు.

గొరవయ్యలు పిల్లనగ్రోవితో పాటలు పాడుతూ ఢమరుకాన్ని వాయిస్తూ, నృత్యం చేస్తారు. వీరు నృత్యానికే ప్రాధాన్యత ఇస్తారు.

విప్రవినోదులు తబలా, హార్మోనియం, మద్దెల, తాళాలను తమ ప్రదర్శనలో వాడతారు. కీర్తనలు, భక్తిగీతాలు పాడతారు.

వీరముష్టులవారు జేగంట, నగారా, శంఖాలను తమ ప్రదర్శనలో వాడతారు. కంచుతో చేసే జేగంట రొట్టెల

పెనంపలె మందంగా ఉంటుంది. భాగవతులు తమ కథల్లో హార్మోనియం, రాగాలపెట్టె, మృదంగం, తాళాలు, గజ్జెలను వాడతారు. రేగు, వేప, మద్ది, టేకు, గుమ్మటేకు వంటి చెట్ల కర్రలతో చేసిన మద్దెలను భాగవతులు వాడతారు. సర్వకులాలను భిక్షమెత్తే బుడుబుడుకుల వాళ్ళు తమ పాటల్లో 'బుడక'ను ఉపయోగిస్తారు. 'అంబ పలుకు జగదంబ పలుకు' అంటూ బుడకను గిరగిరా తిప్పుతారు. పరికముగ్గుల వాళ్ళు చిన్న కిన్నెరను వాయిస్తూ సోదిచెపుతూ, పచ్చబొట్లు పొడుస్తూ భూతవైద్యం చేస్తూ జీవనం సాగిస్తారు. వీరి వాద్యాలు మద్దెల, తాళాలు, హార్మోనియం మొదలైనవి.

సాముగరిడీలు తమ గానంలో గరిడీ అనే వాద్యాన్ని వాడతారు. ఇది 5 అడుగుల ఎత్తులో ఢంకా ఆకారంలో ఉంటుంది. ఈ గరిడీని ఒకరు వాయిస్తుంటే 30, 40 మంది చుట్టు తిరుగుతూ పాటలు పాడుతుంటారు.

ఇంకా ఆసాదివాళ్ళు, చిందు భాగవతులు, పూసల వాళ్ళు, కాటిపాపలు, చెంచులు, సాతానివాళ్ళు, బైరాగులు, సాధనాశూరులు మొదలైన వారెందరో ఉన్నారు.

జానపద భిక్షుక గాయకులు ప్రదర్శించే కళా రూపాలలో వాడే వాద్యపరికరాలు ఇలా ఎన్నో రకాలుగా ఉంటాయి. జానపదళలు, కళారూపాలు వాయిద్య విశేషాలతో జానపద విజ్ఞానం బహు విస్తృతమైనది.

ఆధారగ్రంథాలు :

1. జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ అర్వీయస్.సుందరం
3. తెలుగువారి జానపద కళారూపాలు - డా॥ మిక్కిలిలేని రాధాకృష్ణమూర్తి

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపదుల సంస్కృతికి నిదర్శనం – దాదులూరు పోతులయ్యస్వామి జాతర

– ఎం. దీపిక, పరిశోధక విద్యార్థిని, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

దేశానికి గ్రామం వెన్నెముక వంటిది. కావున నిజమైన సంస్కృతికి, నాగరికతకు అలవాలు గ్రామాలు. జనపదం అనగా గ్రామం. జనపదంలో జీవించే జనులు జాన పదులు. ఆనాటి ఆదిమ కాలంలోని మానవుని నుంచి నేటి ఆధునిక మానవుని వరకు మనిషి జీవితంలో ప్రతి విషయం అనగా జననం నుంచి మరణం వరకు జరిగే అన్నీ అంశాలు జానపద సంస్కృతి క్రిందకు వస్తాయి. జానపద సంస్కృతికి పల్లెపట్టులు ఆటపట్టులు. జానపదుల జీవితంలో ఏడాది పొడవునా జానపద సంస్కృతిని ప్రతి బింబించే సంఘటనలు ఎన్నో జరుగుతుంటాయి. వీరి ఆచార వ్యవహారాలు, వినోదాలు, వేడుకలు, పండుగలు, నోములు, వ్రతాలు, జాతరలు, ఉత్సవాలు, ఉరుసలు, సంతలు, సంబరాలు, జానపద సంస్కృతికి భాష్యం చెబుతున్నాయి. వీటిలో జాతరలు జానపద సంస్కృతికి, ఆచార సాంప్రదాయాలకు, భక్తి విశ్వాసాలకు తార్కా ణాలుగా నిలుస్తున్నాయి. అనంతపురముజిల్లాలో ప్రసిద్ధి చెందిన, జానపద సంస్కృతికి చిహ్నమైన దాదులూరు పోతులయ్యస్వామి జాతరను పరిచయం చేయడం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

జాతర ప్రాముఖ్యత :

మొదటిలో జానపదులు ఒక నిర్ణీత ప్రదేశంలో ఏ రాతినో, చెట్టునో, పుట్టనో దేవతలుగా భావించుకొని పూజించుటకు గుంపులు, గుంపులుగా యాత్రగా ప్రయాణించి అక్కడికి చేరుకొని ఆయా దేవతలకు పూజలు చేసి సంబరాలు చేసుకొనేవారు. ఆ విధంగా యాత్రగా పదిమంది కలిసి పోయి చేసే ఆ పూజా విధానాన్ని 'జాత్ర' అని పిలవడం మొదలు పెట్టారు. ఇలా 'యాత్ర' శబ్ద తద్భవ రూపం జాత్ర. జాత్ర క్రమంగా జాతరగా రూపాంతరం చెందింది. ఆంగ్లభాషలో జాతరకు సమానార్థక పదం FAIR. ఇది లాటిన్ భాషలోని FERIAE అనే పదం నుంచి వచ్చింది. FERIAE అంటే పండుగ, భోజన దినం లేదా సెలవురోజు అని అర్థం. జాతర జానపదుల జీవన సరళిలో అతి ముఖ్యమైన అంశంగా భాసిల్లుతున్నది. సాంప్రదాయ సిద్ధంగా వచ్చే దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, పండుగలకంటే జానపదున్ని మిక్కిలిగి ఆకర్షించేవి, ఆనందింపచేసేవి ఈ జాతరలు. వీరికి గ్రామదేవతలపై భక్తి, విశ్వాసాలు, భయం మెండుగా ఉంటాయి. గ్రామానికి ఏ కష్టమొచ్చినా, అరిష్టమొచ్చినా గ్రామదేవతకు ఆగ్రహం కలిగిందనే భావిస్తారు. కావున ఆ తల్లిని శాంతపరుస్తూ జాతర జరిపిస్తారు. జానపదులది వ్యవసాయాధిరిత జీవితం. అందుకే వారు వేసిన పంటలకు ఏ నష్టం కలగకుండా సకాలంలో వర్షాలు పడి పంట చేతికందాలని తమ గ్రామానికి ఏ అంటు వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉండాలని వారి పశుసంపద సంవృద్ధిగా వర్ధిల్లాలని కోరుతూ వారు నమ్మిన దేవతలకు జాతర్లు జరిపిస్తారు.

దాదులూరి పోతులయ్యస్వామి జాతర – చారిత్రక నేపథ్యం :

అనంతపురము జిల్లాలోని కనగానపల్లి మండలం దాదులూరు గ్రామంలో వెలసిన పోతులయ్య స్వామి బోనాలోలుడు. భక్తితో బోనం సమర్పిస్తే కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ప్రతీతి. అందుకే ఆ స్వామి జాతర అంటే జిల్లా అంతటా సందడి మొదలవుతుంది. జాతరను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాక, ఇతర

రాష్ట్రాలలైన కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలి వస్తారు. ఇక్కడ కొన్ని వందల సంవత్సరాల నుంచి జాతర జరుగుతున్నట్లు ఆధారాలు కన్పిస్తున్నాయి.

పోతురాజు అవతరణ - వివరణ :

జన వ్యవహారంన గ్రామదేవతలు 101మంది. వీరికి రక్షకుడిగా, సోదరుడిగా వివిధ కథలయందు చిత్రింప బడిన వాడు 'పోతురాజు'. పోతురాజు జననం గురించి జానపద పురాణాలందు ఎన్నో కథనాలు ఉన్నాయి. ఇక్కడి కథనం ప్రకారం 'భస్మాసుర సంహారంలో విష్ణువు మోహినీ అవతారం ఎత్తి భస్మాసురున్ని సంహరిస్తాడు. ఆ సమయంలో ఈశ్వరుడు మోహినీని చూసి మోహించి కౌగలించుకున్నప్పుడు ఒక బిందువు నేల రాలుతుంది. దాని నుంచి పోతురాజు పుడతాడు. ఇలా విష్ణువుకు ఈశ్వరుడికి పుట్టిన వాడు కనుక 'పత్తల రాజు' అనే పేరు వచ్చింది. అదే క్రమంగా పోతురాజు అయింది. ఈయనను ఏడుగురు అక్కమ్మగార్లు తమ తమ్ముడిగా పెంచు కుంటారు. పోతురాజుది కొయ్యతో చేయబడిన విగ్రహం కానీ లేదా రెండు మూడు అడుగులు రాతితో చేసిన విగ్రహం ఉండను. ఈ విగ్రహం ప్రతి గ్రామదేవత ఆలయ ముందు ఉండును. విగ్రహంనందు ఒక చేతిలో కత్తి, మరోక చేతిలో నిమ్మకాయ ఉండును. కొన్ని కొన్ని ఆలయాల నందు విగ్రహంనకు బదులుగా సన్నటి పొడు వైన కర్రను భూమిలోపాతి అదే పోతురాజు అందురు. ఏ గ్రామదేవతల జాతరలోనైనా ఊరేగింపులో ముందుగా పోతురాజు విగ్రహమే బయలుదేరును. ఈయనకు ప్రత్యేకమైన గుడులు, సంబరాలు, జాతరలు చాలా అరుదు. ఈ పోతురాజునే పోతులయ్యగా ఇక్కడ జనులు వ్యవహరిస్తారు.

క్రీ.పూ. శాలివాహన శకంలోనే ఇక్కడ పోతులయ్య స్వామి ఉన్నట్లు ఆనవాలు ఉన్నాయి. ఆ కాలంలో ఈ ప్రదేశాన్ని (దాదులూరు గ్రామం) శివానందకోటగా పిలిచేవారని ఆలయం శాసనాలు చెప్పుతున్నాయి. అక్కమ్మ గార్లు ఈ శివానందకోటకు పోతులయ్యస్వామిని కాపలగా ఉంచినట్లు పురాణగాథ. ఆ సమయంలో శీలబ్రహ్మ నాయుడు కోటను కొల్లగొట్టడానికి అనుమతి ఇవ్వాలని పోతులయ్యను అడుగుతారని పోతులయ్యకు తాటంత పోతు, మేడికాయంత ముద్ద (బోనం) ప్రతిఫలంగా ఇస్తానని ఆశ చూపి కోటను కొల్లగొట్టాడని ప్రతీతి. ఈ విషయమై పోతులయ్యను అక్కచెల్లెల్లైన ఏడుగురు అక్కమ్మ గార్లు నిందించి, ఇలా ఎందుకు చేసావని ప్రశ్నిం చగా దీంతో ఆయన పశ్చాత్తాపం చెంది అప్పటి నుంచి శీలబ్రహ్మనాయుడు కానుకగా ఇచ్చే మేకపోతు, బోనాన్ని తన వెనుక సమర్పించాలని ముందుకు తీసుకురాకూడ దని శాసనం చేస్తాడు. నేటికి దేవుడికి సమర్పించే నైవేద్యాలు వెనుక వైపు నుంచే సమర్పిస్తారు. పూజకూడా మొదట వెనుకవైపు చేసి తర్వాత ముందు వైపు చేయడం ఇక్కడి ప్రత్యేకత.

జాతర విశేషాలు :

జాతరలో జరిగే విశేషాలలో అడుగడుగునా జాన పదుల సంస్కృతిని వారి ఆచార సాంప్రదాయాలను స్ఫురింపచేసేవిగా కన్పిస్తాయి. ఫాల్గుణ మాసం, శుద్ధ తదియ రోజు నుంచి జాతర ప్రారంభమై మూడు రోజులు జరుగుతుంది.

ఎలవపూజ :

మొదటి రోజు ఎలవపూజతో జాతర ప్రారంభమవు తుంది. ఆ రోజు గుడికట్లు (అనాది కాలం నుంచి పోతు లయ్యస్వామిని తమ ఇంటి దేవుడిగా భావించి కొలిచే వారు) అందరూ కలసి బుక్కపట్నం చెరువుకు చేరుకొని అక్కడ వెదురుగంపలో చెరకు, టెంకాయ, గన్నేరుపూలు, ఒంబాలు (టెంకాయ పూత), పెట్టి పూజలు చేసి అక్కడ నుంచి కాలినడకతో ఉరుములు, తప్పెట్లు, తాళాలతో ఎంతో కోలాహలంతో ఊరేగింపుగా గుడికి చేరుకుంటారు. ఇలా వచ్చిన గంపను ఎలవగంప, ఎలవపూజ అంటారు. ఎలవగంపను తెచ్చే సాంప్రదాయం కేవలం 'కలికివాండ్ల పల్లికి చెందిన బలిజ వంశస్థులదే' ఈ ఎలవగంపలో

తెచ్చిన పూజా సామాగ్రితోనే గుడిలోని దేవుడికి తొలి పూజ చేస్తారు. ఈ పూజ చేసే సాంప్రదాయం 'ఈడిగ వంశం'స్థులకు సొంతం. పూజానంతరం అదే రోజు దేవుడి ఊరేగింపు ఉంటుంది.

జలధి పూజ :

రెండవ రోజు ఉదయం జలధి పూజ జరుగుతుంది. దీన్నే గంగపూజ అంటారు. గుడికి దగ్గరున్న నది ఇసుకలో ఐదు రాళ్లు దేవుని ప్రతిరూపాలుగా పెట్టి పూజ చేస్తారు. పూజా అనంతరం గుడికట్లందరూ జాతరలో జరిగే లోటుపాట్లు, జాతర విశేషాలు అన్నీ చర్చించుకుంటారు. ఇక్కడ ప్రజలందరూ పూజలో పాల్గొంటారు. అయితే చర్చలో ఉండేది కేవలం గుడికట్లు మాత్రమే. ఈ ప్రదేశాన్నే దాసంగాల మడుగు అంటారు. ఇక్కడ దేవుడిని నిజ స్వరూపం చూపించాడని కథనం ఉంది. ఇదే రోజు జానపదుల పశుసంపదను ఎంతో ముచ్చటగా అలంకరించి కేరింతలు కొడుతూ గుడిచుట్టూ ప్రదక్షినలు చేస్తారు. ఇలా చేయడం వల్ల పశుసంపదకు ఏ హానీ కలగదని వారి నమ్మకం.

ఈరగాళ్లు :

రెండవరోజు సాయంత్రం జాతరలో 'ఈరగాళ్లు' ప్రత్యేక ఆకర్షణగా కన్పిస్తారు. కోరిన కోర్కెలు తీర్చినందుకు ప్రజలు మొక్కుబడిగా తమ కుటుంబంలోని ఒక వ్యక్తిని ఈరగాళ్లుగా చేసి దేవుడికి సమర్పిస్తారు. వీరికి ఎలాంటి నియమనిబంధనలు ఉండవు. కేవలం జాతర రోజు మాత్రమే ఈరగాళ్ల రూపంలో కన్పిస్తారు.

ఈరగాళ్లు ఆహార్యం :

వీరు కేవలం పంచకట్టుతో ఉండి, ఒళ్లంతా బండారు (పసుపు) రాసుకొని, కుంకుమ బొట్లుపెట్టుకొని, తలపాగా చుట్టుకొని, చేతిలో నిమ్మకాయ ఉన్న కత్తిని పట్టుకొని, మెడలో పూలదండ వేసుకొని, దేవునికి వారి కానుకలు సమర్పిస్తూ కన్పిస్తారు. వారి వారి ఆర్థిక పరిస్థితిని బట్టి గుడికి వైభవంగా వస్తారు.

మూడవ రోజు ప్రజలందరూ ఎంతో ఉత్సాహంగా ఆత్రుతగా ఎదురుచూసే జాతరలో ప్రధాన ఘట్టమైనా గావులమహోత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమం తెల్లవారుజామున రెండుగంటలకే ప్రారంభమవుతుంది. అదే సమయంలో బోనాల సమర్పణ జరుగుతుంది.

బోనం :

బోనం అనే పదం భోజనానికి వికృతి పదం. బోనాన్నే ఇక్కడి ప్రజలు 'బానంకుండ' అని పిలుస్తారు. గ్రామ దేవతలకు పెట్టిన భోజనం బోనం అవుతుంది. బియ్యం, పాలు, నీరు, బెల్లం పదార్థాలతో చేసినది బానం. ఈ బానం ఉన్న గిన్నె లేదా కుండ బోనం. ఈ బోనానికి చుట్టూ పసుపురాసి కుంకుమబొట్లు పెట్టి, కంఠానికి వేపరెమ్మల దండ వేసి ఊరేగింపుగా మహిళలు గుడిదగ్గరకు తీసుకెళ్తారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనం గుడికి వెళ్తుంది.

గావు పట్టుట :

పోతురాజు పూనకం వచ్చి కణకణలాడే కన్నులతో దేవునిముందు గంతులెడుతూ గొర్రెలను, మేకలను గావు పడతారు. గావుపట్టుట అనగా బలిపశువుగొంతును నోటితో కొరికి చంపుట. "బలి పశువు నెత్తురుగ్రోలి, దాని ప్రేవులు ధరించి, దొబ్బలు నోట కరచుకొని జమడికలు వాయిస్తూ వీధులు తిరుగునప్పుడు అత్యంత భీభత్సంగా ఉంటుందని" ఆచార్య. బిరుదురాజు రామరాజుగారు తన గేయ సాహిత్యం గ్రంథంలో గావు పట్టు దృశ్యాన్ని వర్ణించారు. వేలాది మంది జనుల మధ్య ఉరుముల పంబజోళ్ల, తప్పెట్ల, తాళాల మధ్య ఒళ్లు గగుర్పాటు పరిచేలా ఎంతో కోలాహలంగా గావుల మహోత్సవం జరుగుతుంది. పూర్వం ఒక బలి పశువునే బలి ఇచ్చేవారు. కాలక్రమేణా భక్తులు వారి మొక్కబడులు ఎక్కువ అవడంతో ఇప్పుడు ఒకే సారి 30 బలి పశువులు (మేకపిల్లలు) గావు పడుతున్నారు.

గావు పట్టు వారి ఆహార్యం :

ఈ జాతరలో గావుపట్టే వ్యక్తులు తొమ్మిది మంది ఉంటారు. వీరినే పోతురాజులు అంటారు. వీరు కేవలం

పంచకట్టుతో ఉంది ఒళ్లంతా బండారు (పసుపు) రాసుకొని, కుంకమబొట్లు పెట్టుకొని, కాళ్లకు గజ్జెలు కట్టుకొని, చేతిలో ఈరతాళ్లుతో కొట్టుకొంటూ గుడిలో దేవుని పద్యాలు చెప్పుకుంటూ నృత్యాలు చేస్తూ, ప్రత్యేక ఆకర్షణగా కన్పిస్తారు. వీరు కాపు, మంగళ, బోయ, ఉప్పర అని నాలుగు కులాలకు చెందిన వారై ఉంటారు. పంబజోడి అనే ప్రత్యేక వాయిద్యం గావుల మహోత్సవంలో కన్పిస్తుంది. దీన్ని మాలకులస్థులు వాయిస్తారు. బలి అనంతరం మేక పిల్లలు వీరి సొంతం.

జాతర సమయంలో జిల్లా నలుమూలలనుండి ఇతరరాష్ట్రాల నుండి వచ్చిన ప్రజలు ఆలయం చుట్టూ పది కిలోమీటర్లు మేర గుడారాలు, టెంట్లు, సేమ్యానాలు వేసుకొని అక్కడే ఉండి జాతరలో పాల్గొంటారు. ఇక్కడ 'యాత్రగా గుంపులు గుంపులుగా ప్రజలందరూ కలసి నిర్ణీత ప్రదేశానికి పోయి చేసే ఆ పూజా విధానాన్ని జాత్ర' అంటారు అన్నమాట స్ఫురణకు వస్తుంది. గావుల మహోత్సవం అనంతరం వారి వారి బలిపశువులైన మేకలు గొర్రెలు కోళ్లు, దేవునికి బలి ఇచ్చి నైవేద్యం సమర్పించి, అక్కడే వండుకొని తిని వారి ప్రాంతాలకు వెళ్లిపోతారు. ఇక్కడితో జాతర ముగుస్తుంది.

ముగింపు :

జాతరలో పదకొండు కులాలవారు పాల్గొంటారు. వీరిలో ఏ ఒక్కరూ లేకపోయినా ఈ జాతర ఆగిపోతుంది. ఇక్కడ జాతర అనేది ఏ కులానికో, వర్గానికో, ప్రాంతానికో చెందినది కాదు. అన్ని సంస్కృతి సాంప్రదాయాలను తనలో కలుపుకొని సమాజంలోని ప్రజలందరిని ఒక త్రాటిపైకి తీసుకొచ్చి సమసమాజ ఐక్యతకు బాటలు వేస్తున్నాయి. ఈ జాతరలు జానపదులు వారి సంస్కృతీ సాంప్రదాయాలను, నమ్మకాలను నేటికి జాతరల రూపంలో సజీవంగా కాపాడుకుంటున్నారు.

ఆధార గ్రంథాలు :

1. ఆర్వీయస్. సుందరం. ఆంధ్రుల జానపద విజ్ఞానం
2. బిరుదురాజు రామరాజు. తెలుగు జానపద గేయసాహిత్యం
3. నాయని కృష్ణకుమారి. తెలుగు జానపద గేయగాథలు
4. సాంబశివ. దాదులూరి పోతులయ్య ఆలయ పూజారితో ముఖాముఖి చర్చ.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సాహిత్య పరిశోధకుడు – ఇనాక్

– డా॥. పి. కాళియప్ప, చెన్నై.

ప్రాచీన మానవుని మనో వికాసాన్ని, వైజ్ఞానిక విషయాలను తెలుసుకోవడానికి దోహదపడేది, మానవుడు ఆవిర్భవించిన కాలం నుంచి నేటి వరకు అభ్యున్నతి కోసం చేసిన ప్రయత్నం తదితర అంశాలను గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడే సాహిత్యమే జానపద సాహిత్యం. సమాజంలో అనాది కాలంగా వచ్చిన మార్పులను గురించి అధ్యయనం చేయడానికి ఉపయోగపడేది జానపద సాహిత్యం.

మన సంప్రదాయాల్లో ఒక శాస్త్రీయవిజ్ఞానం ఉంటుంది. ప్రతి ఆచారం వెనుక చరిత్ర ఉంటుంది. అది ఎంటో తెలుసుకుని చెప్పగలిగితేనే ఏ సంస్కృతియైనా, సంప్రదాయమైన, ఆచారమైన భవిష్యత్తు తరాలకు అందుతుంది. అలా చెప్పలేకపోతే క్రమక్రమంగా వాటి ఉనికి ప్రశ్నార్థకమై మరుగునపడి అంతరించిపోతుంది. అలా అంతరించిపోతున్న అంశాలను, తెలియని విషయాలను తెలుసుకునేందుకు, శోధించడానికి, సమస్యలను పరిష్కరించే, వాస్తవాలను వ్యవస్థీకృత మార్గంలో కనుగొనే ప్రక్రియ పరిశోధన. పరిశోధన యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం ఆవిష్కరణ. శాస్త్రీయ పరిశోధన శాస్త్రీయ పద్ధతిని అనుసరించడంపై ఆధారపడుతుంది, మన చుట్టూ ఉన్న ప్రపంచంలోని ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తుంది. ఆ క్రమంలోనే ప్రముఖ కవి, పరిశోధకుడు, విమర్శకుడు కొలకలూరి ఇనాక్ జానపద సాహిత్యంపై విశేష కృషి చేసి చక్కని పరిశోధన ఆకారాన్ని మనకు అందించాడు. ఇనాక్ జానపద సాహిత్య పరిశోధన పరిణామక్రమాన్ని గురించి చర్చించడమే ప్రస్తుత వ్యాస ముఖ్య ఉద్దేశం.

కొలకలూరి ఇనాక్ సాహిత్య నేపథ్యం :

స్వాతంత్ర్యానంతర సాహిత్యపు తొలితరం కలం యోధుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, కలంతో ఆరు దశాబ్దాలకు పైగా అలుపెరుగని సాహితీ సేద్యం చేస్తున్న కృషీవలుడు. ఆధునికాంధ్ర సాహిత్యంలో అన్ని ప్రక్రియలు చేపట్టి, అభ్యుదయాన్ని ఆవిష్కరించిన వారిలో అగ్రగణ్యుడు కొలకలూరి ఇనాక్. వివిధ ప్రక్రియల్లో రచనలకు ఆయన ఎంచుకున్నది కూడా వివిధ సామాజిక సమూహాలు దళిత, బహుజన, గిరిజన, మైనారిటీ, స్త్రీ పేద, మానవత భావనల పునాదిగా ఇనాక్ సాహిత్యం కొన సాగింది. అంటే సగటు మనిషి జీవితాన్ని దగ్గరగా పరిశీలించే తత్వమే వారిని జానపద పరిశోధవైపు నడిపించినట్లు తెలుస్తుంది. వస్తు, శిల్పాల ఎంపిక ఎలా ఉన్నాసరే, సరైన దృక్పథం లేని రచయితలు కాలగర్భంలో కలిసిపోతారు. ఎక్కడో ఒక చోట వారి సాహిత్య ప్రయాణానికి అంతముంటుంది. ఇనాక్‌లో మాత్రం ఇది జరగలేదు కారణం ఆయనలోని సాహిత్య దృక్పథమే. ఇనాక్ ఆరున్నర దశాబ్దాల సాహిత్యకృషి సాహిత్య గమనానికి దిశానిర్దేశం చేస్తోంది. అందుకే ఆయన వర్తమాన, భవిష్యత్ తరాలకు ఒక విజ్ఞాన సర్వస్వం.

పరిశోధకుడుగా ఇనాక్ :

ఇనాక్‌లో గొప్ప పరిశోధక లక్షణం కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలపై పరిశోధనాత్మక గ్రంథాలను వెలువరించారు ఇనాక్. వ్యాసం, సమీక్ష, పీఠిక, కథానిక, నవల మొదలైన ప్రక్రియలపై చక్కటి పరిశోధన చేశారు. తెలుగు వ్యాసాలు, సాహిత్య దర్శిని, సాహిత్య సందర్శనం, సమీక్షణం, సమీక్షా సాహిత్యం, పీఠికా సాహిత్యం, తెలుగు కథానిక పరిణామం, తెలుగు నవలా వికాసం, సాహిత్య ప్రయోజనం, శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం మొదలైన పరిశోధనా గ్రంథాలు ఆయన వెలువరించారు. సాహిత్య

పరిశోధనలో కొత్త ప్రతిపాదనలు అనేకం ఆధార నహితంగా చేశారు కొలకలూరి ఇనాక్. తెలుగు సాహిత్యంలో గొప్ప ప్రబంధంగా పేరున్న 'వసు చరిత్ర' గ్రంథ కర్త అసలు పేరు రామరాజ భూషణుడో, భట్టు మూర్తో కాదంటారు ఇనాక్. ఆయన అసలు పేరు శు భమూర్తి అనేది ఇనాక్ ప్రతిపాదన. ఆ శుభమూర్తిని శూద్రుడిగా పేర్కొన్నారు ఇనాక్. చేరదీసిన రాజు పేరుతో 'రామరాజ భూషణుడి'గా శుభమూర్తిని పిలుస్తున్నామని ఆధారాలతో నిరూపించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యా లయంలో "తెలుగు వ్యాస పరిణామం" పై పరిశోధన చేశారు. పరిశోధకుడిగా, పరిశోధనల మార్గదర్శిగా కూడా ఇనాక్ మార్గం అనితర సాధ్యం.

జానపద సాహిత్య పరిశోధకుడు - ఇనాక్ :

ప్రతివ్యక్తి తన జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎన్నెన్ని మార్గాలలో పయనించినా వాటి నేపధ్యంగా ఉండేది వారి వ్యక్తిత్వమే. అంటే వారి జీవిత నేపధ్యం ఆధారంగా ఒక విధమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. ఆ వ్యక్తిత్వపు ఆలోచనల నుండే ఏ సమస్యనైనా దర్శించే వీలుంటుంది. ఈ క్రమంలో ఆచార్య ఇనాక్ గారి వ్యక్తి త్వాన్ని పరిశీలిస్తే ఎంతో విశిష్టంగా కనిపిస్తుంది. వారి జీవితం కష్టాల కడలిని దాటుకుని సాహితీ లోకంలో అత్యున్నతమైన వ్యక్తిగా ఎదిగారు. ఇది ఒక సుదీర్ఘమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోటులు, సుఖ దు:ఖాలును అధికమించి నేడు ఒక ఆదర్శనీయమైన వ్యక్తిగా నిలిచారు. ఆచార్య ఇనాక్ గారి జీవన ప్రస్తానానికి వేదిక అయిన రంగం సాహిత్య రంగం. కృషి, పట్టుదల గల వ్యక్తి ఏ రంగాలలో అడుగిడినా ఆయా రంగాలలో శిఖరాలను తాకడంలో ఆశ్చర్య పడవలసిన పనిలేదు. అటువంటి వ్యక్తిత్వంగల ఇనాక్‌గారు సాహితీ రంగంలోకి ప్రవేశించారు. అప్పటికే తెలుగు సాహిత్యంలో ఉద్దండులు అయిన కవులు ఎందరో సాహిత్యంలోని వివిధ రంగాలలో ప్రవేశం చేసి చక్కని ప్రతిభాపాఠవాలు ప్రదర్శిస్తున్నారు. అయితే సాహితీ లోకంలో ఎందరో ఉద్దండ పండితు లున్నా విశిష్ట వ్యక్తిత్వం కలిగిన వారు నూతనమైన మార్గంలో పయనించి వారికంటూ ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకోవడం విలక్షణమైన నైజం. కనుకనే వారు ఏ రంగంలో ప్రవేశించినా అందులో విలక్షణంగా కని పిస్తారు.

సాధారణంగా సాహిత్యంలో కొంత దూరం పోయాక ఒక రకమైన గుర్తింపు వచ్చే సరికి అప్పటి వరకు లేని ఎన్నో లక్షణాలు ప్రవేశిస్తాయి. వారి ఆలోచనా తీరు తెన్నులు మారిపోయిన సందర్భాలు అనేకం. కాని ఇప్పటికీ ఇనాక్ గారు నిత్య విద్యార్థిగా అప్పుడే సాహితీ రంగంలోకి ప్రవేసించిన వ్యక్తిగా, ఒక గ్రంథాన్ని చదివినా, ఒక రచన చేసినా, ఒక అంశాన్ని విశ్లేషించినా నూతనమైన ఆలోచనలతో వాటి ఆత్మను దర్శించడానికి ప్రయత్నం చేస్తారు. అప్పటి వరకు అందులో వెలుగు చూడని నూతన కోణాన్ని ఆవిష్కరిస్తారు. వారు ఒక కథ రాసినా, ఒక నాట కాన్ని రూపొందించినా, ఒక నవలను సృష్టించినా ఏ ప్రక్రియ చేపట్టినా వారి విశిష్ట వ్యక్తిత్వం అందులో ప్రతి ఫలిస్తుంది. ఆ రంగంలో ఒక నూతనమైన ఒరవడిని సృషి ్టస్తారు. అందుకే వారి రచనలు పాఠకులను ఇట్టే ఆకట్టు కుని ఆలోచింపజేస్తాయి. ఇలా సాహితీ రంగంలో కవిగా, కథకుడుగా, నవలా రచయితగా, సాహిత్య విశ్లేషకుడుగా, నూతన సిద్ధాంత ప్రతిపాదకుడుగా ప్రశంసలు అందుకున్న ఇనాక్ ఒక విశిష్టమైన నిత్య పరిశోధకుడు.

ఆధునిక సాహిత్యంపై విస్తృతమైన పరిశోధన సాహిత్యం వెలువడింది. ఇంకా వెలువడుతూనే ఉంది. కారణాలు ఏమైనప్పటికిని జానపద సాహిత్యం విమర్శ రంగంలో పరిశోధన చెప్పుకోదగినంత రాలేదనేది స్పష్టం. నిజానికి జానపద సాహిత్యం మనకు ఎక్కువగా అశు సాహిత్యంగా మౌఖిక రూపంలో నిక్షిప్తమై ఉంది. ఆ అశు సాహిత్యంలోనే మన తరతరాల జానపద సంస్కృతికి చెందిన పునాదులు కనిపిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే భారతీయ సంస్కృతి విశేషాలు మనకు వేల సంవత్సరాల నుండి చిరస్థాయిగా జానపద సాహిత్యంలో నిక్షిప్తమై ఉ

ంది. అటువంటి సాహిత్యం అజ్ఞాత సాహిత్యంగా, చీకటి సాహిత్యంగా నిరాధారణకు గురై ఇప్పుడిప్పుడే పలువురి మన్ననలను పొందగలుగుతుంది. విశ్వవిద్యాలయాలు విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నా ఇంకా ఎందరికో ఈ విశిష్ట సాహిత్యం పట్ల చులకన భావన కలిగి ఉండడం అందరికి తెలిసిన విషయం. ఎందుకంటే అది మౌఖిక, అజ్ఞాత సాహిత్యమని, దానికి ఒక సిద్ధాంత ప్రాతిపదికలేదు అనేది వీరి వాదన. అటువంటి వాదనకు సంస్కృతి, నాగరికతల పేరుతో మూఢత్వాన్ని ప్రదర్శిస్తున్న అజ్ఞాన సాహితీలోకానికి ఇనాక్ చక్కని పరిశోధన చేశారు. అందులో భాగంగా వారు సంధించిన పరిశోధనా బాణం 'జానపదుల సాహిత్య విమర్శ' గ్రంథం. సాధారణంగా జానపద సాహిత్య విమర్శ అన్నవెంటనే అందులో విమర్శ ఏముంటుంది, దాని ప్రాతిపదికలు ఏవి, దానిలో దర్శించేది ఏముంటుంది అనే వాళ్ళకు ఇనాక్ అందించిన ఒక చురక ఈ 'జానపద సాహిత్య విమర్శ'. జానపద సాహిత్యానికి ఒక సగౌరమైన చరిత్ర ఉంది, విశిష్టమైన లక్షణం ఉంది. అసలు నేడు గొప్పగా చెప్పుకుంటున్న పురాణ, ఇతిహాసాలు కంటే ముందు నుండి ఈ సాహిత్యం ప్రజాబాహుళ్యంగా వర్ధిల్లిందని సిద్ధాంతీకరించిన గ్రంథం ఇనాక్ గారి 'జానపదుల సాహిత్య విమర్శ'. జానపద సాహిత్యంలో జానపద పరిశోధనా రంగాన్ని దర్శించవలసిన తీరును అందించే దిక్సూచి ఈ గ్రంథం. అటువంటి విశిష్టమైన పరిశోధన చేసి చక్కటి విమర్శా గ్రంథాన్ని రూపొందించిన విశిష్ట జానపద విమర్శకుడు ఇనాక్.

జానపద సాహిత్య విమర్శ - ఇనాక్ దృక్పథం :

జానపద సాహిత్య విమర్శ గురించి ఇనాక్ ఈ విధంగా అభిప్రాయ పడుతారు. ''సాధారణంగా విమర్శనం ఆలోచన అంతస్సారంగా ఉంటే జానపద సాహిత్య విమర్శనం అనుభూతి అంతరాత్మగా ఉంటుంది. తెలుగు సాహిత్య విమర్శకు నూట ఏభై ఏళ్లు దాటలేదు. తెలుగులో జానపద సాహిత్య విమర్శకు తెలుగు సాహిత్యం అంత ప్రాచీనత వుంది. ఆ కాలంలో పండితులు, కవులు, రాజుల సాహిత్య విమర్శ దృక్పథం పరిమితంగా వున్నప్పటికీ, జానపద సాహిత్య విమర్శన దృక్పథం ఆనాటి పరిస్థితుల దృష్టిలో పరిమితంగా ఉంది'' అని జానపద సాహిత్య విమర్శ విస్తృతిని తెలియజేశారు. ఈ అభిప్రాయాన్నే ఒక క్రమబద్ధమైన సిద్ధాంతపరంగా అన్వయించి పరిశోధకులను, విమర్శకులను ఆశ్చర్యానికి గురి చేశారు. ఈ జానపదుల సాహిత్య విమర్శను ప్రధానంగా మూడు భాగాలుగా విభజించి విశ్లేషించారు. అవి.

1. లక్ష్యం, 2. లక్షణం, 3. సిద్ధాంతం. ఈ విభాగాలు చేయడంలోనే వీరి విమర్శనాత్మక దృక్పథం ఎలాంటిదో తెలుస్తుంది. లక్ష్యం అనే మొదటి భాగంలో ఉపోద్ఘాత శీర్షిక క్రింద దైవీయత - కవిపండితులు, సాహిత్య సృష్టి, స్వప్న దర్శనం, భీమకవి, పోతనలు. మానవీయత అనే శీర్షిక క్రింద తిక్కన ఆంధ్రీకరణం - జానపదుల అభీష్టం, శ్రీనాథుడు - జానపదుల అభిమానం, శ్రీకృష్ణదేవరాయలు - జానపదుల ఆత్మీయత, సాహిత్యం - జానపదుల ఇష్టానిష్టాలు, కావ్యాంకితం - జానపదుల ఆనందం, భాస్కర శతకం - జానపదుల దృక్పథం, కాకతీయులు - జానపదుల నిర్ణయం, కవి మంత్రిత్వం - జానపదుల సంతోషం, భాషాభ్యాసం - జానపదుల ఆసక్తి, కవుల ఇంటి పేర్లు - జానపదుల అభిమతం. జానపదుల సాహిత్య విమర్శ అనే శీర్షిక క్రింద వినోద సాహిత్యం - జానపదుల వ్యాఖ్యానం, రెండర్థాలు - జానపదుల అంతరార్థాలు, జీవితంలో బూతు - జానపదుల విమర్శ. లక్షణం అనే రెండవ విభాగంలో జానపద సాహిత్య విమర్శ - లక్షణాలు, సాహిత్య విమర్శ - జానపదుల సాహిత్య విమర్శ, జానపదుల విమర్శ సాహిత్యం - జానపద లక్షణాలు, జానపద సాహిత్య వర్గీకరం - విమర్శ స్థానంలో విద్వాంసుల వర్గీకరణ, పరిశోధకుల వర్గీకరణ, గద్య కథనాలు - జానపదుల సాహిత్య విమర్శ స్థానంలో జానపద సాహిత్య విమర్శ - కథ, జానపద విజ్ఞానం

వర్గీకరణ అనే అంశాలు. సిద్ధాంతం అనే మూడవ భాగంలో సింహావలోకనంలో సమన్వయం, సారాంశం, నిర్ణయం అనే వాటికి సంబంధించిన విమర్శనాత్మకమైన సిద్ధాంత భూమికను ప్రకటించారు. ఆ అంశాల లోతులలోకి వెళితే జానపద సాహిత్య విమర్శకుడిగా ఇనాక్ దృక్పథం స్పష్టంగా తెలుస్తుంది.

ఆధునిక సాహిత్యం మీద వచ్చినంత విమర్శ ప్రాచీన సాహిత్యం మీద, ప్రాచీన సాహిత్యంపై వచ్చినంత విమర్శ జానపద సాహిత్యంలో రాలేదనేది విజ్ఞులు అంగీకరిస్తున్న విషయం. జానపద సాహిత్య విమర్శ గురించి డా॥ రాచ పాళెం చంద్రశేఖర్ రెడ్డిగారు తన విమర్శ - 2009లో ఇలా అంటారు.

''ఒకప్పుడు విశ్వవిద్యాలయాలలో ఉద్యమ స్థాయిలో పరిశోధనలు జరిగాయి, సదస్సులు వర్కుషాప్‌లు జరిగేవి. మాధ్యమాలలో విమర్శలు వచ్చేవి. అవి మందగించి పోయాయి. సామాజిక శాస్త్రాలు వెలుగులో ఏ శాస్త్రాన్నైనా, ఎప్పటి సాహిత్యాన్నైనా, ఎవరి సాహిత్యాన్నైనా అధ్యయనం చేయడానికి అవకాశం ఉంది. ఒక వ్యవస్థగా మారబోయిన జానపద విజ్ఞాన విమర్శ వెనక్కి వెళ్ళిపోయింది. ఎక్కడైనా పరిశోధనలు జరుగుతున్నా అవి సి.డి.లలో మిగిలిపోయి ఉన్నాయి. జానపద విజ్ఞాన పరిశోధనకు, విమర్శకు ఒక ప్రత్యేక వ్యవస్థకావాలి. దాని కోసం ఆలోచించాలి'' అని పేర్కొన్నారు. ఈ లోటును పూరించడానికే అన్నట్లుగా ఆచార్య ఇనాక్‌గారి జానపదుల సాహిత్య విమర్శ రూపు దిద్దుకుంది'' అని అంటారు.

సాధారణంగా సృజనాత్మక సాహిత్యంపై విమర్శ చేయడం సర్వసాధారణం. కాని జానపద సాహిత్యంపై విమర్శ చేయడం అంత సులువైన విషయం కాదు. అయితే జానపద సాహిత్య విమర్శను అర్థం చేసుకోవాలంటే జానపదుల ఆత్మను అర్థంచేసుకోగల నైపుణ్యం, నేపథ్యం అవసరం. ఈ లక్షణాలు ఇనాక్‌లో పుష్కలంగా ఉన్నాయి. అందుకే తన జానపదుల సాహిత్య విమర్శ గ్రంథానికి రాసిన ఉపోద్ఘాతంలోనే ఆ విమర్శపై వారికి గల దృక్పథం తెలుస్తుంది. జానపదుల విమర్శ ఎలా ఉంటుందో తెలియజేస్తూ ''జానపదులు సాహిత్యం అనుభవించి ఆనందించే రసికులు, సహృదయులు, సమర్థులు. వాళ్ళు తమకు తోచిన తీరులో దాన్ని విమర్శించగలరు. చాలామంది చదవలేరు. సాహిత్యం విని, వినడంవల్ల అనుభవించి ఆ అనుభవం అభివ్యక్తం చేయగలరు. ఆ అభివ్యక్తీకరణం సాహిత్య విమర్శకుల అభివ్యక్తీకరణం కంటే భిన్నంగా ఉంటుంది''' అని జానపద సాహిత్య విమర్శ ఆయువు పట్టును పట్టుకోగలిగారు. జానపద సాహిత్యాన్ని జానపదుల మనస్తత్వం ఆధారంగా అంచనా వేయగలగాలి. అందుకు తగిన నేపథ్యం విమర్శకునికి ఉండాలి. ఆ నేపథ్యంలో నుండి వచ్చిన వారు కనుకనే ఇనాక్ గారు జానపదుల అంతర్మాత్మను ఆవిష్కరించగలిగారు.

దైవీయ కోణంలో జానపదులు కవి, పండితులకు అతీంద్రీయ శక్తులు ఉన్నట్లుగా జానపదులు భావిస్తారని పేర్కొంటారు. అందుకే వాళ్ళ అద్భుతమైన, ఆశ్చర్యకరమైన కవిత్వం సృష్టించగలిగారిని జానపదుల విశ్వాసంగా వ్యాఖ్యానిస్తారు. అంటే ఆ కవుల చుట్టూ జరిగే సన్నివేశాల ఆధారంగా కవులకి భగవదాంశ ఉన్నట్లు భావిస్తారు. అలా వేములవాడ భీమకవి, శ్రీపతి పండితుడు మొదలైన వారిని ఉదాహరణగా తీసుకొని జానపద విమర్శా కోణంలో విశ్లేషించారు. అలాగే కవులు సాహిత్య సమస్యలతో సతమతమవుతుంటే వారిని కాపాడడానికి సరస్వతి, సర్వేశ్వరుడు, శ్రీమహావిష్ణువు స్వయంగా భూలోకం వచ్చి కవులకు సహాయం చేసినట్లు జానపదులు కల్పనలు చేసిన విధానాన్ని విమర్శనాత్మకంగా విశదీకరించారు.

అలా ఇష్టదైవాలు కలలో కనిపించి కవులకు సాహిత్య సంబంధమైన సమస్యలకు పరిష్కారం చూపించారని జానపదుల అభిమతంగా వ్యాఖ్యానిస్తాడు. ఉదా॥కు పోతన భాగవతాన్ని కాపాడడం కోసం శ్రీరాముడు సర్వజ్ఞ సింగభూపాలుని భార్యకు కలలో కనపడి చేయవలసిన కర్తవ్యాన్ని బోధించినట్లుగా జానపదుల విశ్వసిస్తున్నారని

సాహిత్య ఆధారాలతో వ్యాఖ్యానించాడు. అలాగే పోతన కుమార్తె - భగవద్దర్శనం, అన్నమయ్య అద్భుత చర్యలు, భాస్కరశతకం - కవితపశ్చక్తి మొదలైన వాటిని జానపదుల కోణంలో విమర్శనాత్మకంగా సిద్ధాంతీకరించారు.

మానవీయకోణంలో సాహిత్యం, చరిత్రలలోని అనేక సంఘటనల ఆధారంగా పరిశీలించారు. నన్నయ కాలం నుండి తెలుగు సాహిత్యం ప్రారంభమయిందని భావిస్తే జానపదుల మానవీయ సాహిత్య విమర్శనం, సాహిత్య సృజనంతో మొదలైనవి అనడంలో ఇబ్బంది లేదని అంటారు. అయితే జానపద విమర్శ కథలుగా, గాధలుగా ప్రచారంలో వున్నాయి. అవి కవుల జీవితాలు, జీవిత చరిత్రలు, కావ్యచరిత్రలు, రాజులు రాజాస్థానాల కవిత సృజనాల సమాచారం గ్రంథస్థం కావించే కాలంలో సాహిత్య చరిత్రకారులు జానపద సాహిత్య విమర్శను తమ గ్రంథాలలో పేర్కొన్నట్లుగా సిద్ధాంతీకరించారు. అదే కోణంలో తిక్కన భారతాంధ్రీకరణ, జానపదుల అభిష్టం, గురునాథుడు అన్వయం చెప్పినట్లుగా ఉన్న కథను పరిశీలిస్తే,

ఉదా॥ "తిక్కన అనువాద రీతిలో చెప్పే కవిత్వం, ఒకసారి చెబితే మళ్ళీ మార్చుకోదనే ప్రతిజ్ఞ ఉందని ప్రఖ్యాతి. ఉందో లేదో నిర్ణయానికి వీలులేదు. కాని ప్రతిజ్ఞా భంగం కాకుండా భారతాంధ్రీకరణం చేశాడని జానపదులు విశ్వసించారు. అందుకే ప్రచారం చేశారు. తిక్కన తాను చెబుతున్న పద్యం ముగించక గురునాథా ఇంకేం చెప్పేది అని అడిగాడని, గురునాథుడు తనను ప్రశ్నించాడని గ్రహించక, కురునాథుణ్ణి ప్రశ్నించాడని భావించి 'ఏమి చెప్పదున్ గురునాథా' గా వ్రాశాడని, ఆపైన వ్రతభంగమని తిక్కన చింతిస్తుంటే కాదని గురునాథుడు అన్వయం చెప్పినట్లుగా జానపద సాహిత్య సమన్వయ కథ ప్రచారంలో ఉంది". అని తెలిపారు.

అలాగే శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయులు, కాక తీయులు, కవుల ఇంటి పేర్లు మొదలైన వాటి ఆధారంగా జానపదుల అభిమానం, ఆనందం, దృక్పథం, నిర్ణయం ఆసక్తి, అభిమతం మొదలైన కోణాలలో విమర్శ నాత్మకమైన పరిశీలన చేశారు.

అలాగే జానపదుల వినోద సాహిత్యం, వ్యాఖ్యానం, రెండర్థాలలో జానపదుల అంతరార్థ భావాలు, జానపదుల జీవితంలో బూతు ప్రయోగాలు - విమర్శలు, కవుల చుట్టూ అల్లుకున్న కథలు. ఉదాహరణకు తెలుగు సాహిత్యంలో తెనాలి రామలింగకవికి సంబంధించినవి. అలాగే జానపదుల భాషకు సంబంధించిన విశ్లేషణలో మాండలిక వైవిధ్యంతో కూడిన విమర్శా దృక్పథాన్ని సమీక్షించారు.

ఇక జానపద విమర్శ లక్షణాలను తెలియజేస్తూ, దీనిలో వాళ్ళ ఊహ ఆలోచనలు మాత్రమే ప్రతిబిం బిస్తాయి. దీనిలో కవితాదృష్టి జానపదుల దృష్టి, దైవ దోహద సాహిత్యం, జానపదుల విమర్శ, రాజుల కవుల సంబంధం - జానపదుల నిర్ణయం ఇలా అనేకాంశాలను చారిత్రక, సాహిత్యాంశాలను జానపదుల దృష్టిలో విమర్శా విశ్లేషణ చేయడం జానపద విమర్శ నూతన దృక్పథంగా భావించవచ్చును. జానపద సాహిత్య విమర్శలో భాగంగా జానపద గేయాలకు ఆచార్య జి.ఎస్.మోహన్ గారు తెలిపిన లక్షణాలు మరియు ఆచార్య కొలకలూరి మధుర జ్యోతి క్రోడీకరించిన మరికొన్ని లక్షణాలను సమన్వయం చేస్తూ నూతన లక్షణ ప్రతిపాదన చేశారు. అలాగే జానపద సాహిత్య వర్గీకరణ జానపద సాహిత్య విమర్శ స్థానం తెలియజేస్తూ ప్రసిద్ధ జానపద పరిశోధకుల వర్గీకరణ, విశేషాలను తెలియజేశారు. అదే విధంగా జానపద కథలు, గద్య కథనాలు మొదలైన అంశాలను సూత్రబద్ధంగా విమర్శనాత్మక వ్యాఖ్యానం చేశారు.

సింహావలోకనంలో వ్యక్తీకరించిన అంశాలు వారి జానపద సాహిత్య విమర్వ పట్ల గల వారి పరిపూర్ణ అవగాహన చక్కని నిదర్శనంగా చెప్పవచ్చు. ఒకానొక సందర్భంలో నిర్ణయం చేస్తూ "ప్రాచీన సమాజాలు జానపద జనజీవన నిలయాలు. అక్కడే ప్రభవించింది జానపద సాహిత్యం. ఆధునిక సమాజంలో జానపదం

మారి జ్ఞానపదం మొదలవుతుంది'' అని అంటారు. ఈ విధంగా జానపద సాహిత్యాన్ని ఒక క్రమబద్ధమైన అధ్యయనంలో చారిత్రక, సామాజిక, సాహిత్యాంశాలను నేపథ్యంగా జానపదుల దృష్టిలో నుండి పరిశీలించిన విధానం ఇప్పటి వరకు వచ్చిన జానపద సాహిత్య విమర్శలో ఒక నూతన అధ్యాయంగానే చెప్పవచ్చు. జాన పద సాహిత్యాన్ని తన అనుభవ రూపంలో ఆస్వాదించి, తర్కించి ఒక సూత్రబద్ధమైన విమర్శను పాఠకలోకానికి అందించారు ఆచార్య ఇనాక్ గారు. తెలుగు వ్యాకరణానికి చిన్నయ సూరిగారి బాలవ్యాకరణం ఎలా దిక్సూచిగా ఉ ందో అలాగే జానపద సాహిత్యానికి ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి జానపద సాహిత్య విమర్శ అంతటి ప్రాధా న్యతను సంతరించుకుంది. జానపద సాహిత్యంపై విశ్వ విద్యాలయాల్లో ఇప్పటికే ఎన్నో పరిశోధనలు జరిగాయి. ఎందరో మేధావులు జానపద సాహిత్యంపై విశేషమైన గ్రంథాలు వెలువరించారు. అవి అన్నీ జానపద సాహిత్య మనుగడకు, విస్తృతికి ఎంతగానో దోహద పడుతున్నాయి అనడంలో సందేహం లేదు.

ముగింపు :

ఆధునిక జ్ఞానపదంగా ఉన్న జానపదాన్ని మరో మలుపు తిప్పిన గ్రంథం ఇనాక్ గారి "జానపదుల సాహిత్య విమర్శ". ఇక మీదట జానపద సాహిత్యంపై కృషి చేసే పండితులు, పరిశోధకులు ఇనాక్ సూచించిన నూతన దృక్పథంవైపు పయనిస్తే విశేషమైన ఫలితాలు అందు తాయి అనడంలో సందేహం లేదు. సృజనాత్మక సాహిత్య విమర్శ చేయడం సర్వసాధారణం. కాని మౌఖిక సాహిత్యం, ప్రచారంలో ఉన్న సాహిత్యాన్ని ఒక క్రమబద్ధమైన సూత్రానుగుణంగా తీర్చిదిద్దడం ఇనాక్‌కే సాధ్యమైనందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు జానపద పండితులు ఆలోచించని నూతన మార్గంలో పయనించి విశేషమైన పరిశోధన చేసి నిర్మాణాత్మక విమర్శా దృక్పథాన్ని ప్రకటిం చిన ఇనాక్ జానపద సాహిత్య విమర్శకు దిక్సూచిగా నిలిచారు. వీరు జానపద సాహిత్య విమర్శా రత్నంగా సాహితీలోకంలో చిరస్థాయిగా నిలుస్తారు. వారి జానపద విమర్శా దృక్పథం భవిష్యత్తు సాహితీ లోకానికి మార్గ దర్శకత్వం వహిస్తుందని భావిస్తున్నాను.

ఆధారగ్రంథాలు :

1. జానపద సాహిత్య విమర్శ - కొలకలూరి ఇనాక్
2. విమర్శ - 2009 - రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
3. జానపద జీవితం - విస్తాలి శంకరరావు
4. ఆధరనకు నోచుకోని కళారూపాలు - అంతరించిపోతున్న కళాసంపద (వ్యాసం)- స్వరూప్ కృష్ణమూరి

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రపంచీకరణ కోరల్లో ప్రభావం కోల్పోతున్న జానపద కళారూపం గంగిరెద్దు మేళం

– డా॥. ఒబ్బన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

మన తెలుగు సంస్కృతి ఎంతో విశిష్టమైనది.. మనుషుల మధ్య ఆత్మీయానురాగాలు పెంపొందించే అచార వ్యవహారాలు, సంప్రదాయాలను అణువణువునా నింపుకున్న గొప్ప జాతి మనది. ఉదాత్తమైన ఈ కోవకు చెందిందే గంగిరెద్దులాట సంప్రదాయం. తన కళా రూపాన్ని ప్రదర్శిస్తూ అందరూ సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బసవన్న ద్వారా దీవెనలందిస్తాడు గంగిరెద్దులవారు ప్రతిగా బియ్యమో, డబ్బులో, పాత బట్టలో ఇచ్చి పంపుతారు ఊరివాళ్ళు. కళలను పరిడవిల్లింపచేయడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించే తత్వం కూడా మన సంప్రదాయాల్లో ఇమిడి ఉండటం విశేషం.

వ్యవసాయ ప్రధానమైన మన ప్రాంతాల్లో, జీవన విధానంలో పాడి, పశు సంపదకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆవుని గోమాతగా పూజిస్తాం. ఎద్దు శివుడి వాహనం అయిన నందీశ్వరుడిగా, బసవన్నగా పూజలందుకుంటుంది. తొలకరి సమయంలో ఎడ్లని చక్కగా అలంకరించి పూజ చేయడంతో వ్యవసాయారంభం అవుతుంది. దేశానికి వెన్నెముక రైతు అయితే పాలంలో కాడెని మోస్తూ రైతుకే వెన్నెముకగా నిలుస్తుంది ఎద్దు.

ఈ గంగిరెద్దులు మనకు ఎక్కువగా సంక్రాంతి సమయంలో ఎక్కువగా కనిపిస్తాయి. రైతుకి పంట అమ్ముడయ్యి చేతిలో నాలుగు డబ్బులాడే సమయం సంక్రాంతి వేళ. ఈ రోజుల్లో గంగిరెద్దులాట కొన్నాళ్ళు నడుస్తుంది. గంగిరెద్దు ఆడించేవాడిని సన్నాయి అప్పన్న అంటారు. ఎద్దుకి శిక్షణ ఇచ్చి ఎంతో చక్కగా అలంకరించి గంగిరెద్దుగా మార్చి ఊరూ వాడా దాన్ని తిప్పుతాడు. తాను సన్నాయి వాయిస్తూంటాడు. "వ(అ)య్యగారికీ దండం పెట్టు అమ్మ గారికీ దండం పెట్టు" అంటూ గంగిరెద్దు చేత నమస్కారం పెట్టించడం మొదలు అనేక చిత్ర విచిత్ర విన్యాసాలు చేయిస్తూంటాడు. ఇవి అన్ని వయసుల వారిని ఎంతో అలరిస్తూంటాయి.

గంగిరెద్దులకు సంబంధించి వృత్తాంతం :

పూర్వం గజాసురుడనే రాక్షసుడు శివుని కటాక్షం కోసం ఘోరమైన తపస్సు చేశాడట. శివుడు ప్రత్యక్షమై ఏమి కావాలని వరమడిగాడట. అందుకు గజాసురుడు మీరు నా గర్భంలో ప్రవేశించి, పూజలందుకో మంటాడట. అందుకు శివుడు అంగీకరించి అతని గర్భంలో ప్రవేశిస్తాడు. అంతర్ధానమైన పతి దేవుని జాడ తెలియక పార్వతీ దేవిదుఃఖించి గజాసురుని గర్భంలో ఉన్నట్లు తెలుసుకుని పతిని విముక్తిని చేయమని విష్ణుమూర్తిని వేడుకుంటుంది. అప్పుడు విష్ణువు గంగి రెద్దుల మేళాన్ని రూపకల్పన చేశాడట. నంది కేశ్వరుణ్ణి గంగి రెద్దుగా అలంకరించి బ్రహ్మాది దేవతలతో వివిధ వాయిద్యాలైన డోలు, సన్నాయి, బూర, సుత్తి లను ధరింప చేసి, తాను మేళానికి నాయకత్వం వహించి గజాసురుని చెవుల బడి తన సమక్షంలో ఆఆటనుప్రదర్శించమని'కోరుతాడట.

అందుకోసమే ఎదురు చూచిన విష్ణుమూర్తి అద్భుతంగా ఆటను నిర్వహిస్తాడట. గజాసురుడు ఆనంద భరితుడై ఏం కావాలో కోరుకో మంటాడట. తన పాచిక పారిందనుకున్న హరొ ఇది శివుని వాహనమైన నంది తన స్వామికి దూరమై విలపిస్తూ ఉంది. ఆ స్వామిని నంది కడకు చేరనియ్యి అని కోరతాడట. ఆలోచనలో పడ్డ గజాసురుడు, ఇతను అసుర సంహారి యైన చక్రధారి

అనీ, ఇక తనకు మృత్యువు తప్పదనీ తెలుసుకున్న గజాసురుడు శివుని ప్రార్థించి, నందీశ్వరునికి ఎదురుగా నిలుస్తాడట. అంతలో విష్ణుమూర్తి నందిని ప్రేరేపించగా, కొమ్ములతో గజాసురుణ్ణి కుమ్మగా గజాసురుని గర్భం నుండి శివుడు బయట పడతాడట. ఆడిన మాట తప్పని గజాసురుని శిరస్సు అన్ని లోకాల్లో పూజ లందుకుం టుందనీ, అతని చర్మాన్ని తాను మేన ధరిస్తాననీ చెప్పి శివుడు గజాసురునికి శివైక్యాన్ని ప్రసాదిస్తాడట.

గంగిరెద్దు ఆట :

ఆ గంగిరెద్దులను లోకంలో తిప్పుకొమ్మని గంగిరెద్దుల వారికి గంగిరెద్దులతో పాటు వాయిద్యాలు కూడా యివ్వడం జరుగుతుంది. (గంగ యొక్క ఎద్దు గంగిరెద్దు) అప్పటి నుండి గంగిరెద్దులను తిప్పుకొని బ్రతుకు తున్నట్లు పెద్దలు చెప్తారు.

డూ డూ బసవన్నా ఇటురారా బసవన్నా
వురుకుతు రారన్నా రారన్న బసవన్నా
అమ్మవారికి దండం బెట్టు అయ్యవారికీ దండం బెట్టు
మునసబు గారికి దండం బెట్టూ
కరణం గారికి దండం బెట్టూ
రారా బసవన్నా రారా బసవన్నా అంటూ

అంటూ ఇంటింటికి తిరుగుతూ మీకు అంతా ఆ శివయ్య దయవల్ల మేలు జరుగుతుందని చెపుతారు. మంచి జరుగుతాదని చెప్పు అంటూ గంగిరెద్దులతో తలలను ఊపిస్తారు.

గంగిరెద్దుల అలంకారం:

గంగిరెద్దుల్ని స్వంత బిడ్డల్లా చూస్తారు. వాటిని ఎన్నో రకాలుగా అలంకారిస్తారు. మూపురం వద్ద నుండి తోక వరకూ ఎంతో అందంగా రంగు రంగులతో కుట్టిన బొంతను కప్పుతారు. రింగులతో కొమ్ములను అలంక రిస్తారు. కొమ్ము చివర ధగధగ మెరిసే ఇత్తడి గొట్టాలను తొడిగి చిరవన రంగురంగుల ఊలు దారాల కుచ్చులను కట్టతారు. వీటినే కుప్పెలు అని అంటారు. మూతికి తోలుతో కుట్టబడిన మూజంబరంను కడతారు. నొసటి భాగాన అందమైన తోలు కుచ్చులను కడతారు. అంద మైన గవ్వలను కూడా కడాతారు. మూపురాన్ని రంగు పంచెతో అలంకరించి ఒక దండను దిగ వేస్తారు. పొట్ట చుట్టూ తగరపు పువ్వులతో కుట్టిన తోలు బెల్టును, గవ్వల హారాన్ని కడతారు. కాళ్ళకు గజ్జెలు కడతారు. ఇంటి యజమానులు చీరలు, దుప్పట్లు వంటి బట్టలను ఇస్తారు. వాటిని ఆ గంగిరెద్దు వీపు మీద వేస్తుంటారు. అప్పుడు చూడాలి ఆ బసవన్నల అందం. సాక్షాత్తూ నందికేశ్వరుని పోలి వుంటుంది.

గంగిరెద్దులకు శిక్షణ ఇవ్వడం :

వీరు వయసులో ఉన్న కోడె గిత్తను తీసుకువచ్చి దానిని లొంగదీసుకొంటారు. కొన్ని నెలల పాటు గిత్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వాటికి మచ్చిక చేసుకొని వాయిద్యా లకు అనుగుణంగా అడుగులు వేయడం, పడుకోబెట్టడం, తలాఊపడం వంటివి సర్కస్ వాళ్ళు ఇచ్చినట్లు శిక్షణ ఇస్తారు. "డూ డూ బసవన్నా ఇటురారా బసవన్నా" అనగానే కొన్ని ప్రశ్నలు వేసి వాటికి సమాధానాలుగా తల వూపించడం చేస్తారు. దనం పెట్టమంటే కాళ్ళు పైకెత్తి దనం పెట్టేలా చేస్తారు. గంగిరెద్దుల వారు విన్యాసం చేస్తూ వేలకిలా పడుకొని వారి గుండెల మీద గంగిరెద్దు రెండు కాళ్ళను వంటి శిక్షణలు గంగిరెద్దులకు కొన్ని నెలలు నేర్పిస్తారు.

నేడు గంగిరెద్దుల వారి నేటి దీన స్థితి :

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ఆదరణ తగ్గడంతో గంగిరెద్దులాడించే వాళ్ళ జీవితాలు దుర్భరంగా మారాయిప్పుడు. వారి మొహంలో దైన్యం అలుముకుంది. ఒకప్పుడు గొప్ప గొప్ప కీర్తనలు ఆలపోకగా పాడిన వారి సన్నాయిలో నేడు విషాదం పలుకుతోంది. వారి జీవితం శ్రుతి తప్పింది. సాధారణంగా వీరు స్థిర నివాసాలు లేని వారు, భూములు లేని వీరి కుటుంబాల్లో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ. తరతరాలుగా నమ్ముకున్న వృత్తిని వదల్లేక ఆ వృత్తిలో మనుగడ లేక

నానా బాధలు పడ్తున్నారు. మనోవేదన చెందుతున్నారు. వారికి గంగిరెద్దు ఒక ఆత్మీయ నేస్తం, బంధం. కుటుంబంలో ఒక భాగం. తమకిన్నాళ్ళూ అన్నం పెట్టిన గంగిరెద్దుకి నాలుగు గడ్డి పరకలు కొనలేక గంగిరెద్దుల వాడు పడే క్షోభ గుండెల్ని పిండేస్తుంది. అయినా సరే తన వృత్తిని కొనసాగించుకోడానికి అతడు తాపత్రయ పడుతూనే ఉంటాడు.

గంగిరెద్దులు వారు ఉత్తరాంధ్ర మరియు గోదావరి జిల్లాలలో ఎక్కువగా ఉంటారు. వీరికి సంక్రాంతి రోజుల్లో తప్పితే మిగతా రోజుల్లో పూట కూడా గడవడం చాలా కష్టంగా ఉంటుంది. ఒక నాడు దేదీప్యమానంగా వెలిగిన గంగిరెద్దాటలు నేడు వ్యాచక వృత్తిని అవలంబించినా అవి విద్వత్తును ప్రదర్శించే గంగి రెద్దుల మేళంగానూ, ప్రజలను వినోద పర్చి ఆనందింప చేసే కళా రూపంగానూ ఖ్యాతి వహించింది. గంగిరెద్దుల మేళాల వారు, రెండు మూడు కుటుంబాలు కలిసి అయిదారు అందమైన బలి సిన గంగిరెద్దులతో దండుగా బయలు దేరి ఆంధ్ర దేశంలో ఆ మూల నుంచి ఈ మూల వరకూ మకాంలు వేస్తూ జీవ యాత్రలు చేసే వారు. గంగిరెద్దుల వారు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కూడా ఉన్నారు. అయితే వారిలో ఎక్కువ మంది తెలుగు భాషనే మాట్లాడు తారు. వీరికి ఒక వూరనేది లేదు. సంచార జీవులైన వీరు పర్వ దినాలలోనూ, ముఖ్యంగా రైతులకు పంటలన్నీ చేతికి వచ్చి పని పాటలు లేని సమయాల్లోనూ, సంక్రాంతి పండుగ దినాలలోనూ వూర్ల వెంట బయలు దేరుతారు.

ముగింపు :

నాడు ఎంతో వెలుగు వెలిగిన గంగిరెద్దుల వారి పరిస్థితి నేడు యాచకుల కన్నా దయనీయంగా మారడం చాలా బాధాకరం. నాటి సామూహిక ప్రదర్శనలు క్షీణించి ఒకరిద్దరు ఎద్దుతో నాదస్వరం ఊదుతూ ఇంటింటికి తిరిగి బిక్షాటన చేస్తున్నారు. మొగవారు గింగిరెద్దులతో తిరుగుతుంటే ఆడవారు కాటుకలు, అద్దాలు , తిలకాలు మొదలైనవి ఇంటింటికి తిరిగి అమ్ముతున్నాటు, పూర్వం ప్రభువులు, జమీందారుల పోషణలో ఒక వెలుగు వేలిగించారు నేడు తిండికే దూరమయ్యారు. పూర్వం గింగిరెద్దులను కూడా దేవుడి పేరు మీద ప్రజలు, ప్రభువులు ఉచితంగా ఇచ్చేవారు.

నేడు ఆ పరిస్థితి లేదు. పండుగలు లేని రోజుల్లో ఒక్కో ఊరు తిరుగుతూ అక్కడ గుడారాలు వేసుకొని అక్కడ పదిరోజులు ఉంది బిక్షాటన చేస్తారు. ఇటువంటి జానపద కళ అయిన ఈ గంగిరెద్దుల మేళాన్ని కాపాడాలి. ప్రపంచీకరణ మత్తులో జోగుతూ, పాశ్చత్య సాంప్రదాయా లను అనుకరిస్తున్న కొందరు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకోవాలి. ప్రభుత్వాలు కూడా గంగిరెద్దులను ఆడించేవారికి ఆర్థిక సాయం చేయాలి. అదే విధంగా వీరికి నెల నెలా కొద్ది మొత్తంలో భృతిగా సాయం చేయ గగితే వారికి చాలా సాయంగా ఉంటుంది. ఏది ఏమైనా ముఖ్యంగా మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడు కొన్నపుడే మన జాతికి మనుగడ అన్న విషయం మరువ కూడదు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. మోహన్ ,జి.ఎస్ . జానపద విజ్ఞాన వ్యాసావళి . బెంగుళూరు : శ్రీనివాస పబ్లికేషన్స్, 1982
2. రాధాకృష్ణ, మిక్కిలినేని. తెలుగువారి జానపద కళారూపాలు. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2011.
3. రామకృష్ణారెడ్డి, పడాల . తెలుగువారి జానపద కళలు. హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సంస్కృతిక వ్యవహారాలశాఖ ప్రచురితం, 1985.
4. సుందరం, అర్వీయస్, ఆంధ్రుల జానపద విజ్ఞానం. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 1983.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

చిన్నారుల గేయాల్లో దాగివున్న చిట్టి చిట్కాలు

– డా॥. సగిలి సుధారాణి

అక్షరజ్ఞానం లేని మానవులు ఎప్పుడో ఎక్కడో అలవోకగా మౌఖికంగా చెప్పుకొన్న పాటలు, కథలు ఒకతరం నుండి మరొక తారానికి అందజేసేదే 'జానపద విజ్ఞానం'. ఇందులో చిన్నారుల గేయాలను పరిశీలించి చూస్తే మన కట్టుబొట్టు, ఆచారవ్యవహారాలతోపాటు ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలు, వావి వరుసలు, కొలతలు, కొన్ని ప్రశిద్ధ ప్రదేశాలు, తోటివారితో పంచుకొనే గుణం తదితర అంశాలను పొందుపరిచారు.

సాధారణంగా బాల్యం ఎక్కువగా ఇంట్లోను, ఇంటి పరిసరాల్లోను గడుస్తోంది. మొట్టమొదట వారు నేర్చుకొనే విద్య తల్లిదండ్రులతోనే ఆరంభం అవుతుంది. అందుకే "మాతృదేవోభవ- పితృదేవోభవ - ఆచార్య దేవోభవ" అని అంటారు. చిన్నతనంలో పిల్లలు పాడుకొనేందుకు, భాషపై పట్టును పెంచేందుకు మన పెద్దలు చిన్నారులకు చిట్టిచిట్టి గేయాలను నేర్పించేవారు. కానీ నేటి తరం పిల్లలు ఇటువంటి గేయాలకు దూరమవుతున్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులకు ముచ్చటగా మూడేండ్లు కూడా నిండకముందే నర్సరీలో ప్రవేశం కోసం ఆంగ్ల (రైయమ్స్) గేయాలను గుడ్డిగా వారితో వల్లె వేయించి తిరిగి వారు చెబుతుంటే విని మురిసిపోతున్నేరే కానీ ఆ గేయభావాలు కానీ, వాటిని ఏ సందర్భంలో పాడేవారని కానీ ఆలోచించడం లేదు. పెద్దలు మనకు చెప్పిన తెలుగు గేయాలను నేటి తరం పిల్లలకు చెప్పించడం లేదు.

తరతరాలుగా మన ఆచార సంప్రదాయాలు వచన రూపంలో చెబితే అంతగా గుర్తుండవని మన పెద్దలు పాటలరూపంలో అయితే గుర్తుండిపోతుందని కుటుంబాలలోని తమ పిల్లలకు చెప్పేవారు. ఇటువంటి గేయాలు ఒకతరం నుండి మరొక తరానికి మౌఖికంగా చేరేప్పుడు ఆ గేయాలలోని ఉన్న పదాలు ప్రాంతాన్ని బట్టి మార్పులు చేర్పులు జరుగుతాయి.

జానపద వ్యాయం మానవ జీవిత రహస్యాలకు ప్రతిబింబం వంటిది. మానవ జీవితం ఎటువంటి చీకు-చింత లేకుండా సాగిపోవాలంటే సంసారం, సిరి సంపదలు, పాడిపంటలు, కలిగిఉండాలి. అన్నీ ఉండి ఆరోగ్యం సరిగ్గా లేకపోతే ప్రయోజనం ఉండదు. "ఆరోగ్యమే మహా భాగ్యం" అని అందుకే అంటారు. అది మన సొంతం అయితే మిగతావన్నీ రాణింపులోనికి వస్తాయి. ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలు ఎన్నో చిన్నారుల పాటలలో పొందుపరిచారు. పిల్లలు స్వయంగా ఆడుకుంటూ పాడే పాటల్లో అద్భుతమైన ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన విషయాలు ఉండటాన్ని గమనించవచ్చు.

చిన్నారుల పెరుగుదలకు అన్నపానలే కావు శారీరక వ్యాయమంకూడా ఎంతో అవసరం. అందుకే చంటి బిడ్డలను ఒడిలోనో, కాళ్ళపైనో కూర్చోండబెట్టుకోని వారి శరీరాన్నిసున్నితంగా నూనెతో మర్ధన చేస్తూ, చిట్టిచేతులు తడుతూ తారంగం తారంగం తాండవకృష్ణ తారంగం... అని, బుజ్జికాళ్ళు పైకి, కిందికి కదిలిస్తూ తప్పట్లోయ్ తాళాలోయ్ దేవుని గుడిలో బాజాలోయ్... అని, చంటి బిడ్డలను కాళ్లపై కూర్చోపెట్టుకోని చేతులతోవీపు వెనక, ముందు పట్టుకోని ముందుకు వెనకకు ఊపుతూ ఈ పాటను పాడుతారు.

ఊగు ఊగు గంగెద్దా! - ఉగ్గూపాలె గంగెద్దా!
సోలి ఊగె గంగెద్దా! - సోలెడుపాలె గంగెద్దా!
తాలి ఊగె గంగెద్దా! - తవ్వెడు పాలె గంగెద్దా!
మూరి ఊగె గంగెద్దా! - మూనెడు పాలె గంగెద్దా!
ఆగీ ఊగె గంగెద్దా! - అడ్డెడు పాలె గంగెద్దా !

తెలుగునాట పసిపిల్లలకు ప్రతిదినం ఉగ్గుపట్టే సాంప్రదాయం ఉంది. చిటికెడు ఆముదంలో చనుబాలు రంగరించి ఉగ్గుగిన్నెలో పోసి పట్టిస్తారు. కాసేపు పడుకోని లేచిన తరువాత విరోచనం అవుతుంది. నేటి తరం పిల్లలకు క్వాటర్, ఆఫ్ లీటరు, లీటరు అంటే ఠక్కున అర్థం అవుతుంది కానీ ఉగ్గెడు, సోలెడు, తవ్వెడు, మానెడు, అడ్డడు అన్న తెలుగు కొలతలకు సంబంధించిన పదాలు తెలియవు. అందుకే మన పెద్దలు ఉగ్గుపాలతోనే ఇవి నోటికి వచ్చేందుకు పిల్లలకు చెప్పే గేయాల్లో పొందుపరిచారు. అంతెందుకు ఒన్,టు,త్రీ.....లు, హన్డ్రడ్స్... థౌజన్స్...లాక్స్....క్రోర్స్..మిలియన్స్...అనర్గలంగా చెప్పగలరు గానీ ఒకటి, రెండు, మూడు... పట్టు మని పది అంకెలు కూడా తెలుగులో ఠక్కున చెప్పలేరు.

ఒక్కటి రెండు ఒప్పుల కుప్ప- మూడు నాలుగు ముద్దుల గుమ్మ ఐదు ఆరు అందాల భరిణా - ఏడు ఎనిమిది వయ్యారిభామతొమ్మిది పది బంగారు బొమ్మ....

ఇటువంటి పాటలు ద్వారా అంకెలు నోటికి వస్తాయి. చంటిబిడ్డలను నిద్రపుచ్చడానికి తల్లులు లాలిపాటలు, జోలపాటలు పాడటం అనేది పరిపాటి. నిద్ర నిండైన ఆరోగ్యాన్ని కలుగజేస్తుంది.

జో అచ్యుతానంద జోజో ముకుందా
లాలి పరమానంద రామగోవిందా జో...జో....
జోలలు పాడితే బాలలకు నిద్ర నాగస్వరం పాడితే నాగులకు నిద్ర

నాగస్వరం ఊదితే పాములు నిద్రపోతాయి. జోలలు పాడితే పిల్లలు నిద్రపోతారు. ఇది పిల్లల పెంపకంలో పారంపర్యంగా వస్తున్న ఆచారం. కానీ నేడు నవ నాగరికత రంగరించుకున్న కొందరు తల్లులకు లాలిపాట పాడే తీరికలేదు. జోలపాట పాడి నిద్రపుచ్చే ఓపికలేదు. స్పీకర్‌లో మ్యూజిక్ పెట్టి తాము వేరేపనిలో మునిగిపోతున్నారు.

ఆకు అల్లం సూది సుద్ద
ఆకు పాకు కర్వేపాకు
డాండూం తుసుక్ దెబ్బ

ఇది చెడుగుడు పాట. కడుపుబ్బరానికి అల్లాన్ని సూదికి గుచ్చి నిప్పుల్లో కాల్చి కరివేపాకుతో చేర్చి నూరి తింటే ఆవన్నవాయువు (పిత్తు)బయటకు వచ్చి కడుపుబ్బరం తగ్గుతుంది.

చెమ్మ చెక్క చారడేసి మొగ్గ (బుక్క)
అట్లు పోయంగ ఆరగించంగ
ముత్యాల చెమ్మ చెక్క ముగ్గులేయంగ
రత్నాల చెమ్మ చెక్క రంగులేయంగ
పందిట్లో అమ్మాయి పెండ్లి చెయ్యంగ
(కొన్ని ప్రాంతాలలో)
పగడాల చెమ్మచెక్క పందిరేయంగ
ముంగిట్లో పాపాయి పారాడంగ (కొన్ని ప్రాంతాలలో)
పందిట్లో బాలుడు పరిగెత్తంగ

సాధారణంగా మనం ఈ పాటను చిన్నతనంలో పాడుకోని ఆడుకోనిఉంటాం. ఇందులోపరిశీలించి చూస్తే చిట్టి చిట్కాలను మన పెద్దలు పొందుపరిచారు. "రత్నాల చెమ్మ చెక్క రంగులేయంగా" అంటే - మాచకమ్మలకు (వయస్సు వచ్చినా రసజ్వల కాని వారు) ఎర్రపూలు పూసే (చెమ్మా)కొమ్మ బెరడు చారడు తెచ్చి మెత్తగా నూరి అట్లు(దోసెలు)లో వేసి బుక్కాలి(తినాలి). ఈ ఔషధం తీసుకోవడం రసజ్వల కానివారు అవుతారని, ఆపై పెండ్లి చేస్తారు కనుక "పందిట్లో అమ్మాయి పెండ్లి చెయ్యంగ" అని అన్నారు.

అలాగే ముత్యాల చెమ్మ చెక్క ముగ్గులెయ్యంగా అంటే - వివాహమై చాలాఏండ్లైనా బిడ్డలు కలగని వంధ్యలు(గొడ్రాలు) తెల్లని పూలుపూసే కొమ్మ బెరడు చారడు తెచ్చి మెత్తగా నూరి అట్లువేసి తింటే బిడ్డలు కలుగుతారని "ముంగిట్లో పాపాయి పారాడంగ" అని సూచించారు. కొన్ని ప్రాంతాలలో పగడాల చెమ్మచెక్క పందిరేయంగ అంటే పగడాలు అంటే ఉయ్యాలవేసి పందిరి అంటే 'పాలవెల్లి' కట్టడం. కొన్ని ప్రాంతాలలో "పందిట్లో బాలుడు పరిగెత్తంగ" అని అంటారు. ఏది ఏమైనప్పటికీ పెండ్లై ఇంట్లో పిల్లలు పరిగడుతుంటే ఆ

ఆనందమే వేరు. జానపద వైద్యం ఎక్కువ ఆకులు, చెట్టు బెరడులు, పళ్ళు, దుంపలు, కాయలు మొదలైవాటితో కూడుకొని ఉంటాయి. అవి ఆహార పదార్థాలతో త్వరగా జీర్ణం అయిపోతాయని మన పెద్దలు ఈవైద్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇది ఎక్కువ నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల రహస్య గుణం ఎక్కువ. మూలికలు, ఆకుపసర్లు వంటివాటిని కొన్నింటిని గోప్యంగా ఉంచడం జరుగుతుంది. ఈ పాటను మరుగున దాగిన జానపద వైద్యానికి ఉదాహరణగా తీసుకోవచ్చు.

అలాగే

కాళ్ళగజ్జ(జ్జి) కంకాలమ్మ - వేగు చుక్క వెలగా మొగ్గ
మొగ్గ కాదు మోదుగ నీరు - నీరు కాదు నిమ్మల వాయి
వాయికాదు వాయంటకూర - కూర కాదు గుమ్మడి పండు
పండుకాదు పాపడ మీసం - మీసం కాదు మిరియాల పోతు
పోతుకాదు బొమ్మలశెట్టి - శెట్టికాదు శామల మన్ను
మన్ను కాదు మంచి గంధం చెక్క - లింగు లిటుకు
పందెమాల పటుకు
కాలు పండినట్లు కడకు తీసిపెట్టు

ఈ పాటలో కాళ్ళకు 'గజ్జె' అంటే కాళ్ళకు వేసే గజ్జెలు అని అర్థం తీసుకొంటాం. పెద్ద బాలశిక్షలో కూడా ఈ గేయానికి పక్కనే కాళ్ళకు 'గజ్జెలు' వేసిన బొమ్మ దర్శనం ఇస్తుంది. ఈపాటలోని అర్థాలు సాధారణంగా ఎవ్వరికీ అంత సులభంగా అర్థం కావు. పరిశీలించి చూస్తే ఇందులో దాగివున్న అద్భుత వైద్య విజ్ఞానం మనకు అవగాహన అవుతుంది. ఇందులో గజ్జి (Eczema) లాంటి చర్మ వ్యాధులకు మందు చెప్పబడినది.

(ఒక్కోసారి పిల్లల మొకాళ్లపై చేతి వెడల్పుతో సన్నని ఆవాలు గింజలులాగ ఒకదానిపక్కన మరొకటి సందు లేకుండా వస్తాయి. దీనినే 'గజ్జి' అంటారు. కంకాలమ్మ(కచురాలు) ,వేగులచుక్క(బావాంచాలు) వెలగమొగ్గ అంటే పాదరసం 'గజ్జి'పైన రాయాలి. వెలగ మొగ్గకు బదులుగా మోదుగనీరు, వావింటాకురసం, కొద్దిగా మిరియాలు పొడి, మట్టి చిగురు వీటిలో ఏదైనా ఒక దానిని వారి వారి శరీర తత్వాన్ని బట్టి వాడవచ్చు. 'పందెమాల పటుకు' అంటే రాసేవి కాఠిన్యం లేకుండా రాసే చూర్ణం మెత్తగా ఉండాలని అర్థం. మర్ధన చేసేప్పుడు 'చూమంత్ర కాలి' లాగా 'లింగు లిటుకు' అనేది ధ్వన్యానుకరణం. చివరికి గంధం చెక్కను రాసి కాళ్ళను కడగా పెట్టాలి.

పసితనం నుండే ఆరోగ్యంగా పెరగడానికి మన పెద్దలు దేశీయమైన ఆరోగ్య రహస్యాలను పాఠించడం కోసం పాటల్లో పొందుపరిచారు. కానీ నాగరికులం అని అనుకొనే కొందరు మనప్రాచీన ఆచారాలు నిక్షిప్తమైన ఇటువంటి పాటలను అర్థరహితంగా భావించి వాటిని అనాదరిస్తున్నారు.

పాట సహజ పరిమళంతో వికసిస్తుంది. నింగి, నేల, నీరు, పల్లె, నది, అడవి, పొలం, వాటితోపాటు ఎక్కువ స్థానికీయత, మాండలిక శక్తి ఉంటుంది. ఇలాంటి అంశాలు ఏదో మేరకు కలగలసి రావాలి. ఈ సత్యం ఏభాషకైనా వర్తిస్తుంది.

నేడు ప్రపంచాన్ని కరోనమహామ్మారి ఎలా వణికిస్తుందో అలా 1665 సం.లో ఇంగ్లాండులో ప్లేగువ్యాధి (నిమోనియా ప్లేగు)వ్యాపించి చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఈ వ్యాధి లక్షణాలు ముందుగా శరీరంపై ఎర్రగా గుండ్రంగా దద్దర్లు వస్తాయి. తరువాత అవి ఉబ్బుతాయి. వాటినుండి ఒక ఘాటైన వాసన వస్తుంది. ఆ సందర్భంగా జేబులో మంజరి పూల గుత్తినిపెట్టుకొంటారు. ఆఘాటువాసనను ఈ పూలవాసన అరికడుతుంది. ఈ వ్యాధి ముదిరి పోతే హుచు..హుచు అని తుమ్ముతూ పడిపోతారు(చనిపోతారు). ఆ వ్యాధి జ్ఞాపకంగా పాశ్చాత్యులు చెప్పుకొనే గేయం.

రింగారింగా రోసెస్ (Ring - o - Ring - o Roses)
పాకెట్ ఫుల్ ఆఫ్ పోసెస్ (Pocket full of poises)
అచ్చూ..... అచ్చూ (Aichoo Aichoo) ... వి ఆల్ ఫాల్ డౌన్ (We all fall down)

ఈ వ్యాధి లక్షణాలను ఇందులో పొందుపరిచారే కానీ వ్యాధి నివారణను అందులో సూచించలేదు. ఆంగ్లేయ పాలనలో ఇటువంటి బాల సాహిత్య గేయాలు మనకు చేరినాయి. నేటికీ ఉపాధ్యాయులు పిల్లలకు ఈ ఆంగ్లగేయం చెప్పిస్తూ, దానికి అనుగుణంగా అడుగులు వేయిస్తూ పాట చివర చరణంలో పిల్లలను కూలబడేటట్లు నేర్పిస్తున్నారు. మన పిల్లలు ఇది పాడుతూ నృత్యం చేస్తుంటే తన్మయత్వంతో చూసి మురిసిపోతున్నాం.

17 శతాబ్దంలో ఫ్రెంచ్‌రాజు 16వ లూయి 'జాక్', తన పాలనలో ఎవరైనా రాజాజ్ఞను దిక్కరిస్తే అందరిముందు తల తీసే శిక్షను ప్రవేశపెట్టాడు. కొన్నాళ్ళకు జాక్ అరాచకాలు భరించలేక తిరుగుబాటు దారులు అదే విధంగా నగరం నడుబొడ్డున జాక్‌ను అతని భార్య జిల్‌ల తలలు తీసివేసారు. ఆసందర్భంగా వచ్చిన గేయమే ఇది.

జాక్ అండ్ జిల్ వెంట్ అప్ ద హిల్ (Jack and Jill went up the hill)..... అని చెప్పిస్తున్నాం.

కోతి కొమ్మచ్చి ఆడుతూ చెట్టూమీద నుంచి కిందపడి కాలువిరిగితే దానికి ఏం చికిత్స చెయ్యాలో ఈ చిట్టి గీతంలో చెప్పారు.

వానా వానా వల్లప్ప వాకిలి తిరుగు చెల్లప్ప
కొండమీది వెండిగిన్నె(గుండు రాయి) -కొక్కిరాజు కాలు విరిగె
దానికేమి మందు? వేపాకు పసుపు - వెల్లుల్లి పాయ
నూనెమ్మ బొట్టు - నూటక్క దార
పుయ్యవే నూరి - పూటకొక్క తూరి ...

ఇక్కడ 'కొక్కి' అనగా వంకర అనే అర్థం తీసుకోవచ్చు. దెబ్బ తగిలితే కాళ్ళు వంకరగా నడుస్తారు. అందుకే వేపాకు, పసుపు, వెల్లుల్లిపాయ నూనెలో కలిపి పూట కొక్కసారి పూసినట్లైతే ఎముకలు కట్టుకొంటాయని చెప్పబడినది.

ఠక్కున గుర్తుకు రావు అందుకే కొన్ని ముఖ్యమైన పేర్లు గుర్తుండిపోవడానికి ఆపేర్లకు గేయాలలో స్థానం కల్పించారు. అలాగే ఆడబిడ్డలు రసజ్వల అయినపుడు శక్తికోసం సున్నుండలు చేసిపెట్టేవారు. ఆడవారికి ఇది ఎంతో బలవర్ధకమైన ఆహారం.

ఒప్పుల కుప్ప ఒయ్యారి భామ
మినపపప్పు -- మెంతీ పిండి- తాటిబెల్లం తవ్వెడు నెయ్యి
గుప్పెడు తింటే కులుకులాడి -నడుము గట్టే నామాట చిట్టీ
ఒప్పుల కుప్ప ఒయ్యారి భామ
సన్నటి బియ్యం - చాయపప్పు పాలు నెయ్యిడి పాయసం ఒండు - నీ మగుడు తింటే ఆనందమంటే!

ఈ పాటలో మినపప్పు, ఆవునెయ్యి, తాటిబెల్లం, తవ్వెడు కలిపి గుప్పెడుతో ఉండగా చేసి తింటే నడుము గట్టిపడుతుందని(ఆడబిడ్డలను ఉద్దేశించి) ఇదినామాట అంటే పెద్దల మాటగా చెప్పబడినది. మగబిడ్డలకు ఉద్దేశించి సన్నటి బియ్యం -చాయపప్పు-పాలు నెయ్యేసి పాయసం పెడితే వారికి బలవర్ధకమైన ఆహారం అని చెప్పబడింది.

ఇది ఆరోగ్యానికి సంబంధించినటువంటి గేయం ఇందులోని ఔషధ వివరాలు చరకసంహితలో వివరించ బడ్డాయి. పీజాలు, బర్గర్లతో ఒళ్ళు హూనం చేసుకొంటున్న చిన్నారులకు ఇటువంటి బలవర్ధకమైన ఆహారాన్ని ఇవ్వాలి.

ముగింపు :

మనిషి పుట్టినప్పటినుంచి చనిపోయేంతవరకు వివిధ సందర్భాలలో పాడే పాటలు ఉన్నాయి. మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మొదలైనవన్నీ ఇందులో ఉంటాయి. ఆంగ్లయ గేయాలు చాలావరకు ఏదో సంఘటనతో ముడిపడి ఉంటాయే కానీ వాటిల్లో పరిష్కారం ఉండదు. మన గేయాలలో సమస్త విషయాలు ఉంటాయి. ఏదైనా సమస్య వచ్చినపుడు దానిలోనుండి ఏవిధంగా బయటపడలో అన్న పరిష్కారం కూడా సూచిస్తారు. ఈ ఆధునిక కాలంలో పిల్లలకు

అసలు ఏసందర్భంలో నవ్వలో ఏ సందర్భలో ఏడవాలో అన్న అవగాహనే లేదు. అది నేర్పడమే అసలైన విద్య.

చిన్నారుల మనస్తత్వం చాలా సున్నితమైనది. చిన్నతనంలో మనం నేర్చుకొన్న గేయాలు అలానే మనసులో ముద్రపడిపోతాయి. అందుకే మనకు ఇటువంటి గేయాలను నేర్పించారు. 'మొక్కై వంగనిదే మానై ఒంగునా' అని అంటారు. అందుకే మన పూర్వీకులు పాటలరూపంలోను, సామెతల్లో అద్భుతమై విజ్ఞాన రహస్యాలు పొందుపరిచారు. చిన్నతనంలో మనం నేర్చుకొన్న ఒకపాటో, కథో లేదా ఒక పుస్తకమో బాల్యంలో, యవ్వనంలో, మధ్య వయస్సులో, వృద్ధాప్యం వివిధ దశల్లో పరిశీలించిచూస్తే వివిధ అర్థాలు స్ఫురిస్తాయి. అంతర్ధృష్టితో పరిశీలిస్తే అందులోని విజ్ఞానం అవగత మవుతుంది. విద్యాలయాలలో అప్పుడప్పుడు ఇలాంటి విజ్ఞాన దాయకమైన గేయాలను బోధించాలి. అది గురువుల కనీస బాధ్యత.

బడి ఏదేశానికి ఏనాటికైనా ఎనలేని పెట్టుబడి
బడి ఏనాటికైనా కాకూడదు ఒక మొక్కుబడి
బడి సమర్థవంతంగా నిర్వహించే గురువు దేశానికి పరువు
ప్రతీ పూట పాఠం చెప్పని గురువు దేశానికి బరువు

ఆధార గ్రంథాలు :

1. జానపద గేయ సాహిత్యం - 1958 - ఆచార్య బి.రామరాజు
2. ఆయుర్వేద ఇతిహాసం - మహా మహోపాధ్యాయ వేటూరి శంకరశాస్త్రి - లఘు గ్రంథ ప్రచురణ - 1987- తెలుగు అకాడమీ - హైదరాబాద్.
3.బాలసాహిత్యం-1988, తెలుగునాట జానపద వైద్య విధానాలు - 1999 - డా. యం. కె.దేవకి.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద గ్రామదేవతలు : సాంప్రదాయాలు, ఉత్సవాలు, ఊరేగింపులు

- పంచుమర్తి నాగశుశీల & పరుచూరి గోపీచంద్, అసోసియేట్ ప్రొఫెసర్స్, ఆంగ్లశాఖ, జెకెసి కళాశాల, గుంటూరు.

అనాది కాలంలో ఒక ప్రసిద్ధి గాంచిన చెట్టు లేక గట్టురాయిని గ్రామదేవతగా విశ్వసించి ఆరాధించేవారు. అయితే ఈ అనంత జగత్ సృష్టి కర్త పరమేశ్వరుడు సృష్టించిన శక్తి పలుపేర్లతో శక్తి అంశతో గ్రామదేవతగా అవతరించింది. అతి పురాతనమైన పణిదం గ్రామంలో పోలేరమ్మ నామంతో వేంచేసి, పాడి పంటలను కాపాడి, అనవరతం గ్రామాభివృద్ధికి ఆశీర్వాదాలందిస్తున్న దైవదూతగా గ్రామంలోని హిందూసమాజం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు. పొలాలకు అమ్మ పోలేరమ్మ కాగా గంగమ్మ పానీయ దేవత. పురాణ గాథలు పరిశీలిస్తే ప్రాచీన కాలం నుండి గ్రామ దేవతారాధన కొనసాగిందని స్పష్టంగా తెలుస్తుంది. గ్రామ దేవత శక్తి స్వరూపం, శక్తికి మూలాధారం మరియు ఈ రూపానికి మారుగా రక్త కన్నులు గలిగి ఉన్నట్లు, బహుముఖాలతో నరమాలా విభూషణిగా, ఉగ్రరూపిణిగా అభివర్ణించి భక్తులచే ఆరాధన చేయబడుతుంది. చరచరాలతో కూడిన అనంతర సృష్టితో బాటు త్రిమూర్తుల ఆవిర్భావం జరుగగా పరమేశ్వర శక్తి స్వరూప సృష్టే గ్రామదేవతగా గ్రామ గ్రామాన పలురకాల పేర్లతో గ్రామ రక్షణను అభివృద్ధిని జరిపిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

దేవతల గుడి ఊరి పొలిమేర్లలో గాని, చెరువు కట్టలమీద లేక సమీపంలో గాని వ్యవసాయ భూములందు గాని పెద్ద చెట్ల క్రింద గాని నిర్మిస్తారు. పణిదం గ్రామంలో పోలేరమ్మ గుడిని పురాతన కాలంలో ఊరి బైట నిర్మించారు కానీ ప్రస్తుతం ఈగుడి ఆర్ అండ్ బి రోడ్డు ప్రక్కన ఊరిలో భాగంగా ఉత్తరదిశలో తూర్పు ముఖంగా రాతి విగ్రహంగా ప్రతిష్ఠింపబడింది. పోలేరమ్మ వారికి అభిముఖంగా ఒక శిలా రూపంలో పోతురాజు ప్రతిష్ఠ చేయబడ్డాడు. పురాణ గాథ ప్రకారం సరస్వతీదేవికి 101 మంది కూతుళ్ళు పుట్టగా పురుష సంతానం కొరవడినందున చివరి సంతానంగా మగ సంతానానికై పరమేశ్వరుని వేడుకొనగా పరమేశ్వరుడు సరస్వతికిచ్చిన వరప్రసాదమే పోతురాజని తెలుస్తున్నది.

పురాతన కాలంలో పణిదం గ్రామంలో ఉత్తర భాగాన తూర్పుముఖంగా సత్తెనపల్లి బయ్యవరం ఆర్.అండ్.బి ప్రక్కన చుట్టూ పెద్ద బండరాళ్లు పాతి మధ్యలో పోలేరమ్మ అమ్మవారి మూలవిగ్రహం ప్రతిష్ఠాపన చేయబడింది. భక్తుల వితరణతో పోలేరమ్మ గుడి పునర్మించగా ది.26.4.1993న మృగశిర నక్షత్ర యుక్త మిథున పుష్కరాంశ మందు పరమహంస పరివ్రాజకా చార్యులు శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళాశాసనాలతో పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య, ఎక్కిరాల అనంత కృష్ణమాచార్యుల సమక్షంలో భక్తుల జయజయ నినాదాల మధ్య పున: ప్రారంభించబడినది.

స్త్రీ రూపిణి యగు మహాశక్తియే ప్రపంచసృష్టి, స్థితి లయాలు కల్పన చేయు చున్నదని హిందువుల ప్రగాఢ విశ్వాసం. అట్టి మహిమాన్వితమైన భక్తి భావనతో కొలిచి పూజించే వారికి సకల కోరికలు మనోవాంఛితాలు సిద్ధింప చేస్తాయని అనుచానంగా, మహాపురుషులెల్లరు ఆదేవిని ఉపాసన చేసి ఇహపరాలను సాధించారని ఉపనిషత్తులు, ఇతిహాసాలలో, పురాణాలలో, మహాతంత్ర గ్రంథాలలో, వలువిషయాలతో బాటు దేవి ఉపానన క్రమం విపులంగా వివరించబడింది. అట్టి సర్వశక్తి స్వరూపిణికి గ్రామ పుట్టుకతో బాటు విశ్వాసాల నమ్మకాల ప్రాతిపదికన

మొక్కుబడులు భక్తులచే ప్రారంభించబడ్డాయి. ఒకరు జబ్బు నివారణకు, మరొకరు సత్ సంతానానికి, ఇంకొకరు ధన ధాన్యాభివృద్ధి చెందటానికి పలురకాలైన ఇచ్ఛాపూర్వక వాంఛలు ఫలించటానికి గ్రామదేవతల ఆరాధన వేళ్ళూనిందని తెలియుచున్నది.

'బొడ్డురాయి' గ్రామనిర్మాణం ప్రారంభదశలో ప్రతిష్ఠింపబడుతుంది. మానవునికి బొడ్డు ఎంత ప్రధాన మైనదో గ్రామానికి బొడ్డురాయి అంతే ముఖ్యమైనది. గ్రామ ప్రధాన కూడలిలో మంత్రోచ్చారణ జరిపి శుభం చేకూరాలని దైవాన్ని గ్రామస్తులు అంతా ముక్త కంఠంతో ప్రార్థిస్తూ ఒక రాయిని ప్రతిష్ట చేసి పూజలు నిర్వహిస్తారు. గ్రామాల్లో వర్షాలు సకాలంలో కురవనప్పుడు కరువు తాండవిస్తున్న సమయంలో బొడ్డురాయిపై జలాలు ధారగా పోసి ప్రార్థనలు సలుపుతారు. గ్రామ నిర్మాణ ప్రారంభదశలో స్తంభ ప్రతిస్థాపనతోబాటు మంత్రోచ్చా రణతో ఒక రాయిని పాతిపెడతారు. అదే బొడ్రాయి. గ్రామ ఆవిర్భావంలో కొద్ది కాలం వరకు వివాహ వేడుకల్లో భాగంగా పెండ్లి కుమారుడు బాజాభజంత్రీలతో బొడ్రాయి నాశ్రయించి పూజలు నిర్వహించేవారు. తీవ్ర వర్షాభావం గ్రామంలో నెలకొన్నప్పుడు బుంగలతో, బక్కెట్లతో నీళ్ళు తెచ్చి బొడ్రాయిని శుద్ధిచేసి, నీటితో అభిషేకం చేసి సవిస్తారంగా వర్షాలు కురవటానికి వాన దేవుణ్ణి పాటలతో ఆరాధిస్తారు. పణిదం గ్రామంలో బొడ్డురాయి కేంద్ర స్థానంలో నాలుగురోడ్ల కూడలి అయిన రథం సెంటర్‌లో కొన్ని వందల సంవత్సరాల క్రితం గ్రామ స్థాపన కాలంలో నెలకొల్పబడింది. శ్రీ కళ్యాణ వేణుగోపాల స్వామి దేవా లయం గుడి పునరుద్ధరణతోబాటు గోపాలస్వామి గుడి ప్రక్కనే ఉన్న బొడ్డు రాయిని కూడా ది.26.4.1993న మృగశిర నక్షత్రం మిధున పుష్కరాంశ మందు శ్రీ త్రిదండి చినజీయరుస్వామి మంగళాశాసనాలతో పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య సమక్షంలో పునఃప్రతిష్ఠ మహోత్సవం వేలాది గ్రామస్థులు వీనులవిందుగా తిల కించుచుండగా దిగ్విజయంగా నిర్వహించబడింది.

'గ్రామదేవత పోలేరమ్మ' జగత్ సృష్టికి మూలమైన పరమేశ్వరుడు సృష్టించిన శక్తి గ్రామదేవతగా ఆవిర్భ వించిందని పురాణాలు తెలుపుతున్నాయి. గ్రామ దేవత లుగా పోలేరమ్మ, అంకాళమ్మ, గంగానమ్మ, గ్రామాల్లో ప్రధాన గ్రామ దేవతలుగా పూజింపబడుతున్నారు. ఈ ముగ్గురు దేవతలు వ్యవసాయానికి ముడిపడి ఉం డుటచేత గ్రామ వాసులకు ఆరాధ్యదేవత లైనారు. పాలాలకు పోలేరమ్మ తల్లి, అంకణాలకు (భూ పరిణా మానికి) అంకాళమ్మ తల్లి, నీరుకు గంగానమ్మ తల్లి ముఖ్య దేవతలుగా ఉన్నారు. ఈ గ్రామ దేవతలు శక్తి స్వరూపిణిగా ప్రధాన అంశగా పెద్ద ముఖం కలదిగా ఉంటుందని పురాణాలలో వర్ణించబడింది. గ్రామ దేవతల దేవాల యాలు ఊరి పొలిమేర్లలో గాని, వ్యవసాయ భూములు, వృక్షాల క్రింద నిర్మించేవారు. దేవతల ఆలయాలకు విధవరాండ్రు (స్త్రీలు) కానీ, బ్రాహ్మణేతరులుగాని అర్చ కులుగా ఉంటారు. పణిదం గ్రామంలో ఇట్టి ఆచారం అమలులో లేదు.

పార్వతీ దేవికి 101 మంది కుమార్తెలు జన్మించగా మగ సంతానం కొరకు పరమేశ్వరుని వేడుకొనగా ఒక మగసంతానాన్ని ప్రసాదించాడు. అయనపేరే పోతురాజు గ్రామ పుట్టుకతో బాటు విశ్వాసాల ప్రాతిపదికన మొక్కు బడులు భక్తులచే ప్రారంభించబడ్డాయి. ఒకరు జబ్బు నివారణకు మరొకరు సత్ సంతానానికి, ఇంకొకరు ధన ధాన్యాభివృద్ధి చెందటానికి పలురకాలైన ఇచ్ఛాపూర్వక వాంఛలు ఫలించటానికి గ్రామ దేవతల ఆరాధన వేళ్ళూనిందని తెలియుచున్నది.

'పోతురాజు' ఏడుగురు గ్రామదేవతలకి ఏకైక తమ్ముడు. 101 పేర్లతో జాతీయస్థాయిలో వివిధ ప్రాంతాలలో వేర్వేరు పేర్లతో అమ్మదేవతలు లేక మాత్రు దేవతలు లేక అక్కదేవతలు/అమ్మోర్లని పిలువబడు తున్నారు. అయితే ముఖ్యంగా పోలేరమ్మ, అంకమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ, బంగారమ్మ, మాతమ్మ ఎల్లమ్మ అనే పేర్లతో పిలిచే ఏడుగురు అమ్మలు ఒక్కొక్క

ప్రదేశంలో భిన్నమైన పేర్లతో పిలుస్తున్నారు. వీరినే ఏడుగురు అక్క దేవతలుగా ఆరాధిస్తున్నారు. ఈఏడుగురు అమ్మలకు ఉన్న తమ్ముడే పోతురాజు. పోతరాజు లేకుండా జాతర, తిరునాళ్ళు, బోనాలపండుగలు తెలుగు ద్రవిడ రాష్ట్రాలలో నిర్వహించరు. ఉత్తర భారతదేశంలో అమ్మదేవతల పూజలు ఉన్నాయి. కాని పోతురాజు మాత్రం ఉండడు. ఆషాఢమాసంలో 7గురు అమ్మదేవత లందరూ ఆకలితో భోజనం (బోనం) కోసం ఎదరు చూస్తారట. ఈ అక్కదేవతలకు సంవత్సరంలో ఒక్క పర్యాయమైనా బోనం పెట్టపోయినా, బలి ఇవ్వకపోయినా కోపగించి ప్రాణికోటికి అనేక వ్యాధులు సంభవిస్తాయని అనాది నుండి భక్తుల నమ్మిక. తెలుగు ప్రాంతాలలో నిర్వహించిన త్రవ్వకాలలో ఏడుగురు అమ్మతల్లుల విగ్రహాలు ఒకేరాతిపై చెక్కిన 7వ శతాబ్దానికి చెందిన కొన్ని 7గురు మాతృదేవతల/అమ్మతల్లుల విగ్రహాలు లభ్యమయ్యాయి. వీరినే సప్తమాతృకలని పిలుస్తారు. ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలలో, 101 పేర్లతో ఏదోఒక పేరుతో అనగా పోలేరమ్మ, నూకాలమ్మ, తలుపులమ్మ, పైడమ్మ, ముత్యాలమ్మ, గంగానమ్మ, అంకమ్మ, మాతమ్మ, బంగారమ్మ ఎల్లమ్మ వగైరా పేర్లతో విధిగా అమ్మవారి ఆలయం నిర్మించి ఆరాధిస్తున్నారు. ప్రతి అమ్మ వారి గుడికి ముందుభాగంలో తప్పకుండా రాయి రూపంలోనో లేక కళ్ళుగుంజరూపంలోనో కొద్ది దూరంలో అమ్మవారి తమ్ముడు పోతురాజు బోనాల పండుగ దినాన ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో, స్త్రీలు ఎత్తుకునివచ్చే బోనాలకుండపైన అమ్మవారిని ప్రతిష్ఠించి ఊరేగింపులలో పాల్గొనగా వీరికి రక్షణగా, దుష్టశక్తులు దరిచేరకుండా పోతురాజు వేషంలో, పెద్ద జులపాలు, వంపులు తిరిగిన కోరమీసం, ఒంటిపైన పులుంకొన్న పసుపు, నుదుట పెద్దఎఱ్ఱకుంకుమబొట్టు, కాళ్ళగజ్జలతో రక్తపు రంగులో బైటకు తెరిచిన పెద్దనాలుకతో బోనాలబండి ముందు చిందులేస్తూ ఉండగా ఊరేగింపు ముందుకు సాగుతుంది. ఊరేగింపులో పోతురాజు విసరివేసే నిమ్మకాయలను భక్తులు అమ్మవారి ప్రసాదంగా స్వీకరిస్తారు.

రామావతారంలో ఉన్న శ్రీమహావిష్ణువుని లక్ష్మీదేవి ప్రేమించగా రాముడు నిరాకరించగా, వచ్చే జన్మలో గొల్లవంశంలో పుట్టతావని శపించింది. శ్రీరాముడుకూడా నీవుకూడా కామేశ్వరి పేరుతో, నామీద వలపుతో పరి తపిస్తావని ప్రతిశాపం పెడుతూ తదుపరి వచ్చు కాలంలో తానుకల్కి అవతారంలో ఉండగా తనను పొందగలవని శాపవిమోచనం లక్ష్మీదేవికి తెలిపాడు. యాదవకులంలో శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణునిగా జన్మించగా, లక్ష్మి, కామేశ్వరి పేరుతో మహాదేవుని పుత్రికగా పుట్టి విరహంతోనే గడిపింది. మహాదేవుని కూతురుగా పుట్టకపూర్వం ఘోరతపస్సుతో శివుని ఆరాధించి తనను కూతురుగా పొందుమని విన్న వించింది. అదుకు శివుడు "తాను తపస్సులో నిమగ్నమై ఉన్నానని గౌరీదేవిని పరిణయమాడిన తదుపరి నాకు కుమార్తెగా పుట్టగలవని అప్పటివరకు తాను ఎంచుకున్న కొలనిలో లక్ష్మీదేవిని ఉంచాడు. శివునికి పార్వతితో వివాహం జరిగి కుమార్లు కలిగిన పిమ్మట, ఒకదినాన ఆదిలక్ష్మి ఉన్న కొలనులో విహారానికి రాగా ఆకొలనులోని నీటిని ఏడుదోసిళ్ళు త్రాగగా ఆనీటితోబాటు కామేశ్వరీ పార్వతి గర్భంలో ప్రవేశించింది. అప్పుడు పార్వతికి పెరవాణి, శివవాణి, కొండవాణి, ముద్దరాలు, జుక్కు లమ్మ, కామవలి, శార్వాణి అను ఏడుగురు కన్యలు జన్మించారు. ఈఏడుగురు కుమార్తెలను మనతోబాటు తీసుకునిపోయి పెంచుదామని పార్వతి శివునికోరగా, వీరుమన చెప్పుచేతల్లో ఉండక స్వేచ్ఛగా తిరుగుతారు కావున, వీరిని వదిలేద్దామని పార్వతి వినతిని ఒప్పు కొనలేదు. అప్పుడు ఆఏడుగురు కన్యలను కాపాడుటకై పోతురాజును సృష్టించి శివపార్వతులు నిష్క్రమిస్తారు. కొంతకాలం తదుపరి బ్రహ్మ అచ్చటికివచ్చి దాదెమ్మ అను స్త్రీని సృష్టిగావించి ఆఏడుగురకు రక్షణ కల్పించాడు. కూనలమ్మ అను మరొక స్త్రీని సృష్టించి పోతురాజుకిచ్చి వివాహంచేసి వారికి కావలసిన సకల సదుపాయాలు కల్పించాడు. కొంతకాలం గడిచిన పిమ్మట కామపల్లి శివుని ఆశ్రయించి, వరాన్ని పొందింది. శివస్వామి వెంటనే

ఇరువురు యక్షులను రావించి వారికి జక్కులముద్రలతో బాటు మద్దెల, ఉరువు అనుపేరుగల సంగీతవాద్యం, ముత్యాలు పొదిగిన అలంకారవస్తువులు ఇచ్చి కామపల్లి అమ్మ (అమ్మ దేవతలు/ అమ్మతల్లుల కథను వంశానుగతంగా గానంచేస్తూ జీవనం కొనసాగించండని ఆశీర్వదించాడు. వీరినే జక్కులు లేక జముకుల వారుగా సమాజంలో గణతికెక్కారు. ఈకామపల్లి కథ అనగా ఏడుగురు అక్కలకథలోనే పోతురాజు జన్మవృత్తాంతం కలిసి ఉంటుంది. కామపల్లి మహాలక్ష్మి గాథను అన్ని తెగలు కులాలువారు, ప్రత్యేకించి బ్రాహ్మణుల గృహాలలో వ్రతనిర్వహణలో భాగంగా గానం చేయబడుతుంది. ప్రఖ్యాతి గాంచిన ఈఅమ్మవారి కథ మహిళల పాటలలో ముఖ్యమైన పాటగా చేర్చబడింది. వినుకొండ వల్లభ రాయుడి క్రీడాభిరామం వీధినాటక ప్రదర్శనలో మరియు ఎల్లమ్మకథలు చెప్పనప్పుడు జక్కులవారు కామపల్లి మహాలక్ష్మి గాథను గానంచేస్తారు. ఈ జక్కులవారినే బైండ్ల, జముకులు/జక్కులవారుగా పిలుస్తారు. వీరు తెలంగాణా, ఆంధ్రా రాష్ట్రాలలో ఇప్పటికి తమకులవృత్తిని అంటిపెట్టుకుని ఎల్లమ్మ (పరశురాముని) కామపల్లి కథను ప్రత్యేకంగా పల్లె ప్రాంతాలలో శ్రావ్యంగా గానం చేస్తూ ఉపవృత్తిగా మలుచుకున్నారు. జక్కులవృత్తికి ఆదరణ తగ్గగా ఉదరపోషణార్థం వేరేవృత్తులను ఆశ్రయించి తీరిక సమయాల్లో జక్కులగానాన్ని ఆలపిస్తు న్నారు. అమ్మవారి గుళ్ళలో జాతర ఉత్సవాల్లో పోతురాజు రక్షణ కవచంగా ఉంటున్నాడు.

వివిధ ప్రాంతాలలో పరబ్రహ్మణి, మహాకాళి, మహా సరస్వతి, రాజరాజేశ్వరి,గాయత్రీ, భవాని,కనకదుర్గ, పార్వతి, మహిషాసుర మర్ధని, మీనాక్షి కన్యక, భగళ మొదలైన విశేషార్థాలైన నామాలతో పూజింపబడు తున్నారు.

ఆ మహాదేవి శక్తులు అంకమ్మ, అంకాలమ్మ, పోతమ్మ ఎల్లమ్మ, గంగమ్మ, గంగానమ్మ, పల్లాలమ్మ, పెద్దమ్మ, పెద్దింటమ్మ, పోలేరమ్మ, మారమ్మ, మావుళ్ళమ్మ, ముత్యాలమ్మ, నాంచారమ్మ, వెంకమ్మ, మహంకాళమ్మ, మంగమ్మ, గోగులమ్మ, తలుపులమ్మ, పోచమ్మ, బతుకమ్మ, కోట్లమ్మ, మాచారమ్మ, వెలగమ్మ, కట్టమ్మ, నూకమ్మ, గౌరమ్మ, పైడితల్లి వగైరా పలు పేర్లతో ఆ దేవత ఆయా గ్రామాలకు రక్షణ కల్పిస్తుందని విశ్వసించి ఆయా గ్రామాల ఆచారాలను అనుసరించి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒక్కొక్క ప్రాంతంలో వేర్వేరు పేర్లతో గ్రామదేవతను ఆరాధిస్తున్నారు.

'పోలేరమ్మ కొలుపులు'- కలరా, మసూచి లాంటి భయంకర అంటువ్యాధులు గ్రామంలో ప్రబలినప్పుడు అమ్మవారికి (పోలేరమ్మ తల్లికి) కోపం వచ్చిందని, కినుక వహించిన ఆతల్లికి శాంతి నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయం గైకొని ఊర్లో చాటింపు వేయిస్తారు. గ్రామ కుమ్మరిని అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయమని, వడ్రంగిని చెక్కతో బండి తయారు చేయుమని కోరతారు. పోలేరమ్మకు బలి ఇవ్వడానికి దున్నపోతును తయారుగా ఉంచుతారు. ఉత్సవం నిర్వహించే రోజున దున్నపోతును స్నానం చేయించి దానిపై పసుపు నీళ్లు చల్లుతారు. దాని మెడలో వేపాకు దండ మరియు కొమ్ములకు వేప మండలు కట్టి కుంకుమ బొట్టుతో అలంకరించి అమ్మ వారిని పూజించి మధ్యాహ్నం మేళతాళాల వేడుకలమధ్య మాల మాదిగలు ప్రధానపాత్రధారులుగా గ్రామంలో ఊరేగిస్తారు. ఊరేగింపుకు ముందు ప్రధాన మాదిగ డప్పు వాయిస్తూ అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతు వచ్చిందని పెద్దగా చెబుతాడు. ఈ వార్త విని ప్రతి ఇంటి గృహిణి దాని కాళ్ళపై నీటితో వారు పోసి నమస్కరించి మాల మాదిగలకు అన్నదాన సమర్పణ చేస్తారు. ఈ ఊరేగింపు రాత్రి 7 గంటల వరకు కొనసాగుతుంది. తదుపరి ఆ దున్నపోతును ఊరిలోని కేంద్ర స్థానాల్లో ఒక కొయ్యకు కట్టి ఉంచుతారు. దేవతకు ఒక గొర్రెను బలి ఇచ్చి దాని రక్తంతో బలిఅన్నాన్ని తడిపి దున్నపోతు ప్రేగులు వేసి కలుపుతారు. అట్టి అన్నంలో సగభాగం గంపకు ఎత్తుతారు. దేవతకు బలి ఇచ్చే నైవేద్యం బలిరక్తంతో

తడిసిపోతుంది. దీనిని గ్రామస్థులు అమ్మవారి ప్రసాదంగా సేకరించి తీసుకుపోతారు. తాము సమర్పించిన అన్నం లోని సారాన్ని పోలేరమ్మ తల్లి తీసుకుంటుందని మిగి లింది మాత్రమే తమకు మిగుల్చుతుందని నమ్ముతారు.

ప్రథమంగా బలి ఇచ్చిన గొర్రె పేగులను మాల/ మాదిగ పూజారి మెడలో వేసుకొని దాని పచ్చి కాలేయాన్ని (లివర్) నోటిలో ఉంచుకుంటాడు. వీరిలోనే మరొక ప్రధాన వ్యక్తి బలి అన్నం గంపను నెత్తిపై పెట్టుకొనగా వీరితో ఊరేగింపు గ్రామంలో పయనమౌతుంది. గొర్రె పేగులు మెడలో వేసుకున్న వ్యక్తి పూనకం వస్తుందేమోనని ఇద్దరు వ్యక్తులు చెరిఒక ప్రక్కన పట్టుకుని జాగ్రత్తగా నడిపిస్తారు. ఒకవేళ ఒళ్ళు తెలియక పరిగెత్తు తాడని ముందుగానే అతని నడుముకు తాళ్ళు కట్టి దానిని మరొకరు పట్టుకుని నిదానంగా జాగ్రత్తగా నడిపిస్తారు. ఆ వ్యక్తి చుట్టూ జనం గుమిగూడి దుష్టశక్తులను తరిమి వేయడానికి కఱ్ఱలు కత్తులు చూపుకుంటూ నిమ్మ కాయలను కోసి పైకి ఎగరేసి బలి బలి అంటూ పొలి కేకలతో నినదిస్తూ ఊరేగింపు ఆరంభిస్తారు. పొలిగంప మోస్తున్న వాడు రాక్షస శక్తులను దూరంగా పార ద్రోలటానికి గాను గంపలోని పొలిఅన్నం బజార్లలో గృహాల పైన చల్లుతూ ఉండగా ఊరేగింపు కొనసాగుతుంది. ఒకవేళ బలిగంప మోసే వ్యక్తి అచేతనుడైనచో ఒక గొర్రెను అచ్చట బలి ఇచ్చి నిమ్మకాయ కోసి కొబ్బరికాయ కొట్టి నమస్కరిస్తారు. ఈ విధంగా ఊరేగింపు పోలేరమ్మ గుడి వద్దకు ప్రొద్దు వాలే లోగా చేరుతుంది.

మరుసటిరోజు దున్నపోతు బలి తతంగం మాదిగ కులస్తులు మాత్రమే చేస్తారు. బలిచేసిన దున్న మాంసాన్ని కోసి వండి అన్నంతో కలిపి ఊరి మాదిగలు 5 గురకు పెడతారు ఎవరి దృష్టి వీరిపైన పడకుండా దుప్పటి కూడా కప్పుతారు. గ్రామ వాసులు మొక్కుబడులు, ముడుపులు చెల్లించి మేకలు, కోళ్లు, గొర్రెలను చాకలి పూజారి చేత బలి ఇప్పిస్తారు. తదున్నపోతు బలి మాత్రం మాదిగ పూజారి ఇచ్చి తలను వేరుచేసి అమ్మవారికి సమర్పిస్తాడు. తదుపరి గ్రామస్తులు ఊరేగింపుగా కంసాలి గృహానికి పోయి తయారైన చక్కబండికి మేకను బలి ఇచ్చి నైవేద్యం సమర్పించి బండి తయారుచేసిన వడ్రంగికి నూతన వస్త్రాలు మోయిను ఇచ్చి బండిని మేళతాళాలతో బలి స్థలానికి తెస్తారు. బలిగా ఇవ్వబడ్డ దున్నతల తప్ప మిగిలిన అన్ని జంతువులు అవయవాలను మాదిగ మాల వారు తీసుకు వెళతారు. బలి యిచ్చిన దున్న తలను మాత్రం పందిరి లోనే పదిలంగా ఉంచుతారు.

సాయంత్రం అమ్మవారికి ప్రథమంగా ఒక మేక పిల్లను బలి ఇచ్చి దాని రక్తంతో అన్నాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. అప్పుడే ఒక పందిని మెడ లోతు వరకు భూమిలో పాతిపెడతారు. బలి ఇచ్చిన మేక నెత్తురుతో తడిసిన బలి గంపను ఒక మాదిగ మోస్తూ గ్రామస్థులతో ఊరే గింపుగా పందిని పాతి పెట్టిన ప్రదేశానికి వస్తాడు. గ్రామంలోని పశువులను ఆ పంది మృతి చెందేవరకు తలపైన తొక్కిస్తూ పశువులపై బలి రక్తం అన్నాన్ని చల్లుతారు. ఈ ప్రక్రియతో పశువులకు రోగపీడల నుండి విముక్తి లభిస్తుందని నమ్ముతారు.

కుమ్మరి చేసిన దేవత విగ్రహాన్ని, చాకలి, పూజారి పందిరి నుండి బైటకు తీసి శిరస్సుపై పెట్టుకుంటాడు. ఒక మాదిగపెద్ద, నోట్లో దున్నపోతు కాలు, తలపై దీపంతో ఉన్న దున్నపోతు తలను పెట్టుకొనగా, అది ఒరిగిపోకుండా దున్న తలను మోసే వాడి ప్రక్కన మరొకరు ఉండి పట్టుకుంటాడు. ముందుగా దున్న తలను తలపై ధరించిన మాదిగ పయనిస్తూ ఉండగా, అతని వెనుక దేవత విగ్రహం శిరస్సుపై ధరించిన వ్యక్తి వీరిద్దరి వెనుక ఉన్న చెక్క బండి, వీరి వెనుక గ్రామస్థులు నిలబడి ఊరేగింపుగా మేళాల మోతలో అమ్మవారి నామస్మరణతో ఊరి పొలిమేర అంచు వరకు వస్తారు. పోలేరమ్మను ఆట, పాటలతో ఆరాధించి ఊరేగింపుగా వచ్చిన వారికి పసుపు కుంకుమలు పంచిపెడతారు. దేవతపై ఉన్న ఆభరణాలను తొలగించి విగ్రహాన్ని ఊరి పొలిమేర అవతలి వైపు అనగా ప్రక్క గ్రామ పరిధిలో

పెట్టి వెనుదిరుగుతారు. దున్న తలను దానిపై ఉన్న దీపాన్ని మోస్తున్న వ్యక్తి తల పైన ఉన్న దీపాన్ని ఆర్పిన తదుపరి తలను మోసిన మాదిగ వ్యక్తి దానిని ఇంటికి తీసుకుని వెళ్లి దానిని వండి విందుగా భుజిస్తారు. ఇంతటితో కొలుపులు జాతర ముగుస్తుంది. ఈ విధంగా పొరుగూరి స్థలంలో అమ్మవారి విగ్రహాన్ని వదలి నందున వారి గ్రామంపై అమ్మవారికి ఉన్న కోపం హరించి తమ గ్రామానికి పట్టిన పీడ విరగడవుతుందనే నమ్మకం, ఆత్మతృప్తితో సంతోషిస్తారు.

పణిదం గ్రామంలో మహాదేవి శక్తి స్వరూపమైన పోలేరమ్మ తల్లిని గ్రామదేవతగా గ్రామస్థులంతా పరమ పవిత్రంగా భావించి భక్తి భావనతో పూజిస్తారు. ముఖ్యంగా కొలుపులు, ఉత్సవాల సందర్భంలో గ్రామం అనావృష్టితో అలమటిస్తున్నప్పుడు గ్రామదేవతను కొలిచే సందర్భంగా పెద్ద కప్పను (గొండ్రుకప్పను) తలకిందులు చేసి కాళ్లను తాళ్లతో వెదురు కర్రకు కట్టి వేపాకుతో అలంకరించి, ఇద్దరు బాలురు ముందు ఒకరు వెనుక ఒకరు మోస్తూ పోలేరమ్మను స్తుతి ప్రార్థనలతో గుంపులుగా గ్రామ పెద్దలు, పిన్నలు ఊరేగింపుగా వెంటరాగా ఇంటింటికి మహిళలు వారు పోసి, తప్పెట తాళాలు వైవిధ్యమైన నాట్య విన్యాసాల మధ్య నమస్కరిస్తూ ఉండగా గ్రామంలో వీధివీధినా తిరుగుతూ వర్షాలు కురవడానికి గ్రామ దేవత పాటలు పాడుతూ అమ్మవారికి నీరాజనా లర్పిస్తారు. పోలేరమ్మ కొలుపులు ఉత్సవ సందర్భంగా అమ్మవారి గుడి వద్ద పూజ కార్యక్రమం నిర్వహించి పొంగళ్ళతో పూజలు, జంతుబలులు గావించి కుంకుమ బండితో అమ్మవారి పటంతో గ్రామంలో వీధివీధిన ఊరేగుతారు.

పణిదం గ్రామంలో పోలేరమ్మ దేవత నిమ్మగడ్డ వారి ఆధ్వర్యంలో ప్రధాన నిర్వాహకులుగా ముందుండి ఆరాధనలు నిర్వహిస్తారు. అమ్మవారి నైవేద్యాన్ని గ్రామం శివారు చుట్టూ ఊరేగింపుగా పాలి బొచ్చతో రక్షణార్థం చల్లుతారు. ఆవిధంగా కొలిచినందువలన గ్రామాన్ని పోలేరమ్మ దేవత చీడపీడల నుంచి రక్షించి పాడిపంటలు సమృద్ధిగా కలుగజేస్తుందని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఈ పవిత్రమైన కార్యాన్ని స్వర్గీయ నిమ్మగడ్డ చంద్రయ్య మరియు వారి పూర్వుకులు నుండి బాధ్యత స్వీకరించి అవిఘ్నంగా శాస్త్రీయంగా గ్రామస్థుల సమష్టి సహకారంతో భక్తి భావనతో నిర్వహించేవాడు.

కొలుపులు కార్యక్రమానికి రజకులు మాదిగలు, కుమ్మరులు, యాదవులు ముఖ్య భూమిక పోషిస్తారు. సమీప గ్రామమైన కట్టమూరు నుండి పణిదం పోలేరమ్మ గుడి పెద్దల కోరికమేరకు 'బైనీడి' వారు వచ్చి జంపన వగైరా వాద్యాలతో ఊరేగింపులో పాల్గొని నాట్య విన్యాసాలు చేస్తూ జాతర ప్రాశస్త్యాన్ని కొలుపుల పాటల రూపంలో రాగయుక్తంగా వివరిస్తారు. మాదిగ ప్రధముడు పోలేరమ్మ దేవతకు బలి ఇచ్చిన దున్నపోతు తలను వేరుచేసి రక్తం చిందుతూ ఉండగా నెత్తిన పెట్టుకొని మధ్యరాత్రి వరకు పణిదం గ్రామంలో ప్రతివీధిలో ఊరేగిన తదుపరి ఊరేగుతూ ఊరి పొలిమేర హద్దు వరకు ఊరేగింపుగా పోయి పొలిమేర అవతల కొబ్బరి కాయ కొట్టి బలిభోజనం అర్పించిన తదుపరి 'బైనీడి' వారిచే భక్తుల సమక్షంలో అమ్మవారి గుడి లేక రధం సెంటర్లో పోలేరమ్మ కథను చెప్పి ఆశీర్వాదం పొందు తారు.

ఈ గ్రామదేవతను ప్రగాఢంగా ఆరాధించే వారిలో యాదవులు, కుమ్మర్లు ప్రముఖంగా చెప్పవచ్చును. వీరు వారి శుభకార్యాలు ప్రారంభించేముందు అమ్మవారిని ప్రార్థించి దీవెనలు స్వీకరించిన తదుపరి మాత్రమే మిగిలిన కార్యక్రమంలో వరుసక్రమంలో నిమగ్న మవుతారు.

గ్రామాల్లో భయంకర అంటువ్యాధులు (మసూచి, అమ్మవారు, ప్లేగువ్యాధి, కలరా వగైరా) వ్యాప్తి చెందిన సందర్భంలో వాటి నివారణకు నిర్వహించే గ్రామ కొలుపుల సందడిలో ప్రధాన భూమిక బైనీడివారిదే. వీరినే **'బైండ్ల కొమ్ముల'** వారు అని కూడా పిలుస్తారు ప్రథమంగా గ్రామ

కేంద్రస్థానంలో. ఎండు జొన్న చొప్పుతో ఇప్పుడు (గ్రామంలో జొన్న పంట లేదు) పునర్నిర్మించి అమ్మవారి విగ్రహం తాత్కాలికంగా పెడతారు. దీనినే పురం అని పిలుస్తారు. తదుపరి కుమ్మరి వారు శక్తి విగ్రహాన్ని తయారు చేసి పురం ఎదుట పంచమ ముగ్గులు వేసి రాత్రివేళ పూజలు నిర్వహించి శక్తిని సాగనంపుతారు. మరుసటి ఉదయాన గ్రామస్థులు రొట్టెలు, చుట్టలు వగైరా తెచ్చి పురంలో ఉంచుతారు. ఆ తదుపరి గ్రామంలో కొలువై ఉన్న పోలేరమ్మ తల్లికి బలి పశువులతో ఊరేగి దున్న పోతును, మరక పొట్టేలును బలి ఇచ్చి జాతర కార్యక్రమం నిర్వహిస్తారు. అమ్మవారికి వడపప్పు నైవేద్యం, పానకం బైనీడివారి నేతృత్వంలో భక్తుల సమూహంలో సమర్పిస్తారు.

తదుపరి బైనీడివారు ముందుగా వినాయకుని 'గణనాయక బ్రహ్మగణనాయక'! ముందు నీకు వంద నాలు గణనాయక అని ప్రార్థనాగీతం ఆలపించి, అమ్మవార్ల కథలు, రామాయణ, భారత, భాగవత కథలను వచన గేయ రూపంలో వారి వైవిధ్యమైన వాయిద్యాలతో మేళవించి తమ ప్రత్యేకమైన 'సుద్దుల' ద్వారా రాగాలాపన చేస్తూ గ్రామస్థులకు అర్థమైన రీతిలో ప్రాచీన విజ్ఞానాన్ని బోధిస్తారు. సభాస్థలిపై కథలు చెప్పు సందర్భంలో వీరు వేషంలో భాగంగా పంచె అందంగా ధరించి తలపాగాతో నడుముకు శాలువాను ఆకర్షణ ఉట్టిపడేవిధంగా చుట్టుకుంటారు. పాదాలకు గజ్జెలు కట్టి, నొసట కుంకుమ బొట్టు పెట్టుకొని వారి ప్రత్యేక వాయిద్యమైన తోలుతో తయారుచేసిన 'తిత్తితో' వారు పాడే పాట

సుద్దులతో శృతి కలిపి వాయిస్తూ అందుకు తగిన విధంగా కదలికలు, నర్తన సమ్మేళనంతో చూపరులను విశేషంగా ఆకర్షించి పాట ప్రసంగాలతో లయింపజేస్తారు. వీరి జట్టులో ఉన్న నలుగురు సభ్యులలో ఒకరు తిత్తి వాయించడానికి, రెండవవాడు జోడు, మూడవ వాడు సుద్దులు, వచనాల ద్వారా కథలు చెబుతూ ఉంటే నాలుగవ వాడు పిట్ట కథలతో పాత కొత్త సామాజిక జీవన విధానానికి సంబంధం ఉన్న హాస్యోక్తులతో సభికులను ఆకట్టుకుంటాడు. కొన్ని అశుభ కార్యక్రమాల్లో కొమ్మును పెద్ద సుదీర్ఘ. శబ్దం వచ్చేటట్లు ఊదుతారు.

పోలేరమ్మ తిరునాళ్ళు జంగాల కళారాధన, బుడిగి జంగాల వైవిధ్యభరితమైన వీరి వాద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నది. వీరు ఉపయోగించే కిన్నర వాయిద్యం చిన్న వీణవలె ఉండి చేతుల్లో ఇమిడి పోతుంది. దీనికి ఒక ప్రక్కన పిడి చివర సన్నని తీగ చుట్టబడి మధ్యన మూడు చిన్న గుండ్రని బుర్రలు కలిగి ఉండి శ్రావ్యమైన ధ్వనిని పాటకు అనుగుణంగా ఆలపిస్తుంది. ప్రదర్శన కాలంలో కథకులు కిన్నెర వాయిద్యాన్ని పాట శృతికి అనుగుణంగా మీటుతూ రాగాలాపన చేస్తూ చారిత్రక కథలను గానం చేస్తూ పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా జనాలను రంజింపజేసే విధంగా ప్రదర్శనలు ఇస్తారు. **'శారదా'** అనే వీణ ఆకృతిలో ఉన్న వాద్యాన్ని కథకుడు భుజంపై ధరించి ఒక చేతితో పట్టుకొని మీటుతూ రెండవచేతితో తాళాలు చేబూని అనుగుణంగా వాయిస్తూ సభికులను సమ్మోహితులను చేస్తాడు. వీరి వాయిద్యం సరస్వతి దేవి ప్రసాదమని అందుచేత దీనికి శారద అనే నామకరణం చేశారని కథా ప్రారంభంలో చెబుతారు. వీరు శారద, కిన్నెర వృత్తాంతాలు, బొబ్బిలి రాజు కథలు, దేశింగురాజు కథలు, సర్దార్ పాపన్న వగైరా వీరగాథలు, చారిత్రక గేయాలు కర్ణపేయంగా ఆలపిస్తారు. తోడు వచ్చిన మహిళా శారద వాద్యాన్ని మగవారు 'ధక్కీని' ధరించి గానం చేయడానికి మహిళకు ప్రాధాన్యం ఇస్తారు. వీరి ప్రధాన వృత్తి కళారాధనే గ్రామ జనుల కోర్కె మేరకు పోయి అచ్చట జరిపే ఉత్సవాలు ఊరేగింపులలో తమ కళా ప్రావీణ్యానికి తోడుగా అభినయం, నాట్య విన్యాసాలను మేళవించి రసానుభూతిని కలిగించి సభికులను తన్మయులను చేస్తారు. ఈ ప్రదర్శనలో ఉండే ముగ్గురులో ఒకరు గానం, మిగిలిన ఇద్దరూ వంత పాటగాళ్లుగా ఉండి ఫక్కీలపై తాళయుక్తంగా వాయిస్తూ భిన్నమైన రాగాలను తమ వాయిద్యాలపై పలికిస్తారు.

ఈ జంగాల బైనీడీ వారు మంచి 'జానపద కళాకారులుగా' గణుతికెక్కారు.

అయితే ప్రస్తుత కాలంలో ఈకథలకు ఆదరణ తగ్గింది. గ్రామాల్లో పోలేరమ్మ తిరునాళ్ళు, కొలుపులు కొలుస్తున్నారు కాని నేటి వేడుకల్లో బైనీడి, బుడిగిజంగాల జానపద కళాకారుల ఆదరణ క్రమంగా క్షీణించింది. పణిదం గ్రామంలో పూర్వపు రోజుల్లో ఈ పర్వదినాల్లో వీరిని విధిగా పిలిపించి కథలు చెప్పినప్పుడే ఈ పండుగ దినాలు సంపూర్ణమైనట్లు తృప్తి చెందేవారు. అయితే ఇప్పుడు పోలేరమ్మ కొలుపులు కొలిచినా పూర్వవైభవం నామమాత్రంగా గోచరిస్తుంది.

జంగం దేవర్లు, బుడికి జంగాల ప్రతిభాపాటవాల ముందు ప్రస్తుత సినిమా కళాకారులు హీరోలు వారి ప్రతిభముందు సరితూగలేరు. ఆటాపాట, వాద్యం, స్వరకల్పన, స్వరం వారే చేస్తున్నారంటే వారి గొప్ప ప్రతిభకు, వేరే నిదర్శనం ఏమి కావాలి? వీరిహావభావాలు, ఆట, పాట, ఆలాపన, పదోచ్చారణ ప్రకృతిపరంగా అందంగా ఉండి సహజత్వం ఉట్టిపడుతుంది. మాయదారి సినిమాలు వచ్చి సెక్స్‌తో నింపి త్రిడిబొమ్మలతో మాయా లోకం సృష్టించి కృత్రిమ శరీర అవయవాలను చూపుతూ సమాజాన్ని చెడగొడుతున్నాయి తప్ప యువకులను సంస్కారవంతులుగా మలచటం లేదు.

'గ్రామాన్ని కాపు కాయు (రక్షించు) దేవతలు' ప్రాచీన కాలం నుండి జనవాసాలు, అగ్రహార గ్రామాలు, నగర, పుర, పట్టణం వగైరాలను 12 రకాలుగా వర్గీకరించి కాలానుగుణం పరిపాలనా సౌలభ్యం కొరకు మార్పులు చేస్తూ వచ్చారు. వీటిలో గ్రామాలు, అగ్రహారాలు, పుర పట్టణాలను ఆకృతి ఆధారంగా విభజించారు. గ్రామ నిర్మాణంలో వీధులు, దేవతా స్థలాలు, నీటి వసతి బాట సారుల సత్రాలు వగైరా సహజంగా ఏర్పాటు చేయ బడ్డాయి. ఈ గ్రామ హద్దులను 'పొలిమేర' అని పిలుస్తారు. సాధారణంగా సౌమ్య దేవతల దేవాలయాలు గ్రామాన్ని చూచుచుండగా, ఉగ్ర మూర్తులు ఆలయాల వెలుపలకు చూచునట్లు ప్రతిష్ఠ చేస్తారు. ప్రతి గ్రామం వెలుపల హద్దులను పొలిమేరగా నిర్ణయించగా బొడ్డు రాయిని గ్రామ కేంద్రస్థానంగా ప్రతిష్ఠిస్తారు. ఇచ్చట నుండి గ్రామ కొలతలు ప్రారంభిస్తారు. గ్రామాలలో నెలకొన్న నియమానుసారంగా గ్రామదేవతను, ఇతర గ్రామ దేవతలను ప్రతిష్ఠ గావించి నిత్య పూజలు చేస్తారు. చాలా వరకు కొన్ని గ్రామాల్లో గ్రామశక్తి దేవతలు ఒకరు, లేక ఇద్దరు, నలుగురును కూడా నెలకొల్పుతారు. మరికొన్ని గ్రామాల్లో చతుర్ముఖ కాపుదల శక్తులుగా తూర్పున భైరవుడు, ఉత్తరం గంగాదేవి, పడమర రావులమ్మ, దక్షిణం విఘ్నేశ్వరుని కాపుదారి దేవతలుగా ప్రతిష్ఠ చేయిస్తారు.

గ్రామాలు ప్రధానంగా ఏర్పడిన సమయంలోనే అప్పటి ప్రజల జీవన స్రవంతిలో నెలకొన్న పూర్వ ఆచారాలతో బాటు ప్రగాఢమైన విశ్వాసాలు జీవిత గమనంలో నెలకొని విడదీయరాని నమ్మకాలు స్థిరంగా నిలిచి ఇప్పటికీ నిరాఘంటంగా పూర్తిగాగాని పాక్షికంగాకాని కొనసాగు తున్నాయి. వీటినాధారంగా ఆశలు, ఆశయాల సాఫల్యము నకై భక్తులచే మొక్కుబడులకు శ్రీకారం చుట్టబడింది. భక్తుల కుటుంబ సభ్యులు క్షేమంగా ఉంటే రైతు పరంగా సమృద్ధిగా పంటలు పండటానికి, సంతాన హీనులు సంతానప్రాప్తికి, వ్యాధిగ్రస్తులు స్వస్థత చేకూరడానికి, నిరుద్యోగులు ఉద్యోగ ప్రాప్తికి వివిధ రకాలైన కోర్కెలతో పోలేరమ్మ దేవతను ఆరాధిస్తారు. సాధారణంగా గ్రామదేవతల గుడులకు పూజారులుగా బ్రాహ్మణేతరులు గాని విధవరాండ్రు, మధ్య వయసు దాటిన మహిళలు ఉండుటం పరిపాటి.

ముగింపు :

యుద్ధభూమిలో విజయం కాంక్షించే వారు, యాగ నిర్వహణ ద్వారా సత్ ఫలితాలు పొందటానికి, దేవతల చల్లని చూపులు, ప్రేమానుగ్రహాలు పొందటానికి, జంతు బలులు, తలనీలాలు, మొక్కుబడులు లేక భూరి

విరాళాలు ఇచ్చి కోర్కెలు ఈడేర్చుకునేవారు. జంతు బలులు ప్రతి మతంలోనూ పూర్వకాలం నుండి వర్త మానంలోకూడా కొనసాగుతూనే ఉన్నాయి. హిందువులు తమ ఆరాధ్య దైవాలైన శక్తి మాతలకు జంతుబలులు సమర్పించగా, క్రైస్తవులు కూడా మానవునికి గొఱ్ఱె ప్రాణాన్ని సమర్పించుతారు. ముస్లింలు 30 రోజుల హజ్ యాత్రలో 10వ రోజున మీనాకు వచ్చి సైతానుకు చిహ్నంగా భావించిన గోడలపైన 7 రాళ్లు చొప్పున విసిరి 12వ రోజున మక్కాకు వెళ్లి బామనీడ చుట్టూ ప్రదక్షణ చేసి 'హజ్' యాత్రను ముగిస్తారు. జంతు బలి ఇచ్చి తమ కేశాలను సమర్పిస్తారు. జంతు బలులనేవి ఈ మూడు ప్రధాన మతాల్లో ఆచారంగా కొనసాగుతున్నది. ఇట్టి హింసాత్మక జంతుబలులు ప్రభుత్వం నిషేధించినా ప్రజల సంప్రదాయ మనోభావాల వలయాల నుండి బహిర్గతం కాలేకపోతున్నారు. పర ప్రాణి హింస 'పాపం' అని అందరికీ తెలుసు అందునా సాధు జంతువుల విషయంలో అయినా మానవుని మస్తిష్కంలో దాగి ఉండి కష్టకాలంలో నష్ట నివారణకై తమ స్వార్థం వైపే మొగ్గు చూపుతున్నారు. ఇట్టి మూఢవిశ్వాసాలకు అంతమెప్పుడు లభిస్తుందో వేచి చూడాల్సిందే.

ఆధారము :

1. పంచుమర్తి సత్యనారాయణ, M.D.O (Rtd.), పెద్దలు, పూర్వీకులు ప్రత్యక్షంగా పాల్గొని, చూసి తెలిపిన వివరాలు. (ఎపణిదం గ్రామం సత్తెనపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది).

❖ ❖ ❖

రాయలసీమ కథా సాహిత్యం – జానపద పండుగల ప్రస్థావన

– యస్. రెహమాంజనేయులు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

రాయలసీమ సంస్కృతిలో భాగంగా ఇక్కడి ప్రజలు వారి సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగిస్తూ తమ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో తమ పూర్వపు పెద్దలు పాటించిన పద్ధతులను, పండుగలను నేటికీ మరువకుండా ఆచరించడం మనం గమనించవచ్చు. అయితే ఇప్పటి జీవన విధానానికి అనుగుణంగా కొన్ని మార్పులను సంతరించుకోవడం లేదా వాటిని విస్మరించడం కూడా మనకు కనిపిస్తుంది.

ఈ ప్రాంతంలో చాలా గొప్ప కళారూపాలను మనం గమనించవచ్చు. అందులో గొరవయ్యలు, తోలుబొమ్మలాట, ఉరుములు లాంటి ఎన్నో కళలు ఇక్కడి ప్రజా జీవణంలోంచి వచ్చినవే. ఇందులో కొన్ని కళారూపాలు కొన్ని కులాల వారు మాత్రమే ప్రదర్శిస్తున్నారు. అందులో గురవయ్యలు ఒకరు. కురుబ కులానికి చెందిన వారు మాత్రమే వీటిని ప్రదర్శిస్తుంటారు. వీరు జరుపుకునే ఉజ్జినప్ప పండగ అత్యంత ప్రాముఖ్యమైన పండుగ.

ఉజ్జినప్ప పండుగ :

అనంతపురం జిల్లాలో ఉజ్జినప్ప పండుగను కురబ సామాజికవర్గం వారు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. కురబల కులదైవం ఉజ్జినప్ప. ఈ ఉజ్జినప్పకు గుడులు కురబ పల్లెల్లో, పట్టణాల్లో నిర్మితమై ఉన్నాయి. కురబలందరూ పుష్కరాలవలే పన్నెండేళ్ళకోసారి ఉజ్జినప్పకు వేడుకలు జరుపుతారు. ఈ దేవునికి పూజలు నిర్వహించుటకు ప్రత్యేక పూజారులు ఉంటారు. వారు పాటించే నియమ నిబంధనలను గూర్చి కథకుడు బండి నారాయణస్వామి ఇలా తెలిపాడు.

'కురవొల్లది పెద్దపండగ పండెం డేండ్లకు ఒకసారి చేయాల్సిన పండుగ. కానీ యాబై పండ్ల తరువాత చేస్తున్నపండుగ.

మా ఇంటి దేవుడు కందుకూరి ఉజ్జినప్ప. ఆ గుడి కట్టి పూజారి ముసిలోడు అయి పోయినాడు. కాబట్టి మరో కొత్త పూజారప్పను నియమించే కార్యక్రమం కూడా ఉంది పండుగలో.

పూజారి నియమ నిష్టలు :

పూజారప్పలు కాళ్ళకు చెప్పులు తొడుక్కోకూడదని కులాచారం. పూజారప్పకు ఇంకా ఎన్నో నియమాలు. బీడీల కాల్చకూడదు. మద్యం ముట్టరాదు. మాంసం కూడా తినరాదు. ఆవు పాలు తప్ప ఎనుము పాలు తాగకూడదు. ఇంకా ఎన్నో!

ముందు కాలంలో పూజారప్పలు తమ ఇంట్లో వండిన అన్నం కూడా తినేవాళ్ళు కాదంట. స్వంతంగా వండుకొని తినడం తప్ప! ఆ నియమం కొంచెం సడలిపోయింది. ఈ మధ్య తల్లిగానీ, భార్యగానీ వండినఅన్నం తినొచ్చు అని కొంచెం మార్చుకున్నారు ఆ నియమాన్ని" అంటూ పూజరప్ప నియామక విధానం. పూజారి పాటించే నియమాలు కథకుడు తెలిపాడు.

పండుగ విశేషాలు :

అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు తదితర మండలాల్లో ఉజ్జినప్ప స్వామి వేడుకలు అత్యంత వైభవంగా జరుపుతారు. ఈ వేడుకలకు చుట్టుపక్కల మండలాల కురబలతోబాటు కర్నాటక నుంచి కూడా భక్తులు వస్తారు. ఈ వేడుకలు వారం రోజులు పాటు జరుగుతాయి. కథకుని దృక్కోణంలో చూస్తే ఈ పండుగ విశేషాలు ఏమిటో స్పష్టంగా తెలుస్తాయి. వాటిని ఇలా పేర్కొనవచ్చు.

- ఉజ్జినప్ప కురవల కులదైవం
- పన్నెండేళ్ళ కొకసారి ఉజ్జినప్పకు వేడుకలు జరుపుతారు.

- పూజారులు చెప్పులు తొడుక్కోకూడదు.
- బీడీలు, సిగరెట్లు వంటివి తాగరాదు.
- మద్యం, మాంసాలు తీసుకోరాదు.
- ఆవుపాలు తాగాలి, ఎనుముపాలు తాగరాదు.
- ఇంట్లోవండిన అన్నం తినరాదు. పూజారులే స్వయంగా వండుకొని తినాలి.

ఆ పూజారి విరమించుకుంటే మరోపూజారిని కురబ పెద్దలందరూ కలిసి ఎన్నుకుంటారు. ఆ ఎన్నిక కూడ సర్వసాధారణంగా ఉండదు. పెద్ద ఎత్తున ఉజ్జీనప్పకు వేడుకలు నిర్వహించి, ఆ కార్యక్రమంలో ఎన్నుకుంటారు. ఇలా పూజారులను ఎన్నుకునే సంప్రదాయం కేవలం కురబల్లోనే కాదు, దాదాపు అన్ని సామాజిక వర్గాల్లోనూ ఉంది. వారి వారి ఇలవేల్పులకు నిత్యపూజా కైంకర్యాలు చేయుటకు పూజారులను ఎన్నుకుంటున్నారు. వారి కులాచారం ప్రకారం పూజారులకు నియమనిబంధనలు ఏర్పాటు చేసుకుంటారు.

నేటి పిల్లలు అనియమాలను పెద్దగా పట్టించుకోక పోయినా పాతతరం వాళ్ళు మాత్రం విధిగా పాటిస్తు న్నారు. వారు వారి పూర్వ సంస్కృతిని పరిరక్షించుకుంటూ వస్తున్నారు. ఏది ఏమైనా ఈ పూజారులకు సమాజంలో ఆదరణ పెద్దగా లేదనవచ్చు. అందువలన ఎవరూ పెద్దగా ముందుకు పోవడం లేదు.

కొత్త పూజారిని ఎన్నుకొనుట :

ఉజ్జీనప్పకు పూజాకార్యక్రమాలు నిర్వహించుట కొత్త పూజారిని ఎన్నుకునే విధానం వినూత్నంగా ఉంటుంది. పాత పూజారి కొత్త పూజారిని ఎన్నుకొనే రోజు నిష్ఠగా ఉండి ఏ పిల్లవాన్ని ముట్టుకుంటే ఆ పిల్లవాడే పూజారి అవుతాడు. అది కురబలు పెట్టుకున్న నియమం. ఆ విషయాన్ని గూర్చి కథకులు బండి నారాయణస్వామి ఇలా తెలిపాడు.

"ముసలి పూజారప్ప ఏ పిల్లోన్ని ముట్టుకుంటే ఆ పిల్లోన్ని పూజారిగా విడిచి పెట్టక తప్పదు ఆ తల్లిదండ్రు లకు. అందుకని తమ తమ పిల్లోల్లని జాగ్రత్తగా ఇళ్ళలో దాచి పెట్టుకుంటున్నారు. మనుషులు మోస్తున్నారు. దేవుళ్ళు ఊరేగుతున్నారు.

మనుషులు కదిలారు
కిరిదండి కదిలింది
మనుషులు ఊగుతున్నారు
దేవుడు ఊగిపోతున్నాడు

డిక్కు డిక్కుమంటూ మీటుకుంటూ, యాచిస్తూ, గుప్పమనే సారాయి కంపులో ఎవరో ఒకర్ని పొగుడుతూ పాడే ఆసాదోల్ల పదాలు!

దేవున్ని వరమడిగే వాళ్ళ పక్కన బుర్రు బుర్రుమని బూర్లు కొట్టే బూరోల్లు, భీకరమైన ముఖాల్తో జంతు నృత్యాలు చేస్తూ గిన్నెలో పోసిన పాలని పోటీలు పడి తాగుతున్న గొరవయ్యలు.

కిరిదండి ముందు భాగంలో ముసలి పూజారప్ప. పూజారప్ప కాళ్ళ మీంద నీళ్ళ బిందెలు గుమ్మరించి నుదుటికి బండారు దిద్దించుకుని పోతున్న ఆడవాళ్ళు" అంటాడు.

కొత్త పూజారిని ఎన్నుకునే రోజు ఊరు ఊరంతా పండుగ వాతావరణంతో నిండిపోతుంది. ప్రతి ఇల్లు నిష్ఠతో ఉంటుంది. బంధు బలగమంతా వస్తారు. వివిధ రకాలుగా కళాకారులు వేషాలు ధరించి ప్రదర్శనలిస్తారు. దేవున్ని అత్యంత సుందరంగా అలంకరిస్తారు. వివిధ విన్యాసాలు చేస్తూ ఆసాదోళ్ళు పాటలు పాడుతుంటారు. దేవుని విగ్రహాన్ని ఊరేగిస్తారు. ఆ ఊరేగింపు ముందు భాగాన పాత పూజారి నడుస్తుంటాడు. ఊరేగింపు ఇంటింటి దగ్గర ఆగి ముందుకు కదులుతుంది. ప్రతి ఇంటి వారు దేవున్ని మొక్కుతారు. పూజారి కాళ్ళు కడిగి ఆశీస్సులు అందుకుంటారు. కొందరు దేవున్ని వరమడు గుతారు.

ఇంకో పక్క గొరవయ్యలు వింతగా శబ్దాలు చేస్తూ జంతు నృత్యాలు చేస్తూ గిన్నెలో పోసిన పాలను తాగుతుం

టారు. ఈ వేడుకలు చూసి తరించాల్సిందే. ఇది కర్నాటక కురబల సంప్రదాయం. ఆ సంప్రదాయం అట్లే అనంత పురం జిల్లాలోని కర్నాటక సరిహద్దు మండలాలపై ప్రభావం చూపుతున్నది. ఈ సంప్రదాయం చిత్తూరు జిల్లాలో ఒక్క శాంతిపురం మండలంలోనే కనిపిస్తుంది. అక్కడ వెంకటం పల్లెలో కురబలు ఈ వేడుకలు జరుపుతారు. అయితే ఇక్కడ మరో ఆచారం కూడా కొనసాగుతున్నది. పూజారి తలపై భక్తులు కొబ్బరి కాయలు కొడతారు. ఈ దృశ్యం చూడడానికి బీభత్సంగా ఉంటుంది. అయితే పూజారి మాత్రం సర్వసాధరణంగానే ఉంటాడు. తలకు గాయాలు కాక పోవటం మరియు ఏ ప్రమాదం జరగక పోవటానికి దైవమహిమేనని వారు బలంగా నమ్ముతున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. అవశేషం - ఉదయం వీక్లీ - 25.01.1991

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పొడుపు కథలు – చైతన్య దీపికలు

– డా॥. చదలవాడ విజయ కుమార్, తెలుగు శాఖాధ్యక్షులు, సి.ఆర్.కళాశాల,చిలకలూరిపేట.

సృష్టిలో మానవుడు ఎప్పుడు పుట్టాడో పొడుపు కథ కూడా అప్పుడే పుట్టింది. సాధారణంగా సమస్యల్ని పొడుపు కథలు ప్రతిబింబిస్తాయి. అనంతరం పొడుపు కథ ఓ సమస్యగా మారింది. సమస్య మూడి విప్పడానికి సమస్యను సృష్టించిన మానవుడే ఆలోచించాల్సి వచ్చింది. ఆ ఆలోచనలకు ఒక రూపం వచ్చింది. అప్పటి నుండి తరం నుండి తరానికి పొడుపు కథలు సంక్రమిస్తూ వస్తున్నాయి. పొడుపు కథకు మూలం సంస్కృత భాషనే. అపౌరుషేయాలుగా పరిగణించబడుతున్న వేదాల్లోని సంకేతార్థాలున్న ప్రతి స్థలంలో పొడుపు కథా లక్షణాలు భాసిస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన ఉపనిషత్తులోలనూ, స్మృతుల్లోనూ, దర్శనాల్లోనూ, పురాణాల్లోనూ, దృశ్యశ్రవ్యకావ్యాల్లోనూ పొడుపు కథా లక్షణాలు దర్శనమిస్తాయి.

పొడుపు కథాలక్ష్యం :

"పొడుపు కథ నిగూఢార్థ భావాలు కలిగి ఉంటుంది. అభిప్రాయాన్ని సూచిస్తుంది. అర్థస్వరూప వివరణం అసలే ఉండదు. ఉక్తి వైచిత్రి ఆవశ్యం. రసానికి శత్రువు, చిత్ర కవిత్వాంశ ఉంటుంది. కళాత్మకమైన గుణాలుంటాయి. చెప్పబడే విషయం కప్పబడి ఉంటుంది. ఎదుటి వారిని తికమక పెట్టే గుణం దీని సహజ లక్షణం. నిజాన్ని మరుగున పరిచే వక్రోక్తి లక్షణం దీనిది. రూపక సాన్నిహిత్యం అధికం. వీటితో పాటు రూప కాలంకార లక్షణాలు, కళాత్మకమైన విలువలుంటాయి. పొడుపు కథలో లయాత్మకత, సంక్షిప్తత, నిగూఢత అంతరత లక్షణం. అలాగే శబ్ద చమత్కార, వ్యంగ్య రామణీయకత, అలంకారిక ధర్మం అడుగడుగునా దర్శనమిస్తాయి.

అంతే కాకుండా ఆధునిక పదచిత్రాలు పొడుపు కథల్లో కోకొల్లలు. అందువల్ల జనపదులు తమకు తారసపడిన, ప్రతి వస్తువునీ తమకి తోచినరీతిలో పొడుపు కథలో ఆవిష్కరించారు. ఆ విధంగా అల్పాక్షరాల్లో అనల్పార్థాలు పొడుపు కథల్లో నిండుగా దర్శనమిస్తాయి.

పొడుపు కథ స్వరూపాన్ని బట్టి స్వభావాన్ని బట్టి అనేక రకాలుగా విభజించారు. కానీ విషయాన్ని బట్టి విభజించడమే సరియైనదిగా భావించారు.

1. గృహజీవన ప్రహేళికలు, 2. శ్రామికజన ప్రహేళికలు, 3. ప్రకృతి సంబందిత ప్రహేళికలు, 4. తిర్యక్ సంబంధి ప్రహేళికలు, 5. క్రీడా వినోద ప్రహేళికలు, 6. తాత్త్విక ప్రహేళికలు, 7. అస్పష్ట ప్రహేళికలు, 8. ఆత్మాశ్రియ ప్రహేళికలు, 9. శాస్త్ర విజ్ఞాన ప్రహేళికలు.

మళయాళంలో పొడుపు కథల్ని "కడంకథ : అళిప్పాం గధ, అళిప్పకథ విడుకథ" అనే పేర్లతో రెండు భాషల్లోని పొడుపు కథల్ని దిఙ్మాత్రంగా పరిశీలించటం జరుగుతుంది.

పొడుపు కథకు తెలుగులో అనేక పర్యాయ పదాలున్నాయి. కొన్ని అన్యభాషల నుంచి రాగా మరికొన్ని ప్రాంతేయ భేదాన్ని ఏర్పడ్డాయి. పొడుపు కథ సూర్యోదయాన్ని పొద్దు పొడుపు అంటాం. తరువాత చీకటి - ఆ వెనువెంటనే వెలుగు - పొడుపు ఖథ అంటే జ్ఞానోదయము అని అర్థం. అక్షర సామ్యాన్ని బట్టి ప్రహేళికా శబ్ద భవమే పొడుపు - అని పిండితార్థం. విడుపు అనగా పొడుపు కథను పరిష్కరించటం - యిలాంటి పొడుపు కథలను కొన్నింటిని ఈవ్యాసంలో ప్రస్తావిస్తాను.

గృహజీవన ప్రహేళికలు :

భారతీయ జీవన వ్యవస్థలో కుటుంబ వ్యవస్థ సాగరం లాంటిది ఇలాంటి కుటుంబంలో వేడుకలు, వినోదాలు,

వివాహాలు, కోపాలు, తాపాలు, అంతర్గతంగా కుటుంబ వ్యవస్థలో కూరుకొని ఉంటాయి. ఇలాంటి కుటుంబ నేపథ్యంలో అనేక పొడుపు కథలు ఆశువుగా పుట్టుకొస్తాయి. ఉపయోగించే పదాలు పొదుపుగా వున్న - విడదీస్తే చాంతాడంత అర్థం ఉండి తీరాల్సిందే. సాధారణంగా 'పసుపు' అనే పదాన్ని సౌభాగ్యానికి అర్థంగా వాడుతారు. పొడుపు కథగా చూసినప్పుడు

"అనంతపురంలో తప్పెట కొడితే - అంతకు తగులు,
ఇంతకు తగులు
చెరువులో ఉండే చేపకు తగులు - గాళ్ళలో ఉండే
గొడ్డుకు తగులు
బాలింతకు తగులు"

కథలో అంతకూ, ఇంతకూ అనడంలో ఇంట్లో తయారు చేసే ప్రతి పదార్థానికి తగులుతుందనే విశిష్టార్థాన్ని వివరిస్తుంది. వైద్యానికి, వంటకు, శుభానికి మొదలగు అనేక రూపాలుగా 'పసుపుని' వాడతారని చెప్పడం. కేవలం సంబంధ బాంధవ్యాలకే కాక గృహజీవన సౌఖ్యానికి, సౌభాగ్యానికి, తోడ్పడే అనేక పదాలు, పొడుపు కథల్లో దర్శనమిస్తాయి.

శ్రామిక ప్రహేళికలు :

వ్యవసాయం చేసేవారు వృత్తి పనుల్లో, కూలి పనుల్లో నిత్యం అనేక మంది దర్శనమిస్తుంటారు. బరువైన పనులు చేస్తున్నప్పుడు ఆశ్రమను మరచిపోడానికి కొంత ఉపశమనాన్ని, ఆనందాన్ని పొందే క్రమంలో పొడుపు కథలు పొడుస్తుంటారు.

"ఇంటి వెనక కుప్పవేసి - కుప్పకు నిప్పును పెట్టి
కుప్ప కాలిపోతేను - అప్పులెల్ల తీరిపోయె"

కుమ్మరి తను పడ్డ శ్రమ నుండి విముక్తి పొందిన తీరు ఈ కథ తెలియజేస్తుంది. అలాగే

"నున్నటి బండమీద - నూగులు ఆరబోస్తే
నాలుక లేని పాము - నాక్కొని పోయె"

మంగలి శ్రమ జీవనం ఈ కథ తెలుపుతుంది. ఇలా శ్రామిక జీవనాన్ని సూచించే అనేకం వున్నాయి.

ప్రకృతి సంబంధి ప్రహేళికలు :

ఆది మానవుడు మొదలు నేటి ఆధునిక మానవుని దాక పరవశించే ఆనందాన్ని పొందాలంటే అది అనంతమైన ప్రకృతి వల్లనే సాధ్యం. జానపదులు - ప్రకృతి సౌందర్యానికి మరింతగా జీవం పోశారు. సంప్రదాయ, ప్రబంధ సాహిత్యాలలో ప్రకృతిని వర్ణించకుండా సాహిత్యం లేదనే చెప్పాలి. ఉరుములు, మెరుపులు, వానలు, వరదలు, భూమ్యాకాశాలు, సూర్యచంద్ర నక్షత్రాదులు, మట్టి, గుట్టా, చెట్టూ, పుట్టా, యిలా ఎన్నో యిలాంటి వాటిని జానపదులు సునాయాసంగా పొడుపు కథలుగా మలచారు.

"అంతు లేని చెట్టుకు - అరవై నాల్గే కొమ్మలూ
కొమ్మకు కోటి పువ్వులూ - పువ్వుల్లో రెండే కాయలు
ఆకాశం, చుక్కలు, సూర్యుడు, చంద్రుడు,

పొడుపు కథకు ఎంత గొప్ప చిత్రకారుడో, భావుకుడో. ఈ కథను బట్టి తెలుస్తుంది.

తిర్యక్ సంబంధి ప్రహేళికలు :

పొడుపు కథకు పశుపక్ష్యాదులు అతీతం కాదని చెప్పడానికి కొన్ని పొడుపు కథలు

"అడ్డ గోడమీద - బుడ్డ చెంబు
ఉద్యోగం, సద్యోగం లేదు
ఊరంతా వ్యాపకమే - తీరికే లేదు

కుక్కల - జీవన శైలికి చెందింది. యిందులోని అంతరార్థం అందుకోతగినది. ఆచరించతగింది.

క్రీడా వినోద ప్రహేళికలు :

కేవల వినోదార్థం, క్రీడ కొరకే అన్న దృక్పథంతో నిర్మాణమైన కొన్ని పొడుపు కథలు

"వెంకప్ప ఇంకా రాలేదు - (కప్ప)
ఏదో మనవాడని ఊరుకున్నాడు (దోమ)
రేపు మాపు మందు తాగాలి (గాలి)

ఈ కథలో వినోదం, విజ్ఞానం రెండూ ఉన్నాయి.

తాత్త్విక ప్రహేళికలు :

తాత్వికత మానవ జీవితంతో విడదీయరానిది. అసలు మానవుని జీవితం - ప్రకృతితో ముడిపడి ఉందనడం అందరూ అంగీకరించని సత్యం. తాత్వికత భావాలు గల కర్మ, జ్ఞాన భక్తి సంబంధమైన వాటిలో కొన్ని

"ముందు ఆరుకాళ్లు - రెండు తలలు - నాలుగు చేతులు
వెనుక నాలుగు కాళ్లు - మూడు తలలు - ఆరు చేతులు
శవ వాహనం.

చనిపోయిన తరువాత కర్మకాండ తంతుకు సంబంధించిన పొడుపు కథ. మొత్తం శవాన్ని మోస్తున్న తీరును విడుపుతుందీ కథ.

అస్పష్ట ప్రహేళికలు :

ఇది కూడా తత్వానికి సంబంధించిందే. అయితే విడుపు ప్రత్యేకంగా చెపితే గాని అర్థం కాదు.

ఉదా॥

"గోపాలయ్య కుంటలోన - వల్లెలైదు వుత్కవోతే
పల్లెలన్ని మల్లెలాయ - నూటి కొక్క వల్లె చిక్కె

ఇది ఏ మోట పాటలో నుండి జారిపడ్డ ముక్కోగాని గొంతెత్తితే అద్భుతంగా కుదురుతుంది. దేహం పంచ భూతాత్మం అయినప్పుడు చివరికి పంచభూతాలతోనే కలిసినప్పుడు చివరికి ఆ దేహం పూలమాలగా మారిఎ ోవడం లాంటి - విడుపు ఈ కథలో అంతరార్థం - దీనిని ప్రత్యేకంగా విప్పి చెపితేనే గాని అర్థం కాక పోవడం. అందువల్ల దీనిని అస్పష్ట ప్రహేళిక అనడం జరిగింది.

ఆత్మాశ్రయ ప్రహేళికలు :

ఇది పూర్తిగా వ్యక్తినీ, వ్యక్తి భావనను సూచిస్తుంది. భావ కవిత్వ లక్షణాలలో 'ఆత్మాశ్రయ కవిత్వానికి ఏ రకమైన లక్షణం ఉంటుందో అచ్చం అలాగే ఈ పొడుపు కథ ఉంటుంది.

"పెట్టుకుంటానే - పట్టి చూసుకుంటి
పచ్చనీ పెట్టెలో - విచ్చుకోనుంది
ఎంత గుచ్చుకున్నగాని - ఏమైన మరిగాని
తెచ్చుకో మానను - మెచ్చుకో మానను మొగిలి పువ్వు

ఈ పొడుపు కథలో వ్యక్తి కనిపిస్తాడు - యిందులో మొదటిది ఆత్మాశ్రయము - చివరి పాదాలు ఉభయ కోవలోకి రావడం. మొత్తానికి భ్రమ పోయి ఆత్మాశ్రయ భావమే మిగులుతుంది.

శాస్త్ర విజ్ఞాన ప్రహేళికలు :

వైద్యం, జ్యోతిషం, గణితం, మొదలైనవి ఈ విభాగంలోకి వస్తాయి. వీటిల్లో గృహజీవనం, సామాజిక స్థితిగతులున్న ప్రత్యేక అర్థం దృగ్గోచరం అవుతుంది.

ఉదా :

వంకర టింకర - శో
వాని తమ్ముడు - ఆ
నల్లని పిల్లా - మి
నాకే మిస్తావు - తే
నాలుగు కాళ్ళ - మే

మనిషి ఆరోగ్యంగా వుండాలంటే పై వస్తువులన్నీ కలిపితేనే గాని మందు తయారు కాదు. ఈ విధంగా పొడుపు కథలు మన తాత ముత్తాతల నుండి వార సత్వంగా సంక్రమించిన ఆస్తి వీటిలో ఎంత వినోద ముందో అంతటి విజ్ఞానం వుంది. తెలియకుండానే మనిషి మెదడుకు పదును పెడతాయి. ఉల్లాసాన్ని, వివేకాన్ని కలిగిస్తాయి. కానీ నేటితరం, విద్యావస్థ వీటిని పూర్తిగా విస్మరిస్తోంది. బట్టీ చదువులో మెదడు మొద్దుబారి పోతోంది. అందిపుచ్చుకుంటున్న సౌకర్యాలల్లో రేపటితరం తాత్కాలిక ఆనందాన్ని పొందుతున్నదే గాని శాశ్వత ఆనందాన్ని కోల్పోతున్న విషయాన్ని గ్రహించలేకపోతు న్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు పొడుపు కథల్ని పరిచయం చేయలేకపోవడం బాధ పడాల్సిన సంగతి. అందువల్ల యిలాంటి అంతర్జాతీయ సదస్సుల్లోనైనా వీటిని చర్చించి భవిష్యత్తు తరాలకి వీటి గొప్పతనాన్ని తెలియ చేయడానికి చేస్తున్న కృషి అభినందనీయం.

ఉపయుక్త గ్రంథాలు :

1. పొడుపు కథలు - డా॥ కసిరెడ్డి వెంకట రెడ్డి
2. చమత్కార పొడుపు కథలు - వెంకటేశ్వర ప్రింటర్స్, కామారెడ్డి
3. జానపద విజ్ఞాన వ్యాసావళి - డా॥ జి. ఎస్ మోహన్
4. జానపద సాహిత్యం స్వరూపం - డా॥ ఆర్వీయస్. సుందరం
5. పొడుపు కథలు - డా॥ వెలగా వెంకటప్పయ్య
6. పెద్ద బాలశిక్ష -
7. పొడుపు కథలు - జి. శంకరరావు
8. తెలుగు సామెతలు - జనజీవనం పి.నరసింహారెడ్డి
9. తెలుగు సామెతలు - తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు కథానిక : జానపద కళలు

– కనపాల జోసఫ్, ఆంధ్రోపన్యాసకులు, ఆంధ్రక్రైస్తవ కళాశాల, గుంటూరు.

విస్తరిస్తున్న ప్రసార మాధ్యమాల దాటికీ, ప్రపంచీకరణ ప్రభావానికి జానపద కళల ఠీవి కొడ గట్టింది. ఫలితంగా జానపద కళలు ఉనికి గాలిలో దీపమైంది. సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్న జానపద కళల సంరక్షణ సంస్కృతి పరిరక్షణలో భాగం. ఇది ఒక సామాజిక సమస్య క్రాంతి దర్శకుడైన రచయిత అన్ని రకాల సాహితీ సాంస్కృతిక అంశాలను లోతుగా అధ్యయనా చేయాల్సి వుంటుంది. అయితే జానపద కళల స్థితిగతుల పట్ల రచయితల స్పందన ఆశించినంతగా వుండక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ నేపధ్యంగా చూసినపుడు జానపద కళల స్థితిగతులను, కళాకారుల సమస్యలను చిత్రీకరించిన కథలు లేకపోలేదు.

జానపద కళలను ఆశ్రయించుకొని వేలసంవత్స రాలుగా జీవిస్తున్న కొనసాగుతున్నా కళాకారులు పేదరికంతో మగ్గిపోత్తున్నారు. ప్రత్యమ్నాయ మార్గం తెలియక ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నారు. వీటికి కారణం ప్రసాద మాధ్యమాలు ప్రధానమైన కారణంకాగా ఆగ్రకుల ఆధిపత్యం, ఆధిపత్యంలో ఎదురవుతున్న అవమానాలు తమ ఆస్తిత్వానికి పెనుసవాలుగా మారు తున్నాయి. కాలం తెస్తున్న ఈ మార్పు జానపద కళలు, కళాకారులతోపాటు వాయిద్యాలు కూడా అటకెక్కు తున్నాయి. గొంతులు మూగపోతున్నాయి. చేసేది లేక కళాకారులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుం టున్నారు.

లభ్యమవుతున్న జానపద కథలు చాలా వరకు దళితస్పృహ నేపథ్యంలో నుండి వచ్చినవే. ఇవి కళాకారుల సమస్యలను చిత్రించినవే. వీరంతా ప్రసాద మాధ్యమాల ప్రభావ ఫలితంగా ఆభం శుభం ఎరుగని జానపద కళాకారులు - వారిపై పడుతున్న విష సంస్కృతి ప్రభావాన్ని గుర్తుకు తెచ్చే కథలు ఒకటి రెండు చూస్తే అవి, ఏటిపాట, విధ్వంసం, రంగు రంగుల చీకట్లోకి.

రంగు రంగులు కథను గంటేడు కథను నాయుడు రాశాడు. ఈ కథలో శాంతమ్మ మంచి గాయని సంగీతం ఏ గురువు వద్ద నేర్చుకోకపోయినా సప్తస్వరాలు ఆమె గొంతులో అలవోకగా పలకాల్సిందే. శాంతమ్మ పాడు తుంటే ఊరు ఊరంతా ఆమె గడపముందు గుమి గూడి ఆమె సంగీత ఝరిలో లీనం కావల్సిందే. కానీ కూతురు పద్మ ఆధునిక పోకడల ఊబిలో కూరుకుపోయి తల్లిపాడే పాటల్ని ఛాదస్తంగా భావించి కేవలం బూతుపాటలు, బూతు సినిమాలు, బూతు పత్రికలపై వ్యామోహం పెంచు కుంటుంది. ఈ పోకడల్ని చూసి శాంతమ్మ మనస్సు ముల్లు గుచ్చుకున్నట్లయ్యేదియ. 'ఏం సినిమాలో ఏం పిల్లలో వినాయక చవితి వచ్చినా కార్తీక ఏకాదశి వచ్చినా.. గౌరపున్నమి వచ్చినా, చవితి వచ్చినా, వీధి వీధంతా పందిళ్ళు వేసి వారిశ్చంద్ర నాటకమో, బాలనాగమ్మ నాటకం లేదా బుర్రకథో వేసేవారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పెద్ద సంబరమే జరుగుతున్నట్లు వుండేది. ఒక్కోసారి జముకులు పాట పాడించుకుంటే తెల్లగా తెల్లవారిపోయేది. కాలంతో పాటు జానపద కళలు మసక బారుతూ వచ్చాయి. అంతారాల తేడాలో నేటితరం వీధి నాటకాల స్థానంలో గుడ్డలిప్పే రికార్డింగ్ డాన్స్‌లు, సెక్స్ సినిమాలు వీటిపై యువతరం చూపే మోజు శాంతమ్మను కలవర పెట్టేది.

ఒక రోజు సినిమా కెళ్లిన పద్మ తిరిగి ఇంటికి రాదు.

ఈ విషయాన్ని తెలుసుకున్న శాంతమ్మ ఉన్మాదిగా మారుతుంది, "ఓరే బద్దలు గొట్టండరా మీ టీవీలు బద్దలు గొట్టండరా... ఒంటి మీద గుడ్డల్లేకుంట వేసిన డాన్సులు రాకుంట మీ టీ వీలు బద్దలు కొట్టండి.. బూతు కతల బొమ్మల పుస్తకాల్ని తగలబెట్టండ్రా.... తగలబెట్టండి.. ఒరే నా మాట యినకపోతే ఘోరం జరిగిపోద్దిర్రా మీ పిల్లలు మీకు కాకుండా పోతారా" అని వీధి వీధి తిరుగుతుంది.

కన్న కూతురు కళ్లముందే ఆధునిక పోకడలకు బానిసై జన్మ నిచ్చిన తల్లి దండ్రులను కాదని కనిపించకుండా పోతే పేగు బంధం దూరమైతే తట్టుకోలేక పిచ్చివారిగా మారిపోయిన శాంతమ్మతో పాటుగా నీకు ఎంతో మందిని చూస్తేనే వున్నాము. అందువల్ల వాటి నిండా విలువలు నిండి వుండి జీవిత ప్రస్థానానికి దిశ నిర్ధేశం చేసేవి.

ఇలాంటిదే మరొక కథ వి.ఆర్. రాసాని కథ 'వోమం' ఈ కథలో అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని నిరశిస్తూ వారసత్వంగా వస్తూన్న కళలను, వాయిద్యాలను వదిలి నిరసన తెలిపే కథ 'వోమం' మిట్టూరు రైతులకు తరతరాలుగా కపిల బానలు కుట్టిచ్చి ఊడిగం చేస్తూ, ఎదుగుబోదుగూ లేకుండా జీవించే కులాలు, ఊరందరికీ భావిలో నీరు అందుబాటులో ఉన్నా వారికి మాత్రం ఎప్పుడు కరువే. ఎండాకాలంలో చెరువు ఎండిపోతే ఊరిజనం అవసరం కంటే చేపలు పట్టడమే ముఖ్యంగా భావించే వారు ఇది ఆచారమని నమ్మపలికే వారు అగ్రవర్ణాలు. (దళిత ప్రతి నిధి నాయుడు నీటి సమస్య కోసం పంచాయితిలో స్థానం కల్పించుకున్న ఫలితం ఉండేదికాదు. అది సర్పంచి కొండ్రెడ్డికి అసూయగా వుండేది. రెండు నెలలుగా సరి పడానీళ్ళున్నా దళితుల మీద కోపంతో కొండ్రెడ్డి చేపలు పట్టుకోమని గ్రామస్థులకు అనుమతి యివ్వడాన్ని దళితులు జీర్ణించుకోలేకపోతారు. ఈ విషయంలో అగ్ర వర్ణాలకు దళితులకు మధ్య పెద్ద యుద్ధమే జరుగుతుంది. "మేము కాదంటే సావులకీ, సభలకీ, కొమ్ములూడీ, పలకలు కొట్టి బలకాల్సిందేరా అని హుంకరిస్తారు." పనులకు రానీయకూడదని నిర్ణయించుకుంటారు. అగ్ర వర్ణాలు అదే సమయంలో వారి దహన సంస్కారాలకు డప్పులు, కొమ్ములు కావాలని పిలుపొచ్చింది. తామంటే ఎమిటో తెలియచెప్పాలనుకుంటారు దళితులు. కులాలను గుర్తుకు తెచ్చే వాయిద్యాలనే వదిలేయాలనుకుంటారు.

అగ్రవర్ణాల అధూయిత్యాలను, ఆధిపత్యాలను ఎంతో కాలం కొనసాగవు అన్నదానికి నిదర్శనయే ఈ కథ. కాలమే సమాధానం చెపుతుంది. అన్నట్లుగానే ఎవరూ తమ ఆస్తి త్వాన్ని వదులు కోడానికి సిద్ధపడరు. తమ ఆస్థిత్వానికి భంగం కలిగించే ఎలాంటి కళైనా చివరికి తనకు జీవనాధారమైనదైనా సరే వదులు కోవడానికి ఏ మాత్రం వెనుకడుగు వేయరు. అనే సందేశం ఈ జానపకథలో చూస్తాం.

ఇలా జానపద కళలు వస్తువుగా కలిగినవి పది, పదిహేనుకు మించి కనపడవు. అందు వల్ల నేటి తరం, ముఖ్యంగా యువ పరిశోధకులు జానపద కళల కథలను వాటికి చెందిన ప్రదర్శనలను, స్థితిగతులను మారుతున్న కళారూపాలను వెలికి తీయాల్సిన అవశ్యకత వుంది. యిలాంటి జాతీయ సదస్సులు కూడా బాధ్యతను నిర్వహిస్తున్నాయికూడాను, అలాగే రచయితలు వివిధ సామాజిక సమస్యలపట్ల స్పందించినట్టే వివిధ ప్రక్రియల్లో జానపద కళల పరిరక్షణావశ్యకతను చాటి, జానపద కళాకారుల స్థితిగతుల పట్ల సహానుభూతిని ప్రదర్శించాల్సిన అవసరం వుంది. జానపద కళల మనుగడకు, పునరుజ్జీవనానికి పరిష్కార మార్గాల సూచించాలి.

"గత కాలము మేము వచ్చుకాలం" కంటే అన్న గుర జాడ సూక్తిని అశయంగా కలిగి జానపద కథలు, కళల వికాసానికి రచయితలు, పరిశోధకులు సదస్సులు నడుం బిగించాలని కోరుకుందాం. ❖

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపద విజ్ఞాన వ్యాసావళి : డా. జి. ఎన్. మోహన్ 2. జానపద సాహిత్యం - స్వరూపం : డా॥ ఆర్వీయస్ - సుందరం
3. జానపద విజ్ఞాన ధోరణులు : బి. రామాచార్యులు 4. జానపద నృత్యకళ : డా.బి.రామాచార్యులు
5. జానపద గేయవాఙ్మయ పరిచయాలు : హరి ఆదిశేషువు - విజ్ఞాన ప్రచురణలు 1967

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలంగాణ జానపద కళారూపాలు – సంస్కృతి

– ఖలీమ్ పాషా, తెలుగు అధ్యాపకులు, ఫాతిమా విద్యా కళాశాల, ఖాజిపేట్, వరంగల్ అర్బన్, తెలంగాణ

నైరూప్యం :

జానపద కళలకు కాణాచి తెలంగాణ. తెలంగాణ సంస్కృతిలో భాగమైన జానపద కళారూపాలు సంస్కృతిని కాపాడుకుంటూ మనుగడ సాగిస్తున్నాయి. జాతిజనుల అస్తిత్వానికి, వాళ్ల అనుభూతులకి ప్రతీకలు జానపద కళలు. అవి కనుమరుగు కావడమంటే ఓ సంస్కృతి కాలగర్భంలో కలవడమే. అందుకే వాటిని పరిరక్షించు కోవాలి. సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన మన తెలంగాణాలో జానపద కళారూపాలు వందకు పైగా ఉన్నాయి. ఇవి తెలంగాణ సంస్కృతికి అద్దం పడు తున్నాయి. ఒక కులం సంస్కృతీ సంప్రదాయాలను, ఆ కులపుట్టు పూర్వోత్తరాలను ఈ కళారూపాలు వివరిస్తాయి. ఈ కళారూపాలు ప్రదర్శించే వారిని ఉపకులాలకు చెందిన వారిగా, హక్కుదార్లుగా పిలుస్తూ, వారి కళా రూపాలను ఆశ్రిత కళా రూపాలుగా పిలుస్తున్నారు. ఈ కళా రూపాల ప్రదర్శన విధానాన్ని బట్టి తొమ్మిది రకాలుగా వర్గీకరించవచ్చు. అందులో బొమ్మలాటలు, అనుష్టాన కళారూపాలు, వాద్య కళారూపాలు, పటం కథలు, ఇంద్రజాల ప్రదర్శనలు, నృత్యాలు, కథాగాన కళా రూపాలు వేషాలతో కూడిన కళారూపాలు, భజన సంప్ర దాయ కళారూపాలు తదితరాలు ఉంటాయి. ఈ సంస్కృతి పరమైన అంశాలను గురించి తెలుసుకోవడం ఈ పరిశోధన యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

పరిచయం :

అతి ప్రాచీన కాలంనుండి నేడు లలిత కళలుగా పిలువబడుతున్న కళారూపాలు ప్రజా కళలుగా వర్ధిల్లాయి. శిల్పకళ మాత్రం రాజుల పోషణలో జీవం పోసుకున్నది. మిగిలిన నాలుగు లలితకళలు, కవిత్వం, సంగీతం, నాట్యం, చిత్రలేఖనం. ప్రజల సామాజిక జీవితానికి దర్పణం పడుతూ ఉద్యమ చైతన్యానికి ప్రతీకలుగా నిలిచాయి. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోని కళలైన ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. అవి 1) గిరిజన-జానపద కళలు 2) సాంప్రదాయ కళలు. తెలుగునాట గిరిజన-జానపద కళారూపాల పుట్టుక వికాసానికి సంబంధించిన విషయంలో తెలంగాణకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ దృష్ట్యానే తెలుగు విశ్వవిద్యాలయం వారు వరంగల్లో గిరిజన-జానపద పీఠాన్ని ఏర్పాటు చేశారు.

సాధారణంగా ఈ కళారూపాలు శ్రమనుండి పుడు తాయి. శ్రమజీవన సౌందర్యంలో ఆరాటం పోరాటం అనే అంశాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. డార్విన్ అన్నట్లు జీవన పోరాటంవల్లనే నాగరికత ఉనికి, మనుగడ ఉం టుంది. మిగతా తెలుగు ప్రాంతాలతో పోలిస్తే, తెలంగాణ ప్రాంతంలో ఈ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల ఇక్కడ బతుకు-ఆరాటం-పోరాటం అనే సంఘ ర్షణ చారిత్రక యుగంనుండి కనిపిస్తుంది. ఇదే ఇక్కడి జానపద కళా రూపాల్లో ప్రతిఫలించింది. దీని ప్రభావం సంప్రదాయ కళలపై కూడా ప్రబలంగా ఉంది. ఈ కారణం చేతనే ఇక్కడి కళారూపాలన్నీ ప్రజా కళారూపాలు గానే వర్ధిల్లినాయి అన్నది చారిత్రక సత్యం.

భారతీయులు 64 కళలను గురించి చెప్పినా అందులో ఐదింటిని మాత్రం లలిత కళలుగా పేర్కొన్నారు. అవి 1) కవిత్వం 2) సంగీతం 3) నాట్యం 4) శిల్పం 5) చిత్రలేఖనం. ఈ కళలకు మూలాలు మనకు ప్రకృతిలో కనిపిస్తాయి. కాబట్టి అరిస్టాటిల్ ''ప్రకృతి అనుకరణ రూపాలు కళలు'' అన్నారు. ఈ నిర్వచనం ఆదిమ సమాజానికి మాత్రమే వర్తిస్తుంది. మనిషి జీవనయానం అక్కడితో ఆగిపోలేదు. మనిషి ప్రకృతిలో భాగంగా జీవిస్తూనే ప్రకృతిని అన్వేషించాడు. ఆలోచించాడు. సృష్టికి

ప్రతిసృష్టి చేశాడు. అంటే కాలగమనంలో తన అనుభవాలను, ఆలోచనలను, శ్రమను సమ్మిళితం చేసి, ప్రకృతిలో సహజసిద్ధంగా పుట్టిగిట్టుతున్న జీవరాసులను కృత్రిమంగా సృష్టించి, ప్రకృతి రహస్యాలను ఛేదిస్తూ ప్రకృతిని వశ పరచుకున్నాడు. ఫలితంగా సంచార జీవితంనుండి గ్రామీణ, పట్టణ, నగర జీవితాలను నిర్మించుకున్నాడు. అదే వ్యవసాయం, పరిశ్రమలు, మార్కెటింగ్ దిశగా సమాజం విస్తరించింది. ఇవ్వాళ ప్రపంచీకరణ మూలంగా ప్రాంత, దేశ సరిహద్దులు చెదరిపోయి, ఆయా ప్రాంతాల్లో ఉన్న కళలు సంస్కృతి ఒకవైపు ఉనికిని కోల్పోతుంటే, మరోవైపు వీటి మూలాలను అన్వేషించి, ప్రజా ఉద్యమ చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా వాటిని పరిరక్షించి ప్రాచుర్యంలోనికి తెస్తున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పునరుజ్జీవనం పొందిన బతుకమ్మ, బోనాల పండుగలను అందుకు తార్కాణాలుగా పేర్కొనవచ్చును. ఇక ధూంధాం పాట ఆట నిర్వహించిన పాత్ర అందరికీ తెలిసిందే. అలాగే భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం సాగిన నిజాం వ్యతిరేక తెలంగాణ రైతాంగ పోరాటంనుండి అనేక ప్రజా ఉద్యమాల్లో, జానపద లలిత కళలు పోషించిన పాత్ర అమూల్యమైనది. ఇంకా చరిత్రలోకి వెళ్తే క్రీ.శ. 13వ శతాబ్దంనుండి మన తెలంగాణలో ఈ కళారూపాలు నిర్వహించిన పాత్రకు సంబంధించిన ఆనవాళ్లు పాల్కురి సోమనాథుని రచనల్లోనూ, జాయపసేనాని నృత్త రత్నావళి, విద్యానాధుని ప్రతాపరుద్రయశోభూషణం అలంకార గ్రంథంలోనూ, క్రీడాభిరామం రూపకం, సుగ్రీవ విజయం యక్షగానం-ఇత్యాది గ్రంథాల్లో కనిపిస్తాయి. వీటిని చారిత్రక పరిణామక్రమంలో లోతుగా పరిశీలిస్తే ఒకప్పుడు ప్రకృతి అనుకరణరూపాలుగా పురుడు పోసుకున్న ఈ కళారూపాలు సామాజిక జీవిత ప్రతిఫలన రూపాలుగా ప్రజా చేతనకు చేసిన దోహదం ఎంత అమూల్యమైందో వ్యక్తమవుతోంది.

తెలంగాణా కళారూపాలు :

బొమ్మలాటలు :

బొమ్మల ద్వారా ప్రదర్శన ఇచ్చే కళారూపాలు. ఇవి వివిధ రకాల వస్తువుతో బొమ్మలు తయారు చేసి వాటితో ఆడించే బొమ్మలు, తోలుబొమ్మలు, చెక్క బొమ్మలు, మందిచ్చుల బొమ్మలు, పెద్దమ్మలోల్ల బొమ్మలు ప్రధానంగా కన్పిస్తాయి. ఇవే ప్రాచీన కళారూపాలుగా, ఛాయా చిత్రాలకు మాతృకలుగా నిలిచాయి.

తోలుబొమ్మలు :

జంతు చర్మాలతో బొమ్మలను అందంగా తయారు చేసి వాటికి రంగులు అద్ది తెరమీద ఆడిస్తూ, రామాయణ, భారత, భాగవత కథలతో పాటు ఇతర కథలు కూడ ప్రదర్శిస్తారు. వరంగల్ జిల్లా తొర్రూరు ప్రాంతాల్లోను, నల్లగొండ జిల్లా కోదాడ ప్రాంతాల్లో ఈ కళాకారులున్నారు. కనుమరుగై పోతున్న కళారూపాల్లో ఇది ఒకటి.

చెక్క బొమ్మలాట :

తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన కళారూపం చెక్క బొమ్మ లాట కళారూపం. వరంగల్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం, వెంకటాపూర్ మండలం బూర్గు పేటలోను మాత్రమే ఈ ప్రదర్శన ఇచ్చే కళాకారులు ఉన్నారు. చెక్కతో తల, ఛాతి వరకు అందంగా తయారు చేసి మిగితా భాగాలను రంగు రంగుల గుడ్డలతో అలంకరిస్తారు. ఈ బొమ్మల చేతులకు దారాలు కట్టి తెరవెనుక ఉండి ఆడిస్తారు. వీరు ఎక్కువగా భారత, రామాయణాది కథలు ప్రదర్శిస్తారు.

మందెచ్చుల బొమ్మలు, 'నకాశి' వారు పొనిక కర్రతో, చింత గింజల అంబలితో వివిధ రకాలైన బొమ్మలు, పటం కథలకు సంబంధించిన బొమ్మలు, కులపురాణాల వృత్తాంతాలను తెల్లటి గుడ్డమీద వేస్తారు. వీటితో పాటు వివిధ రకాల మాస్కులు, పెద్దమ్మ బొమ్మలు, లాంటివి తయారు చేస్తారు. వీరు తెలంగాణ ప్రాంతంలోని చేర్యాలలో ఉండటం మనకు గర్వకారణం. ఈ వృత్తి ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఏకైక కుటుంబం ధనాలకోట నాగేశ్వరరావుది.

యాదవులకు ఆశ్రితులైన మందెచ్చుల వాళ్ళు బుడిగె జంగం కులస్థులు. వీరు యాదవులకు సంబంధించిన కాటమరాజు కథ, ఎల్లమ్మకథ, పెద్దిరాజు కథలను ప్రదర్శించేటప్పుడు రంగస్థలం పైన వాటి సంబంధించిన బొమ్మలను చూపుతూ కథ చెపుతారు. వీరు వరంగల్ జిల్లా వెంకటాపూర్, నారాయణపురంలో ఈ కళాకారులు ఉన్నారు.

పెద్దమ్మలోల్లు, పెద్దమ్మ దేవతను నెత్తిమీద పెట్టుకొని ఊరూరు తిరుగుతూ, చర్నకోలాతో కొట్టుకుంటూ, శరీరాన్ని కోసుకుంటూ భయానకంగా కనబడుతారు. వీరు తెలంగాణ అంతట జాతరల్లో ఎక్కువగా ఉంటారు.

అనుష్టాన కళారూపాలు :

అనుష్టాన కళారూపాలను పండుగల్లో, దేవతల ఉత్సవాల్లో మాత్రమే ప్రదర్శిస్తారు. వీటిలో బతుకమ్మ, బోనాలు, దుబ్బుల కొలుపులు, పంబా, ఎల్లమ్మవేషం, వీరముష్టి వంటి కళారూపాలు మనకు కనబడుతాయి. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ, బోనాలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి సముచిత స్థానాన్ని కల్పించింది. దుబ్బుల వాళ్ళు దుబ్బు వాద్యంతో పెద్దేవరను కొలిచే పూజారులు.

పంబా కళారూపం :

గ్రామదేవతల ఉత్సవాల్లో, బొడ్రాయి ప్రతిష్టాపనలో వీరి ప్రదర్శన తప్పక ఉంటుంది. ఎల్లమ్మవేషంలో ఊరు చుట్టూ పాలి చల్లుతూ గ్రామం బాగుండాలని కోరు కుంటారు. ఈ అనుష్టాన కళారూపాలు తెలంగాణ ప్రజ లతో విడదీయరాని సంబంధం ఉన్నప్పటికి ఆధునీ కరణ పేరుతో ఈ కళారూపాలు కూడ రంగస్థల ప్రవేశం చేస్తు న్నాయి.

వాద్య కళారూపాలు :

వాద్య కళారూపాల్లో ప్రధానంగా చెప్పుకునేవి డప్పు, దీనిని శుభాశుభాలకు వాడినప్పటికి ప్రత్యేకమైన దరువులను వాయిస్తూ రర రకాలుగా నృత్యాలు చేస్తారు. ఇక తెలంగాణకే తలమానికమైన ఒగ్గుడొల్లు, ఒగ్గు కథలతో పాటు వివిధ రకాల దరువులతో నృత్యాలు చేస్తారు.

బుడబుక్కలవాళ్ళు బుడగ అనే వాద్యంతో భవిష్యత్తు చెపుతూ ఇంటిముందు శ్రావ్యంగా వాయిస్తారు. ప్రజలకు వీరిమీద అపార నమ్మకం ఉంటుంది. విశ్వ బ్రాహ్మణు లకు కులపురాణాన్ని చెప్పెవారు రుంజ కళాకారులు. 'రుంజ' అనే వాద్యంతో ముప్పై రెండు రకాల ధ్వనులు చేస్తూ విశ్వకర్మ పురాణం, మూలస్తంభం వంటి కథలు చెపుతారు. తెలంగాణవ్యాప్తంగా ఒక్క మహబూబ్ నగర్ ప్రాంతాల్లో ఒకటి రెండు బృందాల వారు మాత్రమే ఉ న్నారు.

పటం కళారూపాలు :

తెలంగాణలోనే ప్రత్యేకంగా ప్రదర్శించే కళారూపాలు పటం కథలు. ఇవి పన్నెండు వరకు కలవు. వీటిలో ఒక్కొక్క కులం కుల పురాణాలను ప్రదర్శిస్తారు.వాటిలో పద్మశాలీ కులం వారికి 'కూనపులి కళాకారులు', మార్కెం డేయ పురాణం, మాదిగ కులం వారికి 'డక్కలీ వారు' జాంబ పురాణం, మాల కులంవారికి 'గుర్రపు వారు' భేతాళ పురాణం, చాకలి వారికి 'మా సయ్యలు' మడెలు పురాణం, గౌడ కులం వారికి 'ఏనోటి వారు', గౌడ జెట్టిలు' గౌడ పురాణం, కుమ్మరి వారికి 'పెక్కర్లు' గుండ బ్రహ్మపురాణం, యాదవులకు 'తెరచీరల వారు' మల్లన్న కథను, ముది రాజు కులస్థులకు 'కాకి పడిగెలవారు' పాండవుల కథలను చెపుతారు.

గిరిజన తెగైన నాయక పోడువారికి 'తోటివారు' పద్మనాయక వృత్తాంతమనే కథను ప్రదర్శిస్తారు. పై కులాల వారికి ఆశ్రితులుగా ఉంటూ కులపురాణాన్ని నకాశి ద్వారా బొమ్మలు వేయించి ఆ బొమ్మల ఆధారంగా ప్రేక్షకులకు కథను చెపుతారు. ఈ కళారూపాలు వరంగల్, కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నాయి.

నృత్యాలు :

నృత్య కళారూపాలు ఎక్కువగా గిరిజన తెగలకు సంబంధించినవే ఉన్నాయి. ఇవి వారి ఐక్యత భావంను వెల్లడిస్తాయి. వీటిలో బంజారాలు సుగాలి నృత్యం, గోండు గుస్సాడి నృత్యం, కోయకొమ్ము నృత్యాలు, ధింసా, రేలా, దండారి లాంటి నృత్యాలు కనబడుతాయి. వీటితో పాటు పండుగలకు సంబంధించిన నృత్యాలు ఆయా సందర్భాల్లో ప్రదర్శిస్తారు.

ఇంద్రజాల ప్రదర్శనలు :

ఇంద్రజాల ప్రదర్శనలో 'సాధన శూరులు' పద్మశాలీ కులస్థులకు ఆశ్రితులుగా ఉంటారు. వీరు వివిధ రకాల విన్యాసాలు ప్రదర్శిస్తారు. చొప్ప బెండులతో పల్లకి చేసి అందులో కూర్చోవటం, నెత్తిమీద పొయ్యి పెట్టడం, చెవిలో నుండి నీళ్ళుపోసి ముక్కులో నుండి తీయడం, నీటి లో పసుపు కారం లాంటివి కలిపి మళ్ళి పాడి పసుపు, కారం తీయడం లాంటివి ఎన్నో అటు ఆనందాన్ని, భయాన్ని కల్గిస్తాయి. మరొక కళా రూపం 'కాటిపాపల వాళ్ళు' నోట్లో నుండి పాములను, తేళ్ళను, ఉంగరాలను తీస్తూ ప్రేక్షకులను ఆనందపరుస్తారు. 'పాములవాళ్ళు, యక్షిణి వాళ్ళు కూడ రకరకాల ఇంద్రజాల ప్రదర్శనలు చేస్తారు.

కథాగాన కళారూపాలు :

కథాగాన కళారూపాల్లో రామాయణ, భారత, భాగవత కథలను పురాణాలుగా చెప్పేవారిలో చిందుయక్షగానం, గొందేళివీధి భాగోతం, దాసరి భాగోతం, వీధి భాగోతాలు వీధి నాటకాలు ఈ కోవలోకి వస్తాయి. ఆ కథలకు సంబంధించి పాత్రలువేషధారణతో కథలను రక్తి కట్టిస్తారు. వీటిలో హాస్యగాడి పాత్ర అందరిని ఆకర్షిస్తుంది.

వేషాలతో కూడిన కళారూపాలు :

కళారూపంలో ఎక్కువగా వేషాలతో అలరించేవి. ఇందులో పగటి వేష కళాకారులు ముప్పైకి పైగా వేషాలు వేసి ప్రదర్శన ఇస్తారు. ఇందులో అర్ధనారీశ్వర, అదే విధంగా, పులివేషాలు లాంటివి ఉం టాయి. అదే విధంగా, పులివేషాలు, కాళిక వేషం వంటివి ఇందులోకి వస్తాయి. పగటి వేషకళాకారులు రోజుకొక వేషం వేస్తూ ఊళ్ళో ప్ర దర్శన ఇస్తారు. ఇందులో తుపాకి రాముడి వేషం తెలంగాణాలో ప్రత్యేకం.

తెలంగాణా లత్కోర్ సాబ్ :

పిట్టల దొర వేషం ఆనాడు బ్రిటిష్ వాళ్ళు వేష ధారణను పోలి వుంతుంది. ఒక విధంగా తెల్ల వాళ్ళ వేషాన్నీ, భాషనూ హేళన చేసేటట్లుగానూ వుంటుంది. నాడు సమాజంలో వున్న దుర్మార్గాలను ఎత్తి చూపుతూ హాస్యంతో ప్రజలను వినోద పరుస్తూ విజ్ఞానపర్చే నాటి జాన పద కళా రూపమే పిట్టల దొర. ఈ వేషాన్ని నాటి పగటి వేషధారు లందరూ ప్రదర్శించేవారు.

పిట్టల దొర వేషాన్నే లత్కోర్ సాబ్ "బుడ్డర్ ఖాన్" తుపాకి రాముడు అని కూడా పిలుస్తారనీ, అది పగటి వేషాల్లో ఒక రకమనీ, గ్రామాలలో ప్రదర్శించే పిట్టలదొర వేషగాళ్ళు సమాజంలో వున్న కుళ్ళు విషయాలను హాస్యంతోనూ, వ్యంగ్య రూపంలోనూ బయట పెడతారు. ఖాకీ ప్యాంటు, లేదా నిక్కరు, చిరిగిన ఖాకీ షర్టు తలపై దొర టోపీ, ఆ టోపీ పైన ఒక ప్రక్కగా తెల్లటి ఈక, చేతిలో కట్టె తుపాకీ, మెడలో రుమాలు, ముఖాని కంతా తెల్ల రంగు పూసుకుని, ప్రెంచి కట్ మీసముతో, కాళ్ళకు బూట్లు తొడిగి ఒక దొరలాగా హంగామా చేస్తూ, అడుక్కుంటూ విరామ లేని తన వాగ్ధోరణితో శ్రోతలను చమత్కారంతో ముంచెత్తుతాడు.

జానపద కళారూపాల్లో పై కోవలోకి కాకుండా ఇతర జీవులతో ప్రదర్శన ఇచ్చే కళారూపాలు కూడ ఉన్నాయి. వాటిలో గంగిరెద్దులాట, చిలుక జ్యోసం, గారడి వంటివి ప్రేక్షకులకు హాస్యాన్ని పండిస్తాయి. ఈ విధంగా తెలంగాణ జిల్లాలకే ప్రత్యేకంగా నిలిచిన ఈ జానపద కళారూపాలను పరిరక్షించుకోవాలి.

ముగింపు :

ఈ కళా రూపాలను రక్షించి మన సంస్కృతిని మనమే కాపాడు కుందాం. తెలంగాణను సంస్కృతి రాష్ట్రంగా

తీర్చిదిద్దుదాం.తెలంగాణా సంస్కృతికే మకుటంగా నిలిచే జానపద ఆశ్రిత కళారూపాల సాహిత్యం ఎంతో ప్రాచీన మైనదిగా తెలుస్తున్నది. అంతేగాక విభిన్నమైన ప్రక్రియ లతో, భిన్నమైన కథావస్తువుతో పోషక కులాలను ఆశ్రయిస్తూ మనుగడ సాగిస్తున్న కళారూపాలు తెలం గాణాలోనే ఎక్కువగా ఉండటం తెలంగాణా సంస్కృతీ ప్రాచీనత గొప్పతనమే. వీటి సాహిత్యంలో ఒక సమాజం లేదా ఒక కులం మనుగడకు కావల్సిన, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మనూన్యతా భావాన్ని తొలగించేందుకు కావల్సిన పలు అంశాలు ఉన్నవి. అంతేగాక కులాల ఐక్యతకు దోహదం చేసేదిగా ఉంది. అలాగే వృత్తులకు కులాలకు గౌరవాన్ని కలిగించే విధంగా వీరి సాహిత్యం నిర్మింపబడింది. ఇటు వంటి సాహిత్య విలువలు కలిగిన వీరి సాహిత్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఎంతైన ఉన్నది. భవిష్యత్తు తరాలకు వీరి గొప్పదనాన్ని, వీరి సాహిత్యాన్ని భద్ర పరచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కొన్ని కళా రూపాలు కనుమరుగయ్యాయి. కొన్ని కనుమరుగయ్యే స్థితిలో ఉన్నవి. కావునా పరిశోధనాత్మకంగా కళారూపాలను శోధించి, పరిరక్షించి, తెలంగాణ సంస్కృతీ శోభను నిల పాల్సి ఉంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - డా. బిరుదురాజు రామరాజు.
2. తెలుగు జానపద సాహిత్యం పురాగాథలు - డా.రావిప్రేమలత.
3. తెలుగులో కులపురాణాలు -ఆశ్రిత వ్యవస్థ - డా. పులికొండ సుబ్బాచారి.
4. రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాలు -నల్లగొండ- గౌరవ సంపాదకులు - ఆచార్య యన్.గోపి.
5. తెలుగు జానపద గేయ కథలు - డాక్టర్ నాయని కృష్ణకుమారి.
6. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి.

❖ ❖ ❖

"తెలంగాణ జానపద కళారూపాలు – వాయిద్యాల పరిశీలన"

– అందె అంగడి భాస్కర్, పరిశోధక విద్యార్థి, జానపద కళల విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

జానపద కళారూపాల్లో జానపదవాయిద్యాలున్నప్పటికీ అవి మరుగున పడుతున్నందున అనేక జానపదవాయిద్య సంపద ఉన్నప్పటికీ వాటికి సరైన గుర్తింపు లేక కొన్ని ప్రముఖమైన కళారూపాలను, వాయిద్యాలను పరిచయం చేయదలుచుకున్నాను. ఒక్కొక్క వాయిద్యం వెనుకాల ఒక్కొక్క చరిత్రదాగి ఉంది. గొప్ప సైన్స్ దాగివుంది. వాటిలో ఈ జగతిలో కనుమరుగైపోతున్నవి. మన కలల ఖజానాను కాపడుకోవాల్సిన అవసరం జానపదులపై ఉన్నది. కాబట్టి జానపదకళారూపాలను రేపటి తరానికి వారధిలాగా, సారధిలాగా పంపించాల్సిన అవసరం జానపదులకు పరిశోధకుల మీద ఎంతో బాధ్యత ఉన్నది. భుజాలమీద మోయాల్సిన అవసరం ఉన్నది. వీటిలో డప్పు, రుంజ, శారదకథ, బైండ్లకథ. పై కళారూపాల వాయిద్యాలమీద ప్రాధాన్యతను చెప్ప దలుచుకున్నాను. కళలకు కణాచీ జానపద కళారూపాలు ఉన్నప్పటికీ, వాయిద్యాలు, మరుగునపడుతున్నందున అనేక జానపద వాయిద్య సంపద ఉన్నప్పటికి, వాటికి సరైన గుర్తింపు లేదు. కొన్ని ప్రముఖమైన కళారూపాలను, కొన్ని వాయిద్య పరికరాలు పరిశీలన చేయదలుచు కున్నాను. ఒక్కొక్క వాయిద్యానికి ఒక్కొక్క చరిత్ర ఉంది. గొప్ప సైన్స్ దాగి ఉంది. వాటి వివరాలు విశ్లే షణలో విపులంగా చెప్పదలుచుకున్నాను. కనుమరుగవు తున్న కళారూపాలను, వాయిద్యాలను వీటి వల్ల సమాజంలో కళారూపాల ద్వారా చైతన్యం పొందిన విషయాలను సామాజిక కోణాలను కొత్తకోణంలో వినూత్న మైన రీతిలో పరిశోధన ద్వారా విషయాలను సమగ్రంగా సేకరించి కళారూప వాయిద్యాలు ఎంత గొప్పగా ఉప యోగపడతాయో నా పరిశోధనలో నేను చేపట్టబోయే ప్రణాళికలో పొందు పరచదలచుకున్నాను.

జానపదులు అంటే గ్రామీణ ప్రజలు, పల్లెటూర్లలో నివసించే జనులు, మౌఖికంగా కళలను ప్రచారం చేసేవారు. అక్షర జ్ఞానం లేని వారిని మనం జానపదులు అంటాం. జానపదం అంటే జనపదం అన్నారు. అదే విధంగా పల్లెయొక్క సంస్కృతి ఆచార వ్యవహారం గురించి ప్రకృతి అందాల గూర్చి జానపద కవికి కలిగిన ప్రేరణయే జానపదం అని చెప్పవచ్చు.

జానపదులు వాస్తవికంగా ప్రకృతి ప్రేమికులు కావడం చేతవారు ప్రకృతిలో ఉన్న వాటిని దైవంగా భావించి ఆరాధించడం మొదలుపెట్టారు. ప్రకృతిలో మనకు మేలు చేసే జంతువులను, చెట్లను, గుట్టలను పూజించటం, గ్రామపొలిమేరల్లో ఉండే గ్రామీణ దేవతలుగా చెప్పుకునే ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ గ్రామ పోలేరమ్మ మొదలైన వారికి కోళ్లను, గొర్రె పొటేళ్లను బలిచ్చి, ఆ దేవతలను శాంతిపరుస్తారు. వారు కూడా ఒక పండుగలాగా భావించి అందరు కలిసి బలిచ్చి గొర్రెను వండుకొని సామూహిక భోజన గావించి సంతోషంతో గెంతులు వేస్తు బాగా అరుస్తూ, వారి యొక్క ఆనందం, సంతోషం నుంచి వచ్చి నవే సాంస్కృతిక ఏగయాలు, ఈ విధంగా అమ్మవార్లకు బలిచేయడం వల్ల అమ్మ వారిని కనుసైగల్లో చూసుకొని వారికి ఎటువంటి బాధలు రాకుండా సకాలంలో వర్షాలు కురిపించి పంటలు బాగా పండే విధంగా చేస్తుంది అన్న జానపదుల నమ్మకం. ఈ విధంగా మన యొక్క సంస్కృతి, ఆచారాలు పండుగల నుండి పుట్టినవే ఈ జానపద సాంస్కృతిక నేపథ్యంగా చెప్పుకుంటాం.

తెలుగు దేశంలో మొదటి సారిగా 1989-1990 సం॥లో శ్రీ నందిరాజు చలపతిరావు స్త్రీలపాటలు సంపుటాలను ప్రచురించడం జరిగింది. అదే విధంగా శ్రీ నేదునూరి గాంగధరం జానపద సాహిత్య సేకరణకు సంబంధించి

ఆరేవేల గేయాలు, 4 వేల మాండలిక పదాలను, మరియు 10 వేల సామెతలను సేకరించడం జరిగింది. 1956 వ సం॥లో డా॥ బిరుదురాజు రామరాజు గారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి మొదటి తెలుగు జానపద సాహిత్యంపై పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టాను పొందడం. ఈయన ఎన్నో వేల పుస్తకాల్ని ప్రచురించడం జరిగింది. ఈ విధంగా జానపదం యొక్క ప్రారంభం అనేది మొదలై నేటికి జానపద సాహిత్యం ఎన్నో పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. జానపదం అనేది ఒక తరుగని గని తవ్విన కొద్ది కొత్త కొత్త పరిశోధనలు పుట్టుకవస్తునే ఉంటాయి.

డప్పు, రుంజ, ఒగ్గు, శారద, పన్నెండ్లు మెట్లకిన్నెర, బైండ్ల, పంబ, కాకిపడిగెలు, మందెచ్చుల, కొమ్ము, దుబ్బులవాళ్లు.

డప్పు కళారూపం ఇది ప్రపంచ వాయిద్యం. తెలంగాణలో మాదిగలు మాత్రమే వాయిస్తారు. రుంజ కళారూపం రుంజ కళాకారులు రుంజవాయిద్యం వాయిస్తారు. ఒగ్గు కళారూపం ఒగ్గువారు ఒగ్గు వాయిస్తారు. శారదకండ్లు శారదను వాయిస్తారు. పన్నెండు మెట్ల కిన్నెర (మాష్టి డక్కలివారు వాయిస్తారు), బైండ్ల కళారూపం జమిడిక వాయిస్తారు. పంబ కళారూపం పంబై పదం తమిళం నుండి పంబగా మారింది. వీరు మాల ఆశ్రిత కులం. కాకి పడిగె కళారూపం కట్టెతో(కర్ర) గంటను వాయిస్తారు. మందెచ్చుల కళారూపం వీరు డోలును వాయిస్తారు. కొమ్ము కళారూపం, కొమ్మును ఊదుతారు, వీరణాన్ని తిత్తిని వాయిస్తారు, తాళాలు కూడా వాయిస్తారు. దుబ్బుకళారూపం, దుబ్బును వాయించడం వల్ల దుబ్బు కళారూపం వచ్చింది. వీరు దుర్గమ్మ కొలుపులు చేస్తారు.

డప్పు:

భారతదేశంలోని జానపద కళలన్నింటిలో డప్పు చాలా పురాతనమై ఉంటుంది. ఎప్పటి నుంచి ఎలా పరిణామం చెందిందో మనకు వివరాలు తెలియకపోయినప్పటికి ఇది చాలా పురాతనమైంని ఒప్పుకోవలసి ఉంటుంది. ఎందుకంటే మానవుడు ఆటవిక సమాజంలో ఉన్నప్పుడు వ్యవసాయం అనేటువంటిది తెలియని రోజుల్లో వేట ప్రధానవృత్తిగా మనకు చరిత్ర చెబుతున్న సత్యం.అంతే కాకుండా ఆ రోజుల్లో జంతుచర్మాలను కూడా మానవుడు వస్త్రంగా ధరించాడనడం మన చరిత్ర ద్వారా తెలుసు కన్నాం. ఈ విధంగా మానవుడు వేటాడిన జంతుమాంసాన్ని తిని వాటిచర్మాన్ని వస్త్రంగా ధరించే కార్యక్రమంలో ఇది బాగా ఎండి దాని మీది వెంట్రుకలు వాడుకలో వాటంతట అవి రాలిపోవటం వల్ల అదొక విధమైన శబ్దం చేస్తుంది. ఎలా ఉంటే ఎక్కువ శబ్దం చేస్తుంది, ఎలా ఉంటే తక్కువ శబ్దం చేస్తుంది, అని దాని మీద తెలియకనే యాదృచ్ఛికంగా ప్రయోగం చేసి దానినొక వాయిద్యంగా తయారుచేసుకుని ఉంటాడు. అలా వాయిద్యంగా చేసిన తరువాత దానిని ఎన్నో అవసరాలకు వాడుకొనిఎంతో కొంత దాని ద్వారా సేదతీర్చుకొని ఉంటాడనవచ్చు. ఎందుకంటే డప్పు తయారుచసేందుకు కావల్సిన వస్తువులు చర్మం, కొయ్యలు, ఆ రోజుల్లో అతి సులభంగా మానవునికి దొరికే వస్తువులవి.

డప్పుకు చాలా పేర్లు ఉన్నాయి. మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల వాళ్లు, వివిధ పేర్లతో పిలుచుకుంటున్నారు. ఈ డప్పుకు డప్పు, కొయ్య, తప్పెట, కనక తప్పెట, టకోర అనేవి ప్రధానమైన పేర్లు, తెలంగాణ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దీనినే పలక అని కూడా అంటారు. ఐతే ఇందులోని డప్పు, కొయ్య, తప్పెట, పలక అనే పేర్లన్నీ పెద్ద డప్పుకు వేరు వేరు పేర్లు, డప్పులో చిన్న, పెద్ద డప్పులున్నాయి. డప్పుల రకాలు:

పెద్ద డప్పు, కనకతప్పెట, టకోర, డప్పు చిర్ర, డప్పు చిటిక, డప్పు వాయిద్యకారులు.

రుంజలు :

జాతికి ఒక్క వృత్తి, వృత్తి కొక్క గోత్రాన్ని, గోత్రానికొక్క కీర్తి సంఘంలో సమానత్వమే ధ్యేయం. దైవచింతనే జన్మకు సార్థకథ వృత్తుల ఆచారంగానే సమాజంలో కులం ఏర్పడింది. దీనిలో భిన్నమైనది రుంజ. వీరు త్రికర్మ

కులానికి ఆశ్రితకులం. వీరు రుంజ అనే వాయిద్యం ఉపయోగిస్తారు. "వీరిని పంచాననం" కులాలు అని కూడా అంటారు. వృత్తిపురకాలు చెప్పడాన్ని ఆశ్రితకులాలు ఏర్పడినట్టుగానే, విశ్వకర్మ పురాణం గానం చేయడానికి "రుంజ" పంచాకాం కులాలు పట్టుకొచ్చినవి. వీటిలో రుంజవాయిద్యం ఉపయోగించడం వల్ల రుంజలు లేదా రుంజవాళ్లు అంటారు. బాల్యం నుంచి వీరు విద్యా భ్యాసాలతో పాటు ఈ విద్యను వీరు కఠోర శ్రమత నేర్చు కుని ప్రతివారు ఈ విద్యలో ఆరితేరి ఉంటారు. విద్య నేర్చుకున్న తరువాత, విద్యలో ఉద్దన్డులయ్యి గ్రామాలకు యాత్రలు సాగిస్తారు. సంసారాలతో ఎడ్లబండ్లతో, బయలుదేరుతారు. వీరిలో ప్రధానంగా వీరు పంచదాయ కులం. అంటే ఐదుగురి తెగలను యచీంచేవారని అర్థం. వారిలో ప్రథములు వడ్రంగి వాళ్లు, ద్వితియులు, కమ్మరి వాళ్లు, తృతియులు, కంచరివాళ్లు. చతుర్థలు, స్వర్ణకారులు, పంచములు, శిల్పిలు. వీరిని పంచాకం అని కూడా అంటారు. వీరు ఐదుగురిని రుంజవాళ్లు యాచిస్తు విశ్వకర్మ పురాణం చెప్తారు. వీరి ప్రదర్శన కళలో ప్రత్యేకం ఏమిటింటే ఏ కళకు లేని ఖ్యాతి రుంజ వాయిద్యానికి ఉంది. ఎందుకనగా సంగీత శాస్త్రానికి సంబంధించిన ముప్పయి రెండు రాగాలను వారి వాయిద్య మీద వాయించీ సప్తస్వరాలను రుంజ వాయిద్యం మీద పలికిస్తూ, ప్రదర్శనలలో ప్రదర్శిస్తారు. దిన్న, దిన్న దిందో తక్కుటెతకదింత, దిన్నకు దిన్నంతాం అంటూ ..

"విశ్వ బ్రాహ్మణ హృదయం
విశ్వం విశ్వచంద్ర మాదిత్యలోచనం
శరీరం సర్వదేవత్వం
ఆత్మయో బ్రహ్మ సాంబవ
ముకగ్రే పంచవేదం
కనగ్రే శంబునామ చక్రం
విశ్వ బ్రహ్మణ క్రియకారం
నిదితం విశ్వబ్రహ్మణం
స్వయంబో ఓ.....విశ్వకర్మ బ్రాహ్మణహ ..

రుంజవాళ్లు చెప్పే కథలు :

1. పార్వతి కళ్యాణం, 2. దక్షయజ్ఞం, 3. విశ్వ గుణదర్శనం, 4. వీరభద్ర విజయం, 5. విశ్వకర్మ వంశాగమనం. వీరి కథకులు కరువయ్యిపాయిండ్రు. ఇప్పుడు కేవలం వీరు తెలంగాణలో అన్ని జిల్లాల్లో లేరు. కొన్ని జిల్లాల్లో ఉన్నారు.

రుంజు పుట్టుక :

శివుడు రొంజసురుడు అనే రాక్షసుని సంహరించాడని, వాడి కోరికపై వాడి వివిధ అవయవాలను సంగీత వాద్యా లుగా తయారుచేశాడని ఆ విధంగా రుంజుగా ఏర్పడిందని ఎడ్గర్ థర్స్టన్ రాసిన 'క్యాస్ట్ అండ్ ట్రైబ్స్' పుస్తకంలో ఉంది. ధృవకేశ్వరుడు అనేవాడు శివుని గురించి ఘోరతపస్సు చేస్తాడు. శివుడు అతనికి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మని అడిగినప్పుడు తనకు ఎలాంటి ఆయుధా లతోను చావులేకుండా వరం కావాలాని కోరుతాడు. తరువాత రెండో వరంగా శివుడే తనకు అల్లుడు కావాలని కోరుతాడు. శివుడు అనుగ్రహిస్తాడు. ధృవకేశ్వరుడే హిమవంతుడైపుడతాడు. అతని కుమార్తెగా జన్మించిన పార్వతీదేవి. శివుణ్ణి ప్రేమిస్తుంది. శివుడు ఎరుకలసాని వేషం వేసుకుని పార్వతీని చూస్తాడు. పార్వతి తన వివాహం చెయ్యగల సమర్థుడెవరని దివ్యదృష్టితో చూసి పేదింట పుట్టిన విశ్వకర్మను రమ్మని చెప్తుంది. విశ్వకర్మ వస్తాడు. పార్వతి తాతగారు దేవతల పెండ్లిలకు లగ్న ముహూర్తం పెట్టడం మాంగల్యధారణ లేవు. నా వివాహానికి మాత్రం లగ్నం మాంగల్యం ఉండాలి. దానితో పాటు దుందుబి బేరి, డోంకా, డప్పు, డమారం ఉండాలి.

శారదకథ :

శారద అనే వాద్యాన్ని వాయిస్తూ కథను చెపుతారు. తెలంగాణాలో ప్రాచీనమైన వీరకథ శారథకథ. శారద గాండ్రు ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. పండుగ దినాల్లో ఊరువాడ తిరిగి కథాగానం చేస్తూ, యాచిస్తు జీవనం గడుపుతుంటారు. ఈ కళాకారులను సర్వజాన శ్రోతలంటారు. కథగానం చేస్తున్న శారథకాండ్లలో

అర్థసంచారం, పూర్తిసంచార జాతులంటు రెండు విధాల వృత్తిగాయకులున్నారు. ఈ శారద కళాకారులు సంవత్సరం పాడవునా పల్లె పట్నం తేడా లేకుండా తమ కళ ప్రదర్శనను చేస్తు ప్రజలను యాచిస్తు ఉంటారు.

కళారూప ప్రదర్శన :

ఓ భారతి శారదా... ప్రార్థనతో గానం పెట్టడం వల్ల వీరికి శారదగాండ్లు పేరు వచ్చింది. సాధారణంగా వంత పాడే స్త్రీలు కథకుడి భార్యలై ఉంటారు. వీరు ఎక్కువగా ఇద్దరు భార్యలను కలిగి ఉంటారు. కథకుడి శారదను కుడిభుజం మీద పెట్టుకుని ఏడమ చేతి బొటనవ్రేలుకు అందెలు ధరిస్తారు. స్త్రీలు ముంతవాయిద్యాలు వాయిస్తు వంతపాడతారు. వీరి వాద్యాలు వీరే తయారు చేసు కుంటారు. వీరి కథల్లో బాలనాగమ్మ, రాములమ్మ, మైన వతి, చిత్రావతి, పాండవులకథ, ధర్మంగరాజు, ఎరుకుల సంచారి, చిన్నమ్మకథ, కావమ్మాకథ, సర్వాయి పాపడు కథ మరియు వీరు ఏ ప్రాంతంలో యాచిస్తారో ఆ ప్రాంతంలోపేరొందిన చరిత్రను చెబుతుంటారు. వీరు కథలు ఇంటింటికి తిరిగి చెబుతారు. ఒక్కొక్క ఇంటి ముందు గంటసేపు కథ చెబుతారు. కథ పాట రూపంలో సాగుతుంటుంది. శారద దేవి ప్రార్థనతో ప్రారంభ మవుతది, వీరిలో కొద్ది మంది మాత్రం వేషాలు వేసుకుని కథను చెపుతున్నారు. శారదకళ కథాగాన రూపంలోని సంగీత సాహిత్యాలను ఆస్వాదిద్దాం.

బైండ్ల కథ లేదా బవానీలు :

బవాని మాతకు కొలుపులు చెయించేవారు కావడం వల్ల వీళ్లకు బవానీలు (బైండ్లు) అనే పేరువచ్చింది. చివరకు బైండ్లవారిగా రూపాంతరం చెందినారు. వీరు మాదిగవారు చేసుకునే పెండ్లిలకు పూజారులుగా (పురోహితులుగాను) గ్రామదేవత పండుగల్లో పూజారులు గాను వ్యవహరిస్తుంటారు. ఆదిశక్తికి కొలుపుల చేయిస్తూ జీవించడం వీరి యొక్క ముఖ్యవృత్తి. వీరు వృత్తి గాయకులుగా పేరు పొందినవారు బైండ్లవారు వీరు. ఎల్లమ్మ, మైసమ్మ, మారమ్మ, దుర్గకాళి పేర్లు కలిగిన శక్తిని ఆరాధించి గుణగానం చేసి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ కాలం గడుపుతారు. తెలంగాణలో ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ పేర్లు ఎక్కువగా ప్రచారంలో ఉంటాయి.

బవనీలు :

జమిడిక మొదలైన వాద్యాలు వాయిస్తూ భవాని కథలు చెపుతారు. పండుగల సందర్భంగా కాటమయ్య పోలే రమ్మ, మహాలక్ష్మి, ఈదమ్మ, కనకదుర్గమ్మ, వినంమైసమ్మ కథలు ముఖ్యమైనవి. వీరు చేపట్టేవాటిలో కొలుపులు చేయించే సందర్భంలో ప్రత్యేకమైన కథలు చెబు తుంటారు. ఊరికి ఏమైన అరిష్టం వచ్చినప్పుడు మూడు ఊర్ల పొలిమేరల్లో మారంమైసమ్మ కొలువు చేసి కథ చెబుతారు.

పశువులు మేతలు మేయునప్పుడు వాటి మూతులకు పుండ్లు అయినప్పుడు ఊరిలో ఒక దున్నపోతను వదిలేసి మైసమ్మ కొలుపు చేసి కథ చెబుతారు. సంతానం లేని వారి ఇండ్లలో బాలనాగమ్మ కొలుపు చేసి కథ చెబుతారు. వీరు కథలు చెప్పే సందర్భాలను బట్టి వేదికలు మారుతూ ఉంటాయి. గ్రామదేవత ఉత్సవాల్లో గుడిముందు కథ చెబుతూ దేవత ప్రతిష్ట సమయంలో దేవత ముందు, లేదా పందిరి వేసి పందిరి కింద కథలు చెబుతారు.

బైండ్ల కథ ప్రదర్శన :

ప్రధాన కథకునకు జమిడిక వాద్యకారుడు శృతి వాద్యకారుడు. రెండువైపులా ఉంటారు. ప్రధాన కథకుడు పెద్ద తలపాగా చుట్టుకుని కాళ్లవరకు వేలాడే తెల్లని ధోతి ధరిస్తాడు. కాళ్లకు గజ్జెలు కట్టుకుని చేయి చెవి దగ్గర పెట్టుకుని అభినయం చేస్తూ కథాగానం చేస్తుంటాడు. జమిడిక వాద్యకారుడు లయబద్ధంగా జమిడిక వాయిస్తూ, శృతికారుడు శృతి చేస్తు ఉంటాడు. కథకుడు శ్రావ్యమైన కంఠంతో కథచెబుతూ గజ్జెలకాళ్లతో చక్కగా నాట్యంచేస్తు ప్రేక్షకుల్ని ఆనందపెడుతాడు. అప్పుడప్పుడు జమిడక వాద్యకారుడు మధ్యమధ్యలో కథవివరణ

చేస్తాడు. వీరి హావభావ విన్యాసాలు అందరిని ఆకట్టు కుంటాయి. కథవేగాన్ని పుంజుకునేటప్పుడు కథకుడు వేగంగా హుషారుగా గంతులేస్తూ చూస్తున్నవాళ్లకు ఉత్సాహం కలిగిస్తాడు. జమిడక ధ్వని అతని కథాగానానికి అనుకూలంగా కదంతొక్కుతూ పదం పాడుతూ ఉంటారు.

ఆధారగ్రంథాలు :

1. తెలంగాణ కళలు, సంస్కృతి (జూలూరు గౌరీశంకర్), అడుగుజాడలు ప్రచురణలు-2016
2. మిక్కిలినేని రాధాకృష్ణ 2011 తెలుగువారి జానపద కళారూపాలు (ప్రొ.శ్రీ.తె. విశ్వవిద్యాలయం 2011సం॥)
3. ఆర్వియస్ సుందరం,ఆంధ్రుల జానపద విజ్ఞానం
4. కళల తెలంగాణ : మామిడి హరికృష్ణ (సంపాదకుడు , 2017సం॥)
5. పురాణాలు కథలు: ప్రొ॥ ననూమాసస్వామి-2007
6. మూలధ్వని : ప్రొ॥జయధీర్ తిరుమలరావు
7. భారతదేశం వాయ్యిదాలు : ఎన్.బి.టి

❖ ❖ ❖

జానపద గేయసాహిత్యం – స్త్రీల పాటలు, కుటుంబ విలువలు

– అవధానం సుజాత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ సిటీ కళాశాల, నయాపూల్, హైదరాబాద్.

1. ఉపోద్ఘాతము : జానపద గేయ సాహిత్యం నిర్వచనాలు
2. గేయ లక్షణాలు
3. గేయాలు - విభజన
4. స్త్రీల గేయాలు - కుటుంబవిలువలు

జానపద గేయ సాహిత్యం నిర్వచనం :

జానపదులు పాడే పాటలు లేదా గేయములను జానపదగేయములు అంటారు.

శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు జానపద గేయాన్ని మధుర కవితలని పేర్కొన్నారు. శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు 'దేశిసారస్వత'అని అన్నారు.

జానపద గేయాలు మానవుని మనోభావాలను వ్యక్తం చేస్తాయి. అలవోకగా తన ఉద్రేకాలను వ్యక్తం చేసే ప్రక్రియే అశేయం. జానపదగేయమునకొక ప్రత్యేక కవి యుండడు. అజ్ఞాత కర్తృత్వం, సామూహిక ఆలాపన, మౌఖిక ప్రచారం, లయబద్ధంగా ఉండటం, ఆనాటి ఆచార వ్యవహారాలు, భాష గేయాలలో ప్రతిఫలిస్తాయి.

జానపద గేయమునకు నియమిత స్వరూపం లేకపోవటం పాడేవారి కనుగుణంగా చరణాలు, పదాల మాండలికాలు మారుతూ ఉంటాయి.

గేయ రచనాకాలం ఖచ్చితంగా చెప్పలేకపోవటం. ఒకరి నుండి ఒకరికి వినికిడి ద్వారా ప్రసారం. సహజ శైలిని కలిగి ఉంటాయి. చక్కని దేశీయ ప్రయోగాలు రసధ్వని ఉంటాయి. పాడుకోవడానికి వీలుగా ఉంటాయి. గేయంలో ఒక పదం లేదా చరణము పునరావృతమగును. గేయ రచనలో వస్తువు సామాజిక జీవనం వారి ఆచార వ్యవహారాలే.

గేయ విభజన :

వస్తువును బట్టి గేయములు

1. పౌరాణిక గేయాలు
2. చారిత్రక గేయాలు
3. ఆధ్యాత్మిక గేయాలు
4. సాంఘిక గేయాలు అని చెప్పవచ్చు.

రసమునుబట్టి శృంగార, వీర, కరుణ అద్భుత, హ్యాస గేయములను స్థూలంగా విభజింపవచ్చు.

ఆలంబనం బట్టి :

1. బాల బాలిక గేయాలు
2. స్త్రీల గేయాలు
3. శ్రామిక గేయాలు అని చెప్పవచ్చు.

స్త్రీల గేయములు - కుటుంబ విలువలు :

మానవ జీవనంలో కుటుంబవ్యవస్థకు అత్యంత ప్రాధాన్యం ఉంది. కుటుంబ వ్యవస్థకు స్త్రీలు పట్టు కొమ్మలని చెప్పవచ్చు. ఒక కుటుంబంలో స్త్రీ తల్లిగా, భార్యగా, చెల్లిగా, అక్కగా, అత్తగా, మేనత్తగా అమ్మమ్మగా, నానమ్మగా, వదినగా, తోటి కోడలుగా, వియ్యపురాలిగా అనేక పాత్రలు పోషిస్తోంది. ఒక కుటుంబం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లాలంటే స్త్రీ తన ధర్మాన్ని చక్కగా పోషించినప్పుడే అది సాధ్యమవుతుంది.

స్త్రీల గేయాలలో ఎన్నో కుటుంబ విలువలు దాగి ఉన్నాయి. స్త్రీలు కుటుంబ జీవనంలో ఎలా ఉండాలి, ఎలా నడుచుకోవాలి, ఆత్మీయత, ఆదరణ, ఓర్పు, సహనం, శాంతిసామరస్యం, ప్రేమ వినయ విధేయతలు మొదలగు ఈ గేయాలలో ఇమిడి ఉన్నాయి.

ఇంట్లో పనులు చేసుకుంటూ పాడే పాటలద్వారా తమ పిల్లలకు మంచి చెడు నేర్పేవారు. అంటే ఈ గేయాలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడేవి. తల్లి పాడే జోలపాటలు, లాలి పాటల ద్వారా పిల్లలు, శబ్ద మాధుర్యాన్ని తద్వారా తల్లి ప్రేమను చవి చూస్తారు. ఆ పాటలలో లయ వారికి ఆనందాన్ని కలిగిస్తుంది.

ఉదాహరణ :

జో అచ్యుతానంద జోజో ముకుందా
రావే పరమానంద రామ గోవిందా
రామ లీల మేఘశ్యామ లాలీ,
తామరస నయన దశరథ తనయా లాలీ
ఏడవకు ఏడవకు వెర్రి నాగన్న
ఏడిస్తే నీ కండ్లు నీలాలు కారు

తల్లి బిడ్డకు స్నానం చేయిస్తూ ఆశీస్సులు అందిస్తుంది. అంగరక్ష, ఆదిరక్ష, చిన్ని నా అబ్బాయికి శ్రీరామరక్ష. పెండ్లి వేడుకలలో పాడే పాటలలో ఇరుపక్షాలవారి కోరికలు బలాబలాలు కవితా వస్తువులు. తమ పిల్ల కలిగిన కుటుంబమున చేరాలని అందరూ కోరుకుంటారు.

"అల్ల పూరే వారు పిల్లనడిగేరు, పిల్లనాని రూపు రేఖలున్నాయి.

ఏటేట పండేటి భూములున్నాయి. ఊరి పాలి మేరలో తోటలున్నాయి.

చుటూకొల్లారంపు మిద్దెలున్నాయి.
కుఱ్ఱవారికి మంచి సేద్యపు భూములు ఉన్నాయి
మన పిల్లకు తగ్గ ఈడుజోడేను.
కన్నె నిస్తామని కబురంపుదాము"

అని ఆశపడతారు. ఇక వరుడు వైపు

శ్రీరామ చింతల్ల పండు పండింది
చూచిరావే సీత కోసుకెలదామె
బోరెల్ల వారింట్ల కన్య పుట్టింది
చూచి రావే లక్ష్మి చేసుకొందామె

అని కోరుకుంటారు.

వివాహ వేడుకలలో కట్నాల పాట, పెళ్లి నలుగు పాటలు, దంపుడు పాటలు, వదిన మరదళ్ల పాటలు, అప్పగింతల పాటలు, వియ్యపురాలిని మేలుకొలిపే పాటలు, మంగళహారతి పాటలలో ఆనాటి ఆచార వ్యవహారాలు కొంత హాస్యం తొంగిచూస్తుంది. ఈ పాటల వల్ల పెళ్లి వారిలో కొత్తదనం పోయి, బంధుత్వం బల పడుతుంది. స్నేహానురాగాలు వెల్లివిరుస్తాయి.

కట్నముల పాట :

సువ్వి సువ్వి రామచంద్ర,
సువ్వి సువ్వి కోల్సిసాంద్ర
సువ్వి సీతమ్మ మాకు శుభములమ్మ
గాదైన పసిడి రాకళ్లు పట్టుకొని రాజనములు
కుందెనందు నిండు నుంచి కట్నములు
దంచిరపుడు, కుంద రదనలెంతో వింత -
కుదురుచుండగా .....

ఈ పాటలో ఆంగిక, వాచిక, అభివ్యక్తీకరణ స్త్రీల మనో సౌందర్యాన్ని తెలుపుతాయి.

నలుగు పాటలలు :

నలుగుగిడ రారే నలినాక్షులారా
నలిననాభునకు నవ మోహనాగునకు
నలుగుకు రారా నీవు నవనీతచోరా, వేగరారా
దేవ వేణుగోపాలా - అని నలుగు పెడతారు.

వధూవరులకు నలుగు పెడుతూ పాడే పాటలలో ప్రేమ, ఆత్మీయత వారిని కుటుంబ జీవన పట్ల సానుకూల దృక్పథం పెంపొందించుకొనే విధంగా ఉంటాయి.

వియ్యాలవారిని వధూవరులను గూర్చి పాడే పాట లలో హాస్యముంటుంది.

ఎక్కడ దొరికినాడమ్మ ఈ పెండ్లి కొడుకు

ఉదా :

అడ్డెడు మానెడు పోసినాము
అరిసరైనా వండినాము
అంగుడైనా జూపడాయె
అర మొగము పెళ్ళికొడుకు

వియ్యపు రాలిని హాస్యమాడుతూ.....

వెలదిలో ఈ వియ్యపురాలిది ఎరుకలి
కులమమ్మ వీరిది ఏ కులమమ్మ
ఎరిగి ఎరిగి వీరితో వియ్యమందిరి.....

అప్పగింతలపాటల్లో పిల్లలకు తల్లిదండ్రులు కొత్త ఇంట్లో ఎలా ఉండాలో, చెబుతారు.

"సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినాయి
చెలిగిమి అత్తింట బుద్ధిగల్గి ఉండు
ఎవ్వరేమాడిన ఎదురాడబోకు, వీధిలో
నిలుచుండి కురులు విప్పకమ్మ
పలుమారు పలుచెరచి నవ్వబోకమ్మ
అత్తగారితో పోరు చేయబోకమ్మ
భర్త మనసు తెలిసి మసలు కోవమ్మ
పెద్దల చిన్నవారిని చేరదీయమ్మ
మన్నించు నీతోటి చేసిన మంకు పొరెల్ల
ఎరుగని అత్తింట్లో చేయబోకమ్మ"

అంటూ తల్లి పాడే పాటలో, అమ్మాయికి తగిన శిక్షణ లభిస్తుంది. పౌరాణిక పాటలలో పారుజాత పల్లవి, సుభద్ర కళ్యాణము, గంగా గౌరి సంవాదం ప్రసిద్ధమైనది.

సుభద్ర కళ్యాణం పాటలో :

పెండ్లి వేడుకలు, చక్కగా వర్ణింపబడినాయి.

"శశియు రుక్మిణి సత్యభామయును చెంగి పేరంటములు
జేయుచురేల
చెరుకులు తరిగిరి శుభకరంబుగను
జలకమిడ్డరికిని సరుగునను అమర్చె దివ్యాం
బరమ్ములు
దివ్య మాలికలు దివ్య భూషణమ్ములు
దివ్యాంగనములు ధరియిరోయి
జాచి వాయిద్య ధ్వనులుహొసగ
గరుడ గంధర్వులు గానములు బాడ
అతివ పూజించెను కరకంకణముల చేయి ఘల్లు
మనగా అతివపూజించెను.

పారుజాత పల్లవి పాటలో సత్యభామ అహంకారం, రుక్మిని భక్తిభావన చెప్పబడ్డాయి.

కృష్ణుడు ఇంద్ర లోకం నుండి తెచ్చిన పారిజాత పువ్వు రుక్మిణికీయి సత్యభామ కనుక వహించి నారదుడు ఇరువురికి జగడం పెట్ట కృష్ణుడు ఇంద్రుని గెలిచి చెట్టునే పెకలించి సత్యభామ ఇంటి పెరటి చెట్టుగానాదె.

ఈ గేయంలో కృష్ణుడు భక్తికి లొంగుతాడని చెప్ప బడింది. పూచిన పువ్వులన్నీ రుక్మిని కడకప్పుడు వెళ్ళే తుమ్మదలయి పువులు అన్నీ రుక్మిణిపై వ్రాలి పారిజాతపు చెట్టు సత్యభామ పెరట వేయుటగాని పూచిన పువులు అన్నీ నీపై వ్రాలెగది ..... అనుచూ నారదుడు పలురా హస్తములు ముకుళించి నారదునికి, కృష్ణునికి మ్రొక్కెను. రుక్మిణి లేనప్పుడు గోవిందా కృష్ణహరి గోపాలా హరి యనుచు

పారిజాతపు పువ్వు మెవరు పాడిన విన్నాను. సతులకు సౌభాగ్యం గల్గును సంతోషమున వుండ్రూ అంటూ ఫలశ్రుతి ఉంది.

అన్నాచెల్లెళ్ల అనుబంధం తెలిపే పాటలు ఎన్నో ఉన్నాయి.

ముగ్గురమ్మలతోడ నేబుట్టినాను
నా నడుము మువ్వంచు చీర గోరింది
నలుగురన్నల తోడ నేబుట్టినాను
నా నడుము నల్లంచు చీర గోరింది.
అయిదుగురన్నల తోడ నేబుట్టినాను

నావొళ్లు అద్దాల రవిక గోరింది

అని పాడే గేయంలో చెల్లెలి కోరికలు అన్నలకు మురిపంగా అడగటం తెలుస్తున్నది.

స్త్రీలు అన్నలు రాగానే తమ బాధను చెప్పుకొని, పుట్టింటిని చూసి రావాలని కోరుకుంటారు.

కలవారి కోడలు కలికి కామాక్షి
కడుగుతున్నది పప్పు
కడవలో బోసి
అప్పుడే వచ్చెను అమె పెద్దన్న
కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీరు నింపె"

అప్పుడు ఆమె అన్న

"ఎందుకు కన్నీరు ఏమి కష్టాలు
తుడుచుకో చెల్లెలా మూడుచుకో కురులు
పెట్టుకో సొమ్ములు కట్టుకో చీరే
చేరి మీ అత్త మామలకు చెప్పి రావమ్మా" అంటారు.

ఈ గేయాలలో స్త్రీలకు కుటుంబ మర్యాద పెద్దలకిచ్చే మర్యాద వ్యక్తమవుతున్నాయి.

బావమరదళ్ళ పాటల్లో హాస్యం గోచరిస్తుంది.

బావా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు

స్త్రీలగేయములో భాష మాండలికమే సామెతలు నుడికారాలతో నిండి ఉంటుంది. కొన్ని పదాలు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి.

ఉదా :

కడవ, బువ్వ, పెండ్లాము, మక్కువ, పెక్కు, చేపట్ట, మరుగు, మరుపు, పుస్తె, వేగిరం, మేళం మెరవణి మొదలగునవి.

కొన్ని పాటలలో ఆనాటి వస్తు వర్ణన ఉంది.

కోడలు : కుర్చీ పీటల మీద కూర్చున్న ఓ అత్త
మా అన్నలొచ్చేరు మమ్మంపుతార

అత్త : నేనెరుగ నేనెరుగ నీ మామనడుగు

కోడలు : పట్టె మంచం మీద పడుకొన్న మామ
మా అన్నలొచ్చారు మమ్మంపుతార అని అడుగుతుంది.

కుర్చీపీట, పట్టెమంచం ఆనాడు ఉపయోగించిన వస్తువులు. ఈ పాటలో వ్యక్తమైనాయి. కొన్ని పాటలలో పల్లెల వర్ణన ఉంది.

పగిడి పళ్ళెంలోన పాదాలుగడిగి
అపరంజి పళ్ళెంలో ఆర్తిపట్టి
పచ్చన్ని పచ్చన్ని పందిల్ల

కుడిపాద మెత్తించి, పెండ్లి కుమారునిపై వివాహ వేదికపై కూర్చుండబెడతారు. కొన్ని గేయాలలో స్త్రీల అలంకారాలు, నగలు, వస్త్ర విశేషాల వర్ణన ఉంది.

పట్టుచీరలు, అద్దాల రయికలు, అడ్డచీర, మువ్వల పట్టి, కరకంచు ముక్కుపుల్ల, చెవుల దిద్దులు, ముత్యాల సరాలు, పట్టుపావడాలు, రత్నకంకణాలు, మొదలగునవి వర్ణించబడినాయి. కొత్త కోడలు చేసే మంగళ వారం నోములు, వరలక్ష్మీ వ్రతం, ఏకాగ్రతను ప్రేమను పెంచేవి. స్త్రీల గేయాలలో పిల్లల పెంపకం, కుటుంబంలో కలిగే తీరు, అలంకరణ, ఆదరణ, నోములు, వ్రతాలు ఇవన్నీ కుటుంబ విలువలను తెలియజేస్తున్నాయి.

ముగింపు :

ఈ విధంగా స్త్రీ గేయాలు ఆనందాన్ని, మానసిక వికాసాన్ని కల్గించడమే కాక, కుటుంబంలో ప్రేమ సౌభ్రాతృత్వాలను పెంపొందించడానికి తోడ్పడుతున్నాయని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద సాహిత్యం - బిరుదురాజు రామరాజు
2. తెలుగు జానపద సాహిత్యం - స్త్రీల గేయాలలో సంప్రదాయం
3. స్త్రీల పౌరాణిక పాటలు - ఆంధ్ర సారస్వత పరిషత్తు (తిలక్‌రోడ్)
4. తెలుగు వాణి
5. తెలుగు మహిళ - డా. జి. సుమిత్రా రామకృష్ణ

❖ ❖ ❖

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కాటి పాపలు

– డా॥. బాసని సురేష్

జానపద కళారూపాల్లో ఇంద్రజాల విద్యలను ప్రదర్శించే కళారూపాలు చాలా ప్రత్యేకమైనవి. ఎందుకంటే ఈ కళారూపాలు ప్రేక్షకుల కళ్ళ ముందే నమ్మశక్యం గాని విద్యలను ప్రదర్శించి వారిని సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తాయి. వీరు ప్రదర్శించే విద్యలను ప్రేక్షకులు ఎంత తీక్షణంగా పరిశీలించి చూసినప్పటికీ అంచనాలకు అందకుండా క్షణంలో, వారి కళ్ళకు గంతలు కట్టి అద్భుతాలను ప్రదర్శిస్తారు .ఈ కళారూపాలు కొన్నిసార్లు ప్రేక్షకులకు మంత్రతంత్రాలు ఉన్నాయనే నమ్మకాన్ని కూడా కలిగించడం విశేషం. ఇటువంటి కళారూపాల్లో సాధనా శూరులు, బీరన్నలు, యక్షిణి, విప్రవినోదులు, మోడీ, గారడీ, దేవర పెట్ట వేషం, మహమ్మదీయుల మోళీ, కాటి పాపలు ప్రధానమైనవి. ఇందులో కొన్ని కళారూపాలు నశించిపోగా మరికొన్ని అవసాన దశలో సాధనా శూరులు బీరన్నలు, కాటిపాపలు మనుగడలో ఉన్నాయి .వీటిలో సాధనా శూరులు పద్మశాలి కులాన్ని, బీరన్న లు యాదవులను మాత్రమే ఆశ్రయించి ప్రదర్శనలిస్తూ ఆశ్రిత కళారూపాలుగా కొనసాగుతున్నాయి. కాటి పాపలు మాత్రం తమ కట్టడి గ్రామాల్లోని అన్ని కులాలను ఆశ్రయించి ఇంద్రజాల విద్యలను ప్రదర్శిస్తారు. వీరు శైవాన్ని ప్రధానంగా అనుసరించే బుడగ జంగాలలో బేడ వర్గానికి చెందినవారు. వీరికే కాటి పాపలు లేదా కాటికాపరులు అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఈ కళాకారులు కాటి లోపల పాపల మాదిరిగా పడుకుంటారు కాబట్టి కాటి పాపలని అలాగే కాటికి కాపర్లుగా ఉండటంతో కాటి కాపర్లు అనే పేరు వచ్చిందని చెబుతారు. హరిశ్చంద్రుని కాలం నుండి చేస్తున్న వృత్తి అని చెప్పుకుంటారు.

వీరి దగ్గర ఉన్న రాగి శాసనం మీది ఆధారాలను బట్టి చూస్తే కాటికాపరులు 'అంగ వంగ కళింగ కాశ్మీర నేపాల భూపాల ద్రావిడ విధర్భ మొదలైన 56 దేశములలో పుణ్యం కోసం కాటి పాపడు 5 వేల వరహాలు బిక్షం అడిగి విశ్వనాథునికి ముఖ మంటపం కట్టించి, నాగభరణం చేయించి, విఘ్నేశ్వరునికి షోడశ పూజ గావించి, శిద్ధులకు శుద్ధ భక్తి గావించినాడని గొప్పగా చెప్ప బడుతుంది. అంతేగాక వీరి పుట్టుకకు సంబంధించి కూడా, ఆ పరమేశ్వరుని చిత్ర కంటి మంట చేత మన్మధుడు భస్మ మైనప్పుడు ఆ పరమేశ్వరుడు చెమట తీసి కాటిలో వేస్తే కాటిపాపడు పుట్టెనని, అతనే కాటి కర్త గా నిలిచెనని తెలుస్తున్నది. ఈ కాటి పాపని కి జయ నామ సంవత్సరం మార్గశిర మాసంలో గురువారం నాడు కాశీ విశ్వనాథుడు కాటి కాపరులకు రాగి ధర్మ శాసనాన్ని రాసి ఇచ్చినాడు.

ఈ శాసనంలో కాటికి పుట్టినవాడు కాటి పాపడు కనుక కాటిలో కాల్చిన, బొందలో పూడ్చినా అన్ని కులాల వారు 516 రూపాయలు, ఆవులను ల్యాగలను, చనిపోయిన వ్యక్తిసొమ్ము లను, తలె ముంతను ఇవ్వాలని ఖరారు చేసి,ఇది కాశీ విశ్వనాథుని శాసనమని చెప్పబడింది. అంతే కాకుండా వీటితో పాటుగా బోనుగెడుగింజలు, మూల కాడి బియ్యం, ముఖం మీది బట్ట వీరికి సమర్పించాలని రాసి ఉంది. వీరికి ఇదే కాకుండా కడుపుల కొడుకు పుడితే కాటిపాపని కట్టమని ,మానెడు సోడు గింజలు, శిశువు బొడ్డు మీద 300 రూపాయలు ఇవ్వాలి. ఈ శాసనం మీది నియమాలు తప్పకూడదని ఒకవేళ తప్పితే కాశిలో గోహత్య శిశుహత్య బ్రహ్మ హత్య చేసినంత పాపం తగులుతుందని చెబుతుంది.

కళాకారులకు వంశపారంపర్యంగా సంక్రమించిన కట్టడి గ్రామాలుంటాయి. ఆయా గ్రామాలకు ప్రతి సంవత్సరానికొకసారి వెళతారు. వీరు దీపావళి తరువాత

చెట్ల తీర్థం పోయి, పోచమ్మ తల్లి బోనాలుచేసుకుంటారు. ఆ తరువాత తమ కుల దైవమైన గుస్సాయి పండుగ చేసుకొని కట్టడి గ్రామాలకు బయలుదేరతారు. తిరిగి శ్రావణమాసంలో ఇంటికి వస్తారు.ఇట్లా సంవత్సరంలో ఒక నెల రెండు నెలలు మాత్రమే ఇంటి దగ్గర ఉండి మిగతా నెలలు సంచారం చేస్తూనే ఉంటారు.

కళాకారులు వేషధారణలో బుర్రమీసాలు ,పాడవైన గడ్డం కలిగి,విభూదితో నుదట అడ్డ నామాలుమధ్యలో పెద్ద బొట్టు పెట్టుకుంటారు.మెడలో చంద్ర వాల గొలుసు, రుద్రాక్ష మాలలు, మకన కుందనాలు, కొనక పోగులు రక రకాల ఉంగరాలు ధరిస్తారు. కొందరు తలకు రుమాలు చుట్టుకుంటే మరికొందరు ఈక ల మాదిరిగా ఉండే ఇ త్తడి కిరీటాన్ని పెట్టుకుంటారు. ఇవే కాకుండా పలు రకాల రంగుల కండువాలు నల్లని కోటు వేసు కుంటారు. చేతిలో సండ్ర కర్ర కు ఒక పక్క జోల సంచిని మరొక పక్క బోనుగను తగిలించుకొని, నపేరా పట్టుకొని చూపరులకు భీకరంగా కనిపిస్తారు. వీరు గ్రామానికి వెళ్లగానే మొదట గ్రామ పెద్దలను సర్పంచిని పోలీస్ పటేల్ ను కలిసి వీరువచ్చిన సమాచారాన్ని చెప్తారు. ఆ తర్వాత గ్రామంలో బోనుగను ఊపుకుంటూ ఇంటింటికి ప్రతిఫలం కోసం పాటలు పాడుకుంటూ తిరుగుతారు. ఈ సందర్భంలో ఎవరైనా ధాన్యం గానీ డబ్బులు గానీ ఇస్తే వారికి శుభోదయం అంటూ

కంటి వెలుగు చల్లగా ఉండి
ఐలోని మల్లన్న కొమురెల్లి మల్లన్న
నరసింహస్వామి దీవన రాయేసునిదీవన కలిగి
ముట్టింది ముత్యమై పట్టింది బంగారమై.....

కొడుకులు బిడ్డలు మనమలు మనవరాళ్ళు చల్లగా ఉండాలని, పంటలు బాగా పండాలని దీవనార్తి పెట్టి , కొమ్ముపట్టి ఊదుతారు. ఈరకంగా గ్రామంలో తిరుగు తున్నప్పుడు గతంలో ఆ ఇంట్లో ఎవరైనా చనిపోయి నప్పుడు వారి పేరుమీద వీరికిచ్చిన వెండి ఆభరణాలను, ఆ ఇంటి వారికి గుర్తు చేసి ఇంటి యజమానిని స్మరిస్తారు. అట్లాగే ఇదే సమయంలో ఆ ఇంట్లోని ముత్తాతలు తాతలను తలచి దీవనార్తి పెడతారు. వీరిదగ్గర ఉండే జోల సంచిలో ఇంద్రజాల విద్యలకు ఉపయోగపడే ఎముకలు గచ్చకాయలు రాళ్లు కట్టె బొమ్మలుంటాయి. గ్రామంలో బోనుగను ఊపుకుంటూ తిరుగుతూ ఖచ్చీరు దగ్గర గాని లేదా నాలుగు బాటల దగ్గర గాని కూర్చుండి ఇంద్రజాల విద్యలను ప్రదర్శిస్తారు. తమ దగ్గర ఉండే జోల సంచిని ముందర పెట్టుకొని ప్రేక్షకులు గుమి కూడగానే పాటలు పాడుతూ నపేర ఊదుతూ ప్రద ర్శనకు సిద్ధమవుతారు. ప్రదర్శనలో ఇద్దరు కళాకారులు ఉంటారు. ఇందులో ఒకరు ప్రధానంగా సంభాషిస్తూ విద్యలు ప్రదర్శిస్తుండగా ,మరొకరు అతని సంభాషణకు వంతపాడుతూ, ప్రదర్శించే అంశాన్ని వివరిస్తూ ప్రేక్షకు లను ఆకర్షించే విధంగా పాత్ర పోషిస్తాడు.

ప్రదర్శనలో సహజంగా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా సంభాషణలుంటాయి. గ్రామంలోని కులాల ప్రస్తావన తీస్తూ, వారి గుణగణాలను తెలియపరుస్తూ నవ్విస్తారు. ముందుగా కళాకారులు ప్రదర్శనలో శివ శంకరుడు హరిశ్చంద్ర మహారాజు పోచమ్మ తల్లి గణేష్ విగ్రహాలను తీసి పాటలు పాడటం జరుగుతుంది. అంతేకాకుండా ప్రదర్శించే విద్యలకు తెలంగాణలోని పేరెన్నికగన్న రాయేసునిమొక్కుబడులను కూడా సందర్భానుగుణంగా ప్రస్తుతిస్తూ ప్రేక్షకులను ఆకర్షిస్తారు. ఆ తర్వాత జోల సంచి నుండి బుచ్చమ్మ బుచ్చయ్య అనే ఇద్దరి భార్య భర్తల బొమ్మలను తీస్తారు. పూర్వం వీరిద్దరూ కాటిపాపల వారికి భిక్ష పెట్టలేదని, వీరి ఇంటిపేరు కుక్కలోళ్లని వ్యంగ్యంగా దూషిస్తూ హాస్యాన్ని పండిస్తారు. అట్లాగే వెటకారంగా అనిపించకుండా ఉండేవిధంగా బూతులు కూడా ప్రయోగిస్తూ హాస్యాన్ని కలిగిస్తారు. ఒక మాయా బొమ్మను తీసి దానితో ప్రేక్షకు లకు దండం పెట్టిచ్చి బొమ్మ మాట్లాడినట్లుగా భ్రమ కలిగిస్తారు. అట్లాగే పాములు తేళ్లను సృష్టించి భయ కంపితులను చేస్తారు. శివ శంకరుని తలుచుకొని నోట్లో

నుండి రాళ్లను గచ్చకాయ లను ఒక్కొక్కటిగా తీస్తూ ఆశ్చ ర్యాన్ని కలిగిస్తారు. పిల్లలు ఉంటే వారి మీద హాస్యోక్తు లను వేస్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగిస్తూ ప్రదర్శి స్తారు. ప్రేక్షకులు ప్రదర్శన నచ్చి తోచినంత ఇస్తే తీసుకొని దీవ నార్తి పెడతారు.

కాటిపాపల కళాకారులకు కట్టడి గా సంక్రమించిన గ్రామాల్లో ఎవరైనా చనిపోతే ఆ ఇంటికి హక్కుగా వెళ్లి వారిచ్చే ప్రతిఫలం తీసుకుంటారు. వీరు ఒక్కో గ్రామంలో పది నుండి పదిహేను రోజుల వరకు ఉండి ఆ గ్రామంలో అందరి దగ్గర ప్రతిఫలం స్వీకరిస్తారు .అక్కడే కాలీ సమయంలో షికారు చేసుకుంటారు.

కళాకారులు తమకు వంశపారంపర్యంగా సంక్ర మించిన వృత్తిని గౌరవిస్తూ తమ సంస్కృతిని నిలుపు కుంటూ వస్తున్నారు. అయితే కళాకారులు ఈ ఇంద్రజాల విద్యలు తమతోనే అంతరించిపోకుండా ఉండాలని ,తమ వారసులకు కూడా నేర్పుతూ వస్తున్నారు . తమ సంస్కృతి పరిరక్షణలో తామే ముందుకు వస్తున్నామని అంటు న్నారు. ఏది ఏమైనప్పటికీ మా ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే ఉందని వాపోతున్నారు.

కాటిపాపల శాసనం :

మొదటి వైపు :

1. శ్రీ శుభమస్తు అంగ వంగ కళింగ, కాశ్మీర నేపాళ భూపాళ ద్రావిడ విధర్భ ఛప్పన్న,
2. యాభై ఆరు దేశములందు పుణ్యం గాను కాటి పాపడు ఐదువేల వరహాలు,
3. బిక్షం అడిగి విశ్వనాథునికి ముఖ మంటపం కట్టించి నాడు నాగభరణం చే,
4. యించినాడు విఘ్నేశ్వరునికి షోడశ పూజ గావించి నాడు సిద్ధులకు శుద్ధ భక్తిగా వించి నాడు. అయ్య యింత మహాత్ముడు పరమేశ్వరుడు చిత్ర కంటే మంట చే,
5. త మన్మధుడు భస్మమయి కూలినప్పుడు సదా శివుడు చెమట తీసి కాటిలో వేస్తే,
6. కాటి పాపడు పుట్టెను. అప్పుడు కాటి కర్తఅయి నిలిచెను, గనుక అయోధ్య మధుర
7. కాశీ ముఖ్య పాన శ్రేష్ఠ వాడు భూలోక ప్రత్యక్ష సూర్య ప్రభావ సమాన దివ్య ర
8. త్న సింహాసన భోగ మోక్షదాయక కాశీ విశ్వనాథుని ముఖ మంటపము న
9. శూర చాన రాజ్యభార దురంధరులైన సంతయి ప్రధానిని మిత్య ప్రధానిని జయ
10. ప్రధాని రామప్రధాని మొదలయిన ప్రధా మోత్తములున్నూ మహా జనంబులున్నూ
11. పుణ్యం గాను శ్రీ జయద్భుత శాలివాహన శత వర్షంబులగు మున్నూరు సంవత్సరములగు జయ నామ సంవత్సరం మార్గశిర మానం శు.2. గురువారం నాడు కాశీ విశ్వనాథు
12. డు కాటి కాపలకు వ్రాసి ఇచ్చిన రాగి ధర్మ శాసనం
13. ఫకీరు వానికి కాటి పాపని ఇలాకా లేదు, గోరీ కి పుట్టిన వాడు ఫకీర్ వాడు
14. కాటికి పుట్టినవాడు కాటి పాపడు కనుక కాల్చిన కాటికి పూడ్చిన బొంద కు
15. చేసేనా తిరు వల్లెకు 516 రూపాయలు ఆవుల్యాగను కాటిపాపనికి ఇచ్చే ఖరారు సా
16. సొమ్ములు సొమందాలు తలె ముంత యివ్వాలి యిది కాశీ విశ్వనాథుని శాసనం
17. కాటి పాపానికి ఇచ్చేది కర్త అయి ఉన్నాడు, కలియుగం న పుట్టిను వాడు కాల్చి
18. నా కాటికి పూడ్చిన బొందకు కర్త అయినవాడు కాటిపాపడు కాటి మోసెల్లి న
19. వేస్తే 500 రూపాయలు తలె ముంత ఆవుల్యా గను ఇచ్చేది కురుమ వాండ్ల గొల్ల వా
20. డ్లు సచ్చిపోతే పిల్ల తల్లి గొర్రెను ,తలె ముంత 500 రూపాయలు ఇచ్చేది, వృద్ధులయితే
21. కాశ మేక గొంగడి ఇవ్వవలెను, కాపులు రెడ్లు సస్తే 500 రూపాయలు ఆవుల్యాగను

22. ఇచ్చేది ప్రతి జాతి వాడు ఎవరు చచ్చినా 500 రూపాయలు మొకంము మీద బట్ట

శాసనం రెండవ వైపు :

23. ల్ల మూల కాడి బియ్యం అక్కడి రూపాయలు కాటిపాపనికి ఇచ్చేది ఊరు వుతికే
24. మడేలు రాజు జీవి వస్త్రం నల్లమందుకు 50 రూపాయలు యిచ్చేది ప్రతి జాతి వాడు
25. బొనుగెడు గింజలు ఇవ్వవలెను గౌండ్లు చస్తే అవుల్యాగను ఇచ్చే మంగలి వాం
26. డ్లు ఇంటికి 300 రూపాయలు ఇవ్వవలెను కడుపుల కొడుకు పుడితే కలువ మెల్లు
27. కాటి పాపనిది పాపకి పక్క బెస్ని మానెడు సోలెడు గింజలు బొడ్డు మీది 300 రూపాయలు
28. ఇవ్వాలి ——— (21) దినములు ఎల్లేదాకా పాప ని పేరు కంట్లపాపడు ఇంట్లె పాపడు
29. దొరకి దొరతనానికి పాపడు అన్నిటా పాపని పేరే వీరబాహు సంతతి మాల వా
30. డు సచ్చిపోతే వెంటనే కబురు చేసి పాపని కి ఇవ్వాలి .లంబాడి మనిషి చని
31. పోగులు కడియాలు 500 రూపాయలు తప్పక ఇవ్వాలి ప్రతి కులం వారు ఎవ్వరు
32. చనిపోయిన తాటి పాపానికి 500 రూపాయలు పోగులు కడియాలు బొనిగడుగింజ
33. లు తప్పక ఇవ్వాలి ఇస్తే చచ్చిన వారికి పుణ్యం కల్గును కాశీలో అన్నం వం
34. డిస్తే, కాశీకి పోయిన వారి ముని మనుమలకు ముక్తిఫలము యిది కాశీ పరమే
35. శ్వరుడు చేసిన మేర తప్ప రాదు తప్పించితే కాశిలో గోహత్య శిశుహ
36. త్య బ్రహ్మ హత్య చేసినంత పాపం వచ్చును స్వ దత్తా ద్విగుణం పుణ్యం
37. పరదత్తాను పాలనం పరదత్తా పహారేణ స్వదత్తా నిష్పలం భవేత్.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సంస్కృతి పండుగలు – వైవిధ్యం

– డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి, తెలుగు అధ్యాపకులు, ట్రిబుల్ ఐటి విశ్వవిద్యాలయం, ఒంగోలు.

జనుల నుంచి, జనుల వల్ల, జనుల కొరకు, జనుల చేత ఏర్పడినది జానపదం. జానపద మంటే పల్లెటూరు. జనపదం అనగా జాన-పల్లె, పదం-పాట, జానపదులు పాడుకొనే పాటలను జానపదుల పాటలు అంటారు. జనపదల్లో ఉండే ప్రజలను 'జానపదులు' అని అంటారు.

అక్షరజ్ఞానంలేని పల్లె ప్రజలు పాడుకునే పాటల్ని లేదా గేయాల్ని జానపద గేయాలు, పాటలు అంటారు. అమర కోశంలోను, వ్యాసమహాభారతంలోను జానపదులు అంటే గ్రామీణ ప్రజలు అనే అర్థంలో చెప్పడం జరిగింది. జానపదవాసులే జానపదులు అని ఎర్రన అరణ్యపర్వంలో జానపదులు గ్రామీణులనే అర్థంలోనే ప్రయోగించాడు. ఇందులోని పద్యం చూడవచ్చు.

'జానపదుల్ పురీజనులు సంతసముంబ్రమదంబెలర్ప నీ
దైవ శుభోదయంబు హృదయంబుల గోరుచునున్నవారు స
మ్మానము నొంది కౌరవ నమాజము నిన్ను భజింపభూరితే
జోనిధివై వెలింగెదవు నూర్యుడి చాడ్పున
నీవయిమ్మహిన్' - భారతం అరణ్యపర్వం 5 - 364

భారతంలో జానపదులు యజ్ఞం చేసినవారితో, పండితులతో సమానంగా భావించారు. జానపద శబ్దం జాతిపరంగా, ప్రజల పరంగా, విషయ పరంగా ఉప యోగించడం జరిగింది. ఆంధ్ర పండితులు జానపద శబ్దానికి ప్రాకృత, అజ్ఞాన, పామర, అనాగరిక, అసంస్కృత అనే అర్థలతో పోల్చి చెప్పడం జరిగింది. యజ్ఞవల్క్య స్మృతిలో 'కులాన జాతీఃశ్రేణేశృగణాంజనపదానపి' అని పేర్కొన్నారు. మహాభారతంలో ప్రాంతం, దేశం అనే అర్థంలో ప్రయోగించడం జరిగింది.

ఆంగ్లంలో Folk అనే పదానికి తెలుగులో జానపదు లని వ్యవహారంలో ఉంది. Folk అనే పదం జర్మన్ భాష పదమైన ఎశీశ్రీఎ నుంచి ఏర్పడింది. అదే Volk Slide అనే జర్మను భాషా పదం నుంచి Folk Song, Folk Literature, Folk Lore అనే ఈ మూడు పదాలు ఏర్పడినవి. ఈ పదాలకు తెలుగులో జానపద గేయాలు, జానపద సాహిత్యం, జానపద సారస్వతం అనే మాటల్ని ఉపయోగించడం పరిపాటి అయినది.

జానపద విజ్ఞానం అంటే మౌఖికమైనదే కాక, ఒక తరం నుంచి మరోతరానికి సంక్రమించడమే కాదు, జానపదుల జీవనంపై ఆధారపడుతుంది. ఎలా అంటే మానవ జీవితమంత విస్తృతమైన పరిధి జానపదవిజ్ఞానానికి ఉంది కాబట్టి. జానపద విజ్ఞానాన్ని, జానపద వాఙ్మయా నికి పర్యాయపదంగా వాడడం జరిగింది. ఈ జనాపద విజ్ఞానం అనే మాటలు ఇంగ్లిషులోని 'పోక్‌లోర్' సమానార్థ కంగా తెలుగులో మనం పాడుతున్నాం. 'ఫోక్‌లోర్' అనే పదాన్ని మొట్టమొదట డబ్ల్యు.జె. థాంన్ 1846లో ప్రతిపాదించాడు. జానపదులు గ్రామ ప్రజలే అవసరం లేదు. నగరాలలో కూడా ఇలాంటి మనస్తత్వం కలిగిన వారు ఉండవచ్చు అని ప్రసిద్ధ జానపద విద్వాంసుడు అయిన 'అలన్ డండక్' పేర్కొన్నారు. జానపద కథా క్షేత్రంలో గొప్పగా కృషి చేసిన వారు గ్రిమ్స్ సోదరులు. ఎంతో కృషి చేసి జానపద సంకలనం ప్రచురించారు.

20వ శతాబ్దంలో జానపద గేయాలకు సంబంధించి విమర్శ నాత్మకంగా కొనసాగింది. ఇందులో వేటూరి ప్రభాకరశాస్త్రి, సి. నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖర్ శర్మ, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారు ప్రముఖులు కలరు. ఇదే జానపదంపై సాహిత్య పరిశోధన చేసిన ఎందరో మహానుబావులు కలరు. నేదునూరి గంగాధరం జానపద సాహిత్య పరిశోధనకు గాను 'కవికోకిల', 'వాస్తు విశారద', 'జానపద వాఙ్మయోద్ధారక' అనే బిరుదులు

పొందారు. ఆచార్య బి. రామరాజు, నాయని కృష్ణకుమారి, ఎస్.వి. జోగారావు, పింగళి లక్ష్మీకాంతం, ఆచార్య జి.ఎన్. రెడ్డి, ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పరిశోధన సాహిత్యగ్రంథాలు ఎన్నో వెలుగులోనికి వచ్చాయి. ఇలా జానపద సాహిత్యానికి ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా మన పండుగలు ఆచార సంప్రదాయాలు నేటికి చూడక పోయిన వారి రచనల ద్వారా వింటున్నాం.

జానపద విజ్ఞానంలో జానపద సంస్కృతికి ఎనలేని ప్రాముఖ్యత కలదు. జానపద సంస్కృతిలో పండుగలు, ఆచార సంప్రదాయాలు మన జీవన విధానాలకు, ఆచార వ్యవహారాలకు, కళలకు, సాహిత్యానికి పట్టుకొమ్మలు. పండుగలు మన నాగరికతకు నిరద్ధనాలుగా చెప్పకోవచ్చు.

ఆదిమ మానవుని నుంచి నేటి ఆధునిక మానవుని వరకు ఏదో ఒక ఆరాధన శక్తిని కొలవడం జరుగుతుంది. అలా మొదట ఆత్మారాధన, మాతృ, పితృ దేవతారాధనలు, దైవ, వీరారాధనలు ఆవిర్భవించాయని చెప్పవచ్చు.

పండుగలు - నిర్వచనాలు :

'పండుగలు మొదట ప్రకృత్యారాధనగా ప్రారంభమై వ్యవసాయ సంస్కృతి కాలంలో స్పష్టరూపాన్ని పొంది, తర్వాత కాలంలో ఇంకా క్లిష్ట స్వరూపం సంపాదించి, ప్రాచీన ఆచారాల సూచ్యాగుణాన్ని మాత్రం కలిగి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవిగా పండుగలు రూపొందాయని చెప్పవచ్చు' అని ఆర్వీయస్ సుందరం నిర్వహించారు.

పంటలు పండి అవి చేతికి వచ్చినపుడు ఇంటిల్లిపాది కొత్తబట్టలు తెచ్చుకొని పిండివంటలు చేసి, పండుగ చేసుకొంటారు.

మానవులు అనేక మంది దేవతలను పూజించడం ప్రారంభించారు. ఆయా దేవతలను పూజా, పునస్కారాలతో చేసుకొనుటకు ఒక క్యాలెండర్ రూపొందించుకొన్నారు. సూర్య చంద్రుని కదలికలను బట్టి రాశులు, నక్షత్రాలు, తిథులు, గ్రహాలను బట్టి వారాలు నిర్ణయించారు. ఆ విధంగా 7 వారాలు, 15 రోజులు ఒక పక్షం. అలా 12 నెలలు ఏర్పాటు చేసుకొన్నారు. ఇలా ఒక్కొక్క నెలలో ఒక్కొక్క దేవత ఆరాధన తిథి, నక్షత్రాలు, వారాలు ఎంతో ప్రాధాన్యం చోటుచేసుకొన్నాయని చెప్పవచ్చు.

మన జానపద సంస్కృతిలో పండుగలు ఆచార సంప్రదాయాలు ఎంతో గొప్పవైవిధ్యం కలిగి ఉంటుంది. అదేకాదు నేటి ఆధునిక యుగంలో సైన్సును సైతం అబ్బురపరచే విధంగా ఎన్నో పండుగలు, ఆచార సంప్రదాయాలు కలవు. ఇందులో తెలుగు వారికి ప్రకృతికి సంబంధించిన మొట్టమొదటి పండుగ. ఆ పండుగే మన తెలుగు సంవత్సరం ఆరంభానికి మూలంగా చెప్పవచ్చు.

ఉగాది :

ఈ ఉగాది మనకు యుగ ఆది ప్రారంభం అయిందని చెప్పవచ్చు. చైత్రశుద్ధ పాడ్యమి నాడు బ్రహ్మదేవుడు తన సృష్టి కార్యక్రమాన్ని ప్రారంభించాడని కథనం. ఋతువుల రాణి వసంత ఋతువు. చెట్లు ఆకులు రాలిపోయి క్రొత్త చిగురుతో పులకిస్తుంది. మాసాలలో తొలి మాసం అయిన చైత్రమాసం ఆరంభం. కళ్ళాపు చల్లి ముగ్గులు పెట్టి, తలంటి స్నానాలు చేసి, కొత్త బట్ట ధరించడం, ఉగాది పచ్చడి ఆరురుచులతో షట్‌రుచోపేతంగా ప్రారంభం అవుతుంది. ఇందులో మానవుని జీవన చిత్రణకు కష్టసుఖాలు, ఆనందానుభూతులు ప్రతీకలుగా చెప్పుకోవడం జరుగుతుంది. బ్రాహ్మణుల చేత పంచాంగ శ్రవణం చేయించి, ఆ సంవత్సరం రాశి, ధన, వర్ష, ఆదాయ, వ్యయాలు బేరీజు వేసి చెప్పడం, ఎంతో గొప్పదైన జ్ఞానదృష్టితో ప్రారంభమౌతుంది. గ్రామ దేవతలకు పూజలు జరుపుకోవడం జరుగుతుంది. కొన్ని ప్రాంతాలలో పెద్దలకు బట్టలు పెట్టడం కూడా చేస్తారు. ఇలా ప్రకృతికి మానవునికి మధ్య ఉన్న సంబంధం ఎంతగానో ఈ పండుగలో కనిపిస్తుంది.

శ్రీరామనవమి :

శ్రీరాముడు చైత్ర శుద్ధ నవమి నాడు జన్మించాడు. రాముని జన్మదినం ఊరూ వాడ అని తేడా లేకుండా జరుపుకుంటారు. 'రామాలయం లేని గ్రామాలయం లేదు' అనటంలో అతిశయోక్తి లేదు. శ్రీరామునికి ప్రతి ఇంట్లో స్వామికి పానకం, వడపప్పు, పులిహోర తయారు చేసి, పూలు, పండ్లు, ఆకులు, వక్కలు పెట్టి నైవేద్యంగా ఉంచి కర్పూరం హారతి ఇచ్చి కొబ్బరి కాయ కొడుతారు. ఇలా శ్రీరాముని గ్రామాలలో కొలుసుకొంటారు. దేవాల యాలలో ఉత్సవాలను నిర్వహిస్తారు. అంగరంగ వైభవంగ, మేళ, తాళాలతో ఊరేగింపుతో సీతారామలక్ష్మణ సమేత హనుమతుల ఉత్సవం జరుపుతూంటారు. రామాయణంలో ఘట్టాలను రోజుకో పారాయణం చేస్తారు. ఒక రోజు కళ్యాణం, ఒక రోజు పట్టాభిషేకం వంటి కార్య క్రమాలు, ఆట పాటలతో ప్రతి పల్లె కోలాహలంగా ఉంటుంది. భజనలు, హరికథలు, కోలాటం, తాళభజన, గొరవనృత్యం ఇలా అనేక రకాలుగా శ్రీరామచంద్రుని కొంగు బంగారంగా కొలుసుకోవడం మన హిందూ సంప్ర దాయంలో ఒక భాగంగా చెప్పుకోవచ్చు.

వినాయక చవితి :

పార్వతీపరమేశ్వరుని పుత్రుడు అయిన వినాయకుని పుట్టిన రోజు జరుపుకొంటారు. ఇది భాద్రప్రద శుక్ల చవితినాడు వినాయకుని పూజిస్తారు. మట్టితోగాని, వెండితోగాని, రాగితోగాని, బంగారంతోగాని చేసిన ప్రతిమను పూజించడం చేస్తారు. విఘ్నులకు అధిపతిగా కొలుస్తారు. ఈ రోజు పీటవేసి బియ్యం పోసి దానిపైన విగ్రహాన్ని నిలుపుతారు. మరికొందరు పచ్చని పందిరి వేసి అలంకరించి 21 రకాల ఆకులు, పువ్వులు, పండ్లు, ఉండ్రాళ్ళు, కుడుములు మొదలైనవి పెట్టి పూజిస్తారు. చిన్నపిల్లలు పుస్తకాలు పెట్టి గుంజిళ్ళు తీసి, మొటి క్కాయలు వేసుకుంటారు. మంచిగా విద్యను ప్రసాదించ మని కోరుకోమంటారు. పురవీధులలో, నవరాత్రి ఉత్సవాలు దేవాలయాలలో ఎంతో అంగరంగవైభవంగా పూజించడం జరుగుతుంది. వీధుల్లోని విగ్రహాలు 9 రోజులు పూజించి ఊరేగింపుతో తీసుకొని పోయి నిమజ్జనం చేస్తారు. ఇందులో అందరు కలిసికట్టుగా సామూహికంగా జరుపుకోవడం జరుగుతుంది. ఇలా శ్రీకృష్ణాష్టమి, నాగుల చవితి, దసరా, హోలి, దీపావళి, కార్తిక దీపం, ఆడికృతిక, పెద్దపండుగ, సంక్రాంతి, మహా శివరాత్రి జానపదుల సంస్కృతి పండుగలు ఆచార సంప్రదాయాలు ఎంతగానో కనిపిస్తాయి. జానపదుల సంస్కృతి పండుగలు, ఉత్సవాలు, నమ్మకాలు, పలుకు బళ్ళు, చిత్రకళ, ప్రదర్శన కళలు, శిల్ప వైవిధ్యం ఎంతగానో కన్పిస్తుంది.

ఈ పండుగలు, ఉత్సవాలు అందరిలో ఐకమత్యం పెంపొందిస్తుంది. ముఖ్యంగా ఈ పండుగలు ఉత్సవాలు జనుల జీవితాలను సుఖమయం చేస్తాయి. కంటికి, చెవికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. జానపదులలో ఆశ్చర్యంలో ముంచెత్తుతూ అద్భుతలోకాల్లోకి విహరింప చేస్తూ ఎంతో వైవిధ్యభరితంగా కనివిందు చేస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయసాహిత్యం - ఆచార్య బి. రామరాజు
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్ సుందరం
3. చిత్తూరు జిల్లా పండుగలు సాంఘిక, సాంస్కృతిక పరిశీలన - డా॥ గెంజి అరుణ
4. మన సంస్కృతిలో పండుగలు ఉత్సవాలు - తిరునాళ్ళు - డా॥ గెంజి అరుణ

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు జానపద సాహిత్యం – జానపద నృత్యాలు

– డా॥. సి. ఉదయశ్రీ

సృష్టిలోని సౌందర్యమంతా కళాత్మకం. భూమ్మీది ప్రతి అణువులోనూ సౌందర్యాన్ని గుర్తింపగలిగినవాడు మానవుడే. ఆ సౌందర్యాన్ని సాహిత్య రూపంలోనో, సంగీత రూపంలోనో, కవిత్వ రూపంలోనో, కళాత్మకంగా వివరించ గలిగినవారు కళాకారులు. ఎప్పుడైతే మానవుడు ఆనందాన్ని కోరుకున్నాడో అప్పుడే కళలకు అంకురమేర్పడింది. మన భారతజాతి సంపదంతా మన కళల్లోనే ఇమిడి ఉంది. సింధు నదీలోయ నాగరికతే ఇందుకు తార్కాణం. అప్పటికే జనపదులు సున్నితమైన నాగరికతను అనుభవించారు. మానవుని కళలకు తక్ష శిలా, హరప్పాలు మచ్చుతునకలు. పాణిని వ్యాకరణం, కౌటిల్యుని అర్థశాస్త్రం, శ్రుతుని శస్త్ర చికిత్సా అప్పటికే అరితేరి ఉందీ కాలంలో.

కళ అనేది తేజోరూపమైన సృజనశక్తి. 64 కళల్లో 5 కళలు మాత్రం పండితులచే మనోల్లాసానికీ, ఆనందానికీ హేతువులయ్యాయి అని చెప్పబడింది. అవే లలిత కళలు. వీటినే చిత్ర కళలూ, సరస కళలూ, విలాస కళలు అని పేర్కొన్నారు.

అవి కవిత్వ, సంగీత, చిత్రలేఖన, విగ్రహశిల్ప, నాట్యాలు. ఇందులో సరసత్వము కవితవ్వ, సంగీతాలలో, చిత్రణం చిత్రలేఖనంలో లాలిత్యం విగ్రహ శిల్పంలో ఎక్కువ కనిపిస్తాయి. పై అన్ని లక్షణాలూ కలిగినది నాట్య కళ. కాబట్టే దీనిని సమాహార కళ అని పేర్కొన్నారు.

నాట్యకళ ఒక మహా సముద్రం సంప్రదాయం. తల్లి నుండే పిల్లలకూ, గురువు నుండీ శిష్యులకూ వచ్చే అభ్యాస క్రమము. కాబట్టి భారతీయ శాస్త్రీయ నృత్య కళకు భారతదేశంలో నాట్యశాస్త్ర మొక్కటే ఆధార గ్రంధం. కానీ ఆయా ప్రాంత ప్రజల మత, సాంఘిక, పరిస్థితులను బట్టి వారి అభిరుచులను బట్టి వచ్చినవే వివిధ ప్రాంతీయ జానపద, ఆటవిక, ప్రచార, ఆరాధనా శైలీ నృత్యాలు. నృత్యానికి ఆదిరూపం ఆది మానవుడు ఆనంతంతో వేసిన చిందులూ, గంతులూ అని చెప్పవచ్చు. ఈ విధమైన నృత్యం క్రమేపీ పాటలు అల్లి వాటికి భావ వ్యక్తీకరణతో జానపదుడు చేసే జానపద నృత్యాలైనాయి. ఈ జానపద నృత్యాలు. జానపదులు తమ శుభా కార్యాల్లో తమ ఆనందాన్ని వ్యక్తపరిచేవిగానూ, తాము చేసే పనుల నుండి సేదదీరుటకు గానూ ఆనందంగా పాటలు పాడి చేసే నృత్యాలు.

శాస్త్రంతో సంబంధం లేక కేవలము లోకధర్మిపై ఆధారపడి వృద్ధి పొందిన కళ జానపద కళ. జానపద సాహిత్యమూ, నృత్యమూ రెండూ, మన తెలుగునాట జాతరలందూ, పండుగలందూ ప్రదర్శింపబడుతుంటాయి. భూమిని దున్ని పంటలు పండించి నదీ తీరాల్లో గుడిసెలు నిర్మించుకుని సంఘ సమిష్టి జీవనానికి అలవాటు పడిన జానపదుల ఆనంద నృత్యాలే జానపద నృత్యాలు. ఇవి కూడా సంప్రదాయ నృత్యములే. ఇవి కూడా శిక్షణా క్రమము కలిగి సంప్రదాయానుసారంగా లయకు తగ్గట్టు చేసే నృత్యాలు. ఈ జానపద నృత్యాలు ఆరాధనా సమయంలో వినోదం కొరకూ నిత్య జానపద జీవన విధాన ప్రక్రియల్లో భాగంగా ప్రదర్శింపబుతాయి. పామర జనుల మనసులో నుండి పుట్టిన జానపద సాహిత్యమూ దానికి తగిన నృత్యాలూ ఈ నాటికీ మనం పల్లెలందు, ఆ గ్రామ జాతరలందు చూస్తూ ఉండవచ్చు.

గొబ్బి :

ధనుర్మాసంలో ఆంధ్రప్రదేశ్‌లోని బాలికలు ఇళ్ళ ముందర రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గోమయముతో చిన్న చిన్న బంతుల్లా ఉండలు చేసి వాటిని పసుపు, కుంకుమ, బియ్యప్పిండి, పూవులు

మొదలైన వాటితో అలరించి, పూజించి, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి తర్వాత ముగ్గు మధ్యలో పెట్టి బాలికలంతా గుమిగూడి వాటి చుట్టూ తిరుగుతూ గొబ్బి పాలను పాడుతూ చేతులు తడుతూ ఆడతారు. పెట్టిన గొబ్బెమ్మలను (గొబ్బి దేవత) శ్రీకృష్ణునిగా, గోపిలుగా తలచి వారిపై పాటలు పాడుతూ చేసే నృత్యమే గొబ్బి. ధనుర్మాసమంతా ఈ గొబ్బి దేవతను పూజిస్తారు.

బతకమ్మలాట :

టీ బతకమ్మలాట ఒక విధమైన గౌరీదేవి ఆరాధనగా చెప్పుకోవచ్చు. దేవీ నవరాత్రులలో ఈ బతకమ్మ పూజను చేస్తారు. ఈ ఆచారము తెలంగాణా ప్రాంతమందున్నది. వివిధ రంగుల పుష్పాలని గోపురాకారంగా పేర్చి వీధి గుమ్మాన్ని ముగ్గతో అలంకరించి దానిపై ఈ పుష్ప శిఖరాన్నుంచి పూజించి స్త్రీలందరూ గుమిగూడి బతకమ్మ పాటలను పాడుతూ తాళయుక్తంగా తప్పట్ల తడుతూ దాని చుట్టూ గుండ్రంగా తిరుగుతూ నాట్యం చేస్తారు. ఈ విధంగా తొమ్మిది రోజులు చేసి పదవ రోజున చల్దుల బతకమ్మ పూజతో ముగిస్తారు. ఈ రోజున ఉత్సాహంతో స్త్రీలు పేర్చే పుష్పాలు మనిషి యెత్తున కూడా ఉంటాయి. ప్రతి దినమూ పూజానంతరం పుష్ప శిఖరాన్ని నీటిలో వదులుతారు.

కోలాట కోపులు :

కోలాటము వేసేటపుడు వివిద రకములు గతులకు చెందిన పాటలు పాడుతూ అందుకు తగిన విధంగా నృత్యం చేయుటలకు కోప్పు అని పేరు. ఈ నృత్యాన్ని పురుషులు, స్త్రీలు చేస్తారు. వ్యవసాయం చేసే రైతులు పగలంతా కష్టపడి పనిచేసిన తర్వాత వినోదార్ధము చేసే నృత్యమే కోలాటం. తెలంగాణా ప్రాంతమందలి కరీంనగర్ జిల్లాలో ఈ కోలాట విద్యలో నిపుణులైన కళాకారులు ఉన్నారు. సుమారు నలభై యాభై కోపులు తెలిసిన వారు కూడా ఉన్నారు.

తప్పెట గుండ్లు :

అమ్మవారి కొలువులందు ముఖ్యంగా ఈ విధమైన నృత్యములు చేస్తారు. విశాఖ జిల్లాలందు వీరు ఎక్కువగా ఉన్నారు. పురుషులు మాత్రమే ఈ నృత్యంలో పాల్గొంటారు. గుండ్రంగా టిన్ను రేకుతో చేయబడిన చిన్న చిన్న తప్పెటలను మెడలో వేసుకుని పాడుతూ ఆ పాటను అనునరించి తప్పెటల మీద తాళలయగతుల ననుసరించి తడుతూ గుండ్రంగా తిరుగుతూ నృత్యం చేస్తారు.

జోగాట :

తెలంగాణలో హరిజనుల్లో జోగులవారు ఒక నర్తకుల శాఖవారున్నారు. వీరు డప్పుల వాద్యాన్ని ఆధారంగా చేసుకుని నృత్యం చేస్తారు. వీరి శాఖలో ఎవరైన పోయిన శ్మశాన వాటికకు తీసుకెళుతూ ఈ జోగాట నాడతారు. వీరి నృత్యాలన్నింటిలోకి పిండోత్పత్తి క్రమమును తెలిపే నృత్యము పేర్కొనదగింది. జీవి మాతృగర్భమున బిందు రూపంలో ప్రవేశించింది మొదలు వివిధ మాస క్రమమున పిండము పెరిగే విధానము, ప్రసవము, అటుపై జీవితము నందలి వివిధ ఘట్టములు జోగువారు నృత్యరూపంలో ప్రదర్శిస్తారు. ఇట్టి క్రమమే వేదాంత చర్యలతో పిండున్న 'గొల్ల కలాపము' నందు కూడా చూడవచ్చు.

వీర నాట్యము :

ఆంధ్ర దేశంలో వీరశైవం విరివిగా ప్రచారమందున్న కాలంలో ఆలయాల్లో దేవదాసీల నృత్యారాధనే కాక శివభక్తులు తాండవ పద్ధతికి చెందిన వీరావేశము కల్గించు నాట్యములను చేసేవారు. వీర రస ప్రధానాలైన 'ఖడ్గములు' రచనలు చదువుతూ వేరొకచేత ఖడ్గమును మరొక చేత డాలు ధరించి నృత్యం చేస్తారు. దీనికే హరనాట్యమని పేరు. ఈ నాట్యము యుద్ధ నాట్యాలను పోలి వుంటుంది.

వీరుల కొలుపు :

పల్నాటి యుద్ధము వీర స్వర్గమలంకరించిన ఆంధ్రయోధుల స్మరణార్ధము ముఖ్యంగా ఈ వీరుల కొలుపు ప్రారంభమైంది. ఈ వీరుల కొలువు నందు

ప్రదర్శింపబడే ఆరాధనా నృత్యాలు కూడా తాండవ పద్ధతికి చెందినట్టివే. కారంపూడి, మాచెర్ల, గురజాల, మున్నగు చోట్ల పల్నాటి తాలూకాలో ఈ వీరుల కొలుపులు ఈనాటికీ ప్రతి యేడూ జరుగుతూనే ఉన్నాయి.

సేవ :

సింహాచల నృసింహస్వామిని కీర్తిస్తూ ఇత్తడి రేకులతో చేసిన పెద్ద పెద్ద తాలాలను చేతబట్టుకుని

"హరి హరి నారాయణాది నారాయణా
కరుణించవయ్య మమ్ము కమలలోచనుడు"

అని అందరూ పాడుతూ, నెమలి కుంచెను చేతపట్టిన నాయకుడు 'నాయం' చెప్పుండగా, వలయాకారంగా తిరుగుతూ నృత్యం చేస్తారు. దీనినే 'సింహాద్రి అప్పన్న సేవ' అంటారు.

గరగలు :

దేవీ నవరాత్రుల్లో, అమ్మవారి జాతరల్లో, పంచ శిరస్సుల నాగుతోడను, రంగురంగుల వస్త్రాలతోను అలంకరించిన కరండములను తలపై పెట్టుకొని డప్పుల వాద్యాననుసరించి చేసే భక్తి రస ప్రధానమైనట్టి నాట్యములచే 'గరగల నృత్యమంటారు'.

అశ్వ నృత్యము :

ఇది వినోద ప్రధానమైన జానపద నృత్యం. ఇది గుంటూరు జిల్లాలో ఎక్కువగా ప్రచారంలో ఉంది. ఇందులో సజీవమైన గుఱ్ఱానికి తాలలయలననుసరించి ముక్తాయింపులను కూడా కాళ్ళతో పలికించే విధంగా శిక్షన ఇచ్చి ఆ గుఱ్ఱాల ముందు కాళ్ళకు గజ్జెలు కట్టి దాన్ని చక్కగా అలంకరించి, పక్కన నర్తకి ఆడుతుండగా, నటుడు పాడుతుండగా వాద్య సంగీతాన్ననుసరించి గుఱ్ఱము నృత్యం చేస్తుంది. ఈ నృత్యాలు వివాహ సమయాల్లో, ఇతర ఉత్సవాలలో వినోదానికిగాను ప్రదర్శిస్తారు. ఈ విద్యంటే పల్లె ప్రజల్లో ఎంత ఉత్సాహముందంటే, ప్రతీ మొతుబడి రైతూ ఇటువంటి ఆట గుఱ్ఱాన్నొకదాన్ని పెంచుకుంటాడు.

ఇటువంటిదే దక్షిణదేశంలో ఒక వినోద కళుంది. అందులో నిజమైన గుఱ్ఱానికి బదులు గుఱ్ఱము బొమ్మలు తయారుచేసి ఆ బొమ్మల మధ్య చిల్లు పెట్టి నడుము భాగంలో, దాని ద్వారా నర్తకులు పైకి వచ్చి గుఱ్ఱం బొమ్మలపై స్వారీ చేస్తూన్నట్లు ప్రేమకథలను నృత్య మాడతారు. దీనిని 'పాయ్‌కాల్ కుదిరై' అని అంటారు.

డప్పుల ఆట :

ఆంధ్రదేశంలో డప్పులను చేతబట్టుకుని నర్తకులు, అనేక చిత్రరీతుల్లో డప్పులను పలికిస్తూ నర్తనం చేస్తారు. దీనినే డప్పులాట అంటారు. ఈ ఆటలో అనేక గతి, జతి విన్యాసాల్ని పలికించే సమర్థులు కొంతమందున్నారు.

ముగింపు :

ఈ నాటికీ ఈ నృత్యాలు మనం జనపదులు నివసించే అన్ని ప్రదేశాల్లోనూ చూడవచ్చు. పై విధంగా తెలుగు దేశాల్లో జానపద నృత్యాలు వికాసం చెందాయి. కొన్ని అనుకరణ జానపద నృత్యాలు కూడా ఆయా ప్రదేశాల నుండి వచ్చి స్థిర పడిన వారిచే మన తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి పొందాయి. అయినప్పటికి పై జానపద నృత్యాలు తెలుగు వారిచే తెలుగువారి ద్వారా ప్రచారం చేయబడి ప్రదర్శింపబడుతున్నాయి అనాదికాలం నుండి. ఇటు వంటివి నేడు పట్టణాలకు తరలి వెళ్ళిన వారి ద్వారా విడిచిపెట్టబడుతున్నప్పటికీ నేటికీ పల్లెల్లో ప్రాచుర్యంలో ఉన్నాయి. జానపద సాహిత్యమైనా నృత్యమైన జానపదులలో నిత్యం దీపంలా వెలుగుతూ నేటికీ మన మనసుల్లో నిలిచి ఉన్నాయి.

❖ ❖ ❖

జానపద సాహిత్యం జాతికి పట్టుగొమ్మ

– డా॥. దన్నెన అప్పలనాయుడు, విజయకాలనీ, చీపురుపల్లి పోస్ట్ విజయనగరం జిల్లా.

ఆదిమజాతులనుంచీ ప్రపంచీకరణం వైపు ప్రయాణం మొదలైంది. ప్రపంచీకరణ అంటే ఉన్నస్థితినుంచి ఉన్నతస్థితికి ప్రయాణం చేయడం.అనాగరికస్థితినుంచి నాగరికతవైపు ప్రయాణమవ్వడం.ప్రపంచదేశాలన్నిటినీ అన్నిరంగాలలో అనుసంధానమై అభివృద్ధివైపు పరుగులు తీయిస్తున్నది. పంటలపై ప్రపంచీకరణ ప్రభావం బాగా పడింది. కొత్తకొత్త సంస్కృతుల కలయికలతో మనదేశీయ సంస్కృతి కనుమరుగౌతున్నది. పల్లెల్లో ప్రజలకు అన్ని కళలూ దూరమైనాయి. అందులో జానపదకళలు కాలగర్భంలో కలిసిపోయినాయి. జానపదకళలకు ప్రపంచీకరణం ఒకశాపం ఒక పాపం అని చెప్పవచ్చు.ఐనను జానపద కళలలో ఉన్న అనుభూతి వర్తమానకాలంలో అనుభవించలేకపోతున్నాం. అందుకే వెనుకటి కాలంనాటి జానపద సన్నివేశాలను నెమరు వేసుకోవలసిన అవసరముంది.

జనపదమంటేనే పల్లెటూరని అర్థం. పల్లెలు ప్రాచీన సంస్కృతులకు పట్టుగొమ్మలు. పల్లెను ఉదయం వేకువ ఝామున మేల్కొల్పేది కోడిపుంజు కూత.కూత వినగానే పల్లెప్రజలు పనులకు ఉద్యుక్తులయ్యేవారు.ప్రతివారికి నిత్యావసరం నీరు.ఆనాడు నీటికోసం గిలకబావులదగ్గరికెళ్లి

"బాయికేమో వచ్చినామూ బాయిగంగా మేలుకోయే
బద్దరామూ బాయిగంగా బాలులూ నీభారమమ్మా"

అను పాటతో బాయిని మేలుకొల్పి,తమబాలలు నీచెంతకొచ్చినప్పుడు కాపాడవలసినబాధ్యత నీదేనని ప్రకృతి సహజ వనరును అమాయకంగా వేడుకుంటారు.

గిలకబావిదగ్గర నీరు తోడేటప్పుడు గిలక కిరకిర శబ్దం విన్న ప్రియుడు రాగానే పల్లెపడుచు

"చీమకన్నుల చీరదేరా పాముకన్నుల పైట దేరా
మల్లెపూలా సరముదేరా మాపిటికి మాయింటికి రారా"

అని మురిపెంగా పాడినపాటలో ఎంతచక్కని భావం. ఇష్టంలేని పల్లెపడుచు

"ఆకు లేని అడవిలోనా మేకలేలా మేపుతావూ
ఆశలేని దానియెంటా దేశమేలా తిరుగుతావూ"

తన అయిష్టతను సున్నితంగా వ్యంగంగా తిరస్కరిస్తుంది.

పొన్నపువ్వులాగా పొద్దు పొడిచింది. పల్లెసిరి పగలబడి నవ్వినట్లు పచ్చటి వెచ్చటి పంటపొలాలు, పరుపుకొచ్చిన చెరుకుతోటలూ, పండి వొరిగిన పండ్లతోటలూ, ముంతంత కొప్పులో మొగిలి రేకులు ముడిచి నెత్తిమీద నీళ్లదుత్తలూ, చల్దిగంపలూ పెట్టుకొని పొలాలగట్లదారులలో గడుసుదారి పడుచుటొయ్యారాలు బారులు తీరి నడుస్తున్నారు. మిరపచేలలో, వంగతోటలలో కలుపులు తీయటానికి చిన్నా చితకా, ముసలీముతకా అంతా కదలి వస్తున్నారు. చేలలోనుంచి కలుపూగాబూ ఏరిపారేసినట్లు మనసులోనుంచి కల్లాకపటం ఏరిపారెస్తారు.కలుపు తీస్తూ ఇద్దరు స్త్రీలు అసలు చరణాలు పాడగా మరికొంమంది 'రామ రామా'అన్న పాదాంతభాగాన్ని అందుకుంటారు పాదాంతం పద్యమకుటంలా ఉంటుంది

"రాజా మొనగాడమ్మ జూటూరి చిన్నాగిరెడ్డి
గొండ్లోళ్ళాడుబిడ్డ బాలా చిన్నాగమ్మ
రామరామా కోదండరామా రామరామా కోదండరామా

ఒక్కొక్కప్రాంతంలో ఒక్కొకలా శ్రామికగేయాలు పాడుతుంటారు.

"నోమీ నోమిన్నాలా నోమిన్ననాలో చందామామ"

ఇలా కోటి వీణలు మీటినట్లు,కొండకోనలలో కొదమ కోయిలలు కూసినట్లు, మనసుకు హాయిని గొలుపుతాయి.

పొద్దు పడమటికి వాలింది మాపటివేళ పశువుల మందలను ఇంటికి తోలుకకొస్తూ పిల్లనగోవులూదుతూ పాటలు పాడుతుండేవారు. వరినాట్లు వేసి ఇంటిదారి పట్టిన స్త్రీలు ఎలా పాడుతున్నరో చూడండి

'గుట్టూరు చెర్వుకింద వోరి మొగుడా
నేను వొరిమడి నాటబోతి వోరిమొగుడా
నలుగుర్ని దాటేసి వోరిమొగుడా
నేను గెనిమ్ వారి ముసుం బడితి వోరిమొగుడా
నన్ను యెండ్రకాయ తేలుగుట్టె వోరిమొగుడా
నాయేలు బడేపాటు జూడు వోరిమొగుడా
నేను ఉంటానో పోతానో వోరిమొగుడా
నన్ను వుయ్యాలవూపించు వోరిమొగుడా
నేను సత్తానొ బతుకుతానొ వోరిమొగుడా
నాకు సందిబంది జేపించు వోరిమొగుడా
నాయేలుబడేపాటు జూడు వోరిమొగుడా
నువ్విసనకర్రతొ యిసర్రాద వోరిమొగుడా
నువ్వు కోరుకున్న మొగిడివైతె వోరిమొగుడా
నాకు కోడ్ని గోసి పెట్టరాద వోరిమొగుడా
నువ్వు చేసుకున్న మొగిణివైతె వోరిమొగుడా
నాకు చేపలొండి పెట్టరాద వోరిమొగుడా
నువ్వు అక్కరగల్ల మొగుణివైతె వోరిమొగుడా
నన్ను ఆసపట్ల కంపరాద వోరిమొగుడా
వోరిమొగుడా వోహొరిమొగుడా వొయ్యారిమొగుడా
ఈమహాయిల్లాలు వట్టిగయ్యాళిగంపలా ఉంది.

సగంనగం కూలిన నత్రం మెట్లమీద కూర్చొని తుంబుర మీటుతూ తత్వాలు పాడుతున్న బైరాగి చూడండి

"నాదం బ్రహ్మానందయోగీ
యిట్లు వాదములేలర వోరిబైరాగీ
నీళ్లలోతూ పాడుగూ చేపకెరుకగాని
యిట కడకడగ దిరిగేటి కప్పకేమెరుకా

ఇలా పాడిన తత్వగీతాలు జానవదబాణీకి చెందినవనేమున్నవి.

ఆడది అంటే మగమహారాజులకున్న అలుసు అంతా యింతా కాదు. ఆమె హృదయం పాలసముద్రమనీ, అందులో అమృతమూ, హలాహలమూ రెండూ ఇమిడి ఉన్నాయనీ అతనికి తెలియనివి కావు.అన్నీ తెలిసిన దురభిమాన దుర్యోధనుడు అతను. ఈ అహంకారి ఒక్కసారి ఏమంటాడో చూడండి

"ఆడదాన్ని నమ్మవద్దూ - ఆకులొక్కాలంపవద్దూ
ఆడజాతి వలపుజాతీ - మడువులోనే మందులంపూ
ఆడదాన్ని అడుగనేలా-అడిగి చిన్నా బోవనేలా?
పెట్టవలె పేరైనమందూ-లేవవలెర గుత్తిదంకా"

ఇందలి నాయికా నాయకుల సమయాలూ, సంకేతస్థలాలు ఎలాంటివో వీరే వినిపిస్తారు వినండి

"కుక్కనేమో తోలుకొనీ-కుందిలేటకు నీవు రారా
బోదగడ్డీ పేరుజెప్పీ-బొల్లికొండకు నేనువస్తా"
"సుక్కపుట్టెది సూపెట్టుకోర-ఒక్కదాన్ని నీళ్లకొస్తా
నిమ్మచెట్టు దాపునుండు-నీ రుణమును దీర్చికొందూ"

అల్పాక్షరాలలో అనల్పార్థ రచనలకు ఈపాటలు సరియైన ఉదాహరణలు.అందరికీ అందుబాటులోనున్న మాటలు ఆమాటల పొందిక ఎంతో సుందరంగా పొసగి ఉంటుంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు వారి జానపదల – ప్రాచీనత

– డా॥. నూనెపత్ రెంబాబు, సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీస్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు, నెల్లూలరు.

జానపదలు ప్రాచీనత :

జానపద విజ్ఞానాన్ని ఆంగ్లంలో Folklore అంటారు. ఒక తరం నుంచి మరో తరానికి ఒక క్రమ పద్ధతిలో వివిధ రూపాల్లో అందుతూ వస్తున్నది. మొదట మౌఖిక రూపంలో ప్రచారం పొందిన జానపద విజ్ఞానం ఇటీవలి కాలంలో లిఖితరూపం పొందుతున్నది. క్షేత్ర పర్యటనలు, పరిశోధనల కోసం జానపద విజ్ఞానాన్ని సేకరించి ముద్రణా రూపంలోను, వస్తు రూపంలోను, ఫొటోలు, సీడీల రూపం లోను భద్రపరుస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా ఆయా ప్రాంతాల ప్రజా మూలాలను వెదుకుతున్నారు. జానపదుల లోకంలో లిఖిత సంప్రదాయం కన్నా మౌఖిక సంప్రదాయమే శక్తివంతమైనదిమౌఖిక జానపద విజ్ఞానంలో జానపద గేయాలు, కథాగేయాలు, జానపద పురాణాలు, ఇతిహాసాలు, గద్యకథలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు నుడికారాలు, తిట్లు, ఒట్టులు వంటివి పరిశీలించవచ్చు.

తెలుగు జానపద ప్రదర్శన కళల చరిత్రలోనికి కొంచెం చూస్తే కొన్ని విషయాలు మనకు అవగతం అవుతాయి. ఎప్పటినుండి ఈ కళారూపాలు ఉన్నాయి అని ప్రశ్నిస్తే సరిగ్గా ఏ శతాబ్దంలో ఇవి ప్రారంభం అయ్యాయో చెప్పడానికి ఆధారాలు లేవు. వీటి మొదలు ఎప్పుడు అన్నది ఎవరూ చెప్పలేరు. రెండు వేల సంవత్సరాలనాటిదిగా భావిస్తున్న భరతుని నాట్య శాస్త్రంలో ఆనాటికి లభిస్తున్న దేశి నాటక రూపక ప్రక్రియల గురించిన వివరాలు ఉన్నాయి. వాటిని జానపద ప్రదర్శన కళలు అనే అర్థం చేసుకోవాలి. సంస్కృత ప్రక్రియలలో చేరిన వీధి అనే తరహా రూపక ప్రక్రియ జానపద ప్రక్రియకు మారు రూపమే. కాని భాష మారుతుంది. సంస్కృత సాహిత్యం లోని చాలా ఆధారాలను పరిశీలిస్తే భారత దేశంలో జానపద ప్రదర్శన కళలు దాదాపు ఈ కాలంనుండే ఉన్నాయని చెప్పడానికి వీలుంది. కాని అంత ప్రాచీన కాలంనుండి అంటే రెండు వేల సంవత్సరాల కాలంనుండి తెలుగు జానపద కళారూపాలు ఉన్నాయని చెప్పడానికి నిక్కచ్చి ఆధారాలు లేవు. అసలు తెలుగు భాష అప్పుడు ఉందో లేదో కుడా చెప్పడానికి అవసరమైన చారిత్రక ఆధారాలు ఏవీ మనకు లభించవు. శాతవాహనులు తెలుగు రాజులు అని చెబుతున్నారు. వారికాలం నాటిదైన గాథా సప్తశతిలో కళారూపాలకు సంగీత వాద్యాలకు చెందిన పరోక్ష ఆధారాలను కొంతమంది విద్వాంసులు చూపారు. కాని గాథాసప్తశతి తెలుగులో లేదు. ప్రాకృతంలో ఉంది. ఆధారాలు ఉన్నా కూడా అవి ఏ భాషలో ఉన్న కళారూపాలను తెలుపుతున్నాయో చెప్పడం, రుజువు చేయడం కష్టం. కేవలం 11, 12 శతాబ్దాల కాలం నుండే మనకు నమ్మదగ్గ చారిత్రక ఆధారాలు కనిపిస్తున్నాయి.11వశతాబ్ది కాలంనాటికే ఎన్నో జానపద కళారూపాలు ఉన్నట్టు తిరుగలేని ఆధారాలతో చెప్పవచ్చు. కాని అంతకు ముందు లేవు అని అనడానికి వీలులేదు. ఆధారాలు లేనంత మాత్రాన ఐదారు, శతా బ్దాలు ఏడు ఎనిమిది శతాబ్దాలలో జానపద కళారూపాలు తెలుగులో లేవు అని అనడానికి వీలులేదు. ఆరవ శతాబ్ది కాలంనాటికే తెలుగు భాష బాగా అభివృద్ధి చెందినదని చెప్పడానికి చారిత్రకులు, ఎపిగ్రఫిస్టులు చాలా శాసన ఆధారాలు చూపుతున్నారు. అంత అభివృద్ధి చెందిన భాష ఉన్నప్పుడు ఆనాటికే జానపద ప్రదర్శన కళలు ఉండి ఉండాలి. కాని వాటిని వివరంగా చెప్పే వివరమైన ఆధా రాలు ఆ శాసనాలలో లభించలేదు. క్రీస్తుశకం 1200 ప్రాంతంవాడైన పాల్కురికి సోమనాథుడు దేశిసాహిత్య పితామహుడుగా ఉండి పండితారాధ్య చరిత్ర, బసవ

పురాణం అనే శైవసాహిత్య గ్రంథాలను దేశి సాహిత్యంలో రచించాడు. ద్విపద ఛందస్సు జానపద సాహిత్యానికి అత్యంత దగ్గరి రూపం. ఝటితిగా రచితమయ్యే చాలా జానపద గేయాలలో ఈ ఛందస్సు రూపాలు ఉంటాయి. అందుకే ప్రచారం అవసరం అనుకున్న విషయాలను ప్రజలకు విరివిగా అందించాలనుకున్న కథలను అనాటి కవులు జానపద సాహిత్యానికి చాలా దగ్గరిగా ఉన్న ద్విపద ఛందస్సును స్వీకరించి రచించారు. పాల్కురికి, శ్రీనాథుడు (పల్నాటి వీరచరిత్ర), రంగనాథ రామాయణ కర్త ఇందుకు మంచి ఉదాహరణలు. జానపద జీవితాన్ని విస్తారంగా వర్ణించిన సోమన జానపదులైన శివభక్తుల జీవితాలను కథలను విపులంగా వర్ణించిన సోమన వాటిలో భాగంగానే జానపద కళలను వివరంగా వర్ణించాడు. తన కాలం నాటికి తెలిసిన చాలా జానపద కళలను గురించి ఆచూకీ చెప్పడం మనకు ఇందులో బాగా కనిపిస్తూ ఉంది. పాల్కురికి రచనలలో ఉన్న జానపద కళల గురించి ఇప్పటికే చాలా మంది పండితులు చెప్పిఉన్నారు. వాటిని తిరిగి వివరంగా చెప్పవలసిన అవసరం లేదు. కాని ఏ ఏ కళారూపాల ప్రసక్తి ఉందో చెప్పడం అవసరం. చాలామంది నాటకాలు ఆడుతున్నారని చెప్పాడు అవి జానపద నాటకాలే. రోకళ్ళ పాటలను గురించి చెప్పి వాటిని పాడే ఘట్టాల్ని చెప్పాడు. పిచ్చుకుంటి కళాకారులు శ్రీశైలం వెళ్తున్నట్లుగా వర్ణించాడు. పిచ్చుకుంటి కళాకారులు ఈనాటికీ జీవించి ఉన్నారు. వీరి కళారూపమైన పిచ్చుకుంటికథ ఇప్పటికీ బాగా తిరుగుతూ ఉంది. దీనిలో పల్నాటి వీర చరిత్ర ప్రసిద్ధం. మెరవణి ఉందని, బహురూపులు ఉన్నారని చెప్పాడు. బహురూపులు అంటే వివిధ వేషాలు వేసుకునే కళాకారులు అని పగటి వేషగాళ్ళు అని అర్థం. ఇప్పటికీ రాయలసీమలో కనిపించే మెరవణిని గురించి పాల్కురికి అనాడే ప్రస్తావించాడు. 'భారతాది కథల జీరమఱుగుల నారంగ బొమ్మల నాడించువారు గడునద్భుతంబుగ గంబసూత్రంబు లడరంగ బొమ్మల నాడించు వారు' అని స్పష్టంగా చెప్పి దీని ద్వారా అనాటికి తోలుబొమ్మలాట, చెక్క బొమ్మలాట ఉన్నాయని స్పష్టమైన చారిత్రక ఆధారాన్ని ఇచ్చాడు సోమనాథుడు. 'నమరంగా గడలపై నాడెడు వారు' అని చెప్పి దొమ్మరాటను గురించి చెప్పాడు. యక్షగానాన్ని చెప్పాడు. చిందువారి ప్రసక్తి ఉంది కాబట్టి అది చిందు యక్షగానం కావచ్చు. వెడ యాట, కోడంగియాట, వెడ్డంగము అనే వాటిని గురించి చెప్పాడు. ఈనాడు ఈ కళారూపాలు కనిపించవు. కాల గతిలో అంతరించిపోయాయి. ఇంకా పక్షుల ఆటలు, జంతువులతో ఆడించే ఆటలు, బహురూపులు అంటే పగటివేషగాళ్ళ ఆటలు, పేరణి, కోలాటం, గొండ్లి నృత్యం మొదలైన కళారూపాలను గూడా ప్రస్తావించాడు పాల్కురికి సోమన. ఇంకా నటులకు సంబంధించిన వివరాలు చాలా ఇచ్చాడు. ఈ విధంగా అనాటి జానపద కళల విజ్ఞాన సర్వస్వంగా కనిపిస్తాయి పాల్కురికి పండితా రాధ్య చరిత్ర, బసవపురాణ గ్రంథాలు. పాల్కురికి రాసిన అనాటి భక్తుల కథలు కూడా ఈనాడు జానపద సాహిత్య ప్రక్రియలోని పురాకథా ప్రక్రియ అవుతాయి. అనాటి చాలా జానపద కళలు ఈ నాడు జీవించిలేవు. ఇటీవలి 100 సంవత్సరాల లోపున కూడా ఉన్న వాలకం అనే కళా రూపం ఇప్పుడు అంతరించింది. కనీసం రాబోయే 25 నుండి 50 సంవత్సరాలలో అంతరించే కళారూపాలు కూడా చాలా ఉన్నాయి. ఇక మధ్య యుగాలలోని చాలా కావ్యాలలో ప్రబంధాలలోను తరువాతి కాలంనాటి గ్రంథాలలోను అనాటి తెలుగు జానపద కళల ప్రస్తావన చాలాచోట్ల మనకు కనిపిస్తుంది. అందులోని చాలా ఈనాడూ కూడా మనకు కనిపిస్తున్నాయి. ప్రాచీన కావ్యా లలో జానపద విజ్ఞానం గురించి డా. టి. కిషన్ రావుగారు మంచి పరిశోధన చేశారు. దానిలో చాలా వివరాలు ఉన్నాయి. మరికొంత మంది పండితులు కూడా వారి వారి పరిశోధనలలో భాగంగా కూడా జానపద కళలకు చెందిన చారిత్రక వివరాలను చాలా తావుల్లో ఇప్పటికే అందిచారు. ఇంకా కొన్ని ఆధారాలు వచ్చే కాలం నాటి పరిశోధనలలో కూడా లభించవచ్చు.

తెలుగు రాష్ట్రాలలో ఉండేవని చెప్పడానికి శిల్పాలు, సాహిత్యం, శాసనాలు, చిత్రాలు, జానపద వ్యాయం సాక్ష్యాలుగా ఉన్నాయి. జానపద గాయకులు, జానపద సంగీతం, యక్షగానం, అనేక నృత్యాలను గూర్చిన ఉల్లేఖనాలు మన సాహిత్యంలో అందునా ప్రాచీన కావ్యాల్లో చాలాచోట్ల కనిపిస్తున్నాయి.

కురవంజి (ఎఱుకసాని) :

కురవంజి జానపద దృశ్యకళ. కురవంజి అంటే ఎఱుకలసాని. పూర్వం ఈ ఎరుకలసాని సంఘంలో ఎక్కువ పులుకుబడి సంపాదించుకుంది. ఈ ఎరుకలసాని వినోద కాలక్షేపానికి యదాలాపంగా ఆటులు, పాటలు జోడిరచి ప్రారంభించిన కళారూపం కురవంజి. వీరిని గురించి కురువ, కొరవ, గొరవ, కొరవ మొదలగు పదాలు వాడుకలో ఉన్నాయి. పాల్కురికి సోమనాథుని కాలం నుండే కురవంజిలను గూర్చిన వివరణవుంది.

"కురవ జాతివారి యంజె, అడుగు (నృత్యవిశేషం) 'కురువంజె'" అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సుగ్రీవ విజయం అనే యక్షగాన పీఠిక (పుట.4)లో పేర్కొన్నారు. శుకసప్తతి కథలు రాసిన కదరితీపతి ఒక రాజుగారిని దర్శింప వచ్చిన కొరవంజిని చూచి "ఇఱుకువలి గుబ్బ చన్నుల/మెఱుకుజవరా లొకొత్తర 'ఎఱుకోయవ్వా యెఱుకో'...."అనీ, "సవరని వని వెన్నె రవిక పిక్కటిలుంగ గులుకు పాలుబ్బుగుబ్బులు చెలంగ/ ముంజేతులను ముఖాంబుజమున నొకవింత పొలుపు దెల్పెడు పచ్చబొట్టు లెసగ" అని ఆనాటి ఎఱుకలసాని వేషధారణను వర్ణించారని రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని (2011, పుట.75) పేర్కొన్నారు.

అయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయంలో (2-131) "అణునిభమధ్యలా క్రియలు నా పరిభాషలు నొప్ప 'జిందు, జిక్కిణి, కొరవండి మేళముల 'గేళికసల్పిరి' అని 'జక్కిణి'తోపాటు 'కొరవంజి' ఒక నాట్యభేదంగా పేర్కొనబడింది. తొగు యక్షగానాల్లో 'కారవంజి' పాత్ర విజయ రాఘవుని (క్రీ.శ. 1631-1673) కాలం నుండే కనిపిస్తుంది. విజయరాఘవుడు అంకితం పొందిన మన్నారుదాస విలాసం, విజయరాఘవ చంద్రికావిహారం, విజయరాఘవ కళ్యాణం అనే యక్షగానాల్లో ఎఱుక ఘట్టముంది. ఇతని చంద్రికావిహారం, విజయరాఘవ కళ్యాణంలో ఎఱుకత కురవంజిగా పేర్కొనబడింది. ఈ రెండు యక్షగానాలలో కొరవంజి వేషభాషలు వర్ణింపబడిన దరువులకు 'కొరవంజి దరువు' లని ఉండడం ఒక విశేషం.

గోకుపాటి కూర్మనాథకవి రాసిన 'మృత్యుంజయ విలాసం' ద్వారా కొరవంజి ఎటువంటిదో, దాని చాకచక్యం ఎలాంటిదో, దాని మాట చాతుర్యం మొదలైన విషయాలు తెలుసుకోవచ్చు. చెంగల్వ రాయని 'ఎఱుకలకథ'లో ఎఱుకల ఆచార వ్యవహారాలు, ఆహార విహారాలకు చెందిన విషయాలున్నాయి. ఎఱుకలకే 'కొరవంజి','గొఱవత'లని'గొరతి'అని,'సింగి'అని పర్యాయ పదాలున్నట్లు ఈ గ్రంథాన్నిబట్టి తెలుస్తుంది అని ఆచార్య తూమాటి దోణప్పగారు 'యక్షగానములు ప్రాచీనాంధ్ర నాటక స్వరూపము- జానపదకళాసంపదదీ'(పుట.80) అనే గ్రంథంలో తెలియజేశారు.

వేంకటరాయకవి ఈయన రాసిన 'లేపాక్షి జలక్రీడలు' నాటకంలో ఎఱుకలవారి పుట్టు పూర్వోత్తరాలు వర్ణింప బడ్డాయి. "అఖిల భూతముల తెరగల్ల, భంగులు తెల్లంబుగాను, ఎఱుక గల్గిన వారమౌటకుమము, యెఱుకులవారని యందురే చెలియ" అని వివరిస్తుంది. "కొరవంజులు అనాగరికుల్కెన ఆటవికుల దృశ్యకావ్య రీతలు. కొరవంజులలో రెండు, మూడు పాత్రలు మాత్రమే ఉంటాయి. అవి నృత్య ప్రధానంగా ఉంటాయి. కొరవంజి పేరుతో కొన్ని యక్షగానాలు కనిపిస్తున్నాయి. వీటిలో కొరవంజి పాత్ర ఒకటి ఉంటుంది. ఈ స్త్రీపాత్ర తాత్త్విక ప్రాధాన్యం ఉండేది. భగవంతుడే కొరవంజి పాత్ర ధరించి అనుసంధానం చేయడం ఈ యక్షగానాల్లో కనిపిస్తుందని జి.నాగయ్య 'తెలుగు సాహిత్య సమీక్ష గ్రంథం' (రెం.సం.పు.348) లో పేర్కొన్నారు.

కోలాటం :

కోలాటం నృత్య భేదాలలో ఒకటి. కోలాటాన్ని జాతీయ క్రీడగా తూమాటి దోణప్పగారు పేర్కొన్నారు. దీనినే దండ నర్తనమనీ, దండలాస్యమనీ అంటారు. ఇది ప్రకృతి అనుకరణవల్ల ఏర్పడింది. జనప్రియ వినోదం ఉన్న కళారూపం కోలాటం. ఇందులో కోలలు ప్రధానపాత్ర వహిస్తారు. అందుకే దీనికి కోలాటం (కోల ఆట) అనే పేరు సార్థకమైంది. చేతిలోని కోలలు కొట్టినప్పుడు కలిగే లయ, కాలిగజ్జెసవ్వడుల శ్రుతి, పాదాల విన్యాసం వాటికి తగ్గట్టుగా గీతమాధుర్యం. ఈ విధంగా నాల్గింటినీ సమన్వయపరిచే కళారూపమే కోలాటం. జానపదులు దీన్ని ఒక ఆటగానే భావించినా పరిశోధకుల దృష్టికి ఇది నాట్యం, సంగీతం, గానాలు కలిపిన ఒక విశిష్టమైన కళా రూపం. కోలాటంలోని వస్తు వైవిధ్యాన్ని 'కోపు' అని అంటారు. కోపుల్లో 'జడకోపు' క్లిష్టమైంది. విశిష్టతను కలిగివుంది. కావ్యాల్లో కోలాటం చిత్రీకరింపబడి పూర్వకాపు కావ్య వైభవాన్ని చాటి చెబుతుంది.

పాల్కురికి సోమనాథుడు :

(క్రీ.శ.12వ శతాబ్దం) బసవపురాణం (పుట.26)లో బసవన కళ్యాణపురానికి వస్తున్న సందర్భంలో అతనికి స్వాగతం చెప్తూ "వేడుకంగోలాటమాడెడు" ప్రజలను వివరించాడు. పాల్కురికి సోమన "కోలాట గడియను" పేర్కొన్నాడు. శైవ సంప్రదాయంలో నందికోలాటం ఉండేది. బసవపురాణం (పు.22)లో "కోలాటము బాత్ర గాండ్లి పేరణియు గేళిక జోకయులే నటించు" అని కోలాటం, గండి, పేరణి మొదలైన నృత్య భేదా లర్కొన్నాడు సోమనాథుడు.

తిక్కన :

(క్రీ.శ.13వ శతాబ్దం) విరాటపర్వం(1-240)లో కోలాటాన్ని 'దండలాసకం'గా పేర్కొన్నాడు. దాన్ని 'నృత్య విశేషం' అనే అర్థంలో ఉపయోగించారు. 'దండ' అనేది 'దండము', 'కోల'(కర్ర) అనే ప్రయోగింపబడిరది. చేతిలోని కోలల సహాయంతో ప్రదర్శించే నృత్య విశేషమని ఆ పదానికి అర్థం.

నాచనసోమన :

కృష్ణుడు హంసడింభకులపై దండయాత్రకు వెళ్ళే సందర్భంలో పాంచజన్యాన్ని పూరించాడు. అప్పుడు భూమి ఆకాశం ఒకట్కెయనే విషయాన్ని చెప్పడానికి సోమన (క్రీ.శ.14వ శతాబ్దం)ఉత్తరహరివంశం(4--120)లో "ఉఱ్ఱూతలూగెడునుద యాస్తగిరుతోనాకాశలక్ష్మి కోలాట మాడ" అని కోలాటపు ఆటలోని ఉధృతాన్ని వర్ణించాడు.

తాళ్ళపాక అన్నమయ్య :

(క్రీ.శ.15వ శతాబ్దం) సంకీర్తనల్లో కోలాట కీర్తను తరిగొండమల్లన (క్రీ.శ.1586-1614)చంద్రభానుచరిత్ర (2-139)లో గీర్వాణ బాలామణులు "మృదులాలా పంబుంలం బాడుచున్ గోలాటంబులు వైచిన" వైనాన్ని వర్ణించాడు. కాబట్టి మృదువైన పాటల్ని పాడుతూ కోమలంగా స్త్రీలు ఆడుకునే కోలాటపు పద్ధతిని తెలుపు తుంది. కోలాటంను పురుష క్రీడగాగల స్త్రీలపరంగా కూడా ఆడేఆట. ఆటపాటల సమ్మేళనాలను కలిగిన "కోలాటం" అనే జానపద దృశ్యప్రక్రియ విభిన్నమైన విన్యాసాల తనలో విలీనం చేసుకుని అపూర్వమైన కళారూపం కోలాటం.

బహురూపులు (పగటివేషాలు) :

అంతేగాక గంగిరెద్దులవాడు కావరమణమని ముకు దాడు పొడిచిన పోతెద్దుట్లు" అని శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రలో గంగిరెద్దును ఆడిరచడాన్ని పేర్కొన్నాడు.

జానపదులగేయాలు, జానపదకథాగేయాలు, జానపద సామెతలు, పొడుపు కథలు, జానపదు ప్రదర్శన కళలు, జానపద ఆటలకు సంబంధించిన వివరాలు, జానపదుల సాంఘికాచారాల్కెన వ్రతాలు, నోములు మొదల్కెనవి, వారి శకునాలు, నమ్మకాలు, జానపదల వైద్యానికి సంబం ధించిన అంశాలు, అనేక వృత్తుల ద్వారా సమాజ వికాసా నికి, సౌభాగ్యానికి కారకుల్కెన వారి ఉత్పత్తి పరికరాలు,

కళాప్రదర్శనలు అనేక వాద్యాలపేర్లు, జానపదలు ధరించే వస్త్రాలు, ఆభరణాలు, జానపదుల ఆహార విహారాలు మొదల్కెన జానపద అంశాలన్నీ ఈ క్రింది తెలుగు కావ్యాలో కనిపిస్తున్నాయి.

ఆంధ్రమహాభారతం, భాగవతం, ఆముక్తమాల్యద, ఇందుమతీ పరిణయం, ఉత్తరహరివంశం, కళాపూర్ణోదయం,కాశీఖండం, క్రీడాభిరామం, కుమారసంభవం, దశకుమార చరిత్ర, నవనాథచరిత్రం, నిరంకుశోపాఖ్యానం, పండితారాధ్యచరిత్ర, ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసం, ప్రభావతీ ప్రద్యుమ్నం, పల్నాటి వీరచరిత్ర, పాండురంగ మాహాత్మ్యం, బసవపురాణం, భీమేశ్వరపురాణం, మనుచరిత్ర, మల్లణచరిత్ర, యయాతిచరిత్ర, రాధికాస్వాంతనం, రామాభ్యుదయం, వసుచరిత్ర, విజయవిలాసం, విష్ణుపురాణం, వేమన పద్యాలు, వైజయంవిలాసం, శతకాలు (అన్నీ) శివరాత్రి మాహాత్మ్యం, శుకసప్తతి, సింహాసనద్వాత్రింశిక, హర విలాసం, హంసవింశతి మొదల్కెన తెలుగు కావ్యాలను పేర్కొనవచ్చు.

గిరిజనులు :

మానవులు ప్రకృతిలో దొరికే ఆహారాన్ని సేకరించి చిన్నచిన్న గుంపులుగా ఏర్పడతారు. ఈ గుంపు వ్యవస్థీకృతమైనప్పుడే ఒక కుదురుగా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన కొన్ని కుదులు కలిసి ఒక తెగగా లేదా గణంగా ఏర్పడతాయి.

ఆదిమ తెగల జీవితాల గూర్చి కొంత వరకు అవగాహన చేసుకోవడానికి చారిత్రక సమాచారం దోహదం చేస్తుంది. కొండల్లో కోనల్లో ప్రాచీన సంప్రదాయాలను వీడకుండా అనాగరికంగా జీవిస్తున్న తెగలను గిరిజనులు అంటారు. మొట్టమొదటగా కొండమీదనే నివాసాలు కల్గి, ఆటవిక సంపదను తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన వారినీ, కొండల్లో వుండే కొద్దిపాటి చదును ప్రదేశాన్ని గుర్తించి అక్కడ ఎదిగిన చెట్లను కూల్చి పోడు వ్యవసాయం చేసుకొనే వారినీ కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీరంతా గిరిజనులే. గిరిజనులు కొత్తరాతి యుగంలో (క్రీ.పూ.50,000-5,000) కూడా ఉన్నట్టు ఆధారాలున్నాయి. భారతదేశంలో సింధులోయ నాగరికత కాలానికి కొన్ని జాతులు నివసిస్తున్నాయి. వారిలో సంతాలు అనే నీగ్రోజాతులు బీహారు, గంగానదీ తీరమైదానంలో ఉన్నారు. వీరు వేటపైనే ఆధారపడి జీవించారు. ఈశాన్య ప్రాంతంలో నివసించే మంగోలులు కూడా కొండజాతి వారే. వీరు వ్యవసాయం, వేటపై ఆధారపడి జీవించారు. అంతేగాక దక్కన్ పీఠభూమిలోని దట్టమైన అరణ్యాలలో కోయలు, గోండులు, బిస్తర్లులాంటి ఆస్ట్రలాయిడ్ జాతులు, దక్షిణ భారతదేశంలో చెంచులు, యానాదులు, గోండులు, సవరలు ఉన్నారు. వీరేగాక నిషాదులు, బిల్లులు, కిరాతులు కూడా ఉన్నట్లు చరిత్ర కారులు చెబుతున్నారు. సింధునాగరికత (క్రీ.పూ.1750) కాలంలో కూడా అనేక జాతులవారు నివసించినట్టు ఆధారాలను బట్టి తెలుస్తుంది. మొదట ఒకే జాతి ఉండవచ్చు. సింధులోయ ప్రాంతంలో జరిగే దండయాత్రలు కారణంగా వేరే జాతులు నివాసం ఏర్పాటు చేసుకుని ఉండవచ్చు. మహాభారత, రామాయణ గ్రంథాల్లో కూడా శూద్రులు, అభేరులు, ద్రవిడులు, పుళిందులు, శబరులు లేదా సవరల ప్రస్తావన ఉంది. పాండవులకు వ్యతిరేకంగా కౌరవ సోదరులు పక్షాన ముండా, నాగా తెగలు పోరాడాయి. అంతేగాక భీమునికి గిరిజన యువతికి జన్మించిన ఘటోత్కచుడు కూడా అనేక వీరోచిత కృత్యాలు చేశాడు.

చరిత్ర తొలిదశలో దేశీయ చక్రవర్తులు, విదేశా నుంచి దాడులు చేసిన వారి చిన్నచిన్న గిరిజన తెగలను అణచివేశారు. అజాత శత్రువు వైశాలి గిరిజన జాతి రాజ్యాన్ని (TRIBAL REPUBLIC) సర్వ నాశానం చేశారు. వాయవ్య భారతదేశంలోని గిరిజన తెగలను అలెగ్జాండర్ పూర్తిగా రూపుమాపాడు. అర్థశాస్త్రంలో 'అత్వికులు' అనే వారి నుండి రాజ్యానికి ప్రమాదం వచ్చినట్లుగా పేర్కొన బడింది. తమ సామ్రాజ్యం పరిధిలోని గిరిజన తెగలను

కరుణతో చూస్తానని ప్రకటిస్తూనే అశోకుడు వాయవ్య భారత తెగలు తిరుగుబాటు చేస్తే వచ్చే పరిణామాలు గురించి వారిని హెచ్చరించాడు. చెంచుల సౌకర్యం కోసం శ్రీకృష్ణదేవరాయలు ఒక చెరువు తవ్వించారు. ఛత్రపతి శివాజీ శ్రీశైలాన్ని దర్శించ డానికి వచ్చినప్పుడు ఆయనకు మార్గాన్ని చూపించింది చెంచులే. వీరిలో కొంతమంది చెంచులు సైన్యంలో చేరారు. శివాజీతో వెళ్లిన ప్రముఖు పెద్దదొర, చిన్నదొరలు, బంజారాల ఆరాధ్యద్కెవంగా పేరొందిన హాథిరాంబాబా వేంకటేశ్వర స్వామిని పూజించి తరించారు. ఈయన తిరుపతి వెంకన్నతో పాచికలు ఆడి, బాలాజీ దర్శనం చేసుకుంటాడు. వేంకటేశ్వరస్వామి పద్మావతిని పెళ్ళి చేసుకోవడానికి స్వయంగా ఎరుకల వేషం వేశారు. విధంగా ప్రాచీన కావ్యాల్లో చాలాచోట్ల ప్రాచీన తెలుగు వారి జానపదలు కనిపిస్తున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపద గేయ సాహిత్యం- బిరుదురాజు రామరాజు
2. జానపద గేయగాథలు- నాయని కృష్ణకుమారి
3. జానపద కళాసంపద - తూమాటి దోణప్ప
4. జానపద కళారూపాలు --మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
5. వీరగాథ వ్యాయం- తంగిరాల సుబ్బారావు
6. యక్షగాన వ్యాయం ఎస్వీ జోగారావు

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

తెలుగు జానపద సాహిత్యం – సంప్రదాయ విజ్ఞానము

– డా॥. యస్. సరళాదేవి, తెలుగు అధ్యాపకురాలు, జె.యం.జె.మహిళా కళాశాల, తెనాలి.

ఒక జన సమూహంలోని ఒక తరం ప్రజలు పాటించే ఆచారాలు, నియమాలు, అలవాట్లు, వారి జీవనశైలి మొదలైన అంశాల నుండి తర్వాత తరం గ్రహించే విజ్ఞానాన్ని సంప్రదాయ విజ్ఞానం అంటారు. సంప్రదాయ విజ్ఞానాన్ని ఆంగ్లంలో ''ట్రెడిషనల్ నాలెడ్జ్'' అంటారు. ట్రెడిషన్ అనే పదం లాటిన్ భాషలోని ట్రెడిటస్ ట్రాన్స్‌డేర్ అనే రెండు పదాల నుండి ఏర్పడినది. లాటిన్ భాషలో ట్రెడిటస్ అనగా ''గతాంశాలు'' అని ట్రాన్స్‌డేర్ అనగా 'సంక్రమించుట' అనే అర్థంలో ఉన్నాయి. అమరకోశంలో సంప్రదాయ పదానికి అర్థం ''గురు పరంపరాగతమైన సదుపదేశం'' ఆధునిక కాలంలో ఈ పదం అర్థ విస్తృతిని పొందు గురువులతోపాటు అనుభవజ్ఞులైన పూర్వీకుల ద్వారా వారసత్వంగా పొందే అనేక అంశాలు ఇందులో చేరాయి. సాంఘిక వ్యవస్థకు సంబంధించిన ప్రజలందరూ ఆమోదించినపుడు సంప్రదాయం అన్నది పరంపరాగతంగా నడుస్తుంది. జానపద విజ్ఞానం అత్యంత ప్రాచీన కాలానికి సంబంధించినది. ఇందులో సంప్రదాయకమైన విజ్ఞానం కనిపిస్తుంది. సాంప్రదాయ విజ్ఞానం అన్నది క్రొత్తది కాదు, పాతది కాదు, నిరంతరం రూపుదాల్చుతూనే ఉంటుంది. భిన్నరూపాలను పొందుతూనే ఉంటుంది.

ప్రాచీన కాలంలో గ్రామ వ్యవస్థలో 18 కులాల నిర్మాణం ఉండేది. అందులో వృత్తి కులాలవారు, సేవ కులాలవారు, వ్యాపార కులాల వారు, దైవకార్య కులాల వారు, నిర్వహణా కులాలవారు ఉండేవారు. ఈ కులాలలో వృత్తి కులాలవారు నిర్వహించే వృత్తులకు సంబంధించిన పాటలు, జానపద సాహిత్యంలో అక్కడక్కడ లభ్యమవుతున్నాయి. వృత్తులు రెండు రకాలు. అవి 1) కుల వృత్తి 2) సంచాల జాతి వృత్తులు. వీరు తమ వృత్తులకు సంబంధించిన వనితనాన్ని, ఉత్పత్తులను గేయాలలోను, కథలలోనూ నిక్షిప్తం చేసి ఉన్నారు. ఇలా నిక్షిప్తం చేసిన అంశాలను పరంపరాగతంగా కాపాడుకొస్తున్నారు. అంతేగాక ప్రాచీన కాలంలో ముద్రణాసౌకర్యం లేకపోవడం వలన గేయ రూపంలోనూ, కథల రూపంలోను నిక్షిప్తం చేసుకొని తరం నుంచి తరానికి అనుక్రమంగా నేర్చుకొని వ్యాప్తి చేస్తున్నారు.

సంప్రదాయంలో తరతరాలుగా ఒక జాతిగాని, ఒక సమూహంగాని సంపాదించుకున్న, రూపొందించుకున్న జాతి జీవన అవసరాలకు కావలసిన విద్య, వైద్యం, వృత్తులు మొదలైన అంశాలు ఇందులో చేరుతాయి. అదంతాకూడా సంప్రదాయ విజ్ఞానంలో భాగం అవుతుంది. ఇటువంటి విజ్ఞానం ఆజాతి సృష్టించుకున్న సాహిత్యంలో సర్వసాధారణంగా ప్రతిబింబిస్తుంది. సాహిత్యంలో కూడా శిష్ట సాహిత్యం కంటే జానపద సాహిత్యం మరింత ఎక్కువ ప్రతిబింబించడంలో ఎటువంటి సందేహం లేదు. దానికి ప్రధాన కారణం జానపద సాహిత్యం. జానపదుల అనుభవాల నుంచి కష్ట సుఖాల నుంచి పుట్టిన సాహిత్యం కావడమే.

తెలుగు జానపద సాహిత్యంలో సంప్రదాయ విజ్ఞానాన్ని పరిశీలించటం ద్వారా మన పూర్వీకుల వృత్తులు, పనితనం, ఉత్పత్తి మొదలైన ఆంశాలు వెలుగు చూస్తాయి. ఎరుకుల కులానికి చెందిన స్త్రీ అల్లిన వస్తువులు ఇలా పాటలో కనిపిస్తుంది. మేదర వర్గంలో ఈత ఆకులతో చేటలు, గంపలు, విసనికర్రలు, పుటికలు అల్లుతారు. విసనకర్రలు అల్లేటప్పుడు ఈత ఆకులలోని ఈనెలు తీసి అల్లుతారని, ఈత మట్టలను సన్నగానూ, లావుగాను చీల్చుతారు. వాటితో చేటలు, గంపలు, పుటికలు అల్లుతారు. అల్లేటప్పుడు చేటలకు సన్నగా చేసిన దబ్బలను, పుటికలకు లావుగా చేసిన ఈత దబ్బలను

వినియోగించి సన్నని పుల్లలతో అల్లుతారని క్రింది పాటలో తెలుస్తుంది.

యెటి మీన బొయ్యేటి యెరకల్లసానే
యీన దేసల్లింది యిసనకర్రల్లు
గోడి దబ్బనల్లింది సండు పుటకలు
సరి దబ్బనల్లింది శాట గంపల్లు
గుండు పుటకలన్ని గుమ్మికేసింది
శాట గంపలన్ని జల్ల కాజేసింది

సోలను చేయటానికిచెక్క కావాలి. దాన్ని బాడిసతో చెక్కాలి. పాత రోజుల్లో దాన్ని కమ్మరి కులస్తులే చెక్కేవారు. తిత్తి ఊది వేడిచేస్తూ చెక్కను చెక్కి చట్రం చేయటం ద్వారా సోల తయారవుతుంది.

సోల దొరుకంది నన్నేమంటావ్
ఏయే సోల ఎందుకు దొరకవ్
వడ్లోడు చెక్కంది నన్నే మంటావ్
ఏమిర వడ్లోడ ఎందుకు చెక్కవ్
బాడిశె తెగంది నన్నేమంటావ్
ఏమే బాడిశె ఎందుకు తెగవ్
కమ్మరోడు చెరువంది నన్నేమంటావ్
ఏమిర కమ్మరోడ ఎందుకు చెరువవ్
తిత్తూదంది నన్నేమంటావ్

వరిగడ్డిని వినియోగించి అనేక రకాలైన అవసరాలను తీర్చుకునే విధానం కనిపిస్తుంది. వరిగడ్డితో సన్నగా, లావుగా పరిమాణంతో తాళ్ళను పేనుతారు. సన్నని తాళ్ళతో పలుపులు, దూడలకి తగుళ్ళు చేస్తారు.

దూడలకి తలుగాయె దుక్కిమెకాయె
బాయికే తాడాయె బండి సెరగాయె
పండెండు యెద్దులకి పరాకట్లు ఆయె
ముప్పయ్యి యెద్దులకి ముగుదాళ్ళు ఆయె
పండెండు గాండ్లకీ పగ్గాలు ఆయె
ముప్పయ్యి గాండ్లకే ముంజెరుగులాయె

బావిలో నీటిని స్త్రీలు తోడడానికి అనువుగా ఉండటం కొరకు ఈ చేద బిళ్ళను (గిలక) ఉపయోగిస్తుండేవారు. ఈచేద బిళ్ళను కంసాలి కులానికి చెందినవారు తయారు చేసేవారు.

ఒక చేద బాయికి ఒక చేద బిళ్ళో
ఒక చేద బిళ్ళకి ఒక చేద తాడో
ఒక చేద తాడుకి ఒక చేద దుత్తో

ఈ గేయం కమ్మరి వృత్తిని తెలియజేస్తుంది. పాలంలో గింజలు వేయుటకు ఒక కారుమడక, రెండు కార్ల మడక, మూడు కార్లమడక తయారు చేసుకునేవారు.

ఏడువడ్ల పత్తి చేండ్ల పలుగుచేయించు
ఏడు వడ్ల నాగండ్ల కర్రూ చేయించు
ముద్రుడు ములకాల కట్టె చేయించు

పైన క్రోడీకరించిన జానపద గేయాలు అనేక రకాల వృత్తి పనివారిని, వారు చేసే వృత్తులను తెలియజేస్తాయి. పరిశోధనలో అధిక భాగం వస్తు రీత్యా, లేక రూపం రీత్యా వర్గీకరించడం జరిగింది. ఏదో ఒక సమూహానికో, ఒక రూపానికో సంబంధించిన జానపద విజ్ఞానాన్ని ఒక ప్రాంతం పరిధిగా తీసుకుని సేకరించి అక్కడ అలవోకగా కనపడే కొన్ని సాంస్కృతిక విషయాల్ని గుర్తించటం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1) రామరాజు, బిరుదురాజు, తెలుగు జానపద గేయ సాహిత్యం
2) మోహన్, జి.యస్., జానపద విజ్ఞానాధ్యయనం.
3) సుందరం, ఆర్వీయస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం.
4) భక్తవత్సల రెడ్డి, యస్., జానపద విజ్ఞాన సమాలోచన.

❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద సాహిత్యంలో జంతువుల పాటలు

- కడారి గంగాభవాని

జానపదుల జ్ఞానపపదులని చెబుతుంటారు పెద్దలు. జానపదంలో లేనిందటూ ఏదిలేది నవరసాలు కలిసిన కళ జానపదకళ. జానపదంలోఎ ఎక్కువగా పాతకాలంలో, మోటపాటలు, కలుపుపాటలు, కోతపాటలు, ఇసుర్రాయి పాటలు, జడకొప్పు పాటలు, భజనపాటలు, భాగవతం పాటలు, శ్రామిక గేయాలు, చాలా రకాలైన పాటలు పాడుతు ఉంటే వినసొంపుగా ఉండేవి. వీటిలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసేటప్పుడు, లేదా ముదురు కలుపు తీసేటప్పుడు, ఎడ్లమీద, బర్రెమీద, మేక, గొర్రె, పిల్లి, ఎలుక జంతువుల పాటలు వీరియొక్క కంఠపర్వం నుండి కూని రాగాలతో మెల్లగా మొదలై బయటకు చుట్టుముట్టు ఉన్న సేంద్లల్లో పనిచేస్తున్న వారికి కీలోమీటరు దూరం వరకు వీరిపాటలు గాలిద్వారా చాలా దూరం చేరుతూ ఉంటాయి. వీటిలో కొన్ని జంతువుల పాటలు

"అడెల్ తాడెల్ జినుకపిల్ల
జీడిమెటల్లం ఎయ్యబోతే
బొబ్బబెట్టి కేక పెట్టే
నాగలి కడితె నన్నే చూడదు
కిక్కిడి కొమ్ముల బోడాదిరా
గొర్రు కొడితెనన్నే చూస్తాది
కిక్కిడి కొమ్ములబోడాదిరా
మొట కొడితే మొత్తుకుంటది
కిక్కిడి కొమ్ములా బోడదిరా....
దంతె కడితే దడుసుకుంటది

అంటు రైతు నాగలి కొట్టి దున్నుదామని బురుదలోనికి దిగగానే, ఆ ఎడ్లు నాగలి నడవడానికి ఇబ్బంది పెడుతున్న క్రమంలో "అడిల్ తోడెల్" అంటే "అడిజా" అని అర్థం. ముందుకునడుపు అని అర్థం."జీడియెట్ల ఏయ్యబోతె" అంటే జీడిగింజలు వేసి బెల్లంతోదంచి ఎద్దు లేదా ఆవు నడువకపోయేది. వాటి నోట్లో పోస్తారు. అప్పుడు వాటికి బలం వచ్చును. జీడి గింజలు, బెల్లం వేసినగానీ ఎడ్లు లేదా ఆవు నడువకపోతే "బొబ్బపెట్టి కేక పెట్టె" అంటే రైతు గాడ్రించి అరవడం అని అర్థం. ఇవ్వన్నీ పెట్టిన ఎడ్లు నాగాలి కట్టితే నన్నే చూడదు. గొర్రు కట్టితే నన్నే చూడదు.మోట కట్టితే మొత్తుకుంటాయి కిక్కిడి కొమ్ములా బోడదిరా" తోలు కొమ్ములది అని అర్థం ఈ పాట జాజిరిపాట.

లేతగడ్డియేసెటి లేగెలెది మంద, లేగలది మంద
మలుపపురా సత్తెన్న మామలది మంద, మామలది మంద
"మా అవ్వ మీ తోడ పుట్టలేదమామ", పుట్టలేదమామ
"పుట్టంగ పురుడు చెయ్యలేద మామ", చెయ్యలేదమామ
"పుట్టంగ పురుడు చెయ్యలేదమామా" చెయ్యలేదమామ
"పెరుగంగ పెండ్లిలు చెయ్యలేదమామ", చెయలేదా మామ
"వరిగడ్డి మేసేటి ఆవు లేదు మంద", ఆవులదిమంద
"మలుపపురా సత్తెన్న మామలదిమంద", మామలది మంద
"ఒర్రెల తిరిగెటి గొర్రెలెదుమంద", గొర్రెలదిమంద
మలుపపురా సత్తెన్న మామలది మంద, మామలదిమంద

రైతుకు కొన్ని రోజులు దొడ్డినిండ మంద ఉండి, అప్పులపాలై అమ్ముకున్న క్రమంలో తన ఎడ్లు లేవు కదా, తన తమ్ముడు ఎడ్లనుమేపన్న అంటు వీరి ఇద్దరి మధ్య సాగే పాట దొడ్డి నిండ ఎడ్లు ఆవులు ఉండేవి. ఇప్పుడు ఖాళీ ఉందనీ భాదపడుతుంటే, నా మంద ములుపు అనీ తన మామకు చెబుతున్న పాట, మామ ఒకప్పుడు

మా అమ్మ నిన్ను పెంచి పెద్ద చేసింది. పెండ్లి చేసింది. పిల్లలు పుట్టితే పురుడు కూడా చేసింది. మా అమ్మ అన్నిరకాల సేవలు చేసింది. మాకు దొడ్డి నిండా ఎడ్లు ఉండేవి. ఇప్పుడు లేవు. నీ దగ్గర ఉన్నా మందను మా సత్తెన్న మలుపుతాడని కంటికి రెప్పల నీ మందను కాపాడుతాడు మామ అని చెప్పుతున్న సందర్భంలోనిది పాట

మందకు ఎండగొట్ట మల ఆవులు మేశ
దొడ్లకు ఎండగొట్ట దొరావులు మేశ
మీ ఆవు మేసెటీ ఎసువంటి మేత
సన్నపు బియ్యము సారంగ పసుపు

ఈ పాటలో పొద్దునే మందను మేపి అడవి చుట్టు తిరిగి ఆకు ఆలములు తిన్న ఆవు ఎమేమి మేసింది అని యజమాని ఆవును మరియు అడుగుతున్న సందర్భం లోనిది. పొద్దంత మందకు ఎండగట్టె మల్ల ఆవులే మేత మేసే ఆవి ఏమి తిన్నవి అని అడుగుతున్న సందర్భం లోనిది. దొడ్డిలో ఉన్న ఎడ్లకు కూడా ఎండగొట్టె ఆయినా అవి దొరావులు దొడ్డిలో గడ్డిమేసే ''దొరా'' అంటే పండుటాకు అని అర్థం. లేదా జెరంత ఎర్ర ఎర్రనీ రంగు గలవి అని అర్థం. మరొక్క సందర్భంలో మన ఆవు ఏమేమి తింటది ఎప్పుడెప్పుడు తింటది ఆకులు ఆలములే తింటదా లేదా ఆవు బలిష్టంగా ఉండటానికి రోగాల బారిన పడకుండా సన్నపు బియ్యం దంచి పసుపు ఉప్పు మంచి నూనే, కోడిగుడ్డు ఆవు యొక్క నాలుక మీద ఉప్పురాసి పసుపురాసి పచ్చి మంచి నూనెను కోడిగుడ్డును దాని నోటిలో పోస్తారు. మూడురోజుల తర్వాత దాన్నే పరిశీలించి ఎక్కువ గడ్డినే మెస్తుంది. ఈ పాట కలుపు పాట.

"బుజ్జి మేక బుజ్జి మేక యాడికెళ్తివే
రాజుగారి తోటలోని మేత కెల్తినే
రాజుగారి తోటలోనా ఏమి చేస్తివే
రాణిగారి పూలచెట్లు మేసివస్తివే
మేసివస్తే రాజుగారు ఏమి చేసిరే
భటులు వచ్చి నాది కాలు విరగుకొట్టిరే".....

బుజ్జిమేక దాని ముద్దు పేరు మేకను మంచిగా పెంచుతూ - ఉంటే ఒక్కరోజు మేక రాజుగారి మేడలోకి ఆకలితో ఉండి మేత కెల్లింది. అక్కడ పూసిన పువ్వులను మేక మేసి వచ్చింది. కుంటిన కాలుని చూసి రాణిగారు మేక ఎక్కడి కెల్లావు అని ప్రశ్నించగా ప్రశ్నకు మేక చెబుతున్న జవాబు, నేను రాజుగారి మేడలోకి వెళ్లి పువ్వు లను మేసిన కనుక రాజుగారు భటులతో నా కాళ్లు విరుగ కొట్టించడానికి మేక రాణి గారికి ఏడ్చుకుంటూ చెబుతున్న సందర్భంలోనిది ఈ పాట. కోలాటంలో మరియు జాజిరి పాటల్లో కలుపు పాటల్లో భజన పాటల్లో పడుతూ ఉంటారు.

"కొక్కరకోయని కూసేనురా కోడిపుంజు'
పెంటలన్నీ తిరిగి మన పెంటకొచ్చింది
కుసేనురా కోడిపుంజు కొక్కరకోయని
వడ్ల గింజలన్నీ వరుస వెట్టి తింటుందీ
పురుగు బుసినంతే కాళ్లక్రింద తొక్కింది"

గ్రామాల్లోకి నేటికి కోడి కుతతో పల్లెలు మెల్లగా నిదురలేస్తవి. లేసి అమ్మలు,అక్కలు, వాకిల్లు ఊడ్చి, పెండనీళ్లతో వాకిట్ల సానుపు సల్లి తెల్లని సుద్ధతోటి ముత్యాల్లాంటి ముగ్గులు వాకిట్లో వేసేవారు. కడపను కడిగి పసుపు, కుంకుమ రాసేది. అది కేవలం కోడికూత వల్లనే, నిదుర లేసేవారు. పల్లె తల్లి బిడ్డలు ఇప్పటికి ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. తరతరాలనుంచి ఆచారం, సాంప్రదాయం కొనసాగుతుంది. నేడు పల్లెల్లో కోడి పుంజులు తక్కువై సెల్‌ఫోన్ల కూతలు ఎక్కువైనయి.

"బుర్రు పిట్ట బుర్రుపిట్ట తుర్రుమన్నది"
పడమటింటి కాపురం చేయనన్నది
అత్త తెచ్చిన కొత్త చీర కట్టనన్నది
మామ తెచ్చిన మల్లెపూలు ముడువనన్నది
మొగుడి చేత మొట్టికాయ తింటనన్నది".....

జానపదంలో, జానపద సాహిత్యంలో (పిట్టల పక్షుల మీద కూడ) చాలా పాటలు ప్రాచుర్యంలో ఉన్నవి. బుర్రుపిట్ట అంటే (బురకపిట్ట), తుర్రుమన్నది అంటే ఎగిరిపోయిందనీ అర్థము. పడమటింటి కాపురం చేయ నన్నది అనే దానిలో తనగూడు పడమటి దిక్కున ఉన్నది వాస్తు ప్రకారం లేదు అందువల్ల కాపురం చేయను, చేయకున్న సరే గాని కనీసం నీ జుట్టుకు మామ తెచ్చిన మల్లెపువ్వులు పెట్టుకొమ్మని అర్థం. మరి కొత్త చీర చీరకట్టుకో లేకుంటే మొగుడి చేత మెత్తగా దెబ్బలు తింటదని. బుర్రుపిట్టకు చెబుతు ఉంటుంది. జాన పదంలో ....., శ్రామిక, కలుపు, దంపుడు, పాటలే కాక జంతువుల పాటలు కుప్పలు తెప్పలుగా ఉన్నవి. వీటన్నిం టిని మనం సేకరించి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

అదే విధంగా మన గ్రామసీమల్లో ప్రతిజంతువు మీద పాటలు ఉంటాయికానీ, జంతువులు కొన్ని వ్యవసాయం చేస్తూ అవి ఏ విధంగా ఉంటాయో అనే జానపద పాట చూడండి.

ఏటి గడ్డకు రెండు ఎండ్రికాయలు కల్సి
ఎవుసమంటు మొదటుపెట్టంగ ॥2॥
ఎవుసమంటు మొదలు పెట్టంగ ॥ఏటిగడ్డకు॥

నాక్కనాథుడు నాగలికట్టి
నిత్యం ఎకురం దున్నంగ ॥2॥
నిత్యం ఎకురం దున్నంగ ॥ఏటిగడ్డకు॥

కొంగనాథుడు కొప్పెర పెట్టుక
ఒంగి ఒరలు చెక్కెంగ
ఒంగి ఒరలు చెక్కెంగ ॥ఏటిగడ్డకు॥

తాబేలునాథుడు తలవాలుగట్టుగ
తరిమి తరిమి గొర్రు కొట్టంగ
తరిమి తరిమి గొర్రు కొట్టంగ ॥ఏటిగడ్డకు॥

నెమలినాథుడు నడుమును వంచి
వంగివంగి నాటు వేయంగ
వంగివంగి నాటు వేయంగ ॥ఏటిగడ్డకు॥

కోతినాథుడు కట్టెను వట్టి
తిరుగుతు కావలి కాయంగ
తిరుగుతు కావాలి కాయంగ ॥ఏటిగడ్డకు॥

జంతువులు కొన్ని వ్యవసాయం చేయాలి. అని పందెం వేసుకుని మనం వ్యవసాయం చేస్తే, రైతును చాలా ఇబ్బంది పెడుతున్నాయి. మనం చేస్తే ఎలా ఉంటుంది? అని ఏటిగడ్డకు ఎండ్రికాయలు మొదలుపెట్టగ, నక్కనాగలి కట్టి, నిత్యం అంటే రోజు అని అర్థం. రోజు ఒక్క ఎకరం దున్నుతున్నది. నక్క, నక్క నాగలి కట్టి దున్నుతున్న క్రమంలో, కొంగ నేను తక్కువ కాదు. అని కొప్పెర పట్టుకొని, చేతిలో చెక్కపారవట్టి నక్కదున్నిన కొద్ది, ఒరము చెక్కుతున్నది. మెల్లగ వర్వ రాగానే తాబేలు తనుకూడ పనిలో భాగస్వామ్యం పంచుకోవాలని, తరిమి గొర్రుకొట్టి పొలం మొత్తం ఎత్తువంపులు లేకుండ చేసిం దని అర్థం, నెమలి నారును తెంపి నాటును పెడ్తుంది. పంటను పాడు చేసే కోతి తను పంటకు కాపాలా దారుడయ్య కర్రచేతిలో పట్టుకొని తిరుగుతూ ఉంది.

మనం జంతువులను దేవుండ్లుగ మొక్కేటువంటి సంప్రదాయం మనవద్ద ఉంది కాని, బ్రహ్మంగారి కాలజ్ఞాన భోదనలో తన శిష్యులు కొంతమందికి చెబు తున్న సందర్భంలో తిరిగి గురువుగారి మాటలు వింటాను అనే "పాట"

గురురాజ నీ మాట వినకుంటే కీడే,
వింటే, లోకుల తోటి అపకీర్తి పాలే
హౌరాస గురురాజ అంత నీమాయ
ఆత్మలో తలిచితే ఆనందమాయో

పాడువడ్డ బాయిలో బల్లి ఉన్నదిర
బల్లికడుపున రెండు భజనలున్నయిరా
హోరస్స గురురాజ అంతని మాయ
ఆత్మలో తలిచితే ఆనందమాయో

కారండపడవిలో కొంగ ఉన్నదిరా
కొంగనోటిలో కోటిలింగలున్నాయిరా

హోరస్స గురురాజ అంతని మాయ
ఆత్మలో తలిచితే ఆనందమాయో
నాగలోకంలోన నక్క ఉన్నదిరా
నక్కనోటిలో పరంజ్యోతి ఉన్నదిరా

అంటూ, గురువు శిష్యుల మధ్య సాగేపాట గురువుని మాట నేను వింటకానీ నీ మాట విన కొన్నిసార్లు నాకు అపకీర్తిపాలు అయ్యి నిందెలు వేస్తున్నది. పాడులోకం అని గురువుకు చెబుతాడు. కాని గురువు అంతనిమాయని ఆత్మలో తలచుకో. కొల్సుకో శిష్యుడా అని, పాడువడ్డ బాయిలో బల్లి ఉన్నది చూడు. దాని కడుపున భక్తితో రోజు నన్ను స్మరిస్తూ భజనకీర్తనలు పాడుతూ జెపం చేస్తున్నది. అదే విధంగ పిట్టపిసుమనని, కాకి కార్రుమనని కారండపడవిలో కొంగ ఒక్కటి ఎగురుతున్నది. దాని నోటిలో, కోటిలింగాలు ఉన్నవి. కొంగకూడ నా నామ స్మరణ చేస్తున్నది. నాగలోకంలో నక్క ఉన్నది. నక్కనోటిలో పరంజ్యోతి ఆరిపోనిదీపం ఉన్నది అని చెబుతున్న సందర్భం. జానపద పాటలను కాపాడుకుందాం, జ్ఞాన పదులుగా రేపటికి తరాన్ని అందిద్దాం. వీటిలో పాటలను ఏరుకుని పల్లెసీమలు పట్నంకన్నా మేలు. జానపదుల జాడలు, అక్షరవాడలుగా వీటిని సేకరించి వ్రాసివని. వీటిలో గౌరమ్మ, శాంతమ్మ, నర్సవ్వ బుదవ్వ చెప్పిన పాటలు, వీరినుండి పరిశోధనకు ఉపయోగపడే పాటలు ఉన్నవి. వీటిని ప్రపంచాన్ని పరిచయం చేయిద్దాం జానపదకళలు సంస్కృతి వర్ధిల్లాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1. జానపద కళారూపాలు జయధీర్ తిరుమలరావు
2. జానపద కళారూపాలు విశిష్టత మిక్కినేని రాధకృష్ణ
3. జనసాహితీ ప్రచురణలు

❖ ❖ ❖

అనంతపురముజిల్లా జానపదుల వివాహం – గేయాలు

– కొంక ముల్లికార్జున, పరిశోధక విద్యార్థి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

అనంతపురము జిల్లా కర్ణాటక రాష్ట్రానికి, వివిధ జిల్లాలకు సరిహద్దుగా కలిగి ఉండటం వలన ఆయా ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాల ప్రభావం ఈ జిల్లాపై పడిందనటంలో ఎటువంటి సందేహం లేదు. జానపదులు పుట్టుక మొదలు చనిపోయే వరకు తాము జరుపుకొనే సాంఘిక కార్యక్రమాలలలో పాటలు పాడుకోవడం నేటికి ఉంది. ఈ సాంఘికాచారాలలో ఎక్కువగా స్త్రీలు పాడే పాటలే ఉంటాయి. అమెరికాలో ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ అని, రామలాలి మేఘశ్యామలాలీ అని అయోధ్యలో, ఏడవకు ఏడవకు వెర్రినాగన్న అని పల్లె సీమలోని పాపాయమ్మ, ఇలా స్త్రీలు సహజసిద్ధంగా తమ అనుభవాలను రంగరించి భారత, భాగవత రామాయణాలలోని ఇతి వృత్తాలను తమ నిత్యజీవితంలోకి అన్వయించుకొని పాడుకోవడం నేటికి చూడవచ్చు.

జానపదుల సాంఘికాచారాలలో వివాహవ్యవస్థ అత్యంత ప్రాధాన్యత కలది. ఈ కార్యక్రమాలలో వివిధ సందర్భాలలో జానపద స్త్రీలు కొన్ని పాటలు పాడుకోవడం చూడవచ్చు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలలో మానవ జీవితానికి ముడిపడిన వాటిలో వివాహవ్యవస్థ ఒకటి. ఇది పెళ్లిచూపుల కార్యక్రమంతో మొదలవుతుంది. జానపదులు పెళ్లిసంబంధం అడగడానికి వెళ్లినప్పుడు అబ్బాయిని రామునిగానూ, అమ్మాయిని సీతగా భావించి అమ్మాయిని అడగడానికి వెళ్లినప్పుడు అక్కడ ఆమె కాళ్లు, చేతులు సక్రమంగా ఉన్నాయో లేవోనని, మాటలు వస్తాయో, రావోనని పరివిధాలుగా పరిక్షిస్తారు. ఈ విధంగా చేయడం అన్ని కులాలలోనూ ఉండేది. దీనినే పాటల రూపంలో క్రింది విధంగా పాడుకుంటారు.

అ) ముక్కోటి కొండమీద మున్నూరు దేవతలు ॥2॥
మున్నూరు దేవతలు మున్నూరు జనులు ॥2॥
జనులా మీరొచ్చిండే పనులేమి పనులు ॥2॥
శ్రీలక్షియింటిలో సీతుండాదంట ॥2॥
అయోధ్య రామునికి అడగానొస్తిమి ॥2॥
మాసీతా సిన్నాదే మేమియ్యలేము ॥2॥
అంతకన్నా సన్నోడా అయోధ్యరామ ॥2॥
నడిపించు మీసీతా నడకాచూద్దాము
నడకేమి చూసేవు హంసనడకలా ॥2॥
పలకించు మీసీత పలకచూద్దాము ॥2॥
పలకేమి జూసేవే చిలకపలుకలా ॥2॥
నగుపించు నీసీత నగువు చూద్దాము ॥2॥
నగువేమి చూసేవు నారాయణ నగువ ॥2॥
నగువు చీరలు మీవాయ సీతామాదాయ ॥2॥
రయికలూ వీవాయ రవిని మావాయ ॥2॥
గంధాము మీవాయ గౌరీమాదాయ ॥2॥
అయోధ్యరాముడికి అడగా నొస్తిమి ॥2॥
సీతారాముల పెండ్లి చేసేము మేము

ఆ) ఎవరమ్మామీరు మాయింట నుండేటివారు ॥2॥
వివరమేలాగు తెలుపండమ్మామాకి
విన్నపాలు తెలుపండమ్మా మాకు
సుబద్ర నీ చెల్లెలా సుగుశాలి నీ చెల్లెలా ॥2॥
సుబద్ర నీ చెల్లెలన్నా నేను భాగ్య సంపన్ను రాలినన్నా
వచ్చివాకిట నిలిచి వాదింప జేసేవు
వచ్చిన పనులేమమ్మా నీవు వచ్చిన పనులేమమ్మా
వెయ్యావుల చిన్నా వానికి వెయ్యావుల చిన్నాదాన్ని
వియ్యాములడగా వస్తినన్నా నేను ॥2॥
ఇచ్చేకేమి ఇచ్చినగానీ కుచ్చుల చెడినివ్వడు
ఎచ్చుకాడక్కా బావ అతడు బోగచ్చుల కాడక్కా భావ

ఎచ్చుగా మమ్ముజాకి మొచ్చినయ్యాకిచ్చి
వెచ్చుతగ్గావు లెంచు న్యాయమా వన్నా ॥2॥
చదువూన నా పుత్రుడు సమురంతుడు నీ యల్లుడు ॥2॥
చదువుతో కజ్జుమంతుడన్నా వల్లుడు ॥2॥
చదువూన నీపుత్రుడు సమురంతుడల్లుడు కాదని
బామాలందరూ చెప్పేరక్కా నాతో చేడీలు చెప్పేరక్కా
ఆమాట వారు పలికేరు జనులెలా ॥2॥
ఆమాట మదియ నొంచద్దన్నా ॥2॥
ఇచ్చేకేమి ఈకున్నా వియ్యాము లేకున్నా ॥2॥
వొదిన్నడిగి చెప్పెరన్నా నీవు మా వొదిన్నడిగి చెప్పేరన్నా
ఏమేఏమే భామా యింటివా మాటలన్నీ
సమ్మితి మేమే ముద్దుగుమ్మానీకి ॥2॥
సమ్మతము మనకున్న నమ్మకము ఆయమ్మకున్ని
ఆయమ్మకు నాచుట్టాలెవురూ మనకి
ఆయమ్మకు నా బందువులెవరు
ఆమాట వదినచెప్పె జగమంతా సమ్మతించి
వోలి ఏమి తెచ్చావు చెల్లెలా సొమ్ములేమి తెచ్చినావు
వేయి వరహాల సొమ్ము మంగళసూత్రము
మనవి తెచ్చిన క్షకోనమ్మానీవు ॥2॥
పసుపును కుంకుమ మంగళ రూకలతో
మనవి తెచ్చిన శ్రీ కోనమ్మా

జానపదులు వివాహ కార్యక్రమానికి ముందు పెళ్లి కొడుకు, పెళ్లికూతుర్ని చేసే సాంప్రదాయం ఉంది. వీరిని తయారు చేయడానికి కొన్ని ప్రాంతాలలో పీటలు వాడితే మరికొన్ని ప్రాంతాలలో రాగి, మర్రి కొమ్మమీద కూర్చోబెట్టి లేదా వధూవరుణ్ణి చేసే సంప్రదాయం ఉంది. ఈ కార్యక్రమానికి కంబడి పరచి, దానిపైన ముగ్గులేసి పీఠలు వేస్తారు. ఆ సమయంలో వరుణ్ణి పీటలమీదకు రమ్మని పిలిచే సందర్భంలో ఈ క్రింది విధంగా పాడుకుంటారు.

చిత్తరే యిల్లలికి చిక్కన ముగ్గుపెట్టి
చిలక ముగ్గుల మీద సల్లబడురా
నలుగూకు రారా! సుందరి రాజు! కుమారా

వివాహ కార్యక్రమంలో తలంబ్రాలు అయిపోయిన తర్వాత వధూవరులను ఇంటిలోకి పిలుచుకునేటప్పుడు గుమ్మందగ్గర (వాకిళ్ల) వధూవరులను ఉద్ధేశించి వారిని సీతారాములుగా భావించి పాటలు పాడతారు. వీటినే తలుపు వాకిట పాటలని అని కూడా అంటారు. ఈ పాటలు కేవలం ఒక కులానికి మాత్రమే పరిమితం కాలేదు. వీటిని అందరూ ఆయాప్రాంతాలలో పాడుకుంటూ ప్రతి పాటలోనూ తాత్విక చింతనతో ఆలోచింపచేసే విధంగానూ, నిత్యజీవితంలో భార్యభర్తలు ఏ విధంగా మెలగాలో ఈ క్రింది విధంగా వారు పాటల రూపంలో పాడుకుంటారు.

"వసుదేవపుత్రా వైకుంఠవాస శ్రీలక్ష్మీలోలా ॥2॥ 'రారా'
గోపాలకృష్ణా తుంటరి తనమేలా ॥2॥ 'రారా'
కన్నతల్లి కోతలు పెడితే లోకామెక్కడిదో ॥2॥ 'రారా'
వసుదేవపుత్రా వైకుంఠవాస శ్రీలక్ష్మీలోలా ॥2॥ 'రారా'
చిన్ననోరని తెలియకనీవు మన్నుతినవకురా ....

నాటి స్త్రీలు, పెద్దలు ఇప్పటిలాగా చెప్పదల్చుకున్న విషయాలను కొన్నింటిని ప్రత్యక్షంగా చెప్పకుండా పరోక్షంగా ఇతరులకు అర్థమయ్యేవిధంగా మాటలు, పాటల రూపంలో చెప్పేవారు. పై గేయంలో వారు నేడు జరిగేటువంటి భ్రూన హత్యలను అనాడే గుర్తించి స్త్రీమూర్తి తన బిడ్డను గర్భంలోనే ఉన్నట్లుగా తొలగిస్తే ఈ సృష్టి అనేటువంటింది ఉండదు. సృష్టికి మూలం స్త్రీనే. కావున స్త్రీకి సంతానం మగ, ఆడ పిల్లలు ఎవరు పుట్టినా ఇద్దరిని సమానంగానే చూడాలనే తాత్విక చింతనను నూతన వధూవరులకు పరోక్షంగా సందేశాన్ని స్తారు. అదేవిధంగా మరికొన్న తలుపులు పాటల కూడా ఈ కింది విధంగా పాడుకుంటారు.

మాతా బృందావనమా భారతమాత రావమ్మ తులసి, మాత

పావనమైన తులసి వైకుంఠపురములో వెలసి ॥2॥
అయినా ఇద్దరూ కలసి జయమంగళ లక్ష్మీతులసి
శ్రీమహా విష్ణువు కలసి జయమంగళ లక్ష్మీతులసి
లేవమ్మ తులసిమాత బృందావన భారతమాత రావమ్మ తులసిమాత

రాదారుక్మిణీదేవి నినుకారి మదిలో దలఁ ॥2॥
అభినయమున నొసగుమునమ్మా నీకృష్ణుని త్రాసులు తూగి ॥2॥
మహామహామునులకెల్లా పరమాత్ముని వాక్యలకెలా ॥2॥
సాహసముగా నీదళము సమస్త కళనే బలము ॥2॥
అజ్ఞాన భూమిలో నీవు సుజ్ఞాన మొలవమై మలచి
ప్రజ్ఞాకర రూపమును నీవు సుజ్ఞాన వశమునవెలసి
పతివ్రత స్త్రీలో కెల్లా నీ వ్రతమే పావనమమా ॥2॥
సతిసావిత్రుల సుమతి నిను నేర్చర గొలుతురు మదిలో ॥2॥ లేవమ్మా
పసుపు కుంకుమ తెచ్చి నీసేవలు చేసెదమమ్మా ॥2॥
కాయా కర్పూరాలు నీ సేవలు చేసెదమమ్మా ॥2॥ లేవమ్మా

ముగింపు :

జానపదుల వివాహవ్యవస్థలో పందిరివేయడం మొదలు అప్పగింతలు వరకు సాగే ప్రతి సందర్భంలో స్త్రీలు ఆ సందర్భానుసారంగా పాటలు పాడతారు. అయితే నేటి ఆధునిక పరిజ్ఞాన నేపథ్యంలో జానపద గేయాలు సాంకేతిక పరికరాలైన టి.వి, సినిమాలు, ల్యాప్ టాప్‌లు, చరవాణిలు వంటివి వీరిని ఆకర్షింపబడి కాలానుగుణంగా ఎవరికి వారు యమునాతీరు అన్నట్లుగా ఉంటూ సాంఘిక కార్యక్రమాలలో తక్కువగా పాల్గోనడం, నేటి స్త్రీలు వాటిని నేర్చుకోలేక కనుమరుగవుతున్నాయనే చెప్పవచ్చు. జానపద గేయాలు ప్రతి ప్రాంతంలోనూ నేటికి ఇంకా స్త్రీల నోళ్లల్లో నానుతూనే ఉన్నాయి. వీటిపైన పరిశోధకులు మరింత లోతైన పరిశోధన చేసి వాటిని వెలికితీయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

పొడుపు కథలు – ప్రయోజనాలు

– టి. వెంకటనారాయణ, ఉపాధ్యాయుడు, జిల్లా ఉన్నత పాఠశాల రాయచోటి.

జానపద సాహిత్యంలో జానపద కవిత్వం, గద్యాఖ్యానాలు,సామెతలు ఎంత విశిష్టమైనవో పొడుపు కథలు కూడా అంతే విశిష్ట్యాన్ని కల్గివున్నాయి.తెలుగు సాహిత్యంలో పొడుపు కథలు ఎంతో ప్రత్యేకతతో అల రారుతున్నాయి. ఇవి సాహిత్యాభివ్యక్తి విధానాలే కాకుండా, మానవ మనో వికాసానికి చాలా దోహదపడుతున్నాయి.

పొడుపు కథల్లో మన సంస్కృతి, సంప్రదాయలలో, ఆచార వ్యవహారాలు జీవన విధానాలు, కట్టుబాట్లు ప్రతి బింబిస్తుంటాయి. జానపదులకు విజ్ఞానాన్ని పెంపొందించే సాధనాలు పొడుపు కథలు ఇవి క్రీడాస్ఫూక్తిని కూడా కల్గిస్తాయి.

"జానపద సాహిత్యంలో జానపద గేయాలు, కథ గేయాలు, సామెతలు వైవిధ్యం గల ప్రక్రియలైతే పొడుపు కథలు వాటన్నింటి కంటే ఎక్కువ వైవిధ్యాన్ని కల్గివున్నాయి. అటు వినోదాన్ని ఇటు విజ్ఞానాన్ని సమానంగా యిచ్చే ప్రక్రియల్లో పొడుపు కథకు మించిందిలేదు.ఇంత గొప్ప ప్రయోజనం ఉండడం వల్ల ప్రపంచలోని ప్రతి సమాజం వీటిని వినియోగించుకుంటున్నాయి." అని డా. పేట శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యానించారు.

"పొడుపు కథ (Riddles) అంటే జ్ఞానోదయాన్ని కల్గించేది. నిగూఢమైన అర్థాన్ని ప్రకాశింపచేసేది, మరస్సుకు సూటిగా తగిలేది ఎదలో నాటేది, లేదా వెంటనే అర్థం తోచక చిక్కులు పెట్టేది అని మనం గ్రహింపవ్చు. ఈ పదానికి ఏ అర్థం గ్రహించినప్పటికి పొడుపు కథకు సరిగ్గా అతికినట్లు వ్యుత్పత్తిని కల్పించి చెప్పవచ్చు " అని డా. యశోదారెడ్డి పేర్కొన్నారు.

నిర్వచనాలు :

The new Popular Encyclopaedia లో పొడుపు కథ నిజమైన అర్థాన్ని కప్పిపుచ్చేదిగా ఉండవచ్చు. ప్రశ్నరూపంలో ఉండవచ్చు కాని ఇది జవాబును నేరుగా సూచించదు.

"పొడుపు కథ ప్రశ్న రూపంలో ప్రత్యక్షంగానో, పరోక్షం గానో, సంపూర్తిగానో, అంసపూర్తిగానో, సంప్రదాయ బద్ధంగా ఉంటుంది. ఇది సాధారణంగా అసంభవం గాను, పరస్పర విరుద్ధంగాను కన్పిస్తుంది. కాని ఒక విశిష్టమైన దృష్టితో చూస్తే అది కేవలం సత్యాన్నే గుర్తించమని సవాలు చేస్తుంది." అని పేర్కొన్నాడు.

"పొడుపు కథ ఊహచే పరిష్కరింపబడెడు తికమక పట్టించెడు లేక సందిగ్ధమేన ఒక ప్రశ్నకు అన్వయించెడి ఒక సమస్యాత్మక వాక్యం "అని ప్రస్తావించబడిఉంది. దీనిలోనే " అలంకారికంగా పొడుపు కథ రూపకానికి సన్నిహితంగా ఉంటుంది. నిజానికి దానిని రూకాలం కారంగా గాని, రూకాలంకారాల సమూహంగా గాని నిర్వచింపవచ్చు. అవి సామాన్య వ్యవహారంలో ఉండవు. అంతేకాక వాని ప్రాధాన్యం స్పష్టం కాదు.

రోజర్.డి. అబ్రహామ్స్.అలన్ డండస్‌లు Folk lore and Folk lkfe గ్రంథంలో "నేరుగా సమాధానం తెలియని వాని తెలివి తేటలు పరీక్షించడానికిగాని,లేక వానిని తికమక పెట్టడానికి గాని కల్పింపబడే ప్రశ్నలు పొడుపు కథలు" అని నిర్వచించారు.

నేదునూరి గంగాధరం "పొడుచుట,విప్పుటలో ఆనందమును వెల్లివియించునవి పొడుపు కథలు" అని చెప్పారు.

డా. కసిరెడ్డి "తెలుగు పొడుపు కథలు" అనే గ్రంథంలో పాశ్చత్యుల నిర్వచనాల సారాంశాన్ని గ్రహించి "పొడుపు కథ జటిల ప్రశ్న. ఉద్దేశ్యపూర్వకంగా కల్పింపబడింది.

ఉద్దిష్టార్థం దాని బాహ్యార్థం సూచిస్తుంది.ఎదిటి వాణ్ణి పరీక్షింపదలచి,తికమక పెట్టదలచి, సృష్టింపబడేది. నిజాన్ని మరుగుపుచ్చు వక్రోక్తి గలిగి ఉండేది. సూత్రప్రాయమైన ఆరంభం ముగింపు ఉన్నది. తప్పుత్రోవ పట్టించే కథన మున్నది. సంప్రదాయ బద్ధమై ఉంటుంది. రూపకానికి సన్నిహితంగా ఉంటుంది.

మానవుని పుట్టుకతోనే సమస్యలు మొదలయ్యాయి. వెంటపడ్డ ఆ సమస్యల్ని సాహిత్యం ప్రతిబింబించింది. పరిష్కార మార్గాలు సూచించింది. సమస్య ఎలా నిర్మాణ మవుతుందో పొడుపు కథ తెలిపింది. సమస్య ఎలా పరిష్కార మవుతుందో విడుపు కథ చెప్పింది. అయితే పొడుపునూ - విడుపునూ సృష్టించింది మనిషే,అంటే పొడుపు కథ కర్త - వ్యవహర్త మానవుడే అయ్యాడన్నమాట.

పొడుపు అంటే ఉదయం :

చీకటిలాంటి పొడుపులో ఉదయంలా విడుపు వస్తుంది. పొడవడం వల్ల అంటే తట్టడం వల్ల (సృష్టించడం వల్ల) జ్ఞానోదయం కలుగుతుందన్నమాట.

తెలుగు నాట పొడుపు కథకు, విడుపు కథ తట్టు మారుతట్టు, మారుకతుల, శాస్త్రాలు, సమన్యలు, చిటుకులు, చిట్కాలు, చిక్కు ముళ్లు, యక్ష ప్రశ్నలు, అడ్డుకథ, ఒడ్డు కథ, వేసే కథలు - విప్పే కథలు..... మొదలైన పర్యాయ పదాలెన్నో ఉన్నాయి. నా సిద్ధాంత గ్రంథంలో ఇవన్నీ విరరించడం జరిగింది.

పొడుపు కథ కర్గీకరణం – ప్రయోజనం

పొడుపు అంటే ఉదయం - జ్ఞానం :

ఈ సృష్టిలో మానవుడేనాడు పుట్టాడో పొడుపు కథ ఆనాడే పుట్టింది. (ఈ వ్యాకం శాస్త్రీయ అధ్యయనంలో పనికిమాలినదని తెలుసు. అయితే కాలాన్ని దేశాన్ని నిర్దేశించే ఆధారాలు దొరికే వరకు గత్యంతరం లేదు మరి)

పొడుపు కథకు సంక్షిప్తత, నిగూఢత, అపార్థద్యోతకత, కథాత్వకథ, కథారహితాత్మత, ప్రతీకాత్మకత, ఘటనా విశిష్టిత, విధినిషేధాత్మకత, లోకోక్తి రామణీయకత, లయాత్మకత, చమత్కార చారుత, దృశ్యాత్మకత, అలంకారిత, సమస్యాత్మకత, రసాత్మకత, సాంప్రదాయాత్మకత, కవితాత్మకత తదితర అష్టాదశ లక్షణాలున్నాయి. ఈ లక్షణాన్నిటికి పొడుపు కథల్లో ఉదాహరణలు లభిస్తాయి.

వర్గీకరణం :

పొడుపుకథ స్వరూపాన్ని బట్టి స్వభావాన్ని బట్టి అనేక రకాలుగా విభజించడానికి అవకాశం ఉంది. లయాత్మకమైన గుణాన్ని ఆధారంగా తీసుకొని వచనాలు, గేయాలు, వచన గేయాలు, పద్యాలుగా వర్గీకరించవచ్చు.పొడుపు కథలకున్న పాదాన్ని బట్టి ఏకపది, ద్విపది, చతుష్పది, పంచపది, షట్పది, సప్తపది, అష్టపది మొదలైన విభాగాలు చేయవచ్చు.ఒక్క పొడు కథకు ఒక్క విడుపున్న వానిని, ఒక్క పొడుపు కథకు పెక్కు విడుపుల్ని,పొడపుల్ని వేర్వురుగా సూచించవచ్చు. వచనాల్లో దీర్ఘ వచనాల్ని హ్రస్వవచనాల్ని గేయాల్లో దీర్ఘ గేయాల్ని హ్రస్వ గేయాల్ని వచన గేయాల్లో హ్రస్వ దీర్ఘాల్ని సూచించవచ్చు.

పొడుపు కథలోని చంద :

శిల్ప అనుశాలనానికి, బాషావైభవ పరిశీలనానికి ఈ పై విభజనలన్నీ తోడ్పడతాయి.అందువల్ల పొడుపు కథలో నిత్ర్యస్ర, చతురస్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణాదుల్ని తెలియ జేయడానికి వీలవుతుంది.భాషా పరిశీలనం వల్ల విశేష సంధుల్ని, ధ్వనుల మార్పుల్ని, క్రియుల్ని, విశేషాల్ని, జాతీయాల్ని, పలుకుబళ్లను, విలక్షణ ప్రయోగాల్ని గుర్తించడానికి అవకాశం కలుగుతుంది. కాని తెలుగు పొడుపుకథా హృదయాన్ని అర్థం చేసుకోవడానికి విషయాన్ని బట్టి విభజించడం కన్న ఉత్తమమైన పద్ధతి మరొకటి లేదు.

గృహజీవన ప్రహేళికలు :

ప్రపంచంలో తలమానకమైన భారతీయ గృహ జీవన వ్యవస్థ. తల్లి దండ్రి, కొడుకు, కోడులు, మనుషులూ మనుమరాళ్ళు అందరూ కలిసి ఉన్న సమిష్టి కుటుంబం

వసుదైక కుటుంబం వాతావరణానికి,కేంద్ర బిందువు మాత్రమే. గృహ జీవనంలోని పెండ్లి పేరంటాలు,కలతలు, కలహాలు, శాకపాకాలు, తదితరాలన్నీ దీని క్రిందకే వస్తాయి.

అనంతపురంలో తప్పెట కొడితై
అంతకు తగులు,ఇంతకు తగులు
చెరువులో ఉండే చేపకు తగులు
గాళ్ళలో ఉండే గొడ్డుకు తగులు
బాలింతకు తగులు (పసుపు)

పచ్చి పసుపును వాడుకొనే పసువుగా మార్చే అర్థాన్ని తప్పెట కొట్టడంగా పొడుపు కథాకారుడు భావించాడు. పసుపుగా మార్చేటప్పుడు అంతకూ ఇంతకూ తప్పకుండ తగులుతుంది. అంతకూ ఇంతకూ అనడంలో తయారు చేసే అన్నింటికీ అనే అర్థం కూడా ధ్వనిస్తుంది. చేప వంటకానికి కూడా పసుపు తప్పనిసరి అంటున్నాడు పొడుపు కథా వ్యవహర్త. గాడి పశువులను కట్టివేసే స్థలం,దెబ్బ తాకినప్పుడు,పుండు పుట్టినప్పుడు పశువులకు కూడా పసుపు అవసరమై. ఇక్కడొక విష్టార్థం కూడా ఉంది. గాలి అనే ఒకరకమైన రోగం పశువులకు వస్తుంది. గాళ్ళలో ఉండే గొట్టు అంటే గాలి అనే జబ్బు చేసిన పశువు అనే అర్థం. గాలి పోసిన పశువు కాళ్ళకూ, నాలికకూ పల్లెల్లో ఇప్పటికి పసుపు రాస్తున్నారు. ఇక బాలింతలకు పసుపు పూసే ఆచారం తెలుగు నాట అంతటా ఇప్పటికీ ఉది.

అంతారం కాడ చెట్టు గొడై
అంతకు దాకె - బాలింతకు దాకె
చెర్లున్న చేపకు దాకె
గుండులున్న కుందేలుకు దాకె
మళ్ళొచ్చి మనకు దాకె

ప్రతి పొడుపు కథకూ మాండలిక భేదమొకటి ఉందనడానికి ఉంటుందనానికి ఇదొక నిదర్శనం.

అన్ని ప్రేమలకన్నా - మిన్నైన ప్రేమ (తల్లి ప్రేమ)

కేవలం సంబంధ బాంధవ్యాలే గాక గృహ జీవన సౌఖ్యానికి సౌభాగ్యానికి తోడ్పడే అనేక పరికరాలు ఈ కోవలోకే వస్తాయి.

శ్రామిక జన ప్రహేళికలు :

కూలీ నాలీ చేసేవారు, వ్యవసాయం చేసేవారు వృత్తి పనుల్లో మునిగి తేలేవారు. ఆయా సమయాల్లో శ్రమా పనోదం కొరకు పొడుపు కథల్ని పొడుచుకుంటుంటారు. వాళ్ళు వ్యవహరించేనేగాక ఇతరుల శ్రమ జీవనాన్ని సూచించేవి కూడా ప్రయోగిస్తుంటారు.అలాంఇవన్నీ ఈ కోవలోకి వస్తాయి.

ఇంటి వెనుక కుప్ప వేసి
కుప్పకు నిప్పును పెట్టి
కుప్ప కాలిపోతేను
అప్పులెల్ల తీరిపోయే (కుమ్మరావం)

కుమ్మరి చేసే కర్మను ఈ పొడుపు కథ తెలుపుతుంది. కుంట మట్టి తెచ్చి కుండలు చేసి, కుప్ప పెట్టి కాల్చి అంతవరకు తాను చేసిన అప్పుల్ని తీర్చు కుంటాడు కుమ్మరి. పొడుపు వల్ల పుట్టిన అపార్థమేఘం విడుపు గాలి వల్ల విచ్చి పోయింది.

పొద్దున్నే పోయి
పెద్ద ఎనుము బావిలో పడె (కపిల)

మోటలు పోయి కరంటు మోటర్లు వస్తున్న ఈ కాలంలో కపిల వెనక్కి పడిపోయినా ఒకనాటి వరిపంట కిదదే ఆధారమయింది.కపిల (మోట) పాటల్లో దాగి ఉన్న జానపదుని హృదయ సౌందర్యం సాహిత్యానికి సౌందర్యాన్ని సంతరించి పెట్టింది.వ్యావసాయిక శ్రామిక జీవనాన్ని సూచించే ఇలాంటి పొడుపు కథలు వేలకొలది లభిస్తున్నాయి.

ప్రకృతి సంబంధి ప్రహేళికలు :

ప్రకృతి జీవనానికి పరవశించిన ప్రాక్తన మానవుని నుండి ఆధునికుని వరకు అందరూ ప్రకృతిని ప్రయోజన వంతంగా తీర్చి దిద్దుకొన్నవారే. జానపద ప్రహేళికలు

ప్రకృతిని సంభావించి నట్లుగా సారస్వతంలో మరే సాహిత్య ప్రక్రియ సంభావించలేక పోయింది. ఉరుములు, మెరుపులు, వానలు, వరదలు, భూమ్యాకాశాలు, సూర్య చంద్ర, నక్షత్రాదులు, మట్టీ, గుట్టా, చెట్టూ, ఒక్కటా రెండా ఎన్నని... అన్నీ పొడుపు కథలు పొదుగుకున్నాయి.

అడవిలో అక్కమ్మ తల విరరబోసుకుంది
అని అసహ్యంగా చెప్పినా..... (ఈత చెట్టు)
అడవిలో అక్కమ్మ పసుపు గుడ్డలు ఆరేపు
(తంగేడి పూలు)

అని అందంగా చెప్పినా ప్రకృతి మాతను సముదాయించినట్లే సాదర పూర్వకంగా సన్మానించినట్లే.

అంతులేని చెట్టుకు
అరవై నాల్గే కొమ్మలూ
కొమ్మకు కోటి పువ్వునా!
పువ్వుల్లో రెండే కాయలు.
(ఆకాశం, చుక్కలు, సూర్యుడు, చంద్రుడు)

ఆకాశానికి అంతులేదు - పొంతులేదు,ఇరవై ఏడు నక్షత్ర కుటుంబాల్ని అరవై నాల్గే అన్న అంతకన్నా ఎక్కువే అన్నా మునిగి పొయేదేమి లేదు. ఒక్కొక్క నక్షత్ర కుటుంబానికి కోటి పువ్వులేం కర్మ పదివేల కోట్లా ఉండవచ్చు. పువ్వుల్లో రెండే కాయలు సూర్య చంద్రలు, అనంతాకాశాన్ని, తత్సౌందర్యాన్ని వృక్ష రూపంలో బొమ్మ కట్టించిన పొడుపు కథాకారుడు ఎంతో గొప్ప చిత్రకారుడో ఎంతటి ప్రకృతి సౌందర్యాధకుడో చెప్పడానికి కొల మానాలు లేవు.కొలత బద్దలు చాలవు.

తిర్యక్ సంబంధ ప్రహేళికలు :

పిపీలికాదు బ్రహ్మ పర్యంతం ఎన్ని కోట్ల జీవరాశులున్నాయో చెప్పడం కష్టమే.కష్టమే అని ఊరుకుంటే యెట్లా ప్రహేళికాకర్తా వ్యవహార్తా ఊరుకోనే ఊరుకోడుగా! అందుకే తన పరిచయంలోని పశుపక్షాదుల్ని, క్రిమికీట కాదుల్ని పొడుపు కథల్లో బంధించేశాడు.

అడ్డగోడ మీద
బుడ్డ చెంబు (ఎద్దు మూపురం)
ఉద్యోగం సద్యోగం లేదు
ఊరంతా వ్యాపకమే - తీరిక లేదు (కుక్కు)

గొలుపు కట్టు లేకపోతే ఇక కుక్కుకు పనేమిటి? పనీ పాటలేక అలా తిరిగి రావడమే. ప్రహేళికారుని పరిశీలన గమనార్హమైందే కాదు: అందే అంతరార్థం అందుకో దగ్గది,ఆచదించదగ్గది.

క్రీడా వినోద ప్రహేళికలు :

కేవల వినోదార్థం, క్రీడ కొరకే అన్న దృక్పథంతో నిర్మాణమైన కొన్ని పొడుపు కథలు కనిపిస్తాయి. పొడుపు కథే ఒక రకమైన సంవాదాత్మక క్రీడ.బోడివాడెవడయ్యా, బొచ్చువాడెవడయ్యా అని పోతులూరు వీరబ్రహ్మం గారుని సిద్ధయ్య అడిగాడు. బోడోడు ఎవడురా ! బొచ్చుడు ఎవడురా అని జానపదుడు దరువులు వేస్తూ తన ప్రక్క వాణ్ణి అడిగినా వినోదంతో అడిగినవే. కాని ఆ వినోదానికి భూమిక తాత్వికతే.ఆ భూమికక కూడా భారతీయ సాంస్కృతిక పీఠమే.

పండుగాని పండు - పసిడి వెన్నెల చెండు
పువ్వుకాని పువ్వు - పూసుకుంటే నువ్వు
కళ్ళగాని కళ్ళు కరివేపాకు జుళ్ళూ
గొడుగు గాని గొడుడు - కొరకరాని పిడుగు

ప్రయోజనం :

చరిత్ర కందని అతి ప్రాచీన కాలం విషయం తెలియదు గాని మధ్యయుగంలో పొడుపు కథలు విస్మృత ప్రచారంలోకి వచ్చాయి.అప్పటి నుండి ఇప్పటి వరకు దేశ కాల పరిస్థితులను బట్టి పుట్టిన పొడుపు కథలు సాధించిన ప్రయోజనం అద్భుతమనిపిస్తుంది.

లోకజ్ఞానం :

పొడుపు కథవల్ల లోకజ్ఞానం మబ్బుతుంది.ఆలోచనకు తావిచ్చినప్పుడు భూత భవిష్యద్వర్తమాన విషయాల్ని శోధించడం తప్పనిసరి అయినప్పుడు లోకజ్ఞానం తప్పకుండా అబ్బుతుంది.

శాస్త్ర విషయ పరిజ్ఞానం :

తత్వ, వైద్య జ్యోతిష, గణితాది శాస్త్రాలు పొడుపు కథల్లో కనిపిస్తాయి. వాటివల్ల శాస్త్ర విషయ పరిజ్ఞానం కలుగుతుంది.

క్రీడసక్తి :

ఈ క్రీడ కూర్చొని ఆడే ఆటే,హాస్యాద్భుతాల్లో ముంచి వేసే గుణం కలిగిన పొడుపు కథ వ్యవహర్తకూ శ్రోతకు క్రీడా సక్తిని పెంచుతుంది.

ఆలోచన శక్తి :

జటిల ప్రశ్నను పరిష్కరించేది ఆలోచనే.

జ్ఞాపక శక్తి :

అడగాలంటే అది తెలిసి ఉండాలి.తెలిసి ఉండాలంటే ధారణ చేయాలి. ధారణవల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

వాచక శక్తి :

ఈ కథల్లో అంత్యాక్షరి,చ్యుతాక్షరి,కత్తాక్షరి వంటి అంశాలు వస్తాయి. స్పష్టమైన ఉచ్చారణ కూడా అవసరం. వీటన్నిటి వల్ల వాచక శక్తి పెరుగుతుంది.

సమన్వయ శక్తి :

పొడుపు కథ కేవలం విప్పడం కాదు,విప్పాలంటే ఎంతో సమన్వయ శక్తి ఉండాలి.

జిజ్ఞాస :

పరిష్కారం కొరకు జిజ్ఞాస పెరుగుతుంది.

ఏకాగ్రత :

సమస్యను పరిష్కరించాలనే తపన కారణంగా ' ఏకగ్రత ' నిలుస్తుంది.

విచిత్ర వాగ్వ్యవహారం :

చమత్కారంగా మాట్లాడే శక్తి వస్తుంది.

మానసిక వికాసం :

ఆలోచన కారణంగా మనస్సు వికసిస్తుంది.

రహస్య గోపనం :

ఒక విషయాన్ని దాచి చెప్పే గుణం అలవడుతుంది.ఈ ప్రయోజనాలు, తదితరాంశాలెన్నో తెలుగు పొడుపు కథలు సిద్ధాంత గ్రంథంలో చూడవచ్చు. ఇంతవరకు వచ్చిన సంకలన గ్రంథాల్ని పరిశీలించి మరికొన్ని వినూత్నాంశాల్ని బహిర్గతం.

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ఆదివాసీల సంస్కృతి – జీవన చిత్రణ

– డా॥. బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

– పెండ్యాల లావణ్య, శాఖాధిపతి,
తెలుగు విభాగం, డా॥. కొత్తా రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, దుగ్గిరాల.

తరతరాల చరిత్రగతిలో కొన్ని జనసమూహాలు కొండల్లోనూ, దట్టమైన అరణ్యాలలోను జీవిస్తున్నారు. అటువంటి వారే నేడు ఆదివాసులు, గిరిజనులుగా పిలువ బడుతున్నారు. ప్రస్తుతం మనదేశంలో గిరిజన తెగలు సుమారు 250 దాకా ఉన్నాయి. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ గిరిజన తెగల మొత్తం జనాభా 59,18,073 లక్షల మంది ఉన్నారు.

ఆదివాసీల ప్రస్తావన మనకు వేదకాలం నుండి కనిపిస్తున్న వారి గురించి ప్రత్యేకమైన అధ్యయనాలు అంతగా జరగలేదనే చెప్పాలి. ఆదివాసులు దట్టమైన అడవుల్లోను, ఎత్తైనకొండల్లోను జీవనం సాగిస్తున్నారు. ఆదివాసులు నగరవాసానికి దూరంగా జీవనం సాగిస్తు న్నారు. వీరికి విద్యాపరిజ్ఞానం లేదు. రెక్కాడితేగాని డొక్కాడనివారు ఒక చదువుల పరిస్థితి చెప్పనక్కరలేదు.

స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తరువాత వీరి పరిస్థితుల్లో ఎటువంటి మార్పులేదు. మార్పు లేకపోవ డానికి కారణం అభివృద్ధికి నోచుకోకపోవడమే. ప్రభుత్వ పథకాలు, చట్టాలు, వెసులుబాట్ల గురించి చెప్పేవారు లేకపోవడం ప్రధాన కారణం. పటిష్టంగా నెలకొనిఉన్న రాజ్యాలతోపాటు స్వతంత్రంగా ఉంటూ, తమ ఆచారాలు, కట్టుబాట్లు కొనసాగిస్తూ మనుగడ సాగించిన ఆదివాసీ సముదాయాలు భారతదేశంలో చారిత్రకయుగం నుండి ఉన్నాయి.

ఒక తెగ మరొక తెగతో పోటీపడకుండా, ఒకరి సరిహద్దుల్లోకి ఇంకొకరు చొరబడకుండా వస్తుగత అభివృద్ధిలో విపరీతమైన తారతమ్యాలు, సమూహాలెన్నో యిక్కడ సహజీవనం చేస్తున్నాడు. మైదాన ప్రాంతాల్లో జీవిస్తున్న నాగరికులతో ఎటువంటి సంబంధం లేకుండా వారికి దూరంగా అడవుల్లో ఎన్నో తెగల వారు జీవిస్తున్నారు.

భారతదేశాన్ని అనేక రాజ్యాలు పరిపాలించాయి. ఎన్ని రాజ్యాలు పరిపాలనను కొనసాగించినా ఆదివాసీల బతుకుల్లో వెలుగురేఖ నింపలేకపోయాయి. అయితే బ్రిటీష్ పాలనలో పరిస్థితి మారింది. అంతవరకూ ఉన్న సంస్థాన రాజ్యాల పరిపాలనా పరిధి కిందకురాని ఎన్నో తెగలను బ్రిటీష్ ప్రభుత్వం తమ కేంద్రీకృత పాలన కిందకు తెచ్చాయి. తెగల ప్రత్యేక హక్కులనూ, అస్థిత్వాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశ్యం బ్రిటీష్ ప్రభుత్వానికేమాత్రం లేదు. ప్రథమంగా బ్రిటీష్ పాలనమూలంగా గిరిజనేతర వ్యాపారస్థుల, వడ్డీవ్యాపారులు సులభంగా ఈ తెగల ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడగలిగారు.

ఆదివాసీ భూమి బదిలీ 19వ శతాబ్దపు మధ్యకాలం నుండి 20వ శతాబ్దం వరకూ కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల హక్కులకోసం విపరీతంగా పోరాడి వారి జీవన స్థితిగతుల్లో పూర్తిసానుభూతి కలిగిన ఎంతోమంది ఉద్యోగులు బ్రిటీష్ ప్రభుత్వంలో కలెక్టర్లుగా వుండేవారు. అయితే ఆదివాసీ ఉద్యోగులు బ్రిటీష్ ప్రభుత్వంలో కలెక్టర్లుగా వుండేవారు. అయితే ఆదివాసీ జీవితానికి, అభివృద్ధికి సంబంధించిన ఎన్నో సంస్కరణలు, నివేదికలు ఉన్నా వాటిని చట్టాలు చేసినా అవి అమలులో మాత్రం అంత ఫలితాన్ని చూపలేకపోయాయి.

ఆదివాసీల అభివృద్ధికి అనేకమంది స్వదేశీయులతో పాటు విదేశీయులు కూడా విశేషంగా కృషి చేశారు.

వారిలో మనకు మొదటిగా గుర్తుకొచ్చే వారు ప్రొఫెసర్ హైమండార్ఫ్ వారి సతీమణి ఎలిజబెత్ (బెట్టీ). భార్యా భర్తలిద్దరు గిరిజనులకోసం వారి అభివృద్ధికోసం నిరంతరం పోరాడారు.

ప్రొఫెసర్ హైమండార్ఫ్ పూర్తి పేరు "క్రిస్టాఫ్ ఫానే ఫ్యూరర్ హైమండర్ఫ్. అడవి బిడ్డల ఆచార సంప్ర దాయాలు, వారి జీవన విధానంతోపాటు మారుతున్న కాలంలో ఉనికికోసం వారు చేస్తున్న పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేసిన మహానీయులు హైమం డార్ఫ్ దంపతలు. ఈ దంపతులు భౌతికంగా దూరమైనా గిరిజనులకు వారు చేసిన సేవలకు కృతజ్ఞతగా ప్రతి ఏటా జనవరి 11వ తేదీన వారిరువురి వర్ధంతిని కొమరంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో ఉత్సవంగా నిర్వహిస్తారు.

హైమడార్ఫ్ ఆస్ట్రియా రాజధాని వియన్నాలో 1909 సంవత్సరలో జన్మించాడు. లండన్‌లోని లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో విద్యనభ్యసించారు. తనకు ఇష్టమైన ఆంత్రోపాలజీలో (మానవ వనరుల శాస్త్రం) డాక్టరేట్ చేశారు. తన పరిశోధన కాలంలో 'థెరసియానం' చివరి సంవత్సరంలో 'మతం' అనే అంశాన్ని విషయంగా చదువు తున్నప్పుడు తన గురువు ఐరోపా ఖండానికి చెందని మతాలు అధ్యయనం చెయ్యమని ప్రోత్సహించారు. అందుకే హైమండార్ఫ్ తన సిద్ధాంత వ్యాసం కోసం "ఆదిమ జాతుల మతాలు" ఎంచుకున్నారు. పరిశోధన అవసరమైంది.

1930వ సంవత్సరంలోని యూరపులోని ఆర్థికవ్యవస్థ ఆయనకు అవకాశాన్ని ఇవ్వలేకపోయింది. పట్టువదలక కృషి చేశారు. అమెరికా రాక ఫెల్లార్ ఫౌండేషన్ వారి పుణ్యమా అని భారతదేశం రావడానికి అవకాశం కలిగింది. హైమండార్ఫ్ గారికి భారతదేశాన్ని పరిపాలిస్తున్న కొంత మంది ఆంగ్లేయులతో పరిచయం అంతకుముందు నుండే ఉండడం వలన పరిశోధన సులువైంది. నాగా హిల్స్ కలెక్టరుగా ఉన్న జె.పి. మిల్స్ ఆయన్ని ఈశాన్య భారతదేశం రమ్మన్నారు. వైసరాయగా ఉన్న లినీలిత్‌గో సిమ్లాకు ఆహ్వానించాడు. తరచు భారతదేశం వస్తూ పరిశోధనాంశాలను తెలుగుసుకుంటూ గిరిజనుల కష్టసుఖాలను హైమండార్ఫ్ పంచుకోసాగారు.

హైమండార్ఫ్ 1932 సంవత్సరంలో లండన్లో గిరిజన ఓ పార్టీలో భారతదేశాన్ని గురించిన చర్చలో మహాత్మ గాంధీ మీద అంతగా సదాభిప్రాయం లేని బెట్టీ ఎలి జబెత్‌తో సుదీర్ఘమైన వాగ్వివాదంతో మొదలైన పరిచయం 1938 సంవత్సరంలో ప్రేమగా మారి వివాహం చేసు కున్నారు. పెళ్ళి అయిన కొన్నాళ్ళు సరదాగా వియన్నాలో కాలం గడుపుదామనుకున్న హేమండార్ఫ్ దంపతులకు అప్పటి రాజకీయ పరిస్థితులు అనుకూలించలేదు. హిట్లర్ ఆస్ట్రియాను ఆక్రమించుకున్నాడు. అల్లకల్లోలంగా ఉన్న పరిస్థితుల్లో వేరే చోటికి వెళితే మంచిదనుకుని భారత దేశానికి వచ్చి అసంపూర్ణంగా ఉన్న పరిశోధనలను కొన సాగించారు. వియన్నా నుండి బయల్దేరి బొంబాయి రాగానే రెండో ప్రపంచ యుద్ధం రావడంతో అస్సాం వెళ్ళి నాగా జాతుల మీద చేయవలసిన పరిశోధన కొన్నాళ్ళు వెనక బడిపోయింది. అందుకు కారణం నిజాం రాజ్యంలోని ఆదివాసి ప్రాంతాలను చూసి, పరిశోధించే అవకాశం లభించింది.

1940 సంవత్సరంలో 'కొమరంభీం' అనే గోండు విప్లవకారుడు నిజాం నిరంకుశత్వంపై, దోపిడి విధానాలపై తిరుగుబాటును లేవదీశాడు. సాయుధ బలగాలను పంపి కొమురం భీంని ఆదిలాబాద్‌లోని 'జోడేఘాట్' వద్ద కాల్చి చంపారు. కొమరంభీం మరణంతో మన్యం ప్రాంతంలో అలజడులు, ఆందోళనలు ఎక్కువయ్యాయి. అశాంతిని అణచివేయలేకపోయారు. ఈ అశాంతి కారణాలను విశ్లేషించి, తగు సూచనలు తెలియజేయవలసిందిగా అప్పటి నిజాం ప్రభుత్వాల హైమండార్ఫ్‌ను కోరారు. పరిశీలనకోసం వచ్చిన హైమండార్ఫ్ దంపతులకు గోండ్ల దయనీయ స్థితి చూసి కరిగిపోయారు. సమస్యల పరిష్కారాన్ని అన్వేషిస్తూ మార్లవాయి గ్రామంలో ఏళ్ళ

తరబడి ఉండిపోయారు. యూరప్‌లో యుద్ధం జరుగుతున్నన్ని రోజులూ హైమండార్ఫ్ దంపతులు నిజాం రాజ్యంలోని ఆదివాసుల జీవన విధానాన్ని చదవటంలో గడిపారు.

1939 సంవత్సరంలో హైదరాబాద్ నిజాం ప్రభుత్వంలో రెవెన్యూ గృహమంత్రిగా ఉన్కర్ దంపతులుండేవారు. వీరు హైమండార్ఫ్ దంపతుల్ని హైదరాబాద్ సంస్థానంలోని ఆదిమ జాతుల గురించి పరిశోధించమని ప్రోత్సహించారు. అందువల్లనే హైమండార్ఫ్‌కి ప్రస్తుత తెలంగాణా ప్రాంతంలోకి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన తెగల జీవన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలోనే పాల్వంచ సంస్థానం కూడా సందర్శించి కొండరెడ్ల మధ్య పనిచేశారు. ఉన్కర దంపతులతో హైమండార్ఫ్ దంపతులు కర్నాటక రాష్ట్రంలోని రాయచూరు వెళ్ళారు.

హైమండార్ఫ్ దంపతులు పరిశోధన నిమిత్తం మరల నల్లమల కొండల్లో ఉండే అతి పురాతనమైన చెంచుబాతి మీద ప్రారంభించారు. ఈ పరిశోధన నిమిత్తం తొమ్మిది నెలలపాటు అక్కడే ఉండాల్సి వచ్చింది. ఆ తొమ్మిది నెలలు హైమండార్ఫ్ దంపతులు దుంపల, కంద మూలాలు అలవాటు చేసుకుని తిన్నారు. పరిశోధన పూర్తి అయిన వెంటనే హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఉన్కర దంపతులు మంచి విందు ఏర్పాటు చేశారు. హైమండార్ఫ్ దంపతులు విందును ఆరగించి అరిగించుకోవడానికి రెండు వారాలు పట్టిందంటారు.

హైమండార్ఫ్ చెంచుల దేశంలో కొంతకాలం గడిపాక వారి గురించి అనుభవాలను గ్రంథస్థం చేయాలని సంకల్పించారు. సభ్య ప్రపంచానికి కొంచెందూరంగా, అంతగా బాదరబందీ లేనిచోటు వెళ్ళాలని ఉన్కర దంపతుల్ని కోరగా, అందుకు పాల్వంచ ప్రాంతాన్ని హైమండార్ఫ్‌కి సూచించారు. ప్రొఫెసర్ గారు పాల్వంచ, ఖమ్మం గిరిజన ప్రాంతం వచ్చి సంవత్సర కాలం 1940 ప్రొఫెసర్ గారు పాల్వంచ, ఖమ్మం జిల్లాల్లో హైమండార్ఫ్ దంపతుల అనుభవాలే "ది రెడ్డీస్ ఆఫ్ ది బైసన్ హిల్స్ - ఎ స్టడీ ఇన్ ఎకల్చరేషన్" పేరుతో ప్రచురించారు.

ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు - హైమండార్ఫ్ సూచించిన పరిష్కార మార్గాలు :

అనాదిగా ఆదివాసులు వారి మీద జరుగుతున్న అన్యాయాలను అణచివేయడానికి అనేక తిరుగుబాటు దళాలు ఏర్పడ్డాయి. అటువంటి తిరుగువాటు దళాలలో చెప్పుకోదగ్గవి. సంతాళ్ తిరుగుబాటు, రంప తిరుగుబాటు ఈ తిరుగుబాటుదారుల ముఖ్య ఉద్దేశ్యం గిరిజనేతరుల నుండి అమాయక గిరిజనుల్ని కాపాడటమే. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ తిరుగుబాటు దళాలు ఉక్కుపాదం మోపాయి. పుట్టుకొక్కుల్లా పుట్టుకొస్తున్న తిరుగుబాటు దళాలను అణచివేయడానికి ప్రభుత్వం ఈ ప్రత్యేక బలగాలాలు ఏర్పాటు చేసింది.

1855-56 ప్రాంతంలో జరిగిన సంతాల్ తిరుగుబాటు ప్రధానమైనది. ఈ తిరుగుబాటుకు కారణం తాము పుట్టి పెరిగిన భూమి గిరిజనేతలు చేతుల్లోకి వెళ్ళడాన్ని గిరిజనులు సహించలేకపోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతాల్ ఆదివాసులు తిరుగుబాటును ప్రారంభించారు. వీరి తిరుగుబాటుకి అనేక కారణాలున్నాయి. తమ ప్రాంతాల్లో చొరబడిన వ్యాపారస్థుల, వడ్డీ వ్యాపారుల దురాశతో కూడిన దుర్మార్గపు ఎత్తుగడలు, అప్పు తీర్చుకునేందుకు వ్యక్తులను తరాల తరబడి బానిసలుగా చేసుకునే పద్ధతి నిరసించారు. నిరసనకు రూపమే ఈ తిరుగుబాటు. భారతదేశంలోని ఆదివాసీ చరిత్రలోనే ఒక మరుపురాని మహత్తర ఘట్టంగా 'సంతాల్ తిరుగుబాటు" ప్రత్యేకతను సంతరించుకుంది.

1879 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొండరెడ్లలో జరిగిన రంపపితూరీ దండు. ఇది తూర్పు గోదావరి జిల్లాలోని చోడవరం తాలూకాలోని జరిగింది. రంప ప్రాంతంలో విప్పసారా, కల్లు గీయడం రకరకాల సారాయిలు కాయడం సంప్రదాయం. అయితే గిరిజనేతరులు ఈ ప్రాంతంలో ప్రవేశించి తమకు ఇష్టం వచ్చి

నట్లు అధిక ధరలు నిర్ణయించుకుని వ్యాపారం ప్రారంభించారు. అధిక ధరలు భరించలేకపోయినవారు ధరలకు వ్యాపారం ప్రారంభించారు. అధిక ధరల భరించలేక పోయినవారు ధరలకు వ్యతిరేకంగా ఎదురు తిరిగారు. గిరజనేతరులు ప్రభుత్వాలను తమకు అనుకూలంగా మార్చుకుని గిరిజనుల ఆస్థలను జప్తు చేసుకుంటున్నారు. దీనికంతటకి కారణం ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలేనని గ్రహించిన ఆదివాసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించారు. తిరుగుబాటు దారులను అణచివేయడానికి ప్రభుత్వం గిరిజనుల పోడు వ్యవసాయం మీద 3 వంతులకు పైగా పన్నులు వసూలు చేయటం, పన్ను కట్టని వారిని కొట్టి చిత్రహింసలకు గురి చేసేవారు. దాదాపు రంప తిరుగుబాటు 1880 సంవత్సరం నవంబర్ వరకు కొనసాగి తరువాత పూర్తిగా అణచి వేయబడింది.

రంప తిరుగుబాటు చరిత్రలో ప్రత్యేకస్థానాన్ని సంతరించుకుంది. స్వతహాగా ఏ పోరాట చరిత్రలేని ఆదివాసులు కూడా పరిస్థితులు విషమిస్తే సంఘటితమై ఎంతటి పోరాట పటిమ ప్రదర్శిస్తారో రంప తిరుగుబాటు తెలియజేసింది. ఏ కారణాలైతే, అణచివేతలైతే రంప తిరుగుబాటుకు దారి తీశాయో దాదాపు అదే పరిస్థితులను, అణచివేతలనూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని ఆదివాసీ సముదాయలు నేటికీ ఎదుర్కొంటున్నాయి.

హైమండార్ఫ్ పరిశోధన నిమిత్తం వచ్చిన గోండ్ల ధైర్యాన్ని చూసి కరిగిపోయి సమస్యల పరిష్కారాన్ని అన్వేషిస్తూ మార్లవాయి గ్రామంలో ఏళ్ళ తరబడి ఉండిపోయాడు. ఆయన పుణ్యమా అని గోండులకు భూమిపై హక్కు, చట్టాలు లభించాయి. గోండ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు రూపొందించేలా హైమండార్ఫ్ పరిశోధించారు. వీరి పరిశోధనల కారణంగా గోండ్లలో అభివృద్ధికి చట్టాలు ఏర్పడ్డాయి. గోండ్ల సమస్యలు తెలుసుకోవడమేకాక, వారి ఆచార వ్యవహారాల గురించి తెలుసుకుని పుస్తకాలను రచించాడు. గోండ్ల గురించి పుస్తక పరిజ్ఞానం సంపాదించాలంటే వీరి పుస్తకాలే మనకు ఆధారం వీరి పుస్తక పరిజ్ఞానం సంపాదించాలంటే వీరి పుస్తకాలే మనకు ఆధారం వీరి సతీమణి ఎలిజిబెత్ బర్నార్డో బెట్టీ. లండన్‌లో పుట్టి పెరిగినా, తన భర్త అభిరుచే తన అభిరుచే తన అభిరుచిగా భావించి 1940 సంవత్సరం నుండి ఏళ్ళ తరబడి ఆదిలాబాద్ అడవుల్లో గడిపింది. భర్త పరిశోదన, గోండ్లు సేవనిమిత్తం తనతో పాటు అడవుల్లో గుర్రాల మీద, కాలినడకన తిరుగుతూ కష్టాన్ని కూడా ఇష్టంగా మార్చుకుని తన వంతు సేవ చేసింది. నిరక్షరాస్యులైన ఆదివాసీ పిల్లలకి సొంతంగా కొండపైన బడి ఏర్పాటు చేసి పాఠాలు చెప్పింది. బెట్టీ ఉన్నంతకాలం బడి కొనసాగింది. ఆదివాసీల కష్టాలను తమ కష్టాలుగా భావించి సమస్యల పరిష్కారానికి పోరాడారు. సూదిమళ్ళ గ్రామంలో కొండపైన ట్రైనింగ్ స్కూలును ప్రారంభించి గిరిజన పిల్లలకు ఉచిత విద్యను అందించారు. ఒకవైపు తమ పరిశోదనకు సంబంధించిన కార్యక్రమాలను చూసుకుంటూ మరొకవైపు సామాజికంగా గిరిజనుల కొరకు తీవ్రంగా కృషి చేశారు.

హైమండార్ఫ్ భార్య బెట్టీ కూడా భర్త లోపాలే అడవులు, కొండలు, గూడాలు, వంకలు దాటుకుంటూ, భర్త అభిరుచే తన అభిరుచిగా భావించి మనసా వాచా కర్మణా సముఖత చూపించింది. గిరిజనుల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం, పండుగలు, నృత్యాలు, కర్మ కాండలు, పెళ్ళిళ్ళు, విడాకులు, వ్యవసాయం, భాష, యాస, నడవడి, భూమి సాగుచేసే విధానాలపై హైమండార్ఫ్ రాసిన పుస్తకాలు ప్రపంచ ప్రఖ్యాతి గడించాయి. 1979వ సంవత్సరంలో రెండోసారి భారత్‌కు వచ్చినపుడు లండన్‌కు చెందిన మైఖేల్ యార్క్‌తో ఆదివాసీల జీవనం గురించి పలు డాక్యుమెంటరీలు తెరకెక్కించారు. డార్ఫ్ అప్పట్లో తీసిన ఫోటోలు ఇప్పటికీ గిరిజనులపై పరిశోదన చేసేవారికి ఉప యోగపడుతున్నాయి.

భూమిపై హక్కులేక ఇబ్బందులు పడుతున్న వారికోసం హైమండార్ఫ్ భూములపై యామజమాన్య

హక్కులు కల్పించేందుకు నిజాంతో చర్చలు జరిపారు. అప్పటికే అటవీ భూములను సాగు చేసుకుంటున్న స్థానికులకు ఒకొక్కరికి దాదాపు 15 ఎకరాలు ఇప్పిం చేందుకు కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగానే సుమారు 12 వేల గిరిజన కుటుంబాలకు భూ పట్టాలు వచ్చాయి. హైమండార్ఫ్‌ను నిజాం ప్రభుత్వం కొంతకాలం గిరిజనాభి వృద్ధి సలహాదారుగా నియమించింది. ఆదివాసీల హక్కుల రక్షణ కోసం హైమండార్ఫ్ అనేక సూచనలు చేశారు. ఆయన నివాసం ఉన్న మార్లవాయిలో ఉపాధ్యాయ శిక్షణే కేంద్రాన్ని నెలకొల్పి అనేకమంది గిరిజనులను చదువువైపు నడిచేలా ప్రోత్సహించారు.

హైమండార్ఫ్ దంపతులు మార్లవాయిలో ఉన్నప్పుడు ఆ గ్రామ పెద్ద లచ్చుపటేల్ మరణించాడు. ఆ మరుసటి రోజే డార్ఫ్ భార్య బెట్టీ బాబుకు జన్మనిచ్చింది. మార్లవాయి ప్రాంత సంప్రదాయం ప్రకారం ఊరిలో ఎవరైనా చని పోయిన మరుసటి రోజులోనే ఎవరైనా బిడ్డ పుడితే, వారే మళ్ళీ పుట్టారని నమ్ముతారు. ఇందుకు గుర్తుగా చని పోయిన వారి పేరు పుట్టిన బిడ్డకు పెడతారు. ఆ సంప్ర దాయం ప్రకారం డార్ఫ్ దంపతులు తమ కొడుకు పేరు ''లచ్చు పటేల్'' అని నామకరణం చేశారు. డార్ఫ్ దంపతులు ఆదివాసీలతో ఎంతగా కలిసి పోయారంటే తమ మరణానంతరం దంపతులిద్దరి సమాధులు ఇక్కడే ఏర్పాటు చేయాలని డార్ఫ్ స్థానికులను కోరారు. డార్ఫ్ భార్య ఎలిజిబెత్ బెట్టీ 1987 సంవత్సరంలో మరణించారు. ఆమె చనిపోయిన తరువాత డార్ఫ్, ఆయన కొడుకు లచ్చుపటేల్ (నికోలస్) ఎలిజిబెత్ చితాభస్మాన్ని లండన్ నుండి మార్లవాయికి తీసుకొచ్చి సమాధి కట్టించారు. 1995 సంవత్సరంలో హైమండార్ఫ్ కూడా చనిపోగా 2012 సంవత్సరంలో లండన్ నుండి ఆయన చితా భస్మాన్ని మార్లవాయికి తీసుకువచ్చి ఎలిజిబెత్ సమాధి పక్కనే మరో సమాధి కట్టించారు. అప్పటినుండి ప్రతిఏటా జనవరి 11వ తేదీన డార్ఫ్ దంపతుల వర్ధంతిని ఆదివాసులు ఘనంగా జరుపుకుంటారు.

గోండ్ల హైమండార్ఫ్‌ను స్మరించుకోవడానికి ప్రధాన కారణం 'దర్బార్' గోండులలో మోసం' వంశీయుల ఆరాధ్య దైవం నాగోబ' దేవత. నాగోబా దేవాలయం అది లాబాద్ జిల్లా 40 కి.మీ. దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. ప్రతియేటా ఈ నాగోబు జాతర జరపడం అనవాయితి కొండలు కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు 'దర్బార్' ఏర్పాటు చేయాలని ప్రొఫె సర్ హైమండార్ఫ్ అనుకొని మొదట 1946 వ సంవ త్సరంలో మొట్టమొదటి 'దర్బార్'ను నిర్వహించాడు. 'దర్బార్' అనగా సమావేశం ఏర్పాటు చేసి గిరిజనుల కష్ట సుఖాలను తెలుసుకోవడం వాటికి సంబంధించిన పరి ష్కారాల మార్గాలు సూచించడం. ప్రతి ఏడు కూడా పండుగ రోజు 'దర్బార్'ని నిర్వహించి గిరిజనుల సమస్యలు తెలుసుకుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తరు వాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 'దర్బార్' కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. జాతర చివరిరోజు జరిగే ఈ దర్బార్ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, తెగల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరౌతుంటారు. హైమండార్ఫ్ పుణ్యమా అని గిరిజనుల బతుకుల్లో కాంతి రేఖ ఉదయించింది. అటువంటి హైమండార్ఫ్ 50 ఏళ్ళ తరువాత తిరిగి అభివృద్ధి పరచిన గ్రామాలను చూడాలని వచ్చి ఎక్కడ అభివృద్ధి జరగకపోవడం చూసి కలత చెందారు. భార్యతో కలిసి తిరిగిన ప్రదేశాలను, ఎదుర్కొన్న సమస్యలను కష్టాలను సుఖాలను గుర్తు చేసుకుంటూ ఇన్నేళ్ళ తరువాత తన రోజుల నాటి వ్యక్తులను చూడ గలిగినందుకు ఆయన కళ్ళలో ఉబికిన ఆనంద భాష్పాలు, ఇప్పుడు తనతోలేని బెట్టి జ్ఞాపకాలతో విషా దాశ్రువులుగా మారి అంతలోనే కళ్ళలో ఇంకి పోయాయి.

డార్ఫ్ రచనలు :

1. ద చెంచుస్ (1943)
2. ద రెడ్డీస్ ఆఫ్ బైసన్ హిల్స్ (1945)
3. ద రాజ్ గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్ (1945)
4. ద షెర్పాస్ ఆఫ్ నేపాల్ (1964)
5. ద ట్రైబ్స్ ఆఫ్ ఇండియా (స్ట్రగుల్ సర్వైవర్ (1982)

ఉపయుక్త గ్రంథాలు :

1. భద్రాచలం మన్నెం కథలు - అంగలకుర్తి విద్యాసాగర్.
2. మనుగడ కోసం పోరాటం ఆంధ్రప్రదేశ్ ఆదివాసులు - హైమండార్ఫ్ - అనువాదం - అనంత
3. జనసాహితీ ప్రచురణలు

❖ ❖ ❖

జానపదుల నృత్యాలు – వ్యష్టి సమిష్టి

– డా॥. కూడ పుష్పలత, మహబూబ్‌నగర్, తెలంగాణ .

అంగికం భువనం యస్య
వాచికమ్ సర్వవాఙ్మయమ్!
ఆహార్యం చంద్రతారాది
తం వందే సాత్త్వికం శివమ్!!

ఈ సృష్టిలోని కదలికలన్నీ శివుని అంగికాభినయాలే! ధ్వని అంతా ఆయన వాచికాభినయమే. ఆకాశంలోని చంద్రుడు, తారలు ఆయనకు ఆహార్యాభినయాలు. ప్రకృతిలోని సాత్త్వికాభినయాలు. అట్టి మహానటుడు శివునికి నమస్కరించుకున్నాను. అని నాట్యశాస్త్రంలో భరత ముని పేర్కొన్నారు.

జానపద విజ్ఞానంలోని సాహిత్యంలోనూ, ప్రదర్శన కళల్లోనూ దృశ్యశాఖకెంతో ప్రాధాన్యమున్నది. ఈ దృశ్యశాఖలో నృత్యం ఒకటి. నృత్యం - న్నత్తం - నాట్యం ఈ మూడు సమానార్థకాలే అయినా ఒకదానికన్నా ఒకటి ఉన్నతమైనది. నృత్యంలో ఔద్ధత్యం ఎక్కువ. నృత్యంలో నటన - వాచకం సమ ప్రాధాన్యంగా ఉంటాయి నాట్యం హాస భావ విలాస ప్రదర్శన అనబడుతుంది.

మనిషి బ్రతుకులో అనుభవించే కష్టాలు, సుఖాలు, ప్రేమ, విరహం, పుట్టుక, చావు మొదలైనవన్నీ లయాత్మకమైన కదలికలుగా మారి నృత్యమనిపించుకున్నాయి. నిజానికి నృత్యం మానసికానందానిస్తుంది. మనిషి నమ్మకాలకు, ఆచరణలకు, సంప్రదాయాలకు నృత్యం ప్రతినిధిగా నిస్తుంది. జానపదుని సుఖదు:ఖాల ఉద్వేగాన్ని తగ్గించుకోవాలంటే చిందులు వేస్తారు. లయబద్ధమైన అవయవాల కదలిక ద్వారా మనిషికి తృప్తి కలుగుతుంది. దైహిక చలనం వల్ల అలసట కలిగి, తద్వారా మనిషి ఒక విధమైన సుప్తస్థితికి చేరుకొని తృప్తి పొందుతాడు. నృత్యం మానసికమైన అవసరం అనవచ్చును. నృత్యానికి అనుబంధంగా వాయించే వాద్యాలు గాని, చేతుల కదలిక గాని, కాళ్ల కదలిక గాని, ఇతర అవయవాల చలనం గాని ఆవేశానికి తగ్గట్టుగా, సందర్భానికి తగ్గట్టుగా ఉంటుంది.

జానపదుల నృత్యాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నెమలి, ఎలుగుబంటి, గుర్రం, కప్ప, సర్పం, చెట్టు, గాలి ఇలా ఎన్నో ప్రకృతి నుంచే వారు నృత్యాన్ని నేర్చుకున్నారు. వారి నిత్యకృత్యాల్లోని కదలికలే నృత్యాలయ్యాయి. వినోదార్థం ఆడే ఆటలు కూడా నృత్యాలయ్యాయి.

జానపద నృత్యాలు వ్యష్టిగా, సమిష్టిగా కనిపిస్తాయి. ఒకే వ్యక్తి ఎందరి వలెనో నటిస్తూ ఆడినా లేదా ఒక్కని వలెనే నటించినా అది వ్యష్టి నృత్యమవుతుంది. ఒకరు లేక ఇద్దరు, పది మంది ఉన్నా అది సమిష్టి నృత్యమవుతుంది.

వ్యష్టి నృత్యాలు :

వ్యష్టి నృత్యాలలో పులివేషం, ఎలుగుబంటి వేషం, పికిలి గుర్రాలాట, నెమలి ఆట, ముండమోపి వేషం, లత్కోరిసాబ్‌వేషం, పోతరాజు వేషం మొదలుగునవి.

పులివేషం :

పులివేషం వేసేవాళ్లు దసరాకు మరియు జాతర్లలో ఉత్సవాల్లో నృత్యం చేస్తూ డబ్బులు అడుక్కుంటారు. శరీరానికి బిగ్గరగా పసుపురంగు బట్టలు కట్టుకొని, వాటిపై నల్లని చారలు దిద్దుకొని, తోక పెట్టుకొని ముఖానికి పులి ఆకారాం గల అట్టను తగిలించుకొని నిలబడి లేదా వంగి తప్పెట దరువులపై పులిలాగా ఆడతాడు. మానవులు జంతువుల నుండి పరిణామమై వచ్చినారని డార్విన్ మహాశయుడు చెప్పినట్లుగా ఇప్పటికి జంతువుల వేషధారణ చేసి ఆడాలనే కోరిక చావలేదనిపిస్తుంది.

ఎలుగుబంటి వేషం :

పగటి వేషగాళ్ళంతా హాస్య ధోరణి కలవారే. పాత

గొంగడి చింపులు కాళ్లకు, చేతులకు, వంటికి కట్టుకొని, చేతిలో కర్ర పట్టుకొని ఇంకొక వ్యక్తి ఎలుగుబంటిని పట్టుకొని పోయినట్లుగా పోతాడు. ఇతని చేతిలో కర్ర, కర్రకు గాని చేతికి గాని రెండు ఇనుప కడియాలు వంటి రింగులు తగిలించి శబ్దం చేస్తూ ఆడిస్తుంటాడు. వేష ధారణలోనున్న వ్యక్తి లయబద్ధంగా అడుగులు వేస్తూ ప్రజలకు వినోదం కల్గిస్తూ డబ్బులు వసూలు చేస్తారు.

పికిలి గుర్రాలాట :

పికిలి గుర్రాల నృత్యం చాలా సినిమాలలో వచ్చింది. దానికి మూలం జానపదులు జాతర్లలో ఆడే పికిలి గుర్రా లాట అని ఎందరికి తెలుసు? కీలు గుర్రాల ఆకారంలో అట్టలతో, రంగు కాగితాలతో చేసి నడుముకు కట్టుకొని రాజు, రాణి వేషాలతో మేళ, తాళాలతో వాటికి అను గుణంగా నృత్యం చేస్తారు.

నెమలి ఆట :

ముందుగా నెమలి బొమ్మను అట్టలతో, రంగు కాగితా లతో, తోకభాగంలో నెమలి ఈకలు అమర్చి, మడత భాగంలో పురివిప్పిన ఈకలు ఆడడానికి వీలుగా అమర్చు తారు. తలపై భాగంలో నెమలి తలను కూడా అమర్చు తారు. మేళ, తాళాలకు అనుగుణంగా పురివిప్పిన నెమలిలా నృత్యం చేస్తారు. సర్కస్‌లలో కూడా చాలా అద్భుతంగా, లయబద్ధంగా నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

ముండమోపి వేషం :

'పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం' అన్న సామెత లాగా మొగుడు చచ్చి ముండ ఏడుస్తుంటే ఎవడో రాళ్లు వేశారు. భర్త చనిపోయిన ఆడదానిపై ఎంత సానుభూతి ఉన్నా ఔచిత్యం మేరలు దాటి దానిని హాస్యవస్తువుగా మార్చేవారు లేక పోలేరు. కొందరు ముండమోపి వేషం వేసుకొని ప్రజలను అలరింపజేస్తారు.

లత్కోరిసాబ్‌వేషం :

తెలంగాణలో లత్కోరిసాబ్ వేషం బ్రిటీష్ వాళ్లను పోలి ఉంటుంది. అంటే ఆ కాలంనాటి జవాన్లను పోలి ఉంటుంది. ఇతని మాటలు ఉత్తరకుమారుని ప్రజ్ఞల్లా ఉంటాయి. అంటే ఒక మాటలో చెప్పాలంటే సినిమాలోని పాటలా

'కట్టె తుపాకి పట్టుకొని కట్టదాటి పోతుంటే
కాలుజారి పడ్డాడే సోగ్గాడు
ఒక్క పిట్టనైన కొట్టనైన కొట్టలేడే సోగ్గాడు'

అనే పాట జ్ఞప్తికి వస్తుంది. ఇతడు వర్తమాన, సామాజిక విషయాలను వ్యంగ్యంగా హాస్యధోరణిలో విమర్శిస్తుం టాడు. ఇతడు వదులైన చొక్కా, ప్యాంటు, దొరటోపీ ధరించి ఉంటాడు. చేతిలో కట్టెతుపాకి గానీ, రెండుగా చీల్చిన కర్రను కాలుకు కొట్టుకుంటూ పెద్దశబ్ధం చేస్తూ, వ్యంగ్య మాటలతో నవ్విస్తూ తిరుగుతుంటాడు.

పోతరాజువేషం :

పోతరాజు అక్కదేవతలకు తమ్ముడు, సంరక్షకుడు, పరిచారకుడు అది జానపదులతో ప్రచారం తెలంగాణలో వృత్తిరీత్యా ఉన్న పోతరాజు వేషానికి ఏ సంబంధం ఉం డదు. వీరి వేషం లంగ కట్టుకొని, తలకు గుడ్డ కట్టుకొని కండలు దీరిన దేహంతో భయం కొల్పే విధంగా పుండి నారతో చేసిన కొరడాతో వీపున రక్తం వచ్చే వరకు కొట్టు కుంటుంటారు. వీరినే మొండివారని కూడా అంటారు. వీరికిరు ప్రక్కలా ఇద్దరు ఆడవాళ్లు మెడకు డోలు తగి లించుకొని నాగబెత్తంతో గీస్తుంటే భయంకరమైన శబ్ధం వస్తుంది. వీరు ఎక్కువగా జాతర్లలో కనబడుతుంటారు.

సమిష్టి నృత్యాలు :

సమిష్టి నృత్యాలలో కొన్ని కోలాటం, గరగరలు (కరగలు), చిరుతలు, చెక్కభజనలు, బ్రతుకమ్మ, గొబ్బి మొదలగునవి.

కోలాటం :

జానపదుల్లో కోలాటం ఆరోగ్యానికి, ఆనందానికి మూలమైన ఆట. పల్లెటూళ్లలో తిన్న తర్వాత రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభించి ఒక మూడు గంటల తర్వాత మానేస్తారు. జానపద శాస్త్రవేత్తలు దీనిని మిశ్రమ కళే అవుతుందన్నారు. కోలాటంలో నృత్యం వంటి ఆట.

వాగ్రూపమైన పాట ఉంది. పాటగతి తప్పకుండా ఉండడానికి కోలలున్నాయి. మద్దెల వాద్యముంది. అందువల్ల ఇది ఆటా, పాటా, శబ్దం, లయ అన్నీ మేళవించిన మిశ్రమకళే. సాధారణంగా ఈ కోలాటం గ్రామ కూడలిలో ఆడుతుంటారు. కోలాటంను కోల+ఆట=కోలాటం. అనగా కర్ర అని, తమిళంలో కోల+అట్టం. ఇదే తెలుగులో కోలాటం అయ్యింది. పదిహేను నుంచి ఇరువై మంది దాకా రెండు కోలలను తీసుకొని ఒకదానిని ఒకటి కొడుతూ వలయాకారంలో తిరుగుతుంటారు. ఈ ఆటను స్త్రీలు, పురుషులు కూడా ఆడతారు. గురువు పాట చెప్తూ చిరుతలు వాయిస్తూ చెప్తుంటే, మిగతా వారంతా వంత పాడుతూ కోలలు కొడ్తూ వృత్తాకారంగా తిరుగుతుంటారు. వీరంతా ధోవతి కట్టి, నడుముకు ఎర్రటి తుండుగుడ్డ కట్టి, కాళ్లకు గజ్జెలు ధరించి లయబద్ధంగా అడుగులు వేస్తూ కోలాటాలు కొడ్తూ, పాటలు పాడుతూ వలయాకారంగా తిరుగుతారు. దీనిలో విశేషమైంది జడకొప్పు. దీనినే జడకోలాటం, వేణీ కోలాటం అంటారు.

గొల్లవారి వాడలకు కృష్ణమూర్తి
నీవు ఏమి పనికొచ్చినావు కృష్ణమూర్తి
పాలుగొన వచ్చినానే గొల్లభామ
మంచిపాలు వోసి నన్ను దోలు గొల్లభామ

అంటూ ఎన్నో గీతాలు పాడతారు.

గరగరలు (కరగలు) :

కరగ అనేది జానపదులు నిర్వహించుకొనే ఉత్సవం. రాయలసీమలోను, కర్ణాటకలోని కొన్ని ప్రదేశాల్లో నిర్వహిస్తారు. వ్యవహారంలో దీనిని గరగ, గర్గి అని కూడా పిలుస్తారు. గరగ అనగా ఒక పచ్చి మట్టి ముంత. ఈ ముంతకు పూజ చేసి తర్వాత జంతు బలులిస్తారు. కుండకు పూలు చుట్టుతారు. దాని చుట్టూ వలయాకారంగా తిరుగుతూ ప్రజలు నృత్యం చేస్తారు. ఈ గరగను గురించి ఒక పురాణ కథ ఉంది. పాండవులు స్వర్గారోహణం చేసేటప్పుడు వెనకగా వస్తున్న ద్రౌపతి మూర్ఛపోయింది. వాళ్లు ఆమెను వదిలి వెళ్లిపోయారు. ఆమెకు మెలకువ వచ్చేసరికి భర్తలు లేకపోగా తమిరాసురుడనే రాక్షసుడు వచ్చి ఆమెను పీడించసాగాడు. అప్పుడు ఆమె కృష్ణుడిని తలచగా సమున్నతమైన శరీరంతో, పెద్ద కుండతో ఆ రాక్షసునికి భయంకరంగా కన్పించి పారిపోయాడని ప్రతీతి.

మరొక అంశం కూడా ద్రౌపతి వివాహంతోనే ముడిపడి ఉంది. ద్రౌపతి వివాహ సమయంలో వధువు సమీపంలో ఒక ముంత ఉంచడం సంప్రదాయం. ఆ ముంతను నేటికినీ పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి మొదలగు జిల్లాలలో గడిగ ముంత అని, గడిగం ముంత అని పిలుస్తుంటారు.

చిరుతలు :

జానపదుల సమిష్టి నృత్యాలలో చిరుతలకెంతో ప్రాధాన్యముంది. ఇది కేవలం పురుషుల ఆటనే. రెండు చెక్కలు, వాటి మధ్య భాగంలో రెండు ఇనుపరేకుల్ని అమర్చి ఉంటారు. ఇవి రెండు ఒక చేతిలో పట్టుకొని చేసే కదలికల కారణంగా వచ్చే ఆటకూ, పాటకూ అనుగుణంగా ఉంటుంది.

చెక్కభజనలు :

ఇవి కూడా చిరుతల లాంటివే. కాకపోతే కొద్దిగా పొడవుగా ఉండి ఇనుపరేకుల జతలను అయిదు, ఆరు వరకు అమర్చుతారు. ఇవి ఎక్కువగా భజనలలో ఉపయోగిస్తారు. రాయలసీమ చెక్కభజన, తెలంగాణ రాంభజన, కోస్తా జిల్లాల పండరీ భజన అన్నీ ఒకే విధంగా ఉంటాయి. అందరూ వర్తులాకారంగా నిలబడి ఒకరు చెప్తే అందరూ అంటూ వలయాకారంగా తిరుగుతుంటారు. అడుగులకూ, రకరకాల దరువులకూ, చేతిలోని చెక్కలకు అధిక ప్రాధాన్యముంటుంది.

బతుకమ్మ :

బతుకమ్మ నృత్యం ముఖ్యంగా తెలంగాణ స్త్రీల ప్రత్యేకం. ఇది ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఒక పక్షం రోజులు సాగుతుంది. 'ముప్పయి జట్లయినా కలుస్తాయి కాని మూడు సిగలు కలవవు' అనే సామెతకు

వ్యతిరేకంగా మూడు వందలమందయినా స్త్రీలను కల్పు తుందీ పండుగ. ఈ బతుకమ్మ తయారీకి ముఖ్యంగా తంగేడు, గడ్డి, గునుగు, బీర, కట్ట మొదలైన ఎన్నోరకాల పూలను ఉపయోగిస్తారు. ఇంటిల్లిపాడి కలిసి ఒక పెద్ద పళ్లెంలో గోపురాకారంగా పూలను పేర్చుతారు ఈ బ్రతుకమ్మ చుట్టూ స్త్రీలు వలయాకారంగా నిలబడి ఉయ్యాలో, వలలో, కోల్, చందమామ, గౌరమ్మ అనే ఆవృత్తులున్న పదాలను పాడుతుంటారు. చప్పట్లు కొడుతూ వంగుతూ లేస్తూ ఒకరు చెప్పిన దానిని అందరూ అంటూ తిరుగుతారు.

శ్రీలక్ష్మి దేవియూ చందమామ
సృష్టి బతుకమ్మ చందమామ
పుట్టినా రీతి చెప్పవే చందమామ
బట్టు నరసింహ్మకవి చందమామ

అంటూ ఈ పాటలో ఒక చిన్న కథను తెల్పుతారు. చోళదేశరాజైన ధర్మాంగదుడనే అతని భార్య సత్యవతిల నూర్గురు సంతానం శత్రువుల చేతిలో మరణిస్తారు. సత్యవతి లక్ష్మీదేవిని ప్రార్థిస్తే సాక్షాత్తు మహాలక్ష్మీ తన గర్భంలో జన్మిస్తుంది. మునులు, కవులు, గాయకులు ఆ పాపను చూసి 'బ్రతుకగవే ఈ తల్లీ చందమామ బ్రతుకమ్మ' అన్నారు.

గొబ్బి : 'కొలని దేవరకు గొబ్బిళ్లో
యదుకుల స్వామికి గొబ్బిళ్లో

అంటూ అన్నమయ్య పాటలో నుండే ఉన్నట్లు తెలుస్తుంది. నేటికిని సంక్రాంతి పండగ మూడు రోజులు చక్కని రంగురంగుల ముగ్గులలో ఈ గొబ్బెమ్మలను పెట్టి పూజిస్తారు. గొబ్బెమ్మలంటే ఎవరో కాదు గోపమ్మలే. ఆనాడు శ్రీకృష్ణుని చుట్టూ చేరి రాసకేళిలో తేలియాడిన గోపెమ్మలకు ప్రతిరూపాలే. ఈ గొబ్బిళ్లకు చరిత్రలో గోదాదేవి కథ కూడా ముడిపడి ఉంది. ఈ గొబ్బెమ్మలను ఆవుపేడతో చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి, బంతి, చేమంతి, గుమ్మడి, బీర, పొట్ల పూలు పెడ్తారు. ఆ తర్వాత ఒకరు పాట చెబుతుంటే ఒకరి నడుముపైన ఒకరి చేతులు వేసి వలయాకారంగా తిరుగుతూ గొబ్బిళ్లో, గొబ్బియల్లో అనే ఆవృత్తులతో పాటలు పాడుతూ తిరుగుతారు. పై విధంగా జానపదుల పండుగలలో, పబ్బాలలో, జాతర్లలో, ఉత్సవాలలో నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పొందుతారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు
2. తెలుగువారి జానపద కళారూపాలు - డా॥మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
3. తెలుగు జానపద గేయగాథలు - ఆచార్య నాయని కృష్ణకుమారి
4. జానపద నృత్య కళ - ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ఆర్వీఎస్ సుందరం
6. జానపద విజ్ఞానాధ్యయనం - డా॥జి.ఎస్.మోహన్

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – అక్టోబర్ 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
BHAVAVEENA SPECIAL EDITION
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

జానపద వైద్యం

– డా॥. వై. సుగుణ

జనపదం అంటే పల్లెటూరు. జనపదాలలో నివసించే వారిని జానపదులు అంటారు. జనపదం మొదట మనకు ఎర్రన అరణ్య పర్వంలో కన్పిస్తుంది. అది కర్ణుడు, శకుని, దుర్యోధనుడు మాట్లాడుకునే సందర్భంలో ''జానపదుల్ పురీజనులు సంతసముం బ్రమదం బెలర్ప'' అంటారు.

జానపదులు గ్రామాల్లో జీవించే వాళ్ళు మాత్రమే కాదు. అలాంటి మనస్తత్వం ఉన్నవాళ్ళు పట్టణాల్లో ఉన్నా వాళ్ళ ఆచారవ్యవహారాలు, మనస్తత్వం, నమ్మకాలు అన్నీ జానపదుల్లో కనిపించేవే అని జానపద పండితుడు ''అలెన్‌డండన్'' పేర్కొన్నారు.

జానపద వైద్యానికి ప్రత్యేకత ఉంది. దీన్నే గ్రామాల్లో నాటు వైద్యం అంటారు. ప్రకృతిలో వస్తువులను ఆదిమ మానవుడు కడుపు నింపుకోవడానికే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగించాడు. ప్రాచీన కాలంలో డాక్టర్లు, మందులు అందుబాటులో ఉండేవికావు. ఆ సమయంలో మానవుడే వైద్యాన్ని సృష్టించుకొన్నాడు. కరోనా కష్టకాలంలో దీనికి మందు ఇంకా కనిపెట్టకపోవడం వల్ల జానవదుల వైద్యాన్నే నమ్ముకొని, గోరువెచ్చని నీరుతాగడం, పసుపు పాలు తీసుకోవడం, పసుపు నీళ్ళతో ఆవిరి పట్టడం, అల్లం, లవంగం, మిరియాలు, పసుపులతో కషాయం కాచుకొని తాగడం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పలంటే మనలో సగం మందికి పైగా ఈ వైద్యం ద్వారానే బయటపడ్డారు, పడుతూ ఉన్నారు. ప్రకృతి వైద్యం నేడు సర్వత్రా ఉపయోగంలో ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మానవుడు ప్రకృతిలోని ఔషధగుణాల్ని గుర్తించి ఉపయోగిస్తున్నాడు. దీనివల్ల ఎలాంటి నష్టం, సైడ్ ఎఫెక్ట్ అనే మాటలేదు. జానపదులు కొన్ని రోగాలకు ఆకుల నుండి తీసిన పసరును ప్రయోగిస్తారు. తేలుకుట్టినప్పుడు ఒక మంత్రాన్ని చెబుతుంటారు. అయితే దీన్ని బయటకు ఉచ్చరించరు. బయటకు చెబితే వైద్యం పనిచేయదని వాళ్ళ నమ్మకం. మంత్రాలకు చింతకాయలు రాలవన్నది మనకు తెలిసిన జానపదుల ఆ మంత్రం వల్ల నాకు నయమవుతుందనే నమ్మకమే దాని నుంచి బయట పడడానికి దోహదపడుతుంది.

ఆనాటి నుండి ఈ నాటి వరకు రోగాల నివారణ కోసం పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.

''ధర్మార్థ కామ మోక్షాణామారోగ్యం మూల ముత్తముం'' అని చరక మహర్షి ఆరోగ్యమనెడి లోకోత్తర మైన వస్తువు చతుర్విధ పురుషార్థాలకూ మూలభూతమని చెప్పాడు. కనుకనే నాటి ప్రజలు ఆరోగ్యానికి ఎనలేని ప్రాధాన్యత యిచ్చారు'' అంటారు.

జలుబు నివారణ :

పరగడుపున గోరువెచ్చని పాలల్లో చిటికెడు పసుపు కలిపి తీసుకోవడం ఒకటి. మరొకటి బాగా మరుగుతున్న నీటిలో కొంచెం పసుపు తులసి ఆకులు వేసి ఆవిరి పట్టినా జలుబు తగ్గును. గోరువెచ్చని నీటిలో కొంచెం ఉప్పు కలిపి రెండు చుక్కలు ముక్కులో వదిలిన జలుబు నుండి ఉపశమనం. ప్రతి రోజు పచ్చి ఉల్లిపాయ ఆహారంలో తీసుకున్నట్లైతే జలుబు రాకుండా నివారించుకోవచ్చు. జిల్లేడు పాలతో పసుపు కలిపి గొంతుకి రాసినా జలుబు తగ్గును. నేడు మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ కూడా ప్రకృతిలో దొరికే సుగంధ ద్రవ్యాలతో ''కధా'' పానీయం చేసుకొని తాగమనడం గమనార్హం.

పొడి దగ్గు :

వాము ఆకును రాళ్ళ ఉప్పుతో కలిపి నమిలిన కఫం తగ్గును. గోరు వెచ్చని పాలలో పసుపు మిరియాల పొడి

కలిపి పరగడుపున ఒకసారి, సాయత్రం ఒకసారి తీసు కోవాలి. రాత్రి పడుకోబోయేముందు తేనెతో మిరియాల పొడి వేసి చప్పరించిన మంచిది. ఇంకొందరు సున్నం పైన వచ్చే తేటనీరు అందులో కొంచెం ఉప్పు పసుపు కలిపి తీసుకుంటారు. చంటి పిల్లలకైతే కొబ్బరినూనెను వేడి చేసి అందులో గడ్డకర్పూరంతో పొగపట్టినా ఆ వేడికి కఫం కరిగి ఉపశమనం లభిస్తుంది. నిప్పలపై కాల్చిన అల్లం కఫానికి బాగా పనిచేస్తుంది. లవంగం కాల్చి పొడిచేసి తేనె కలిపి నాలుకపైన పెట్టినా కఫం కరుగుతుందనే నమ్మకం జానపదులది. కొన్నిసార్లు ఇవన్నీ చేయడం వలన వారికి కల్గిన ఉపశమనమే జానపద వైద్యానికున్న ప్రత్యేకత.

గ్యాస్ ట్రబుల్ :

ధనియాలు, జీలకర్ర, వాములను కషాయంగా కాచు కొని తాగిన మంచి ఫలితం ఉంటుంది. రాత్రి భోజనం తరువాత కొంచెం నీటిలో దాల్చిన చెక్క పొడిని కలిపి తీసుకోవాలి. ప్రతిరోజు పరగడుపున అల్లం రసం తీసుకుంటే మంచిది. వామును నేరుగా నోట్లో వేసుకొని నమిలిన మంచి ఫలితం. పుదీన ఆకులను నేరుగా కాని కషాయం రూపంలోగాని తీసుకోవాలి. పాలల్లో తెల్లగడ్డలు ఉడికించి తాగిన మంచిది.

విరోచనాలు :

పెరుగులో కొంచెం మెంతులు కలిపి తీసుకుంటే వెంటనే ఉపశమనం కల్గుతుంది. సగ్గుబియ్యం గంజిలో కొంచెం పంచదార కలిపి తీసుకోవాలి. ఆవాలు దోరగా వేయించి పొడి చేసుకొని లేదా నేరుగానైనా తీసుకోవచ్చు. గట్టి యింగువను కొంచెం పొడిచేసి మజ్జిగతో తీసుకోవాలి. బొరుగులు, పుట్నాలపప్పులు, ఎండు కొబ్బరి కలిపి తీసుకుంటారు. నారింజ రసంలో కొద్దిగా ఉప్పు మిరియాల పొడి కలిపి తీసుకున్న విరోచనాలు తగ్గుతాయనే నమ్మకం ఉంది.

అజీర్ణం :

ఒక గ్లాసు నీటిలో ఒక నిమ్మకాయను పిండి మూడు చెంచాలు అల్లం రసంతో కలిపి తీసుకోవాలి. అన్నంలో మొదటి ముద్దగా వాముపొడిని కలుపుకొని తినాలి. ప్రతి రోజు పరగడుపున ధనియాలు జీలకర్ర, వాములను కషాయం రూపంలో తీసుకోవాలి. జీలకర్ర ప్రతిరోజు ఆహారంలో ఉండేలాగా చూసుకోవాలి. ఒట్టి అల్లం రసం తీసుకొన్న అజీర్ణం తగ్గుతుంది.

పన్నునొప్పి :

జామ ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిని పుక్కిలించిన నొప్పి తగ్గును. ఇలా రెండు లేదా మూడు సార్లు చేయాలి. వేడి నీళ్ళలో పసుపు కలిపి పుక్కిలించిన పన్ననొప్పి తగ్గును. నొప్పి ఉన్న పంటిపైన లవంగం పెట్టి ఉంచిన నొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది.

చెక్కర వ్యాధి :

ప్రతిరోజు లేత వేపాకును తినడం అలవాటు చేసు కొంటే 40 రోజుల్లో వ్యాధి అదుపులోకి వస్తుంది. రాత్రి పూట రెండు బెండకాయలు మొదలు చివర తొలగించి నీటిలో నానబెట్టి ఉదయాన్నే పళ్ళు తోముకొని ఆ నీళ్ళు తాగాలి. మెంతికూర, మెంతులు ఎక్కువగా తీసు కుంటుండాలి. దాల్చిన చెక్క పొడి ఎక్కువగా తీసుకున్న మంచిది. నేరేడు గింజలు పొడిచేసి ప్రతిదినం తీసుకోవాలి.

కడుపునొప్పి :

గోరువెచ్చని నీటిలో ఉప్పు పంచదార కలిపి తీసుకున్న తగ్గును. పొట్టలో వెంట్రుకలు చేరి నొప్పి వస్తే మిరప విత్తనాలు, ఆవాలు, మెంతులు మూడింటినీ నోట్లో వేసుకొని నీళ్ళు తాగిన తగ్గును. ధనియాల కషాయం తాగిన మంచి ఫలితం ఉంటుంది. వామును అలాగే నోట్లో వేసుకొని నమిలిన పొట్ట నొప్పి తగ్గును. చిన్నప్పుడు తెలిసీ తెలియక ఇనుము సంబంధించి ఏదైనా పొట్టలోకి వెళ్తే నేరేడు పళ్ళు బాగా తింటే అవి బయటకొచ్చేస్తాయని జానపదులు నమ్ముతారు. దీనికి శాస్త్రీయమైన ఆచారాలు కూడా ఉన్నాయి.

తలనొప్పి :

నీలగిరి ఆకులను నీళ్ళలో మరిగించి ఆవిరి పట్టాలి.

ఇంకా ఇవే ఆకులను నిప్పుల మీద కాల్చి గోరువెచ్చగా తలపైన వేసుకోవాలి. నీలగిరి ఆకులను పచ్చివే చిదిమి ఆ పసరును నుదిటిపైన పట్టీలాగా వేసుకోవాలి. అవు పాలలో శొంఠి వేసి బాగా మరిగించి ఆ పాలను నుదిటి పైన వేసుకోవాలి. పసుపును నీటిలో కలిపి వెచ్చచేసి నుదిటిపైన రాసుకోవాలి.

ఎంతకీ తగ్గని తలనొప్పి ఉంటే ఒక రాత్రంతా మెంతులు నానబెట్టి మొత్తటి పేస్టులా చేసుకొని తలకు పెట్టుకొంటే తలలో వేడి బయటకు వచ్చేసి నొప్పి తగ్గుతుంది.

అలర్జీ :

తాటి ముంజుల రసం అలర్జీ పైన పూసిన తగ్గును. కుప్పింటి ఆకును నూరి పసుపు, ఉప్పులతో కలిపి గుళికల రూపంలో తీసుకోవాలి. అల్లం రసము, తులసి ఆకు రసము అలర్జీ పైన పూసిన మంచి ఫలితం ఉంటుంది. కలబంద రసం పూసిన మంచిది. కరివేపాకు ఎక్కువగా తీసుకున్నా అలర్జీకి మంచిది.

మోకాళ్ళ నొప్పులు :

సీమసింత ఆకును వేడిచేసి నొప్పి ఉన్న చోట వెచ్చ చూపించిన నొప్పి నుండి ఉపశమనం లేదా దాన్ని ఒక బట్టలో మూటకట్టి మోకాలుకి కట్టు వేసుకోవాలి. రాత్రి రెండు ఖర్జూరం కడిగి నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగి ఖర్జూరం తినాలి. ఇలా చేస్తే మోకాళ్ళ నొప్పులు మటుమాయమవుతాయి. బెండకాయను కడిగి రెండుగా చీల్చి నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగాలి.

సెగ గడ్డలు :

తెల్లగడ్డను దంచి ఎర్రమట్టిలో కలిపి పుండుపైన పెట్టినా తగ్గును. లేత తమలపాకును ఆముదం రాసి వెచ్చ చేసి పుండుపైన వేసిన తగ్గును. అరటి పువ్వును మెత్తగా చేసి పుండుపైన వేసినా తగ్గును. ఉల్లిపాయను కాల్చి సెగగడ్డపై పెట్టినా లోపల ఉన్న చీము అంతా బయటకు వచ్చేస్తుంది.

బాలింతలకు పాలుపడుటకు :

గర్భం ధరించినప్పటి నుండి వారి ఆహారంలో మెంతులు లేదా మెంతికూర ఉండేలా చూసుకోవాలి. తెల్లగడ్డలు, మేక మాంసం క్రమం తప్పకుండా ఒక మోతాదులో తీసుకోవాలి. జీలకర్ర, పంచదార కలిపి యిచ్చినా బాలింతలకు పాలు సమృద్ధి అవుతాయి. అన్నం ఉడుకుతున్నపుడు పైన కనిపించే తేట నీరు తీసుకున్నా పాలు పడుతాయి. ఎండు చేపలు ఎక్కువగా తీసుకున్న మంచిది.

ఎముకలు బెణికినప్పుడు :

కలబంద ఈనెలు తీసి ఒక పన్నెండు గంటలు దానిపైన బరువు వుంచి అది తీసి కడితే కుదురు కుంటుంది. మునగాకు వేడిచేసి గుడ్డలో మూటకట్టి నొప్పి ఉన్నచోట కట్టినా నొప్పి తగ్గును. విరిగిన ఎముకల మీద ముష్టికాయతో రుద్దినా తొందరగా కుదురుకుంటుంది. చింతపండు సున్నం కలిపి బాగా వేడి తగిలేలా దంచి దాన్ని బెణికిన చోట కట్టినా ఉపశమనం కల్గుతుంది. నువ్వుల నూనె (మంచినూనె)తో మర్దన చేసిన తగ్గుతుంది.

ఒంట్లో వేడి చేసినప్పుడు :

గట్టి పెరుగులో పంచదార కలిపి తీసుకొన్న వేడి తగ్గును. గోరువెచ్చని నీటిలో కొద్దిగా పంచదార కలిపి తీసుకోవాలి. గసగసాలు మెత్తగా నూరి ఆ రసం తీసుకున్న తగ్గుతుంది. బెల్లం పానకంలో ఏలకుల పొడి కలిపి తీసుకోవాలి. అవుపాలను వేడి చేసి అందులో బెల్లం కలిపి తీసుకోవాలి. కాంగూగ్రి గింజలు నానబెట్టి ఆ నీటిని తాగినా వేడి తగ్గును. పల్చటి మజ్జిగ చేసుకొని ఎక్కువగా తీసుకుంటే మంచిది.

ఇలా ప్రతి సమస్యకు, రోగానికి విరుగుడుగా మనకు ప్రకృతిలో దొరికే వస్తువులనే ఉపయోగించడం పరిపాటి. ఆ సమస్య నుండి ఉపసమనం కూడా పొందుతూ ఉన్నారు. నాటువైద్యమనే, మూఢ నమ్మకాల్ని చాలా

మంది తీసిపారేసినా దాని వల్ల పొందే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. అందుకే అంటారు ప్రతి ఒక్కరి వంటిల్లు ఓ వైద్యశాల అని అది అక్షరాల నిజమన్నది నేడు మనకు అనుభవానికి వచ్చింది. ఆవిరి పట్టడం, కషాయం తాగడం వంటివన్ని జానపద వైద్యాన్ని ప్రకృతి వైద్యానికి మరింత ప్రాముఖ్యత పెరిగిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఎందుకంటే ప్రకృతిలో దొరికే వస్తువులు వంటింట్లో ఉండే పదార్థాలే మనలోని రోగనిరోదక శక్తిని పెంపొందిస్తున్నప్పుడు వాటిని వాడడంలో ఎలాంటి తప్పులేదు. జానపద వైద్యమని తీసిపారేయకుండా అందులో ఉన్న మహత్యాన్ని గమనించవసిందిగా, వీలైతే ఆచరించవలసినదిగా కోరుకొంటూ సర్వేజన సుఖినోభవంతు!

❖ ❖ ❖

అక్టోబర్ 2020

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

తెలుగు జానపద సాహిత్యం - సంస్కృతి - సమాలోచన

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు



పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజి

పెదనందిపాడు, గుంటూరు - 522 235, ఆంధ్రప్రదేశ్.